శ్రీరామకృష్ణ పరమహంస

సమగ్ర సప్రామాణిక జీవిత గాథ

Cat-1039



శ్రీ శారదానంద స్వామి

శ్రీరామకృష్ణ పరమహంస



శ్రీరామకృష్ణ పరమహంస

[సమగ్ర సప్రామాణిక జీవిత గాథ]

రెండవ సంపుటం

వంగమూలం: శ్రీ శారదానందస్వామి

తెలుగుసేత: శ్రీ దయాత్మానందస్వామి

శ్రీరామకృష్ణ మఠం

మైలాపూర్ :: చెన్నై 600 004

181.493
C 79093

Published by
The President
Sri Ramakrishna Math
Mylapore, Chennai-4

© Sri Ramakrishna Math, Chennai
All rights reserved

79093
530 044.

ISBN 81-7823-018-6
ISBN 81-7823-012-7

Printed in India at
Sri Ramakrishna Math Printing Press
Mylapore, Chennai-4

Cover Design : Ravi

విజ్ఞప్తి

'శ్రీరామకృష్ణ పరమహంస' (జీవితగాథ) రెండవ (చివరిది కూడా) సంపుటాన్ని విడుదల చేస్తున్నందుకు ఎంతో సంతోషిస్తున్నాము. ఈ సంపుటంలో భగవాన్ శ్రీరామకృష్ణులు తమ అవతార కార్యంలో దోహదం చేయడానికి జన్మించిన నరేంద్రుణ్ణే ఆ కార్యనిర్వహణకు అనువుగా తీర్చిదిద్ది, మలచి, ఆ కార్యభారాన్ని అప్పగించిన వైనం ప్రధానంగా చోటుచేసుకొన్నది.

గురుదేవుల ప్రత్యక్ష శిష్యులలో ఒకరూ, శ్రీరామకృష్ణ మఠ-మిషన్ల ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించి ఎనలేని సేవలు అందించిన వారూ అయిన స్వామి శారదానంద ఈ గ్రంథ వంగమూలాన్ని రచించారు. శారదానంద స్వామి ఈ గ్రంథాన్ని కల్పతరువు నాటితో (1-1-1886) ముగించారు. ఆపైన శ్రీరామకృష్ణులు జీవించిన ఎనిమిది నెలల పైబడ్డ కాల జీవితాన్ని అనూహ్య కారణాల వలన ఆయన రచించలేదు. ఈ గ్రంథానికి సమగ్రతను చేకూర్చాలనే ఉద్దేశంతోనూ, పాఠకులకు గురుదేవుల జీవితగాథను ఆమూలాగ్రం అందించాలనే ఆకాంక్షతోను ఆ ఎనిమిది నెలల గురుదేవుల జీవిత కాలాన్ని ఈ గ్రంథం అనుబంధంలో 'కాళీమాత ఒడిలో....' అనే అధ్యాయంలో మేం పొందుపరిచాం. ఇందుకు మహాత్మాగాంధీగారు ముందుమాట వ్రాసిన 'Life of Sri Ramakrishna' అనే అద్వైత ఆశ్రమం వారి ఆంగ్లపుస్తకం మాకు ఎంతో తోడ్పడింది.

వంగమూలం నుండి తెలుగులోకి అనువదించడం సులభమైన పని కాదు. సామాన్యంగా ఇటువంటి బృహద్గ్రంథ అనువాదాన్ని పలువురు ఒక బృందంగా కలిసి చేయడం పరిపాటి. కాని ఈ గ్రంథ తెలుగు అనువాదాన్ని ఒక్కరే, ఎవరి తోడ్పాటూ లేకుండా పూర్తిచేయడం గొప్ప విశేషం. ఈ గ్రంథ అనువాదాన్ని నిర్దిష్టంగా పూర్తిచేసి ఇచ్చినవారు

లండన్‌లోని శ్రీరామకృష్ణ వేదాంత సెంటర్ మినిష్టర్ (అధ్యక్షులు) స్వామి దయాత్మానందగారు. ఆయనకు కృతజ్ఞతాభివందనాలు తెలుపు కొంటున్నాము.

ఈ బృహద్గ్రంథ ప్రచురణకు రూపకల్పనచేసి, అనునిత్యం పురోగతిని సమీక్షిస్తూ, ఈ కార్యక్రమానికి నేపథ్య సారథ్యం వహించిన వారు మా మఠ మేనేజర్ స్వామి జ్ఞానదానందగారు.

ఈ గ్రంథం వెలువడడంలో ఇతోధికంగా కృషి చేసిన యావన్మందికీ మా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాం. వారందరూ భగవాన్ శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రులవుతారుగాక!

ఈ గ్రంథం చదివే పాఠకులలో భక్తిజ్ఞానాలు ఇనుమడిస్తాయనీ, మానవ జీవిత పరమసత్యాన్ని అవగాహన చేసుకొనే పథంలో వారు పురోగమిస్తారనీ, వారి హృదయాలు శాంత్యానందాలతో ఉప్పొంగుతాయనీ మేం ఆశిస్తున్నాం, ఆకాంక్షిస్తున్నాం.

-ప్రకాశకులు

విషయ సూచిక

4. గురు భావం - 2

ప్రస్తావన ... 3

1. వైష్ణవచరణ్ - గౌరీపండితుడు ... 7

తొలిజీవిత కాలంలో శ్రీరామకృష్ణుల 'గురుభావం' గురించిన అజ్ఞత 7; 'పువ్వులు వికసించగానే తుమ్మెదలు వాటంతట అవే వచ్చి చేరుతాయి' 8; ఆధ్యాత్మిక విషయంలో సర్వులూ సరిసమానంగా గ్రుడ్డివారే 8; శ్రీరామకృష్ణుల ఆధాత్మిక ప్రచార వైనం 9; భైరవీ బ్రాహ్మణిని కలుసుకొన్నప్పటి శ్రీరామకృష్ణుల స్థితి 9; శ్రీరామకృష్ణుల అత్యున్నత అవస్థను ఇతరులు అవగతం చేసుకొన్న తీరు 10; బ్రాహ్మణి విన్నపం మేరకు పండిత సదస్సు 10; వైష్ణవచరణ్, గౌరీపండితులను ఆహ్వానించడం 11; వైష్ణవచరణ్ ఖ్యాతి 12; శ్రీరామకృష్ణుల శారీరక మంటను బ్రాహ్మణి ఉపశమింప చేయడం 12; మితిమించిన శ్రీరామకృష్ణుల ఆకలి బాధను బ్రాహ్మణి నివారించడం 13; యౌగిక క్షుత్తు: శ్రీరామకృష్ణులలో దానిని మేం చూసిన వైనం 14; మొదటి ఉదాహరణ : పెద్ద మిఠాయి ముక్కను తినడం 14; రెండవ ఉదాహరణ 16; మూడవ ఉదాహరణ 18; నాలుగవ ఉదాహరణ: దక్షిణేశ్వరంలో అర్ధరాత్రి సేరు హల్వా తినడం 19; ఆధ్యాత్మిక భావోద్వేగాలు: శ్రీరామకృష్ణుల శారీరక మార్పులు 20; వైష్ణవచరణ్ ఆగమనం 20; శ్రీరామకృష్ణుల అవస్థ గురించి చర్చ 20; వైష్ణవచరణ్ నిర్ణయం 21; 'కర్తాభజ' తత్సంబంధిత మతసంప్రదాయాల పట్ల శ్రీరామకృష్ణుల దృక్పథం 22; పూర్తి ప్రాపంచిక భోగాసక్తిపరులైన వ్యక్తులు కోరే మతం 23; తంత్రశాస్త్రాల మూలం : చరిత్ర 24; తంత్రాలలో 'వీరాచారం' ఎలా ప్రవేశించింది? 26; ప్రతి తంత్రంలోని ఉత్తమ, అధమ విభాగాలు 28; వైష్ణవం : క్రొత్త ఉపాసనా విధానం 28; ఈ సాధన పద్ధతి నుండి 'కర్తాభజ' మొదలైన సంప్రదాయాల ఉత్పన్నం, వాటి సారాంశం 29; 'కర్తాభజ' ప్రభృత సంప్రదాయాల మేరకు సాధ్య, సాధనలు 30; శ్రీరామకృష్ణులను, వైష్ణవచరణ్ పరీక్షించడం 32; శ్రీరామకృష్ణులను భగవదవతారంగా వైష్ణవచరణ్ గుర్తించడం 33; గౌరీపండితుని అతీంద్రియశక్తి 33; దేవీ భావనతో తన భార్యను గౌరీపండితుడు ఆరాధించడం 34; గౌరీపండితుడి

విచిత్ర హోమవిధానం 36; వైష్ణవచరణ్, గౌరీలు కూడా పాల్గొన్న దక్షిణేశ్వరంలో జరిగిన సదస్సు 36; శ్రీరామకృష్ణుల గురించిన గౌరీ దృఢ విశ్వాసం 37; గౌరీపండితుడి వైరాగ్యం 38; వైష్ణవచరణ్ను, గౌరీపండితుణ్ణి శ్రీరామకృష్ణులు ఉదాహరించడం 39; కాళీ, కృష్ణులు అభిన్నులన్న విషయంపై గౌరీ పండితుడి అభిప్రాయం 39; తన ప్రేమాస్పదుణ్ణి భగవంతుడి ఒకానొక రూపంగా పరిగణించడాన్ని గురించి వైష్ణవచరణ్ 40; ఈ ఉపదేశం శాస్త్ర సమ్మతమే; యాజ్ఞవల్క్య - మైత్రేయి సంవాదం 41; అవతారమూ, శాస్త్రాలూ 41.

2. గురుభావం - పలు సంప్రదాయ సాధువులు ... 44

శ్రీరామకృష్ణులు సాధువులను కలుసుకొన్న తీరు 44; నీరు, శౌచాదులకు ఏకాంత స్థలాల సదుపాయం ఉన్న చోట్లలోనే సాధువులు విశ్రమిస్తారు 45; పై విషయం గురించి ఒక కథ 45; దక్షిణేశ్వరానికి సాధువులు రావడానికి కారణాలు 46; వివిధ సంప్రదాయాల సాధువులు విభిన్న సమయాల్లో రావడం 46; పరమహంసల వేదాంత విచారణ 46; పరమానందంలో మునిగి ఉన్న ఒక సాధువు మహోన్నత అవస్థ 48; జ్ఞానోన్మత్తుడైన ఒక సాధువును శ్రీరామకృష్ణులు దర్శించడం 48; గంగాజలం, మురికి కాలువ నీటి మధ్య విభేదం బ్రహ్మజ్ఞానికి కానరాదు 49; రామావత్ సాధువు దక్షిణేశ్వరానికి రావడం 50; రాంలాలా వృత్తాంతం 50; రాంలాలా ఉదంతం పట్ల మేం స్పందించిన తీరు 52; సుఖాలను అధికరిస్తుంది కాబట్టే మనం ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని ప్రశంసిస్తాం 53; కాపాలికుల ఉద్బోధ : యోగభోగాల సహ అస్తిత్వం అసంభవం 55; పరిత్యాగ ప్రబోధాన్ని చూసి లౌకికులు భీతి చెందడం 56; శ్రీరామకృష్ణుల వద్దే రాంలాలా శాశ్వతంగా ఉండిపోయిన వైనం 57; శ్రీరామకృష్ణులు : నిస్వార్థ ప్రేమానుభూతి 58; రామనామం పట్ల అచంచల విశ్వాసం ఉన్న ఒక సాధువు 58; రామావత్ సాధువుల భక్తిగీతాలు 59; సాధువుల ఆవశ్యకాలను శ్రీరామకృష్ణులు సరఫరా చేయించడం : రాజకుమార్ ఉదంతం 60; ఆధ్యాత్మికం కాని సూచనల పట్ల సైతం శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మికంగా స్పందించడం 62; ఇందుకు కొన్ని ఉదాహరణలు 63; సాధువులకు శ్రీరామకృష్ణుల దోహదం 68; శ్రీరామకృష్ణుల సాధనలు : సాధువుల ఆగమనం 69; అవతార పురుషుల ఆధ్యాత్మిక శక్తిలో తారతమ్యం 69; శ్రీరామకృష్ణుల, ఇతర అవతార పురుషుల ఆధ్యాత్మిక శక్తుల సాదృశ్యం 70; అన్ని సంప్రదాయాలకు చెందిన సాధువులు, సాధకులు శ్రీరామకృష్ణుల వద్దకు రావడానికి హేతువు 71; వారి రాక శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక జాగృతం నిమిత్తం కాదు 72; శ్రీరామకృష్ణుల సమాధ్యవస్థ రుగ్మత కాదు : శివనాథ్తో సంభాషించడం 73; పిచ్చివాడిలా శ్రీరామకృష్ణులు ప్రవర్తించడానికి కారణం 74; సాధకులకు శ్రీరామకృష్ణులు మంత్రదీక్ష నివ్వడం: ఉదాహరణకు శ్రీనారాయణ శాస్త్రి 74; శాస్త్రిగారి పుట్టుపూర్వోత్తరాలు 75; శ్రీరామకృష్ణులను ఆయన సందర్శించడం 75; శాస్త్రిగారి సంకల్పం 76; శాస్త్రిగారిలో వైరాగ్యోదయం 77; శాస్త్రిగారు : మైకేల్ మధుసూదన్ 77; శ్రీరామకృష్ణులు : మైకేల్ 78; తన అభిప్రాయాన్ని శాస్త్రిగారు గోడమీద వ్రాయడం 78; శాస్త్రిగారు సన్న్యాసం

స్వీకరించడం 79; సాధువులను, సాధకులను శ్రీరామకృష్ణులు సందర్శించడం 79; వంగదేశంలో న్యాయదర్శనం 80; వేదాంత పండితుడు పద్మలోచన్ 80; పద్మలోచన్ మేథాసంపత్తి 81; శివుడా, విష్ణువా ఎవరు గొప్ప? 81; భావదనురాగం 82; పద్మలోచన్ కలకత్తాకు రావడం 82; శ్రీరామకృష్ణ పద్మలోచన్‌ల ప్రథమ సమావేశం 83; శ్రీరామకృష్ణుల పట్ల పద్మలోచన్ భక్తిప్రపత్తులు పెంపొందడానికి కారణం 83; పద్మలోచన్ అద్భుత శక్తిని గురించి శ్రీరామకృష్ణులకు తెలియడం 84; కాశీలో పద్మలోచన్ పరమపదించడం 85; దయానంద సరస్వతి గురించి శ్రీరామకృష్ణులు 86; జయనారాయణ్ పండితుడు 86; భక్తుడైన కృష్ణకిశోర్ 86.

3. గురుభావ స్థితిలో తీర్థయాత్ర - సాధుసాంగత్యం ... 87

నిరుపమానమైన శ్రీరామకృష్ణుల జీవితం 87; శ్రీరామకృష్ణుల ఉదార సిద్ధాంతాలకు ఆస్కారం 89; పై దానికి నిదర్శనం 89; శ్రీరామకృష్ణుల భావాల పరివ్యాప్తి 90; దక్షిణేశ్వరానికి వచ్చిన అన్ని సంప్రదాయ సాధువులలోను, తీర్థయాత్రలో పరిచయమైన సాధువులలోను శ్రీరామకృష్ణుల భావాలూ ఆదర్శాలూ మొట్టమొదట ప్రచారమైనాయి 91; వివిధ ఆధ్యాత్మిక స్థితుల, అనుభూతుల మూలంగా శ్రీరామకృష్ణుల అసాధారణ బోధనాశక్తి వికాసం 91; జనసామాన్యం స్థితిగతులను అవగతం చేసుకోవడంలో తీర్థయాత్ర దోహదపడడం 93; మహాపురుషుల తీర్థయాత్రల ప్రాధాన్యం 94; పుణ్యక్షేత్ర సేవనానంతరం 'నెమరు వేసుకోవడం' గురించి ఉపదేశం 95; భక్తిభావం : పుణ్యక్షేత్రాలు 95; బుద్ధగయకు తీర్థయాత్ర చేయగోరిన ఒక భక్తునికి శ్రీరామకృష్ణుల ఉపదేశం 96; ఎవరికి ఇక్కడ ఉన్నదో, వారికి అక్కడా ఉన్నది 98; శ్రీరామకృష్ణుల విశ్వాసం : తీర్థయాత్రలు 98; భక్తుడవవు, మూర్ఖుడవు కాబోకు 99; పుణ్యక్షేత్రాలలో అపవిత్రత 100; 'స్వర్ణమయ కాశీని' శ్రీరామకృష్ణులు దర్శించడం 100; 'సువర్ణమయ' కాశీగా పేర్కొనడానికి కారణం 101; కాశీక్షేత్రం పట్ల శ్రీరామకృష్ణుల ప్రతిస్పందన 102; మణికర్ణికాఘట్టంలో శ్రీరామకృష్ణుల అలౌకిక దర్శనం 102; శ్రీరామకృష్ణులు, త్రైలింగస్వామిని దర్శించడం 104; బృందావనంలో శ్రీరామకృష్ణుల భావసమాధి 104; వ్రజభూమి పట్ల శ్రీరామకృష్ణుల ప్రగాఢ ప్రీతి 105; గంగామాయి ఉదంతం 106; శ్రీరామకృష్ణుల మాతృసేవాపరాయణత్వం 107; గయాక్షేత్రానికి వెళ్లడానికి శ్రీరామకృష్ణులు నిరాకరించడం : తత్కారణం 108; కార్యం కారణంలో లయమయ్యే నియతి 110; అవతార పురుషుల జీవిత రహస్యాన్ని కర్మసిద్ధాంతం విశదీకరించలేదు : తత్కారణం 110; సాంఖ్యదర్శనం : అవతార సిద్ధాంతం 111; వేదాంతం : అవతార సిద్ధాంతం 112; వారి మనశ్శరీరాల అనుపమానత 113; శ్రీరామకృష్ణుల నవద్వీప సందర్శనం 115; శ్రీ చైతన్యుల అవతారం గురించి శ్రీరామకృష్ణుల అభిప్రాయాలు 115; శ్రీరామకృష్ణులు కాల్నాను సందర్శించడం 116; భగవాన్‌దాస్ బాబాజీ పరిత్యాగం, భక్తి, కీర్తిప్రతిష్ఠలు 116; శ్రీరామకృష్ణుల సాధనకాలంలో ప్రారంభమైన మతోద్యమాలు 118; కొలటోలా హరిసభలో శ్రీరామకృష్ణులు 118; భాగవత పారాయణం 118; 'శ్రీ చైతన్యుల ఆసనం'పై శ్రీరామకృష్ణులు 119; పై సంఘటన వలన చెలరేగిన సంక్షోభం 120; ఆ విషయం

విని బాబాజీ కుపితుడవడం 121; భగవాన్‌దాసును సందర్శింప శ్రీరామకృష్ణులు వెళ్లడం 121; శ్రీరామకృష్ణుల గురించి బాబాజీకి హృదయ్ తెలియచేయడం 121; ఒక వైష్ణవ సాధువును బాబాజీ మందలించడం 122; లోకులకు బోధిస్తున్నాననే బాబాజీ అహంకారం 122; బాబాజీ అహంకారాన్ని శ్రీరామకృష్ణులు విమర్శించడం 123; శ్రీరామకృష్ణుల పలుకులను సత్యమని బాబాజీ అంగీకరించడం 124; వారి మధ్య హార్దిక సంభాషణ 124.

4. గురుభావం - చివరి భాగం ... 126

బ్రహ్మజ్ఞానిని సర్వజ్ఞుడని వేదాలు పేర్కొంటాయి 126; వేదవచనాలు ఏ విధంగా సత్యాలు? - శ్రీరామకృష్ణుల వివరణ 127; ఒక వస్తువు ఆద్యంతాలు తెలుసుకోవడమే ఆ వస్తువును గురించి సమగ్రంగా తెలుసుకోవడమౌతుంది 128; బ్రహ్మజ్ఞాని సంకల్పాలన్నీ ఈడేరతాయి 128; శ్రీరామకృష్ణుల జీవితం నుండి మరొక ఉదాహరణ 129; రెండు చైతన్య భూముల నుండి శ్రీరాకృష్ణుల దృక్పథం 130; సామాన్యులు ప్రతి విషయాన్ని రెండవ రకంగానే చూస్తారు 130; శ్రీరామకృష్ణుల రెండు రకాల దృష్టికోణాలకు కొన్ని ఉదాహరణలు 131; శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మికతను ఆపాదించే దృక్పథం 131; శ్రీరామకృష్ణుల ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి సామాన్యుల కంటే చురుకైనవి. భోగ సుఖాలపట్ల అనాసక్తమై ఉండడమే అందుకు కారణం 133; శ్రీరామకృష్ణుల కుశాగ్రబుద్ధికి ఉదాహరణలు 133; సాంఖ్యదర్శన తత్త్వాన్ని 'ఇంటి యజమాని - ఇల్లాలు' దృష్టాంతం ద్వారా సులభంగా విపులీకరించడం 134; బ్రహ్మం, మాయ అభేదమైనవి : పాము కదులుతూన్నా, పడుకొనివున్నా పామే 134; ఈశ్వరుడు మాయచే బద్ధుడు కాడు. 'తన నోట్లో విషం ఉన్నా పాము చావదు.' 135; భగవంతుడు తన నియతిని మార్చగలడు 135; శ్రీరామకృష్ణులు : 'తటిద్వాహకం' 136; ఎర్రమందార మొక్కకు తెల్లమందారపువ్వు పూచిన సంఘటన 137; 'ఈ సమస్త విశ్వం జగజ్జనని క్రీడారంగం' - శ్రీరామకృష్ణుల ప్రగాఢ విశ్వాసం 137; ఉన్నత భావభూములనుండి ప్రత్యేక స్థానాలలో ఘనీభూతమై అభివ్యక్తమయ్యే ఆధ్యాత్మిక శక్తిని శ్రీరామకృష్ణులు గుర్తించడం 138; శ్రీచైతన్యుల బృందావన ఆవిష్కరణ 139; శ్రీరామకృష్ణుల జీవితంలో అటువంటి సంఘటనలు. వన - విష్ణుపూర్‌లో తొల్లిటి మృణ్మయిమూర్తి విగ్రహాన్ని దర్శించడం 139; వన-విష్ణుపూర్ పట్టణ స్థితిగతులు 140; శ్రీ మదన్‌మోహన్ - మృణ్మయి 140; లోకుల నైజాన్ని కనుగొనగలిగే శ్రీరామకృష్ణుల అంతర్దృష్టి - మొదటి ఉదాహరణ 141; రెండవ ఉదాహరణ 142; 'ఎంత ప్రయత్నం చేసినా ఎవరూ తాము కోరినట్లు కాలేరు' 143; మూడవ ఉదాహరణ : శశధర పండితుణ్ణి చూడబోయినప్పుడు మంచినీళ్లు త్రాగే సందర్భంలోనిది 144; శ్రీరామకృష్ణుల మనోనిర్మాణం; అంతర్దృష్టి 145; ఒక ఉదాహరణ 146; రెండవ ఉదాహరణ 147; మూడవ ఉదాహరణ 147; శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అనుభవాలు : శాస్త్రాల ధ్రువీకరణ 147; అద్వైత జ్ఞాన ప్రమాణం 148; దర్శనాలు రెండు రకాలు. 1. స్వసంవేద్యం - తమకు మాత్రమే తెలిసేవి 2. ఇతరులకుకూడా తెలిసేవి 148; వస్తువుల యథార్థ స్వభావంతోనే శ్రీరామకృష్ణులు సంతృప్తి చెందేవారు 149; శాక్తుల, వైష్ణవుల మధ్య

నెలకొన్న విద్వేషం 149; శ్రీరామకృష్ణులు : ఆ విద్వేషం తొలగించిన వైనం 150; ఔషధ నిర్ణయం చేసి మందుమాకు లిచ్చే సాధు సంప్రదాయానికి మూలం: క్రమేణా వారి ఆధ్యాత్మిక పతనం 150; వేషమాత్ర సాధువుల గురించి శ్రీరామకృష్ణుల అభిప్రాయం 151; నిజమైన సాధువుల జీవితాలే శాస్త్రాలకు జీవం పోస్తాయి 151; నిజమైన సాధువులలో కూడా సంకుచితత్వం ఉండడం శ్రీరామకృష్ణులు గమనించడం 152; పుణ్యక్షేత్రాలలో ఈ ఆధ్యాత్మికత కొరవడడం శ్రీరామకృష్ణులకు అనుభవైకవేద్యమే 152; తమ ఉదార (మత) సిద్ధాంతం గురించి శ్రీరామకృష్ణులు ఎరిగే ఉన్నారు 154 మతాలెన్నో మార్గాలన్ని 154; లోకానికి ఆధ్యాత్మికతను అందివ్వడానికే జగజ్జనని తనకు అద్భుత శక్తిసంపత్తిని ఒసగిందని శ్రీరామకృష్ణులు గ్రహించడం 155; ఆధ్యాత్మిక గురువుగా నిరహంకారులైన శ్రీరామకృష్ణులు 157; అందుకు ఉదాహరణ - భావముఖంలో శ్రీరామకృష్ణులు జగజ్జననితో తగవులాడడం 157; పై విషయానికి రెండవ ఉదాహరణ 158; 'నేను జగజ్జనని సామ్రాజ్యంలో కార్యనిర్వహణాధికారిని. గందరగోళం చెలరేగిన చోట్ల శాంతి నెలకొల్పవలసి వస్తుంది' - అని శ్రీరామకృష్ణులు గ్రహించడం 159; తమ అంతరంగ భక్తులను కలుసుకోవడానికి శ్రీరామకృష్ణులు ఆతురత చెందడం 160; అంతరంగ భక్తులు వచ్చి తీరాలనే శ్రీరామకృష్ణుల ప్రగాఢ విశ్వాసం 162; జగజ్జననికే పూర్తిగా పరాధీనులై ఉండడం వలనే శ్రీరామకృష్ణులకు ఆ నమ్మకం కలిగింది 163; శ్రీరామకృష్ణుల పై వచనాల తాత్పర్యం 163; దివ్యభావం : దాని అర్థం 164; శాంభవీ దీక్ష : శాక్తీ దీక్ష 165; అటువంటి దీక్షలకు యుక్తాయుక్త కాలనియమం పాటింప నవసరం లేదు 166; దివ్యభావమూర్తులైన సద్గురువులలో శ్రీరామకృష్ణులు సర్వశ్రేష్ఠులు 166; అవతార పురుషులలో శక్త్యభివ్యక్తీకరణ 167; శ్రీరామకృష్ణులు : కేశవచంద్రసేన్, తదితర భక్తులు 168.

5. భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు: 1885వ సం॥ నవయాత్రోత్సవం ... 169

శ్రీరామకృష్ణులలో దివ్య, మానవ ప్రవృత్తుల సామరస్యం 169; విజయకృష్ణ గోస్వామి దివ్యదర్శనం పొందడం 170; శ్రీరామకృష్ణుల అసాధారణ ప్రవర్తనకు భక్తులు స్పందించిన తీరు 171; స్వామి ప్రేమానంద : సమాధి స్థితి 172; భక్తుల గురించి శ్రీరామకృష్ణులు ఎందుకు ఆందోళన చెందేవారు? 174; ఈ అంశంపై నరేంద్రుడి అభ్యంతరం 175; యోగ్యులైన అందరినీ శ్రీరామకృష్ణులు గౌరవించేవారు 175; అహంకార నిర్మూలనకై శ్రీరామకృష్ణులు చేపట్టిన తీవ్రప్రక్రియలు 176; డాక్టర్ కైలాస్, త్రైలోక్యబాబులకు సంబంధించిన సంఘటనలు శ్రీరామకృష్ణుల అభిమానరాహిత్యానికి దృష్టాంతాలు 176; తద్విరుద్ధమైన లౌకికుల ప్రవర్తన 177; మతోద్యమాలు 177; కలకత్తాలో శశధర పండితుడు 179; శశధర్‌ను చూడాలని శ్రీరామకృష్ణులు ఆకాంక్షించడం 179; శ్రీరామకృష్ణుల ఆకాంక్షలన్నీ నెరవేరతాయి 180; 1885వ సంవత్సర నవయాత్ర 180; ఈశాన్‌చంద్ర ముఖోపాధ్యాయ్ గురించి 181; స్వామి యోగానంద పూర్వాచారపరాయణత్వం 183; బలరాంబాబు ఇంట్లో రథోత్సవం

184; శ్రీరామకృష్ణుల పట్ల భక్తురాండ్ర భక్తిప్రపత్తులు 185; ఒక భక్తురాలు తన్మయ స్థితిలో శ్రీరామకృష్ణులను అనుసరించడం 185; శ్రీరామకృష్ణుల అంతర్ముఖత్వానికి మరికొన్ని దృష్టాంతాలు 186; ఒక భక్తురాలిని దక్షిణేశ్వరానికి రమ్మని శ్రీరామకృష్ణులు ఆహ్వానించడం 188; గాలికి ఎగిరే విస్తరాకులా మసలుకో 189; దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులు భావసమాధి పొందడం 190; కుండలినీ దర్శనం - భావావస్థలో మాట్లాడడం 191; భక్తుల ఆహార విషయంగా శ్రీరామకృష్ణులు ఆందోళన చెందడం 191; శ్రీరామకృష్ణుల బాలక స్వభావం 192; శశధర పండితుడు శ్రీరామకృష్ణులను రెండవసారి కలుసుకోవడం 194; పై సంఘటనను స్వయంగా శ్రీరామకృష్ణులు ఒక భక్తుడికి వర్ణించిన తీరు 195; ఇతర అవతారమూర్తుల పట్ల విశ్వాసం ఏర్పడడానికి శ్రీరామకృష్ణుల జీవితం దోహదం చేసింది 196.

6. భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు :
గోపాలుని తల్లి కథ - మొదటి భాగం ... 198

శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి గోపాలుని తల్లి కలుసుకోవడం 199; పటల్‌డాంగా వాస్తవ్యుడైన గోవిందచంద్ర దత్త ఉదంతం 201; భక్తురాలైన అతడి భార్య 201; ఆమె పురోహితుల కుటుంబం : బాల వితంతువైన అఘోరమణి 202; అఘోరమణి భక్తి, ఆచార నిష్ఠలు 203; గోవిందబాబు ఆలయంలో వసిస్తూ, అఘోరమణి తపస్సు చేయడం 204; ప్రాచ్య పాశ్చాత్య మహిళలలో ఆధ్యాత్మికత 204; శ్రీరామకృష్ణులను రెండవసారి అఘోరమణి దర్శించడం 205; గోవింద చంద్రుని ఉద్యానానికి శ్రీరామకృష్ణులు వెళ్లడం 207; అఘోరమణి బాలగోపాలుని దివ్యదర్శనం పొందడం 207; ఆ పరిస్థితిలోనే ఆమె శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లడం 208; ఆమె భావావస్థను శ్రీరామకృష్ణులు ప్రశంసించడం 210; ''నువ్వు సమస్తం సాధించావు'' - శ్రీరామకృష్ణుల ప్రశంస 212.

7. భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు : 1885 వ సం॥ రథయాత్ర
-గోపాలుని తల్లి కథ - చివరి భాగం ... 214

బలరాం బోసు ఇంట్లో రథయాత్రోత్సవం 214; శ్రీరామకృష్ణులు : శ్రీ చైతన్యుల సంకీర్తనం 214; బలరాం బాబు భగవత్సేవలు 215; శ్రీరామకృష్ణులకు, బలరాం ఒనర్చిన అసాధారణ సేవానిరతులు 216; శ్రీరామకృష్ణులు 'నేను', 'నాది' అనే మాటలు ఎన్నడూ ఉపయోగించి ఎరుగరు 217; శ్రీరామకృష్ణులు : ఆయన సరఫరా దారులు 217; అమిత భక్తి ప్రపత్తులున్న బలరాం కుటుంబం 218; బలరాంబాబు ఇంట్లో జరిపే రథోత్సవం ఆతడి భక్తిని చాటుతుంది 219; భక్తురాండ్రతో శ్రీరామకృష్ణులకు గల అద్భుత బాంధవ్యం 220; గోపాలుని తల్లిని, శ్రీరామకృష్ణులు తోడ్కొని రమ్మనడం 221; శ్రీరామకృష్ణుల భావావస్థ : గోపాలుని తల్లి రాక 222;

భావసమాధిమగ్నులైనప్పుడు శ్రీరామకృష్ణులలోని ఆకర్షకత్వం 223; శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి రావడం 224; ఆ మూటను చూసి శ్రీరామకృష్ణులు చిరాకు పడడం 224; గోపాలుని తల్లి పశ్చాత్తాపం 225; గోపాలుని తల్లి మానసిక వైఖరి 227; మార్వాడీ భక్తులు శ్రీరామకృష్ణుల దర్శనార్థం రావడం 228; కానుకల పట్ల శ్రీరామకృష్ణుల వైఖరి 228; మార్వాడీలు సమర్పించిన పటికబెల్లమంతా గోపాలుని తల్లికి శ్రీరామకృష్ణులు ఇచ్చివేయడం 230; స్వీయ దర్శనాలను గురించి ఇతరులకు వెల్లడించకూడదు 231; గోపాలుని తల్లిని వివేకానంద స్వామికి పరిచయం చేయడం 231; కామార్‌హాటీ ఉద్యానంలో శ్రీరామకృష్ణులు పిశాచాన్ని చూడడం 233; గోపాలుని తల్లికి శ్రీరామకృష్ణులు తినిపించడం 235; గోపాలుని తల్లికి విశ్వరూప దర్శన ప్రాప్తి 237; బారానగర మఠంలో గోపాలుని తల్లి 238; పాశ్చాత్య మహిళలతో గోపాలుని తల్లి 238; గోపాలుని తల్లి సోదరి నివేదిత ఇంట్లో నివసించడం 238; గోపాలుని తల్లి మరణం 239.

అనుబంధం : శ్రీరామకృష్ణుల మానవ ప్రవృత్తి ... 243

శ్రీరామకృష్ణుల యోగశక్తుల గురించి వినే జనసామాన్యం ఆయన పట్ల భక్తిప్రపత్తులు చెల్లించింది. 243; సకామ భక్తి ఆధ్యాత్మిక పురోగతికి హానికరం 244; యథార్థభక్తి ఉపాసకుని ఉపాస్యునిలా మారుస్తుంది 245; అవతార పురుషుల జీవితాలను అధ్యయనం చేసేప్పుడు గోచరించే అపూర్వ విషయాలు 246; శ్రీరామకృష్ణుల జన్మస్థలం, కామార్పుకూర్ 248; బాల రామకృష్ణుల అద్భుత ప్రవర్తన 248; ఆ సత్యాన్వేషణ ఫలితం 251; శ్రీరామకృష్ణుల సరళ వచనాలలోని గూఢార్థం 252; శ్రీరామకృష్ణుల దైనందిన అలవాట్లు, ఇష్టానిష్టతలు 254; ఆధ్యాత్మిక చైతన్య జాగృతీమూర్తి శ్రీరామకృష్ణులు 256.

5. దివ్యభావం - నరేంద్రుడు

ప్రస్తావన ... 261

సింహావలోకనం ... 262

శ్రీరామకృష్ణుల జీవితంలో దివ్యభావం 262; దివ్యభావ ఆరంభం ఎలా గుర్తించ బడింది 263; శ్రీరామకృష్ణులు : భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం 263 మానవ జీవితంలో దివ్యభావం ఎప్పుడు పాత్ర వహిస్తుంది 264; దివ్యభావం : అవతార పురుషులను అవగతం చేసుకోవడంలోని క్లిష్టత 265; శ్రీరామకృష్ణుల దివ్యభావంలోని ఏడు దశలు 265.

1. i. బ్రహ్మసమాజం - శ్రీరామకృష్ణుల ప్రభావం ... 267

శ్రీరామకృష్ణుల పట్ల బ్రహ్మసమాజస్థుల భక్తిప్రపత్తులు 267; వారిలో శ్రీరామకృష్ణుల అనురాగ బాంధవ్యం 268 శ్రీరామకృష్ణుల పట్ల బ్రహ్మసమాజస్థులకు గల ప్రగాఢ

ఆకర్షణ 268; సాధనలో బ్రహ్మసమాజస్థులకు శ్రీరామకృష్ణుల తోడ్పాటు 269; తమకు ఆచరణీయాలైన ఉపదేశాలనే ధారాళంగా స్వీకరించమనడం 270; శ్రీరామకృష్ణులు హాస్యోక్తుల ద్వారా బోధిస్తారు 270; భక్తి : శక్తిగా భగవంతుని చైతన్యం 271; 'భగవంతుని స్వభావానికి పరిమితిని నిర్ణయించకండి' 271; శ్రీరామకృష్ణుల ఉపదేశాలను కేశవ్ పాక్షికంగా అంగీకరించడం : నవవిధాన్ 273; కేశవ్ పట్ల శ్రీరామకృష్ణుల ప్రగాఢ ప్రేమాభిమానాలు 274; విజయకృష్ణ గోస్వామిపై శ్రీరామకృష్ణుల ప్రభావం 274; అప్పటి నుండి సాధనాపథంలో ఏ మేరకు విజయ్ పురోగమించాడు? 275; కేశవ్, విజయ్‌ల మధ్యనున్న అపార్థాన్ని తొలగించడం 276; దక్షిణేశ్వరానికి రావడం శివనాథ్ మానుకోవడం 276; బ్రహ్మసమాజంపై శ్రీరామకృష్ణుల ప్రభావం గురించి ప్రతాపచంద్ర మజుందార్ వెలిబుచ్చిన అభిప్రాయం 277; సాధారణ బ్రహ్మసమాజంపై శ్రీరామకృష్ణుల ప్రభావం 278; బ్రహ్మసమాజానికి శ్రీరామకృష్ణుల గుర్తింపు 279.

1. ii. మణిమల్లిక్ గృహంలో బ్రహ్మసమాజ ఉత్సవం ... 281

ఆ సంఘటన జరిగిన తేదీ నిర్ణయం 281; వైకుంఠనాథ్ సన్యాల్‌తో మా పరిచయం 281; బాబూరాంతో మా ప్రథమ పరిచయం 282; మణిమల్లిక్ ఇంట్లో అద్భుత సంకీర్తన 284; శ్రీరామకృష్ణుల అద్భుత నృత్యం 284; విజయకృష్ణ గోస్వామితో శ్రీరామకృష్ణుల హాస్యోక్తులు 287; భక్తుల పట్ల శ్రీరామకృష్ణుల అవ్యాజ అనురాగం 287; మణిమల్లిక్ కుటుంబం ఒక భక్త కుటుంబం 288.

1. iii. జయగోపాల్ సేన్ ఇంట్లో శ్రీరామకృష్ణులు ... 289

జయగోపాల్ సేన్ గృహం 289; శ్రీరామకృష్ణుల బోధనా విధానం 290; ఆయన బోధనా విధానంలోని మరో విలక్షణత 292; అనుభూతిరహిత వచనాలపట్ల ఆయన చిరాకుపడడం 292; సంసార జీవితంలో భగవత్సాక్షాత్కారం పొందడం ఎలాగో శ్రీరామకృష్ణులు నేర్పడం 293; సంకీర్తనానందం 294.

2. దివ్యదర్శనాలలో చూసిన భక్తుల ఆగమనారంభం ... 297

బ్రహ్మసమాజం నుండి కూడా శ్రీరామకృష్ణులు కొంత నేర్చుకోవడం 297; పాశ్చాత్య భావాల ప్రభావం గ్రహించగలగడం 298; ఆధునికుల తులనాత్మక వైఖరి 298; ఈ విషయంగా శ్రీరామకృష్ణులు సంచలనం చెందకపోవడం 299; తమ ఉపదేశాలను పాక్షికంగా బ్రహ్మసమాజస్థులు స్వీకరించడం పట్ల శ్రీరామకృష్ణులు సమాధానపడడం 299; బ్రహ్మసమాజం ద్వారా కలకత్తా ప్రజలు శ్రీరామకృష్ణుల పట్ల ఆకర్షితులు కావడం 300; శ్రీరామకృష్ణుల అద్భుత దర్శనం : రాఖాల్ రావడం 302; రాఖాల్ బాల స్వభావం 303; రాఖాల్ భార్య 303; బాలక స్వభావాన్ని రాఖాల్ ఎలా కోల్పోతాడు 304; రాఖాల్‌ను, శ్రీరామకృష్ణులు తిట్టడం 304; రాఖాల్ మనస్సులో ఈర్ష్య: శ్రీరామకృష్ణుల భయసంశయాలు 304; రాఖాల్ బృందావనానికి వెళ్లడం 305; రాఖాల్ అస్వస్థత గురించి విని శ్రీరామకృష్ణుల భయోద్రేకం 305; రాఖాల్ తదుపరి జీవితం 305.

3. నరేంద్రుని పుట్టుపూర్వోత్తరాలు - దక్షిణేశ్వర రాక ... 307

దివ్యభావంలో శ్రీరామకృష్ణులు 307; సురేంద్రుని ఇంట్లో శ్రీరామకృష్ణ నరేంద్రుల ప్రథమ సమావేశం 308; నరేంద్రుణ్ణి దక్షిణేశ్వరానికి రమ్మని శ్రీరామకృష్ణులు ఆహ్వానించడం 308; దక్షిణేశ్వరానికి నరేంద్రుడు మొదటిసారి వెళ్లడం 309; నరేంద్రుణ్ణి గురించి శ్రీరామకృష్ణుల ఆలోచనలు 310; నరేంద్రుణ్ణి చూడగోరి శ్రీరామకృష్ణులు తపించిపోవడం 312; శ్రీరామకృష్ణులతో జరిగిన ప్రథమ సమావేశం గురించి నరేంద్రుడు 312; మళ్లీ వస్తానని నరేంద్రుడు వాగ్దానం చేయడం 314; శ్రీరామకృష్ణుల గురించి నరేంద్రుని తొలి అభిప్రాయం 314; నరేంద్రుని అప్పటి మతానుష్ఠానం 315; బ్రహ్మసమాజంతో నరేంద్రుని సంబంధం 316; నరేంద్రుని రెండు అద్భుత భావనలు 316; ధ్యానం పట్ల నరేంద్రుని సహజ అభిరుచి 316; మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ ప్రోత్సాహం 317; నరేంద్రుని బహుముఖ ప్రజ్ఞాపాటవాలు 318; అధ్యయనం పట్ల నరేంద్రుని అభిరుచి 319; త్వరితంగా చదవగల నరేంద్రుని సమర్థత 319; నరేంద్రుని వాదసరణి 320; శరీర వ్యాయామం పట్ల నరేంద్రుని అభిరుచి 321; అతడి సాహసం, నెచ్చెలిమి 321; సైరాపిస్ అనే ఓడను సందర్శింప అనుమతి పొందడం 322; ట్రెపీజ్ సంఘటన 323; నరేంద్రుని సత్యనిష్ఠ 324; హాని కలిగించని వినోదాల పట్ల నరేంద్రుని అభిలాష 324; నరేంద్రుని కోపం 325; నరేంద్రుని మనోబుద్ధుల సమ వికాసం 325; రాయపూర్ వెళ్లేదారిలో నరేంద్రుడు ధ్యానమగ్నుడవడం 326; సన్న్యాసం పుచ్చుకొన్న నరేంద్రుని తాత 327; నరేంద్రుని తండ్రి, విశ్వనాథ్ దత్త 328; సంగీతం పట్ల విశ్వనాథ్ ప్రీతి 329; మహమ్మదీయ ఆచారవ్యవహారాల పట్ల విశ్వనాథ్ మక్కువ 329; వినోదాల పట్ల విశ్వనాథ్ అభిలాష; విశ్వనాథ్ ఉదారత్వం 330; నరేంద్రుని తల్లి 330.

4. శ్రీరామకృష్ణులతో నరేంద్రుని రెండవ, మూడవ సమావేశాలు ... 332

శ్రీరామకృష్ణులను రెండవసారి కలుసుకోవడంలో నరేంద్రుని జాప్యం 332; శ్రీరామకృష్ణుల యోగశక్తి ద్వారా నరేంద్రుడు పొందిన అద్భుతమైన అనుభవం 333; నరేంద్రుని పునరాలోచనలు 335; శ్రీరామకృష్ణులను సునిశితంగా పరిశీలించాలని నరేంద్రుడు తీర్మానించుకోవడం 335; చిరకాల పరిచయస్థునిలా నరేంద్రునితో శ్రీరామకృష్ణులు మెలగడం 336; నరేంద్రుని మూడవ సమావేశం 336; భావపారవశ్యంలోని శ్రీరామకృష్ణుల స్పర్శతో నరేంద్రుడు బాహ్యస్మృతిని కోల్పోవడం 337; ఆ బాహ్యచైతన్యరహిత స్థితిలో నరేంద్రుణ్ణి, శ్రీరామకృష్ణులు ప్రశ్నించడం 338; నరేంద్రుణ్ణి గురించిన శ్రీరామకృష్ణుల అద్భుత దర్శనం 338; శ్రీరామకృష్ణుల పట్ల నరేంద్రుని దృఢవిశ్వాసం 339; గురువు గురించిన నరేంద్రుని భావనలో మార్పు 340; వైరాగ్య పథంలో నరేంద్రుని పురోగతి 340; పరీక్షించకుండా ఉపదేశాలను స్వీకరించరాదనే నరేంద్రుని సంకల్పం 341; అప్పటి నుండి నరేంద్రుని ప్రవర్తన 340;అప్పటి నరేంద్రుని మానసిక స్థితి 341.

5. శ్రీరామకృష్ణుల నిస్స్వార్థ ప్రేమ : నరేంద్రనాథ్ ... 342

తొలి జీవితంలో నరేంద్రుని అసాధారణ అనుభూతులు 342; శ్రీరామకృష్ణుల దివ్యశక్తుల ప్రత్యక్షానుభూతిని నరేంద్రుడు చవిచూడడం 343; ఆధ్యాత్మిక జీవితానికి నరేంద్రుని అర్హత 344; నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ఆకర్షణ 345; మొదటి సమావేశంలోనే నరేంద్రునికి బ్రహ్మజ్ఞానం అనుగ్రహింప శ్రీరామకృష్ణులు ప్రయత్నించడం 345; నరేంద్రుడు మొదటిసారి, రెండవసారి పొందిన అద్భుత అనుభవాలలోని తారతమ్యం 346; నరేంద్రుని గురించి శ్రీరామకృష్ణుల వెరపు 346; నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులు ఎందుకు ఆకర్షితులైనారు 347; ఈ ఆకర్షణ సహజమే, అనివార్యమే 347; నరేంద్రుని పట్ల గల శ్రీరామకృష్ణుల అనురాగం అలౌకికమైనది 348; ఆ ప్రేమ గురించి ప్రేమానందస్వామి ఉద్ఘాటన 348; ప్రేమానందస్వామి మొట్టమొదటిసారి దక్షిణేశ్వర సందర్శం 348; నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులు చూపే అక్కర గురించి ప్రేమానందస్వామి ప్రత్యక్ష అనుభవం 349; నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమ గురించి వైకుంఠనాథ్ సన్యాల్ 350; శ్రీరామకృష్ణులు తనపై వర్షిస్తూన్న ప్రేమకు నరేంద్రుడు చలించకపోవడం 352.

6. i. శ్రీరామకృష్ణ నరేంద్రనాథ్‌ల మధ్య నెలకొన్న అపురూప అనుబంధం ... 353

శ్రీరామకృష్ణుల పావన సాంగత్యం ఎంతకాలం నరేంద్రుడికి లభించింది? 353; నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ప్రవర్తనలోని ఐదు ముఖ్యాంశాలు 354; అద్భుత దర్శనాలపై ఆధారపడిన శ్రీరామకృష్ణుల వైఖరి 354; నరేంద్రుణ్ణి శ్రీరామకృష్ణులు పరీక్షించడానికి హేతువు 355; నరేంద్రుని ఎడ శ్రీరామకృష్ణులు ఎలా మెలగారు? 355; నరేంద్రుని గురించి సామాన్యుల పొరపాటు అభిప్రాయం 356; నరేంద్రుణ్ణి, శ్రీరామకృష్ణులు శ్లాఘించడం ఈ రచయిత వినడం 357; నరేంద్రుని గురించిన ఈ రచయిత తొలి పొరపాటు అభిప్రాయం 357; ఒక మిత్రుని ఇంట్లో నరేంద్రుణ్ణి, రచయిత మొదటిసారి కలుసుకోవడం 358; ఆ సమయంలో నరేంద్రుని బాహ్య ప్రవర్తన 358; ఆ మిత్రుడితో నరేంద్రుని సాహిత్య చర్చ 359; శ్రీరామకృష్ణుల ద్వారా నరేంద్రుని మహత్వాన్ని రచయిత తెలుసుకోవడం 360; ఆది నుండి శ్రీరామ కృష్ణులు, నరేంద్రుణ్ణి గుర్తించడం 360; బహిరంగంగా శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి ప్రశంసించడం: అందుకు హేతువు 361; నరేంద్రునిలో అంతర్గతమై ఉన్న శక్తుల గురించి శ్రీరామకృష్ణులు 361; అందుకు నరేంద్రుని నిరసన 362; నరేంద్రుని వాదనా పటిమ 363; నరేంద్రుణ్ణి చూడగోరి శ్రీరామకృష్ణులు సాధారణ బ్రహ్మ సమాజానికి వెళ్లడం 363; ఆయన రాకకు ఫలితం 364; జనాన్ని చెల్లాచెదరు చేయడానికి దీపాలు ఆర్పివేయడం 365; శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరానికి నరేంద్రుడు తోడ్కొని వెళ్లడం 365; తనను అంతగా ప్రేమిస్తున్నందుకు నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను నిరసించడం 366.

6. ii. శ్రీరామకృష్ణ నరేంద్రనాథ్‌ల మధ్య నెలకొన్న అపురూప అనుబంధం ... 367

నరేంద్రుని మహత్వం గురించిన శ్రీరామకృష్ణుల వచనాలు 367; మార్వాడీ భక్తులు నివేదించి తెచ్చిన ఆహారపదార్థాలు 368; నరేంద్రుని భక్తిపై ఆహారదోషం ఎటువంటి ప్రభావం చూపలేదు 368; నరేంద్రుని పురోగతి 368; శ్రీ'మ'ను నరేంద్రునితో వాదించమని శ్రీరామకృష్ణులు కోరడం 369; భక్తుడైన కేదార్‌నాథ్ ఛట్టోపాధ్యాయ 370; కేదార్ వాదనా పటిమ 371; కేదార్ గురించి నరేంద్రుడు 372; నరేంద్రుడు - రాఖాల్ 373; అద్వైత తత్త్వాన్ని నరేంద్రుడు నిరసించడం 374; ప్రతాపచంద్ర హాజ్రా 375; హాజ్రా తెలివితేటలకు నరేంద్రుని మెచ్చుకోలు 376; నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు శ్రీరామకృష్ణుల ప్రవర్తన 376; ఆధ్యాత్మిక భావోద్వేగంలో శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి స్పృశించడం 376; నరేంద్రుని అద్భుత అనుభవం 377; ఒక సందర్భంలో రచయిత, నరేంద్రునితో సంభాషించడం 378; ఒక అద్భుత సంఘటన గురించి నరేంద్రుని ప్రస్తావన 379; రచయిత ఇంట్లో నరేంద్రుని అపూర్వ అనుభవం 379.

7. శ్రీరామకృష్ణుల పరీక్షా విధానం : నరేంద్రుడు ... 381

శ్రీరామకృష్ణుల పరీక్షా విధానం 381; సాధారణమైన పరీక్షా విధానం 382; విశిష్ట ఆధ్యాత్మిక భావసంపన్నులైన వ్యక్తులను కలుసుకొన్నప్పుడు శ్రీరామకృష్ణులలో భావ పారవశ్యం కలగడం 383; వ్యక్తులను పరీక్షించడంలో శ్రీరామకృష్ణులు అవలంబించే నాలుగు పద్ధతులు 383; ముఖకవళికలను బట్టి మానసిక సంస్కారాలను రూఢీ పరచుకోవడం 384; ఈ విషయంలో శ్రీరామకృష్ణుల అద్భుత పరిజ్ఞానం 384; ముంజేతి బరువును తూచి వ్యక్తి స్వభావాన్ని నిర్ధారించడం 385; ఇతర లక్షణాలు స్వభావ తీరుతెన్నులను వెల్లడించడం 386; ద్వార కాపలాదారు హనుమాన్ సింగ్ 386; స్త్రీల ఆధ్యాత్మిక నైజాన్ని రూఢీపరచుకోవడం 387; నరేంద్రుని శారీరక లక్షణాలపై శ్రీరామకృష్ణులు వెలిబుచ్చిన అభిప్రాయం 388; అతిసామాన్యమైన పనులలో వెల్లడయ్యే మానసిక ప్రతిచర్యలను, ఇతర కార్యకలాపాలు వెల్లడించే కామ కాంచన ఆసక్తి తీవ్రతలను పరిశీలించడం ద్వారా మనిషిలోని స్వాభావిక సంస్కారాలను తెలుసుకోవడం 389; యువకుల గురించి శ్రీరామకృష్ణుల అభిప్రాయం 389; తమ వద్దకు వచ్చే భక్తుల చర్యల నన్నిటిని ఆయన గమనించడం 389; కొన్ని ఉదాహరణలు 390; గంగలో పోటు 391; చేతల నన్నింటిని భగవత్సాక్షాత్కారం వైపుకే మరల్చాలి 391; భగవద్విశ్వాసం, మూర్ఖత్వం విభిన్నమైనవి; సత్ అసత్ వివక్షణ సదా చేస్తూండాలి 392; విభిన్న మానసిక స్వభావాలు గల వ్యక్తులకు విభిన్న బోధనలు 393; యోగానందకు ఉపదేశించడం 393; నిరంజన్‌కు విభిన్న ఉపదేశం 394; భక్తురాండ్రకు ఉపదేశం 395; హరీష్ వృత్తాంతం 395; ''దయచూపే సందర్భం కాదిది'' 396; వ్యక్తుల మామూలు దైనందిన చేతల ఆధారంగా ఉపదేశించడం 397; తమను గురించి వ్యక్తుల అంచనాల ద్వారా శ్రీరామకృష్ణులు వారి ఆధ్యాత్మిక ప్రగతిని రూఢీపరచుకోవడం 397; దీనిని గురించి మరింత వివరణ

397; ఆయనను గురించి వివిధ భక్తుల విభిన్న అంచనాలు 399; భక్తుడైన పూర్ణ చంద్రుడి ఉదాహరణ 400; పూర్ణుడి పట్ల శ్రీరామకృష్ణుల ఆప్యాయతానురాగాలు 401; పూర్ణుడి ఆధ్యాత్మిక అర్హత గురించి శ్రీరామకృష్ణులు 401; పూర్ణుడి దృష్టిలో శ్రీరామకృష్ణులు 401; పూర్ణుడికి శ్రీరామకృష్ణుల ఉపదేశం 402; సంసారియైనప్పటికీ పూర్ణుని మహత్వం 402; రెండవ ఉదాహరణ - వైకుంఠనాథ్ 402; పలుకులు, చేతలు భిన్నంగా ఉండే వ్యక్తిని విశ్వసించరాదు 404; వైద్యుడు, రోగి కథ 404; భక్తులు శ్రీరామకృష్ణులను పరీక్షించడం 405; మొదటి ఉదాహరణ: యోగానంద స్వామి కథ 405; యోగీంద్రుడి శుభసంస్కారాలు, అతడి తెలివితేటలు 405; యోగీంద్రుడు ఈశ్వరకోటిలోని వాడు 406; యోగీంద్రుని వివాహం, అతడి పశ్చాత్తాపం 406; దక్షిణేశ్వర కాళికాలయంలోనే యోగీన్ రాత్రిళ్లు కూడా గడపడం 408; శ్రీరామకృష్ణుల పట్ల యోగీన్‌కు సంశయం కలగడం 409; యోగీంద్రుడి సందేహ నివృత్తి 409; గురువు పాదపద్మాలకు యోగీన్ ఆత్మసమర్ప 409; నరేంద్రుని చేతలను శ్రీరామకృష్ణులు పరిశీలించడం 410; ఒక తమాషా సంఘటన 410; నరేంద్రుడి ఆత్మసంయమం 411; నరేంద్రునిలో కానవచ్చే భక్తియొక్క భౌతిక లక్షణాలు 412; శ్రీరామకృష్ణుల ఉదాసీన వైఖరిపట్ల ఆందోళన చెందని నరేంద్రుడు 412; నరేంద్రుడు : అతీంద్రియ శక్తులు 413.

8. i. జీవితంలోను, శ్రీరామకృష్ణుల వద్దా నరేంద్రుని శిక్షణ ... 415

తమలో స్త్రీ నైజం, నరేంద్రునిలో పురుష నైజం అభివ్యక్తమౌతూందన్న శ్రీరామకృష్ణుల వచనానికి అర్థం 415; నరేంద్రుడు స్వతంత్ర చింతనాశీలి 416; తన తండ్రి జీవితం, సమాజ పరిస్థితులు నరేంద్రునిపై చూపిన ప్రభావం 416; పాశ్చాత్య చింతనా ధోరణి పట్ల నరేంద్రుడి అసంతృప్తి 417; ప్రాచ్య, పాశ్చాత్య చింతనా ధోరణుల మధ్య నరేంద్రుడు ఊగులాడడం 418; నరేంద్రుని భగవత్సాక్షాత్కార సంకల్పంలో ఎలాటి మార్పులేకపోవడం 419; నరేంద్రుడి భగవద్విశ్వాసం చెక్కు చెదరలేదు 420; నరేంద్రుని సాధన 421; ధ్యానాభ్యాసం పట్ల నరేంద్రుడి అభిలాష 421; బుద్ధుని దర్శనం కలగడం 422.

8. ii. జీవితంలోను, శ్రీరామకృష్ణుల వద్దా నరేంద్రుని శిక్షణ ... 423

నరేంద్రుడు న్యాయవాద వృత్తిలో శిక్షణ పొందడం 423; జీవితాంతం బ్రహ్మచర్యం పాటించాలన్న నరేంద్రుని తీర్మానం 423; సన్న్యాసి కావాలనే అతడి అభిలాష 424; యథాప్రకారం శ్రీరామకృష్ణులను నరేంద్రుడు దర్శిస్తూనే ఉండడం 424; శ్రీరామకృష్ణులతో తన సమయాన్ని నరేంద్రుడు గడపిన తీరు 424; భవనాథ్ ప్రభృత నరేంద్రుని బారానగర మిత్రులు 426; నరేంద్రుని తండ్రి హఠాన్మరణం 427; నరేంద్రుని లౌకిక పరిస్థితులలో శోచనీయ మార్పు 427; ఆ దుర్దశ వర్ణన 428; కటిక దారిద్ర్యం 429; స్త్రీల ప్రలోభం 429; తల్లి మందలింపు 430; గాయపడిన అభిమానం

కారణంగా నాస్తికత్వం జనించడం 430; నరేంద్రుని శీలంపట్ల శ్రీరామకృష్ణుల విశ్వాసం 431; అవిచ్ఛిన్న అశాంతి 432; అద్భుత దర్శనంతో నరేంద్రుడు శాంతి పొందడం 432; సన్న్యసించాలనే నరేంద్రుని సంకల్ప 433; శ్రీరామకృష్ణుల విన్నపం మేరకు నరేంద్రుని సంకల్పంలో మార్పు 433; దారిద్ర్య ఉపశమనం కోసం నరేంద్రుడు ఆయనను ప్రార్థించడం 434; నరేంద్రునికి జగజ్జనని దివ్యదర్శనం 435; జగజ్జననిని సంపదలు అనుగ్రహించమని మూడుసార్లు ప్రార్థించడంలో నరేంద్రుని వైఫల్యం 435; విగ్రహారాధనను నరేంద్రుడు విశ్వసించడం 436; ఈ విషయంగా శ్రీరామకృష్ణులు ఆనందించిన వైనం 437; నరేంద్రునితోటి శ్రీరామకృష్ణుల ఆప్తబాంధవ్యం 438; నరేంద్రునితోపాటు వైకుంఠ్ కలకత్తాకు తిరిగిపోవడం 439.

9. శ్రీరామకృష్ణుల భక్తబృందం - నరేంద్రనాథ్ ... 440

1884 నాటికే శ్రీరామకృష్ణుల విశేష భక్తులందరూ వచ్చి చేరడం 440; ఈ కోవకు చెందిన భక్తులతో శ్రీరామకృష్ణుల ప్రవర్తన 440; దివ్యభావంలో శ్రీరామకృష్ణులు వారి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేయడం 441; శ్రీరామకృష్ణుల దివ్యస్పర్శ ఋజువు పరచే విషయం 442; ప్రతి భక్తుడూ శ్రీరామకృష్ణులను తన భావంలోని వ్యక్తిగా తలచడం 443; ఒక ఉదాహరణగా బలరాం బసు 443; శ్రీరామకృష్ణుల దర్శనానంతరం బలరాం తొలుత ప్రవర్తన 444; అహింసావ్రతం పట్ల బలరాం సంశయం 444; ఒక ఉదాహరణతో బలరాం సందేహ నివృత్తి 445; రెండు కోవల భక్తులు 446; పురుషులకు శ్రీరామకృష్ణుల ఉపదేశ విధానం 446; భక్తులలో నరేంద్రుని ప్రాధాన్యం 447; శ్రీరామకృష్ణుల వచనాల ప్రగాఢతను నరేంద్రుడు అవగతం చేసుకోవడం 448; శివుణ్ణిగా ఎంచి జీవుణ్ణి సేవించడం 449.

10. పానీహాటి మహోత్సవం ... 451

పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా నరేంద్రుడు 451; బంధువుల శత్రుత్వం 451; శ్రీరామకృష్ణుల వ్యాధి 452; అధికంగా మాట్లాడడం, భావసమాధి పొందడం కారణంగా వ్యాధి ప్రకోపించడం 452; పానీహాటి మహోత్సవ వృత్తాంతం 452; ఆ ఉత్సవంలో పాల్గొనాలనే శ్రీరామకృష్ణుల ఆకాంక్ష 454; పానీహాటికి బయలుదేరడం 454; మాతృదేవి ఆ బృందంతో కలిసి వెళ్లకపోవడానికి హేతువు 455; ఉత్సవ స్థలంలో భక్తులు చూసిన దృశ్యం 455; మణిసేన్ గృహం 455; మణిసేన్ కుటుంబీకుల దేవాలయం 456; భావసమాధ్యవస్థలో శ్రీరామకృష్ణులు నృత్యం చేయడం 456; రాఘవ పండితుని ఇంటికి పోతున్నప్పుడు శ్రీరామకృష్ణుల భావావస్థ 457; భావసమాధ్యవస్థలో శ్రీరామకృష్ణుల అలౌకిక సౌందర్యం 458; శ్రీరామకృష్ణులను తిలకించిన సంకీర్తన బృంద ఉత్సుకత, ఆనందం 458; ఎల్లరూ శ్రీరామకృష్ణుల పట్ల ఆకర్షితులవడం 459; పళ్లెంలో ప్రసాదం 459; నవచైతన్యుని అనుగ్రహించడం 460; దక్షిణేశ్వరానికి తిరిగి రావడం 461; మాతృదేవి వివేకం గురించి శ్రీరామకృష్ణులు 462; ఈ అంశం గురించి మాతృదేవి వచనాలు 463; స్నానయాత్ర దినం: శ్రీరామకృష్ణులు విసుగు చెందడం 463.

11. శ్రీరామకృష్ణులు కలకత్తాకు తరలి వెళ్లడం ... 465

పానీహాటీ అనుభవంతో శ్రీరామకృష్ణుల గొంతునొప్పి ప్రకోపించడం 465; వైద్యుల నిషేధాన్ని శ్రీరామకృష్ణులు ఉల్లంఘించడం 466; శ్రీరామకృష్ణుల వ్యాధికి కారణాలు 467; భావసమాధిలో జగజ్జననితో శ్రీరామకృష్ణులు తగవులాడడం 468; దక్షిణేశ్వరంలో భక్త ప్రవాహం 469; తమ మరణ కాలాన్ని శ్రీరామకృష్ణులు ముందుగానే సూచించడం 469; శివజ్ఞానంతో శ్రీరామకృష్ణుల జీవ సేవ 470; లోకుల మనస్సులలో నిహితంగా ఉన్న గత సంస్కారాలను ఆయన కనుగొనడం 471; ఒక ఉదాహరణ 471; వ్యాధి ప్రకోపించి గొంతు నుండి రక్తం స్రవించడం 472; చికిత్స నిమిత్తం బలరాం ఇంట్లో బస చేయడం 473; వ్యాధిని క్యాన్సర్‌గా నిర్ధారణ చేయడం 474; బలరాం ఇంట్లో ఆధ్యాత్మిక సేవనం 474; బలరాం ఇంట్లో జరిగిన ఒక సంఘటన 475.

12. i. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు ... 477

శ్యాంపుకూర్ ఇంటి వర్ణన 477; శ్రీరామకృష్ణుల చికిత్సకై డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ నియుక్తులవడం 478; గురుదేవుల పథ్యం, రాత్రి సేవ 479; మాతృదేవి అమిత సిగ్గుకు ఒక ఉదాహరణ 479; శ్యాంపుకూర్‌కు మాతృదేవిని తోడ్కొని రావాలనే ప్రతిపాదన 480; దేశకాల పాత్రానుగుణంగా సర్దుకుపోయే మాతృదేవి సమర్థత 480; కామార్పుకూర్ నుండి దక్షిణేశ్వరానికి వచ్చే దారిలో 480; మాతృదేవి తారకేశ్వరానికి కాలినడకన వస్తున్నప్పుడు జరిగిన సంఘటన 481; తేలో భేలో మైదానంలో 482; బాగ్దీ దంపతులు 482; మాతృదేవికి వారి ఆదరణ 482; బాగ్దీ దంపతుల నుండి మాతృదేవి సెలవు పుచ్చుకోవడం 483; శ్యాంపుకూర్ ఇంట్లో మాతృదేవి 484; శ్రీరామకృష్ణులను యువభక్తులు సేవించడం 484.

12. ii. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు ... 486

శ్రీరామకృష్ణుల సేవలో గృహస్థ భక్తుల పాత్ర 486; గృహస్థ భక్తుల పరిత్యాగం 487; గురుదేవుల వ్యాధి భక్తులను ఒక సంఘంగా పెనవేయడం 488; శ్రీరామకృష్ణులను గురించి భక్తుల మూడు భావనలు 488; భక్తుల పరస్పర ప్రేమాభిమానాలు 489; శ్రీరామకృష్ణులలో విశేష ఆధ్యాత్మిక అభివ్యక్తతను భక్తులు అనుభూతి చేసుకోవడం 489; శ్రీరామకృష్ణుల పట్ల డా. సర్కార్ ఆకర్షితులు కావడం 490; డాక్టర్ మహేంద్ర లాల్ సర్కార్ సత్యనిష్ఠ 491; పరావిద్య : అపరావిద్య 491; భగవంతుడు అనంతుడు 491; బుద్ధికి అవగతమైనా హృదయం అంగీకరించదు 491; భావసమాధిలోని ఒక బాలభక్తుని నాడి పరీక్షించడం 493; విద్య ఉత్పాదించే ఆవేశం (గర్వం) 493; డాక్టర్ వినమ్రత 494; 'డాక్టర్‌లో సారం ఉంది' 494; ఆధ్యాత్మిక పథంలో డాక్టర్‌ను గురుదేవులు నడిపించడం 494; ఔషధాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో డాక్టర్ ఆందోళన 495; కించిత్తు నియమభంగం ఎంతో హానికరం 496; శ్రీరామకృష్ణుల పట్ల డాక్టర్ గౌరవం ఇనుమడించడం 497; భగవదవతారం గురించి డాక్టర్ అభిప్రాయం 498; వ్యాధి ప్రకోపించడం 499; కాళికోత్సవంలో శ్రీరామకృష్ణుల అద్భుత

భావసమాధి 499; పూజ ఏర్పాట్లు 500; శ్రీరామకృష్ణులు మౌనంగా కూర్చోవడం 500; భావసమాధిమగ్నులైన శ్రీరామకృష్ణులను, గిరీష్‌చంద్ర పూజించడం 501; భక్తులు కూడా శ్రీరామకృష్ణులను అర్చించడం 502; శ్రీరామకృష్ణులను గురించిన భక్తుల ప్రత్యక్ష ఆధ్యాత్మికానుభూతులు 502; శ్రీరామకృష్ణులతో బలరాం సాంగత్యం పట్ల ఆతడి బంధువుల అనిష్టత 503; బలరాంను వారు నిరోధించడం 503; బలరాం తొలిజీవనం 504; శ్రీరామకృష్ణులను బలరాం కలుసుకోవడం 504; బలరాం దాయాది హరివల్లభ్ కలకత్తాకు రావడం 505; హరివల్లభ్‌ను శ్రీరామకృష్ణులు చూడగోరడం 505; శ్రీరామకృష్ణుల వద్దకు హరివల్లభ్‌ను, గిరీష్ తోడ్కొని రావడం 506; శ్రీరామకృష్ణుల స్పర్శ : తత్ప్రభావం 507; భక్తుల సంఖ్య అధికరించడం 508; శ్రీరామకృష్ణుల చేతలలోని మాధుర్యం పట్ల ఎల్లరు ఆకర్షితులవడం 509; ఒక ఉదాహరణ: సబ్ జడ్జి ఉపేంద్ర 509; శ్రీరామకృష్ణులను ఉపేంద్ర దర్శించడం 512; భగవంతుడు సాకారుడు, నిరాకారుడు కూడా 512; రాంచంద్ర మాటలతో అతుల్ చికాకుపడడం 512.

12. iii. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు ... 514

తమ సూక్ష్మదేహంలో శ్రీరామకృష్ణులకు పుళ్లు కానరావడం 514; క్రొత్త దర్శనార్థుల పట్ల నిబంధనలు 515; ఒక నటి శ్రీరామకృష్ణులను దర్శించడం 515; భక్తులలో భావోద్వేగం అధికరించడానికి కారణం 516; ఈ విషయంలో రాంచంద్ర, గిరీష్‌ను మించిపోవడం 519; విజయకృష్ణ గోస్వామి ఆ మంటను ప్రజ్వలింప చేయడం 519; ఈ భావోద్వేగాన్ని అరికట్టే నరేంద్రుని ప్రయత్నాలు 520; భావోద్వేగం జీవితంలో నిరంతర పరిణామాన్ని ఉత్పన్నం చేయదు 520; కన్నీరు స్రవించడంలో, గగుర్పాటులో, శారీరక మార్పులలో కృతిమత్వం హానికరం 521; నరేంద్రుని మాటలపట్ల దృఢ విశ్వాసం ఏర్పడడం 521; భావోద్వేగాన్ని నరేంద్రుడు అపహాస్యం చేయడం 522; భావోద్వేగ స్థానే నిష్కామైన వైరాగ్యం, దైవభక్తి నెలకొల్ప నరేంద్రుని ప్రయత్నాలు 523; శ్రీరామకృష్ణులను ప్రేమించేవారి జీవితాలు అదే మాదిరిగా రూపొందుతాయి 523; నూతన భావాలను విమర్శనాత్మకంగా పరిశీలించాక భక్తులు అంగీకరించేలా చేయడానికి నరేంద్రుడి ప్రయాస 524; పేరుప్రతిష్ఠలకై మహిమాచరణ్ చక్రవర్తి ప్రాకులాట 524; జ్ఞానిగా చలామణి కాగోరిన మహిమాచరణ్ : అతడి పులిచర్మం 525; అతడి గురువు 526; మహిమాచరణ్ ఆధ్యాత్మిక సాధన 526; శ్యాంపుకూర్‌లో మహిమాచరణ్ 526; మహిమాచరణ్ నరేంద్రుల మధ్య వాదోపవాదాలు 527; నిజమైన సాధకులందరికీ సముచిత గౌరవం ఇవ్వాలన్న నరేంద్రుని ఉద్బోధ 527; క్రైస్తవ ప్రచారకుడు ప్రభుదయాళ్ మిశ్ర 528; శ్రీరామకృష్ణుల పరిస్థితి మరింత దిగజారడం 528.

13. i. కాశీపూర్ ఉద్యాన గృహంలో శ్రీరామకృష్ణులు ... 530

కాశీపూర్ 530; కాశీపూర్ ఉద్యాన గృహం 532; శ్రీరామకృష్ణులు కాశీపూర్‌కు వచ్చి తమ యువ శిష్యులకు శిక్షణ గరపడం 535; ఎన్నో పవిత్ర స్మృతులను

సంతరించుకొన్న కాశీపూర్ ఉద్యాన గృహాన్ని రామకృష్ణ మిషన్ ప్రాప్తించుకోవాలి 536.

13. ii. కాశీపూర్ సేవాదీక్ష ... 537

ఉద్యాన గృహంలో బసచేయడంలో గురుదేవుల ఆనందం 537; శ్రీరామకృష్ణుల సేవకు మందీమార్బలం, ధనం అవసరమైనాయి 538; ఉద్యాన గృహంలోనే బసచేసి గురుదేవులను సేవించాలని నరేంద్రుడు సంకల్పించడం 538; జగజ్జనని మీద మాత్రమే శ్రీరామకృష్ణులు ఆధారపడి ఉండడం 539; తమ నేతృత్వంలో ఆయన ఏర్పాట్లు చేయించుకోవడం 540; భావి సన్న్యాసి బృందం రూపుదిద్దుకోవడం 541; శ్రీరామకృష్ణుల ఆరోగ్యం కించిత్తు మెరుగుపడడం 542; వంటలో మాతృదేవికి సోదరి లక్ష్మి సహాయపడడం 543; గృహస్థ భక్తులు - ఆర్థిక విషయాలు 543; భగవత్సాక్షాత్కారం కోసం యువభక్తులను నరేంద్రుడు ప్రేరేపించడం 544; యువభక్తులు ధునిలో కోర్కెలను దగ్ధం చేయడం 545.

13. iii. శ్రీరామకృష్ణుల ఆత్మవ్యక్తీకరణ - అభయ ప్రదానం ... 546

డాక్టర్ రాజేంద్ర చికిత్సలో గురుదేవుల ఆరోగ్యం కించిత్తు మెరుగుపడడం 546; శ్రీరామకృష్ణుల ఆత్మవ్యక్తీకరణ - అభయ ప్రదానం 547; శ్రీరామకృష్ణులు కల్పతరువే అయినారు? 549; ఆత్మవ్యక్తీకరణ సమయంలో అక్కడ హాజరైవున్న వారు 550; ఆధ్యాత్మికానుభూతులు కలిగించమని గురుదేవులను వైకుంఠనాథ్ సతాయించడం 550; శ్రీరామకృష్ణుల స్పర్శతో వైకుంఠ్‌లో జనించిన అనుభూతి 551; యోగ్యత సంతరించుకోకుండా ఉన్నత ఆధ్యాత్మికానుభూతులను నిలిపి ఉంచుకోవడం అసాధ్యం 551.

అనుబంధం ... 553

కాళీమాత ఒడిలో.... ... 555

కొన్ని అంశాలు ... 571

దక్షిణేశ్వర ఆలయాలు ... 580

పూర్వాపరక్రమంలో ముఖ్య సంఘటనలు ... 590

రచన - రచయిత ... 593

ఓమ్

నిరంజనం నిత్యమనంతరూపం
భక్తానుకంపాధృత విగ్రహంవై ।
ఈశావతారం పరమేశమీడ్యం
తం రామకృష్ణం శిరసానమామి ॥

-స్వామి అభేదానంద



ꕥ భక్తులతో భగవాన్ శ్రీరామకృష్ణులు ꕥ

మాతృదేవి శ్రీశారదాదేవి

IV

గురు భావం 2

ప్రస్తావన

'గురుభావం' రెండవ భాగం ప్రచురితమైంది. దీనిలో శ్రీరామకృష్ణుల జీవిత మధ్యకాలం మాత్రమే పొందుపరచబడి ఉండడం చూసి పూర్వాపర్య క్రమం పాటించలేదే? పుట్టినప్పటి నుండి సాధనలు ముగించే వరకూ జరిగిన వారి జీవితాన్ని ముందుగానే తెలుపకుండా, సాధన సిద్ధులైన పిదప జరిగిన సంఘటనల వివరాలతో ఎందుకు ప్రారంభించారు? అని పాఠకులు ప్రశ్నించ వచ్చు![1] అందుకు మా సమాధానం:

లోకోత్తర పురుషులైన శ్రీరామకృష్ణుల జీవిత చరిత్రను రచించాలనే ఎలాటి పథకమూ మునుపు మాకు లేదు. సమగ్రమైన ఆయన జీవిత చరిత్రను యథా తథంగా మాబోటి సామాన్యులకు సాధ్యం అనే అడియాసకు మేం ఏనాడూ మనస్సులో చోటు ఇవ్వలేదుకూడా. కారణాంతరాల ప్రోద్బలం వలన ఆయన జీవితంలోని కొన్ని సంఘటనలను 'ఉద్బోధన్' మాసపత్రిక పాఠకులకు తెలియచేయాలనే ఉద్దేశంతో మాత్రమే మేం ఈ పనికి ఉపక్రమించాం. ఇంతవరకూ పురోగమిస్తామని మేం అప్పుడు అనుకోలేదు. అందువలనే తదనంతరం కాలంలో జరిగిన సంఘటనలు తొలికాలపు సంఘటనల కంటే ముందుగా వివరింపబడినాయి.

శ్రీరామకృష్ణుల జీవితంలోని అద్భుత సంఘటనలను, ఆయన అపూర్వ సాధన వృత్తాంతాన్ని మాకంటే ముందే పలుపురు నమోదు చేయ ప్రయత్నించారు. అక్కడక్కడ వారు నమోదు చేసిన భాగాలలో తప్పులు దొర్లినప్పటికీ, మొత్తంమీద శ్రీరామకృష్ణుల జీవితంలోని సంఘటనలన్నీ దాదాపు ప్రచురింప

---

1. 'శ్రీరామకృష్ణ ప్రసంగం' పేరిట శ్రీరామకృష్ణుల జీవిత చరిత్రను రచించిన స్వామి శారదానంద 'గురుభావం' మొదటి భాగం (ఇది రెండవ భాగం) తోనే ప్రారంభించారు కనుక.

బడ్డాయి. ఆ అంశాలనే మళ్ళీ నమోదుచేసి మా శక్తిని వృధాచేసుకోవడం కంటే, మునుపు ఎన్నడూ వివరింపబడని శ్రీరామకృష్ణుల అసాధారణ దివ్యభావాల, ఆశయాలను వివరించడం సముచితమని మేం భావిస్తున్నాం. 'భావ ముఖం'లో ఆయన సుస్థిరులైనారంటే ఏమిటో, 'గురుభావం' ఆయనలో సహజంగానే అభివ్యక్తమైందంటే ఏమిటో అవగతం చేసుకోలేకపోతే శ్రీరామ కృష్ణుల అద్భుత వ్యక్తిత్వాన్ని, అసామాన్య చర్యలను, అనుపమాన భావాల ఆశ యాలను ఎవరూ అర్థంచేసుకోలేరు. కనుకనే ప్రారంభంలోనే పాఠకులకు వీటిని విశదపరచడానికి ప్రయత్నించాం.

బహుశా కొందరు ఇలా ఆక్షేపణ లేవదీయవచ్చు: ''మీ పుస్తకంలో విభిన్న చోట్ల శ్రీరామకృష్ణుల ప్రత్యేక మనోభావాలను, చర్యలనూ విశదీకరిస్తు న్నప్పుడు, వాటిని ఏ రీతిలో మీరు అర్థం చేసుకొన్నారో ఆ రీతిలోనే వివరింప ప్రయత్నించారు. పర్యవసానంగా మీ తెలివీ, వివేచనాశక్తే దురవగాహమైన ఆయన శీలం, భావాలకు గీటురాయిగా మారింది. మీ తెలివీ, వివేచనాశక్తీ దురవగాహమైన శ్రీరామకృష్ణులను గ్రాహ్యం చేసుకోగలవని పరోక్షంగా చెప్పక చెబుతూ జనుల దృష్టిలో ఆయనను తక్కువ చేయడం లేదా? అలా చేయ కుండా ఆయన జీవితంలోని సంఘటనలను యథాతథంగా అభివర్ణించి ఊర కుంటే ఎంతో బాగుండేదేమో? అలా చేసి ఉంటే శ్రీరామకృష్ణులను తక్కువ చేసినట్లు ఉండేదికాదు; ఆయన భావాల, చర్యల అర్థాన్ని జనులు తమ ధోర ణిలో తాము అవగతం చేసుకొని ఉండేవారేమో!''

ఈ ఆక్షేపణ పైకి యుక్తంగా కనిపిస్తున్నా, నిజానికి అది సారరహిత మైంది. కారణం ఏమిటంటే, ఏ విషయాన్ని అర్థం చేసుకోవాలన్నా తన ఇంద్రి యాలు, మనస్సు, బుద్ధి సహాయాన్నే మనిషి తీసుకోక తప్పదు, మరోమార్గం లేదు. అయినా ఏ విషయాన్ని తాను అర్థం చేసుకోగోరుతున్నాడో దానికంటే తన మనస్సు, బుద్ధి ఉన్నతమైనవని దీని ద్వారా ఋజువు కావడం లేదు. కాలం, దేశం, విశ్వం, ఆత్మ ఈశ్వరుడు మొదలైన అనంత పదార్థాలన్నీ తన మనోబుద్ధులకు అతీతమైనవని తెలిసికూడా వాటిని తన మనోబుద్ధుల ద్వారా అవగాహన చేసుకోవడానికి సర్వదా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని వాటిని తెలుసుకోవడానికి చేస్తున్న ప్రయత్నం తప్పు అని గాని లేదా ఆ ప్రయత్నం పరిమితమైనదని గాని మనం భావించము. ఈ ప్రయత్నం ఆతడి మనో బుద్ధులను విస్తృతపరుస్తుంది, ఎంతో మేలు ఒనగూరుస్తుంది.

అదేవిధంగా లోకోత్తరులైన మహాపురుషుల అసాధారణ భావాలనూ, చర్యలనూ మనం అధ్యయనం చేస్తే, అది మనకెంతో మేలు ఒనగూరుస్తుంది;

తద్ద్వారా అవి పరిమితం చేయబడవు లేక కుదింపబడవు. సాధన చేయడం మూలంగా ఎవరి మనస్సు ఎంత పవిత్రమౌతుందో, ఎవరి గ్రహణశక్తి ఎంత అధికతరమౌతుందో తదనుగుణంగానే ప్రతి ఒక్కరూ ఎక్కువగానో తక్కువగానో ఆ మహాపురుషుల దివ్యభావాలనూ, చర్యలనూ అవగతం చేసుకోవడంలోను, ఇతరులకు వివరించడంలోను సమర్థులౌతారు. ఆధ్యాత్మిక సాధనలను తీవ్రంగా అనుష్ఠించిన వ్యక్తి శ్రీరామకృష్ణులను మాకంటే సమగ్రంగా అర్థం చేసుకోగలుగుతాడు. కనుక ఆ దివ్యపురుషుణ్ణి అర్థం చేసుకోవడం కోసం మన మనస్సును, వివేకాన్ని వినియోగించడంలో తప్పేమీ లేదు.

కేవలం ఒక్క విషయంలో మాత్రం అప్రమత్తంగా ఉండాలి; శ్రీరామకృష్ణులను ఆమూలాగ్రం అర్థం చేసుకోగలిగామనే భ్రమలో పడరాదు. ఈ అంశాన్ని మనం సదా మనస్సులో నిలుపుకొని ఉంటే మరే సంశయాలు తలెత్తే అవకాశం ఉండదు.

— **రచయిత**

1. వైష్ణవచరణ్ - గౌరీపండితుడు

యే మే మతమిదం నిత్యమనుతిష్ఠన్తి మానవాః ।
శ్రద్ధావన్తోఽనసూయన్తో ముచ్యన్తే తేఽపి కర్మభిః ॥

- గీత, 3-31

ఈ నా మతాన్ని (బోధన) దురాక్షేపా లొనర్చక శ్రద్ధాపూరితులై, సర్వదా అనుష్ఠించేవారుకూడా కర్మాచరణ నుండి విముక్తు లవుతారు.

1. తొలి జీవిత కాలంలో శ్రీరామ కృష్ణుల 'గురుభావం' గురించిన అజ్ఞత

ఆంగ్ల విద్యాభ్యాసం చేసి, పాశ్చాత్య భావాలను, ఆశయాలను సంతరించు కొన్న కేశవచంద్రసేన్ మొదలైన కొద్దిమంది ఆధునిక హైందవులలో మాత్రమే శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మికతను ప్రసారం చేశారనీ లేదా ప్రగాఢతరం చేశారనీ కలకత్తా జన సామాన్యం అభిప్రాయం. ఈ అభిప్రాయం సరికాదు.

శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో వసిస్తూన్నారనే విషయం వారికి తెలియ డానికి చాలాకాలం క్రితమే ఎందరో ప్రసిద్ధ సాధువులు, సాధకులు, గొప్ప శాస్త్రపండితులు వంగదేశంలోని వివిధ ప్రాంతాల నుండి, ఉత్తర భారతదేశం నుండి ఆయన వద్దకు వచ్చారు. అలా వచ్చి దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆయన ఆధ్యాత్మిక ఆదర్శాన్ని చూసి, ఆయన గురుభావ సహాయంతో నిర్జీవ మైన తమ ఆధ్యాత్మిక జీవనానికి తిరిగి ప్రాణం పోసుకొన్నారు; దాంతో నూత్న భావాలను, శక్తిని సంతరించుకొని వాటిని ఇతర ప్రాంతాలలో అనేకులకు అందించడానికి వెళ్ళిపోయారు. కాని ఈ విషయం అత్యధికులైన కలకత్తావాసు లకు అసలు తెలియదు.

శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''పువ్వులు వికసించగానే తుమ్మెదలు వాటంతట అవే వచ్చి చేరుకుంటాయి. వాటిని ఎవరూ ఆహ్వానించ నవసరం

2. 'పుష్పాలు వికసించగానే తుమ్మెదలు వాటంతట అవే వచ్చి చేరతాయి'

లేదు. భగవద్భక్తి ప్రేమలు నిజంగా నీలో జనించగానే, భగవద్దర్శనంకోసం అంటే సత్యసాక్షాత్కారార్థం తమ జీవితాన్ని ఎవరు పరిత్యజించారో లేదా పరిత్యజింప నిశ్చయించుకొన్నారో అటువంటి వారు వివరణకు అందని ఒక ఆధ్యాత్మిక నియతి ప్రభావంలో నీ వద్దకు వస్తారు.'' మొట్టమొదట భగవత్సాక్షాత్కారం, ఆయన దర్శనం, కృపను పొందాలన్నదే శ్రీరామకృష్ణుల అభిప్రాయం. మానవాళికి శ్రేయస్సును ఒనగూర్చే శక్తిని సంతరించుకొనే ముందుగా భగవదాదేశం పొంది ఉండాలి; తదనంతరమే ధర్మప్రచారానికీ, లోక శ్రేయస్సుకూ ఉపక్రమించాలి. అలా భగవదాదేశం పొందని పక్షంలో, ''నీ మాటలు ఎవరు లక్షిస్తారు? ఆచరించమని నువ్వు వారికి చెప్పిన దాన్ని వారెందుకు పాటిస్తారు, అసలు ఎందుకు వింటారు?'' అని ఆయన చెప్పేవారు.

3. ఆధ్యాత్మిక విషయాలలో సర్వులూ సరిసమానంగా గ్రుడ్డివారే

భగవదనుభూతి పొందనంతవరకూ నిజానికి మనం అందరమూ ఒకే స్థితిలో ఉన్నవారమే. జన్మ జరా మృత్యువులతో కూడిన ఈ నిరర్థక సంసారంలో సర్వదా వసిస్తూనే, పాండిత్య గర్వాలతో ఇతరులకంటే అధికులమని మనం విర్రవీగుతూ ఉంటాం. భౌతిక విజ్ఞానంలో మనం ఎంతగా పురోగమించినప్పటికీ, అతిగూఢమైన జగజ్జనని మాయారాజ్యంలో ఉంటూనే ఉంటాము. ఇంద్రియాలకు, లోభం పేరాసలకు, మృత్యుభయానికి లొంగిపోయినందున పరిణమించే దుస్థితి మనలను వెన్నంటుతూనే ఉంటుంది. ''నే నెవరిని? ఎందుకు ఇక్కడకు వచ్చాను? ఎక్కడికి పోవాలి? పంచేంద్రియాలు, మనస్సు బుద్ధి తోడ్పాటుతో సత్యాన్ని తెలుసుకోవడానికి ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ, అడుగడుగునా వాటి చేతనే వంచింపబడుతూ, భ్రష్టుపట్టే మనం ఆడుతూవున్న ఈ ఆట లక్ష్యం ఏమిటి? వాటి పట్టునుండి ఎన్నటికైనా విడివడడం సాధ్యమేనా? ముక్తులం కాగలమా?'' మొదలైన శాశ్వత సమస్యల విషయంలో ఎడతెగని అజ్ఞానాంధకారంలోనే మనం జీవిస్తున్నాం. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ యథార్థజ్ఞానశూన్యులే; దానిని పొంద సంసిద్ధులే. కాని ఈ జ్ఞానాన్ని వారికి అందించే వారెవరు? ఒకవేళ నిజానికి ఆ జ్ఞానాన్ని ఇవ్వగలిగేవారు ఎవరైనా ఉంటే వారు దానిని ఎంతైనా ఇవ్వవచ్చుగాక! కాని భ్రాంతిలో పూర్తిగా మునిగిపోయివున్న మనిషి తాను బోధింప తలచినది తనకు అవగతమై ఉండాలన్న విషయం అర్థం చేసుకోడు. పైగా పేరుప్రతిష్ఠల కోసమో, మరేదో స్వార్థం కోసమో తాను పొందని దానిని ఇతరులకు ఇవ్వడానికి లేదా ఇస్తూవున్నట్లు నటించడానికి పరుగులు పెడతారు; ఫలితంగా అంధుడు

అంధుడికి దారి చూపే రీతిలో, బోధకుడూ బోధితుడూ ఇద్దరూ ఇక్కట్లలో పడతారు.

కనుక శ్రీరామకృష్ణులు లోకం నడిచే మార్గానికి పూర్తిగా విరుద్ధమైన మార్గంలోనే నడిచారు. పరిపూర్ణ త్యాగ వైరాగ్య సంయమాలను ఒకే చోట నిశ్చింతులై ప్రశాంతంగా ధీరసుస్థిరులై వసిస్తూ అభ్యసించి జగజ్జనని చేతిలో అనువైన పరికరంగా తమను తీర్చి దిద్దుకొన్నారు. సమగ్ర సత్యాన్ని అనుభూతం చేసుకొని, యథార్థమైన లోకశ్రేయస్సుకై కార్యాదర్శాన్ని ప్రజ్వలించారు. భగవల్లబ్ధి పొంది, తదనంతరం ఇతరులకు పంపిణీ చేయడంకోసం తాము సముపార్జించిన జ్ఞాన భాండారాన్ని తెరిచారు. వెంటనే ఆహ్వానం లేకపోయినా జ్ఞానపిపాసువులు పరిగెత్తుకొంటూ ఆయన వద్దకు రాసాగారు. ఆయన దృక్కులచే, స్పర్శచే పునీతులైన వారు తాము తరించినట్లు భావించుకొన్నారు; ఆయన వినూత్న భావాలను తాము పోయిన ప్రతి చోటా ప్రచారం చేస్తూ అనేకులను తరింప చేయసాగారు. ఎందుకంటే, మనం ఎక్కడున్నా మనలోని భావాలనే వ్యక్తం చేస్తూ ఉంటాము కనుక. ఈ విషయాన్నే శ్రీరామకృష్ణులు సరళ గ్రామీణ శైలిలో ఇలా చెప్పేవారు: ''ఎవరు ఏం తిన్నారో ఆ వాసనే త్రేన్చినప్పుడు బయటకు వస్తుంది. దోసకాయ తింటే దోసకాయ త్రేనుపే వస్తుంది; ముల్లంగి తింటే ముల్లంగి త్రేనుపే వస్తుంది.''

4. శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక ప్రచారవైనం

భైరవీ బ్రాహ్మణిని కలుసుకోవడం శ్రీరామకృష్ణుల జీవితంలో ఒక ముఖ్య సంఘటన. ఆ సమయం నుండే ఆయన ఒక వంక ఆధ్యాత్మిక సాధనలలో సత్వర పురోగతిని పొందుతూవచ్చారు; మరో వంక ఆయన వ్యక్తిత్వంలో 'గురుభావం' విస్పష్టంగా అభివ్యక్తం కాసాగింది. అలాగని 'గురుభావం' తొలినాళ్లలో ఆయనలో అభివ్యక్తం కాలేదని అనుకోరాదు. దాదాపు ఆయన జీవితంలో అన్ని కాలాలలోను, చిన్నతనంలో సహా, 'గురుభావం' ఆయనలో అభివ్యక్తం అయిందని గత అధ్యాయాలలో స్పష్టీకరించాం. శ్రీరామకృష్ణుల దీక్షాగురువులు సైతం తమ ఆధ్యాత్మిక జీవితంలోని లోటుపాట్లను ఈ 'గురుభావ' తోడ్పాటుతో సరిదిద్దు కొన్నారనే సంగతినీ ఇదివరలోనే తెల్పాం.

5. భైరవీ బ్రాహ్మణిని కలుసుకొన్నప్పటి శ్రీరామకృష్ణుల స్థితి

భైరవీ బ్రాహ్మణి రాకకు మునుపు శ్రీరామకృష్ణుల అసాధారణ భగవదనురాగం, వ్యాకులత అనేకుల దృష్టిలో ఉన్మాదంగా, శారీరక రుగ్మతగా కానవచ్చేవి; ప్రఖ్యాత వైద్యులు ఆయనకు చికిత్సకూడా చేశారు. ఆ సమయంలో స్వయంగా సాధకుడైన తూర్పు వంగదేశ వైద్యుడొకరు, ఆయనను గంగాప్రసాద్ సేన్ అనే

6. శ్రీరామకృష్ణుల అత్యున్నత అవస్థను ఇతరులు అవగతం చేసుకొన్న తీరు

వైద్యుని ఇంట్లో చికిత్స నిమిత్తం వచ్చినప్పుడు చూడడం తటస్థిం చింది. శ్రీరామకృష్ణుల శరీరంలో కానవస్తున్న లక్షణాలన్నీ నిజానికి యోగాభ్యాస ఫలితంగా జనించిన అసాధారణ మార్పులని ఈ వైద్యుడు తన అభిప్రాయం వెలి బుచ్చినా, అప్పుడు ఎవరూ ఆయన అభిప్రాయాన్ని లక్షించలేదు. భగవత్ప్రేమతో కలిసి ఉన్నప్పటికీ అవి ఉన్మాద లక్షణాలనే అందరూ, మథుర్‌బాబుతో సహా నిశ్చయించుకొన్నారు.

కాని భక్తిశాస్త్రాలలో నిష్ణాతురాలైన బ్రాహ్మణి మాత్రం శ్రీరామకృష్ణుల శరీరంలో కానవచ్చే లక్షణాలు, దేవతలకు సైతం దుర్లభమైన అనన్య భాగవద్భక్తికి ఫలితంగా మనస్సులో జనించే మార్పులకు అనుగుణంగా బాహ్యంగా వ్యక్తమౌ తూన్న మార్పులేనని ప్రప్రథమంగా గుర్తించి, వెల్లడించింది. అలా ఆమె తన అభిప్రాయాన్ని వెలిబుచ్చడంతోనే ఆగిపోలేదు. అతీంద్రియ మానసిక పరివర్తన లకు అనుగుణంగా అప్పుడప్పుడు శరీరాలలోకూడా కచ్చితంగా ఇటువంటి (అంటే శ్రీరామకృష్ణులలో కానవస్తూన్నటువంటి) లక్షణాలే వ్యక్తం అవుతాయని బ్రాహ్మణి భక్తిశాస్త్రాలను సోదాహరణపూర్వకంగా చూపింది; మూర్తీభవించిన దివ్యప్రేమ రూపిణియైన రాధాదేవిలో, శ్రీకృష్ణ చైతన్యులలో, ప్రాచీన ఆచార్య, యోగులలో ఇటువంటి శారీరక లక్షణాలు కానవచ్చాయనికూడా తెలియ చేసింది. ఆ తరువాత భక్తిశాస్త్రాలలో నమోదైన లక్షణాలను శ్రీరామకృష్ణుల శరీరంలో అభివ్యక్తమయ్యే లక్షణాలతో ఆమె పోల్చి, తన వాదనను బుజువు చేసింది. బ్రాహ్మణి అలా చేయడం చూసి, శ్రీరామకృష్ణులు తల్లి భరోసాతో రెట్టించిన బలం పుంజుకొన్న పిల్లవాడిలా ఆనందించారు; కాళికాలయంలోని జనం, మథుర్‌బాబుతో సహా బ్రాహ్మణి చెప్పింది విని తక్కువ ఆశ్చర్యపోలేదు. 'శాస్త్రాలలో నిష్ణాతులైన పండితులను రావించు; నా మాటలలోని సత్యాన్ని వారు విశ్వసించేటట్లు బుజువు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను'' అని బ్రాహ్మణి, మథుర్‌తో చెప్పినప్పుడు వారు పొందిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు.

7. బ్రాహ్మణి విన్నపం మేరకు పండిత సదస్సు

ఆశ్చర్యపోవడం విశ్వసించడం కాదు కదా! ఊరూపేరూ లేని భిక్షాటనలో జీవించే ఒక స్త్రీ మాటల, పాండిత్యంపై ఎవరు మాత్రం విశ్వసించడానికి సంసిద్ధంగా ఉంటారు? అందుచేతనే ఆమె పలుకులు కూడా పైన చెప్పిన తూర్పు వంగదేశ వైద్యుని పలుకుల్లా మథుర్ తదితరులపై ఎలాటి ప్రభావమూ చూపలేక పోయేవే! కాని శ్రీరామకృష్ణుల ప్రమేయంతో కథ అడ్డం తిరిగింది. చిన్నపిల్ల వాడిలా హఠంపట్టి ఆయన, మథుర్‌ను, ''మంచి పండితులను రావించి,

బ్రాహ్మణి చెబుతూన్న విషయం పరీక్షించి చూడాలి'' అని అడిగారు. సంపన్ను డైన మథుర్ ఇలా ఆలోచనలో పడ్డాడు: ''అలా చేయడంలో నష్టమేమిటి? చిన్న భట్టాచార్యుల చికిత్స నిమిత్తం వైద్యులకు, ఔషధాలకు ఎంతో డబ్బు ఖర్చవు తున్నది. పండితులు వచ్చి శాస్త్రప్రమాణంతో బ్రాహ్మణి వాదనను వమ్ము చేసి నప్పుడు - అలా జరగడం తథ్యం - కనీసం ఒక్క సత్ఫలితమైనా ఒనగూరు తుంది. నిష్కపటియైన భట్టాచార్య, పండితుల పలుకులు విశ్వసించినప్పుడు తాను ఏదో ఒక రుగ్మతతో బాధపడుతున్నట్లు తప్పక గ్రహిస్తాడు. పర్యవసానంగా తన మనస్సును అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. నలుగురూ నడిచే త్రోవ పట్టక, 'నేను చేస్తున్నది, అవగతం చేసుకొన్నదే సముచితం; ఇతరులు అవ గతం చేసుకొని నన్ను చేయమన్నది తప్పు' అని భావిస్తూ, తన మనస్సును పట్ట పగ్గాలు లేకుండా వదలివేసే వ్యక్తి పిచ్చివాడు కాక మరేమౌతాడు? లోకులు వెర్రి వారు అయ్యే తీరు ఇదే. పండిత సదస్సును సమావేశపరచకుండా, బ్రాహ్మణి పలుకులనే భట్టాచార్య గుడ్డిగా నమ్ముతూవుంటే ఆయన మానసిక అస్తవ్యస్తత, శారీరక రుగ్మత ప్రకోపం చెందడం తథ్యం.'' ఇలా తర్జనభర్జన పడి చివరికి కొంత ఉత్సుకత కారణంగా, కొంత శ్రీరామకృష్ణులపట్ల ఉన్న ప్రేమాభిమానాల చేత మథుర్ పండిత సదస్సును సమావేశపరచడానికి అంగీకరించాడు.

8. వైష్ణవచరణ్, గౌరీ పండితులను ఆహ్వానించడం

ఆనాటి కలకత్తా పండితగోష్ఠిలో వైష్ణవచరణ్‌కు ఎనలేని గౌరవమర్యాద లుండేవి. దేశంలో పలుచోట్ల ఆయన భాగవతం చదివి వినిపిస్తూ చక్కగా వ్యాఖ్యానించేవారు; అందువలన జనసామాన్యంలో కూడా ఆయన ఎంతో ఖ్యాతి గాంచారు. అందుచేతనే శ్రీరామ కృష్ణులు, మథుర్‌బాబు, బ్రాహ్మణి ఆయనను గురించి వినివున్నారు. కాబట్టి వైష్ణవచరణ్‌ను పండిత సదస్సుకు ఆహ్వానించాలని మథుర్ నిశ్చయించుకొన్నాడు. అదేవిధంగా బాంకూరా జిల్లాలోని 'ఇందేష్'కు చెందిన గౌరీపండితుడు కూడా తన అసాధారణ శక్తి, అరుదైన పాండిత్యానికి ఖ్యాతి పొందాడు. ఈయనను కూడా మథుర్ పండిత సదస్సుకు ఆహ్వానింప నిర్ణయించుకొన్నాడు. ఈ విధంగా వైష్ణవచరణ్, గౌరీపండితుడు దక్షిణేశ్వరానికి రావడం తటస్థించింది. వారిద్దరి గురించి అప్పుడప్పుడు శ్రీరామకృష్ణుల నుండి మేం ఎన్నో విషయాలు విన్నాం. ఆ విధంగా వారి గురించి మాకు తెలిసినదంతా పాఠకులకు ఇప్పుడు తెలుపడానికి ప్రయత్నిస్తాం.

వైష్ణవచరణ్ గొప్ప పండితుడే కాదు, శ్రద్ధాళువైన మహా సాధకుడుగా కూడా ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న వ్యక్తి. ఆయన భగవద్భక్తి, శాస్త్ర, వేదాంత - విశేషంగా భక్తిశాస్త్రాల గురించిన - ప్రగాఢ పరిజ్ఞానం ఆనాటి వైష్ణవ సమాజం

అంతటిలో ఆయనను అగ్రగణ్యునిగా చేశాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

9. వైష్ణవచరణ్ ఖ్యాతి

ధార్మిక ప్రాధాన్యమైన ప్రతి బహిరంగ ఉత్సవంలోనూ ఆయనదే అగ్రతాంబూలం. ధార్మిక పరమైన తుది నిర్ణయాలలో వారు ఆయనను సంప్రదించి, ఆయన వెలిబుచ్చిన నిర్ణయాలను శిరసావహించేవారు. అంతేకాక శ్రద్ధాళువులైన పలువురు సాధకులు సముచిత మార్గాదేశాలకై ఆయనను ఆశ్రయించి, ఆయన సలహాలను తు.చ. తప్పక పాటించేవారు. అందువలన శ్రీరామకృష్ణుల భావావస్థ ప్రగాఢ భగవద్భక్తి ఫలితంగా జనించిందో లేక అదొక శారీరక రుగ్మతో నిర్ణయించడంకోసం వైష్ణవచరణ్‌ను తోడ్కొని రావాలని మథుర్‌బాబు సంకల్పించడంలో ఆశ్చర్యంలేదు.

ఈ లోపు శ్రీరామకృష్ణుల అవస్థ గురించిన తన అభిప్రాయాన్ని ఋజువు పరచే ఒక ముఖ్య నిదర్శనాన్ని బ్రాహ్మణి చూపించింది; ఇది ఆమెకు ఎంతో

10. శ్రీరామకృష్ణుల శారీరక మంటను బ్రాహ్మణి ఉపశమింప చేయడం

సంతోషాన్ని, ఇతరులకు విస్మయాన్ని కలిగించింది. బ్రాహ్మణి దక్షిణేశ్వరానికి రావడానికి కొంతకాలం మునుపు నుండి తీవ్రమైన శారీరక మంటతో శ్రీరామకృష్ణులు బాధపడేవారు. రకరకాల చికిత్సలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సూర్యోదయంతో ప్రారంభమయ్యే ఆ మంట రోజు గడిచేకొద్దీ తీవ్రతరమై మిట్టమధ్యాహ్నానికి భరింపరాని తారాస్థాయికి చేరుకొనేది; అప్పుడు ఆయన గంగానదిలో రెండు మూడు గంటలసేపు మునిగి, తడిగుడ్డను తలమీద పెట్టుకొని ఉండవలసి వచ్చేది. ఈ సంగతి స్వయంగా ఆయనే మాతో చెప్పారు. ఎక్కువసేపు నీళ్లలో మునిగివుంటే జలుబు లేదా మరేదో రుగ్మత వాతపడవలసి వస్తుందేమో అన్న భయంతో ఇష్టంలేకపోయినా నీళ్లలోనుండి వెలుపలకు వచ్చేసే వారు. అందుచేత యజమానుల భవంతిలోని ఒక గదిలో తలుపులు, కిటికీలు అన్నీ మూసి తడిగుడ్డతో తడిసిన చలువరాతి నేలమీద ఆయన దొర్లే వారు.

బ్రాహ్మణికి ఈ విషయం తెలిసీ తెలియగానే, ఆయన రుగ్మతకు ఒక క్రొత్త వివరణను ఆమె కనుగొన్నది. అది ఎలాటి రుగ్మతా కాదనీ, తీవ్ర భగవత్ వ్యాకులత కారణంగా జనించిన అసాధారణ ఆధ్యాత్మిక ఘటన అనీ ఆమె చెప్పింది. భగవత్సాక్షాత్కార నిమిత్తం జనించే తీవ్ర వ్యాకులత వలన కలిగే భౌతిక మార్పులు శ్రీరాధారాణి, చైతన్య మహాప్రభువుల వంటి వారి జీవితాలలో తరచూ కానవచ్చేవని బ్రాహ్మణి తెలిపింది. ఈ ఆధ్యాత్మిక 'రుగ్మత'ను నయం చేసే ఔషధం కూడా అసాధారణమైనదే! అది: సువాసనలు వెదజల్లే పూమాలలతో రోగిని అలంకరించడం, చందనాది సుగంధాలను దేహానికి అలదడం.

బ్రాహ్మణి నిర్దేశించిన చికిత్సా విధానానికే కాక, ఆమె చేసిన రోగ నిర్ధారణకు కూడా మథుర్‌బాబుతో సహా అందరూ నవ్వుకున్నారు. వాళ్లు ఇలా అనుకొన్నారు: 'ఎన్ని ఔషధాలు వాడినా, మధ్యమ నారాయణ, విష్ణువంటి ఎన్ని తైలాలు మర్దన చేసినా కించిత్తుకూడా తగ్గుముఖం పట్టని రోగాన్ని, అసలు అది రోగమే కాదని ఆమె నిర్ణయించడం ఎంత అర్థరహితం!' కాని బ్రాహ్మణి నిర్దేశించిన సులువైన, ప్రమాదరహితమైన చికిత్సకు అభ్యంతరం చెప్పడానికి ఎవరికి మాత్రం ఏం ఆస్కారం ఉంది! ఒకటి రెండు రోజులు ఆ చికిత్స చేయించుకొని అది నిష్ప్రయోజనమని తెలుసుకొని శ్రీరామకృష్ణులే మానివేస్తారని ప్రతి ఒక్కరూ భావించారు. బ్రాహ్మణి సూచించిన మేరకు శ్రీరామకృష్ణులను పువ్వుల మాలలతో, సుగంధ లేపనంతో అలంకరించారు. కాని అందరినీ విస్మయం కలిగించే రీతిలో శ్రీరామకృష్ణుల శారీరక మంట మూడు రోజుల్లోనే పూర్తిగా తగ్గిపోయింది. కాని సందేహ ప్రాణులు నిజాన్ని అంత తేలికగా అంగీకరిస్తారా? అటువంటి మనస్తత్వం ఉన్న వ్యక్తులు రోగ నిదానానికి తమ సొంత వివరణలు ఇవ్వకుండా ఉండలేరు. కాకతాళీయంగా రోగ నిదానం జరిగిందన్నారు. ఇంతకు క్రితం భట్టాచార్యుల శరీరానికి మర్దించిన విష్ణుతైలమే అసలుసిసలైన ఔషధం. వైద్యుడు చెప్పిన దానిని బట్టి ఆ విషయం స్పష్టమౌతున్నది. ఆ తైలం ఇప్పటి వరకూ సత్ఫలితాలను ఇస్తూ వచ్చింది; బ్రాహ్మణి చెప్పిన చికిత్స జరిపించకపోయినా ఒకటి రెండు రోజుల్లో ఆ తైల వాడకమే, శారీరక మంటను పూర్తిగా ఉపశమింపచేసేది. కనుక రోగం నయంకావడం కేవలం కాకతాళీయమే! బ్రాహ్మణి మాటను పట్టించుకోకుండా ఆ తైల వాడకాన్ని కొనసాగించాలి. ఇదీ వారి అభిప్రాయం.

11. మితిమించిన శ్రీరామకృష్ణుల ఆకలి బాధను బ్రాహ్మణి నివారించడం

ఇది జరిగిన కొద్ది కాలంలోనే, జనం 'రోగం'గా పరిగణించిన మరో ఉపద్రవం పాల్పడ్డారు శ్రీరామకృష్ణులు. బ్రాహ్మణి సూచించిన సులువైన చికిత్సా విధానంతో ఇదికూడా నయమైందని శ్రీరామకృష్ణుల ముఖతా మేం విన్నాం. ఆ విషయంగా ఆయన ఇలా చెప్పారు: ''ఆ సమయంలో మితిమించిన ఆకలితో బాధపడేవాణ్ణి. ఎంత తిన్నా తృప్తి కలిగేది కాదు. కడుపునిండా తిన్న వెంటనే మళ్లీ ఆకలి దహించేది. తిన్నా తినకపోయినా సదా ఆకలి దహించివేసేది. రేయింబవళ్లు ఆ ఆకలి ఎడతెగకుండా కొనసాగేది. 'ఇదొక క్రొత్త రోగమా?' అనే ఆలోచన మదిలో మెదలింది. బ్రాహ్మణికి ఈ విషయం చెప్పాను. అందుకు ఆమె ఇలా చెప్పింది: 'నాయనా, భయపడకు. భగవత్సాక్షాత్కార మార్గంలో పయనించే వ్యక్తులకు అటువంటి అవస్థలు అప్పుడప్పుడు

కలుగుతాయని శాస్త్రాలు వచిస్తున్నాయి. ఈ నీ ఆకలి రోగాన్ని నేను నయం చేస్తాను.' తరువాత మథుర్ బాబుకు చెప్పి ఒక గదిలో అటుకులు, మరమరాల నుండి సందేశ్ రసగుల్లా లూచీ వంటి మధుర భక్ష్యాల వరకు రాశులుగా అమర్చ చేసింది. అలా మధుర భక్ష్యాలు వగైరా గదిలో పెట్టించాక, 'నాయనా! రాత్రింబగళ్లు ఈ గదిలోనే ఉండిపో; ఎప్పుడు ఏది తినాలనిపించినా నిశ్చింతగా తిను' అని నాతో చెప్పింది. ఆ గదిలో అటూ ఇటూ నడుస్తూ, ఆ భక్ష్యాలను తేరిపార చూస్తూ, అప్పుడొక కుప్ప నుండి, ఇప్పుడొక కుప్పనుండి భక్ష్యాలను తీసుకొంటూ నేను తినసాగాను. ఈ విధంగా మూడు రోజులు గడిచిపోయాయి; ఆ మితిమించిన ఆకలి పూర్తిగా తగ్గిపోయింది. హమ్మయ్య అనుకొన్నాను.''

12. యౌగిక క్షుత్తు: శ్రీరామకృష్ణులలో దానిని మేం చూసిన వైనం

యోగావస్థ, అంటే మనస్సు భగవంతుడిలో లీనమై ఉండే అవస్థ; ఈ అవస్థ సాధకులలో సహజం, స్వాభావికం కావడానికి మునుపు, కొన్ని సందర్భాలలో ఆ తరువాత కూడా పైన పేర్కొన్నట్లు కొందరిలో మితిమించిన ఆకలి జనించడం గురించి మేం వినివున్నాం. అంతేకాక తదనంతర కాలంలో శ్రీరామకృష్ణుల జీవితంలోనూ కాస్త తేడాతో అటువంటి అవస్థలు కలగడం మేం కళ్లారా చూసి ఆశ్చర్య చకితులమైనాం. తొలుత అనుభవించినట్టి ఎడతెగని ఆకలి బాధను తదనంతర కాలంలో ఆయన పొందలేదు. అప్పుడు ఆయన భావావస్థలో సాధారణంగా తినగలిగే ఆహారానికి నాలుగైదు రెట్లు అధికంగా తిని, సునాయాసంగా జీర్ణం చేసుకోవడం మేం చూశాం. అటువంటి కొన్ని సంఘటనలను ఇక్కడ వివరిస్తే పాఠకులు ఈ విషయాన్ని సులభంగా అర్థంచేసుకోగలుగుతారు.

13. మొదటి ఉదాహరణ: పెద్ద మిఠాయి ముక్కను తినడం

పాఠకులకు ఇంతకు మునుపే ఒక ఉదంతం[1] గురించి చెప్పివున్నాం. శ్రీరామకృష్ణులు భక్తురాండ్ర పట్ల ఎలా అవ్యాజ కరుణతో మెలగేవారో ప్రస్తావించిన సందర్భంలో ఈ ఉదంతం తెలిపాం. బాగ్‌బజార్ వాస్తవ్యులైన కొందరు స్త్రీలు 'భోలా' మిఠాయి దుకాణం నుండి మీగడతో తయారుచేసే 'సర్' అనే పెద్ద మిఠాయి ముక్కను కొని, ఆయన కోసం దక్షిణేశ్వరానికి వచ్చారు. శ్రీరామకృష్ణులు అక్కడ లేకపోవడంతో ఆ మిఠాయిని ఆయన గదిలో ఉంచి, ఎంతో ప్రయాసతో మహేంద్రనాథ్ గుప్త అనే పంతులుగారి ఇంటికి వెళ్లి, అక్కడ శ్రీరామకృష్ణులను కలుసుకొన్నారు. ఆయనతో మాట్లాడుతూన్నప్పుడు, శ్రీరామకృష్ణులు 'లావు బ్రాహ్మణుడు' అని పేర్కొనే ప్రాణకృష్ణ ముఖోపాధ్యాయ్ హఠాత్తుగా అక్కడకు

---

1. III.1.32

రావడం, ఆ స్త్రీలు ఎలా శ్రీరామకృష్ణులు కూర్చున్న మంచం క్రింద నక్కి కూర్చోవడం మొదలైన వివరాలన్నీ ముచ్చటించాం. అక్కడే శ్రీరామకృష్ణులు భోజనం ముగించి బాగా ప్రొద్దుపోయాక దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చారు. భావావస్థలో ఆ రాత్రి ఆకలి వేయగా ఆ భక్తురాండ్రు తెచ్చిన మిఠాయిని దాదాపు పూర్తిగా ఆరగించారని కూడా ఆ సందర్భంలో చెప్పాం. ఇప్పుడు అటువంటి మరికొన్ని సంఘటనలను ఇక్కడ వివరించనున్నాం. ఆయన జీవితంలో ఇటువంటి సంఘటనలు దాదాపు ప్రతినిత్యం జరిగాయి కనుక 'కొన్నిటిని' అని పేర్కొన్నాం. అందుచేత వాటి నన్నిటినీ ఉదాహరించడం అసాధ్యం.

ప్రప్రథమంగా మలేరియా వ్యాధి తాండవించి జనక్షయం గావించడానికి మునుపు వంగదేశంలో అత్యధిక భాగం, ప్రత్యేకించి రాఢ్ ప్రాంతం, విస్తృత నీటి వనరులతో, పళ్లతోటలతో, పచ్చని వరిపొలాలతో కళకళలాడేది; ఆరోగ్యకర మైన వాతావరణ విషయంలో హుగ్లీ, బర్ద్వాన్ వంటి జిల్లాలు భారతదేశ వాయవ్య ప్రాంతానికి ఏమాత్రం తీసిపోలేదని వృద్ధులు చెబుతూ ఉంటారు. ఆ రోజుల్లో జనం బర్ద్వాన్ వంటి ప్రదేశాలకు వాతావరణ మార్పిడికోసం వెళ్లేవారని వారు చెప్పేవారు. బర్ద్వాన్‌కు సుమారు ఇరవై ఐదు మైళ్ల దూరంలో ఉన్న కామార్పు కూర్‌కూడా ఆరోగ్యకర వాతావరణానికి నెలవై ఉండేదని చెప్పడం అతిశయోక్తి కాదు. కనుక అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు ఆరోగ్యం పుంజుకోవడానికై కామార్పుకూర్‌కు వెళ్లడం కద్దు. శరీరం పట్ల ఏమాత్రం శ్రద్ధ వహించక పన్నెండు సంవత్సరాల అసాధారణ సాధనానుష్ఠానాల వలనా, అనవరతం భావ సమాధిమగ్నులై ఉన్నందునా శ్రీరామకృష్ణుల దేహదార్ఢ్యం దెబ్బతిన్నది. కనీస శారీరక పరిశ్రమకుకూడా దుర్బలులై, ఆయన తరచు అనారోగ్యానికి గురయ్యే వారు. కాబట్టే సాధనలు ముగించాక వాతావరణ మార్పిడికోసం ప్రతి సంవత్సరం శ్రీరామకృష్ణులు కామార్పుకూర్ తదితర చుట్టుపట్ల ప్రదేశాలకు పోయి, అక్కడ 'చాతుర్మాస్యం' (అంటే వర్షాకాలపు నాలుగు నెలలు) గడిపి కలకత్తాకు తిరిగి వచ్చేవారు. అటువంటి సందర్భాలలో ఆయన మేనల్లుడూ విశ్వాసపాత్రుడూ సేవకుడూ అయిన హృదయ్ ఆయన వెంటే ఉండేవాడు. ఆ ప్రయాణాల ఖర్చులన్నింటినీ భరించడమేకాక, ఆ కుగ్రామాలలో శ్రీరామకృష్ణులు ఇబ్బంది పడరాదనే తలంపుతో మథుర్ అవసరమైన సామగ్రి సైతం ఆయనతోపాటు పంపించేవాడు. కుమార్తెను ప్రప్రథమంగా అత్తవారి ఇంటికి సాగనంపుతున్నప్పుడు తల్లి ఆమెతోబాటు సారె పంపుతుంది; అదే విధంగా మథుర్, భక్తపరాయణుడైన అతడి భార్య జగదాంబ దాసీ శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌కు వెళు తున్నప్పుడు ఆయనతోకూడా నిత్యావశ్యకాలైన సామగ్రినంతా పంపించేవారు.

ఎందుకంటే గ్రామంలోని శ్రీరామకృష్ణుల కుటుంబ స్థితిగతులు ఆ దంపతులకు తెలియనివి కావు; ఆ కుటుంబం శివుని కుటుంబం వంటిది. తాతముత్తాతల కాలంనుండీ ఆ కుటుంబ సభ్యులకు భవిష్యత్తు నిమిత్తం ఎంతోకొంత సమకూర్చుకొని ఉంచుకోవాలనే ఈషణ్మాత్రమైన ధ్యాసకూడా ఉండేది కాదు. లభించిన దాంతోనే జీవనం సాగిస్తూ, ఎట్టిపరిస్థితిలోను ఋజుమార్గం వీడక వర్తించడమే ఆ కుటుంబ ఆచారం. రఘువీరుని పేరిట ఉన్న అర ఎకరం పొలంలో పండిన పంటతో కుటుంబాన్ని వెళ్లబుచ్చేవారు. ఆ ధర్మపరాయణ కుటుంబానికి ఆ గ్రామ కిరాణా అంగడే ఉగ్రాణం; దక్షిణలు మొదలైన వాటి ద్వారా లభించే స్వల్ప పైకంతో ఆ రోజుకు మాత్రం సరిపడే నిత్యావశ్యకాలైన పప్పు, ఉప్పు, నూనె, కాయగూరలు ఇత్యాదులను ఆ అంగడినుండి కొను గోలు చేసుకొనేవారు. తక్కిన రోజులలో అన్నం, చెరువు గట్లమీద పెరిగే తోట కూరలతో సంతృప్తితో ఆనందంగా గడిపివేసేవారు. సర్వకాలసర్వావస్థలలో తమ కులదైవమైన రఘువీరుని మీదే ఆధారపడి ఉండేవారు. ఆ కుటుంబ స్థితిగతులు బాగా తెలిసి ఉండడం వలనే రఘువీరుని పేరిట కొన్ని 'భిగా'ల వరిపొలాన్ని కొనుగోలుచేసి వారికి ధారాదత్తం చేయాలనే బలీయమైన కోర్కె[1] మథుర్‌బాబుకు ఉండేది. ఆ దృష్ట్యే శ్రీరామకృష్ణులతోబాటు గృహనిర్వహణకు అవసరమైన నిత్యావసర వస్తువులను మథుర్ పంపేవాడు.

చాతుర్మాస్య కాలంలో ఏటేటా శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌కు వెళ్లే వారని మునుపే చెప్పుకొన్నాం. మలేరియా వ్యాధి ఆ ప్రాంతాల సోకి, తాండ

14. రెండవ ఉదాహరణ

విస్తున్న సందర్భంలో ఒక సంవత్సరం శ్రీరామకృష్ణులు కామార్పుకూర్ వెళ్లారు; ఆ రోగం వాతబడి ఎంతో బాధ ననుభవించారు. ఆనాటి నుండి స్వగ్రామానికి వెళ్లకూడదని సంకల్పించు కొన్నారు. మళ్లీ ఎన్నడూ ఆయన అక్కడకు వెళ్లిందిలేదు. తమ మరణానికి ఎనిమిది లేక పది సంవత్సరాలకు మునుపు అలా సంకల్పించుకొన్నారు. ఏది ఏమైనప్పటికీ అంతకు మునుపు ఒక సంవత్సరం ఆయన కామార్పుకూర్‌కు వెళ్లారు. ఆయనను చూడడానికీ, ఆయన ఆధ్యాత్మిక వచనాలు వినడానికీ ఇరుగు పొరుగు స్త్రీలు పురుషులు సతతం ఆయన వద్దకు తీర్థప్రజగా వచ్చారు. అవిచ్ఛిన్న మైన ఒక దివ్యానంద లహరి అప్పుడక్కడ ప్రవహించింది. ఆయనను చూడ వచ్చిన వారిని సేవించడంలో ఆ ఇంటిస్త్రీలు ఎంతో ఆనందం పొందారు. ఆ

---

1. మథుర్‌బాబు ఈ కోరిక తీరలేదని చెప్పడం అనవసరం. మథుర్ ఒక సందర్భంలో ఈ ప్రస్తావన తీసుకురాగానే శ్రీరామకృష్ణులు మండిపడి అతణ్ణి కొట్టబోయారుకూడా.

ఆనందంలో రోజులు ఎలా గడిచిపోయాయో ఎవరికీ తెలియరాలేదు. రాంలాల్ తల్లి (రామేశ్వర్ భార్య), ఆమె కుమార్తె లక్ష్మి, మాతృదేవి శారదాదేవి అప్పుడు ఆ ఇంట్లోనే ఉన్నారు.

ఒక రోజు చీకటిపడి మూడు గంటలు గడిచిపోయాయి. శ్రీరామకృష్ణు లను చూడవచ్చిన ఇరుగు పొరుగు స్త్రీలు పురుషులు సెలవుపుచ్చుకొని తమ ఇళ్లకు వెళ్లిపోయారు. శ్రీరామకృష్ణులు గత కొన్ని రోజులుగా అజీర్తితో బాధపడు తున్నారు. సగ్గుబియ్యం, బార్లీనీళ్లు మాత్రమే ఆయన ఆహారంగా పుచ్చుకొంటు న్నారు. ఆ రాత్రికూడ కాసిని పాలు, బార్లీనీరు పుచ్చుకొని, నిద్రకు ఉపక్రమిం చారు. ఆ ఇంటి స్త్రీలు చివరకు భోజనం చేసి, ఇంటి పనులన్నీ ముగించి పడుకోబోతున్నారు.

ఆ సమయంలో శ్రీరామకృష్ణులు తమ పడకగది తలుపులు హఠాత్తుగా తెరుచుకొని భావావస్థలో తూలుతూ, రాంలాల్ తల్లిని ఇతరులను ఉద్దేశించి, ''మీరందరూ పడుకొన్నారా! నా కేమీ ఆహారం ఇవ్వకుండానే పడుకొన్నా రేమిటి?'' అని అడిగారు. ఆ మాటలకు విస్తుబోయి రాంలాల్ తల్లి, ''అదేమిటి! ఇప్పుడే కదా నువ్వు తిన్నావు'' అని బదులిచ్చింది. అందుకు ఆయన, ''ఎప్పుడు తిన్నాను? ఇప్పుడే కదా నేను దక్షిణేశ్వరం నుండి వచ్చాను. నా కెప్పుడు ఆహారం ఇచ్చారు?'' అని అడిగారు.

ఈ మాటలకు ఆ స్త్రీలందరూ ఆశ్చర్యపోయి, ఒకరి మొహాలు ఒకరు చూసుకొన్నారు. భావావస్థలో ఆయన అలా మాట్లాడుతున్నారని వారు గ్రహించ గలిగారు. కాని వాళ్లిప్పుడు ఏం చేయగలరు? ఆ అర్ధరాత్రి ఇంట్లో తినడానికి ఏమీ లేదు. మార్గాంతరం ఏమిటి? రాంలాల్ తల్లి కాస్త సంకోచిస్తూ, ''ఇంట్లో మరమరాలు తప్ప ఇంకేమీ లేదు. మరమరాలు తింటావా? అవి కాసిని తిను. అవి కడుపుకు చెరుపు చేయవు'' అని అంటూ, ఒక పళ్లెంలో మరమరాలు పోసి, ఆయన ముందు పెట్టింది. ఆ మరమరాలు చూసి శ్రీరామకృష్ణులు పిల్లవాడిలా కోపగించుకొని, ''వట్టి మరమరాలు మాత్రమే తినను'' అంటూ మారాం చేశారు. రాంలాల్ తల్లి ఆయనను బుజ్జగింప ప్రయత్నించింది. ''కడుపు నొప్పితో నువ్వు బాధపడుతున్నావు; మరేదీ నీకు సరిపడదు. పైగా ఈ అపరాత్రి దుకాణాలన్నీ మూసివేసి ఉంటారు; కనుక సగ్గుబియ్యంకాని, బార్లీకాని కొనుక్కురావడం సాధ్యం కాదు. ఈ రాత్రికి ఇవి కాస్త తిను. తెల్లారగానే నీ కోసం చారు, అన్నం వండుతాను.'' కాని ససేమిరా ఆయన వినలేదు. మారాం చేస్తున్న పిల్లవాడిలా ఆయన పదేపదే ''వీటిని నేను తినను'' అంటూ మొండి కేశారు.

ఒక సత్యంతరంలో రాంలాల్‌ను మూలానికి పంపారు. అక్కడ ఒక మూలానికి వెళ్ళి చూసొచ్చి ఆ మూలానున్న సిద్ధమండపం చూసాను. మూలాల మధ్య పెద్ద పొన్న (మామిడి వంటి చెట్టు) నిలువుగా ఉంది ఇంటికి దగ్గర. సాధారణంగా ఒక మనిషి నడవడానికి దారి లేకుండానే మనుషులు, ఈ మిఠాయి ఒక పళ్ళెంలో పెట్టి శ్రీరామకృష్ణుల ముందు ఉంచారు. ఆయన మాట్లాడి సంతోషంగా ఆ ఆహారాన్ని పూర్తిగా తిన్నారు. ఆయన అలా తినడం చూసి ఆ మనుషులు ఆశ్చర్యంతో చూస్తున్నారు. "అరే! అర్ధరాత్రి కామార్పుకూరు నుంచి వచ్చిన మనుష్యులు, కాళ్ళతో నడిచి వచ్చి, ఈ అర్ధరాత్రి ఇంత ఆహారం తిన్నారు. ఇప్పుడు చేస్తే మరో ఉపద్రవం సంభవిస్తుందని" అని ఆలోచించి భయపడ్డారు. కాని మర్నాడు ఆయన మామూలుగానే ఉండటం చూసి అంతా ఆశ్చర్యపోయారు. ఆ అర్ధరాత్రి అంత ఆహారం తిన్నప్పటికీ ఆయన కడుపులో ఇబ్బందేమీ కలగలేదు.

మరో సందర్భంలో ఆయన కామార్పుకూరులో ఉన్నప్పుడు జరిగింది ఒకటి చెప్పారు. ఒకరోజు రాత్రి భోజనం చేసి పడుకున్నారు.

15. మాట ఉద్ధారణ

కాని కాస్సేపటికి లేచి, "నాకు చాలా ఆకలి వేస్తున్నది" అన్నారు. ఈ మాటలు విని ఆ ఇంట్లోని స్త్రీలు ఆశ్చర్యపడ్డారు. తినడానికి ఆయనకు వారు ఏం ఇవ్వగలరు? ఆ రోజు ఇంట్లో ఏ ప్రత్యేకమైన వంటకాలేమీ సిద్ధంచేయలేదు మామూలు సంభారాలే జరిగింది. ఆ కాలంలాగా ఇంట్లో ఏదైనా అదనంగా మిగలలేదు. ఒక పళ్ళెం మాత్రం ఉంది. ఈ విషయం మాత్రమే సరోజిని శ్రీరామకృష్ణులకు చెప్పగా, ఆ అన్నం తీసుకువచ్చారు. ఆ అన్నంలో పెట్టడానికి కూర ఏమీ లేదని మాత్రం ఆమె చెప్పింది. అందుకు ఆయన, "నువ్వు వెతికి చూడలేదా? బ్రహ్మాండ మీరు కాదు, వెదకండి కాస్త 'మే' పంచదార చేతికి వస్తుంది! ఆ సంచిలో కొద్దిగా ఉంటుందేమో చూడు" అని అన్నారు. వెంటనే మాత్రమే వెతికి చూడగా కొంగ్గెలో కాస్త పులుసు అడుగునపట్టి ఒక చిప్పలో కాస్త కనిపించింది. దాన్ని ఆమె తీసుకువచ్చి ఆ పళ్ళెంతోపాటు ఆయనకు వడ్డించింది. ఆ అర్ధరాత్రి ఆయన ఆ పళ్ళెం (దాదాపు రెండు సేర్లు), ఆ పేరు పులుసుతో కలిపి తిని, తృప్తిపడ్డారు.

ఆయన దక్షిణేశ్వరంలో ఉంటున్నప్పుడు అప్పుడప్పుడు ఇలాగే జరుగుతుంది. ఒకనాటి అర్ధరాత్రి శ్రీరామకృష్ణులు లేచి, రాంలాల్‌ను పిలిచి, "నాకు బాగా ఆకలిగా ఉంది" అని అన్నారు. అప్పుడు ఏం చేయాలి? సామాన్యంగా కొంత మిఠాయి, ఫలాలు ఆయన గదిలో ఉండేవి; కాని ఆ సందర్భంలో ఏవీ లేవు.

గత్యంతరం లేక రాంలాల్ నహబత్ కెళ్లి విషయం మాతృదేవికీ, ఇతర భక్తు రాండ్రకూ తెలిపాడు. వారు హడావిడిగా లేచి, పొయ్యి రాజేసి, ఒక రాచిప్ప నిండా దాదాపు సేరు హల్వా వండారు. ఒక భక్తురాలు ఆ హల్వాను శ్రీరామకృష్ణుల గదికి తీసుకు వచ్చింది. గదిలో ఒక మూల చిన్నదీపం మినుకుమినుకు మంటున్నది. రాంలాల్ ప్రక్కనే కూర్చుని ఉన్నాడు. భావావిష్టులై గదిలో పచార్లుచేస్తున్న శ్రీరామకృష్ణులను చూసి ఈమె ఆశ్చర్యపోయింది. ఆ ప్రశాంత నిస్తబ్ధ నీరవ నిశీథిలో భావోద్వేగంతో దేదీప్యమానంగా ఆయన వదనం ప్రకాశిస్తూన్నది; దేని ముందు సమస్త విశ్వం ఇచ్ఛామాత్రంగా సమాధిలో లీనమై మళ్లీ ఇచ్ఛామాత్రంగా అభివ్యక్తమౌతుందో ఆ విశాలమైన నేత్రాల స్థిర అంతర్దృష్టి; అనన్య మనస్కుడైన ఆ గురుగంభీర పద విక్షేపణం; ఉద్దేశరహితమైన ఆ సానంద విచారణం - చూసిన తక్షణం ఆ భక్తురాలి హృదయం ఒక అవ్యక్తభావంతో నిండిపోయింది. ఆ స్థితిలో శ్రీరామకృష్ణుల దేహం బాగా లావు, పొడవు అయినట్లు ఆమెకు అనిపించింది; ఆయన మానవమాత్రునిగా కాక ఎవరో దేవత స్వర్గం నుండి దుఃఖాక్రందనాలతో నిండిన ఈ మానవ లోకానికి దిగివచ్చి, ఈ గభీర నిశీథిలో గోప్యంగా ఠీవిగా ఆ గదిలో పచార్లు చేస్తూన్నట్లుగా ఆమె భావించింది. కరుణార్ద్రహృదయులై ఈ మరుభూమిని మళ్లీ స్వర్గంలా మార్చడం ఎలాగని, దాని కొక మార్గం అన్వేషింప నిమగ్నులై ఉన్నట్లుగా ఆమెకు అనిపించింది. తనకు బాగా తెలిసిన శ్రీరామకృష్ణులు ఆయన కారని ఆమెకు నిశ్చయంగా అనిపించింది. ఆయనను సమీపించేకొద్దీ ఆమె గగుర్పాటు చెంది, అవ్యక్తమైన భక్తిపూర్వకభీతి ఆమెను ఆవరించింది.

16. నాలుగవ ఉదాహరణ : దక్షిణేశ్వరంలో అర్ధరాత్రి సేరు హల్వా తినడం

శ్రీరామకృష్ణులు కూర్చోవడానికి రాంలాల్ అంతకు మునుపే గదిలో ఒక ఆసనం వేసివుంచాడు. ఆ భక్తురాలు సంభ్రమ సంకోచాలతో మెల్లగా వెళ్లి ఆ హల్వా రాచిప్పను ఆసనం ముందు పెట్టింది. శ్రీరామకృష్ణులు కూర్చుని ఆ గభీర భావావస్థలో నెమ్మదిగా నెమ్మదిగా ఆ హల్వాను పూర్తిగా తినివేశారు. ఆ భక్తురాలి మనోభావాలను ఆయన పసిగట్టారేమో? ఎవరు చెప్పగలరు? తమను సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్న ఆమెను గమనించి ఆయన, ''ఎవరు తింటున్నారో చెప్పగలవా? నేనా లేక మరెవరోనా?'' అని అడిగారు. అందుకు ఆ భక్తురాలు, ''మీలో మరెవరో ఉన్నట్లు, వారే తింటున్నట్లు నాకు కనిపిస్తూ ఉంది'' అని జవాబిచ్చింది. ఆ జవాబు విని శ్రీరామకృష్ణులు, ''సరిగ్గా చెప్పావు'' అంటూ నవ్వారు.

ఇటువంటి ఎన్నో సంఘటనలను పేర్కొనవచ్చు. శక్తివంతమైన ఆధ్యాత్మిక భావోద్వేగాలు చెలరేగిన సందర్భాలలో ఆయన దేహంలో అవి గొప్ప మార్పులను

ఉత్పన్నం చేసేవి; ఆయన శారీరక కదలికలు, తినడం, త్రాగడం, ప్రవర్తన ఇత్యాదులు విభిన్న ప్రకృతిని సంతరించుకొని ఆయనను పూర్తిగా మరొక వ్యక్తిలా అనిపింపచేసేవి. అయినప్పటికీ ఆయన ప్రవర్తన ఎంత విపరీతాకృతిని దాల్చినా, ఆ ఆధ్యాత్మిక భావాల తదనంతరం ఆయన శరీరంలో ఎటువంటి వ్యాఘాతం కానవచ్చేది కాదు. మనలో నెలకొన్న మనస్సు మన భౌతిక దేహాలను వినూత్నంగా తీర్చిదిద్దుతుందన్నది సైద్ధాంతికంగా అంగీకరించే విషయమే; కాని ఈ మార్పు ఎలా జరుగుతుందో తెలియరాదు. దీనిని గురించి అనేకులు సందేహం వెలిబుచ్చుతారు. కాని శ్రీరామకృష్ణుల జీవితంలో దాదాపు సర్వ సామాన్యమైపోయిన ఈ సంఘటనలు అందుకు నిదర్శనాలుగా ఒప్పారుతున్నాయి.

17. ఆధ్యాత్మిక భావోద్వేగాలు : శ్రీరామకృష్ణుల శారీరక మార్పులు

వైష్ణవచరణ్ గురించి మథుర్‌బాబు, భైరవీబ్రాహ్మణి నుండే తెలుసుకొన్నాడని కొందరు చెబుతారు. ఆ తరువాత శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మికావస్థలలో ఏదైనా శారీరక రుగ్మత ఉందేమోనన్న విషయం తేల్చిచెప్పడంలో తనకు సలహా ఇవ్వడానికి వైష్ణవచరణ్‌ను దక్షిణేశ్వరానికి ఆహ్వానించాడంటారు. ఏది ఎలావున్నా ఇది జరిగిన కొద్దికాలానికే వైష్ణవచరణ్ దక్షిణేశ్వరానికి వచ్చాడు. ఆ సందర్భంలో ఒక చిన్న పండిత సదస్సు ఏర్పాటు చేశారని మనం ఊహించవచ్చు. వైష్ణవచరణ్‌తోబాటు మామూలుగా కొద్దిమంది శ్రద్ధాళువులైన సాధకులు, పండితులు వచ్చే ఉంటారు. ఇక విదుషీమణియైన బ్రాహ్మణి, మథుర్ గోష్ఠి ఉండనే ఉన్నారు. నిర్ణయించవలసిన అంశం: శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అవస్థ. కాబట్టే మేం దానిని సదస్సు అని పేర్కొన్నాం.

18. వైష్ణవచరణ్ ఆగమనం

చర్చ మొదలైంది. చుట్టుప్రక్కల జనం నుండి తాను విన్న, స్వయంగా తాను కళ్లారా చూసిన శ్రీరామకృష్ణుల అవస్థను బ్రాహ్మణి అభివర్ణించింది. ప్రాచీన భక్తిమార్గ ఆచార్యవరుల అనుభవాలుగా శాస్త్రాలలో నమోదైన అవస్థలతో శ్రీరామకృష్ణుల ప్రస్తుత అవస్థను పోల్చి, భైరవీ బ్రాహ్మణి ఆయన అవస్థా, ప్రాచీన ఆచార్యుల అవస్థా ఒక్కటే అని తన అభిప్రాయం ప్రకటించింది. వైష్ణవచరణ్‌ను ఉద్దేశించి, ''దీనిని గురించి మీకు భిన్నాభిప్రాయం ఉండేపక్షంలో, సవివరంగా నాకు తెలుపగోరుతున్నాను'' అని చెప్పింది. దైవబలంతో శక్తివంతురాలైనదో అన్నట్లుగా, తన బిడ్డను రక్షింపబూనే తల్లిలా వీరదర్పంతో శ్రీరామకృష్ణుల పక్షాన్ని సమర్థింప బ్రాహ్మణి ఉద్యుక్తురాలైంది. ఈ పండిత సదస్సుకు కారణభూతులైన శ్రీరామకృష్ణులు అప్పుడు ఎలా స్పందించారు? మనం ఆ దృశ్యాన్ని ఊహించుకోవాల్సిందే!

19. శ్రీరామకృష్ణుల అవస్థ గురించి చర్చ

ఆయన పూర్తిగా ఉదాసీనులై, 'ఆత్మానందం'లో రమిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ వాగ్వాదాలు చేస్తూన్న జనం మధ్య కూర్చుని ఉన్నారు; అప్పుడప్పుడు తన చిన్ని సంచీనుండి సోపుగింజలనో, చలవ మిరియాలనో నోట్లో వేసుకొంటూ, ఆ చర్చ తనను గురించి కాక మరెవరి గురించో సాగుతున్నట్లు వింటున్నారు. మధ్యమధ్యలో వైష్ణవచరణ్‌ను తట్టుతూ, ''ఒక్కొక్కప్పుడు నాకు ఇలా అవుతుంది'' అంటూ తన స్వీయస్థితిని ఆయనకు చెబుతున్నారు.

వైష్ణవచరణ్ గొప్ప సాధకుడు. ఆ సాధన ఫలితంగా సంతరించుకొన్న సూక్ష్మదృష్టి సహాయంతో, శ్రీరామకృష్ణులను చూడగానే ఆయన ఒక మహా

20. వైష్ణవచరణ్ నిశ్చయం

పురుషుడని గ్రహించాడని కొందరు అభిప్రాయపడ్డారు. దానికి తోడు బ్రాహ్మణి తెలిపినదంతా విని ఆమె అభిప్రాయంతో వైష్ణవచరణ్ హృదయపూర్వకంగా ఏకీభవించాడని శ్రీరామకృష్ణుల ముఖతా మేం విన్నాం. అంతేకాక, ప్రధానమైన ఏ పంధొమ్మిది భక్తిభావాలు లేదా భక్త్యవస్థలు ఏకకాలంలో నెలకొన్న ఏ స్థితిని భక్తిశాస్త్రాలు మహాభావం అని పేర్కొంటున్నాయో, భావమయియైన శ్రీమతి రాధారాణి, చైతన్య మహాప్రభువుల జీవితాలలో మాత్రమే ఆ మహాభావ స్థితి అభివ్యక్తమైనదో, అటువంటి మహాభావ లక్షణాలన్నీ ప్రస్తుతం శ్రీరామకృష్ణులలో అభివ్యక్తం అవడం చూసి ఆశ్చర్యపోతున్నాననీ వైష్ణవచరణ్ ప్రకటించాడు. పూర్వజన్మ సుకృతఫలంగా సామాన్యజీవి జీవితంలో ఎప్పుడైనా ఈ మహాభావం కించిత్తు అభివ్యక్తమౌతే, ఈ పంధొమ్మిది భావాలలో రెండు లేక మూడు మాత్రమే అతడిలో వ్యక్తమౌతాయి. గతంలో ఏ జీవీ ఆ పంధొమ్మిది భావాల తాకిడిని అరికట్టడంలో సమర్థుడు కాలేకపోయాడు; భవిష్యత్తులోను ఏ జీవి సమర్థుడు కాబోడని శాస్త్రాలు వచిస్తున్నాయి. వైష్ణవచరణ్ పలుకులు విని మథుర్‌బాబు, తదితరులు దిగ్భ్రమతో స్తబ్ధులైనారు. ఇక శ్రీరామకృష్ణులు విస్మయానందాలతో, ''ఆయన ఏమంటున్నాడో చూశావా! ఇదొక రుగ్మత కాదని తెలిసి సంతోషిస్తున్నాను'' అని మథుర్‌తో అన్నారు.

శ్రీరామకృష్ణుల మహోన్నతావస్థ గురించి వైష్ణవచరణ్ వెలిబుచ్చిన దృక్పథం కేవలం నోటిమాట కాదు. అప్పటినుండి ఆయన శ్రీరామకృష్ణుల పట్ల అపరిమిత భక్తిప్రపత్తులు చూపసాగాడు. ఆ నాటి నుండి ఆయన తరచు దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణుల దివ్యసాహచర్య ఆనందాన్ని ఆస్వాదించసాగాడు. తాను చేస్తున్న నిగూఢ సాధనల గురించి తెలిపి, వాటిపై శ్రీరామకృష్ణుల అభిప్రాయాన్ని తెలుసుకోగోరాడు. అంతేకాక తనలా తనతోబాటు సాధనలు చేస్తూన్న భక్తులు కూడా శ్రీరామకృష్ణుల పరిచయాన్ని పొంది తనలా ఆయన దివ్యసాంగత్య......

79093
హైదరాబాద్-500 044.

ఆనందాన్ని పొందాలనే ఉద్దేశంతో ఆయన అప్పుడప్పుడు ఆ సాధకుల వద్దకు ఆయనను తోడ్కొని వెళ్లేవాడు. పవిత్రతే మూర్తీభవించిన శ్రీరామకృష్ణులకు కూడా నిగూఢ సాధనలు చేస్తున్న ఆ సాధకులతో కలిసిమెలిసి తిరుగుతూ, వారి జీవితాల, సాధనల గురించి తెలుసుకొనే అవకాశం లభించింది. తద్వారా ఆయన ఈ విషయం గ్రహించారు: లోకుల దృష్టిలో ఆ సాధనలు ఎంత తుచ్ఛంగా, గర్హనీయంగా కనిపించినా 'భగవత్సాక్షాత్కార నిమిత్తం చేస్తున్నాను' అనే ప్రగాఢ విశ్వాసంతో ఎవరైనా అటువంటి సాధనలు శ్రద్ధతో చేస్తూపోతే అవి పతనానికి దారితీయవు సరికదా క్రమంగా వాటి తోడ్పాటుతో సాధకుడు వైరాగ్యం, ఆత్మసంయమం పెంపొందించుకొని, ఆధ్యాత్మిక సాధనలో పురోగమిస్తాడు, భగవద్భక్తిని సంతరించుకొంటాడు.

21. 'కర్తాభజ'[1] తత్సంబంధిత మతసంప్రదాయాల పట్ల శ్రీరామకృష్ణుల దృక్పథం

కాని ప్రప్రథమంగా ఆ తుచ్ఛ సాధనానుష్ఠానాలను గురించి విని, కళ్లారా స్వయంగా వాటిని చూసినప్పుడు తనలో చెలరేగిన ఆలోచనలను అనేకసార్లు మాకు ఇలా ఆయన తెలిపారు : ''వీళ్లు గొప్పగా మాట్లాడతారు; అదే సమయంలో అంత నికృష్ట అనుష్ఠానాలకు పాల్పడతా రెందుకో?'' మళ్లీ ఆయనే చివరికి తన అభిప్రాయాన్ని మార్చుకొన్నానని మాతో చెప్పారుకూడా. అందుకు కారణం : ఆ సాధకులలో కూడా శ్రద్ధాళువులైన కొందరు భగవంతునిపట్ల విశ్వాసం వహించి ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించడమే! ఈ 'కర్తాభజ' సంప్రదాయస్థులపట్ల మాలో ఉన్న ద్వేషాన్ని తొలగించడం కోసం వారిపట్ల ఉన్న తమ నమ్మకాన్ని శ్రీరామకృష్ణులు ఇలా వ్యక్తంచేశారు: ''వారిపట్ల మీ రెందుకు ద్వేషం వహించాలి? వారిదికూడా ఒక మార్గమే; అయితే తుచ్ఛమైనది. ఇంటిలోపలికి వెళ్లడానికి ప్రధాన ద్వారం, వెనుక ద్వారం, మరుగుదొడ్డి పరిశుభ్రం చేసే వ్యక్తి వెళ్లడానికి ఒక ద్వారం ఉన్నట్లుగానే భగవంతుని భవనంలోకి ప్రవేశించడానికి అనేక ద్వారాలు ఉంటాయి. వారిది మలిన ద్వారం. ఏ ద్వారం గుండా వెళ్లినా అందరూ చేరుకొనేది ఇంట్లోకే. మీరూ వారితో కలిసిమెలిసి వారిలా వ్యవహరించాలా? కాదు. మీరు అలా చేయకూడదు. కాని వారిపట్ల ద్వేషం వహించకూడదు.''

---

1. కర్తా అంటే గురువు, భజ అంటే భజించు అని అర్థం. 'కర్తాభజ' ఒక తుచ్ఛమైన సాధనామార్గం. దీనిని అనుసరించే సాధకులు గురువునే భగవంతుడిగా భావించి, భజిస్తారు. దీన్లో దోషంలేదు. కాని దానితోపాటు స్త్రీపురుషులు కలసి సాధన పేరిట వ్యభిచారం చేస్తూంటారు. అందుకే వాటిని రహస్యంగా చేయడం. కాబట్టే లోకులు ఈ మార్గాన్ని ఏవగించుకొంటారు.

22. పూర్తి ప్రాపంచిక భోగాసక్తిపరులైన వ్యక్తులు కోరే మతం

ప్రాపంచిక భోగవాసనలతో తపించే మనస్సు వైరాగ్యమార్గాన్ని అంత సులభంగా అనుసరిస్తుందా? హృదయపూర్వకంగా, పవిత్రభావంతో భగవదన్వేషణకు ఉద్యుక్తమౌతుందా? సామాన్యంగా మనస్సు పవిత్రతలోకూడ కొంత అపవిత్రతను అంటిపెట్టుకొని ఉంటుంది; కామకాంచనాలను అది పరిత్యజించినప్పటికీ వాటి 'వాసన'కై ఉబలాటపడుతుంది. అతిపవిత్ర భావంతో జగజ్జననిని పూజించాలని ఒక వంక ఆదేశిస్తూ మరోవంక ఆమె సంతృప్తికై కామాన్ని ప్రకోపింపచేసే ఏవగింపు పాటలు పాడమని పూజావిధానం గురించి తెలిపే పుస్తకాలు[1] వక్కాణిస్తున్నాయి. ఇటువంటి విపరీత పద్ధతుల బోధన చూసి ఆశ్చర్యపడనక్కర లేదు, వాటిని నిరసించనూ పనిలేదు. అనంతకోటి బ్రహ్మాండ నాయికయైన మహామాయ కల్పించిన కామకాంచన సంకెల మనిషిని ఎంత గట్టిగా బంధించివేసిందో దీని ద్వారా విశదమౌతుంది. ఆమె కరుణించి ఈ కఠోర బంధనాన్ని తొలగించకపోతే ముక్తి పొందడం జీవుడికి అసాధ్యం అనే విషయం సుస్పష్టం. ఎవరికి ఏ మార్గంలో ముక్తిపొంద పురోగమింప చేయడంలో తోడ్పడుతుందో గ్రహించడం మానవాతీతమని దీని ద్వారా విశదమౌతున్నది. అతిస్పష్టమౌతున్న మరొక విషయం : మన మనస్సుల ప్రవృత్తుల ధోరణులను ఒక వంక, మరో వంక శ్రీరామకృష్ణుల అనుపమాన దివ్యజీవిత మర్మాన్ని సునిశిత తులనాత్మక అధ్యయనం చేస్తే ఆయన మానవాతీతులనీ, పరమపురుషుడైన భగవంతుడే మనవంటి వారిపట్ల కరుణ వహించి తన ఇచ్ఛమేరకు తుచ్ఛమైన ఈ మురికి సంసారంలోకి కొద్దికాలంకోసం అవతరించి వచ్చారనీ తెలియవస్తుంది; బాహ్య దృష్టికి ఆయన ఎంత దీనాతిదీనులుగా కానవస్తున్నా, జ్ఞానదృష్టికి మాత్రం రాజరాజేశ్వరుడుగా జీవించి వెళ్లిపోయారనే విషయం గోచరిస్తుంది.

వైదిక యుగాలలో ప్రాబల్యం వహించిన యజ్ఞయాగాదులలో (దీనికే కర్మ కాండ అని పేరు) యోగం, భోగం రెండూ నిండి ఉన్నాయి. ఇంద్రాది దేవతలను

---

1. ఇవి తాంత్రిక శాస్త్రగ్రంథాలు. తాంత్రిక మార్గంలో 1. దక్షిణామార్గం లేక దక్షిణాచారం, 2. వామమార్గం లేదా వామాచారం అని రెండు మార్గాలున్నాయి. వీటిలో దక్షిణామార్గం అతిశుద్ధమైన మార్గం. ఇకపోతే వామమార్గం అశుద్ధమైన ఆచరణలతో కూడుకొన్న మార్గం. పైన ప్రస్తావించిన శాస్త్రగ్రంథాలు ఈ వామాచారానికి చెందినవని గ్రహించాలి. తుచ్ఛమైన అనుష్ఠానాలతో కూడుకొన్న ఈ మార్గంకూడ శ్రద్ధాళువులైన ఏ ఒకరిద్దరో సాధకులకు తోడ్పడుతుంది. అయినప్పటికీ ఈ మార్గం సామాన్యులకు ఆచరణీయం కాదనే విషయం గ్రహించుకోవాలి.

యాగాదుల ద్వారా, అట్లే ఉపాసనాదుల ద్వారా అర్చించి మెప్పించడం; అట్లే వారినుండి పొందిన రూపరసాది భోగ్యవస్తువులను (ఈహంలోగాని లేదా పరంలోగాని) నియమానుసారంగా భోగించడం - ఇలా యోగం, భోగం ఈ రెండూ మానవ జీవితోద్దేశంగా ఈ కర్మకాండ నిర్దేశించింది. ఈ విధంగా వేద నిర్దిష్ట క్రియాకలాపాలను సంయమ పూర్వకంగా అనుష్ఠిస్తూవుంటే కాలక్రమాన మనస్సు కొంతవరకైనా వాసనా రహితమూ, పవిత్రమూ అవుతుంది. ఆ స్థితికి చేరుకొన్నాక ఉపనిషత్తులు అభివర్ణించిన శుద్ధభక్తితో భగవంతుణ్ణే ఆరాధించి కృతకృత్యుడు కాగలుగుతాడు. అంటే భగవత్సాక్షాత్కారం పొంది ముక్తి పొందుతాడన్నమాట.

23. తంత్రశాస్త్రాల మూలం : చరిత్ర

కాని బౌద్ధయుగంలో ఇది విపరీత మార్గాన్ని పట్టింది. వాసనాశూన్యులై (సంసారం విడిచి) అరణ్యంలో వసిస్తూ అత్యంత శుద్ధభావంతో యోగ్యులైన సాధకులకు మాత్రమే ఉపయుక్తమైన కఠోర సాధనామార్గం, వివేచనారహితంగా భోగవాసనలతో తపించిపోతున్న ప్రాపంచికుల కందరికీ నిర్దేశింపబడసాగింది.[1] ఆనాటి రాజ్యాంగ యంత్రాంగం కూడా బౌద్ధసన్న్యాసుల ఈ ప్రయత్నానికి ఎంతో తోడ్పడింది. తత్ఫలితం? ప్రవృత్తి మార్గంలో చరిస్తున్న మనిషిని (అంటే ప్రాపంచిక సుఖాలకోసం అర్రులుచాస్తున్న మనిషిని) నియమిత భోగమార్గంలో నడిపిస్తూ క్రమంగా అతణ్ణే నివృత్తి మార్గంలోకి (అంటే త్యాగ వైరాగ్య మార్గంలోకి) పురోగమింపచేస్తున్న వైదిక యజ్ఞయాగాదులు బాహ్యంగా లుప్తమైపోయాయి. కాని లోపలి కోర్కెలన్నీ అంత సులభంగా లుప్తమౌతాయా? కావు. కాబట్టే అవి నిశ్శబ్ద అర్ధరాత్రుళ్లలో, భయంకర నిర్జన శ్మశానాలలో అతిగోప్యంగా తుచ్ఛ తాంత్రిక సాధనరూపంలో అభివ్యక్తం కాసాగాయి. ఈ విధంగా వైదిక యజ్ఞయాగాదులు వ్యవహారచ్యుతమై నిష్ఫలం కావడం చూసి (నిర్వహించే యజమానులు, నిర్వర్తించే పురోహితులు లేకపోవడంచేత) యోగీశ్వరుడైన పరమశివుడు వాటి నన్నిటినీ విభిన్న రూపంలో, తంత్రాల రూపంలో[2] సజీవం చేశాడని తంత్రశాస్త్రాలు చాటుతున్నాయి. ఈ కింవదంతిలో నిజానికి ఒక గొప్ప

---

1. యోగ్యులా? కాదా? అనే విచక్షణ లేకుండా ప్రతి ఒక్కరికీ సన్న్యాసం ఇవ్వడం బుద్ధుడు చేసిన తప్పు అని స్వామి వివేకానంద వ్యాఖ్యానించేవారు. బుద్ధుని అసామాన్య వ్యక్తిత్వ ప్రభావంతో వేలాది పురుషులు, స్త్రీలు ఆ కాలంలో సన్న్యసించారు. దాని ఫలితం: 1. సన్న్యాసాశ్రమానికి యోగ్యులు కాకపోవడం చేత నైతికంగా పతనం ఏర్పడింది. 2. శ్రేష్ఠులైన పురుషులు సన్న్యసించడం వలన దేశం సామాజికంగా, రాజకీయంగా అధోగతి పట్టింది.

2. అంటే వేదాలు చాటుతున్న ప్రవృత్తిమార్గం తంత్ర సాధనలనే నూతన రూపాన్ని దాల్చి మనిషి భగవంతుణ్ణే చేరే మార్గాన్ని చూపిస్తున్నదని గ్రహించాలి.

సత్యం దాగివుంది; ఎందుకంటే వైదిక క్రతువులలో ఉన్నట్లే ఈ తంత్రాల లోనూ యోగం, భోగం కలసి ఉండడం మనకు కనిపిస్తున్నది కనుక. అంతేకాక మరో విశేషం ఈ తంత్రాలలో కానవస్తూన్నది. వైదికకర్మకాండ సదా ఉపనిషత్తులు నిర్దేశిస్తూన్న జ్ఞానకాండ నుండి వేరుగా, సుదూరంగా ఉండడం కానవస్తూన్నది. కాని తంత్రాలలో మాత్రం అలాకాక ప్రతీ తంత్రసాధన కూడా అద్వైతజ్ఞానంతో అత్యంత సన్నిహిత సంబంధం కలిగివుండడం - ఇదే తంత్రాల వైశిష్ట్యం - మనకు స్పష్టంగా తెలుస్తూన్నది. ఈ క్రింది ఉదాహరణ ఈ అంశాన్ని స్పష్టంచేస్తుంది.

ఏదో ఒక దేవతామూర్తిని పూజించడానికి నువ్వు కూర్చున్నావనుకుందాం. అప్పుడు మొట్టమొదట నువ్వు చేయవలసింది: మూలాధార చక్రంలో నిద్రాణంలో ఉన్న కుండలినీశక్తిని మేల్కొల్పుతున్నావనీ, సుషుమ్నా మార్గం ద్వారా క్రమంగా దానిని శిరస్సులోని సహస్రార చక్రానికి కొనిపోతున్నావనీ, అక్కడ కుండలినీతోపాటు జీవుడివైన నువ్వు భగవంతునితో ఐక్యమైన స్థితిలో ఉన్నావనీ భావించాలి. ఆ తరువాత ఆ పరమాత్మ నుండి విడివడి జీవస్వరూపాన్ని మళ్లీ దాలుస్తున్నావనీ, ఆ పరమాత్మ ఘనీభూతమై నీ ఇష్టదేవతా రూపంలో అభివ్యక్తమౌతున్నాడనీ భావించాలి. తదనంతరం ఆ ఇష్టదేవతను నీ లోపలనుండి వెలుపలకు తీసుకువస్తున్నావనీ, పిదప ఫలపుష్పాది పూజోపకరణాల ద్వారా ఆ దేవతను పూజింప ఉపక్రమిస్తూన్నట్లూ ఊహించుకోవాలి.[1] మానవ జీవిత పరమావధి ప్రేమ ద్వారా భగవంతునితో తాదాత్మ్యం చెందడం. ఈ పై క్రియ ఆ ప్రయత్నానికి ఎంత ఉపయుక్తమైనదో గమనార్హం. నిజానికి వేలాది సాధకులలో బహుశా ఏ ఒక్కడు మాత్రమే పై క్రియను సక్రమంగా నిర్వర్తించి ఫలాన్ని పొందగలడు. అయినా ప్రతి ఒక్కరూ ఆ క్రియను కొద్దోగొప్పో చేయడానికి ప్రయత్నించినా అది మేలు ఒనగూరుస్తుంది. ఎందుకంటే ఎడతెగకుండా ఆ ప్రయత్నాన్ని కొనసాగిస్తే క్రమంగా సాధకుడు పురోగమిస్తాడు కనుక. ఈ విధంగా తంత్రాలలో పేర్కొన్న ప్రతి క్రియ కూడా అద్వైతజ్ఞానంతో కూడుకొన్నదై సాధకుడికి అతడి పరమావధిని అడుగడుగునా జ్ఞాపకం చేస్తూవుంటుంది. వైదిక కర్మకాండల నుండి భిన్నమైన తాంత్రిక సాధనలలో మనకు కనిపించే నూతనత్వం ఇదే. ఈ తాంత్రిక సాధనా ప్రణాళిక భారతీయులపై అంత విస్తృత ప్రభావం చూపడానికి కారణం ఇదే.

---

1. ఇలా ఊహించుకోవడం తాంత్రిక పూజావిధానంలో అత్యంత ప్రధానమైన ఒక అంశం. దీనినే 'భూతశుద్ధి' అని పేర్కొంటారు.

తంత్రాలలో కానవచ్చే మరో కొత్త భాగం: జగత్కారణ స్వరూపిణియైన మహామాయను మాతృభావంతో, అంటే తల్లిగా పూజించాలనే ఆదర్శాన్ని ప్రబోధించడం. ఫలితంగా స్త్రీమూర్తుల నందరినీ పరమ పవిత్ర దృష్టితో చూడాలనే ఆదర్శం జనించింది. వేదాలను, పురాణాలను తరచిచూస్తే, తంత్రాలలో ఉన్నట్లు ఈ భావం ఏకరీతిగా వాటిలో కనిపించదు. వేదాలలోని సంహితల భాగంలో స్త్రీశరీర ఆరాధన లవలేశంగా కొన్నిచోట్ల చూడవచ్చు, అంతే. ఉదాహరణకు ఈ సంహిత లలో వధువు యోని, 'ప్రజాపతేః ద్వితీయ ముఖం', అంటే సృష్టికర్తయైన ప్రజాపతి 'రెండవ ముఖం' అని అభివర్ణింపబడింది; అంతేగాక పెళ్లికూతురు తేజస్వంతమైన సంతానాన్ని కనగలదనే ఉద్దేశంతో, 'గర్భం దేహి సినీవాలి' - ఈమె సద్గర్భాన్ని పొందుగాక అనే మంత్రాల ద్వారా దేవత లందరూ ఆ 'యోని'లో పూజింపబడాలని, అట్లే ఆ అంగాన్ని పరమ పవిత్ర దృష్టితో చూడా లని విధింపబడింది. కాని ఈ 'యోని లింగాల' పూజ వైదిక కాలం నుండే భారతదేశంలో ప్రాబల్యం వహించిందని పై విషయం చూసి అపార్థం చేసుకో కూడదు. ఎందుకంటే ఈ 'యోని లింగాల' పూజ ప్రప్రథమంలో బాబి లోనియాలోని సుమేర్ జాతులలోనూ, అట్లే ఆ జాతులకు చెందిన ద్రావిడుల లోను స్థూలరూపంలో ఉండినట్లు చారిత్రక బుజువులున్నాయి.

24. తంత్రాలలో 'వీరాచారం' ఎలా ప్రవేశించింది?

ఇకపోతే భారతదేశ తంత్రాలు ఒకవంక వేదాలలోని కర్మకాండ, జ్ఞాన కాండల స్ఫూర్తిని తమ ప్రతి క్రియాకలాపంలోను ఐక్యం చేసుకొన్నాయి; అట్లే మరోవంక యోగ్యులైన కొంతమంది సాధకులకు ఆధ్యాత్మిక సాధనలో తోడ్పడ గలవని తలచి పైన పేర్కొన్న స్త్రీ శారీరక ఉపాసనను కూడా అవి ఒక భాగంగా చేసుకొన్నాయి. కాని ఆ ఉపాసనలోని స్థూలమైన మొరటు భావాన్ని చాలావరకు మార్చి, దానితోపాటు వైదిక యుగ ఉపాసనలోని ఉన్నత ఆధ్యాత్మిక భావాన్ని జోడించి ఆ ఆదర్శాన్ని సమగ్ర రూపంలో వికసింప చేశాయి తంత్రాలు. తంత్రాలలోని 'వీరాచారం' ఈ రీతిలోనే ఉత్పన్నమైనట్లు కానవస్తోంది.

భోగవాసనలతో ఊరిపోయిన మనుషులు స్థూల రూపరసాది విషయా లను కొంతయైనా భోగించకుండా ఉండలేరని తంత్రశాస్త్రకారులైన కౌలాచార్యు లకు బాగా తెలుసు. అయినా తమకు అత్యంత ప్రియమైన ఆ భోగ్యవస్తువుల పట్ల ఏదోరకంగా వారిలో పూజ్యభావం జనింప చేయగలిగితే - కొంతకాలం భోగాలలో మునిగి తేలినప్పటికీ - వారు ఆ పూజ్యభావ సత్ఫలితంగా క్రమేణా ఆత్మసంయమాది ఆధ్యాత్మిక సుగుణాలను పెంపొందించుకోవడం తథ్యం.

కాబట్టే తంత్రశాస్త్రకారులు ఇలా ప్రబోధించారు: ''స్త్రీ శరీరం నిజానికి ఒక పవిత్రమైన పుణ్యక్షేత్రం; స్త్రీని మానవమాత్రురాలిగా చూడడం మానుకోవాలి; స్త్రీని జగజ్జననిగా సదా పరిగణించాలి; ప్రతి స్త్రీ సాక్షాత్తు జగజ్జనని విశిష్ట అభివ్యక్తీకరణ అని ఎరిగి సదా స్త్రీ లందరిపట్లా పూజ్యభావంతో మెలగాలి. స్త్రీ పాదోదకాన్ని పుచ్చుకోవాలి. పొరపాటుగానైనా స్త్రీని నిందించడంగాని, కొట్టడం గాని చేయరాదు.''

తంత్రశాస్త్ర సాహిత్యంలో ఈ క్రింది వాక్యాలను ఉదాహరణగా మనం చూడవచ్చు:

1. యస్యాః అంగే మహేశాని సర్వతీర్థాని సంతివై ॥

- పురశ్చరణోల్లాస తంత్రం, 14వ పటలం

[ఓ మహేశ్వరీ! స్త్రీ శరీరంలో సమస్త పుణ్యక్షేత్రాలూ నెలకొని ఉన్నాయి.]

2. శక్తౌ మనుష్యబుద్ధి స్తు యః కరోతి వరాననే ॥

- ఉత్తర తంత్రం, 2వ పటలం

[ఓ దేవీ! ఎవడు స్త్రీని మానవమాత్రురాలిగా చూస్తాడో, అతడు ఏనాడూ మంత్రసిద్ధుడు కాలేడు; పైగా విరుద్ధ ఫలితాన్నే (అంటే భ్రష్టతనే) పొందుతాడు.]

3. శక్త్యాః పాదోదకం యస్తు పి బే ద్భక్తిపరాయణః ।
ఉచ్ఛిష్టం వాపి భుంజీత తస్య సిద్ధిరఖండితా ॥

- నిగమ కల్పద్రుమం

[స్త్రీ తన బొటన వ్రేలిని ముంచి పవిత్రం చేసిన తీర్థాన్ని భక్తితో త్రాగేవాడికి, ఆమె ఎంగిలిని శ్రద్ధాళువై ప్రసాదంగా పుచ్చుకొనేవాడికి సిద్ధి కలగడం తథ్యం.]

4. స్త్రియో దేవాః స్త్రియః పుణ్యాః స్త్రియ ఏవ విభూషణః ।
స్త్రీ ద్వేషోనైవ కర్తవ్య స్తాసు నిందాం ప్రహారకం ॥

- ముండమాలాతంత్రం, 5వ పటలం

[స్త్రీలే దేవతలు, స్త్రీలే పవిత్రులు, సమాజానికి ఆభరణాలు. కాబట్టి స్త్రీలను ద్వేషించరాదు, గర్హించరాదు, కొట్టరాదు. (అంటే స్త్రీలను పూజించడం దేవతలను పూజించినట్లే, స్త్రీలను నిందించడం దేవతలను నిందించినట్లే అవుతుంది.)]

పైన పేర్కొన్న శాస్త్రోపదేశాలు ఎంత ఉదాత్తమైనవైనా ఏం లాభం? కాల క్రమంలో తాంత్రిక సాధకులు భగవంతుణ్ణి పొందాలన్న ఆదర్శాన్నే విస్మరించి,

హేయమైన అతీంద్రియ శక్తులను, సిద్ధులను పొందడంలో తలమునకలయ్యారు.

25. ప్రతి తంత్రంలోని ఉత్తమ, అధమ విభాగాలు

ఈ కాలఘట్టంలో నానారకాల అస్వాభావిక సాధనలు, భూతప్రేతపిశాచాదుల ఉపాసన లాంటివి తంత్రశాస్త్రంలో చొరబడి, తంత్రశాస్త్రాన్ని ప్రస్తుత హేయస్థితికి దిగజార్చాయి. కాబట్టే ప్రతి తంత్రంలోను ఉత్తమం అధమం, మంచి చెడు, ఉచ్చం నీచం అనే రెండు రకాల విభాగాలు ఉండడం మనం చూడవచ్చు. కొన్ని సందర్భాలలో ఉన్నత స్తరానికి చెందిన భగవదుపాసనలో హేయ సాధనలను చొప్పించడం కానవస్తుంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ తమ నైజానికి అనుగుణమైన తంత్ర సాధనను ఎంపిక చేసుకొంటున్నారు.

శ్రీ చైతన్య మహాప్రభువుల అవతరణంతో తాంత్రిక సాధనలో మరో పరిణామం ఏర్పడింది. జనసామాన్యంలో ద్వైతభావం (అంటే భక్తిభావం)

26. వైష్ణవం : క్రొత్త ఉపాసనా విధానం

ప్రచారం చేయడమే శ్రేయస్కరమని భావించి అద్వైతానికి దారితీసే తాంత్రిక సాధనలను చాలవరకు వదలివేసి కేవలం తంత్రాలలోని మంత్రాలను, బాహ్య ఉపాసనలను మాత్రమే చైతన్యులూ, ఆయన ఉత్తరాధికారులూ ప్రచారం చేశారు. పై ఉపాసనలో వారు ఒక వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇతరులు తనను ఎలా సేవించాలని ఇష్టపడతాడో సాధకుడు తన ఉపాసనా దైవాన్ని అదే రీతిలో సేవించాలని వారు ప్రబోధించారు. సాధకులు నైవేద్యంగా అర్పించిన ఫలమూలాదులను తాంత్రిక దైవాలు దృష్టిమాత్రంతో పవిత్రీకరిస్తాయని తంత్రశాస్త్రాలు వచిస్తున్నాయి. కాబట్టి నైవేద్యంగా అర్పించిన ఆ పదార్థాలను ప్రసాదంగా ఆరగిస్తే అవి సాధకులకు కామక్రోధాది ప్రవృత్తుల పట్ల అనాసక్తతను, ఆధ్యాత్మికతపట్ల ఆసక్తతను పెంపొందిస్తాయని సామాన్యంగా విశ్వసిస్తారు. కాని వైష్ణవాచార్యులు ప్రవేశపెట్టిన నూతన సాధన పద్ధతితో నైవేద్య పదార్థాలను దేవతలు తమ దృక్కులతో పవిత్రం చేయడమేకాక, కొన్ని సందర్భాలలో సాధకుల భక్తి ప్రగాఢత మేరకు నైవేద్యంలోని స్థూలభాగాలను సైతం స్వీకరిస్తారనే విశ్వాసం ప్రాబల్యం పొందింది. ఇంతేకాక ఈ సాధన పద్ధతిలో వైష్ణవాచార్యులు అనేక మార్పులు ప్రవేశపెట్టారు కూడా. సాధ్యమైనంత వరకు తంత్రాలలో కానవస్తున్న 'పశ్వాచారా'[1]నికి, బాహ్యశౌచానికి ఎంతో ప్రాధాన్యత

---

1. సాధకుల యోగ్యతను బట్టి తాంత్రిక సాధనలను ఉత్తమం, మధ్యమం, అధమం అని మూడు తరగతులుగా విభజించి, తదనుగుణంగా సాధకులను కూడా దైవాచారం, వీరాచారం, పశ్వాచారం అనే మూడు తరగతులకు చెందినట్లు విభజించారు. సాత్త్విక గుణ సంపన్నులకు దైవాచారం, రాజసిక గుణసంపన్నులకు వీరాచారం, తామసికులకు పశ్వాచారం →

నివ్వడం వాటిలో ప్రధానమైనవి. మనసావాచ కర్మణా పూర్తి శౌచాన్ని పాటించి, 'జపాత్ సిద్ధిః జపాత్ సిద్ధిః జపాత్ సిద్ధిః' జపం ద్వారా భగవత్సాక్షాత్కారం కలగడం తథ్యం, నామమే బ్రహ్మం, అంటే భగవన్నామంతోనే భక్తుడు భగవత్సాక్షాత్కారం పొందగలడనే భావాన్ని జనసామాన్యానికి ఈ వైష్ణవాచార్యులు ప్రబోధించారు.

27. ఈ సాధన పద్ధతి నుండి 'కర్తాభజ' మొదలైన సంప్రదాయాల ఉత్పన్నం, వాటి సారాంశం

కాని ఆ తొలి వైష్ణవాచార్యుల ప్రయత్నాలన్నీ నిష్ఫలమయ్యాయి. వారి నిష్క్రమణానంతరం కొద్దికాలంలోనే వాసనాపూర్ణమైన మనస్సు వారు నిర్ణయించిన పవిత్ర ఉపాసనా విధానంలో అపవిత్ర భావాలను ప్రవేశింప చేసింది. ప్రవృత్తి పూర్ణుడైన మనిషి వారు ప్రబోధించిన సాధనలలోని సూక్ష్మపవిత్ర ఆశయాలను విడిచిపెట్టి, స్థూలాంశాలను మాత్రమే స్వీకరించాడు. తన ఉపపతి (విటుడు) పట్ల స్త్రీ చూపే ప్రగాఢ ప్రేమాకర్షణలను అలవరచుకొని, వాటిని భగవంతుని వైపుగా మరలించడానికి బదులు మనిషి, తానే ఉంపుడుగత్తెను ఉంచుకొనే స్థితికి దిగజారాడు. ఈ విధంగా వైష్ణవాచార్యులు నిర్దేశించిన శుద్ధ సాధన మార్గంలో భోగాన్ని ప్రవేశపెట్టి దానిని తన నైజానికి అనుకూలించే స్థాయికి దిగజార్చాడు. అంతకంటే ఏం చేయగలడు మరి? అత్యంత పావన జీవితం గడపడానికి యోగ్యుడు కాదుకదా! యోగం భోగం రెండూ కలగలసిన సాధన పద్ధతిని మాత్రమే అతడు జీర్ణంచేసుకోగలడు. ఆధ్యాత్మికానుభూతిని పొందగోరాడు; కాని అదే సమయంలో రూపరసాది సుఖాలను చవిచూడాలని అర్రులు చాచాడు. ఇందువలననే వైష్ణవ సంప్రదాయంలో కర్తాభజా, ఆవుల్, బావుల్, దరబేశ్, సాఇ మొదలైన రహస్య సాధన సమాజాలు ఉత్పన్నమైనాయి. కాబట్టే ఈ రహస్య సంప్రదాయాల మూలంలో యోగం భోగం కలగలసిన అతిప్రాచీన వైదిక కర్మల తీరుతెన్నులు కానవస్తాయి. దీనితోపాటు ప్రతి సాధనానుష్ఠానంతో అద్వైత భావాన్ని జోడించాలనే తాంత్రిక కౌలాచార్యులు ప్రవేశపెట్టిన ప్రక్రియ ధోరణికూడా కనిపిస్తుంది.

---→

అనుకూలిస్తాయి. పశు + ఆచారం = పశ్వాచారం. పశు అంటే జంతువులకు, అంటే తమో గుణం అధికంగా ఉండే సామాన్యులకు అనుకూలించే ఆచారం; అంటే సాధనల, క్రతువుల, భోగ్య వస్తువుల నుండి వైదొలగి మెలగడం, భగవంతుణ్ణి విగ్రహాదులలో పూజించడం, తీర్థయాత్రాదులు చేయడం, బిగ్గరగా భగవన్నామ సంకీర్తన చేయడం ఇత్యాదులు పశ్వాచారాలు. తదనంతరం మనస్సు పవిత్రమై స్థిరపడేకొద్దీ ధ్యానం, ఉపాసన మొదలైనవి విధింపబడతాయి.

భగవంతుడు, ముక్తి, ఆత్మసంయమం, పరిత్యాగం, ప్రేమ మొదలైన అంశాలను గురించి కర్తాభజ మొదలైన సంప్రదాయాల భావాలను ఒకింత వివరిస్తే పైన మేం తెలిపిన విషయాన్ని పాఠకులు సులభంగా అవగతం చేసుకోగలుగుతారు. ఈ సంప్రదాయాలను గురించి ముచ్చటిస్తున్నప్పుడు శ్రీరామకృష్ణులు అనేక సందర్భాలలో మాకు వాటిని గురించి అనేక విషయాలు తెలిపారు. సరళమైన తేటతెల్లని పలుకులలో వారి బోధనలు ఉండేవి. ఆ పద్యపాదాలు, ఆ పదజాలం వ్యక్తంచేసే భావాలను జనసామాన్యం అర్థం చేసుకోవడంలో ఎంతవరకు దోహదం చేస్తాయో వాటిని పాఠకుడు స్వయంగా విన్నప్పుడు తెలుసుకోవచ్చు. కర్తాభజ ప్రభృత సంప్రదాయస్థులు భగవంతుణ్ణి 'ఆలేక్ లతా' అని పేర్కొంటాడు. 'అలక్ష్య' అనే సంస్కృత పదంనుండే 'ఆలేక్' అనే పదం ఉత్పన్నమైంది. 'ఆలేక్', అంటే మనోవాక్కులకు అతీతుడైన పరమాత్మ శుద్ధసత్వసంపన్న మానసంలో ప్రవేశించి లేదా ఆధారం చేసుకొని అభివ్యక్తమౌతాడు. ఎవరిలో అలా అభివ్యక్తమౌతాడో అతడే 'కర్త' లేదా గురువు. ఎవరిలో భగవంతుడు ఆ విధంగా అభివ్యక్తమౌతాడో అతణ్ణి ఆ సంప్రదాయస్థులు 'సహజ్' బిరుదంతో గౌరవిస్తారు. భగవద్భావం నిజానికి ఎవరిలో అభివ్యక్తమౌతుందో, అటువంటి యథార్థ గురువే ఆ సంప్రదాయస్థులకు 'ఉపాస్య' డౌతాడు. కాబట్టే 'కర్త'నే (గురువునే) భగవంతుడిగా భజించే, ఆరాధించే సంప్రదాయస్థులను 'కర్తాభజా' అంటారు.

28. 'కర్తాభజ' ప్రభృత సంప్రదాయాల మేరకు సాధ్య, సాధనలు

'ఆలేక్‌లత' యథార్థ స్వభావం, విశుద్ధ మానసంపై దాని ప్రభావం గురించి ఆ సంప్రదాయస్థులు ఇలా చెబుతారు:

'అది అవ్యక్తంగా వస్తుంది
అవ్యక్తంగానే పోతుంది
ఎవరూ 'ఆలేక్'ను చూడలేరు
ఎవ రీ 'ఆలేక్'ను తెలుసుకొంటాడో
అతడే ముల్లోకాలలో గురువౌతాడు.'

'సహజు'డైన వ్యక్తి లక్షణం: అతడు సదా 'అచ్యుతు'డుగా ఉంటాడు. అంటే స్త్రీతో సాహచర్యం నెరపుతూవున్నా ఎన్నటికీ అతడిలో 'కామభావం' తలెత్తదు.

అటువంటి వ్యక్తిని గురించి వారు ఇలా చెబుతారు:

'రమణేర్ సంగే ధాకే, నా కరే రమణ్' - రమణితో సహవాసం చేస్తూన్నా రమణం, అంటే రతిక్రియ చేయడు.

కామకాంచనమయమైన సంసారంలో పూర్తిగా అనాసక్తుడై మెలగలేని సాధకుడు ఎన్నటికీ ఆధ్యాత్మిక పురోగతి పొందడు. కాబట్టే సాధకులకు వారు ఇలా ఉపదేశిస్తారు:

'వంట చేయి, కూరలు వడ్డించు, కాని వంటపాత్రను తాకవద్దు
పాము ముందు కప్పను ఆడించు, కాని కప్పను మింగివేయకుండా చూడు,
అమృత సాగరంలో స్నానమాడు, కాని శిరోజాలు తడవనివ్వకు.

తంత్రశాస్త్రాలు సాధకులను పశువు, వీరుడు, దివ్యుడు అని ఎలా మూడు తరగతులుగా విభజిస్తున్నాయో అదే విధంగా కర్తాభజ సంప్రదాయం కూడ సాధకులను యోగత్యానుసారంగా నాలుగు తరగతులుగా వర్గీకరిస్తున్నది. అవి: 1. ఆవుల్, 2. బావుల్, 3. దర్‌బేశ్, 4. సాఇ. అందరికంటే 'సాఇ' ఉత్కృష్టుడు, అంటే సిద్ధి పొందిన వ్యక్తి మాత్రమే 'సాఇ' అవుతాడన్నమాట.

''వీరందరూ నిరాకార భగవంతుణ్ణే ఉపాసిస్తారు'' అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఆ సంప్రదాయానికి చెందిన కొన్ని పాటలను మాకు ఆయన పాడి వినిపించేవారు. ఉదాహరణకు ఈ క్రింది పాట చూడండి:

మునుగవే లోతుకు మునుగవే మనసా
సర్వేశు సౌందర్య సంద్రంబునందు
అట్టడుగు లోతులను అందగలవేని
ప్రభు ప్రేమరత్నము పొందెదవచట ॥ ము ॥

వెదుకవే హృదయాన వెదుకవే మనసా
వెదుకవే దానిలో బృందావనంబు
శ్రీకృష్ణచంద్రుడు క్రీడించు నెపుడు
భక్తబృందము కూడి పాడియాడుచును ॥ ము ॥

వెలిగింపవే మనసు వెలిగింపు జ్యోతి
వెలిగింపవే నిత్య విజ్ఞానదీప్తి
ఆరకుండగజేయు మా దీపశిఖను
నిరతము కదలక నీ డెందమందు ॥ ము ॥

నీ పడవ నెవ్వరు నెట్టుచున్నారు
గట్టిదౌ నేలపై పట్టి త్రోయుచును

అతడె నీ గురువని అనియె కుబీరు[1]
భావింపు మా గురుపద పద్మములను ॥ ము ॥

ఈ విధంగా గురువును పూజించడం, అందరూ సమావేశమై పూజ భజనాదులలో నిమగ్నులై ఉండడం ఆ సంప్రదాయస్థుల ప్రధాన సాధనలు. వీరు విగ్రహారాధనను తిరస్కరించినప్పటికీ, సామాన్యంగా విగ్రహారాధన చేయరు. గురుపూజ సంప్రదాయం భారతదేశంలో అత్యంత ప్రాచీనమైనది. ఉపనిషత్కాలం నుండే గురుపూజ ప్రాబల్యం వహించినట్లు కనబడుతున్నది. అందుకు కారణం: 'ఆచార్యదేవో భవ'[2] - ఆచార్యుణ్ణి దేవుడిగా భావించు వంటి వచనాలను ఉపనిషత్తులలో మనం చూడవచ్చు. దేవీదేవతలను పూజించడం ఆనాడు అసలు వాడుకలోనే లేదనిపిస్తోంది. కాలక్రమంలో గురుపూజ ఎన్ని రూపాలను సంతరించుకొన్నదో చూస్తే ఆశ్చర్యపోక తప్పదు.

పైగా శుచి - అశుచి, మంచి - చెడు మొదలైన భేద భావాన్ని మనస్సు నుండి పూర్తిగా తొలగించుకోవడం నిమిత్తం ఆ కర్తాభజాది సంప్రదాయ సాధకులు రకరకాలైన సాధనానుష్ఠానాలను పాటించవలసి వచ్చేది. ''సాధకులు ఈ అనుష్ఠానాలను గురించి గురుశిష్య పరంపరానుగతంగా ఉపదేశాలు పొందేవారు'' అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు; వాటిలో కొన్నిటిని ఆయన అప్పుడప్పుడు మాకు చెప్పడం కూడా కద్దు.

''వేదాలను, పురాణాలను చెవితో వినాలి. కాని తంత్రాలు విధించిన సాధనలు ప్రత్యక్షంగా అనుష్ఠించాలి, అభ్యాసం చేసుకోవాలి'' అని శ్రీరామకృష్ణులు తరచు వచించేవారు. నిజానికి భారతదేశంలో స్మృతులను అనుసరించేవారు చాలావరకు ఏదో ఒక తాంత్రిక సాధనను అనుష్ఠించడం చూడవచ్చు. పరిశీలించి చూస్తే న్యాయ, వేదాంతాలలో నిష్ణాతులైన పండితులు అనుష్ఠానంలో తాంత్రికులే. భాగవతాది భక్తిశాస్త్రాలలో కోవిదులైన వైష్ణవ పండితులు నిజానికి కర్తాభజ ప్రభృత సంప్రదాయాల రహస్య సాధనలు అనుష్ఠించేవారుగానే కనిపిస్తారు. వైష్ణవచరణ్ కూడా ఆ కోవకు చెందిన వ్యక్తే. కలకత్తాకు ఉత్తరాన కొన్ని మైళ్ల దూరంలోని కాఛిబాగాన్ కర్తాభజ రహస్య సమావేశంతో ఆ వైష్ణవచరణ్‌కు అత్యంత సన్నిహిత సంబంధం ఉండేది. ఆ సంప్రదాయానికి చెందిన స్త్రీలు, పురుషులు అనేకులు అక్కడే వసించి, వైష్ణవచరణ్ ఉపదేశానుసారం సాధనలు చేస్తూవుండేవారు. శ్రీరామ

29. శ్రీరామకృష్ణులను, వైష్ణవచరణ్ పరీక్షించడం

1. గీత రచయిత
2. తైత్తిరీయోపనిషత్తు, 1-11-2.

కృష్ణులను ఆయన కొన్ని సందర్భాలలో అక్కడకు తోడ్కొని వెళ్లారు కూడా. శ్రీరామకృష్ణులు సదా సర్వవేళలా నిర్వికారస్థితిలో నెలకొని ఉండడం, భగవత్ప్రేమ ఫలితంగా అపూర్వ భావసమాధి మగ్నులు కావడం గమనించిన అక్కడి స్త్రీలు కొందరు ఆయన జితేంద్రియుడో కాదో తెలుసుకోగోరి ఆయనను పరీక్షించారని తెలియవస్తున్నది. ఫలితంగా 'అక్షుణ్ణ సహజ్' అనే మహోన్నతమైన బిరుదునిచ్చి ఆయనను గౌరవించారని మేం విన్నాం. బాలక స్వభావులైన శ్రీరామకృష్ణులు వైష్ణవచరణ్ అభ్యర్థన మేరకే నిస్సంకోచంగా అక్కడకు వెళ్లారు. వారు తమను ఆ విధంగా పరీక్షిస్తారని ఆయనకు అసలు తెలియదు. ఏది ఏమైనా మళ్లీ ఎన్నడూ ఆయన అక్కడకు వెళ్లలేదు.

30. శ్రీరామకృష్ణులను భగవదవతారంగా వైష్ణవచరణ్ గుర్తించడం

శ్రీరామకృష్ణుల శీలసంపత్తి, పావనత్వం, భక్తిపారవశ్యకత వైష్ణవచరణ్‌ను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. పర్యవసానంగా శ్రీరామకృష్ణుల పట్ల భక్తిప్రపత్తులు నానాటికీ ఆయనలో అధికరింపసాగాయి. చివరకు అతడు, శ్రీరామకృష్ణులు భగవదవతార పురుషులని బహిరంగంగా అంగీకరింప వెనుకాడలేదు.

31. గౌరీపండితుని అతీంద్రియశక్తి

వైష్ణవచరణ్, శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూన్న కొద్ది కాలానికే ఇందేష్‌కు చెందిన గౌరీపండితుడు దక్షిణేశ్వరానికి రావడం తటస్థించింది. అతడు సుప్రసిద్ధుడైన తాంత్రిక సాధకుడు. అతడు దక్షిణేశ్వరానికి మొదటిసారి వచ్చినప్పుడు ఒక వినోద సంఘటన జరిగింది. ఆ సంఘటన గురించి మేం శ్రీరామకృష్ణుల ముఖతా విన్నాం. కఠోర తపస్సాధనల ఫలితంగా గౌరీపండితుడు ఒక అద్భుతశక్తిని సంతరించుకొన్నాడు. (శాస్త్రతర్కంలో ఎవరినైనా పరాజితులను చేయగలగడమే ఆ శక్తి) శాస్త్రతర్కానికి ఆహ్వానితుడై వెళ్లినప్పుడు, తర్కం జరుగనున్న సభామండపంలోకి ప్రవేశించే ముందు, 'హా, రే, రే, రే, నిరాలంబో లంబోదర జనని కం యామి శరణం!' అని బిగ్గరగా కొన్నిసార్లు ఉచ్చరించిన తదుపరే సభలోకి ప్రవేశించేవాడు. పండితుడి నోటినుండి మేఘగంభీర స్వనంలో వెలువడిన వీరభావసూచకాలైన ఆ పలుకులు, విన్న ప్రత్యర్థు లందరి గుండెల్లో ఒక అవ్యక్తభీతిని రగిలించేవని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఇందుమూలంగా రెండు లాభాలు ఒనగూడేవి. 1. ఆ పలుకులు గౌరీపండితుని శక్తిని పూర్తిగా జాగృతం చేసేవి. 2. ఆ పలుకులతో ప్రత్యర్థులను జడిపించి, ముగ్ధులను చేసి వారి శక్తిని దోచుకొనేవాడు. పండితుడు అలా బిగ్గరగా ఉచ్చరిస్తూ మల్లయోధునిలా కుడి అరచేతితో ఎడమ అరచేతిని చరుస్తూ చరుస్తూ సభలో ప్రవేశించేవాడు; పూర్వం ఢిల్లీ చక్రవర్తుల సమక్షంలో

సభాసదులు ఏ రీతిలో మోకాళ్లమీద చేతులు పెట్టుకొని కూర్చునేవారో, ఆ విధంగా కూర్చుని శాస్త్ర వాగ్వాదం ప్రారంభించేవాడు. అప్పుడు గౌరీపండితుణ్ణి వాగ్వాదంలో ఓడించడం ఎవరికైనా అసాధ్యమని శ్రీరామకృష్ణులు చెప్పేవారు.

గౌరీపండితుడికి అటువంటి శక్తి ఉందని అంతకు మునుపు శ్రీరామ కృష్ణులకు తెలియదు. కాని పండితుడు కాళికాలయంలో ప్రవేశించి హా, రే, రే, రే అంటూ బిగ్గరగా ఉచ్చరించిన మరుక్షణమే, తనలోనుండి ఏదో శక్తి ప్రేరేపించడంతో శ్రీరామకృష్ణులూ అవే అక్షరాలను అతడికంటే బిగ్గరగా ఉచ్చరించారు. వెంటనే పండితుడూ ఆ అక్షరాలనే శ్రీరామకృష్ణుల కంటే మరింత బిగ్గరగా ఉచ్చరించాడు. అది విని ఉత్తేజంతో శ్రీరామకృష్ణులు 'హా, రే, రే, రే' అంటూ మరింత బిగ్గరగా ఉచ్చరించారు. రెండు వైపుల నుండి వారు అలా ఒకరికంటే ఒకరు బిగ్గరగా ఉచ్చరించడంతో, బందిపోటు దొంగలు పడ్డప్పుడు చెలరేగే కోలాహలం, అలజడి అక్కడ నెలకొన్నాయని నవ్వుతూ శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఆ శబ్దం వచ్చిన వైపుకు కర్రలు, కటారులు పుచ్చుకొని ఆలయ కాపలా వారు ఆదరాబాదరా పరుగెత్తుకొంటూ వచ్చారు. తక్కిన వారంతా భయంతో బిర్రబిగుసుకుపోయారు. గౌరీపండితుడు, శ్రీరామకృష్ణుల కంటే బిగ్గరగా ఆ అక్షరాలను ఉచ్చరించలేకపోవడంతో, మౌనం పాటించవలసి వచ్చింది. ఈ సంఘటనతో పండితుడు ఒకింత చిన్నబుచ్చుకొని కాళికాలయంలోకి ప్రవేశించాడు. శ్రీరామకృష్ణులూ, క్రొత్తగా వచ్చిన పండితుడూ ఈ కోలాహలాన్ని సృష్టించారని గ్రహించి, అక్కడ గుమిగూడిన జనం నవ్వుకొంటూ వెళ్లిపోయారు. శ్రీరామ కృష్ణులు ఇలా చెప్పేవారు: ''తదనంతరం జగజ్జనని గౌరీపండితుడి జీవిత విజయ రహస్యాన్ని నాకు వ్యక్తం చేసింది. ప్రత్యర్థుల శక్తులను నిర్వీర్యం చేసి తనను అజేయుడయ్యేలా చేస్తూవచ్చిన శక్తిని నాటితో అతడు కోల్పోయాడు. అతడి శ్రేయస్సు నిమిత్తమే జగజ్జనని ఆ శక్తిని దీనిలోకి (శ్రీరామకృష్ణులలోకి) ఆకర్షించి వేసింది.'' ఆనాటి నుండి క్రమక్రమంగా గౌరీపండితుడు శ్రీరామకృష్ణుల భావాదర్శానికి ముగ్ధుడై, పూర్తిగా ఆయన పట్ల విధేయుడై వర్తించసాగాడు.

గౌరీపండితుడు గొప్ప తాంత్రిక సాధకుడని మునుపే చెప్పుకొన్నాం. ప్రతి సంవత్సరం దుర్గాపూజ సందర్భంలో గౌరీపండితుడు పూజకు అవసరమైన ఏర్పాట్లన్నీ స్వయంగా తానే చేసుకొనేవాడు. తన భార్యను వస్త్రభూషణాదులతో అలంకరించి, పసుపు కుంకాలు అలది పూజాపీఠం మీద ఆసీనునుచేసి, జగజ్జననిగా భావించి మహాభక్తితో ఆమెను పూజించేవాడు. ఈ విషయం మేం శ్రీరామకృష్ణుల ముఖతా విన్నాం. లోకంలోని స్త్రీ లందరూ సాక్షాత్తు

32. దేవీభావంతో తన భార్యను గౌరీ పండితుడు ఆరాధించడం

జగన్మాతృ స్వరూపిణులనీ, వారందరిలోను జగన్మాత జగత్పాలన శక్తీ, ఆనందప్రదాయిని శక్తీ విశేషంగా అభివ్యక్తమౌతాయని తంత్రాలు చాటుతున్నాయి. కాబట్టే స్త్రీల నందరినీ పవిత్రభావంతో పూజించాలి. స్త్రీలలో స్వయంగా జగజ్జనని నెలకొని ఉన్నదనే విషయం విస్మరించి, వారిని భోగ్యవస్తువుగా మాత్రమే ఎంచి, కామభావంతో చూస్తే, అది జగజ్జననిని అవమానించడమే అవుతుంది; పర్యవసానం అటువంటి వారు అంతులేని దుఃఖాల పాల్పడతారు. దేవీ మాహాత్మ్యంలో (చండీ లేదా దుర్గా సప్తశతి) దేవతలు, దేవిని ఇలా స్తుతిస్తున్నారు.

విద్యాః సమస్తాస్తవ దేవి భేదాః
స్త్రియః సమస్తాః సకలా జగత్సు ।
త్వయైకయా పూరితమమ్బయైతత్
కా తే స్తుతిః స్తవ్యపరాపరోక్తిః ॥ *[దేవీమాహాత్మ్యం, 11.6]*

[దేవీ! విద్యలన్నీ నీ వివిధ అంశాలు. లోకంలోని స్త్రీ లందరూ (నీ) వివిధ కళలు (అంశాలు) కలిగి ఉంటారు. తల్లీ! ఈ యావత్తు జగత్తూ నువ్వే నిండివున్నావు. స్తుతింప దగిన సకల వస్తువుల పరాపరోక్తి (ముఖ్యోక్తీ, గౌణోక్తీ) రూపమైన నిన్ను నిజానికి ఏ స్తుతులు వర్ణించగలవు?]

''ఓ దేవీ! నువ్వు జ్ఞానస్వరూపిణివి; లోకంలోని మానవులు పొందుతున్న అంతులేని చిన్నా, పెద్ద విద్యలన్నీ నువ్వే, నువ్వు ఆ విద్యల రూపంలో అభివ్యక్తమౌతున్నావు; లోకంలోని స్త్రీలందరూ నీ అభివ్యక్తీకరణలే. నువ్వొక్క దానివే లోకం యావత్తు వ్యాపించి, సర్వత్రా నెలకొని ఉన్నావు. అసదృశయైన నువ్వు వర్ణనాతీతవు. నీ అనంత గుణాలను ఎవరు స్తుతించగలిగారు? ఎవరు స్తుతించ గలుగుతారు?''

భారతదేశంలో మనలో అనేకులం ఈ స్తోత్రాన్ని నిత్యం చదువుతూనే ఉంటాం. కాని దౌర్భాగ్యం ఏమిటంటే కొన్ని నిమిషాలపాటైనా స్త్రీ దేహాన్ని దేవీ భావంతో చూసి, సముచిత భక్తిప్రపత్తులు చెల్లించి, హృదయాలలో పరమానందాన్ని పొంది తరింప కనీస ప్రయత్నమైనా చేసేవారు ఏ కొద్దిమందైనా కనిపిస్తారా? జగజ్జనని విశేషంగా అభివ్యక్తమయ్యే స్త్రీమూర్తులను అపవిత్ర దృష్టితో చూస్తూ ప్రతి రోజూ వందలాది పర్యాయాలు ఆమెను అవమానించకుండా ఉండేవారు ఎందరున్నారు? ఓ భారతదేశమా! స్త్రీమూర్తులపట్ల చూపే పాశవిక వైఖరీ, జీవుణ్ణే శివుడిగా సేవించడం విస్మరించడమూ ప్రస్తుత ఈ నీ దుర్దశకు హేతువులు. జగజ్జనని కరుణించి నీ పాశవిక వైఖరిని ఎప్పుడు తొలగిస్తుందో ఆమెకే ఎరుక!

గౌరీ పండితుడి మరొక అద్భుతశక్తిని గురించి మేము శ్రీరామకృష్ణుల ముఖతా వినివున్నాం. ఉత్కృష్ట తాంత్రిక సాధకులు నిత్యపూజ ముగించాక సాధారణంగా హోమం చేస్తారు. నిత్యం కాకపోయినప్పటికీ గౌరీపండితుడు కూడా తరచు హోమం నిర్వర్తించేవాడు. కాని ఆయన హోమం చేసే విధానం ఎంతో విచిత్రంగా ఉండేది. ఇతరులలా ఆయన హోమం చేసేవాడు కాదు. సామాన్యంగా నేలమీద మట్టితోగాని లేదా ఇసుకతోగాని వేదికను నిర్మించి, దానిపై కట్టెలు పేర్చి అగ్ని రగిలించి ఆహుతులు వ్రేల్చడం పరిపాటి. గౌరీ మాత్రం తన ఎడమ చేతిని నిరాధారంగా ముందుకు చాచి, దానిమీద ఒక మణుగు (82 పౌండ్లు) కట్టెలు పేర్చి, వాటిని రగిలించి, మండుతున్న అగ్నిలో తన కుడిచేతితో ఆహుతులు వ్రేల్చేవాడు. హోమ కార్యం పూర్తిచేయడానికి చాలసేపు పట్టేది. అంతసేపు చేతిని నిరాధారంతో చాపుకొని ఉంచడం, మణుగు కట్టెల భారాన్ని భరించడం, మండుతున్న కట్టెల ఉష్ణాన్ని అంతసేపూ ఓర్చుకొంటూ, మనస్సును ప్రశాంతంగా ఉంచుకొని విధివిహితంగా భక్తిప్రపత్తులతో ఆహుతులు వ్రేల్చడం మాకు అసాధ్యమనే అనిపించింది. స్వయంగా శ్రీరామకృష్ణుల ముఖతా ఈ అసాధారణ కృత్యం గురించి విన్నప్పటికీ కూడా మొదట్లో మాలో అనేకులం నమ్మలేకపోయాం. మా విస్మయావస్థను గమనించి శ్రీరామకృష్ణులు, ''ఆహా! అతడలా చేయడం నేను కళ్లారా చూశాను. ఇదికూడా ఆతడి అద్భుత శక్తులలో ఒకటి'' అని చెప్పారు.

33. గౌరీపండితుడి విచిత్ర హోమ విధానం

గౌరీ పండితుడు దక్షిణేశ్వరానికి వచ్చిన కొద్దిరోజులలోనే వైష్ణవచరణ్ వంటి కొందరు సాధక - పండితులను మథుర్ ఆహ్వానించి, ఒక సదస్సు ఏర్పాటు చేశాడు. క్రొత్తగా వచ్చిన గౌరీపండితునికీ, ఇతర పండితులకీ మధ్య శాస్త్ర ప్రమాణాలపై చర్చ జరిపించి, మునుపటిలా శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అవస్థను రూఢి పరచుకోవడమే ఈ సదస్సును ఏర్పాటు చేయడంలోని ఉద్దేశం. కాళికాలయానికి ఎదురుగా ఉన్న నాదమండపంలో ఉదయం వేళ సదస్సు ప్రారంభమైంది. వైష్ణవచరణ్ కలకత్తానుండి రావడం ఆలశ్యం కావడంతో, శ్రీరామకృష్ణులు, గౌరీతో కలిసి సభా స్థలానికి బయలుదేరారు. సభలోకి ప్రవేశించే ముందు శ్రీరామకృష్ణులు కాళికాలయానికి వెళ్లి, జగజ్జనని పాదారవిందాలను భక్తిప్రపత్తులతో అర్చించారు. భావసమాధిమగ్నులై ఆయన ఆలయం నుండి బయటకు వచ్చీరాగానే వైష్ణవచరణ్ ఆయన పాదాలమ్రోల భక్తిప్రపత్తులతో వాలిపోయాడు. అతణ్ణి చూసీచూడగానే ఆధ్యాత్మిక భావోద్వేక స్ఫూర్తితో శ్రీరామ

34. వైష్ణవచరణ్, గౌరీలు కూడా పాల్గొన్న దక్షిణేశ్వరంలో జరిగిన సదస్సు

కృష్ణులు సమాధిమగ్నులై, వైష్ణవచరణ్ భుజాలమీదకెక్కి కూర్చున్నారు. తన జన్మ ధన్యమైనట్లుగా భావించి వైష్ణవచరణ్ పరమానందభరితుడైనాడు. వెంటనే సంస్కృతంలో ఆశువుగా ఒక స్తోత్రాన్ని రచించి శ్రీరామకృష్ణులను స్తుతించాడు. సమాధిమగ్నులై ఉన్న శ్రీరామకృష్ణుల అనుగ్రహపూర్ణ తేజోవిరాజమానమైన మూర్తిని దర్శించి, హృదయం ఆనందంతో ఉప్పొంగ వైష్ణవచరణ్ ఆలాపించిన మనోహర స్తోత్రగానం విని అక్కడున్న మథుర్ ప్రభృతులు భక్తి పెల్లుబుకగా చేష్టలు దక్కి చిత్తరువులా నిలబడిపోయారు. కాస్సేపటికి శ్రీరామకృష్ణుల సమాధి భంగమైంది. అప్పుడు మెల్లగా అందరూ ఆయనతో కలిసి నాదమండపం లోకి వెళ్ళి, కూర్చున్నారు.

సదస్సు ప్రారంభమైంది. కాని గౌరీపండితుడు ప్రప్రథమంలోనే హఠాత్తుగా ఇలా చెప్పాడు: ''ఈయన (శ్రీరామకృష్ణులను చూపుతూ) ఆ పండితుడిపై అంతటి కృపను వర్షించినప్పుడు, నేను ఈ రోజు ఆయనతో వాదించలేను. ఒకవేళ వాదించినా నాకు ఓటమి తథ్యం. ఎందుకంటే ఆయన (వైష్ణవచరణ్) నేడు దైవకృప అనే ఆయుధం ధరించి ఉన్నాడు కనుక. అంతేకాక ఆయన కూడా నా దృక్పథాన్నే వహించినట్లు కానవస్తున్నది. కనుక ఈ వ్యవహారం గురించి చర్చిం చడం వృథా.'' ఇతర శాస్త్రాంశాల మీద కొంతసేపు చర్చ జరిపిన తరువాత సదస్సు ముగిసింది.

వైష్ణవచరణ్ పాండిత్యాన్ని చూసి గౌరీపండితుడు ఆ రోజు ఆయనతో చర్చించడానికి వెనుకాడాడని భావించడం సరికాదు. శ్రీరామకృష్ణుల దివ్యత్వం, జీవన విధానాదులు చూసి, దీర్ఘకాలిక తపశ్చర్యల ఫలంగా జనించిన అంతర్దృష్టితో దక్షిణేశ్వరంలో బస చేసిన ఆ కొద్దిరోజులలోనే గౌరీపండితుడు, 'శ్రీరామ కృష్ణులు సామాన్యులు కారు, మహాపురుషులు' అని తన హృదయాంతరాళాల్లో గ్రహించాడు. కొన్ని రోజులు గడిచిన తరువాత ఒక రోజు శ్రీరామకృష్ణులు, గౌరీపండితుణ్ణి ఇలా అడిగారు: ''ఇలా చూడు! వైష్ణవచరణ్ దీనిని (తమను చూపుతూ) అవతారమంటున్నాడు. అలా కావడం సాధ్యమేనా? నువ్వు ఏం అనుకొంటున్నావో కాస్త చెప్పు.''

ఆ ప్రశ్నకు గౌరి గంభీరంగానే జవాబిచ్చాడు: ''వైష్ణవచరణ్ మిమ్మల్ని అవతారం అని మాత్రమే అంటున్నాడా? అతడు మరీ తక్కువగా అంచనా వేశాడు. ఎవరి అంశలు యుగాల పర్యంతం లోకహితార్థం ఈ ఇలలో అవతారాలుగా జన్మిస్తూ ఉంటాయో, ఎవరి శక్తి మూలంగా వారు తమ పనులు చేయడంలో కృతకృత్యులవుతారో ఆ పరమాత్మే మీరు అన్నదే నా దృఢ విశ్వాసం.'' ఆ

35. శ్రీరామకృష్ణుల గురించిన గౌరీ దృఢ విశ్వాసం

మాటలు విని శ్రీరామకృష్ణులు నవ్వుతూ, "ఓహో! ఆయనకంటే రెండాకులు ఎక్కువే చదివినట్లున్నావు! అలా అనుకోడానికి నాలో ఏం చూశావో చెబుతావా?" అని అడిగారు. అందుకు గౌరీ ఇలా ప్రత్యుత్తరం ఇచ్చాడు: "శాస్త్రాధారాలు, స్వానుభవం నుండే నేను అలా చెబుతున్నాను. ఎవరైనా ఇందుకు విరుద్ధమైన అభిప్రాయం వెలిబుచ్చితే, నా దృఢనిశ్చయాన్ని ఋజువు చేయడానికి సంసిద్ధుణ్ణే."

అందుమీదట శ్రీరామకృష్ణులు చిన్నపిల్లవాడిలా, "మీరు ఏమిటేమిటో చెబుతున్నారు; వాటి గురించి ఎవరి కెరుక? నాకు దేన్ని గురించీ ఏమీ తెలియదు" అని అన్నారు.

"నిజమే. 'మీ రెవరో మీకే తెలియదు' అని శాస్త్రాలూ వచిస్తున్నాయి. అటువంటప్పుడు మీ గురించి ఇతరులు ఎలా తెలుసుకోగలరు? అనుగ్రహించి మీ రెవరికి వెల్లడిస్తారో, వారు మాత్రమే నిజం తెలుసుకోగలుగుతారు" అని గౌరీ జవాబిచ్చాడు.

పండితుడి ప్రగాఢ విశ్వాసాన్ని వెలిబుచ్చే పలుకులు విని శ్రీరామకృష్ణులు మందహాసం చేశారు. రోజులు గడిచేకొద్దీ శ్రీరామకృష్ణుల పట్ల గౌరీపండితుడి

36. గౌరీపండితుడి వైరాగ్యం

ఆకర్షణ అధికం కాసాగింది. శ్రీరామకృష్ణుల దివ్యసాహచర్యంలో పండితుడి శాస్త్రజ్ఞానమూ, సాధన ఫలితాలూ సాఫల్యం సంతరించుకొని, సంసారం పట్ల తీవ్ర అనాసక్తత రూపంలో అభివ్యక్తం కాసాగాయి. నానాటికీ ఆతడి మనస్సు పాండిత్యం, గౌరవం, సిద్ధులు మొదలైన వాటిపట్ల అభిలాషను కోల్పోసాగింది; ఆతడి మనస్సు భగవంతుడి పాదపద్మాల వైపుగా మరలిపోసాగింది. ఇప్పుడు గౌరీపండితుడిలో వెనుకటి పాండిత్యాహంకారం, చర్చపట్ల అభిరుచి, ఆ దర్పం పూర్తిగా మటుమాయమయ్యాయి. భగవంతుడి పాదపద్మాలను పొందడానికి సమస్త ప్రయత్నాలూ చేయకుండానే విలువైన సుదీర్ఘ కాలాన్ని వృథా చేసుకొన్నానని పండితుడికి ఇప్పుడు అర్థమైంది. ఆ రీతిలో కాలాన్ని ఇకమీదట వృథా చేయకూడదనుకొన్నాడు. సర్వసంగ పరిత్యాగం చేయాలని దృఢంగా సంకల్పించుకొన్నాడు; తన జీవితంలో మిగిలివున్న ఆ కొద్దిరోజులను భగవంతుడి మీదనే పూర్తిగా ఆధారపడుతూ, భక్తిపూరిత హృదయంతో, పరమ వ్యాకులతతో ఆయనను ప్రార్థిస్తూ గడిపివేసి తద్వారా భగవత్సాక్షాత్కారం పొంద నిశ్చయించుకొన్నాడు.

ఈ విధంగా శ్రీరామకృష్ణుల దివ్యసాహచర్యంలోనూ, భగవద్ధ్యానంలోనూ గౌరీపండితుడు రోజులూ, నెలలూ గడిపివేయసాగాడు. చాలాకాలం ఇలా ఇంటి నుండి దూరంగా ఉండిపోవడంతో, ఆయన భార్య, కుమారుడు తదితర

కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి రావలసిందిగా పదేపదే ఆయనకు ఉత్తరాలు వ్రాయసాగారు. అందుకు కారణం: ఆయన ఒక 'ఉన్మాద సాధువు'తో అత్యంత సన్నిహితంగా మెలగుతున్నాడనీ, తత్ఫలితంగా ఆయన మనస్సు లౌకిక విషయాలపట్ల ఎంతో అనాసక్తి వహిస్తూన్నదనీ వాళ్లకు జాడమాత్రంగా తెలియ రావడమే. తన కుటుంబ సభ్యులు దక్షిణేశ్వరానికి వచ్చి తనను మళ్లీ సంసార జీవితంలోకి లాక్కుపోతారనే ఆలోచన పండితుడిలో మెదలి, బలపడింది. ఆయనకు వచ్చిన ఉత్తరాలు ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. సుదీర్ఘంగా ఆలోచించిన తరువాత పండితుడికి ఒక చక్కని మార్గం కనిపించింది. ఒక సుముహూర్తం ఆసన్నం కావడంతో, పండితుడు శ్రీరామకృష్ణుల పాదపద్మాలకు ప్రణమిల్లి, సెలవు ఇప్పించమని కంట తడిపెట్టుకొని ఆయనను అర్థించాడు. ''ఇదేమిటి గౌరీ! హఠాత్తుగా సెలవు పుచ్చుకొంటున్నావెందుకు? ఎక్కడకు వెళతావు?'' అని శ్రీరామకృష్ణులు అడిగారు. అందుకు చేతులు జోడించి పండితుడు, ''నన్ను ఆశీర్వదించండి, నా మనోవాంఛితం సిద్ధిస్తుంది. భగవత్సాక్షాత్కారం పొందకుండా నేను తిరిగి రాను'' అని జవాబిచ్చాడు. ఆనాటి నుండి గౌరీపండితుడి జాడ ఎంత అన్వేషించినప్పటికీ తెలియరాలేదు.

37. వైష్ణవచరణ్ను, గౌరీపండితుణ్ణి శ్రీరామకృష్ణులు ఉదాహరించడం

వైష్ణవచరణ్, గౌరీపండితుల జీవితాల నుండి వివిధ సంఘటనలను గురించి అనేకసార్లు శ్రీరామకృష్ణులు మాతో ప్రస్తావించారు. మరికొన్ని సందర్భాలలో ఏదో అంశం చర్చిస్తూ ఆ పండితులు ఆ అంశం మీద వెలిబుచ్చిన అభిప్రాయాన్ని ఆయన మాకు తెలిపేవారు. ఒక రోజు శ్రద్ధాళువైన ఒక సాధకుడికి ఉపదేశం చేస్తూ, ఆతడితో, ''మనిషిలో నిజంగా తన ఇష్టదైవాన్ని చూడగలిగినప్పుడు భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. నరలీలలో విశ్వాసం ఏర్పడినప్పుడే పరిపూర్ణజ్ఞానం కలుగుతుందని వైష్ణవచరణ్ తరచు వచించేవాడు'' అని శ్రీరామకృష్ణులు చెప్పడం మాకు బాగా జ్ఞాపకం.

38. కాళీ, కృష్ణులు అభిన్నులన్న విషయంపై గౌరీపండితుడి అభిప్రాయం

కాళీ, కృష్ణుల మధ్య భేదభావం కనబరిచే ఒక భక్తుణ్ణి గమనించి శ్రీరామకృష్ణులు అతడితో ఒకసారి ఇలా అన్నారు: ''ఎంత అపరిపక్వ భావం! కాళీ, కృష్ణుడు, చైతన్యుడు, మిగిలిన అందరి అభివ్యక్తీకరణ నీ ఇష్టదైవమే అని గ్రహించు. ఆ కారణంగా నీ ఇష్టదైవాన్ని విడిచిపెట్టి చైతన్యుణ్ణే ఆరాధించమంటున్నానా? కానే కాదు. కాని ఈ మినహాయింపు ధోరణి విడిచిపెట్టు. నీ ఇష్టదైవమే కృష్ణుడు, చైతన్యుడు తదితర దివ్య అభివ్యక్తీకరణలనే దృఢవిశ్వాసం కలిగి ఉండు. కోడలు అత్తగారింటికి వెళ్లి అత్తమామలను, మరదళ్లను,

మరుదులను అనురాగంతో సేవించడం నువ్వు చూడలేదా? కాని భర్తతో మాత్రమే ఆమె శయనిస్తుంది, తన భావనలను అతడితో మాత్రమే పాలుపంచు కొంటుంది. భర్త మూలంగానే ఆ కుటుంబంలోని సభ్యులందరూ తనకు సొంత మయ్యారని ఆమెకు చక్కగా తెలుసు. అదే విధంగా నీ ఇష్టదైవం మూలంగానే ఆయన ఇతర అభివ్యక్తీకరణలతో నీకు సంబంధం కలిగింది కనుక వారందరి పట్లా భక్తిప్రపత్తులు చెల్లించాలి. ఈ విషయం గ్రహించి నీ దైవదురభిమానాన్ని పారద్రోలు. 'కాళీ గౌరాంగులు ఒక్కరే అని ఎప్పుడు అవగతమౌతుందో అప్పుడే యథార్థ జ్ఞానం కలిగినట్లు తెలుస్తుంది' అని గౌరీ చెప్పేవాడు.''

తన కుటుంబంలోని ఒకరి పట్ల ప్రగాఢ అనురక్తి అలవరచుకొన్న ఫలితంగా ఒక ఫలానా భక్తుడి మనస్సు ప్రశాంతతను కోల్పోవడం ఒక సందర్భంలో శ్రీరామకృష్ణులు గుర్తించారు. అప్పుడు ఆ భక్తుడికి తన కుటుంబంలోని ఆ సదరు వ్యక్తిని భగవంతుడి ఒకానొక రూపంగా భావించి, సేవించమని ఆయన ఉపదేశించారు.

39. తన ప్రేమాస్పదుణ్ణే భగవంతుడి ఒకానొక రూపంగా పరిగణించడాన్ని గురించి వైష్ణవచరణ్

తన మేనల్లుడిపట్ల ప్రగాఢ అనురాగాన్ని అలవరచుకొన్న ఒక భక్తురాలికి ఆ మేనల్లుణ్ణే బాలగోపాలుడిగా భావిస్తూ సేవించమని శ్రీరామకృష్ణులు ఉపదేశించారనీ, అలా ఆచరించిన ఫలితంగా కొద్దికాలంలోనే ఆమె భావసమాధిని కూడా పొందగలిగిందనీ ఇంతకు మునుపే[1] పాఠకులకు తెలిపి ఉన్నాం. తాము ప్రేమించే వ్యక్తి పట్ల భగవంతునిపట్ల చూపే భక్తిప్రపత్తులు నెరపాలని ఉపదేశించే సందర్భాలలో శ్రీరామకృష్ణులు, వైష్ణవచరణ్ ప్రస్తావన తెచ్చి ఈ అంశంలో ఆతడి ఉద్దేశాన్ని ఇలా తెలిపేవారు: ''తాను ప్రేమించే వ్యక్తిని ఇష్టదైవంగా పరిగణించి చూసినప్పుడు, ఆతడి మనస్సు సత్వరమే భగవంతుడి మీద లగ్నమౌతుంది అని వైష్ణవచరణ్ తరచు చెప్పేవాడు.'' ఇలా అంటూ శ్రీరామకృష్ణులు మరింత విశదీకరించేవారు: ''అలా చేయమని వైష్ణవచరణ్ తన సంప్రదాయానికి చెందిన స్త్రీలకు ఉపదేశించేవాడు. ఆయన అలా చెప్పడం నింద్యార్హం కాదు. ఎందుకంటే ఆ స్త్రీలందరిదీ 'ఉపపతి వైఖరి' కదా! ఒక స్త్రీకి తన ఉపపతి పట్ల ఎంతటి ఆకర్షణ ఉందో అంత ఆకర్షణను భగవంతుడి పట్ల ఆరోపించుకోగోరతారు వాళ్లు.'' అయినా అటువంటి ప్రమాదకరమైన సాధన పద్ధతిని జనసామాన్యానికి బోధించకూడదనీ, అలా బోధిస్తే వ్యభిచారం పెచ్చు పెరిగిపోతుందనీ శ్రీరామకృష్ణులు నొక్కివక్కాణించేవారు. కాని భర్తనుగాని, కుమారుణ్ణిగాని లేదా సమీప బంధువునిగాని భగవద్రూపునిగా ఎంచి ప్రేమించి, సేవించడం పట్ల ఆయనకు

---

1. III. 1.27.

ఎటువంటి అభ్యంతరమూ ఉండేది కాదు. పైగా తమ పాదపద్మాలను ఆశ్రయిం చిన అనేకమంది భక్తులకు ఈ సలహానే ఇచ్చేవారని మాకు బాగా తెలుసు.

కాస్త తరచి చూస్తే పై ఉపదేశం శాస్త్రవిరుద్ధం కాదనీ, పైగా అదొక క్రొత్త పద్ధతికూడా కాదనీ మనం గ్రహించవచ్చు. ''భర్తలో ఆత్మస్వరూపుడుగా భగవం తుడు నెలకొని ఉండడం వలననే భార్యకు, భర్త ప్రియ తముడౌతున్నాడు; భార్యలో భగవంతుడు ఉండడం వల ననే భార్యపట్ల భర్తకు ఆకర్షణ జనిస్తున్నది''[1] అని ఉపని షత్కారుడైన ఋషి యాజ్ఞవల్క్య - మైత్రేయి సంవాదం మూలంగా బోధిస్తున్నాడు. లోకంలో మనకు ప్రియతమమైన, ఆకర్షణీయమైన అన్ని వస్తువులను, వ్యక్తులను ప్రియస్వరూపుడూ, ఆనందస్వరూపుడూ అయిన ఆ భగవంతుని అంశలుగా పరిగణించాలి; ఆ దృక్పథం నుండే వాటిని ప్రేమించా లని ఉపనిషత్ ఋషులు అనాది కాలంనుండి మనకు బోధిస్తూ వస్తున్నారు. తదనంతర కాలంలో భక్తిగ్రంథకారులైన నారదాదులు మానవుడికి పరమ హానికర శత్రువులైన కామక్రోధాదులను భగవంతుని వైపుకు త్రిప్పాలనీ, అట్లే సఖ్య వాత్సల్య మధుర భావాదుల ద్వారా భగవంతుణ్ణి ఉపాసించాలనీ బోధించారు. ఇలా చేయడంలో ఈ ఆచార్యులు మునుపటి ఉపనిషత్ ఋషుల అడుగుజాడ లనే అనుసరించారన్న విషయం సుస్పష్టం. కాబట్టి శ్రీరామకృష్ణుల పై ఉపదేశం శాస్త్రపరమైనదనడంలో ఎలాంటి సంశయమూ లేదు.

40. ఈ ఉపదేశం శాస్త్ర సమ్మతమే; యాజ్ఞవల్క్య - మైత్రేయి సంవాదం

భగవదవతారమూర్తు లందరూ క్రొత్త ఆధ్యాత్మిక మార్గాలను ఆవిష్కరిస్తారు. ఆ మార్గాలు, వెనుకటి శాస్త్రబోధనలకు విరుద్ధమైనవిగా ఉండవు సరికదా, శాస్త్రబోధనానుసారమైనవిగానే ఉంటా యని చెప్పనవసరం లేదు. ఏ అవతారమూర్తి జీవితాన్నైనా అధ్యయనం చేస్తే ఈ విషయం అవగతమౌతుంది. ఆధునిక యుగ ప్రవక్తయైన శ్రీరామకృష్ణుల జీవితంలో ఈ అంశం ప్రస్ఫుటంగా కానవస్తూన్నదని వివరించ డానికే ఈ పుస్తకంలో ప్రయత్నించాం. ఆయన జీవితం ప్రతి మలుపులోను మనకు శాస్త్రాలపట్ల ఆయన కనబరచిన గౌరవాస్పద వైఖరే తారసపడుతుంది. కాని పాఠకులకు ఈ విషయం స్పష్టం చేయడంలో విఫలులమైతే, కేవలం అది మా పరిమిత మేధస్సు లోటుపాటే; 'ఎన్ని మతాలో, అన్ని మార్గాలు' అన్న మహోన్నత ఆధ్యాత్మిక సత్యావిష్కారులైన శ్రీరామకృష్ణుల పొరపాటు మాత్రం కానేకాదు.

41. అవతారమూ, శాస్త్రాలూ

---

1. బృహదారణ్యకోపనిషత్తు, 2.5

లౌకికుడూ, జిత్తులమారీ అయిన పాశ్చాత్యుడు ఇతర దేశాల సంప్ర దాయాలను, ధార్మిక సంస్థలను విమర్శించే సందర్భంలో ఒక ప్రమాణాన్ని, తమ వాటిని విమర్శించేటప్పుడు ఆ ప్రమాణాన్ని త్రోసివేసి, తమకు సానుకూలమైన ప్రమాణాన్ని అనుసరిస్తాడు. ఈ పాశ్చాత్య ద్వంద్వనీతిని అనుకరిస్తూ మనం వేటిని 'తుచ్ఛమైన కర్తాభజా'ది సంప్రదాయాలని ముఖం చిట్లించుకొంటామో ఆ రహస్య సంప్రదాయాల నుండి మొదలుపెట్టి, అతిశుద్ధమైన 'అద్వైత వేదాంతం' వరకు దైవమానవులైన శ్రీరామకృష్ణుల దృష్టిలో ప్రతి ఒక్క మతం భగవత్సాక్షాత్కారానికి తీసుకువెళ్లే మార్గంగా సముచిత గౌరవస్థానం పొందింది; యోగ్యతానుసారం సాధకులకు బోధింపబడింది.

"మహాశయా! అంత ఉన్నత స్థితికి చెందిన సాధకురాలైన భైరవీ బ్రాహ్మణి కూడా ఐదు మకారాలతో[1] సాధన చేయడం ఎందుకో?" అని, అనుష్ఠానాలపట్ల జుగుప్సతో మేం శ్రీరామకృష్ణులను అనేక సందర్భాలలో ప్రశ్నించాం. "అంత గొప్ప పండితుడూ, భక్తుడూ అయిన వైష్ణవచరణ్ తన సాధన నిమిత్తం పరస్త్రీని నాయికగా పరిగ్రహించడం తప్పుకాదా?" అని కూడా అడిగాం.

మా పై ప్రశ్నలకు శ్రీరామకృష్ణుల జవాబు ఇలా ఉండేది: "వాళ్లు అలా చేయడంలో తప్పు ఏమీ లేదు. అది భగవత్సాక్షాత్కారానికి మార్గం అని నూటికి నూరుపాళ్లు వాళ్లు విశ్వసించేవారు. భగవత్సాక్షాత్కారం కలుగుతుందని హృదయ పూర్వకంగా, చిత్తశుద్ధితో ఎవరు దేనిని విశ్వసిస్తారో దానిని తప్పు అని చెప్పరాదు, నిందించరాదు. ఎందుకంటే ఏ భావాన్ని అయినా కచ్చితంగా అనుసరిస్తే దాని ద్వారా సర్వభావమయుడైన భగవంతుణ్ణే పొందవచ్చు కనుక. ప్రతి ఒక్కరూ తమ భావవైఖరిని అనుసరించే భగవంతుణ్ణే ప్రార్థించాలి. అంతేగాని ఎవరి ఆధ్యాత్మిక భావాన్నీ గర్హించకూడదు, అట్లే ఇతరుల భావాన్ని తమ భావంగా చేసుకోవడానికి ప్రయత్నించనూ కూడదు." అలా అంటూ సదానందమయులైన శ్రీరామ కృష్ణులు అప్పుడప్పుడు ఈ క్రింది పాటను పాడేవారు.

> **ఓ మనసా, నీలోనే ఉండిపో, మరెవరి చోటుకు పోబోకు,**
> **నీ హృదయంలో వెతకితే, కోరుకొన్నదంతా అప్రయత్నంగా లభిస్తుంది**
> **సకల సంపదలకు ఆలవాలమైన ఆ చింతామణి (నీలోనే ఉన్నది), నీ**
> **కోర్కెలన్నిటిని ఈడేరుస్తుంది**

---

1. ఐదు మకారాలు: 1. మత్స్యం, 2. మాంసం, 3. మద్యం, 4. ముద్రా (వేయించిన గింజలు), 5. మైథునం. ఇవి తాంత్రిక వామాచార సాధనకు ఎంతో ముఖ్యం. వీటి కారణంగానే తంత్రాలు భ్రష్టుపట్టాయి.

(ఓ మనసా) ఆ చింతామణి ప్రాంగణాన ఎన్ని రత్నరాశులు పడివున్నవో!
ఓ మనసా, ప్రయాసతోకూడి తీర్థయాత్రాదులు చేయాలని అశాంతి పొందకు
(నువ్వు) మూలాధారం[1]లో ఉన్న త్రివేణి[2]లో ఆనందంగా స్నానమాడి
సేదతీర వెందుకని?
ఓ కమలాకాంతా[3], ఈ ప్రపంచం మిథ్య, ఇంద్రజాలమని తెలుసుకో
లేకపోతున్నావా?
ఈ కుండలోనే[4] విరాజిల్లుతున్న ఆ ఐంద్రజాలకుణ్ణి[5] గుర్తించలేదా!

---

1. షట్చక్రాలలో మొదటిదైన మూలాధార చక్రం, కుండలినీశక్తికి మూలస్థానం.
2. అలహాబాదులోవి గంగా యమునా సరస్వతీ నదుల సంగమస్థానం. ఇక్కడ ఇడా, పింగళ, సుషమ్న ద్వారాలు.
3. ఈ గీత రచయిత, దేవీ భక్తుడు, శక్తిసాధకుడు.
4. మనశ్శరీరాలనే పాత్ర. మనసు, శరీరం+పరమాత్మ = జీవుడు
5. పరమాత్మ. (బాహ్యంగా చేసే తీర్థయాత్రలు, పూజాది కర్మకలాపాలు లోపలవున్న పరమాత్మను తెలుసుకోవడం కోసమే.)

2. గురుభావం - పలు సంప్రదాయ సాధువులు

అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।
ఇతి మత్వా భజన్తే మాం బుధా భావసమన్వితాః ॥ *-గీత, 10.8*

తేషామేవానుకమ్పార్థమహమజ్ఞానజం తమః ।
నాశయామ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥ *-గీత, 10.11*

[సమస్తానికీ నేనే ఉత్పత్తి స్థానాన్ని. సర్వం నాలో నుండే ఉద్భవిస్తున్నది. అది తెలుసుకొని జ్ఞానులు సర్వదా నన్ను పరమ ప్రేమతో ఆరాధిస్తూ ఉంటారు.

వారిపట్ల కరుణ వహించి నేను వారి బుద్ధిలో నెలకొని, వారిలోని అజ్ఞానాంధకారాన్ని సమ్యగ్దర్శన (పరిపూర్ణ సత్య) దీప్తివంతమైన జ్ఞానజ్యోతితో రూపుమాపుతాను.]

1. శ్రీరామకృష్ణులు సాధువులను కలుసుకొన్న తీరు

ఒకసారి శ్రీరామకృష్ణులు మాతో ఇలా చెప్పారు: ''కేశవ సేన్ ఇక్కడకు (తమ వద్దకు) రావడం మొదలుపెట్టిన తరువాత నుండే మీ వంటి 'యంగ్ బెంగాల్'[1] (young Bengal) బృందం ఇక్కడకు రాసాగింది. అంతకు మునుపు ఇక్కడికి ఎందరు సాధువులు, సర్వసంగ పరిత్యాగులైన సన్న్యాసులు, విరాగులు, బాబాజీలు[2] వచ్చేవారో మీకు తెలుసా? రైళ్ల రాకపోకలు మొదలయ్యాక ప్రస్తుతం వారు ఈ వైపు అంతగా

---

1. శ్రీరామకృష్ణులకు తెలిసిన అతికొద్ది ఆంగ్ల పదాలలో ఇది ఒకటి. ఆంగ్లవిద్య నభ్యసించిన వారిని ఆయన చమత్కారంగా 'young Bengal' అని పేర్కొనేవారు.
2. వైష్ణవ సాధువులను 'బాబాజీ'లని పేర్కొంటారు.

రావడం లేదు. కాని అంతకు మునుపు సాధువు లందరూ గంగానది ప్రక్కగా వెళ్లే కాలిబాట మీదుగా స్నానార్థం గంగాసాగరానికి, అట్లే జగన్నాథ దర్శనార్థం పూరీకి పోయేటప్పుడు ఇటువైపుగా వచ్చేవారు. అలా వచ్చినప్పుడు తప్పక రాణీ రాస్మణి ఉద్యానంలో కొన్ని రోజులు బసచేసి, విశ్రాంతి తీసుకొనేవారు. వారిలో కొందరు దీర్ఘకాలమే ఇక్కడ గడిపి, వెళుతూ ఉండేవారు. ఎందుకో తెలుసా? అన్నపానీయాల (భిక్ష), శౌచాదులకు ఏకాంత స్థలాల సదుపాయంలేని చోట సాధువులు తిష్ఠవేయరు. సాధువులు భిక్షాన్నంతో మాత్రమే శరీరాన్ని పోషించు కొంటారు. కాబట్టే అనాయాసంగా భిక్ష లభించే చోట్ల మాత్రమే సామాన్యంగా సాధువులు తిష్ఠవేయడం కద్దు.

"ప్రయాణాలలో అలసిపోయినప్పుడు, ఆ సాధువులు భిక్ష దుర్లభమైన చోట్లకూడా ఒకటి రెండు రోజులు ఆగి, విశ్రమిస్తారు; కాని వారు ఎన్నడూ

2. నీరు, శౌచాదులకు ఏకాంత స్థలాల సదుపాయం ఉన్న చోట్లలోనే సాధువులు విశ్రమిస్తారు

నీరు, ఏకాంత స్థలాలు లభించని చోట్లలో మాత్రం బస చేయరు. అందరూ ఉపయోగించే బహిర్భూములను గాని లేదా తాము ఇతరుల కంటపడే స్థలాలలోగాని ఉత్తమ సాధువులు శౌచాదులు నిర్వర్తించరు. వాటికై సుదూరాన ఉండే ఏకాంత స్థలాలకు పోతారు. సాధువులు చెప్పిన ఒక కథ వినండి:

"ఒక ఫలానా వ్యక్తి సర్వసంగపరిత్యాగం చేసిన సాధువుకై అన్వేషించ సాగాడు. 'చూడు, ఏ సాధువు జనసంచారం నుండి దూరంగా పోయి శౌచాదులు

3. పై విషయం గురించి ఒక కథ

నిర్వర్తించుకొంటాడో, అతడే నిజమైన పరిత్యాగి అని తెలుసుకో' అని ఇతడు వినివున్నాడు. ఈ వ్యక్తి ఈ సంగతి జ్ఞాపకం పెట్టుకొని జనసంచారం లేని స్థలాలలో వెతకసాగాడు. ఇలా ఉండగా ఒక రోజు ఒక సాధువు శౌచాదులు తీర్చుకోవడానికి ఇతరుల కంటే చాలాదూరం వెళ్లడం చూసి, ఈ వ్యక్తి ఆతణ్ణే కాస్తదూరంలో ఉండి అనుసరించసాగాడు. ఈలోపు మరొక సంఘటన జరిగింది. 'నిజమైన యోగి పురుషుణ్ణే వివాహం చేసుకొంటే సుపుత్రుడు జన్మిస్తాడు' అన్న సంగతి ఆ దేశ రాజకుమార్తె విన్నది. ఎందుకంటే యోగి పురుషుల వంశంలోనే సాధువులు జన్మిస్తారని శాస్త్రాలు వచిస్తున్నాయి కనుక. తనకు నచ్చిన వరుణ్ణే వెతకడంకోసం ఈ రాకుమార్తె సాధువులు బస చేసిన చోటుకు వచ్చింది. పైన పేర్కొన్న సాధువును ఎంపిక చేసుకొని, అంతఃపురానికి తిరిగివచ్చి, ఆ సాధువునే వివాహం చేసుకొంటానని తండ్రితో చెప్పింది. రాజుకు కుమార్తె అంటే పంచప్రాణాలు. ఆమె పట్టుపట్ట డంతో రాజు, ఆ సాధువును కలుసుకొని తన కుమార్తెను వివాహమాడమనీ, ఆమెతోపాటు అర్ధరాజ్యంకూడా ధారాదత్తం చేస్తాననీ పరిపరివిధాల ఒప్పించ

డానికి ప్రయత్నించాడు. కాని సాధువు ఈ ప్రలోభాలకు వశం కాలేదు. ఆనాటి రాత్రే ఎవరికీ తెలియకుండా ఎటో వెళ్ళిపోయాడు.

"నిజమైన సాధువుకోసం వెతుకుతూన్న ఆ వ్యక్తి ఈ సాధువు ప్రవర్తన, అతడి అద్భుత పరిత్యాగం చూసి, ఆయనను నిజమైన బ్రహ్మజ్ఞానిగా గుర్తించాడు. వెంటనే ఇతడు వెళ్ళి ఆ సాధువును ఆశ్రయించాడు. సాధువు ఈ వ్యక్తిని స్వీకరించి, ఉపదేశం చేశాడు. ఆయన అనుగ్రహంతో ఈ వ్యక్తి నిజమైన భావ దృష్టిని పొంది, తన జీవిత ధ్యేయాన్ని నెరవేర్చుకొన్నాడు.

"రాణీరాస్మణి ఉద్యానంలో భిక్ష సునాయాసంగా లభించేది. గంగామతల్లి అనుగ్రహంతో నీటికి ఎటువంటి ఎద్దడీ ఉండేది కాదు. సాధువులకు నప్పే

4. దక్షిణేశ్వరానికి సాధువుల రాకకి కారణాలు

ఏకాంత ప్రదేశాలు చుట్టుపట్ల ఉన్నాయికూడా. కాబట్టి ఆ రోజుల్లో సాధువులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఇక్కడ బసచేసేవారు. దక్షిణేశ్వర ఉద్యానంలో లభించే సదుపాయాల గురించిన వార్త ఆ నోటా ఈ నోటా ప్రాకింది; గంగాసాగర్, పూరీ క్షేత్రాలకు తీర్థయాత్రలు చేసే సాధువులకు రాస్మణి ఉద్యానం చక్కని విశ్రాంతి నిచ్చే బసగా క్రమేణా ప్రసిద్ధి కెక్కింది."

శ్రీరామకృష్ణులు మళ్ళీ కొనసాగించారు: "ప్రత్యేక సందర్భాలలో ప్రత్యేక

5. వివిధ సంప్రదాయాల సాధువుల విభిన్న సమయాల్లో రాకడ

వర్గాలకు చెందిన అనేకమంది సాధువులు ఇక్కడ గుమి గూడేవారు. ఒక్కొక్క సమయంలో సన్న్యాసులు, పరమహంసలు - పొట్టకూటి దేశద్రిమ్మరులు కారు - వచ్చేవారు. (తమ గదిని చూపుతూ) రాత్రింబవళ్ళు ఆ గది సాధువులతో నిండిపోయి ఉండేది. బ్రహ్మం, మాయ, అస్తి, భాతి, ప్రియం మొదలైన వేదాంత అంశాల చర్చలో రేయింబవళ్ళు గడిచిపోయేవి."

అస్తి, భాతి, ప్రియం అనే వేదాంత పదాలను శ్రీరామకృష్ణులు ఇలా విశదీకరించేవారు: "ఈ పదాలు వేటిని సూచిస్తాయో మీకు తెలుసా? బ్రహ్మ స్వరూ

6. పరమహంసల వేదాంత విచారణ

పాన్ని. వేదాంతం బ్రహ్మ స్వరూపాన్ని ఇలా అభివర్ణిస్తున్నది: ఏ పరమాత్మ 'అస్తి' స్వరూపుడో, అంటే ఎవరు (సర్వకాలసర్వావస్థలలో ఏ మార్పూ లేకుండా) నిజానికి విద్యమానుడై ఉంటాడో అతడే 'భాతి'; అంటే ప్రకాశిస్తూ లేదా అభివ్యక్తమౌతూ ఉంటాడు. అంటే అభివ్యక్తమవడం జ్ఞానం స్వభావం అన్నమాట. ఏ వస్తువును గురించిన జ్ఞానం మనకు కలుగుతుందో ఆ వస్తువే మనకు అభివ్యక్తమౌతుంది. దేనిని గురించి తెలియదో అది అభివ్యక్తం కాదు. కాదా? కాబట్టే ఏ వస్తువు 'ఉనికి' మనకు తెలియవచ్చిన తక్షణం అది మనకు అభివ్యక్తం కావడం గురించి మనకు

ఎరుక కలుగుతుంది; అంటే దాని జ్ఞానస్వరూపం మనకు అవగతమౌతుంది. వెంటనే అది మనకు 'ప్రియ'మైనదిగా అనిపిస్తుంది. అంటే ఆ వస్తువులో ఉన్న ఆనంద స్వరూపం మన మనస్సులలో 'ప్రియ' భావాన్ని జనింపచేసి, దానిని ప్రేమించాలనే ప్రేరణను మనలో పురిగొల్పుతుంది. ఈ విధంగా దేనిని గురించి అయినా 'అస్తి' (ఇది ఉన్నది) అనే ఎరుక కలుగగానే దాని జ్ఞానస్వరూపం, ఆనంద స్వరూపాన్ని గురించిన ఎరుకకూడా కలుగుతుంది. అంటే 'అస్తి', 'భాతి', 'ప్రియం' - ఈ మూడూ సదా కలిసే అవగతమౌతాయి. కాబట్టే 'అస్తి' అనే భావనతోపాటు 'భాతి', 'ప్రియం' అనే ఎరుక, 'భాతి' అనే భావనతోపాటు 'అస్తి', 'ప్రియం' అనే ఎరుక, అట్లే 'ప్రియం' అనే ఎరుకతో 'అస్తి', 'భాతి' అనే ఎరుక కలుగుతాయని వేదాంతం మనకు బోధిస్తూన్నది.

ఎందుకంటే ఏ బ్రహ్మపదార్థం నుండి ఈ ప్రపంచమూ, ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ, వస్తువూ ఉత్పన్నమైనాయో ఆ బ్రహ్మపదార్థ స్వరూపమే 'అస్తి-భాతి-ప్రియం' కనుక. లేదా దానికే మరో పేరు 'సత్-చిత్-ఆనందం'. కాబట్టే నిజమైన ఆనందం కలిగినప్పుడు (దీనినే భగవత్సాక్షాత్కారం లేదా బ్రహ్మజ్ఞానం అంటారు) నీ మనస్సు అనురక్తి చెందిన ప్రతి వస్తువులోగాని లేదా వ్యక్తిలోగాని భగవంతుని ఉనికి నీకు తెలియవస్తుందని ఉత్తరగీత[1] వచిస్తూన్నది.

''యత్ర యత్ర మనోయాతి తత్ర తత్ర పరం పదం'' - ఎక్కడెక్కడకు మనస్సు పోతుందో అక్కడల్లా భగవంతుడు కనిపిస్తాడు.

రూపరసాది భోగ్యవిషయాలుకూడా ఆనంద స్వరూపుడైన ఆ పరమాత్మని అంశాలు కావడం వలననే మనస్సు వాటి పట్ల ఆకర్షితమౌతుందని వేదాలూ వచిస్తున్నాయి.

''ఇటువంటి విషయాల మీద ఆ సన్న్యాసుల మధ్య తీవ్రంగా చర్చోపచర్చలు జరుగుతూ ఉండేవి. ఆ సమయంలో నేనూ తీవ్ర రక్తగ్రహిణితో బాధపడుతున్నాను. ఎడతెగని విరోచనాలు. గదిలో ఒక మూల హృదయ్ ఒక మట్టి పాత్రను పెట్టాడు. ఒక ప్రక్క అలా రక్తగ్రహిణితో బాధపడుతూనే, మరో ప్రక్క వారి వేదాంత చర్చను వినేవాణ్ణి. ఏ విషయంలోనైనా వారు ఒక నిర్ణయానికి రాలేనప్పుడు (తమ శరీరాన్ని చూపుతూ) దీనిలోనుండి అమ్మ సరళమైన పరిష్కారాలను సూచించేది. ఆ పరిష్కారాలను నేను వారికి చెప్పగానే వారి భేదాభిప్రాయాలు సమసిపోయేవి.

---

1. ఇది మహాభారతం లోనిది.

7. పరమానందంలో మునిగి ఉన్న ఒక సాధువు మహోన్నత అవస్థ

''ఒకప్పుడు ఒక సాధువు ఇక్కడకు వచ్చాడు. ఆయన ముఖం దేదీప్యమానంగా ప్రకాశిస్తూన్నది. ఆయన సదా ఒక చోట కూర్చుని, మందహాసం చేస్తూవుండేవాడు. ఉదయాన ఒకసారి, సాయంత్రం ఒకసారి ఆయన తన గదిలోనుండి బయటకు వచ్చేవాడు. తన చుట్టూవున్న చెట్లను, మొక్కలను, గంగానదిని, ఆకాశాన్ని తేరిపార పరికించేవాడు; తరువాత ఆనందంలో మునకలు వేస్తూ రెండు చేతులూ పైకెత్తి నాట్యం చేసేవాడు. ఒక్కొక్కప్పుడు నేలమీదపడి దొర్లుతూ, పెద్దగా నవ్వుతూ, ''సబాస్! ఎంత అద్భుతమైంది మాయ! ఎంతటి భ్రమ కల్పించబడింది!'' అని అంటూవుండేవాడు. అంటే, భగవంతుడు ఎంతటి అందమైన మాయను ఆవిష్కృతం చేశాడని అర్థం. అదే ఆతడి ఉపాసన. ఆతడు పరమానందానుభూతిని పొందాడు.

''మరొక సందర్భంలో మరో సాధువు ఇక్కడకు వచ్చాడు. ఆతడు జ్ఞానోన్మత్తుడైన సాధువు. అతడు పిశాచంలా కనిపించాడు. అతడు నగ్నంగా ఉన్నాడు.

8. జ్ఞానోన్మత్తుడైన ఒక సాధువును శ్రీరామకృష్ణులు దర్శించడం

ఒళ్లంతా దుమ్మూధూళీ పట్టి ఉంది. పొడవైన గోళ్లు, శిరోజాలు; పీనుగుల మీదనుండి ఏరుకు వచ్చిన చినిగి పేలికలైన బట్టను ఒంటి పైభాగాన ఆచ్ఛాదనగా వేసుకొని ఉన్నాడు. కాళికాలయం ముందు నిలబడి, కాళీప్రతిమను చూస్తూ స్తవం పఠించసాగాడు. ఆతడి స్తవగానానికి ఆలయం యావత్తు కంపించినట్లయింది. అది చూసి అమ్మ ప్రసన్నురాలై నవ్వినట్లుగా అనిపించింది. తరువాత అతడు పేదలు ప్రసాదం పుచ్చుకొనే చోటికి వెళ్లి కూర్చోబోయాడు. ఆ పిశాచాకారాన్ని చూసి తమతో కూర్చోనివ్వకుండా వారు అతణ్ణి అక్కడ నుండి తరిమివేశారు. తదనంతరం ఎంగిలాకులు పారవేసే చోట కూర్చుని కుక్కలతోపాటు ఆ ఎంగిలాకులలో మిగిలిన ఆహారాన్ని పంచుకొని తింటూ ఆతడు కనిపించాడు. ఒక కుక్క మెడ చుట్టూ చేయి వేసి, ఒకే ఎంగిలాకు నుండి ఆతడూ, ఆ కుక్కా కలిసి తినసాగారు. అపరిచిత వ్యక్తి ఎవరో తన మెడమీద చేతులు వేసినప్పటికీ ఆ కుక్క మొరగలేదు, పారిపోవడానికీ ప్రయత్నించలేదు. చివరకు నాక్కూడా అదే గతిపట్టి ఆతడిలా తిరుగాడ వలసివస్తుందేమోనని ఆ దృశ్యం చూసి భయపడ్డాను.

''ఇదంతా చూసి నేను గబాగబా హృదయ్ వద్దకొచ్చి, 'హృదూ! అతడిది సామాన్యమైన పిచ్చితనం కాదు; అది దివ్యోన్మాదం' అని చెప్పాను. నా మాటలు విని హృదయ్ అతణ్ణి చూడడానికి పరిగెత్తాడు. అప్పటికే ఆ సాధువు ఉద్యానం దాటి వెళ్లిపోతున్నాడు. హృదయ్ ఆతణ్ణి చాలాదూరం వరకు వెంబడించి,

'మహరాజ్, భగవత్సాక్షాత్కారం పొందే ఉపదేశం కాస్త సెలవియ్యండి' అని ప్రార్థించాడు. మొదట అతడేమీ బదులు పలుకలేదు. కాని హృదయ్ తనను వదలిపెట్టకుండా వెంబడించి రావడం గమనించి, కాలిబాట ప్రక్కన పారుతున్న మురికి కాలువ నీటిని చూపుతూ, 'ఈ మురికి నీరూ, ఆ గంగాజలమూ సమానంగా పవిత్రమైనవనే జ్ఞానం నీలో ఎప్పుడు జనిస్తుందో అప్పుడు భగవదనుభూతి పొందగలవు' అని చెప్పాడు. అంతే, ఇంకేమీ చెప్పలేదు. అయినా హృదయ్ ఇంకా ఆతడి నుండి వినాలని ప్రయత్నించాడు. 'మహరాజ్! నన్ను మీ శిష్యుణ్ణిగా స్వీకరించి, మీ వెంట తోడ్కొని వెళ్లండి' అని అడిగాడు. అందుకు ఆ సాధువు బదులేమీ చెప్పలేదు. అతడు మరికొంత దూరం వెళ్లి వెనక్కి తిరిగి చూడగా, హృదయ్ ఇంకా వెంబడిస్తూ రావడం కంటబడింది. వెంటనే కళ్లెర్ర చేసుకొని, ఇటుక ముక్కను పుచ్చుకొని విసరబోయినట్లు బెదిరించాడు. దాంతో హృదయ్ వెనుదిరిగి పారిపోయాడు. అలా హృదయ్ పారిపోగానే ఆ సాధువు ఇటుక ముక్కను క్రిందపడేసి, బాటను విడిచి మెల్లగా జారుకున్నాడు. మళ్లీ ఆ సాధువు కనిపించలేదు. లోకుల సతాయింపుల నుండి తప్పించుకోవడానికి అటువంటి సాధువులు మారురూపంలో అలా సంచరిస్తూ ఉంటారు. ఈ సాధువు నిజమైన పరమహంస స్థితిలో ఉన్నాడు. నిజమైన పరమహంసలు పిల్లలలా, పిశాచాలలా, పిచ్చివారిలా లోకంలో వ్యవహరిస్తూ ఉంటారని శాస్త్రాలు వచిస్తున్నాయి. అందుకే పరమహంసవరేణ్యులు తమ చుట్టూ కొందరు పిల్లలను చేరదీసి, ఆ పిల్లలతో ఆడుకొంటూ వారిలా వర్తించడం నేర్చుకొంటారు. పిల్లలకు దేనిపట్లా అనురక్తి ఉండని విధంగా వీరూ ప్రతి దానిపట్లా అనురక్తిని కల్పించుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. తల్లి కొత్త బట్ట తొడిగినప్పుడు పిల్లవాడు ఎంత సంతోషిస్తాడో నువ్వు చూడలేదా? 'ఆ బట్టను నా కివ్వవూ?' అని నువ్వు కనుక అడిగితే, వెంటనే అతడు, 'ఉహూ, నే నివ్వను. అమ్మ నా కిచ్చింది' అని ఠక్కున జవాబిస్తాడు. ఇలా జవాబిచ్చి, బహుశా నువ్వు లాగివేస్తావేమో అనుకొని ఆ బట్టను గట్టిగా పట్టుకొని, భీతితో నీ వంకే చూస్తూవుంటాడు. ఆ బట్టనే తన ఆరవ ప్రాణంగా చూసుకొంటాడు. కాని ఆ తరువాత చిల్లిగవ్వ ఖరీదు చేసే బొమ్మ నీ చేతిలో ఉండడం చూసి, 'దాన్ని నా కివ్వు, ఈ బట్టను నీ కిస్తాను' అని అంటాడు. కాసేపయ్యాక బహుశా ఆ బొమ్మను విసిరివేసి ఒక పువ్వుకోసం పరుగెత్తుతాడు. బట్టపట్ల అతడికెంత తక్కువ అనురక్తి ఉందో బొమ్మ పట్లకూడా అంతే అనురక్తి ఉంది. బ్రహ్మజ్ఞానుల విషయం కూడా అంతే.

9. గంగాజలం, మురికి కాలువ నీటి మధ్య విభేదం బ్రహ్మజ్ఞానికి కానరాదు

"ఆ విధంగా కొంతకాలం జరిగింది. పరమహంసల రాక తగ్గిపోసాగింది. వారి స్థానే తీవ్ర వైరాగ్యవంతులు, శ్రద్ధాళువులూ, అనాసక్తిపరులూ అయిన రామావత్ బాబాజీలు[1] (శ్రీరాముణ్ణి ఆరాధించే సాధువులు) పలువురు రాసాగారు. ఆహ్, వారి భక్తివిశ్వాసాలు ఎంత మహోన్నతం! భగవత్సేవలో ఎంతటి నిష్ఠాగరిష్ఠులు! అటువంటి రామావత్ సాధువులలో ఒకరి నుండి రాంలాలా[2] నా వద్దకు వచ్చి ఉండిపోయాడు. అదొక పెద్ద కథ.

10. రామావత్ సాధువు దక్షిణేశ్వరానికి రావడం

"ఆ బాబాజీ రాంలాలా విగ్రహాన్ని చాలాకాలం నుండి ఆరాధిస్తూన్నాడు. ఎక్కడకు వెళ్ళినా తనతోపాటు తీసుకొని వెళ్లేవాడు. భిక్ష ద్వారా లభించిన ఆహారాన్ని వండి రాంలాలాకు నైవేద్యంగా అర్పించేవాడు. అంతే కాదు. నిజంగా రాంలాలా ఆరగించడం లేదా ఏదైనా తింటానని మారాంచేయడం, షికార్లు చేసిరావాలని కోరడం, అల్లరి చేయడం మొదలైనవన్నీ ఆ సాధువు ప్రత్యక్షంగా దర్శించేవాడు. ఆ రాంలాలా సాహచర్యంలో ఆతడు సదా ఆనందపారవశ్యమత్తతలో ఉండేవాడు. రాంలాలా అవన్నీ చేయడం నేనుకూడా చూశాను. ఇరవై నాలుగు గంటల సేపూ బాబాజీ వద్ద కూర్చుని, రాంలాలాను తదేకంగా చూస్తూవుండే వాణ్ణి.

11. రాంలాలా వృత్తాంతం

"రోజులు గడిచేకొద్దీ, రాంలాలాకు నా పట్ల ప్రేమ అధికరించసాగింది. నేను బాబాజీ వద్ద కూర్చునివున్నంతసేపూ రాంలాలా ఆడుతూ, పాడుతూ ఆనందంగా అక్కడే ఉండేవాడు. కాని నేను నా గదికి బయలుదేరగానే నన్ను వెంబడించేవాడు. రావద్దని ఎంత కట్టడిచేసినా వినేవాడు కాదు. మొదట్లో ఇదంతా ఏదో నా మతిభ్రమ అనుకొనేవాణ్ణి. అంతగా తనను ప్రేమిస్తూ, ఎంతో కాలం నుండి ఆరాధిస్తూ సేవిస్తూవున్న బాబాజీ కంటే ఎక్కువగా నన్ను ప్రేమిస్తున్నాడా? అసంభవం! కాని అలా అనుకొన్నా ఏం ప్రయోజనం? యథార్థంగా, నా ముందున్న మిమ్మల్ని చూసినట్లే - నా ముందు, నన్ను అనుసరిస్తూ నృత్యం చేస్తూ రావడం చూసేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు చంకన ఎత్తుకోమని మారాంచేసేవాడు. మరొకప్పుడు ఒళ్లో కూర్చోబెట్టుకొంటే, స్థిమితంగా అక్కడ కూర్చుని ఉండేవాడు కాదు. అక్కడికీ ఇక్కడికీ పరుగెత్తేవాడు, ముళ్లకంచెలలోకి పోయి పువ్వులు కోసేవాడు, లేదా గంగానదిలో దూకి ఈదుతూ, నీటిని ఎగజిమ్మేవాడు.

---

1. బాబా అంటే తండ్రి. ఉత్తర భారతదేశంలో వైష్ణవ సాధువులను 'బాబా' అని పేర్కొనడం పరిపాటి. 'జీ' అనే అక్షరం గౌరవసూచకం, తెలుగులో 'గారు'కు సమానార్థం.
2. 'లాలా' అనే పదం పసిబిడ్డను సూచిస్తుంది. రాంలాలా అంటే బాలరాముడని అర్థం.

నేను పదేపదే, 'నాయనా! అలా చేయవద్దు. ఎండలో తిరిగితే కాళ్లు బొబ్బలెక్కుతాయి. ఎక్కువసేపు నీళ్లలో నానితే జలుబుచేసి జ్వరం వస్తుంది' అని చెప్పేవాడిని. ఎంత చెప్పినా వినిపించుకొనేవాడు కాడు. మరెవరికో నేను చెబుతున్నట్లు అసలు పట్టించుకొనేవాడు కాడు. పద్మపత్రాలవంటి తన అందమైన కళ్లను విప్పి నా వంకే చూస్తూ ఇకిలించేవాడు; నన్ను విసిగించాలని మరింత అల్లరిపనులు చేసేవాడు. మూతిముడుచుకొని నన్ను వెక్కిరించేవాడు. నా కప్పుడు నిజంగా కోపం ముంచుకొచ్చేది. 'వెధవా, ఉండు, ఈ రోజు బడితెపూజ చేస్తాను' అని తిట్టేవాణ్ణి. ఇలా కేకలేసి ఎండలోనుండో లేదా నీళ్లనుండో ఇవతలకు లాక్కొచ్చి అదీ ఇదీ ఇచ్చి బుజ్జగించి గదిలోనే ఆడుకొనేలా చేసేవాణ్ణి. అతడి చిలిపిచేష్టలు మితిమీరినప్పుడు ఒకటి రెండు వడ్డించేవాణ్ణి. దెబ్బలు తిన్నప్పుడు అతడి అందమైన పెదవులు కంపించేవి; ఏడుస్తూ నా వైపే చూస్తూవుండేవాడు. అతడు ఏడవడం చూసి నే నెంతో బాధపడేవాణ్ణి. వెంటనే ఆప్యాయంగా ఒళ్లోకి తీసుకొని, బుజ్జగించేవాణ్ణి. ఇవన్నీ నిజంగానే జరిగాయి.

''ఒక రోజు స్నానం చేయడానికి నేను వెళుతూవుంటే, నాతోపాటు వస్తానని పట్టుపట్టాడు రాంలాలా. చేసేదిలేక నాతోకూడా తీసుకువెళ్లాను. కాని ఎంతసేపటికీ నీళ్లనుండి బయటకు రాడే! ఎంత చెప్పినా వినిపించుకోడు. చివరికి నాకు కోపం వచ్చింది. అతణ్ణి నీళ్లలో ముంచి, 'ఇష్టం వచ్చినంతసేపు నీళ్లలో ఉండు' అని అన్నాను. అప్పుడతడు నిజంగానే ఊపిరాడక గిలగిలకొట్టుకోవడం చూసి, నేను చేసిన పనికి పశ్చాత్తాపం చెంది, నీళ్లనుండి బయటకు తీసి ఎత్తుకొన్నాను.

''మరో సందర్భంలో అతడికోసం ఎంత బాధపడి విలపించానో చెప్పలేను. ఆ రోజు ఏదో తినాలని రాంలాలా మొండికేశాడు; పొట్టుతీయని అటుకులు ఇచ్చాను. ఆ అటుకులు తిని రాంలాలా నాలుక గీరుకుపోయింది. అది చూసి నేను పడిన బాధ ఇంతింత కాదు. వెంటనే అతణ్ణి నా ఒళ్లోకి తీసుకొని, అతడి చుబుకాన్ని పుచ్చుకొని, 'అయ్యో, ఎంత అనాలోచితంగా, మూర్ఖంగా ప్రవర్తించాను! తల్లి కౌసల్య వెన్నమీగడలను పెట్టిన నీ నోట్లో ఈ మోటు పదార్థాన్ని పెట్టానుగదా తండ్రీ!' అని బిగ్గరగా ఏడుస్తూ చెప్పాను.'' ఎన్నడో జరిగిపోయిన ఆ సంఘటన గురించి మాతో చెబుతూ ఉంటే శ్రీరామకృష్ణులలో గతశోకం పెల్లుబికింది. మా సమక్షంలో ఆయన భోరున ఏడ్చేశారు. రాంలాలాతో ఆయనకు ఏర్పడిన ఆప్యాయానురాగాల బంధం మాకు కించిత్తుకూడా అవగతం కాకపోయినా, ఆయన పట్ల సానుభూతితో మా కళ్లు చెమర్చకుండా ఉండలేకపోయాయి.

మాయాపాశంలో కట్టువడిపోయిన అల్పజీవులమైన మేం రాంలాలాను గురించి విని స్తబ్ధులమయ్యాం. భక్తిపూర్వక భీతితో ఏమైనా (ఆతడి లీలలు) కనపడతాయేమోనని రాంలాలా ప్రతిమ వైపు ఆశాజనకంగా చూశాము. ఒట్టి లోహం తప్ప మా కేమీ కనిపించలేదు. ఎలా కనిపిస్తుంది? రాంలాలా పట్ల ప్రేమాకర్షణ ఆ మేరకు మాకు లేదే! శ్రీరామకృష్ణులలా శ్రీరామచంద్రుని పట్ల ప్రేమ మాలో తీవ్రమై మా ప్రేమ నేత్రాలు విప్పారినప్పుడే కదా అంతరంగంలోనూ, బాహ్యంలోనూ సజీవుడైన రాంలాలాను చూడగలిగేది? భక్తిహీనులమైన మాకు కనిపించింది ఒక చిన్న ప్రతిమ మాత్రమే. దానిని చూసి 'శ్రీరామకృష్ణులు చెప్పిన సంఘటనలు నిజంగా జరిగాయా? అలా జరగడం సంభవమేనా?' అనే ఆలోచనలే తలెత్తుతాయి. ఆధ్యాత్మికపరమైన ప్రతి విషయంలోనూ మనకు ఇటువంటి సంశయమే ఎదురౌతుంది; దేనినీ విశ్వసించం. సంశయమనే భారాన్ని నెత్తిమీద పెట్టుకొని చతికిలబడతాం.

12. రాంలాలా ఉదంతం పట్ల మేం స్పందించిన తీరు

'సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన' - అంటే '(ఓ మానవులారా!) ఈ ప్రపంచంలో ఒక్క సచ్చిదానంద బ్రహ్మ వస్తువు తప్ప మరేదీ లేదు; మీకు కనిపించే నానావస్తువులలో, నానా వ్యక్తులలో దేనిలో కూడా సత్యత్వమన్నదే లేదు. ఉన్నదంతా ఒక్క భగవంతుడు మాత్రమే' అని బ్రహ్మజ్ఞులైన ఋషులు వచించడం నీకు తెలియదా? ఋషుల పై వచనాలు విని బహుశ అది నిజమేనేమో అనే సంశయం మెరుపుతీగలా మెరిసి మళ్లీ మాయమైపోతుంది.

ఎందుకంటే వారి వచనాలు ఆలకించి ప్రపంచాన్ని పరికించి చూస్తే వారు వచించే ఆ ఏకమేవా ద్వితీయం అనబడే బ్రహ్మవస్తువు నీడ అయినా ఎంత వెతికినా అసలు మనకు కానరాదు. ఒట్టి కర్ర, మన్ను, ఇళ్లు, వాకిళ్లు, మనుష్యులు, పశువులు - ఇలా వివిధ రంగుల, ఆకృతుల నానాత్వం మాత్రమే మనకు కనిపిస్తుంది. మహా అయితే అనంత తారకామండలోద్దీప్తమైన వినిర్మల నీలాకాశం, లేదా ఆ నీలాకాశాన్ని చుంబింప ప్రయత్నిస్తూవున్నట్లున్న మంచుతో కప్పబడ్డ పర్వత శిఖరాలు; లేకుంటే 'అంత గర్వం తగదు సుమా' అని వాటిని హెచ్చరిస్తూన్నట్లు మర్మమర్మ సవ్వడితో వడివడిగా ప్రవహించే నిర్మలమైన సెలయేళ్లు; లేదా ప్రచండ శక్తితో ఆకాశాన్నంటే ఉత్తుంగ తరంగాలతో పైకెగసి అంతటినీ మింగివేయాలనే ఆశతో ముందుకు ఉరుకుతూ ఎంత ప్రయత్నించినా చెలియలి కట్టను అతిక్రమించలేని సముద్రాలను - మహా అయితే ప్రకృతి అందించే ఈ సౌందర్యాలను మాత్రమే మనం తిలకించగలం. వీటిని చూసి, 'ఈ ఋషులు ఏమైనా మత్తు ప్రభావంలో చూస్తూవున్న ప్రతిదీ బ్రహ్మమని చెప్పలేదు కదా!'

అని భావిస్తాం. మనం అలా సంశయించడం గమనించి, 'నాయనలారా, మేం చెబుతున్నది నిజమే. ఆత్మసంయమాన్ని, పావనత్వాన్ని సంతరించుకోండి. మనస్సును ఏకాగ్రమూ, ప్రశాంతమూ చేసుకోండి. అప్పుడు మేం చెప్పింది అవగతం చేసుకోగలుగుతారు. నీ ఆలోచనల అభివ్యక్తీకరణే ఈ ప్రపంచమన్న నిజం నువ్వప్పుడు గ్రహించ గలుగుతావు. నీ మనస్సులో 'నానాత్వం' ఉండడం వల్లనే బాహ్యంలో కూడా నీకు నానాత్వం కనిపిస్తున్నది' అని ఋషులు సమాధానం చెప్పవచ్చు.

అందుకు మనం ఇలా స్పందిస్తాం: ''స్వామీ! బతుకుతెరువు సముపార్జించుకోవడంతోనే, ఇంద్రియాల నిరంకుశత్వంతోనే మేం సతమతమౌతున్నాం. మీరు చెబుతున్న అనుష్ఠానాలు పాటించడంలో ఇక మాకు తీరిక ఎక్కడ ఉంటుంది?'' లేదా ఇలా అంటాము: ''మీరు పేర్కొనే ఆ బ్రహ్మాన్ని సాక్షాత్కారం చేసుకోవాలంటే నిర్వర్తించవలసిన మీరిచ్చిన విధుల జాబితాను కొన్ని రోజుల్లో లేదా కొన్ని నెలల్లో లేదా కొన్ని సంవత్సరాలలో పూర్తిచేయడం జరిగే పనికాదు. ఒక జీవిత కాలంలో సైతం పూర్తిచేయగలగడం సందేహమే. మీరు ఉపదేశించినట్లు మా మనస్సులను కేంద్రీకరించి ప్రయత్నించినప్పటికీ ఆ బ్రహ్మాన్ని పొందడంలో విఫలులమైతే, చిట్ట చివరకు ఆ అనంత ఆనందానుభూతి సముపార్జన కేవలం అభూతకల్పనగా మిగిలిపోతుంది. రెంటికీ చెడ్డ రేవడి పరిస్థితిలో పడతాం. ఇహపరాలను రెంటినీ కోల్పోతాం. ఇటు తాత్కాలికమైనవే అయిన లౌకిక సుఖాలనూ అటు ఆ పరమానందాన్నీ చవిచూడలేం. అప్పుడు మా గతి ఏమిటి? వద్దు స్వామీ, వద్దు. ఆ అనంత ఆనందాన్ని చవిచూసే భాగ్యం మీకు కలిగితే మంచిది; మీ శిష్యప్రశిష్యులతో సహా దాన్ని అనుభవిస్తూ ఉండండి. రూపరసాదులనుండి కళ్లెదుట మాకు అందుతున్న ఈ సుఖాన్నే మమ్మల్ని అనుభవించనివ్వండి. పైకి సబబుగా తోచే తర్కవాదాలు చేసి మేం అనుభవిస్తున్న ఆ కించిత్తు సుఖాన్నీ చెడగొట్టకండి.''

విజ్ఞాన శాస్త్రవేత్త ముందుకొచ్చి మనతో ఇలా అంటాడు: ''ఈ ప్రపంచంలోని పదార్థా లన్నిటిలో - ఇటుకలు, చెట్లు, మొక్కలు, మనుష్యులు, పశువులు - ఇలా ప్రతి ఒక్క దాన్లో సర్వత్రా వ్యాప్తమైన ఒకే ఒక్క చైతన్య శక్తి ఈ నానావస్తువులుగా, వ్యక్తులుగా అభివ్యక్తమౌతూన్నదని, నేను నీకు ఆధునిక పరికరాల సహాయంతో ఋజువు చేసి చూపించగలను.'' ఆ వస్తువులన్నిటిలోను జీవం స్పందిస్తూ ఉండడం మనకు కూడా కానవస్తుంది. ఆ శాస్త్రవేత్తకు మా జవాబు: ''సెబాస్! నీ మేధస్సు పరిధి విస్తృతమైనదే! కాని కేవలం

13. సుఖాలను అధికరిస్తుంది కాబట్టే మనం ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని ప్రశంసిస్తాం

ఆ జ్ఞానం మాత్రమే ఉన్నందున ప్రయోజనం ఏమిటి? దాదాపు ఈ విషయాన్నే శాస్త్రకర్తలైన మా ఋషులు ఏనాడో చెప్పివున్నారు.[1] ప్రయోగాల ద్వారా ఆ విషయాన్ని నిరూపించి నువ్విప్పుడు చూపించావని అంగీకరిస్తాం. కాని ఇది మా రూపరసాది సుఖభోగాలను పెంపొందిస్తుందని నువ్వు చెప్పగలవా? అప్పుడే నీ వివేకాన్ని మెచ్చుకోగలుగుతాం.'' అందుకు ఆ విజ్ఞానవేత్త బహుశా ఇలా జవాబివ్వవచ్చు: ''ఎందుకు కాదు? తప్పకుండా పెంపొందిస్తుంది. ఇలా చూడండి, విద్యుచ్ఛక్తి కనిపెట్టడంతో ప్రపంచం నలుమూలల నుండి వార్తలు తెలుసుకోవడం ఎంత సులువైనదో మీకు కనిపించడం లేదా? అలాగే ఆవిరిశక్తి కనుగొనడం వలన, ఆ శక్తితో నడిచే రైళ్లు, ఓడలు, యంత్రాలు, కర్మాగారాలు మొదలైన వాటి ద్వారా నీ సమస్త సుఖాలకూ మూలకారణమైన ధనాన్ని ఆర్జించడం నీ కెంత సులభమైందో చూడు; అలాగే (తుపాకీ మందులాంటి) పేలుడు పదార్థాల రహస్యాలను ఆవిష్కరించుకొని, తుపాకులను, ఫిరంగులను తయారుచేసి వాటి ద్వారా నీ సుఖభోగాలకు అడ్డుపడే శత్రువులను పరిమార్చడం నీ కెంత సులభతరమైనదో గుర్తించలేదా? విజ్ఞానశాస్త్రం ద్వారా నేడు నీకు పరిచితమైన ఈ సర్వవ్యాపకమైన శక్తి భవిష్యత్తులో సత్ప్రయోజనాలకు నీకు తప్పక వినియోగపడుతుంది.'' ఆ సమాధానంతో సంతృప్తి చెందక మనం ఇలా అడుగుతాం: ''మంచిది. ఒక రకంగా నీ జవాబు సబబుగానే ఉంది. కాని సాధ్యమైనంత త్వరలో మా సుఖభోగాలకు పరాకాష్ఠయైన దానిని సృష్టించి ఇవ్వు. నువ్వు నూతనంగా ఆవిష్కరించిన శక్తి మరింత మా సుఖభోగాల పులకరింతకు దోహదం చేస్తుందా? అప్పుడు మాత్రమే నీ నూతనావిష్కరణ అభినందనీయమూ, నీ మేధస్సు ప్రశంసనీయమూ అవుతుంది. అప్పుడు మాత్రమే వేదపురాణాదుల కర్తలైన ఋషులలా మత్తు ప్రభావంలో నువ్వు పలకడం లేదని ఒప్పుకొంటాం.'' విజ్ఞానశాస్త్రవేత్త విని, మా ఆలోచనా సరళిని గ్రహించి, 'తథాస్తు' అని అంటాడు.

వేదాలలోని పరబ్రహ్మ జ్ఞానాన్ని ప్రచారం చేసిన ఋషులు మాత్రం (విజ్ఞాన శాస్త్రవేత్తలలా భోగలాలసుల ఒత్తిడికి తల ఒగ్గి) 'తథాస్తు' అని చెప్పలేకపోయారు. కాబట్టే లౌకిక కోలాహలానికి సుదూరంగా పోయి దుర్గమారణ్యాలలో వాసంచేస్తూ, సంసార సుఖాలపట్ల విరక్తి చెందిన ఏ కొద్ది

---

1. ''అంతఃసంజ్ఞా భవంత్యేతే సుఖదుఃఖ సమన్వితాః'' (అంటే రాళ్లు రప్పలవంటి జడపదార్థాలలో కూడా చైతన్యం నిహితంగా ఉంది. అందువలనే అవి సుఖదుఃఖాలను అనుభవిస్తూ ఉన్నాయి.

మంది సాహచర్యంలో సంతృప్తి పడవలసివచ్చింది వారికి. భారతీయ ఆధ్యాత్మిక జగత్తులో పై రీతిలో 'తథాస్తు' అని ప్రాపంచికులకు తల ఒగ్గే ప్రయత్నం ఎక్కడా, ఏనాడూ చేసినట్లు కానరావడం లేదు. బౌద్ధయుగం చరమ దశలో జరిగిన దానిని కొంచెం జ్ఞాపకం తెచ్చుకో. ఆ సమయంలో తాంత్రిక కాపాలికుల ప్రభావం కొన్నిచోట్ల బాగా వ్యాపించింది. వీరప్పుడు మారణం, ఉచ్చాటనం, వశీకరణం[1] మొదలైన ప్రక్రియలను ప్రచారం చేయసాగారు. అలాగే శాంతి, స్వస్త్యయనాదుల[2] ద్వారా శారీరక, మానసిక రుగ్మతలను నివారించి తిరిగి ఆరోగ్యవంతులను చేయడం; అట్లే భూతప్రేతాదులను వదలగొట్టే ప్రయోగాలు; ఇవి బహుళ ప్రాచుర్యం పొందాయి. అలాగే కఠోర తపస్సుచేసి ఏదో ఒక అలౌకిక శక్తిని సముపార్జించి ప్రదర్శించకపోతే, తన అనుయాయుల విజయానికీ, సుఖాలకూ తానే కీలకం అనే అభిప్రాయాన్ని వారిలో పాదుకొల్పకపోతే ఆ రోజుల్లో ఎవరినీ ఆధ్యాత్మిక గురువుగా పరిగణించేవారే కారు. ఒక్కసారి అటువంటి పతన కాలపు సంగతులను జ్ఞాపకం తెచ్చుకో. ప్రాపంచికుల సుఖభోగాలకు తోడ్పడే శక్తి, సుఖభోగాలను మరింత అధికరించే శక్తి ఆధ్యాత్మిక సత్యాలలో నిహితమై ఉంది (అంటే ఆధ్యాత్మికత కేవలం యోగానికే కాక భోగానికికూడా తోడ్పడగలదు) అని ఆ పతనావస్థలో ప్రచారం చేయబడింది.

14. కాపాలికుల ఉద్భేధ: యోగ భోగాల సహ అస్తిత్వం అసంభవం

అయినా ఏం ప్రయోజనం? ప్రచారం చేసినంత మాత్రాన సత్యం ఎన్నడూన్నా అసత్యమౌతుందా? వెలుగు చీకట్లు ఏకకాలంలో ఉండడం సంభవిస్తుందా? యోగం భోగం కలిసి ఉండడం సంభవమా? ఈ సరళ సత్యాన్ని అవగతం చేసుకోలేకపోయారు తాంత్రిక కాపాలికులు. భోగాలను యోగంతో మిళితం చేసే తమ ప్రయత్నంలో అనతికాలంలోనే పతితులై, యోగభ్రష్టులై, భోగం అనే వలలో చిక్కువడి, సంసార బంధాన్ని తొలగించే మతం పేరిట మనిషిని మరింత బంధనంలో తగుల్కొనేలా చేసే భోగవాసనలను గోప్యంగా ఆ కాపాలికలు ప్రచారం చేయసాగారు.

---

1. మారణం అంటే చంపడం; ఉచ్చాటనం అంటే మంత్ర ప్రయోగంతో శత్రువులను నాశనం చేయడం లేదా వారిని పిచ్చివారిలా చేయడం ఇత్యాదులు. వశీకరణం అంటే ఇతరుల మనస్సులను తన వశంలోకి తెచ్చుకొని తన ఇచ్ఛమేరకు వారిచే ప్రవర్తింపచేయడం.

2. శాంతి = దయ్యాల, భూతప్రేత పిశాచాదుల, దుష్టగ్రహాదుల వలన కలిగే ఉపద్రవాల బారినుండి తప్పించుకోవడానికి చేసే క్రియలు; స్వస్త్యయనం = రుగ్మతలను పోగొట్టి ఆరోగ్యం కలిగించే క్రియలు. మంత్రాల, తంత్రాల, చక్రాల పూజలు మొదలైన వాటి ద్వారా ఈ క్రియలు జరిపిస్తారు. ఎక్కువగా పురోహితులే ఇవన్నీ జరుపుతారు.

కాని వీరి ప్రయత్నాలు వివేకవంతులను మోసగించలేకపోయాయి. పరస్పర విరుద్ధాలైన యోగం, భోగం ఒకే చోట, ఏకకాలంలో కలసి ఉండడం ఎన్నటికీ పొసగదనే విషయం నిజమైన ధార్మిక చింతనాపరులు స్పష్టంగా అవగాహన చేసుకొన్నారు. అలా అవగతం చేసుకొని వారు మళ్లీ మన ఋషులు, మునులు ఉపదేశించిన జ్ఞానమార్గాన్ని అవలంబించి, ఆ జ్ఞానానుభూతిని తమ జీవితాలలో పొందగోరారు.

లౌకికుల అభిప్రాయాలతో ఏకీభవించి, వారి 'తథాస్తు' (అంటే ఫరవా లేదు, యోగం భోగం రెండూ సరేలే) తత్త్వాన్ని మేం ఎలా అంగీకరించగలం?

15. పరిత్యాగ ప్రభావాన్ని చూసి లౌకికులు భీతి చెందడం

ఎందుకంటే మేం చెబుతూన్న కథ శ్రీరామకృష్ణుల గురించిందాయె! ఆయన ఈ లోకానికి చెందిన వారు కాదాయె! గాఢనిద్రలో సైతం లోహ స్పర్శమాత్రాన ఆయన చేయి కొంకర్లు పోయేటంత పరిత్యాగ భావం ఆయనలో ప్రగాఢంగా పాదుకుపోయింది. ఆ సమయంలో శరీరంలో ఏదో గుచ్చుకొన్నంత బాధ కలిగి, ఆయన శ్వాసక్రియ స్తంభించిపోవడం కద్దు. ఏ స్త్రీమూర్తి కంటబడినా ఆమె జగజ్జనని ప్రతిరూపం అనే భావం ఆయనలో ఆ క్షణమే తళుక్కున మెరిసేది; ఎంతటి దురాకర్షణ సైతం ఆ భావాన్ని కించిత్తూ మార్చలేకపోయేదంటే అతిశయోక్తి కాదు. వేలాది రూపాయలు విలువచేసే ఆస్తిని ఒకప్పుడు మథుర్‌బాబు ఆయన పేరిట వ్రాసి ఇవ్వగోరాడు. ఆ ప్రతిపాదనను మథుర్ వ్యక్తం చేసీచేయగానే శ్రీరామకృష్ణులు ఎంతో క్షోభించి, అగ్గిమీద గుగ్గిలమై తన పట్ల అమిత భక్తి ప్రపత్తులుగల మథుర్‌ను కర్రపుచ్చుకొని కొట్టబోయారు. మరొక సందర్భంలో లక్ష్మీనారాయణ్ అనే మార్వాడీ భక్తుడు శ్రీరామకృష్ణులకు పదివేల రూపాయలు ఇవ్వగోరాడు. కాలాంతరంలో తమ శిష్యులకు ఆ సంఘటన గురించి చెబుతూ, తీవ్ర ఉద్వేగంతో తామెంత బాధపడ్డారో వివరిస్తూ, "నా తలను ఎవరో రంపంతో కోస్తూన్నంతగా బాధపడ్డాను" అని చెప్పారు. రూపరసాది ఏ ప్రాపంచిక సుఖాలూ ఎన్నడూ ఆయనను ఆకర్షించలేకపోయాయి, సమాధ్యవస్థలో కలిగే అతీంద్రియానందానుభవానికి అంతరాయం కలిగించలేకపోయాయి. అటువంటి అద్భుత త్యాగవైరాగ్యాలకు ప్రతిరూపులైన శ్రీరామకృష్ణుల కథను చెప్ప పూనుకొన్న మేం అనేక దుర్భాషలకు, విమర్శలకు గురికావలసి వస్తుందని, సుఖభోగాలకు అర్రులు చాచే ఓ సంసారీ, మాకు ముందే తెలుసు.

అంతే కాదు. మీ కుమారులలో, మనుమలలో, మిత్రులలో లేదా బంధువులలో ఎవరైనా ఆ అద్భుతమూర్తి గురించి మేం చెప్పిన విషయాలు విని, ప్రభావితులై భోగసుఖాలకు తిలోదకాలిచ్చి సంసార పరిత్యాగం చేయనున్నప్పుడు

ఆ పవిత్రమూర్తి పట్ల అపనింద వేయడానికి మీరు ఏమాత్రం సంకోచించరనీ మాకు బాగా తెలుసు.

శ్రీరామకృష్ణుల దివ్యచరితాన్ని తెలుప పూనుకొన్న మాకు ఆ ప్రయత్నాన్ని విరమించడంగాని లేదా సత్యాన్ని పాక్షికంగా దాచిపెట్టడంగాని సాధ్యం కాదు. మాకు తెలిసినంత వరకు ఉన్నది ఉన్నట్టు చెప్పక తప్పదు. లేకపోతే మా మనస్సులు శాంతించవు. ఎందుకంటే ఎవరో బలవంతంగా మాచే మాట్లాడిస్తున్నారు కనుక. కాబట్టి మాకు తెలిసినంత వరకు ఆ అద్భుతమూర్తి దివ్యచరితాన్ని సవివరంగా చెప్పడానికి ప్రయత్నిస్తాం. 'తల తోకను'[1] వదలిపెట్టి, జీర్ణం చేసుకొన్నంత మేర ఈ కథను అంగీకరించు. లేదా భంగు త్రాగినవాడు చెప్పే కట్టు కథలా భావించి ఈ పుస్తకాన్ని గిరాటేసి, విషయ సుఖాలనే కొంగ్రొత్త తేనెను గ్రోలడానికి ప్రతి రోజూ పరుగెత్తి వెళ్లు.

తదనంతరం ఎప్పుడైనా సంసారమనే ఘోరమైన సుడిగుండంలో పడి, నీ దురదృష్ట (లేదా అదృష్టమా?) ఫలితంగా వైరాగ్యం జనించినప్పుడు, 'కామక్రోధాదులనే విషయ సుఖాలు విషతుల్యంగా' తోచినప్పుడు, ఈ అలౌకిక మహాపురుషుని దివ్యజీవిత గాథను మరొకసారి చదువు. అప్పుడు నీకు శాంతి లభిస్తుంది, శ్రీరామకృష్ణుల విలువ అవగతమౌతుంది.

రాంలాలా అద్భుత ప్రవర్తనను గురించి వర్ణిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''కొన్ని రోజులలో బాబాజీ వంటచేసి రాంలాలాకు నివేదించబోతే, అతడు ఎంత వెతికినా కనిపించేవాడు కాడు. హృదయావేదనతో బాబాజీ ఇక్కడకు (శ్రీరామకృష్ణుల గదికి) పరుగెత్తుకొని వచ్చేవాడు. రాంలాలా గదిలో ఆడుకొంటూ ఉండడం చూసేవాడు. అభిమానం గాయపడడంతో బాబాజీ, రాంలాలాను ఇలా చీవాట్లు పెట్టేవాడు: 'ఎంతో ప్రయాసపడి వంట చేసి నీకోసం ఇక్కడా అక్కడా వెతకుతున్నాను. కాని నువ్వు ఏమాత్రం పట్టించుకోకుండా ఇక్కడ నిశ్చింతగా తచ్చాడుతున్నావు. అసలు నిన్ను అని ఏం ప్రయోజనం? నీ స్వభావమే అంత. దయాదాక్షిణ్యా లన్నవి నీకు ఉంటే కదా! నీ తండ్రిని విడిచిపెట్టి వనాలకు పోయావు. కుమిలిపోయి తండ్రి మరణించినా చివరిచూపుకైనా నువ్వు తిరిగి పోలేదు.' ఈ రకంగా చీవాట్లు పెట్టి రాంలాలాను లాక్కుపోయి, తినిపించేవాడు. రోజులు అలా గడిచిపోయాయి. రాంలాలా ఈ చోటును (అంటే తనను) విడిచిపెట్టి వెళ్లడానికి ఇష్టపడనందున బాబాజీ చాలా

16. శ్రీరామకృష్ణుల వద్దే రాంలాలా శాశ్వతంగా ఉండిపోయిన వైనం

1. అంటే అంత ముఖ్యం కామకొన్న వివరాలను విడిచిపెట్టి అని అర్థం.

కాలం ఇక్కడే గడిపాడు. తాను అమితంగా ప్రేమించిన రాంలాలాను విడిచిపెట్టి బాబాజీకూడా వెళ్లలేకపోయాడు. ఇలా ఉండగా ఒక రోజు బాబాజీ కన్నీరు మున్నీరై నా వద్దకొచ్చి ఇలా అన్నాడు: 'రాంలాలాను ఎలా దర్శించాలని కోరుకొన్నానో ఆ రూపంలో దర్శనమిచ్చి నా జీవిత పిపాసను తీర్చాడు. ఇక ఇక్కడ నుండి కదలనని చెప్పాడు. నిన్ను విడిచి మరోచోటికి వెళ్లడానికి అతడు ఇష్ట పడడం లేదు. నా మనస్సులో ఎలాంటి విచారమూ, బాధా లేవు. నీ వద్దే సుఖంగా ఉంటూ హాయిగా ఆడుతూ పాడుతూ అతడు ఉండడమే నాకు ఆనంద దాయకం. అతడి సుఖమే నా సుఖంగా భావిస్తున్నాను. కాబట్టి అతణ్ణి నీకు అప్పగించి, మరోచోటుకు వెళ్లిపోతాను. నీతో అతడు సంతోషంగా ఉన్నాడని తెలిసి, నేనూ పరమానందభరితుడనౌతాను.' ఇలా చెప్పి, బాబాజీ, రాంలాలాను నాకు అప్పగించి నా వద్ద సెలవు పుచ్చుకొని వెళ్లిపోయాడు. అప్పటినుండి రాంలాలా ఇక్కడే ఉంటూవచ్చాడు.''

అమోఘమైన శ్రీరామకృష్ణుల దివ్యసాహచర్య ఫలంగా బాబాజీ మనస్సు స్వార్థగంధరహితమైన అత్యున్నత ప్రేమను చవిచూడగలిగిందని దీని నుండి మనం గ్రహించుకోవచ్చు. అటువంటి ప్రేమశక్తిలో తన ప్రేమాస్పదుడినుండి ఎడబాటు కలిగే భయం ఉండదని బాబాజీకి నమ్మకం ఏర్పడిందనీ మనం తెలుసుకోవచ్చు. తన ఇష్టదైవమూ, పరిశుద్ధప్రేమకు అపరావతారమూ అయిన రాంలాలా సదాసర్వదా తన వద్దే ఉన్నాడనీ, కోరిన తక్షణం ఆతడి దర్శనం పొందగలననీ బాబాజీ చక్కగా గ్రహించి ఉంటాడు. అటువంటి నమ్మకం ఉండబట్టే తన ప్రాణంకంటే మిన్నయైన రాంలాలాను బాబాజీ విడిచిపెట్టి వెళ్లగలిగాడనే విషయంలో ఎలాటి సందేహానికీ తావులేదు.

17. శ్రీరామకృష్ణులు: నిస్స్వార్థ ప్రేమానుభూతి

శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''ఒకానొక సందర్భంలో రామనామం పట్ల అచంచల విశ్వాసం ఉన్న ఒక సాధువు ఇక్కడకు రావడం తటస్థించింది. అతడు కూడా రామావత్ సంప్రదాయానికి చెందిన వ్యక్తే. అతడి వద్ద ఒక నీటికూజా, ఒక పుస్తకం మాత్రమే ఉండేవి. ఆ పుస్తకం అతడికి ఆరోప్రాణం. నిత్యం అతడు ఆ పుస్తకాన్ని పువ్వులతో అర్చించేవాడు. ఒక రోజు ఆ పుస్తకాన్ని ఒకసారి నాకివ్వమని అడిగి, పుచ్చుకొన్నాను. ఆ పుస్తకాన్ని తెరిచి చూశాను; ఎర్రసిరాతో పెద్ద అక్షరాలలో కేవలం 'ఓం రామః' అని మాత్రమే వ్రాసి ఉంది. అప్పుడు ఆ సాధువు నాతో ఇలా అన్నాడు: 'అనేక పుస్తకాలు చదవడం వలన ప్రయోజనం ఏమిటి? ఆ పరమాత్మని నుండే కదా వేదాలూ, పురాణాలూ వెలువడ్డాయి.

18. రామనామం పట్ల అచంచల విశ్వాసం ఉన్న ఒక సాధువు

ఆయనా, ఆయన నామమూ ఒక్కటే. కాబట్టి నాలుగు వేదాలలో, పద్దెనిమిది పురాణాలలో, ఇతర శాస్త్రాలన్నింట్లో ఏం ఉందో (సారం) అదంతా ఆయన ప్రతి ఒక్క నామంలో ఉన్నట్లే! అందుకు ఆయన నామమే నా ఏకైక తోడూనీడా!' భగవన్నామం పట్ల ఆ సాధువుకు ఉన్న అచంచల విశ్వాసం అటువంటిది!''

19. రామావత్ సాధువుల భక్తిగీతాలు

ఈ విధంగా అనేకమంది సాధువుల గురించి ఎన్నో విషయాలు శ్రీరామ కృష్ణులు మాకు చెప్పారు. వారినుండి తాము నేర్చుకొన్న భక్తిగీతాలను అప్పుడప్పుడు పాడికూడా మాకు వినిపించే వారు. ఉదాహరణకు ఈ క్రింది పాటలు:

1. ఓ మనసా, నువ్వు (నా) రామచంద్రుని గుర్తించలేకపోయావు
        మరప్పుడు ఏం గుర్తించావు? ఏం తెలుసుకొన్నావు?
    ఎవడు రామ (నామ) రసాన్ని ఆస్వాదించాడో నిజమైన సాధువతడేగాని
        విషయ సుఖాన్ని చవిచూసినవాడు సాధువా? (కాదు)

    వంశాన్ని ఉద్ధరించే పుత్రుడే పుత్రుడుగాని
        తక్కిన పుత్రులందరూ అప్రయోజకులు.

2. సీతాపతి రామచంద్రుని, రఘుపతి రామచంద్రుని
        అయోధ్యానాథుని భజించు, మరెవ్వరినీ భజించకు!
    రాముని దరహాసం, మాటలు, చేతలు, సుందర నయనాలు, నుదుట
        శోభించే తిలకం, చక్కని నాసికతో అచ్చం బాలభానుని తలపిస్తాడు
    మిరిమిట్లుగొలిపే కర్ణకుండలాలు, ఆయన విశాలవక్షంపై వ్రేలాడు
        తారలలా ప్రకాశించే ముత్యాల హారం, హిమవత్పర్వత
        శిఖరాన్ని తొలచుకొని వచ్చే గంగలా ఉంది
    అటువంటి రఘుకుల తిలకుడు నేస్తాలతో కలిసి
        సరయూ నదీతీరాన షికార్లు చేస్తూవుంటే
        చూసిన తులసీదాసు[1] పరమానందంతో ఉక్కిరిబిక్కిరై
        ఆ పావన పదధూళికోసం తహతహలాడుతున్నాడు.

3. రాముణ్ణి భజించే వాడొక్కడే
        నిజానికి జగత్తులో జీవించి ఉండేవాడు.

4. రాముడు తప్ప నన్ను తరింప చేసేవాడెవ్వడూ లేడు.

పైన పేర్కొన్న 3, 4 గీతాల మిగిలిన చరణాలు మాకు గుర్తులేవు.

---

1. ఇది తులసీదాసు రచించిన గీతం (సీతాపతి రామచంద్ర, రఘుపతి రఘురాఈ).

కొన్ని సమయాలలో ఆ సాధువులనుండి తాము నేర్చుకొన్న భక్తిగీతాలను శ్రీరామకృష్ణులు మాకు పాడి వినిపించేవారు. ఆయన తరచు ఇలా చెప్పేవారు: ''దొంగతనం, స్త్రీ సాహచర్యం, అసత్యం - ఈ మూడింటి బారినుండి అప్రమత్తంగా ఉండాలని సాధువులు సదా ఉపదేశిస్తారు.'' ఇలా చెబుతూ శ్రీరామకృష్ణులు, తులసీదాసు దోహా[1] ఏం తెలుపుతున్నదో వినమనేవారు. 'సత్యనిష్ఠ, వినయం, పరధనం పట్ల అనాసక్తి - ఈ మూడు సద్గుణాల ద్వారా శ్రీహరి లభించకుంటే తులసీదాసు అబద్ధం చెప్పేవాడౌతాడు.' పై దోహాను పాడి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''వినయం అంటే ఏమిటో తెలుసా? నమ్రత, అణకువ. సరైన నమ్రతాభావం జనించినప్పుడు, అహంకారం నశిస్తుంది, భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. కబీరుదాస్ గీతలో కూడా ఇదే భావం ఇమిడి ఉంది: 'సేవ, ఆరాధన, వినయం ద్వారా రఘునాథుడు అలవోకగా లభిస్తాడు. (కనుక) సోదరా, ఆనందంగా (ఈ సద్గుణాలను) అలవరచుకొంటూ సాగు!''

20. సాధువుల ఆవశ్యకాలను శ్రీరామకృష్ణులు సరఫరా చేయించడం: రాజకుమార్ ఉదంతం

మరో సందర్భంలో శ్రీరామకృష్ణులు మాకు ఇలా చెప్పారు: ''అన్ని సంప్రదాయాలకు చెందిన సాధువులకు వారి సాధనలకు ఆవశ్యకమైన సామగ్రిని సరఫరా చేయించాలనే ఆకాంక్ష ఒకప్పుడు నాలో కలిగింది. తమకు అవసరమైన సామగ్రి లభించగానే, ఆ సాధువులు నిశ్చింతగా సాధనానుష్ఠానాలు కొనసాగించుకోగలరన్నదే నా అభిప్రాయం. ఈ విషయంగా మథుర్‌ను సంప్రతించాను. అందుకు మథుర్, 'దీనిలో శ్రమ ఏముంది బాబా? ఇప్పుడే అన్నీ సిద్ధం చేయిస్తాను. ఎవరికి ఏం ఇవ్వదలచుకొన్నారో ఇచ్చెయ్యండి' అని చెప్పాడు. అంతకు ముందు నుండే ఆలయ భాండారం నుండి బియ్యం, పప్పులు, పిండి మొదలైనవి సాధువులకు ఇచ్చే ఆనవాయితీ ఉంది. దానితోబాటు ఇప్పుడు మథుర్ సాధువులకు నీటి కూజాలు, కమండలాలు, దుప్పట్లు, ఆసనాలూ ఇచ్చే ఏర్పాటు చేశాడు; అంతేకాక గంజాయి త్రాగే సాధువులకు భంగు మొదలైన మత్తుపదార్థాలూ, తాంత్రిక సాధకులకు మద్యం వగైరా మత్తుపానీయాలు కూడా సమకూర్చే ఏర్పాటు చేశాడు. ఆ కాలఘట్టంలో తాంత్రిక సాధకులు అనేకమంది దక్షిణేశ్వరానికి వస్తూవుండేవారు; వారు శ్రీచక్రపూజను[2] చేస్తూవుండేవారు. వారి సాధనలకు అవసరమైన ఒలిచిన అల్లం, ఉల్లిపాయ ముక్కలు, వేయించిన మినపపప్పుతో కూడిన మరమరాలు మొదలైనవాటిని వారికి ఇప్పించేవాణ్ణి.

---

1. దోహా అంటే సామాన్యంగా రెండు చరణాల భక్తిగీతం అని అర్థం.
2. నేలమీద శ్రీచక్ర యంత్రాన్ని వేసి, దాని మీద చుట్టూ కూర్చుని జపధ్యానాలు చేయడం.

వాటితో ఆ సాధకులు జగజ్జననిని ప్రార్థిస్తూ ఆరాధించడం నేను తదేకంగా చూసేవాడిని. అనేక సందర్భాలలో వారు నన్ను తమతోపాటు చక్రంలో కూర్చోబెట్టేవారు; పలుమార్లు నన్ను చక్రేశ్వరుణ్ణి[1] చేసేవారు. 'కారణా'న్ని[2] కూడా పుచ్చుకోమని బ్రతిమిలాడేవారు. కాని నేను కారణాన్ని పుచ్చుకోలేననీ, పుచ్చుకొనే అవసరమూ లేదనీ, భగవన్నామంతోనే నాకు 'మత్తు' కలుగుతుందనీ తెలుసుకొన్నాక వారు దాన్ని పుచ్చుకోమని నన్ను బలవంతం చేసేవారు కారు. అయినా వారితో కలిసి కూర్చున్నప్పుడు 'కారణం' పుచ్చుకోవలసి వస్తుందని తలచి, మద్యాన్ని వ్రేలితో తాకి, నుదుటన బొట్టులా పెట్టుకొనేవాణ్ణి లేదా వాసన చూసేవాణ్ణి; లేదా మహా అయితే వ్రేలితో ఒక చుక్క నోట్లో చిలకరించుకొనేవాణ్ణి. తరువాత దాన్ని వారి పాత్రలలో పోసేవాణ్ణి. వారిలో కొందరు మద్యం పుచ్చుకోగానే మనస్సును జగజ్జననిపై లగ్నంచేసి, తన్మయులై ధ్యానించేవారు. మరికొందరు తల్లిని ధ్యానించడం విస్మరించి, తప్పత్రాగి చివరకు త్రాగుబోతులయ్యేవారు. ఇలా ఉండగా ఒక రోజు వాళ్లు చాలా అసభ్యంగా ప్రవర్తించారు. దాంతో ఆ రోజునుండి మద్యం ఖైరాలను వాళ్లకు ఇప్పించడం నిలిపివేయించాను.

కాని రాజకుమార్[3] మాత్రం మద్యం పుచ్చుకోగానే మనస్సును ఆలోచనా శూన్యం చేసుకొని జపానికి కూర్చోవడం సదా నేను గమనించేవాణ్ణి. కాని తదనంతర కాలంలో అతడు పేరుప్రతిష్ఠలకోసం ఎగబడ్డాడని తెలియవచ్చింది. అది సహజమే కదా! అతడికి భార్యాబిడ్డలున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం ధన సముపార్జనలో పడివుంటాడు. ఏది ఏమైనప్పటికీ, సాధనకు ఉపకరిస్తుందనే ఉద్దేశంతో మాత్రమే అతడు మద్యం పుచ్చుకొనేవాడు. అతడు తప్పత్రాగడంగాని, అసభ్యంగా ప్రవర్తించడంగాని నే నెన్నడూ చూడలేదు.

'కారణం' (మద్యం) పుచ్చుకోవడంలో శ్రీరామకృష్ణులు అశక్తులనే విషయ గురించి ఎన్నో ఆలోచనలు మాలో చెలరేగేవి. అనేక సందర్భాలలో 'భంగు', 'కారణం' (మద్యం) వంటి పేర్లు సంభాషణ మధ్యలో దొర్లినప్పుడు, ఆయన దివ్యోన్మత్తులవడం, కొన్నివేళల్లో సమాధిమగ్నులు కావడం మేం కళ్లారా చూసివున్నాం. పైకి సంస్కారవంతులుగా కనిపించే మనం, స్త్రీ జననేంద్రియం

---

1. చక్రంలో కూర్చున్న వారికి నాయకుడు.

2. కారణం అంటే మద్యం.

3. ఇతడు అచలానందుడనే పేరుతో ఖ్యాతికెక్కాడు. అప్పుడప్పుడు ఇతడు కాళీఘాట్ వద్ద నివసించేవాడు. ఇతడికి కొందరు శిష్య ప్రశిష్యులుండేవారు. కొన్ని సం॥ల క్రితమే మరణించాడు. ఇతడి మృతకాయాన్ని కాళీఘాట్‌కు సమీపంలో ఉండే ఒక గ్రామంలో పటాటోపంగా శిష్యులు సమాధి చేశారు.

(యోని) పేరు వినబడగానే తుచ్ఛ ఆలోచనలు రేకెత్తగా కామవికారాలకు లోనవుతాం. అలాగే మరికొందరు తమ బలహీనతలను గుర్తించికూడా, తామేదో ఉత్తములమని చాటుకోవడానికి 'యోని, గుహ్యేంద్రియం' వంటి పదాలు చెవిన పడగానే, (తామేదో అశ్లీల, బూతు పదజాలం విని భరించలేని ఉత్తములలా) చెవులు మూసుకొని, అక్కడనుండి పారిపోతారు. కాని అద్భుతమూర్తులైన శ్రీరామకృష్ణులు 'యోని' అనే మాట చెవిన పడగానే సమాధిమగ్నులై పోవడం మేం అనేక సందర్భాలలో చూశాం! అట్టి సందర్భాలలో శ్రీరామకృష్ణులు సమాధ్యావస్థ నుండి క్రిందికి దిగి, కొంత మామూలు స్థితిలోకి వచ్చాక ఇలా అనడం మేం వినివున్నాం: "అమ్మా! యాభై ఐదు (అకారం నుండి క్షకారం వరకు) అక్షరాల స్వరూపిణివి నువ్వే కదా! ఏ అక్షరాల సముదాయంతో వేదవేదాంతమంతా అభివర్ణింపబడిందో బూతు, అశ్లీల పదజాలం కూడా ఆ అక్షరాల సముదాయంతో కల్పించబడినదే కదా! వేదవేదాంతాలు ఉపయోగించే 'క, ఖ'లు, అశ్లీల పదజాలంలోని 'క, ఖ'లు విభిన్నాలు కావు. వేదవేదాంతమంతా నువ్వే, అలాగే అశ్లీల పదజాలం అంతా నువ్వే." ఇలా అంటూ మళ్లీ ఆయన సమాధి మగ్నులయ్యేవారు.

21. ఆధ్యాత్మికం కాని సూచనల పట్ల సైతం శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మికంగా స్పందించడం

ఆహ్! లోకంలోని అన్ని - మంచి చెడు, శుభాశుభ - వస్తువులనూ ప్రకాశింపచేసే, మనబోటి వారి మనోబుద్ధులకు అతీతమైన, వర్ణింపనలవిగాని దివ్యజ్యోతి ఆ అద్భుతమూర్తి కళ్లలో ప్రకాశిస్తూ ఉండడం ఎవరు తెలుసుకోగలరు? ఏ కళ్లగుండా దివ్యలోకాలను ఆయన దర్శించారో, అటువంటి కళ్లు ఎవరికి ఉన్నాయి? సావధానంగా వినండి. జాగ్రత్తగా ఆయన వచనాలను హృదయాలలో సభక్తికంగా పదిలపరచుకోండి. ఆ అద్భుతమూర్తి మానసిక పావనత్వం ఎంత దురవగాహమైనదో యోచించి చూడండి!

జగజ్జనని అనుగ్రహం పొందిన రాంప్రసాద్ ఇలా పాడేవాడు:

"సురా పాన్ కొరినా ఆమి సుధా ఖాఇ జై కాళీబోలే ।
ఆమార్ మన్‌మాతాలే మాతాల్ కొరే ।
జత మద్ - మాతాలే మాతాల్ బోలే ॥"

[నేను మద్యం త్రాగను, 'జై కాళీ' అంటూ అమృతాన్ని ఆస్వాదిస్తూ నా మనస్సు భావద్భావంతో మత్తెక్కుతుంది. మత్తిల్లిన నన్ను చూసి త్రాగుబోతులు నేను మద్యంత్రాగి 'నిషా'లో ఉన్నానని భ్రమిస్తారు.]

మద్యం వంటి మత్తు కలిగించే పదార్థాలను పుచ్చుకోకుండానే కేవలం భగవదానందంతో ఇంతటి 'నిషా' పొందవచ్చునని శ్రీరామకృష్ణులను చూడడానికి

మునుపు, నిజం చెప్పాలంటే మేం కలలోకూడా ఊహించలేదు. శ్రీహరి నామాన్ని ఉచ్చరించినంతనే శ్రీచైతన్యులు బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయేవారని ఒక రచయిత ఒక పుస్తకంలో వ్రాశాడు. ఆ విషయం చదివి ఆ రచయిత మూర్ఖుడనీ, మూఢనమ్మకం గలవాడనీ ఒక కాలఘట్టంలో మేం పరిగణించడం మా కింకా బాగా జ్ఞాపకం ఉంది. ఆ కాలఘట్టంలో నగరంలోని యువకులందరి మనస్సులలో ఆధ్యాత్మికతకు సంబంధించిన ప్రతి విషయంలోనూ అవిశ్వాసం, సందేహం గూడుకట్టుకొని ఉండేవి. ఆ తరుణంలోనే శ్రీరామకృష్ణులను మేం కలుసుకోవడం జరిగింది. కలుసుకోవడం మాత్రమే కాదు, మేం ఆయనను రేయింబవళ్ళు, సదా సర్వవేళలా సంశయ దృష్టితోనే పరిశీలించాం. భగవన్నామ కీర్తనం చేస్తూ మహోత్సాహంతో చేసే విశృంఖల నృత్యం, నృత్యం చేస్తూచేస్తూ పదేపదే బాహ్యస్మృతిని కోల్పోవడం మా కళ్లారా చూశాం; నాణేలతో సహా ఏ లోహవస్తువు స్పర్శ (వాటి ఎరుక తెలియదు) ఆయన భరించలేకపోవడం, 'సిద్ధి, కారణం' వంటి మత్తునిచ్చే పదార్థాల పేర్లను వినగానే భావదానందంతో ఉద్దీప్తులై తప్పత్రాగిన వారిలా నిషా పొందడం చూశాం. ఇక భగవన్నామం, రాముడు కృష్ణుడు వంటి అవతారాల పేర్లు వినడం సంగతి ప్రత్యేకంగా చెప్పాలా? ఏ అశ్లీల పదాలు వినబడగానే ఇతరులలో కామభావాలే రేకెత్తుతాయో, అటువంటి పదజాలం ఆయనలో బ్రహ్మయోని, త్రిజగత్ప్రసవినీ, ఆనందమయి అయిన జగజ్జననీ భావాలను ఉద్దీపింప చేసి, అతీంద్రియ విమలానందంలో ఆయనను ముంచెత్తేవి.

పాఠక మహాశయా! ఈ అద్భుతమూర్తిని మా హృదయాంతరాళాలలో అవతారపురుషునిగా కొలుస్తున్నామని సమర్థించుకోవడానికి ఇంకా ఏ మహాసుగుణాన్ని సోదాహరణగా చూపించాలి?

22. ఇందుకు కొన్ని ఉదాహరణలు

రామచంద్ర దత్త, శ్రీరామకృష్ణుల పరమ భక్తుడు. అతడి ఇల్లు కలకత్తాలోని సిమ్లా అనే పేటలో ఉండేది. శ్రీరామకృష్ణులు తమ భక్తులతో కలిసి అక్కడకు ఎన్నోసార్లు వెళ్లి, తమ ఆనందప్రద సాహచర్య లబ్ధిని ఆతడికి, అక్కడ సమావేశమైన భక్తులకూ ప్రసాదించి వెళ్లేవారు. ఒక రోజు శ్రీరామకృష్ణులు దత్త గృహంలో కొంతసేపు భగవత్ప్రసంగంతో గడిపి, తిరిగి దక్షిణేశ్వరానికి బయలుదేరారు. రామచంద్ర దత్త ఇల్లు మధురాయ్ సందులో ఉంది. ఇరుకు సందు కాబట్టి బళ్లు ఇంటి ముందు వరకు రాలేకపోయేవి. అందుచేత ప్రధాన వీధిలో బళ్లను ఆపి, కాస్తదూరం కాలినడకన రావలసి వచ్చేది. ఆ రోజు బండి శ్రీరామకృష్ణుల కోసం ప్రధాన వీధిలో పశ్చిమం వైపుగా వేచివుంది. శ్రీరామకృష్ణులు బండి వైపుగా నడవసాగారు. భక్తులు ఆయ

నను అనుసరించి వస్తున్నారు. భగవదానంద పారవశ్యంలో ఆయన తూలిపో తున్నారు; ఇతరుల ఆసరా లేకుండా ఆ నాలుగు అడుగులుకూడా వేయలేని స్థితిలో ఉన్నారు. ఇద్దరు భక్తులు ఆయనను రెండు వైపులా పుచ్చుకొని మెల్లగా నడిపించసాగారు. ఆ సందు మలుపులో కొంతమంది జనం నిలబడి ఉన్నారు. శ్రీరామకృష్ణుల అవస్థ వారెలా అర్థం చేసుకోగలరు? వాళ్లలో వాళ్లు ఇలా మాట్లాడుకొంటున్నారు: ''అబ్బ, ఎంత తప్ప త్రాగి ఉన్నాడో ఈ మనిషి!'' అని మెల్లగా మాట్లాడినా ఆ మాటలు మా చెవిన పడ్డాయి. మాలో మేం 'నిజమే' అనుకొన్నాం.

ఒక రోజు పగటిపూట పరమారాధ్యురాలైన మాతృదేవిని పిలిచి, తమ గదిని, పరుపును శుభ్రపరిచి, తమలపాకులు చుట్టి సిద్ధంచేయమని చెప్పి, కాళికాలయానికి వెళ్లారు. మాతృదేవి ఆ పనులన్నీ సత్వరమే దాదాపుగా పూర్తి చేసింది. ఈలోగా శ్రీరామకృష్ణులు ఆలయం నుండి తిరిగి వచ్చారు. తప్పత్రాగిన వ్యక్తిలా ఆయన తూలిపోతున్న స్థితిలో ఉన్నారు. కళ్లు ఎర్రబారి ఉన్నాయి, అడు గులు తడబడుతున్నాయి. మాటలు అస్పష్టంగా, అర్థరహితంగా ఉన్నాయి. గది లోకి ప్రవేశించి తూలుతూ తూలుతూ మాతృదేవి వద్దకు వచ్చారు. ఇంటి పను లలో మునిగిపోయి ఉన్న మాతృదేవి, ఆయన ఆ స్థితిలో రావడం గమనించలేదు. త్రాగిన వ్యక్తిలా ఆయన ఆమెను త్రోసి, ''ఆఁ, నేను మద్యం త్రాగానా?'' అని అడిగారు. ఆమె వెనక్కు తిరిగి ఆయన భావావస్థను చూసి విస్తుబోయింది. ''లేదు, లేదు. మీ రెందుకు మద్యం పుచ్చుకొంటారు?'' అని మాతృదేవి జవా బిచ్చింది. ''మరి తూలిపోతున్నా నెందుకు?'' అని శ్రీరామకృష్ణులు అడిగారు. అప్పుడు మాతృదేవి ఆయనను అనునయిస్తూ, ''లేదు, లేదు. మద్యం మాత్రం కాదు. కాళీమాత ప్రేమామృతాన్ని త్రాగివున్నారు'' అని చెప్పింది. అందుకు తమ సమ్మతి తెలుపుతున్న ధోరణిలో, ''నువ్వు చెప్పింది నిజమే'' అని అన్నారు.

కలకత్తా భక్తులు శ్రీరామకృష్ణులను దర్శించి ఆయన అనుగ్రహం పొంది నప్పటినుండే, కనీసం వారానికి ఒకటి రెండుసార్లు ఆయన ఎవరో ఒక భక్తుని ఇంటి వెళ్లివచ్చేవారు. తమ భక్తులలో ఎవరైనా నియమిత సమయంలో తమ వద్దకు రాలేకపోయినప్పుడూ, ఇతరుల నుండి ఆ వ్యక్తి క్షేమసమాచారాలు తెలియ నప్పుడూ దయాళువులైన శ్రీరామకృష్ణులు స్వయంగా తామే ఆ వ్యక్తి వద్దకు వెళ్లేవారు. సామాన్యంగా తరచు నియమిత సమయాలలో దక్షిణేశ్వరానికి వచ్చే భక్తుడు రానప్పుడు, ఆయన ఆందోళనపడి ఆ వ్యక్తిని చూడడానికి కలకత్తాకు వెళ్లేవారు. ఆయన శుభాగమనం సర్వదా ఆయా భక్తుల శ్రేయస్సు కోసమే అన్న విషయం ముమ్మాటికీ నిజం. దాన్లో ఆయన స్వార్థం కించిత్తుకూడా ఉండదు.

వేణీ సాహ్ అనే వ్యక్తికి బారానగర్‌లో మంచి బాడుగ గుర్రబ్బళ్లు ఉండేవి. శ్రీరామకృష్ణులు తరచు కలకత్తాకు వస్తూపోతూ ఉండడం వలన, ఆయన అవసరం మేరకు ఈ వ్యక్తి దక్షిణేశ్వరానికి ఒక బాడుగ బండిని పంపాలని ఏర్పాటు చేసుకొన్నారు. ఒకవేళ కలకత్తానుండి బండి ఎంత ఆలస్యంగా తిరిగి వచ్చినా వేణీ సాహ్ అభ్యంతరం చెప్పకూడదు. అదనపు సమయం బండి వేచివున్నందుకు అదనపు బాడుగ చెల్లించేవారు. బండి బాడుగలను మొదట్లో మథుర్‌నాథ్, తరువాత పానీహాటీ వాస్తవ్యుడైన మణిసేన్, ఆ తరువాత శంభుమల్లిక్, తదనంతరం సిందూరియాపటికి చెందిన జయగోపాల్ సేన్ భరిస్తూ వచ్చారు. కాని ఆయన ఏ భక్తుని ఇంటికి వెళ్లేవారో, ఆ రోజు బండి బాడుగ ఆ భక్తుడే తన స్తోమతనుబట్టి చెల్లించేవాడు.

ఒక రోజు శ్రీరామకృష్ణులు కలకత్తాలోని యదుమల్లిక్ ఇంటికి వెళ్లవలసి వచ్చింది. యదుమల్లిక్ తల్లి ఆయనకు పరమ భక్తురాలు. ఆమెను చూడగోరే ఆ రోజు కలకత్తా వెళ్లాలనుకొన్నారు. చాలా రోజులుగా ఆ కుటుంబ క్షేమ సమాచారాలు ఆయనకు తెలియరాలేదు. శ్రీరామకృష్ణులు భోజనం చేశాక, గుర్రపు బండి వచ్చింది. అప్పుడే కలకత్తానుండి పడవలో మా మిత్రుడు 'అ-' శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చాడు. 'అ-'ను చూడగానే ఆయన అతడి క్షేమ సమాచారాలు విచారించారు. ''నువ్వు రావడం మంచిదయింది. ఈ రోజు యదుమల్లిక్ ఇంటికి వెళుతున్నాను. దారిలో మీ ఇంటి వద్ద దిగి, 'గి-'ని చూసి పోతాను. పనుల ఒత్తిడి వలన తీరుబడిలేక అతడు చాలారోజుల నుండి ఇక్కడకు రాలేదు. పద, మనం కలిసే పోదాం'' అని 'అ-'తో చెప్పారు. అందుకు 'అ-' అంగీకరించాడు. శ్రీరామకృష్ణులతో పరిచయం 'అ-'కు అంతంతమాత్రమే. అతడు గురుదేవులను కొద్దిసార్లే, కొన్నిచోట్లలో చూసివున్నాడు. మనం ఏ వస్తువులను లేదా వ్యక్తులను చూసి రోతతో ఏవగించుకొంటామో, వాటినే చూసి అసాధారణ వ్యక్తులైన శ్రీరామకృష్ణులు భగవద్భావ ప్రేరణతో ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడంటే అక్కడ భావసమాధిమగ్నులవుతారనే విషయం 'అ-'కు అంతగా తెలియదు.

శ్రీరామకృష్ణులు వెళ్లి బండిలో కూర్చున్నారు. ఆయనను సేవిస్తూన్న బాల భక్తుడు లాటూ (కాలాంతరంలో స్వామి అద్భుతానంద) గురుదేవుల సంచీ, తువ్వాలు మొదలైన అవసరమైన వస్తువులను తీసుకొని ఆయన వెనుకే వెళ్లి బండిలో కూర్చున్నాడు. మా మిత్రుడు 'అ-' కూడా వెళ్లి బండిలో కూర్చున్నాడు. బండి బయలుదేరింది. క్రమంగా బారానగర్ బజారు దాటి, మతి చెరువు ప్రక్కనుండి పోసాగింది. దారిలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ సంఘటన ఏదీ జరగ

లేదు. దారిలో అదీ ఇదీ చూస్తూ గురుదేవులు, లాటూనో 'అ-'నో చిన్నపిల్ల వాడిలా వాటి గురించి అడగసాగారు; లేదా ఏదో ఒక అంశంపై ముచ్చటిస్తూ, మామూలు స్థితిలో ఉండే రీతిలో ఉల్లాసంగా ఉన్నారు.

మతి చెరువుకు దక్షిణం వైపు ఒక చిన్న బజారు వెలిసి ఉంది. దానికి మరింత దక్షిణం వైపు ఒక సారాయి దుకాణం, ఒక ఔషధశాల, ధాన్యం నిల్వ చేసుకొనే పెంకుటిళ్లతో కూడిన గిడ్డంగి ఉన్నాయి. వీటికి దక్షిణంగా సుప్రసిద్ధ శ్రీ సర్వమంగళ, చిత్రేశ్వరీ దేవాలయాలకు దారితీసే విశాలమైన మార్గం ఉంది. ఈ మార్గం గంగానది ఒడ్డు ప్రక్కనుండి పోతుంది. కలకత్తాకు పోవాలంటే ఈ మార్గానికి కుడివైపుగా వెళ్లాలి.

కొందరు త్రాగుబోతులు ఆ సారాయి దుకాణంలో కూర్చుని త్రాగుతూ గోలచేస్తూ ఆనందిస్తున్నారు. వారిలో కొందరు ఆనందంగా పాడుతున్నారు, కొందరు చేతులూ కాళ్లూ ఊపుతూ నాట్యం చేస్తున్నారు. ఆ అంగడి యజమాని సారాయి అమ్మడానికి ఒక పనివాణ్ణి నియమించి, అంగడి వాకిలి వద్ద అన్య మనస్కంగా నిలబడి ఉన్నాడు. నుదుట పెద్ద సిందూరం బొట్టు పెట్టుకొని ఉన్నాడు. అదే సమయంలో శ్రీరామకృష్ణుల బండి ఆ అంగడి ముందునుండి వెళ్లసాగింది. ఆ అంగడి యజమాని శ్రీరామకృష్ణులను చూడగానే చేతులెత్తి నమస్కారం చేశాడు; బహుశా ఆయనను గుర్తుపట్టి ఉంటాడు.

అంగడిలో జరుగుతున్న గోల శ్రీరామకృష్ణుల దృష్టిని ఆకర్షించింది. ఆ త్రాగుబోతులు తమ ఆనందాన్ని ఆ రకంగా వ్యక్తం చేయడం ఆయన గమనించారు. మద్యం (కారణం) త్రాగి అలా వాళ్లు ఆనందించడం చూసిన తక్షణమే శ్రీరామకృష్ణుల మనస్సులో జగత్కారణమైన ఆనంద స్వరూపం ఉద్దీపనమైంది. కేవలం ఉద్దీపనమే కాదు, ఆయనకు ఆ అనుభూతే కలిగింది. వెంటనే పూర్తి నిషాలో మునిగిపోయారు, మాటలు అస్పష్టంగా రాసాగాయి. అంతే కాదు. తమ కుడి పాదాన్ని ముందుకు చాచి బండిని ఎక్కే మెట్టుమీద నిలిపి, కాస్త ముందుకు వంగి నిలబడ్డారు. అలా నిలబడి తప్పత్రాగిన వ్యక్తిలా ఆ త్రాగుబోతుల సంతోషాన్ని చూస్తూ, ఆనందంతో చేతులూ కాళ్లూ ఊపుతూ, ''సెబాస్, సెబాస్, ఎంతో బాగుంది'' అంటూ బిగ్గరగా అరవసాగారు.

'అ-' ఇలా అన్నాడు: ''హఠాత్తుగా శ్రీరామకృష్ణులకు ఇటువంటి భావావస్థ ఏర్పడుతుందని సూచనప్రాయంగా కూడా మాకు తెలియలేదు. అప్పటిదాకా మామూలు సహజ స్థితిలోనే ఆయన మాట్లాడుతున్నారు. కాని ఆ త్రాగుబోతులను చూసీచూడగానే ఆ భావావస్థకు లోనయ్యారు. నేను భయంతో కొయ్యబారిపోయాను. బండిలోకి ఆయనను లాగివేయాలనే ఆతురతతో చేతులు

చాచి, ఆయనను అందుకోబోయాను. అప్పుడు లాటూ కల్పించుకొని, 'ఏమీ చేయనక్కరలేదు. ఆయన తనను అదుపులో పెట్టుకోగలరు, క్రింద పడిపోరు' అని చెప్పాడు. ఆ మాటతో స్థిమితపడ్డాను. అయినా, కాస్సేపు నా గుండె తీవ్రంగా కొట్టుకోసాగింది. తరువాత ఇలా అనుకొన్నాను: 'ఇటువంటి పిచ్చి మనిషితో కలిసి ఒకే బండిలో ప్రయాణం చేయడం ఎంత తప్పయింది. మరెన్నడూ ఇలా చేయను.'

''నిజానికి ఈ సంఘటన లన్నీ వివరించడానికి పట్టిన సమయం కంటే జరగడానికి స్వల్పవ్యవధే పట్టింది. ఈలోగా బండి మద్యం అంగడి దాటి పోయింది, శ్రీరామకృష్ణులు బండిలో ప్రశాంతంగా కూర్చున్నారు. ఆ తరువాత సర్వమంగళాదేవి ఆలయం చూసి, 'అదుగో సర్వమంగళాదేవి. ఆమె జాగ్రద్దేవత. నమస్కరించు' అని అన్నారు. ఇలా అంటూ ఆయన దేవికి నమస్కరించారు. వారిని అనుకరించి మేమూ దూరంనుండే దేవికి నమస్కరించాం. తరువాత నేను శ్రీరామకృష్ణుల వంక చూశాను. ఆయన మందహాసంచేస్తూ, మామూలు స్థితిలో కనిపించారు. ఆయన పడిపోయివుంటే, మరణించి ఉంటే అనే ఆలోచనతో నా గుండె చాలసేపటివరకు కొట్టుకొంటూనే ఉండిపోయింది.

''తదనంతరం బండి ఇంటి గుమ్మం వద్దకొచ్చి ఆగగానే, ఆయన నాతో, ''గి-' ఇంట్లో ఉన్నాడా? లోపలికెళ్లి కాస్త చూడు'' అని అన్నారు. నేను లోపలికి వెళ్లివచ్చి, 'గి-' లేడని చెప్పాను. 'సరే, 'గి-'ని చూడలేకపోయాను. ఈ రోజు బండి అదనపు బాడుగను అతణ్ణే చెల్లించమని అడుగుదామనుకొన్నాను. కాని నీతో పరిచయం అయింది కదా! ఒక రూపాయ ఇస్తావా? యదుమల్లిక్ పిసినారి అని నీకు తెలుసుకదా! అతడు బేరమాడుకొన్న రెండు రూపాయల నాలుగు అణాలకంటే చిల్లిగవ్వకూడా అదనంగా ఇవ్వడు. కాని భక్తులను కలుసుకొని తిరిగి వచ్చేసరికి రాత్రి ఎంత ఆలస్యమౌతుందో ఎవరికి తెలుసు? పైగా రాత్రి బాగా పొద్దుపోతే బండివాడు మమ్మల్ని బాగా సతాయిస్తాడు. కాబట్టి బండివాడికి మూడు రూపాయల నాలుగు అణాలు చెల్లిస్తే అతడు గోలచేయకూడదని వేణీతో ఒక ఒప్పందం కుదుర్చుకొన్నాం. కనుక ఒక రూపాయ నువ్వు ఇస్తే ఈ రోజు బండి బాడుగకు ఇబ్బంది ఉండదు. అందుకే నిన్ను అడగడం' అని నాతో చెప్పారు. ఇదంతా విని లాటూ చేతికి ఒక రూపాయ ఇచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాను. ఆయన యదుమల్లిక్‌ను చూడడానికి వెళ్లిపోయారు.''

బాహ్యదృష్టికి త్రాగుబోతులా కనిపించే స్థితి ఎప్పుడంటే అప్పుడు శ్రీరామకృష్ణులకు ఏర్పడేది. అటువంటి సంఘటనలు కోకొల్లలు. వాటిలో కొన్నిటిని మాత్రమే మేం పొందుపరచగలిగాం.

23. సాధువులకు శ్రీరామకృష్ణుల దోహదం

ఆ విధంగా అనేక సందర్భాలలో శ్రీరామకృష్ణులు మాకేకాక అనేకులకు దక్షిణేశ్వర కాళికాలయానికి విచ్చేసిన సాధువుల, సాధకుల గురించిన కథలు వివరించి చెప్పేవారు. ఆ సంఘటనలను స్వయంగా చూసినవారు ఎందరో ఇప్పటికీ బ్రతికే ఉన్నారు. మేం ఆ సమయంలో సెయింట్ క్సేవియర్ కళాశాలలో చదువుకొంటున్నాం. గురువారం, ఆదివారం కళాశాలకు సెలవు రోజులు. శని ఆదివారాలలో శ్రీరామకృష్ణుల వద్ద భక్తులు క్రిక్కిరిసి ఉండేవారు. కనుక మేం గురువారం నాడు కూడా ఆయన వద్దకు వెళ్లేవారం. ఆయన జీవితంలో జరిగిన వివిధ సంఘటనలను ఆయన ముఖతా వినే సదవకాశం ఇందుమూలంగా మాకు కలిగింది. ఆ అన్ని సంఘటనల వివరాల ద్వారా మాకొక విషయం స్పష్టంగా అవగతమైంది: భైరవీ బ్రాహ్మణి, తోతాపురి, మహమ్మదీయుడైన గోవింద, ఆరు నెలలపాటు ఎడతెగని పరిపూర్ణ నిర్వికల్ప సమాధిలో మగ్నులై ఉన్నప్పుడు శ్రీరామకృష్ణుల దేహాన్ని పరిరక్షించడానికి దైవవశాత్తు కాళికాలయానికి వచ్చిన సాధువు, అలాగే మరి కొందరు సాధువులు[1] - వీరు తప్ప ఆంగ్ల విద్యను అభ్యసించిన మా వంటి శిష్యుల రాకకు ఎంతో కాలానికి మునుపు దక్షిణేశ్వరానికి వచ్చిన నానాసంప్రదాయాలకు చెందిన ప్రతి సాధువూ, సాధకుడూ దివ్యులైన శ్రీరామకృష్ణుల సంసర్గంతో తమ ఆధ్యాత్మిక జీవితాలలో నూతన ప్రకాశాన్ని, నిర్దేశాన్ని పొందగలిగారు. ఆ విధంగా శ్రీరామకృష్ణుల తోడ్పాటుతో స్వయంగా తాము కృతార్థులు కావడమే కాక, తమ తమ సంప్రదాయాలకు చెందిన నిజమైన సాధకులకు, వారు అనుసరిస్తున్న మార్గాలలో భగవత్సాక్షాత్కారం ఎలా పొందవచ్చునో చూపించే అవకాశమూ వారికి కలిగింది. ఇటువంటి వారంతా కేవలం నేర్చుకోవడానికి మాత్రమే శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చారు. తమ జ్ఞానాన్ని సమగ్ర పరచుకొని తమ స్థానాలకు వెళ్లిపోయారు.

భైరవీ బ్రాహ్మణి, తోతాపురి వంటి వారు కూడా పురాకృత సుకృత ఫలంగా శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక జీవితంలో దోహదం చేయడానికి వచ్చారు. అయినప్పటికీ సుదీర్ఘకాల సాధనానంతరం కూడా నిగూఢమైన ఏ మహోన్నత ఆధ్యాత్మిక సత్యాలను తమ జీవితంలో సాక్షాత్కరించుకోలేకపోయారో, ఆ సత్యాలను శ్రీరామకృష్ణుల దివ్యానుగ్రహ కటాక్షం ద్వారా సాక్షాత్కరించుకొని తరించారు.

---

1. భైరవీ బ్రాహ్మణి, తోతాపురి వంటివారు శ్రీరామకృష్ణులనుండి కేవలం నేర్చుకోవడానికే కాక, గురువులుగా ఆయనకు తోడ్పడే సదవకాశాన్నీ పొందారు. ఇతరులు మాత్రం కేవలం ఆయన తోడ్పాటును పొంది, వెళ్లిపోయారని రచయిత అభిప్రాయపడుతున్నారు.

దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన సాధువుల, సాధకుల వరుస క్రమాన్ని పరికిస్తే మరొక సత్యం మనకు స్ఫురిస్తుంది. ఈ అధ్యాయంలో ఆ

24. శ్రీరామకృష్ణుల సాధనలు: సాధువుల ఆగమనం

సంఘటనలు జరిగిన వరుస క్రమాన్ని, శ్రీరామకృష్ణుల ముఖతా మేం విన్న మేరకు యథాతథంగా పొందుపరచడం వలన ఈ సాధకుల వచ్చిన వరుస క్రమాన్ని అధ్యయనం చేయడం అనుకూలమౌతుంది. ఎప్పుడెప్పుడు ఆయన ఒక ప్రత్యేక భావంలో భగవంతుణ్ణి ఉపాసించి, సాధనచేసి భగవంతుణ్ణి ఆయా ప్రత్యేక రూపంలో సాక్షాత్కరించుకొనేవారో, అదే సమయంలో అదే తీరులో భగవంతుణ్ణి ఉపాసిస్తూ, సాధన చేస్తున్న ఆయా సంప్రదాయాలకు చెందిన నిజమైన సాధకులు బృందాలవారీగా ఆయన వద్దకు వచ్చేవారని స్వయంగా శ్రీరామకృష్ణుల ముఖతా మేం వినివున్నాం. వారితో ఆయా భావాలకు సంబంధించిన చర్చతో శ్రీరామకృష్ణులు రేయింబవళ్లు గడిపేవారు.

శ్రీరామ మంత్రోపాసనలో సిద్ధి పొందగానే రామావత్ సంప్రదాయకులు అనేకులు ఆయన వద్దకు రావడం మొదలైంది. వంగదేశ వైష్ణవ మార్గానికి చెందిన శాంత దాస్యాది భావాలను అనుసరించి ఎప్పుడెప్పుడు శ్రీరామకృష్ణులు ఆయా భావాలలో సిద్ధి పొందారో, అదే సమయంలోనే ఆ భావమార్గాన్ని అనుసరించే సాధకులు రావడం తటస్థించింది. అలాగే భైరవీ బ్రాహ్మణి సహాయంతో అరవై నాలుగు తంత్రాల ప్రధాన సాధనలలో, అంటే శక్తిసాధనలో సిద్ధి పొందిన తక్షణమే వంగ దేశంలో తాంత్రికసాధనలలో సుప్రసిద్ధులైన సాధకు లందరూ శ్రీరామకృష్ణుల వద్దకు రావడం జరిగింది. శ్రీరామకృష్ణులు అద్వైత తత్త్వంలో పరిపూర్ణులై నిర్వికల్పానుభూతి పొంది, బ్రహ్మజ్ఞానం సంతరించుకొన్న వెంటనే పరమహంస సంప్రదాయానికి చెందిన సాధకవరేణ్యులు అనేకులు ఆయన వద్దకు వచ్చారు.

వివిధ సంప్రదాయాలకు చెందిన సాధకులు శ్రీరామకృష్ణుల దివ్యసాహచర్యం పొందే నిమిత్తం ఆ రకంగా వేర్వేరు సమయాలలో రావడంలో ఒక

25. అవతారపురుషుల ఆధ్యాత్మిక శక్తిలో తారతమ్యం

గూఢార్థం ఇమిడి ఉందని పిల్లవాడికి సైతం ఇట్టే అర్థమౌతుంది. గతంలో అవతార పురుషుల శుభావతరణంతో లోకంలో ఇలాగే జరిగింది, ఇక ముందుకూడా కచ్చితంగా ఇలాగే జరుగుతుంది. ఆధ్యాత్మిక జగత్తు నిగూఢ నియమాల మేరకు, ధర్మగ్లానిని తొలగించడం కోసమో లేదా దాదాపు ఆరిపోనున్న ఆధ్యాత్మిక జ్యోతిని దేదీప్యమానంగా ప్రకాశింప చేయడం కోసమో ప్రతి యుగంలోను ఈ అవతారపురుషులు జన్మిస్తూ ఉంటారు.

కాని అవతార పురుషుల జీవితాలను అధ్యయనం చేసినప్పుడు వారి శక్తి అభివ్యక్తీకరణలో తారతమ్యం ఉండడం కానవస్తుంది. వీరిలో కొందరు దేశంలోని ఒక ప్రాంతాన్నో లేదా కొన్ని ప్రత్యేక మతసంప్రదాయాలనో ఉద్ధరించడానికీ, మరికొందరు లోకంలో ఆధ్యాత్మిక కొరతను తీర్చడానికీ ఏతెంచారన్న విషయం స్పష్టమవుతుంది. వీరందరూ తమ సొంత సిద్ధాంతాలను, తాము ఆవిష్కరించుకొన్న ఆధ్యాత్మిక సత్యాలను ప్రకటించడం కానవస్తుంది. కాని వీరు పూర్వ ఋషుల, ఆచార్యుల, అవతారపురుషుల ఆ ఆధ్యాత్మిక బోధనల ప్రామాణికతను చెక్కుచెదరనివ్వకుండా పరిరక్షిస్తారు. తమ దివ్యయోగశక్తుల ద్వారా గతంలో వెలసిన ఆధ్యాత్మిక సిద్ధాంతాల, సంప్రదాయాల మధ్య అనుక్రమమూ, అంతః సంబంధమూ ఉండినట్లు వారు చూడగలగడమే ఇందుకు కారణం. లౌకిక వస్తువుల పట్ల అనురక్తితో అంధత్వం పొందిన మన దృష్టికి, ఆధ్యాత్మిక జగత్తు చరిత్రా, ప్రాచీన మత సిద్ధాంతాల మధ్య నెలకొన్న అంతఃసంబంధమూ గోచరించవు. కాని గతంలో వెలసిన మత సంప్రదాయాల మధ్య 'సూత్రే మణిగణా ఇవ' - వివిధ మణులు ఒకే దారంతో కూర్చబడిన రీతిలో, ఒక సన్నిహిత సంబంధం ఉండడం ఆ అవతార పురుషుల అంతర్దృష్టికి స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే తమ కొంగ్రొత్త ఆధ్యాత్మికానుభూతి అనే మణిని ఆ మణిహారానికి చేర్చి, దాని ప్రకాశాన్ని ఇనుమడింపచేసి వారు నిష్క్రమిస్తారు.

26. శ్రీరామకృష్ణుల ఇతర అవతారపురుషుల ఆధ్యాత్మిక శక్తుల సాదృశ్యం

విదేశీయ మతాల చరిత్రను అధ్యయనం చేసినప్పుడు ఈ అంశం మనకు మరింత స్పష్టమౌతుంది. యూదీయ మతాచార్యులు ప్రచారం చేసిపోయిన ధార్మిక సత్యాలను ఏసుక్రీస్తు చెక్కుచెదరనివ్వక, తాను అనుభూతం చేసుకొన్న ధార్మిక సత్యాలను ప్రకటించడం ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. మళ్ళీ కొన్ని శతాబ్దాల తరువాత మహమ్మద్ ప్రవక్త ఏతెంచి ఏసుక్రీస్తు ప్రకటించిన సత్యానుభూతులను చెక్కుచెదరనివ్వక, తన సత్యావిష్కృతాలను ప్రచారం చేశాడు. ఈ విధంగా చూస్తే ప్రచారంలో ఉన్న పూర్వపు ధార్మిక సిద్ధాంతాలను, ఒక క్రొత్త ధార్మిక సిద్ధాంతం వచ్చి దుర్బలీకరించదని తేటతెల్లమవుతుంది. ప్రాచీన యూదీయ ఆచార్యుల స్థానాన్ని ఏసుక్రీస్తు ఆక్రమించుకోలేదు; అదే విధంగా మహమ్మద్ ప్రవక్త ఏసుక్రీస్తు స్థానాన్ని ఆక్రమించుకోలేదు. భగవత్సాక్షాత్కార ఫలసాధకతలో ప్రాచీన మతాలు నూతన మతాలకు దీటైనవే. ఆధ్యాత్మిక జగత్తులో అన్నిచోట్ల ఇదే నియమం వర్తిస్తుంది. భారతీయ మతసంప్రదాయాలన్నింటి విషయంలో కూడా ఇదే నియమం అనువర్తిస్తుంది. మన వైదిక ఋషులు, ఆచార్యవరేణ్యులు, పురాణ తాంత్రిక గ్రంథకర్తలు నానామతాలను,

సంప్రదాయాలను ప్రచారం చేసిపోయారు. వారు రూపొందించిన సాధనామార్గాలలో దేనినైనా ఎన్నుకొని, ప్రగాఢ విశ్వాసంతో అనుష్ఠిస్తే ఆ మార్గం ద్వారా నువ్వు కూడా భగవంతుని ఆయా భావాలను ప్రత్యక్షంగా సాక్షాత్కరించుకోగలవు. ఒకదాని తరువాత ఒకటిగా ఈ వివిధ మత సాధన లన్నిటినీ శ్రీరామకృష్ణులు అనుష్ఠించి, వాటిలో పరిపూర్ణత్వం సంతరించుకొని, తదనంతరం ఆ మహోన్నత సత్యాన్ని మాకు వెల్లడించి వెళ్ళిపోయారు.

27. అన్ని సంప్రదాయాలకు చెందిన సాధువులు, సాధకులు శ్రీరామకృష్ణుల వద్దకు రావడానికి హేతువు

''పువ్వులు వికసించిన తక్షణమే తుమ్మెదలు వ్రాలుతాయి.'' ఆధ్యాత్మిక జగత్తులో కూడా ఇదే నియమం వర్తిస్తుందని శ్రీరామకృష్ణులు మాతో అనేకసార్లు చెప్పివున్నారు. ఈ నియమాన్ని అనుసరించే అవతార పురుషులు తమ జీవితంలో ఎప్పుడు ఆధ్యాత్మిక సత్యాలను సాక్షాత్కరించుకొని సిద్ధి పొందిన తక్షణమే, వాటిని తెలుసుకోవడం కోసం ఆధ్యాత్మిక పిపాసువులు వారి పట్ల ఆకర్షితులై, వారి దరిచేరతారు. ఒక్క సంప్రదాయానికి చెందిన సాధకులు మాత్రమే కాక, అన్ని సంప్రదాయాలకూ చెందిన వారు బృందం వెంట బృందంగా వచ్చేవారు. ప్రతీ సాధన మార్గాన్ని అనుష్ఠించి, దాన్లో సిద్ధిపొంది ఆయా భగవద్భావాలను శ్రీరామకృష్ణులు సమగ్రంగా సాక్షాత్కరించుకోవడమే ఇందుకు కారణం. కాబట్టే ఆయా సాధన మార్గాలను గురించి ఆ మార్గాలను అనుసరించే సాధకులకు నిర్దిష్ట సమాచారం అందివ్వగలరనే వారందరూ ఒక అజ్ఞాత నియమానుసారం ఆయన వద్దకు వచ్చేవారు. కాని ఆయన వద్దకు వచ్చిన ప్రతీ సాధకుడూ తన మార్గంలో పరిపూర్ణతను సంతరించుకోలేదు; అలాగే శ్రీరామకృష్ణులను యుగావతార పురుషునిగా గుర్తించలేదు. వారిలో విశిష్ట సాధకులు మాత్రమే అలా చేయగలిగారు. కాని వారిలో ప్రతి ఒక్కరూ శ్రీరామకృష్ణుల దివ్యసాంగత్యం వలన తమ తమ మార్గాలలో మాత్రం పురోగమించగలిగారు. అలా తమ మార్గంలో పురోగమిస్తూ ఉంటే సరైన సమయంలో తమకు భగవత్సాక్షాత్కారం కలగడం తథ్యమని వారు ప్రగాఢంగా విశ్వసించారు. తాము అనుసరించే మతం పట్లా, మార్గం పట్లా విశ్వాసాన్ని కోల్పోవడమే ధర్మగ్లానికి కారణమని, అటువంటి సాధకులు ఆధ్యాత్మిక సత్యాలను ఆవిష్కరించుకోలేరని చెప్పడం అనవసరం.

దక్షిణేశ్వరానికి విచ్చేసిన సాధువుల నుండే భగవత్సాక్షాత్కారానికి దారితీసే సాధన పద్ధతులను నేర్చుకొని, కఠోర తపశ్చర్యలు శ్రీరామకృష్ణులు ఆచరించారనే వదంతి వ్యాప్తంలో ఉంది. అలా ఆచరించినందున ఒకానొక సమయంలో

28. వారి రాక శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక జాగృతం నిమిత్తం కాదు

ఆయనకు మతి చెడిందనీ, తీవ్రభావోద్వేగాల ప్రభావంతో బాహ్యచైతన్యాన్ని కోల్పోయే శాశ్వత భౌతిక రుగ్మత వాటిల్లిందనీ అనుకొంటారు. హే భగవాన్! మనం ఎంత చదువుకొన్న మూర్ఖులమో కదా! పరిపూర్ణ మనో ఏకాగ్రత ద్వారా సమాధి స్థితిలో లీనమైనప్పుడు బాహ్యచైతన్యం లుప్తమౌతుందని భారతీయ ఋషిపుంగవులు స్వానుభవపూర్వకంగా వేద పురాణాదుల మూలంగా వెల్లడించి ఉన్నారు. అంతేగాక ప్రపంచంలో ఏ ఇతర దేశస్థులకీ తెలియని సమాధి సంబంధిత శాస్త్రరహస్యాల నన్నిటినీ పూర్తి వివరాలతో మనకు వదలిపెట్టి వెళ్లారు. అలాగే లోకంలో అవతార పురుషులుగా పరిగణింపబడుతూ ఎవరు మానవాళి అర్చనలు చూరగొంటూ వచ్చారో, ఆ మహాపురుషు లందరూ తమ జీవితాలలో బాహ్యచైతన్యాన్ని కోల్పోవడం చవిచూసే ఉన్నారు. నిజానికి ఆ పరిణామం బాహ్యచైతన్యం కోల్పోవడం కాదనీ, అది ఆధ్యాత్మిక పురోగతి పరాకాష్ఠ స్థితి అనీ వాళ్లు పదేపదే మనకు వివరించి ఉన్నారు. ఇదంతా పరికించికూడా మనం ఆ నిరర్థకమైన మాటలు వినడంగాని పలకడంగాని చేస్తూపోతే, ఇక ఆ భగవంతుడే మనకు దిక్కు!

ఓ పాఠక మహాశయా! వారి అర్థరహితమైన విమర్శలను నువ్వు అంగీకరించే పక్షంలో ఒక్క నిజాన్ని మాత్రం తెలుసుకో; ఒక గ్రుడ్డి వ్యక్తిని అనుసరించిపోయే గ్రుడ్డివాళ్ల ఉదాహరణ నీకు వర్తిస్తుంది. నువ్వూ, నీ వంటి దృక్పథం ఉన్న ఇతరులూ వర్ధిల్లుగాక! కాని దైవోన్మత్తులైన అద్భుతమూర్తి పాదారవిందాల వద్ద కూర్చునే స్వేచ్ఛను మాత్రం దయచేసి మాకు వదలిపెట్టు. ఏదో ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చే ముందు మాత్రం నువ్వుకూడా ఈ ప్రశ్నను అవగతం చేసుకోవడానికి ప్రయత్నిస్తే ఎంతో బాగుంటుంది. కాని నీ నిర్ణయం ఈ క్రింది కఠోపనిషత్తు వచనాలు వివరించే దుర్గతికి దారితీయకుండా జాగ్రత్త వహించు.

> అవిద్యాయామంతరే వర్తమానాః
> స్వయంధీరాః పండితం మన్యమానాః ।
> దంద్రమ్యమాణాః పరియన్తి మూఢాః
> అంధేనైవ నీయమానా యథాంధాః ॥

-కఠోపనిషత్తు, *1.2.5*

[గాఢమైన అజ్ఞానంలో కూరుకుపోయి ఉన్న మూర్ఖులు తామే ప్రజ్ఞావంతులూ, మహావిద్వాంసులూ అనుకొంటూ గ్రుడ్డివాళ్ల చేతనే నడిపించబడే గుడ్డివాళ్లలా (సంసారంలో) తూలుతూ తడబడుతూ సుడులు (జననమరణ చక్రంలో) తిరుగుతూ ఉంటారు.]

29. శ్రీరామకృష్ణుల సమాధ్యవస్థ రుగ్మత కాదు : శివనాథ్‌తో సంభాషించడం

శ్రీరామకృష్ణుల భావసమాధిని రుగ్మతగా పేర్కొనడం క్రొత్త ఏమీకాదు. శ్రీరామకృష్ణులు జీవించి ఉన్నప్పుడు పాశ్చాత్య విధానంలో విద్యనభ్యసించిన పలువురు అలాగే పేర్కొన్నారు. కాని కాలం గడిచేకొద్దీ ఆ దివ్యోన్మత్త పురుషుని సంభాషణలు, భవిష్యద్వాణి విస్తృత ఆమోదాన్ని పొందడమే కాక, వాటి ప్రాముఖ్యం మరింతగా వెల్లడి కాసాగింది; దాంతో పై అభిప్రాయాలకు కాలదోషం పట్టింది. ప్రపంచ వ్యాప్తంగా జనులు ఉత్కంఠతో ఆయన అనుపమాన బోధనలను స్వీకరించసాగారు. ఆ విధంగా ఆయన భావసమాధిలో రుగ్మతను మాత్రమే చూడగలిగిన ఆ విమర్శకుల అవివేకం అజ్ఞానం బట్టబయలైంది. వారి విమర్శలు చంద్రుడిపై విసిరిన పిడికెడు దుమ్ము చందమైంది. ఆ విమర్శకుల కథనాలు భ్రమపూరితాలని చక్కగా తెలుసుకొని, జనులు శ్రీరామకృష్ణుల అనుభూతుల, బోధనల సత్యత్వాన్ని సమగ్రంగా అవగతం చేసుకోసాగారు. ఇదే ఇప్పుడూ జరుగుతున్నది, భవిష్యత్తులోనూ ఇదే జరుగనున్నది. ఎందుకంటే అగ్నిని బట్టలలో పెట్టి దాచడం ఎంత అసాధ్యమో, సత్యాన్ని దాచడమూ అంతే అసాధ్యం కనుక. కాబట్టి ఆ విషయాన్ని మరింత విశదీకరించనవసరం లేదు. ఈ విషయం గురించి స్వయంగా శ్రీరామకృష్ణులే వచించిన ఒకటి రెండు మాటలను ఉదాహరిస్తే సరిపోతుందని భావిస్తున్నాం.

మా మాన్యమిత్రులైన పండిత శివనాథశాస్త్రి సాధారణ బ్రహ్మసమాజ ప్రచారకులలో ఒకరు. శ్రీరామకృష్ణుల భావసమాధ్యవస్థను ఈయన నాడీ దుర్బలత కారణంగా ఏర్పడే అపస్మారం లేదా మూర్ఛరోగం అని మాలో కొందరితో, శ్రీరామకృష్ణులు జీవించి ఉన్నకాలంలోనే చెప్పారు. ఈ వ్యాఖ్యానం క్రమంగా శ్రీరామకృష్ణుల చెవిన పడింది. శ్రీరామకృష్ణుల భావసమాధుల పట్ల శివనాథశాస్త్రికి ఇటువంటి దృక్పథం ఉన్నప్పటికీ అతడు చాలాకాలం నుండి అప్పుడప్పుడు శ్రీరామకృష్ణుల దర్శనార్థం వస్తూవుండేవాడు. ఇలా ఉండగా ఒక రోజు శివనాథశాస్త్రి దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు ఈ ప్రస్తావన తెచ్చి శ్రీరామకృష్ణులు అతడితో ఇలా అన్నారు: ''ఇలా చూడు శివనాథ్! నువ్వు ఈ స్థితులను (భావసమాధులను) రుగ్మతలని పేర్కొంటున్నావట నిజమేనా? సమాధి సమయంలో నేను బాహ్యస్మృతిని కోల్పోతానని జనానికి చెబుతున్నావట! ఆహా, ఏం తర్కం! రేయింబవళ్లు ఇటుక, కర్ర, మన్ను, డబ్బు ఇత్యాది జడపదార్థాలను గురించే చింతన చేసే మీరు బాగానే ఉంటారు, జాగ్రదావస్థలోనే ఉంటారు. కాని ఎవరి చైతన్యంతో ఈ విశ్వం యావత్తు చైతన్యమయమైనదో ఆయననే సదా సర్వదా చింతన చేస్తూవున్న నేను మాత్రం చైతన్యరహితుణ్ణయ్యానా! నీ వివే

కాన్ని ఎక్కణ్ణుండి ఎరవు తెచ్చుకొన్నావు?'' శివనాథ్ మౌనంగా ఉండి పోయాడు.

మాతో శ్రీరామకృష్ణులు ప్రతిరోజు 'దివ్యోన్మాదం', 'జ్ఞానోన్మాదం' మొదలైన పదాలు ఉపయోగించి మాట్లాడేవారు. పన్నెండు సుదీర్ఘ సంవత్సరాల కాలంపాటు తమ జీవితంలో ఒక శక్తివంతమైన భగవదను రాగమనే తుపాను చెలరేగిందని తరచు మా అందరితో చెబుతూ ఉండేవారు. ఆయన తరచు ఇలా చెప్పేవారు: ''ఆహా! తుపాను వీచినప్పుడు ఎలా దుమ్ము ధూళి చెలరేగి అన్నీ ఒక్కటిగా కనబడతాయో, మామిడి పనస మొదలైన చెట్ల మధ్య వ్యత్యాసం ఎలా కాన రాదో, నాకూ అటువంటి అవస్థే కలిగింది. మంచీ చెడు, నిందాస్తుతులు, పవిత్రాపవిత్రాల మధ్య వ్యత్యాసం ఈ అవస్థలో నాకు తెలిసేది కాదు. భగవత్సాక్షాత్కారం ఎలా పొందడం అన్న ఏకైక ఆలోచన, భావన మాత్రం నాలో మెదలేది. ప్రతి క్షణం నా మనస్సును ఇదే ఆక్రమించి ఉండేది. లోకులు, 'ఈయన పిచ్చివాడయ్యాడు' అనేవారు.''

30. పిచ్చివాడిలా శ్రీరామకృష్ణులు ప్రవర్తించడానికి కారణం

తొలి రోజుల్లో దక్షిణేశ్వరానికి వచ్చిన పండితులైన సాధకులు కొందరు శ్రీరామకృష్ణుల పట్ల మహాభక్తిపరవశులైన ఆయన నుండి మంత్రదీక్షను, సన్న్యాసాన్ని సైతం స్వీకరించి వెళ్లిపోయారు. వారిలో పండితుడైన నారాయణశాస్త్రి ఒకరు. ఆయన ప్రాచీనకాలంనాటి నైష్ఠిక బ్రహ్మచారిలా గురువుల ఇళ్లలో నివసిస్తూ, అవిచ్ఛిన్నంగా ఇరవై ఐదు సంవత్సరాలపాటు వివిధ శాస్త్రాలు అధ్యయనం చేశాడని శ్రీరామకృష్ణుల ముఖతా మేం విన్నాం. షడ్దర్శనాల నన్నిటిని ఔపోసనపట్టాలనే ప్రగాఢ ఆకాంక్ష ఆయనకు ఉండేది. అందుకోసం కాశీ, భారతదేశ వాయవ్య ప్రాంతంలోని కొన్నిచోట్ల విభిన్న గురువుల వద్ద వసిస్తూ ఐదు దర్శనాలలో పారంగతుడయ్యాడు. కాని వంగదేశంలోని నవద్వీపానికి చెందిన సుప్రసిద్ధ పండితుల వద్ద షడ్దర్శనాలలో ఆరవదైన న్యాయదర్శనాన్ని అధ్యయనం చేయకుంటే, షడ్దర్శనాలలో పారంగతుడయ్యానని ప్రకటించుకోలేడు కదా! అందువల్లనే ఆయన దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను కలుసుకోవడానికి ఎనిమిది సంవత్సరాలకు మునుపే వంగదేశానికి వచ్చాడు. ఏడు సంవత్సరాలు నవద్వీపంలో వసించి న్యాయదర్శనం అధ్యయనం చేశాడు. అధ్యయనం పూర్తికాగానే ఇంటికి తిరిగి వెళ్లాలనుకొన్నాడు. మళ్లీ ఈ ప్రాంతాలకు వచ్చే ఆస్కారం ఉందో లేదోననే సంశయం బహుశా అప్పుడు ఆయనలో తలెత్తి ఉంటుంది. కాబట్టి కలకత్తా చూడడానికి వచ్చాడు. కలకత్తా పరిసరాలలో ఆయన

31. సాధకులకు శ్రీరామకృష్ణులు మంత్రదీక్ష నివ్వడం : ఉదాహరణకు శ్రీ నారాయణశాస్త్రి

సందర్శించిన స్థలాలలో దక్షిణేశ్వరం కూడా ఉంది. దక్షిణేశ్వరంలోనే శ్రీరామకృష్ణులను దర్శించుకొనే భాగ్యం శ్రీనారాయణశాస్త్రికి కలిగింది.

న్యాయ దర్శన అధ్యయన నిమిత్తం వంగదేశానికి రావడానికి పూర్వమే శ్రీనారాయణశాస్త్రి గొప్ప పండితుడిగా సుప్రసిద్ధుడు. ఆయన కీర్తి గురించి విని

32. శాస్త్రిగారి పుట్టుపూర్వోత్తరాలు

జైపూర్ మహారాజు ఒక సందర్భంలో తన ఆస్థాన పండితుడిగా పెద్ద వేతనంపై నియమించగోరి శాస్త్రిగారిని ఎంతో గౌరవంగా ఆహ్వానించాడన్న విషయం శ్రీరామకృష్ణుల నుండి మేం విన్నాం. కాని శాస్త్రిగారి విద్యాతృష్ణ అప్పటికి ఇంకా తీరలేదు. షడ్దర్శనాలలో పారంగతుడవాలన్న ఆయన ఆకాంక్ష అప్పటికి నెరవేరలేదు. కాబట్టి ఆయన మహారాజుగారి ఆహ్వానాన్ని సాదరంగా తిరస్కరించాడు. శాస్త్రిగారు రాజపుటానాకు చెందినవారని తెలియవస్తోంది.

నారాయణశాస్త్రిగారు సాధారణ పండితుల వంటి వారు కారు. శాస్త్రజ్ఞానార్జన పెంపొందేకొద్దీ ఆయనలో క్రమంగా వైరాగ్య బీజాలు అంకురింప

33. శ్రీరామకృష్ణులను ఆయన సందర్శించడం

సాగాయి. వేదాంతాది శాస్త్ర మర్మాలను కేవలం అధ్యయనం చేయడంతో మాత్రమే ఎవరూ వాటిని అర్థంచేసుకోలేరనీ, సాధన ద్వారా మాత్రమే వాటిని ఆకళింపు చేసుకోవచ్చుననీ శాస్త్రిగారు స్పష్టంగా అవగతం చేసుకొన్నారు. కాబట్టి శాస్త్రాధ్యయనం పూర్తికాని స్థితిలోనే ఆయనలో అప్పుడప్పుడు ఈ భావన మెదలేది: ''ఈ తీరులో నేను సరైన జ్ఞానాన్ని గడించలేకపోతున్నాననే భయం కలుగుతోంది. కొంతకాలం సాధనలు అనుష్ఠించి, శాస్త్రాలు వాక్రుచ్చే విషయాలను అనుభూతం చేసుకోవాలి.'' కాని ఆయన సాధనాదులలో నిమగ్నమవ్వాలనే తన ఆకాంక్షను అణచిపెట్టేశారు; మళ్లీ శాస్త్రాధ్యయనంలో పడ్డారు. రెంటికీ చెడ్డ రేవడిని అవుతానేమోనని భయపడడమే అందుకు కారణం. ఇప్పుడు షడ్దర్శనాలలో పారంగతుడవడమనే ఆయన చిరకాల మనోభీష్టం నెరవేరింది. ఇంటికి తిరిగి వెళ్లాలనుకొన్నారు. ఇంటికి తిరిగి వెళ్లాక యుక్తమైనది ఏదో చేయాలని అప్పటికే నిశ్చయించుకొన్నారు. అటువంటి శుభముహూర్తంలోనే శ్రీరామకృష్ణులను దర్శించుకొనే భాగ్యం ఆయనకు కలిగింది. శ్రీరామకృష్ణులను చూసిన క్షణంలోనే అంతుబట్టని రీతిలో ఆయన పట్ల ఆకర్షితుడైనాడు.

ఇంతకు మునుపే మేం చెప్పినట్లు ఆ రోజుల్లో దక్షిణేశ్వర కాళికాలయంలో అతిథులకు, ఫకీరులకు, సాధువులకు, సన్న్యాసినులకు, పండితులకు చక్కని వసతి, భోజన సౌకర్యాల ఏర్పాటు ఉండేది. నారాయణశాస్త్రిగారిని సాదరంగా ఆహ్వానించి ఇష్టమైనన్ని రోజులు అక్కడ బస చేయమని వారు చెప్పివుంటారన

డంలో వింత ఏమీ లేదు. అందుకు కారణం ఆయన సుదూర ప్రాంతం నుండి వచ్చిన బ్రాహ్మణ బ్రహ్మచారి, మరోవంక గొప్ప పండితుడుకూడా అయివుండ డమే. భోజనం, ఇతర అవసరాలు సమకూరుస్తూ, దివ్యమానవ సాంగత్యాన్ని కల్పించే ఆ స్థలం ఎంత సుందరమైనది! ఇదంతా చూసి శాస్త్రిగారు కొంతకాలం అక్కడ గడపాలని నిర్ణయించుకొన్నాడు. అలా కాక మరెలా నిర్ణయించుకొం టాడు? శ్రీరామకృష్ణులతో సాన్నిహిత్యం పెరిగేకొద్దీ ఆయన పట్ల శాస్త్రిగారికి ఒక రకమైన ప్రేమ, దానితోపాటు ఆయనను గురించి మరింత తెలుసుకోవాలనే ఆరాటం పెరగసాగాయి. సరళ హృదయుడూ, ఉదారచిత్తుడూ అయిన శాస్త్రి గారి సాంగత్యంలో శ్రీరామకృష్ణులు కూడా పరమానందభరితులై, భగవత్ప్ర సంగాలు చేస్తూ ఆయనతో ఎంతోసేపు గడపసాగారు.

వేదాంత శాస్త్రాలు అభివర్ణించే సప్తభూముల గురించి శాస్త్రిగారు చదివారు. మనస్సు నిమ్నభూములనుండి ఉన్నతోన్నత భూములకు అధిరోహించినప్పుడు,

34. శాస్త్రిగారి సంకల్పం

ఆ స్థితిలో అద్భుత అనుభూతులు, దర్శనాలు కలిగి చివ రకు నిర్వికల్ప సమాధి సిద్ధిస్తుందని శాస్త్రిగారు శాస్త్రాధ్య యనం వలన గ్రహించారు. ఆ స్థితిలో మనిషికి అఖండ సచ్చిదానంద స్వరూపు డైన బ్రహ్మవస్తువు సాక్షాత్కారం కలిగి, దాన్లో లయమైపోతాడు; ఫలితంగా యుగ యుగాంతరాల పర్యంతం వస్తూన్న సంసార భ్రమ ఏకమొత్తంగా అదృశ్యమై పోతుంది. తాను శాస్త్రగ్రంథాలలో చదివి, కంఠస్థం చేసుకొన్న వీటిని శ్రీరామ కృష్ణులు ప్రత్యక్షంగా సాక్షాత్కరించుకొన్నారని శాస్త్రిగారు గ్రహించారు. 'సమాధి', 'అపరోక్షానుభూతి' ఇత్యాది పదాలను తాను కేవలం ఉచ్చరిస్తున్నా ననీ, అయితే శ్రీరామకృష్ణులు ఈ స్థితులను ప్రత్యక్షంగా రేయింబవళ్లు అనుభ విస్తున్నారనీ శాస్త్రిగారు కనుగొన్నారు. అప్పుడు ఆయన ఇలా అనుకొన్నారు: 'ఆహా, ఎంత అద్భుతం! శాస్త్ర నిగూఢ మర్మాలను బోధించి, విశదీకరించే వ్యక్తి నాకు ఇక్కడకాక మరెక్కడ లభిస్తాడు? ఈ అవకాశాన్ని జారవిడువరాదు. ఏ విధంగానైనా బ్రహ్మజ్ఞానాన్ని పొందే సాధనోపాయాన్ని వీరినుండి తెలుసుకోవాలి. జీవితం అనిత్యం. ఎప్పుడు ఈ శరీరం రాలిపోతుందో ఎవరి కెరుక? సమ్యక్ జ్ఞానాన్ని పొందకుండానే మరణిస్తానేమో! అలా జరగడానికి వీల్లేదు. భగవత్సాక్షా త్కారార్థం చిత్తశుద్ధితో కనీసం ఒకసారైనా ప్రయత్నించాలి. ప్రస్తుతం ఇంటికి తిరిగి వెళ్లే ప్రసక్తే లేదు.'

శ్రీరామకృష్ణుల దివ్యసాంగత్య ఫలితంగా రోజులు గడిచేకొద్దీ శాస్త్రిగారిలో వైరాగ్యం, భగవత్సాక్షాత్కార పరితప్తత అధికం కాసాగాయి. 'నా పాండిత్యంతో

సర్వులనూ విస్మయపరుస్తాను', 'మహామహోపాధ్యాయ బిరుదాంకితుడనై కీర్తి ప్రతిష్ఠలు పొందుతాను' మొదలైన ఆకాంక్షలు హేయమైన లక్ష్యాలుగా ఆయనకు ఇప్పుడు గోచరించసాగాయి; క్రమేణా అవి ఆయన మనస్సునుండి అదృశ్యమైపోయాయి. శాస్త్రిగారు వినమ్రుడైన శిష్యుడిలా, శ్రీరామకృష్ణుల వచనామృతాన్ని సావధానంగా గ్రోలుతూ, తనలో ఇలా అనుకోసాగారు: 'ఇకపై మనస్సును భగవంతునిపై తప్ప మరే ఇతర విషయాలపై నిమగ్నం చేయను. ఎప్పుడు ఎలా శరీరం రాలిపోతుందో ఎవరికీ తెలియదు. ప్రస్తుతం ఇంకా వ్యవధి ఉన్నందున భగవత్సాక్షాత్కారానికై తీవ్రంగా కృషి చేయాలి.' మళ్లీ శ్రీరామకృష్ణులను చూసి ఇలా అనుకొనేవారు: 'ఆహా, ఈయన మానవజన్మ పొంది ఏం తెలుసుకోవాలో, దేనిని పొందాలో గ్రహించి ఎంత నిశ్చింతులై జీవిస్తున్నారో కదా! ఈయన మృత్యుంజయులైనారు. మృత్యువు, ఆయన ముందు భయానక 'కాళరాత్రి' నీడను సైతం పడేటట్లు చేయలేకపోయింది. సరే, ఇటువంటి మహాపురుషులు సత్యసంకల్పులౌతారని ఉపనిషత్కారులు వచిస్తున్నారు కదా. వీరి అనుగ్రహం పొందగలిగితే, సంసారపరమైన వాసనలన్నిటినీ లుప్తంచేసుకొని, బ్రహ్మజ్ఞానం సంతరించుకోవచ్చు. అటువంటప్పుడు ఆయన అనుగ్రహంకోసం నే నెందుకు ప్రార్థించకూడదు? ఆయనకు శరణాగతుడ నెందుకు కాకూడదు?' ఈ విధంగా పర్యాలోచనలు చేస్తూ నారాయణ శాస్త్రిగారు దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల సాంగత్యంలో జీవించసాగారు. తనను అనర్హునిగా ఎంచి ఆశ్రయం ఇవ్వరేమోనని తలచి శాస్త్రిగారు, హఠాత్తుగా శ్రీరామకృష్ణులను ఏదీ అభ్యర్థించలేకపోయారు. కాలం అలా దొర్లిపోసాగింది.

35. శాస్త్రిగారిలో వైరాగ్యోదయం

నానాటికీ శాస్త్రిగారి మనస్సులో వైరాగ్యం తీవ్రం కాసాగిందనడానికి ఈ క్రింది సంఘటన తార్కాణం. మైకేల్ మధుసూదన్ దత్త నాడు వంగదేశంలో సుప్రసిద్ధ కవి, పేరుమోసిన న్యాయవాది కూడా. ఆ సమయంలో అతడు రాణీరాస్మణి తరఫున ఒక వ్యాజ్యాన్ని నడిపిస్తున్నాడు. ఆ వ్యాజ్యం గురించి కొన్ని వివరాలు కచ్చితంగా తెలుసుకోవడానికి ఒక రోజు అతడు, రాణి బంధువు లొకరితో దక్షిణేశ్వర కాళికాలయానికి వచ్చాడు. తన సంప్రతింపులు పూర్తయ్యాక, మాటల మధ్యలో శ్రీరామకృష్ణులు అక్కడ వసిస్తున్నారని తెలుసుకొని, ఆయనను చూడాలనే కోర్కె వ్యక్తం చేశాడు. శ్రీరామకృష్ణులకు కబురు పంపగా, ఆయన మధుసూదన్‌తో మాట్లాడమని ముందుగా నారాయణశాస్త్రిగారిని పంపి, కాసేపయాక స్వయంగా తాము వెళ్లారు. మాటల సందర్భంలో శాస్త్రిగారు, హైందవమతాన్ని వదలి క్రైస్తవ మతాన్ని పుచ్చుకోవడానికి కారణం ఏమిటని మధుసూదన్‌ను ప్రశ్నించారు.

36. శాస్త్రిగారు : మైకేల్ మధుసూదన్

ఆర్థిక ఒత్తిళ్ళ నిర్బంధంచేత తాను అలా చేయవలసి వచ్చిందని మధుసూదన్ సమాధానం చెప్పాడు. ఒక అపరిచిత వ్యక్తికి తన కథను వెల్లడించడం ఇష్టంలేక అలా జవాబు చెప్పివుంటాడేమో అన్న సంశయానికి తావులేకపోలేదు. కాని అతడు నిజాన్ని దాచి ఎగతాళికో లేక వ్యంగ్యానికో అలా చెప్పడం లేదనీ, యథార్థమే చెబుతున్నాడనీ శ్రీరామకృష్ణులూ, అక్కడున్న ఇతరులూ అనుకొన్నారు. ఏది ఎలావున్నా ఆ జవాబు విని శాస్త్రిగారు ఎంతో చిరాకుపడ్డారు. "ఏమిటి? క్షణభంగురమైన సంసారం కోసం స్వధర్మాన్ని విడిచిపెట్టడమా? ఎంత అల్పత్వం! ఏదో ఒక రోజు చావవలసిందే కదా! మతం మార్చుకోడానికి బదులు నువ్వు చనిపోయివున్నా బాగుండేది!" అని అన్నారు. ఆ తరువాత, 'అయినప్పటికీ లోకులు గొప్ప వ్యక్తిగా ఎంచి, ఇతడి రచనలను ప్రశంసిస్తూ చదువుతారే' అని అనుకొన్నారు. శాస్త్రిగారి మనస్సు తిరస్కార భావంతో నిండిపోగా, ఆపైన అతడితో మాట్లాడడం ఆపేశాడు.

శ్రీరామకృష్ణుల ముఖతా ధార్మిక ఉపదేశం వినాలనే ఆకాంక్ష మధుసూదన్ వ్యక్తం చేశాడు. "నా నోటిని ఎవరో బలవంతంగా అణచివేసినట్లయింది. ఏం

37. శ్రీరామకృష్ణులు : మైకేల్

మాట్లాడడానికి నోరు పెగల్లేదు" అని గురుదేవులు ఆ సంఘటన గుర్తుకు తెచ్చుకొని మాతో చెప్పేవారు. హృదయ్, మరికొందరు ఇలా చెప్పారు: కాసేపటికి శ్రీరామకృష్ణుల ఆ భావం తొలగిపోగా, రాంప్రసాద్ కమలాకాంత్ తదితర సుప్రసిద్ధ సాధకుల పాటలు తమ శ్రావ్యమైన కంఠంతో పాడి మధుసూదన్‌ను ఆహ్లాదపరిచారు. ఆ పాటల ద్వారా భగవద్భక్తే సంసారంలో అత్యంత ప్రధానమైనదని అతడికి సూచించారు.

మైకేల్ మధుసూదన్ సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయాకకూడా అతడి ధర్మభ్రష్టత్వాన్ని శాస్త్రిగారు నిరసిస్తూనే ఉండిపోయారు. అంతేగాక శ్రీరామకృష్ణుల

38. తన అభిప్రాయాన్ని శాస్త్రిగారు గోడమీద వ్రాయడం

గదికి దారితీసే తలుపుకు తూర్పు వైపున ఉన్న వసారా గోడమీద బొగ్గుతో పెద్దపెద్ద అక్షరాలతో శాస్త్రిగారు ఇలా వ్రాశారు: "ఆర్థిక అవసరాల ఒత్తిళ్ళకు తలవొగ్గి స్వధర్మాన్ని విడిచిపెట్టడం అతినీచమైన కార్యం." బెంగాలీలో పెద్దపెద్ద అక్షరాలతో స్పష్టంగా శాస్త్రిగారు వ్రాసిన ఆ వాక్యాలు మా దృష్టిని ఆకర్షించి, మాలో కుతూహలం రేకెత్తించాయి. తరువాత ఒక రోజు విచారించగా జరిగినదంతా తెలియవచ్చింది. శాస్త్రిగారు వంగదేశంలో చాలాకాలం వసించినందున ఆయన బెంగాలీ భాషను క్షుణ్ణంగా నేర్చుకొన్నారు.

ఇక నారాయణశాస్త్రిగారి జీవితంలో మాకు తెలిసిన చివరి ఉదంతం. ఒక రోజు ఆయన శ్రీరామకృష్ణులను ఒక ఏకాంత ప్రదేశంలో కలుసుకొన్నారు. అదే

మంచి తరుణంగా ఎంచి, తన ఆంతరంగిక అభిలాషను వ్యక్తంచేసి, తనకు సన్న్యాస దీక్షను అనుగ్రహించమని గట్టిగా పట్టుపట్టారు. ఆయన ఉత్కంఠను గుర్తించి అందుకు శ్రీరామకృష్ణులు అంగీకరించారు; ఒక శుభదినాన ఆయనకు సన్న్యాసదీక్షను ఒసగారు. తదనంతరం శాస్త్రిగారు కాళికాలయాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయారు. వశిష్ఠాశ్రమానికి పోయి, బ్రహ్మసాక్షాత్కారం లభించేటంత వరకు తీవ్రసాధనలలో మగ్నులై ఉంటానని వెళ్లబోయే ముందు శ్రీరామకృష్ణులకు తెలిపారు. కళ్లు చెమ్మగిల్లగా, శ్రీరామకృష్ణుల పాదపద్మాలకు మ్రొక్కి, ఆయన ఆశీర్వాదాలకై ప్రార్థించి శాశ్వతంగా దక్షిణేశ్వరం విడిచి వెళ్లిపోయారు. ఆ తరువాత ఆయనను గురించి అంతగా ఏమీ తెలియరాలేదు; వశిష్ఠాశ్రమంలో[1] ఆరోగ్యం బాగా దెబ్బతిని మరణం ఆసన్నమయ్యే వరకు తీవ్ర తపశ్చర్యలలో కాలం వెళ్లబుచ్చారని మాత్రం తెలియవచ్చింది.

39. శాస్త్రిగారు సన్న్యాసం స్వీకరించడం

ఎప్పుడైనా చుట్టుప్రక్కల ఏ సంప్రదాయానికి చెందిన సాధువులైనా, సాధకులైనా, భక్తులైనా బసచేసి ఉన్నారని తెలియవస్తే, వారిని చూడాలనే కోర్కె శ్రీరామకృష్ణులకు కలిగేది. అటువంటి కోర్కె జనించగానే ఆహ్వానం లేకుండానే వారి వద్దకు వెళ్లి భగవత్ప్రసంగంలో కొంతసేపు వారితో గడిపి తిరిగి వచ్చేవారు. అలా ఆహ్వానం లేకుండా వెళితే లోకులు ఏమనుకొంటారో, అపరిచితులైన ఆ సాధకులు తన రాకపట్ల సంతోషిస్తారో లేదో, తన పట్ల సముచితంగా ప్రవర్తిస్తారో లేదో అన్న ఆలోచనలు ఎన్నడూ ఆయనలో తలెత్తేవి కావు. ఏదో విధంగా ఆ సాధకుల వద్దకు వెళ్లి, వారు ఏ మార్గానికి చెందినవారో, తమ లక్ష్యం దిశగా వారెంత పురోగమించారో తదితర విషయాల గురించి సరైన అవగాహన కలిగేటంత వరకు ఆయన మనస్సు కుదుటపడేది కాదు. అదే విధంగా శాస్త్ర పండితులైన సాధకులు ఎవరైనా ఉన్నారని తెలియవస్తే శ్రీరామకృష్ణులు పైవిధంగానే ప్రవర్తించేవారు. పండితుడైన పద్మలోచన్, దయానంద సరస్వతి మొదలైన వారిని ఆయన అదే విధంగా సందర్శించారు; వారి జీవిత కథలను అప్పుడప్పుడు మాకు చెప్పడంకూడా కద్దు. ముందుగా పద్మలోచన్ కథను పాఠకులకు ఇక్కడ వివరించనున్నాం.

40. సాధువులను, సాధకులను శ్రీరామకృష్ణులు సందర్శించడం

---

1. అస్సాం రాష్ట్రంలో గౌహటీ నగరానికి సమీపంలో ఒక వశిష్ఠాశ్రమం ఉండేది. నారాయణ పండితుడనే ఒక సన్న్యాసి అక్కడ కఠోర తపస్సు ఆచరించి చనిపోయాడని స్థానికులు ఇప్పటికీ చెప్పుకొంటారు. బహుశ ఆయనే శ్రీరామకృష్ణుల నుండి సన్న్యాస దీక్ష పుచ్చుకొన్న నారాయణశాస్త్రిగారు అయివుండవచ్చు.

శ్రీరామకృష్ణులు అవతరించడానికి మునుపు వంగదేశంలో వేదాంత అధ్యయనం విస్తృతి గాంచలేదు. ఆదిశంకరులు అనేక శతాబ్దాలకు పూర్వం ఈ ప్రాంతంలోని తాంత్రికులను తర్కవాదంలో పరాజితులను చేశారు; కాని జనసామాన్యంలో మాత్రం ఆయన తమ అద్వైత సిద్ధాంతాన్ని వేళ్లూనింప చేయలేకపోయారు. పర్యవసానంగా అద్వైత సిద్ధాంత అత్యున్నత సూత్రాలను తాంత్రికులు అంగీకరించి తమ ఉపాసనా ప్రణాళికలలో వాటిని ప్రవేశపెట్టినప్పటికీ, అప్పటికే ప్రాచుర్యంలో ఉన్న ఉపాసనా పద్ధతులనే కొనసాగించారు.

41. వంగదేశంలో న్యాయ దర్శనం

వంగదేశ పండితులు మాత్రం తమ మెదళ్లను న్యాయదర్శన అధ్యయనం లోనే వినియోగించి, 'నవ్యన్యాయ' మనే కొత్తశాఖను రూపకల్పనచేసి దార్శనిక రంగంలో ఒక అద్భుత విప్లవాన్ని కొనితెచ్చారు. వంగదేశస్థులు న్యాయదర్శనాన్ని ఈ మేరకు ఉడుములా పట్టుకోవడానికి కారణం ఏదైనా ఉందా? తర్కవాదంలో ఆదిశంకరులచే పరాజితులై, పరాభవాన్ని పొందడమే ఇందుకు కారణమేమో ఎవరు చెప్పగలరు? ఏదైనా ఒక రంగంలో ఒక ఫలానా జాతి మరో జాతిచే పరాజయం చవిచూసినప్పుడు, పరాజయం పొందిన ఆ జాతి అభిమానంతో, బాధతో క్రుంగిపోయి, ఆ రంగంలో అందరినీ మించడానికి ప్రయత్నం చేయడం ప్రపంచ చరిత్ర పదేపదే చాటుతూనే ఉంది.

42. వేదాంత పండితుడు పద్మలోచన్

తంత్ర న్యాయ శాస్త్రాలకు పట్టుగొమ్మ అయిన వంగదేశంలో వేదాంత అధ్యయనం అరుదైనా, ఉదార వేదాంత నిర్ణయాల పట్ల జనం ఆకర్షితులైన వారిలో పండితుడు పద్మలోచన్ ఒకరు. న్యాయదర్శనంలో కోవిదుడైన తరువాత వేదాంత అధ్యయనం చేయాలనే ఆకాంక్ష పద్మలోచన్‌కు కలిగింది. ఆయన కాశీకి వెళ్లి సమర్థులైన గురువుల వద్ద సుదీర్ఘకాలం వేదాంతం అధ్యయనం చేశాడు. దానితో కొద్ది సంవత్సరాలలోనే ఆయన వేదాంత పండితుడిగా సుప్రసిద్ధుడైనాడు. తదనంతరం బర్ద్వాన్ మహారాజు ఆహ్వానం మేరకు, ఆయన ఆస్థానంలో పండితునిగా పదవి స్వీకరించాడు. పద్మలోచన్ అద్భుత పాండిత్య ప్రతిభ నానాటికీ ఇనుమడించడం చూసి, త్వరలోనే మహారాజు ఆయనను ప్రధాన ఆస్థాన పండితునిగా నియమించాడు. క్రమంగా పద్మలోచన్ కీర్తి వంగదేశం నలుమూలలా వ్యాపించింది.

పద్మలోచన్ అద్భుత మేధాసంపత్తిని చాటే ఒక విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం అప్రస్తుతం కాబోదు. ఆధ్యాత్మికతకు చెందిన ఏ విషయంలోనైనా సంకుచిత అభిప్రాయాలను వ్యక్తం చేయడం నీచప్రవృత్తినే సూచిస్తుందని

43. పద్మలోచన్ మేధాసంపత్తి

వ్యాఖ్యానిస్తూ శ్రీరామకృష్ణులు కొన్ని సందర్భాలలో ఈ అంశంపై పద్మలోచన్ వ్యాఖ్యానాలను ఉదాహరించేవారు. శ్రీరామకృష్ణులు ఎప్పుడైనా ఎవరినుండైనా ఉదార భావాలను వ్యక్తంచేసే పలుకులు వినేపక్షంలో వాటిని సదా జ్ఞాపకంలో పెట్టుకొని మాటల సందర్భంలో వాటిని ఉదాహరించడం కద్దు. ఆయన సత్యనిష్ఠకు తగ్గట్లు ఎవరినుండి ఆ వచనాలు తాము మొదట విన్నారో వారి పేరునుకూడా తప్పక తెలిపేవారు.

44. శివుడా, విష్ణువా ఎవరు గొప్ప?

ఒకప్పుడు బర్ద్వాన్ రాజాస్థానంలో 'శివుడు గొప్ప, విష్ణువు గొప్ప?' అనే వివాదం పండితుల మధ్య చెలరేగిందని శ్రీరామకృష్ణులు చెప్పారు. ఆ సమయంలో పద్మలోచన్ సభలో లేడు. ఆ వాగ్వాదంలో పాల్గొన్న పండితులు తమ శాస్త్రజ్ఞానంతో లేదా బహుశా తమ అభిమానం మేరకు కొందరు శివుడు గొప్పవాడని, మరికొందరు విష్ణువు గొప్పవాడని పేర్కొంటూ సభలో కలకలం లేవదీశారు. ఆ విధంగా మాటామాటా పెరిగి ఆ వాగ్వాదం రెండు వర్గాల, శైవుల వైష్ణవుల మధ్య దాదాపు కొట్లాటకు దారితీసింది. కాని సమస్యకు పరిష్కారం మాత్రం అంతుబట్టలేదు. అందువలన ఆస్థాన ప్రధాన పండితుణ్ణి రావించి, సమస్యకు పరిష్కారం తేల్చమన్నారు. పద్మలోచన్ సభకు వచ్చాడు. సమస్యను విని, సభ నుద్దేశించి ఇలా చెప్పాడు: ''నా పధ్నాలుగు తరాల వారిలో ఏ ఒక్కరూ శివుణ్ణిగాని విష్ణువునుగాని ఎన్నడూ చూసిందిలేదు. అటువంటప్పుడు ఎవరు గొప్ప, ఎవరు తక్కువ అని నే నెలా నిర్ణయించి చెప్పగలుగుతాను? కాని శాస్త్రాలు ఏం చెబుతున్నాయో మీరు తెలుసుకోగోరితే, శైవ శాస్త్రాలు శివుడు గొప్పవాడని, వైష్ణవ శాస్త్రాలు విష్ణువు గొప్పవాడని పేర్కొంటున్నాయని మాత్రం చెప్పవలసి వస్తుంది. కాబట్టి తమ ఇష్టదైవమే, తక్కిన ఇతర దేవత లందరికంటే శ్రేష్ఠుడని భావించాలి.'' ఇలా వ్యాఖ్యానించి పద్మలోచన్ శివ విష్ణువుల మహత్త్వాన్ని చాటే కొన్ని శ్లోకాలు ఉదాహరించి, చివరకు వారిద్దరూ గొప్పతనంలో సరిసమానులే అని తన నిర్ణయాన్ని వెల్లడించాడు. ఈ నిర్ణయంతో పండితుల మధ్య చెలరేగిన కలహం సద్దుమణిగింది; అందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ దాపరికంలేని, సూటిగా తెలిపిన, ఆడంబరరహితమైన శాస్త్రపరిజ్ఞానం ఆయన మేధాసంపత్తికి ప్రమాణమనీ, ఇదే ఆయన పేరు ప్రతిష్ఠలకు కారణమనీ ఈ సంఘటన నుండి మనం గ్రహించవచ్చు.

కేవలం శాస్త్రాల శబ్దజాలమనే మహారణ్యంలో సుదూరం చొచ్చుకుపోయి నందువలన మాత్రమే పద్మలోచన్ సుప్రసిద్ధుడైనాడనడం సబబు కాదు. ఆయన జీవన విధానం ప్రతిబింబించే ఉదారత, వైరాగ్యం, సత్ప్రవర్తన, తపశ్చర్యలు,

ప్రగాఢ భగవద్భక్తి మొదలైన ఉదాత్త సద్గుణాలను పరికించి లోకులు ఆయనను
45. పద్మలోచన్ భగవదనురాగం
అసాధారణమైన ఒక గొప్ప సాధకుడిగా, మహాభక్తుడిగా పరిగణించారు. నిజమైన పాండిత్యం, ప్రగాఢ భగవద్భక్తి ఏకకాలంలో ఒక వ్యక్తిలో ఉండడం ఎంతో అరుదైన విషయం. ఏ వ్యక్తిలో ఈ రెండూ కలగలిసి ఉంటాయో ఆ వ్యక్తిపట్ల లోకులు ఆకర్షితులవడం సహజం. కనుక పండిత పద్మలోచన్ గురించి వినగానే శ్రీరామకృష్ణులకు అటువంటి సత్పురుషుణ్ణి సందర్శించాలనే ఆకాంక్ష జనించడంలో వింతేమీ లేదు. బర్ద్వాన్ రాజాస్థాన ప్రధాన పండితుడిగా చాలాకాలం పదవి నలంకరించిన పద్మలోచన్ అప్పటికి కాస్త వయస్సు పైబడ్డ వ్యక్తే అయివుండాలి.

మనస్సులో ఏదైనా ఆకాంక్ష జనించగానే శ్రీరామకృష్ణులు, బాలుడి మాదిరి, దానిని నెరవేర్చుకోవడానికి ఎంతో ఆతురత చెందేవారు. ఈ విశిష్ట
46. పద్మలోచన్ కలకత్తాకు రావడం
లక్షణాన్ని ఆయన బహుశా చిన్ననాటినుండి అలవరచుకొని ఉండివుంటారు. ''జీవితం క్షణభంగురం, కనుక చేయవలసింది వెంటనే చేసెయ్యి'' - ఈ సూక్తిని ఆయన చిత్తశుద్ధితో తన జీవితంలో పాటించారు. అదే విధంగా తన ఆదర్శంపట్ల ప్రగాఢ నిష్ఠ, ఏకాగ్రతను అభ్యసించిన ఫలితంగా మనస్సు స్వభావం ఆ రీతిలో మారిపోతుందని కించిత్తు పర్యాలోచిస్తే మనం స్పష్టంగా గ్రహించవచ్చు.

ఏది ఏమైనప్పటికీ శ్రీరామకృష్ణుల ఆతురతను చూసి ఆయనను బర్ద్వానుకు పంపాలనుకొన్నాడు మథుర్‌బాబు. ఈలోపు దీర్ఘకాల అనారోగ్య కారణంగా పద్మలోచన్‌ను గంగాతీరంలోని అరియదాహలోని ఒక ఉద్యానగృహానికి తరలించారు. వాతావరణ మార్పు, స్వచ్ఛమైన గాలి పీల్చడం ఫలితంగా పద్మలోచన్ ఆరోగ్యం కొంత మెరుగుపడిందనే సమాచారం తెలియవచ్చింది. ఆ సమాచారం నిజమో కాదో తెలుసుకొని రమ్మని హృదయ్‌ను పంపారు.

హృదయ్ వెళ్లి వచ్చి ఆ సమాచారం నిజమేనని రూఢిపరిచాడు. పద్మలోచన్‌కూడా, శ్రీరామకృష్ణులను గురించి విని, ఆయనను చూడాలనే ఆతురతతో ఉన్నాడని తెలియవచ్చింది. శ్రీరామకృష్ణుల సమీప బంధువని తెలుసుకొని హృదయ్‌పట్ల ఆయన ఎంతో గౌరవం చూపాడు. ఒక మంచిరోజు చూసుకొని పద్మలోచన్‌ను కలుసుకోవడానికి శ్రీరామకృష్ణులు బయలుదేరారు. హృదయ్ ఆయనకు తోడుగా వెళ్లాడు.

మొట్టమొదటిసారి కలుసుకొన్నప్పుడు శ్రీరామకృష్ణులు, పద్మలోచన్ ఒకర్నొకరు చూసి ఎంతో ఆనందించారని హృదయ్ చెప్పేవాడు. చూడగానే పద్మలోచన్ సాధకుడైన ఉదారస్వభావుడనీ, మహాపండితుడనీ శ్రీరామకృష్ణులు

గుర్తించారు. అలాగే శ్రీరామకృష్ణులు కూడా అత్యున్నత ఆధ్యాత్మికావస్థను

47. శ్రీరామకృష్ణ పద్మలోచన్‌ల ప్రథమ సమావేశం

సిద్ధించుకొన్న మహాపురుషులని పద్మలోచన్ గ్రహించాడు. సుమధుర కంఠంతో శ్రీరామకృష్ణులు జగజ్జననిని గురించి పాడిన పాటలు విని పద్మలోచన్ కళ్లు బాష్పపూరితాలైనాయి. అంతేగాక సమాధ్యవస్థలో పదేపదే శ్రీరామకృష్ణులు బాహ్యస్మృతిని కోల్పోవడం చూసీ, ఆ అవస్థలో ఆయనకు కలిగే అనుభూతుల గురించి వినీ పద్మలోచన్ స్తబ్ధుడయ్యాడు. శాస్త్రకోవిదుడైన పద్మలోచన్ శాస్త్రాలలో నమోదైన ఆధ్యాత్మికావస్థలతో, శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మికావస్థలను పోల్చడానికి ప్రయత్నించే ఉంటాడు. అలా ప్రయత్నించినప్పటికీ ఆతడు ఆ రోజు ఎటువంటి నిర్ణయానికి రాలేక ఎంతో ఇబ్బంది పడివుంటాడనడం నిస్సందేహం. ఎందుకంటే శ్రీరామకృష్ణుల చరమానుభూతులను శాస్త్రాలలో నమోదైన వాటిలో కనుగొనలేక, శాస్త్ర వచనం నిజమో లేదా శ్రీరామకృష్ణుల అనుభవాలు సత్యాలో తేల్చుకోలేక సతమతమై ఉంటాడు కనుక. కాబట్టి శాస్త్రజ్ఞానం, సూక్ష్మబుద్ధి సహాయంతో ఆధ్యాత్మిక విషయా లన్నిటిలో కచ్చితమైన నిర్ణయాలు చేయగల పద్మలోచన్ వివేచనాత్మకమైన మనస్సు నాడు పరమానందంలో సైతం వెలుగులో నీడలా ఇతమిత్థంగా తెలియని ఒక అశాంతిని పొందింది.

మొదటి పరిచయం నుండి ఒకరిపట్ల ఒకరికి ఏర్పడిన అభిమానం

48. శ్రీరామకృష్ణుల పట్ల పద్మలోచన్ భక్తి ప్రపత్తులు పెంపొందడానికి కారణం

ఆకర్షణల కారణంగా శ్రీరామకృష్ణ పద్మలోచన్‌లు మరికొన్ని సార్లు కలుసుకొన్నారు. పర్యవసానంగా శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అవస్థ గురించి పద్మలోచన్‌కు ఏర్పడిన విశ్వాసం ప్రగాఢతరం కాసాగింది. ఆ విశ్వాసం ప్రగాఢతరం కావడానికి మరొక విశేష కారణం కూడా ఉంది. దానిని గురించి మేం స్వయంగా శ్రీరామకృష్ణుల ముఖతా విన్నాం.

పండిత పద్మలోచన్ వేదాంత అధ్యయనం, బోధనతోపాటు తంత్రశాస్త్రాలు నిర్దేశించిన సాధనలనుకూడా చాలాకాలం నుండి అనుష్ఠిస్తూ వచ్చాడు. ఈ సాధనల ఫలితంగా ఆతడికి కొంత ఆధ్యాత్మికానుభూతి కూడా కలిగింది. కొన్ని ఆధ్యాత్మిక సాధనల మూలంగా పద్మలోచన్ సంతరించుకొన్న శక్తి రహస్యాన్ని జగజ్జనని తనకు వెల్లడించిందని శ్రీరామకృష్ణులు తెలిపారు. ఆతడి ఇష్టదైవమైన దేవి అతడి సాధనల పట్ల ప్రసన్నురాలై అతడి కొక వరం ప్రసాదించిందని శ్రీరామకృష్ణులు తెలుసుకొన్నారు. తద్ద్వారా అనేక పండిత సదస్సులలో అజేయుడై తన శ్రేష్ఠత్వాన్ని పద్మలోచన్ పరిరక్షించుకొన్నాడు. సదా తన వద్ద ఒక తువ్వాలు, నీటితో నిండిన చెంబును పద్మలోచన్ ఉంచుకొనేవాడు. ఆతడు వాటిని చేత

పుచ్చుకొని అటూ ఇటూ పచార్లుచేసి వచ్చి, ఆ నీటితో ముఖం కడుక్కొని, తలమీద నీరు చల్లుకొని ఆ తరువాత సమస్య పరిష్కారానికి పూనుకొనేవాడు. ఇది అతడి అలవాటు. ఆతడి ఈ విచిత్ర అలవాటుకు కారణం ఏమిటో కనుగొనాలనే కుతూహలం ఎవరికీ కలగలేదు; దీని వెనుక ఏదో నిగూఢమైన ఉద్దేశం ఉంటుందనీ ఎవరూ ఊహించనూ లేదు. తన ఇష్టదైవం ఆజ్ఞ మేరకే తాను అలా చేస్తున్నాననే రహస్యం ఎవరికీ, చివరకు తన భార్యకు సైతం అతడు వెల్లడించలేదు. అలా చేసినప్పుడు మేధస్సు, శాస్త్రజ్ఞానం, దైవానుగ్రహం కలిసి అతణ్ణి అలా చేయమని ప్రేరేపించేవి. నాటి నుండి ఆ సలహాను తు.చ. తప్పక పాటిస్తూ, ఎవరికీ తెలియరాని రీతిలో సత్ఫలితాలను పొందుతూ వచ్చాడు.

49. పద్మలోచన్ అద్భుత శక్తిని గురించి శ్రీరామకృష్ణులకు తెలియడం

జగజ్జనని అనుగ్రహంతో పద్మలోచన్ శక్తి రహస్యం గురించి తెలుసుకోగలిగానని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఇలావుండగా ఒక రోజు అదను కనిపెట్టి ఆయన పండితుడి తువ్వాలు, నీటిచెంబు దాచేశారు. ఆ వస్తువులు లేకపోవడంతో చర్చిస్తూన్న సమస్య పరిష్కారంలో నాడు పద్మలోచన్ పాల్గొనక, ఆ వస్తువులను వెతకడంలో నిమగ్నుడయ్యాడు. ఆ తరువాత శ్రీరామకృష్ణులే వాటిని దాచిపెట్టారని తెలిశాక అతడి ఆశ్చర్యానికి హద్దులేకపోయింది. తన రహస్యం తెలియడం వలననే శ్రీరామకృష్ణులు అలా చేశారని పండితుడు గ్రహించి, శ్రీరామకృష్ణులను తన ఇష్టదైవంగా ఎంచి ఆయనను స్తుతిపూర్వకంగా శ్లాఘించకుండా ఉండలేకపోయాడు. ఆనాటినుండి పండితుడు శ్రీరామకృష్ణులను భగవదవతారంగా పరిగణించి, ఆయన పట్ల ఆ మేరకు భక్తిప్రపత్తులతో మెలగసాగాడు. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: "పద్మలోచన్ అంత గొప్ప పండితుడైనప్పటికీ, దీనిపట్ల (తనపట్ల) భక్తి విశ్వాసాలు కలిగి ఉండేవాడు. అతడు ఇలా అనేవాడు: 'నా ఆరోగ్యం కుదుటపడ్డ తరువాత పండితు లందరినీ సమావేశపరచి, మీ రొక భగవదవతారమని వారికి చాటిచెబుతాను. నా మాటను ఎవరు ఖండిస్తారో చూస్తాను.' మథుర్‌బాబు ఒక సందర్భంలో, ఏదో మరొక కారణంగా అనేకమంది పండితులను రావించి, ఒక పండిత సదస్సును దక్షిణేశ్వరంలో ఏర్పాటు చేయబోయాడు. పద్మలోచన్ లోభరహితుడూ, నిష్ఠాగరిష్ఠుడూ అయిన బ్రాహ్మణుడు కావడంచేత ఎన్నడూ నిమ్నకులస్థుడి నుండి ఎటువంటి కానుకా పుచ్చుకోడు. ఈ కారణంగా అతడు పండిత సదస్సుకు రాడేమోనని మథుర్ అనుమానించి, సదస్సుకు హాజరయ్యేలా పద్మలోచన్‌కు విజ్ఞప్తి చేయమని నన్ను కోరాడు. మథుర్ కోర్కె మేరకు పద్మలోచన్‌ను ఆప్యాయంగా, 'మీరు దక్షిణేశ్వరానికి రాగలరా?' అని అడిగాను. అందుకు

అతడు, 'మీతోపాటు పాకీవారి ఇంటికికూడా వచ్చి, అక్కడ భోజనం చేస్తాను. అటువంటప్పుడు ఇతరుల ఇళ్ల సంగతి ప్రత్యేకంగా చెప్పాలా?' అన్నాడు.''

50. కాశీలో పద్మలోచన్ పదము పదించడం

కాని మథుర్ సమావేశపరచిన పండిత సదస్సుకు పద్మలోచన్ రాలేక పోయాడు. సదస్సు జరగడానికి ముందే ఆయన ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. కంట తడిపెట్టుకొని శ్రీరామకృష్ణుల నుండి సెలవు పుచ్చుకొని కాశీకి వెళ్లిపోయాడు. కొద్ది కాలంలోనే అక్కడే ఆయన దివంగతుడైనాడని తెలియవచ్చింది.

పై సంఘటన జరిగిన చాలాకాలం తరువాత కొందరు కలకత్తా భక్తులు శ్రీరామకృష్ణుల పాదపద్మాలను ఆశ్రయించి రాసాగినప్పుడు, భక్తిపారవశ్యంలో వారు బాహాటంగా ఆయనను భగవదవతారంగా అభివర్ణించారు. అప్పుడు పై విషయం తెలియరాగా, అలా అభివర్ణించవద్దని శ్రీరామకృష్ణులు వారిని కట్టడి చేశారు. కాని వారు అలా చాటడం మానలేదు. దానితో ఆయన విసుగుచెందే వారు. దానిని గురించి మాతో ఇలా చెప్పారు: ''వారిలో ఒకరు వైద్యుడు, మరొకరు నాటకశాల కార్యనిర్వాహకుడు. వారు ఇక్కడకు అప్పుడప్పుడు వచ్చి నన్ను ఒక అవతారమూర్తిగా పేర్కొనేవారు. అలా పేర్కొని నన్నేదో గొప్ప వాణ్ణి చేస్తున్నామని వారు భావించేవారు. కాని అవతారం అంటే ఏమిటో వారికి తెలుసా? వారు ఇక్కడకు వచ్చి నన్ను అవతారమూర్తిగా పేర్కొనడానికి చాలా కాలం మునుపే తమ యావజ్జీవితాలు ఇటువంటి విషయాలను అధ్యయనం చేయడంలో గడిపిన పద్మలోచన్ వంటి మహాపండితు లెందరో - వారిలో కొందరు షడ్దర్శనాలలో, మరికొందరు మూడు దర్శనాల్లో పారంగతులైనవారు - ఇక్కడకొచ్చి నన్ను అవతారంగా అభివర్ణించి వెళ్లారు. అవతారం అని పేర్కొబడడం నాకు రోతగా పరిణమించింది. అలా నన్ను పేర్కొనడంలో నాకు అదనంగా ఏం గొప్పతనం ఆపాదిస్తున్నారు?''

పద్మలోచనే కాకుండా అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు మరికొందరు సుప్రసిద్ధ పండితులనుకూడా కలుసుకొన్నారు. మాటల సందర్భంలో అప్పు డప్పుడు మాతో, వారిలో తాను చూసిన విశేష సద్గుణాలను గురించి ఆయన చెప్పేవారు. అటువంటి సుప్రసిద్ధ వ్యక్తులలో కొందరిని గురించి ఇక్కడ ప్రస్తా వించడం అసంగతం కాబోదు.

ఆర్యసమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి. ఒకప్పుడు ఆయన తన పర్యాటనలో వంగదేశానికి వచ్చాడు. ఉత్తర కలకత్తాలోని బారానగర్‌కు చెందిన సింథి అనే పల్లెలో, ఒక పెద్దమనిషి ఉద్యానంలో కొద్దిరోజులు బస చేశాడు. మహాపండితుడిగా అప్పటికే ఆయన సుప్రసిద్ధుడు. కాని అప్పటికి ఇంకా

ఆయన ఆర్యసమాజాన్ని స్థాపించలేదు, తన మూలసిద్ధాంతాలను ప్రచారమూ చేయలేదు. ఆయన గురించి విని శ్రీరామకృష్ణులు ఒక రోజు ఆయనను చూడబోయారు. స్వామి దయానంద గురించి మాటల సందర్భంలో ప్రస్తావించి మాతో ఒక సందర్భంలో ఇలా చెప్పారు: ''సింథి ఉద్యానంలో బసచేసి ఉన్న ఆయనను చూడడానికి వెళ్లాను. ఆయన కొంతశక్తి సముపార్జించాడని కనుగొన్నాను. ఆయన రొమ్ము సదా ఎర్రబారి ఉండేది. వైఖారి అవస్థలో ఉండి, రేయింబవళ్లు శాస్త్రాంశాలను గురించి మాట్లాడుతూండేవాడు. వ్యాకరణ ప్రయోగాలతో అనేక పదాల అర్థాలను తలక్రిందులు చేసేవాడు. 'నే నేదో చేస్తాను, ఒక సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తాను' అనే అహం ఆయన మనస్సులో ఉండేది.''

51. దయానంద సరస్వతిని గురించి శ్రీరామకృష్ణులు

జయనారాయణ్ పండితుణ్ణి గురించి శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ''మహా పండితుడైనప్పటికీ, అతడిలో అహంకారం లేదు. తన మరణం గురించి అతడికి ముందుగానే తెలుసు; తాను కాశీకి వెళ్లి అక్కడ మరణిస్తానని చెప్పేవాడు. నిజానికే అట్లాగే జరిగింది.''

52. జయనారాయణ్ పండితుడు

అరియదాహ్ వాస్తవ్యుడైన కృష్ణకిశోర్ భట్టాచార్యకు తమ పట్ల గల భక్తిప్రపత్తులను గురించి శ్రీరామకృష్ణులు అనేక సందర్భాలలో ప్రస్తావించేవారు. ఆయన అతడి ఇంటికి వెళ్లివచ్చేవారు. మహాభక్తురాలైన కృష్ణకిశోర్ భార్యకూడా శ్రీరామకృష్ణుల పట్ల ఎంతో భక్తి ప్రపత్తులు చూపేది. కృష్ణకిశోర్ భక్తివిశ్వాసాలు అసాధారణమైనవి. 'రామ' నామం పట్లనే కాక 'మరా, మరా' పట్లకూడా కృష్ణకిశోర్‌కు ఎంతో భక్తిప్రపత్తులుండేవి. అందుకు కారణం: రామ మంత్రాన్ని నారదమహర్షి, అప్పటికి దారిదోపిడీగాడైన వాల్మీకికి ఆ రీతిలో ఉపదేశించాడని పురాణాలు వచిస్తున్నాయి. ఆ రామ మంత్రాన్ని జపం చేస్తూపోగా వాల్మీకి మనస్సులో శ్రీరామచంద్రుడి అద్భుత దివ్య లీల అభివ్యక్తమైంది. దాంతో ఆయన ఆదికవియై రామాయణాన్ని రచించాడు. కృష్ణకిశోర్ సంసారంలో ఎన్నో ఇక్కట్లకు, బాధలకు గురియైనాడు. యుక్త వయస్కులైన ఆయన ఇద్దరు కుమారులు అకాలమరణం పొందారు. పుత్రశోకం ఎంత ప్రగాఢమైనదంటే మహాభక్తుడైన కృష్ణకిశోర్‌కూడా ఆ శోకాన్ని భరించలేక తల్లడిల్లిపోయాడని శ్రీరామకృష్ణులు చెప్పేవారు.

53. భక్తుడైన కృష్ణకిశోర్

పైన పేర్కొన్న సాధకులనే కాక శ్రీరామకృష్ణులు మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మొదలైన వారినికూడా కలుసుకొన్నారు. దేవేంద్రుని ఉదారభక్తిని గురించి, విద్యాసాగర్ కర్మయోగపరత్వాన్ని గురించి మాతో అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు ప్రస్తావించేవారు.□

3. గురుభావ స్థితిలో తీర్థయాత్ర - సాధు సాంగత్యం

యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశసమ్భవమ్ ॥ *- గీత, 10.41*

[మహిమాన్వితమూ, సంపద్యుక్తమూ అయిన వస్తువు ఏదైనాసరే అది నా తేజస్సులోని అంశం వలనే కలిగిందని గ్రహించు.]

భావముఖంలో నెలకొని గురుభావ ప్రేరణతో ఎన్నోచోట్ల, ఎందరో భక్తులతో అనేక రీతులలో శ్రీరామకృష్ణులు సలిపిన దివ్యలీలల నన్నిటిని అభివర్ణించడం ఎవరి తరమూ కాదు. ఆ దివ్యలీలా విలాసాలను కించిత్తు ఇంతకు మునుపే పాఠకులకు తెలిపివున్నాం. అదే గురుభావ ప్రేరణతో ఆయన తీర్థయాత్రలు చేశారు. ఆ విశేషాలను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

1. నిరుపమానమైన శ్రీరామకృష్ణుల జీవితం

మేం గమనించినంత వరకు శ్రీరామకృష్ణుల ఏ చర్యా ఉద్దేశరహితమూ, నిరర్థకమూ అయివుండలేదు. విశేష సంఘటనల మాట అటుంచితే, మామూలు దైనందిన చర్యలలో కూడా, తరచి చూస్తే గంభీర అంతరార్థం కానవస్తుంది. ఈ ఆధునిక యుగంలో ఆధ్యాత్మిక రంగంలో అటువంటి అసామాన్య సంఘటనలతో నిండిన జీవితం మరొకటి కానరాదు. యావజ్జీవితం సాధనలు అనుష్ఠించికూడా మనిషి భగవంతుడి అనంత భావాలలో ఏ ఒక్క భావాన్ని సైతం పరిపూర్ణంగా అనుభూతం చేసుకోలేడు. అటువంటప్పుడు విభిన్న మతాలు, మతశాఖలు వెలిబుచ్చే నానా భావాలలో భగవదనుభూతిని పొంది, వాటిలోని సత్యాలను బోధించడంలో సామర్థ్యం సంతరించుకోవడం అసంభవమని ప్రత్యేకంగా చెప్పాలా? కాని

ఆధ్యాత్మిక రంగంలో శ్రీరామకృష్ణులు అనుపమానులై నిలిచిపోయారు; వారికి సాటి ఎవరూ లేరు.

ప్రాచీనకాలపు ఆధ్యాత్మిక గురువరేణ్యులు సాధారణంగా ఏదో ఒక ఆధ్యాత్మిక భావానుసారంగా సాధనలు అనుష్ఠించి, తదనుగుణంగా భగవత్సాక్షాత్కారం పొందారు; తాము అవలంబించిన ఆ సాధన మార్గం ఒక్కటి మాత్రమే భగవత్సాక్షాత్కారానికి దారితీస్తుందని వాళ్ళు ప్రచారం చేసిపోయారు. భగవంతుణ్ణి ఇతర వివిధ భావాల ద్వారాకూడా పొందవచ్చుననే అవకాశం గురించి వారికి తెలియదు. లేదా స్వయంగా వారు ఆ సత్యాన్ని దాదాపుగా అవగతం చేసుకోగలిగినప్పటికీ దానిని జనసామాన్యంలో ప్రచారం చేస్తే, అది వారి ఇష్టనిష్ఠకు హాని కలిగిస్తుందేమోనని, తద్ద్వారా వారి ఆధ్యాత్మిక పురోగతికి విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయంతో సకల మతాలూ సత్యాలే అని బాహాటంగా ఆ ప్రాచీన ఆచార్యవరేణ్యులు ప్రచారం చేయలేదు. వారి ఉద్దేశం ఏమైనప్పటికీ గురువులుగా వారు ప్రచారం చేసింది కేవలం సంకుచిత ధార్మిక సిద్ధాంతాలనే అనడానికి చరిత్రే సాక్ష్యం. తత్ఫలితంగా కాలక్రమాన ఆ సిద్ధాంతాలు అసూయకూ, ద్వేషానికీ, అనేక సందర్భాలలో రక్తపాతానికీ మూలస్థానాలుగా పరిణమించాయి.

అంతే కాదు. అటువంటి సంకుచిత మతభావ ప్రచారం పరస్పర విరుద్ధమైన ఎన్నో సిద్ధాంతాలను ఉత్పన్నంచేసి భగవత్సాక్షాత్కార మార్గాన్ని ఎంతో జటిలం చేసింది; ఆ జటిలతను తొలగించుకొని సత్యస్వరూపుడైన భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడం అసంభవమనే అభిప్రాయాన్ని జనసామాన్యంలో కలిగించింది. ఇదే అదనుగా ఈ లౌకిక జీవితమూ, సుఖభోగాలే జీవన సర్వస్వం - ఇంతకంటే మరేమీ లేదు - అని చాటే పాశ్చాత్య జడవాదం తిరుగులేని శక్తితో విద్యావిధానం అనే ముసుగులో భారతదేశంలో ప్రవేశించింది. అలా ప్రవేశించిన పాశ్చాత్య విద్యావిధానం, ప్రభావంలో పడే వయస్సుగల పిల్లల, యువకుల మనస్సులను కలుషితం చేయసాగింది; యావత్తు దేశాన్ని నాస్తికత, భోగలాలస అనే విదేశీ విషతుల్య భావాల, ఆదర్శాలతో ప్లావనం చేయసాగింది. పవిత్రతకూ, పరిత్యాగానికీ, భగవత్ప్రేమకూ జాజ్జ్వల్యమాన ఉదాహరణయైన అద్భుతమూర్తులైన శ్రీరామకృష్ణులు అవతరించి మతాన్ని పునరుద్ధరించకపోతే ఆ దుర్గతి ఎంత విస్తృతమయ్యేదో ఎవరి కెరుక?

స్వయంగా శ్రీరామకృష్ణులు అన్ని మతాలనూ, సాధన మార్గాలనూ అనుష్ఠించారు. భారతదేశంలోను, ఇతర దేశాలలోను ప్రాచీనకాలపు మహాత్ములు, ఋషులు, ఆచార్యులు, అవతార పురుషులు ఏ నానామార్గాలను, భావాలను అనుసరించి భగవత్సాక్షాత్కారం పొందారో, వాటిలో ఏ ఒక్కటీ అసత్యం కాదని

శ్రీరామకృష్ణులు అనుష్ఠానపూర్వకంగా చాటిచూపారు. శ్రద్ధాళువైన సాధకుడు ఆ

2. శ్రీరామకృష్ణుల ఉదార సిద్ధాంతాలకు ఆస్కారం

ప్రాచీనులు చూపిపోయిన ఆయా మార్గాలను అనుసరించి ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించి నేడుకూడా భగవత్సాక్షాత్కారం పొందగలరని ఆయన ప్రత్యక్షంగా చూపించారు.

పరస్పర విరుద్ధమైన సామాజిక ఆచారాల సంప్రదాయాల కారణంగా భారతదేశంలోని హిందువుల మహమ్మదీయుల మధ్య పర్వతంవంటి పెద్ద అడ్డుగోడ నిలిచి ఉన్నప్పటికీ, ఆ రెండు మతాలూ సత్యాలే అని అనుష్ఠానపూర్వకంగా ప్రదర్శించి శ్రీరామకృష్ణులు చూపారు. ఇద్దరూ ఒకే భగవంతుణ్ణే విభిన్న భావాలతో ఉపాసిస్తూ, విభిన్న మార్గాలలో పురోగమించినప్పటికీ కాలక్రమాన ప్రేమలో ఒకటైపోతారని, పాత వైషమ్యాలు మరచిపోతారని ఆయన ప్రకటించారు. పరిత్యాగం లేకుండా శాంతి లభించదనీ, ఆ శాంతి జీసస్ క్రైస్తుతో సహా ప్రాచీన పాశ్చాత్య ఋషుల, అవతారపురుషుల ఆధ్యాత్మిక సందేశం పట్ల విశ్వాసం కలిగి ఉండడం మూలంగానే కలుగుతుందనీ భోగలాలసమయమైన పాశ్చాత్యానికి ఆయన హెచ్చరిక చేశారు. అద్భుతమైన శ్రీరామకృష్ణుల జీవితాన్ని మరింత ప్రగాఢంగా అధ్యయనం చేసేకొద్దీ ఆయన ఏ ప్రత్యేక దేశానికీ, సంప్రదాయానికీ, జాతికీ, మతానికీ చెందినవారు కారని తేటతెల్లమౌతుంది. శాంతిని వదలుకోలేరు కనుక ప్రపంచ ప్రజానీకం యావత్తు శ్రీరామకృష్ణుల ఉదార సిద్ధాంతాలను ఏదో ఒక రోజు ఆశ్రయించక తప్పదు.

భావముఖంలో సుస్థిరులై శ్రీరామకృష్ణులు ఉదార భావాల (ఆశయాల) రూపంలో అన్ని శాఖలలో ప్రవేశించి, అన్ని సంకుచితతత్త్వాలు ఉత్పన్నంచేసే పరిమితులను విచ్ఛిన్నంచేసి, వారందరినీ సరిక్రొత్త మూసలో పోతపోసి, కనీ వినీ ఎరుగని వైనంలో ఐక్యత అనే త్రాటితో బద్ధులను చేస్తారు.

పరస్పర విరుద్ధ మత సంప్రదాయాలకు చెందిన సాధకులు ఎంతోమంది శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చేవారు; ఆయనలో తమ తమ ఆధ్యాత్మిక భావాల పరి

3. పై దానికి నిదర్శనం

పూర్ణ ఆదర్శాన్ని చూసి, ఆయనకూడా తమ సాధన మార్గంలోనే పయనిస్తున్నారని ప్రగాఢంగా విశ్వసించేవారు. మేం పైన చెప్పిన విషయానికి ఇది నిదర్శనం. ఈ విధంగా భారతీయ మత సంప్రదాయాలన్నిటిలోను ఒక సమైక్యభావాన్ని కల్పించాలని గురుభావంలో శ్రీరామకృష్ణులు చేపట్టిన కార్యం మొట్టమొదట భారతదేశంలోనే ప్రారంభమైనా అది భారతదేశ ఎల్లలలోనే ఆగిపోలేదు; ఆసియాతోనూ ఆగిపోలేదు. పాశ్చాత్యంలో వ్యాపించిన మతద్వేష నాస్తిక శక్తులతో శ్రీరామకృష్ణుల ప్రశాంత నిరు

ద్వేగ ఆధ్యాత్మికపరత తలపడి, ఎన్నడూ చరిత్ర చవిచూడని యావత్ప్రపంచంలో శాంతిశకానికి నాంది పలికింది. శ్రీరామకృష్ణుల నిర్యాణానంతరం ఆ పని ఎంత చురుగ్గా సాగుతున్నదో మీరు గమనించలేదా? ఎలా గురుగత ప్రాణులైన పూజ్య వివేకానంద స్వామి ద్వారా శ్రీరామకృష్ణుల భావాలూ బోధనలూ అమెరికా ఐరోపాలలో ప్రవేశించి ఈ స్వల్పకాలంలోనే చింతనాశీల ప్రపంచంలో ఎంత విప్లవాన్ని తీసుకువచ్చిందో మీరు గమనించలేదా? తిరుగులేని కాలగతిలో ఓటమి లేని ఈ భావరాశి సమస్త ప్రజానీకంలో, సకల మతాలలో, సమస్త సమాజాలలో తన ప్రభావాన్ని విస్తరించి ఒక అద్భుత విప్లవాన్ని తీసుకురావడం తథ్యం. దాని పురోగతిని నిరోధించే శక్తి ఎవరికి ఉంది? అసదృశ పావనత తపశ్చర్యల ఉపకారిక శక్తితో తేజోదీప్తమైన ఆ భావరాశి ప్రభావాన్ని ప్రతిఘటించి ఎవరు నిలవగలరు? ప్రస్తుతం ఏ పరికరాల తోడ్పాటుతో ఈ దివ్యభావరాశి వ్యాపిస్తూన్నదో, ఆ పరికరాలు బహుశా పగిలిపోవచ్చు. అనాసక్తతను అలవరచుకొని అనేకులు ఈ భావరాశి మూలాన్ని బహుశా అవగతం చేసుకోలేకపోవచ్చు. అయినప్పటికీ అనంత మహిమోపేతులూ, భావమయులూ అయిన శ్రీరామకృష్ణుల దివ్యభావ రాశిని ప్రపంచంలోని యావన్మందీ తమ హృదయాలలో పదిలపరచుకొని, ఆ మూసలో తమ జీవితాలను పోతపోసుకొని పరస్పర విరుద్ధ మతాల సామరస్య పథాన్ని దేదీప్యమానం చేస్తారనడం ఖాయం.

4. శ్రీరామకృష్ణుల భావాల పరివ్యాప్తి

కాబట్టి వివిధ భారతీయ మత సంప్రదాయాలకు చెందిన సాధకు లనేకులు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి, ఆయన తోడ్పాటుతో యథార్థ ఆధ్యాత్మికానుభూతిని పొందడం గురించి మేం చెప్పిన ఉదంతాలను కేవలం కల్పిత కథలుగా ఎంచకండి. ముందుగా శ్రీరామకృష్ణులు నెలకొన్న భావముఖ స్థితి, ఆధ్యాత్మిక ప్రగాఢతను స్పష్టంగా అవగతం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఆయన మనస్సులో అభివ్యక్తమైన దివ్య భావరాశి ఆ భావముఖ స్థితి నుండే ఉత్పన్నమైనదని గ్రహించండి. ఆ తరువాత ఇక్కడ వివరించిన సంఘటనలను లోతుగా తరచి పరికించండి. శ్రీరామకృష్ణులు కేంద్రంగా ఒక భావ ఉద్యమం ఎలా పెంపొందినదీ, మొదట పూర్వాచారపరాయణులలో, పిదప ఆధునిక విద్యావంతులలో, ఆ తరువాత యావ త్ప్రపంచంలో అది తన ప్రభావాన్ని విస్తృతం చేస్తూ, మానవచింతనా ధోరణిలో ఒక విప్లవంగా ఎలా రూపుదిద్దుకొంటూవున్నదో మీకు అర్థమౌతుంది.

వివిధ ప్రాచీన సంప్రదాయాలకు చెందిన సాధకులలో మొట్టమొదట శ్రీరామకృష్ణుల భావరాశి వ్యాప్తి గాంచింది. ఇది ఎలా జరిగిందో ఇంతకు మునుపే కొంతవరకు విశదీకరించాం. శ్రీరామకృష్ణులు ఒక ప్రత్యేక భావమార్గంలో సాధ

నను అనుష్ఠించి దాన్లో పరిపూర్ణత్వాన్ని సిద్ధించుకోగానే, ఆ మార్గావలంబులైన సాధకు లెందరో తమంతటట తామే ఆయన వద్దకు రావడం తటస్థించేది; ఆయనలో తమ భావాల పరిపూర్ణ ఆదర్శాన్ని వారు కనుగొనేవారు. తరువాత తమ ఆధ్యాత్మిక పురోగతికి అవసరమైన సహాయం ఆయననుండి పొంది, తమ దారిన తాము వెళ్ళిపోయేవారు.

5. దక్షిణేశ్వరానికి వచ్చిన అన్ని సంప్రదాయ సాధువులలోను, తీర్థ యాత్రలో పరిచయమైన సాధువులలోను శ్రీరామ కృష్ణుల భావాలూ ఆదర్శాలూ మొట్టమొదట ప్రచారమైనాయి

అంతేగాక మథుర్‌బాబు, శ్రద్ధాళువైన ఆతడి భార్య జగదంబాదాసి విన్నపంతో శ్రీరామకృష్ణులు బృందావనం దాకా తీర్థయాత్ర చేశారు. కాశీ, బృందావనం వంటి పుణ్యక్షేత్రాలలో సాధువులకు, భక్తులకు కొదవ ఉండదు. కాబట్టి ఆ క్షేత్రాలలో వసిస్తూన్న సాధువు లెందరికో శ్రీరామకృష్ణులను కలుసుకొనే అవకాశం అప్పుడు లభించింది. ఇది మా ఊహ ఎంతమాత్రమూ కాదు; స్వయంగా శ్రీరామకృష్ణుల ముఖతా విన్న విషయమే. ఆ పుణ్యక్షేత్రాలలో వసించిన సుప్రసిద్ధ సాధకులు ఆయనను కలుసుకొని గురుభావంలోని ఆయన సహాయాన్ని పొంది, తరించారు. ఆయన ముఖతా మేం విన్న విషయాలను కొంతలో కొంత ఇక్కడ పొందుపరచడం అవసరంగా భావిస్తున్నాం.

6. వివిధ ఆధ్యాత్మిక స్థితుల, అనుభూతుల మూలంగా శ్రీరామకృష్ణుల అసాధారణ బోధనాశక్తి వికాసం

శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''పావు అన్ని గళ్లనూ దాటుకొంటూ వచ్చిన తరువాతే 'పరమపద' స్థానం చేరుతుంది. పాకీవాడి స్థితినుండి చక్రవర్తి పదవి వరకు అన్ని స్థితుల అనుభవాలను చవిచూసి, వాటి నిరర్థకతను నిజంగా గుర్తించిన తరువాతే మనిషికి నిజమైన పరమహంస స్థితి కలుగుతుంది, యథార్థ బ్రహ్మజ్ఞానం ప్రాప్తిస్తుంది. చరమ జ్ఞానం పొంది తరించగోరేవారు పాటించవలసిన నియతి ఇదే.'' కాని నిజంగా జగద్గురువులు కాగోరే వారి గురించి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''ఆత్మహత్య చేసుకోవడానికి గోటి కత్తెర చాలు; కాని ఇంకొకరిని (శత్రువును) చంపాలంటే కత్తి, డాలు వగైరా ఆయుధాలు అవసరం.'' నిజమైన ఆధ్యాత్మిక గురువు కాగోరితే అన్ని రకాల అనుభవాలు చవిచూసి, ముముక్షు జనసామాన్యంకంటే సమధిక శక్తిసంపన్నుడై ఉండాలి. శ్రీరామకృష్ణులు పదేపదే మాతో ఇలా చెప్పేవారు: ''అవతారపురుషుడు, సిద్ధ పురుషుడు, జీవుడు - ఈ ముగ్గురిలో తేడాను కల్పించేది వారిలోని శక్తి తారతమ్యం ఒక్కటి మాత్రమే.'' ఉదాహరణకు ఈ వ్యవహార ప్రపంచంలో కూడా ఇలాగే జరగడం కద్దు. గొప్ప రాజనీతి కోవిదులైన బిస్మార్క్, గ్లాడ్‌స్టోన్ వంటి వారు గతంలోని, వర్తమానంలోని తమ దేశ సామాజిక రాజకీయ సంఘ

టనలమీద దృష్టి పరపి, సామాన్య జనానీకం కంటే ఎంతో ముందుచూపు పెంపొందించుకొని ఉండడం మీరు గమనించలేదా? ఈ కారణం వలననే వాళ్ళు రాబోయే యాభై సంవత్సరాలలో ప్రస్తుత భావాలు, ఉద్యమాలు కొనితెచ్చే లబ్ధికర, వినాశకర ఫలితాలను అంచెనా కట్టగలిగారు. కాలక్రమంలో దుష్ఫలితా లను కొనితెచ్చే హానికర భావాల, ఉద్యమాలను అరికట్టే ప్రయత్నం చేయగలి గారు. ఇదే నియతి ఆధ్యాత్మిక రంగంలోకూడా వర్తిస్తుందని గ్రహించాలి. ప్రాచీన ద్రష్టల జీవితాల, బోధనల నుండి ఉత్పన్నమైన భావాల ఉద్యమాల పనితీరు తెన్నులను జాగ్రత్తగా అధ్యయనంచేసి, సరైన అవగాహనకు వచ్చిన తదనంతరమే అవతారపురుషులు కొత్త ఉద్యమాలకు ఉపక్రమించాలి; ప్రాచీన ద్రష్టలు బోధించిన మూల భావాలు శతాబ్దాల కాలగతిలో ఏ మార్పులకు గురి అయినవో వీరు గుర్తించాలి; ఆ మార్పులు లోకుల జీవితాలపై ఎటువంటి మంచి లేక చెడు ప్రభావాన్ని తెచ్చాయో పరికించాలి; ఆ భావాలు ఏ మేరకు భ్రష్టుపట్టాయో తరచి చూడాలి. క్రొత్తగా ప్రచారం చేయబోయే నూతన భావాలు శతాబ్దాల కాలగతిలో ఏ పెడదారులకు దారితీస్తాయో ఊహించాలి; ప్రస్తుతం ప్రచారంలో ఉన్న భావాలకంటే ఈ నూత్నభావాలు మరింత హాని కలిగిస్తాయేమో గమనించాలి. అవతార పురుషులు ఈ విధమైన ఆలోచనా సరళితో అప్పుడు నెలకొన్న స్థితిని అంచెనా వేయాలి. ఈ అంశాలను కచ్చితంగా ఆకళింపు చేసుకోలేని పక్షంలో జనం ప్రస్తుత పరిస్థితిని, పరిస్థితిని వాళ్ళు ఎలా అవగతం చేసుకోగలరు? రోగాన్ని కచ్చితంగా నిర్ధారణ చేయలేనప్పుడు, రోగ నిదానానికి ఔషధాన్ని ఎలా నిర్ణ యించగలుగుతారు? కాబట్టి తీవ్ర తపశ్చర్యాదులు అనుష్ఠించి ఔషధ నిర్ణయ శక్తిని సముపార్జించడంతోపాటు, లోకంలో నెలకొనివున్న వైవిధ్య పరిస్థితులను చవి చూసి, ఇతరు లందరికంటే ఎంతో అనుభవం గడించవలసి ఉంటుంది ఈ అవతార పురుషులకు, ఆచార్యపురుషులకు. జీవితంలో ఎన్ని రకాల స్థితిగతులను శ్రీరామకృష్ణులు అనుభవించ వలసివచ్చిందో మీరు చూడలేదా? నిరుపేద కుటుం బంలో జన్మించి, చిన్నతనంలో ఆయన కటిక దారిద్ర్యం అనుభవించారు; దక్షి ణేశ్వర కాళికాలయంలో పూజారి బాధ్యతను స్వీకరించారు; యౌవనంలో మరొకరి క్రింద పనిచేసే హీనస్థితిని గడపవలసి వచ్చింది; సాధకావస్థలో భావ త్సాక్షాత్కారానికై పరితపిస్తూ బంధువుల, అపరిచితుల అపహాస్యాలకూ, తిరస్కారాలకూ గురి కావలసి వచ్చింది. సాధనకాల తొలి రోజులలో పిచ్చివాడిగా నిందింపబడ్డారు; ఈ దురవస్థ ఒక ప్రక్క ఇలా ఉండగా మరొక ప్రక్క మహ దైశ్వర్యవంతుడైన మథుర్‌బాబువంటి వారినుండి రాచమర్యాదలూ మన్ననలూ పొందారు; విభిన్న సంప్రదాయాలకు చెందిన సాధకులు, భక్తులు ఆయనను

సాక్షాత్తు భగవదవతారంగా పరిగణించి, ఆరాధించారు. ఈ విధంగా పరస్పర విరుద్ధమైన ఈ అనుభవాలను చవిచూడడంలో ఆయన స్థితప్రజ్ఞులై విరాజిల్లారు.

అనన్యమైన భగవత్ప్రేమ భగవత్సాక్షాత్కారంకోసం అసాధారణ కఠోర తపశ్చర్యాదులలో నిమగ్నంచేసి, యోగజనితమైన అతీంద్రియ సూక్ష్మదృష్టిని ఆయనలో పూర్తిగా తెరిపించింది ఒక వైపు; మరో వైపు సంసారంలోని నానా అవస్థలతోను ఆయనకు పరిచయం గావించింది; అలాగే బాహ్యప్రపంచంలోని జనసామాన్యంలోని నానా అవస్థలను చక్కగా ఆకళింపుచేసుకొనే శక్తిని జనింపచేసి, వారితో చక్కగా వ్యవహరించగలిగే కౌశలాన్ని సంతరింపచేసింది. అలాగే జన సామాన్యం పట్ల, సుఖదుఃఖాల పట్ల సానుభూతిపరులుగా ఒనర్చింది ఆయనను. బాహ్యాభ్యంతరమైన ఆ నానా అవస్థల గుండా శ్రీరామకృష్ణుల గురుభావం లేక ఆచార్యభావం నానాటికీ మరింతగా వికసిస్తూ, అభివ్యక్తం కావడమే ఇందుకు కారణం.

7. జనసామాన్యం స్థితి గతులను అవగతం చేసుకోవడంలో తీర్థయాత్ర దోహదపడడం

పైన వివరించిన ఫలితాలే శ్రీరామకృష్ణుల జీవితంలో ఆయన చేసిన తీర్థ యాత్రల వలన కలిగాయనడంలో సందేహానికి తావులేదు. జనసామాన్యం ఆధ్యాత్మిక స్థితులను గురించి తెలుసుకోవలసిన అవసరం యుగాచార్యులైన శ్రీరామకృష్ణులకు కలిగింది. మథుర్‌బాబుతో కలిసి ఆయన చేసిన తీర్థయాత్రల ద్వారా ఈ అవసరం చాలావరకు తీరిందనే చెప్పాలి. శ్రీరామకృష్ణుల జ్ఞాననేత్రం ఆంతరిక జగత్తులోని మాయా ఆవరణా లన్నింటిని ఛేదించి అందరిలో నిహితంగా ఉన్న ఆ 'ఏకమేవాద్వితీయం' ఆ బ్రహ్మవస్తువును, ఆ అఖండ సచ్చిదానంద స్వరూపుణ్ణే సదా ప్రత్యక్షంగా దర్శించగలిగేది, స్పర్శించగలిగేది; అలాగే అదే నేత్రం బాహ్యప్రపంచంలో దైనందిన జీవితంలో లౌకికుల ఒకటి రెండు మాటలు వినీ వినగానే వాళ్ల మనోవైఖరిని చూడగలిగేది అంతే గాక నిత్యం జరుగుతున్న కొన్ని సంఘటనలను గమనించగానే సామాజిక పరిస్థితులను, దేశ స్థితిగతులను ఆకళింపు చేసుకోగలిగేది. పై వర్ణనలు శ్రీరామకృష్ణుల సాధారణ బాహ్యచైతన్య స్థితికే వర్తిస్తాయని గ్రహించాలి. యోగశక్తితో ఆయన ఉన్నత భూములను అధిరోహించినప్పుడు ఆయన దివ్యదృష్టి సంపన్నులయ్యేవారు. ఆ దివ్యదృష్టితో ఆయన వ్యక్తి లేక సమాజ లేక దేశ స్థితిని ప్రత్యక్షంగా చూడగలిగేవారు; దానితోపాటు ఆ రుగ్మతలు తొలగిపోయే మార్గాన్ని రూఢి పరచుకొనే వారు. అటువంటి దివ్యావస్థలో సామాన్యులలా పరిస్థితులను పరికించి, ఇతరత్రా పోల్చి, యోచించి ఏదైనా నిర్ణయానికి వచ్చే అగత్యం ఆయనకు ఉండేదికాదు.

దివ్యపురుషులైన శ్రీరామకృష్ణులు సాధారణ బాహ్యదృష్టి, అసాధారణ యోగదృష్టి సహాయంతో అన్ని విషయాల తత్త్వనిరూపణకు వస్తూవుండడం మేం గమనించాం. కాబట్టే ఆయనలోని దివ్య, మానవ భావాలను పాఠకులకు విశదీకరించకపోతే, ఆ దివ్యపురుషుని సమగ్ర స్వరూపాన్ని పాఠకులకు అందించని వారమే అవుతాం. అందువలననే ఆయన జీవితాన్ని ఈ రెండు, దివ్య మానవ భావాల వెలుగులో అధ్యయనం చేయడానికి ఈ పుటలలో ప్రయత్నిస్తున్నాం.

8. మహాపురుషుల తీర్థయాత్రల ప్రాధాన్యం

శాస్త్రదృష్టితో పరికించినప్పుడు శ్రీరామకృష్ణుల తీర్థయాత్రకు మరొక కారణం తెలియవస్తుంది. భక్తిజ్ఞానాలలో పరిపూర్ణతను సంతరించుకొన్న సాధు పుంగవులు పుణ్యక్షేత్రాలను సందర్శించడం, ఆ క్షేత్ర పావనత్వాన్ని ఇనుమడింప చేయడానికే అని శాస్త్రాలు వచిస్తున్నాయి. సాధుపుంగవులు పుణ్యక్షేత్రాలకు వచ్చి, విశిష్ట భగవద్దర్శనార్థం వ్యాకులతతో అక్కడ వసించి తిరిగి వెళ్లిపోతున్నప్పుడు భగవంతుని విశిష్ట భావాల నూతన అభివ్యక్తీకరణలను వదలిపోతారు; లేదా అక్కడ అప్పటికే నెలకొన్న అభివ్యక్తీకరణలను మరింత తేజోవంతం చేసి వెళతారు. కనుక ఇతరులు ఆ పుణ్యక్షేత్రాల సందర్శనానికి వచ్చినప్పుడు ఆయా భగవద్భావాలను కించిత్తు సులభంగా అనుభూతం చేసుకోగలుగుతారు. సామాన్య సాధుపుంగవుల సందర్శనం చేతనే పుణ్యక్షేత్రాల పావనత్వం ఇంతగా ఇనుమడిస్తున్నప్పుడు, శ్రీరామకృష్ణుల వంటి అవతార పురుషుల పుణ్యక్షేత్రాల సందర్శన ప్రభావం ఎంత శక్తిమంతమై ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాలా? అనేక సందర్భాలలో పుణ్యక్షేత్రాల గురించి పైన తెలిపిన విషయాలను అతి సరళంగా శ్రీరామకృష్ణులు మాకు విశదీకరించేవారు. ఆయన ఇలా చెప్పేవారు: ''నాయనలారా! భగవత్సాక్షాత్కారార్థం ఏ ప్రదేశంలో జనులు సుదీర్ఘకాలం జపం, ధ్యానం, ప్రార్థన, ఉపాసన, తపస్సు మొదలైనవి అనుష్ఠించారో, ఆ ప్రదేశంలో భగవంతుని అభివ్యక్తీకరణ విశేషంగా ఉంటుందని కచ్చితంగా తెలుసుకోండి. భగవంతుని పట్లగల భక్తి కారణంగా వారి భగవత్ చింతనలు, ఒక రకంగా చెప్పాలంటే ఘనీభవిస్తాయి. అందుకే భగవద్భావ ఉద్దీపన, భగవద్దర్శనం సులభంగా పొంద తరమౌతుంది. భగవత్సాక్షాత్కారార్థం యుగాల పర్యంతం అసంఖ్యాక సాధువులు, భక్తులు, సిద్ధపురుషులు ఈ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూంటారు; సమస్త కోర్కెలను విడనాడి హృదయపూర్వకంగా భగవంతుణ్ణే అక్కడ ప్రార్థిస్తూ ఉంటారు. సర్వత్రా భగవంతుని ఉనికి సమానంగా ఉన్నప్పటికీ ఆ స్థలాలలో విశిష్టమైన భగవత్ అభివ్యక్తీకరణ పాదుకొని ఉంటుందనడం నిస్సందేహం. నేలపై ఎక్కడ త్రవ్వినా నీరు లభిస్తుంది. కాని బావులు, గుంటలు, చెరువులు మొదలైన చోట్ల త్రవ్వ నవసరం లేకుండానే నీరు

లభిస్తుంది కదా! అదే విధంగా భగవంతుని అభివ్యక్తీకరణ విషయం పుణ్య క్షేత్రాలకు వర్తిస్తుంది.

భగవంతుడు విశేషంగా అభివ్యక్తమయ్యే పుణ్యక్షేత్రాలను సందర్శించి తిరిగి వచ్చాక 'నెమరు వేసుకోవాలి' అని శ్రీరామకృష్ణులు మాకు బోధించేవారు.

9. పుణ్యక్షేత్ర సేవానంతరం 'నెమరు వేసుకోవడం' గురించి ఉపదేశం

ఆయన ఇలా చెప్పేవారు: ''పశువులు కడుపు నింపుకొన్న తదనంతరం, నిశ్చింతగా ఒక చోట కూర్చుని తాపీగా ఆహారాన్ని నెమరు వేస్తాయి. అలాగే దేవాలయాలు, పుణ్య క్షేత్రాలు సందర్శించిన తరువాత, ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని, ఆ పవిత్ర ప్రదేశాలలో మదిలో మెదలిన పవిత్ర భావాలను నెమరు వేసుకొని, వాటిలో పూర్తిగా లీనమైపోవాలి. పుణ్యక్షేత్రాలను సందర్శించి రాగానే రూపరసాది లౌకిక విషయాలను మనస్సులోకి రానివ్వకూడదు. అలా చేస్తే ఆ పుణ్యక్షేత్రాలలో సంతరించుకొన్న భగవద్భావాలు మనస్సు మీద శాశ్వత సత్ఫలితాలను ఉత్పన్నం చేయవు.''

ఒక సందర్భంలో శ్రీరామకృష్ణులతోపాటు మాలో కొందరు జగన్మాతను సేవించడం కోసం కాళీఘాట్‌కు వెళ్లాం. పీఠస్థానం కావడం వలన కాళీఘాట్‌లో జగజ్జనని అభివ్యక్తీకరణ విశేషంగా ఉంటుంది. ఆ అభివ్యక్తీకరణ, శ్రీరామకృష్ణుల మనశ్శరీరాలలో జగజ్జనని సజీవ అభివ్యక్తీకరణతో ఏకమై భక్తుల హృదయాలలో మహదానందాన్ని కలిగించాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కాళీఘాట్ నుండి తిరిగి వచ్చేటప్పుడు మాలో ఒకరు అనివార్య కారణాల వలన ఆ నాటి రాత్రి అత్తగారి ఇంట్లో గడపవలసివచ్చింది. మర్నాడు అతడు గురుదేవుల వద్దకు వచ్చినప్పుడు, ''గతరాత్రి ఎక్కడ గడిపావు?'' అని ఆయన అడిగారు. అతడు రాత్రి అత్తగారి ఇంట్లో గడిపాడని తెలుసుకోగానే, ఆయన ఇలా అన్నారు: ''అదేమిటి? జగజ్జననిని సేవించుకొని వచ్చావు కదా! జగజ్జనని దర్శనాన్ని, ఆమె గురించిన భావాలను నెమరువేసుకొంటూ గడపడానికి బదులుగా లౌకికులలా రాత్రంతా అత్తగారి ఇంట్లో గడిపి వచ్చావే? దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు దర్శించినప్పుడు కలిగే భగవద్భావాలను తప్పక నెమరు వేసుకొంటూ ఉండాలి. అలా చేయకపోతే ఆ భగవద్భావాలు మనస్సులో ఎలా పాదుకొని ఉంటాయి?''

ముందుగానే భగవద్భక్తిని, భగవద్భావాలను పెంపొందించుకోకుండా పుణ్యక్షేత్రాలను సందర్శించినా విశేష ఫలితం లభించదని శ్రీరామకృష్ణులు అనేక

10. భక్తిభావం : పుణ్యక్షేత్రాలు

సందర్భాలలో మాకు చెబుతూ ఉండేవారు. తీర్థయాత్రలు చేసిరావాలన్న మా ఆకాంక్షను ఆయనతో విభిన్న సమయాలలో వ్యక్తంచేసేవారం. అప్పుడు ఆయన ఆప్యాయంగా మాతో ఇలా చెప్పేవారు:

''నాయనలారా, ఇక్కడ (అంటే హృదయంలో భక్తి) ఉన్నవారికి అక్కడా ఉంటుంది. ఇక్కడ (హృదయంలో) ఏమీ లేనివారికి అక్కడా మృగ్యమే.'' ఇంకా ఆయన ఇలా కొనసాగించేవారు: ''ఎవరి హృదయంలో భక్తిభావం సహజంగా పాదుకొని ఉంటుందో, పుణ్యక్షేత్రాల సందర్శనతో ఆ భక్తిభావం మరింత ఇనుమడిస్తుంది. కాని భక్తిభావశూన్యులు పుణ్యక్షేత్ర సేవనంలో ఎటువంటి ప్రత్యేక లబ్ధినీ పొందలేరు. ఫలానావారి అబ్బాయి కాశీకో లేక మరో పుణ్యక్షేత్రానికో పారిపోయాడని తరచు వింటూ ఉంటాం. కొద్దికాలంలోనే ఉద్యోగం సంపాదించుకొన్నాడని ఉత్తరం కూడా వ్రాసి కొంత డబ్బు కూడా పంపాడని వినవస్తుంది. అనేకులు పుణ్యక్షేత్రాలలో నివసించాలనే తపనతో అక్కడకు వెళతారు; కాని అక్కడకు వెళ్లగానే వ్యాపారాదులు ప్రారంభిస్తారు. మథుర్‌బాబుతో కలిసి నేను భారతదేశ వాయవ్య ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఇక్కడ ఉన్నవే, అక్కడా ఉన్నాయి, ఎలాంటి తారతమ్యమూ కనిపించలేదు. అన్నిచోట్ల ప్రపంచం ఒకే తీరులోనే ఉంది. అదే మామిడి చెట్లు, చింతచెట్లు, వెదురు పొదలు ఇక్కడ ఉన్నట్లే అక్కడా అలాగే ఉన్నాయి. అదంతా పరికించి హృదయ్‌తో ఇలా అన్నాను: 'ఒరే హృదూ! ఏం చూడాలని మరి ఇక్కడకు వచ్చాను? అక్కడ ఏం ఉందో ఇక్కడా అదే ఉంది. కనబడుతున్న వ్యత్యాసం ఒక్కటే. బయలు ప్రదేశాలలో కానవచ్చే విసర్జనను బట్టి చూస్తే ఈ ప్రాంతస్థులకు అక్కడి వారికంటే జీర్ణశక్తి ఎక్కువని తెలియవస్తోంది.' ''

11. బుద్ధగయకు తీర్థయాత్ర చేయగోరిన ఒక భక్తునికి శ్రీరామకృష్ణుల ఉపదేశం

కంఠవ్రణంతో బాధపడుతున్న శ్రీరామకృష్ణులను చికిత్సకోసం భక్తులు మొదట శ్యాంపుకూర్‌లోని ఒక బాడుగ ఇంటికీ, తరువాత కాశీపూర్ ఉద్యానగృహానికీ తరలించారని ముందే చెప్పాము. కాశీపూర్ ఉద్యాన గృహానికి శ్రీరామకృష్ణులను తరలించిన కొద్ది రోజులకే వివేకానందస్వామి ఎవరికీ చెప్పకుండా ఇద్దరు సోదర శిష్యులతోపాటు బుద్ధగయకు వెళ్లాడు. ఆ సమయంలో బుద్ధుడి అసాధారణ వైరాగ్యం, తపశ్చర్యలతో కూడిన ఆయన జీవితం గురించి రేయింబవళ్లు మేం చర్చించుకొనేవారం. ఉద్యానగృహం క్రింది అంతస్తులో దక్షిణం వైపు ఒక చిన్నగది ఉంది. ఆ గదిని మేం ఉపయోగించుకొనేవారం. ఆ గది గోడమీద బుద్ధుని దృఢసంకల్పాన్ని వ్యక్తంచేసే లలితవిస్తారంలోని ఈ క్రింది శ్లోకం వ్రాయబడి ఉంది:

ఇహాసనే శుష్యతు మే శరీరం త్వగస్థిమాంసం ప్రలయంచ యాతు ।
అప్రాప్యబోధిం బహుకల్ప దుర్లభాం నైవాసనాత్ కాయ మతశ్చలిష్యతే ॥

[ఈ శరీరం ఆసనం మీదనే శుష్కించిపోవుగాక; ఎముకలు, మాంసంతో కూడిన ఈ చర్మం నశించిపోవుగాక; యుగాల పర్యంతం సాధన చేసినా దుర్లభమైన ఆ సత్యసాక్షాత్కారం (జ్ఞానోదయం) లభించినంత వరకు ఈ (నా) శరీరం ఈ ఆసనంనుండి కదలదు.]

ఈ వచనాలే మా కళ్లముందు రేయింబవళ్లు మెదలుతున్నాయి. భగవత్సాక్షాత్కారార్థం మా జీవితాలను పరిత్యజించాలని ఈ వచనాలు మాకు పదేపదే జ్ఞాపకం చేయసాగాయి. మేం కూడా లలితవిస్తార సూక్తిని పాటించాలనుకొన్నాం.

బుద్ధుడి వైరాగ్యం గురించి ఎడతెగని చర్చల మధ్య స్వామీజీ హఠాత్తుగా బుద్ధగయకు వెళ్లిపోయాడు. ఎక్కడకు వెళుతున్నాడో, ఎప్పుడు తిరిగివస్తాడో ఎవరికీ చెప్పలేదు. బహుశా ఆయన ఇక సంసారంలోకి తిరిగి రాడేమోననీ, మళ్లీ మేం ఆయనను చూడలేమేమోననీ మాకు అనిపించింది. కాషాయాంబరాలు ధరించి స్వామీజీ బుద్ధగయకు వెళ్లాడని తదనంతరం మాకు తెలియవచ్చింది. కనీసం ఒక గంట సేపయినా ఆయన ఎడబాటును భరించలేనంతగా మా మనస్సులను ఆయన ఆకట్టుకొన్నారు. కాబట్టి మేం ఎంతో అశాంతికి గురి అయ్యాం; ఆయన వద్దకు, బుద్ధగయకు వెళ్లాలనే బలీయమైన కోర్కె మాలో చెలరేగింది. క్రమంగా ఈ సంగతి శ్రీరామకృష్ణుల చెవిన పడింది. మాలో ఒకరు స్వామీజీ వద్దకు పోవాలని సంకల్పించుకోవడం తెలిసి బ్రహ్మానందస్వామి ఒక రోజు ఈ విషయాన్ని గురుదేవులకు విన్నవించాడు. అందుమీదట శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''ఎందుకు కలత చెందుతారు? నరేంద్రుడు ఎక్కడకు పోతాడు? ఎంతకాలం దూరంగా ఉండగలడు? త్వరలోనే అతడు తిరిగి రావడం మీరు చూస్తారు కదా!'' ఆ తరువాత నవ్వుతూ ఇలా చెప్పారు: ''ప్రపంచం యావత్తు ఆధ్యాత్మికతకోసం అన్వేషించినా ఏమీ (అంటే నిజమైన ఆధ్యాత్మికత) మీకు లభించదు. అక్కడ ఉన్నదంతా, ఇక్కడ (తమ శరీరాన్ని చూపుతూ) కూడా ఉంది.'' 'ఇక్కడ' అనే మాటను శ్రీరామకృష్ణులు రెండు అర్థాలలో వాడినట్లు తెలుస్తోంది. మొదటి అర్థం: ఆ కాలంలో తనలో అభివ్యక్తమయ్యే ఆధ్యాత్మికశక్తి కంటే మించిన ఆధ్యాత్మిక శక్తి అభివ్యక్తీకరణ మరెక్కడా ఎవరూ కనుగొనలేరని సూచిస్తుంది. రెండవ అర్థం: భగవంతుని ఉనికి ప్రతి ఒక్కరిలోను ఉంది; భగవంతుడి పట్ల భక్త్యనురాగాలను తమ హృదయాలలో జాగృతం చేసుకోలేని వారు, బాహ్యంగా వివిధ ప్రదేశాలకు తీర్థయాత్రలు చేసివచ్చినా ఏ లాభమూ ఉండదని సూచిస్తుంది. శ్రీరామకృష్ణుల వచనాలలో రెండు, అంతకంటే ఎక్కువ అర్థాలు అంతర్నిహితంగా ఇమిడి ఉండడం కద్దు. ఒక్క శ్రీరామకృష్ణుల వచనాలలోనే కాదు, యుగయుగాలుగా ఈ ఇలలో అవతరించిన అవతార

పురుషుల వచనాలలో ఎన్నో భావార్థాలు ఇమిడి ఉండడం చూడవచ్చు. జన సామాన్యం తమ వ్యక్తిగత ఇష్టం మేరకు లేదా గత సంస్కారాల ననుసరించి అవ తార పురుషుల వచనాలలోని ఏదో ఒక అర్థాన్ని గ్రహిస్తుంది. శ్రీరామకృష్ణులు ఏ వ్యక్తిని ఉద్దేశించి పై మాటలు చెప్పారో ఆ వ్యక్తి ఆ మాటలలోని మొదటి అర్థాన్ని గ్రహించి, ఆధ్యాత్మిక అభివ్యక్తీకరణ శ్రీరామకృష్ణులలో కానవచ్చినంత మేరకు మరెక్కడా కానరాదని దృఢంగా విశ్వసించి, నిశ్చింతగా శ్రీరామకృష్ణుల వద్దే ఉండిపోయాడు. కొన్ని రోజులలోనే వివేకానందస్వామి కాశీపూర్‌కు తిరిగి వచ్చేశాడు.

12. ఎవరికి ఇక్కడ ఉన్నదో, వారికి అక్కడా ఉన్నది

శ్రీరామకృష్ణుల మహాసమాధికి కొద్దికాలం ముందు, శ్రద్ధాళువైన ఒక భక్తు రాలు బృందావనానికి వెళ్లి కొంతకాలం అక్కడ తపశ్చర్యాదులలో గడిపి రావాలనే తన ఆకాంక్షను గురుదేవులకు వ్యక్తం చేసింది. ఆమె కోర్కె వినగానే శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''ఓహ్! ఎందుకు అక్కడకు వెళ్లాలి? అక్కడ ఏం చేస్తావు? ఇక్కడ (అంటే భక్తి) ఉన్నవారికి, అక్కడా ఉంటుంది. ఇక్కడ లేనివారికి అక్కడా మృగ్యమే.'' బృందావనం పట్ల ఉన్న మక్కువ కారణంగా ఆ భక్తురాలు శ్రీరామకృష్ణుల మాటలు పట్టించుకోకుండా, ఆయన వద్ద సెలవు పుచ్చుకొని బృందావనానికి వెళ్లింది. ఆ తీర్థయాత్ర పర్యటనలో తాను ఏమంత లబ్ధి పొందలేదని ఆమే మాకు తదనంతరం తెలిపింది. అంతేకాక చివరి రోజులలో శ్రీరామకృష్ణుల సాన్నిధ్యంలో ఉండే భాగ్యానికి కూడా ఆమె నోచుకోలేకపోయింది. ఆమె బృందా వనానికి వెళ్లిన కొద్దికాలానికే శ్రీరామకృష్ణులు మహాసమాధి పొందారు.

13 . శ్రీరామకృష్ణుల విశ్వాసం : తీర్థయాత్రలు

మూర్తీభవించిన సమస్త ఆధ్యాత్మిక భావాల ప్రతిరూపులైన శ్రీరామ కృష్ణులు ఒక విశిష్ట మనోవైఖరితో తాను తీర్థయాత్రలు చేశానని అనేక పర్యా యాలు మాతో చెప్పివున్నారు. ఆయన ఇలా చెప్పేవారు: ''కాశీలో ప్రతి ఒక్కరూ ఇరవై నాలుగు గంటలూ శివుణ్ణే ధ్యానిస్తూ సమాధిమగ్నులై ఉంటారని అనుకొన్నాను; బృందావనంలో యావ న్మందీ గోవిందుని సాంగత్యంలో భక్తి, దివ్యప్రేమలలో లీనమై ఉంటారని భావిం చాను. కాని నేను ఆ ప్రదేశాలకు వెళ్లి చూసినప్పుడు అంతా తద్విరుద్ధంగానే కని పించింది.'' ఐదేళ్ల బాలునిలా ప్రతి విషయాన్ని విశ్వసించే మనస్తత్వం గలవారు శ్రీరామకృష్ణులు. మేం చిన్నతనం నుండి ప్రతి వ్యక్తినీ, ప్రతి విషయాన్నీ సంశ యాత్మక దృక్పథంతో చూడడం అలవాటు చేసుకొన్న వాళ్లం. మా కుటిల మనస్సులలో ఆ రకం సరళ విశ్వాసం ఎలా చోటుచేసుకొంటుంది? ఎవరైనా సరళ మనస్తత్త్వంతో ప్రతి దానిని విశ్వసించడం కనుక మన కళ్లబడితే అతడి

నొక మూర్ఖుడిగా, బుద్ధిహీనుడిగా భావిస్తాం. "నాయనలారా! తపశ్చర్యలు, సాధనలు అనుష్ఠించిన ఫలితంగా వ్యక్తులు నిష్కపటులూ, ఉదారులూ మారతారు. నిష్కాపట్యం సంతరించుకోకుండా భగవత్సాక్షాత్కారం పొందలేరు. ఇటువంటి నిష్కాపట్యం, సరళ విశ్వాసం ఉన్నవారికే భగవంతుడు తన యథార్థ నైజాన్ని అభివ్యక్తం చేస్తాడు." పై విషయాన్ని మొట్టమొదటిసారిగా శ్రీరామకృష్ణుల నుండి మేం విన్నాం. సరళ విశ్వాసం ఉండాలంటే మూర్ఖులు కావాలేమోనని కొందరు అపార్థం చేసుకోవచ్చు. అందుకే ఆయన ఇలా అనేవారు: "నువ్వు భక్తుడివి కావాలి, నిజమే; అలాగని మూర్ఖుడవు ఎందుకు కావాలి?" మళ్లీ ఆయన ఇలా కొనసాగించేవారు: "నీ మనస్సులో ఏది నిత్యమో ఏది అనిత్యమో, ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో సదా వివక్షణ చేస్తూవుండాలి. అలా చేస్తూచేస్తూ చివరకు అనిత్యమైన వాటిని విడిచిపెట్టి, నిత్యమైన వాటి మీద మనస్సును ఏకాగ్రం చేయాలి."

14. భక్తుడవు, మూర్ఖుడివి కాబోకు

శ్రీరామకృష్ణుల ఈ రెండు వచనాల సామరస్యాన్ని గ్రహించలేక అప్పుడప్పుడు ఆయన వద్ద ఎన్నోసార్లు చీవాట్లు తిన్నాం. అప్పటికి యోగానందస్వామి ఇంకా సన్న్యాసం పుచ్చుకోలేదు. ఒక సందర్భంలో ఇంటికి ఒక మూకుడు కావలసివచ్చి దానిని కొనడానికి బారాబజారుకు వెళ్లాడు. అక్కడ అంగడి వాడికి అధార్మిక వర్తనకు వాటిల్లే అనర్థాలను గుర్తుచేసి, "చూడవోయ్, వస్తువు న్యాయమైన ధర పుచ్చుకొని, మంచి మూకుడు ఇవ్వు. చిల్లులు పగుళ్లు ఏవీ లేకుండా చూడు" అని అన్నాడు. అందుకు అంగడివాడు, "నిశ్చింతగా ఉండండి, మంచి మూకుడు ఇస్తాను" అని చెప్పి, తనే ఒక మూకుడు ఎంపికచేసి ఇచ్చాడు. యోగానంద స్వామి అంగడివాడి మాటలు నమ్మి, మూకుణ్ణే పరీక్షించకుండానే తీసుకువచ్చాడు. కాని దక్షిణేశ్వరానికి వచ్చాక చూస్తే మూకుడులో పగుళ్లు కనిపించాయి. ఈ విషయం శ్రీరామకృష్ణులకు తెలిసింది. అప్పు డాయన ఇలా అన్నారు: "అదేమిటి? పరీక్షించకుండా వస్తువును ఎలా కొనుక్కొని వచ్చావు? అంగడివాడు వ్యాపారం చేయడానికే కూర్చున్నాడుగాని ధార్మికతకు కంకణం కట్టుకొని కూర్చోలేదే? అతడి మాటలు నమ్మి ఎందుకు మోసపోయి వచ్చావు? నువ్వు నిస్సందేహంగా భక్తుడివే; అందుకని మూర్ఖునిలా వ్యవహరించవచ్చా? లోకుల చేతుల్లో నువ్వు మోసపోవాలా? ముందు ఇచ్చిన వస్తువు మంచిదో కాదో పరీక్షించి ఆ తరువాత అంగడివాడికి పైకం చెల్లించు. వస్తువు పుచ్చుకొనే ముందు తూకం సరిగా ఉందో లేదో చూడు. అలాగే కొన్ని వస్తువులు కొనుగోలు చేసినప్పుడు కొసరు ఇవ్వడం కద్దు. కొసరు పుచ్చుకోకుండా రాబోకు." ఇలాంటి ఉదాహరణాలు ఎన్నో

పేర్కొనవచ్చు. వాటిని ఇక్కడ పేర్కొనడం అప్రస్తుతం. అద్భుత నిరాడం బరతతో పాటు అసాధారణ వ్యవహారదక్షత శ్రీరామకృష్ణులలో ఎలా మేళనమై ఉన్నదో చూపడానికే ఈ విషయం ప్రస్తావించాం.

ఆ తీర్థయాత్రలో మథుర్‌బాబు లక్ష రూపాయల కంటే ఎక్కువే ఖర్చు పెట్టాడని శ్రీరామకృష్ణుల నుండి మేం విన్నాం. కాశీకి రాగానే బ్రాహ్మణ పండి

15. పుణ్యక్షేత్రాలలో అపవిత్రత

తులను ఆహ్వానించి మథుర్ వారికి సంతర్పణ చేశాడు. ఆ తరువాత ఒక రోజు బ్రాహ్మణులను వారి కుటుంబాలతో సహా ఆహ్వానించి, తృప్తిగా వారికి భోజనం పెట్టించి ప్రతి ఒక్కరికి ఒక వస్త్రం, ఒక రూపాయి దక్షిణగా సమర్పించాడు. బృందావనం సందర్శించి తిరిగి వచ్చాక మళ్లీ శ్రీరామకృష్ణుల ఆదేశానుసారం ఒకరోజు మథుర్ 'కల్పవృక్ష'మైనాడు. అడిగిన వారందరికీ పాత్రలు, వస్త్రాలు, దుప్పట్లు, చెప్పులు ఇత్యాదులు ఇచ్చాడు. సంతర్పణ చేసిన మొదటి రోజే బ్రాహ్మణులు తమలో తాము కలహించుకోవడం, గోలచేయడం, చివరకు కొట్లాడుకోవడం వరకూ పోవడం చూసి శ్రీరామకృష్ణులు ఎంతో కలత చెందారు. ఇతర ప్రాంతాలలో మాదిరి కాశీలో కూడా జనం కామినీకాంచనాల పట్ల ఎంతో అనురక్తి కలిగి ఉండడం చూసి ఆయన నిరాశా నిస్పృహ చెందారు. కంట తడిపెట్టుకొని, ''అమ్మా, నన్నెందుకు ఇక్కడకు తీసుకువచ్చావు? దక్షిణేశ్వరంలో ఆనందంగానే ఉన్నాను కదా!'' అని జగజ్జననితో మొరపెట్టుకొన్నారు.

పుణ్యక్షేత్రాలలో నివసించే జనంలో సైతం విషయాసక్తి తీవ్రస్థాయిలో ఉండడం చూసి శ్రీరామకృష్ణులు ఎంతో బాధపడ్డారు. అయినప్పటికీ ఆయనకు

16. 'స్వర్ణమయ కాశీని' శ్రీరామకృష్ణులు దర్శించడం

ఆ క్షేత్రాలలో అసాధారణ దివ్యదర్శనాలు, అనుభూతులు కలిగాయి. దానితో శివుడి మహిమపట్ల, కాశీక్షేత్ర మహత్వం పట్ల ఆయన విశ్వాసం మరింత ఇనుమడించింది. పడవ మీదుగా కాశీలో ప్రవేశించినప్పటినుండి కాశీనగరం నిజానికి సువర్ణ నిర్మితమనీ, మన్ను రాళ్లతో అక్కడ ఏదీ నిర్మితం కాలేదనీ ఆయనకు యోగ దృష్టిలో గోచరించింది. వాస్తవానికి యుగయుగాంతరాల నుండి విశ్వనాథుణ్ణి ఆరాధిస్తూ వస్తున్న సాధువుల, భక్తుల అమూల్య స్వర్ణమయోజ్జ్వల ఆధ్యాత్మిక భావరాశులు కుప్పలు కుప్పలుగా ప్రోగై, ఘనీభవించి ప్రస్తుత కాశీనగర రూపాన్ని సంతరించుకొన్నట్లుగా తోస్తూన్నది. తేజోవిరాజమానమై ప్రకాశిస్తూ మూర్తీభవించిన ఆ ఆధ్యాత్మిక భావోద్వేగాలే కాశీక్షేత్ర అసలైన స్వరూపం. ఇక బాహ్యంగా కానవస్తున్నది దాని నీడ మాత్రమే.

స్థూలదృష్టితో పరికించినా కాశీక్షేత్రం 'సువర్ణమయం' అని ఎందుకు పేర్కొనబడుతూన్నదో అర్థం చేసుకోవడం ఏమంత కష్టం కాదు. గంగాతీరాన

17. 'సువర్ణమయ' కాశీగా పేర్కొనడానికి కారణం

రెండు మైళ్ల మేరకు విస్తరించిన కాశీ నగరం అసంఖ్యాక దేవాలయాల, పెద్ద భవనాల, విశాలమైన మెట్లతో నిర్మితమైన స్నానఘట్టాల, చక్కని కాలిబాటల, దర్వాజాల, ఉద్యాన గృహాల, మఠాల, కాలువల, కోనేరుల, సాధువులకు విద్యార్థులకు పేదలకు ఉద్దేశించిన అన్నసత్రాలతో అలరారుతూ ఉంటుంది. ఈ వైభవాన్ని చూసి అతి ప్రాచీన కాలం నుండి భారత దేశ అన్ని ప్రాంతాల వారు ఈ శివపురిని నిర్మింప ఎడతెగని సువర్ణవర్షం కురిపించి ఉంటారని ఎవరు మాత్రం అంగీకరించకుండా ఉండగలరు? ముప్పై కోట్ల భారతీయుల భక్తిప్రపత్తులు ఏకమై యుగాల పర్యంతం ప్రయత్న లోపంలేకుండా ఈ సుందర పుణ్యక్షేత్ర బాహ్య అభివ్యక్తీకరణకు దోహదం చేసివుంటాయనుకొని ఎవరు మాత్రం ఆశ్చర్యపోరు? ప్రబలమైన ఆధ్యాత్మిక భావప్రవాహాన్ని చూసి ఎవరు మాత్రం ముగ్ధులు కాకుండా ఉండగలరు? దాని మూలస్థానాన్ని కనుగొనే ప్రయత్నంలో మైమరచిపోరు? మహామహిమోపేతమైన ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించి, భక్తితో హృదయం ద్రవించిపోగా, ఆశ్చర్యచకితులై, వినమ్రులై ఇలా అనకుండా ఎవరు ఉండగలరు? ''నిజానికి ఇదొక అసదృశ సృష్టి. ఇది మానవనిర్మితం మాత్రం కాదు. నిస్సహాయుడైన జీవుడి దుర్దశ చూసి దీనవత్సలుడూ, ఆర్తత్రాణపరాయణుడూ అయిన ఆ భగవంతుడి అనంత కరుణయే దీని ఉనికికి కారణం.'' ఆ పరమేశ్వరుని శక్తే సాక్షాత్తు అన్నపూర్ణాదేవిగా వెలసి, జీవుల స్థూల సూక్ష్మ దేహాలను పరిపోషిస్తూ ఉన్నది. అన్నాన్ని వితరణ చేస్తూ జీవుడి అన్నమయ, ప్రాణమయకోశాలను; భక్తిజ్ఞానాలతో జీవుడి మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలను పరిపోషిస్తూ, సత్వరమే జీవుడికి ముక్తిని ప్రసాదిస్తూ ఉంటుంది. కనుక సువర్ణమయ ఆధ్యాత్మిక భావాల రాశిగా కాశీని భావముఖంలో వెలకొన్న ఉన్న శ్రీరామకృష్ణులు గాంచడం వింతేమీ కాదు.



కాశీ విశ్వనాథ దేవాలయం

ప్రకాశించే వస్తువులు అన్నీ హిందువుల దృష్టిలో పవిత్రంగా, సత్వగుణోపేతమైనవిగా ఎంచబడతాయి. కాబట్టే జ్యోతి లేక వెలుగు తన ప్రకాశం కారణంగా ...

సత్వగుణ వ్యక్తీకరణగా ఒప్పారుతున్నది. అందుకే శాస్త్రాలు దైవవిగ్రహాల ఎదుట దీప ప్రమిదను వెలిగించి ఉంచమని నొక్కి-వక్కాణిస్తున్నాయి; ఆ దీపాలను ఆర్పరాదనీ కట్టడిచేస్తున్నాయి. ఈ శాస్త్ర ఆదేశాలనుండి పై విషయం స్పష్టమౌతున్నది. బహుశా ధగధగ మెరిసే బంగారం వంటి వాటిని పవిత్ర వస్తువులుగా పరిగణించ డానికి కారణం ఇదే కావచ్చు. అందుకే బంగారు ఆభరణాలను శరీరానికి దిగువ భాగంలో ధరించకూడదని శాస్త్రాలు వచించడానికికూడా కారణం ఇదే అయి వుండవచ్చు. కాశీక్షేత్రం స్వర్ణమయంగా కానరావడంచేత బాలక స్వభావులైన శ్రీరామకృష్ణులు అక్కడ మూత్రవిసర్జనాదులు చేస్తే అపవిత్రం చేసినట్లుగా భావించి, ఎంతో ఆందోళన చెందారు. మథుర్‌బాబు ఏర్పాటు చేయించిన పల్లకీలో 'అసి' నదిని దాటి దూరంగాపోయి అక్కడ మూత్ర విసర్జనాదులు పూర్తిచేసుకొని వచ్చేవారనే సంగతి స్వయంగా ఆయన ముఖతా మేం విన్నాం. కొన్ని రోజుల తరువాత ఆ భావం ఉపశమించాక, అలా నదిని దాటిపోవలసిన అవసరం తీరిపోయింది.

18. కాశీక్షేత్రం పట్ల శ్రీరామకృష్ణుల ప్రతిస్పందన

కాశీలో ఆయనకు కలిగిన మరొక అద్భుత దర్శనం గురించి స్వయంగా ఆయనే మాకు చెప్పారు. కాశీకి తీర్థయాత్రకు వచ్చేవారిలో అనేకులు గంగాతీరంలోని మణికర్ణిక వంటి ఐదు పవిత్ర ప్రదేశాలను సందర్శింప పడవ మీదుగా వెళతారు. శ్రీరామ కృష్ణులతోపాటు మథుర్‌కూడా అదేవిధంగా పడవ మీద గంగలో ప్రయాణం చేశాడు. కాశీలోని ప్రధాన శ్మశానవాటిక మణికర్ణికకు సమీపంలోనే ఉంది. మథుర్‌బాబు పడవ మణికర్ణికా ఘట్టాన్ని సమీపించినప్పుడు, ప్రక్కనే ఉన్న శ్మశానంలో దహింపబడుతున్న మృతదేహాల చితుల నుండి ఎగసే పొగతో మణికర్ణిక పూర్తిగా ఆవరించిపోయి ఉంది. భావమయులైన శ్రీరామకృష్ణులు తన దృష్టిని ఆ వైపుకు పరపగానే

19. మణికర్ణికా ఘట్టంలో శ్రీరామకృష్ణుల అలౌకిక దర్శనం


మణికర్ణికా ఘట్టం

పట్టరాని ఆనందంతో ఉప్పొంగిపోయారు, ఆయనకు రోమాంచమైంది. గబగబ నడిచి పడవ అంచుమీద నిలబడి సమాధిమగ్నులయ్యారు. ఆయన ఎక్కడ నదిలో పడిపోయి, నీటి ప్రవాహంలో కొట్టుకొనిపోతారేమోనని భయంతో పడవ వాళ్ళు, మథుర్‌తోబాటు వస్తున్న పండాలు, తదితరులు ఆయనను పట్టుకోవడానికి ముందుకు ఉరికారు. శ్రీరామకృష్ణులు ప్రశాంతంగా, స్థిరంగా నిలబడి ఉండడంతో ఆ అవసరం లేకపోయింది. అద్భుత తేజస్సు, దరహాసం ఆయన ముఖారవిందాన్ని దేదీప్యవంతం చేస్తూ, ఆ ప్రదేశాన్ని పవిత్రం, జ్యోతిర్మయం గావించసాగింది. హృదయ్ మథుర్‌లు, శ్రీరామకృష్ణుల కిరువైపులా నిలబడి జాగ్రత్తగా ఆయనను చూసుకోసాగారు. పడవవారు కాస్త దూరంలో నిలబడి ఆయన భావమయావస్థను విస్మయంతో చూడసాగారు. కొంతసేపటికి ఆయన భావమయావస్థ ఉపశమించింది. తరువాత వాళ్ళ మణికర్ణికా ఘట్టంలో దిగి, స్నానాదులు ముగించి, ఆచారకర్మలు నిర్వర్తించుకొని, ఇతర చోట్లు సందర్శింప మళ్ళీ పడవలో బయలుదేరారు.

ఆ తరువాత తమకు కలిగిన దివ్యదర్శనాన్ని మథుర్ తదితరులకు ఆయన ఇలా వర్ణించి చెప్పారు: ''పొడగరీ, పింగళవర్ణుడూ, జటాధారీ, శ్వేతకాయుడూ అయిన పురుషు డొకడు మెల్లగా నడుస్తూ శ్మశానంలోని ప్రతి చితి వద్దకు వెళ్ళి, ఒక్కో జీవుణ్ణే జాగ్రత్తగా లేవదీసి చెవిలో తారక బ్రహ్మమంత్రాన్ని ఉపదేశించ సాగాడు. చితికి మరోవైపు సర్వశక్తిమంతురాలైన జగదంబ, మహాకాళి రూపుదాల్చి జీవుడి స్థూల సూక్ష్మ కారణ బంధనాల నన్నిటినీ త్రెంచివేసి, స్వయంగా మోక్ష ద్వారం తెరిచి, ఆ జీవుణ్ణే కైవల్యధామానికి పంపుతూవుంది. ఈ విధంగా ఎన్నో కల్పాల పర్యంతం కఠోర తపశ్చర్యాదులు అనుష్ఠించిన తరువాతే ఏ అద్వైతానుభూతి జీవుడికి లభిస్తుందో, దానిని విశ్వనాథుడు జీవులకు క్షణమాత్రంలో ప్రసాదించి వారిని తరింపచేస్తున్నాడు.''

మథుర్‌తోపాటు వస్తూవున్న శాస్త్రాలలో ఆరితేరిన పండితులు శ్రీరామకృష్ణుల దివ్యదర్శన వర్ణన విని, ఇలా అన్నారు: ''కాశీలో మరణించే జీవులకు శివుడు ముక్తిని ప్రసాదిస్తాడనే విషయం (లింగపురాణాంతర్గతమైన) కాశీఖండం ఇతమిత్థంగా పేర్కొంటున్నది. కాని ఆయన ముక్తిని అనుగ్రహించే పద్ధతి మాత్రం వివరంగా వర్ణింపబడలేదు. మీ దివ్యదర్శనం, అనుభూతి ఆ విషయాన్ని స్పష్టం చేయడమేకాక శాస్త్రాలలో నమోదైన విషయాలనూ మించిపోయాయి.''

త్రైలింగస్వామి

20. శ్రీరామకృష్ణులు త్రైలింగస్వామిని దర్శించడం

కాశీలో బసచేసినప్పుడు అక్కడ సుప్రసిద్ధ సాధు సన్న్యాసులను శ్రీరామకృష్ణులు దర్శించారు. వారిలో ఒకరైన త్రైలింగస్వామిని చూసి ఆయన ఎంతో ఆనందించారు. అప్పుడప్పుడు ఆయన త్రైలింగస్వామిని గురించి మాతో ముచ్చటించేవారు. ఆయన ఇలా అనేవారు: ''సాక్షాత్తు విశ్వనాథుడే తన అభివ్యక్తీకరణార్థం త్రైలింగస్వామి దేహాన్ని ఆశ్రయించి ఉన్నాడు. స్వామి ఉనికిచే కాశీ పావనత్వం మరింత ఇనుమడించింది. ఆయన ఉన్నతోన్నత జ్ఞానావస్థలో ఉన్నారు. ఆయన దేహస్మృతిరహితుడై ఉన్నాడు. మండుటెండలో ఎవరూ కాలుకూడా మోపలేనంత విపరీతమైన వేడిగా ఉండేది గంగాతీరం ఇసుక. కాని త్రైలింగస్వామి ఆ ఇసుకమీద హాయిగా పడుకొని ఉన్నారు. క్షీరాన్నం స్వయంగా వండి, తీసుకువెళ్ళి ఆయనకు తినిపించాను. ఆ సమయంలో ఆయన మౌనవ్రతంలో ఉన్నారు. నేను సంజ్ఞతో, 'భగవంతుడు ఏకమా? అనేకమా?' అని అడిగాను. ఆయన కూడా సంజ్ఞతో ఇలా జవాబిచ్చారు: 'సమాధ్యవస్థలో ఉన్నప్పుడు భగవంతుడు ఏకమనే తెలియవస్తుంది; కాని నేను నువ్వు జీవుడు జగత్తు ఇత్యాది అనేకజ్ఞానం ఉన్నంత వరకు భగవంతుడుకూడా అనేకంగానే అనుభూతమౌతూంటాడు.' త్రైలింగస్వామిని చూపుతూ, 'నిజమైన పరమహంస స్థితి అంటే ఇదే' అని హృదయ్‌తో చెప్పాను.''

21. బృందావనంలో శ్రీరామకృష్ణుల భావ సమాధి

కాశీలో కొద్ది రోజులు గడిపిన తరువాత శ్రీరామకృష్ణులు, మథుర్‌తోపాటు బృందావనం వెళ్లారు. బృందావనంలో 'బంకుబిహారి' విగ్రహాన్ని చూడగానే ఆయన అద్భుత భావసమాధికి లోనైనారు; ఆ విగ్రహాన్ని ఆలింగనం చేసుకోవడానికి పరుగెత్తారని విన్నాం. మునిమాపువేళ గోపబాలురు ఆవుల మందలను తోలుకొని తిరిగివస్తూ యమునానదిని దాటడం చూసి ఆ బాలురలో నెమలిపింఛధారియైన నీలమేఘశ్యాముణ్ణి దర్శించి ఆయన ఆధ్యాత్మిక భావోద్వేగంలో మునిగి



బృందావనం : ఒక ప్రాంతం

పోయారు. శ్రీరామకృష్ణులు వ్రజభూమిలో నిధువనం, గోవర్ధనగిరి మొదలైన శ్రీకృష్ణుడు లీలలు సలిపిన స్థలాలు దర్శించారు. బృందావనంకంటే ఆయనకు ఈ స్థలాలే బాగా నచ్చాయి. ఈ స్థలాలలో వ్రజరాణియైన రాధాదేవి, శ్రీకృష్ణులను వివిధ రీతులలో దర్శించడం వలన ఆయన భగవత్ప్రేమ తీవ్రతరమైనదని మేం విన్నాం.

గోవర్ధనగిరి మొదలైన ప్రదేశాలను దర్శింప మథుర్ ఆయనను పల్లకీలో పంపించాడని తెలియవస్తోంది. పల్లకీలో ఒక ప్రక్క ఒక వస్త్రం పరచి దానిమీద రూపాయలు, అర్ధరూపాయలు, పావలాలు, బేడలు (రెండణాలు) మొదలైన నాణేలను మథుర్ పేర్చాడు. దేవాలయాలలో బీదసాదలకు శ్రీరామకృష్ణులు దానధర్మం చేయడానికే మథుర్ ఆ ఏర్పాటు చేశాడు. కాని శ్రీరామకృష్ణులు ఆ నాణేలను చేతిలో పుచ్చుకోలేనంత భగవత్ప్రేమానురాగాలలో లీనమైపోయారు. వేరే గత్యంతరంలేక వస్త్రం ఒక అంచును లాగి ఆయా స్థలాలలో బీదసాదల మధ్య నాణేలను క్రుమ్మరిస్తూ ఆయన వెళ్లవలసి వచ్చింది.

22. వ్రజభూమి పట్ల శ్రీరామకృష్ణుల ప్రగాఢ ప్రీతి

వ్రజభూమిలో సంసార పరిత్యాగులైన సాధకు లెందరో పర్ణశాలలు వేసుకొని, తలుపు ముఖంగా తమ వీపులను త్రిప్పి బాహ్య విషయాలన్నింటినుండి దృష్టిని మరలించి, జపధ్యానాదులలో మగ్నులై ఉండడం శ్రీరామకృష్ణులు చూశారు. వ్రజభూమి ప్రకృతి సౌందర్యం, తదితర దృశ్యాలు శ్రీరామకృష్ణులను ఎంతగానో

ఆకట్టుకొన్నాయి. వ్రజభూమిలోని ఫలపుష్పాదులు, గోవర్ధనగిరి, నిస్సంకోచంగా సర్వత్రా తిరుగాడే లేళ్లు, నెమళ్లు, తపశ్చర్యలలో మునిగిపోయివున్న సాధువులు, నిరాడంబరులూ, కల్లాకపటంలేని వ్రజవాసులు - ఈ దృశ్యాలన్నీ శ్రీరామ కృష్ణులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. అంతేగాక నిధువనంలో గొప్పతపస్వినీ, భగవదారాధకురాలూ, వయోవృద్ధురాలూ అయిన గంగామాయిని చూసి శ్రీరామకృష్ణులు ఎంతో ముగ్ధులయ్యారు. ఆ సాధ్విని సాంగత్యంలో ఆయన ఎంతగా ఆనందించారంటే, వ్రజభూమిని విడిచిపెట్టి ఎక్కడకూ వెళ్లకూడదనీ, శేషజీవితమంతా అక్కడే గడిపివేయాలనీ దాదాపుగా నిశ్చయించుకొన్నారంటే అతిశయోక్తి కాదు.

23. గంగామాయి ఉదంతం

గంగామాయికి అప్పటికి అరవై ఏళ్లు ఉంటాయి. సుదీర్ఘ కాలం నుండి వ్రజేశ్వరియైన రాధాదేవి, శ్రీకృష్ణుని పట్ల ఆమెకున్న ప్రగాఢ భక్త్యనురాగాలు చూసి రాధారాణి ప్రధాన చెలికత్తెయైన లలితాదేవియే ఏదో కారణంగా ఆమెగా మానవరూపం దాల్చి జీవులకు ప్రేమను బోధింప అవతరించిందని స్థానికులు భావించేవారు. చూసిన క్షణంలోనే రాధా రాణి దేహంలో అభివ్యక్తమైన మహాభావం శ్రీరామకృష్ణులలో కూడా అభివ్యక్త మౌతూన్నదని గంగామాయి గ్రహించగలిగిందని ఆయన ముఖతా మేం విన్నాం. కాబట్టే, రాధారాణి శ్రీరామకృష్ణులుగా అవతరించిందని ఎంచి, ఆమె ఆయనను 'దులారి' (ముద్దులపట్టి) అని పేర్కొనసాగింది. అప్రయత్నంగా తన 'దులారి' దర్శనభాగ్యం లభించడంతో తాను తరించాననీ, తన చిరకాల ఆరాధన, సేవ, ప్రేమలు ఫలవంతమైనాయనీ గంగామాయి ఉప్పొంగిపోయింది. శ్రీరామకృష్ణులు కూడా ఆమెను చూడగానే తక్కిన విషయాలన్నీ మరిచిపోయారు; ఆమె తనకు ఎంతో చిరపరిచితురాలైనట్లు ఆయనకు అనిపించింది. ఆమె పర్ణశాలలో కొన్ని రోజులు గడిపారు. వారి పరస్పర ప్రేమానురాగాలు ఎంత ముగ్ధమనోహరం అయినాయంటే శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి పోవడానికి నిరాక రిస్తారేమోనని మథుర్ తదితరులు భయపడ్డారని మేం విన్నాం. పరమ భక్తుడైన మథుర్ మనస్సు తన 'బాబా' తిరిగి తమతో రాడేమోననే తలంపుతో ఎంత తల్లడిల్లిపోయి ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. కాని మాతృప్రేమ ముందు వ్రజభూమిలోనే ఉండిపోవాలన్న ఆయన సంకల్పం చివరకు తల వంచింది. ఈ సందర్భాన్ని ప్రస్తావించినప్పుడు ఆయన మాతో ఇలా చెప్పారు: ''వ్రజ భూమికి వెళ్లినప్పుడు నేను సర్వం మరచిపోయాను. కాని కొన్ని రోజులు గడిచాక మా అమ్మ జ్ఞాపకానికి వచ్చింది. ఈ వృద్ధాప్యంలో ఆమెను చూసుకొనే వారు, ఆమెకు సేవ చేసేవారులేక ఎంత కష్టపడవలసి వస్తుందోననే తలంపు

మదిలో మెదలింది. దాంతో ఇంకా అక్కడ ఉండడం నాకు అసాధ్యమై పోయింది.''

ఈ మహాపురుషుని పలుకుల చేష్టల గురించి చింతన చేసేకొద్దీ, అంతగా బాహ్యదృష్టికి పరస్పర విరుద్ధాలుగా కానవచ్చే భావాలూ ఆశయాలూ ఆయనలో

24. శ్రీరామ కృష్ణుల మాతృసేవా పరాయణత్వం

అద్భుతంగా సామరస్యం వహించి ఉండడం చూసి ఆశ్చర్య పోతాం. జగజ్జనని పాదపద్మాల వద్ద తనుమనస్సులతో సమస్తాన్ని ఆయన అర్పించినా, సత్యనిష్ఠను మాత్రం ఆమెకు అర్పించలేకపోవడం మీరు గమనించలేదా? ప్రతి వ్యక్తితోను లౌకిక బాంధవ్యాన్ని విడిచిపెట్టినప్పటికీ, తల్లి పట్ల ప్రేమను, కర్తవ్యాన్ని ఆయన విస్మరించలేదు. తమ సతీమణితో ఎన్నడూ జాడమాత్రంగాకూడా లౌకిక సంబంధం పెట్టుకోకపోయినా, గురుభావంలో సదా ఆమెతో అనురాగ బాంధ వ్యాన్ని నెరపడం మాత్రం మరచిపోలేదు. ఆయన అసాధారణ చేష్టితాలకు ఇలాటి ఉదాహరణాలు ఎన్నో చూపవచ్చు! గతంలో ఆవిర్భవించిన ఏ ఆధ్యాత్మిక ఆచా ర్యుని లేదా అవతారపురుషుని జీవితంలోనన్నా ఇన్ని పరస్పర విరుద్ధ భావాలూ ఆశయాలూ ఇంత మధురంగా సామరస్యం చెందివుండడం మనకు కాన వస్తుందా? ఇటువంటి అసాధారణ ఘటనను ఎన్నడూ చూసివుండలేదని ఎవరు మాత్రం అంగీకరించరు? శ్రీరామకృష్ణులు అవతార పురుషులని అంగీకరించినా అంగీకరించకపోయినా ఆధ్యాత్మిక జగత్తులో ఎంత వెతకినా ఆయనకు దీటైన మరో ఉదాహరణ కానరాదని మాత్రం అంగీకరింపక తప్పదు. వయోవృద్ధురాలైన శ్రీరామకృష్ణుల మాతృమూర్తి తన జీవిత అంతిమ సంవత్సరాలు దక్షిణేశ్వరం లోనే గడిపింది. అప్పుడు ఆమెకు సేవాశుశ్రూషలు స్వయంగా తానే నిర్వర్తించి, ధన్యులైనట్లు ఆయనే మాతో చాలాసార్లు చెప్పివున్నారు. ఆరాధ్యురాలైన ఆమె కాలధర్మం చేసినప్పుడు ఆయన అనుభవించిన దుఃఖం వర్ణనాతీతం. అప్పుడు ఆయన విలపించినంతగా లోకంలో ఏ కొద్దిమందో విలపించి ఉంటారని చెప్పడం అతిశయోక్తి కాబోదు. మాతృవియోగంతో ఆయన చెప్పరాని దుఃఖం అనుభ వించినప్పటికీ, తాను సన్న్యాసిని అనే విషయం క్షణమాత్రంకూడా ఆయన విస్మరించలేదు. సన్న్యాసి కావడం వలన తల్లికి శ్రాద్ధాది కర్మలు నిర్వర్తించరాదనే శాస్త్ర నిషేధాన్ని తు.చ. తప్పక పాటిస్తూ, శ్రీరామకృష్ణులు ఆ కర్మకాండను రాంలాల్[1] చేత చేయించారు. తాము ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని ఆమెకై విలపిస్తూ మాతృఋణాన్ని సాధ్యమైనంత వరకూ తీర్చుకొన్నారు.

---

1. శ్రీరామకృష్ణుల చిన్న అన్నగారైన రామేశ్వర్ కుమారుడు.

అనేక సందర్భాలలో ఈ విషయం ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు మాతో ఇలా చెప్పేవారు: ''నాయనలారా, లోకంలో తల్లితండ్రులే పరమగురువులు. వారు జీవించి ఉన్నంత కాలం తమ శక్తిమేరకు వారికి సేవాశుశ్రూషలు చేయాలి; వారి మరణానంతరం శక్త్యానుసారం శ్రాద్ధాది కర్మలు నిర్వర్తించాలి. శ్రాద్ధాది కర్మలు నిర్వర్తింప ఏమాత్రం స్తోమతలేని పేదలు అడవిలోకి పోయి తల్లితండ్రులను జ్ఞాపకం చేసుకొని, వారికై విలపించాలి; ఈ విధంగా చేస్తేనే తల్లితండ్రుల ఋణం తీరుతుంది. ఒక్క భగవంతుడి కోసం మాత్రమే తల్లితండ్రుల మాటను జవదాటవచ్చు; అలా చేయడం దోషంగా పరిగణింపబడదు. తండ్రి నిషేధించినప్పటికీ ప్రహ్లాదుడు హరినామ స్మరణ విడిచిపెట్టలేదు. తల్లి ఎంతవలదని వారించినప్పటికీ వినకుండా ధ్రువుడు తపస్సు చేయడంకోసం అరణ్యాలకు వెళ్లాడు. వాళ్లు అలా చేయడం వలన ఏ దోషానికి గురికాలేదు.'' ఈ విధంగా మాతృభక్తి మూలంగాకూడా శ్రీరామకృష్ణుల గురుభావ అద్భుత అభివ్యక్తీకరణ వికసించడం చూసి మేం తరించాం.

అతికష్టంమీద గంగామాయి నుండి సెలవు పుచ్చుకొని శ్రీరామకృష్ణులు, మథుర్‌తోపాటు కాశీకి తిరిగి వచ్చేశారు. కొన్ని రోజులు అక్కడ గడిపారు.

25. గయాక్షేత్రానికి వెళ్లడానికి శ్రీరామకృష్ణులు నిరాకరించడం : తత్కారణం

తరువాత దీపావళి పండుగరోజు అన్నపూర్ణాదేవి సువర్ణ విగ్రహాన్ని దర్శించి భక్తిప్రేమలతో ఆయన ఉప్పొంగిపోయారు. కాశీనుండి గయాక్షేత్రానికి వెళ్లాలని మథుర్ అభిలాషపడ్డాడు. కాని శ్రీరామకృష్ణులు అందుకు అంగీకరించకపోవడంతో మథుర్ ఆ కోర్కె విడిచిపెట్టాడు. శ్రీరామకృష్ణుల తండ్రియైన ఖుదీరాం గయాక్షేత్రాన్ని సందర్శించినప్పుడు, ఆ క్షేత్ర అధిదేవుడైన గదాధరుడు ఆయనకు కలలో కనిపించి వారి కుటుంబంలో జన్మిస్తానని చెప్పినట్లుగా, స్వయంగా శ్రీరామకృష్ణులే మాతో చెప్పివున్నారు. ఆ కారణంగానే శ్రీరామకృష్ణులకు గదాధర్ అని నామకరణం చేశారు. గయకు వెళ్లి గదాధరుని పాదపద్మాలను కనుక దర్శిస్తే, అప్పుడు జనించే ప్రేమోద్వేగంలో విడిగా తానొక మానవదేహంలో జీవిస్తున్నాననే విషయం పూర్తిగా మరిచిపోయి శాశ్వతంగా తాను గధాధరునిలో ఐక్యం అయిపోతానేమోననే భయంతో మథుర్‌తోపాటు గయాక్షేత్రానికి వెళ్లడానికి నిరాకరించానని ఆయన అప్పుడప్పుడు మాకు చెప్పేవారు. గత యుగాలలో ఎవరు శ్రీరాముడుగా, శ్రీకృష్ణుడుగా, శ్రీ చైతన్యుడుగా అవతరించారో ఆతడే ప్రస్తుతం తమ దేహాన్ని ఆశ్రయించి ఈ ఇలలో అవతరించాడని శ్రీరామకృష్ణుల దృఢవిశ్వాసం. కాబట్టే తమ తండ్రిగారి కలలో తెలియచేయబడినట్లు తన మనశ్శరీరాల ఉత్పత్తికి మూలస్థానమైన గయాక్షేత్ర ప్రస్తావన వచ్చి

నప్పుడల్లా ఆయనలో వర్ణనాతీతమైన భావోద్వేగం జనించడం మేం గమనించి వున్నాం. అలాగే అవతార పురుషులు ఏఏ స్థలాలలో తన లీలా నాటకానికి తెర దించారో (అంటే తమ అవతారాలను చాలించారో) అటువంటి చోట్లకు వెళ్లా లనే ప్రస్తావన వచ్చిన తక్షణమే శ్రీరామకృష్ణులలో అవ్యక్తమైన భావోద్వేగం జనించేది. అటువంటి స్థలాలకు కనుక వెళితే ఆ స్థలంతో తమ మనస్సు విలీన మైపోయి మళ్లీ తిరిగి మర్త్యజగత్తులోకి దిగిరాలేదని ఆయన చెప్పేవారు. చైతన్యులు తమ అవతారాన్ని చాలించిన పూరీక్షేత్ర (నీలాచలం) సందర్శనం చేయాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు అదే భావనను వ్యక్తంచేశారు. ఆయన పరంగా మాత్రమే అటువంటి భావనను వ్యక్తం చేసేవారు కాదు. కొందరి భక్తుల విషయంలో కూడా కొన్ని క్షేత్రాలకు వెళ్లవద్దని వారిని నిషేధించేవారు. తమ భక్తులలో కొందరు దైవాంశసంభూతులనే విషయం యోగదృష్టితో ఆయన తెలుసుకొనేవారు. ఆ సందర్భంలో ఏ దైవాంశసంభూతులో ఆ దేవత విశేషంగా అభివ్యక్తమయ్యే పుణ్యక్షేత్రాలకు ఆ భక్తులను వెళ్లవద్దని నిషేధించేవారు. శ్రీరామ కృష్ణుల ఆ మనోభావనను పాఠకులకు విశదీకరించడం ఎంతో కష్టం. శ్రీరామ కృష్ణుల ఆ భావనను 'భయ'మని పేర్కొనడం సముచితం కాదు. ఎందుకంటే, స్వయంగా సమాధిస్థితి అనుభూతిని పొందిన సామాన్య సాధకులు కూడా మరణ సమయంలో జీవుడెలా దేహాన్ని విడిచిపోతాడో గుర్తించగలుగుతారు కనుక; కాబట్టే చావు కూడా బాల్యం, యౌవనం, వృద్ధాప్యం వంటి ఫలానా శారీ రక స్థితి మార్పు అని ఎరిగి చావుభయం లేనివారైపోతారు. సామాన్యులే ఇలా చావుపట్ల నిర్భీతులవుతున్నప్పుడు సంకల్పమాత్రాన ప్రగాఢ సమాధ్యవస్థను పొందగలిగే అవతారపురుషులు మృత్యుంజయులై, నిర్భయు లవుతారనడం ఆశ్చర్యం కాదు. ఆ భావనను జనసామాన్యంలా ఇంకా జీవించి ఉండాలి లేదా దేహాన్ని పరిరక్షించుకోవాలి అనే తహతహగా చెప్పడంకూడా సబబు కాదు. ఎందు కంటే జనసామాన్యం బ్రతకాలని కోరుకోవడం భోగం కోసమూ, స్వార్థసుఖం కోసమే కదా! కాని ఎవరి మనస్సులనుండి స్వార్థపరాయణత్వం శాశ్వతంగా తొలగి పోయిందో, అటువంటి వారి విషయంలో ఈ వివరణ వర్తించదు.

అటువంటప్పుడు శ్రీరామకృష్ణుల భావనను మేం ఎలా విశదీకరించగలం? పలుకులే మన పరికరాలు, అంటే మన మనస్సులలో ఎగసే భావాలను వ్యక్తం చేయడానికి తోడ్పడే పరికరాలన్నమాట. కాని శ్రీరామకృష్ణుల వంటి మహాపురు షుల దివ్యభావాలను వ్యక్తం చేయగల శక్తి మన పలుకులకు ఉన్నాయా? కాబట్టి పాఠక మహాశయా, ఈ పరిస్థితిలో వ్యర్థతర్కాల జోలికిపోకుండా, శ్రీరామ కృష్ణులు తమ భావనలను వ్యక్తంచేసిన అదే పలుకుల పట్ల విశ్వాసం వహించి,

మన ఊహాశక్తి తోడ్పాటుతో మనం గ్రహించినంత మేరకు ఆ దివ్యభావాల రూపురేఖలను చిత్రించుకోవడం తప్ప మరో గత్యంతరం మనకు లేదు.

ఒక స్థలంనుండి, ఒక వస్తువు లేదా వ్యక్తినుండి ఉత్పన్నమైన దివ్య అభివ్యక్తీకరణ, ఆ మూలస్థానానికి అత్యంత సన్నిహితంగా చేరువైనప్పుడు, ఆ ఉత్పత్తి స్థానంలో విలీనమైపోతుందని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. శాస్త్రాలలో కూడా ఇందుకు ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. జీవుడు పరబ్రహ్మంనుండే ఉద్భవిస్తున్నాడు; ఎప్పుడు సరైన జ్ఞానాన్ని సంతరించుకొని ఆ పరబ్రహ్మాన్ని సమీపిస్తాడో, అప్పుడు దాన్లో జీవుడు లీనమైపోతాడు. అనంతమైన మనస్సు (లేదా విశ్వమానసం) నుండే నీది, నాది, ప్రతి వ్యక్తి పరిమిత మనస్సూ ఉద్భవిస్తుంది; అంటే ఆ విశ్వమానస అభివ్యక్తీకరణలే ఈ మనస్సులని అర్థం. మనలో ఏ ఒకరి అల్పమైన మనస్సు పవిత్రతను, అనాసక్తతను, కరుణను, తదితర ఉదాత్త సుగుణాలను పెంపొందించుకొంటూ చివరకు ఆ విశ్వమానసాన్ని సమీపించగలిగితే లేదా దానివంటిదే కాగలిగితే వెంటనే దాన్లో లీనమైపోతుంది. స్థూలప్రపంచంలో కూడా ఇదే నియమం వర్తిస్తుంది. ఈ భూమి ఉత్పన్నమైనది సూర్యునినుండే. ఏదో శక్తి ద్వారానో లేదా మరో విధంగానో భూమి, సూర్యుణ్ణి సమీపించగలిగితే వెంటనే దాన్లో లీనమైపోతుంది. కనుక పైన పేర్కొన్న శ్రీరామకృష్ణుల ప్రగాఢ విశ్వాసం వెనుక మనకు తెలియని ఏదో ప్రత్యేక భావం ఉండివుంటుంది. గదాధర్ (గయలో వెలసిన దేవుడు) అనే వస్తువు లేదా వ్యక్తి నిజంగా ఉన్నట్లయితే, శ్రీరామకృష్ణుల మనశ్శరీరాలు ఏదో కారణంగా ఆ గదాధరుని నుండి అభివ్యక్తమైనాయనే విషయం యథార్థమైతే శ్రీరామకృష్ణుల ఆ ప్రగాఢ విశ్వాసం, అంటే ప్రేమ కారణంగా వారిద్దరూ పరస్పరం ఆకర్షితులై, ఇద్దరూ ఐక్యమైపోతారనే విశ్వాసం - యుక్తివిరుద్ధమని ఎలా చెప్పగలం?

26. కార్యం కారణంలో లయమయ్యే నియతి

అవతార పురుషుల జీవితాలు సామాన్య మానవుల జీవితాల వంటివి కావని వివరించడానికి ఊహగాని తర్కంగాని ఉపయోగింపనక్కరలేదు. ఊహాతీతమైన మహాశక్తి వారిలో అభివ్యక్తం కావడం చూసి, సామాన్యులు పూజ్యభావంతో వారికి తలవంచి ప్రణామం చేస్తారు; హృదయపూర్వకంగా వారిని ఆరాధించి, శరణు వేడుతారు. అసాధారణ శక్తిసంపన్నులైన అటువంటి అవతార పురుషుల జీవిత రహస్యాన్ని అవగతం చేసుకోవడానికి కపిల మహర్షివంటి మేధావులైన దార్శనికులు, తత్త్వవేత్తలు ఎంతో కృషి చేశారు. సామాన్యులలోకంటే ఎంతో గొప్పశక్తి వీరిలో అభివ్యక్తం కావడంలోని మర్మాన్ని తెలుసుకోబోయి

27. అవతార పురుషుల జీవిత రహస్యాన్ని కర్మసిద్ధాంతం విశదీకరించలేదు : తత్కారణం

నప్పుడు, సర్వులకూ వర్తించే కర్మ సిద్ధాంతం ఈ మర్మాన్ని విశదీకరించలేదని ఆదిలోనే వారు గ్రహించారు. ఎందుకంటే, సామాన్యులు చేసే శుభాశుభ కర్మ లన్నీ స్వార్థ సుఖప్రాప్తికోసమే కనుక. కాని ఈ అవతార పురుషుల కర్మలను గురించి అధ్యయనం చేసినప్పుడు, వాటిలో స్వార్థగంధం కించిత్తూ కానరాదు. ఇతరుల కష్టాలను తీర్చాలనే ఆకాంక్ష వారిలో తిరుగులేని ప్రేరణను కల్పిస్తుంది. ఆ ఉదాత్త ప్రేరణ కారణంగా వారు సుఖసంతోషాల నన్నిటినీ పూర్తిగా త్యజిస్తారు. పేరుప్రతిష్ఠలు పొందాలనే ఆకాంక్ష వారిలో ఎన్నడూ కలగకపోవడం మనం చూడ వచ్చు. ఇహలోక పేరుప్రతిష్ఠల, పరలోక సుఖసంతోషాల పట్ల వారికి ఎన్నడూ కోర్కె జనించదు; వాటిని వారు కాకిరెట్టలా ఎంచుతారు.

నరనారాయణులనే ఋషు లిద్దరు బదరికాశ్రమంలో లోకకళ్యాణార్థం యుగాలపర్యంతం కఠోర తపస్సు చేయడం మీకు తెలియదా? తన ప్రజల సంతో షానికై శ్రీరామచంద్రుడు తన ప్రాణసమానురాలైన సీతాదేవిని బహిష్కరించాడు. శ్రీకృష్ణుడు ఒనరించిన ప్రతి కార్యమూ సత్యధర్మాల ప్రతిష్ఠాపన కోసమే. జీవు లను జన్మ జరామరణాది దుఃఖాలనుండి ఉద్ధరించడం కోసమే బుద్ధుడు ఒక సామ్రాజ్యాన్నే త్యజించాడు. దుఃఖమయ ప్రపంచంలో ప్రేమ స్వరూపుడైన తండ్రి స్వర్గరాజ్యాన్ని నెలకొల్పే ఉద్దేశంతోనే ఏసుక్రీస్తు శిలువమీద ప్రాణాలు అర్పించాడు. అధర్మాన్ని అరికట్టడం కోసమే మహమ్మద్ కత్తిదూశాడు. అద్వై తానుభూతిలోనే నిజమైన శాంతి ఉందని తన యావచ్ఛక్తిని వినియోగించి ప్రజ లకు బోధించాడు శంకరాచార్యుడు. జీవుణ్ణి సంసారం నుండి తరింపచేసే శక్తి ఒక్క శ్రీహరి నామంలోనే ఉందని గ్రహించి, తన సాంసారిక సుఖ సంతోషాలకు తిలోదకాలిచ్చి మహోత్సాహంతో శ్రీహరి నామాన్ని ఎడతెగని నృత్యగానాల ద్వారా ప్రచారం చేయడంలో నిమగ్నుడైనాడు శ్రీచైతన్య మహాప్రభువు. వ్యక్తిగత కష్టాలనే కొనితెచ్చిన ఇటువంటి కార్యాలకు అవతార పురుషులను ఏ స్వార్థం ప్రేరేపిం చింది?

అంతేకాదు. అసాధారణ ఆధ్యాత్మికానుభూతులను పొంది జీవన్ముక్తులైన మహాపురుషులలో ఎటువంటి లక్షణాలు అభివ్యక్తమౌతాయని శాస్త్రాలు అభి వర్ణిస్తున్నాయో ఆ లక్షణాలన్నీ అవతార పురుషుల జీవితా లలో కూడా కానరావడం గమనించారు మన దార్శనికులు. కనుక గత్యంతరంలేక అటువంటి మహాపురుషుల నందరినీ ఒక క్రొత్త కోవకు చెందిన వారుగా పరిగణించవలసివచ్చింది. అవతార పురుషు లలో లోకకళ్యాణం ఒనగూర్చాలనే ఉదార ఆకాంక్ష ఉంటుందని సాంఖ్యదర్శన కారుడైన కపిలుడు వచించి ఉన్నాడు. కాబట్టే గత జన్మలలో కఠోర తపస్సుచేసి

28. సాంఖ్య దర్శనం: అవతార సిద్ధాంతం

ముక్తులైనప్పటికీ వీరు నిర్వాణస్థితిని చేపట్టక, ప్రకృతిలీనులై ఉంటారు. అంటే సమస్త ప్రకృతిశక్తీ తమ శక్తే అనే ఎరుకతో ఒక కల్పాన్ని గడిపివేస్తారు. కాబట్టే ఇటువంటి ప్రకృతిలీనులలో ఏ మహాత్ముడు ఏ కల్పంలో తాను అటువంటి ప్రకృతిశక్తి సంపన్నుడనని భావిస్తాడో ఆతడు ఆ కల్పంలో జనసామాన్యానికి 'ఈశ్వరుడు'గా విరాజిల్లుతాడు. ఎందుకంటే, ప్రకృతిలోని యావచ్ఛక్తీ 'తనదే' అనే బోధ ఎవరికి ఉంటుందో ఆతడు ఆ యావచ్ఛక్తిని తన ఇచ్ఛమేరకు ఉపయోగించడమో లేదా ఉపసంహరించడమో చేయగలుగుతాడు కనుక. ఈ చిన్ని శరీరాలలోని ప్రకృతి శక్తులన్నీ 'మనవే' అని తెలుసుకోవడంచేత వాటిని మనం ఎలా ఉపయోగించుకొంటామో, అలాగే 'ప్రకృతిలీన' పురుషులు కూడా ప్రకృతి శక్తు లన్నిటినీ 'తమవి'గా గ్రహించి సంకల్ప మాత్రాన వాటిని ఉపయోగిస్తూంటారు. సర్వకాల వ్యాపీ, ఏకమాత్రుడూ అయిన ఈశ్వరు డొకడు ఉన్నాడని నిజానికి సాంఖ్యదర్శనకారుడైన కపిలుడు అంగీకరించకపోయినా, ఒక కల్ప కాలం వరకూ శాసించే సర్వశక్తిమంతులైన పురుషుల అస్తిత్వాన్ని అంగీకరిస్తాడు. అటువంటి వ్యక్తులను ఆయన 'ప్రకృతి లీను'లని పేర్కొంటాడు.

ఈ ఈశ్వర ఆవర్తన సిద్ధాంతాన్ని వేదాంతకారులు అంగీకరించరు. ఒక్కడే అయిన ఈశ్వరుడి నిత్య అస్తిత్వాన్ని వీరు అంగీకరిస్తారు. ఆ ఏకైక ఈశ్వరుడే

29. వేదాంతం: అవతార సిద్ధాంతం

మనకు కనిపించే ఈ ప్రపంచంగా, జీవులుగా అభివ్యక్తమౌతున్నాడనీ, విశేష శక్తివంతులైన ఆ ఆధికారిక పురుషులందరూ కూడా నిత్యశుద్ధబుద్ధ ముక్తస్వరూపుడైన ఈశ్వరుడి విశేషాంశ సంభూతులనీ వీరు చెబుతారు. అంతేకాక ఆ ఆధికారిక పురుషులు జగత్కల్యాణానికి దోహదంచేసే ఏదో ఒక విశేష కార్యాన్ని నిర్వర్తించడంకోసం అవసరమైనప్పుడల్లా జన్మిస్తూవుంటారనీ వీరు వచిస్తారు. ఆ కార్యాన్ని నిర్వర్తింప అవసరమైన శక్తిని సంతరించుకొనే వారు జన్మించడం వలన వేదాంతకారులు వారిని 'ఆధికారికు' లని పేర్కొంటారు. 'ఆధికారికు' డంటే అధికారం పొందిన వ్యక్తి లేదా ఏదో ఒక విశేష కార్యం నిర్వర్తింప అవసరమైన శక్తిసామర్థ్యాలు సంతరించుకొన్నవాడని అర్థం. ఇలా జన్మించే ఆధికారిక పురుషులలోకూడా శక్తితారతమ్యం, (ఎక్కువ తక్కువలు) ఉండడం గమనించి వీరిని మళ్లీ రెండు తరగతులుగా వర్గీకరించారు : 1. అవతార పురుషులు 2. నిత్యముక్తులైన ఈశ్వరకోటులు. ఎవరి చేతలు లోకంలోని యావన్మందికీ శాశ్వతమైన మేలును ఒనగూరుస్తాయో వారు అవతార పురుషులుగా పేర్కొనబడతారు. ఎవరి చేతలు ఒక దేశానికి లేదా ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమై మేలొనరిస్తాయో వారు నిత్యముక్తులైన ఈశ్వరకోట్లు. ఈశ్వరకోటులకంటే అవతార పురుషులలో అభివ్యక్తమయ్యే ఆధికారికశక్తి అత్యంత అధికంగా ఉంటుంది.

వేదాంతకారుల పై అభిప్రాయాన్ని ఆధారం చేసుకొని తమ ఊహాశక్తి దోహదంతో ప్రతి అవతార పురుషునిలో ఏ మేరకు భగవదంశం ఇమిడివుందో అంచనావేయడానికి పురాణకర్తలు ప్రయత్నించారు; ఆ అంచనా కట్టడంలో వారు అతిశయోక్తులను ఆశ్రయించడం కూడా కద్దు. ''ఏతే చాంశకలాః పుంసః కృష్ణస్తు భగవాన్ స్వయం'' అంటే ఇతర అవతారపురుషులందరూ భగవంతుని అంశ మాత్రులు, కాని శ్రీకృష్ణుడు సాక్షాత్తు భగవంతుడే! - ఇటువంటి అతిశయోక్తులు భాగవతంలో మనకు తారసపడతాయి.

గురుభావం స్వయంగా భగవంతుడి శక్తే అనే విషయం ఇదివరకే మరొక చోట[1] విశదీకరింప ప్రయత్నించాం. అజ్ఞాన భ్రాంతిలోపడి, ఎంత ప్రయత్నించి నప్పటికీ దాన్నుండి బయటపడలేని జీవుణ్ణి చూసి అపార కరుణ వహించి అతణ్ణి ఉద్ధరింప భగవంతుడు ఆతురత చెందుతాడు. కరుణార్ద్రుడైన భగవంతుని ఆ ఆతురతే గురురూపంగా లేదా గురుభావంగా ఆవిర్భవించి వ్యక్తమౌతుంది. జనసామాన్యం గ్రహించి అవగతం చేసుకోవడానికి సుగమమౌతుందనే ఉద్దేశంతో భగవంతుని ఆ గురుభావం అప్పుడప్పుడు మానవరూపం దాల్చి అభివ్యక్త మౌతూ వస్తుంది. ఇది యుగాల పర్యంతంగా సంఘటిల్లుతున్న విషయమే. అలా మానవరూపాలు దాల్చిన పురుషులనే అవతార పురుషులు లేదా ఆధికారిక పురుషులు అంటారు. వీరు జగత్పూజ్యులు, జగద్గురువులు. కాబట్టే అవతార పురుషులు మాత్రమే మానవాళికి నిజమైన గురువులనే విషయం సుస్పష్ట మౌతున్నది.

30. వారి మనశ్శరీరాల అనుపమానత

మనశ్శరీరాల నిర్మాణంలో సామాన్యజీవులకూ ఆధికారిక పురుషులకూ ఎంతో వ్యత్యాసం ఉంటుంది. వారిలో అవి మహోన్నత భావద్భావాలనూ, ప్రేమనూ, మహోన్నతశక్తినీ గ్రహించి వ్యక్తంచేయ సామర్థ్యం వహించి ఉంటాయి. సామాన్యుడికి కించిత్తు ఆధ్యాత్మికశక్తి, పర్యవసానంగా జనంలో కాస్త పూజ్యనీయత లభిస్తే, అతడి ఆనం దానికి పట్టపగ్గాలుండవు, అహంకారంతో మిడిసిపడతాడు. కాని ఆధికారిక పురు షులు ఏమాత్రం చలించరు. వేయిరెట్ల ఆధ్యాత్మికశక్తి సంతరించుకొన్నప్పటికీ వారిలో అహంకారం, గర్వం జాడమాత్రంగా కూడా కనిపించదు. జీవుడు సకల బంధాలనుండి విముక్తుడై, ఆత్మజ్ఞానం చేకూర్చే సమాధి స్థితిని పొందగలిగితే, అతడు ఇక ఏ కారణం వలనకూడా ఈ సంసారంలోకి మళ్లీ రావడానికి ఇష్ట

---

1. III.3.22-28

పడదు. కాని ఈ పరమానందాన్ని చవిచూసిన మరుక్షణమే ఇతరులతో దానిని పాలుపంచుకోవాలనే ఆతురత ఆధికారిక పురుషులలో జనిస్తుంది. భగవత్సాక్షాత్కారం పొందాక జీవుడికిక ఏ కర్తవ్యమూ మిగిలి ఉండదు. కాని భగవత్సాక్షాత్కారం సంతరించుకొన్న తరువాతే ఆధికారిక పురుషుల కర్తవ్యం మొదలవుతుంది. అంటే తమ జన్మోద్దేశం వారు అవగతం చేసుకొని ఆ లక్ష్య సాధనకు ఉద్యుక్తు లవుతారు. తాము జన్మించిన ప్రత్యేక లక్ష్యాన్ని సాధించే వరకూ, సామాన్య ముక్తపురుషులలా, 'దేహం ఇప్పుడే రాలిపోతే పోనీ' అనే ఆలోచన ఎన్నడూ కలుగకపోవడమనే నియతి ఆధికారిక పురుషులకు వర్తిస్తుంది. అందుకు బదులుగా ఈ మర్త్యుల సుఖదుఃఖాలలో పాలుపంచుకొంటూ వారి మధ్య జీవించాలనే ఆతురత వారిలో కానవస్తుంది. కాని అవతార పురుషులు బ్రతికి ఉండాలనే సంకల్పానికీ, సామాన్యజీవుల సంకల్పానికీ మధ్య హస్తిమశకాంతరం ఉంది. పైగా తమ కర్తవ్య నిర్వహణ పూర్తి అయిందని గ్రహించగానే, మరొక్క క్షణంకూడా తాత్సారం చేయకుండా పరమానందంగా తమ దేహాలను సమాధి స్థితిలో త్యజించివేస్తారు. సామాన్యజీవులు సంకల్పమాత్రాన సమాధిలో దేహాన్ని త్యజించలేకపోవడమే కాక, తమ జీవిత కర్తవ్యాలు ఎప్పుడు ముగుస్తాయో కూడా వారు తెలుసుకోలేరు. పైగా తమ కోర్కెలు ఇంకా అనేకం ఈడేరలేదని భావిస్తారు, ఇంకా జీవించాలనే అప్రతిహతమైన వ్యాకులతా వారిలో నెలకొనే ఉంటుంది. ఈ రీతిలో సామాన్యులకూ, అవతార పురుషులకూ మధ్య మరెన్నో విషయాలలో వ్యత్యాసాలు ఉండడం గమనించవచ్చు. సామాన్య జీవులకు వర్తించే మన ప్రమాణాలతో అవతార పురుషుల జీవిత లక్ష్యాలను, చేతలను నిర్ణయింప ప్రయత్నిస్తే మనం పప్పులో కాలువేసినట్లే.

ఈ శాస్త్రభావాల నేపథ్యంలోనే, 'నేను గయాక్షేత్రాన్ని సందర్శిస్తే శరీరం నిలవదు', 'పూరీక్షేత్రానికి వెళితే నాకు శాశ్వత సమాధి స్థితి కలుగుతుంది' మొదలైన శ్రీరామకృష్ణుల వచనాలను మనం అవగతం చేసుకోవలసి ఉంటుంది. కాబట్టే సంక్షిప్తంగానే ఆ అంశాన్ని మేం ఇక్కడ చర్చించాం. శ్రీరామకృష్ణుల ఏ భావమూ శాస్త్ర విరుద్ధమైనది కానేకాదన్న విషయం పై చర్చనుండి పాఠకులు అర్థం చేసుకోగలరు.

మథుర్‌తో కలిసి గయాక్షేత్రాన్ని సందర్శింప శ్రీరామకృష్ణులు నిరాకరించారనే విషయం ఇంతకు మునుపే చెప్పివున్నాం. కాబట్టి ఆ పర్యటనలో ఎవరూ ఆ పుణ్యక్షేత్రాన్ని దర్శించలేదు. అందరూ వైద్యనాథం మీదుగా కలకత్తాకు తిరిగి వచ్చారు. కాశీకి పోతున్నప్పుడు ఈ వైద్యనాథం వద్దే ఒక ఫలానా కుగ్రామంలోని నిరుపేద లనుభవిస్తున్న కటిక దారిద్ర్యాన్ని చూసి, హృదయం ద్రవించిపోగా

మథుర్‌కి చెప్పి వారందరికీ కడుపారా తిండి పెట్టించి, కట్టుబట్టను శ్రీరామ కృష్ణులు ఇప్పించిన సంఘటనను మరొక చోట విపులంగా ప్రస్తావించాం (III.7.38).

కాశీ, బృందావనం వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించడంతో పాటు శ్రీరామకృష్ణులు ఒక సందర్భంలో చైతన్య మహాప్రభువు జన్మస్థలమైన నవద్వీపాన్ని కూడా సందర్శించారు. ఈసారి కూడా మథుర్‌బాబే ఆయనను తనతో అక్కడకు తోడ్కొని వెళ్లాడు. అవతార పురుషుల మనస్సులకు సైతం అన్ని సత్యాలూ, అన్ని సమయాలలోనూ సాక్షాత్కరించవన్న విషయం, గౌరాంగుని గురించి ఒక సందర్భంలో శ్రీరామకృష్ణులు ముచ్చటిస్తున్నప్పుడు మాకు స్పష్టమైంది. కాని ఏ ఆధ్యాత్మిక సత్యాలను గురించి తెలుసుకోవాలని, అవగతం చేసుకోవాలని వారు ఆకాంక్షిస్తారో అవి మాత్రం సునాయాసంగా వారి బుద్ధికి గోచరిస్తాయి.

31. శ్రీరామకృష్ణుల నవద్వీప సందర్శనం

గౌరాంగ మహాప్రభువును భగవదవతారంగా పరిగణించడంలో అప్పుడు మాలో అనేకులకు సందేహం ఉండేది. పైగా మాలో అనేకులం 'వైష్ణవు'డనే మాటను నిమ్నజాతి వారికి పర్యాయపదంగా భావించే వారం. మా సందేహ నివృత్తికై దీనిని గురించి శ్రీరామకృష్ణులను అడిగాం. అందుకు జవాబుగా శ్రీరామకృష్ణులు మాకు ఇలా చెప్పారు: ''నాకు కూడా అదే వైఖరి ఉండేది. మొదట్లో నేను ఇలా అనుకొనేవాణ్ణి: 'భాగవతాది పురాణాదులలో జాడ మాత్రంగా కూడా ప్రస్తావించని చైతన్యులు ఎలా అవతారపురుషు డవుతాడు? బోడితలల వైష్ణవులు ఆయనను అవతారపురుషుణ్ణిగా నెలకొల్పారు.' చైతన్యులను అవతారంగా విశ్వసించేవాణ్ణి కాదు. మథుర్‌తోబాటు నవద్వీపం వెళ్లాను. చైతన్యులు నిజంగా అవతారపురుషుడే అయినపక్షంలో ఆయన దివ్య అభివ్యక్తీకరణ శక్తి ఏదో కొంత మేరకు అక్కడ గోచరించాలనీ, ఆ స్థలం చూసినప్పుడు ఈ విషయం తెలియవస్తుందనీ అనుకొన్నాను. ఆయన దివ్యత్వ అభివ్యక్తీకరణ ఎక్కడన్నా కానవస్తుందేమోనని పెద్దగోస్వామి, చిన్నగోస్వామి ఇళ్లకు, తదితర చోట్లకు నడక సాగించాను. కాని ఎక్కడా నాకు ఏ ప్రత్యేకతా కనిపించలేదు. ప్రతిచోట చేతులు ఎత్తి నిలబడివున్న కొయ్య విగ్రహాలే కళ్లబడ్డాయి. వాటిని చూసి నిరుత్సాహపడ్డాను. అక్కడకు వెళ్లినందుకు విచారించాను. ఆ తరువాత తిరిగి వెళ్లడానికి పడవలో అడుగుపెట్టగానే నా కొక అద్భుత దర్శనం కలిగింది: సుకుమారులైన ఇద్దరు బాలురు కనిపించారు. అంత అందమైన బాలురను నే నెన్నడూ చూసి ఉండలేదు. తప్తకాంచనం వంటి మేనిఛాయ, తలమీద జ్యోతి

32. శ్రీచైతన్యుల అవతారం గురించి శ్రీరామకృష్ణుల అభిప్రాయాలు

ర్మండలంతో వారు విరాజిల్లుతున్నారు. తలలు పైకెత్తి నావంకే చూస్తూ ఆకాశ మార్గంలో నా వైపుగా పరుగెత్తుకొని రాసాగారు. 'అదుగో వారొస్తున్నారు, వారొస్తున్నారు' అంటూ కేకలు పెట్టాను. ఇలా కేకలు పెట్టసాగానో లేదో వాళ్ల వచ్చి దీన్లో (తమ శరీరాన్ని చూపిస్తూ) ప్రవేశించారు. బాహ్య చైతన్యం కోల్పోయి, క్రిందపడిపోయాను. హృదయ్ ప్రక్కనే ఉండి పట్టుకోకపోతే నీళ్లలో పడిపోయి ఉండేవాణ్ణి. ఇటువంటి దర్శనాలు ఎన్నో కలగడం వలన, వాస్తవానికి (చైతన్యులు) అవతారమనీ, భగవదాంశసంభూతుడనీ నాకు నమ్మకం ఏర్ప డింది.'' శ్రీరామకృష్ణులు ఇటువంటి విషయాలు ఎన్నో మాతో చెప్పారు. చైతన్య మహాప్రభువుల నగర సంకీర్తన దివ్యదర్శనం కలిగిందని ఒక రోజు శ్రీరామ కృష్ణులు మాతో చెప్పారు. ఈ దివ్యదర్శనాన్ని గురించి మేం మరొక చోట[1] విశదీకరించాం.

పైన పేర్కొన్న పుణ్యక్షేత్రాలనేకాక శ్రీరామకృష్ణులు ఒక సందర్భంలో మథుర్‌బాబుతో కలిసి కాల్నాకు కూడా వెళ్లారు. చైతన్య మహాప్రభువు పాద ధూళి సోకడం వలన వంగదేశంలో గంగాతీర గ్రామాలు ఎన్నో పవిత్ర తీర్థాలుగా రూపొందాయి. వాటిలో కాల్నా ఒకటి. పైగా బర్ద్వాన్ రాజవంశీయులు నూట ఎనిమిది శివాలయాలను ఇక్కడ నెలకొల్పి కాల్నా కీర్తి వైభవాలను మరింత ఇనుమడింప చేశారనే విషయం యాత్రీకు లందరికీ అనుభవైకవేద్యమే. కాని శ్రీరామకృష్ణులు కాల్నాకు వెళ్లడం లోని ఉద్దేశం అది కాదు. ఆ ప్రాంతాలలోని సుప్రసిద్ధుడైన వైష్ణవ సాధువు భగవాన్ దాస్ బాబాజీని సందర్శించడమే ఆయన ఉద్దేశం.

33. శ్రీరామకృష్ణులు కాల్నాను సందర్శించడం

అప్పుడు భగవాన్‌దాస్ బాబాజీ వయస్సు ఎనభై ఏళ్లకు పైబడి ఉంటుంది. తాను జన్మించి ఏ కులాన్ని పావనం చేశాడో మాకు తెలియదు. కాని ఆయన మహోన్నత పరిత్యాగం, వైరాగ్యం, భగవద్భక్తి గురించి మాత్రం వంగదేశంలోని ఆబాలగోపాలానికి సువిదితమే. పరమనిష్ఠతో కదలామెదలక రేయింబవళ్లు దీర్ఘకాలం ఒకేచోట పద్మాసనంలో కూర్చుని ఒకే భంగిమలో జపం ధ్యానం ధారణ తపస్సు చేసిన ఫలితంగా జీవిత చరమాంకంలో ఆయన కాళ్లు రెండూ పక్షవాతంతో పడిపోయాయని విన్నాం. ఎనభై ఏళ్లు పైబడ్డా, అంగవైకల్యం సంభవించినా హరి నామస్మరణ పట్ల ఉత్సుకత, దివ్యప్రేమ భావంలో ఆనందబాష్పాలు స్రవించడం మాత్రం ఏమాత్రం సన్నగిల్లలేదు; పైపెచ్చు అధికరించాయి.

34. భగవాన్‌దాస్ బాబాజీ పరిత్యాగం, భక్తి, కీర్తిప్రతిష్ఠలు

---

1. II. అనుబంధం - 26

కాల్నా ప్రాంతాలలోని వైష్ణవ సముదాయం భగవాన్‌దాస్ బాబా తమ మధ్య వసించడం వలన క్రొత్త ఉత్తేజాన్ని సంతరించుకొన్నది. బాబా ఉజ్జ్వల ఆదర్శాన్ని సోదాహరణగా గైకొని, ఆయన ఉపదేశాలను అనుసరించి అనేకమంది వైష్ణవ సాధువులు తమ ఆధ్యాత్మిక జీవితాలను రూపుదిద్దుకొనే అవకాశం పొంది, ధన్యులయ్యారు. ఆ రోజుల్లో ఆయనను దర్శించుకోవడానికి వెళ్లిన ప్రతి ఒక్కరూ సుదీర్ఘకాలం బాబా అనుష్ఠిస్తూ వచ్చిన తపస్సు, పవిత్రత, భక్తి, వైరాగ్యాదుల ప్రభావాన్ని తమ అంతరాంతరాళాలలో అనుభూతం చేసుకొని, అపూర్వ ఆనందాన్ని పొందేవారనడం అతిశయోక్తి కాబోదు. శ్రీ చైతన్య మహాప్రభువు ప్రచారం చేసిన భగవత్ప్రేమ అమోఘమైనదన్న ఆయన అభిప్రాయాలు అక్కడి ప్రజలు శిరసావహించి, అందరూ వాటిని పాటించేవారని మేం విన్నాం. కనుక సిద్ధపురుషుడైన బాబాజీ కేవలం సొంత సాధనలలోనే మునిగిపోలేదు; వైష్ణవ సముదాయానికి సంక్షేమం చేకూర్చే, వైష్ణవ సాధువులు వైరాగ్య ఆదర్శం మేరకు తమ జీవితాలను రూపొందించుకొనే, సంసార పంకంలో చిక్కువడిన సామాన్య జీవులు చైతన్యుల భక్తిమార్గంలో ఉత్సుకత పొంది తమ జీవితాలలో శాంతిని సంతరించుకొనే మార్గాలను గురించి చర్చిస్తూ, వాటిని ఆచరణయుతం చేయడంలోకూడ బాబా ఎంతో సమయాన్ని గడిపేవారు. వైష్ణవ సముదాయంలో ఎక్కడ ఏం జరుగుతున్నదో, సాధువుల మంచి చెడు ప్రవర్తనల గురించి జనం బాబాజీ దృష్టిలోకి తెచ్చేవారు. అదంతా విని ఆయన, యోచించి ఏం చేయాలో ఉత్తర్వులిచ్చేవారు. వైరాగ్యం, తపస్సు, ప్రేమలతో జీవితం గడిపే వారిలో తేజో వైభవం, సాధికారికత నెలకొని ఉంటాయి; జనం బాబా పలుకులను ఎంతో విధేయతతో శిరసావహించి, వాటిని తక్షణమే పాటింప ఆతురత కనబరిచేవారు. గూఢాచారు లెవరూ లేకపోయినా, వైష్ణవ సముదాయంలో జరిగే ప్రతిదీ సిద్ధుడైన బాబాజీ కళ్లకు గోచరమయ్యేది; ఆ సముదాయంలో ప్రతి వ్యక్తీ ఆయన ప్రభావానికి లోనయ్యేవాడు. ఆయన ప్రభావం పరపిన పరిరక్షక దృక్కుల ముందు సరళ హృదయుల భక్త్యుత్సాహాలు ఎలా నానాటికీ అధికరించేవో, అట్లే కపటవర్తనులు తెలియరాని భయం ఆవరించగా, సిగ్గుతో కుంచించుకుపోయి తమ దుష్ప్రవర్తనాన్ని మార్చుకోవడానికి ప్రయత్నించడమూ కద్దు.

భగవత్సాక్షాత్కారార్థం పన్నెండు సంవత్సరాల కాలంపాటు అవిచ్ఛిన్నంగా శ్రీరామకృష్ణులు తీవ్ర సాధనలలో మునిగివున్న, గురుభావం ఆయనలో సమగ్రంగా అభివ్యక్తం అయ్యే కాలంలో భారతదేశంలో అనేక ప్రాంతాలలో ప్రధానమైన మతోద్యమాలు రూపుదిద్దుకోసాగాయి. వాటిలో కొన్ని: కలకత్తా, దాని పరిసర ప్రాంతాలలో హరిసభలు, బ్రహ్మసమాజం; స్వామి దయానంద పంజాబు,

35. శ్రీరామకృష్ణుల సాధన కాలంలో ప్రారంభమైన మతోద్యమాలు

భారతదేశ వాయవ్య ప్రాంతాలలో మొదట్లో 'వేదమతం'గా తదనంతరం ఆర్యసమాజంగా ప్రచారం చేసిన మతోద్యమం; బెంగాల్‌లో పునరుజ్జీవనం పొందిన వేదాంత మతం, దాని శాఖలైన 'కర్తాభజా' మొదలైనవి; ఉత్తర భారతదేశంలో రాధా స్వాముల మతోద్యమం; గుజరాత్‌లో స్వామి నారాయణ మతోద్యమం. పైన పేర్కొన్న మతోద్యమాలన్నీ పైన చెప్పిన కాలఘట్టానికి కాస్త అటూ ఇటూగా స్థాపితమై ప్రచారం చేయబడినవే. ఈ మతోద్యమాలను, వాటి సిద్ధాంతాలను ఇక్కడ విశదీకరించడం మా ఉద్దేశం కాదు. కలకత్తాలోని కొల టోలా ప్రాంతంలో నెలకొన్న ఒక హరిసభను శ్రీరామకృష్ణులు సందర్శించినప్పటి ఒక్క సంఘటనను మాత్రం వివరింపదలచాం.

36. కొలటోలా హరిసభలో శ్రీరామకృష్ణులు

కొలటోలా హరిసభ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని పురస్కరించుకొని ఒక రోజు శ్రీరామకృష్ణులు హృదయ్‌ను వెంటబెట్టుకొని అక్కడకు వెళ్లారు. ఇంతకు మునుపే మేం ప్రస్తావించిన వైష్ణవచరణ్ ఆ రోజు సభలో భాగవత పారాయణం చేసి విశదీకరిస్తారనీ, అది వినడానికే శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్లారనీ కొందరంటారు. కాని శ్రీరామకృష్ణుల ముఖతా ఈ కారణంగా ఆయన అక్కడకు వెళ్లినట్లు మేం వినలేదు. ఏది ఏమైనప్పటికీ భాగవత పారాయణం సాగుతూండగా అందరూ దానిని వినడంలో లీనమై ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు అక్కడకు వచ్చారు. శ్రోతల నడుమ కూర్చుని ఆయనకూడా విన సాగారు.

37. భాగవత పారాయణం

శ్రీ చైతన్యుల పావన పాదపద్మాల వద్ద సంపూర్ణ శరణు పొందినట్లు ఆ హరిసభ సభ్యులు తమను పరిగణించుకొనేవారు. ఈ అంశాన్ని సదా జ్ఞాపకంలో ఉంచుకొనే యత్నంలో వాళ్లు ఒక ఆసనాన్ని పరచి, చైతన్య దేవులు దానిపై ఆసీనులై ఉన్నట్లుగా ఎంచి, భాగవ తాదుల పఠనం, ఆరాధన మొదలైనవి నిర్వర్తించేవారు. ఆ ఆసనాన్ని 'శ్రీ చైతన్యుల ఆసనం' అని పేర్కొనేవారు. భక్తిప్రపత్తులతో అందరూ ఆ ఆసనం ముందు ప్రణామాలు చేసేవారు. ఆ ఆసనం మీద కూర్చోడానికి ఎవరినీ అనుమ తించేవారు కారు. పువ్వులు, పువ్వులమాలలతో అలంకరించబడిన ఆ ఆసనం ముందు భాగవత పారాయణం జరుగుతుంది; శ్రీచైతన్యులు ఆ ఆసనంలో కూర్చుని వింటారని భక్తులు భావిస్తూ, ఆయన దివ్యసన్నిధానంలో శ్రీహరి వచనామృతాన్ని తాము గ్రోలుతూవున్నట్లుగా భావించేవారు. శ్రీరామకృష్ణుల ఆగమనంతో పారాయణం చేస్తున్న వ్యక్తి, శ్రోతల భక్తిభావం నూరురెట్లు ఇనుమ డించిందని చెప్పనవసరం లేదు.

భాగవత వచనామృతాన్ని గ్రోలుతూ శ్రీరామకృష్ణులు మైమరచిపోయారు. ఆ స్థితిలో హఠాత్తుగా ఆయన 'శ్రీ చైతన్యుల ఆసనం' వైపుగా పరుగెత్తి, దాని మీద నిలబడి, ప్రగాఢ సమాధిలో మగ్నులైపోయారు; దేదీప్యమానంగా ప్రకాశిస్తూవున్న ఆయన ముఖారవిందాన మొలకెత్తిన అసాధారణమైన ప్రేమాస్పద దరహాసాన్ని, చిత్తరువులలో కానవచ్చే చైతన్యుల భంగిమలో నిలబడిన తీరునూ చూసి భక్తులు తమ హృదయాంతరాళాలలో భావముఖ స్థితిలోని శ్రీరామకృష్ణులు, చైతన్యదేవులతో తాదాత్మ్యం చెందినట్లుగా భావించసాగారు. బాహ్యదృష్టిలో శ్రీరామకృష్ణుల, చైతన్యుల మనశ్శరీరాల మధ్య దేశకాల పరిస్థితుల కారణంగా కనవచ్చే సుదూరం ఆ భావజగత్తులో పూర్తిగా అదృశ్యమైనదని, భావముఖంలో శ్రీరామకృష్ణులు ఆ ఎడబాటును అనుభవించడం లేదని భక్తులు గ్రహించారు. భాగవతం పారాయణ చేస్తూన్న వ్యక్తి పారాయణ చేయడం ఆపి, ఆయన వంకే నిశ్చలంగా చూస్తూ ఉండిపోయాడు. శ్రోతలు శ్రీరామకృష్ణుల భావసమాధి స్థితిని అవగతం చేసుకోలేకపోయినప్పటికీ, ఏదో ఒక అవ్యక్తమైన విస్మయంతో పరవశులై నిశ్చలంగా ఉండిపోయారు. మంచిగాని చెడుగాని పలుకలేని స్థితిలో వారంతా ఉన్నారు. శ్రీరామకృష్ణుల శక్తివంతమైన ఆధ్యాత్మిక భావ ప్రవాహంలో అందరూ అనిర్వాచ్య జగత్తుకు తాత్కాలికంగా కొట్టుకొనిపోయి అనిర్వచనీయ పరమానందం అనుభవించసాగారు. మొదట్లో ఏం చేయాలో వాళ్లకు అర్థం కాలేదు; కాసేపయ్యాక అనిర్వచనీయ భావ ప్రభావానికిలోనై బిగ్గరగా 'హరిబోల్' అంటూ హరిసంకీర్తన ప్రారంభించారు.

38. 'శ్రీ చైతన్యుల ఆసనం' పై శ్రీరామకృష్ణులు

ఏ భగవన్నామం ద్వారా మనస్సు సమాధిస్థితికి అధిరోహిస్తుందో ఆ నామం ద్వారానే మనస్సు మళ్లీ ఆ స్థితి నుండి మామూలు స్థితికి తిరిగి రాగలదని సమాధి తత్త్వాన్ని విశదీకరిస్తూ ఇంతకు మునుపే మరొక చోట[1] ప్రస్తావించి ఉన్నాం. శ్రీరామకృష్ణులలో నిత్యం ఇలా జరగడం మేం ఎన్నోసార్లు గమనించి వున్నాం. 'హరి' నామం చెవిన పడగానే శ్రీరామకృష్ణులకు ఒకింత శరీరస్మృతి కలిగింది. అప్పుడు ఆయనలో భగవత్ప్రేమభావం ఉప్పొంగగా, సంకీర్తన చేస్తున్న భక్తబృందంతో జతకట్టి మహోత్సాహంతో నృత్యం చేస్తూ చేస్తూ, భావాతిశయ పారవశ్యంలో చిత్తరువులా కదలామెదలక నిలబడిపోసాగారు. శ్రీరామకృష్ణుల ఆ అవస్థను చూస్తూన్న భక్తుల భక్త్యుత్సాహాలు నూరింతలధికరించగా, వారందరూ సంకీర్తనలో తన్మయులైపోయారు. అటువంటి పరిస్థితిలో 'శ్రీ చైతన్యుల

1. III.7.6

ఆసనం' మీద శ్రీరామకృష్ణులు నిలబడడం సముచితమో కాదో నిర్ణయించే వారెవరున్నారు? ఆ రీతిలో మహోత్సాహంతో నృత్యం చేస్తూ శ్రీహరి, శ్రీచైతన్యుల గుణనామ కీర్తనం గావించిన తదనంతరం అందరూ ఏకస్వరంలో జయ జయ ధ్వానాలు చేసి నాటి ఉత్సవాన్ని ముగింపుకు తెచ్చారు. కొంతసేపయ్యాక శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లారు.

శ్రీరామకృష్ణుల నృత్యసంకీర్తనల దివ్యప్రభావంలో తన్మయులై తాత్కాలికంగా ఉన్నత ఆధ్యాత్మిక భూములను అధిరోహించ గలిగారు ఆ భక్తులు.

39. పై సంఘటన వలన చెలరేగిన సంక్షోభం

కాని తాత్కాలికంగా స్తబ్ధమైనా ఇతరులలో తప్పులు పట్టడమే స్వాభావికమైన వారి దోషదృష్టి, శ్రీరామకృష్ణులు అక్కడ నుండి నిష్క్రమించిన తక్షణమే 'పునర్మూషికం' మాదిరిగా మళ్లీ తప్పులు పట్టే స్థితికే దిగజారింది. నిజానికి జ్ఞానాన్ని పూర్తిగా ఉపేక్షించి కేవలం ఒక్క భక్తి ఆధారంతో మాత్రమే భగవత్సాక్షాత్కారం సిద్ధిస్తుందని ఉపదేశించే మతాలన్నింటిలోను ఈ దోషం కనబడుతుంది. భక్తి మార్గంలో సాగే సాధకులు శ్రీహరి సంకీర్తనాదుల తోడ్పాటుతో కొంతసేపు ఉన్నత ఆధ్యాత్మిక స్థితులకు అలవోకగా అధిరోహించి పరమానందం అనుభవించ గలిగినా, ఆ భావోద్వేగం అణగిపోయిన మరుక్షణమే నిమ్న స్థితులకు దిగజారిపోతారు. అది వారి తప్పు కాదు; ఉద్వేగంలో ఉత్తేజం చెందడం, అది అణగాక నిస్త్రాణ చెందడం మనశ్శరీరాల ప్రకృతి ధర్మం. అంటే ఎంత ఉవ్వెత్తుకు అధిరోహిస్తామో, తరువాత అంతే అధోస్థితికి పడిపోతాం. అట్లే ఉత్తేజం అనంతరం నిస్త్రాణ కలగడం కూడా ప్రకృతి స్వభావమే.

ఇప్పుడు కూడా అలాగే జరిగింది. హరిసభకు చెందిన ఆ భక్తుల ఉన్నత ఆధ్యాత్మిక భావోద్వేగం తగ్గిపోగానే వారిలో పూర్వపు స్వభావ సంస్కారాలు మళ్లీ తలఎత్తి, శ్రీరామకృష్ణుల ప్రవర్తనను విమర్శించడంలో వారు మునిగిపోయారు. భావముఖ స్థితిలో శ్రీరామకృష్ణులు 'శ్రీ చైతన్యాసనాన్ని' అధిష్ఠించడం సబబే అని ఒక పక్షం వారు అంగీకరించగా, మరొక పక్షం వారు అందుకు తమ తీవ్ర నిరసనను వెలిబుచ్చారు. ఆ రెండు పక్షాల మధ్య వాదోపవాదాలు తారాస్థాయిని చేరుకొన్నాయి. కాని చివరకు వారు ఎటువంటి నిర్ణయానికీ రాలేకపోయారు.

ఈ వివాదం క్రమంగా ఆ నోట ఈ నోట వైష్ణవ సముదాయం అంతటా ప్రాకింది. భగవాన్‌దాస్ బాబాజీ చెవినకూడా పడింది. అక్కడితోనే వ్యవహారం ఆగిపోలేదు; భవిష్యత్తులో భావద్భావం కలిగినట్లు నటిస్తూ పేరుప్రతిష్ఠలను పొందే ఉద్దేశంతో నయవంచకులు, మోసగాళ్లు ఆ ఆసనాన్ని అధిష్ఠిస్తారేమోనని

భయపడ్డ హరిసభ భక్తులు కొందరు బాబాజీని కలుసుకొని, అటువంటి సంఘటనలు ఇకమీదట జరగకుండా ఏం చేయాలో ఆయనను సలహా అడిగారు.

శ్రీచైతన్యుల పాదాశ్రితుడై సిద్ధుడైన బాబాజీ తన అభీష్టదేవత ఆసనం మీద ఎవరో అనామకుడైన శ్రీరామకృష్ణులు నిలబడ్డారని వినగానే ఎంతో చిరాకు

40. ఆ విషయం విని బాబాజీ కుపితు డవడం

పడ్డాడు. కోపంతో కళ్లు మూసుకుపోగా శ్రీరామకృష్ణులను నానాదుర్భాషలాడాడు, నయవంచకుడని అభివర్ణించడానికి కూడా వెనుకాడలేదు. తన వద్దకు వచ్చిన హరిసభ సభ్యులను చూడగానే బాబాజీ విసుగు, కోపం తారాస్థాయినందుకొన్నాయి. తమ కళ్ల ముందే అలా జరిగినప్పుడు వాళ్లు చేతులు ముడుచుకొని కూర్చోవడం మహాపరాధమని వాళ్లపై భగ్గున మండిపడ్డాడు. తరువాత కోపం తగ్గాక, భవిష్యత్తులో మరెవరూ అలాంటి పని చేయకుండా కట్టుదిట్టంగా ఉండడానికి ఏం ఏర్పాట్లు చేయాలో ఆదేశాలిచ్చాడు. కాని ఈ గందరగోళానికంతా కారణం ఎవరో (అంటే శ్రీరామకృష్ణులు) వారికి మాత్రం ఇవేవీ తెలియవు.

ఈ సంఘటన జరిగిన కొన్ని రోజుల తరువాత తమ ఇచ్ఛ మేరకు మథుర్,

41. భగవాన్‌దాసును సందర్శింప శ్రీరామ కృష్ణులు వెళ్లడం

హృదయ్‌లతో కలిసి శ్రీరామకృష్ణులు కాల్నాకు వెళ్లారు. వేకువజామునే వారి పడవ రేవును చేరింది. మథుర్ వసతి భోజనాల ఏర్పాట్లలో మునిగిపోయాడు. ఈలోపు శ్రీరామకృష్ణులు హృదయ్‌ను వెంటబెట్టుకొని ఊళ్లోకి వెళ్లారు. బాబాజీ చిరునామా దారేపోయేవారినుండి తెలుసుకొని ఆయన ఆశ్రమం వద్దకు వచ్చారు.

అపరిచితులను కలుసుకోబోయే ముందు పసిబిడ్డ స్వభావులైన శ్రీరామకృష్ణులు వర్ణించ నలవిగాని ఒక రకం భయం, సిగ్గులకు లోనయ్యేవారు. ఆయన

42. శ్రీరామకృష్ణుల గురించి బాబాజీకి హృదయ్ తెలియ చేయడం

అలా వ్యవహరించడం మేం ఎన్నోసార్లు గమనించాం. బాబాజీ వద్దకు వెళ్లినప్పుడుకూడా ఆయన అలాగే సిగ్గు, భయాలకు లోనయ్యారు. హృదయ్‌ను ముందు వెళ్లమన్నారు. ఆపాదమస్తకం ఒక వస్త్రం కప్పుకొని హృదయ్‌ను వెంబడించారు. హృదయ్ తిన్నగా బాబాజీ వద్దకు వెళ్లి ప్రణామం చేసి, ''భగవన్నామ సంకీర్తన చేస్తూ మా మామ మైమరచిపోతారు. సుదీర్ఘకాలం నుండి ఆయన ఈ స్థితిని అనుభవిస్తున్నారు. మిమ్మల్ని చూడగోరి ఇక్కడకు వచ్చారు'' అని చెప్పాడు.

బాబాజీని సమీపించగానే సాధనాలబ్ధమైన ఆయన శక్తిని తాను గ్రహించానని హృదయ్ చెప్పేవాడు. ఎందుకంటే, తాను ప్రణామంచేసి నోరు విప్పడానికి ముందే ''ఎవరో ఒక మహాపురుషుడు ఆశ్రమానికి వచ్చినట్లుందే'' అన్న బాబాజీ

పలుకులు అతడికి వినిపించాయి. ఇలా అంటూ బాబాజీ చుట్టూ చూశాడు. కాని ఎవరూ కనిపించలేదు, హృదయ్ తప్ప. దాంతో తన ముందున్న వ్యక్తులతో చర్చిస్తూన్న అంశంమీద మళ్లీ దృష్టి మరల్చాడు. ఒకానొక వైష్ణవ సాధువు ఏదో తప్పు చేశాడు. ఆ తప్పుకు ఏం శిక్ష విధించాలి? అనే విషయం గురించి అప్పుడు చర్చిస్తున్నారు. ఆ సాధువు చేసిన అనుచిత కార్యానికి బాబాజీకి ఎంతో కోపం వచ్చింది. ''నీ జపమాలను లాగేసుకొంటాను, సముదాయం నుండి నిన్ను వెలి వేస్తాను'' అంటూ ఆ సాధువును తిట్టసాగాడు. అదే సమయంలో శ్రీరామకృష్ణులు అక్కడకు వచ్చారు; బాబాజీకి నమస్కరించి, వినమ్రంగా ఒక ప్రక్కగా కూర్చున్నారు. ఆపాదమస్తకం వస్త్రంతో కప్పుకొని ఉండడం వలన ఆయన ముఖాన్ని ఎవరూ స్పష్టంగా చూడలేకపోయారు. శ్రీరామకృష్ణులు వచ్చి అలా కూర్చోగానే, హృదయ్ ఆయనను గురించి బాబాజీతో చెప్పాడు. ఆ మాటలు వినగానే బాబాజీ తన చర్చను ఆపివేసి, శ్రీరామకృష్ణులకు హృదయ్‌కు ప్రతి నమస్కారాలు చేసి, వారిని గురించి వాకబు చేశాడు.

43. ఒక వైష్ణవ సాధువును బాబాజీ మందలించడం

మాటల మధ్యలో బాబాజీ జపమాలను త్రిప్పుతూ లెక్కించడం గమనించి హృదయ్, ''ఇప్పుడు కూడా మీకు మాలను త్రిప్పుతూ లెక్కిస్తూ జపం చేయవలసిన అవసరం ఏమున్నది? మీరు సిద్ధులయ్యారు కదా! అటువంటప్పుడు జపమాలను ఉపయోగించవలసిన అవసరం మీకు లేదు కదా?'' అని అడిగాడు. శ్రీరామకృష్ణుల అభిమతం మేరకు హృదయ్ అలా ప్రశ్నించాడో లేదా తన ఇచ్ఛమేరకు అలా అడిగాడో ఇతమిత్థంగా తెలియరావడం లేదు. కాని తన ఇచ్ఛమేరకే అలా ప్రశ్నించాడని భావించవలసి వస్తోంది. ఎంతో కాలంగా శ్రీరామకృష్ణుల సేవలో నిమగ్నుడై ఉండడం వలన, ఆయన సాంగత్యంలో ఉత్తమ అధమ వ్యక్తులెందరితో కలిసిమెలిసి వ్యవహరించడం వలన హృదయలో సమయస్ఫూర్తి కొంత వరకు పెంపొందింది. హృదయ్ ప్రశ్న విని మొదట బాబాజీ ఎంతో వినమ్రతను వ్యక్తం చేశాడు. తదనంతరం, ''వ్యక్తిగతంగా వీటి అవసరం నాకు లేకపోయినప్పటికీ, లోకులకు బోధించే నిమిత్తం నాకు ఇవి చాలా అవసరమైవున్నాయి. నేను అలా చేయకుంటే, లోకులు నన్ను అనుకరించి భ్రష్టులైపోతారు'' అని అన్నాడు.

44. లోకులకు బోధిస్తున్నాననే బాబాజీ అహంకారం

పిల్లవాడిలా ప్రతి విషయంలోను సదాసర్వదా జగజ్జనని మీదనే శ్రీరామకృష్ణులు ఆధారపడేవారు. చివరకు ఆ స్వభావం ఎంత సహజమైపోయిందంటే స్వకీయ అహంకారంతో ఏ పనైనా చేయడం మాట అటుంచి, మరెవరైనా

45. బాబాజీ అహంకారాన్ని శ్రీరామకృష్ణులు విమర్శించడం

అహంకార ప్రేరణతో అలా చేస్తూవుండడం చూసినా లేదా చేస్తానని చెప్పడం విన్నా ఆయన ఎంతో మథనపడేవారు. అందువలననే ఎంతో అరుదుగా భగవంతుడి దాసుణ్ణే అనే అర్థంతో 'నేను' అనే మాటను ఆధ్యాత్మిక భావస్థితిలో ఉన్నప్పుడు ఉపయోగించినా, సామాన్యంగా మనం ఉపయోగించే అర్థంలో ఆయన ఎన్నడూ, మరే అవస్థలోనూ ఉపయోగించేవారు కారు. ఆయనను కొద్దిసేపు మాత్రమే చూసిన ఎవరైనాకూడా ఆయన నిరహంకార ప్రవృత్తిని చూసి ఆశ్చర్యపోయేవారు, ముగ్ధులయ్యేవారు; 'నేను ఆ ఫలానా పనిని చేసేస్తాను' అని ఎవరైనా అనడం వింటే ఆయన ఎంతో చిరాకుపడడం చూసి, 'ఈ మనిషి ఏమంత పాడుపని చేశాడని ఈయన ఇంతగా చిరాకుపడుతున్నారు?' అని ఆశ్చర్యపోయేవారు.

శ్రీరామకృష్ణులు, భగవాన్‌దాస్ బాబాజీ వద్దకు వచ్చీరాగానే ఒక సాధువు జపమాలను లాక్కొని అతణ్ణే సముదాయం నుండి వెలివేస్తానని బాబాజీ అనడం విన్నారు. ఆ తరువాత లోకులకు మరింత బాగా బోధించే నిమిత్తమే తాను జపమాలను త్రిప్పుతూ లెక్కించడం, తిలకం నుదుట ధరించడం ఇంకా వదలిపెట్టలేదని బాబాజీ అనడమూ శ్రీరామకృష్ణులు విన్నారు. పదేపదే బాబాజీ 'అతణ్ణే వెలివేస్తాను', 'లోకులకు బోధిస్తాను', 'తిలకం నుదుట ధరించడం మానుకోలేదు' మొదలైన మాటలు అనడం విని, నిష్కపటులైన శ్రీరామకృష్ణులు విసుగును వ్యక్తం చేయకుండా ఉండలేకపోయారు. అటువంటి సందర్భాలలో సభ్యతగల వ్యక్తులం అనుకొనే మనం ఊరకనే ఉండిపోవడం కద్దు. శ్రీరామకృష్ణులు హఠాత్తుగా లేచి నిలబడి బాబాజీని ఉద్దేశించి ఇలా అన్నారు: ''ఏమిటీ? ఇప్పటికీ నీలో ఇంత అహంకారమా? లోకులకు బోధించడానికి, వారిని బహిష్కరించడానికి, వారిని స్వీకరించడానికి లేదా వారిని తిరస్కరించడానికి నువ్వెవరివి? లోకులకు బోధించడానికి నువ్వెవరవు? ఈ లోకం ఎవరికి చెందిందో ఆయనే ఈ పనులు చేయగలడు. ఆయనే చేయలేకపోతే, ఆ కార్యాన్ని నువ్వు సాధించగలవా?'' ఆయన ఇలా మందలిస్తూ ఉండగా ముసుగులా ఆయన శరీరాన్ని కప్పివేసిన వస్త్రం జారిపడిపోయింది; ఆయన ధరించిన ధోవతి సడలి, నడుంకట్టు నుండి జారింది; అప్పుడు ఆయన ముఖారవిందం అపూర్వ దివ్యతేజస్సుతో ప్రకాశించసాగింది. ఎవరితో, ఏం మాట్లాడుతున్నాననే స్పృహే ఆయనలో కానరాలేదు. ఈ నాలుగు మాటలు పలికీ పలుకుతూండగానే, భావావేశమగ్నులై, నిశ్చేష్టితులై శ్రీరామకృష్ణులు సమాధిస్థితులైనారు.

సాధన సిద్ధుడైన బాబాజీ పట్ల ఇంతకాలం వరకూ సర్వులూ ఎంతో భక్తిప్రపత్తులు నెరపుతూ వచ్చారు. అందుచేత ఆయన చెప్పిన దానికి నిరసన

తెలిపే లేక ఆయనలో దోషాలు ఎత్తి చూపే సాహసం ఎవరికీ లేదనే చెప్పాలి.

46. శ్రీరామకృష్ణుల పలుకులను సత్యమని బాబాజీ అంగీకరించడం

అటువంటప్పుడు శ్రీరామకృష్ణుల చర్యకు బాబాజీ మొదట్లో ఎంతో ఆశ్చర్యపోయాడు. కాని అటువంటి పరిస్థితులలో సామాన్యులలా బాబాజీ కోపగించుకోలేదు, ప్రతీకారం తీర్చుకోవాలనీ అనుకోలేదు. ఆయనలో నొచ్చుకొన్న భావన ఏదీ వ్యక్తం కాలేదు; పైగా ప్రశాంతంగా ఉండిపోయాడు. ఎంతో కాలంగా అనుష్ఠించిన తపశ్చర్యాదుల ఫలితంగా జనించిన నిజాయితీ ఇప్పుడు ఆయనకు శ్రీరామకృష్ణుల వచనాలలోని సత్యాన్ని అవగతం చేసుకోవడంలో దోహదపడింది. 'నిజానికి భగవంతు డొక్కడే తప్ప రెండవ కర్త అంటూ మరెవరూ ఈ ప్రపంచంలో లేడు. అన్ని కార్యాలను తానే చేస్తున్నానని అహంకారపూరితుడైన మనిషి ఎంతైనా అనుకోవచ్చు. కాని నిజానికి అతడు పరిస్థితుల చేతిలో కీలుబొమ్మ మాత్రమే. అనుమతి పొందిన మేరకే అతడు నిర్వర్తించగలడు, అవగతం చేసుకోగలడు. లౌకికులు తమ స్వకీయశక్తితో, ఇచ్ఛమేరకు కార్యాలను చేస్తూవున్నట్లు భావించవచ్చు; కాని భక్తుడు, సాధకుడు క్షణకాలం కూడా అలా పొరపడరాదు, అలా పొరపడితే భ్రష్టుపట్టడం మాత్రం ఖాయం' అని బాబాజీ అవగతం చేసుకొన్నాడు. ఆ విధంగా శ్రీరామకృష్ణుల శక్తివంతమైన పలుకులు బాబాజీ అంతర్దృష్టిని విస్ఫారింపచేశాయి; అతడి దోషాలను ఎత్తి చూపాయి; అతణ్ణి వినమ్రుని, నిరాడంబరుని గావించాయి. పైగా శ్రీరామకృష్ణులలో అభివ్యక్తమయ్యే అద్భుత ఆధ్యాత్మిక భావాన్ని చూసి ఆయన సామాన్యులు కారని బాబాజీకి రూఢి అయింది.

తదనంతరం వారి మధ్య జరిగిన భగవత్ప్రసంగంతో అక్కడ దివ్యానందం ప్రవహించి ఉంటుందని మనం సులభంగానే ఊహించవచ్చు. సంభాషణ

47. వారి మధ్య హార్దిక సంభాషణ

సాగుతూ ఉన్నప్పుడు మధ్యమధ్యలో శ్రీరామకృష్ణులు భావసమాధిమగ్నులై పరమానందాన్ని చవిచూడడం చూసి బాబాజీ ముగ్ధుడయ్యాడు. ఏ మహాభావాన్ని గురించి అవగతం చేసుకోవడానికి తానింత సుదీర్ఘకాలం శాస్త్రాధ్యయనం చేస్తూవచ్చాడో, ఆ మహాభావం శ్రీరామకృష్ణులలో సదా అభివ్యక్తం కావడం చూసి బాబాజీ పరవశించిపోయాడు. అలా ప్రత్యక్షంగా చూశాక శ్రీరామకృష్ణుల పట్ల ఆయన భక్తిప్రపత్తులు ఎన్నోరెట్లు అధికరించాయి.

ఆ తరువాత కౌలటోలా హరిసభలో భావావేశంలో తన్మయులై 'శ్రీ చైతన్య ఆసనాన్ని' అధిష్ఠించిన దక్షిణేశ్వరపు పరమహంస ఈయనే అని బాబాజీకి తెలిసింది. అన్యాయంగా ఆయనను దుర్భాషలాడినందుకు అప్పుడు బాబాజీ పడిన

దుఃఖమూ, పశ్చాత్తాపమూ వర్ణనాతీతం. వినమ్రుడై బాబాజీ, శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి, క్షమించమని వేడుకొన్నాడు. ఈ విధంగా శ్రీరామకృష్ణుల, బాబాజీల ఆనాటి ప్రేమ నాటకానికి తెరదిగింది. కొంతసేపయ్యాక హృదయ్‌ను వెంటబెట్టుకొని శ్రీరామకృష్ణులు, మథుర్ వద్దకు తిరిగివచ్చి జరిగిన వృత్తాంత మంతా పూసగుచ్చినట్లు అతడికి చెప్పారు; బాబాజీ అత్యున్నత ఆధ్యాత్మిక అవస్థ గురించి ప్రశంసిస్తూ తెలిపారు. అంతా విని మథుర్ కూడా బాబాజీని దర్శించ డానికి వెళ్లాడు. ఆ ఆశ్రమంలో వెలసిన దైవ ప్రతిమల సేవార్థం, ఒక రోజు విశేష ఉత్సవం జరపడానికి మథుర్ ఏర్పాటు చేయించాడు.

4. గురుభావం : చివరి భాగం

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వామధిష్ఠాయ సమ్భవామ్యాత్మమాయయా ॥
యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ -భ.గీ. 4-6,7,8

[నేను పుట్టుకలేని వాణ్ణి, అవ్యయుణ్ణి, జీవులకు ప్రభువును; అయినప్పటికీ స్వకీయ ప్రకృతిని లోబరచుకొని నా మాయ సహాయంతో అవతరిస్తూ ఉంటాను.

ఎప్పుడెప్పుడు ధర్మం క్షీణించి, అధర్మం వృద్ధి చెందుతుందో అప్పుడల్లా నేను దేహం దాల్చి అవతరిస్తాను.

సాధు రక్షణార్థం, దుష్టశిక్షణార్థం, ధర్మసంస్థాపనార్థం నేను ప్రతి యుగంలోను ఉద్భవిస్తూ ఉంటాను.]

1. బ్రహ్మజ్ఞానిని సర్వజ్ఞుడని వేదాలు పేర్కొంటాయి

బ్రహ్మజ్ఞానం పొందిన వ్యక్తి (బ్రహ్మజ్ఞాని) సర్వజ్ఞుడౌతాడని వేదాలూ, ఇతర శాస్త్రాలూ నొక్కి-వక్కాణిస్తున్నాయి. సామాన్యులలో మాదిరి బ్రహ్మజ్ఞానుల మనస్సులలో కృత్రిమ ఆలోచనలు ఏనాడూ ఉదయించవు. ఏ విషయం గురించియైనా తెలుసుకోవాలని, అవగతం చేసుకోవాలని వారు ఆశించగానే, తక్షణమే వారి అంతర్దృష్టికి అది సుస్పష్టమౌతుంది, అంటే దాని తత్త్వం వారికి విశదమౌతుంది. పై వేదవచనం వినగానే, దానిని మేం అవగతం చేసుకోలేకపోయాం; అందువలన దానిని ప్రతిఘటించాం, దాని యథార్థ భావాన్ని తెలుసుకోవాలనే లక్ష్యం లేనందున ఆ వేద దృక్పథానికి విరుద్ధంగా అనేక వాదాలు లేవనెత్తాం.

''అదే నిజమైతే, భారతదేశ గత యుగాలనాటి బ్రహ్మజ్ఞానులు భౌతికశాస్త్రాల గురించి అంతగా అజ్ఞులై ఎందుకు ఉండిపోయారు. ఉదజని (హైడ్రోజన్), ఆమ్లజని (ఆక్సిజన్) వాయువుల సమ్మేళనం నీటిని ఉత్పన్నం చేస్తుందని ప్రాచీన భారతదేశంలోని ఏ బ్రహ్మజ్ఞానికైనా తెలుసా? విద్యుచ్ఛక్తి సహాయంతో ఆరు నెలలు ప్రయాణంచేసిగాని చేరుకోలేని అమెరికా నుండి వార్తలను నాలు గైదు గంటలలోనే అందుకోవచ్చుననే విషయం ఆ బ్రహ్మజ్ఞాను లెవరూ ఎందుకు చెప్పిపోలేదు? లేదా యాంత్రిక సహాయంతో మనిషి పక్షిలా ఆకాశంలో ఎగురుతూ పయనించగలడనే విషయం వారి కెందుకు తెలియలేదు?'' అని మేం వాదించే వారం.

2. వేదవచనాలు ఏ విధంగా సత్యాలు? - శ్రీరామకృష్ణుల వివరణ

శాస్త్రోక్తులకు పై విధంగా భాష్యం చెప్పుకోవడానికి ప్రయత్నిస్తే అవి అర్థహీనాలైపోతాయని శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చినప్పుడు మేం తెలుసుకొన్నాం. శాస్త్ర భావం వేరు; శాస్త్రాలను ఆ వెలుగులో అధ్యయనం చేయకుంటే, వాటి యథార్థమైన అర్థాన్ని తెలుసుకోలేం. ఒకటి రెండు గ్రామీణ జీవన ఉదాహరణాలతో శ్రీరామకృష్ణులు శాస్త్ర వచనాల అర్థాన్ని విశదీకరించారు. ఆయన ఇలా చెప్పారు: ''కుండలో అన్నం ఉడుకుతూన్నది అనుకొందాం. అన్నం ఉడికిందో లేదో తెలుసుకోవడానికి ఒక్క మెతుకు పట్టుకుని చూస్తాం. వెంటనే అన్నం అంతా ఉడికిందో లేదో తెలిసిపోతుంది. ఎలా? అన్ని మెతుకులను పట్టుకొని చూడలేదుగదా! అటువంటప్పుడు నువ్వు ఈ నిర్ణయానికి ఎలా రాగలిగావు? అదే విధంగా ఈ ప్రపంచంలోని ఒకటి రెండు వస్తువులను పరిశీలించినప్పుడు ఈ యావత్తు జగత్తు నిత్యమో, అనిత్యమో, సత్యమో లేదా అసత్యమో తెలిసిపోతుంది. మనిషి పుడతాడు, కొంతకాలం జీవిస్తాడు, పిదప మరణిస్తాడు; ఆవు విషయంలోకూడా అదే నిజం వర్తిస్తుంది. ఈ విధంగా కొన్నిటిని పరిశీలించినప్పుడు నామ రూపాలుగల ప్రతిదీ ఈ నియతినే అనుసరిస్తుందని తేటతెల్లమౌతుంది. భూమి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు - వీటన్నిటికీ నామరూపాలున్నాయి. కనుక ఇవి కూడా అదే స్వభావం గలవి. ఈ విధంగా ఈ జగత్తులోని సమస్త వస్తువులూ ఇటువంటి స్వభావం గలవే అని తెలుసుకోగలవు. అప్పుడు నీకు లోకంలోని ప్రతి వస్తువు స్వభావం తెలియవస్తుంది కదా! ఈ ప్రపంచం (సంసారం) అనిత్యం, అసత్యం అని ఎప్పుడు నువ్వు తెలుసుకొంటావో అప్పుడిక దానిని నువ్వు ప్రేమించలేవు; మనస్సులో నుండి దాని ధ్యాసను వదలిపెట్టి, కోర్కెలనుండి విడివడతావు. అలా వాటిని నువ్వు పరిత్యజించిన మరు నిమిషమే జగత్కారణుడైన భగవం

తుని అనుభూతి నీకు కలుగుతుంది. ఎవరికి ఇలా భగవత్సాక్షాత్కారం కలుగు తుందో అతడు సర్వజ్ఞుడు కాక మరేమౌతాడో చెప్పండి?''

శ్రీరామకృష్ణులు ఇలా విశదీకరించిన తరువాత మేం ఇలా అనుకొన్నాం: 'ఆయన వచించింది నిజమే కదా! ఒక విధంగా చూస్తే భగవదనుభూతి పొందిన వ్యక్తి సర్వజ్ఞుడే కదా! ఒక వస్తువు ఆది మధ్య అంతాలను చూడగలగడం, ఆ వస్తువును గురించిన జ్ఞాన మని మనం పేర్కొంటాం. కాబట్టి ఈ రీతిలో జగత్తును గురించి తెలుసుకోవడం లేదా అవగతం చేసుకోవడం కూడా జగత్తును గురించిన జ్ఞానంగానే తప్పక పేర్కొనాలి. మళ్లీ, ఈ రీతిలో అవగతం చేసుకోవడం జగత్తులోని ప్రతి విశేష వస్తువుకూ వర్తిస్తుంది. కనుక యావత్తు జగత్తు, దానిలోని అన్ని వస్తువులు అనిత్యమని, అందుచేత అసత్య మని గ్రహించిన వ్యక్తిని తప్పక సర్వజ్ఞుడని పేర్కొనాలి. కాబట్టి శాస్త్రాలు వచిం చింది నిజమేనని అంగీకరింపక తప్పదు.'

3. ఒక వస్తువు ఆద్యంతాలు తెలుసు కోవడమే ఆ వస్తువును గురించి సమగ్రంగా తెలుసుకోవడమౌతుంది

''బ్రహ్మజ్ఞాని సంకల్పాలన్నీ నిజమౌతాయి, ఈడేరతాయి'' అనే శాస్త్రోక్తికి పై వివరణ నుండి సరైన అర్థాన్ని మనం గ్రహించవచ్చు. చింతనాశక్తిని ఏకాగ్రం చేసి ఒక వస్తువును గురించి విచారణ చేసినప్పుడు ఆ వస్తువు గురించిన సమగ్రజ్ఞానం తెలియరావడం దైనం దిన అనుభవంలోని విషయమే. అటువంటప్పుడు తన మనస్సును పూర్తిగా నియంత్రించుకొని ఒక వస్తువును గురించి ఏకాగ్రమైన మానసిక శక్తితో విచారణ చేసినప్పుడు బ్రహ్మజ్ఞాని ఆ వస్తువు గురించిన సమగ్ర జ్ఞానం అలవోకగా గ్రహించగలగడం ఏమంత ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. అయినా ఈ అంశంపై మరికొంత పరిశీలించవలసి ఉంది: ఎవరు జగత్సారం యావత్తు కేవలం మిథ్య, అనిత్యం అని చక్కగా గ్రహిస్తాడో, ఎవరు జగత్కార ణుడూ సర్వశక్తిస్వరూపుడూ అయిన భగవంతుణ్ణి ప్రేమ ద్వారా సాక్షాత్క రించుకొంటాడో అటువంటి బ్రహ్మజ్ఞాని మనస్సులో రైలుబళ్ళు, విధ్వంసకర యంత్రాలు మొదలైనవి సృష్టించాలనే సంకల్పంగాని, కోర్కెగాని ఎన్నడైనా జని స్తుందా? అటువంటి సంకల్పాలు బ్రహ్మజ్ఞానుల మనస్సులలో ఉదయించడం అసంభవం. అటువంటప్పుడు వారు వాటి నెలా సృష్టించగలరు?

4. బ్రహ్మజ్ఞాని సంకల్పాలన్నీ ఈడేర తాయి

శ్రీరామకృష్ణుల పావన సాంగత్య ఫలితంగా మాకు ఈ విషయం స్పష్టంగా తెలిసింది. నిజానికి వారి మనస్సులలో అటువంటి సంకల్పాలు జనించడం అసంభవం. కాశీపూర్ ఉద్యానగృహంలో శ్రీరామకృష్ణులు నయంకాని కంఠ వ్రణంతో అమిత బాధ ననుభవిస్తూన్నప్పుడు మేం (వివేకానందస్వామి, ఇతర

శిష్యులం), మా శ్రేయస్సుకోసం తమ మనశ్శక్తితో వ్యాధిని నయం చేసుకోమని కంటతడిబెట్టుకొని ఆయనను ప్రార్థించాం; కాని ఆయనకు అలా ప్రయత్నించడంగాని, సంకల్పించుకోవడంగాని సాధ్యంకాలేదు. అలా చేయడానికి ప్రయత్నించికూడా గట్టిగా సంకల్పించుకోలేకపోయినట్లు ఆయన తెలిపి, ఇలా కొనసాగించారు: ''సచ్చిదానందం నుండి మనస్సును మరల్చి ఈ అస్థిమాంస పంజరం మీద లగ్నం చేయడం అసాధ్యమైంది. నేను సదా శరీరాన్ని హేయమైనదిగా, అల్పమైనదిగానే ఎంచుతూ వచ్చాను; మనస్సును సదా జగజ్జనని పాదపద్మాలకు అర్పించివేశాను. అటువంటప్పుడు, నాయనలారా, మనస్సును ఆమె ధ్యాసనుండి మరల్చి ఈ దేహం మీదికి ఎలా త్రిప్పగలుగుతాను?''

మరో సంఘటన గురించి ఇక్కడ ప్రస్తావిస్తే పాఠకులకు పై విషయం సులభంగా అర్థమౌతుంది. ఒక రోజు శ్రీరామకృష్ణులు బాగ్‌బజార్‌లోని బలరాంబోసు ఇంటికి వెళ్లారు. అప్పుడు సమయం ఉదయం పది గంటలు. ఆ రోజు ఆయన అక్కడకు వెళ్లే కార్యక్రమం ముందే నిర్ణయమైంది. కనుక నరేంద్రుడు మొదలైన యువభక్తులు కొందరు ఆయన దర్శనార్థం అక్కడకు వచ్చారు.

5. శ్రీరామకృష్ణుల జీవితం నుండి మరొక ఉదాహరణ

అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులతోను, మధ్యమధ్యలో తమలో తాము వాళ్లు అనేక విషయాల గురించి మాట్లాడుకోసాగారు. మాటల సందర్భంలో సూక్ష్మదర్శిని గురించిన ప్రస్తావన వచ్చింది. కంటికి కనిపించని అతిసూక్ష్మవస్తువులను సూక్ష్మదర్శిని గుండా చూడవచ్చుననీ, చిన్న వెంట్రుకకూడా దానిగుండా చూసినప్పుడు కర్రలా కనిపిస్తుందనీ, శరీరం మీద ప్రతి వెంట్రుక దానిగుండా చూసినప్పుడు బొప్పాయి ఆకు కాండం అంత బోలుగా ఉన్నట్లు కనిపిస్తుందనీ విని, శ్రీరామకృష్ణులు పిల్లవాడిలా ఆ సూక్ష్మదర్శినిని చూడాలనే కుతూహలం వ్యక్తంచేశారు. ఎవరి వద్దనుండైనా సూక్ష్మదర్శినిని తీసుకువచ్చి నాటి మధ్యాహ్నం ఆయనకు చూపించాలని భక్తులు అనుకొన్నారు.

వాకబు చేయగా స్వామి ప్రేమానంద సోదరుడూ, మా మాన్య మిత్రుడూ అయిన డా. బిపిన్‌బిహారీ ఘోష్ వద్ద సూక్ష్మదర్శిని ఉన్నట్లు తెలియవచ్చింది. వైద్యశాస్త్ర పరీక్షలలో అత్యున్నత శ్రేణిలో ఉత్తీర్ణుడైనందున కలకత్తా వైద్యకళాశాల వారు సూక్ష్మదర్శినిని అతడికి బహూకరించారు. ఆ పరికరాన్ని తీసుకువచ్చి గురుదేవులకు చూపించడంకోసం ఒక మనిషిని అతడి వద్దకు పంపించారు. విషయం తెలుసుకొని అతడే స్వయంగా ఆ పరికరాన్ని తీసుకుని సాయంత్రం నాలుగు గంటలకు అక్కడకు వచ్చాడు. పరికరాన్ని సరిగా అమర్చి, శ్రీరామకృష్ణులను దాని గుండా చూడమన్నాడు.

శ్రీరామకృష్ణులు లేచి ముందుకు వెళ్లారు కాని సూక్ష్మదర్శిని గుండా చూడకుండానే తిరిగి వచ్చారు. ఎందుకు అలా చేశారని అడిగినప్పుడు, ''ఇప్పుడు మనస్సు అత్యున్నత భావభూమిలో నెలకొని ఉంది. దానిని క్రిందికి తీసుకురావడం అసాధ్యమైపోతున్నది'' అని ఆయన అన్నారు. ఆయన మనస్సు క్రింది భావభూములకు దిగివస్తుందేమోనని మేం చాలాసేపు వేచిచూశాం. కాని ఆ రోజు ఆయన మనస్సు ఆ అత్యున్నత ఆధ్యాత్మిక భూమి నుండి క్రిందికి దిగలేదు. కనుక ఆ సందర్భంలో ఆయన సూక్ష్మదర్శినిగుండా చూడడం కుదరలేదు. ఇక చేసేదిలేక బిపిన్ బాబు మాలో కొందరికి చూపి, పరికరాన్ని తీసుకొని తిరిగి వెళ్లిపోయాడు.

6. రెండు చైతన్య భూముల నుండి శ్రీరామకృష్ణుల దృక్పథం

దేహస్మృతి భావాన్ని విస్మరించి శ్రీరామకృష్ణుల మనస్సు ఎంత అత్యున్నత చైతన్య భూములకు అధిరోహిస్తుందో, ఆ భూములలో ఆయనకు అంతటి అసాధారణమైన దివ్యదర్శనాలు కలిగేవి. ఎప్పుడు ఆయన మనస్సు అద్వైత భావభూమిని చేరేదో అప్పుడు ఆయనకు దేహస్మృతి పూర్తిగా తొలగిపోయేది; హృదయ స్పందనా, ఇంద్రియ వ్యాపారాలన్నీ కొంతసేపు ఆగిపోయేవి, శరీరం మృత కాయంలా పడివుండేది. ఆలోచన, ఊహ వంటి మానసిక పరివర్తనలన్నీ పూర్తిగా నిలిచిపోయి, ఆయన అప్పుడు అఖండ సచ్చిదానందంలో లయమై పోయేవారు. తదనంతరం ఆ మహోన్నత స్థితినుండి నిమ్న భూములకు దిగి వస్తునప్పుడు సామాన్యుల మాదిరి మళ్లీ 'ఈ దేహం నాది' అనే భావం ఆయనలో జనించేది; అప్పుడు మాత్రమే మనలాగే కళ్లతో చూడడం, చెవులతో వినడం, చర్మంతో స్పర్శను అనుభవించడం, మనస్సుతో ఆలోచించడం చేయగలిగేవారు.

7. సామాన్యులు ప్రతి విషయాన్ని రెండవ రకంగానే చూస్తారు

మనిషి మనస్సు సమాధి భూమికి అధిరోహించడం, మళ్లీ క్రమంగా క్రిందికి దిగడం గురించి కించిత్తు అనుభవం పొందిన ఒక సుప్రసిద్ధ పాశ్చాత్య తాత్త్వికుడు[1], 'సామాన్య వ్యక్తి దేహంలో ఉండే చైతన్యం సదా ఒకే స్థితిలో నెలకొని ఉండదు' అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఈ అభిప్రాయం యుక్తియుక్తమైనదే, ప్రాచీన ఋషుల ఆమోదం పొందినదే అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మనిషి ఆధ్యాత్మిక గుర్తింపు నిజానికి అద్వైత చైతన్య భూమికి చెందింది;

---

1. రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ -"Consciousness ever moves along a graded plane." అంటే 'చైతన్యం ఎప్పుడూ శ్రేణీకరణ భూమి వెంబడి కదులుతూ ఉంటుంది'' అని అర్థం.

కాని అతడు అనంతకాలంగా దానిని గురించి పూర్తిగా మరిచిపోయాడు. పైగా పంచేంద్రియాల ద్వారా మాత్రమే జ్ఞానం పొందవచ్చుననే దృఢనమ్మకాన్ని సంతరించుకొన్నాడు. కాబట్టే నిశ్చింతగా సంసార సాగరంలో లంగరు దింపి, జీవిస్తున్నాడు. శ్రీరామకృష్ణుల వంటి ఆధికారిక పురుషులు, జగద్గురువులు, అవతారపురుషులు ప్రతి యుగంలోను అవతరించి, పైన పేర్కొన్న ప్రవర్తనకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరించి (అంటే భగవత్సాక్షాత్కారం, అతీంద్రియ జ్ఞానమే అసలైన జ్ఞానం అని చూపి) ఆ భ్రమను తొలగించివేస్తారని వేదాది శాస్త్రాలు మనకు బోధిస్తున్నాయి.

8. శ్రీరామకృష్ణుల రెండు రకాల దృష్టి కోణాలకు కొన్ని ఉదాహరణలు

ఏది ఏమైనప్పటికీ లోకంలోని వస్తువులను, వ్యక్తులను మనం చూసే రీతిలో శ్రీరామకృష్ణులు చూసేవారు కాదనే విషయం సుస్పష్టం. ఉన్నత, ఉన్నతతర భావభూములను అధిరోహించినప్పుడు అవి ఎలా కానవస్తాయో, సదా ఆయన అదే దృష్టితో వ్యక్తులను, వస్తువులను చూసేవారు. కనుక మనలా ఏ విషయంలోనుకూడా సంకుచితభావం, పరిమిత దృష్టి ఆయనకు ఉండడం అసంభవం. అందువలననే మన పలుకులనూ, మన భావాలనూ ఆయన అవగతం చేసుకొన్నప్పటికీ, మేం మాత్రం ఆయన వచనాలను, భావాలను అర్థం చేసుకోలేకపోయేవారం. మనిషిని మనిషిగా, ఆవును ఆవుగా, పర్వతాన్ని పర్వతంగా మాత్రమే మనం తెలుసుకోగలం. మరి ఆయన దృష్టిలో? ఆయనకూడా మనిషిని మనిషిగా, ఆవును ఆవుగా, పర్వతాన్ని పర్వతంగా చూసేవారు. కాని అదే సమయంలో ఇవన్నీ నిజానికి ఆ పరమాత్మని అభివ్యక్తీకరణలే అనీ, జగత్కారణమైన అదే సచ్చిదానందం వీటిగుండా ప్రకాశిస్తూవుందనికూడా ఆయన దర్శించేవారు. కేవలం తేడా ఏమిటంటే పలుచని లేదా దళసరి ఆవరణ భేదానుసారంగా ఆ పరమాత్మని అభివ్యక్తీకరణ కూడా అధికంగానో తక్కువగానో వ్యక్తమౌతుంది. దానిని గురించి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పడం మేం విన్నాం:

''చెట్లుచేమలు, మనుషులు, పశువులు, గడ్డి, నీరు తదితరాలన్నీ రకరకాల ఒరలు (కోశాలు)గా నాకు కనిపిస్తాయి. అవి తలగడ గలీబుల వంటివి.

9. శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మికతను ఆపాదించే దృక్పథం

వాటిని మీరు చూడలేదా? వాటిలో కొన్ని ఎర్రరంగు ముతకబట్టతో, మరికొన్ని పట్టుబట్టతో, కొన్ని వివిధ రకాల బట్టలతో తయారు చేయబడతాయి. మళ్లీ వీటిలో కొన్నిటిని గుండ్రంగా, చతుర్భుజాకృతిలో తయారుచేస్తారు. ఈ జగత్తుకూడా అలాగే ఉంటుంది. మళ్లీ, ఆ రకరకాల గలీబులన్నీ ఒకే ఒక్క-

పదార్థంతో, అంటే దూదితో నింపడి ఉంటాయో, అలాగే మనిషి, ఆవు, గడ్డి, నీరు, పర్వతం మొదలైన అన్ని ఒరలలోను ఆ ఒక్క అఖండ సచ్చిదానందమే నిండివుంటుంది. నాయనలారా, నిజానికి అమ్మ (జగజ్జనని) రకరకాల ముసుగులు వేసుకొని లేదా రకరకాల రూపాలు దాల్చి, వాటిలోపల నుండి తొంగి చూస్తూన్నట్లు నేను దర్శిస్తూన్నాను. ఈ జగత్తు సదాసర్వదా ఆ విధంగా కనిపిస్తూవున్న స్థితిలో నేను ఉన్నాను. నేనున్న ఆ స్థితిని అర్థం చేసుకోలేక లోకులు నా వద్దకొచ్చి నన్ను శాంతింప, ఊరడింపచేయడానికి ప్రయత్నించేవారు. నన్ను ఆ స్థితిలో చూసి రాంలాల్ తల్లి, తక్కినవారు విలపించేవారు. వారలా విలపించడం చూసినప్పుడు, (కాళికాలయాన్ని చూపుతూ) ఆ అమ్మే రకరకాల వేషాలు ధరించి వచ్చి అలా చేస్తున్నట్లు దర్శించేవాడను. ఆ విచిత్ర మారువేషం చూసి, 'భలే వేషం దాల్చావే అమ్మా' అంటూ పొట్టచెక్కలయ్యేలా నవ్వేవాడను.

''ఒక రోజు కాళికాలయంలో కూర్చుని తల్లిని గురించి ధ్యానం చేయసాగాను. ఎంత ప్రయత్నించినా ఆ రోజు తల్లి రూపాన్ని మనస్సులో లగ్నం చేసుకోలేకపోయాను. పిదప ఏం చూశానో తెలుసా? రమణి అనే వేశ్య స్నానం చేయడానికి ఘట్టానికి వస్తూవుండేది. అమ్మ ఆమెలా వేషం దాల్చి (అంటే ఆ రూపంలో అన్నమాట) 'పూజాఘటం' ప్రక్కన నిలబడి తొంగిచూడసాగింది. ఆ దృశ్యం చూసి, నవ్వేసి, 'అమ్మా, ఈ రోజు నీకు రమణివి కావాలనే ఆకాంక్ష జనించిందా? సరే మంచిది. ఈ రోజు ఈ రూపంలోనే పూజను స్వీకరించు' అని అన్నాను. ఆ విధంగా నాకు దర్శనమిచ్చి, 'వేశ్యను కూడా నేనే. నేను తప్ప మరొకటి ఏదీ లేదు' అనే విషయం నాకు ఆ రోజు స్పష్టంచేసింది.

''మరో సందర్భంలో బండిలో కూర్చుని మేఛో బజారు గుండా పోతున్నాను. అప్పుడు అమ్మ అందంగా చీర, నగలు ధరించి, తల దువ్వుకొని, నుదుట బొట్టుపెట్టుకొని, హుక్కా పీలుస్తూ, వరండాలో పడుపుగత్తె రూపంలో నిలబడి లోకులను ఆకర్షిస్తూ కనిపించింది. ఆ దృశ్యం చూసి ఆశ్చర్యపోతూ, 'అమ్మా, ఇక్కడ ఈ రూపంలో ఉన్నావా?' అంటూ, ఆమెకు ప్రణామం చేశాను.''

ఉన్నత చైతన్య భూముల నుండి వ్యక్తులను, వస్తువులను (అసలు స్వరూపంలో) చూడడం మనం పూర్తిగా మరిచిపోయాం. అటువంటప్పుడు శ్రీరామకృష్ణుల అనుభవాలను మనం ఎలా అవగతం చేసుకోగలం?

శ్రీరామకృష్ణులు మామూలు దేహస్మృతి స్థితిలో ఉన్నప్పుడు సైతం సుఖభోగేచ్ఛ అణుమాత్రంకూడా ఆయనలో ఉండేది కాదు. ఆ కారణంగా

10. శ్రీరామకృష్ణుల ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి సామాన్యులకంటే మరుకైనవి. భోగసుఖాల పట్ల అనాసక్తులై ఉండడమే అందుకు కారణం

ఆయన బుద్ధి, పరిశీలనా దృష్టి మనకంటే ఎన్నోరెట్లు తీక్ష్ణంగా ఉండేవి. కాబట్టే ఆయన మనకంటే అధికంగా ఎన్నో విషయాలను గ్రహించి, అవగతం చేసుకోగలిగేవారు. మనలో ప్రతి ఒక్కరిలోనూ సుఖించాలి, భోగించాలి అనే కోర్కె తీవ్రంగా ఉండడం వలన తినడం, తాగడం, తిరగడం, చూడడం, పడుకోవడం మొదలైన ప్రతి ఒక్క పనిలోను మన సుఖానికి దోహదం చేసే విషయాలే సదా మన కళ్లకు ఉజ్జ్వల వర్ణంలో కనిపిస్తూవుంటాయి; కాబట్టే మన మనస్సులు మన సుఖానికి విరుద్ధమైన వస్తువులను, వ్యక్తులను తాత్సారం చేసి, మన సుఖానికి దోహదం చేసే విషయాల వైపుకే ఎక్కువగా ఆకర్షింపబడతాయి. తత్ఫలితంగా అలా ఉదాసీనం చేసిన వస్తువుల, వ్యక్తుల స్వభావాన్ని గురించి తెలుసుకొనే అవకాశం మనం కోల్పోతాం. ఇలా ఏదో కొన్ని వస్తువులను, వ్యక్తులను మాత్రమే మనవిగా, అంటే మన సొంతంగా చేసుకొనే ప్రయత్నంలోనే మన యావత్తు జీవితాన్ని గడిపివేస్తాం.

జ్ఞాన సముపార్జనా శక్తిసామర్థ్యాలలో జనసామాన్యంలో అంత తారతమ్యం కనిపించడానికి పైన పేర్కొన్న విషయమే కారణం. కళ్లు, చెవులు మొదలైన ఇంద్రియాలు మనందరిలో సరిసమానంగానే ఉన్నప్పటికీ వాటిని అన్ని విషయాలలోను సరిసమానంగా ఉపయోగించి మనం సమానంగా జ్ఞానాన్ని సముపార్జించుకోగలుగుతున్నామా? లేదే! కాబట్టే మనలో ఎవరికి స్వార్థపరత్వం, భోగేచ్ఛ తక్కువగా ఉంటాయో వారే ఇతరులకంటే అధికంగా, సునాయాసంగా అన్ని విషయాలలోను అధికంగా జ్ఞానం సముపార్జించుకోగలుగుతున్నారు.

11. శ్రీరామకృష్ణుల కుశాగ్ర బుద్ధికి ఉదాహరణలు

మామూలు భావభూమిలో నెలకొని ఉన్నప్పుడు సైతం శ్రీరామకృష్ణుల పరిశీలనా దృష్టి ఎంతో కుశాగ్రంగా ఉండేది; అందుకు ఒకటి రెండు ఉదాహరణలు ఇక్కడ పేర్కొనడం అసంగతం కాబోదు. జటిలమైన ఆధ్యాత్మిక సత్యాలను అలవోకగా విశదీకరించడంలో ఆయన అందరికీ తెలిసిన దృష్టాంతాలు, ఉపమానాలు ఉపయోగించేవారు. వీటి ద్వారా ఆయన పరిశీలనాదృష్టి ఎంత నిశితమైనదో మనం గ్రహించవచ్చు. ఈ దృష్టాంతాల సహాయంతో ఒక దీప్తిమంతమైన చిత్రాన్ని దర్శింపచేసి, జటిలంగా కానవచ్చే సమస్యల పరిష్కారం సుసాధ్యమే అన్న విషయాన్ని శ్రోతల మనస్సులు అవగతం చేసుకొనేట్లు చేసేవారు.

ఒక రోజు చర్చిస్తున్న సాంఖ్యదర్శన తత్త్వ విషయాన్నే ఉదాహరణగా తీసుకొందాం. ఈ విశ్వం యావత్తు పురుషుడు, ప్రకృతి - ఈ రెండిటి నుండే

ఉత్పన్నమౌతుందనే విషయం గురించి మాతో ప్రసంగిస్తూ శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: ''ఆ (సాంఖ్య) సిద్ధాంతం ప్రకారం పురుషుడు అకర్త, అంటే ఏమీ చేయడు. పనులన్నింటినీ నిర్వర్తించేది ప్రకృతే. ప్రకృతి నిర్వర్తిస్తూవున్న ఆ పను లన్నింటినీ పురుషుడు సాక్షీభూతుడుగా గమనిస్తూ ఉంటాడు, అంతే. ప్రకృతి కూడా స్వతంత్రంగా ఏ పనీ చేయలేదు.'' అక్కడున్న శ్రోతలలో గుమాస్తాలు, గణకులు, పాఠశాల కళాశాల బాలురు, కొద్ది మంది వైద్యులు, న్యాయవాదులు, మేజిస్ట్రేట్లు కూడా ఉన్నారు. శ్రీరామ కృష్ణులు వెలిబుచ్చిన సిద్ధాంతం వారందరికీ అవగతం కాలేదు. కాబట్టే గురు దేవుల వచనాలు విని (అవగాహన కాక) ఒకరి ముఖాలు ఒకరు చూసుకో సాగారు. అది గమనించి శ్రీరామకృష్ణులు ఇలా కొనసాగించారు: ''వివాహం జరుగుతున్న ఇల్లు మీకు జ్ఞాపకం రావడం లేదా? ఇంటి యజమాని ఒక చోట కూర్చుని తాపీగా హుక్కా త్రాగుతూ ఉంటాడు. కాని ఇంటి యజమానురాలు పసుపు మరకలున్న చీర ధరించి, ఆ పని పూర్తయిందా, ఈ పని మొదలయిందా అని పరిశీలిస్తూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. అదే సమయంలో ఆహ్వానితులైన స్త్రీలకు పిల్లలకు స్వాగతం పలుకుతూ, మధ్యమధ్యలో భర్త వద్దకొచ్చి, 'ఈ పని అలా చేయించాను, ఆ పని ఆ విధంగా చేయించాను, ఇది జరిగిపోయింది, అది ఇంకా జరగలేదు' అని అభినయ పూర్వకంగా చెబుతూ ఉంటుంది. అప్పుడు ఇంటి యజమాని హుక్కా త్రాగుతూ, ఆమె చెబుతూవున్న ప్రతి మాటకూ, 'సరే, సరే' అంటూ తన ఆమోదం వ్యక్తంచేస్తూ ఉంటాడు.'' శ్రీరామకృష్ణుల ఆ వచనాలు విని అందరూ నవ్వేశారు. సాంఖ్యదర్శన తత్త్వంకూడా వారికప్పుడు అర్థమైంది.

అ. సాంఖ్యదర్శన తత్త్వాన్ని 'ఇంటి యజమాని - ఇల్లాలు' దృష్టాంతం ద్వారా సులభంగా విపులీకరించడం

మరొక సందర్భంలో, 'బ్రహ్మం - మాయ లేదా ప్రకృతి - పురుషుడు', రెండూ వేర్వేరు తత్త్వాలు కావు, ఒక్కటే. ఒకే తత్త్వం ఒక దృక్పథం నుండి బ్రహ్మంగా, మరో దృక్పథం నుండి మాయగా కానవస్తుంటాయి' అనే వేదాంత విచారణ జరుగుతూన్నది. ఆ విషయం మాకు అర్థం కాకపోవడం చూసి శ్రీరామ కృష్ణులు ఇలా చెప్పారు: ''అదెలాగో మీకు తెలుసా? ఉదాహరణకు నిశ్చలంగా పడుకొనివున్న పామును, అలాగే కదులుతూవున్న పామును తీసుకోండి. నిశ్చలంగా పడుకొనివున్న పామును పురుషుడితో పోల్చవచ్చు; ఈ స్థితిలో ప్రకృతి, పురుషుడితో కలిసి, ఐక్యమైపోతుంది. కదులుతూన్న పామును ప్రకృతితో పోల్చవచ్చు. అప్పుడు ప్రకృతి, పురుషుడి నుండి

ఆ. బ్రహ్మం, మాయ అభేదమైనవి : పాము కదులుతున్నా, పడుకొనివున్నా పామే

విడివడి, పనిచేస్తుంది.'' పై వేదాంత విచారణలో ఇమిడివున్న తాత్త్వికాంశం అప్పుడు అందరికీ అర్థమైంది. 'అయ్యో! ఇంత సులభమైన అంశాన్ని ఎందుకు అర్థం చేసుకోలేకపోయాం?' అని అనుకొన్నాం.

ఇ. ఈశ్వరుడు మాయచే బద్ధుడు కాదు. 'తన నోట్లో విషం ఉన్నా పాము చావదు.'

మరొక సందర్భంలో, బహుశ, ''మాయ ఈశ్వరుడి శక్తి, అది ఆయన లోనే నెలకొని ఉంటుంది కదా? అటువంటప్పుడు మనలాగే మాయాబద్ధుడా ఏమిటి?' అనే ప్రశ్న లేవదీశారు. అది విని, శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''కాదు, నాయనలారా. మాయ ఈశ్వరుడికే చెందినా, అది సదా ఆయనలోనే నెలకొని ఉన్నా, ఈశ్వరుడు ఏనాడూ మాయాబద్ధుడు కాడు. ఈ విషయం చూడండి: పాము ఎవరిని కాటువేస్తుందో అతడు మరణిస్తాడు. పాము నోట్లో ఎప్పుడూ విషం ఉంటూనే ఉంటుంది. ఆ నోటి ద్వారానే పాము ఆహారం తింటుంది; అలా తింటున్నప్పుడు ఏదో కొంతపాలు విషం లోపలకు పోయేతీరాలి. కాని ఆ విషం దాని మీద పనిచేయదు, పాము చావదు. ఇదీ అలాగే.'' అలా జరగడం సంభవమేనని అంతా అర్థం చేసుకొన్నారు.

శ్రీరామకృష్ణులు మామూలు చైతన్య స్థితిలో ఉన్నప్పుడు ఏ విషయమూ (దాని యథార్థ స్వభావం) ఆయన చురుకైన పరిశీలనా దృష్టి నుండి తప్పించుకోలేదని పై ఉదాహరణల నుండి స్పష్టమౌతోంది. బాహ్యప్రకృతి లోపల సంభవించే పరిణామాలు ఆయన దృష్టికి అగోచరాలు కావు; ఇక మనిషి నైజం గురించి వేరేగా చెప్పాలా? పరికరాల (సూక్ష్మదర్శిని మొదలైనవి) తోడ్పాటుతో మాత్రమే కనుగొని, అవగతం చేసుకోగలిగే బాహ్యప్రకృతి పరిణామాలను గురించి మేం ఇక్కడ ప్రస్తావించడం లేదు.

12. భగవంతుడు తన నియతిని మార్చ గలడు

ఈ సందర్భంలో మరో అంశం గమనార్హం. లోకుల దృష్టిని సామాన్యంగా ఆకర్షించని, బాహ్యప్రకృతిలో ఏర్పడే అసాధారణ మార్పులు లేదా అభివ్యక్తీకరణలు సైతం, మామూలు చైతన్య స్థితిలో ఉన్నప్పుడు శ్రీరామకృష్ణుల దృష్టిని ఆకర్షించేవి. 'భగవత్సంకల్పం వలననే ఈ సృష్టి యావత్తు సాగిపోతున్నది; దీనిలో కాన వచ్చే అభివ్యక్తీకరణలన్నీ ఆయన సంకల్పాధీనాలే. ఈ లోకంలోని సమస్త వస్తువుల, వ్యక్తుల విధి నియంత్రకుడు భగవంతుడే' అనే భావనను శ్రీరామకృష్ణుల మనస్సులో గాఢంగా ముద్రించడానికేమో అన్నట్లు జగజ్జనని ఈ సృష్టిలో జరిగే అసాధారణ సంఘటనలను సదాసర్వదా ఆయనకు దర్శింపచేసేది. చిన్నతనం నుండి అటువంటి సంఘటనలను చూసిన ఫలితంగా, ''ఎవరు నియతులను అమలుపరుస్తాడో, ఆయనే సంకల్ప మాత్రాన వాటిని రద్దు చేయగలడు లేదా

క్రొత్త నియతులను అమలుపరచగలడు కూడా'' అన్న శ్రీరామకృష్ణుల వచనాలకు మనం స్పష్టమైన అర్థం తెలుసుకోగలం. అటువంటి కొన్ని సంఘటనలను ఇక్కడ ప్రస్తావించడం అసంగతం కాబోదు.

కళాశాల రోజుల్లో ఆధునిక భౌతికశాస్త్ర ఆవిష్కరణలలో విద్యుచ్ఛక్తి గురించి చదువుతున్నప్పుడు మేం ముగ్ధులయ్యేవారం. ఒకరోజు శ్రీరామకృష్ణుల

13. శ్రీరామకృష్ణులు : సమక్షంలో ఉత్సాహంకొద్దీ పై ప్రస్తావన తెచ్చి, దానిని 'తటిద్వాహకం' గురించి పరస్పరం ముచ్చటించుకొంటున్నాం. మా సంభాషణలో 'ఎలక్ట్రిసిటీ' అనే మాట పదేపదే దొర్లడం గమనించి, చిన్నపిల్లవాడిలా ఆయన కుతూహలంగా, ''మీరు దేనిని గురించి ముచ్చటించుకొంటున్నారు? 'ఎల్కట్రిక్‌టిక్' అంటే ఏమిటి?'' అని అడిగారు. ఆ ఆంగ్ల పదాన్ని ఆయన అలా ఉచ్చరించడం చూసి మేం నవ్వు ఆపుకోలేకపోయాం. తరువాత విద్యుచ్ఛక్తిని గురించిన సామాన్య విషయాలు ఆయనకు తెలిపాం. ఆ సందర్భంలో అశనిపాతాన్ని నిరోధించే 'తటిద్వాహకం' (lightning conductor) ఉపయోగం గురించీ ఆయనకు తెలియచేశాం. పిడుగు ఎప్పుడూ ఎత్తైన చోటునే తాకుతుందనీ, కనుక 'తటిద్వాహకం' ఇంటికంటే ఎత్తైన స్థానంలోనే అమర్చాలనే నియమం పాటించాలనీ చెప్పాం. మా వివరణను సావధానంగా ఆలకించి, పిదప శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''కాని నే నొక సందర్భంలో మూడంతస్తుల మేడను తాకకుండా, దాని ప్రక్కనే ఉన్న ఒక చిన్న పాక మీద ఆ దారుణమైన పిడుగు పడడం చూశాను. దీనిని గురించి మీ రేమంటారు? నాయనలారా, ఈ సంఘటనలకు మినహాయింపులులేని ఒకే తీరు వివరణ ఇవ్వగలరా? జగజ్జనని సంకల్పం మేరకే నియమాలు వర్తిస్తాయి; ఆమె సంకల్పానుసారమే అవి తలక్రిందులు చేయబడతాయి.''

అప్పుడు మేం ప్రకృతి నియమాలను (అంటే అవి అనుల్లంఘనీయాలని) శ్రీరామకృష్ణులకు విశదీకరింప ప్రయత్నించాం; కాని మథుర్‌బాబులా ఆ సందర్భంలో సరైన జవాబు ఇవ్వలేకపోయాం. ''నిజానికి పిడుగు ఆ మూడంతస్తుల మేడ వైపుకే ఆకర్షింపబడింది; కాని మనకు తెలియని ఏదో కారణంగా హఠాత్తుగా దాని గతి మారి, ఆ పాకమీద పడింది. ఇలా ఏదో కొన్ని మినహాయింపులు ఉన్నప్పటికీ, వేలాది స్థలాలలో నియమానుసారం ఎత్తైన స్థలాలమీదే పిడుగు పడుతుంది'' అంటూ మా విశదీకరణను కొనసాగించాం. కాని ప్రకృతిపరమైన సంఘటనలు అనుల్లంఘనీయమైన నియమం మేరకే జరుగుతాయన్న విషయం ససేమిరా శ్రీరామకృష్ణులు అంగీకరించలేదు. ఆయన ఇలా అన్నారు: ''సరే, వేలాదిచోట్ల మీరు చెప్పిన నియమం మేరకే

అశనిపాతం సంభవిస్తుందని ఆమోదించినా, ఆ నియమానికీ కొన్ని మినహా యింపులున్నాయనడం తథ్యం; కనుక ఆ నియమం ఏకరూపతను కోల్పోయిం దనడం స్పష్టంగా తేటతెల్లమౌతున్నది.''

సర్వసాధారణంగా ఎర్రపువ్వులు మాత్రమే లేదా తెల్లపువ్వులు మాత్రమే పూచే మొక్కలు ఎంతో అరుదుగా తద్విరుద్ధ రంగుల పువ్వులు పూసిన సంఘటనలు వృక్షశాస్త్రజ్ఞులు నమోదుచేసి ఉన్నారు. కాని అలా జరగడం ఎంతో అరుదు; అలా జరగడం అసంభవ మని చెప్పడం అతిశయోక్తి కాబోదు. కాని శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన అటువంటి సంఘటనను పరికిం చండి. 'ప్రకృతి నియమాలు అనుల్లంఘనీయాలు కావు, భగవత్సంకల్పం మేరకు అవి మార్చబడతాయి' అని మాటల సందర్భంలో శ్రీరామకృష్ణులు, మథుర్‌తో ఒకసారి చెప్పడం జరిగింది. ఆ సందర్భంలోనే అటువంటి అరుదైన సంఘటన జరగడం గమనించి గురుదేవులు దానిని మథుర్‌కు చూపారు. ఒకే మందారమొక్క కొమ్మన ఎర్రమందార పువ్వు, తెల్లమందార పువ్వు పూయడం గురుదేవులు, మథుర్‌కు చూపిన సంఘటనను ఇక్కడ ప్రస్తావిస్తున్నామని పాఠకులు గమనించగలరు.

14. ఎర్రమందార మొక్కకు తెల్లమందార పువ్వు పూచిన సంఘటన

శ్రీరామకృష్ణులు సజీవమైన[1] రాయిని చూశారని చెప్పుకొంటారు; అదే విధంగా మరొక సందర్భంలో మనిషి వెన్నెముక చివరి త్రికోణాకారపు చిన్న ఎముక కొద్దిగా సాగి, తదనంతరం మళ్లీ మామూలు స్థితికి సంకోచించుకుపోవడం ఆయన చూశారు[2]; అట్లే ఆయన ఎందరో దేవతలను, ప్రేతాలను చూశారు. శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన ఇటువంటి మరెన్నో సంఘనలను గురించి మేం వినివున్నాం. అయినా నమ్ముతున్నామా? లేదు. పాశ్చాత్యాన్ని అనుకరిస్తూ సృష్టికర్త్రియైన ప్రకృతి యావత్తు జడమైనదనే, మేధాశక్తి రహితమైనదనే నిర్ణయానికి వస్తున్నాం. కాబట్టి ప్రకృతిలో కానవచ్చే అసాధారణ సంఘటనలు నియమోల్లంఘనాలనీ, ప్రకృతిని వ్యవస్థాబద్ధంచేసే నియమాల నన్నిటినీ మనం అవగతం చేసుకొన్నామనీ భావిస్తూవుంటాం.

15. 'ఈ సమస్త విశ్వం జగజ్జనని క్రీడా రంగం' - శ్రీరామకృష్ణుల ప్రగాఢ విశ్వాసం

---

1. ఈ విషయం గురించి అడిగినప్పుడు, ''ఒక రాయి ఒక చోటునుండి మరొక చోటుకు గెంతడం శ్రీరామకృష్ణులు చూశారు'' అని రచయిత చెప్పారు.

2. శ్రీరామకృష్ణుల స్వీయ అనుభవం ఇది. ఆంజనేయభావంతో శ్రీరామచంద్రుణ్ణే ఉపాసిస్తూన్నప్పుడు (సేవాభావంలో) ఆయన వెన్నెముక చివరి భాగం కోతి తోకలా కొద్దిగా పెరిగి, ఆ సాధన పూర్తికాగానే వెన్నెముక సహజ స్థితికి వచ్చేసింది.

కాని శ్రీరామకృష్ణుల దృఢవిశ్వాసం ఇందుకు విభిన్నం. బాహ్యాంతర ప్రకృతి యావత్తు జగజ్జనని క్రీడావిలాసమే తప్ప మరేమీ కాదనే విషయం ఆయన స్పష్టంగా గ్రహించారు. కాబట్టే ప్రకృతిలో కానవచ్చే ఈ అసాధారణ సంఘటనలు జగజ్జనని సంకల్పం మేరకే (అంటే నియమోల్లంఘనాలు కావు) జరుగుతూవున్నట్లు ఆయనకు కానవచ్చేది. ఈ దృఢనమ్మకం మూలంగా శ్రీరామకృష్ణుల మనస్సులో శాంత్యానందాలు మనలోకంటే ఎన్నో రెట్లు వెల్లి విరిసేవనే విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన అటువంటి సంఘటనలు కొన్నిటిని ఇంతకు మునుపే ప్రస్తావించి ఉన్నాం, ఇకముందు కూడా ప్రస్తావించనున్నాం.

16. ఉన్నత భావ భూముల నుండి ప్రత్యేక స్థానాలలో ఘనీభూతమై అభివ్యక్తమయ్యే ఆధ్యాత్మిక శక్తిని శ్రీరామ కృష్ణులు గుర్తించడం

శ్రీరామకృష్ణులు ప్రతి వస్తువునూ, వ్యక్తినీ ఇంతకు మునుపే ప్రస్తావించిన రెండు దృక్పథాల నుండి పరికించి, పిదప వాటి గురించి ఒక నిర్ణయానికి వచ్చేవారు. సాధారణ చైతన్యభూమి నుండి మాత్రమే మనలా పరిశీలించి ఏ అభిప్రాయానికీ ఆయన వచ్చేవారు కారు. కనుక పుణ్యక్షేత్రాలను, పావన సాధువులను సందర్శించినప్పుడు ఆయన రెండు విధాల (రెండు భావ భూముల నుండి) ఆ క్షేత్రాల, సాధువుల ఆధ్యాత్మిక శక్తిని అంచనా వేసేవారు. ఉన్నత భావభూముల నుండి పరిశీలించినప్పుడు ఏ పుణ్యక్షేత్రంలో ఎంత ఆధ్యాత్మికశక్తి ఘనీభూతమై ఉందో అంచనా వేయ గలిగేవారు; అంటే మనిషిని ఉన్నత భావభూములకు అధిరోహింపచేయగలిగే శక్తి ఏ క్షేత్రంలో ఏ మేరకు ఉన్నదో ఆయన గ్రహించగలిగేవారన్నమాట. రూపరసాది భోగ్యవస్తువుల పట్ల ఆసక్తిరహితమూ, దేవతలవంటి పావనమూ అయిన శ్రీరామకృష్ణుల మనస్సు ఆ సూక్ష్మాంశాలను కనుగొనగలిగే అద్భుత పరికరం. ఏ పుణ్యక్షేత్రాన్నిగాని లేదా దేవాలయాన్నిగాని సందర్శించిన తక్షణం ఆయన మనస్సు ఉన్నత భావభూములకు అధిరోహించి, ఆ స్థలంలో లేదా దేవాలయంలో నెలకొన్న దివ్యత్వ అభివ్యక్తీకరణను ఆయనకు వెల్లడించేది. అలా మనస్సు ఉన్నత భావభూములకు అధిరోహించిన స్థితిలోనే కాశీక్షేత్రాన్ని స్వర్ణమయంగా, కాశీలో మరణించే జీవులకు ముక్తి లభించే తీరును ఆయన దర్శించగలిగారు. అదే విధంగా బృందావనంలోని దివ్యత్వ ప్రత్యేక అభివ్యక్తీకర ణను అనుభూతం చేసుకొన్నారు; అట్లే నవద్వీపంలో ఇప్పటికీ శ్రీచైతన్యులు సూక్ష్మరూపంలో వెలసివుండడం శ్రీరామకృష్ణులు గ్రహించగలిగారు.

శ్రీకృష్ణుడు దివ్యలీలలు సలిపిన బృందావనంలో నెలకొని ఉన్న దివ్యత్వ అభివ్యక్తీకరణ అనుభూతిని పొందిన ప్రప్రథములు శ్రీచైతన్యులనే చెప్పు

17. శ్రీ చైతన్యుల బృందావన ఆవిష్కరణ

కొంటారు. ఆయన అవతరించడానికి పూర్వం ఆ వ్రజభూమిలోని పుణ్య క్షేత్రాలు దాదాపు విస్మృతాలే! చైతన్యులు ఆ స్థలాలలో సంచరిస్తున్నప్పుడు ఆయన మనస్సు ఉన్నత చైతన్య భూముల నధిరోహించి ఎన్నో యుగాల క్రితం శ్రీకృష్ణుడు ఎక్కడెక్కడ ఏఏ దివ్యలీలలు సలిపాడో అక్కడక్కడ ఆ దివ్య అభివ్యక్తీకరణ అనుభూతిని ఆయన పొందారు. చైతన్యుల అనుభవాలను విని యథార్థంగానే శ్రీకృష్ణుడు ఆయా స్థలాలలో దివ్యలీలలు సలిపాడని విశ్వసించసాగారు ఆయన శిష్యులైన రూపగోస్వామి, సనాతన గోస్వామి మొదలైనవారు. తదనంతరం ఈ శిష్యుల, ప్రశిష్యుల ముఖతా ఆ సంగతి విని క్రమక్రమంగా భారతీయులు యావన్మందీ విశ్వసిస్తూవచ్చారు.

పైన పేర్కొన్నట్లు చైతన్యులు బృందావనాన్ని ఆవిష్కరించిన తీరు మేం అవగతం చేసుకోలేదు; అలా ఆవిష్కరించడం సాధ్యం అనే విషయాన్ని మేం ససేమిరా ఒప్పుకొనేవారం కాదు. కాని ఉన్నత చైతన్యభూముల నధిరోహించి వస్తువుల, వ్యక్తులందరి విషయంలో అలా జరగడం సంభవమేనని విశ్వసించ వలసి వచ్చింది. అయినప్పటికీ ఆ నిజాల పట్ల మాకు ఏర్పడిన విశ్వాసం అంతంతమాత్రమే! దీనిని గురించిన కొన్ని ఉదాహరణలను ఇక్కడ పొందు పరుస్తున్నాం.

18. శ్రీరామకృష్ణుల జీవితంలో అటువంటి సంఘటనలు. వన - విష్ణుపూర్‌లో తొల్లిటి మృణ్మయిమూర్తి విగ్రహాన్ని దర్శించడం

శ్రీరామకృష్ణుల మేనల్లుడైన హృదయ్, కామార్పుకూర్‌కు సమీపంలోని సిహోర్ అనే గ్రామానికి చెందినవాడు. అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు, తమ స్వస్థలం నుండి దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చేముందు సిహోర్ వెళ్లి కొన్ని రోజులు అక్కడ గడిపివచ్చేవారని ఇంతకు మునుపే పాఠకులకు తెలిపివున్నాం. ఒకసారి ఆయన సిహోర్‌లో బసచేసి ఉన్నప్పుడు హృదయ్ తమ్ముడైన రాజారాంకు, మరొక గ్రామస్థుడికి మధ్య ఏదో విషయంలో వాగ్వాదం వచ్చింది. ఆ వాగ్వాదం చిలికిచిలికి గాలివానయ్యై చివరికి దెబ్బలదాకా వెళ్లింది. రాజారాం పక్కనే ఉన్న ఒక హుక్కా గొట్టంతో ఆ గ్రామస్థుడి తలమీద కొట్టాడు. గాయపడ్డ ఆ గ్రామస్థుడు, రాజారాం మీద దౌర్జన్యం చేశాడని వ్యాజ్యెం వేశాడు. ఆ సంఘటన శ్రీరామకృష్ణుల సమక్షం లోనే జరిగింది. శ్రీరామకృష్ణులు సత్యసంధులని తెలిసిన ఆ గ్రామస్థుడు ఆయనను సాక్షిగా పేర్కొన్నాడు. అందువలన శ్రీరామకృష్ణులు సాక్ష్యం ఇవ్వ డానికి వన-విష్ణుపూర్‌కు వెళ్లవలసి వచ్చింది. కోపంలో కళ్లుమూసుకుపోయిన రాజారాంను, శ్రీరామకృష్ణులు బాగా చీవాట్లు పెట్టి, "అతడికి కొంత పైకం

ముట్టజెప్పి రాజీ చేసుకో. లేకుంటే తీర్పు నీకు ప్రతికూలంగా రావడం తథ్యం. ఎట్టి పరిస్థితిలోనూ నేను అసత్యం పలుకను. జరిగింది జరిగినట్లు సాక్ష్యం ఇస్తాను.'' దాంతో రాజారాం భయపడిపోయి, వ్యాజ్యాన్ని రాజీ చేసుకోవడంలో మునిగిపోయాడు. శ్రీరామకృష్ణులు ఆ అవకాశాన్ని తీసుకొని వన-విష్ణుపూర్ పట్టణాన్ని చూడడానికి వెళ్లారు.

ఒకప్పుడు ఈ వన-విష్ణుపూర్ పట్టణం ఎంతో సౌభాగ్యంతో వర్ధిల్లింది. ఇప్పటికీ అక్కడ వెలసివున్న లాల్‌బంధ్, కృష్ణబంధ్ వంటి పెద్ద కొలనులు,

19. వన-విష్ణుపూర్ పట్టణ స్థితిగతులు

అనేక పెద్ద దేవాలయాలు (శిథిలావస్థలో ఉన్న వాటితో సహా), విశాలమైన శుభ్రమైన వీథులు, అంగళ్లతో నిండిన బజార్లు, చక్కని ఇళ్లను చూస్తే ఆ పట్టణ గత వైభవం కొట్టొచ్చినట్లు తెలిసిపోతుంది. వ్యాపారం, వృత్తి పనులమీద ఆ పట్టణానికి తీర్థప్రజలా జనం వస్తూపోతూవుండడం చూడవచ్చు.

ఒకప్పుడు శక్తివంతులైన విష్ణుపూర్ రాజులు ధర్మపరాయణులై, విద్యా పోషకులై అలరారారు. ఒకనాడు ఆ పట్టణం సంగీతానికి పెట్టింది పేరుగా కీర్తి

20. శ్రీ మదన్‌మోహన్ - మృణ్మయి

గాంచింది. శ్రీచైతన్యుల అనుయాయులైన రూప, సనాతనాదుల నిష్క్రమణానంతరం విష్ణుపూర్ రాజవంశం వైష్ణవ సంప్రదాయాన్ని అవలంబించింది. కలకత్తా బాగ్‌బజార్‌లో ప్రతిష్ఠితమైవున్న శ్రీమదన్‌మోహన్ విగ్రహం ఒకప్పుడు ఈ రాజవంశానికి చెందినదే. గోకుల్ చంద్ర మిత్రా అనే వ్యక్తి ఒకప్పుడు ఒక విష్ణుపూర్ రాజుకు పెద్ద మొత్తంలో ధనం అప్పుగా ఇచ్చాడట. అప్పు తీర్చవలసి వచ్చిన సమయం రాగానే మిత్రా ధనం తిరిగి పుచ్చుకోవడానికి బదులుగా, తనను ముగ్ధుణ్ణి చేసిన ఆ విగ్రహాన్ని అడిగి, తీసుకొన్నాడు.

శ్రీ మదన్‌మోహన్ విగ్రహమేకాక, విష్ణుపూర్ రాజులు మృణ్మయి అనే ఎంతో ప్రాచీనమైన విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఈ దేవి 'జాగ్రద్దేవత'గా ప్రసిద్ధి గాంచింది. ఆ రాజవంశం క్షీణదశలో పడిన తరువాత, ఒక పిచ్చి స్త్రీ ఈ విగ్రహాన్ని పగలగొట్టిందట. అందువలన రాజకుటుంబం మరో కొత్త విగ్రహాన్ని చేయించి ప్రతిష్ఠించిందట.

శ్రీరామకృష్ణులు ఇతర దేవాలయాలను సందర్శించిన తరువాత ఈ మృణ్మయిదేవిని దర్శింప బయలుదేరారు. కాని దారిలో ఒక చోట భావపారవశ్య స్థితిలో ఆయన మృణ్మయిదేవి ముఖారవిందాన్ని మాత్రం దర్శించారు. ఆయన దేవాలయానికి వెళ్లి కొత్తగా ప్రతిష్ఠితమైన దేవి విగ్రహాన్ని చూడగానే, తాను భావపారవశ్యంలో చూసిన దేవి ముఖంలా, ఈ దేవి ముఖం

కనిపించలేదు. ఈ తేడాకు కారణం ఏమిటో ఆయనకు అంతుబట్టలేదు. వాకబు చేసిన తరువాత కొత్త విగ్రహం, పాత విగ్రహానికి భిన్నమైనదన్న యథార్థం తెలియవచ్చింది. కొత్త విగ్రహాన్ని మలచిన శిల్పి తన కౌశలం ప్రదర్శించడం కోసం దేవీ ముఖాన్ని మరో తీరులో మలచాడు. పగిలిపోయిన పాత విగ్రహం తలను ఒక బ్రాహ్మణుడు తన ఇంట్లో పదిలపరిచాడు. కొద్దికాలం తరువాత అతడు ఆ తలకు సరిపడే మరో విగ్రహాన్ని తయారు చేయించి, దాన్ని ఆ విగ్రహానికి అమర్చి, లాల్‌బంధ్ తటాకం వద్ద ఒక అందమైన చోట దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, నిత్యపూజాదికాలు నిర్వర్తింపసాగాడు.

తమ వద్దకు వస్తూవుండే వ్యక్తుల ఉద్దేశాలను, వైఖరులను కనుగొనగలిగే శ్రీరామకృష్ణుల శక్తిని నిరూపించే కొన్ని ఉదాహరణలను ఇక్కడ ప్రస్తావించడం సముచితం. శ్రీరామకృష్ణులు, బ్రహ్మానందస్వామిని తమ మానస పుత్రునిగా ప్రేమించేవారని ఇంతకు మునుపే పేర్కొన్నాం. ఒకరోజు స్వామి, శ్రీరామకృష్ణుల గదికి తూర్పువైపున ఉన్న వసారాలో ఉత్తరం వైపుగా నిలబడి

21. లోకుల నైజాన్ని కనుగొనగలిగే శ్రీరామకృష్ణుల అంతర్దృష్టి - మొదటి ఉదాహరణ

ఆయనతో ఏవో విషయాల గురించి మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో తోట వైపు నుండి పై కప్పులేని జోడు గుర్రాల బండి ఒకటి రావడం స్వామి చూశాడు. ఆ బండిలో కొందరు పెద్ద మనుషులు కూర్చుని ఉన్నారు. ఆ బండిని చూడగానే, ఆ బండి కలకత్తాకు చెందిన ఎవరో సంపన్నుడిదై ఉంటుందని స్వామి గ్రహించాడు. శ్రీరామకృష్ణుల దర్శనార్థం కలకత్తా నుండి అనేకులు రావడం కద్దు. అందువలన స్వామి ఆ బండి రావడం చూసి ఆశ్చర్యపోలేదు.

కాని శ్రీరామకృష్ణుల దృష్టి బండి మీద పడగానే, ఆయన భయంతో కుంచించుకుపోయి, వారి దృష్టిలో పడకుండా గబగబా తమ గదిలోకి వెళ్ళి, కూర్చుండిపోయారు. ఆయన అలా ప్రవర్తించడం చూసి ఆశ్చర్యపోయిన స్వామి కూడా ఆయనను అనుసరించి గదిలోకి వెళ్ళాడు. స్వామిని చూసీచూడగానే శ్రీరామకృష్ణులు, ''వెళ్ళు, వెళ్ళు. వాళ్ళ ఇక్కడకు రాగోరితే, నే నిప్పుడు వారిని కలుసుకోలేనని చెప్పు'' అని అన్నారు. శ్రీరామకృష్ణులు అలా నిర్దేశించగానే స్వామి మళ్ళీ బయటకు వచ్చాడు. ఇంతలో ఆ పెద్దమనుషులు రానే వచ్చారు; వారు స్వామిని సమీపించి, ''ఇక్కడొక సాధువు నివసిస్తూన్నారు కదా?'' అని అడిగారు. అప్పుడు బ్రహ్మానంద స్వామి ''అవును. ఆయనతో మీకేం పని?'' అని వాళ్లను అడిగాడు. అందుకు జవాబుగా వారిలో ఒక వ్యక్తి, ''మా బంధువు లొకరు తీవ్ర రోగానికి గురియైనాడు. ఏ చికిత్స చేసినా నయం కావడంలేదు. అందుకు సాధువు ఏదైనా ఔషధం ఇవ్వగలరనే ఉద్దేశంతో

ఇక్కడికి వచ్చాం'' అని జవాబిచ్చాడు. ఆ జవాబు విని బ్రహ్మానంద స్వామి, ''మీరు పొరబడ్డారు. ఈయన ఎవరికీ మందుమాకులు ఇవ్వరు. బహుశా మీరు దుర్గానంద బ్రహ్మచారిని గురించి విని ఉంటారు. మందుమాకులకు ఆయననే కలుసుకోవాలి. పంచవటిలో ఒక కుటీరంలో ఆయన వసిస్తున్నారు. మీ రక్కడకు వెళ్లి ఆయనను కలుసుకోవచ్చు'' అని వాళ్లకు చెప్పాడు.

ఆ పెద్దమనుషులు వెళ్లిపోయిన తరువాత శ్రీరామకృష్ణులు, బ్రహ్మానంద స్వామితో, ''వారిలో తమస్సు ఎంత కరడుకట్టుకుపోయివుందంటే, వారితో మాట్లాడడం సంగతి అలావుంచి, వారి వంక చూడనైనా చూడలేకపోయాను. భయంతో పారిపోయాను'' అని చెప్పారు. అనునిత్యం ఉన్నత భావభూముల నుండి ప్రతి స్థలం, వ్యక్తి, వస్తువులో అభివ్యక్తమయ్యే (భగవత్) శక్తి తార తమ్యాలు (ఎక్కువ తక్కువలు) శ్రీరామకృష్ణులు గ్రహించగలగడం మేం ప్రత్యక్షంగా చూశాం. పదేపదే వాకబు చేసి ఆయన పేర్కొన్నట్లు సుగుణాలో లేదా దుర్గుణాలో నిజానికి ఆ సదరు వ్యక్తులలో ఉన్నాయని తేల్చుకొని తరువాత ఆయన వచనాలను (నిశ్శంకతో) మేం నమ్మేవారం. మామూలు భావ భూమిలో నెలకొని ఉన్న స్థితిలో పుణ్యక్షేత్రాదులలో శ్రీరామకృష్ణులు పొందిన అనుభవాలను కొన్నిటిని పాఠకులకు తెలియచేయడం అసంగతం కాబోదు.

అతి ఉదారమనస్కుడైన వివేకానంద స్వామి చిన్నతనం నుండి పరుల యాతనలు చూసి ఎంతో బాధపడేవాడు. అందువల్లే ఏ విషయంలోనైనా ఎవరినుండి ఏదైనా మేలు ఒనగూరిందని తెలుసుకోగానే అలా చేయమని లేదా ఆ మేలు పొంద ఆ వ్యక్తి వద్దకు వెళ్లడానికి తన మిత్రులను, బంధువులను ప్రోత్సహించేవాడు. విద్య, ధార్మిక, తదితర విషయాలలో ఎల్లరినీ ప్రోత్సహించడం స్వామీజీ అలవాటు. పైన పేర్కొన్న నిజం ఆయన చర్యలలో సూచనప్రాయంగా తెలియవస్తుంది. ధ్యానం, ప్రార్థనల నిమిత్తం నియమిత రోజులలో వివిధ స్థలాలలో ఆయన సమావేశాలు ఏర్పాటుచేసేవారు. కళాశాలలో చదువుకొంటున్న రోజుల్లో మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్, కేశవచంద్రసేన్ వంటి బ్రహ్మసమాజ నాయకులతో పరిచయం కలిగిన వెంటనే, తన మిత్రులలో అనేకులను వారి వద్దకు తోడ్కొని వెళ్లాడు. యౌవనంలో అడుగిడగానే ఆయన నిర్వహించిన కార్యాలను పరికిస్తే ఆయన స్వభావం అవగతమౌతుంది.

22. రెండవ ఉదాహరణ

శ్రీరామకృష్ణుల పావన సాంగత్యం పొంది, అసాధారణమైన ఆయన త్యాగ వైరాగ్యాలను, భగవద్భక్తిని చూసి తన మిత్రులను తోటి విద్యార్థులను ఆయన వద్దకు తోడ్కొని వెళ్లి ఆయనతో పరిచయం కల్పించాడు. ఇలా చేయడం

స్వామీజీ జీవితంలో ఒక ధార్మిక వ్రతంగా పరిణమించింది. కాని స్వామీజీ ఎవరినిపడితే వారిని, ప్రతి పరిచయస్థుణ్ణి శ్రీరామకృష్ణుల వద్దకు తోడ్కొని వెళ్లాడని మాత్రం పొరబడకూడదు. చాలాకాలంగా తనతో ఉన్న పరిచయ ఫలితంగా సజ్జనులని, ధార్మికులని గట్టిగా తెలిసిన వ్యక్తులనే స్వామీజీ దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణుల వద్దకు తీసుకువెళ్లేవాడు.

ఆ విధంగా స్వామీజీ అటువంటి అనేకమంది మిత్రులను శ్రీరామకృష్ణుల వద్దకు తీసుకువెళ్లాడు. కాని శ్రీరామకృష్ణుల అంతర్దృష్టి వారి అంతరంగ ప్రవృత్తిలోకి చొచ్చుకునిపోయి ఆ వ్యక్తుల గురించి భిన్నంగా అంచనాలు వేయగలిగిందని, శ్రీరామకృష్ణుల, స్వామీజీ ముఖతా కూడా అప్పుడప్పుడు మేం విన్నాం.

23. 'ఎంత ప్రయత్నం చేసినా ఎవరూ తాము కోరినట్లు కాలేరు'

స్వామీజీ ఇలా చెప్పేవారు: ''శ్రీరామకృష్ణులు నన్ను ఆదరించి ఆధ్యాత్మిక ప్రబోధంతో నన్ను అనుగ్రహించిన రీతిలో నా మిత్రులను అనుగ్రహించలేదని గ్రహించి, వారినికూడా నన్ను అనుగ్రహించినట్లే అనుగ్రహించమని ఆయనను ఒత్తిడి చేశాను. కుర్రతనపు మూర్ఖత్వంతో ఈ అంశంపై అనేక సందర్భాలలో ఆయనతో వాదించడానికి వెనుకాడలేదు. 'ఎందుకు, మహాశయా? ఒకరిని అనుగ్రహించి మరొకరిని అనుగ్రహించని పక్షపాతబుద్ధి భగవంతుడికి ఎన్నటికీ ఉండదు. అటువంటప్పుడు మీరు నన్ను ఆదరించినట్లు నా మిత్రులను ఎందుకు ఆదరించడంలేదు? ఆసక్తి ఉండి గట్టిగా ప్రయత్నిస్తే ఎవరైనాగాని విద్యనార్జించి పండితుడెలా కాగలడో, అదే విధంగా ప్రయత్నించి ఆధ్యాత్మిక అనుభూతినికూడా పొందగలగడం తథ్యం.' అందుకు శ్రీరామకృష్ణులు ఇలా జవాబిచ్చారు: 'నాయనా, నేనేం చేయగలను? వారందరిలో ఆబోతువంటి పాశవిక వైఖరి నెలకొని ఉందని అమ్మ నాకు చూపించింది. ఈ జన్మలో వారికి ఆధ్యాత్మికానుభూతి కలుగదు. నన్నేం చేయమంటావు? అయినా నువ్వు చెబుతున్నదేమిటి? కేవలం సంకల్ప ప్రయత్నాలతో ఎవరైనా జీవితంలో తాము కోరుకొన్నట్లు కాగలరా?' ఆయన వచనాలను అప్పుడు నేను పట్టించుకొనే స్థితిలోనా ఉన్నాను? నే నిలా అన్నాను: 'మహాశయా, మీ రేమంటున్నారు? సంకల్పించుకొని, ప్రయత్నంచేస్తే తాము కోరుకొన్నట్లు కాలేరా, ఏమిటి? తప్పకుండా కాగలరు. మీ మాటలను నమ్మలేకపోతున్నాను.' నే నెంత చెప్పినా మళ్లీ ఆయన, 'నువ్వు నమ్మినా, నమ్మకపోయినా, అమ్మ నాకు చూపించింది. అదే' అని అదే మాట చెప్పారు. అప్పట్లో ఆయన మాటలను ససేమిరా ఒప్పుకొనేవాణ్ణి కాను. కాని కాలం గడిచేకొద్దీ, అనుభవం సంతరించుకొనే కొద్దీ, శ్రీరామకృష్ణుల వచనాలే నిజమనీ, నా అభిప్రాయమే తప్పనీ అవగతం చేసుకోసాగాను.''

ఈ విధంగా ఎన్నో రీతుల పరీక్షించి మదింపు వేసుకొన్న తరువాతే శ్రీరామకృష్ణుల వచనాలన్నిటినీ క్రమంగా నమ్మసాగానని స్వామీజీ చెప్పేవారు.

24. మూడవ ఉదాహరణ: శశధర పండితుణ్ణి చూడబోయినప్పుడు మంచినీళ్లు త్రాగే సందర్భంలోనిది

శ్రీరామకృష్ణుల ప్రతి చర్యను, ప్రవర్తనను స్వామీజీ పరీక్షించారనడానికి స్వామీజీయే స్వయంగా మాకు చెప్పిన ఒక సంఘటనను గురించి ఇక్కడ వివరించడం అసంగతం కాబోదు. స్వామీజీ నుండి పండిత శశధర తర్కచూడామణిని గురించి విని, 1885వ సం॥ రథయాత్రోత్సవం నాడు ఆయనను కలుసుకోవడానికి శ్రీరామకృష్ణులు వెళ్లారు. మాటల సందర్భంలో శ్రీరామకృష్ణులు, పండితుడికి ఇలా ఉద్బోధ చేశారు: ''జగజ్జనని ప్రత్యక్ష ఆదేశం పొందిన వారు మాత్రమే నిజమైన ధర్మప్రచారకులు; ధర్మప్రచారకులమని చెప్పుకొనే ఇతరుల వాగాడంబరం వ్యర్థప్రగల్భమే అవుతుంది.'' పిదప శ్రీరామకృష్ణులు తాగడానికి మంచినీళ్లు అడిగారు. శ్రీరామకృష్ణులకు దాహంవేసే నీళ్లు అడిగారో లేదా మరో ఉద్దేశంతో అడిగారో మాకు తెలియదు. ఎందుకంటే, ఎవరైనా సాధువో, సన్న్యాసో లేదా అతిథో లేదా ఫకీరో ఒక గృహస్థుడి ఇంటికి వెళ్లి, ఏమీ పుచ్చుకోకుండా తిరిగి వెళ్లిపోతే ఆ గృహస్థుడికి శుభం కాదని, ఆయన మాతో ఇంకో సందర్భంలో చెప్పివున్నారు. అందువలన ఎవరి ఇంటికైనా వెళ్లినప్పుడు, ఆ గృహస్థుడు తానుగా ఏమీ సమర్పించకపోయినా లేదా మరిచిపోయినా, ఆయనే స్వయంగా అడిగి ఏదో ఒకటి తినడమో, త్రాగడమో చేసివచ్చేవారు. ఏదిఏమైనప్పటికీ, శ్రీరామకృష్ణులు మంచినీళ్లు అడగ్గానే నామాలు పెట్టుకొని, జపమాల ధరించిన ఒక వ్యక్తి గబగబా వెళ్లి ఎంతో మర్యాద కనబరుస్తూ ఒక గ్లాసు నీళ్లు తీసుకువచ్చి ఆయనకు ఇచ్చాడు. ఆ గ్లాసు పుచ్చుకొన్నారేగాని, ఎంత ప్రయత్నించినా ఆయన నీళ్లు త్రాగలేకపోయారు. అది చూసి పక్కనే ఉన్న మరో వ్యక్తి ఆ నీళ్లు పారపోసి మరోగ్లాసు నీళ్లు పట్టుకొచ్చాడు. శ్రీరామకృష్ణులు కాసిని నీళ్లు త్రాగి, పండితుని వద్ద నాటికి సెలవు పుచ్చుకొని తిరిగి వెళ్లిపోయారు. మొదట తీసుకువచ్చిన నీటి గ్లాసులో ఏదో పడివుంటుందనీ, అందువలనే శ్రీరామకృష్ణులు త్రాగలేదనీ అందరూ అనుకొన్నారు.

అప్పుడు తాను గురుదేవుల ప్రక్కనే కూర్చుని ఉన్నాననీ, కాబట్టి ఆ గ్లాసులో దుమ్ముధూళిలాంటివి ఏవీ పడకపోవడం తాను స్పష్టంగా చూశాననీ స్వామీజీ చెప్పారు; అయినప్పటికీ శ్రీరామకృష్ణులు ఆ నీరు త్రాగడానికి నిరాకరించారు. కారణం ఏమైవుంటుందోనని దీర్ఘంగా యోచించి బహుశ 'స్పర్శదోషం' వలన గ్లాసు అపవిత్రమై ఉండవచ్చుననే నిర్ణయానికి వచ్చారు స్వామీజీ.

అలా నిర్ణయానికి రావడానికి కారణం ఇది: ఎవరిలో విషయాసక్తి, కామ కాంచనాసక్తి ప్రబలంగా ఉంటుందో, ఎవరు దగా మోసం ద్వారా అన్యాయంగా ధనార్జన చేస్తారో, తమ విషయసుఖేచ్ఛ, లాలస తీర్చుకోవడానికి బాహ్యంగా ధార్మికవేషం వేస్తారో, అటువంటి వ్యక్తులు తినడానికి లేదా త్రాగడానికి ఏదైనా ఇచ్చినప్పుడు, వాటిని స్వీకరింప తాను చేతిని ముందుకు చాచలేకపోయే వాడినని శ్రీరామకృష్ణులు చెప్పడం స్వామీజీ వినివున్నారు. అటువంటి వ్యక్తుల స్వభావం తనకు ఇట్టే తెలిసిపోయేదనీ, తెలియకుండానే అటువంటి ఆహారం చేత పుచ్చుకొంటే తక్షణం తన చేతులు ముడుచుకుపోయేవని శ్రీరామకృష్ణులు చెప్పడం కూడా స్వామీజీ వినే ఉన్నారు.

ఆ ఆలోచన మదిలో మెదలగానే పై సంఘటనను పురస్కరించుకొని నిజానిజాలను తేల్చుకోవాలని స్వామీజీ సంకల్పించుకొన్నారు. తమతో దక్షిణేశ్వరానికి రమ్మని శ్రీరామకృష్ణులు ఎంత చెప్పినాకూడా తన కేదో అత్యవసరమైన పని ఉందని చెప్పి, ఆయనను బండిలో ఎక్కించి, పంపించివేశారు. పైన పేర్కొన్న పంగనామాల వ్యక్తి తమ్ముడితో స్వామీజీకి కొంత పరిచయం ఉంది. శ్రీరామకృష్ణులు వెళ్లిపోయిన తరువాత, స్వామీజీ ఆ వ్యక్తిని ఒక ఏకాంత ప్రదేశానికి తోడ్కొని వెళ్లి, అతడి అన్నగారి శీలం, స్వభావాల గురించి ప్రశ్నించారు. మొదట్లో అతడు జవాబు చెప్పడానికి తటపటాయించాడు. చివరకు, 'నా అన్న దుర్గుణాల గురించి నే నెలా చెప్పగలను?' అని మాత్రం అన్నాడు. అతడు చెప్పిన దానిని బట్టి నిజాన్ని ఆయన అర్థం చేసుకోగలిగారు. తరువాత తనకు పరిచయం ఉన్న ఆ కుటుంబంలోని మరొక వ్యక్తిని అడిగి అంతా తెలుసుకొన్నాను. దాంతో ఆయన సంశయం తీరిపోయింది. లోకుల మనస్సులను గురుదేవులు ఎలా తెలుసుకోగలిగారా అని ఆశ్చర్యపోయారు.

25. శ్రీరామకృష్ణుల మనోనిర్మాణం, అంతర్దృష్టి

మామూలు భావభూమిలో ఉన్నప్పుడు సైతం శ్రీరామకృష్ణులు అన్ని వస్తువులలోని స్వతస్సిద్ధమైన, కంటికి కానరాని మంచి చెడు గుణాలను ఎలా గ్రహించ గలిగేవారో మనం తెలుసుకోగోరితే ముందుగా ఆయన మనోనిర్మాణాన్ని అవగతం చేసుకోవాలి; ఈ మనోనిర్మాణమే అన్నిటిని అంచనాకట్టి సరైన నిర్ణయానికి రావడానికి దోహదం చేసే ప్రమాణాన్ని ఆయనకు కల్పించింది. ఈ పుస్తకంలో పలుచోట్ల దానిని గురించి సూచించివున్నాం. అందువలన దానిని గురించి ఇక్కడ క్లుప్తంగా ప్రస్తావిస్తే సరిపోతుంది. శ్రీరామకృష్ణుల మనస్సు ఏ లౌకిక వస్తువు పట్లా అనురక్తి పొందనందువలన, అది పూర్తిగా ఆయన వశంలోనే ఉండేది; ఆ కారణంచేత సంకల్ప మాత్రాన ఒక వస్తువుపై మనస్సును లగ్నం

చేయడంగాని లేదా ఉపసంహరించడంగాని చేయగలిగేవారు. అవాంఛనీయమని పరిత్యజించిన ఏ వస్తువునైనాసరే మళ్లీ ఎన్నడూ కన్నెత్తికూడా ఆయన చూసే వారు కారు. అనన్యసాధారణమైన నిష్ఠ, వివేచనాశక్తి, సమగ్ర సావధానతలు ఆయ నకు మనస్సును నియంత్రించుకోగల శక్తిని ఒసగాయి. తత్ఫలితంగా ఎప్పుడు, ఎక్కడ, దేనిమీద, ఎంతకాలం మనస్సును ఏకాగ్రం చేయగోరేవారో అంత కాలం ఆ సదరు వస్తువుపై మనస్సును లగ్నం చేయగలిగేవారు. క్షణమాత్రం కూడా ఆయన మనస్సు మరే ఇతర ఆలోచనలకు, ఊహలకు లోనయ్యేది కాదు.

ఆయన మనస్సు ఒక విచిత్రమైన రీతిలో వ్యవహరించేది. ఏదైనా ఒక వస్తువును స్వీకరించడమో లేక త్యజించడమో చేయాలనుకోగానే, ఆయన మనస్సులోని ఒక భాగం, రెండవ భాగంతో, ''ఎందుకు అలా చేయగోరు తున్నావు?'' అని ప్రశ్నిస్తుంది. ఆ ప్రశ్నకు సంతృప్తికరమైన జవాబు వస్తే, ''సరే, మంచిదే, అలాగే చేయి'' అని అంటుంది. ఆ నిర్ణయానికి వచ్చిన తక్షణమే మనస్సులోని రెండవ భాగం ఇలా చెబుతుంది: ''నీ సంకల్పాన్ని అంటిపట్టుకొని ఉండు. తింటున్నప్పుడు లేదా విశ్రాంతి తీసుకుకొంటు న్నప్పుడు, నడుస్తూవున్నప్పుడు లేదా కలగంటున్నప్పుడు కూడా అందుకు విరుద్ధంగా ప్రవర్తించకు.'' పిదప ఆయన మనస్సు దానిని ఏకగ్రీవంగా అంగీ కరించి, తదనుగుణంగా వ్యవహరించేది. అచంచలమైన ఆయన నిష్ఠాగరిష్ఠత కాపరిలా నిలబడి మనస్సు ప్రవర్తనను జాగ్రత్తగా పరిశీలించేది. కాబట్టి పొర పాటుగానైనా ఆయన తన నిర్ణయానికి విరుద్ధంగా ఎన్నటికీ వ్యవహరించేవారు కారు; లోపలినుండి ఎవరో తన ఇంద్రియాలను కట్టిపడేసి ఆ రీతిలో ప్రవ ర్తించకుండా అడ్డుకొంటున్నట్లు ఆయనకు స్పష్టంగా స్ఫురించేది. వ్యక్తుల, వస్తువుల పట్ల ఆయన జీవితాంతం ప్రవర్తించిన తీరుతెన్నులను అధ్యయనం చేసినప్పుడు పైన పేర్కొన్న ఆయన వచనాలు మనకు అవగతమౌతాయి.

26. ఒక ఉదాహరణ

బాలుడైన గదాధర్ కేవలం కొద్ది రోజులు పాఠశాలకు వెళ్లీవెళ్లగానే, 'బియ్యం, అరటికాయలు మూటకట్టుకోవడానికి ఉపయుక్తమైన ఈ పొట్ట కూటి విద్య నాకు అవసరం లేదు. అటువంటి విద్యను నేను నేర్చుకోను' అని చెప్పడం పరికించండి. తమ్ముడు ఇలా దారితప్పుతున్నాడని భావించి, పెద్దన్నగారైన రాంకుమార్ తనతో కల కత్తాకు తోడ్కొని వెళ్లి స్వయంగా తన పర్యవేక్షణలో విద్య నేర్ప ప్రయత్నిం చాడు. కాని అట్టి విద్య కేవలం పొట్టకూటికై ఉద్దేశింపబడినదన్న గదాధర్‌లో చిన్ననాడు ఏర్పడిన అభిప్రాయాన్ని అన్నగారు మార్చలేకపోయాడు. కలకత్తాలో

పాఠశాలను ప్రారంభించి తన శక్తిమేరకు విద్యార్థులకు విద్య నేర్పిస్తూన్నప్పటికీ, తన అన్నగారు కుటుంబాన్ని లోటులేకుండా పోషించలేకపోవడం గదాధర్‌కు తెలియని విషయం కాదు. పండితుడూ, సజ్జనుడూ అయిన తన పెద్దన్నగారు సంపన్నులను భట్రాజులలా పొగడి ధనం ఆర్జించడం కంటే, రాణీరాస్మణి కాళీకాలయంలో అర్చక పదవిని స్వీకరించడం ఎంతో సముచితమని శ్రీరామ కృష్ణులు భావించి, అన్నగారు చేసిన ఆ పనికి తన ఆమోదముద్ర వేశారు.

సాధన చేస్తూన్న కాలంలో శ్రీరామకృష్ణులు ధ్యానానికి కూర్చోగానే శరీరం లోని కీళ్లన్నీ కటకట శబ్దంతో యాంత్రికంగా మూసుకుపోయేవి. చాలాసేపటి

27. రెండవ ఉదాహరణ

వరకు ఆయనను కదలనివ్వకుండా కూర్చోబెట్టడానికే ఎవరో లోపలనుండి తమ కీళ్లన్నిటికీ తాళం వేస్తున్నట్లు ఆయనకు అనిపించేది. అలా తాళం వేసిన వ్యక్తి మళ్లీ వాటిని తెరవనంతవరకు శ్రీరామకృష్ణులు తన ఇచ్ఛమేరకు కాళ్లను, చేతులను, మెడను కనీసం అటూ ఇటూ కదల్చలేకపోయేవారు. లేదా, ఒక త్రిశూలం చేత పుచ్చుకొన్న వ్యక్తి, ఆయన ప్రక్కనే కూర్చుని, ''భగవంతుణ్ణి తప్ప మరి దేనిని గురించియైనా చింతన చేశావో, ఈ త్రిశూలంతో నిన్ను పొడిచివేస్తాను'' అని బెదిరించేవాడు. పూజా సమయంలో జగజ్జననితో తాదాత్మ్యం చెందమని మనస్సును శాసించ గానే, అది అట్లే వర్తించేది. కాని జగజ్జనని పాదపద్మాలకు మందారపువ్వులు, బిల్వపత్రాలు అర్పించబోతున్నప్పుడు, ఈ తాదాత్మ్యానికి విరుద్ధంగా ఎవరో బలవంతంగా తన చేతులను తన తల వైపుగా త్రిప్పివేయడం జరిగేది.

అదే విధంగా సన్న్యాసదీక్ష పుచ్చుకొన్న మరుక్షణమే ఆయన మనస్సు సమస్త జీవులలోను ఆ ఒక్క అద్వైత బ్రహ్మాన్నే దర్శించసాగింది. సన్న్యాసం

28. మూడవ ఉదాహరణ

స్వీకరించిన తదనంతరం పితృతర్పణం విడువబోతున్న ప్పుడు ఆయన చేతులు కొంకర్లుబోయి, దోసిలిలో నీరు పట్టుకోలేకపోయారు. సన్న్యాసం పుచ్చుకోవడం వలన శాస్త్రవిహిత కర్మలు తమ నుండి వైదొలగాయని ఆయన అప్పుడు గ్రహించారు.

అనాసక్తి, వివేచన, ఏకాగ్రత, నిష్ఠ మొదలైనవి ఆయన మనస్సుకు స్వాభావికమైనవని రుజువు చేయడానికి ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు.

29. శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అనుభవాలు: శాస్త్రాల ధ్రువీకరణ

శ్రీరామకృష్ణుల ఈ అనుభవాలు శాస్త్రాలలో పేర్కొన బడిన వాటితో కచ్చితంగా సరిపోవడం వలన, శాస్త్రోక్తులు సత్యమే అన్న విషయం రుజువు అవుతున్నది. పరమ పూజ్యులైన వివేకానంద స్వామి ఇలా చెప్పారు: ''శ్రీరామ కృష్ణులు ఈసారి ఇలలో విద్యాగంధం లేనివారుగా అవతరించడానికి ఇదే

కారణం. హిందువుల వేదవేదాంత శాస్త్రాలను, ఇతరుల మత గ్రంథాలలో నమోదైన ఆధ్యాత్మిక స్థితులను నిరూపణ చేయడానికే, ఆ గ్రంథాలలో సూచించిన మార్గాల ననుసరించి మనిషి నిజంగా ఆ ఆధ్మాత్మిక స్థితులను అనుభూతం చేసుకోగలడని రుజువు చేయడానికే ఆయన విద్యాగంధం లేని వారుగా ఉండిపోయారు.''

నిర్వికల్ప అవస్థను పొంది, అద్వైతానుభవాన్ని సంతరించుకోవడమే మానవ జీవిత చరమానుభూతి అని, శ్రీరామకృష్ణుల స్వాభావిక మనోస్థితిని పరిశీలించినప్పుడు సుస్పష్టమౌతుంది. ఆ నిర్వికల్ప స్థితిలో, ''నక్కలన్నీ ఒకే రీతిలో ఊళలు వేయడం'' అనుభూతమౌతుందని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. నక్కల ఊళలన్నీ ఎలా ఒకే రీతిలో ఉంటాయో, అదేవిధంగా నిర్వికల్ప భూమికి చేరిన ప్రతి ఒక్కరూ ఆ స్థితినుండి దర్శించిన జగత్కారణుడైన భగవంతుణ్ణి గురించి వెలిబుచ్చే విషయమంతా ఒకే రకంగా ఉంటుందని ఆయన వచనాలకు అర్థం. ప్రేమావతారుడైన శ్రీచైతన్యులను గురించి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''ఏనుగు బాహ్యదంతాలు శత్రువును ఎదుర్కోవడానికి, లోపలి దంతాలు ఆహారం నమిలి తినడానికి అమరివున్నాయి. అదే విధంగా శ్రీచైతన్యుల విషయంలో కూడా ద్వైతభావం బాహ్యవైఖరిగా, అద్వైతభావం ఆంతరిక వైఖరిగా ఒప్పారుతున్నాయి.'' కాబట్టి సదా ఏకరీతిలో ఉండే అద్వైత భావమే ప్రతి విషయం నిర్ణయించడంలోను శ్రీరామకృష్ణుల ప్రమాణం అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. వ్యక్తిగతంగాగాని, సమాజపరంగాగాని ఏఏ భావాలు, చర్యలు లేక కర్మకలాపాలు ఎంత మేరకు ఆ నిర్వికల్ప భూమికి చేర్చడంలో దోహదం చేస్తాయో, ఆ భావాలు మొదలైన వాటిని శ్రీరామకృష్ణులు ఆ మేరకు ఇతర భావాలకంటే ఉన్నతమైనవని పరిగణించేవారు.

30. అద్వైతజ్ఞాన ప్రమాణం

ఆధ్యాత్మిక భావఫలితంగా శ్రీరామకృష్ణులకు కలిగిన దివ్యదర్శనాలను గురించి అధ్యయనం చేసినప్పుడు, వాటిలో కొన్ని ఆయనకు మాత్రమే తెలియవచ్చేవిగా, మరికొన్ని ఇతరులూ గ్రహించగలిగేవిగా ఉండడం మనం కనుగొనవచ్చు. నిరంతర అభ్యాసం, నిష్ఠాగరిష్ఠత మూలంగా ఆయన స్వకీయ ఆలోచనలు ఘనీభూతమై, మూర్తిమంతమై ఆత్మగత అనుభవాలుగా రూపు దిద్దుకొని, ఆ రూపాలలో ఆయనకు అభివ్యక్తమయ్యేవి కేవలం ఆయనకు మాత్రమే గ్రాహ్యమయ్యేవి. ఉన్నతోన్నత భావభూములను అధిరోహిస్తూ నిర్వికల్ప భూమికి చేరుకోబోతున్నప్పుడూ లేదా భావముఖంలో

31. దర్శనాలు రెండు రకాలు. 1. స్వసంవేద్యం - తమకు మాత్రమే తెలిసేవి 2. ఇతరులకూడా తెలిసేవి

నెలకొని ఉన్నప్పుడూ ఆయనకు ఇతర దర్శనాలు కలిగేవి. వాటిలోని విషయం ఆ సమయంలో ఇతరు లెవరికీ తెలియకపోయినా వాటి యాథార్థ్యతను గురించి - అప్పటికే అవి యథార్థమనీ లేదా భవిష్యత్తులో అలా జరుగనున్నవనీ - శ్రీరామకృష్ణులు తెలియచేసేవారు; ఆయన తెలిపినట్లే తదనంతరం నిజంగా అవి అలా జరగడం ఇతరులకు అనుభవమయ్యేది. వీటిలో మొదటి కోవకు చెందిన దర్శనాలు నిజమని గ్రహించాలంటే శ్రీరామకృష్ణులలోని శ్రద్ధ, విశ్వాసం, భక్తి, నిష్ఠ కలిగి ఉండాలి; లేదా ఏ ఉన్నత భూమిని అధిరోహించి నప్పుడు ఆ దర్శనాలు ఆయనకు కలిగాయో, ఆ ఉన్నత భూమిని అధిరోహించగలగాలి. కాని ఆ రెండవ కోవకు చెందిన దర్శనాలు యథార్థమైనవని గ్రహించడానికి ఏ విశ్వాసంగాని, సాధనగాని అవసరం లేదు. ఎందుకంటే కాల క్రమంలో అటువంటివి సంఘటిల్లడం చూసి అవన్నీ యథార్థమైనవేనని నమ్మక తప్పదు.

32. వస్తువుల యథార్థ స్వభావంతోనే శ్రీరామకృష్ణులు సంతృప్తి చెందేవారు

శ్రీరామకృష్ణుల మనోనైజం గురించి ఇంతకు మునుపు మేం చెప్పిన దానిని బట్టీ, ఇప్పుడు ప్రస్తావించిన దానినిబట్టీ చూస్తే, అటువంటి మనస్సు మామూలు చైతన్యస్థితిలో నెలకొని ఉన్నప్పుడుకూడా ఊరకే ఉండిపోదని గ్రహించవచ్చు. ఎందుకంటే, తన ఎరుకలోకి వచ్చిన వస్తువుల, వ్యక్తుల స్వభావ ప్రవర్తనలను అధ్యయనం చేసి, సబబైన నిర్ణయానికి వచ్చేవరకు ఆ మనస్సు తృప్తి చెందదు. కనుక. పండితులు శాస్త్రాధ్యయనం చేయడం పొట్ట కూటి కోసమేనని చిన్ననాడే వివేచనతో గ్రహించి, పరిహాసంగా తాను పేర్కొనే 'బియ్యం, అరటికాయలు' సముపార్జించిపెట్టే విద్యను నేర్వ నిరాకరించారు. వయస్సు పెరిగేకొద్దీ అదే మనస్సు పలుచోట్ల పలురకాల వ్యక్తులతో సంసర్గం పొంది వారిని గురించి వివిధ నిర్ణయాలకు రాగలిగింది. ఆ నిర్ణయాలే మన ప్రస్తుత చర్చనీయాంశం.

33. శాక్తుల, వైష్ణవుల మధ్య నెలకొన్న విద్వేషం

శ్రీ చైతన్యుల మరణానంతర కాలంలో ప్రారంభమైన శాక్తుల, వైష్ణవుల మధ్య ఏర్పడిన విద్వేషం అప్రతిహతంగా కొనసాగిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాంప్రసాద్ వంటి ఏదో కొద్దిమంది సాధకులు తమ సాధనల మూలంగా కాళీ కృష్ణుల ఏకత్వాన్ని అనుభూతం చేసుకొని, ఆ రెండు తెగలమధ్య చెలరేగుతున్న విద్వేష భావం తప్పని ప్రచారం చేశారు. ఒకరి దేవతలను ఒకరు రంధ్రాన్వేషక దుర్బుద్ధితో నిందించుకోవడం చూస్తే, వారి ఉపదేశాన్ని జన సామాన్యం ఖాతరు చేయలేదనీ, విద్వేషభావం అట్లే కొనసాగిందనీ

స్పష్టమౌతుంది. చిన్నతనం నుండి శ్రీరామకృష్ణులకు ఈ విషయం తెలియనిది కాదు. అంతేగాక, ఈ రెండు తెగల శాస్త్రాలలో పేర్కొన్న సాధనలు అనుష్ఠించి, వాటిలో పరిపూర్ణత్వం సంతరించుకొని, రెండు మార్గాలు సత్యాలే అని శ్రీరామకృష్ణులు అనుభూతం చేసుకొన్నారు. శాక్తుల, వైష్ణవుల మధ్య చెలరేగుతున్న ఈ విద్వేషానికి హేతువు ఆధ్యాత్మికత కొరవడడం మూలంగా వారిలో జనించిన దురహంకారమే దురభిమానమే అని ఆయన స్పష్టంగా అవగతం చేసుకొన్నారు.

శ్రీరామకృష్ణుల తండ్రియైన క్షుదీరాం శ్రీరామచంద్ర ఉపాసకులు. దైవికంగా శ్రీరఘువీరుని సాలగ్రామాన్ని పొంది, దానిని ఇంట్లో ప్రతిష్ఠించారు.

34. శ్రీరామకృష్ణులు: ఆ విద్వేషం తొలగించిన వైనం

శ్రీరామకృష్ణులు వైష్ణవుల వంశంలో జన్మించినప్పటికీ, చిన్నతనం నుండి ఆయన శివుని మీద, విష్ణువు మీద సరిసమానంగానే భక్తిప్రపత్తులు నెరపారనడం నిర్వివాదాంశం. బాల్యంలో ఒక సందర్భంలో శివుని వేషం ధరించి, అదే భావపారవశ్యంలో కొన్ని గంటలసేపు ఉండిపోయారనే విషయం నేటికీ ఇరుగుపొరుగువారు చెప్పుకోవడం కద్దు; ఆ సంఘటన జరిగిన స్థలాన్ని అందుకు నిదర్శనంగా వారు చూపిస్తారు కూడా. మరొక సంఘటనను ఇక్కడ ప్రస్తావించవలసి ఉంది. ఒక సందర్భంలో శ్రీరామకృష్ణులు తన కుటుంబంలోని యావన్మందికీ విష్ణువు, శక్తి మంత్రదీక్ష ఒసగారు. వారి మనస్సులలోని విద్వేషాన్ని తొలగించడం నిమిత్తమే ఆయన అలా వ్యవహరించారని మనం ఊహించవచ్చు.

ధర్మపాలకుడైన అశోక చక్రవర్తి జనసామాన్య శ్రేయస్సుకోసం విద్యను, ధార్మికతను ప్రచారంచేయ సంకల్పించడం అందరికీ సువిదితమే. మనుష్యుల,

35. ఔషధ నిర్ణయం చేసే మందుమాకు లిచ్చే సాధు సంప్రదాయానికి మూలం: క్రమేణా వారి ఆధ్యాత్మిక పతనం

పశువుల శారీరక రుగ్మతల చికిత్స నిమిత్తం ఆతడు ఎన్నో వైద్యశాలలను భారతదేశంలో పలుచోట్ల నెలకొల్పాడు. ఓషధి మొక్కలు, మూలికలు మొదలైన వాటిని విరివిగా పెంచి అవి అందరికీ సులభంగా అందుబాటులో ఉండేట్లు ఏర్పాట్లు చేయించాడు. అంతేగాక బౌద్ధ సన్న్యాసుల ద్వారా ఔషధాలను, ఓషధి మొక్కలను విదేశాలకు పంపించాడు కూడా. ఆనాటి నుండే బహుశా ఔషధాలను సేకరించి, పదిలపరచుకొనే సాధుసంప్రదాయం ప్రారంభమై ఉండవచ్చు. ఆ వాడుక తాంత్రిక యుగంలో మరింత ప్రాబల్యం సంతరించుకొంది. ఆ వాడుక క్రమేణా సాధువుల ఆధ్యాత్మిక పతనానికి దారి తీయడం గమనించి తదనంతర యుగ స్మృతికారులు అందుకు వ్యతిరేకంగా గొప్ప అభ్యంతరం లేవదీశారు. కాని పూర్వాచారపరాయణమైన భారతదేశంలో

నేటికీ ఆ వాడుక నశించలేదు. దక్షిణేశ్వరంలో వసించిన కాలంలోను, తీర్థ యాత్రలు చేసినప్పుడు అనేకమంది సాధువులు అటువంటి అన్య విషయాల పట్ల ఆసక్తిపరులై, లౌకికతకు ఎరగావడం శ్రీరామకృష్ణులు చూసేవున్నారు. ఆ విధంగా సాధువులలో సైతం ఆధ్యాత్మికత కొరవడడం గురించి శ్రీరామకృష్ణు లకు గట్టి నమ్మకం కుదిరింది. అందుకే మాతో పదేపదే ఆయన ఇలా చెప్పే వారు: ''మందుమాకు లిచ్చే, మంత్రతంత్ర ప్రయోగం చేసే, ధనం పుచ్చు కొనే, పంగనామాలు తిలకం వంటి గుర్తులు శరీరం మీద అలదుకొనే, పాదు కలను మాత్రమే ధరించే సాధువులను ఎన్నడూ విశ్వసించకండి. తాము గొప్ప సాధువులమని చాటుకోవడానికే వారిలా అతిగా చేస్తారు. ఆ గుర్తులు వారికి వ్యాపార ప్రకటనలలా వినియోగపడతాయి.''

పైన ప్రస్తావించిన విషయాన్ని బట్టి, వంచకులూ, భ్రష్టులూ అయిన సాధువులను పరికించి పాశ్చాత్య ధోరణులను అనుసరించే కొందరిలా శ్రీరామ కృష్ణులు సాధుసంప్రదాయాల నన్నిటినీ రద్దు చేయగోరా రని ఎవరూ అపార్థం చేసుకోరాదు. ఈ అంశాన్ని ప్రస్తా విస్తూ అప్పుడప్పుడు ఆయన ఇలా చెప్పేవారు: ''కాషా యాంబరాలు ధరించి, భిక్షపైనే జీవించే సామాన్య సాధువునుకూడా ఒక మంచి గృహస్థుడికంటే శ్రేష్ఠునిగానే పరిగణించాలి; ఎందుకంటే, అతడు జప తపాదులేవీ అనుష్ఠించకపోయినా, పవిత్రునిగా (అంటే కామకాంచన రహితు నిగా) యావజ్జీవితం భిక్షాన్నంతో గడపగలిగితే, అతడు సామాన్య గృహస్థుని కంటే పరిత్యాగ మార్గంలో ఎంతో పురోగమించినట్లే.'' భగవంతునికై సర్వ స్వాన్ని త్యజించడమే మనిషి శీలానికి, ప్రవర్తనకు గీటురాయిగా శ్రీరామ కృష్ణులు పరిగణించేవారనడానికి పై వచనాలు తార్కాణాలు.

36. వేషమాత్ర సాధువుల గురించి శ్రీరామకృష్ణుల అభిప్రాయం

ఏ సంప్రదాయానికి చెందినవారైనా - భక్తిమార్గావలంబులైనా లేదా జ్ఞాన మార్గావలంబులైనా - భక్తి నిష్ఠలున్న సాధువులను శ్రీరామకృష్ణులు గౌరవించే వారనడానికి అనేక ఉదాహరణలు మేం తెలిపివున్నాం. ఇటువంటి మహాత్ముల భగవదనుభూతివలనే భారత దేశ సనాతన ధర్మమనే జ్యోతి జాజ్వల్యమానంగా ప్రకా శిస్తూ వస్తోంది. వీరిలో భగవత్సాక్షాత్కారం పొంది, నానారకాల మాయాబంధ నాలనుండి విముక్తులైన వారు, వేదాదిశాస్త్రాలను ఆధ్యాత్మిక సత్యాల కోశా గారంగా నిరూపణచేసి, వాటి సాధికారికతను నెలకొల్పారు. వైశేషికాది హేతు వాదులతో సహా భారతీయ దార్శనికు లందరూ సత్యద్రష్టలకు మాత్రమే వేదాలు వెల్లడైనాయని ఏకగ్రీవంగా ఆమోదించారు. కాబట్టే నిశిత అంతర్దృష్టి

37. నిజమైన సాధువుల జీవితాలే శాస్త్రాలకు జీవం పోస్తాయి

సంపన్నులైన శ్రీరామకృష్ణులు ఆ నిజాన్ని గ్రహించే ఆ మహాత్ములను గౌరవించా రనడంలో ఎలాంటి ఆశ్చర్యమూ లేదు.

నిష్ఠ భక్తిగల సాధువులను శ్రీరామకృష్ణులు గౌరవించి, వారి సాంగత్యంలో అమితానందాన్ని పొందినప్పటికీ, వారిలో కొరవడిన ఒక లక్షణం కారణంగా ఆయన అనేక సందర్భాలలో బాధ ననుభవించారు. తనలా సమాన ప్రేమాభిమానాలతో వారు అన్ని సంప్రదాయస్థులతోనూ కలసిమెలసి మెలగకపోవడం శ్రీరామకృష్ణులు గుర్తించారు. అద్వైత సాధన మార్గంలో ఎంతో పురోగమించిన సాధకులలోకూడా ఈ సంకుచితత్వం పాదుకొని ఉండడం ఆయన గుర్తించారు. అటువంటప్పుడు భక్తిమార్గావలంబుల విషయం గురించి వేరే ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! అద్వైత భూమిని అధిరోహించి ఉదార సమభావాన్ని సంతరించుకోవడానికి ఎంతో మునుపే ఈ సాధువులు ఇతర మార్గావలంబులైన సాధకులను ఆధ్యాత్మికంగా అధములనీ లేదా క్రిందిస్థాయి వారనీ అవహేళన చేసేవారు. ఒకే గమ్యం వైపుగా పురోగమిస్తున్న సాధకులలో అటువంటి పరస్పర ఓర్వలేనితనం ఉండడం చూసి మహోదారభావసంపన్నులైన శ్రీరామకృష్ణులు ఎంతో వ్యథ చెందేవారు. నిజమైన ఆధ్యాత్మికత కొరవడడమే ఇందుకు కారణమని ఆయన స్పష్టంగా గ్రహించారు.

38. నిజమైన సాధువులలో కూడా సంకుచితత్వం ఉండడం శ్రీరామకృష్ణులు గమనించడం

దక్షిణేశ్వర కాళికాలయంలో నివసిస్తూన్నప్పుడు గృహస్థులలోను, సన్న్యాసులలోను ఆధ్యాత్మికత ఎంతగానో కొరవడి ఉండడం అనునిత్యం ప్రత్యక్షంగా శ్రీరామకృష్ణులు చూసేవారు. పుణ్యక్షేత్రాలూ, దేవాలయాలూ దర్శింప వెళ్లినప్పుడు ఈ చెడులు ఆయనకు ఏమాత్రం తక్కువగా కనిపించలేదు; పైగా మరింత హానికరమైనవిగా స్ఫురించాయి. మథుర్‌బాబు నుండి కానుకలు పుచ్చుకొనేటప్పుడు బ్రాహ్మణులు కలహించుకోవడం; కాశీలో తాంత్రిక సాధకులు తమ జగజ్జనని ఉపాసనను తిలకింప శ్రీరామకృష్ణులను ఆహ్వానించారు. జగజ్జననిని నామమాత్రంగా పూజించారో లేదో, పూజా నెపంతో తప్పత్రాగి అసభ్యంగా ప్రవర్తించడం; పేరుప్రతిష్ఠలకై దండి సన్న్యాసుల తహతహ; ఆధ్యాత్మిక సాధనల నెపంతో బృందావనంలో వైష్ణవ బాబాజీలు స్త్రీల సాంగత్యంలో గడపడం, ఇటువంటి మరెన్నో 'వాస్తవాలు' శ్రీరామకృష్ణుల నిశిత అంతర్దృష్టికి తమ అసలు రంగులలో కనిపించి, నాటి సమాజ, దేశ యథార్థ స్థితిని అవగతం చేసుకోవడంలో దోహదపడ్డాయి.

39. పుణ్యక్షేత్రాలలో ఈ ఆధ్యాత్మికత కొరవడడం శ్రీరామకృష్ణులకు అనుభవైకవేద్యమే

కేవలం ఈ సంఘటనలను పరిశీలించడం వలన కాక, ఇంతకు మునుపే ప్రగాఢ అద్వైత సత్యానుభూతిని సంతరించుకొన్నందు వలననే ఆయనకు ఆ విషయాలు స్పష్టమైనాయి. ఇంతకు క్రితమే ఆ పరమానుభూతిని పొందగల గడం వలననే వ్యక్తిగత, సామాజిక జీవిత పరమలక్ష్య భావన ఆయన మనస్సులో ప్రగాఢంగా నాటుకుపోయింది. కాబట్టే ఆ అనుభూతిపరంగా పరీ క్షించడం వలననే ఆయన అన్ని విషయాలనూ అలవోకగా అర్థం చేసుకో గలిగేవారు. ఆయన మామూలు భావచైతన్య భూమిలో నెలకొని ఉన్నప్పుడు దైనందిన వ్యక్తిగత, సామాజిక సంఘటనల అధ్యయనం, అనుభవం, మానవ జీవితంపై ప్రభావం చూపే అన్ని వస్తువుల విలువలను రూఢిపరచుకోవడంలో దోహదం చేశాయి. కనుకనే నిజమైన పురోగతి, నాగరకత, సదాచారం, విద్య, భగవద్భక్తి, నిష్ఠ, యోగం, కర్మ మొదలైన ప్రేరేపక శక్తులు మనిషిని ఏ గమ్యా నికి తీసుకుపోతున్నాయో ఆయనకు రూఢిగా తెలిసిపోయేది. నిజమైన సాధుత్వం అంటే ఏమిటో ఆయనకు తెలియకపోతే ఫలానా సాధువు ఆధ్యాత్మి కంగా ఏ మేరకు పురోగమించాడో ఆయన ఎలా అర్థం చేసుకోగలిగేవారు? సుదీర్ఘ కాలంగా అసంఖ్యాక సాధువులు భగవంతుణ్ణి చింతన చేయడం మూలంగానే పుణ్యక్షేత్రాలలో, దేవతావిగ్రహాలలో ఆధ్యాత్మికభావం సుసంఘటితమై అభివ్యక్తమౌతూవుంటుందనే విషయం నిశ్చయంగా ఆయనకు తెలియకపోతే, సత్యసంధులైన శ్రీరామకృష్ణులు లోకులను తీర్థయాత్రలు చేసి అక్కడి విగ్రహా లను ఆరాధించి రమ్మని ఎలా ప్రోత్సహించేవారు? లేదా, నానామతాలు మత శాఖలు కొనిపోయే దిశను, చివరకు తీసుకుపోయే గమ్యాలను గురించి ఆయ నకు తెలియకుంటే వాటిలో వ్యక్తమౌతూన్న మతసంకుచితత్వం గర్హనీయమని ఎలా అవగతం చేసుకోగలిగేవారు?

ఎన్నో శాఖాసంప్రదాయాలు, ఎందరో సాధువులు, ఎన్నో పుణ్య క్షేత్రాలు, దేవతా విగ్రహాలు, నానామతాలు కోలాహల వాదాల ప్రతిధ్వనులు, శాస్త్రవచనాల అర్థాలు మన దైనందిన అనుభవంలోనివే. ఈ పరస్పర విరుద్ధ అనుభవాల నడుమ, కలహాల పట్ల మనం పొందే దురాకర్షణకు లోనై కొన్ని సమయాలలో ఒక ఫలానా మతం సరైనదనీ, మరొకటి కాదనీ భావిస్తూ ఉంటాం. అట్లే దైనందిన లౌకిక సంఘటనలను పరిశీలించి, అధ్యయనం చేసి మానవ జీవిత పరమావధి ఏదో రూఢిపరచుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటాం; ఆ ప్రయత్నంలో కొన్ని సమయాల్లో ఫలానా దానిని పరమావధిగా, మరికొన్ని సమయాలలో మరొక దానిని పరమావధిగా స్వీకరిస్తూ ఏ స్థిర నిర్ణయానికీ రాలేక అటూ ఇటూ ఊగిసలాడుతూ తరచు నాస్తికులుగా మారి,

లౌకిక సుఖభోగాలే నిజమైన జీవిత పరమావధిగా పరిగణిస్తాం. అటువంటి స్థిరనిర్ణయానికి దారితీయని, సదా మారుతూవుండే నిర్ణయాల మూలంగా మన అనుభవాలు ఏ రకంగా మనకు దోహదం చేస్తాయి? తమ అద్భుత మనో నిర్మాణం ఫలితంగా శ్రీరామకృష్ణులు ఏ విషయాన్ని సైతం చూసిన తక్షణమే గ్రహించి, అవగతం చేసుకోగలిగేవారు. అటువంటి మహాపురుషుల లేక జగ ద్గురువుల సహాయం లేకుండా మనవంటి అపక్వమనస్కులు నూరు జన్మలలో కూడా అర్థం చేసుకోలేమనడం ముమ్మాటికీ నిజం. ఆయన ప్రతి చర్య, ప్రవర్తన నుండి మన మనస్సులకూ ఆయన మనస్సుకూ మధ్యనున్న హస్తిమశకాంతరాన్ని ఊహించుకోవచ్చు. కాబట్టే అవతారపురుషుల మనస్సులు రజస్సు, తమస్సు స్పృశించని శుద్ధసత్త్వ పదార్థంతో రూపొంది ఉంటాయని భక్తిశాస్త్రాలు వచిస్తున్నాయి.

ఈ విధంగా దివ్యభావ, సామాన్యభావ భూములనుండి పరికించడం వలన దక్షిణేశ్వరానికి వచ్చిపోయే వ్యక్తుల, తీర్థయాత్రలు చేసే సందర్భంలో కలుసుకొన్న వ్యక్తుల నుండి దేశంలో నెలకొని ఉన్న ఆధ్యాత్మిక కొరత గురించీ, మతసంకుచితత్వం, అస హనం గురించీ, ఆయన చక్కగా అవగతం చేసుకోగలి గారు. అన్ని మత సిద్ధాంతాలు సరిసమానంగా సత్యాలే అయినప్పటికీ, వివిధ ప్రవృత్తులుగల వ్యక్తులు వివిధ మార్గాలలో అదే గమ్యాన్ని చేరుకోవడంలో అవి తోడ్పడతాయని ఆయన లోతుగా యోచించి కనుగొన్నారు; గత యుగాచార్యులు ఈ మతాల ఏకతా సత్యం గురించి అజ్ఞా నులై ఉండివుండవచ్చు లేదా ఇంకా సరైన సమయం ఆసన్నం కాలేదని భావించి ఉద్దేశపూర్వకంగానే అలా ప్రచారం చేసివుండకపోవచ్చునని శ్రీరామకృష్ణులు గ్రహించారు. సంకుచితరహితమైన ఆయన ఉదార వైఖరి ప్రపంచానికి అతి నవీనమైనదనే విషయం ఆయన స్పష్టంగా తెలుసుకొన్నారు. ఈ ఉదార వైఖరి ఆయనతోనే అవతరించింది, ఆయనే లోకానికి దానిని అందించవలసి వుంది.

40. తమ ఉదార (మత) సిద్ధాంతం గురించి శ్రీరామకృష్ణులు ఎరిగే ఉన్నారు

లోకాన్ని ముగ్ధపరచిన ''అన్ని మతాలూ సత్యాలే; మతాలెన్నో మార్గా లన్ని'' అన్న మహోదార సిద్ధాంత వచనం ప్రప్రథమంగా శ్రీరామకృష్ణుల ముఖతా వెలువడిందని మనలో అనేకులం ఇప్పుడు అవ గతం చేసుకోగలుగుతున్నాం. గత యుగాల ఋషుల, మతాచార్యులలో ఈ మహోదార సిద్ధాంతం పాక్షికంగా అభివ్యక్తమైందని కొందరు ఈ విషయంలో అభ్యంతరం లేవదీయవచ్చు. కాని నిశితంగా పరిశీ

41. మతాలెన్నో మార్గాలన్ని

లించినప్పుడు ఆ ఆచార్యవరులు తమ మేధాశక్తిని ఉపయోగించి వాటిలో అత్యావశ్యకమైనవని తాము పరిగణించిన వాటిని రసమిశ్రమం చేసివుంటారని తేటతెల్లమౌతుంది. కాని గతయుగాల ఆచార్యులలా కాక శ్రీరామకృష్ణులు ఏ మతంనుండి కించిత్తుకూడా వదలిపెట్టలేదు. తమ జీవితంలో సమధికోత్సాహంతో ఆ మత సాధనలు అనుష్ఠించి, ఆ మతాలు ప్రతిపాదించిన పరమ గమ్యాన్ని చేరుకొని, ఆ పరమసత్యాన్ని అనుభూతం చేసుకొన్నారు. ఈ అంశాన్ని ఇక్కడ మరింత విపులీకరించాలన్నది మా ఉద్దేశం కాదు. శ్రీరామ కృష్ణుల జీవితంలో బాల్యంనుండికూడా ఈ మహోదార సిద్ధాంతం పాదుకొని ఉందనడానికి మాకు నిదర్శనం లభించిందని మాత్రమే పాఠకులకు చెప్పదలచుకొన్నాం. గత యుగాల ద్రష్టలూ, ఆచార్యులూ, అవతారపురుషులూ ప్రత్యేక మార్గంలో పరమగమ్యాన్ని చేరుకోవడం ఎలాగో సమాజంలో ప్రచారం చేసినప్పటికీ, వివిధ మార్గాలలో అదే పరమగమ్యాన్ని చేరుకోవచ్చునని మాత్రం వారిలో ఎవరూ ప్రచారం చేసివుండలేదు. కాని పుణ్యక్షేత్రాలు సందర్శించిన తదనంతరమే ఆధ్యాత్మిక జగత్తులో ఆ మహోదారతను తాము మాత్రమే అనుభూతం చేసుకొన్నామని శ్రీరామకృష్ణులు నిశ్చయంగా తెలుసుకోగలిగారు. సాధన కాలంలో సమస్త లౌకిక వాసనాకామన లన్నిటిని జగజ్జనని పాదపద్మాల చెంత హృదయపూర్వకంగా అర్పించి, ఈ సంసారంలోకి ఈ మాయావరణంలోకి మరిక తిరిగి రాకూడదని దృఢ సంకల్పం చేసుకొని నిర్వికల్ప అద్వైత భావభూమిలో నెలకొని ఉండగోరారు శ్రీరామకృష్ణులు. కాని జగజ్జనని అలా జరగనివ్వలేదు. అంతుబట్టని రీతులలో ఆయన దేహాన్ని పతనం చెందకుండా పరిరక్షించింది. లోకంలో సాధ్యమైనంత వరకు మత సంకుచితత్వాన్ని వైషమ్యాన్ని తొలగించే ఉద్దేశంతోనే తమ దేహం పతనం చెందలేదని శ్రీరామకృష్ణులు అర్థం చేసుకొన్నారు. అంతేకాక ఈ ఉదారభావాన్ని గ్రోల లోకం దప్పికతో తపించిపోతూవున్నదనీ ఆయనకు తెలుసు. పై నిర్ణయానికి మేం ఎలా రాగలిగామో పాఠకులకు వివరింప ప్రయత్నిస్తాం.

42. లోకానికి ఆధ్యాత్మికతను అందివ్వడానికే జగజ్జనని తనకు అద్భుత శక్తిసంపత్తిని ఒసగిందని శ్రీరామకృష్ణులు గ్రహించడం

ఆధ్యాత్మికత లేదా సత్యసాక్షాత్కారం వట్టి మాటల వలన కాక, సాధనానుష్ఠానాల వలన మాత్రమే లభిస్తుందని శ్రీరామకృష్ణులు చిన్ననాటినుండీ విశ్వసించేవారు. సాధన కాలంలోనూ, పరిపూర్ణత్వాన్ని సంతరించుకొన్న తదనంతరమూ సుదీర్ఘ సాధనానుష్ఠానాల ఫలితంగా సముపార్జించుకొన్న శక్తులను ఇతరులలో ప్రవేశింప చేయాలని అప్పుడప్పుడు ఆయన అనుకొనేవారు. ఆయన ఈ భావనను ఇంతకు క్రితమే మేం

అక్కడక్కడ[1] సూచనప్రాయంగా వెలిబుచ్చివున్నాం. జగజ్జనని అనుగ్రహించి అట్టి శక్తిని పుష్కలంగా తమలో సంచితంచేసి ఉందని అప్పటికే అనేక సంద ర్భాలలో ఆయన రూఢిపరచుకొన్నారు. మథుర్ మొదలైన ప్రత్యేకించి కొంద రిని అనుగ్రహింప ఆమె ఆ శక్తిని పరికరంగా వినియోగించుకొంది. పర్యవ సానంగా ఏదో కొద్దిమంది ధన్యులపై మాత్రమే జగజ్జనని అనుగ్రహం తమ మనశ్శరీరాలనే పరికరం ద్వారా వర్షింపచేయడానికి మాత్రమే ఈ శక్తి ఉందని అప్పటి వరకు శ్రీరామకృష్ణులు విశ్వసించేవారు. అయినా ఆమె ఏ రీతిలో, ఎప్పుడు అటువంటి వ్యక్తులను కటాక్షించేదో ఆయనకు తెలిసేది కాదు. అన్ని విధాల కేవలం తల్లి మీద ఆధారపడే బిడ్డవంటి మనస్సుగల శ్రీరామకృష్ణులు ఆ విషయాన్ని అవగతం చేసుకోవడానికి ప్రయత్నంకూడా చేయలేదు.

తమ ఆధ్యాత్మిక సందేశాన్ని యావద్దేశంలో ప్రచారం చేసి లోకాన్ని ఆధ్యాత్మిక ఉత్తుంగ తరంగంతో ముంచెత్తివేయవలసి వస్తుందనే విషయాన్ని మాత్రం అంతకుముందు ఎన్నడూ ఆయన కలలోకూడా ఊహించలేదు. కాని జగజ్జనని తమ మనశ్శరీరాల ద్వారా ఆ కొంగ్రొత్త లీలను అప్పటికే ప్రారంభిం చిందని ఆయన హృదయాంతరాళాలలో అప్పటినుండి భావించసాగారు. కాని ఆయన నిస్సహాయులు. ఏ ఉపాయం ద్వారా దానిని సాధించాలో, దాని నిమిత్తం జగజ్జనని తనను ఎలా రూపొందిస్తుందో లేదా దానిని సాధింప ఆమె తనను ఎక్కడకు తోడ్కొనిపోతుందో అనే విషయాల గురించి ఆయనకు ఏమాత్రం తెలియదు. ఆయన ఎప్పటికీ జగజ్జనని బిడ్డడే! 'ఆమె నా తల్లి, నేను ఆమె బిడ్డను' అన్న విషయం మాత్రమే ఆయనకు తెలుసు. తల్లి ఆకాంక్ష తప్ప ఆయన మదిలో మరెలాంటి ఆకాంక్ష జనించదు. తల్లిని వివిధ రూపాలలో, వివిధ మార్గాలలో తెలుసుకోవాలనే ఏకైక ఆకాంక్ష మాత్రమే బహుశా ఆయన సొంత కోర్కెగా పేర్కొనవచ్చు. కాని ఆ ఆకాంక్ష కూడా తన సంకల్పం వలననే ఆయన మనస్సులో ఉదయించిందనే విషయం అంతకు మునుపే ఆయనకు జగజ్జనని స్పష్టంచేసి ఉంది. కాబట్టి ఆధ్యాత్మిక ఉద్యమ నిమిత్తమైన ఈ కొంగ్రొత్త అనుభవం మదిలో స్ఫురించగానే, జగజ్జనని బిడ్డడైన శ్రీరామకృష్ణులు పూర్తి పరాధీన వైఖరిలో ఆమె నేతృత్వంకై ఎదురుచూడసాగారు; ఆమె కూడా అంతకు మునుపులా తన బిడ్డతో ఆడుకోసాగింది.

గంగామాత పావన సాంగత్యంలో, దివ్యప్రేమలో లీనమైపోయినప్పుడు బృందావనంలోనే తన శేష జీవితాన్నంతా గడిపివేయాలనే ఆయన ఆకాంక్ష

---

1. III.6,7

నుండి మన కొక విషయం స్పష్టమౌతుంది. అస్పష్టంగా ఆధ్యాత్మిక ఉద్యమ భావాలు ఆయన మదిలో ఉదయిస్తున్నప్పటికీ, అహంకార ప్రభావంలోపడి ఆధ్యాత్మిక గురువు పదవిని స్వీకరించే సాధారణ గురువుల, మతప్రవక్తలలా ఆయనకు ఆ పదవిని అలంకరించాలనే ఉద్దేశం ఏనాడూ కలుగలేదు. "అమ్మ తన పనిని తానే నిర్వర్తించుకొంటుంది. ఈ లోకాన్ని ఉద్ధరింప, బోధింప నే నెవరిని?" అనే శ్రీరామకృష్ణుల జీవిత దృక్పథాన్ని కించిత్తుకూడా మేం అవగతం చేసుకోలేం. జగజ్జనని తన పనిని నిర్వర్తించే అద్భుత పరికరంగా ఆయనను రూపొందించింది ఈ దృక్పథమే. సతతం భావముఖంలో నెలకొని ఉండగల స్థితిని కల్పించింది ఈ దృక్పథమే అన్న విషయం నిర్వివాదాంశం. ఆయనలో అద్భుత గురుభావ అభివ్యక్తీకరణకు దారితీయించింది కూడా ఈ దృక్పథమే.

43. ఆధ్యాత్మిక గురువుగా నిరహంకారులైన శ్రీరామకృష్ణులు

ఇంతకు మునుపు ఆ గురుభావం అభివ్యక్తమైనప్పుడు వారికి ఆ విషయం తెలిసేది కాదు. ఆయన మనశ్శరీరాలను ఆశ్రయించి అది తన కార్యాన్ని నిర్వర్తించేది. ఆ పని పూర్తియైన తరువాతే జరిగినదంతా ఆయన అవగతం చేసుకోగలిగేవారు. కాని ఇప్పటినుండి ఆ గురుభావం ఎడతెగని రీతిలో ఆయనలో అభివ్యక్తమౌతూవుండడం వలన క్రమేణా ఆయన మనశ్శరీరాలు అందుకు అలవాటుపడి, అది సహజావస్థగా మారింది. ఎంత కాదనుకొన్నా ఆ గురుభావ శక్తి ఇప్పుడు శ్రీరామకృష్ణులను ఆధ్యాత్మిక గురుపీఠంలో సుప్రతిష్ఠితుని గావించింది. ఇంతకు మునుపు ఒక సామాన్య సాధకునిగా లేదా బాలకునిగా భావించుకోవడమే ఆయన మామూలు మనోస్థితి; అధిక సమయం ఆయన ఈ భావంలోనే నెలకొని ఉండేవారు. ఆ సందర్భంలో గురుభావం అప్పుడప్పుడు మాత్రమే అభివ్యక్తమయ్యేది. మరి ఇప్పుడో? కచ్చితంగా అందుకు వ్యతిరేకంగా జరుగసాగింది; ఇప్పుడు అత్యధిక సమయం ఆయన గురుభావంలో నెలకొని ఉండేవారు; అందుకు అనుగుణంగా సామాన్య సాధక లేదా బాలక వైఖరి ఆయనలో అప్పుడప్పుడు మాత్రమే అభివ్యక్తం కాసాగింది.

అహంకారవశులై ఆధ్యాత్మిక గురువు పదవిని స్వీకరించడం శ్రీరామకృష్ణులకు అసంభవమైన పని. భావముఖంలో నెలకొని ఉన్నప్పుడు జగజ్జననితో చిన్నపిల్లవాడిలా తగవులాడడం ఇందుకు నిదర్శనగా పలుమార్లు మేం చూసివున్నాం. పద్మం వికసించగానే తేనెటీగలు గుంపులుకట్టి వ్రాలే విధంగా, శ్రీరామకృష్ణులలో అభివ్యక్తమయ్యే ఆధ్యాత్మికత పట్ల ఆకర్షితులై

44. అందుకు ఉదాహరణ - భావముఖంలో శ్రీరామకృష్ణులు జగజ్జననితో తగవులాడడం

ఆధ్యాత్మిక పిపాసువులు అనేకులు దక్షిణేశ్వరానికి రాసాగారు. ఆ కాలంలో ఒక రోజు మేం ఆయనను దర్శింప వెళ్లినప్పుడు భావముఖస్థితిలో ఆయన జగజ్జననితో మాట్లాడుతూండగా చూశాం. ఆయన ఇలా అంటున్నారు: ''అమ్మా, ఏం చేస్తున్నావు? గుంపులు గుంపులుగా జనాన్ని ఎందుకు తోడ్కొనివస్తున్నావు? స్నానానికీ, తినడానికీ నాకు తీరిక అంటూ లేకుండా పోయింది.'' ఆయన కంఠవ్రణంతో బాధపడుతున్న తొలి దశ అది. తన దేహస్థితిని ఉద్దేశిస్తూ ఆయన, ''ఇది ఇప్పటికే చిల్లిపడిన మద్దెల. మరింతగా వాయిస్తే పూర్తిగా పగిలి పోతుంది. అప్పుడు ఏం చేస్తావు?'' అని అన్నారు.

45. పై విషయానికి రెండవ ఉదాహరణ

మరొక సందర్భంలో మేం ఒకసారి దక్షిణేశ్వరంలో ఆయన పక్కన కూర్చుని ఉన్నాం. అప్పుడు 1884వ సంవత్సరం అక్టోబరు నెల జరుగుతున్నది. ప్రతాపచంద్ర హాజ్రా తల్లికి జబ్బు చేసిందనే వార్త తెలిసింది. ఇంటికి వెళ్లి తల్లికి ఉపచర్యలు చేయమని హాజ్రాకు, గురుదేవులు నచ్చచెప్పసాగారు. మేం కూడా ఆ సందర్భంలో అక్కడే ఉన్నాం. కాని హాజ్రా ఇంటికి వెళ్లకుండా వైద్యనాథ్ క్షేత్రానికి వెళ్లాడనే సమాచారం తెలియవచ్చింది. ఆ వార్త విని శ్రీరామకృష్ణులు విసుక్కున్నారు. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకొన్నాక, ఆయన మమ్మల్ని ఒక పాట పాడమని చెప్పి, పిదప భావపారవశ్యులైనారు. ఈ సందర్భంలోకూడా శ్రీరామకృష్ణులు, జగజ్జననితో పిల్లవాడిలా తగవులాడసాగారు. ఆయన ఇలా అన్నారు: ''అటువంటి పనికిమాలిన, బాధ్యతారహితులను ఇక్కడి కెందుకు తోడ్కొని వస్తున్నావు? (కాసేపు మౌనం వహించి) నే నంతగా పాటుపడలేను. ఒక సేరు పాలలో పావు సేరు నీళ్లు కలిపినా ఫరవాలేదు; లేదా ఒక సేరు పాలలో ఒక సేరు నీరు. కాని ఇప్పుడు ఐదు సేర్ల నీళ్లలో ఒక సేరు పాలు కలిపి ఉన్నారు. కట్టెలు రాజేయడానికి ఊది ఊది నా కళ్లు మండుతున్నాయి. కావాలంటే నువ్వే వారి వ్యవహారం చూసుకో. ఇక నే నెంతమాత్రం ఊదలేను. అటువంటి వ్యక్తులను ఇకమీదట తోడ్కొని రావద్దు.'' ఆ మాటలు విని ఆశ్చర్యచకితులమై మేం మౌనంగా కూర్చుండిపోయాం. శ్రీరామకృష్ణులు ఆ మాటలు ఏ దురదృష్టవంతుణ్ణి ఉద్దేశించి పలుకుతున్నారో అనుకొని భయంతో వణకిపోయాం. ఇటువంటి వాగ్వాదాలు నిత్యం శ్రీరామకృష్ణుల, జగజ్జనని మధ్య జరగడం కద్దు. ఇతరులు సన్మానం పొంద దేనికోసం దేవులాడుతూంటారో ఆ గురువు పదవిని హేయంగా భావించి, దానిని తననుండి ఉపసంహరింపచేయమని శ్రీరామకృష్ణులు నిత్యం తల్లిని కోరుతూ ఉండేవారని పై ఉదహరించిన తగవులాటలు స్పష్టీకరిస్తున్నాయి.

ఈ విధంగా ఇచ్ఛామయియైన జగజ్జనని తన మార్మిక లీల ద్వారా యావజ్జీవితం ఆయన కెన్నో అద్భుత, అసాధారణ అనుభవాలు అనుగ్రహించింది. ఇంతకు మునుపు మరే జగద్గురువులో సైతం కల్పించని మహోదార ఆధ్యాత్మిక భావాలను పుష్కలంగా శ్రీరామకృష్ణులలో, ఆమె పాదుగొల్పింది. దానితోపాటు ఇతరులను తరింపచేయడానికి ఎంత గొప్ప ఆధ్యాత్మిక శక్తిని ఆయనలో నిల్వచేసిందో, ఆ శక్తిని తమ ద్వారా ఇతరులకు అందివ్వడానికి తమను ఎంత అద్భుతమైన పరికరంగా రూపొందించిందో - ఈ విషయాలన్నీ జగజ్జనని, ఆయనకు దర్శింపచేసింది. ఒక వంక బయటి ప్రపంచంలో ఆధ్యాత్మికత పూర్తిగా కొరవడడం చూసీ, మరో వంక ఆ కొరత తీర్చడానికి ఆమె అనుగ్రహం వలన తమలో అద్భుత ఆధ్యాత్మిక శక్తి సంచితం కావడం గుర్తించీ శ్రీరామకృష్ణులు ఆశ్చర్య చకితులైనారు.

46. 'నేను జగజ్జనని సామ్రాజ్యంలో కార్యనిర్వహణాధికారిని. గందరగోళం చెలరేగిన చోట్ల శాంతి నెలకొల్పవలసి వస్తుంది' -అని శ్రీరామకృష్ణులు గ్రహించడం

ప్రస్తుత యుగంలో జగజ్జనని మరొకసారి అజ్ఞాన మోహరూపంలో విచ్చలవిడిగా చెలరేగుతున్న రక్తబీజ రాక్షసుణ్ణి వధింప రణరంగంలో కాలు మోపిందని గ్రహించడానికి ఆయనకు ఎంతో కాలం పట్టలేదు; తల్లి అహేతుక కృపను లోకం మరొకసారి వీక్షించి తరిస్తుందనీ, అశేష కళ్యాణగుణమయి, అనంత కోటి బ్రహ్మాండ నాయిక అయిన జగజ్జననిని జయజయధ్వానాలతో స్తుతిస్తుందనీ ఆయన గ్రహించలేకపోలేదు. అత్యధిక ఉష్ణం మబ్బులను ఉత్పన్నం చేసేటట్లు, చీకటి తదనంతరం వెలుగు ప్రసరించేటట్లు, గడ్డుకాలం తరువాత సౌభాగ్యం కలిగే తీరుతుంది. అదే విధంగా ఎంతో కాలంగా ఆధ్యాత్మిక కొరతతో బాధపడుతున్న అసంఖ్యాక జనానీక అవసరం తీర్చడానికి జగజ్జనని అనంత కరుణ శ్రీ గురురూపంలో అవతరించి మానవులతో కలసిమెలసి జీవిస్తుంది. జగజ్జనని అనుగ్రహించి ఈ విషయాన్ని శ్రీరామకృష్ణులకు స్పష్టం చేసింది. ఇటువంటివి జరగడం ఇదే మొదటిసారి కాదనీ, ఇంతకు మునుపు ఎన్నోసార్లు ఆయనతో తాను అటువంటి లీలలు సలిపాననీ, భవిష్యత్తులోకూడా ఆయనతో ఆ లీల జరుగనున్నదనీ జగజ్జనని, ఆయన గ్రహించేలా చేసింది. పైగా సామాన్య జీవులలా ఆయనకు ముక్తి కలుగదు. ''జగజ్జనని విశాల సామ్రాజ్యంలో ఎక్కడెక్కడ శాంతిభద్రతలు కొరవడతాయో అక్కడక్కడకు రివ్వున వెళ్లి శాంతిభద్రతలు నెలకొనేట్లుచేసే కార్యనిర్వహణాధికారి'' ఆయన అని ఆమె సుస్పష్టం చేసింది. శ్రీరామకృష్ణుల వచనాల నుండి ఈ విషయాలన్నీ ఇప్పుడు మాత్రమే ఆయన గ్రహించారని తేటతెల్లమౌతున్నది.

'మతాలెన్నో మార్గాలన్ని' అనే మహోదార భావాన్ని లోకహితార్థం జగజ్జనని స్వయంగా తమలో జనింపచేసిందనే విషయాన్ని గ్రహించడంతోపాటు, శ్రీరామకృష్ణుల వివేచనాత్మక మనస్సు మరొక విషయం గురించి విచారణ చేయసాగింది. తమ మనశ్శరీరాలను ఆశ్రయించివున్న జగజ్జననినుండి ప్రత్యక్షంగా ఆ నవీన ఉదార భావాన్ని స్వీకరించి తదనుగుణంగా తమ జీవితాలను మలచుకొని ధన్యులు కానున్నవారు, అంతేగాక ఆమెనుండి శక్తిని కూడా పొంది ఈ ఆధునిక యుగంలో ఆమె సలుపుతున్న ఈ నవ్యలీలలో పాల్గొని, ఆ ఉదారభావాన్ని ప్రచారం చేసి అనేకులను కృతార్థులను గావించే వారు ఎవరో శ్రీరామకృష్ణులు తెలుసుకోవాలని ఆరాటపడ్డారు.

47. తమ అంతరంగ భక్తులను కలుసుకోవడానికి శ్రీరామకృష్ణులు ఆతురత చెందడం

శ్రీరామకృష్ణ - మథురానాథ్‌ల అనురాగ బాంధవ్యాన్ని విశదీకరిస్తున్న తరుణంలో, భావపారవశ్య స్థితిలో శ్రీరామకృష్ణులు భవిష్యత్తులో రానున్న తమ అంతరంగ భక్తులను చూశారనే విషయం మేం సూచనప్రాయంగా ప్రస్తావించి ఉన్నాం.[1] జగజ్జనని మార్మిక లీల వలన లోకంలో ఏ వస్తువుపట్లా అనురక్తి జనించని శ్రీరామకృష్ణుల మనస్సులో గతంలో అలా చూసిన ఆ భక్తుల ముఖాలు ఇప్పుడు ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ కానరాసాగాయి. ఆ అద్భుత యతివరేణ్యుల మనస్సు ఇప్పుడు సదాసర్వదా ఈ విషయాలను పదేపదే చింతన చేయడంలోనే లగ్నమైంది: 'అలా రానున్న భక్తులు ఎందరై ఉంటారు? వారి నెప్పుడు తమ వద్దకు అమ్మ తోడ్కొని వస్తుంది? వారిలో ఎవరి ద్వారా అమ్మ ఏ ప్రత్యేక కార్యం చేయించనున్నది? తనలా అమ్మ వారినికూడా సన్న్యాసులుగా తీర్చిదిద్దుతుందా? లేదా వారు గృహస్థులుగానే ఉండిపోతారా? ఆ రానున్న భక్తులలో కనీసం ఒక్కరైనా జగజ్జనని లీలను సమగ్రంగా అవగతం చేసుకోగలరా? లేదా వారి జీవితకాలంలో ఆ లీలను పాక్షికంగా మాత్రమే అవగాహన చేసుకోగలరా? ఎందుకంటే, ఇప్పటి వరకు జగజ్జనని అద్భుత లీలను అర్థం చేసుకొన్నవారు ఏ కొద్దిమంది మాత్రమే ఉన్నారు.' పై విషయాలనే యోచిస్తూ ఆయన రోజులు గడిపివేస్తున్నారు.

దీనిని గురించి ఆయన ఇలా చెప్పేవారు: ''అప్పుడు మిమ్మల్నందరినీ చూడాలనే చెప్పనలవిగాని వ్యాకులత ననుభవించేవాణ్ణి. తడి తువ్వాలును పిండుతూన్నట్లు ఎవరో హృదయాన్ని పిండివేస్తూన్న బాధతో అశాంతికి గురయ్యేవాణ్ణి. వెక్కి-వెక్కి ఏడ్వాలనిపించేది. కాని లోకులు ఏమనుకొంటారోనని అలా

---

1. III. 7.33



డాబా

ఏడ్వలేకపోయేవాణ్ణి; ఏదో రకంగా నన్ను అదుపులో ఉంచుకొనేవాణ్ణి. కాని పగలు గడిచిపోయి, రాత్రి సమీపించి కాళికాలయంలో, విష్ణ్వాలయంలో హారతి సంగీతం వినరాగానే, ఇక నన్ను నేను అదుపులో ఉంచుకోలేకపోయేవాణ్ణి. 'అయ్యో, మరో రోజు గడిచిపోయింది, వాళ్లు ఇంకా రాలేదు' అనుకొనేవాణ్ణి. ఆలయ యజమానుల భవంతి డాబా (కుఠీ) మీది కెక్కి, బిగ్గరగా, 'నాయన లారా! మీరంతా ఎక్కడున్నారు?' అంటూ కేకలు పెట్టేవాణ్ణి. పిచ్చివాణ్ణి అయిపోతానేమో ననిపించేది. పిదప, సుదీర్ఘ నిరీక్షానంతరం మీరు ఒక్కొక్కరుగా రాసాగారు. అప్పుడే నా మనస్సు కుదుటపడింది. మిమ్మల్ని ఇంతకు మునుపే చూసివున్నాను కనుక, మీరు రావడంతోనే గుర్తించగలిగాను. పూర్ణుడు (పూర్ణచంద్ర ఘోష్) వచ్చినప్పుడు, అమ్మ, 'ఇతడి రాకతో నువ్వు (భావపారవశ్యంలో) చూసిన భక్తు లందరూ రావడం పూర్తయింది. ఈ కోవకు చెందిన భక్తులు ఇకమీదట రారు' అని తెలిపింది. మిమ్మల్నందరినీ అమ్మ నాకు చూపించి, 'వీరంతా నీ అంతరంగ భక్తులు' అని చెప్పింది. అద్భుత దర్శనం, అద్భుతంగా ఈడేరింది!'' (శ్రీరామకృష్ణుల ఈ వచనాల ప్రగాఢ అర్థాన్ని ఎవరు అవగతం చేసుకోగలరు! ఇవి మాలో ఎవరూ కల్పించిన మాటలు కావని స్పష్టం చేయడంకోసమే సాక్షాత్తు శ్రీరామకృష్ణుల వచనాలనే ఇక్కడ పొందుపరిచాం.

48. అంతరంగ భక్తులు వచ్చి తీరాలనే శ్రీరామకృష్ణుల ప్రగాఢ విశ్వాసం

తమ ఉదార మతాన్ని అర్థం చేసుకొని, స్వీకరించగల భక్తులను సమీకరించుకొంటున్నప్పుడు ఆయనకు కలిగిన మరొక నమ్మకాన్ని గురించి అప్పుడప్పుడు స్వయంగా ఆయనే మాతో ఇలా చెప్పేవారు: ''ఈ లోకంలో అంతిమ జన్మను అనుభవిస్తున్న వారందరూ ఇక్కడకు వస్తారు; ఎవరు భగవంతుణ్ణి కనీసం ఒక్కసారైనా నిజంగా ప్రార్థించి ఉంటారో, వారంతా ఇక్కడకు వచ్చి తీరాలి.'' గురుదేవుల పై వచనాలు విన్న వారి మనస్సులలో ఎన్నో రకాల ఆలోచనలు చెలరేగాయి. అవి ఏమిటో వివరించడం ఎంతో కష్టం. ఆయన నమ్మకం పూర్తిగా యుక్తియుక్తం కాదనే నిర్ణయానికి కొందరు వచ్చారు. అసంబద్ధ ప్రలాపమని కొందరు నిర్ణయించారు. మరికొందరు దాన్లో ఆయన అహంకారం వ్యక్తమౌతూందన్నారు; కొందరు ఆయనకు మతి చెడిందన్నారు. కొందరు తాము అర్థం చేసుకోలేకపోయినా శ్రీరామకృష్ణులు చెబుతున్నారు కనుక అవి నిజమై తీరాలి అనుకొన్నారు. కాబట్టి యుక్తి తర్కాలతో వాటిని సమర్థించడం విశ్వాసానికి హాని వాటిల్లచేస్తుందని తలచి ఆ వచనాలను సూక్ష్మంగా తరచి చూడడానికి నిరాకరించారు. 'గురుదేవులు స్పష్టంగా వాటిని వివరించినప్పుడే అర్థం చేసుకొంటా'మని కొందరు భావించారు. అందుకే వాటిని నమ్మడమో లేదా నమ్మకపోవడమో రెండూ చేయకుండా, వాటిని గురించి వాదించే ఇరుపక్షాల వారి వాదాలను నిర్లిప్తంగా వింటూ ఉండిపోయారు.

కాని అహంకారం కించిత్తు అయినా లేకపోవడమే శ్రీరామకృష్ణుల సహజ స్వభావం కావడం వలననే, జగజ్జనని తన ఉదార భావాన్ని ఆయనకు అనుభవైకవేద్యం చేసిందనీ, యథార్థమైన ఆచార్య పదవిలో ఆయనను సుప్రతిష్ఠితులను గావించిందనీ - అనే విషయాన్ని కనుక మేం పాఠకులకు అవగతం చేయించగలిగితే, ఆయన పై వచనాల అర్థాన్ని అవగాహన చేసుకోవడం అంత కష్టమేమీ కాబోదు. అంతే కాదు. ఆ వచనాలను మరింత తరచి చూసినప్పుడు ఎంత అలవోకగా, స్వాభావికంగా శ్రీరామకృష్ణులు అత్యున్నత ఆధ్యాత్మిక అవస్థను సంతరించుకోగలరనే విషయం పాఠకులు నిదర్శనపూర్వకంగా గ్రహించవచ్చు.

జగజ్జనని బిడ్డయైన శ్రీరామకృష్ణులు తమ మనశ్శరీరాలను పరికించి చూసినప్పుడు, వాటిలో నిహితమైవున్న అపూర్వ ఆధ్యాత్మిక శక్తీ, దానిని ఇతరులకు ఒసగే సామర్థ్యమూ తమ స్వీయప్రయత్నం వలన లభించాయని ఆయన ఎన్నడూ, క్షణమాత్రం సైతం భావించింది లేదు. తన మార్మిక రీతిలో జగజ్జనని సలుపుతున్న లీలావిలాసమే వాటికి కారణమని కనుగొని

49. జగజ్జననికే పూర్తిగా పరాధీనులై ఉండడం వలననే శ్రీరామకృష్ణులకు ఆ నమ్మకం కలిగింది

శ్రీరామకృష్ణులు ఆశ్చర్యచకితులైనారు. అఘటనాఘటన సమర్థురాలైన జగజ్జనని విద్యావిహీనులైన ఆయన మనశ్శరీరాలను ఆశ్రయించి ఎంత బ్రహ్మాండమైన లీలావిలాసాన్ని సలుపుతున్నదో కదా! మూగవాణ్ణి వాచాలునిగా మార్చి, కుంటివాడిచేత పర్వతాలనే అధిరోహింపచేసి లోకాలన్నిటిచేత స్తుతింప బడిన ఆమె పూర్వకాల లీల లన్నిటినీ ఈ ప్రస్తుత లీల వేయి రెట్లు అధిగ మించిందనడం అతిశయోక్తి కాబోదు! ఈ లీల మూలంగా వేదాలు, బైబిల్, పురాణాలు, కొరాన్, తదితర ధర్మశాస్త్రాలన్నీ సత్యాలుగా ఋజువైనాయి; ధర్మం మళ్లీ ప్రతిష్ఠితమైంది, ఇంతకు మునుపు మరెవరి వలనా ఈడేరని ప్రపంచ ఆవశ్యకత శాశ్వతంగా తీరింది. 'జయం, తల్లీ, జయం! లీలామయి యైన బ్రహ్మశక్తికి జయం!' ఆ దర్శన ఫలితంగా ఇటువంటి ఆలోచనలే ఆయన మనస్సులో మెదలేవి. జగజ్జనని మాటల, అనంత కరుణ, మార్మికశక్తిపట్లగల ప్రగాఢ విశ్వాసం కారణంగా ఆ దర్శనాన్ని (ఆ అనుభూతిని) శ్రీరామకృష్ణులు సంపూర్ణ సత్యంగా గ్రహించారు. అలా విశ్వసించి తల్లి ఆ లీలకు ఆస్కారం ఎంతవరకు ఉన్నదో, దానికి దోహదం చేసేవారెవరో, ఆ శక్తి బీజాన్ని ఎటువంటి వ్యక్తుల హృదయాలలో నాటాలో అనే ప్రశ్నలను తల్లిని అడిగి, జవాబుగా రానున్న తమ అంతరంగ భక్తులను భావపారవశ్య స్థితిలో దర్శించారు; అట్లే ఎవరికి ఈ జన్మ చివరిదో, ఎవరు భగవంతుణ్ణి మనసారా ఒక్కసారైనా ప్రార్థించారో, అటువంటి వారు మాత్రమే తమ ద్వారా జగజ్జనని వెల్లడించిన నవీన మహోదారభావాన్ని స్వీకరింప అర్హులని తెలుసుకొన్నారు. జగజ్జననికే పూర్తిగా పరాధీనులై ఉన్నందున శ్రీరామకృష్ణులు ఆ నిర్ణయానికి రాగలిగారు. తల్లి మీదనే పూర్తిగా ఆధారపడిన బాలుడు తల్లి నిర్ణయానికి కాక మరే నిర్ణయానికి రాగలుగుతాడు? జగజ్జనని మీదనే అలా పూర్తిగా ఆధారపడి ఉండడం వలననే శ్రీరామకృష్ణుల మనస్సులో అహంకారం జాడమాత్రంగా కూడా చోటుచేసుకోలేదు.

''ఎవరికి ఇది చివరి జన్మో వారు 'ఇక్కడికి' వచ్చి తీరాలి'', ''ఒక్క-

50. శ్రీరామకృష్ణుల పై వచనాల తాత్పర్యం

సారైనా ఎవరు హృదయపూర్వకంగా భగవంతుణ్ణి ప్రార్థించారో వారు 'ఇక్కడికి' వచ్చి తీరాలి'' - ఈ వచనాలలోని 'ఇక్కడికి' అనే పదానికి 'జగజ్జనని నవీన ఉదార మతం' (మతాలన్నీ సత్యాలే అనే మతం) అని అర్థం చేసుకొంటే, అప్పుడది యుక్తియుక్తంగా ఉండి, ఎవరూ అభ్యంతరం తెలుపరు. 'ఇక్కడికి' అనే పదానికి పైన చెప్పినట్లు అర్థం చేసుకొన్న తక్షణమే మరో ప్రశ్న తలెత్తక మానదు. 'ఎన్ని మతాలో అన్ని

మార్గాలు' అనే జగజ్జనని ఆ ఉదార మతాన్ని వారు (ఆంతరంగిక శిష్యులు) తమంతట తామే స్వీకరిస్తారా? లేదా ఎవరిని జగజ్జనని (అంటే శ్రీరామకృష్ణులను) పరికరంగా చేసుకొని ప్రప్రథమంగా లోకంలో ఈ ఉదార మతాన్ని ప్రకటించిందో ఆయన తోడ్పాటుతో మాత్రమే వారు దానిని స్వీకరిస్తారా? - ఇదే ఆ ప్రశ్న. మాకు తెలిసినంత వరకు పై ప్రశ్నకు జవాబు: పైన పేర్కొన్న ఆ ఉదార మతాన్ని పరిపూర్ణంగా అనుభూతం చేసుకొన్న తరువాతే పై విషయాన్ని నిర్ణయించడం సబబు. అలా ప్రత్యక్షానుభూతి పొందనంత వరకు మౌనం వహించడమే ఉత్తమం.

అయినా పాఠకుడు మా నిర్ణయాన్ని తెలుసుకోగోరితే మేం ఇలా చెప్ప వలసివస్తుంది: పై భావాన్ని సక్రమంగా అనుభూతం చేసుకోగలిగినప్పుడు, దాంతోపాటు అదే సమయంలో జగజ్జనని ఎవరిని ప్రప్రథమంగా ఈ లోకం లోకి ఆ ఉదారభావ మూర్తిగా చేసి తీసుకొని వచ్చిందో ఆయన (శ్రీరామ కృష్ణులు) దర్శనం కూడా నీకు కలిగే తీరుతుంది; అప్పుడు నీ అంతట నువ్వే ఆ మూర్తి పావన సన్నిధిలో నీ భక్తిప్రపత్తులను గుమ్మరిస్తావు; అలా చేయమని అయన నిన్ను స్వాధికారంతో అడుగరు, ఇతరు లెవరూ అలా చేయమనీ చెప్పరు. కాని జగజ్జనని పట్ల నీకున్న భక్తే నీ చేత అలా చేయిస్తుంది. దీన్ని గురించి మరింత విపులీకరించవలసిన అవసరం లేదు.

జగజ్జనని సంకల్పంతో ఎవరిలో ఈ గురుభావం సహజావస్థగా మారుతుందో, అంటే వారి వ్యక్తిత్వం ఆ గురుభావ ఘనీభూతరూపాన్ని సంతరించు కొంటుందో, అటువంటి వారి ప్రవర్తన - తినడం, తిరగడం, కార్యకలాపాలు, ఇతరులపై అహేతుక కరుణ చూపడం - యావత్తు మనిషి బుద్ధికి గ్రాహ్యంకాని రీతిలో ఉంటుందని భారతీయ తాంత్రికాచార్యులు పదేపదే వక్కాణించిపోయారు. ఆ విధంగా అభివ్యక్తమయ్యే గురుభావాన్ని తంత్రాలు 'దివ్యభావం' అని పేర్కొంటాయి. అలాగే ఆ దివ్యభావంలో సుప్రతిష్ఠితులైనటువంటి గురువులు, శిష్యుల కిచ్చే మంత్రదీక్ష, బోధనా పద్ధతులుకూడా శాస్త్రాల విధి నియమాలను ఉల్లంఘించి, అనూహ్య రీతులలో ఉంటాయి. వారు కనుక కరుణిస్తే ఎవరిలోనైనా గాని కేవలం సంకల్పంతో లేదా స్పర్శతో ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేసి, తక్షణమే వారిని సమాధిమగ్నులను గావించగలరు. లేదా ఇంకా పరిపక్వం చెందని శిష్యులలో పాక్షికంగా ఆ శక్తిని జాగృతం చేసి, కొంతకాలం గడిచాక ఆ శక్తి రగుల్కొనేలా చేసి ఈ జీవితంలోనే వారు ఆత్మసాక్షాత్కారం పొందేలా అనుగ్రహింప సమర్థులు.

51. దివ్యభావం : దాని అర్థం

మంత్రదీక్ష గురించి తంత్రాలు ఇలా వచిస్తున్నాయి: గురుభావం కొద్దిగా మాత్రమే తీవ్రంగావున్న స్థితిలో గురువు, శిష్యుడికి 'శాక్తీ' దీక్షను ఒసగుతాడు. అదే గురుభావం అత్యంత తీవ్రమైన స్థితిలో (దీనికే 'దివ్యభావం' అని పేరు) 'శాంభవీ' దీక్షను ఇవ్వగలడు. సామాన్యులైన గురువులు 'మాంత్రీ లేదా ఆణవీ' దీక్షను మాత్రమే ఒసగాలని తంత్రాలు నిర్దేశిస్తున్నాయి.

'శాక్తీ', 'శాంభవీ' దీక్ష విధానాలను గురించి రుద్రయామల, షడన్వయ మహారత్న, వాయవీయ సంహిత, సారదా, విశ్వసార మొదలైన తంత్రశాస్త్రాలు ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నాయి. ఈ సందర్భంలో వాయవీయ సంహిత నుండి కొన్ని శ్లోకాలను ఈ క్రింద ఉదహరిస్తున్నాం.

శాంభవీ చైవ శక్తీ చ మాంత్రీ చైవ శివాగమే ।
దీక్షోపదిశ్యతే త్రేధా శివేన పరమాత్మనా ॥

గురోరాలోకమాత్రేణ స్పర్శాత్ సంభాషణాదపి ।
పద్యః సంజ్ఞా భవేత్ జంతోః దీక్షా సా శాంభవీ మాతా ॥

గురుణా జ్ఞానమార్గేణ క్రియతే జ్ఞానచక్షుషా ।
మాంత్రీ క్రియావతీ దీక్షా కుంభమండలపూర్వికా ॥

(వీటి తాత్పర్యం క్రింద చూడండి)

52. శాంభవీ దీక్ష : శాక్తీ దీక్ష

'శాంభవీ', 'శాక్తీ', 'మాంత్రీ' అని మంత్రదీక్ష విధానాలు మూడు రకాలని పరమాత్ముడైన శివుడు తంత్రశాస్త్రాలలో బోధించి ఉన్నాడు. శ్రీ గురువు దర్శనంతో, స్పర్శనంతో లేదా సంభాషణ (ప్రణామాదులు) చేసిన క్షణానే జీవుడిలో జ్ఞానోదయం కలుగుతుంది. దీనినే శాంభవీ దీక్ష అని పేర్కొంటారు. రెండవదైన శాక్తీ దీక్షలో బ్రహ్మజ్ఞానియైన గురువు తన జ్ఞానచక్షువు ద్వారా శిష్యుడిలో తన శక్తిని ప్రవేశింపచేసి, అతడిలో ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేస్తాడు. ఇక మూడవదైన మాంత్రీ దీక్షలో మండలం రచించడం, ఘటాన్ని ప్రతిష్ఠాపించడం, దేవతను పూజించడం వంటి క్రియలు ముగించాక గురువు, శిష్యుడి చెవిలో మంత్రాన్ని ఉపదేశిస్తాడు.

శాక్తీ, శాంభవీ దీక్షలు తక్షణ ముక్తిని ప్రసాదిస్తాయని రుద్రయామల తంత్రం వచిస్తున్నది:

సిద్ధైః స్వశక్తిమాలోక్య తయా కేవలయా శిశోః ।
నిరుపాయం కృతా దీక్షా శాక్తేయా పరికీర్తితా ॥

అభిసిద్ధిం వినాచార్య శిష్యయోరుభయోరపి ।
దేశికానుగ్రహేణైవ శివతా వ్యక్తికారణీ ॥

అంటే ఏ బాహ్యమైన తోడ్పాటు లేకుండా కేవలం తమ ఆధ్యాత్మిక శక్తి తోడ్పాటుతో మాత్రమే సిద్ధపురుషులు శిష్యులలో దివ్య జ్ఞానోదయం కల్పిస్తారో, అటువంటి దీక్షను 'శాక్తీ' దీక్షగా పేర్కొంటారు. 'శాంభవీ' దీక్షలో ఇవ్వాలనే, పుచ్చుకోవాలనే ఏ ఆకాంక్ష గురుశిష్యు లిద్దరిలో ఉండనే ఉండదు. కాని పరస్పరం కలుసుకొన్న తక్షణమే ఆచార్యుని హృదయంలో కరుణ పొంగి పొరలగా, శిష్యుణ్ణి అనుగ్రహించాలని గురువు తహతహ చెందుతాడు. అటువంటి సంకల్పం మెదలగానే మరుక్షణమే శిష్యుడిలో అద్వైతజ్ఞానం ఉదయిస్తుంది; అతడు శిష్యరికాన్ని అంగీకరిస్తాడు.

53. అటువంటి దీక్షలకు యుక్తాయుక్త కాల నియమం పాటింప నవసరంలేదు

శాంభవీ, శాక్తీ దీక్షలను ఒసగడానికి యుక్తాయుక్త కాలనియమం చూడవలసిన అవసరం లేదని పురశ్చరణోల్లాస మనే తంత్రం వచిస్తున్నది.

దీక్షాయుం చంచలాపాంగి న కాలనియమః క్వచిత్ ।
సద్గురోః దర్శనాదేవ సూర్యపర్వే చ సర్వదా ॥

శిష్యమాహూయ గురుణా కృపయా యది దీయతే ।
తత్ర లగ్నాదికం కించిత్ న విచార్యం కదాచన ॥

ఓ పార్వతీదేవీ! వీరభావంలో, దివ్యభావంలో ప్రతిష్ఠితులైన గురువుల నుండి దీక్ష స్వీకరించడానికి కాలాకాల విచారణ చేయనవసరం లేదు. సద్గురు దర్శనం లభించిన మరుక్షణమే, శిష్యుణ్ణి అనుగ్రహించి గురువు పిలవగానే శుభ ముహూర్తమా కాదా అనే విచారణ చేయకుండానే దీక్షను స్వీకరించాలి.

దివ్యభావం సంతరించుకొన్న సామాన్యులైన గురువుల గురించే శాస్త్రాలు ఔపచారికంకాని విధానాన్ని నిర్దేశిస్తున్నప్పుడు దివ్యపురుషులైన శ్రీరామకృష్ణులను గురించి వేరే చెప్పాలా? జగజ్జననికి సర్వదా పరికర మాత్రులై అహేతుక దయాసింధుత్వంతో ఆయన ఇతరులకు ఏ విధంగా బోధించాలో, ఇతరులలో ఏ విధంగా ఆధ్యాత్మిక శక్తిని ప్రసరింప చేయాలో ఎవరైనా ఎలా నిర్ణయించగలరు? ఎందుకంటే, శ్రీరామకృష్ణుల మనశ్శరీరాలను ఆశ్రయించి, అనుగ్రహంతో జగజ్జనని సలుపుతున్న ఆ లీల, తంత్రాలలో పేర్కొన్న దివ్య భావంలో సలుపుతున్న సాధారణమైన లీల వంటిది మాత్రం కాదు కనుక.

54. దివ్యభావమూర్తులైన సద్గురువులలో శ్రీరామకృష్ణులు సర్వశ్రేష్ఠులు

పైగా కేవలం ఏ వ్యక్తిగత శిష్యుడి హితంకోసం కాక, సమస్త మానవకోటి హితం కోసం జగజ్జనని ఆయన ద్వారా అప్పుడు 'ఎన్ని మతాలో, అన్ని మార్గాలు' అనే మహోదార భావాన్ని అభివ్యక్తం చేస్తూన్నది; దివ్యభావం సంతరించు కొన్న ఏ ఆధ్యాత్మిక గురువూ అప్పటి దాకా ఆ మహోదార మతాన్ని అనుస రించిందీలేదు, అనుభూతం చేసుకొన్నదీ లేదు. కాబట్టే ఇప్పటి నుండి శ్రీరామకృష్ణుల జీవితంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైందని మేం చెప్పాం.

55. అవతార పురుషులలో శక్త్యభివ్యక్తీకరణ

శ్రీరామకృష్ణుల పట్ల భక్తిప్రపత్తులున్న పాఠకుడు మా పలుకులు విని ఒకింత చిరాకు కనబరచి ఇలా అనవచ్చు: ''మీరు చెబుతున్నదంతా ఏమిటి? శ్రీరామకృష్ణులు అవతార పురుషులని మీరు పరిగణించినప్పుడు, ఆయనలో పైన పేర్కొన్న ఆ దివ్యభావం లేదా ఆధ్యాత్మిక శక్తి సదాసర్వదా నెలకొని ఉండలేదని చెప్పడం సబబేనా?'' అందుకు మా సమాధానం: ''సోదరా, శ్రీరామకృష్ణుల వచనాల ప్రమాణంతోనే మేం అలా చెప్పాం. మానవ దేహాన్ని దాల్చినప్పుడు, అవతారపురుషులలో సైతం అన్ని రకాల దివ్యభావాలు లేదా దివ్యశక్తులు సదా సర్వవేళలా అభివ్యక్తం కావు. ఒక ఫలానా భావం లేదా శక్తి అవసరమైనప్పుడే వారిలో అది అభివ్యక్తమౌ తుంది. కాశీపూర్ ఉద్యానగృహంలో కంఠవ్రణం వ్యాధితో పోరాడి శ్రీరామ కృష్ణుల దేహం వట్టి ఎముకల గూడుగా శుష్కించిపోయినప్పుడు ఆ దివ్య భావం, శక్తి తమలో అభివ్యక్తమవడం గుర్తించి, ఆయన మాతో ఇలా చెప్పారు: ''దీనిలోకి (అంటే ఆయన శరీరంలోకి) ఇకమీదట ఎవరినీ స్పృశించ నవ సరంలేని శక్తి వచ్చిందని అమ్మ నాకు చూపుతున్నది. స్పృశించమని మీతో చెప్పినా చాలు, మీరు స్పృశించగానే ఇతరులలో ఆధ్యాత్మికత జాగృతమౌ తుంది. ఈసారి కనుక అమ్మ దీనిని (తమ రోగాన్ని) నయం చేసిందంటే, ఇక ఇక్కడకు వచ్చే జనాన్ని అరికట్టడం మీకు అసాధ్యమౌతుంది. ఆ అరికట్టే ప్రయత్నంలో మీరు పడ్డ శ్రమకు ఫలితంగా జనించే ఒంటి నొప్పులు పోగొట్టుకోవడానికి మందులు పుచ్చుకోవలసి ఉంటుంది.'' అప్పటి వరకు అభివ్యక్తం కాని శక్తిని తమలో ఆయనప్పుడు సంతరించుకొన్నారనే విషయం ఆయన పై వచనాల నుండి స్పష్టంగా తెలుస్తోంది. ఇటువంటి అనేక ఉదాహర ణాలు చూపవచ్చు.

దివ్యభావ ప్రేరితులై పైన పేర్కొన్నట్లు శ్రీరామకృష్ణులు పరమ వ్యాకు లతతో రానున్న తమ భక్తులను కేవలం కేకలుపెట్టి పిలవడంతోనే ఉపశమనం పొందలేదు. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో వసిస్తూన్నారనే సమాచారం

బెల్ఘారియా ఉద్యానవనానికి చేరితే, ఆయన దక్షిణేశ్వరంలో బసచేసి ఉన్నారనే

56. శ్రీరామకృష్ణులు : కేశవచంద్రసేన్, తదితర భక్తులు

సంగతి అక్కడ నుండి దాదాపు అందరి భక్తులకూ అందుతుందనే విషయం జగజ్జనని శ్రీరామకృష్ణుల హృదయాంతరాళాలలో తెలిపి, ఆయనను అక్కడకు తోడ్కొనిపోయి శ్రీ కేశవచంద్రసేన్‌తో పరిచయం గావించింది. ఈ సంఘటన జరిగిన కొద్ది కాలంలోనే శ్రీరామకృష్ణుల విశేష కృపకు పాత్రులైన పూర్వం ఆయన భావపారవశ్యంలో చూసిన వివేకానందస్వామి, బ్రహ్మానందస్వామి మొదలైన భక్తులు ఒక్కరొక్కరుగా రాసాగారు. దివ్యభావంలో శ్రీరామకృష్ణులు ఈ భక్తులతో సలిపిన లీల కథనాన్ని ఆయన కనుక మాచే చెప్పించ గోరితే, మరో సందర్భంలో అలాగే చేస్తాం. కాని ఇప్పుడు మాత్రం అపూర్వ దివ్యభావ ప్రభావంలో తమ భక్తులతో 1885వ సం॥ రథయాత్ర ఉత్సవ దినాలలో కొన్ని రోజులు గడిపిన వృత్తాంతం పాఠకులకు తెలిపి, 'గురుభావం' అనే ఈ భాగాన్ని ముగించబోతున్నాం.

5. భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు: 1885వ సం॥ నవయాత్రోత్సవం

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।
కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥

-*గీత. 9.31*

[నన్ను ఆశ్రయించిన వాడు (మునుపు ఘోరపాపాత్ముడై ఉన్నప్పటికీ) సత్వరమే ధర్మాత్ముడౌతాడు, శాశ్వతశాంతిని పొందుతాడు. ఓ అర్జునా, నా భక్తుడు ఏనాడూ చెడిపోడని ఢక్కా మ్రోగించి చాటిచెప్పు.]

భావముఖంలో సుప్రతిష్ఠితులైన శ్రీరామకృష్ణుల అద్భుత వ్యక్తిత్వాన్ని ఏ కొంచెమైనా అవగతం చేసుకోగోరితే, భక్తుల సాంగత్యంలో ఆయన మెలిగే తీరును గమనించవలసి ఉంటుంది. వివిధ ప్రవృత్తులు గల భక్తులతో అనునిత్యం ఆయన ఎలా కలసిమెలసి తిరిగేవారో, ఎలా మాట్లాడేవారో, తమాషాగా వ్యవహరించేవారో, భావపారవశ్యంలో ఎలా ప్రవర్తించేవారో నిశితంగా పరిశీలించి, అనుపానులను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే ఆ దివ్యలీల మార్మికత కించిత్తు అవగతమౌతుంది. భక్తుల సాంగత్యంలో ఆయన సలిపిన అటువంటి ఒక లీల కథనం ఇక్కడ పాఠకులకు విశదీకరిస్తున్నాం.

1. శ్రీరామకృష్ణులలో దివ్య, మానవ ప్రవృత్తుల సామరస్యం

మేం గమనించినంత మేరకు ఈ అద్భుత మహాపురుషుని అతిసామాన్యమైన చేతలు సైతం ధ్యేయరహితాలై, ప్రయోజనరహితాలై ఉండలేదు. ఒకే వ్యక్తిలో దివ్య, మానవ నైజాలు ఇంత అద్భుత సామరస్యంలో మేళవించి ఉండడం ఎంతో అరుదైన విషయం. గత ఇరవై ఐదు సంవత్సరాల కాలంలో ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో మేం పర్యటించినప్పుడు కూడా అటువంటి మరొక వ్యక్తి

మాకు తారసపడలేదు. ''పళ్లు (దంతాలు) ఉన్నంతవరకు వాటి విలువ తెలుసుకోలే''మనే సామెత ఒకటి ఉంది. శ్రీరామకృష్ణులకు సంబంధించినంత వరకు మా విషయంలో ఈ సామెత నిజమైంది. కంఠవ్రణంతో బాధపడు తున్నప్పుడు చికిత్స నిమిత్తం శ్రీరామకృష్ణులను శ్యాంపుకూర్‌కు తోడ్కొని వచ్చినప్పుడు, ఒక రోజు ఆయనను దర్శింపవచ్చిన శ్రీ విజయకృష్ణ గోస్వామి మాతో ఇలా చెప్పారు:

2. విజయకృష్ణ గోస్వామి దివ్య దర్శనం పొందడం

కొన్ని రోజుల క్రితం ఢాకాలో బసచేసి ఉన్నప్పుడు గది తలుపులన్నీ మూసి విజయకృష్ణ గోస్వామి ధ్యానానికి కూర్చున్నాడు. ఆతడి కప్పుడు శ్రీరామకృష్ణుల దివ్యదర్శనం కలిగింది. తాను చూస్తున్నది నిజమో లేక భ్రమో అని తేల్చుకోవడానికి తన ముందు కానవస్తున్న మూర్తి అవయవాలన్నిటిని ఆతడు పదేపదే తడివి చూశాడు. ఈ సంఘటనను గురించి బాహాటంగా ఆ రోజు గురుదేవుల వద్ద, మా వద్ద విజయకృష్ణ గోస్వామి ప్రస్తావించాడు. విజయ్ ఇలా చెప్పాడు: ''దేశంలో వివిధ ప్రాంతాలలో పర్యటించాను; కొండలు పర్వతాలు తిరిగి ఎందరో మహాత్ములను సందర్శించాను. కాని ఇటువంటి (శ్రీరామకృష్ణులను చూపుతూ) వారిని నే నెక్కడా చూడలేదు. కొన్ని చోట్ల రెండణాలు, మరి కొన్ని చోట్ల ఒక్క అణా, కొన్నిచోట్ల ఒక్క కాణీ, మరికొన్నిచోట్ల ఒక్క దమ్మిడీ (ఆధ్యాత్మికశక్తి) కనిపించింది. చివరకు కనీసం నాలుగు అణాలు కూడా ఎక్కడా కనిపించలేదు. కాని ఇక్కడో, పూర్తిగా పదహారణాలు! పరిపూర్ణ ఆధ్యాత్మికశక్తి ఇక్కడ మాత్రమే అభివ్యక్తమౌతున్నది.'' శ్రీరామకృష్ణులు నవ్వుతూ, ''అతడు ఏమంటున్నాడు?'' అని మమ్మల్ని అడిగారు. అందుకు విజయ్ ఇలా జవాబిచ్చాడు: ''మిమ్మల్ని ఢాకాలో దర్శించాను, మీరు 'అసంభవం' అన్నా మీ మాటను నమ్మను. ఇంత సునాయాసంగా (అందరికీ) లభించే మీ రింత గందరగోళాన్ని సృష్టించారు. దక్షిణేశ్వరం కలకత్తాకు అతి సమీ పంలో ఉంది; ఎప్పుడు కోరుకుంటే

విజయకృష్ణ గోస్వామి

అప్పుడు వచ్చి మిమ్మల్ని దర్శించుకోగలం. కావలసినన్ని పడవలు, గుర్రబ్బళ్లు లభించడం వలన ఏ ఇబ్బందీ లేకుండా ఇక్కడకు రావచ్చు. ఇంటి ప్రక్కనే మీ రింత సులభంగా లభిస్తున్నారు కనుకనే మీ విలువను మేం అర్థం చేసుకోలేకపోతున్నాం. మీరే ఏ పర్వత శిఖరం మీదో వసిస్తున్నారనుకోండి, ఎంతోదూరం నడిచి, తిండీ తిప్పా లేకుండా, చెట్లవ్రేళ్లను ఆసరగా పుచ్చుకొని పర్వతాన్ని అధిరోహించి చివరకు మీ దర్శనం చేసుకొన్నప్పుడు, బహుశా మీ విలువను అర్థం చేసుకుంటామేమో! కాని ఇప్పుడు అద్వితీయ మహాపురుషుడు ఇంత సామీప్యంలో వసించడం వలన, ఎక్కడో సుదూర ప్రాంతాలలో ఇంతకంటే గొప్ప మహాత్ములు ఉండివుంటారని మేం భ్రమపడుతూ వుంటాం. అందువలననే ఇక్కడికి అక్కడికి పరుగులుపెట్టి నిరంతర ప్రయాసలకు సిద్ధపడతాం.''

3. శ్రీరామకృష్ణుల అసాధారణ ప్రవర్తనకు భక్తులు స్పందించిన తీరు

పైన చెప్పింది ముమ్మాటికీ నిజం. కరుణార్ద్రహృదయులైన శ్రీరామకృష్ణులు తమ వద్దకు వచ్చిన దాదాపుగా యావన్మందినీ తమ సొంతవారిగా పరిగణించేవారు; ఒక్కసారి అలా పరిగణించిన తరువాత ఇక ఆయనను విడిచిపెట్టి వెళ్లడానికి ఆ భక్తులు ఎంత ప్రయత్నించినా, గురుదేవులు మాత్రం వారి సాంగత్యాన్ని విడిచిపెట్టలేకపోయేవారు. ఒక్కొక్కప్పుడు చిరునవ్వుతో, మరొకప్పుడు కఠోర శాసనంతో ఆ భక్తులు గత జన్మలనుండి సంచితం చేసుకొన్న సంస్కారాలనన్నీ తుడిచివేసి, తాము రూపొందించిన అనుపమాన మూసలలో వారిని కొంగ్రొత్తగా పోతపోసి వారికి శాశ్వత శాంతిని ప్రసాదించేవారు. భక్తులు తమ స్వీయ జీవిత కథలను దాపరికం లేకుండా విప్పి చెప్పినప్పుడు పై విషయం తేటతెల్లమౌతుంది. ఒకప్పుడు నరేంద్రుడు చెప్పనలవిగాని లౌకిక కష్టనష్టాలకు గురైనాడు; 'ఇంతకాలం నుండి తాను భగవంతుణ్ణే నమ్మి, శరణు వేడినప్పటికీ ఆయన కానరాలేదే? గురుదేవులు కూడా తన నిమిత్తం ఈ విషయంలో ఏమీ చేయలేదే!' అనుకొని అభిమానం దెబ్బతినగా చెప్పాపెట్టకుండా ఇల్లు విడిచి వెళ్లిపోవాలని తీర్మానించుకొన్నాడు. కాని శ్రీరామకృష్ణులు అతణ్ణి అలా చేయనివ్వలేదు. దివ్యశక్తితో నరేంద్రుడి ఉద్దేశం గ్రహించి, అతడికి ఎంతో నచ్చచెప్పి ఆ రోజు తమతో దక్షిణేశ్వరంలోనే బస చేయించారు. తరువాత అతణ్ణి ప్రేమపూర్వకంగా నిమురుతూ, భావావేశపరులై, ''ఓ రాయ్! (అంటే రాధా) నీతో మాట్లాడాలన్నా భయమే, మాట్లాడకుండా ఊరకే ఉండాలన్నా భయమే! నిన్నెక్కడ కోల్పోతానో అనే శంకతో నా మనస్సు భీతి చెందుతున్నది సఖీ!'' అనే గీతం పాడసాగారు శ్రీరామకృష్ణులు.

అనేక విధాల అనునయించి సంసార పరిత్యాగం చేయనివ్వకుండా నరేంద్రుణ్ణి తమవద్దే ఉంచుకోగలిగారు.

ఇక గిరీశ్ ఉదంతం: తన భారాన్నంతా (ముక్త్యారునామాను) గురుదేవులకు అర్పించి కృతార్థుడైనా కూడా తన పూర్వకర్మ సంస్కారాలను గుర్తుకు తెచ్చుకొని నిశ్చింతగా ఉండలేక ఎంతో భయపడుతున్న గిరీశ్‌చంద్ర ఘోష్‌ను చూసి అతడికి అభయప్రదానం ఇస్తూ శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "ఓ మందమతీ! నిన్ను పట్టుకొన్నది నీటిపాము అనుకొంటున్నావా? ఇది నాగుపాము. తప్పించుకొని కలుగులోకి పారిపోయినా చావక తప్పదు. నీటిపాములు కప్పలను పట్టుకొంటే వెయ్యిసార్లు బెకబెక మని అరిచి కప్పలు చావడం నువ్వు గమనించలేదా? కొన్ని తప్పించుకొని పారిపోవడం కద్దు. కాని నాగుపాము లేదా త్రాచుపాము పట్టుకొన్నదంటే మూడు బెకబెకలకే కప్ప చస్తుంది. ఎంతో అరుదుగా ఏదో ఒక కప్ప తప్పించుకొని పారిపోయినా, కన్నంలో దూరిన తక్షణమే చావడం తథ్యం. ఇక్కడి విషయం కూడా అటువంటిదే అని తెలుసుకో."

కాని శ్రీరామకృష్ణుల పలుకుల అర్థాన్ని, ఉద్దేశాన్ని, చేతలను అప్పుడెవరు అర్థం చేసుకోగలిగారు? శ్రీరామకృష్ణుల వంటి వ్యక్తులు సర్వత్రా ఉంటారని బహుశా అందరూ భావించి ఉంటారు. ఆయనలా ప్రతి ఒక్కరి చపలతలకు వినోదిస్తూ, కోరకుండానే వరాభయహస్తాలతో ఇంటింటికీ తిరిగే వ్యక్తులు సర్వత్రా ఉంటారని భావించడమే ఇందుకు కారణం. కరుణామయులైన శ్రీరామకృష్ణులు చూపే ఆప్యాయతానురాగాల తరుచ్ఛాయలో భక్తులు ఎంత ధైర్యాన్ని పొందేవారో, ఎన్ని గారాలు పోయేవారో, ఎంత సులభంగా వారి అభిమానం దెబ్బతినేదో చెప్పడం కష్టం! ఆధ్యాత్మికతను ఆచరణలో చూపడం ఏమంత కష్టమైన పని కాదని దాదాపు వారందరూ భావించారనడం అతిశయోక్తి కాదు. ఆధ్యాత్మిక జగత్తులో ఏ భావాన్నియైనా లేదా దివ్యదర్శనాన్ని అయినా తాము కోరినప్పుడల్లా, ఏ సమయంలోనైనా అనుభూతం చేసుకోగలమని వారికి రూఢి అయింది. శ్రీరామకృష్ణులను కాస్త ఆతురతతో దాని కోసం ప్రాధేయపడితే చాలు, వెంటనే ఆయన తమ స్పర్శతోనో లేదా ఆశీర్వాదంతోనో లేదా కేవలం సంకల్పంతోనో దానిని ప్రసాదించగలరు. అలా జరిగిన సంఘటనలు అనేకం. వాటి నన్నిటినీ పేర్కొనడం సాధ్యంకాదు.

4. స్వామి ప్రేమానంద: సమాధి స్థితి

కాలాంతరంలో ప్రేమానంద స్వామిగా పేర్కొనబడిన బాబూరాంకు భావసమాధి స్థితిని పొందాలనే ఆకాంక్ష కలిగింది. అతడు శ్రీరామకృష్ణుల వద్ద కెళ్ళి, "నాకు భావసమాధి స్థితి కలిగేట్లు చేయండి" అంటూ విలపిస్తూ, ఆయనను అర్థించాడు. అందుకు

ఆయన "సరే, అమ్మను అడుగుతాను. నాయనా, నా సంకల్పంతో ఏమైనా జరుగుతుందా?" అంటూ అతణ్ణి అనునయించారు. కాని శ్రీరామకృష్ణుల మాటలను అతడు వింటేే కదా! "నాకు భావసమాధి స్థితి కలిగేట్లు చేయండి?" అవే మాటలు బాబూరాం మళ్లీ వల్లించాడు. గురుదేవులను అలా అతడు ప్రార్థించిన కొన్ని రోజుల తరువాత ఏదో పని మీద తన స్వగ్రామమైన ఆంట్‌పూర్‌కు వెళ్లవలసి వచ్చింది. అది 1884వ సంవత్సరం. ఈలోపు శ్రీరామకృష్ణులు, బాబూరాంకు భావసమాధి స్థితి ఎలా కలుగుతుందా అని ఆందోళన చెందసాగారు. తారసపడ్డ వారందరితో ఆయన ఇలా చెప్పసాగారు: "ఊరికి వెళ్లేముందు బాబూరాం భావసమాధి కలగాలని ఏడుస్తూ అర్థించాడు. ఏం జరుగుతుందో? అతడికి భావసమాధి స్థితి కలుగకుంటే, అతడికి ఇక్కడి (అంటే తమ) మాటల మీద గురి ఉండదు." తదనంతరం ఆయన జగజ్జననిని, "అమ్మా, బాబూరాంకు కించిత్తు అయినా భావసమాధి స్థితి లేదా ఇతర ఆధ్యాత్మిక అనుభూతి ప్రాప్తించేలా చూడు" అని ప్రార్థించారు. అందుకు అమ్మ, "అతడికి భావం కలుగదు. జ్ఞానం ప్రాప్తిస్తుంది" అని జవాబిచ్చింది. జగజ్జనని ఆ వచనాలు వినగానే శ్రీరామకృష్ణులు మళ్లీ ఆందోళన చెందారు. మాలో కొందరితో తీవ్ర ఆందోళనకు గురైన వ్యక్తిలా ఇలా అన్నారు: "బాబూరాం అడిగిన విషయం అమ్మకు తెలిపాను. 'అతడికి భావం కలుగదు, జ్ఞానం ప్రాప్తిస్తుంది' అని అమ్మ చెప్పింది. కనీసం అదన్నా పొందితే, అతడి మనస్సు శాంతిస్తుంది, అదే పదివేలు. అతడికోసం ఎంతో దిగులుపడ్డాను. ఊరికి వెళ్లేముందు ఎంతగానో విలపించాడు." ఆహా! ఎలాగైనాసరే బాబూరాంకు ఏదో ఒక ఆధ్యాత్మికానుభూతి కలగాలని శ్రీరామకృష్ణులు పడిన ఆందోళన అంతింత కాదు! ఆందోళన ఉట్టిపడే స్వరంలో ఆయన, "అతడికి భావం కలుగకుంటే ఈ చోటి (తమ) మాట మీద అతడికి ఏమాత్రం గురి ఉండదు" అని మళ్లీ చెప్పారు. శ్రీరామకృష్ణుల జీవితం యావత్తు ఏదో బాబూరాం ఆయన మాటలను పట్టించుకోవడం లేదా పట్టించుకోకుండా ఉండడం మీదే ఆధారపడినట్లు ఆయన మాటలు ధ్వనించాయి.

అప్పుడప్పుడు ఆయన బాలభక్తుల గురించి ప్రస్తావిస్తూ, "సరేగాని, వీరందరికోసం అంతగా ఎందుకు ఆందోళన చెందుతానో తెలుసా? ఒకడు ఏం అనుభూతి పొందాడో మరొకడు ఏం పొందలేదో అని ఎందుకు యోచిస్తూ వుంటాను? వీళ్లంతా 'స్కూల్ బాయిస్'[1], దమ్మిడీ లేనివారు; ఒక చిల్లి కాణీ

---

1. ఈ పదాన్ని ఆంగ్లంలోనే ఉచ్చరించారు. ఆయనకు తెలిసిన కొన్నే ఆంగ్ల పదాలలో ఇదొకటి.

మిఠాయి కొని తెచ్చి ఇచ్చే స్తోమత కూడా వాళ్లకు లేదు. అయినా కూడా వాళ్లకోసం నే నంతగా ఎందుకు ఆందోళనపడుతున్నాను? వాళ్లలో ఎవరైనా రెండు రోజులు రాకపోతే నా ప్రాణం విల విల్లాడిపోయేది, అతణ్ణి చూడాలని తహతహ లాడిపోయేది. అతడు ఎందుకు రాలేదో తెలుసుకోవాలని ఆరాటపడేవాణ్ణి. అలా అవడానికి హేతువు ఏమిటి?'' అని చెబుతూ ఉండేవారు. ఈ ప్రశ్న విన్న బాలుడు, ''నాకు తెలియదండీ. కాని తప్పకుండా వారి మేలుకోసమే మీరలా ఆందోళన చెందుతారనుకొంటాను'' అని బహుశా జవాబిస్తాడు!

5. భక్తుల గురించి శ్రీరామకృష్ణులు ఎందుకు ఆందోళన చెందేవారు?

శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''కారణం ఇది : వీరందరూ అతి శుద్ధసత్వసంపన్నులు. కామకాంచనాలు వీరిని ఇంతవరకు స్పృశించలేదు. వీరిప్పుడు భగవంతుడి మీద మనస్సు లగ్నంచేస్తే భగవత్సాక్షాత్కారం పొందగలరు. నాది గంజాయిత్రాగే వ్యక్తి స్వభావం. గంజాయి త్రాగేవాడు తానొక్కడే త్రాగడంతో తృప్తి చెందడు; తాను మత్తును అనుభవించాక ముంతను ప్రక్కవాడికి అందిస్తేనే తృప్తి చెందుతాడు. నా స్వభావమూ అటువంటిదే. బాలురందరిపట్ల ఇది వర్తించినా, ఇతరు లందరికంటే నరేంద్రుడి గురించే నేను అధికంగా తహతహ చెందుతాను. రెండు రోజులు అతడు రావడం ఆలశ్యమైతే, నా హృదయాన్ని తడి తువ్వాలు మెలిపెట్టి పిండుతున్నట్లుగా బాధపడేవాణ్ణి. అది చూసి లోకులు ఏమనుకొంటారోనని దేవదారు వనానికి[1] పోయి వెక్కివెక్కి ఏడ్చేవాణ్ణి. ఒకప్పుడు హాజ్రా చూసి, ఇలా అన్నాడు: 'మీ స్వభావం ఎంత విచిత్రం! మీది పరమహంస అవస్థ కదా! మనస్సును ఏకాగ్రంచేసి సమాధిమగ్నులై భగవంతుడితో తాదాత్మ్యం చెంది ఉండడానికి బదులుగా, నరేంద్రుడు రాలేదని యోచిస్తూ బాధపడతా రెందుకు? భవనాథ్‌కు ఏమౌతుంది? ఇలా ఏమేమో ఆలోచిస్తూ ఉంటారెందుకు?' ఆ మాటలు విని అతడు చెబుతున్నది నిజమే కదా, ఇక మీదట అలా చేయకూడదు అని అనుకొన్నాను. దేవదారు వనం నుండి తిరిగి వస్తున్నప్పుడు, 'కలకత్తా నగరం స్పష్టంగా నా ముందు కనిపించి, జనమంతా రేయింబవళ్లు కామకాంచనాలలో మునిగిపోయి ఎంతో బాధ ననుభవిస్తూన్న' దృశ్యం (జగజ్జనని) నాకు చూపించింది. అది చూసి నా హృదయం ద్రవించిపోయింది. 'వీరికి మేలు ఒనర్ప, వీరిని ఉద్ధరింప కోటిరెట్ల బాధ ననుభవించాల్సి వచ్చినా ఆనందంగా అనుభవిస్తాను' అని అనుకొన్నాను. వెనక్కు తిరిగి వెళ్లి హాజ్రాతో, 'నేను

---

1. కాళికాలయానికి వాయవ్యంలో ఉన్న చిట్టడివి. అది దాదాపు నిర్జనప్రాంతం.

వారిని గురించే చింతన చేస్తూవుంటే, నీకేం పట్టిందిరా మందమతీ' అని గట్టిగా చెప్పాను.''

''ఒక సందర్భంలో నరేంద్రుడు ఇలా అన్నాడు: ''నరేందర్, నరేందర్ అంటూ సదా ఎందుకంత వాపోతున్నారు? విపరీతంగా అట్లే యోచిస్తూ

6. ఈ అంశంపై నరేంద్రుడి అభ్యంతరం

వుంటే, మీరూ నరేందర్‌లా మారిపోవలసి వస్తుంది. జడ భరతుడు ఎడతెగక లేడిని గురించే చింతన చేసినందున లేడిగా జన్మించవలసి వచ్చింది.' నరేంద్రుడి మాటలపై నాకు గట్టి నమ్మకం ఉందని మీకు తెలుసుకదా! కాబట్టి అతడి మాటలు విని జంకాను. అమ్మకు ఈ విషయం విన్నవించాను. అందుకు ఆమె, 'అతడు చిన్నపిల్లవాడు. అతడి మాటలను ఎందుకు పట్టించుకొంటావు? నువ్వు అతడిలో నారాయణుణ్ణే చూస్తున్నావు. కాబట్టే అతడి పట్ల నీ కంత ఆకర్షణ కలిగింది.' ఆ మాటలు విని నా మనస్సు కుదుటపడింది. తిరిగి వచ్చి నరేంద్రుడితో, 'నీ మాటలు నే నంతగా పట్టించుకోను. నీలో నారాయణుణ్ణే చూసి నీ పట్ల ఆకర్షితుడ నైనానని అమ్మ తెలిపింది. ఏ రోజు నీలో నారాయణుని చూడలేనో, ఆ రోజు నీ ముఖం వంక కూడా చూడను, ధూర్తుడా!' అని అన్నాను.''

కనుక అద్భుతమూర్తులైన శ్రీరామకృష్ణుల ప్రతి చర్యా మాకు విచిత్రంగా తోచినప్పటికీ, దానిలో నిగూఢార్థం ఉండే ఉంటుంది. దానిని అపార్థం చేసుకోవడంతో మా కెక్కడ హాని వాటిల్లుతుందేమోనని గురుదేవులు దానిని విపులీకరించి చెప్పేవారు.

సద్గుణ సంపన్నుల నందరినీ శ్రీరామకృష్ణులు సదా గౌరవించడం మేం చూసివున్నాం. ఆయన ఇలా అనేవారు: ''పరమ సద్గుణవంతుల పట్ల మర్యాద

7. యోగ్యులైన అందరినీ శ్రీరామకృష్ణులు గౌరవించేవారు

మన్ననలు కనబరచకుంటే భగవంతుడు అసంతృప్తి చెందుతాడు. వారు అంతవారు కావడానికి ఆయన శక్తే కారణం; ఆయనే వారిని అలా రూపొందించాడు. అందువలన వారిని అగౌరవించడం, సాక్షాత్తు భగవంతుణ్ణే అగౌరవించడమే అవుతుంది.'' కాబట్టి సద్గుణ సంపన్నుడైన వ్యక్తి చుట్టుపట్ల వసిస్తూన్నాడని తెలియగానే, ఏదో విధంగా ఆ వ్యక్తిని కలుసుకోవాలని శ్రీరామకృష్ణులు ఆతురత చెందేవారు. ఆ వ్యక్తే సరాసరి శ్రీరామకృష్ణుల వద్దకు వస్తే సరేసరి; లేకపోతే ఆయనే ఆ వ్యక్తి వద్దకు ఆహ్వానం లేకపోయినా సరే వెళ్ళి, నమస్కరించి ముచ్చటించి, తృప్తిచెంది తిరిగి వచ్చేవారు.

బర్ద్వాన్ రాజుగారి ఆస్థాన పండితుడైన పద్మలోచన్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, సుప్రసిద్ధ కాశీ వైణికుడైన మహేశ్, సఖీభావంలో సిద్ధురాలైన బృందావన

వాసిని గంగామాయి, భక్తశిఖామణి కేశవచంద్ర సేన్ మొదలైన వ్యక్తుల విశిష్ట గుణసంపత్తిని గురించి విని, వెతుక్కుంటూ వారి ఇళ్లకు వెళ్లి శ్రీరామకృష్ణులు వారిని చూసివచ్చారు.

8. అహంకార నిర్మూలనకై శ్రీరామకృష్ణులు చేపట్టిన తీవ్ర ప్రక్రియలు

ఆహ్వానం లేకపోయినా శ్రీరామకృష్ణులు ఆ విధంగా ఇతరుల ఇళ్లకు వెళ్లడంలో ఆశ్చర్యం ఏమీలేదు. 'నేను ఎంతో గొప్ప వ్యక్తిని' లేదా, 'ఇలా ఎవరి ఇంటికిపడితే వారింటికి పోతే ఇతరుల దృష్టిలో చులకనై పోతాను' లేదా, 'నా కిచ్చే మర్యాద తగ్గిపోతుంది' - ఇటువంటి అహంకారపూరిత భావాలు ఎన్నడూ ఆయన మనస్సులో మెదలేవి కావు. అహంకార ఆత్మాభిమానాలను ఆయన ఎన్నడో సమూలంగా ధ్వంసం చేసివేశారు.

అహంకారాన్ని కూకటివ్రేళ్లతో నిర్మూలించడానికి ఆయన చేసిన సాధన లెన్నో కదా! కాళికాలయంలో ముష్టివాళ్ల ఎంగిలి విస్తరాకులను తమ తలమీద పెట్టుకొని అవతల పారేసి వచ్చేవారు. తిరిగి వచ్చి వాళ్లు తిన్న చోటును శుభ్ర పరిచేవారు. అంతేకాక వారిని సాక్షాత్తు నారాయణ స్వరూపులుగా ఎంచి, ఒకసారి వారి ఎంగిలిని ప్రసాదంగా ఆరగించారు కూడా. కాళికాలయ పరిచారకుల మరుగుదొడ్డిని శుభ్రంగా కడిగి, తమ దీర్ఘ శిరోజాలతో తుడిచి, జగజ్జననిని హృదయపూర్వకంగా, ''అమ్మా! వీరికంటే నేను అధికుడననే భావన నా మదిలో ఎన్నడూ తలెత్తకుండా చూడు'' అని ప్రార్థించారు.

శ్రీరామకృష్ణులలో ఈ అభిమానరాహిత్యం ఎంత అద్భుతం, సహజం అయిందంటే, దానిని కళ్లారా చూసిన తరువాత కూడా మనకు ఎటువంటి ఆశ్చర్యమూ జనించదు. కాని మరెవరిలోనన్నా ఈ అభిమానరాహిత్యం కించిత్తు అయినా కనిపించగానే 'ఎంత ఆశ్చర్యం!' అనే మాటలు అనివార్యంగా మన నోటినుండి వెలువడతాయి. నిజానికి, మనందరిలా శ్రీరామకృష్ణులు ఈ లోకానికి చెందిన వారు కారు సుమా!

9. డాక్టర్ కైలాస్, త్రైలోక్యబాబులకు సంబంధించిన సంఘటనలు శ్రీరామకృష్ణుల అభిమాన రాహిత్యానికి దృష్టాంతాలు

తమ ధోవతి క్రింది అంచును భుజం మీద వేసుకొని శ్రీరామకృష్ణులు ఒకసారి కాళికాలయ తోటలో నడుస్తున్నారు. అటువైపు పోతున్న ఒక పెద్దమనిషి (డా. కైలాస్) ఆయనను తోట మాలిగా ఎంచి, ''ఏమోయ్, ఆ పువ్వులు కోసి ఇవ్వు'' అని అడిగారు. శ్రీరామకృష్ణులు మారుమాట్లాడక, పువ్వులు కోసి ఇచ్చి, చల్లగా అక్కడనుండి జారుకొన్నారు.

మరొక సందర్భంలో మథుర్‌బాబు కీర్తిశేషుడైన కుమారుడు త్రైలోక్య బాబు ఏదో కారణంగా హృదయ్ మీద విసుక్కొని, ఆలయం నుండి వెళ్లి

పొమ్మని అతణ్ణే ఆజ్ఞాపించాడు. కోపోద్రేకంలో త్రైలోక్యబాబు, ఇకమీదట శ్రీరామకృష్ణులు కూడా ఆలయంలో బసచేయరాదని సూచనప్రాయంగా తెలిపాడు. ఈ సమాచారం చెవిన పడగానే శ్రీరామకృష్ణులు కండువా భుజంమీద వేసుకొని, నవ్వుతూ బయటకు నడిచిపోసాగారు. ఆయన దాదాపు ఆలయ సింహద్వారం వద్దకు చేరుకోగానే, ఆయన అలా వెళ్ళిపోతే ఏదో కీడు మూడుతుందని భయపడి, ఒక్క పరుగులో అక్కడికొచ్చి, "మీరు వెళ్ళిపోవాలన్నది నా ఉద్దేశం కాదు. ఎందుకు వెళ్ళిపోతున్నారు?" అని, ఆయనను తిరిగి వెళ్ళమని త్రైలోక్యుడు ప్రార్థించాడు. శ్రీరామకృష్ణులు నవ్వుకొంటూ, ఏమీ జరుగనట్లే తమ గదిలోకి వచ్చి తాపీగా కూర్చున్నారు.

అటువంటి దృష్టాంతాలు ఎన్నిటినో పేర్కొనవచ్చు. శ్రీరామకృష్ణులు ఆ తీరులో ప్రవర్తించడం మన కంత ఆశ్చర్యం కలిగించదు. కాని మరో గొప్ప

10. తద్విరుద్ధమైన లౌకికుల ప్రవర్తన

వ్యక్తి పూర్తిగా ఆయనలా కాకపోయినా, ఏదో కొంతలో కొంత ఆయనలా ప్రవర్తిస్తే, వెంటనే ఆ వ్యక్తిని మనం ఆకాశానికెత్తుతాం. ఎందుకంటే, నోరు తెరిచి ఏమీ చెప్పకపోయినా మనస్సులో మనం ఈ విషయం పాదుగొలుపుకొని కూర్చున్నాం : లోకంలో బ్రతికి ఉండగోరితే స్వార్థాన్నే పరమార్థంగా చేసుకోక తప్పదనీ, బలహీనులను ప్రక్కకు నెట్టి మన దారిని సుగమం చేసుకోక తప్పదనీ, ఇతరుల దృష్టి నుండి మన తప్పిదాల నన్నిటిని కప్పిపుచ్చి మన కీర్తిని మనమే చాటుకోవాలనీ భావిస్తాం. తన మతాన్ని ఎవరు చిత్తశుద్ధితో ఆచరిస్తాడో, భగవంతుడిపై, మనిషిపై ఆధారపడి ఉంటాడో, అటువంటి వ్యక్తిని నిష్ప్రయోజకుడిగా పరిగణిస్తాం.

అయ్యో లోకమా! నీ రాజనీతి, సామాజిక శిష్టాచారం, వ్యక్తిగత నీతి, అంతర్జాతీయ విధానాలు ఇత్యాదులు సర్వత్రా ఇటువంటివే కదా! నీ 'ఢిల్లీ లడ్డు'[1] ను తినని వాడూ, తిన్నవాడూ ఇద్దరూ పశ్చాత్తాపపడతారు.

అది 1885వ సంవత్సరం. శ్రీరామకృష్ణులు అప్పటికే సుప్రసిద్ధులైనారు.

11. మహోద్యమాలు

శ్రీరామకృష్ణుల పట్ల ఆకర్షితులై నిత్యం అనేకమంది కొత్తవారు దక్షిణేశ్వరానికి వచ్చి, ఆయనను దర్శించుకొని ధన్యులు కాసాగారు. అప్పటికే కలకత్తా నగరంలోని ఆబాలవృద్ధు లందరూ 'దక్షిణేశ్వర పరమహంస' పేరు వినివున్నారు, వారిలో అనేకులు ఆయనను

---

1. ఇది హిందీభాషలోని ప్రాంతీయం. సామాన్యమైన ఒక తీపి భక్ష్యం అద్భుతంగా ఉందని ప్రాచుర్యం పొందివుంటుంది. దానిని తినని వాడు ఇంకా లభించలేదే అని విచారిస్తాడు. తిన్న వాడు దానిలో ఏమీ లేదని కనుగొని పశ్చాత్తాపం చెందుతాడు. ఇక్కడ ఇది లౌకిక సుఖాలకు ఉదాహరణగా పేర్కొనబడింది.

దర్శించారు కూడా. అవ్యక్తమైన ఆధ్యాత్మిక ప్రవాహం ఒకటి ఆ రోజుల్లో కలకత్తా జనానీక హృదయ సీమలలో ప్రవహించసాగింది. హరిసభలు, బ్రహ్మ సమాజం, సంకీర్తన బృందాలు, ప్రవచన సమాజాలు - ఇలా నానామతశాఖలు కలకత్తా నగరమంతటా వ్యాపించి ఉన్నాయి. ఇలా ఈ మతశాఖలు ఆ సమయంలో హఠాత్తుగా వ్యాప్తిగాంచడానికి కారణం ఏమిటి? ఇతరు లెవరికీ ఆ కారణం తెలియకపోయినా శ్రీరామకృష్ణులకు మాత్రం అసలు కారణం తెలుసు. దానిని గురించి ఆయన అప్పుడప్పుడు మాతోను, ఇతర భక్తులతోను భక్తురాం్రడతోను చెప్పి ఉన్నారు.

ఈ సందర్భంగా తనతో ఒక రోజు శ్రీరామకృష్ణులు చెప్పిన విషయం గురించి, ఒక భక్తురాలు మాతో ఇలా చెప్పింది: ''నీకు కనబడుతున్న ఆ హరి సభలూ, ఇతర మతసంస్థలూ పుట్టుకు రావడం (తమ శరీరాన్ని చూపుతూ) దీని మూలంగానే అని తెలుసుకో. అవి పూర్వం ఉన్నాయా? అన్నీ నిర్జీవస్థితి లోనే ఉండేవి. కాని ఇది (తన శరీరం చూపుతూ) వచ్చినప్పటి నుండీ మళ్లీ అవి సజీవాలైనాయి, ఉపరితలానికి కాస్త క్రిందుగా ఒక ఆధ్యాత్మిక ప్రవాహం పారసాగింది.''

మరొక సందర్భంలో శ్రీరామకృష్ణులు మాతో ఇలా చెప్పారు: ''మీరు చూసే 'యంగ్ బెంగాల్' (అంటే యువతరం) భక్తి మొదలైన వాటిని ఖాతరు చేస్తారా? తలవంచి ప్రణామం చేయడంకూడా వారికి తెలియదు. నేను తల వంచి వారికి ప్రణామం చేయడం వలన, క్రమేణా వాళ్లు ప్రణామం చేసేట ప్పుడు ఎలా తలవంచాలో నేర్చుకొన్నారు. కేశవ్‌ను చూడడానికి అతడి ఇంటికి వెళ్లాను. అప్పు డతడు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. తలవంచి అతడికి ప్రణామం చేశాను. అందుకు బదులుగా అతడు తల ఊపాడు. తిరిగి వచ్చే టప్పుడు సాష్టాంగ ప్రణామం చేశాను. అప్పు డతడు చేతులు జోడించి, చేతు లతో ఒకసారి తలను స్పృశించాడు. మా మధ్య పరిచయం పెరిగేకొద్దీ, నా మాటలను అతడు మరింతగా వినసాగాడు; తలవంచి నేను ప్రణామం చేసే కొద్దీ, అతడూ తలవంచి ప్రణామం చేయడం ప్రారంభించాడు. లేకుంటే భక్తీ ఇత్యాదుల గురించి వారికి ఏమన్నా తెలుసా లేదా వాటిని లక్ష్యపెట్టేవారా ఏమిటి?''

బ్రహ్మసమాజపు ఒక మతశాఖ అయిన 'నవవిధాన్'[1] శ్రీరామకృష్ణుల సాంగత్య లబ్ధితో ఉగ్రరూతలు వేయసాగింది. పెద్ద ఎత్తున ప్రార్థనా సభలను

1. అభిప్రాయభేదాలు తల ఎత్తడం వలన కేశవసేన్ నాయకత్వంలోని బ్రహ్మసమాజం రెండు శాఖలుగా చీలిపోయింది. కేశవ్‌ను వ్యతిరేకించినవారు తమ శాఖను 'సాధారణ →

నిర్వహించసాగింది. అటువంటి సమయంలో శశధర పండితుడు కలకత్తాకు

12. కలకత్తాలో శశధర పండితుడు

వచ్చి, హిందూమతాన్ని గురించి ప్రసంగాలివ్వసాగాడు. పాశ్చాత్య వైజ్ఞానికి దృక్పథం నుండి హిందూమత దైనందిన అనుష్ఠానాలను ఎంతో చక్కగా విశదీకరించసాగాడు.

ప్రతి ఒక్క విషయంలోను 'ఒక్కో ఋషిది ఒక్కో అభిప్రాయం' అనే లోకోక్తి ముమ్మాటికీ నిజమే. హిందూ మతాన్ని గురించి పండితుడు చేస్తున్న వైజ్ఞానికపరమైన వివరణకు కూడా పై సత్యమే వర్తిస్తుంది. అయినప్పటికీ అతడి ప్రసంగాలకు శ్రోతల కొదువ లేదు. కార్యాలయాలనుండి తిరిగివచ్చే గుమాస్తాలు, పాఠశాల కళాశాల విద్యార్థులు గుంపులు గుంపులుగా అతడి ప్రసంగాలకు రాసాగారు. సనాతన హిందూమతం మీద అతడు ప్రసంగించే 'ఆల్బర్ట్ హాలు' శ్రోతలతో క్రిక్కిరిసిపోయేది. పండితుడి వైజ్ఞానికపరమైన వివరణను వినడానికి ప్రతి ఒక్కరూ ఉత్సుకత కనబరచేవారు. ఒక రోజు మేం కాస్సేపు నిలబడి ప్రసంగం వినడం మాకు గుర్తుంది. ఒక సందర్భంలో ఎంతో కష్టంతో మా తలలను లోపలకు దూర్చి నల్లని గడ్డంతో, రుద్రాక్షమాలలు వ్రేలాడుతున్న మెడతో, అందమైన ముఖారవిందంతో ప్రకాశిస్తూన్న వయోవృద్ధుడైన పండితుణ్ణి చూడగలిగాం. ఆ సమయంలో కలకత్తాలో ఎక్కడ చూసినా పండితుడి మత ప్రసంగం గురించే జనం మాట్లాడుకొంటున్నారనడం అతిశయోక్తి కాదు.

'వార్తలు ఆ నోట ఈ నోట ప్రాకుతాయి' అనే సామెత ఉంది. దక్షిణేశ్వర మహాపురుషుని గురించిన సమాచారం పండితుడికి, పండితుడి సాధనల

13. శశధర్‌ను చూడాలని శ్రీరామకృష్ణులు ఆకాంక్షించడం

గురించి శ్రీరామకృష్ణులకు చేరడానికి ఎంతో కాలం పట్టలేదు. కొందరు భక్తులు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి ఇలా చెప్పారు: ''శశధర్ గొప్ప పండితుడు, గొప్ప వక్త కూడా. మొన్న ఆయన ముప్పై రెండు అక్షరాలతో కూడిన హరి నామాన్ని దేవీపరంగా ఎంత బాగా విశదీకరించడంటే, విన్నవారంతా 'సెబాస్' అంటూ తెగ మెచ్చుకోకుండా ఉండలేకపోయారు.'' ఆ మాటలు విని శ్రీరామకృష్ణులు, ''అలాగా! ఒకసారి ఆయన చెప్పింది వినగోరుతున్నాను'' అని అన్నారు. ఇలా అంటూ శ్రీరామకృష్ణులు భక్తులతో, పండితుణ్ణి చూడాలనే తన కోర్కెను వెలిబుచ్చారు.

→

బ్రహ్మసమాజం' పేరిట నడపసాగారు. కేశవ్ తన అనుయాయులతో కలిసి 'నవవిధాన్' పేరిట తన శాఖను నడపసాగాడు. శ్రీరామకృష్ణుల సాంగత్య లబ్ధి పొంది ఈ శాఖ ఖ్యాతిగాంచింది.

శ్రీరామకృష్ణుల పావన మానసంలో జనించే ఆకాంక్ష ఏదో విధంగా ఫలించే తీరేది. ఏదో ఒక అదృశ్యశక్తి అడ్డంకు లన్నిటినీ తొలగించివేసి, మార్గాన్ని సుగమం చేసి ఆ ఆకాంక్షను ఫలింపచేసేది.

14. శ్రీరామకృష్ణుల ఆకాంక్షలన్నీ నెరవేరాయి

మనోవాక్కాయాల ద్వారా సదాసర్వదా సత్యనిష్ఠ పాటిస్తూ, పావన జీవితం గడిపే వ్యక్తి క్రమేణా ఎంత ప్రయత్నించినప్పటికీ మనస్సులో అసత్యానికి చోటు ఇవ్వలేడనీ, అటువంటి వ్యక్తి మనస్సులోని సంకల్పాలన్నీ ఈడేరతాయనీ మేం ఇంతకు మునుపు విని వున్నాం. సైద్ధాంతికంగా దీనిని అంగీకరించినప్పటికీ, ఒక వ్యక్తి జీవితంలో యథార్థంగా ఇలా జరుగుతుందని మేం ఎన్నడూ నమ్మిందిలేదు. కాని శ్రీరామకృష్ణుల మనోసంకల్పాలు పదేపదే అనుకోని రీతులలో ఈడేరడం చూసిన తరువాత అది సత్యమేనని క్రమంగా మేం అంగీకరించాం. అయినప్పటికీ ఆయన జీవించి ఉన్నప్పుడు ఆయన వచనాల పట్ల మేం పరిపూర్ణ విశ్వాసం వహించి ఉన్నామా? లేదు. ఆయన ఇలా చెప్పేవారు: ''కేశవ్, విజయ్‌లలో జ్ఞానజ్వాలలు దీపాలలా మినుకుమినుకు మనడం నేను చూశాను. కాని నరేంద్రుడిలో జ్ఞానభాస్కరుణ్ణే చూశాను!'' మళ్లీ ఆయన కొనసాగించారు: ''ఒక్క శక్తితో కేశవ్ ప్రపంచాన్ని కుదిపివేస్తే, నరేంద్రుడిలో అటువంటి పద్దెనిమిది శక్తులు ఉన్నాయి.'' గురుదేవుల పై వచనాలు సామాన్య చింతనల వలన లేదా పరిశీలన వలన పొందిన జ్ఞానోక్తులు కావు; భావసమాధి అనుభవాల మూలంగా సంతరించుకొన్నవి. అప్పటికీ ఆయన వచనాలను మేం పూర్తిగా విశ్వసించామా? కొన్ని సమయాలలో మేం, 'బహుశా నిజమేనేమో! ఆయన వ్యక్తుల హృదయాలను చదవగలరు. ఆయన అలా చెబుతున్నప్పుడు, దానిలో ఏదో రహస్యం దాగి ఉంటుంది' అని అనుకొనేవారం. మళ్లీ కొన్ని సమయాలలో కాస్త సందేహం కలిగేది. 'మహావక్తా జగద్విఖ్యాతుడైన భక్తశిఖామణి కేశవ్ ఎక్కడ? పాఠశాల బాలుడైన నరేంద్రు డెక్కడ? వీరిద్దరి గురించిన శ్రీరామకృష్ణుల అభిప్రాయం నిజమేనా?' గురుదేవుల అనుభవాలను గురించి మాకు అలాంటి సందేహాలు కలుగుతున్నప్పుడు, 'నా కీ కోర్కె ఉంది' అని సరళరీతిలో ఆయన వెలిబుచ్చిన ఆకాంక్షలు ఈడేరితీరతాయి అని మేం నిస్సందేహంగా నమ్మేవారమని ఎలా చెప్పగలం?

శశధర్ పండితుణ్ణి గురించి శ్రీరామకృష్ణులు ప్రస్తావించిన కొన్ని రోజుల తరువాత 'జగన్నాథ రథయాత్ర' ఉత్సవం వచ్చింది.

15. 1885 వ సంవత్సర నవయాత్ర

ఈ రథయాత్రోత్సవం తొమ్మిది రోజుల పాటు జరుపుకొంటారు కనుక దీనిని 'నవయాత్ర'గా పేర్కొంటారు. 1885 వ సంవత్సర

ఈ నవయాత్రోత్సవ సందర్భంలో శ్రీరామకృష్ణులకు సంబంధించి జరిగిన సంఘటన లెన్నో మాకు జ్ఞాపకం వస్తున్నాయి.

'ఠన్‌ఠనియా' ప్రాంతంలో నివసించే ఈశాన్‌చంద్ర ముఖోపాధ్యాయ్ ఆహ్వానాన్ని మన్నించి, రథం బయలుదేరే పండుగ నాటి ఉదయమే శ్రీరామకృష్ణులు అతడి ఇంటికి వెళ్లారు. అక్కడ నుండి మధ్యాహ్నం వేళ శశధర్ పండితుణ్ణి కలుసుకోవడానికి వెళ్లారు. పిదప ఆ సాయంకాలం బలరాం బాబు ఇంట్లో జరుగుతున్న రథోత్సవంలో పాల్గొని, నాటి రాత్రి అక్కడే బసచేశారు. మర్నాడు కొందరు భక్తులతో కలిసి పడవలో దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చారు. ఇది జరిగిన కొన్ని రోజుల తరువాత ధార్మిక ప్రసంగం చేయడానికి శశధర్ ఆలంబజార్‌కు రావలసి వచ్చింది. ప్రసంగం ముగించి శ్రీరామకృష్ణులను దర్శింప ఆయన దక్షిణేశ్వరానికి వచ్చాడు. తదనంతరం రథం తిరిగి వచ్చే రోజు శ్రీరామకృష్ణులు మళ్లీ బలరాం ఇంటికి వెళ్లి, భక్తుల సాంగత్యంలో మహదానందంగా ఆ రోజు, మరుసటి రోజు అక్కడే గడిపారు. మూడవ రోజు ఉదయం 'గోపాలుని తల్లి', తదితర భక్తులతో కలిసి పడవలో దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చారు. రథం తిరిగి వచ్చే రోజు శశధర్ పండితుడు, బలరాం ఇంటికి వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించాడు. కళ్లనీళ్లపర్యంతమైపోతూ ఆయన, ''వేదాంత చర్చలతో నా గుండె ఆర్చుకుపోయింది; దయచేసి ఒక్క భక్తి బిందువును ప్రసాదించండి'' అని శ్రీరామకృష్ణులను ప్రార్థించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు భావసమాధి మగ్నులై పండితుడి హృదయాన్ని స్పృశించారు. ఆ సందర్భంలో జరిగిన సంఘటనల వివరాలను ఇక్కడ పొందుపరచడం అసంగతం కాబోదు.

16. ఈశాన్‌చంద్ర ముఖోపాధ్యాయ్ గురించి

రథం ముందుకు బయలుదేరిన నాటి ఉదయమే శ్రీరామకృష్ణులు ఠన్‌ఠనియాలో వసిస్తూన్న ఈశన్‌చంద్ర ముఖోపాధ్యాయ్ ఇంటికి వెళ్లారని ముందే చెప్పాం. అప్పుడు ఆయనతోపాటు యోగేన్ (యోగానందస్వామి), హాజ్రా, కొందరు భక్తులు ఉన్నారు. దయాళువు, ఉదారుడు, భగవంతుని పట్ల ప్రగాఢ విశ్వాసం గలవాడు అయిన ఈశాన్ వంటి వ్యక్తులు లోకంలో ఎంతో అరుదు. ఆయన ముగ్గురు లేదా నలుగురు కుమారులూ మంచి విద్యావంతులు. మూడవ కుమారుడైన సతీశ్, నరేంద్రుడి సహాధ్యాయి. పఖ్వాజ్ (ఒక రకమైన మద్దెల)ను వాయించడంలో ప్రవీణుడైనందున, మధురమైన నరేంద్రుడి కంఠస్వరం తరచు ఆ ఇంట్లో వినవచ్చేది. ఈశాన్ దయాగుణం, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ దయాగుణానికి దీటైనదని ఒక రోజు వివేకానందస్వామి మాతో చెప్పాడు.

అనేక సందర్భాలలో తాను తినబోతున్న భోజనాన్ని బిచ్చగాళ్లకిచ్చి, ఆయన దాదాపు పస్తుండిపోవడం కళ్లారా వివేకానందస్వామి చూసేవున్నాడు. అంతే గాక ఇతరులు బాధపడుతుండడం చూసి, ఆ బాధను తీర్చలేని తన శక్తిహీన తకు ఈశాన్ కన్నీరుమున్నీరవడం తాను చూసినని కూడా స్వామి చెప్పి వున్నాడు. ఈశాన్ దయాగుణం గలవాడు మాత్రమే కాదు, జపం పట్ల మహా నిష్ఠ గలవాడుకూడా. నియమానుసారం ఆయన సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు దక్షిణేశ్వరంలో జపం చేస్తూవుండడం మాలో అనేకు లకు తెలిసిన సంగతే. పరమ నిష్ఠాభక్తులతో జపం చేసే ఈశాన్, శ్రీరామ కృష్ణులకు ప్రీతిపాత్రుడు కావడంలో వింత ఏమీ లేదు.

ఒక రోజు ఈశాన్ జపం పూర్తిచేసుకొని శ్రీరామకృష్ణులకు ప్రణామం చేయడానికి వచ్చినప్పుడు, ఆయన భావపారవశ్యంలో తమ పావన పదారవిందా లను ఈశాన్ తలపై పెట్టడం మాకు జ్ఞాపకం ఉంది. బాహ్యస్మృతి కలి గిన తరువాత శ్రీరామకృష్ణులు, ''ఓ బ్రాహ్మణుడా, మునుగు, లోతుగా మునుగు!'' (అంటే సచ్చిదానంద సాగరంలో మునుగు అని అర్థం) అని ఈశాన్‌తో నొక్కివక్కాణించారు. ఆ రోజులలో ఈశాన్ ఉదయకాల పూజ, జపం ముగిసేటప్పటికి సాయంత్రం నాలుగు గంటలయ్యేది. తరువాత అతడు కాస్త ఫలహారం తినేవాడు. సంధ్యాసమయం వరకు ఇతరులతో ఆధ్యాత్మిక ప్రసంగాలలోనో లేదా భక్తి గీతాలు వినడంలోనో గడిపేవాడు. ఆ తరువాత కొన్ని గంటలసేపు జపం చేస్తూ కూర్చునేవాడు. ఆతడి లౌకిక వ్యవహారాదుల నన్ని టిని కుమారులే బాధ్యతాయుతంగా నిర్వర్తించేవారు. శ్రీరామకృష్ణులు అప్పు డప్పుడు ఈశాన్ గృహాన్ని పావనం చేసేవారు. కలకత్తాలో బసచేసి ఉన్నప్పుడు ఈశాన్ తరచు దక్షిణేశ్వరానికి వచ్చి గురుదేవులను దర్శించుకొనేవాడు; లేదా దేవాలయాలను లేదా పుణ్యక్షేత్రాలను దర్శించుకొంటూ, ఆధ్యాత్మిక సాధన లలో కాలం గడుపుతూండేవాడు.

1885 వ సం॥ రథయాత్రోత్సవం నాడు శ్రీరామకృష్ణులు, ఈశాన్ గృహాన్ని పావనం చేసి, భాట్‌పాడాకు చెందిన కొందరు పండితులతో ధార్మికత గురించి ముచ్చటించారు. ఆ సమయంలో శశధర పండితుడు అక్కడికి సమీపంలోనే బసచేసి ఉన్నాడని వివేకానంద స్వామి గురుదేవులకు చెప్పాడు. ఆ సమాచారం విని శ్రీరామకృష్ణులు, శశధర్‌ను చూడడానికి వెళ్లారు.

ఎవరి సాదర ఆహ్వానం పురస్కరించుకొని శశధర పండితుడు ధార్మిక ప్రసంగాలు చేయడానికి ఏతెంచాడో, వారితో స్వామికి పరిచయం ఉంది, హైా కళాశాల వీధిలోని వారి ఇంటికి స్వామి తరచు వెళ్లేవాడు కూడా. అందువలన

శశధర్ కలకత్తాలోనే ఉన్నాడని స్వామికి తెలియవచ్చింది. శశధర్ పండితుడి ఆధ్యాత్మిక ప్రసంగ వ్యాఖ్యానంలో అనేక తప్పులు దొర్లుతున్నాయని స్వామి గ్రహించాడు. కాబట్టి తర్కయుక్తులతో ఆ వ్యాఖ్యానంలోని తప్పులను పండితుడికి సూచించాలనే ఉద్దేశంతో స్వామి మరింత తరచుగా ఆ ఇంటికి వెళ్లేవాడు.

వివేకానంద స్వామికి పండితుణ్ణి గురించి ఎన్నో విషయాలు తెలుసుననీ, వాటిని గురుదేవులకు తెలిపాడనీ, స్వామి విన్నపం మేరకు గురుదేవులు అతడితో కలిసి పండితుడి వద్దకు వెళ్లారనీ, పండితుడికి ఆ సందర్భంలో అమూల్యమైన ఉపదేశాలు ఇచ్చారనీ బ్రహ్మానంద స్వామి చెప్పేవారు.

జగజ్జనని నుండి ఆదేశం పొందకుండా, అధికార పత్రాన్ని సంతరించుకోకుండా ధర్మోపదేశం చేయడం వ్యర్థమనీ, పైపెచ్చు అది అహంకారాన్ని, గర్వాన్ని పెంచి, కొన్ని సందర్భాలలో ఆతడి పతనానికి దారితీస్తుందనీ ప్రథమ సమావేశంలోనే శ్రీరామకృష్ణులు, శశధర్‌కు తెలియచెప్పారు. శ్రీరామకృష్ణుల ఉపదేశ వచనాల ప్రభావ ఫలితంగా కొద్దికాలంలోనే శశధర పండితుడు ధార్మిక ప్రసంగాలకు స్వస్తిచెప్పి, తపశ్చర్యాదులలో కాలం గడపడానికి కామాఖ్య (అస్సాం లోని) పీఠానికి వెళ్లిపోయాడు.

శ్రీరామకృష్ణులు ఆ నాటి సాయంత్రం పండితుడి వద్ద సెలవు పుచ్చుకొని యోగేన్‌తో (యోగానంద స్వామి) కలిసి బాగ్‌బజార్‌లోని బలరాం బాబు ఇంటికి వెళ్లారు. యోగేన్ ఎంత పూర్వాచారపరాయణుడంటే ఇతరుల ఇళ్లలో నీరు సైతం పుచ్చుకొనేవాడు కాడు. అందువలన ఆ రోజు బయలుదేరడానికి ముందు ఇంట్లోనే ఫలహారం చేసివచ్చాడు. యోగేన్ ఆచార నిష్ఠలు శ్రీరామకృష్ణులకు తెలియనివి కావు. కాబట్టి ఆయన కూడా పరాయి ఇళ్లకు వెళ్లినప్పుడు ఏదన్నా తినమని అతణ్ణి ఎన్నడూ బలవంతంచేసేవారు కారు. బలరాం బాబుకు భగవద్భక్తి, గురుదేవుల పట్ల భక్తిప్రపత్తులు ఉండడం వలన, యోగేన్ ఆయన ఇంట్లో పళ్లు, పాలు, మిఠాయిలు నిరభ్యంతరంగా పుచ్చుకొనేవాడు. ఈ విషయం శ్రీరామకృష్ణులకు తెలుసు. అందువలన బలరాం ఇంటికి చేరుకొన్న కాసేపటికి శ్రీరామకృష్ణులు, ''ఈ రోజు యోగేన్ ఏమీ తినలేదు. తినడానికి అతడికి ఏదన్నా ఇవ్వండి'' అంటూ బలరాంను పురమాయించారు. వెంటనే బలరాం ఆప్యాయంగా యోగేన్‌ను ఇంటి లోపలకు తోడ్కొనివెళ్లి ఫలహారం పెట్టించాడు. శ్రీరామకృష్ణులు తరచు భావపారవశ్య స్థితిలో మగ్నులై ఉన్నప్పటికీ, భక్తుల

17. స్వామి యోగానంద పూర్వాచార పరాయణత్వం

మానసిక శారీరక స్థితిగతులను ఎంత సునిశితంగా పరిశీలిస్తారో తెలుపడానికే ఈ సంఘటనను ఇక్కడ ప్రస్తావించాం.

బలరాంబాబు ఇంట్లో నిర్వహించే రథోత్సవంలో శ్రీరామకృష్ణులు పాల్గొనడంతో అక్కడ పరమానంద ప్రవాహం కట్టలు తెంచుకొని ప్రవహించింది. సూర్యాస్తమయం కాగానే జగన్నాథ ప్రతిమను చందనమాల్య వస్త్ర పతాకాదులతో అలంకరించి, ఇంటిలోనుండి తీసుకువచ్చి, అలంకరించి సిద్ధంగా ఉన్న చిన్న రథంలో కూర్చోబెట్టి మళ్లీ పూజించారు. శ్రీరామకృష్ణుల పట్ల భక్తిప్రపత్తులున్నవాడూ, బలరాంబాబు పురోహిత వంశజుడూ అయిన ఫకీర్ పూజను నిర్వర్తించాడు.

ఫకీర్ పేదవాడవడం వలన బలరాంబాబునే ఆశ్రయించి చదువుకొన్నాడు. అతడు ఆచారవంతుడు, భక్తినిష్ఠలు ఉన్నవాడు. బలరాం బాబు ఏకైక పుత్రుడైన రామకృష్ణుని చదువు సంధ్యలను అతడే చూసుకొనేవాడు. మొదటిసారి శ్రీరామకృష్ణులను చూసినప్పటి నుండి ఆయన పట్ల ఫకీర్ గొప్ప భక్తిప్రపత్తులు పెంపొందించుకొన్నాడు. ఫకీర్ పాడే స్తుతులను శ్రీరామకృష్ణులు ఇష్టంగా వినేవారు. ఒక రోజు శంకరభగవత్పాదులు రచించిన కాళీస్తోత్రాన్ని నెమ్మదిగా, ప్రతి పదాన్ని స్పష్టంగా ఉచ్చరిస్తూ ఎలా స్తుతించాలో శ్రీరామకృష్ణులే స్వయంగా ఫకీర్‌కు నేర్పారు. ఆ నాటి సంధ్యాసమయంలో శ్రీరామ్కృష్ణులు తాను వసించే గదికి ఉత్తరం వైపున ఉన్న వసారాలోకి ఫకీర్‌ను తోడ్కొని వెళ్లి, భావపారవశ్యంలో అతణ్ణి స్పృశించి, ధ్యానం చేయమని చెప్పారు. తత్ఫలితంగా ఫకీర్‌కు అద్భుత దర్శనాలు, అనుభూతులు కలిగాయి.

భగవత్సంకీర్తనం చేస్తూ రథాన్ని ముందుకు లాగుతున్నారు. స్వయంగా శ్రీరామకృష్ణులు రథానికి కట్టిన తాడు పుచ్చుకొని ఒకింత సేపు రథాన్ని లాగారు.

18. బలరాం బాబు ఇంట్లో రథోత్సవం

తదనంతరం భావపారవశ్యంలో ఉన్మత్తులై తాళాను సారంగా నృత్యం చేశారు. భావపారవశ్యంలో ఉత్తేజభరితంగా పెడుతున్న బొబ్బరింతలు, ఆయన చేస్తున్న నృత్యం చూసి అక్కడ సమావేశమైవున్న అందరూ ముగ్ధులై, తమ ఉనికినే విస్మరించి, భగవద్భక్తిలో ఉన్మత్తులైపోయారు. ఇంటి మొదటి అంతస్తులోని వసారాలో పదేపదే రథాన్ని లాగుతూ నృత్యగానాలతో భక్తులు చాలసేపు గడిపారు. తదనంతరం జగన్నాథునికీ, రాధాదేవికీ, చైతన్యులకూ, ఆయన ఆంతరంగిక భక్తులకూ జయజయ ధ్వానాలు చెప్పి, ప్రణామాలర్పించి నాటి సంకీర్తన ముగించారు. పిదప జగన్నాథుని పావన ప్రతిమను రథం నుండి క్రిందికి దింపి, రెండవ అంతస్తుకు దారితీసే మెట్ల వరుస పైనవున్న ఒక చిన్నగదిలో ప్రతిష్ఠించారు. ఏడు రోజుల

పాటు జగన్నాథుని ప్రతిమను ఈ గదిలోనే ఉంచుతారు. అంటే జగన్నాథుడు రథమెక్కి మరొక చోటికి వెళ్లినట్లు, ఏడు రోజుల తరువాత మళ్లీ స్వస్థానానికి తిరిగి వచ్చేటట్లుగా భావించుకోవాలి. జగన్నాథుని ప్రతిమను అలా ఆ చిన్న గదిలో ప్రతిష్ఠించిన తదుపరి, ఆయనకు అన్నభోగం నివేదించారు. తదనంతరం అన్నప్రసాదాన్ని ముందుగా శ్రీరామకృష్ణులకు, తరువాత తక్కిన భక్తులకు పెట్టారు. గురుదేవులు, యోగేన్ నాటి రాత్రి బలరాంబాబు ఇంట్లోనే గడిపారు. తక్కిన భక్తులలో అనేకులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు.

19. శ్రీరామకృష్ణుల వల్ల భక్తురాండ్ర భక్తి ప్రపత్తులు

మర్నాడు ఉదయం ఎనిమిది లేదా తొమ్మిది గంటల సమయంలో శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లడానికి ఒక పడవను ఏర్పాటు చేశారు. పడవ రాగానే శ్రీరామకృష్ణులు ఇంటి లోపలకు వెళ్లి జగన్నాథునికి ప్రణామం చేశారు. అక్కడున్న భక్తుల ప్రణామాలు స్వీకరించి, ఆయన బయటకు రాసాగారు. భక్తురాండ్రు కూడా ఆయన ననుసరించి బయటి వసారావరకు వచ్చి, గురుదేవులను సాగనంపి, బరువెక్కిన హృదయాలతో వెనుదిరిగారు. కళ్లకు కనిపించే ఆ అద్భుత సజీవదైవం సాంగత్యాన్ని ఎవరు మాత్రం విడిచిపెట్టి ఉండగలుగుతారు? ఆ విధంగా భక్తురాండ్రు వలయాకారంలోవున్న ఆ వసారా వాకిలి వరకు వచ్చి వెనక్కు తిరిగారు. కాని వారిలో ఒక స్త్రీ మాత్రం మైమరచిపోయి గురుదేవులను అనుసరించి బయటి వసారా దాకా వచ్చింది. అపరిచితులైన పురుషులు అక్కడ ఉన్నారని ఆమెకు కించిత్తుకూడా స్ఫురించినట్లులేదు.

20. ఒక భక్తురాలు తన్మయ స్థితిలో శ్రీరామ కృష్ణులను అనుసరించడం

భక్తురాండ్ర వద్ద సెలవు పుచ్చుకొని భావపారవశ్యంలో, అంతర్ముఖులై ఆయన బయటకు నడవసాగారు. ఆ స్థితిలో ఆయనకు భక్తురాండ్రు కొంత దూరం వరకు తనను అనుసరించి వచ్చారనీ, వారిలో ఒక స్త్రీ ఇంకా తనను అనుసరించి వస్తూనే ఉందనీ బొత్తిగా తెలియదు. ఆ తీరులో శ్రీరామకృష్ణులు నడిచి రావడం కళ్లారా చూసిన వారు మాత్రమే, దాన్లోని అసాధారణ భావాన్ని అవగతం చేసుకోగలరు. ఇతరులకు దాన్ని విపులీకరించడం అసాధ్యం.

పన్నెండు సంవత్సరాల పర్యంతం, కేవలం పన్నెండు సంవత్సరాలనే అనడ మెందుకు? జీవితాంతం ఏకాగ్రతను అభ్యసించిన ఫలితంగా శ్రీరామకృష్ణుల మనస్సు ఏ మేరకు ఏకాగ్రమయ్యేదంటే, ఆయన దానిని ఎప్పుడు, ఎక్కడ, ఏ పనిలో నియుక్తం చేస్తారో, అది అక్కడే ఆ పనిలోనే మగ్నమై ఉండిపోయేది; అటూ ఇటూ కూడా తొంగిచూడడం కూడా ఉండదు. ఎప్పుడు ఏ భావం ఆయన మనస్సులో జనించేదో, అప్పుడు ఆయన

మనశ్శరీరాలు ఆ భావాన్ని మాత్రమే అభివ్యక్తం చేసేవి. ఆయన మనశ్శరీరాలు ఆయనకు అంతగా వశవర్తులై ఉండేవంటే, అది అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. దీనిని విశదీకరించడం ఎంతో కష్టం. మన మనస్సులను పరికించి చూస్తే రకరకాల భావనలు ఏకకాలంలో అక్కడ రాజ్యం చేస్తూవుండడం, అభ్యాస ఫలితంగా వాటిలో ఏది బలీయమై ఉంటుందో, అదే భావన మనం ఎంత అణగద్రొక్క ప్రయత్నించినా ఫలితం లేకుండా, అభివ్యక్తం కావడం మనం గమనించవచ్చు. శ్రీరామకృష్ణుల మనోనిర్మాణం మన మనస్సులకంటే ఎంతో విభిన్నమైనదో కదా!

పై విషయాన్ని తేటతెల్లపరిచే మరెన్నో దృష్టాంతాలను పేర్కొనవచ్చు. ఒక రోజు శ్రీరామకృష్ణులు కాళీమాతకు ప్రణామం చేయడంకోసం తమ గదినుండి బయలుదేరారు. తమ గది నుండి తూర్పు వసారా వద్దకొచ్చి, మెట్లు దిగి, ఆలయ ప్రాంగణంగుండా తిన్నగా కాళికాలయానికి వెళ్లారు. కాళికాలయానికి వెళ్లే దారిలోనే రాధాగోవిందాలయం ఉంది. కాళికాలయానికి వెళుతున్నప్పుడు, ఆయన అనుకొని ఉంటే ముందుగా రాధాగోవిందాలయాన్ని దర్శించుకొని, తరువాత కాళికాలయానికి వెళ్లివుండవచ్చు. కాని ఎన్నడూ ఆయన అలా చేయలేకపోయేవారు. తిన్నగా కాళికాలయానికే వెళ్లేవారు. వెనక్కు తిరిగి వస్తున్నప్పుడు మాత్రమే ఆయన రాధాగోవిందాలయాన్ని సందర్శించేవారు. కాళీమాత పట్లే ఆయనకు అపరిమితమైన భక్తిప్రపత్తులు ఉండడం వలననే ఆయన అలా చేస్తున్నారని ఆ రోజులలో మేం భావించేవారం. ఒక రోజు ఆయనే మాతో ఇలా చెప్పారు: ''ఎందుకు ఇలా జరుగుతున్నదో మీరు చెప్పగలరా? కాళీమాత దర్శనానికి వెళ్లాలని అభిలషించగానే, తిన్నగా అక్కడకే వెళ్లవలసి వచ్చేది. అటూ ఇటూ కాసేపు పచార్లు చేసి లేదా రాధాగోవిందాలయాన్ని సందర్శించుకొన్నాక కాళికాలయానికి వెళ్లడం నాకు అసాధ్యంగా తోచేది. ఎవరో నా కాళ్లు పట్టుకొని తిన్నగా కాళికాలయానికే తోడ్కొని పోతున్నట్లు అనిపించేది; అటూ ఇటూ కాళ్లు తిప్పడం కూడా నాకు సాధ్యం కాకపోయేది. కాళీమాత సందర్శనానంతరం మాత్రమే ఎక్కడికైనా పోగలిగేవాణ్ణి. ఎందుకు అలా జరుగుతున్నదో చెప్పగలరా?''

21. శ్రీరామకృష్ణుల అంతర్ముఖత్వానికి మరి కొన్ని దృష్టాంతాలు

మా అజ్ఞానాన్ని ఒప్పుకొని లోపల ఇలా అనుకొన్నాం: 'ఇలా కావడం సాధ్యమా? ఇష్టపడితే ముందే రాధాగోవిందులకు మ్రొక్కి, పిదప కాళికాలయానికి వెళ్లవచ్చు కదా! కాళీమాతను దర్శించాలనే ఆకాంక్ష బలీయమైనదవడం వలన బహుశా అలా చేయలేకపోతున్నారు కాబోలు.' కాని మా

ఆలోచనలను మాటల ద్వారా ఒకేసారి వ్యక్తం చేయలేకపోయాం. శ్రీరామ కృష్ణులే అప్పుడప్పుడు పై ప్రశ్నలకు ఇలా సమాధానం చెప్పేవారు: "ఏమిటో తెలుసా? ఎప్పుడు ఏది చేయాలనే సంకల్పం నాలో జనిస్తుందో, తక్షణమే దానిని చేసే తీరాలి, ఒక్క క్షణం ఆలస్యమైనా మనస్సు సహించదు." ఏకాగ్రత సంతరించుకొన్న మనస్సు అటువంటి అవస్థను పొందుతుందనే విషయం మేం అప్పుడు గ్రహించామా ఏమిటి? ఎంతో కాలానికి మునుపే శ్రీరామకృష్ణుల మనస్సు పరిపూర్ణ ఏకాగ్రత స్థితిని చేరిందనీ, దాన్లో ఇక తద్భిన్నంగా ఎటువంటి భావాలూ జనించే అవకాశమే లేదనే విషయం మా కప్పుడు అవగతమైందా ఏమిటి?

అప్పుడప్పుడు మళ్లీ ఆయన ఇలా చెప్పేవారు: "ఇలా చూడండి. నా మనస్సు నిర్వికల్ప స్థితిలో నెలకొని ఉన్నప్పుడు, నువ్వు - నేను, చూడడం - వినడం, మాట్లాడడం - మౌనం వహించడం ఇత్యాదులన్నీ లుప్తమై పోతాయి. ఆ స్థితినుండి రెండు మూడు మెట్లు దిగి వచ్చిన తరువాత కూడా పలువురితో లేదా పలు వస్తువులతో వ్యవహరించడం సాధ్యం కానంత ప్రగాఢ దివ్యపారవశ్యం నాలో నెలకొనే ఉంటుంది. ఆ స్థితిలో భోజనానికి కూర్చుంటే, యాభై రకాల వంటకాలు నా ముందు వడ్డించివున్నా, నా చేయి వాటన్నిటి వైపుకూ పోలేదు; ఒక్క వంటకాన్నే అందుకోగలుగుతుంది. అటువంటి అవస్థలు కలిగినప్పుడు అన్నం, పప్పు, కూరలు, పాయసం అన్నీ కలగాపులగం చేసి తినవలసి వచ్చేది." నిర్వికల్పావస్థ నుండి రెండు మూడు మెట్లు క్రిందికి దిగివచ్చిన స్థితి వర్ణన విని మేం విస్తుపోయాం.

మళ్లీ శ్రీరామకృష్ణులు ఇలా కొనసాగించేవారు: "ఎవరినీ స్పృశించలేని మరొక అవస్థ కూడా అప్పుడప్పుడు కలిగేది. ఆ స్థితిలో వీరెవ్వరైనా (భక్తులను చూపుతూ) నన్ను స్పృశిస్తే బాధతో అరవవలసి వచ్చేది." అటువంటి అవస్థలో శ్రీరామకృష్ణుల మనస్సులో శుద్ధసత్త్వగుణం ఎంత ఉద్ధృతమౌతుం దంటే, కించిత్తు అపవిత్రతను సైతం స్పృశించడానికి ఆ మనస్సుకు అసంభవమని అప్పుడు మాలో ఎవ్వరైనా అర్థం చేసుకోగలిగామా ఏమిటి? మళ్లీ ఆయన ఇలా చెప్పేవారు: "మరొకప్పుడు భావపారవశ్యంలో అతణ్ణే (ప్రేమా నందస్వామిని చూపుతూ) మాత్రమే స్పృశించగల స్థితి నాకు కలిగేది. ఆ సమ యంలో అతడు నన్ను ఆసరాగా పట్టుకొన్నా[1], నాకు బాధ కలిగేది కాదు. అతడు తినిపిస్తే తినగలిగేవాణ్ణే."

---

1. భావపారవశ్య స్థితిలో శ్రీరామకృష్ణులకు దేహస్మృతి పూర్తిగా ఉండేది కాదు. అటువంటి సమయంలో తల, మెడ, చేతులు వంగిపోయేవి; కొన్ని సందర్భాలలో దేహమంతా ఒక ప్రక్కకు →

22. ఒక భక్తురాలిని దక్షిణేశ్వరానికి రమ్మని శ్రీరామకృష్ణులు ఆహ్వానించడం

అన్యమనస్కులై శ్రీరామకృష్ణులు క్రితం రోజు రథాన్ని త్రిప్పిన వలయాకార వసారాలో పచార్లు చేయసాగారు. అప్పుడు హఠాత్తుగా ఆయన వెనక్కు తిరిగి, ఆ భక్తురాలు తనను అనుసరించి రావడం చూశారు. ఆమెను చూసిన తక్షణమే, ఆయన నిలబడిపోయి, ''అమ్మా ఆనందమయీ, అమ్మా ఆనందమయీ'' అంటూ పదేపదే ఆమెకు నమస్కారం చేయసాగారు. ఆ భక్తురాలు కూడా తన తలను ఆయన పాదాల మ్రోల వాల్చి, ఆయనకు ప్రణామం చేసింది. ఆమె అలా చేయగానే, శ్రీరామకృష్ణులు ఆమె ముఖంకేసి తేరిపార చూసి, ''రాకూడదా, అమ్మా, నాతో రాకూడదా?'' అని అన్నారు. ఆయన పలికిన తీరుకు ఆమె ఒక అపూర్వ ఆకర్షణకు లోనైంది. ముప్ఫై ఏళ్ల వయస్కురాలైన ఆమె పల్లకీలో తప్ప ఎక్కడికీ వెళ్లి ఉండలేదు. అటువంటిది ఏ ఆలోచనా లేకుండా శ్రీరామకృష్ణుల వెంట దక్షిణేశ్వరానికి బయలుదేరింది. బయలుదేరే ముందు ఇంట్లోకి పరుగున వెళ్లి బలరాం బాబు భార్యతో, ''గురుదేవులతోపాటు దక్షిణేశ్వరానికి వెళుతున్నాను'' అని చెప్పి వచ్చింది. ఈ భక్తురాలు దక్షిణేశ్వరానికి వెళుతున్నదని విని, మరొక భక్తురాలు చేస్తున్న పనులన్నిటిని విడిచిపెట్టి ఈమెతోపాటు తానుకూడా బయలు దేరింది. ఆ భక్తురాండ్రను తనను అనుసరించి రమ్మని చెప్పి, శ్రీరామకృష్ణులు అదే భావపారవశ్య స్థితిలోనే యోగేన్, చిన్ననరేంద్రుడు, ఇతర బాలభక్తులతో తిన్నగా వెళ్లి పడవలో కూర్చున్నారు. ఆ భక్తురాండ్రు ఇద్దరూ పరుగెత్తి వెళ్లి, కాన్వాస్ కప్పుకు వెలుపలనున్న కొయ్యగచ్చు మీద కూర్చున్నారు. పడవ బయలుదేరింది.

అలా పడవలో వెళుతూన్నప్పుడు ఆ భక్తురాలు, శ్రీరామకృష్ణులతో ఇలా చెప్పింది: ''మనస్ఫూర్తిగా ఆయనను (భగవంతుణ్ణి) ప్రార్థించాలనే కోర్కె నాకు

→

ఒరిగిపోవడం వలన పడిపోవడానికి ఆస్కారం ఉండేది. అలా జరిగినప్పుడు ఎక్కడ పడిపోయి గాయపడతారో అని భయపడి ప్రక్కనే ఉన్న భక్తులు జాగ్రత్తగా ఆయనను పొదవి పట్టుకొనేవారు, వంకరపోయిన అంగాలను సరిచేయడానికి ప్రయత్నించేవారు. అలాగే ఏ దేవతానామం వినడంతో ఆయనకు భావపారవశ్యత కలిగిందో, 'కాళీ, కాళీ' లేదా 'రామ, రామ' లేదా 'ఓం, ఓం' లేదా 'ఓం తత్సత్' - ఇలా ఆ నామాన్ని ఆయన చెవి వద్ద ఉచ్చరించే వారు. కొంతసేపటికి క్రమంగా ఆయన బాహ్యస్మృతిని పొందేవారు. కాని ఏ నామాన్ని వింటూ భావపారవశ్యం పొందారో, దానిని తప్ప ఇతర నామాలను ఆ స్థితిలో ఎవరైనా ఉచ్చరిస్తే ఆయన ఎంతో బాధకు గురి అయ్యేవారు.

కలిగింది. కాని ఎంత ప్రయత్నం చేసినా ఈ పనికిమాలిన మనస్సు వినడం లేదు! నేను ఏం చెయ్యాలి?''

శ్రీరామకృష్ణులు ఆప్యాయంగా ఇలా అన్నారు: ''ఆయన నెందుకు శరణు కోరరాదు? గాలిలో ఎగిరే విస్తరాకులా సంసారంలో మసలుకోవాలి. ఎలాగో గాలికి ఎగిరే తెలుసా? పారేసిన విస్తరాకు గాలి ఎక్కడకు ఎగుర వేస్తుందో అక్కడకు పోతుంది, తన ప్రమేయం లేకుండా. ఇదీ అలాగే. అదే విధంగా భారమంతా భగవంతుని మీదే వేసి, జీవించాలి; దివ్య చైతన్య వాయువు మనస్సును ఏ వైపుకు త్రిప్పుతుందో, ఆ వైపుకే తిర గాలి, అంతే!''

23. గాలికి ఎగిరే విస్తరాకులా మసలుకో

ఇలా మాట్లాడుతూండగా పడవ కాళికాలయ ఘట్టాన్ని చేరింది. పడవ నుండి దిగగానే శ్రీరామకృష్ణులు తిన్నగా 'కాళీగృహం'[1] లోకి వెళ్లారు. ఆలయ ఆవరణకు ఉత్తర దిశన ఉన్న నహబత్[2]లో మాతృదేవి అప్పుడు నివసిస్తూ న్నారు. ఈ భక్తురాండ్రు మాతృదేవిని దర్శింప అక్కడకు వెళ్లారు. ఆమెకు ప్రణామం చేసి తదుపరి కాళికాలయానికి వెళ్లారు. ఈలోపు శ్రీరామకృష్ణులు బాలభక్తులతో కలిసి కాళికాలయానికి వచ్చి, జగజ్జననిని దర్శించి, ప్రణామం చేశారు. తరువాత ఆలయానికి ఎదురుగా ఉన్న నాదమందిరానికి వెళ్లి అక్కడ కూర్చుని, భావపారవశ్యంలో సుమధురంగా పాడసాగారు:

(భువన్ భులాయిదేవి మా భవమోహిని)

అమ్మా, లోకాన్నంతా మాయతో కప్పిపుచ్చావే । మూలాధార చక్రంలో,
పెద్ద పద్మంలో కూర్చుని వీణ వాయిస్తూ ఆనందిస్తూవుంటావు.
ఈ దేహంలో ఉంటూ ఈ దేహాన్నే వాద్య పరికరంగా మార్చి,
త్రిగుణాలనే మూడు స్వరాలలో సంచరిస్తూ ఇడ, పింగళ, సుషుమ్నా

---

1. శ్రీరామకృష్ణులు కాళికాలయాన్ని 'కాళీగృహం' అనీ, రాధాగోవింద ఆలయాన్ని 'విష్ణుగృహం' అనీ సంబోధించేవారు.

2. దేవాలయాలలో సన్నాయి ఇత్యాది మేళతాళాలు చేయడానికి ప్రత్యేకమైన చిన్న గదులను కడతారు. వంగ భాషలో ఈ గదులను 'నహబత్ ఖాన్' అని పేర్కొంటారు. దక్షిణేశ్వర కాళి కాలయానికి రెండు ప్రక్కల రెండు ప్రత్యేకమైన వాద్యమందిరాలు ఉన్నాయి. ఆలయానికి ఉత్త రంగా ఉన్న రెండంతస్తుల 'నహబత్'లో మాతృదేవి వసించేవారు. ఆమె క్రింది అంతస్తులో పడుకొనేవారు. ఆహార సామగ్రి వగైరాలన్నీ మొదటి అంతస్తులో నిల్వచేసేవారు. వంట మాత్రం క్రిందనే చేసేవారు. కలకత్తా నుండి భక్తురాండ్రు వచ్చి రాత్రిళ్లు బస చేయవలసివస్తే మాతృదేవి పై అంతస్తులో పడుకోవడం కద్దు.

అనే మూడు తంత్రులను మీటుతూ ఆనందించే నువ్వు
మహామంత్ర స్వరూపిణివి.

అమ్మా, మూలాధారంలో 'భైరవ' రాగంగా, ఆరు దళాల
స్వాధిష్ఠానంలో 'శ్రీరాగం'గా, మణిపూరంలో 'మల్లార' రాగంగా,
అనాహతంలో 'వసంత' రాగంగా అభివ్యక్తమౌతూ హృదయాన్ని
ప్రకాశింప చేస్తూవుంటావు.

అల్లే విశుద్ధ చక్రంలో 'హిందోళ' రాగంగా, ఆజ్ఞాచక్రంలో
'కర్నాటక' రాగంగా అభివ్యక్తమౌతుంది.

గుణత్రయ మనే మాయ జీవుని దృష్టిని కప్పివేయడంచేత
'ఆ పరతత్వం మరుగున పడింది.'

- అని శ్రీ నందకుమార్[1] అంటాడు.

24. దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులు భావ సమాధి పొందడం

కాళీమాతకు ఎదురుగా, నాదమందిరంలో కూర్చుని శ్రీరామకృష్ణులు పై పాటను పాడసాగారు. కొందరు భక్తులు కూర్చుని, నిలబడి ఆ పాటను ముగ్ధులై వినసాగారు. పాడుతూ పాడుతూ భావసమాధిమగ్నులై శ్రీరామకృష్ణులు హఠాత్తుగా లేచి నిలబడ్డారు. పాట ఆగి పోయింది. ఆయన పెదవులపై వెల్లివిరిసిన అద్భుత మందహాసం ఆ మందిరాన్ని ఆనందంతో నింపివేసింది. చేష్టలుదక్కి భక్తులు ఆ పావనమూర్తిని తిలకించసాగారు. అటువంటి అవస్థలో శ్రీరామకృష్ణుల శరీరం ఒకింత వంగడం గమనించి చిన్న నరేంద్రుడు, ఎక్కడ పడిపోతారోనన్న భయంతో ఆయనను పట్టుకోవడానికి ముందుకు వెళ్లాడు. కాని అతడు గురుదేవులను తాకిన మరుక్షణమే ఆయన విపరీతమైన బాధతో అరిచారు. తాను అలా స్పృశించడం అప్పుడు ఆయన భరించలేకున్నారని గ్రహించి చిన్న నరేంద్రుడు కాస్త ఒదిగి నిలబడ్డాడు. ఇంతలో శ్రీరామకృష్ణులు అలా బాధతో అరవడం ఆలయంలోని రాంలాల్ విని ఒక్క పరుగులో అక్కడకు వచ్చి ఆయనను పొదవి పట్టుకొన్నాడు. కొంతసేపటి వరకు శ్రీరామకృష్ణులు అదే స్థితిలో ఉండిపోయారు. పిదప భగవన్నామాన్ని వింటూ వింటూ క్రమేణా బాహ్యస్మృతిలోకి వచ్చారు. కాని అప్పటికీ ఆ 'భావానందం'లోనే ఉండడం వలన మామూలు తీరులో నిలబడలేకపోయారు. ఆయన కాళ్లు తడబడు తున్నాయి.

---

1. ఈ గీత రచయిత.

అటువంటి స్థితిలోనే ప్రాకుతూ ప్రాకుతూ నాదమందిరం మెట్లను దిగుతూ చిన్నపిల్లవాడిలా, "అమ్మా, పడిపోనులే, నువ్వు ఏమంటున్నావు?" అంటూ మాట్లాడసాగారు. అప్పుడు ఆయనను చూస్తే మూడు నాలుగేళ్ల పిల్లవాడని ఎవరికైనా అనిపిస్తుంది. తల్లిని చూస్తూ మాట్లాడుతున్నట్లు, ఆమెనే తేరిపార చూస్తున్నట్లు ఆయన నిబ్బరంగా మెట్లు దిగసాగారు. ఇంత చిన్న విషయంలో సైతం భగవంతుణ్ణే ఈ విధంగా ఆసరా చేసుకొనే వైఖరి మరెక్కడైనా మనం చూడగలమా?

శ్రీరామకృష్ణులు మెట్లు దిగి, ఆలయ ప్రాంగణాన్ని దాటి తమ గదికి పశ్చిమంగా ఉన్న వసారాలోకి వచ్చి, అక్కడ కూర్చున్నారు. ఆయన ఇంకా భావ

25. కుండలినీ దర్శనం - భావావస్థలో మాట్లాడడం

పారవశ్యంలోనే ఉన్నారు. ఆ భావపారవశ్యం ఆయనను వదలిపెట్టేట్లు లేదు. అది ఎక్కువ తక్కువగా ఉంటూనే ఉంది. కొంతసేపు అదే స్థితిలోనే ఉండిపోయి, తన ప్రక్కనే ఉన్న భక్తులతో ఆ భావపారవశ్యంలోనే, "మీరు సర్పాన్ని (కుండలినీ) చూశారు? అది నన్నెంతో ఇబ్బంది పెడుతోంది" అని చెప్పసాగారు. మళ్లీ, వెంటనే భక్తుల విషయం మరిచిపోయి, సర్పాకృతిలో ఉన్న ఆ కుండలినీని ఉద్దేశించి (భావావస్థలో ఆయన కుండలినీని అప్పుడే దర్శించారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు), "ఇప్పుడు వెళ్లిపో, నేను పొగ త్రాగి, ముఖం కడుక్కోవాలి; పళ్లు తోముకోవాలి" అని అన్నారు. ఇలా ఒకసారి భక్తులతోను, మరొకసారి భావావస్థలో దర్శిస్తూన్న ఆ మూర్తితోను మాట్లాడుతూ మాట్లాడుతూ శ్రీరామకృష్ణులు క్రమంగా సహజావస్థలోకి వచ్చారు.

శ్రీరామకృష్ణులు మామూలు స్థితిలో ఉన్నప్పుడు భక్తుల నిమిత్తం ఆందోళన చెందేవారు. తమతోపాటు వచ్చిన భక్తుల ఆహారం కోసం ఇప్పు

26. భక్తుల ఆహార విషయంగా శ్రీరామకృష్ణులు ఆందోళన చెందడం

డాయన ఆరాటపడ్డారు. కూరగాయలు ఏవైనా నిల్వ ఉన్నాయేమోనని తెలుసుకురమ్మని మాతృదేవి వద్దకు ఒకరిని పంపారు. కూరగాయలు ఏవీ లేవని ఆమె నుండి జవాబు వచ్చింది. ఎవరు అంగడికెళ్లి కూరగాయలు కొని తెస్తారోనని మళ్లీ శ్రీరామకృష్ణులు ఆందోళన పడ్డారు. అంగడి నుండి కూరగాయలు కొని తీసుకురాకపోతే, కలకత్తా నుండి వచ్చిన భక్తుల భక్తురాండ్రకు భోజనం పెట్టడం ఎలా అనే చింతనలో పడ్డారు శ్రీరామకృష్ణులు. కాసేపు యోచించి చివరకు ఆ ఇద్దరు భక్తురాండ్రను, "మీరు బజారు కెళ్లి కూరగాయలు కొని తీసుకురాగలరా?' అని అడిగారు. వాళ్లు "సరే"నని వెంటనే బజారుకెళ్లి ఆకు కూరలు, బంగాళాదుంపలు, రెండు పెద్ద వంకాయలు కొని తెచ్చారు.

మాతృదేవి వాటి నన్నిటిని వండింది. ఆలయం నుండి శ్రీరామకృష్ణుల వంతుగా ఒక పళ్లెం నిండా మామూలుగా వచ్చే కాళీమాత ప్రసాదం కూడా వచ్చింది. శ్రీరామకృష్ణులు భోజనం చేసిన తరువాత, భక్తు లందరూ కూర్చుని ప్రసాదాన్ని ఆరగించారు.

భావపారవశ్యంలో శ్రీరామకృష్ణులను చిన్న నరేంద్రుడు తాకినప్పుడు ఆయన బాధతో అరవడానికి కారణం ఏమిటో తరువాత తెలియవచ్చింది. చిన్ననరేంద్రుడి ఎడమ కణత మీద చిన్న కురుపు లేచి క్రమంగా పెద్దది కాసాగింది. తదనంతరం ఆ కురుపు మరింత బాధాకరంగా తయారవుతుందని, వైద్యులు మందులు పూసి దానిని పుండులా చేశారు. ఒంటి మీద పుండు ఉన్నప్పుడు దేవతామూర్తులను స్పృశించరాదనే విషయం మేం ఇంతకు మునుపే వినివున్నాం. కాని ఆ లోకోక్తి మా కళ్లముందే సత్యమని ఋజువవుతుందని ఎవరు కలగన్నారు? భగవద్భావంలో తన్మయులై సంపూర్ణ బాహ్యస్మృతి కోల్పోయిన పరిస్థితిలో కూడా అంతర్నిహితంగా ఉన్న ఆ దివ్యశక్తి ఆయనను అలా ప్రవర్తింప చేయడం మనం అవగతం చేసుకోలేకపోయినా, ఆయన బాధపడడం మాత్రం సందేహాతీతమే. చిన్ననరేంద్రుడు పవిత్రత పట్ల గురుదేవులకు ఎంత ఉన్నత అభిప్రాయం ఉందో మేం ఎరిగేవున్నాం. సామాన్య అవస్థలో ఉన్నప్పుడు అతడి శరీరంలో పుండు ఉన్నప్పటికీ, ఇతరు లందరి మాదిరిగా చిన్ననరేంద్రుణ్ణి తాకేవారు, తమ పాదాలను స్పృశింపనిచ్చేవారు, అతడితో కలిసిమెలిసి ఉండేవారు. అటువంటప్పుడు భావావస్థలో మాత్రం తన స్పర్శను పుండు కారణంగా శ్రీరామకృష్ణులు సహించలేరనే విషయం పాపం చిన్ననరేంద్రుడు ఎలా తెలుసుకోగలడు? ఆ తరువాత పుండు ఆరిపోయేటంత వరకు, శ్రీరామకృష్ణులను భావావస్థలో చిన్ననరేంద్రుడు స్పృశించలేదు.

శ్రీరామకృష్ణులు చేస్తున్న వివిధ భగవత్ప్రసంగాలను వింటూ, ఆ రోజంతా ఎలా గడిచిపోయిందో ఎవరికీ తెలియరాలేదు. సాయంకాలం సమీపించడంతో భక్తులు తమ ఇళ్లకు బయలుదేరారు. ఆ ఇద్దరు భక్తురాండ్రు శ్రీరామకృష్ణుల వద్ద, మాతృదేవి వద్ద సెలవు పుచ్చుకొని కాలినడకన కలకత్తాకు బయలుదేరారు.

27. శ్రీరామకృష్ణుల బాలక స్వభావం

పై సంఘటన జరిగిన రెండు మూడు రోజులు గడిచాక ఒకనాటి మధ్యాహ్నం శశధర పండితుడు శ్రీరామకృష్ణుల దర్శనార్థం దక్షిణేశ్వరానికి రానున్నాడని తెలియవచ్చింది. ఎవరైనా ప్రముఖ వ్యక్తి తమను చూడడానికి వస్తున్నాడని వింటే బాలక స్వభావులైన శ్రీరామకృష్ణులు అనేక సందర్భాలలో భయపడడం కద్దు. తమకు చదువు

సంధ్యలు లేవని సంకోచపడేవారు. అంతేగాక ఎప్పుడు భావసమాధి కలుగుతుందో తమకే తెలియదాయె; ఎప్పుడు బాహ్యస్మృతి కోల్పోతారో, కట్టుబట్ట సైతం ఊడిపోతుందో ఆయనకే తెలియరాదు. అటువంటి పరిస్థితిలో క్రొత్తగా వచ్చిన వ్యక్తి తమను చూసి ఏమనుకొంటాడు, ఏమంటాడు? అని ఆందోళన చెందేవారు.

ఆయన అలా కంగారుపడడం చూసి మాలో మేం, 'క్రొత్తగా వచ్చే వ్యక్తి తమను గురించి ఏమనుకొంటే ఏమిటి? ఏమంటే ఏమిటి? దానిని గురించి ఆయన ఎందుకు అంతగా కంగారుపడాలి?' అని అనుకొనేవారం. ఆయనే స్వయంగా అనేకులకు, "లోకులు కేవలం పురుగులు. సిగ్గు, ద్వేషం, భయం ఉన్నంతవరకు ఆధ్యాత్మికత కించిత్తూ ఒంటపట్టదు" అని ఉపదేశించడం కద్దు. అటువంటప్పుడు ఆయన కూడా పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడుతున్నారా ఏమిటి?

కాదు. బాగా పరిశీలించి చూస్తే కనిపించేది ఏమిటి? చిన్నపిల్లవాడు క్రొత్తవ్యక్తిని చూసినప్పుడు భయంతో, సిగ్గుతో కుంచించుకుపోతాడు. కాని ఒకింత పరిచయం ఏర్పడ్డాక ఆ వ్యక్తి ఒళ్లోకి ఉరుకుతాడు, భుజాలపైకెక్కి-తల వెంట్రుకలను పుచ్చుకొని లాగుతూ, చిలిపి చేష్టలు చేస్తాడు. శ్రీరామకృష్ణుల వైఖరికూడా సరిగ్గా అలాగే ఉండేది. నిజానికి ఆయన పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడే వ్యక్తే అయిన పక్షంలో మహారాజా యతీంద్రమోహన్, సుప్రసిద్ధుడైన కృష్ణదాస్ పాల్ వంటి వ్యక్తులతో ఆయన అసలు ఆ తీరులో మాట్లాడి ఉండేవారా ఏమిటి![1]

మళ్లీ తమను చూడడానికి వచ్చిన వారి కెక్కడ కీడు వాటిల్లుతుందోనని శ్రీరామకృష్ణులు కొన్ని సందర్భాలలో భయపడడం కద్దు. ఎందుకంటే, తమ ప్రవర్తన, వ్యవహరించే తీరు ఆ కొత్తవ్యక్తి ప్రశంసించినా లేకున్నా ఆయన అసలు పట్టించుకోరు. కాని తమను అవగతం చేసుకోలేక దూషించిన ఆ కొత్తవ్యక్తికి కీడు వాటిల్లడం తథ్యం; అందుకే ఆయన భయపడేవారు. ఒక సందర్భంలో

---

1. మహారాజా యతీంద్ర మోహన్‌ను ప్రప్రథమంగా చూడగానే శ్రీరామకృష్ణులు, "కాని, చూడండి, నేను మాత్రం నిన్ను 'రాజు' అని పిలువలేను సుమా! ఎలా అబద్ధం చెప్పగలను?" అని అన్నారు. మళ్లీ అతడు తనను యుధిష్ఠిరునితో పోల్చుకొని మాట్లాడినప్పుడు శ్రీరామకృష్ణులు విసుక్కొని, అతడి వైఖరిని బాహాటంగా విమర్శించారు.

అలాగే లోకోపకారం కంటే పరమధర్మం మరొకటి లేదని కృష్ణదాస్ పాల్, ఒక సందర్భంలో శ్రీరామకృష్ణులతో వాదించినప్పుడు, ఆయన ఎంతో విసుగు చెంది, అతడి బుద్ధి లోపాన్ని ఎత్తిచూపారు.

గిరీశ్ చంద్రఘోష్ అభిమానం దెబ్బతినడంతో కోపంలో శ్రీరామకృష్ణులను ఆయన సమక్షంలో నానాదుర్భాషలాడాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు, ''చూడండి, అతడు నన్ను గురించి ఏమన్నా అననివ్వండి. మా తల్లిని దుర్భాషలాడనంత వరకు ఫరవాలేదు'' అని అన్నారు.

శశధర పండితుడు తమను చూడడానికి వస్తున్నాడని విన్నప్పటి నుండి శ్రీరామకృష్ణుల భయానికి అంతులేకపోయింది. తమ వద్దనే ఉన్న యోగేన్, చిన్ననరేంద్రుడు తదితర భక్తులతో ఆయన, ''పండితుడు వచ్చినప్పుడు మీ రందరూ కూడా ఇక్కడే ఉండండి'' అని అన్నారు. అలా చెప్పడంలో ఆయన ఉద్దేశం ఇది : తాము నిరక్షరాస్యులు కనుక విద్యావంతుడైన పండితుడితో సముచిత రీతిలో మాట్లాడలేరు. కాబట్టి వాళ్లంతా అక్కడే ఉండి పండితుడితో మాట్లాడి తమను ఆ ఇబ్బంది నుండి గటెక్కించాలి. ఆహ్, చిన్నపిల్లవాడిలా ఆయన ఇలా భీతి చెందడం గురించి ఇతరులకు వివరించడం ఎంత కష్టం! కాని శశధర్ రాగానే శ్రీరామకృష్ణులు మరో రకంగా మారిపోయారు. చిరునవ్వు చిందిస్తూ, అర్ధబాహ్యావస్థకు చేరి, ఆప్యాయంగా పండితుడితో, ''మీరు పండితులు. దయచేసి ఏమైనా సెలవియ్యండి'' అని అన్నారు.

28. శశధర పండితుడు శ్రీరామకృష్ణులను రెండవ సారి కలుసుకోవడం

శశధర్: మహాశయా! వేదాంత అధ్యయనంతో నా గుండె ఆర్చుకుపోయింది. అందుకే భక్తిరసం కించిత్తు గ్రోలాలని మీ వద్దకు వచ్చాను. కనుక మీరే ఏమైనా సెలవియ్యండి, వింటాను.

శ్రీరామకృష్ణులు *(ఆప్యాయంగా)*: నేనేం చెప్పగలను? సచ్చిదానందం ఎటువంటిదో చెప్పడానికి ఎవరికీ సాధ్యంకాదు. అందుకే మొదట్లో ఆయన అర్ధనారీశ్వరుడైనాడు. ఎందుకని? ఎందుకంటే పురుషుడు - ప్రకృతి - రెండూ తానే అని చూపడం కోసం. తదనంతరం ఆ అవస్థ నుండి ఒక మెట్టు క్రిందికి దిగి పురుషుడు వేరుగా, ప్రకృతి వేరుగా అయ్యాడు.

ఆ విధంగా నిగూఢ ఆధ్యాత్మిక తత్త్వాలను వివరిస్తూ శ్రీరామకృష్ణులు ఉత్తేజభరితులై లేచి నిలబడి శశధర్‌ను ఉద్దేశిస్తూ ఇలా చెప్పసాగారు: ''మనస్సు సచ్చిదానందంలో లీనం కానంతవరకు భగవంతుణ్ణి ప్రార్థించడం, లౌకిక విధులు నిర్వర్తించడం కొనసాగుతాయి. మనస్సు పరమాత్మలో లీనమైపోయిన తదుపరి లౌకిక విధులను నిర్వర్తించే అవసరం ఇక ఉండదు. ఉదాహరణకు 'నా నితాయ్ మదపుటేనుగు' (నితాయ్ ఆమార్ మాతా హాతీ) అనే పాటను తీసుకోండి. పాట ప్రారంభమైనప్పుడు పాటలోని పదాలు, లయ, తాళం, రాగం, అర్థం - వీటన్నిటి మీద అధిక శ్రద్ధ వహించి పాడతాం. అలా పాడుతూ

పాడుతూ మనస్సు పాట భావంలో లీనం కాసాగానే కేవలం ‘మదపు టేనుగు, మదపు టేనుగు’ అని మాత్రం ఉచ్చరిస్తాం. తదనంతరం భావంలో మనస్సు మరింత ప్రగాఢంగా లీనమైనప్పుడు ‘ఏనుగు, ఏనుగు’ అనే పదాలే వెలువడ తాయి. చివరకు భావం తీవ్రమైనప్పుడు ‘ఏ, ఏ’ అని ఉచ్చరిస్తూ నోరు తెరచు కొని ఉంటాం. (మౌనం దాలుస్తాం)

భావావస్థను గురించి అలా వర్ణిస్తూ వర్ణిస్తూ ‘ఏ’ అని ఉచ్చరిస్తూ భావావస్థ పొంది, శ్రీరామకృష్ణులు నోట మాటరాక దాదాపు పదిహేను నిమిషాలపాటు అట్లే నిలబడిపోయారు. ఆ సమయంలో ఆయన ప్రసన్న వదనం దేదీప్యమానంగా ప్రకాశించసాగింది. ఆ భావావస్థ కొంత ఉపశమించిన తరువాత, బాహ్యస్మృతి పొంది మళ్లీ శశధర్‌తో ఆప్యాయంగా మాట్లాడనారం భించారు.

శ్రీరామకృష్ణులు: ఓ పండితుడా నీ (భూతభవిష్యత్తు లన్నిటినీ) లోపలి యావత్తు చూడగలిగాను. నువ్వు సజ్జనుడవి. వంట మొదలైన గృహకృత్యాదు లన్నిటిని పూర్తిచేసి, అందరికీ భోజనం వడ్డించి గృహిణి భుజం మీద తువ్వాలు వేసుకొని స్నానం, బట్టలు ఉతకడం కోసం చెరువుకు వెళుతుంది; మళ్లీ వంటింటికి తిరిగి రాదు. అదే విధంగా నువ్వు కూడా భగవంతుణ్ణి గురించి అందరికీ చెప్పిన తరువాత వెళ్లిపోతావు, మళ్లీ ఎన్నటికీ తిరిగిరావు.

శ్రీరామకృష్ణుల వచనాలు విని శశధర్, ‘‘ఇదంతా తమ అనుగ్రహమే’’ అంటూ పదేపదే ఆయన పాదధూళిని స్వీకరించాడు. విస్తుబోయి శ్రీరామ కృష్ణుల వచనాలు విని, అంతకాలం వరకూ తనకు భగవదనుభూతి కలుగలేదే అని చింతనచేస్తూ, కంట తడిపెట్టుకొన్నాడు.

29. పై సంఘటనను స్వయంగా శ్రీరామ కృష్ణులు ఒక భక్తుడికి వర్ణించిన తీరు

శశధర్ దక్షిణేశ్వరానికి వచ్చిన మర్నాడు మా ఆప్త స్నేహితుడు ఒకడు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చాడు. అతడితో శ్రీరామ కృష్ణులు క్రితం రోజు జరిగిన సంఘటనను వర్ణించిన తీరును మేం ఇక్కడ పొందుపరుస్తున్నాం.

శ్రీరామకృష్ణులు *(ఆప్యాయంగా)*: ‘ఇక్కడ’ (తమకు) పాండిత్యం వంటివి ఏవీ లేవని నీకు తెలుసు కదా! చదువు సంధ్యలు లేని వ్యక్తిని! నన్ను చూడడానికి పండితుడు వస్తున్నాడని విని ఎంతో భయ పడ్డాను. కట్టుబట్ట ఉందో లేదో అనే ధ్యాస కూడా ఉండదు. అయుక్తంగా ఏమైనా మాట్లాడతానేమో నని భయంతో కుంచించుకుపోయాను. నేను అమ్మతో, ‘అమ్మా, నువ్వు తప్ప నాకు శాస్త్రాలూగీస్త్రాలూ ఏవీ తెలియవు. నువ్వే నన్ను కాపాడాలి’ అని అన్నాను. ఆ తరువాత ఎవరితోనో, ‘మీరు ఇక్కడే

ఉండండి' అని చెప్పాను. 'నువ్వు నా కూడా ఉంటే నాకు ఎక్కడలేని ధైర్యం వస్తుంది' అని మరెవరితోనో చెప్పాను. పండితుడు వచ్చి కూర్చున్న తరువాత కూడా భయం పోలేదు. మౌనంగా కూర్చుని, అతడి వైపే చూస్తూ, అతడి మాటలనే వినసాగాను. అప్పుడే అతడి అంతరంగాన్ని చూడగలిగాను. కేవలం శాస్త్రాధ్యయనం వలన ఏమీ ప్రయోజనం లేదని అమ్మ నాకు దర్శింపచేసింది. వైరాగ్య వివక్షతలు లేని శాస్త్రాధ్యయనం నిష్ప్రయోజనం. తక్షణమే సర్రున (తమ శరీరాన్ని చూపుతూ) ఏదో (కుండలినీ) తల వైపుగా ప్రాకింది, భయం మటుమాయమైంది. ముఖం పైకి లేచింది; నోటినుండి మాటలు ఎగజిమ్ముకొంటూ వస్తున్నట్లు అనిపించింది. మాటలు బయటకు వచ్చేకొద్దీ, లోపల నుండి ఎవరో అందించి నెట్టుతూన్నట్లు మాటలు ప్రవాహంలా రాసాగాయి. ఆ ప్రాంతంలో (కామార్పుకూర్) ధ్యానం కొలిచేటప్పుడు 'ఒక సేరు, రెండు సేర్లు' అంటూ ఒకడు కొలుస్తూవుంటే, అతడి వెనుక నుండి మరొకడు ధాన్యం కుప్పను ముందుకు నెట్టుతూవుంటాడు. నా నోటి నుండి మాటలు రావడం కూడా అలాగే ఉంది. నేను ఏం చెబుతున్నానో నా కేమీ తెలియడం లేదు. కాస్త బాహ్యస్మృతి వచ్చాక చూద్దును కదా, అతడు (పండితుడు) ఏడుస్తున్నాడు, పూర్తిగా మారిపోయి కనిపించాడు. ఇటువంటి అవస్థ అప్పుడప్పుడు కలుగుతుంది, భయం కారణంగా. అప్పుడు పదేపదే నేను దేవదారు వనానికి (శౌచం నిమిత్తం) పోవలసివస్తుంది. పడవలో గంగా విహారానికి నన్ను తోడ్కొని వెళ్లడానికి, ఒక ఆంగ్లేయుడితో (క్రైస్తవ ప్రచారకుడు కుక్) వస్తున్నట్లు కేశవ్ కబురు పంపిన సందర్భంలో కూడా నాకు ఇటువంటి అవస్థ కలిగింది. వాళ్లు వచ్చాక నేను పడవలో కూర్చోగానే అదే అవస్థలో నోట మాటలు ప్రవహించాయి. ఆ తరువాత వాళ్లు (మమ్మల్ని చూపుతూ), 'మీరు ఎంతో ఉపదేశించారు' అని చెప్పారు. కాని, నాకు మాత్రం అసలు ఏమీ తెలియదు, నాయనా!''

30. ఇతర అవతార మూర్తుల పట్ల విశ్వాసం ఏర్పడడానికి శ్రీరామకృష్ణుల జీవితం దోహదం చేసింది

శ్రీరామకృష్ణుల అలౌకికావస్థల గురించి మనం ఏం అవగతం చేసుకోగలం? వాటిని గురించి విశదీకరించడం లేదా మా అనుభూతులను వెలిబుచ్చడం ఎలాగో తెలియక స్తబ్ధులమై, ఆశ్చర్యచకితులమై ఉండిపోవలసిందే. అద్భుతమైన ఏదో ఒక శక్తి ఆయన మనశ్శరీరాలను ఆశ్రయించి, తమకే తెలియని ఒక మహాకర్షణతో తనకు నచ్చినవారిని దక్షిణేశ్వరానికి తోడ్కొనివచ్చి, వారిని ఆధ్యాత్మిక ఉన్నతభూములను అధిరోహింపచేసి అసాధారణ రీతులలో క్రీడిస్తుంది. ఇటువంటి సంఘటనలను కళ్లారా చూస్తూన్నా

వాటిలోని మార్మికత అవగతం కాదు. కాని ఫలితాల నుండి పరికించి చూస్తే ఆ అద్భుత సంఘటనలు జరిగాయని అంగీకరించక తప్పదు. అంతకుమించి ఎవ్వరూ తెలుసుకోలేరు.

ఆహా! దురుద్దేశాలతో ఎంతమంది దుష్టులు గురుదేవుల వద్దకు రావడం, భావావస్థలో ఆయన వారిని స్పృశించడం, ఫలితంగా ఆ క్షణంలోనే వారి నైజం యావత్తు ఆమూలాగ్రం మారిపోయి, సరిక్రొత్త జీవితాన్ని పొందడం మే మెన్ని సందర్భాలలో చూడలేదు!

కేవలం స్పర్శ మాత్రంచేత ఏసుక్రీస్తు, మేరీ అనే దుఃఖితురాలికి సరిక్రొత్త జీవితాన్ని అనుగ్రహించాడు. భావపారవశ్యంలో ఒకానొకడి భుజాల మీదికి ఎక్కి కూర్చున్నాడు చైతన్య మహాప్రభువు; ఫలితంగా ఆతడి మనస్సులోని సంశయాలూ, అపనమ్మకాలు తొలగిపోయి, ఆ స్థానే భక్తి ఉదయించింది.

అవతారమూర్తుల జీవితాలలో జరిగిన ఇటువంటి సంఘటనలను గురించి చదివి, వారి వారి శిష్యప్రశిష్యులు తమ తమ సంప్రదాయాలను అసంఖ్యాకులు అనుసరించాలనే ఉద్దేశంతో ఈ కట్టుకథలను అల్లారనీ, నిజమైన ఆధ్యాత్మిక సత్యాలను సాక్షాత్కరించుకొనే మార్గంలో ఇవన్నీ అడ్డంకులనీ మేం ఇంతకు మునుపు భావించేవారం.

నవవిధాన్ (బ్రహ్మ) సమాజం వారు ప్రచురించిన భక్తి చైతన్య చంద్రిక అనే పుస్తకంలో శ్రీహరి నామాన్ని వింటూ చైతన్యులు బాహ్యస్మృతి కోల్పోయేవారని వ్రాసివుండడం చూసి, ఆ రచయితకు మతిచెడి ఉండాలని మేం భావించిన విషయం మాకు జ్ఞాపకం ఉంది. ఎంతటి కూపస్థ మండూకాలమై ఉండివుండేవారమో! శ్రీరామకృష్ణుల సందర్శన భాగ్యమే మాకు దక్కకుంటే మాకు ఎటువంటి దుర్గతి పట్టేదో కదా! 'ఇల్లు కట్టలేకపోయినా కట్టడంలోని లోపాలను గ్రహించగలిగే జ్ఞానాన్ని' శ్రీరామకృష్ణుల సందర్శన భాగ్యం వలన సంతరించుకొన్నాం. మా దౌర్భాగ్య సందేహాస్పద మనస్సులు ఎన్ని సంశయాలు లేవనెత్తినా లేదా మోసగాళ్ళు ఏదంటే దాన్ని మతంగా ప్రచారం చేసినా తక్షణమే అంగీకరించక, అది నిజమైన మతమో కాదో గ్రహించి వారి బారినుండి తప్పించుకోగల జ్ఞానమైనా మా కిప్పుడు ఉదయించింది.

సాధారణ వస్తువులలా భక్తి విశ్వాసాదులను సమర్థుడైన వ్యక్తి ఇతరులకు ప్రత్యక్షంగా అందించవచ్చునని ఇప్పుడు తెలుసుకొన్నాం. అహేతుక కృపాసాగరులైన శ్రీరామకృష్ణుల ఒక్క అనుగ్రహ బిందువును పొంది అమరులం అవడం తథ్యం అనే ఆశ మా హృదయాలను నింపివేసింది.

6. భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు: గోపాలుని తల్లి కథ[1] - మొదటి భాగం

నవీన నీరద శ్యామం నీలేందీవరలోచనం ।
పల్లవీ నందనం వందే కృష్ణం గోపాల రూపిణం ॥
స్ఫురద్బర్హదలోద్బద్ధ నీలకుంచిత మూర్ధజం ।

[నవీన నీరద శ్యామునికి, నీలికమలనేత్రునికి, గోపికానందప్రదాయకునికి, నీలిరంగు శిరోజాలపై చక్కని నెమలిఫించాన్ని ధరించిన వానికి, గోపాల రూపియైన శ్రీకృష్ణునికి ప్రణతులు.]

యోయో యాంయాం తనుం భక్తః శ్రద్ధయాఽర్చితుమిచ్ఛతి ।
తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥ -భ.గీ. 7-21

[శ్రద్ధతో ఏఏ భక్తుడు ఏఏ దేవతామూర్తిని ఆరాధింపగోరతాడో, ఆయా భక్తునికి ఆయా మూర్తియందే సుస్థిర శ్రద్ధను నేను అనుగ్రహిస్తాను.]

---

1. దివ్యభావంలో ప్రతిష్ఠితులైన శ్రీరామకృష్ణులు విశిష్టులైన కొందరి సాధకులతో ఎటువంటి దివ్యలీలలు సలిపేవారో తెలుపడానికి ఉదాహరణగా ఇక్కడ 'గోపాలుని తల్లి' అనుభూతులను, అద్భుత దివ్య దర్శనాలను వర్ణిస్తున్నాం. ఈ కథను చదివి కొందరు అతిశయోక్తిగా ఎంచవచ్చు. ఈ కథలో కించిత్తు కూడా, కనీసం భాషలో సైతం మేం చేర్చలేదని వారికి తెలుపుకొంటున్నాం. శ్రీరామకృష్ణుల సత్యనిష్ఠులైన భక్తురాండ్ర నుండి మేం ఈ వృత్తాంతాన్ని విన్నది విన్నట్లు తు.చ. తప్పకుండా పొందుపరుస్తున్నాం. పైగా వారు 'గోపాలుని తల్లి'ని ప్రశంసించాలనే ఉద్దేశం ఉన్నవారు కూడా కాదు; పైపెచ్చు ఆమె చర్యలను కొన్నింటిని మా సమక్షంలోనే తీవ్రంగా విమర్శించినవారు కూడా.

And whoso shall receive one such little child in my name receiveth Me. - *Matthew XVIII - 6*

[నా పేరిట అటువంటి బిడ్డను ఒక్కడినైనా స్వీకరించిన వాడు నన్నే స్వీకరించిన వాడవుతాడు. - క్రొత్త నిబంధన, మాథ్యూ *XVIII - 6*]

'**గో**పాలుని తల్లి' (గోపాలేర్ మా) ప్రప్రథమంగా శ్రీరామకృష్ణులను ఎప్పుడు కలుసుకొన్నదో మేం కచ్చితంగా చెప్పలేం. కాని 1885 వ సం॥ మార్చ్ లేదా ఏప్రెల్ నెలలో మేం ఆమెను మొట్టమొదటిసారి దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణుల వద్ద చూశాం. అప్పటికే ఆమె ఆరు నెలల నుండి ఆయన వద్దకు వస్తూవున్నదని తెలియవచ్చింది; ఆయనతో బాలగోపాలుని భావంలో దివ్యలీల జరుపుతూ వస్తున్నది. ఆ సందర్భంలో ఆమె శ్రీరామకృష్ణుల గదిలో ఆగ్నేయ ముఖంగా (అంటే శ్రీరామకృష్ణుల వైపుగా), గంగాజలం కూజా ఉన్న చోటు ప్రక్కన కూర్చుని ఉన్నట్లు మాకు జ్ఞాపకం. అప్పటికి ఆమెకు అరవై ఏళ్ల ఉండవచ్చు; కాని అంత వయస్సు ఉన్నట్లు కనపడలేదు. అందుకు కారణం ఆమె ముఖంలో ఆనందం వెల్లివిరిసి ఉండడమే! మమ్మల్ని పరిచయం చేసినప్పుడు, ఆమె ఇలా అన్నది: ''నువ్వు జి - కుమారుడివా? అయితే నువ్వు మా వాడివే! ఆహా, జి-కుమారుడు భక్తుడయ్యాడే! గోపాలుడు[1] ఈసారి ఎవ్వరినీ విడిచిపెట్టడు. (అంటే అందరినీ భగవంతుని వద్దకు తీసుకువెళతాడు) ఒక్కొక్కరిగా అందరినీ ఆకర్షిస్తాడు. సరే, మంచిది. నీతో లౌకికపరమైన బంధుత్వం ఇంతకు ముందు నుంచి ఉన్నది. ఇప్పుడు దానికంటే అత్యంత సన్నిహితమైన (ఆధ్యాత్మిక) బంధుత్వం ఏర్పడింది.''

1. శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి గోపాలుని తల్లి కలుసుకోవడం

1884వ సం॥ డిసెంబర్ నెల. ఆకాశం వినిర్మలంగా ఉంది. ఆ సంవత్సరం నవంబర్ నెల ఆరంభం నుండి కొంచెం చలి మొదలవడం మాకు జ్ఞాపకమే. అంత ఎక్కువ చలిగాని ఎండగాని లేని ఈ హేమంత ఋతువులోనే గోపాలుని తల్లి ప్రప్రథమంగా శ్రీరామకృష్ణులను దర్శించుకొనే భాగ్యం పొందిందని మేం భావిస్తున్నాం.

గంగాతీరాన 'కామార్‌హాటి' అనే గ్రామం ఉంది. పటల్‌డాంగా వాస్తవ్యుడైన కీ.శే. గోవిందచంద్ర దత్తకు ఆ గ్రామంలో ఒక దేవాలయం, ఉద్యానం

---

1. ఆమె శ్రీరామకృష్ణులను గోపాలునిగా భావించేది, గోపాలుడనే పేర్కొనేది. అందుకే ఆమెను గోపాలేర్ మా (గోపాలుని తల్లి) అని పిలుస్తారు.

గోపాలుని తల్లి

ఉన్నవి. ఆ ఆలయ ఉద్యానం నుండే 'వారు' శ్రీరామకృష్ణుల దర్శనార్థం పడవలో వచ్చారు. 'వారు' అని ఎందుకు చెబుతున్నామంటే, ఆ రోజు గోపాలుని తల్లి ఒంటరిగా రాలేదు. పైన పేర్కొన్న గోవిందచంద్ర దత్త వితంతువూ, ఆమెకు దూరపు బంధువూ అయిన కామిని అనే స్త్రీతో కలిసి వచ్చింది. శ్రీరామకృష్ణుల గురించి అప్పటికే కలకత్తాలో అనేకులు ఎరిగివున్నారు. కాబట్టి ఈ స్త్రీ లిద్దరు కూడా ఆయనను గురించి విన్నప్పటి నుండి, ఆ అద్భుతమూర్తిని చూడాలని తహతహ చెందసాగారు. ప్రతి ఏటా నవంబర్ నెలలో గోవిందచంద్రుని గుళ్లో విశేషపూజ చేయడం ఆనవాయితీ. అందుకోసం గోవిందచంద్రుని భార్య ఆ సమయంలో కామార్‌హాటి గ్రామంలోనే బసచేసి, ఆ పూజ ఏర్పాట్లు స్వయంగా చూసుకొనేది. పైగా కామార్‌హాటి గ్రామం దక్షిణేశ్వరానికి కేవలం రెండు మూడు మైళ్ల దూరంలోనే ఉండడం వలన, అక్కణ్ణుండి దక్షిణేశ్వరానికి రావడం ఎంతో అనుకూలం. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని 'కామార్‌హాటి గృహిణి'గా పేరుపొందిన కామిని, గోపాలుని తల్లి దక్షిణేశ్వరంలోని కాళికాలయానికి వచ్చారు.

ఆ రోజు శ్రీరామకృష్ణులు ఆ స్త్రీలను సాదరంగా తమ గదిలో కూర్చోబెట్టి, భక్తిమార్గం గురించి వారికి ఎన్నో ఉపదేశాలిచ్చారు; వారికోసం భక్తిగీతాలు ఆలాపించారు. తరువాత మళ్లీ రావలసిందని చెప్పి, వారికి సెలవిచ్చారు. వాళ్లు సెలవు పుచ్చుకొంటున్నప్పుడు, కామార్‌హాటిలోని తమ ఆలయానికి ఒకసారి రావలసిందని కామిని, ఆయనను ఆహ్వానించింది. వీలుచూసుకొని అలాగే వస్తానన్నారు శ్రీరామకృష్ణులు. ఆయన గోవిందుని భార్యను, గోపాలుని తల్లిని ఎంతగానో ప్రశంసించారు. ఆయన ఇలా అన్నారు: ''ఆహా, వారి కళ్లలో,

ముఖాలలో ఎంత చక్కని భావం వెల్లివిరుస్తున్నదో కదా! భాగవద్భక్తి అనే ప్రవాహంలో వాళ్లు తేలియాడుతున్నారు; కళ్లు తీవ్ర భక్తితో తొణికిసలాడుతున్నాయి. వారి నుదుట తిలకం కూడా చక్కగా నప్పింది.'' అంటే వారి వేషభాషాదులూ, ప్రవర్తనా సహజ రీతిలో వారి అంతరంగ భక్తినే అభివ్యక్తం చేస్తున్నాయి; లోకానికి చాటిచూపాలనే కించిత్తు ప్రయత్నంకూడా వారిలో కానరాలేదు.

2. పాటల్‌డాంగా వాస్తవ్యుడైన గోవింద చంద్ర దత్త ఉదంతం

పాటల్‌డాంగా వాస్తవ్యుడైన గోవిందచంద్ర దత్త కలకత్తాలో పేరుమోసిన ఒక విదేశీయ వాణిజ్యసంస్థకు దళారిగా వ్యవహరించేవాడు. దక్షత, నిరంతర పరిశ్రమల కారణంగా త్వరలోనే అతడు గొప్ప ధనవంతుడయ్యాడు. కాని పక్షవాతం వాతబడడంతో చేస్తున్న వృత్తిని కొనసాగించలేకపోయాడు. ఇది జరగడానికి మునుపే అతడి ఏకైక పుత్రుడు మరణించాడు; పిదప అతడూ మరణించాడు. ఇక బ్రతికి ఉన్నవారు అతడి కుమార్తెలు యజ్ఞేశ్వరి, నారాయణి[1], వారి సంతానమూ. ఆస్తిపాస్తులు బాగానే ఉండడం వలన తన శేషజీవితాన్ని ధార్మిక అధ్యయనంలోను, ధార్మిక కార్యకలాపాలలోను గోవిందచంద్రుడు గడిపాడు. ఇంట్లో రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను పండితులను ఆహ్వానించి చెప్పించడం, కామార్‌హాటీ ఉద్యానంలో రాధాకృష్ణుల విగ్రహాలను వైభవోపేతంగా ప్రతిష్ఠించడం, భాగవతం, ఇతర శాస్త్రాలను పారాయణ చేయించడం, భార్యతోపాటు తులాభారంగా[2] బ్రాహ్మణులకు పేదలకు విలువైన వస్తువులను దానం చేయడం మొదలైన పుణ్యకార్యాలు చేశాడు. విశేషంగా కామార్‌హాటిలో ప్రతిష్ఠితమైన రాధాకృష్ణుల ఆలయంలో తరచు ఏదో ఒక ఉత్సవం జరిపిస్తూ, అక్కడకు వచ్చే అతిథులకు, పేదసాదలకు కడుపార రాధాకృష్ణుల ప్రసాదంతో అన్నసంతర్పణ చేసేవాడు.

3. భక్తురాలైన అతడి భార్య

గోవిందచంద్రుని మరణానంతరం పరమసాధ్వియైన అతడి భార్య చాలా కాలం వరకు భగవత్సేవను వైభవోపేతంగా జరుపుతూ వచ్చింది. ఆ తరువాత కారణాంతరాల వలన ఆస్తిలో చాలాభాగం వారు కోల్పోయారు. అందువలన రాధాకృష్ణుల సేవకు ఎక్కడ

---

1. యజ్ఞేశ్వరికి 'భూత్', నారాయణికి 'నారాణ్' అనేవి ముద్దుపేర్లు.

2. సంపన్నులు త్రాసులో ఒక వైపు తాము కూర్చుని మరొక వైపు తమ బరువుకు సమానంగా ధనమో, ధాన్యమో, బట్టలో ఇత్యాదులు పెట్టి వాటిని దానం చేసే కార్యాన్ని 'తులాభారం'గా పేర్కొంటారు.

గ్రంథాలయ
79093
హైదరాబాద్-500 044.

ఉపేక్ష ఏర్పడుతుందోనని ఆమె కామార్‌హాటీలోనే నివసిస్తూ, పూజాది కార్య కలాపాల పర్యవేక్షణను స్వయంగా తానే చూసుకోసాగింది. ఆమె పాతకాలంనాటి మనిషి, జీవితంలో అనేక కష్టనష్టాలు అనుభవించింది. కనుక ధార్మిక జీవితంలో తప్ప నిజమైన శాంతి మరెక్కడా లభించదనే సత్యాన్ని ఆమె హృదయాంతరాళాలలో గ్రహించింది. కాని ఈ దిక్కుమాలిన సంసారాన్ని అంత సులభంగా వదిలిపెట్టడం సాధ్యమా? కూతుళ్ళు, అల్లుళ్ళు, సమాజం, హోదా, గౌరవం, ఇతర లౌకిక ఆసక్తులను పట్టించుకోవాలి కదా! కాని ఆమె భర్త మరణించిన నాటినుండి కఠోర బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించసాగింది. నాటి నుండి కటిక నేలమీద పడుకోవడం, రోజుకు మూడుసార్లు స్నానం చేయడం, ఒక్కపూట మాత్రమే తినడం, వ్రతం పూజ ఉపవాసం రాధాకృష్ణుల సేవ జపం ధ్యానం దానధర్మాలు చేయడం - వీటితోనే కాలం వెళ్లబుచ్చసాగింది.

4. ఆమె పురోహితుల కుటుంబం : బాల వితంతువైన అఘోరమణి

గోవిందచంద్రుని పురోహిత కుటుంబం కామార్‌హాటి దేవాలయానికి సమీపంలోనే నివసించేది. పురోహితుడైన నీలమాధవ్ బంద్యోపాధ్యాయ్ గౌరవనీయుడైన వ్యక్తి. అఘోరమణి దేవి (కాలాంతరంలో 'గోపాలుని తల్లి') ఆతడి చెల్లెలు. బాలవితంతువు కావడం వలన జీవితాంతం ఆమె పుట్టింట్లోనే గడిపింది. గోవిందుని భార్యను అందరూ 'గిన్నీ', అంటే గృహిణి అని పిలిచేవారు. గృహిణితో సన్నిహిత పరిచయం ఏర్పడినప్పటి నుండి అఘోరమణి తన సమయాన్నంతా రాధాకృష్ణ విగ్రహాల సేవ, పూజాదులలోనే గడపసాగింది. భగవద్భక్తి పెంపొందే కొద్దీ గంగాతీరంలోని ఆ ఆలయంలోనే జీవించాలనే బలమైన కోరిక ఆమెలో కలుగసాగింది. దాంతో గృహిణి అనుమతి పొంది స్త్రీలు వసించే ఒక గదిలో ఆలయ ఆవరణలోనే నివసించసాగింది. రోజుకు ఒకటి రెండుసార్లు మాత్రం పుట్టింటికి వెళ్లివచ్చేది; తక్కిన సమయాన్నంతా దేవాలయంలోనే పావన విధుల నిర్వహణలో గడిపివేసేది.

'గృహిణి'లా కఠోర బ్రహ్మచర్య వ్రతాన్ని, ధార్మికానుష్ఠానాలను అఘోరమణి పాటించేది. ఆ కారణంగా వారిద్దరి అభిప్రాయాలు, ఆలోచనలు ఒకే తీరులో ఉండేవి. అయినా ఒక తేడా ఉంది. 'గృహిణి' సంపన్నురాలు కావడం వలన బాహ్యంగా తన సామాజిక స్థాయికి తగినట్లు వ్యవహరించవలసి వచ్చేది. ఈ ఇబ్బందులేవీ లేనందున అఘోరమణి మరింత స్వేచ్ఛగా వ్యవహరించేది. పైగా బాలవితంతువు కాబట్టి బిడ్డాపాపా లేనందున ఆమెకు కుటుంబ బాధ్యతలంటూ ఏవీ ఉండేవి కావు. ఆమెకున్నదంతా తన ఆభరణాలు అమ్మగా వచ్చిన ఆరు లేక ఏడు వందల రూపాయలే. ఆ మొత్తాన్ని కూడా గృహిణికిచ్చి ప్రభుత్వ

ఋణపత్రాలలో పెట్టించింది. ఆ మొత్తం మీద వచ్చే వడ్డీతో ఆమె సామాన్య జీవనం సాగిపోయేది; అత్యవసరమైనప్పుడు మాత్రం పెట్టుబడి నుండి కొద్దిగా తీసుకొనేది. గోవిందుని భార్యకూడా ఆమెకు, ఆమె అన్నకు అన్ని విషయాల లోను చేదోడువాదోడుగా ఉండేది.

5. అఘోరమణి భక్తి, ఆచార నిష్ఠలు

బాలవితంతువు కావడం వలన అఘోరమణి దాంపత్య సుఖాన్ని ఏనాడూ చవిచూసింది లేదు. ''బాలవితంతువులు మడిని ఎంతగా పాటిస్తారంటే, ఉపయోగించే ముందు ఉప్పును కూడా కడుగుతారు'' అనడం కద్దు. అఘోరమణి కూడా పెరిగి పెద్దయ్యాక ఆ విధంగానే తయారైంది. మడి, నిష్ఠలను తు.చ. తప్పక పాటించేది. ఒక రోజు అన్నం వండి, కుండనుండి శ్రీరామకృష్ణుల కంచంలో అన్నం వడ్డిస్తున్నప్పుడు ఆయన గరిటెను స్పృశించడం తటస్థించింది. కుండలో మిగిలిన అన్నం తిన లేదు సరికదా, గరిటెను గంగలోకి విసిరి పారేసింది. ఈ సంఘటన శ్రీరామ కృష్ణుల దర్శనార్థం ఆమె వస్తూన్న తొలినాళ్లలో జరిగింది.

మాతృదేవి నివసించే వాద్యమందిరంలో (నహబత్‌లో) రెండు మూడు వంటపొయ్యి లుండేవి. అనేక సందర్భాలలో కాళీమాతకు అన్నప్రసాదం నివే దించడంలో చాలా జాప్యం జరిగేది; ఒక్కోసారి మధ్యాహ్నం ఒంటిగంటన్నర దాటేది. శ్రీరామకృష్ణులు అస్వస్థులుగా ఉన్నప్పుడు, మాతృదేవి ఆయనకోసం అన్నం, చారు పెందలకడనే వండిపెడుతూండేది. శ్రీరామకృష్ణులను చూడ డానికి వచ్చి అప్పుడప్పుడు రాత్రిళ్లు అక్కడే బసచేసే భక్తులకోసం చపాతీలు, పప్పు ఆ పొయ్యిల మీదే మాతృదేవి వండేవారు. అలాగే కలకత్తా, తదితర ప్రాంతాల నుండి శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చి రోజంతా మాతృదేవితో గడిపి, కొన్ని సందర్భాలలో రాత్రుళ్లు నహబత్‌లో ఆమెతో గడిపే భక్తురాండ్రకు కూడా మాతృదేవి ఆ పొయ్యిల మీదే వంటచేసి పెట్టేవారు. ఒక రోజు అఘోర మణి లేదా 'కామార్‌హాటి బ్రాహ్మణి' (ప్రారంభంలో శ్రీరామకృష్ణులు ఆమెను ఇలా సంబోధించేవారు) శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చినప్పుడు, మాతృదేవి పొయ్యిని మూడుసార్లు ఆవుపేడ, గంగాజలం మొదలైన వాటితో శుద్ధిచేసిన తరువాత, ఆమె తన అన్నం వండే కుండను పొయ్యిమీద పెట్టింది. ఆమె మడి, ఆచారాలను అంత సునిశితంగా పాటించేది.

చిన్నప్పటి నుండి కామార్‌హాటి బ్రాహ్మణి సున్నిత మనస్కురాలుగానే పెరిగింది. సహాయం చేయమని ఎవరినైనా ప్రాధేయపడడం మాట అలావుం చితే, ఎవరైనా సంకుచితంగా ఒక్క మాట పలికినా ఆమె సహించేది కాదు. పైగా ఎవరైనా తప్పు చేయడం కంటపడితే చాలు, నిర్మొహమాటంగా అతడి ముఖం

మీదే ఆ తప్పు ఎత్తిచూపడానికి జంకేది కాదు. అందువలన ఆమె ఎవరితోను సఖ్యంగా మసలుకోలేకపోయేది. గోవింద చంద్రుని భార్య ఆమెకు ఆలయ ఆవరణలో ఇచ్చిన గది ఉద్యానానికి దక్షిణ సరిహద్దున ఉంది. ఆ గది దక్షిణాన ఉన్న మూడు కిటికీల నుండి గంగానదిని చక్కగా తిలకింపవచ్చు. గదికి ఉత్తరంగా ఒకటి, పశ్చిమంగా మరొకటి, రెండు వాకిళ్లు ఉన్నాయి. అఘోరమణి ఆ గదిలో కూర్చుని, గంగా ప్రవాహాన్ని చూస్తూ, రేయింబవళ్లు జపం చేస్తూవుండేది. కష్టసుఖాలలో ముప్పై సుదీర్ఘ సంవత్సరాల కాలంపాటు ఆ గదిలో గడిపిన తదనంతరమే ఆమె మొట్టమొదటిసారి శ్రీరామకృష్ణులను దర్శించింది.

6. గోవిందబాబు ఆలయంలో వసిస్తూ, అఘోరమణి తపస్సు చేయడం

కామార్‌హాటి బ్రాహ్మణి పుట్టింటివారు బహుశా శాక్తేయులై ఉండ వచ్చు. ఆమె మెట్టింటివారు ఏ సంప్రదాయస్థులో తెలియరావడం లేదు. కాని ఆమె వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించింది; గురువు నుండి 'బాలగోపాల' మంత్రదీక్షను పుచ్చుకొన్నది. ఇందుకు 'గృహిణి'తో ఆమెకున్న సాన్నిహిత్యం కూడా బహుశ ఒక కారణమై ఉండవచ్చు. ఎందుకంటే గోవిందచంద్రుని గురువు వంశస్థులు 'మాల్పార'కు చెందిన గోస్వాములు కనుక. వారు కృష్ణారాధకులు. రాధాకృష్ణ ఆలయం కట్టినప్పటి నుండి ఆ వంశస్థులలో ఒకరిద్దరు తరచు కామార్‌హాటిలో నివసిస్తూ ఉండడం పరిపాటి.

అఘోరమణి బాలవితంతువు కావడం వలన, ఆమెకు బిడ్డలు లేరు; కాబట్టి బిడ్డలమీద తల్లికి ఎటువంటి ప్రేమ ఉంటుందో ఆమెకు అనుభవమైన విషయం కాదు. అయినప్పటికీ భగవంతుడి మీద ఆమెకంత వాత్సల్యభక్తి ఎలా కలిగిందో చెప్పడం కష్టం. పూర్వజన్మ సంస్కారమే అందుకు కారణమని అనేకులు చెబుతారు. ఏది ఏమైనా ఆమెకంత ప్రగాఢ భక్తి ఉందనడం మాత్రం యథార్థమే.

తీవ్రమైన దుఃఖం వాటిల్లినప్పుడు లేదా మరే కారణంగానో ఇంగ్లండు లేదా అమెరికాకు చెందిన మహిళలలో ఆధ్యాత్మిక పిపాస జనించినప్పుడు ఇతరులకు ఉపకారం చేయడం లేదా పేదలకు, బాధితులకు సేవచేయడం రూపంలో ఆ ఆధ్యాత్మికత అభివ్యక్త మౌతుంది. రేయింబవళ్లు ఇతరులకు మంచి చేయడమే వారి ఏకైక లక్ష్యంగా మారిపోతుంది. కాని మనదేశంలో అందుకు పూర్తి విరుద్ధం. కఠోర బ్రహ్మచర్య వ్రతం అవలంబించడం, జపతపాదులు అనుష్ఠించడం, నిష్ఠగా ఆచారాలను పాటించడం రూపంలో మన దేశ మహిళల ఆధ్యాత్మికత అభివ్యక్తమౌతుంది.

7. ప్రాచ్య పాశ్చాత్య మహిళలలో ఆధ్యాత్మికత

ఈ సాధనానుష్ఠానాలు తీవ్రతరమయ్యేకొద్దీ, పరిత్యాగ స్ఫూర్తి వారిలో ఉదయించి, వారు జీవితంలో మరింతగా అంతర్ముఖులవుతారు. మానవ జీవిత పరమోద్దేశం భగవత్సాక్షాత్కారమనే, దానిలోనే నిజమైన శాంతి నెలకొని ఉందనే భావన భారతదేశంలోని ప్రతి స్త్రీ పురుషుల నరనరాల్లో జీర్ణించుకొని పోయింది. కాబట్టి 'కామార్‌హాటి బ్రాహ్మణి' ఏకాంతవాసం, సాధనానుష్ఠానాలు ఇతర దేశస్థులకు విడ్డూరంగా తోచవచ్చునేమో గాని, ఈ దేశంలో అది వింతేమీ కాదు.

శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి చూసినప్పటి నుండి కామార్‌హాటి బ్రాహ్మణికి ఆయనపట్ల వల్లమాలిన ఆకర్షణ ఏర్పడింది. అలా జరగడానికి కారణం ఏమిటో, భవిష్యత్తులో ఈ ఆకర్షణ దేనికి దారితీస్తుందో ఆమె కప్పుడు చూచాయగా కూడా తెలియరాలేదు. ఆయన పట్ల ఆమె కప్పుడు వర్ణనాతీతమైన ఆకర్షణ ఏర్పడిందే కాని, 'ఈయన ఎంతో ఉత్తములు, నిజమైన సన్న్యాసి, భక్తుడు. అవకాశం చూసుకొని మళ్ళీ ఈయన వద్దకు రావాలి' అనే అభిప్రాయం మాత్రమే ఆయన పట్ల కలిగింది. గోవిందచంద్రుని భార్యకు కూడా శ్రీరామకృష్ణుల పట్ల అదేవిధమైన ఆకర్షణ ఏర్పడింది. కాని మళ్ళీ ఆమె ఎన్నడూ దక్షిణేశ్వరానికి వెళ్ళలేదు; బహుశా సమాజం ఎక్కడ తనను తప్పుగా భావిస్తుందోనని జంకి ఉంటుంది. అదేకాక తన కూతుళ్ళ, అల్లుళ్ళ నిమిత్తం 'పాటల్‌డాంగా' ఇంట్లోనే ఎక్కువ కాలం గడపవలసిన అగత్యం వచ్చింది. అక్కడ నుండి దక్షిణేశ్వరం చాలాదూరంలో ఉండడం వలన, ఆమె రావాలనుకొంటే అందరికీ చెప్పి అవసరమైన ఏర్పాట్లు చేసుకొని మరీ రావలసి వచ్చేది. కాబట్టి ఈ పరిస్థితుల రీత్యా ఆమె మళ్ళీ ఎన్నడూ దక్షిణేశ్వరానికి వెళ్ళలేదని భావించవచ్చు.

అఘోరమణికి అటువంటి చిక్కులు ఏవీ లేవు. కొన్ని రోజులు గడిచాక ఒక రోజు జపం చేస్తూవుండగా శ్రీరామకృష్ణులను చూడాలనే ఆకాంక్ష ఆమెకు కలిగింది. వెంటనే రెండు మూడు కాసులతో నాసిరకం సందేష్ అనే తీపి తినుబండారాన్ని కొనుక్కొని, దక్షిణేశ్వరానికి వెళ్ళింది. ఆమెను చూసీచూడగానే శ్రీరామకృష్ణులు బిగ్గరగా, "ఓ, నువ్వు వచ్చావా! నా కోసం ఏం తెచ్చావో ఇవ్వు" అని అన్నారు. "ఎందరో ఎన్నో మంచి తినుబండారాలు తీసుకువచ్చి ఆయనకు తినిపించడం చూసి అటువంటి నాసిరకం సందేష్ తెచ్చినందుకు నేను కుంచించుకుపోయాను. పైగా నేను వచ్చీరాగానే ఆయన ఆ నాసిరకం మిఠాయిని తినాలనగానే, నా పరిస్థితిని మీరు ఊహించుకోవచ్చు" అని ఆ సంఘటన గురించి తదనంతర కాలంలో ఆమె చెప్పేది. సిగ్గు, సంకోచాలు ముప్పిరిగొనగా ఆమె ఏం మాట్లాడ

8. శ్రీరామకృష్ణులను రెండవసారి అఘోరమణి దర్శించడం

లేక తను తెచ్చిన సందేష్‌ను ఆయనకు ఇచ్చింది. ఆయన ఎంతో ఆనందిస్తూ ఆ మిఠాయిని తింటూ, ''డబ్బు ఖర్చుపెట్టి సందేష్‌ను ఎందుకు తెచ్చావు? కొబ్బరి ఉండలను చేసి ఉంచుకొని, ఇక్కడకు వచ్చేటప్పుడు ఒకటి రెండు పట్టుకురా. లేదంటే స్వయంగా నువ్వు వండిన సొరకాయ కూరో, బంగాళా దుంపలతో వండిన వంకాయకూరో, పులుసో ఏదో ఒకటి పట్టుకురా. నీ చేతి వంటకాన్ని తినాలని నా కెంతో కోర్కెగా ఉంది'' అని అన్నారు.

గోపాలుని తల్లి ఇలా చెప్పేది: ''ధార్మిక విషయాల గురించి మాట్లాడ లేదు. కేవలం తినడం గురించే సంభాషణ సాగింది. అప్పుడు నేను ఇలా అను కొన్నాను: 'తిండి, తిండి గురించే మాట్లాడే వింత సాధువును చూడడానికి వచ్చినట్లుంది. నిర్ధనురాలైన నేను ఈయనకు ఎక్కడనుండి అంతతెచ్చి తిని పించగలను? మళ్లీ ఇక్కడకు రానుగాక రాను.' కాని తిరిగిపోతున్నప్పుడు దక్షి ణేశ్వర ఆలయ ముఖద్వారం దాటానో లేదో వెనుక నుండి ఆయన నన్ను ఆకర్షి స్తున్నట్లు అనిపించింది. ముందుకు అడుగు వెయ్యలేకపోయాను. మనస్సు కెంతో నచ్చచెప్పుకొని కాళ్లీడ్చుకొంటూ ఎలాగో కామార్‌హాటి చేరాను.''

ఇది జరిగిన కొన్ని రోజుల తరువాత బ్రాహ్మణి 'ఆకుకూర' పుచ్చుకొని మూడు మైళ్ల దూరం నడిచి పరమహంస దేవులను చూడడానికి వచ్చింది. ఆమె రాగానే, మొదటి మాదిరిగానే శ్రీరామకృష్ణులు ఆమెను అడిగి తీసుకొని ఆ ఆకుకూరను తింటూ, ''ఆహా, ఎంత బాగా వండావో! ఇది అమృతం, అమృతం!'' అంటూ ఆనందించసాగారు. ఆయన ఆనందాన్ని చూసి గోపా లుని తల్లి కళ్లు చెమ్మగిల్లాయి. 'తాను పేదరాలు కావడం వలన ఆయన ఈ సామాన్యమైన వంటకాన్ని అతిగా ప్రశంసిస్తున్నారు' అని ఆమె అనుకొన్నది.

ఈ రీతిలో రెండు మూడు నెలలలో గోపాలుని తల్లి దక్షిణేశ్వరానికి అధికంగా రాసాగింది. క్రమంగా తాను వండిన రుచికరమైన వంటకాలను చేత పుచ్చుకొని కామార్‌హాటి నుండి దక్షిణేశ్వరానికి తీసుకువచ్చేది. శ్రీరామకృష్ణులు వాటిని తనివితీరా ఆరగించేవారు. మళ్లీ ఆయన సామాన్యమైన కూరనో, ఆకునో వండి తీసుకురమ్మని ఆమెతో చెప్పేవారు. ఎప్పుడూ 'ఇది పట్రా, అది పట్రా. ఇది తింటాను, అది తింటాను' అనే విన్నపాల బాధతో అప్పుడప్పుడు గోపాలుని తల్లి ఇలా అనుకొనేది: 'గోపాలా! ఇంతకాలంగా నిన్ను పూజిస్తూ వచ్చినందుకు ఫలితం ఇదా? సదా తిండి తిండి అనే సాధువు వద్దకు నన్ను తీసుకొనివచ్చావు. ఇక మీదట రాను, బాబు!' మళ్లీ అదే తిరుగులేని ఆకర్షణ! 'ఎప్పుడు, ఎంత త్వరగా అక్కడకు మళ్లీ వెళతాను?' అనే ఆలోచనే మళ్లీ ఆమెను తొలచి వేసేది.

ఈలోపు శ్రీరామకృష్ణులు ఒకసారి కామార్‌హాటిలోని గోవిందచంద్రుని ఉద్యానానికి వచ్చి, ఆలయంలో నిర్వర్తింపబడుతున్న పూజాదికాలను చూసి ఎంతో సంతోషించారు. ఆ సందర్భంలో ఆయన భక్తి గీతాలు విగ్రహాల ఎదుట ఆలాపించారు. పిదప ప్రసాదం స్వీకరించి దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చారు. పాటలు పాడుతూన్నప్పుడు ఆయన పొందిన భావపారవశ్యాన్ని చూసి గృహిణి మొదలైన వారంతా ఎంతో ముగ్ధులయ్యారు. కాని తమ ప్రాబల్యం ఎక్కడ తగ్గిపోతుందో నని గోస్వాముల (పురోహితుల) మనస్సులలో అసూయాద్వేషాలు ఒకింత రగిలాయే లేదో చెప్పలేం. యథాతథంగా ఇట్లే జరిగిందని మాత్రం మేం విన్నాం.

9. గోవిందచంద్రుని ఉద్యానానికి శ్రీరామకృష్ణులు వెళ్లడం

రోజు వేకువన రెండు గంటలకు నిద్రలేచి, కాలకృత్యాలు ముగించుకొని, మూడు గంటలకు జపానికి కూర్చోవడం 'కామార్‌హాటి బ్రాహ్మణి' సుదీర్ఘ కాల వాడుక. ఉదయం ఎనిమిది లేక తొమ్మిది గంటలకు జపం పూర్తిచేసి, స్నానం చేసేది. తరువాత ఆలయంలోకి వెళ్లి రాధాకృష్ణులను దర్శించి, ఆలయ సేవాకార్యాలలో పాల్గొనేది. ఆలయంలో పూజ, నైవేద్యాదులు పూర్తికాగానే, మధ్యాహ్నం పన్నెండు గంటలకు తన వంటను చేసుకొనేది. పిదప భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకొని మళ్లీ జపానికి కూర్చునేది. సాయంత్రం మళ్లీ ఆలయంలోకి వెళ్లి సంధ్యాహారతి దర్శించుకొని వచ్చి, రాత్రి బాగా ప్రొద్దుపోయే వరకు జపం చేసేది. తరువాత కాసిన పాలు త్రాగి నిద్రకు ఉపక్రమించేది. ఆమె శరీర నిర్మాణంలో వాయుధాతువు అధికం. కనుక ఆమె చాలా తక్కువ సేపు మాత్రమే నిద్రించేది. అప్పుడప్పుడు గుండెదడ ఎక్కువై ఏదో అస్పష్టమైన వ్యాకులతకు గురి అయ్యేది. ఈ విషయం విని శ్రీరామకృష్ణులు ఆమెతో ఇలా చెప్పారు: "నీ శరీరంలోని ఆ వాయుధాతువు శ్రీహరిపై ధ్యానం చేస్తూన్నందు వలన కలిగింది. దాన్ని నయంచేస్తే, నీ జీవితానికి ఇక ఆసరా ఏముంటుంది? ఆ వ్యాకులత ఏర్పడినప్పుడు ఏదైనా కాస్త తిను, తగ్గుతుంది."

అది 1884వ సంవత్సరం. శీతకాలం గడిచిపోయింది. వసంత ఋతువు ఏతెంచింది. కొంగ్రొత్త చిగుళ్లతో, పువ్వులతో, పక్షుల కిలకిలారావాలతో నిండిన పృథివి ఒకరకం దివ్యోన్మత్తతను అనుభవిస్తూ, మేల్కొన్నది. జీవులు తమ గత సంస్కార ప్రవృత్తుల మేరకు అనుభవించే మంచి, చెడు అనే భేదం ఈ దివ్యోన్మత్తతలో కానరావడం లేదు. సజ్జనులలో ఆ ప్రకృతి సత్సంస్కారాలను, దుర్జనులలో విపరీత భావనలను జాగృతం చేస్తుంది. అదే తేడా.

10. అఘోరమణి బాలగోపాలుని దివ్య దర్శనం పొందడం

అటువంటి వసంత ఋతువు సమయంలో 'కామార్‌హాటి బ్రాహ్మణి' ఒకనాడు వేకువజాము మూడు గంటలకు జపం చేయడానికి కూర్చుంది. జపం ముగించి, జప ఫలాన్ని ఇష్టదేవతకు సమర్పించే ముందు ప్రాణాయామం చేయసాగింది. అప్పుడు తనకు ఎడమ వైపున శ్రీరామకృష్ణులు కూర్చుని ఉండడం చూసింది. ఆయన కుడిచెయ్యి పిడికిలి బిగిసివుంది. స్పష్టంగా, సజీవ మూర్తిగా దక్షిణేశ్వరంలో తాను చూసినట్లే ఆయన కనిపించారు. 'ఇదేమిటి? ఈవేళప్పుడు ఈయన ఇక్కడి కెలా వచ్చారు?' అని అనుకొని ఆమె ఆశ్చర్య పోయింది.

గోపాలుని తల్లి తన అనుభవాన్ని ఇలా వర్ణించింది: ''నేను విస్తుబోయి అలా అవాక్కయి చూస్తూ, ఆలోచిస్తూన్నప్పుడు 'గోపాలుడు' (శ్రీరామకృష్ణు లను ఆమె అలా పేర్కొనడం రివాజు) కూర్చుని, చిరునవ్వులు చిందిస్తు న్నాడు. ఆ తరువాత గుండె దడదడలాడుతూండగా నా చేత్తో గోపాలుని (శ్రీరామకృష్ణుల) ఎడమ చేతిని పుచ్చుకొన్న మరుక్షణమే ఆ మూర్తి అదృశ్య మైపోయాడు. ఆ స్థానే పది నెలల బాలగోపాలుడు, నిజంగానే (చేతు లతో చూపుతూ) ఇంత పెద్దవాడు, ఆ మూర్తినుండి బయల్వెడలి ప్రాకుతూ, ప్రాకుతూ చేయెత్తి నా వంకే చూస్తూ, 'అమ్మా! వెన్న తినిపించు' అని అడిగాడు. ఆ విచిత్ర అనుభవంతో విస్తుబోయాను. పెద్దగా కేకలుపెట్టాను. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఉండివుంటే వాళ్లు పరుగెత్తుకొంటూ అక్కడకు వచ్చేవారు. నేను విలపిస్తూ, 'నాయనా! ఏమీలేని అభాగ్యురాలిని. నీకు ఏం తినిపించగలను? నాయనా, ఎక్కణ్ణుండి వెన్న, పాలు తెచ్చియివ్వ గలను?' అని అన్నాను. ఆ విచిత్ర గోపాలుడు నా మాటలు పట్టించు కొంటాడా? 'తినేందుకు ఏమన్నా పెట్టు' అని సతాయిస్తూనే ఉన్నాడు. నేనేం చేయగలను? ఏడుస్తూ లేచి నిలబడి, ఎండుకొబ్బరి ఉండను తెచ్చి అతడి చేతిలో పెట్టాను. తరువాత, 'నాయనా, గోపాలా! ఈ పనికిమాలిన పదార్థాన్ని తిన డానికి ఇచ్చానని చెప్పి నాకు మాత్రం అటువంటిది తినడానికి ఇవ్వవద్దు' అని చెప్పాను.

''మరిక జపం విషయమో? జపం ఎలా చేస్తాను? గోపాలుడు వచ్చి, ఒళ్లో కూర్చుని జపమాలను లాగేశాడు. నా భుజాల మీదకెక్కాడు, గది చుట్టూ ప్రాకాడు. తెల్లారగానే పిచ్చిదానిలా పరుగెత్తుకొని దక్షిణేశ్వ రానికి వెళ్లాను. గోపాలుడు నా చంకనెక్కి, తలను నా భుజాలమీద ఆన్చాడు. అతణ్ణి వక్షానికి హత్తుకొని, ఒక చెయ్యి అతడి పిరుదుల మీద, మరొక చెయ్యి అతడి వీపుమీద వేసుకొని,

11. ఆ పరిస్థితిలోనే ఆమె శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లడం

కాలినడకన వెళ్లాను. గోపాలుడి వంగవన్నె పాదాలు నా వక్షస్థలంమీద వ్రేలాడడం నేను స్పష్టంగా చూశాను.''

తన ఇష్టదైవ దర్శనం పొందడం వలన కలిగిన భావప్రేమోన్మాదంలో అఘోరమణి ఆనాటి ఉదయం కామార్‌హాటి ఉద్యానం నుండి, దక్షిణేశ్వరానికి నడిచి వచ్చింది. మాకు తెలిసిన మరొక భక్తురాలు ఆ సమయంలో అక్కడ ఉండడం తటస్థించింది. ఆ భక్తురాలినుండి మేం విన్న కథనాన్ని పాఠకులకు ఇప్పుడు తెలుపుతున్నాం. ఆమె ఇలా చెప్పింది:

''నే నప్పుడు శ్రీరామకృష్ణుల గదిని ఊడ్చి, శుభ్రం చేస్తున్నాను. అప్పుడు ఉదయం ఏడు లేక ఏడున్నర గంటలయివుండవచ్చు. ఎవరో, 'గోపాలా, గోపాలా' అని కేకలువేస్తూ శ్రీరామకృష్ణుల గది వైపుకు రావడం వినవచ్చింది. ఆ గొంతు పరిచయం ఉన్న వారిదేననిపించింది. తీరా చూద్దును కదా, వచ్చింది గోపాలుని తల్లి. అస్తవ్యస్తంగా చీర ధరించి పిచ్చిదానిలా కనిపించింది. కనుగుడ్లు నుదుట కెక్కాయి, చీర చెంగు నేలమీద పొరాడుతూన్నది. చుట్టుపట్ల ఏముందో అన్న ధ్యాసకూడా ఆమెకు లేనట్లే ఉంది. ఆ స్థితిలో తూర్పు వాకిలి నుండి ఆమె గురుదేవుల గదిలోకి వచ్చింది. అప్పుడు ఆయన తన చిన్న మంచం మీద కూర్చుని ఉన్నారు.

''గోపాలుని తల్లిని ఆ స్థితిలో చూసి నేను విస్తుబోయాను; ఆమెను చూసి శ్రీరామకృష్ణులు భావసమాధి మగ్నులైనారు. ఈలోపు గోపాలుని తల్లి ఆయన ప్రక్కనవచ్చి కూర్చుంది; శ్రీరామకృష్ణులు చిన్న పిల్లవాడిలా వెళ్లి ఆమె ఒళ్లో కూర్చున్నారు. ఆమె రెండు కళ్లనుండి అశ్రువులు ప్రవహిస్తున్నాయి. అప్పుడామె తనతోపాటు తెచ్చిన వెన్న, మీగడలను స్వహస్తాలతో ఆయనకు తినిపించసాగింది. ఆ దృశ్యం చూసి నేను సంభ్రమాశ్చర్యభరితనైనాను. శ్రీరామకృష్ణులు భావావస్థలో ఏ స్త్రీనిగాని స్పృశించగా ఇంతకుముందు ఎప్పుడు నేను చూడలేదు. కాని ఆయన గురువైన భైరవీ బ్రాహ్మణికి అప్పుడప్పుడు యశోదాభావం కలిగేదనీ, ఆ సమయంలో గురుదేవులు గోపాల భావంలో ఆమె ఒడిలో కూర్చునే వారనీ మాత్రం నేను విన్నాను.

''ఏది ఏమైనా గోపాలుని తల్లి అవస్థను, శ్రీరామకృష్ణుల ఆ భావాన్ని చూసి నేను తెల్లబోయాను. కాసేపటికి ఆ భావం ఉపశమించగా శ్రీరామకృష్ణులు లేచి వెళ్లి తమ మంచం మీద కూర్చున్నారు. కాని గోపాలుని తల్లి ఆ మానసిక వైఖరి మాత్రం ఉపశమించలేదు. పట్టరాని ఆనందంతో ఆమె లేచి నిలబడి, 'బ్రహ్మ నృత్యం చేస్తున్నాడు, విష్ణువు నృత్యం చేస్తున్నాడు' అంటూ పిచ్చిదానిలా గదిలో నృత్యం చేయసాగింది. శ్రీరామకృష్ణులు అదంతా చూసి నవ్వుతూ నాతో, 'అలా

చూడు, ఆమెలో పరమానందం పొంగిపొరలుతూన్నది. ఆమె మనస్సు ప్రస్తుతం గోపాలుని లోకానికి వెళ్లిపోయింది' అని అన్నారు. ఆ తరువాత కూడా గోపాలుని తల్లికి భావావస్థలో అటువంటి దివ్యదర్శనాలు కలిగేవట; ఆ సమయంలో ఆమె మరో వ్యక్తిగా మారిపోయేది. మరో సందర్భంలో భుజించేటప్పుడు ఆధ్యాత్మిక భావోద్వేగంలో మమ్మల్నందరినీ గోపాలురుగా పిలుస్తూ, తన స్వహస్తాలతో మాకు అన్నం తినిపించింది. నా కుమార్తెను మా స్థాయికంటే తక్కువ స్థాయి పిల్లవాడికిచ్చి పెళ్లి చేశానని ఆమెకు మనస్సులో నా పట్ల కొంత అయిష్టత ఉండేది. కాని ఆ రోజు తన అయిష్టతకు ఎంతో వినయంగా క్షమార్పణ చెప్పుకొంది! ఆమె ఇలా చెప్పింది: 'నీలో ఇంత భక్తివిశ్వాసాలు ఉన్నాయని ఇంతకు మునుపు తెలిసిందా? భావావస్థలో 'గోపాలుడు' (శ్రీరామకృష్ణులు) దాదాపు ఎవరినీ స్పృశించలేదు. కాని ఈ రోజు అతడు భావావస్థలో నీ వీపుమీది కెక్కి కూర్చున్నాడే! నువ్వు సామాన్యురాలవా?' " నిజానికి శ్రీరామకృష్ణులు ఆ రోజు గోపాలుని తల్లిని చూసి భావపారవశ్యంలో మొట్టమొదట ఆ భక్తురాలి వీపుమీద కూర్చుని, ఆ తరువాత గోపాలుని తల్లి ఒడిలో కొంతసేపు కూర్చోవడం జరిగింది.

అఘోరమణి భావావస్థలో ఆ రోజు అలా దక్షిణేశ్వరానికి వచ్చి, భావపారవశ్యంలో కన్నీరుమున్నీరై శ్రీరామకృష్ణులతో అనేక విషయాలు చెప్పింది. ఆమె ఇలా చెప్పింది: "నా ఒడిలో గోపాలుడు, అదుగో నీలో ప్రవేశించాడు... ఇదుగో మళ్లీ బయటకు వస్తున్నాడు. రా నాయనా, ఈ పేదతల్లి ఒళ్లో వచ్చి కూర్చో." ఆ చపల గోపాలుడు ఒకసారి శ్రీరామకృష్ణుల శరీరంలో లీనమైపోయేవాడు, మరొకసారి తేజస్వియైన బాలుని రూపంలో ఆమె వద్దకు వచ్చేవాడు. అతడి పిల్లచేష్టలకు అంతే లేదు. ఆ భావోద్వేగంలో ఆమె మునిగిపోయింది; ఆమె తన నియమనిష్ఠలన్నిటినీ విస్మరించింది; అవన్నీ కొట్టుకొనిపోయాయి. భావతరంగాల ఉప్పెనలో మునిగిపోయినప్పుడు ఎవరు మాత్రం తమను అదుపులో ఉంచుకోగలరు?

ఆనాటి నుండి అఘోరమణి నిజంగానే 'గోపాలుని తల్లి'గా మారింది. శ్రీరామకృష్ణులు ఆమెను ఆ పేరుతోనే పిలువసాగారు. అసాధారణమైన ఆమె భావావస్థను చూసి శ్రీరామకృష్ణులు పరమానందభరితులయ్యారు. ఆమెను శాంతింప చేయడానికి తన చేత్తో ఆమె మేనును నిమురసాగారు. గదిలో ఉన్న మంచి భక్ష్యాలను ఆమెకు తినిపించారు. తింటూ తింటూ భావ ప్రభావంలో ఆమె, "గోపాలా, నాయనా, దీనురాలైన నీ తల్లి తన జీవితాన్ని కష్టాలలోనే గడిపింది; రాట్నంతో

12. ఆమె భావావస్థను శ్రీరామకృష్ణులు ప్రశంసించడం

వడికిన నూలు విక్రయించి భారంగా జీవనం సాగిస్తున్నది. అందుకేనా నువ్వు ఈ రోజు ఆమెను ఇంత అభిమానంగా చూసుకొంటున్నావు?'' అని అన్నది.

ఆ రోజంతా ఆమెను, శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలోనే ఉండమన్నారు. ఆమె అక్కడే స్నానంచేసి, భోజనం చేసింది. ఆమెను మరింత శాంతపరచి సూర్యాస్తమయానికి మునుపే కామార్‌హాటికి పంపించివేశారు. భావపారవశ్యంలో కానవచ్చిన బాలగోపాలుడు ఆమె చంకనెక్కి ఆమెతోపాటు కామార్‌హాటికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వెళ్లగానే గోపాలుని తల్లి అలవాటు ప్రకారం ధ్యానానికి కూర్చుంది. కాని జపం చేయడం సాధ్యమా? ఎవరి నిమిత్తం జపం చేస్తూన్నదో, ఎవరిని ధ్యానిస్తూవుందో, ప్రార్థిస్తూ ఇంతకాలం గడిపిందో సాక్షాత్తు ఆతడే తన కళ్లముందు నానారకాల చిలిపిచేష్టలు చేస్తూ, గారాలు పోతుంటే జపం సాగుతుందా! చివరకు బ్రాహ్మణి లేచి గోపాలుణ్ణి తీసుకొని మంచం మీద తన ప్రక్కన పడుకోబెట్టుకొన్నది. ఆమెకు పరుపు, కనీసం దిండు కూడా లేవు. మెత్తని తలగడ లేనందున గోపాలుడు సణుగుడు మొదలుపెట్టాడు. దాంతో ఆమెకు నిద్రపట్టలేదు. ఇక చేసేదిలేక బ్రాహ్మణి తన ఎడమ చేతిని అతడి తలక్రింద పెట్టి జోకొడుతూ ఇలా చెప్పింది: ''నాయనా, ఈ రోజు ఎలాగో నిద్రపో. తెల్లవారగానే కలకత్తాకెళ్లి భూత (యజ్ఞేశ్వరి, కామార్‌హాటి గృహిణి పెద్దకుమార్తె) నడిగి మెత్తని దిండు చేయించి తీసుకువస్తానులే.''

గోపాలుని తల్లి స్వయంగా వంట చేసుకొని, మానసికంగా గోపాలుడికి తినిపించి, పిదప దానిని ప్రసాదంగా స్వీకరించేదని ఇంతకు మునుపే తెలిపివున్నాం. మర్నాడు తన నిజమైన గోపాలునికి త్వరగా వంటచేసి తినిపించడానికి, ఎండుకట్టెలకోసం ఉద్యానానికి వెళ్లింది. గోపాలుడుకూడా తనతో వచ్చి ఎండు పుల్లలు ఏరడం ఆమె కంటపడింది. ఆ విధంగా తల్లీ కుమారులు ఎండు పుల్లలు ప్రోగుచేసుకొన్న తరువాత వంట మొదలైంది. చిలిపి గోపాలుడు ఊరకే కూర్చుంటాడా? ఒకసారి ఆమె ప్రక్కన కూర్చుని, మరొకసారి ఆమె వీపుమీది కెక్కి ఆమె వంటచేసే తీరును పరికించసాగాడు. మధ్యమధ్యలో వ్యర్థప్రసంగం చేస్తూ, అదీ ఇదీ కావాలని మారాం చేయసాగాడు. తీయని మాటలతో, సుతిమెత్తని చీవాట్లతో అతడి అల్లరిని బ్రాహ్మణి అదుపులో పెట్టడానికి ప్రయత్నించసాగింది.

ఈ సంఘటన జరిగిన కొన్ని రోజుల తరువాత గోపాలుని తల్లి ఒక రోజు దక్షిణేశ్వరానికి వచ్చింది. శ్రీరామకృష్ణులను దర్శించుకొని, మాతృదేవి వసించే నహబత్ (వాద్యమందిరం) కెళ్లి, జపం చేయడానికి కూర్చుంది. నియమం

మేరకు జపం పూర్తి చేసుకొని, భగవంతునికి ప్రణామాలర్పించి లేవబో తున్నప్పుడు పంచవటి నుండి శ్రీరామకృష్ణులు అక్కడికి వచ్చారు. గోపాలుని తల్లిని చూడగానే ఆయన, ''ఇప్పుడు కూడా నువ్వు అంతసేపు జపం చేయడ మెందుకు? ఇప్పటికే నువ్వు ఎంతో సాధించావు కదా!'' అని అన్నారు.

గోపాలుని తల్లి : జపం చేయ నవసరం లేదా? సమస్తం సాధించానా?

13. ''నువ్వు సమస్తం సాధించావు'' - శ్రీరామ కృష్ణుల ప్రశంస

శ్రీరామకృష్ణులు : అవును, నువ్వు సమస్తం సాధించావు.

గోపాలుని తల్లి : సమస్తం?

శ్రీరామకృష్ణులు : అవును, సమస్తం.

గోపాలుని తల్లి : మీరు ఏమంటున్నారు? నేను సమస్తం ప్రాప్తించు కొన్నానా?

శ్రీరామకృష్ణులు : అవును, సమస్తం. నువ్వు చెయ్యవలసినంత జపం, తపం, సాధనలు పూర్తిచేశావు. కాని నీకు ఇష్టమైతే జపతపాదులను దీని (తమ శరీరం చూపుతూ) క్షేమంకోసం చేయవచ్చు.

గోపాలుని తల్లి : అయితే ఇప్పటి నుండి నేను చేసే జపతపాదులన్నీ నీ కోసమే, నీ కోసమే, నీ కోసమే.

పై సంఘటనను, ప్రస్తావిస్తూ గోపాలుని తల్లి మాతో అప్పుడప్పుడు ఇలా చెబుతూండేది: ''ఆ రోజు గోపాలుని ముఖతా ఆ మాట విన్న తరువాత జపమాల, సంచి మొదలైన వాటిని గంగలో పారేశాను. అప్పటి నుండి గోపాలుని క్షేమం కోసం వ్రేళ్లమీద లెక్కిస్తూ జపంచేయసాగారు. చాలాకాలం తరువాత మళ్లీ జపమాలను వాడడం మొదలుపెట్టాను. నేను ఇలా అనుకొన్నాను: 'ఏదో ఒకటి చెయ్యాలి. ఇరవై నాలుగు గంటలు గడపడం ఎలా?' కాబట్టే గోపాలుని హితంకోసం జపమాలలోని పూసలను లెక్కించసాగాను.''

అప్పటి నుండి గోపాలుని తల్లి జపతపాదులన్నీ ఆగిపోయాయి. శ్రీరామకృష్ణుల దర్శనార్థం ఆమె తరచు దక్షిణేశ్వరానికి వెళ్లసాగింది. ఆహారాది విషయాలలో ఇంతకుముందు ఆమెకున్న ఆచారనిష్ఠలు ఆ మహాభావప్రవాహంలో పడి కొట్టుకుపోయాయి. గోపాలుడే ఆమె మనస్సును, హృదయాన్ని పూర్తిగా ఆక్రమించివేశాడు. నానారీతులలో గోపాలుడు ఆమెకు బోధించసాగాడు. అటువంటప్పుడు ఆమె తన నియమనిష్ఠలను ఎలా పాటించగలుగుతుంది? వేళాపాళా లేకుండా గోపాలుడు తినగోరతాడు. తాను తింటూన్నది అమ్మ నోట్లో కుక్కుతాడు. దానిని తిరస్కరించగలదా? పైగా, తిరస్కరిస్తే అతడు ఏడ్చేవాడు. ఈ అసాధారణ భావకెరటాలపై తేలుతూన్నప్పటి నుండి, ''ఇదంతా శ్రీరామకృష్ణుల

క్రీడ అని, తన 'నవీన నీరద శ్యాముడు, నీలకమల నేత్రుడు' గోపాలరూపంలో ప్రత్యక్షమౌతున్న తన కృష్ణుడు మరెవరో కాదు శ్రీరామకృష్ణులే'' అని ఆమెకు అవగతమైంది. కాబట్టే ఆయనకోసం వండి, ఆయనకు తినిపించి, ఆ ప్రసాదాన్ని తను పుచ్చుకోవడానికి ఆమె కించిత్తు కూడా సంకోచించేది కాదు.

గోపాల రూపుడైన కృష్ణుణ్ణి ఒకప్పుడు చంకనెత్తుకొంటూ, మరొకప్పుడు వక్షానికి హత్తుకొంటూ కామార్‌పుకూర్ బ్రాహ్మణి ఎడతెగకుండా రెండు నెలలు గడిపింది. భావరాజ్యంలో ఆ విధంగా అంత దీర్ఘకాలం వసిస్తూ, 'చిన్మయ నామం, చిన్మయ ధామం, చిన్మయ శ్యాముని' ప్రత్యక్షంగా దర్శించే అవకాశం అరుదుగా ఏ కొద్దిమంది అదృష్టవంతులకోగాని లభించదు.

నిజానికి ఈ ప్రపంచంలో భగవంతుణ్ణి వాత్సల్యభావంతో చూడడమన్నది ఎంతో అరుదైన విషయం. ఎందుకంటే, భగవంతుని శక్తి గురించి కించిత్తు ఎరుక ఉన్నా వాత్సల్యభక్తి జనించడం అసంభవం కాబట్టి. ఇక అసదృశమైన భక్తి తోడ్పాటుతో, అది ఘనీభవించడం ద్వారా భగవంతుని అలా ప్రత్యక్షంగా దర్శించగలగడం మరెంత అరుదైన విషయమో సులభంగా ఊహించుకోవచ్చు. 'కలౌ జాగర్తి గోపాలః, కలౌ జాగర్తి కాళికా' అనే లోకోక్తి ఉంది. (అంటే కలియుగంలో గోపాలుడు, కాళీ - ఈ ఇద్దరూ జాగ్రద్దేవతలు అని అర్థం). బహుశా అందుకే కాబోలు భగవంతుడు ఈ రెండు రూపాల్లో నేడు కూడా అలా అప్పుడప్పుడు ప్రత్యక్షమౌతున్నాడు.

శ్రీరామకృష్ణులు, గోపాలుని తల్లితో ఇలా చెప్పారు: ''నువ్వు ఎంతో సాధించావు. అటువంటి అవస్థ దీర్ఘకాలం కొనసాగితే ఈ కలియుగంలో శరీరం నిలవదు.'' లోకహితార్థం వాత్సల్యభక్తికి ఆదర్శ దృష్టాంతంగా ఈ పేద బ్రాహ్మణి పావనదేహం మరికొంత కాలం ఈ లోకంలో నిలిచి ఉండాలన్నదే శ్రీరామకృష్ణుల సంకల్పమై ఉండవచ్చు. కాబట్టే ఎడతెగకుండా రెండు నెలలు అలా గోపాలుని దర్శించిన తరువాత, గోపాలుని తల్లి దర్శనాదులు క్రమంగా తగ్గిపోసాగాయి. అయినప్పటికీ కాసేపు నిశ్చలంగా కూర్చుని మనస్సును గోపాలుని మీద ఏకాగ్రం చేయగానే మునుపటి మాదిరే ఆమెకు గోపాలుని దర్శనం కలిగేది.

7. భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు: 1885 వ సం॥ రథయాత్ర గోపాలుని తల్లి కథ : చివరి భాగం

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥ -భ.గీ. 9-22

[సంపూర్ణ నిష్ఠతో, నేను తామే అయినట్లు భావిస్తూ, సర్వంలో నన్ను ఉపాసిస్తూ ఉండేవారి యోగక్షేమాలను నేను వహిస్తాను.]

1. బలరాంబోసు ఇంట్లో రథ యాత్రోత్సవం

కామార్‌పూటి బ్రాహ్మణికి బాలగోపాల రూపంలో భగవద్దర్శనం కలిగిన కొంతకాలం తరువాత బలరాంబోసు ఇంట్లో రథం తిరిగి వచ్చే సందర్భం పురస్కరించుకొని ఉత్సవం జరిపారు. ఆ ఉత్సవంలో పాల్గొనడానికి శ్రీరామకృష్ణులు అతడి ఇంటికి విచ్చేశారు. ఎందరో భక్తులు కూడా ఆ ఉత్సవంలో పాల్గొన్నారు. బలరాంబాబు ఆనందానికి అవధులు లేవు. వచ్చిన భక్తుల నందరినీ సాదరంగా ఆహ్వానించాడు. బలరాం భక్తుల కుటుంబంలో జన్మించాడు. ఒక్క తరమే కాదు, తరతరాలుగా అతడి వంశస్థు లందరూ భక్తులే. కాబట్టే అతడి పట్ల, అతడి కుటుంబం పట్ల శ్రీరామకృష్ణులు అనుగ్రహ వృష్టి కురిపించారు.

2. శ్రీరామకృష్ణులు : శ్రీ చైతన్యుల సంకీర్తనం

శ్రీ చైతన్య మహాప్రభువుల నగర సంకీర్తనం చూడాలనే ఆకాంక్ష ఒకప్పుడు తమకు జనించిందనీ, తదనంతరం ఒకసారి ఆ దివ్యదర్శనం కలిగిందనీ శ్రీరామకృష్ణులే స్వయంగా మాకు చెప్పారు. అదొక అద్భుత దృశ్యం. ఇసుక పోసినా రాలనంత జనం హరి

నామ స్మరణతో ప్రేమోన్మత్తులై ఉన్నారు. ఇక ఆ మహోన్మాద భక్తి ప్రవాహంలో ఉన్మాదులైవున్న శ్రీ చైతన్యుల ఉన్మత్త ఆకర్షణ శక్తి చెప్పనలవి కానిది. అసంఖ్యాక జనం నెమ్మదిగా పంచవటి వైపునుండి కదలి శ్రీరామకృష్ణుల గది ముందునుండి పోసాగింది. ఆ సంకీర్తన బృందంలో భక్తితో ప్రకాశిస్తూన్న బలరాంబాబు ముఖాన్ని తాము చూశామని శ్రీరామకృష్ణులు చెప్పారు. ఆయనను ఆకట్టుకొన్న కొద్దిమంది ముఖాలలో బలరాంబాబుది ఒకటి; ఆ ముఖం ఆయన జ్ఞాపకాలలో అట్లే నిలిచిపోయింది. మొట్టమొదటిసారి బలరాంబాబు దక్షిణేశ్వరానికి వచ్చి గురుదేవులను దర్శించిన మరుక్షణమే, శ్రీరామకృష్ణులు ఆ నగర సంకీర్తన బృందంలో తాను చూసిన వ్యక్తి ఇతడే అని గుర్తించారు.

ఒరిస్సాలోని కొఠార్ అనే ప్రాంతంలో బలరాంబాబు కొక జమీ ఉంది. అక్కడ శ్యాంచంద్ (శ్రీకృష్ణుని) విగ్రహానికి పూజాది సేవలు ఒనరించేవారు.

3. బలరాంబాబు భగవత్సేవలు

బలరాంబాబుకు బృందావనంలో ఒక లతాగృహం ఉంది; అక్కడ శ్యామసుందరుని పూజ సేవలు జరిగేవి. అట్లే కలకత్తాలోని ఆతడి బాగ్‌బజార్ ఇంట్లో 'జగన్నాథుని'కి పూజాసేవాదులు జరిపించేవారు. ఈ జగన్నాథ విగ్రహాన్ని తదనంతర కాలంలో కొఠార్‌కు తరలించారు. అతణ్ణి గురించి శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''బలరాం సమర్పించే ఆహారం ఎంతో పవిత్రమైనది. తరతరాలుగా ఆ కుటుంబం వారు భగవంతుణ్ణి, అతిథి అభ్యాగతులను, సాధువులను సేవిస్తూ వస్తున్నారు. ఆతడి తండ్రి సర్వసంగపరిత్యాగం చేసి బృందావనంలో హరినామస్మరణలో కాలం గడుపుతున్నాడు. అతడు అర్పించే ఆహారాన్ని నేను నిస్సంకోచంగా, ఆనందంగా స్వీకరిస్తాను. ఆ ఆహారాన్ని నోట పెట్టగానే అలవోకగా లోపలకు వెళ్లిపోతుంది.'' నిజానికి అంతమంది భక్తులలో బలరాంబాబు ఒసగే ఆహారాన్ని మాత్రమే శ్రీరామకృష్ణులు అత్యంత ప్రీతితో ఆరగించడం మేం గమనించి ఉన్నాం. ఉదయం వేళ శ్రీరామకృష్ణులు కలకత్తాకు వచ్చినప్పుడల్లా నాటి మధ్యాహ్నం బలరాంబాబు ఇంట్లోనే భోజనం చేసేవారు. బ్రాహ్మణులైన భక్తుల ఇళ్లలో తప్ప ఇతర భక్తుల ఇళ్లలో ఆయన భోజనం చేయడం అనుమానాస్పదమే. కాని ప్రసాదం విషయంలో మాత్రం ఆ విచక్షత లేదు. నారాయణ ప్రసాదం లేదా ఇతర దేవతలకు నైవేద్యం చేసిన ప్రసాదాన్ని మాత్రం ఆయన ఎవరి ఇళ్లలోనైనా నిరభ్యంతరంగా స్వీకరించేవారు.

మహాపురుషుల అతిసామాన్యమైన దైనందిన చేతలలో సైతం వివరింపనలవిగాని అలౌకిక అంశం ఇమిడి ఉంటుంది. శ్రీరామకృష్ణుల సాంగత్యంలో

సురేంద్రనాథ్ మిత్ర

4. శ్రీరామకృష్ణులకు, బలరాం ఒనర్చిన అసాధారణ సేవా నిరతులు

కేవలం ఒక్క రోజు గడిపిన వ్యక్తి కూడా పై ప్రకటనలోని సత్యాన్ని ఇట్టే గ్రహించ గలదు. బలరాం బాబు అర్పించే ఆహారాన్ని గురుదేవులు స్వీకరించే విషయాన్ని కాస్త విశ్లేషించి చూస్తే ఈ విషయం మనకు స్పష్టమౌతుంది. సాధన చేస్తున్న కాలంలో ఒకానొక సందర్భంలో శ్రీరామకృష్ణులు జగజ్జననిని, ''అమ్మా, నన్ను శుష్కసాధువునిగా రూపొందించవద్దు. కాస్త అవసరాలకు కొరత రానివ్వకు'' అని ప్రార్థించారు. ఆమె కూడా ఆయన భోజన సామగ్రి సరఫరాకై నలుగురు భక్తులు నియమింపబడినట్లు తెలియచేసింది. ఆ నలుగురిలో రాణీరాస్మణి అల్లుడైన మథురానాథ్ మొట్టమొదటి వాడు; శంభుమల్లిక్ రెండవ వాడు. సిమ్లా పేటకు చెందిన సురేంద్రనాథ్ మిత్ర (ఇతణ్ణే శ్రీరామకృష్ణులు సురేందర్ లేదా సురేశ్ అని పిలిచేవారు) అర్ధ సరఫరాదారు అని స్వయంగా శ్రీరామకృష్ణులే చెప్పేవారు.

మథురానాథ్, శంభుమల్లిక్‌లు శ్రీరామకృష్ణులకు ఒనరించిన సేవలను ప్రత్యక్షంగా చూసే అదృష్టానికి మేం నోచుకోలేదు. ఎందుకంటే మేం శ్రీరామకృష్ణుల వద్దకు రావడానికి ఎంతోకాలం క్రితమే వారిద్దరూ మరణించారు. కాని వారొనరించిన అద్భుత సేవలను గురించి గురుదేవుల ముఖతా మేం విని వున్నాం. తమ సరఫరాదారులలో బలరాంబాబు కూడా ఒకడనే విషయం ఆయన ఎన్నడూ ప్రస్తావించినట్లు మాకు జ్ఞాపకం లేదు. కాని శ్రీరామకృష్ణులను అతడు అద్భుత రీతిలో సేవించడం మేం ప్రత్యక్షంగా చూసివున్నాం. మథుర్‌బాబు సేవానిరతికి తప్ప, ఇతర సరఫరాదారుల సేవకు బలరాంబాబు సేవ ఏమాత్రం తీసిపోదని మేం ఘంటాపథంగా చెప్పగలం. ఈ విషయాలను గురించి మరో సందర్భంలో వివరించడానికి ప్రయత్నిస్తాం. కాని బలరాంబాబు దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించుకొన్న నాటి నుండి, గురు

దేవులు మహాసమాధి పొందిన నాటి వరకు ఆయనకు ఆవశ్యకమైన బియ్యం, పటికబెల్లం, సగ్గుబియ్యం, బార్లీ, సేమ్యా మొదలైన ఆహార దినుసులను అతడే సరఫరా చేస్తూ వచ్చాడు. సురేంద్రుడు (లేదా సురేశ్ మిత్ర) గురుదేవుల సేవ నిమిత్తం దక్షిణేశ్వరంలో రాత్రిళ్లు బసచేసే భక్తుల తిండి, పడక ఏర్పాట్లు చూసుకొనేవాడు.

శ్రీరామకృష్ణులతో ఈ వ్యక్తులకు ఎలాటి నిగూఢ బాంధవ్యం పెనగొని ఉందో ఎవరి కెరుక? వారికి ఇటువంటి దుర్లభమైన సేవాధికారం లభించడానికి కారణాన్ని ఎవరు వివరించగలరు? వీరు అదృష్టవంతులని, ప్రత్యేకంగా జగజ్జననే వీరిని నియమించిందని మాత్రమే మేం అవగతం చేసుకొన్నాం. లేకపోతే లోకోత్తర పురుషులైన శ్రీరామకృష్ణుల ప్రస్తుత లీలకు దోహదకారులుగా వీరు జన్మించి ఉండేవారే కాదు. లేకుంటే శుద్ధ బుద్ధ ముక్తమైన శ్రీరామకృష్ణుల మానసంలో వీరి ముఖాలు ప్రగాఢంగా నిలిచిపోయి, చూడగానే వీరిని గుర్తించి, ''వీరు ఇక్కడికి (తమకు) చెందినవారు, ఈ విశేష సేవాధికారాన్ని పొందేవచ్చారు'' అని ఆయన చెప్పి ఉండేవారే కాదు.

'వీరు నా వాళ్లు' అని అనకుండా, 'ఇక్కడికి చెందినవాళ్లు' అనేవారు శ్రీరామకృష్ణులు. అత్యంత పునీతమైన ఆయన మానసంలో లవలేశమైనా 'అహం' కూడా చోటుచేసుకోకపోవడమే అందుకు కారణం. కాబట్టే 'నేను', 'నాది' అని పేర్కొనడం ఆయనకు అసాధ్యమయ్యేది. అసాధ్యం అనడ మెందుకు? ఆ రెండు పదాలను ఆయన ఉపయోగించలేకపోయే వారనడం సబబు. ఎప్పుడైనా అగత్యంలేక వాడవలసివస్తే 'నేను జగజ్జనని సేవకుణ్ణి, బిడ్డను' అనే అర్థంలో వాడేవారు. అది కూడా అంతకు ముందు నుండే ఆ భావం మనస్సును పూర్తిగా ఆక్రమించిన స్థితిలో మాత్రమే. కాబట్టే మాటల సందర్భంలో ఎప్పుడైనా 'నాది' అని అనవలసివస్తే శ్రీరామకృష్ణులు తమ దేహాన్ని చూపుతూ 'ఇక్కడిది' అనే మాటనే సదా సర్వదా వాడేవారు. భక్తులు కూడా ఆయన అభిప్రాయాన్నే అర్థం చేసుకొనేవారు. ఉదాహరణకు, ఫలానా వ్యక్తి 'ఇక్కడి వాడు' కాదు, లేదా ఆ వైఖరి లేదా భావన 'ఇక్కడిది' కాదు అంటే ఆ ఫలానా వ్యక్తి తమకు చెందిన వాడు కాదని, ఆ వైఖరి లేదా భావన తమది కాదని చెబుతున్నారని గ్రహించాలి.

5. శ్రీరామకృష్ణులు 'నేను', 'నాది' అనే మాటలు ఎన్నడూ ఉపయోగించి ఎరుగరు

శ్రీరామకృష్ణుల సరఫరాదారుల గురించి ఇక్కడ కొంత ముచ్చటించ నున్నాం. శ్రీరామకృష్ణుల మొదటి సరఫరాదారు మథుర్‌బాబు. శ్రీరామ

కృష్ణులు ప్రప్రథమంగా కాళికాలయంలో అడుగిడినప్పటి నుండి ఆయన సాధనలు ముగిసే వరకు, అంటే పధ్నాలుగు సంవత్సరాల కాలంపాటు, మథుర్

6. శ్రీరామకృష్ణులు : ఆయన సరఫరాదారులు

ఆయనను ఎంతో ఆప్యాయంగా సేవించాడు. రెండవ సరఫరాదారు శంభుమల్లిక్. ఇతడు మథుర్ మరణానంతరం నుండి కేశవచంద్రసేన్ తదితర భక్తులు గురుదేవుల వద్దకు రావడానికి ముందు కొద్దికాలం వరకు, అంటే తను సజీవుడై ఉన్నంత వరకు శ్రీరామకృష్ణులను సేవించుకొన్నాడు. ఇక అర్ధ సరఫరాదారుడైన సురేశ్ బాబు, శ్రీరామకృష్ణుల మహాసమాధికి ఆరేడేళ్ల ముందునుండి, ఆయన మహాసమాధి పొందిన నాలుగు ఐదు సంవత్సరాల వరకు జీవించి ఆయనను, ఆయన సన్న్యాస శిష్యులను సేవించాడు. ప్రారంభంలో శ్రీరామకృష్ణ మఠం బారానగరానికి చెందిన మున్షీబాబు పాడబడ్డ ఇంట్లో 1886వ సం॥ స్థాపించబడింది. (ఈ బారానగర మఠం తదనంతరం బేలూర్‌కు తరలించబడింది.) బారానగర మఠ స్థాపన సురేశ్‌బాబు విన్నపం మేరకే స్థాపించబడింది; ఆ మఠ నిర్వహణ ఖర్చులు ఆతడే భరించేవాడు.

శ్రీరామకృష్ణులు వచించిన నలుగురు సరఫరాదారులలో రెండున్నర మంది పోగా మిగిలిన ఒకటిన్నర మంది ఎవరు?

బేలూర్ మఠంకోసం స్థలం కొనుగోలు చేయడంలో, ఆ మఠ నిర్మాణంలో వివేకానందస్వామికి ఆర్థికంగా ఎంతో సహాయం చేసిన అమెరికా వాస్తవ్యురాలు శ్రీమతి సారా సి. బుల్, మనం ప్రస్తుతం ప్రస్తావిస్తున్న బలరాంబాబు - బహుశా వీరిద్దరూ ఆ ఒకటిన్నర సరఫరాదారులేమో! శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానంద (స్థూలరూపంలో) ఇప్పుడు లేనందున ఆ ప్రశ్నకు జవాబు ఎవరు చెప్పగలరు?

దక్షిణేశ్వరానికి వెళ్లి శ్రీరామకృష్ణులను దర్శించుకొన్న నాటినుండి బలరాం బాబు ప్రతి సంవత్సరం తన ఇంట్లో జరిగే రథోత్సవానికి ఆయనను

7. అమిత భక్తి ప్రపత్తులున్న బలరాం కుటుంబం

ఆహ్వానించేవాడు. అతడి ఇల్లు (నిజానికి ఆ ఇల్లు కటక్‌లో సుప్రసిద్ధ న్యాయవాదియైన ఆతడి సోదరుడు రాయ్ హరివల్లభ బోస్ బహదూర్‌ది) బాగ్‌బజార్‌లోని రమాకాంత్ బోసు వీధిలో ఉంది. బలరాం తన సోదరుడి ఇంట్లో నివసించేవాడు. ఆ ఇంటి నెంబరు 57. ఈ ఇంటిని శ్రీరామకృష్ణులు ఎన్నిసార్లు పావనం చేశారో చెప్పలేం! ఇక్కడ శ్రీరామకృష్ణులను దర్శించుకొని తమ జీవితాన్ని ధన్యం చేసుకొన్న వారెందరో చెప్పడం ఎవరి తరం? శ్రీరామకృష్ణులు అప్పు

డప్పుడు దక్షిణేశ్వర కాళికాలయాన్ని కాళీమాత 'కోట'గా చమత్కరించే వారు. బలరాం ఇంటిని కాళీమాత రెండవ 'కోట'గా పేర్కొనడం అతిశయోక్తి కాబోదు. ''బలరాం కుటుంబ సభ్యులందరూ ఒకే రాగం ఆలాపిస్తారు'' అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఇంటి యజమాని, గృహిణి నుండి చిన్న పిల్లల వరకు ప్రతి ఒక్కరూ శ్రీరామకృష్ణుల భక్తులే. భగవన్నామ జపం చేయనిదే వారెవ్వరూ కనీసం నీళ్లకూడా పుచ్చుకొనేవారు కారు. పూజ, పారాయణ, సాధుసేవ, దానధర్మం మొదలైన ధార్మిక కార్యాలను ప్రతి ఒక్కరూ పాటించే వారు. అనేక కుటుంబాలలో ఒకరిద్దరు ఆధ్యాత్మికపరులైతే, తక్కిన వారు పరమ లౌకికులై ఉండడం కద్దు. కాని ఈ కుటుంబం తద్విరుద్ధం; అందరూ భక్తిభావప్రపూర్ణులే. నిస్వార్థ ధార్మికతగల కుటుంబాలు ఎంతో అరుదు; కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఒకే ధ్యేయం పట్ల అనురక్తిగలవారై, ఆ ధ్యేయాన్ని చేరుకోవడంలో పరస్పరం సహకరించుకోవడం మరీ అరుదైన విషయం. అటువంటప్పుడు బలరాంబాబు ఇల్లు (కుటుంబం) శ్రీరామకృష్ణు లకు రెండవ 'కోట' కావడంలో, అక్కడకు వచ్చి ఆయన ఆనందించడంలో వింత ఏమీలేదు.

బలరాంబాబు ఇంట్లో జగన్నాథుని నిత్యసేవ జరిగేదని ఇంతకు మునుపే తెలిపివున్నాం. రథోత్సవ సమయంలో ఒక రథాన్ని లాగేవారు. అయినా ఈ

8. బలరాంబాబు ఇంట్లో జరిపే రథోత్సవం అతడి భక్తిని చాటుతుంది

ఉత్సవంలో ఎలాటి బాహ్యాడంబరమూ ఉండేది కాదు; మేళ తాళాలూ, అలంకారాలూ, కోలాహలం ఉండేవి కావు; కేవలం అది భగవద్భక్తిని చాటే ఉత్సవంగా ఎంతో నిరాడంబరంగా జరిగేది. అతడి ఇంటి మొదటి అంతస్తులో చతుష్కోణాకృతి వసారా ఉంది. రథాన్ని ఈ వసారా చుట్టూ లాగుతూంటే కీర్తన బృందంవారు సంకీర్తనం చేసేవారు. శ్రీరామకృష్ణులు, భక్తులు వారితో కలిసి పాడేవారు.

బలరాంబాబు

ఆ ఉత్సవం అంత నిరాడంబరంగా జరిగినా, వెల్లివిరిసే అంతటి ఆనందం, పొంగిపొరలే భగవద్భక్తి, భగవదోన్మత్త భావం, శ్రీరామకృష్ణుల మధుర నృత్యం మరెక్కడ లభిస్తాయి? ఆ సాత్విక కుటుంబంవారి విశుద్ధ భక్తికి ప్రసన్నుడై స్వయంగా జగన్నాథుడు రథంలోని ప్రతిమలోను, అట్లే శ్రీరామ కృష్ణుల శరీరంలోను అభివ్యక్తుడైనాడంటే అతిశయోక్తి కాదు! అదొక అపూర్వ మైన సన్నివేశం. ఆ విశుద్ధ భక్తి ప్రవాహంలో కొట్టుకొనిపోతే పాషండుని కర్కశ హృదయం కూడా ద్రవించిపోతుందంటే, ఇక భక్తుల గురించి ప్రత్యేకించి చెప్పాలా? కొన్ని గంటలు ఆ విధంగా సంకీర్తన కొనసాగేది. తరువాత అన్న భోగం జగన్నాథునికి నివేదించాక శ్రీరామకృష్ణులు భోజనం చేసేవారు; పిదప భక్తులు ప్రసాదం పుచ్చుకొనేవారు. రాత్రి చాలా పొద్దుపోయేదాక ఆ ఆనం దోత్సాహం కొనసాగేది. ఏదో ఇద్దరు ముగ్గురు భక్తులు తప్ప తక్కిన వారంతా ఇళ్లకు తిరిగి వెళ్లిపోయేవారు. ఈ ఆనందోత్సవంలో పాల్గొనే భాగ్యం ఈ రచ యితకు ఒకే ఒక్కసారి కలిగింది. 1885వ సం॥ రథం తిరిగివచ్చే సందర్భంలో జరిగిన ఉత్సవ వేడుకల్లో ఈ రచయిత పాల్గొన్నాడు. శ్రీరామకృష్ణుల ఆనతి మేరకు గోపాలుని తల్లిని కూడా ఆ ఉత్సవానికి ఆహ్వానించారు. శ్రీరామ కృష్ణులు ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని బలరాంబాబు ఇంటికి విచ్చేసి రెండు పగళ్లు, రెండు రాత్రుళ్లు అక్కడే గడిపి, మూడవ రోజు ఉదయం ఎనిమిది లేదా తొమ్మిది గంటలకు పడవలో బయలుదేరి దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లారు.

శ్రీరామకృష్ణులు ఆ రోజు ఉదయమే బలరాం ఇంటికి విచ్చేశారు. బయటి గదిలో కొంతసేపు కూర్చున్న తరువాత, ఫలహారం చేయడానికి ఆయ నను లోపలికి తోడ్కొని వెళ్లారు. ఈలోపు ఇద్దరు ముగ్గురుగా భక్తులు వచ్చి బయటి గదిలో సమావేశమయ్యారు; ఇరుగు పొరుగు ఇళ్లలో నుండి భక్తు రాండ్రు లోపలి గదిలోకి వచ్చారు. వీరిలో చాలామంది బలరాం బంధువులు లేదా పరిచయస్థులు. శ్రీరామకృష్ణులు తన ఇంటిని పావనం చేసినప్పుడల్లా బలరాం ఆహ్వానం పురస్కరించుకొని వీరంతా బలరాం ఇంటికి వచ్చేవారు. అలాగే బలరాం దక్షిణేశ్వరానికి పోతున్నప్పుడు వీరిని తన ఇంటికి రప్పించి, తనతోపాటు వీరిని గురుదేవుల వద్దకు తీసుకువెళ్లేవాడు. భావిని, అసీమ్ తల్లి, గణు తల్లి, అమ్మమ్మ లేదా ఆతడి తల్లి, ఈతడి అత్త, ఇంకొకరి ఆడపడుచు, వారి పొరుగింటి స్త్రీ - ఇలా అనేకమంది భక్తురాండ్రు ఆ రోజు అక్కడకు వచ్చారు.

పవిత్ర మనస్కులూ, సుగుణ సంపన్నులూ అయిన ఈ భక్తురాండ్రతో, పరిపూర్ణ కామగంధరహితులైన శ్రీరామకృష్ణులకు గల మధుర బాంధవ్యాన్ని మేం మాటల్లో వివరించలేం. వారిలో అనేకులు శ్రీరామకృష్ణులను తమ ఇష్టదైవంగా ఆరాధించేవారనడం అతిశయోక్తి కాదు. ప్రతి ఒక్కరికీ శ్రీరామకృష్ణుల పట్ల ప్రగాఢ భక్తివిశ్వాసాలుండేవి. వారిలో గోపాలుని తల్లి వంటి కొద్దిమంది భాగ్యశాలురు ప్రత్యక్ష దివ్యదర్శనాదుల మూలంగా ఈ విషయాన్ని గ్రహించారు. కాబట్టే శ్రీరామకృష్ణులను తమ సొంత మనిషికంటే అత్యంత సన్నిహితులుగా పరిగణించి, ఆయన సమక్షంలో బిడియం, సంకోచం చెందేవారు కారు.

9. భక్తురాండ్రతో శ్రీరామకృష్ణులకు గల అద్భుత బాంధవ్యం

ఇంట్లో మంచి వంటకం ఏదైనా తయారుచేస్తే ముందుగా దాన్లో కొంత భాగం శ్రీరామకృష్ణులకోసం ప్రత్యేకంగా కేటాయించి, ఆ తరువాతే తాము తినేవారు; ఆ వంటకాన్ని ఎవరి ద్వారానన్నా పంపడమో లేదా తామే స్వయంగా తీసుకువెళ్లో శ్రీరామకృష్ణులకు ఇచ్చేవారు. గురుదేవుల జీవితకాలంలో ఈ భక్తురాండ్రు ఎన్నిసార్లు దక్షిణేశ్వరానికి, తిరిగి తమ ఇళ్లకు కాలినడకన వెళ్లి వచ్చారో చెప్పలేం. కొన్ని సందర్భాలలో వాళ్ల సూర్యాస్తమానం తరువాత, మరి కొన్ని సమయాలలో రాత్రి పది గంటలకు, కొన్ని వేళల్లో కీర్తన, ఉత్సవం పూర్తయ్యాక ఏ అర్ధరాత్రో తిరిగి ఇళ్లకు వెళ్లివుండవచ్చు. శ్రీరామకృష్ణులు చిన్నపిల్లవాడిలా వారిలో కొందరిని తమ కడుపు రుగ్మతకు ఔషధం గురించి సంప్రతించడం కద్దు. అది చూసి ఎవరైనా హేళనపూర్వకంగా నవ్వితే, ఆయన వెంటనే, ''మీకేం తెలుసు? ఆమె ఘనవైద్యుడి భార్య కదా! తప్పకుండా ఆమెకు కొన్ని మందుల గురించి తెలిసే ఉంటుంది'' అనేవారు. వారిలో ఒకరి తీవ్ర భక్తిభావం గమనించి, ''ఈమె కృపాసిద్ధురాలైన గోపిక'' అని చెప్పేవారు. మరొక భక్తురాలు వండిన వంటకం రుచిచూసి, ''ఈమె వైకుంఠంలోని వంటగత్తె, కాకరకాయ పులుసు వండడంలో నేర్పరి'' అని చెప్పేవారు.

ఫలహారం ఆరగిస్తూ శ్రీరామకృష్ణులు భక్తురాండ్రతో గోపాలుని తల్లి మహద్భాగ్యాన్ని గురించి ముచ్చటించారు. ఆప్యాయత ఉట్టిపడే స్వరంలో వారితో ఇలా చెప్పారు: ''కామార్‌హాటి నుండి గోపాలభావం సంతరించుకొని వచ్చే ఆ బ్రాహ్మణికి వివిధ దివ్యదర్శనాలు కలిగాయి. తన నుండి ఆహారం పుచ్చుకోవడానికి గోపాలుడు చెయ్యి చాపుతాడని ఆమె చెబుతూంటుంది. ఆ రోజు అటు

10. గోపాలుని తల్లిని, శ్రీరామకృష్ణులు తోడ్కొని రమ్మనడం

వంటి అనేక దివ్యదర్శనాల అనుభూతి పొందడంతో ప్రేమోన్మత్తురాలై ఇక్కడకు (దక్షిణేశ్వరానికి) వచ్చింది. నేనేదో కాస్త తినిపించిన తరువాత ఆమె ఆ ఉన్మాదావస్థ కొంత ఉపశమించింది. ఆ రాత్రి దక్షిణేశ్వరంలోనే ఉండిపొమ్మన్నాను గాని, ఆమె బసచేయలేదు. తిరిగి వెళ్లేటప్పుడు కూడా అదే ప్రేమోన్మాదావస్థ కొనసాగింది. కట్టుకొన్న చీర వదులై నేలమీద పొరాడడం కూడా ఆమె గమనించే స్థితిలో లేదు. నేను చీరను సరిచేసి, ఆమెను శాంతపరచడానికి నా చేతిని ఆమె తలమీద వేసి అనునయంగా నిమురసాగాను. ఆమె భక్తి సాటిలేనిది, ఆమె ఎంతో ఉత్తమురాలు. ఆమెను తోడ్కొని రాకూడదా?''

ఈ మాట చెవిన పడగానే, కామార్‌హాటి నుండి గోపాలుని తల్లిని తోడ్కొని రావడానికి బలరాం ఒక వ్యక్తిని పంపించాడు. శ్రీరామకృష్ణులు నాడు, మర్నాడుకూడా అక్కడే ఉంటారు కనుక, ఆమె రావడంలో జాప్యమైనా ఫరవాలేదు.

ఫలహారం ఆరగించి శ్రీరామకృష్ణులు వెలుపల గదిలోకి వచ్చి భక్తులతో ముచ్చటించసాగారు.

11. శ్రీరామకృష్ణుల భావావస్థ : గోపాలుని తల్లి రాక

వేళకాక మునుపే శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనం ముగించారు. భక్తులు కూడా భోజనాలు చేశారు. తదనంతరం ఆయన కాసేపు విశ్రాంతి తీసుకొని చావడిలోకి వచ్చి భక్తులతో వివిధ ఆధ్యాత్మిక అంశాలపై మాట్లాడసాగారు. అలా మాట్లాడుతూ మాట్లాడుతూ సంధ్యాసమయం కానున్నప్పుడు ఆయన భావపారవశ్యం పొందారు. దోగాడుతూ, కుడిచేతిని ఏ తినుబండారాన్నో అడుగుతున్న ధోరణిలో పైకెత్తి, ఎవరి ముఖం వైపుగానో చూస్తున్నట్లు తన ముఖాన్ని పైకెత్తి, కళ్ల ఆనందాన్ని వ్యక్తం చేసే భంగిమలో బాలగోపాలుని ప్రతిమను మనమంతా చూసేవుంటాం. భావావేశమగ్నులైన శ్రీరామకృష్ణుల దేహం, అంగాలు అచ్చం అదే భంగిమను సంతరించుకొని ఉన్నాయి. కాని ఒక్క తేడా మాత్రం ఉంది. ఆయన కళ్లు సగం మూతబడి ఉన్నాయి; బాహ్యదృష్టి లేదు, దృష్టి అంతర్ముఖమై ఉంది.

శ్రీరామకృష్ణులకు భావపారవశ్య స్థితి ప్రారంభమైన తక్షణమే గోపాలుని తల్లి వచ్చిన బండి బలరాంబాబు ఇంటి గుమ్మం ముందు ఆగింది. బండి దిగి మేడమీదకు వచ్చి తన ఇష్టదేవతారూపంలో ఉన్న శ్రీరామకృష్ణులను ఆమె

చూసింది. గోపాలుని తల్లి మహాభక్తే శ్రీరామకృష్ణులకు ఆ విధంగా హఠాత్తుగా గోపాలభావం జనించడానికి కారణమని భక్తులు గ్రహించారు. ఆమె ఎంత అదృష్టవంతురాలో అని అనుకొంటూ, అక్కడున్న వారంతా ఆమెను పూజ్య భావంతో చూడసాగారు. "ఆహా, ఆమెది ఎంత అద్భుతమైన భక్తి! ఈమె భక్తి ప్రేరణతోనే శ్రీరామకృష్ణులు సాక్షాత్తు గోపాల రూపాన్ని దాల్చారు!" అని చెప్పసాగారందరూ.

కాని గోపాలుని తల్లి మాత్రం ఇలా అన్నది: "భావపారవశ్యంలో అలా కొయ్యదుంగలా బిర్రబిగుసుకుపోవడం నాకు నచ్చలేదు. నా గోపాలుడు నవ్వుతాడు, ఆడతాడు, నడుస్తాడు, పరుగెత్తుతాడు. అయ్యో! ఇదేమిటి? కొయ్య దుంగలా బిర్ర బిగుసుకుపోయిన భంగిమ! ఇటువంటి గోపాలుణ్ణి చూడడం నాకు ఇష్టంలేదు."

ఇంతకు మునుపు భావసమాధిలో శ్రీరామకృష్ణులు పూర్తిగా బాహ్య స్మృతిని కోల్పోవడం మొట్టమొదటిసారి చూసినప్పుడు ఆమె భయంతో ఎంతో కంగారుపడి, "నాయనా, ఎందుకు నువ్వు ఈ స్థితిలో ఉన్నావు?" అంటూ, ఆయన దేహాన్ని కుదిపింది. ఈ సంఘటన శ్రీరామకృష్ణులు కామార్‌పుకూర్‌...

12. భావసమాధిమగ్నులైనప్పుడు శ్రీరామకృష్ణులలోని ఆకర్షకత్వం

మొట్టమొదటిసారి మేం శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లినప్పుడు, ఆయన వయస్సు దాదాపు నలభై తొమ్మిదేళ్లు, బహుశా ఐదారు నెలలు తక్కువ ఉండవచ్చు. గోపాలుని తల్లి కూడా ఇదే సమయంలోనే ఆయన వద్దకు రాసాగింది.

శ్రీరామకృష్ణులను కలుసుకోవడానికి ముందు మేం ఇలా అనుకొనే వారం: అమాయకులైన పసిపిల్లల చేష్టలు, నృత్యం చూడముచ్చటగా ఉంటుంది గాని, యుక్తవయస్కుడు అలా చేస్తే చిరాకు వస్తుంది లేదా పరిహాసాస్పదంగా ఉంటుంది. వివేకానంద స్వామి, "ఖడ్గమృగం నాట్యకత్తెలా నృత్యం చేయడం ఊహించుకోండి" అని చెప్పేవారు. కాని శ్రీరామకృష్ణుల విషయంలో మా అభిప్రాయాలను మార్చుకోక తప్పలేదు. కాస్త వయస్సు పైబడ్డాకూడా శ్రీరామకృష్ణులు నృత్యం చేసేవారు, వివిధ అభినయాలు చూపేవారు - ఆహా! అవి ఎంత రమ్యంగా ఉండేవో! "యుక్తవయస్కుడు నృత్యం చేసేటప్పుడు ఇంత అందంగా ఉంటాడని కలలో సైతం ఊహించలేదు" అని గిరీశ్‌ఘోష్ చెప్పేవాడు.

ఈ రోజు బలరాంబాబు ఇంట్లో గోపాల భావావస్థ ప్రభావంలో శ్రీరామకృష్ణుల అంగభంగిమల తీరుతెన్నులు ఎంత రమ్యంగా ఉన్నాయో కదా! ఆ తీరుతెన్నులు ఎందుకంత అందంగా కనిపించాయో మా కప్పుడు అర్థం కాలేదు. ఆ తీరుతెన్నులు అందంగా ఉన్నాయని మాత్రమే అప్పుడు అనుకొన్నాం, అంతే. ఇప్పుడిప్పుడే మాకు అర్థం కాసాగింది. ఎప్పుడు ఏ భావం ఆయనలో జనించేదో, అప్పుడు ఆ భావంలో పరిపూర్ణంగా ఆయన లీనమైపోయేవారు; మరే ఇతర భావానికీ ఆయన మనస్సులో చోటువుండేది కాదు. దానిలో పూర్తిగా డైల్యూట్[1] (సజలం) అయిపోయేవారు. ఆ తాదాత్మ్యం ఎంత పరిపూర్ణంగా ఉండేదంటే, మధ్యవయస్సు దాటిన ఒక వ్యక్తి ఆ భావ ప్రేరణలో ఒక పిల్లవాడిలా లేదా ఒక స్త్రీలా ప్రవర్తించడం ఎవరికీ విలక్షణంగా కనిపించేది కాదు. శ్రీరామకృష్ణుల మనస్సును ఆవరించిన భావతరంగాలు పొంగిపొరలి, ఆయన దేహాన్ని ఆ భావానికి అనుగుణంగా పూర్తిగా మార్చి, కొత్తరూపాన్ని దాల్చేట్లు చేసేవి.

ఆ సందర్భంలో శ్రీరామకృష్ణులు, భక్తుల సాంగత్యంలో బలరాం ఇంట్లో రెండు పగళ్లు, రెండు రాత్రుళ్లు ఆనందంగా గడిపారు. ఇది మూడవ రోజు, ఇక ఆయన దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లవలసివుంది. ఉదయం ఎనిమిది లేదా తొమ్మిది గంటలకు ఘట్టం వద్ద ఆయన తిరిగి వెళ్లడానికి ఒక పడవ సిద్ధంగా ఉంది.

13. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరానికి తిరిగి రావడం

గురుదేవుల సేవ నిమిత్తం ఆయనతో పాటు వచ్చిన ఒకరిద్దరు యువభక్తులతోపాటు గోపాలుని తల్లి, మరో భక్తురాలు (గోలాప్‌మా) ఆ పడవలోనే దక్షిణేశ్వరానికి వెళ్లనున్నారు. బహుశా కాళీ (స్వామి అభేదానంద) వారిలో ఒకడై ఉంటాడు.

గోలాప్‌మా

శ్రీరామకృష్ణులు ఇంటి లోపలికి వెళ్లి జగన్నాథునికి మొక్కి, ఆ భక్త కుటుంబం ప్రణామాలు స్వీకరించి, వెళ్లి పడవలో కూర్చున్నారు. గోపాలుని

---

1. శ్రీరామకృష్ణులు వాడే కొన్ని ఆంగ్ల పదాలలో ఇదొకటి.

తల్లి, ఇతర భక్తులు కూడా ఆయనను అనుసరించి వెళ్లి పడవలో కూర్చు న్నారు.

గోపాలుని తల్లికి వస్త్రాలు, వంటకు ఉపయోగపడే గరిట, పట్టకారు, మరికొన్ని సామానులు బలరాం కుటుంబ సభ్యులు ఎంతో భక్తిప్రపత్తులతో సమర్పించారు. వాటిని ఒక మూటగా కట్టి, ఆ మూటనుకూడా పడవలో పెట్టారు. పడవ బయలుదేరింది.

పడవలో పోతున్నప్పుడు శ్రీరామకృష్ణుల దృష్టి ఆ మూటమీద పడింది. ఆ మూట గోపాలుని తల్లిదని ఆయనకు తెలియవచ్చింది. బలరాం కుటుంబంవారు ఆ మూటలోని వస్తువులను ఆమెకు ఇచ్చారని ఆయన తెలుసుకోగానే ఆయన ముఖం గంభీర ముద్ర దాల్చింది. సూటిగా గోపాలుని తల్లిని సంబోధించ కుండా, 'గోలప్‌మా'తో త్యాగ వైరాగ్యాలను గురించి మాట్లాడసాగారు: ''పరి త్యాగాన్ని సంతరించుకొన్న వ్యక్తే భగవత్సాక్షాత్కారం పొందగలడు. ఎవడు పరాయివారి ఇళ్లలో భోజనం చేసి ఉత్తచేతులతో (అంటే ఏమీ స్వీకరించ కుండా) తిరిగి వస్తాడో ఆ వ్యక్తి మాత్రమే భగవంతుణ్ణే ఆనుకొని కూర్చో గలడు (అంటే భగవంతుడిపై ఒత్తిడి తేగలడు).'' దారిలో ఆయన గోపాలుని తల్లితో ఒక్క మాటకూడా మాట్లాడలేదు సరికదా అప్పుడప్పుడు ఆ మూట వంకే దృష్టిని సారించారు. శ్రీరామకృష్ణుల ఆ వైఖరి చూసి గోపాలుని తల్లి, 'మూటను గంగలో పారేస్తే బాగుంటుంది' అని అనుకొన్నది. శ్రీరామకృష్ణులు ఐదేళ్ల పిల్లవాడిలా భక్తులతో పరిహాసమాడుతూ, ఆడుతూ పాడుతూ మెలగే వారు; కాని అవసరమైనప్పుడు వారితో కఠినంగాకూడా వ్యవహరించేవారు. ఎవరైనా కించిత్తు అనుచితంగా ప్రవర్తించినా ఆయన సహించలేకపోయేవారు. ఎంత చిన్న విషయం కూడా ఆయన దృష్టిలో పడకుండా తప్పించుకోలేదు. ఎవరైనా రవంత అనుచితంగా ప్రవర్తించిన మరుక్షణమే తన సునిశిత దృష్టిని ఆ వ్యక్తిపై పరపేవారు; ఆ వ్యక్తి వెంటనే తన తప్పిదాన్ని దిద్దుకోడానికి తీవ్రంగా ప్రయత్నించేవాడు. ఆ వ్యక్తిలో దిద్దుబాటు తేవడానికి ఆయన గట్టిగా ప్రయ త్నించ నవసరంలేదు. ఎందుకంటే, తీక్షణంగా చూస్తూ, కాసేపు ఆ వ్యక్తితో మాట్లాడకపోతే చాలు - తప్పు చేసిన ఆ వ్యక్తి కంగారుపడి, తన తప్పుకు పశ్చా త్తాపం చెందేవాడు. అప్పటికీ బుద్ధిరాకపోతే, ఆయన ముఖతా వెలువడ్డ రెండు మూడు మందలింపు మాటలు చాలు, అతడిలో పరివర్తన తేవడానికి. శ్రీరామకృష్ణులు ప్రతి భక్తునితో వ్యవహరించే పద్ధతి, బోధించే విధానం కూడా అనుపమానంగానే ఉండేవి. ముందుగా ఆయన తమ అనంత ప్రేమతో భక్తుని

14. ఆ మూటను చూసి శ్రీరామకృష్ణులు చిరాకుపడడం

హృదయాన్ని చూరగొనేవారు, ఆ తరువాత కొద్ది మాటలతో అతడికి ఉపదేశించి, అతడిలో పరివర్తన తెచ్చేవారు.

15. గోపాలుని తల్లి పశ్చాత్తాపం

దక్షిణేశ్వరం చేరుకోగానే గోపాలుని తల్లి ఆతురతతో నహబత్‌లో ఉంటున్న మాతృదేవి వద్దకు వెళ్ళి, ఇలా అన్నది: ''ఓ కోడలా, ఈ సామగ్రి మూటను చూసి గోపాలుడు ఎంతో ఆగ్రహించాడు; ఇప్పుడు ఏం చెయ్యాలి? వీటిని ఇక్కడే పంచిపెట్టి పోతే మంచిదనిపిస్తోంది.''

కరుణాస్వరూపిణియైన మాతృదేవి ఆ వృద్ధురాలు బాధపడడం చూసి, ఆమెను ఊరడిస్తూ ఇలా అంది: ''అమ్మా, ఆయన ఏమైనా చెప్పనివ్వు. వీటిని ఇవ్వడానికి నీకు ఇంకెవరున్నారు? ఈ పరిస్థితిలో నువ్వు మాత్రం ఏం చేయగలవు? అవసరం ఉండబట్టే కదా వీటిని నువ్వు పుచ్చుకొన్నావు?''

మాతృదేవి అంతగా చెప్పినప్పటికీ గోపాలుని తల్లి ఒక వస్త్రాన్ని, ఒకటి రెండు సామాన్లను అక్కడే పంచిపెట్టింది. ఆ తరువాత హృదయం తడబడుతూంటే స్వయంగా ఒకటి రెండు కూరలతో వంటచేసి, భోజనం పెట్టడానికి శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్ళింది. అందరి హృదయాలను ఇట్టే తెలుసుకోగల శ్రీరామకృష్ణులు, ఆమె పశ్చాత్తాపపడడం గమనించి, ఆ విషయం గురించి మరేమీ వ్యాఖ్యానించలేదు. మునుపటి మాదిరే ఆమెతో నవ్వుతూ మాట్లాడారు. దాంతో గోపాలుని తల్లి కూడా కుదుటపడింది. శ్రీరామకృష్ణులకు

నహబత్, గురుదేవుల గది

భోజనం తినిపించి, తేలికపడ్డ హృదయంతో సాయంత్రం కామార్‌హాటికి తిరిగి వెళ్లిపోయింది.

తాను మొదటి దర్శనం పొందినప్పటి నుండి గోపాలుని తల్లి తన ఇష్టదైవమైన బాలగోపాలుణ్ణే రెండు నెలలపాటు అనవరతం దర్శించసాగిందని ఇంతకు మునుపే తెలిపివున్నాం. తరువాత ఆమె కా నిరంతర దర్శనాలు కలగడం తగ్గాయి. అలా అని రెండు నెలల తరువాత ఎప్పుడోగాని ఆమెకు ఆ దర్శనాలు కలిగేవి కావని భావించరాదు. ప్రతి రోజు, ఎప్పుడు ఆమె కోరుకొంటే అప్పుడు గోపాలుడు సాక్షాత్కరించేవాడు. ఎప్పుడన్నా ఆమెకు ఏదైనా బోధించవలసివస్తే గోపాలుడు హఠాత్తుగా ఆమె ముందు కనిపించి సంజ్ఞల ద్వారానో లేదా మాటల ద్వారానో లేదా తాను స్వయంగా చేసి చూపో ఆమెకు ఆ విషయం బోధపరచేవాడు. మళ్లీమళ్లీ శ్రీరామకృష్ణుల పునీత దేహంలో లీనమైపోతూ, తానూ శ్రీరామకృష్ణులూ అభిన్నులమనే సత్యాన్ని ఆమెకు గ్రహింపచేశాడు. తనకు ఇది కావాలి, అది తినగోరుతున్నాను అని ఆమెను అడిగి పుచ్చుకొని, తన నెలా సేవించాలోకూడా ఆమెకు నేర్పాడు. అలాగే శ్రీరామకృష్ణుల కొందరు విశిష్ట భక్తులతో ఆమె సమక్షంలో కలిసి పచార్లు చేస్తూ, 'భగవంతుడు - భక్తుడు' తాను (గోపాలుడు) తన భక్తులు అభిన్నులమనే విశ్వాసాన్ని ఆమెలో పాదుగొలిపాడు. దాంతో ఆ భక్తులు స్పృశించిన ఆహారాన్ని తినడంలో ఇదివరలో ఆమెకున్న సంకోచం క్రమంగా సమసిపోయింది.

శ్రీరామకృష్ణులే తన ఇష్టదైవమని గోపాలుని తల్లిలో ప్రగాఢ విశ్వాసం కుదురుకొన్నాక, గోపాలరూప దర్శనం తరచు ఆమె పొందడంలేదు. అందుకు

16. గోపాలుని తల్లి మానసిక వైఖరి

బదులుగా ఆమెకు తరచు శ్రీరామకృష్ణుల రూపదర్శనమే కలుగసాగింది. ఆ రూపం ద్వారానే గోపాలరూపుడైన భగవంతుడు ఆమెకు అవసరమైనదంతా బోధించసాగాడు. గోపాలరూప దర్శనం కలగడం తగ్గిపోవడంతో మొదట్లో ఆమె ఎంతో బాధపడి, ఒక రోజు శ్రీరామకృష్ణుల వద్దకెళ్లి ఏడుస్తూ, "గోపాలా, నన్నెందుకిలా చేస్తున్నావు? నేనేం తప్పు చేశాను? ఇంతకు ముందులా నీ దర్శనం (అంటే గోపాల రూపంలో) నాకు కలగడం లేదు, ఎందుకు?" అని అడిగింది. అందుకు శ్రీరామకృష్ణులు ఇలా జవాబిచ్చారు: "ఈ కలియుగంలో అటువంటి దర్శనాలు అనవరతం కలిగితే, దేహం నిలవదు. ఇరవై ఒక్క రోజుల తరువాత దేహం ఎండుటాకులా రాలిపోతుంది." నిజానికి మొదటి దర్శనానంతరం రెండు నెలల వరకు గోపాలుని తల్లి భావావస్థ ప్రభావంలోనే ఉండిపోయింది. వంట, స్నానం, తినడం, జపిం

చడం, ధ్యానించడం మొదలైన పనులన్నీ అలవాటు మేరకు, కర్తవ్యం మేరకు మాత్రమే నిర్వర్తించిందని మాత్రమే చెప్పాలి. పాత అలవాట్ల కారణంగానే ఆమె దేహం యాంత్రికంగా ఈ పనులను చేసుకుపోయేది. కాని ఆమె మాత్రం సదాసర్వదా ఆధ్యాత్మిక భావోన్మత్తతలోనే నెలకొని ఉండేది. ఈ విధంగా ఉంటే దేహం ఎంతకాలం నిలుస్తుంది? రెండు నెలలకాలం దేహం నిలిచి ఉండడమే ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. రెండు నెలలు పూర్తయ్యే సమయానికి ఆ భావోన్మత్త ప్రభావం ఎంతో మేరకు తగ్గిపోయింది. కాని మునుపటిలా గోపా లుణ్ణి దర్శించలేకపోవడం వలన, పదేపదే గోపాల దర్శనం పొందాలనే తీవ్ర వ్యాకులత ఆమెలో జనించింది. తత్ఫలితంగా దేహంలో వాయుధాతువు ప్రకో పించి గుండెలో ఆమె ఎంతో బాధననుభవించసాగింది. అందుకే ఆమె శ్రీరామ కృష్ణులతో, ''వాయువు ప్రకోపించడం వలన నా గుండెను రంపంతో కోస్తు న్నట్లు అనిపిస్తోంది'' అని చెప్పింది. శ్రీరామకృష్ణులు ఆమెను అనునయించి, ఆప్యాయంగా, ''ఇది ఉత్త వాయువు కాదు, హరి వాయువు. అది తొలగిపోతే నీ జీవితాని కిక ఆసరా ఏమిటి? అది ఉండడమే మంచిది. బాధ ఎక్కు వైనప్పుడు ఏదైనా కాస్త తిను'' అని చెప్పారు. అలా అంటూ ఆయన ఆ రోజు రుచికరమైన తినుబండారాలను ఆమె చేత తినిపించారు.

17. మార్వాడీ భక్తులు శ్రీరామకృష్ణుల దర్శనార్థం రావడం

కలకత్తా వాస్తవ్యులైన (బెంగాలీలు) మా వంటి అనేకమంది ఎలా శ్రీరామ కృష్ణుల వద్దకు వచ్చేవారమో, అట్లే మార్వాడీ స్త్రీ పురుషు లనేకులు ఆయన దర్శనార్థం అప్పుడప్పుడు వచ్చేవారు. వారు అనేక బళ్లు కట్టుకొని దక్షిణేశ్వరానికి వచ్చేవారు. గంగలో స్నానం చేసి, పువ్వులు సేకరించి శివుణ్ణి, తదితర దైవాలను ఆరాధించి పంచవటిలో సమావేశమయ్యేవారు. అక్కడ పొయ్యి రాజేసి రొట్టెలు, పప్పు, కూరలు వండి దేవుడికి నైవేద్యం చేసేవారు. తరువాత తాము వండి నైవేద్యం చేసిన ఆహారంలో ముందుగా ఒక వంతు శ్రీరామకృష్ణులకు సమర్పించి, తద నంతరం తాము భుజించేవారు. వారిలో పలువురు గురుదేవులకు పటికబెల్లం, ద్రాక్షపళ్లు, బాదం, ఖర్జూరాలు, పిస్తాపప్పు, జామపళ్లు, దానిమ్మపళ్లు, తమల పాకులు మొదలైనవి సమర్పించి, ప్రణామం చేసేవారు. వారు మనలోని అత్యధిక సంఖ్యాకులవంటివారు కారు; సాధువుల ఆశ్రమాలకు లేదా దేవా లయాలకు రిక్తహస్తాలతో వెళ్లరాదనే ఆచారం వారికి బాగా తెలుసు. కాబట్టి వచ్చేటప్పుడు తప్పకుండా ఏదో ఒకటి తమతోపాటు తీసుకువచ్చేవారు. కాని శ్రీరామకృష్ణులు మాత్రం ఏ ఒకరిద్దరు మార్వాడీలను మినహాయించి తక్కిన వారు సమర్పించే వేటినీ స్వీకరించేవారు కారు. ఆయన ఇలా చెప్పేవారు:

''వారు నా కిచ్చే తామలపాకు చుట్టలో, 'న్యాయస్థానంలోని నా వ్యాజ్యం గెల వాలి', 'నా రోగం నయం కావాలి', 'నా వ్యాపారంలో బాగా లాభం రావాలి' మొదలైన పదహారు కోర్కెలు జోడించి కట్టిపెడతారు.''

18. కానుకల పట్ల శ్రీరామకృష్ణుల వైఖరి

శ్రీరామకృష్ణులు వారిచ్చే ఆహార పదార్థాలు తాము తినరు, తమ భక్తులకు సైతం తినడానికి ఇచ్చేవారు కారు. కాని కొన్ని సందర్భాలలో ఆ మార్వాడీవారు వండి, దేవుడికి నైవేద్యం చేశాక తమకు సమర్పించిన ఆ ఆహారాన్ని ప్రసాదంగా కాస్త తినేవారు, మాకు కూడా తినడానికి ఇచ్చేవారు.

మార్వాడీ లిచ్చే పటికబెల్లం, పండ్లు వగైరాలను స్వీకరించే అర్హతవున్న ఏకైక వ్యక్తి నరేంద్రనాథ్. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు: ''సదా ఒరనుండి దూసిన జ్ఞానఖడ్గం అతడి వద్ద సిద్ధంగా ఉంది. వీటిని తిన్నా అతడి కెలాటి దోషమూ అంటదు. ఆతడి ఆధ్యాత్మిక అంతర్దృష్టి ఎన్నటికీ మందగించదు.'' కాబట్టే శ్రీరామకృష్ణులు ఆ తినుబండారాలను ఆ సమయంలో అక్కడున్న ఎవరైనా భక్తులకిచ్చి వాటిని నరేంద్రుడి ఇంటికి పంపించేవారు. భక్తులెవరూ ఆ సమయంలో అక్కడ లేనప్పుడు కాళికాలయ పూజారియైన రాంలాల్ (తమ అన్నగారి కుమారుడు) ద్వారా పంపించేవారు. ఒక రోజు ఈ విషయం ప్రస్తావిస్తూ సోదరుడు రాంలాల్ మాతో ఇలా చెప్పాడు:

రాంలాల్

రాంలాల్‌తో పనిపడినప్పుడు శ్రీరామకృష్ణులు మధ్యాహ్న భోజనానంతరం అతణ్ణి పిలిచి, ''కలకత్తాలో నీకేం పనిలేదా?'' అని అడిగేవారు. అతణ్ణి పదేపదే అలా పనికట్టుకొని ఆ వస్తువులను ఇచ్చిరావడానికి పంపితే అత డెక్కడ చిరాకుపడతాడోనని ఇలా ప్రారంభించేవారు. ''ప్రస్తుతం కలకత్తాలో నాకేం పని లేదు. కాని మీరు వెళ్ళిరమ్మంటే వెళ్ళివస్తాను'' అని రాంలాల్ జవాబిచ్చేవాడు. అందుకు శ్రీరామకృష్ణులు ఇలా అనేవారు: ''అబ్బే, ఊరకే అడిగాను. నువ్వు కలకత్తాకు

వెళ్లి చాలా రోజులైంది కదా! వెళ్లాలనివుంటే ఒక్కసారి వెళ్లిరాకూడదా? వెళ్లేటప్పుడు ఆ పెట్టెలో డబ్బులున్నాయి, తీసుకో. బారానగర్ నుండి బాడుగ బండిలో వెళ్లు. ఎండలో నడిస్తే నీకు జబ్బు చేస్తుంది. వెళ్లేటప్పుడు ఈ పటికబెల్లం, బాదంపప్పు మొదలైనవి తీసుకెళ్లి నరేంద్రుడికి ఇవ్వు. అతడి సమాచారం కనుక్కొనిరా. అతడు ఇక్కడికి వచ్చి చాలా రోజులైంది. అతడి క్షేమసమాచారాలు వినాలని ఆతురతగా ఉంది.''

''ఆహా, నే నెక్కడ విసుక్కొంటానోనని ఎంత తటపటాయింపో!'' అని సోదరుడు రాంలాల్ జవాబిచ్చేవాడు.

అటువంటి అవకాశాలను సోదరుడు రాంలాల్ పురస్కరించుకొని కలకత్తాకు వెళ్లి భక్తుల ఆనందాన్ని ఇనుమడింప చేసేవాడని చెప్పడం అవసరం లేదు.

* * *

ఒక రోజు దక్షిణేశ్వరానికి పలువురు మార్వాడీలు వచ్చారు. మామూలు ప్రకారం ఆ రోజు శ్రీరామకృష్ణుల గదిలో పటికబెల్లం, పండ్లు వగైరాలు గుట్టలా ప్రోగయ్యాయి. ఆ సమయంలో తలవనితలంపుగా గోపాలుని తల్లి, కొందరు భక్తురాండ్రు శ్రీరామకృష్ణులను చూడగోరి వచ్చారు. ఆయన గోపాలుని తల్లిని చూసి, ఆమె ప్రక్కకు వచ్చి నిలబడ్డారు. బిడ్డ తల్లిని చూసినప్పుడు తన ప్రేమను వ్యక్తంచేసే రీతిలో ఆయన ఆమెను తాకుతూ తమ ప్రేమను వ్యక్తం చేయసాగారు. గోపాలుని తల్లి శరీరాన్ని చూపుతూ అక్కడున్న అందరితో, ''ఈ గలీబు హరితో నింపబడివుంది; ఈ శరీరం హరిమయం'' అని చెప్పారు. గోపాలుని తల్లి అవాక్కయి నిలబడిపోయింది, శ్రీరామకృష్ణులు ఆమె కాళ్లను తాకినా ఆమె కుంచించుకుపోలేదు. ఆ తరువాత గదిలో ఉన్న మంచి తినుబండారాలన్నీ తెచ్చి ఆమెకు తినిపించసాగారు. ఆమె దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడల్లా శ్రీరామకృష్ణులు అలాగే ప్రవర్తించేవారు, ఆమెకు అట్లే తినిపించేవారు. ఒక రోజు ఆమె, ''గోపాలా, నాకు ఇలా తినిపించడం నీ కెందుకంత ఇష్టం?'' అని అడిగింది.

శ్రీరామకృష్ణులు: గతంలో నువ్వు నా కెంతో తినిపించావు కాబట్టి.

గోపాలుని తల్లి: గతంలోనా? ఎప్పుడు నీకు తినిపించాను?

శ్రీరామకృష్ణులు: వెనుకటి ఒక జన్మలో.

ఆ రోజంతా గోపాలుని తల్లి దక్షిణేశ్వరంలో గడిపింది. కామార్‌హాటికి తిరిగి వెళ్ళిపోవడానికి ఆయన వద్ద సెలవు పుచ్చుకొంటున్నప్పుడు, శ్రీరామకృష్ణులు మార్వాడీలు సమర్పించిన పటికబెల్లమంతా ఆమె కిచ్చి, తీసుకువెళ్ళమన్నారు. ''ఇంత పటికబెల్లం నా కెందుకిస్తున్నావు?'' అని ఆమె అడిగింది. అందుకు శ్రీరామకృష్ణులు (ఆమె చుబుకం పుచ్చుకొని ఆప్యాయంగా), ''మొదట్లో నువ్వు బెల్లానివి; తరువాత నువ్వు పంచదారవైనావు. ఇప్పుడు నువ్వు పటికబెల్లంగా మారావు. ప్రస్తుతం పటికబెల్లంగా మారావు కనుక పటికబెల్లం తిని, ఆనందించు'' అని అన్నారు.

19. మార్వాడీలు సమర్పించిన పటికబెల్లమంతా గోపాలుని తల్లికి శ్రీరామకృష్ణులు ఇచ్చివేయడం

మార్వాడీ భక్తులు సమర్పించిన పటికబెల్లమంతా శ్రీరామకృష్ణులు, గోపాలుని తల్లికి ఇవ్వడం చూసి భక్తు లందరూ ఆశ్చర్యపోయారు. ఆయన అనుగ్రహంతో ఆమె మనస్సు ఇకపై మలినత నొందదని వారు గ్రహించారు. ఇక ఏ దారి కానరాక చివరకు ఆమె ఆ పటికబెల్లాన్ని స్వీకరించింది. లేకుంటే ఏం చెయ్యగలదు? తీసుకోకపోతే తన గోపాలుడు (శ్రీరామకృష్ణులు) వదలిపెడతాడా? పైగా దేహం ఉన్నంత వరకు అన్ని వస్తువుల అవసరం ఉండనే ఉంటుంది. దానిని గురించి గోపాలుని తల్లి అప్పుడప్పుడు మాతో, ''శరీరం ఉన్నంత వరకు అన్నీ, చివరకు జీలకర్ర, మెంతులు కూడా అవసరమే. ఎంత విచిత్రమైన స్థితో కదా!'' అని వాపోయేది.

20. స్వీయ దివ్య దర్శనాలను గురించి ఇతరులకు వెల్లడించ కూడదు

జపధ్యానాదులు అనుష్ఠిస్తున్నప్పుడు తనకు కలిగే అనుభూతుల నన్నిటినీ శ్రీరామకృష్ణుల వద్దకొచ్చి ఆయనకు తెలిపే అలవాటు మొదటి నుండి గోపాలుని తల్లికి ఉంది. ''అలా కలిగే దర్శనాలను గురించి ఎవరికీ చెప్పకూడదు. అలా చెప్పే పక్షంలో అవి ఆగిపోతాయి'' అని శ్రీరామకృష్ణులు ఆమెతో చెప్పారు. అలా ఆయన చెప్పడం చూసి గోపాలుని తల్లి ఒక రోజు, ''ఎందుకు చెప్పకూడదు? అవన్నీ నీకు సంబంధించిన దర్శనాలే, మరెవరివో కావు కదా! వాటి గురించి నీతోకూడా చెప్పకూడదా?'' అని ఆయనను అడిగింది. అందుకు శ్రీరామకృష్ణులు, ''ఆ దర్శనాలు 'ఇక్కడకు' చెందినవైనా, వాటి గురించి నాతోకూడా చెప్పరాదు'' అని నిష్కర్షగా జవాబిచ్చారు. ''అవునా!'' అందామె. ఆ తరువాత తనకు కలిగే దివ్యదర్శనాలను గురించి ఏదో అరుదైన సందర్భాలలో తప్ప, ఎవ్వరికీ ఆమె వెల్లడించలేదు. శ్రీరామకృష్ణులు ఏం చెప్పినా, దాని పట్ల ఆమె పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండేది.

మరి సందేహాస్పదులమైన మనమో? శ్రీరామకృష్ణుల వచనాలలోని సత్యాన్ని పరీక్షించడంలోనే మన బ్రతుకులు తెల్లారిపోతాయి. కాబట్టి ఆ వచనాలను విశ్వసించి, ఆచరణ రూపంలో తర్జుమాచేసి తత్ఫలితాలను ఆనందంగా అనుభవించే భాగ్యానికి మనం నోచుకోలేదు.

ఒక రోజు గోపాలుని తల్లి, నరేంద్రుడు ఒకే సమయంలో దక్షిణేశ్వరంలో ఉండడం తటస్థించింది. అప్పటికీ నరేంద్రుడికి బ్రహ్మసమాజ సిద్ధాంతమైన నిరాకారతత్వం మీదే ఎక్కువ మొగ్గు ఉండేది. విగ్రహారాధన పట్ల అప్పటికీ అతడి కెంతో అయిష్టత ఉండేది. అయినా విగ్రహారాధకులు కూడా క్రమక్రమంగా సకల జీవులలో వెలసివున్న నిరాకార భగవంతుణ్ణే చేరుకోగలరనే నమ్మకం అప్పటికే అతడిలో జనించింది.

21. గోపాలుని తల్లిని వివేకానంద స్వామికి పరిచయం చేయడం

శ్రీరామకృష్ణులు హాస్యప్రియులు. సకలసుగుణాన్వితుడూ, గొప్ప మేధావీ, మహాపండితుడూ, చర్చలపట్ల ఎంతో అభిలాషగలవాడూ, భగవద్భక్తుడూ అయిన నరేంద్రుడు ఒక వైపు; నిరుపేద, నిరక్షరాస్యురాలు, తర్కవిచారాలంటే ఏమిటో తెలియని అజ్ఞురాలు, సరళ విశ్వాసంతో కేవలం ఒక్క భగవన్నామం ఆధారంగా భగవంతుని అనుగ్రహాన్ని, దర్శనాన్ని పొంద ప్రయత్నిస్తున్న వృద్ధురాలు గోపాలుని తల్లి మరొక వైపు. ఈ ఇరువురిని ఒకచోట చేర్చి శ్రీరామకృష్ణులు వినోదించసాగారు. మొట్టమొదట బాలగోపాల రూపంలో భగవంతుడు ఆమె కెలా సాక్షాత్కరించాడో, నాటినుండి తన దివ్య లీలను ఆమెతో ఎలా సలుపుతున్నాడో - ఈ విషయాలను నరేంద్రుడికి చెప్పమని శ్రీరామకృష్ణులు గోపాలుని తల్లిని అడిగారు. అప్పుడామె, ''గోపాలా, అలా చెప్పడంలో దోష మేమీ లేదు కదా?'' అని అడిగింది. దోషం లేదని శ్రీరామకృష్ణులు భరోసా ఇచ్చాక ఆమె గద్గద స్వరంలో, కళ్లు ఆర్ద్రంకాగా, బాలగోపాల రూపంలో మొట్టమొదటిసారిగా భగవంతుడు దర్శనమిచ్చి, అప్పటి నుండి రెండు నెలల పర్యంతం తనతో సలిపిన దివ్యలీలా విలాసాలను పూసగుచ్చినట్లు నరేంద్రుడికి చెప్పసాగింది. గోపాలు డెలా తన భుజంమీద తల ఆన్చి కామార్‌హాటి నుండి దక్షిణేశ్వరానికి వచ్చాడో, తన వక్షంమీదుగా అతడి రెండు ఎర్రని పాదాలు వ్రేలాడడం తను ఎలా స్పష్టంగా చూసిందో, అప్పుడప్పుడు అతడెలా శ్రీరామకృష్ణుల దేహంలో లీనమైపోయి బయటికి వచ్చాడో, నిద్రించడానికి దిండు లేదని ఎలా సణుక్కొన్నాడో, వంటకోసం ఎండు పుల్లలను ఎలా ప్రోగుచేశాడో, తిండికోసం ఎలా చిలిపిగా ప్రవర్తించాడో - ఈ

సంఘటనలన్నీ విశదంగా చెప్పింది. ఈ సంఘటనలను విశదీకరిస్తున్నప్పుడు ఆ వృద్ధురాలు ఉద్వేగంలో పులకాంకితురాలై భగవంతుణ్ణే బాలగోపాల రూపంలో ప్రత్యక్షీకరించుకోసాగింది.

నరేంద్రుడు బయటకు కరడుగట్టిన హేతువాదిగా కనిపించినా, నిజానికి అతడి అంతరంగం మాత్రం పరిపూర్ణ భగవద్భక్తితో నిండి ఉంటుంది. ఆ వృద్ధురాలి భావసమాధి గురించి, దివ్యదర్శనాలను గురించి వింటూ అతడు కళ్లనీళ్లను ఆపుకోలేకపోయాడు. తన కథనం వివరిస్తూ ఆమె, అమాయకంగా, ''నాయనా, నువ్వు విద్యావంతుడివి, బుద్ధిశాలివి; నేను అనాథను, అజ్ఞానిని; నా కేమీ తెలియదు, అర్థంకూడా కాదు. నా ఈ అనుభవాలు కేవలం భ్రమలో లేదా యథార్థాలో దయచేసి చెప్పు'' అని నరేంద్రుణ్ణే పదేపదే అడగసాగింది. ఆమెను ప్రతిసారి ఊరడిస్తూ నరేంద్రుడు, ''లేదమ్మా, భ్రమ కాదు, నువ్వు చూసిందంతా సత్యమే''[1] అని చెప్పసాగాడు. ఇంతకు ముందులా అనవరతం తాను గోపాలుని దర్శనం పొందకపోవడం వలన, ఆరాటంతో గోపాలుని తల్లి, నరేంద్రుణ్ణే అలా ప్రశ్నించి ఉండవచ్చు.

ఈ సమయంలోనే ఒక రోజు శ్రీరామకృష్ణులు, రాఖాల్‌తో (బ్రహ్మానంద స్వామి) కామార్‌హాటికి వెళ్లారు. అప్పుడు ఉదయం పది గంటలు అయివుంటుంది. స్వహస్తాలతో షడ్రసోపేతంగా వంటచేసి ఆయనకు తినిపించాలని గోపాలుని తల్లికి ఒక గొప్ప కోర్కె ఉంది. ఆ కారణంగానే నాడు శ్రీరామకృష్ణులు అక్కడకు వెళ్లారు. ఆయన రాకకు ఆమె పరమానందం చెందింది.

22. కామార్‌హాటి ఉద్యానంలో శ్రీరామకృష్ణులు పిశాచాన్ని చూడడం

వాళ్లు రాగానే ఫలహారం పెట్టి, యజమానుల ఇంట్లో వారి విశ్రాంతికి పడక నేర్పాటు చేసి, నడుం బిగించి వంటకు ఉపక్రమించింది. అంతకు మునుపే ఇతరుల నుండి మంచి పదార్థాలను సేకరించి తెచ్చింది. ఆమె వివిధ రకాల వంటకాలను తయారుచేసి, మధ్యాహ్నం తన సంతృప్తి మేరకు ఆయనకు తిని

---

1. ఇక్కడొక చమత్కారం ఉంది. శ్రీరామకృష్ణులు తనకు కలిగే దివ్యదర్శనాలను గురించి నరేంద్రునికి చెప్పేవారు. కాని అతడు వాటిని నమ్మేవాడు కాదు. అవన్నీ ఆయన భ్రమలనీ, గాఢంగా ఊహించుకోవడం వలన అవి దర్శనాలుగా అనిపిస్తున్నాయనీ అతడు ఆయనతో వాదించేవాడు. కాని ఇప్పుడు సరళహృదయురాలైన గోపాలుని తల్లి దర్శనాలను సత్యమని ఒప్పుకొన్నాడు. ఇకపైన శ్రీరామకృష్ణుల దర్శనాలనూ సత్యమని అతడికి ఒప్పుకోక తప్పదు. ఒకరి దర్శనాలను అంగీకరించి మరొకరివి భ్రమలనడం సహేతుకం అనిపించుకోదు కదా!

పించింది. భోజనం కాగానే ఇంటి మొదటి అంతస్తులోని దక్షిణపు గదిలో విశ్రాంతికై తన బొంతపై బాగా ఉతికిన దుప్పటి పరిచి పడకను సిద్ధంచేసింది. రాఖాల్ కూడా, గురుదేవుల పక్కనే పడుకొన్నాడు. శ్రీరామకృష్ణులు, రాఖాల్‌ను తమ మానసపుత్రునిగా పరిగణించి, అట్లే చూసుకోవడమే అందుకు కారణం.

శ్రీరామకృష్ణులు అప్పుడా గదిలో ఒక విచిత్రం చూశారు. స్వయంగా ఈ విషయం ఆయన ముఖతా వినడం వలన ఆ సంఘటనను సాహసించి ఇక్కడ పొందుపరుస్తున్నాం. లేకుంటే పేర్కొనేవారం కాదు. పగలు రాత్రి కలిపి శ్రీరామ కృష్ణులు కొద్దిసేపు మాత్రమే నిద్రించేవారు. కాబట్టి అప్పుడాయన కేవలం ఊరకే పడుకొనివున్నారు. రాఖాల్ ఆయన ప్రక్కనే నిద్రపోతున్నాడు. ఆ సంఘటన గురించి గురుదేవులు ఇలా చెప్పారు: ''అప్పుడు భరించలేని దుర్వా సన రాసాగింది. అప్పుడు గది ఒక మూలలో రెండు ఆకృతులను చూశాను. అవి పరమ వికారంగా కనిపించాయి. వాటి పొట్టల నుండి ప్రేగులు వ్రేలాడు తున్నాయి. వాటి ముఖం, కాళ్లు, చేతులు వైద్యకళాశాలలో నే నొకసారి చూసిన మానవ అస్థిపంజరాల మాదిరే ఉన్నాయి. అవి ఎంతో దీనంగా నాతో, 'మీ రిక్కడ ఎందుకు ఉన్నారు? ఇక్కడ నుండి దయచేసి వెళ్లిపోండి. మా కెంతో బాధగా ఉంది (బహుశా తమ దుస్థితిని తలచుకొంటూ) మిమ్మల్ని చూస్తే' అన్నాయి. ఒక ప్రక్క అవి కాళ్లావ్రేళ్లాపడుతూంటే, మరోప్రక్క రాఖాల్ నిద్రపోతున్నాడు. నా ఉనికి వాటికి కష్టంగా ఉందని గ్రహించి, నా చిన్నసంచి తువ్వాలు పుచ్చుకొని నేను బయటకు రాబోతుంటే, రాఖాల్ లేచి, 'ఎక్కడకు వెళుతున్నారు?' అని అడిగాడు. 'తరువాత చెబుతాలే' అంటూ అతడి చెయ్యి పుచ్చుకొని, క్రిందికి దిగాను. తరువాత మేం ఆ వృద్ధురాలి నుండి సెలవు పుచ్చుకొన్నాం. అప్పుడే ఆమె భోజనం తినడం పూర్తిచేసింది. పడవలో కూర్చున్న తరువాత, రాఖాల్‌కు ఇలా చెప్పాను: 'అక్కడ రెండు పిశాచా లున్నాయి. కామార్‌హాటి మిల్లు ఉద్యానానికి ప్రక్కనే ఉంది. అక్కడ నివసించే ఆంగ్లేయులు తిని పారేసే మాంసం, ఎముకల వాసనతో (పిశాచాల పరిభాషలో వాసన అంటే తినడమని అర్థం) అవి ఆ గదిని ఆశ్రయించి ఉన్నాయి.' సదాసర్వదా ఆమె ఒంటరిగానే ఆ ఇంట్లో జీవిస్తోంది కనుక, ఎక్కడ భయపడు తుందోనని ఈ విషయం ఆ వృద్ధురాలికి మాత్రం చెప్పలేదు.''

సుసంపన్నుడూ, సుప్రసిద్ధ కలకత్తా వాస్తవ్యుడూ అయిన కీ.శ. మతిలాల్ సీల్ ఉద్యానానికి ఎదురుగా మతిఝిల్ చెరువు ఉంది. దాని ప్రక్కనుండి

ఉత్తరం వైపుగా గంగాతీరం వెంబడి బారానగర్ బజార్‌ను దాటివెళ్లే ఒక వీధి ఉంది. క్రీ.శ. లాలాబాబు, రాణి కాత్యాయనుల అల్లుడైన కృష్ణగోపాల్ ఘోష్ ఉద్యానగృహం ఈ వీధిలోనే ఉన్నది. ఈ ఉద్యానగృహం లోనే 1885వ సం॥ డిసెంబర్ మధ్యనుండి 1886వ సం॥ ఆగస్టు 16వ తేదీ వరకు దాదాపు ఎనిమిది నెలలు (కంఠ వ్రణంతో బాధపడుతూ) శ్రీరామకృష్ణులు నివసించి, భక్తుల స్థూలదృష్టి నుండి కనుమరుగయ్యారు. కాశీపూర్ ఉద్యానంగా పేర్కొ-బడే ఈ ఉద్యానమే ఆ భక్తుల హృదయాలలో (గురుదేవుల అంత్యలీలను స్మరించుకొని) దుఃఖాన్ని, అదే సమయంలో హర్షాన్ని ఉత్పన్నం చేస్తుందో కదా! శ్రీరామ కృష్ణులు రోగగ్రస్తులు కావడం వలన భక్తులు దుఃఖించారనడం సబబే; కాని ఈ విషాద పరిస్థితిలో భక్తులు ఎలా ఆనందం పొందారో అన్న ప్రశ్న తలెత్తక మానదు. అందుకు జవాబు: శ్రీరామకృష్ణుల దివ్యదేహంలో ఆ రోగం బాహ్యంగా వ్యక్తమై ఆయన భక్తుల నందరినీ అద్భుత ప్రేమబంధంలో పెన వేయడానికి దారితీసింది. అంతేగాక ఆంతరంగిక భక్తులు - సాధారణ భక్తులు, కాబోయే సన్న్యాసులు - గృహస్థులు, జ్ఞానులు - భక్తులు అని భక్తులను వివిధ కోవల క్రింద వర్గీకరించడానికి కూడా దారితీసింది. వారిలోని తారతమ్యాలు ఈ కాలఘట్టంలోనే స్పష్టంగా తెలియవచ్చారు. తామంతా ఒకే ఆధ్యాత్మిక కుటుంబానికి చెందిన వారమనే విశ్వాసానికి అంకురార్పణ జరిగింది ఇక్కడే. అంతేగాక ఎంతమంది ఆధ్యాత్మిక పిపాసువులు ఇక్కడకు వచ్చి శ్రీరామకృష్ణు లను దర్శించుకొని అపరోక్షానుభూతి మార్గంలో పురోగమించారో లెక్కిం చడం ఎవరి తరం? కఠోర సాధన ఫలితంగా నరేంద్రుడు నిర్వికల్ప సమాధిని పొందింది ఈ కాశీపూర్‌లోనే! నరేంద్రుడితో సహా పన్నెండు మంది యువ కులు శ్రీరామకృష్ణుల పావన హస్తాల నుండి కాషాయాంబరాలను స్వీకరించిందీ ఇక్కడే.

23. గోపాలుని తల్లికి శ్రీరామకృష్ణులు తినిపించడం

1886వ సం॥ జనవరి నెల మొదటి తేది మధ్యాహ్నం (3-4 గం॥ మధ్య) తోటలో పచార్లుచేస్తూ శ్రీరామకృష్ణులు అక్కడ గుమిగూడిన భక్తులను చూసి అసాధారణ భావపారవశ్య స్థితిని పొంది, ''మీకిక చెప్పడానికి ఏముంది? మీ అందరికీ ఆధ్యాత్మిక జాగృతం కలుగుగాక!'' అని దీవిస్తూ, వారందరి హృదయాలను తన పావన హస్తాలతో స్పృశించి, వారిలో ప్రత్యక్షంగా ఆధ్యా త్మిక శక్తిని ప్రసారం చేసింది ఇక్కడే!

దక్షిణేశ్వరంలో మాదిరిగానే ప్రతి రోజు అనేకమంది భక్తులు కాశీ పూర్‌కు కూడా రాసాగారు. ఇక్కడకూడా మాతృదేవి, గురుదేవులకు

వంటచేయడం, ఇతరమైన ఇంటి పనులలో పూర్తిగా నిమగ్నమైంది. గోపాలుని తల్లి, ఇతర భక్తురాండ్రు ఇక్కడకు వచ్చి గురుదేవులను సేవిస్తూ, భక్తుల అవసరాలను చూసుకోసాగారు. వీరిలో కొందరు వీలైనప్పుడల్లా ఒకటి రెండు రాత్రుళ్లు అక్కడే సేవలో గడిపి ఇళ్లకు తిరిగి వెళ్లేవారు. కాబట్టి కాశీపూర్ ఉద్యానగృహంలో ఆ భక్తబృంద అద్భుత సమావేశాన్ని పరికించి చూస్తే ఏదో ఒక అజ్ఞాత మహత్కార్య నిర్వహణార్థమే జగజ్జనని శ్రీరామకృష్ణుల పావన దేహంలో ఆ వ్యాధిని కల్పించిందని మనకు తోస్తుంది.

ప్రతి రోజు గురుదేవుల దివ్యలీలలను దర్శిస్తూ, కొత్త భక్తులు రావడం చూసి, గురుదేవుల ఆనందమయమూర్తిని, ఆ మూర్తినుండి అభివ్యక్తమౌతున్న అపూర్వ శక్తి వికాసాన్ని గమనించి లోకహితార్థం ఆయన ఆ వ్యాధిని నటిస్తున్నారేమోని, సంకల్పమాత్రాన ఆ వ్యాధిని నిర్మూలించి, స్వస్థులు కాగలరని చిరకాలంగా వస్తున్న భక్తులు భావించారు.

కాశీపూర్ ఉద్యానంలో ఉంటున్నప్పుడు శ్రీరామకృష్ణులు బార్లీనీరు, సేమియా జావ మొదలైన ద్రవపదార్థాలను మాత్రమే పుచ్చుకొన్నారు. కాని ఒక రోజు కచ్చూరం (Zedoary) పొడి కలిపిన జున్నుపాలు పుచ్చుకోగోరారు. ప్రత్యేక సందర్భాలలో ఆహ్వానితులై వచ్చిన అతిథులకు సామాన్యంగా కలకత్తా గృహస్థులు ఈ జున్నుపాలను ఇస్తారు. బార్లీ, జావ మొదలైనవి పుచ్చుకొంటున్నప్పుడు జున్నుపాలు పుచ్చుకోవడం అంత హానికరం కాదని భావించి, శ్రీరామకృష్ణులు జున్నుపాలు పుచ్చుకోవడం గురించి ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. కాబట్టి మర్నాడు ఉదయం యోగేన్ (యోగానందస్వామి) కలకత్తాకు వెళ్లి అంగడి నుండి జున్నుపాలు కొని తీసుకురావాలని తీర్మానించారు.

యోగేన్ మర్నాటి ఉదయం బయలుదేరాడు. దారిలో ఆలోచనలో పడ్డాడు: 'అంగడిలో లభించే జున్నుపాలలో కచ్చూరం పొడితోపాటు నానా రకాలూ వేసి కల్తీచేస్తారు. దాన్ని గురుదేవులు తింటే రోగం ప్రకోపించదా?' శ్రీరామకృష్ణులను భక్తు లందరూ తమ ప్రాణంలో ప్రాణంగా చూసుకొంటారు. కాబట్టి ప్రతి భక్తుని మనస్సులో ఒకేఒక్క ఆలోచన 'ఆయన స్వస్థులు కావాలి' అన్న ఆలోచనే మెదలేది. ఆ కారణంగానే యోగేన్ అలా ఆలోచించాడని కచ్చితంగా చెప్పవచ్చు. మళ్లీ ఆలోచనలో పడ్డాడు: 'బయలుదేరడానికి ముందు ఈ విషయం గురించి గురుదేవులను అడగలేదే! కనుక ఏ భక్తుల ఇంట్లోనైనా జున్నుపాలు తయారుచేయించి తీసుకుపోతే ఆయన చిరాకుపడరా?' ఈ తీరులో ఆలోచించి బాగ్‌బజార్‌లోని బలరాం ఇంటికి యోగేన్ వెళ్లాడు. తన రాకకు గల కారణాన్ని వారికి చెప్పాడు. యోగేన్ చెప్పింది విని, అక్కడున్న

భక్తులు ఇలా అన్నారు: ''అంగడి జున్ను తీసుకుపోవడ మెందుకు? మేమే తయారుచేసి ఇస్తాం. కాని వెంటనే తీసుకుపోవడం కుదరదు. తయారు చేయడానికి ఆలస్యమౌతుంది. కనుక నువ్వు ఇక్కడే భోజనం చెయ్యి. ఈలోపు పాలు కాచి, సిద్ధపరుస్తాం. మధ్యాహ్నం మూడు గంటలకు నువ్వు పట్టుకుపోవచ్చు.'' అందుకు యోగేన్ అంగీకరించాడు. కాబట్టే అతడు ఇంట్లో తయారుచేసిన జున్నును తీసుకొని సుమారు సాయంత్రం నాలుగు గంటలకు కాశీపూర్‌కు తిరిగి వెళ్లగలిగాడు.

కాని శ్రీరామకృష్ణులు జున్నుపాలను మధ్యాహ్నం పుచ్చుకోవాలను కొన్నారు. దానికోసం ఎంతోసేపు ఎదురుచూసి, చివరకు మాములుగా భోజనం చేసేశారు. తరువాతే యోగేన్ తిరిగి వచ్చాడు. జరిగిందంతా అతడి నుండి విని ఆయన ఎంతో చిరాకుపడి, అతడితో ఇలా అన్నారు: ''అంగడి నుండి కొని తీసుకురమ్మని నీతో చెప్పారు. అంగడి జున్ను పాలను త్రాగాలను కొన్నాను. భక్తుల ఇంటికి వెళ్లి వాళ్లనెందుకు ఇబ్బందిపెట్టావు? పైగా ఈ పాలు మరీ చిక్కగా ఉంటాయి, జీర్ణించుకోవడం కష్టంకూడా. అటువంటప్పుడు దీనిని పుచ్చుకోవచ్చా? నేను దీన్ని పుచ్చుకోను.'' నిజానికి ఆయన దాన్ని ముట్టనుకూడా ముట్టలేదు. మాతృదేవిని పిలిచి, ఆ జున్నుపాలనంతా గోపాలుని తల్లికి ఇవ్వమని, ''దీనిని భక్తులు ఇచ్చారు; ఆమె హృదయంలో గోపాలుడు వాసం చేస్తున్నాడు. ఈ పాలను ఆమె త్రాగడం, నేను త్రాగడమే అవుతుంది'' అని చెప్పారు.

శ్రీరామకృష్ణుల నిర్యాణానంతరం గోపాలుని తల్లి పొందిన అశాంతత అంతా ఇంతా కాదు. చాలాకాలం వరకూ ఆమె కామార్‌హాటిని విడిచి బయటకు వెళ్లలేదు. ఆమె ఏకాంతవాసం చేసింది. తరువాత మునుపటిలా శ్రీరామకృష్ణుల దర్శనాలు పొందసాగాక, ఆమె మనస్సు కుదుటపడింది. శ్రీరామకృష్ణుల మహాసమాధ్యానంతరం ఆమెకు కలిగిన దివ్యదర్శనాలను గురించి మేం చాలా వినివున్నాం. గంగకు అవతలి వైపునవున్న మహేశుని రథయాత్రోత్సవాన్ని ఆమె తిలకించడానికి వెళ్లినప్పుడు కలిగిన అద్భుత దర్శనం వాటిలో ఒకటి. ఆ సందర్భంలో తన ముందు ఉన్న సమస్తంలో తన ఇష్టదైవమైన గోపాలుని దర్శించి వర్ణనాతీతమైన పరమానందాన్ని ఆమె చవిచూసింది. అప్పుడు ఆ రథం, రథంలోని జగన్నాథుడు, ఆ రథాన్ని లాగుతున్నవారు, ఉత్సవాన్ని దర్శిస్తున్న ఆ జనసమూహం - ఈ యావత్తు తన గోపాలునిలా కనిపించిందని ఆమె చెప్పింది. కాని ఆ గోపాలుడు విభిన్న రూపాలను దాల్చివున్నాడు; అంతే. ఈ

24. గోపాలుని తల్లికి విశ్వరూప దర్శనప్రాప్తి

విధంగా భగవంతుని విశ్వరూప దర్శనాన్ని పొంది ప్రేమానురాగాల ఉన్మత్తతలో ఆమె బాహ్యస్మృతిని కోల్పోయింది. ఒక సందర్భంలో మిత్రురా లొకరికి దీనిని గురించి తెలియచేస్తూ గోపాలుని తల్లి, ''అప్పుడు నేను నేను కాదు; నవ్వుతూ, నాట్యంతో మరో కురుక్షేత్రాన్నే సృష్టించాను'' అని చెప్పింది.

అప్పటి నుండి మనస్సు అల్లకల్లోలంగా ఉన్నప్పుడల్లా శ్రీరామకృష్ణుల సన్న్యాస శిష్యులు వసిస్తూన్న బారానగర మఠానికి గోపాలుని తల్లి వచ్చేది.

25. బారానగర మఠంలో గోపాలుని తల్లి

అక్కడ ఆమె మనస్సు కుదుటపడేది. అటువంటి సందర్భాలలో ఆ సన్న్యాసులు ఆమెను స్వహస్తాలతో వండి శ్రీరామకృష్ణులకు ఆ ఆహారాన్ని నివేదించమని కోరేవారు. ఆమె కూడా ఎంతో సంతోషించి ఒకటి రెండు కూరలు వండి, వాటిని గురుదేవులకు నైవేద్యంగా అర్పించేది. ఆ తరువాత మఠం మొదట్లో ఆలంబజారుకు, పిదప గంగకు ఆవలి వైపున ఉన్న నీలాంబరబాబు ఇంటికి మార్చబడింది. గోపాలుని తల్లి ఈ స్థలాలకు కూడా వచ్చి పగటిపూట పూర్తిగా ఎంతో ఆనందంగా అక్కడ గడిపేది. రాత్రిపూట కూడా అక్కడ గడిపిన సందర్భాలు ఒకటి రెండు లేకపోలేదు.

వివేకానందస్వామి అమెరికా నుండి తిరిగి వచ్చినప్పుడు ఆయనతోపాటు సారా (శ్రీమతి సారా సి.బుల్), జయ (కుమారి మాక్లౌడ్), నివేదిత కూడా

26. పాశ్చాత్య మహిళలతో గోపాలుని తల్లి

భారతదేశానికి వచ్చారు. ఒక రోజు వారంతా గోపాలుని తల్లిని చూడడంకోసం కామార్‌హాటికి వెళ్లారు. ఆమె మాట తీరుకు, కనబరచిన మర్యాదామన్ననలకు వారెంతో సంతోషించారు. వారిలో కూడా తన గోపాలుణ్ణే ఆమె చూసింది. వారి చుబుకాలను స్పృశించి, ఆప్యాయంగా వారిని ముద్దుపెట్టుకోవడం మాకు జ్ఞాపకమే. వారిని తన మంచంమీద కూర్చోపెట్టి తినడానికి అటుకులు, కొబ్బరి ఉండలు మొదలైనవి ఇచ్చింది. వారు కోరగా తనకు కలిగిన దివ్యదర్శనాలను గురించి ఒకింత చెప్పింది. ఆ పాశ్చాత్య మహిళలు వాటిని ఎంతో సంతోషంగా తిని, ఆమె మాటలను ముగ్ధులై విన్నారు. అమెరికాకు తీసుకుపోవడానికి ఆమె నడిగి కొంచెం అటుకులను పుచ్చుకున్నారు కూడా.

గోపాలుని తల్లి అద్భుత జీవిత కథను విని, సోదరి నివేదిత ముగ్ధురా

27. గోపాలుని తల్లి సోదరి నివేదిత ఇంట్లో నివసించడం

లైంది. 1904 సం॥ గోపాలుని తల్లికి బాగా జబ్బుచేసి, స్వయంగా ఏమీ చేసుకోలేని పరిస్థితి ఏర్పడినప్పుడు ఆమెను బలరాంబాబు ఇంటికి తోడ్కొని వచ్చారు. అప్పుడు సోదరి నివేదిత ఆమెను బాగ్‌బజార్‌లోని, నెం 17, బోస్‌పాడాలోని

తన ఇంటికి తీసుకువెళ్లాలని ఆరాటపడింది. ఆమె ఆరాటాన్ని చూసి గోపాలుని తల్లికూడా ఏమాత్రం సంకోచించకుండా, అందుకు అంగీకరించింది. ఎందుకంటే, ఆమె మనస్సులోని విచక్షతల నన్నిటినీ గోపాలుడు ఏనాడో తొలగించివేశాడు కదా! ఇందుకు ఉదాహరణగా మా కొక సంఘటన జ్ఞాపకం వస్తున్నది.

ఒక రోజు దక్షిణేశ్వరంలో నరేంద్రుడు, కాళీమాతకు నివేదించిన మేక మాంసాన్ని గిన్నెడు తిని, చేతులు కడుక్కోవడానికి బయటకు వెళ్లాడు. అతడు తిన్న స్థలాన్ని శుభ్రం చేయమని అక్కడున్న ఒక భక్తురాలికి శ్రీరామకృష్ణులు చెప్పారు. గోపాలుని తల్లి అప్పుడు అక్కడే ఉంది. శ్రీరామకృష్ణులు అలా చేయమని చెప్పగానే ఆ భక్తురాలు స్వహస్తాలతో ఆ స్థలాన్ని శుభ్రం చేసింది. ఆమె అలా చేయడం చూసి శ్రీరామకృష్ణులు ఎంతో సంతోషించి, ఆ భక్తురాలిని ఉద్దేశిస్తూ, ''నానాటికీ ఈమె ఎంత ఉదారంగా వ్యవహరిస్తున్నదో చూడండి'' అని అన్నారు.

28. గోపాలుని తల్లి మరణం

అప్పటి నుండి గోపాలుని తల్లి సోదరి నివేదిత ఇంట్లోనే నివసించ సాగింది. వివేకానందస్వామి మానస పుత్రికయైన నివేదిత ఆమెను తన కన్నతల్లిలానే సేవించింది. ప్రక్కనే ఉన్న ఒక బ్రాహ్మణ కుటుంబంవారిచే ఆమెకు భోజనాదికాలు ఏర్పాటు చేయించింది. ప్రతి రోజు పగటిపూట గోపాలుని తల్లి అక్కడకు వెళ్లి కాస్త అన్నం తినివచ్చేది. రాత్రి పూట ఆ కుటుంబంలోని ఎవరో ఒకరు ఆమె గదికి కొన్ని లూచీలు, ఇతర పదార్థాలు తెచ్చి ఇచ్చేవారు. ఈ విధంగా గోపాలుని

సోదరి నివేదిత

తల్లి రెండు సంవత్సరాలు జీవించి, గంగాతీరంలో మరణించింది. అంతిమ దినాలలో హైందవ ఆచారం మేరకు ఆమెను గంగాతీరానికి[1] మోసుకు వెళ్లారు. సోదరి నివేదిత స్వహస్తాలతో ఆమె మంచాన్ని పువ్వులతో, పువ్వుల మాలలతో, గంధమాల్యాదులతో చక్కగా అలంకరించింది; సంకీర్తన బృందాన్ని ఏర్పాటుచేసి, కన్నీరుమున్నీరై కాలినడకన గంగాతీరానికి వెళ్లింది. గోపాలుని తల్లికి ప్రాణం ఉన్న రెండు రోజులు నివేదిత రాత్రిళ్లు అక్కడే గడిపింది.

1906 వ సం॥ జూలై నెల ఎనిమిదవ తేది వేకువజామున, తూర్పుదిశ బాలభానుని అరుణారుణ కిరణాలతో రాగరంజితం కాసాగింది. ఆకాశంలో కొన్ని నక్షత్రాలు ఇంకా మిణుకు మిణుకుమంటూవున్నాయి. హిమగిరి నందన గంగానదీమతల్లి తెల్లని తరంగాలతో తీరాలను ముంచెత్తుతూ మర్మర ధ్వనితో ప్రవహిస్తూన్నది. అట్టి పవిత్ర ముహూర్తంలో గోపాలుని తల్లి దేహాన్ని భక్తిప్రపత్తులతో గంగాజలాలలో సగం వరకు ముంచి ఉంచారు. కొన్ని క్షణాల లోనే ఆమె పంచప్రాణాలు భగవంతుని పాదపద్మాలలో లీనం కాగా, ఆ మహా భక్తురాలు అభయపద ప్రాప్తి పొందింది.

ఆమె బంధువు లెవరూ ఆ సమయంలో అక్కడ లేకపోవడం వలన బేలూరు మఠానికి చెందిన ఒక బ్రాహ్మణ బ్రహ్మచారి ఆమెకు అంత్యక్రియలు జరిపి, శాస్త్రాల నిర్దేశం మేరకు పన్నెండు రోజులు హవిష్యాన్నం తింటూ శ్రాద్ధాది కర్మలను నిర్వర్తించాడు.

శోకసంతప్తయైన సోదరి నివేదిత ఆ పన్నెండు రోజులు గడిచాక, గోపాలుని తల్లికి బాగా పరిచయస్థులైన స్థానిక మహిళలను ఆహ్వానించి, తన పాఠశాల భవనంలో సంకీర్తన, సమారాధన మొదలైన పాటించవలసిన విధులను నిర్వర్తించింది.

చనిపోవడానికి ముందు గోపాలుని తల్లి తాను ఎంతో కాలం నుండి పూజిస్తూవచ్చిన శ్రీరామకృష్ణుల చిత్రపటాన్ని బేలూరు మఠ ఆలయంలో

---

1. ఇది వంగ దేశంలో పాటించే ప్రసిద్ధమైన ఆచారం. గంగాతీరంలో ప్రాణం విడిస్తే ముక్తి పొందుతారని హిందువుల నమ్మకం. అందుకై కొన ఊపిరితో ఉన్న వారిని గంగాతీరానికి మోసుకుపోయి నడుం నుండి క్రింది వరకు సగం దేహాన్ని నది నీళ్లలో ప్రాణం పోయేవరకు ముంచి ఉంచుతారు. అప్పటిదాకా ఒడ్డున ఉన్న బంధువులు, తదితరులు భగవన్నామ సంకీర్తనం, గీతా పారాయణం చేస్తూవుంటారు. సంపన్నులు సంకీర్తన బృందాన్ని ఏర్పాటు చేస్తారు. అంత్యకాలంలో భగవన్నామం వింటూ ప్రాణం విడవడమే ఈ ఆచార ఉద్దేశం.

పదిలపరచమని, మఠం వారికి ఇచ్చింది. ఆ సందర్భంలోనే శ్రీరామకృష్ణుల పూజ, సేవాదుల నిమిత్తం రెండు వందల రూపాయలు కూడా సమర్పించింది.

చివరి పన్నెండు సంవత్సరాల శేషజీవితాన్ని తనను ఒక సన్న్యాసినిగా పరిగణించుకొని, కాషాయాంబరాలనే ధరించిన గోపాలుని తల్లి ధన్యజీవి.

శ్రీరామకృష్ణుల మానవ ప్రవృత్తి[1]

1. శ్రీరామకృష్ణుల యోగశక్తుల గురించి వినే జనసామాన్యం ఆయన పట్ల భక్తిప్రపత్తులు చెల్లించేవారు

శ్రీరామకృష్ణుల దివ్యప్రవృత్తిని గురించి అనేకులు, అనేక విధాలుగా మాట్లాడుతుంటారు. తరచి చూసినప్పుడు అత్యధిక సంఖ్యాకులు శ్రీరామకృష్ణుల పట్ల కనబరిచే భక్తిప్రపత్తులకు కారణం ఆయన అలౌకిక యౌగిక శక్తులే అని తెలియవస్తుంది. 'ఆయనను మీ రెందుకు గౌరవిస్తున్నారు?' అని ఒక వ్యక్తిని అడిగినప్పుడు, ఆ వ్యక్తి నుండి వచ్చే జవాబు ఈ తీరులో ఉంటుంది: దక్షిణేశ్వర కాళికాలయంలో కూర్చునే సుదూరాలలో జరిగే సంఘటనలను ఆయన చూశారు; స్పర్శ మాత్రంతో కొన్ని సమయాలలో శారీరక రుగ్మతలను నయం చేశారు; దేవీదేవతలను సదా దర్శిస్తూ, వారితో సంభాషిస్తారు; ఆయన వాక్కు బ్రహ్మవాక్కు, ఆయన వచిస్తే అసంభవం సైతం బాహ్యప్రకృతి నియమాలను ఉల్లంఘించి జరిగే తీరుతుంది. మరణశిక్ష పొందిన వ్యక్తికూడా ఆయన అనుగ్రహానికి కించిత్తు పాత్రుడైతే, మరణశిక్ష నుండి తప్పించుకోవడమే కాక ప్రత్యేక గౌరవాన్ని కూడా పొందుతాడు; అలాగే ఎర్రని పువ్వులను మాత్రమే పూచే చెట్టు ఆయన వాక్కు ప్రభావంతో తెల్లని పువ్వులు పూస్తుంది.

లేదా శ్రీరామకృష్ణులు ఎదుటి వ్యక్తి ఆలోచనలు చదవగలరని కొందరంటారు; ఆయన అంతర్దృష్టి స్థూల ఆవరణాన్ని ఛేదించి వ్యక్తి అంతరంగంలోని ఉద్దేశాలను పసిగట్టగలరు; ఆయన సుతిమెత్తని చేతి స్పర్శమాత్రాన అల్లకల్లోలితమైన భక్తుల మనస్సులు ఉపశమించి, వారికి ఇష్టదేవతామూర్తుల

---

1. శ్రీరామకృష్ణుల డెబ్బై రెండవ జన్మదినోత్సవ సందర్భంగా బేలూరు మఠంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వామి శారదానంద చదివిన వ్యాసం.

దర్శనం కలిగి, వారి ధ్యానం ప్రగాఢమౌతుంది; యోగ్యులైన కొందరికి ఆయన సంకల్పమాత్రంచే నిర్వికల్ప సమాధి ద్వారం తెరచుకొంటుంది.

కొందరు ఇలా అంటారు: "ఆయన పట్ల మాకు భక్తిప్రపత్తులు ఎందుకున్నాయో మాకు తెలియదు. ఆయనలో మేం ఎంతటి అద్భుత సమగ్ర భక్తి జ్ఞానాలను చూశామో కదా! అటువంటి మరొక వ్యక్తిని లోకం ఆరాధించే వారిలోగాని, వేద పురాణాదులు ఉత్కృష్టంగా శ్లాఘించిన మహనీయులలోగాని మేం చూడడం అసంభవం; ఇక సమకాలీనులలో చూడగలమని చెప్పడం అనవసరం! శ్రీరామకృష్ణులతో పోల్చి చూసినప్పుడు పైన పేర్కొన్న వారు వెల వెలబోతారనడం అతిశయోక్తి కాబోదు! ఇలా భావించడం మా భ్రమో కాదో తేల్చి చెప్పలేకపోతున్నాం; కాని ఒక్కటి మాత్రం నిజం. ఆ దివ్యప్రకాశం చూసి మా కళ్లు బైర్లుక్రమ్మాయి; మా మనస్సులు ఆయన ప్రేమలో శాశ్వతంగా లీనమైపోయాయి; వెనక్కు మరలించాలని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. జ్ఞానం, తర్కం, హేతువాదం స్తంభించిపోయాయి. ఇంత మాత్రమే చెప్పగలం:

'ఓ దయానిధీ, జన్మ జన్మలకు నేను నీ దాసుణ్ణే
నీ గమ్యమేమిటో నే నెరుగును
నా గతి ఏమిటో అదీ తెలియదు
తెలుసుకోవాలనే ఆకాంక్ష సైతం లేదు
నీ ఆదేశంతో భుక్తిని ముక్తిని భక్తిని
జప తప భజన సాధనల నన్నిటినీ త్రోసిరాజన్నాను
ఉన్నది కేవలం ఒక్క కోర్కె - నిన్ను తెలుసుకోవాలని
దానికి కూడా అతీతంగా నన్ను తీసుకెళ్లు, 'ప్రభూ!' "[1]

కనుక పైన పేర్కొన్న చివరి కోవలోని కొద్దిమంది విషయం వదలి పెడితే, తక్కిన వారందరికీ శ్రీరామకృష్ణుల పట్ల అంతటి భక్తివిశ్వాసాలు ఏర్పడడానికి నిజమైన కారణం ఆయనకు గల అలౌకిక యౌగిక శక్తులే అన్న విషయం సుస్పష్టమౌతున్నది. శ్రీరామకృష్ణుల పట్ల భక్తిప్రపత్తులు కలిగి ఉంటే తమ రుగ్మతలు నయమౌతాయనో లేదా కష్టకాలం ఎదురైనప్పుడు తమకు అనుకూలంగా పరిస్థితులు చక్కబడతాయనో మందబుద్ధులు భావించడం పరిపాటి. నిజాయతీతో ఒప్పుకోకపోయినా ఆ సదరు వ్యక్తులలో స్వార్థమనే ప్రవాహం

---

1. వివేకానంద స్వామి వంగభాషలో రచించిన గీతం నుండి.

పరవళ్లుత్రొక్కి ప్రవహిస్తోందనే విషయం తెలుసుకోవడానికి ఎక్కువ కాలం పట్టదు.

ఇక ఇంతకంటే సూక్ష్మబుద్ధులు కొందరున్నారు. దూరశ్రవణం మొదలైన అణిమాది సిద్ధులను పొందడానికి లేదా ఆయన అనుయాయులలో ఒకరై గోలోకమో వైకుంఠమో చేరుకొని అక్కడ ఉండిపోవడానికి వీరు శ్రీరామకృష్ణులను ఆరాధిస్తారు.

లేదా బుద్ధిశక్తి మరింత సూక్ష్మమైనవారు శ్రీరామకృష్ణులను ఉపాసించి సమాధిస్థితి పొందాలనే, లేదా జననమరణ చక్రం నుండి ముక్తి పొందాలనే అభిలాషగలవారై కనిపిస్తారు. వీరి విశ్వాసానికీ వెనుక స్వార్థపరత్వం ఉందని సులభంగానే అర్థం చేసుకోవచ్చు.

శ్రీరామకృష్ణుల దివ్యశక్తులను చాటే దృష్టాంతాలు అనేకం; తమ కోర్కెలు ఈడేర భక్తులు ఆయనను సకామభక్తితో ఆరాధించినా కూడా తద్ద్వారా వారికి ఎంతో మేలు కలగడమన్నదీ సత్యమే; అయినప్పటికీ ఈ విషయాలను చర్చించడం మా ఉద్దేశం కాదు. శ్రీరామకృష్ణుల వైశిష్ట్య మానవ ప్రవృత్తిని చిత్రీకరించడమే మా ఉద్దేశం.

సకామభక్తి, అంటే ఏవైనా కోర్కెలను తీర్చుకోవాలనే ఉద్దేశంతో శ్రీరామకృష్ణుల పట్ల భక్తి కలిగివుండడం సత్యసాక్షాత్కార అధిరోహణకు ఆటంకంగా నిలుస్తుంది. స్వార్థపరత్వం సదా భయాన్నే కలిగిస్తుంది, భయమే సత్వరం మనిషిని దుర్బలుణ్ణే చేసివేస్తుంది. మళ్లీ స్వార్థసిద్ధి మనిషి మనస్సులో అహంకారాన్ని, అట్లే ఒక్కొక్కప్పుడు సోమరితనాన్ని అధికరించి, అతడి కళ్లను కప్పివేస్తుంది. కాబట్టి అతడు సత్యాన్ని దర్శించలేడు. అందువలననే తమ భక్తులలో ఈ లోపం రాకూడదనే ఉద్దేశంతో శ్రీరామకృష్ణులు ఒక కంట వారిని గమనిస్తూనే ఉండేవారు. ధ్యానాదులు అనుష్ఠిస్తూన్న ఫలితంగా తమ భక్తులలో ఎవరిలోనైనా దూరదర్శనం లేదా దూరశ్రవణం ఇత్యాది శక్తులు అభివ్యక్తమౌతున్నాయని చూచాయగా తెలుసుకొన్న తక్షణం ఆ భక్తుడి మనస్సులో అహంకారం తలెత్తి భగవత్సాక్షాత్కార లక్ష్యం నుండి అతణ్ణే వైదొలగ చేస్తుందని, వారిని కొంత కాలందాకా ధ్యానాదులు అనుష్ఠించడం ఆపమని నిషేధించేవారు. ఆయన అలా చేయడం మేం ఎన్నోసార్లు చూశాం. ఇటువంటి శక్తులను పొందడం మానవ జీవిత పరమావధి కాదని పదేపదే ఆయన వక్కాణించడం మేం వినివున్నాం.

2. సకామభక్తి ఆధ్యాత్మిక పురోగతికి హానికరం

అయినా దుర్బలుడైన వ్యక్తి అటువంటి మాటలను వింటాడా? లాభనష్టాలు బేరీజు వేయకుండా ఎవడైనా ఏదైనా చేస్తాడా? ఎవరినైనా గౌరవిస్తాడా?

త్యాగవైరాగ్యాలకు ప్రతిరూపులైన శ్రీరామకృష్ణుల జీవితాన్ని చూసి త్యాగగుణాన్ని అలవరచుకోవడానికి మారుగా తన స్వార్థసిద్ధి కోసమే ఆయనను ఆశ్రయిస్తాడు. శ్రీరామకృష్ణుల త్యాగవైరాగ్యాలు, అసాధారణ సాధనానుష్ఠానాలు, సత్యసంధత, పిల్లవాడివంటి సరళత్వం, భగవద్విశ్వాసం - ఇవన్నీ తన కోర్కెలు తీర్చడం కోసమేనని దుర్బలుడైన భక్తుడు భావిస్తాడు. ఈ వైఖరికి కారణం మానవ దౌర్బల్యమే. కాబట్టి శ్రీరామకృష్ణుల మానవ ప్రవృత్తిని గురించి చర్చించడం మన కెంతో మేలు ఒనగూరుస్తుంది.

3. యథార్థభక్తి ఉపాసకుని ఉపాస్యు విలా మారుస్తుంది

కొద్దిపాటి భక్తినైనా నిష్ఠతో అనుష్ఠిస్తే అది భక్తుణ్ణి అతడి ఇష్టదేవతలా మార్చివేస్తుంది. లోకంలోని అన్ని మత గ్రంథాలూ ఈ విషయాన్ని చాటి చెప్పడం సువిదితమే. శిలువ వేయబడిన ఏసుక్రీస్తును ధ్యానిస్తూ ఏకాగ్రచిత్తులైన క్రైస్తవ భక్తుల కాళ్ల నుండి, అర చేతుల నుండి రక్తం స్రవించడం; శ్రీకృష్ణ విరహిణియైన రాధాదేవిని తదేక చిత్తంతో ధ్యానించిన ఫలితంగా శ్రీచైతన్యులు తన దేహంలో భరించలేని మంటను అనుభవించడం, అదే విధంగా ఒక్కొక్కప్పుడు కళే బరంలా పడివుండడం; నిశ్చల ధ్యానమగ్నుడైన బుద్ధదేవుని విగ్రహం ఎదుట కూర్చుని ఆయనను తదేకంగా ఎంతోసేపు ధ్యానిస్తూ నిశ్చల భంగిమలో ఉండి పోయే బౌద్ధభక్తులు - పై విషయానికి కొన్ని దృష్టాంతాలుగా చెప్పవచ్చు.

అలాగే ఎవరో ఒక ప్రత్యేక వ్యక్తిని గాఢంగా ప్రేమించి సదా ఆ వ్యక్తిని గురించే ధ్యానిస్తూ ధ్యానిస్తూ తనకే తెలియకుండా క్రమంగా తన ప్రేమాస్పదు డిలా మారిపోవడమే కాక ఆ వ్యక్తి హావభావాలూ, ఆలోచనా సరళికూడా అట్లే సంతరించుకోవడం మేం కళ్లారా చూసివున్నాం. కాబట్టి మనకూ శ్రీరామ కృష్ణుల పట్ల కించిత్తు అయినా భక్తిప్రేమలుంటే మన దైనందిన జీవితం ఏ కొంతమేరకైనా ఆయన మాదిరి కాక తప్పదు. అలా కాకపోతే అవి యథార్థ భక్తిప్రేమలు కావనే నిర్ణయించాలి.

ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తవచ్చు: "అలాంటప్పుడు మనలో ప్రతి ఒక్కరం ఒక శ్రీరామకృష్ణ పరమహంస కాగలమా? ఒక వ్యక్తి సంపూర్ణంగా మరొక వ్యక్తిలా కావడం ఈ ప్రపంచంలో చూసివున్నామా?" ముమ్మూర్తులా కాకపోయినా ఒకే మూసలో పోతపోసిన వారిలా తప్పక మారగలరని మేం భావిస్తాం. ఆధ్యాత్మిక జగత్తులోని ప్రతి మహాత్ముడు ఒక్కో ప్రత్యేకమైన మూసవంటివారు. ఆ మూసలలో పోతపోయబడిన వారి శిష్యప్రశిష్యులు ఆ విభిన్న మూసలను నేటిదాక పదిలపరుస్తూ వస్తున్నారు. మనిషి శక్తి స్వల్పం; జీవితాంతం ప్రయత్నించి కూడా తమ జీవితాలను ఆ నమూనాల మాదిరి

మలచుకోవడం సాధ్యంకాదు. అదృష్టవశాత్తు ఎవరైనా అలా మలచుకోగలిగితే అటువంటి వారిని మనం సిద్ధపురుషులుగా ఆరాధిస్తాం. అటువంటి సిద్ధపురుషుడి మాట, చింతన, ప్రవర్తన మొదలైన భౌతిక మానసిక క్రియలన్నీ అతడు అనుసరించే ఆ మహాపురుషుడి మాదిరిగా మారిపోతాయి. ఏ మహాశక్తి ఆ ఆదర్శ మహాపురుషుడిలో మొట్టమొదటిసారిగా అభివ్యక్తమై లోకాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తిందో, ఆయనను అనుకరించిన సిద్ధపురుషుడి మనస్సులో దేహంలో అభివ్యక్తమై, దానిని ఇతరులకు పంచి యివ్వగలిగే పరికరంగా వికాసం చెందుతుంది. అనాది నుంచి ఇలా ఎందరో మహాత్ముల, అవతార పురుషుల ఆధ్యాత్మిక శక్తులు వారి శిష్యప్రశిష్యుల మూలంగా పరిరక్షితమై వస్తున్నాయి.

ఆధ్యాత్మిక జగత్తులో ఏ మహాత్ములు తమ జీవితాలలో కొంగ్రొత్త మూసలను, అంటే ఆదర్శాలను ప్రకటించిపోతుంటారో వారే 'అవతార పురుషులు'గా పూజింపబడుతున్నారు. ఈ అవతార పురుషులు క్రొత్త ఆధ్యాత్మిక సత్యాలను, మార్గాలను ఆవిష్కరిస్తారు. కేవలం స్పర్శమాత్రాన వీరు ఇతరులలో ఆధ్యాత్మిక శక్తిని అందించగలరు. ఈ అశాశ్వత లోకంలోని కామకాంచనాదులకై వారు తమ శక్తిని వ్యయంచేయరు. భగవత్సాక్షాత్కార మార్గం ఇతరులకు చూపడం కోసమే వారు జన్మిస్తారనే విషయం వారి జీవితాలను అధ్యయనం చేసినప్పుడు మనకు స్పష్టమౌతుంది; స్వీయ సుఖం లేదా ముక్తి వారి లక్ష్యం కానేకాదు. ఇతరుల దుఃఖాలను చూసి జాలిపడి వారిపట్ల ప్రవహించే అనంత ప్రేమే ఈ మహాపురుషులను కార్యక్షేత్రంలోకి ఉరికిస్తుంది, దుఃఖనివృత్తి మార్గాన్ని ఆవిష్కరించి వారికి దోహదం చేస్తారు.

4. అవతార పురుషుల జీవితాలను అధ్యయనం చేసినప్పుడు గోచరించే అపూర్వ విషయాలు

శ్రీరామకృష్ణుల దివ్యరూప సందర్శనం మాకు కలిగేటంత వరకు శ్రీకృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, శంకరుడు, చైతన్యుడు మొదలైన అవతార పురుషులలో దాగివున్న ఆధ్యాత్మిక శక్తుల గురించి బొత్తిగా మాకు తెలియదనడం అతిశయోక్తి కాదు. వారి జీవితాలలో జరిగిన అలౌకిక సంఘటనలు, తమ సంప్రదాయాలను బలపరచుకోవడం కోసమే వారి శిష్యప్రశిష్యులు కల్పించిన కథలుగా మేం భ్రమపడేవారం. అవతార పురుషులు కూడా నేటి సభ్య సమాజం నమ్మలేని కాల్పనిక జీవులనే భావించేవారం. లేదా భగవంతుడు అవతరించడం సంభవమని నమ్మినా, మనలో మాదిరే వారిలోనూ మానవ ప్రవృత్తు లుంటాయనే నమ్మకం కలిగేది కాదు. వారి దేహాలలో కూడా మనలో లాగానే రోగాలు జనిస్తాయని, వారి మనస్సులలో కూడా సుఖదుఃఖాలు ఉంటాయని, సరిగ్గా మనలో మాదిరే వారిలోను దేవుడు - సైతాన్ (దయ్యం) మధ్య

పోరాటం జరుగుతూ ఉండవచ్చుననీ మేం నమ్మేవారం కాదు. కాని శ్రీరామ కృష్ణుల పావన సాంగత్యం వలన అలా జరగడం సత్యమనే విషయం మేం గ్రహించగలిగాం.

అవతార పురుషులలో దేవ-మానవ ప్రవృత్తులు ఎంతో అద్భుత రీతిలో సామరస్యం చెందివుంటాయని మనం చదివో లేక వినో ఉంటాం. కాని శ్రీరామ కృష్ణులను దర్శించడానికి ముందు ఏ వ్యక్తిలోగాని బాలక భావం, కఠోర నియమాల పురుషభావం రెండూ సామరస్యం చెందివుండగలవని మేం నమ్మేవారం కాము.

శ్రీరామకృష్ణుల సరళ శిశు స్వభావమే తమను ఎంతగానో ఆకర్షించిందని ఎంతోమంది చెబుతూంటారు. అమాయకుడైన బాలుడు అందరి ప్రేమను సహజంగానే చూరగొంటాడు; అతణ్ణి కాపాడ వారంతా తమంతట తాముగానే ముందుకొస్తారు. కాస్త వయస్సు పైబడ్డప్పటికీ శ్రీరామకృష్ణులను చూసిన వారి మనస్సులలో కచ్చితంగా అటువంటి భావమే ఉదయించేది. అందువలన వారు ముగ్ధులై ఆయన పట్ల ఆకర్షితులయ్యేవారు. కొంతమేరకు ఈ విషయం నిజమే; కాని కేవలం ఈ ప్రవృత్తి మాత్రమే జనసామాన్యాన్ని ఆకర్షించిందని మేం అనుకోం. ఎందుకంటే, ఆయనను దర్శించినప్పుడు పొందిన ప్రేమ, ఆనందాలతోపాటు అదే సమయంలో ఆయన పట్ల భక్తివిశ్వాసాలు కూడా ఉదయించేవని మేం అనుభవపూర్వకంగా గ్రహించాం. కుసుమకోమలమైన శిశుస్వభావం అనే ముసుగు కప్పివుంచిన ఆయనలోని మహాశక్తే ఆ ఆకర్షణకు కారణం. శ్రీరాముడి అలౌకిక శీలాన్ని సుప్రసిద్ధ కవివరేణ్యుడైన భవభూతి ఇలా అభివర్ణించాడు:

వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి ।
లోకోత్తరాణాం చేతాంసి కోను విజ్ఞాతుమర్హతి ॥

[వజ్రంకంటే కఠోరంగానూ, పువ్వుల కంటే మృదువుగానూ లోకోత్తర పురుషుల మనస్సులుంటాయి; అటువంటి వారిని తెలుసుకోవడం ఎంత కష్టమో!]

శ్రీరామకృష్ణుల విషయంలోను పై విషయం యథాతథంగా వర్తిస్తుంది.

అలౌకిక సంఘటనలను పరిశీలించే వారికి శ్రీరామకృష్ణుల శిశు స్వభావం ఒక సరిక్రొత్త అనుభవం. ప్రగాఢ విశ్వాసం, ఎల్లలెరుగని సరళత్వం, సత్యనిష్ఠ ఆయన మనస్సులో సదాసర్వదా అభివ్యక్తమౌతూ ఉంటాయి; కాని లౌకికులు ఆయనలో లోకజ్ఞానం కొరవడడం మాత్రమే గమనించేవారు. అందరి మాట

లను ఆయన విశ్వసించేవారు, ముఖ్యంగా మత చిహ్నాలను ధరించే వారి మాట లను. దేశంలో, తమ స్వగ్రామంలో ప్రచారంలోవున్న భావాలు శ్రీరామకృష్ణుల అద్భుత శిశుస్వభావ ప్రవృత్తి పూర్ణవికాసానికి ఎంతో దోహదం చేశాయి.

5. శ్రీరామకృష్ణుల జన్మ స్థలం, కామార్పుకూర్

విస్తృతమైన ఆకుపచ్చని వరిపొలాలతో ఆకుపచ్చ సముద్రంలా కాన వస్తున్న సువిశాల ప్రదేశం; సముద్రంలోని చిన్నిచిన్ని ద్వీపాలలా కానవస్తున్న వెదురు, మర్రి, ఖర్జూరం, మామిడి, రాగి వంటి చెట్ల క్రింద శుభ్రమైన కృషీవలుల పూరిళ్లు; ఎత్తైన ఈత చెట్లతో ఆవృతమైన హాల్దార్పుకూర్ వంటి పెద్ద చెరువులు; ముదురు నీలి రంగు ఆకులతో కప్పబడివున్న ఆ చెరువుల నీలిజలం; చిన్నదైనా సుప్రసిద్ధమైన 'వృద్ధ శివుని' వంటి దేవుళ్లను ప్రతిష్ఠించిన గుళ్లు; శిథిలావస్థలో అనతిదూరాన కనిపిస్తున్న మందారన్ కోట; గ్రామ శివార్లలో తాతముత్తాతల ఎముకలు చెల్లా చెదరైపడివున్న శ్మశానవాటికలు; వాటి ప్రక్కన పచ్చికబయళ్లు; కాస్త దూరంలో దట్టమైన మామిడి తోపు; తోపు చుట్టూ వంకరటింకరగా ప్రవహిస్తూన్న 'భూతి' అనే వాగు; బర్ద్వాన్‌నుండి, పూరీకి పోయే సదా రద్దీగా ఉండి దాదాపు గ్రామాన్ని చుట్టుకొనిపోయే కాలిబాట - ఇదే కామార్పుకూర్, శ్రీరామకృష్ణుల జన్మస్థలం.

6. బాల రామకృష్ణుల అద్భుత ప్రవర్తన

చైతన్య మహాప్రభువు స్థాపించిన వైష్ణవ మతమే ఈ ప్రాంతాలలో అధి కంగా అనుసరింపబడుతూన్నది. రైతులు పొలాలలో పనిచేస్తూనో లేదా సాయంత్రం పనులన్నీ పూర్తయ్యాకనో భాగవత్సంకీర్తనం చేస్తూ తమ శ్రమను మరచిపోయేవారు. సరళ విశ్వాసమే వీరి మతానికి మూలం. మనుగడకోసం పెనుగులాటకు దూరంగా ఉన్న ఆ ప్రశాంత గ్రామ వాతావరణానికి, ఆ సరళ విశ్వాసానికి పసిహృదయం కూడా అనుకూల రంగమౌతుంది. బాల శ్రీరామకృష్ణుల విషయంలో అట్లే జరిగింది; ఆయన బాలుని వంటి ప్రవర్తన ఒక అద్భుతంగా అక్కడ పరిగణింపబడేది. ఆయన అద్భుత చేతలను అవగతం చేసుకోలేకపోయినా ఆయన ఉత్కృష్ట లక్ష్యాన్ని, ఆ లక్ష్యంపట్ల కనబరిచే ఏకాగ్రతను చూసి ప్రతి ఒక్కరూ విస్తు పోయేవారు. 'రామనామం మనిషిని పవిత్రునిగా చేస్తుంది' అనే విషయం హరి దాసుని ముఖతా విని అప్పుడప్పుడు బాలరామకృష్ణులు, 'అదే నిజమైతే హరి దాసూగారు ఇప్పటికీ ఆచమనాదులు చేయడం ఎందుకో?' అని ప్రశ్నించేవాడు. అలాగే ఒక పౌరాణిక నాటకాన్ని ఒక్కసారి వినగానే, అతడికది కంఠస్థమయ్యేది. తరువాత ఆ ఊరి మామిడితోపులో నేస్తాలతో కలిసి ఆ నాటకాన్ని ప్రదర్శించే వాడు. ఆ దారినే పోతున్నవారు ఆ పిల్లలు ప్రదర్శిస్తున్న నాటకాన్ని చూసి,

వారు ఆలాపిస్తున్న భక్తిగీతాలు విని ముగ్ధులై, తమ ప్రయాణాన్ని మరచిపోయి అక్కడే ఆగిపోవడం కద్దు. ఆ బాలుడి తెలివి ఇతర విషయాలలో కూడా అభివ్యక్తమయ్యేది. విగ్రహాలను తయారుచేయడంలో, దేవతామూర్తులను చిత్రించడంలో, అనుకరించడంలో, సంగీత సంకీర్తనలలో, రామాయణ భారత భాగవతాలను కేవలం విని వాటిని కంఠస్థం చేయడంలో, ప్రకృతి సౌందర్యానుభవంలో తన్మయత్వం పొందడంలో బాలరామకృష్ణుల కౌశలం వ్యక్తమయ్యేది. కారుమబ్బుల ఆకాశంలో తెల్లని కొంగలు బారులుతీరి ఎగిరి పోవడం చూసి ప్రప్రథమంగా తాను భావపారవశ్యం పొందానని స్వయంగా ఆయన ముఖతా మేం వినివున్నాం. అప్పు డాయన వయస్సు ఆరేడేళ్లు.

ఎప్పుడు ఏ భావం ఉదయిస్తుందో అప్పుడు ఆ ఒక్క భావంలో మాత్రమే లయమైపోవడం ఆ బాలుని విశిష్ట లక్షణం. ఇందుకు నిదర్శనంగా ఒక వర్తకుని ప్రాంగణాన్ని చూపుతూ ఇప్పటికీ ఇరుగుపొరుగులు ఇలా చెబుతూవుంటారు: 'శివ పార్వతుల సంవాదం' అనే నాటకంలో శివుని పాత్ర ధారికి హఠాత్తుగా జబ్బు చేయడంతో, అతడి స్థానే ఆ శివుని వేషం ధరించమని బాల రామకృష్ణులను అందరూ బ్రతిమాలగా, అందుకు అంగీకరించి శివ వేషం ధరించాడు. అప్పుడు శివభావంలో తన్మయుడై బాహ్యస్మృతిని చాలా సేపటి వరకు కోల్పోయాడు. వయస్సులో పిల్లవాడే అయినా పిల్లతనపు చాంచల్యం అతణ్ణి స్పృశించలేదు. తాను చూసినటువంటి లేదా విన్నటువంటి దేదైనా అతణ్ణి ఆకర్షిస్తే అది ఎంత గాఢంగా ఆతడి హృదయంలో హత్తుకుపోయే దంటే ఆ విషయంలో పరిపూర్ణతను సాధించి, దానిని వినూత్న రీతిలో వ్యక్తం చేసేవరకు ఆతడి మనస్సు కుదుటపడేది కాదు.

పుస్తకజ్ఞానం కొరవడినా బాహ్యజగత్తు సాంగత్యంతో బాలరామకృష్ణుల ఇంద్రియాలు సత్వరమే వికాసం చెందాయి. ఆయన జీవిత మూలసూత్రం

7. బాల రామకృష్ణుల సత్యాన్వేషణ

ఇది : ''ఏది సత్యమో దానిని క్షుణ్ణంగా పరీక్షించిన తరువాతే అంగీకరిస్తాను. పరీక్షకు అది నిలబడితే, దానిని ఆచరణలో పెడతాను. అసత్యంగా ఋజువు కాని దేనినైనా గ్రహించకూడదు.''

బాల్యంలో అద్భుత జ్ఞాపకశక్తి, తెలివితేటలు గల శ్రీరామకృష్ణులను చదువు నిమిత్తం బడికి పంపారు; కాని ఆయన విచిత్ర బాలకభావం మారలేదు. ''ఇంతకష్టపడి ఇదంతా నేర్చుకోవడం, అర్ధరాత్రి దాకా మేల్కొని భాష్య కారుల టీకలను, వ్యాఖ్యానాలను నెమరువేయడం - ఇదంతా ఏ ప్రయోజనార్థం? సత్యాన్ని ఆవిష్కరించుకోవడంలో ఇది నాకు దోహదం చేస్తుందా?'' అని ఆలోచించాడు. ఆ రకమైన విద్యను ఉత్పన్నం చేసిన బడి పంతులును

చూసి, అతడి మనస్సు ఇలా చెప్పింది: ''మహా అయితే నువ్వు కూడా ఆత డిలా సరళమైన పదాలకు మేథోపరమైన అర్థాలను జోడించగలవు; సంపన్ను లను పొగిడి రెండు కాసులు గడించి ఎలాగో సంసారాన్ని నెట్టుకురాగలవు; అతడిలా నువ్వూ శాస్త్రాలలోని పరమ సత్యాలను చదివి, వాటిని ఇతరులకు బోధించగలవు; కాని 'చందన కట్టెలను మోసే గాడిద'లా ఆ పరమ సత్యా లను నీ జీవితంలో అనుభూతం మాత్రం చేసుకోలేవు.'' విచక్షణాయుతమైన అతడి బుద్ధి ఇలా చెప్పింది: ''ఈ పొట్టకూటి విద్యవలన ఏ ప్రయోజనమూ లేదు. మానవ జీవిత నిగూఢ రహస్యాలను ఆవిష్కరించుకోగల ఆ 'పరా విద్య'ను మాత్రమే నేర్చుకోవడానికి ప్రయత్నించు.''

శ్రీరామకృష్ణులు బడికి వెళ్లడం మానుకొన్నాడు; ఆనందమయియైన జగ జ్జననిని ఆరాధించడంలో మనస్సును లగ్నం చేశారు. దానిలో సైతం ప్రశాం తత లభించిందా? అతడి మనస్సు ఇలా ప్రశ్నించింది: ''నిజంగానే ఆమె ఆనందమయియైన జగజ్జననియా? లేదా వట్టి రాతి విగ్రహమేనా? నిజంగానే ఈమె భక్తులు అర్పించే ఫలపుష్పాదులను స్వీకరిస్తుందా? ఈమె కృపాకటాక్ష వీక్షణంతో మనిషి సమస్త బంధాల నుండి ముక్తుడై దివ్యజ్ఞానాన్ని సంత రించుకోగలగడం నిజమేనా? లేదా, యుగాల పర్యంతం ప్రోగైవస్తూన్న ఆచారా లకు, ఊహలకు మూఢనమ్మకం జతయై రూపొందించిన అవాస్తవిక, ఛాయా మాత్ర రూపమా ఇది? ఆ రీతిలో మనిషి అనాది నుండి ఆత్మవంచన చేసు కొంటున్నాడా?'' ఈ సంశయాలను నివృత్తి చేసుకోవడానికి ఆ బాలుడి హృదయం తపించింది. దానితోపాటు ఆ సరళహృదయంలో తీవ్ర వైరాగ్యమనే మొలక మెల్లగా చిగురించసాగింది.

తరువాత ఆయన వివాహం జరిగింది. కాని పై సమస్యల పరిష్కారాన్వేష ణకు ఈ వివాహం ఆటంకం కాలేదు; నానావిధాలుగా ఆ సమస్యను పరిష్క రించే ప్రయత్నాలలో ఆయన మనస్సు లీనమైపోయింది; ఆ ప్రయత్నంలో భార్య, సంసారం, లౌకిక వ్యవహారాలు, ధనసంపాదన, సుఖం, చివరకు అత్యా వశ్యకాలైన అన్నపానీయాదులు - ఇవన్నీ నిష్ప్రయోజన స్మృతులుగా ఆయన మనస్సులో నిలిచిపోయాయి. సుదూరంలో ఉన్న కామార్పుకూర్‌లో ఎవరి బాలకభావం లౌకికులకు హాస్యాస్పదంగా తోచిందో, శ్రీరామకృష్ణుల ఆ బాలక భావం దక్షిణేశ్వరంలో మరింతగా వికాసం చెంది ప్రాపంచికుల దృష్టిలో పిచ్చి తనంగా పరిగణింపబడింది.

కాని ఆ బాలకభావంలో అసంబద్ధతగాని, ఉద్దేశరాహిత్యంగాని కనిపిస్తు న్నాయా? 'ఇంద్రియాతీతమైన ఆ పరమ సత్యాన్ని ప్రత్యక్షం చేసుకొంటాను,

స్పృశిస్తాను, పరిపూర్ణ రూపంలో చవిచూస్తాను' - ఆ వెర్రితనపు విశిష్ట లక్షణం ఇది కాదా? ఏ వజ్రసంకల్పం, ఏ నిరంతర పట్టుదల, ఏ శ్రద్ధ, ఏ ఏకాగ్రత కామార్పుకూర్‌లో బాలరామకృష్ణుల బాలక భావంలో ఒక సరిక్రొత్త అందాన్ని సంతరించుకొన్నదో, అదే ఇప్పుడు మళ్లీ దక్షిణేశ్వరంలో యువ రామకృష్ణుల పిచ్చితనంగా రూపుదిద్దుకొన్నది. ఎటువంటి అసాధారణ సంఘటన!

ఆ ఉన్మత్తత ఒక ఝంఝామారుతంగా పన్నెండేళ్ల పాటు విజృంభించి ఆయన మనస్సును కలచివేసింది. సంశయం, అపనమ్మకం అనే తరంగాలలో తలక్రిందులౌతూ శ్రీరామకృష్ణుల జీవననావ దాదాపు మునిగిపోయే స్థితికి చేరింది. కాని వీరహృదయం తన లక్ష్యాన్ని ఎన్నడూ వదలిపెట్టదు; సద్యో మరణాన్ని చూసి భయపడదు. కేవలం భగవత్ప్రేమ విశ్వాసాలే ఏకైక ఆసరాగా తన గమ్యపథంలో శ్రీరామకృష్ణుల మనస్సు పురోగమించసాగింది. సాంసారిక జీవితంలో కామకాంచనాలు ఉత్పన్నం చేసే కోలాహలం, లోకులు మంచి చెడులు, ధర్మాధర్మాలు, పాపపుణ్యాలుగా ఎంచే సమస్తం అట్టడుగుకు వెళ్లిపోయాయి. ఆయన మనస్సును ఆ మహా భావతరంగాలు మందకొడి జీవిత అల్ప కలహాలకు ఎంతో ఎత్తులో, అతి ఊర్ధ్వలోకానికి తీసుకువెళ్లాయి. అసాధారణ నిరంతర భావోద్వేగాలూ, తీవ్ర తపశ్చర్యలూ బలిష్ఠమైన శ్రీరామకృష్ణుల మనశ్శరీరాలను చెల్లాచెదరు చేసివేశాయి; అదే సమయంలో వాటికి వినూత్న రూపాన్ని, అందాన్ని సంతరింపచేశాయి. ఈ విధంగా మహాభావాన్ని (భగవత్ప్రేమ పరాకాష్ఠ స్థితి) ఇముడ్చుకోగల, ఆధ్యాత్మిక మహోన్నత సత్యాలను వివరించి అందించే సమగ్రమైన పరికరంలా శ్రీరామకృష్ణుల మనశ్శరీరాలు రూపుదిద్దుకొన్నాయి.

ఓ మనిషీ! శ్రీరామకృష్ణులు ఈ వీరగాథను నువ్వు అవగతం చేసుకోగలవా? నీ స్థూలదృష్టికి ఒక వస్తువు విలువ పెరిగేది దాని పరిణామం బట్టే కదా! అటువంటి ఏ దివ్యమహాశక్తి స్వార్థపరత్వాన్ని సమూలంగా నాశనంచేసి, అహంకారాన్ని కూకటివ్రేళ్లతో పెకలించివేసి, మనశ్శరీరాలను ఇకపై కించిత్తు స్వార్థ కార్యాన్ని చేయడానికి సైతం అసమర్థం చేస్తుందో, ఆ మహాశక్తి కనీసం నీ ఊహకు సైతం అందుతుందా?

8. ఆ సత్యాన్వేషణ ఫలితం

శ్రీరామకృష్ణుల హస్తాలు చేతనంగానో లేదా అచేతనంగానో ఏ లోహాన్ని స్పృశించినా తక్షణమే అవి కర్రలా బిగుసుకుపోయేవి. అటువంటప్పుడు దానిని తీసుకోవడం ఆయన కెలా సాధ్యమౌతుంది? తెలిసో తెలియకో ఎవరికి చెందినవో వారి అనుమతి లేకుండా ఆకులు పువ్వులు వంటి అతిసామాన్య వస్తువులన

ఆయన ఎప్పుడైనా పుచ్చుకొంటే, చక్కగా తెలిసిన దారికూడా ఆయన తప్పి పోయేవారు; ఆ అల్పవస్తువును తిరిగివెళ్లి తెచ్చిన చోటనే పడేసిన తరు వాతే ఆయనకు దారి స్పష్టంగా కనిపించేది. సామాన్య వస్తువులను మూటకట్టితే సరే, ఆ మూట విప్పనంత వరకు ఆయనకు శ్వాసక్రియ స్తంభించిపోయేదంటే అతిశయోక్తి కాదు! అపవిత్రురాలైన స్త్రీ ఎవరైనా ఆయనను తాకిన తక్షణమే, తాబేటి అవయవాల మాదిరి ఆయన పురుషాంగం పూర్తిగా కుంచించుకు పోయేది. జన్మాదిగా స్వార్థానికి మాత్రమే ఆలవాలమైన మనిషి కళ్లు ఏ పరమ పవిత్ర మానసిక స్థితులకు ఆ శారీరక వికారాలన్నీ చిహ్నాలో, వాటిని ఎలా చూడగలవు? ఎలా అర్థం చేసుకోగలవు? మన కాల్పనిక ఊహాశక్తి సైతం ఈ విశుద్ధ భావరాజ్యంలోకి ఎలా ప్రవేశించగలదు? పుట్టిన లగాయతు మన అంత రంగంలోని అపవిత్ర భావాలను కప్పిపుచ్చి, మనలను పవిత్రతకు ప్రతిరూపా లుగా చిత్రించుకోవడం మనకు వెన్నతోపెట్టిన విద్య. నిజాన్ని దాచిపెట్టి వంచ నతో ధనికులం కాగల లేదా సుప్రసిద్ధులం కాగల అవకాశం లభిస్తే మనలో ఎంత మంది అందుకు వెనుకాడతాం? ధైర్యసాహసాల విషయమూ అటువంటిదే. ఒక దెబ్బకు బదులుగా పది దెబ్బలు వడ్డించే సాహసం లేకపోయినా లేదా ఒక్క పరుగులో వెళ్లి అగ్నిజ్వాలలను క్రక్కుతున్న ఫిరంగిని హస్తగతం చేసుకోలేక పోయినా, లేదా మన చిరకాల వాంఛితమైన వస్తువు ప్రాప్తికై ప్రాణాలనొడ్డే ధైర్యం మనకు లేకపోయినా, ఇతరు లెవరైనా ధైర్యసాహసాలు ప్రదర్శించి అలా చేస్తే మనం గర్విస్తాం, వారిని ప్రశంసిస్తాం.

కాని ఏ సాహసంతో శ్రీరామకృష్ణులు ఇహపర సుఖభోగాల నన్నిటినీ పరిత్యజించారో, లోకానికి అజ్ఞాతం అజ్ఞేయం అయిన ఏ అతీంద్రియ సత్యం నిమిత్తం తమ మనశ్శరీరాలను సైతం పణంగా పెట్టారో, అట్టి ధైర్యసాహసాలను కించిత్తు అయినా అవగతం చేసుకోవడం మనకు సాధ్యమా? పాఠక మహా శయా! అవగతం చేసుకోగలిగితే మృత్యుంజయత్వం సంతరించుకొన్న వాడిగా మాచే, లోకంచే కొనియాడబడతావు.

శ్రీరామకృష్ణుల అతిసామాన్య వచనాలలో, చేతలలో ఎటువంటి గూఢార్థం ఇమిడివుంటుందో స్వయంగా ఆయనే వివరించకపోతే, ఎవరూ

9. శ్రీరామకృష్ణుల సరళ వచనాలలోని గూఢార్థం

అర్థం చేసుకోలేరు. భావసమాధి స్థితినుండి దిగివచ్చాక పరిచితులైన వ్యక్తుల పేర్లను లేదా వస్తువులను గురించి ప్రస్తావించేవారు లేదా వారిని స్పృశించేవారు; లేదా కొన్ని తినుబండారాలను పేర్కొని వాటిని తినగోరేవారు లేదా త్రాగగోరేవారు. ఎందు కలా చేసేవారో ఒక రోజు ఆయనే మాకు ఇలా విశదపరిచారు: ''సామాన్య

జనుల మనస్సులు సర్వసాధారణంగా గుదం, లింగం, నాభి కేంద్రాలలోనే తిరుగుతూ ఉంటుంది. మనస్సు కాస్త పవిత్రమైనప్పుడు కొన్నిసార్లు అది హృదయం దగ్గరి అనాహత చక్రం వరకు ఎగసి జ్యోతి దర్శనాన్నో లేదా జ్యోతిర్మయ రూప దర్శనాన్నో పొంది, ఆనందం అనుభవిస్తుంది. తరువాత సాధన చేస్తూచేస్తూ ఏకనిష్ఠను సంతరించుకొని మనస్సు కంఠ ప్రదేశంలోని విశుద్ధ చక్రానికి ఎగసి వెళుతుంది. అటువంటి స్థితిలో ఏ ధ్యేయవస్తువు మీద దానికంత నిష్ఠ జనించిందో దానిని గురించి తప్ప ఇతరత్రా వేటి గురించి ప్రసంగించడం దాదాపు ఆ మనస్సుకు అసంభవమౌతుంది. ఇంత ఉన్నత స్థానానికి మనస్సు ఎగసి వెళ్లినప్పటికీ, అది మళ్లీ నిమ్నచక్రాలకు దిగిపోయి తన ఆదర్శాన్ని పూర్తిగా విస్మరించడం కద్దు.

''కాని తీవ్ర నిష్ఠ, సాధన సహాయంతో ఒక్కసారి భ్రూమధ్యంలో ఉండే ఆజ్ఞాచక్రానికి కనుక మనస్సు చేరగలిగితే, సాధకుడికి సమాధి స్థితి కలుగుతుంది; అతడక్కడ ఎంత ఆనందాన్ని చవిచూస్తాడంటే దిగువ చక్రాల వద్ద లభించే ఆనందాలన్నీ ఎంతో అల్పంగా తోస్తాయి. ఇక్కడకు (ఆజ్ఞాచక్రం) చేరిన వాడు దిగువకు పడిపోవడమంటూ ఉండదు. సాధకుడికి ఈ స్థితిలో (లాంతరు లోపల వెలిగే దీపంలా) ఎంతో సన్నని ఆవరణతో కప్పబడిన పరమాత్మని జ్యోతి అభివ్యక్తమౌతుంది. అతడికీ పరమాత్మకీ కించిత్తు ఎడం ఉన్నప్పటికీ, ఈ భూమిని చేరిన వ్యక్తికి అద్వైతానుభూతి లభిస్తుంది. ఇక ఈ చక్రాన్ని ఛేదించగలిగితే భేదాభేదాల జ్ఞానంకూడా ఆమూలాగ్రం నశించి, పరిపూర్ణ అద్వైతావస్థ సిద్ధిస్తుంది.

''మీకు బోధించే నిమిత్తమే నా మనస్సు కంఠం వద్దనున్న విశుద్ధచక్రం వరకూ దిగుతూ ఉంటుంది. ఎంతో నిర్బంధంమీదటే మనస్సును అక్కడ నిలపగలుగుతాను. ఆరు నెలలపాటు నిర్వికల్ప సమాధిలో, సంపూర్ణ అద్వైత స్థితిలో ఉండిపోయిన కారణంగా, మనస్సు ఆ దిశవైపుకే సహజంగా వెళ్లగోరుతుంది. 'ఇది చేస్తాను', 'అది తింటాను', 'ఈ వ్యక్తిని చూడాలి', 'అక్కడకు వెళ్లాలి' మొదలైన చిరుకోర్కెలు కల్పించుకోకపోతే, మనస్సును ఆ ఊర్ధ్వస్థితి నుండి దిగువకు తీసుకురావడం అసాధ్యం. మనస్సు క్రిందికి దిగిరాకుంటే తినడం, తిరగడం, మాట్లాడడం, దేహాన్ని సజీవంగా ఉంచడం మొదలైనవన్నీ చేయడం అసాధ్యమే ఔతుంది. కాబట్టే భావసమాధిలోకి పోతున్న సమయంలో, 'నేను పొగత్రాగుతాను', 'ఫలానా చోటికి వెళతాను' ఇత్యాది చిరుకోర్కెలను కల్పించుకొంటాను. అయినప్పటికీ ఆ కోర్కెలను పదేపదే మననం చేసుకొంటేనే తప్ప మనస్సు క్రిందికి దిగిరాదు.''

''సమాధి స్థితి పొందడానికి మునుపు సాధకుడు ఏ పరిస్థితులలో, స్థితులలో ఉండివుంటాడో, సమాధిని పొందిన తదనంతరం ఎంతో శక్తివంతు డైనప్పటికీ ఆ వెనుకటి పరిస్థితులను మార్చాలనే ఆకాంక్ష అతడికి ఉండదు. ఎందుకంటే ఒక్క బ్రహ్మవస్తువు తప్ప తక్కినవన్నీ అతడికి తుచ్ఛంగా కనిపిస్తాయి కనుక' అని పంచదశీకారుడు ఒక చోట వచించాడు. శ్రీరామకృష్ణుల జీవితంలో ఈ సత్యం ఋజువైంది. భగవత్ప్రేమ అనే ఝుంఝూమారుతం ఆయనలో చెలరేగ డానికి మునుపు ఆయన అలవాట్లు, జీవన విధానాలు ఎలా ఉండేవో, తదనం తరం కూడా అట్లే ఉండిపోవడం మనం గమనించవచ్చు. ఆ అలవాట్లు కొన్ని టిని ఇక్కడ పేర్కొంటున్నాం.

10. శ్రీరామకృష్ణుల దైనందిన అలవాట్లు, ఇష్టానిష్టతలు

తన దేహాన్ని, దుస్తులను, పరుపు మొదలైన వాటిని ఎంతో శుభ్రంగా ఉంచుకోవడం ఆయన అలవాటు. వస్తువులను వాటి సముచిత స్థానంలోనే ఉంచేవారు, ఇతరులనూ అలాగే చేయమని బోధించేవారు; ఎవరైనా అందుకు విరుద్ధంగా చేస్తే ఆయన చిరాకుపడేవారు. ఎక్కడకన్నా వెళ్లబోతున్నప్పుడు తువ్వాలు, చిన్నసంచి, తదితర అవసర సామగ్రి వెంట తీసుకువస్తున్నారో లేదో స్వయంగా కనుక్కొనేవారు. అలాగే తిరిగి వచ్చేటప్పుడు పట్టుకెళ్లిన ఏ వస్తు వునూ మరిచిపోకుండా తీసుకురావలసిందిగా తమతో వచ్చిన శిష్యులకు జ్ఞాపకం చేసేవారు. ప్రతి పనిని వేళతప్పకుండా చేయడానికి ఆరాటం చెందే వారు. ఒక పని చేస్తానని వచిస్తే, ఆ పనిని తప్పకుండా నిర్వర్తించేవారు. ఒక ఫలానా వ్యక్తి నుండి ఒక వస్తువు పుచ్చుకుంటానని చెబితే, ఆ వస్తువును అతడి నుండి మాత్రమే పుచ్చుకొనేవారు; ఇతరుల నుండి పుచ్చుకొంటే అసత్య దోషా నికి పాల్పడినట్లవుతుంది కదా! అటువంటి విషయాలలో హఠం పట్టి ఆయ నకు ఎంతో అసౌకర్యం కలిగినా ఆయన దానిని భరించేవారే తప్ప తన మాటను జవదాటేవారు కారు. ఏవరినైనా చిరిగిన దుస్తులతో, గొడుగుతో, చెప్పులతో ఆయన చూస్తే, వీలైతే క్రొత్తవి కొని ధరించమని ఆతడికి చెప్పేవారు; ఆ వ్యక్తి పేదవాడైతే కొన్ని సమయాలలో ఆయనే స్వయంగా వాటిని కొనియిచ్చేవారు. ''చిరిగిన దుస్తులు మొదలైనవి ఉపయోగించే వ్యక్తిపై లక్ష్మీకటాక్షం ప్రసరిం చదు'' అని ఆయన తరచు చెప్పేవారు.

గర్వం, అహంకారం సూచించే వచనాలు ఆయన నోటి నుండి ఎన్నడూ వెలువడవు. తమ భావాన్ని లేదా అభిప్రాయాన్ని చెప్పవలసివస్తే తమ శరీరాన్ని చూపుతూ, 'ఇక్కడి భావం' లేదా 'ఇక్కడి అభిప్రాయం' అనే మాటలే వాడే వారు. తమ శిష్యుల చేతులు, కాళ్లు, ముఖం, కళ్లు మొదలైన అంగాలను,

వారి ప్రవర్తన, తినే త్రాగే నడిచే నిద్రించే విధానాలను సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలిస్తూండేవారు. తద్ద్వారా వారి మానసిక స్థితిగతులు, వారి పురోగతి చక్కగా ఆకళింపు చేసుకోగలిగేవారు. వ్యక్తులను గురించి ఆయనకు ఏర్పడిన అభిప్రాయాలు తప్పుకావడం మే మెన్నడూ చూడలేదు.

శ్రీరామకృష్ణులను దర్శించుకొన్న వారిలో అత్యధిక సంఖ్యాకులు ఆయన తమనే అధికంగా అభిమానించేవారని భావించడం కద్దు. ప్రతివ్యక్తి సుఖ దుఃఖాల పట్ల ఆయన కనబరిచే ప్రగాఢ సానుభూతియే వారలా భావించడానికి కారణంగా మాకు తోస్తుంది. సానుభూతి, ప్రేమ - ఇవి రెండూ విభిన్నమైనవి, బాహ్య లక్షణాలనుబట్టి రెండూ ఒకేలా కనిపించినప్పటికీ కూడా. కాబట్టి సానుభూతిని ప్రేమగా జమకట్టడంలో వింతలేదు. ఎప్పుడు దేనిని గురించి ఆలోచించేవారో అప్పుడు దాన్లోనే పూర్తిగా లీనమైపోవడం శ్రీరామకృష్ణుల స్వాభావిక మనోవైఖరి. ఆయనలో ఈ విశేషగుణం ఉండడం వలన తమ ప్రతి శిష్యుని మనోస్థితిని యథాతథంగా తెలుసుకోగలిగి, ఆ శిష్యుని ఉన్నతికి సరైన మార్గాన్ని నిర్ణయించేవారు.

శ్రీరామకృష్ణుల బాలక ప్రవృత్తిని వివరిస్తున్నప్పుడు చిన్ననాటి నుండే తమ కళ్ళు, చెవులు మొదలైన ఇంద్రియాలను సరైన పరిశీలనలో ఎలా పూర్తిగా ఉపయోగించుకోవడం నేర్చుకొన్నారో చూపడానికి ప్రయత్నించాం. తమ శిష్యులలో కూడా ఈ విశేష గుణాన్ని పెంపొందింప ఆయన గట్టిగా ప్రయత్నించారు. చేతలను కార్యరూపంలో పెట్టడానికి మునుపే 'విచారణ'ను ఉపయోగించమని శిష్యులకు ఆయన ఉపదేశించేవారు. 'విచారణ' ఒక్కటే ప్రతిదాని మంచి చెడులను వెల్లడించి, మనస్సును నిజమైన పరిత్యాగం వైపుకు తీసుకు పోతుందని పదేపదే ఆయన వక్కాణించేవారు. మూర్ఖుణ్ణి, సంకుచిత మనస్కుణ్ణి ఆయన ఎన్నడూ ఇష్టపడేవారు కాదు. తరచు ఆయన ఇలా చెప్పగా వినేవాళ్లం : ''నువ్వు భక్తుడివి, నిజమే. అంతమాత్రాన మూర్ఖుడవు కావడ మెందుకు? ఒకే ఒక్క భావాన్ని అనుసరించే సంకుచిత మనస్కుడవు కావద్దు; అది 'ఇక్కడి' (అంటే తమ) వైఖరి కాదు. ఒకే ఆహారపదార్థాన్ని పలు రకాల భక్ష్యాలుగా వండితే తింటాను. (అంటే భగవంతుణ్ణి రకరకాలుగా, అనంత భావాల ద్వారా పొందడం). ఇదే ఇక్కడి వైఖరి.'' ఒకే ఒక్క భావం మాత్రమే నిజమని చెప్పడాన్ని ఆయన మందకొడి వైఖరిగా పేర్కొనేవారు. తమ శిష్యు డెవరైనా ఏదేని భగవంతుని విశేష భావాన్ని ఆనందించలేకపోతే, 'ఎంత అల్ప బుద్ధివి!' అంటూ మందలించేవారు. ఆ మందలింపు విని ఆ శిష్యుడు సిగ్గుతో తలవంచుకోవలసి వచ్చేది. అటువంటి మహోదార, విశ్వజనీన భావప్రేరణ

వలననే శ్రీరామకృష్ణులు అన్ని మత సంప్రదాయాల సాధనలను అనుష్ఠించి, 'మతాలెన్నో మార్గాలన్ని' అనే మహోన్నత సత్యాన్ని ఆవిష్కరించారనడంలో ఎలాటి సందేహమూ లేదు.

పుష్పం వికసించింది. నానాదిశల నుండి తుమ్మెదలు మధువును వెర్రిగా ఆస్వాదింప పరుగెత్తుకొని రాసాగాయి. దినకరుని స్పర్శతో హృదయం పూర్తిగా వికసించిన పద్మం వాటి వాంఛలను పూర్తిగా తీర్చడానికి వెనుకాడదు. అదే విధంగా శ్రీరామకృష్ణులు తమ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరిని సంతృప్తిపరచడంలో ప్రయత్నం లోపం చేయలేదు. ఎవరికి పాశ్చాత్య విద్యను గురించిన ఎరుక లుప్తమో, కొందరు ఆధునికులు మూఢనమ్మకాల కుప్పగా ఎంచే సనాతన ధర్మాన్ని అను ష్ఠిస్తూ ఎవరు తమ జీవితాన్ని రూపుదిద్దుకొన్నారో, అటువంటి శ్రీరామ కృష్ణులు ఏ ఆధ్యాత్మిక అమృతాన్ని లోకానికి పంచి యిచ్చారో, అటువంటి అమృతాన్ని ప్రపంచం మరెన్నడైనా చవిచూసి ఉందా? శ్రీరామకృష్ణులు సంచయం చేసి, తమ శిష్యులకు అందించిన ఆ మహా ఆధ్యాత్మిక శక్తి లీలను లోకం ఇంతకు మునుపు ఎన్నడైనా చూసివుందా? ఆ మహాశక్తి ప్రేరణతో ఆధునిక విజ్ఞానం వెలుగు ప్రసరిస్తూన్నప్పటికీ లోకులు ఆధ్యాత్మికత అన్నది ఒక ప్రత్యక్షానుభూతిగా అవగతం చేసుకోవడం, అన్ని మతాలలోను అపరివర్త నీయమైన ఒక సనాతన సత్యం ప్రవహిస్తూ ఉండడం మునుపు ఎన్నడైనా లోకం చూసివుందా?

11. ఆధ్యాత్మిక చైతన్య జాగృతిమూర్తి శ్రీరామకృష్ణులు

ఒక పువ్వు నుండి మరో పువ్వుకు సంచరించే మలయమారుతంలా ఒక సత్యం నుండి మరో సత్యానికి పయనిస్తూన్న మానవ జీవనం క్రమక్రమంగా, నెమ్మదిగా అపరివర్తనీయమైన ఆ అద్వైతసత్యం వైపుకే పురోగమిస్తున్నది; అంతేకాక ఒకానొక రోజు తప్పకుండా అది ఆ అపార అనంత అవాఙ్మానస గోచరమైన పరమసత్యాన్ని చేరుకొంటుంది - అనే అభయవాణి మునుపు ఎన్న డైనా పలకడం ఈ లోకం చూసివుందా?

భారతావనిలో అవతరించిన శ్రీకృష్ణుడు, బుద్ధుడు, శంకరుడు, రామా నుజుడు, చైతన్యుడు; అట్లే ఇతర దేశాలలో ఉద్భవించిన ఏసుక్రీస్తు, మహ మ్మదు మొదలైన మతాచార్యులు ఆధ్యాత్మిక జగత్తులోని ఏ మతసంకుచి తత్వాన్ని నిర్మూలించలేకపోయారో, విద్యావిహీనుడైన ఈ బ్రాహ్మణ బాలుడు తన జీవితంలో దాన్ని ఆమూలాగ్రం నిర్మూలించి, పరస్పరవిరుద్ధమైన మతా లన్నిటి మధ్య అద్భుత సామరస్యమనే అసాధ్యాన్ని సాధ్యం చేయగలగడం ఎవ రైనా ఎన్నడైనా కనీవినీ ఉన్నారా?

ఆధ్యాత్మిక జగత్తులో శ్రీరామకృష్ణుల స్థానాన్ని ఎవరు నిర్ణయించగలరు? మేం ఆ సాహసం చేయలేం. కాని ఇంతమటుకు చెప్పగలం. నిర్జీవమైన భారత దేశం ఆయన పావన పదస్పర్శతో మరింత పావనత్వాన్ని సంతరించుకొన్నది, జాగృతమైంది; ప్రపంచ దేశాలలో అది వైభవ స్థానాన్ని ఆక్రమించడం తథ్యం; లోకానికి భారతదేశం ఆశను, ఆశీస్సులను ఇవ్వనున్నది; ఆయన మానవ రూపంలో అవతరించిన కారణంగా మనిషి సైతం దేవతలకూ పూజనీయు డయ్యాడనడం అతిశయోక్తి కాదు; అంతేకాక వివేకానంద స్వామిలో లోకం శ్రీరామకృష్ణులు జాగృతం చేసిన అద్భుత శక్తి ప్రకటన ప్రారంభాన్ని మాత్రమే దర్శించింది.

గురు భావం సమాప్తం

V

దివ్యభావం - నరేంద్రుడు

ప్రస్తావన

ఇది శ్రీరామకృష్ణ పరమహంస గ్రంథంలో ఐదవ భాగం. దీన్లో బ్రహ్మసమాజ భక్తులతో ప్రప్రథమంగా పరిచయం కావడం నుండి, కంఠవ్యాధి చికిత్స నిమిత్తం కలకత్తాలోని శ్యాంపుకూర్‌లో నివసించి నప్పటి వరకు శ్రీరామకృష్ణుల జీవితంలో జరిగిన సంఘటనలను సాధ్య మైనంత దాకా పొందుపరిచాం. ఈ కాలఘట్టంలో శ్రీరామకృష్ణులు దివ్య భావంలో పూర్తిగా సుప్రతిష్ఠితులై మెలగారు; ఆయన చేతలను, ప్రవర్త నను ఈ భావమే పురికొల్పింది. పైగా ఆయన జీవితం, నరేంద్రుడి (వివేకానంద స్వామి) జీవితంతో శాశ్వత మధురానుబంధంతో ముడి వేయబడింది కూడా ఈ కాలఘట్టంలోనే. శ్రీరామకృష్ణుల ఈ కాలఘట్ట జీవితాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు, నరేంద్రుని జీవిత గాథ కూడా ఏకకాలంలో మనకు ద్యోతకమౌతుంది. అందువలననే ఈ గ్రంథ విభా గాన్ని 'దివ్యభావం - నరేంద్రుడు'గా పేర్కొన్నాం.

శ్రీరామకృష్ణులుగా దివ్యజనని సలిపిన దివ్యలీలను రచింప ప్రారం భించినప్పుడు, ఇంతవరకు పురోగమించగలమని ఎన్నడూ మేం ఊహించలేదు. అనూహ్యమైన ఆయన అనుగ్రహం వలననే ఇది సాధ్య మైందని మా గట్టి నమ్మకం. కాబట్టి ఆయన పాదపద్మాలకు పదేపదే ప్రణామం చేస్తూ, ఈ ఐదవ భాగాన్ని వినమ్రంగా పాఠకుల ముందు సమర్పిస్తున్నాం.

శుక్లపక్ష తదియ,
ఫాల్గుణం, **1919**

రచయిత

సింహావలోకనం

1. శ్రీరామకృష్ణుల జీవితంలో దివ్యభావం

1873వ సం॥ షోడశీపూజ నిర్వర్తించి తమ సాధనలకు శ్రీరామకృష్ణులు భరతవాక్యం పలికారని ఇంతకు మునుపే తెలిపివున్నాం. ఆనాటి నుండి దివ్యభావ ప్రేరణతో తమ చేతలన్నీ ఆయన నిర్వర్తించారని చెప్పడం సబబు కాదు. అప్పుడు ఆయన వయస్సు ముప్పై ఎనిమిదేళ్లు. కాబట్టి ఆ దివ్యభావం ఆయన జీవితంలో పన్నెండేళ్లు[1] కంటే కాస్త ఎక్కువకాలం కొనసాగింది. ఈ కాలంలో జగజ్జనని సంకల్పంతో ఆయన చేతలన్నీ కొంగ్రొత్త అసాధారణ లక్షణాన్ని సంతరించుకొన్నాయి. ఆ సంకల్ప ప్రేరణతో, ఆధునిక పాశ్చాత్య విధానంలో విద్యావంతులైన వారికి మతం, ఆధ్యాత్మికతలను అందించడంలో తన మనస్సును లగ్నం చేశారు. కాబట్టి పన్నెండేళ్ల ఆధ్యాత్మిక సాధనాకాలంలో శ్రీరామకృష్ణులు ఆరేళ్లు తాము సముపార్జించిన శక్తిని స్వయంగా తెలుసుకొంటూ, జనసామాన్యం ఆధ్యాత్మిక స్థితిని గ్రహిస్తూ గడిపినట్లు స్పష్టమౌతుంది. ఆ తరువాత సాటిలేని శక్తితో సనాతన ధర్మ పునఃస్థాపన కార్యంలో నిమగ్నులైనారు; పాశ్చాత్య భావాల, ఆదర్శాల ప్రగాఢ ప్రేరణతో మతం పతనం చెందడాన్ని అరికట్టగలిగారు. తమ ఈ కార్యాన్ని పూర్తిచేసి ఆయన ఈ లోకం నుండి నిష్క్రమించారు. ఈ దివ్య కార్యాన్ని ఎలా నిర్వర్తించారో మా శక్తిమేరకు పొందుపరచనున్నాం.

మేం ఇంతకు మునుపు చెప్పిన దాని నుండి పాఠకుడు, ముప్పై తొమ్మిదవ సం॥ దాకా శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మిక సాధకుడు మాత్రమే అని భావించవచ్చు. కాని అది నిజం కాదు. మానవాళిని ఆధ్యాత్మిక మహాసత్యాలను అనుభూతం చేసుకోవడంలో పురోగమింప చేసిన లోకారాధకులైన జగద్గురువులలో,

---

1. శ్రీరామకృష్ణులు తమ యాభై ఒకటవ ఏట మహాసమాధి చెందారు.

ప్రవక్తలలో, మత వ్యవస్థాపకులలో చిన్ననాటి నుండే జగద్గురువు లక్షణాలు అభివ్యక్తీకరించాయని ఈ పుస్తకం మూడవ విభాగంలో మేం విశదీకరింప ప్రయత్నించాం. శ్రీరామకృష్ణులలో కూడా ఆ జగద్గురువు లక్షణాలు ఆయన జీవితంలో బాల్యంతో సహా అన్ని దశలలోను అభివ్యక్తమవడం మనం చూడవచ్చు. ఈ లక్షణాల ప్రేరణతో తమ సాధన కాలంలో ఆయన అనేక కార్యాలను నిర్వర్తించడం మనం చూసివున్నాం. కాని తమ ముప్పై రెండవ ఏట సాధనలు పూర్తి చేసిన నాటి నుండి ఆయన దాదాపు ప్రతి పనిని ఈ ప్రేరణతో చేయడం మనం చూడవచ్చు. మథుర్‌బాబుతో తీర్థయాత్రలు చేసినప్పుడు, ఆ తరువాత ఆయన చేతలన్నిటిలోను దీనిని మనం గమనించవచ్చు. ఆయనలో దివ్యభావ అభివ్యక్తీకరణ 1875 వ సం॥ ప్రారంభమై, నిజమైన ఆధ్యాత్మిక ప్రచారానికి ఉపక్రమించారని చెప్పడానికి కారణం: అంతకు మునుపు ఆ దివ్యభావం పూర్తిగా లేదని కాదు; కాని అప్పటి నుండి ఆ దివ్యభావం అవిరామంగా ప్రవహించి, ఆయన జీవితోద్యమం స్పష్టంగా కచ్చితంగా అభివ్యక్తమైంది. అప్పటి నుండి పాశ్చాత్య భౌతికవాదం, భౌతికశాస్త్రంపై ఆధారపడ్డ సంస్కృతీ నాగరకతల పట్ల విరుద్ధ వైఖరిని ఆయన అవలంబించడం మనం చూడవచ్చు. ఆ భౌతికవాదం భారతదేశంలో చొరబడి ప్రతి వ్యక్తిని సనాతన ధర్మానికి విరుద్ధమైన జీవన వైఖరిని అవలంబించేలా చేయడమూ, వారిని ఆధ్యాత్మిక విలువల నుండి వైదొలగేలా చేయడమూ శ్రీరామకృష్ణుల పై వైఖరికి కారణాలుగా పేర్కొనవచ్చు. కాబట్టి ఆంగ్లేయ విధానంలో విద్య నభ్యసించిన వారికి నిజమైన ఆధ్యాత్మికతను బోధించి, తమ మార్గదర్శకత్వంలో సామాన్యజనుల జీవితాలలో దివ్యజ్యోతిని ప్రసరింప ఆయన హృదయపూర్వకంగా నిమగ్నులైనారు.

2. దివ్యభావ ఆరంభం ఎలా గుర్తించబడింది

అట్టి కార్యభారాన్ని వహించడానికి అత్యంత ఆవశ్యకత తలెత్తిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భగవత్సంకల్పం, దివ్యభావంలో నెలకొనివున్న శ్రీరామకృష్ణుల అసాధారణ ఆధ్యాత్మిక శక్తి తోడ్పాటు లేకుండివుంటే భారతజాతీయ లక్షణం, సనాతన ధర్మం తుడిచిపెట్టుకుపోయి ఉండేవనడం అతిశయోక్తి కాదు. కాస్త తరచి చూసినప్పుడు శ్రీరామకృష్ణులు అన్ని మత సంప్రదాయ సాధనాదులు అనుష్ఠించి తత్ఫలితంగా ఆవిష్కరించిన 'మతాలెన్నో మార్గాలన్ని' అనే మహోత్తమ సత్యం పాశ్చాత్య ఆశయాల ఆదర్శాల మోహాంధకారంలో పడివున్న జనానీకానికి వెలుగు చూపి మళ్లీ వారిని సనాతన ధర్మానికి తిరిగి వచ్చేలా చేయడం మనం గ్రహించవచ్చు. ఆ విధంగా పాశ్చాత్య వెల్లువకు అడ్డుకట్ట

3. శ్రీరామకృష్ణులు: భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం

పడింది, సనాతన ధర్మం పునఃప్రతిష్ఠించబడింది; భారతదేశం ఘోర దుర్ఘటన నుండి కాపాడబడింది. ఇక్కడే ఆయన జీవితోద్దేశాలు రెండు స్పష్టంగా నిరూపణమౌతాయి. మొదటిది, ప్రపంచంలోని మతాలన్నిటిని భారతదేశ సనాతన ధర్మమనే త్రాటిపైకి తీసుకువచ్చి, ఆ మతాలన్నీ సంపూర్ణ సత్యాలని నిరూపణ చేశారు; ఆ మతాలను అనుసరించే స్త్రీ పురుష సముదాయాల అభిరుచి, సంస్కారాలను బట్టే అవి విభిన్నాలుగా ఉన్నాయని ప్రకటించారు. రెండవది, భారతదేశ ఆత్మయైన శాశ్వత శాంతి, సౌహార్దం పాశ్చాత్య భౌతికవాద మనే సుడిగుండంలో పడి కొట్టుకొనిపోకుండా పరిరక్షించారు. భారతదేశంలో పాశ్చాత్య విద్యావిధానాన్ని 1836 వ సం॥లో ప్రవేశపెట్టారు. అదే సం॥లోనే శ్రీరామకృష్ణులూ జన్మించారు. ఇక్కడొక విచిత్రం మనకు ద్యోతకమౌతుంది. భారతీయ సంస్కృతీ నాగరికతలను పెకలించివేసే పాశ్చాత్య విద్యావిధాన విజృంభణ ప్రారంభం, ఆ విద్యావిధానం కల్పించే కీడులను తొలగించి ఆ స్థానే భారతీయ విలక్షణ సంస్కృతిని పాదుగొలిపే ప్రయత్నారంభం ఏకకాలంలో సంభవించడమే ఆ విచిత్రం.

4. మానవ జీవితంలో దివ్యభావం ఎప్పుడు పాత్ర వహిస్తుంది

మానవ జీవితంలో ఆధ్యాత్మిక నాటకపు చరమరంగమైన పరిపూర్ణ దివ్యభావ సాక్షాత్కారం ఎంతో అరుదుగా కానవస్తుంది. జీవుడు కర్మ బంధనాల నుండి భగవంతుని అనుగ్రహం వలన ముక్తుడైనప్పుడు ఆ భావాన్ని కించిత్తు చవిచూస్తాడు. ఒక వ్యక్తి (అంటే జీవుడు లేదా బంధనంలోని ఆత్మ) బాహ్య అంతరేంద్రియాల నియంత్రణ ఊపిరితీసుకొన్నంత స్వతసిద్ధమూ, సులువూ అయినప్పుడు; ఆ పరమాత్మ ప్రేమలో తన గుర్తింపును కోల్పోయి 'నేను' అనే చైతన్యం శాశ్వతంగా సచ్చిదానందసాగరంలో విలీనం అయిపోయినప్పుడు; నిర్వికల్ప సమాధిలో మనోబుద్ధులు అన్ని రకాల మాలిన్యాలను వదలించుకొని శుద్ధసత్త్వరూపాలను సంతరించుకొన్నప్పుడు; దివ్యజ్ఞానమనే అనలంచే మనస్సులోని కోర్కెల పరంపర దగ్ధమై, క్రొత్త సంస్కారాలూ కర్మఫలాలూ ఇకపై తలెత్తనప్పుడు మాత్రమే దివ్యభావ మధురలీల ప్రారంభమౌతుంది, ఆతడి జీవితం తరిస్తుంది. పరిపూర్ణ దివ్యభావ అభివ్యక్తీకరణ పొంది అనవరతం శాంతి, సంతృప్తులతో జీవితం ధన్యం చేసుకొన్న వ్యక్తిని కలుసుకొనే అవకాశం ఎంతో అరుదుగా గాని లభించదు. పైగా ఆకాంక్షారహితమూ, ఉద్దేశరహితమూ అయిన అటువంటి వ్యక్తి చేతలు సామాన్యుల మనోబుద్ధులకు ఎన్నటికీ గ్రాహ్యంకావు. కాబట్టి దివ్యభావంలో సుప్రతిష్ఠితుడైన వ్యక్తి మాత్రమే ఆ భావపు యథార్థ నైజాన్ని అవగతం చేసుకోగలడని చెప్పక తప్పదు. ఆ భావ

ప్రభావంలో నిర్వర్తించే అసాధారణ చేతల నిజమైన ప్రాధాన్యతను మనబోటి మనోబుద్ధులు గలవారికి ఎన్నటికీ సాధ్యం కాదు; వారిని ప్రగాఢ భక్తి విశ్వాసాలతో కొలిచినప్పుడు మాత్రమే వారి చేతలు గ్రాహ్యమౌతాయి.

దివ్యభావ సమగ్ర అభివ్యక్తీకరణను అవతారపురుషులలో మాత్రమే కాంచగలం. ఇందుకు ప్రపంచ మతచరిత్రే తార్కాణం. అవతారపురుషులు సదా మనకు నిగూఢంగా కానరావడానికి కారణం అదే. ఊహ సహాయంతో మాయకు అతీతమైన బ్రహ్మజ్ఞాన స్థితి పాక్షిక చిత్రాన్ని గీయడం సాధ్యమే. దివ్యభావంలో స్వతసిద్ధంగా సుప్రతిష్ఠితులైన వ్యక్తుల చేతల, ఉద్దేశాలను కించిత్తు కూడా అవగతం చేసుకోవడం మనకు మించిన పని; కొన్ని సమయాలలో వారు మనలా తమ లక్ష్య సాధనకు ఎంతో శ్రమిస్తారు; కొన్ని సందర్భాలలో భగవంతునిలా అపారశక్తి సమన్వితులై అద్భుత కార్యాలను అలవోకగా చేస్తారు; దీనిని వివరించడం మనకు సాధ్యం కాదు. 'ఎలా' అన్నది ఒక మర్మంగానే మిగిలిపోతుంది. మూర్ఖంగా మనం వారి నిగూఢ చేతల లోతులను ఆరాతీయ ప్రయత్నిస్తే మన తర్కమే కాదు, ఊహకూడా స్తబ్ధమౌతుంది. కాబట్టి ఈ సమయంలో శ్రీరామకృష్ణుల చేతలను తర్కబద్ధంగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదని చెప్పడం అనవసరం. కనుక ఆ దివ్యభావ ప్రభావంలో ఆయన నిర్వర్తించిన కార్యాలను సాధ్యమైన మేరకు పేర్కొనడం మాత్రం చేయవచ్చు; ఆయన చేతలు, బోధనలు ఫలవంతమై వాటి ప్రాధాన్యత సుస్పష్టమైన నాడు వాటి ఉద్దేశాల గురించిన నిర్ణయానికి మీరే రాగలుగుతారు. సామాన్యంగా మనం ఒక కారణాన్ని దాని పరిణామాలను బట్టే అంచనా వేస్తాం. పరిణామం పెద్దదైనప్పుడు ఆ కారణం కూడా పెద్దదే అయివుంటుంది. కాబట్టి ఆ కాల ఘట్టంలో ఆయన అసాధారణ చేతల గురించి లోతుగా ఆలోచిస్తే ఆయన మనశ్శరీరాల ద్వారా దివ్యభావం అభివ్యక్తమౌతూవుందనే మనం విశ్వసించవలసి ఉంటుంది.

5. దివ్యభావం: అవతార పురుషులను అవగతం చేసుకోవడం లోని క్లిష్టత

దివ్యభావంలో సుప్రతిష్ఠితులై ఉన్న శ్రీరామకృష్ణుల చేతలన్నీ ఆధ్యాత్మికతను సుస్థాపితం చేయడానికే అయినప్పటికీ, వాటిని కచ్చితంగా ఏడు తరగతులుగా వర్గీకరించవచ్చు. మొదటిది : తమ సతీమణి శారదాదేవి ఆధ్యాత్మిక జీవితాన్ని అసాధారణ రీతిలో తీర్చిదిద్ది, ఆమెను ఒక ఆధ్యాత్మిక శక్తికేంద్రంగా రూపొందించారు. రెండవది: సమాజాన్ని ప్రభావితం చేసే, గొప్ప ఆదర్శాలను పాటించే సమకాలీన కలకత్తా ధార్మిక నాయకుల నందరినీ ఆయన కలుసుకొన్నారు; వారి

6. శ్రీరామకృష్ణుల దివ్యభావంలోని ఏడు దశలు

ఆధ్యాత్మిక జీవితాలను సమగ్రం చేయడంలో తమ ఆధ్యాత్మిక శక్తిని వినియోగించి, తోడ్పడ్డారు. మూడవది: ఆ సమయంలో దక్షిణేశ్వరానికి వచ్చిన అన్ని సంప్రదాయాల వారి ఆధ్యాత్మిక దప్పికను ఆయన తీర్చారు. నాలుగవది: తమ వద్దకు వచ్చిన భక్తులలో కొందరిని, తాము ఇంతకు మునుపే దివ్యదర్శనాలలో గాంచిన వారిని, తమ దివ్యోద్యమంలో సహచరులుగా జగజ్జనని ప్రత్యేకంగా గుర్తించిన వారిని, సామర్థ్యం మేరకు వర్గీకరించి, వారి ఆధ్యాత్మిక జీవితాలను తీర్చిదిద్దారు. ఐదవది: వారిలో కొందరికి సన్న్యాసదీక్ష నొసగారు; ఆ విధంగా తమ కొంగ్రొత్త మహోదార ఆధ్యాత్మిక సిద్ధాంతాల ప్రచారానికి ఒక సౌభ్రాతృత్వాన్ని స్థాపించారు. ఆరవది: కలకత్తా వాస్తవ్యులైన తమ భక్తుల ఇళ్లను పదేపదే పావనం చేసి, ఆధ్యాత్మిక సంభాషణల, ఉపాసనాది సేవల ద్వారా ఆ భక్తుల కుటుంబ సభ్యులలో, వారి ఇరుగుపొరుగు వారిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేశారు. ఏడవది: అద్భుత ప్రేమానురాగాలతో తమ భక్తులను ముడి వేసి వారి మధ్య హార్దిక అనుబంధాన్ని కల్పించారు; ఫలితంగా ఆ భక్తులు క్రమంగా ఉదార ఆధ్యాత్మిక సౌభ్రాతృత్వాన్ని సంతరించుకొన్నారు.

రెండవ విభాగం చివరన శ్రీరామకృష్ణులు 1874లో పైన పేర్కొన్న ఏడు కార్యాలలో మొదటి దానిని ఎలా ఆచరించారో పాఠకులకు వివరించి ఉన్నాం. అదే విభాగం అనుబంధంలో 1875లో బ్రహ్మసమాజ నాయకుడైన కేశవ చంద్రసేన్ వద్దకు వెళ్లి తన రెండవ కార్యాచరణను ఎలా పూర్తిచేశారో చర్చించాం. మళ్లీ నాలుగవ విభాగంలోని 5, 6, 7 అధ్యాయాలలో పైన పేర్కొన్న మూడు, నాలుగు, ఆరవ కార్యాచరణల గురించి సూచనప్రాయంగా తెలిపివున్నాం. మిగిలిన కార్యాచరణలను శ్రీరామకృష్ణులు ఎప్పుడు, ఎక్కడ పూర్తిచేశారో ఇకముందు చూడబోతున్నాం.

1.i. బ్రహ్మసమాజం - శ్రీరామకృష్ణుల ప్రభావం

1. శ్రీరామకృష్ణుల పట్ల బ్రహ్మసమాజస్థుల భక్తిప్రపత్తులు

బ్రహ్మసమాజ నాయకుడైన కేశవచంద్రసేన్‌ను కలుసుకొన్న తరువాతే కలకత్తా జనసామాన్యానికి శ్రీరామకృష్ణుల గురించి తెలియ వచ్చింది. యోగ్యతకు అగ్రతాంబూల మిచ్చే కేశవసేన్, శ్రీరామకృష్ణులను చూసిన మొదటి రోజు నుండే ఆయన పట్ల అమిత ఆకర్షితుడైనాడని మేం ఇంతకు మునుపే చెప్పివున్నాం. పాశ్చాత్య భావాల, ఆదర్శాలతో స్ఫూర్తి చెందినప్పటికీ కేశవ్ హృదయం భగవంతుని పట్ల భక్తితో పరిపూర్ణమై ఉండేది; తన మట్టుకు తానే భక్తి అనే అమృతాన్ని గ్రోలి ఆనందించడం అతడికి సాధ్యం కాదు. శ్రీరామకృష్ణుల వచనాలు విరజిమ్మే ప్రకాశం ఆతడి జీవన పథంలో మరింత వెలుగును ప్రసారం చేసేకొద్దీ, కేశవ్ బాహాటంగా జనాన్ని శ్రీరామకృష్ణుల పావన సాంగత్య సుధను తనతోబాటు వచ్చి గ్రోలి తరించమని ఉత్సాహంగా ఆహ్వానించసాగాడు. కాబట్టి సులభ సమాచార, సండే మిర్రర్, థీయిస్టిక్ క్వార్టర్లీ రెవ్యూ మొదలైన బ్రహ్మసమాజ బెంగాలీ, ఆంగ్ల వార్తాపత్రికలు శ్రీరామకృష్ణుల పావనత్వాన్ని, వచనామృతాన్ని, మహోదార ధార్మిక సిద్ధాంతాలను గురించిన చర్చలతో నిండివుండడం చూడ వచ్చు. బ్రహ్మసమాజ ప్రార్థనాసభలలో కేశవ్, తదితర బ్రహ్మసమాజ నాయ కులు అనేక సందర్భాలలో శ్రీరామకృష్ణుల వచనాలను పదేపదే ఉదహరించడం పరిపాటి అయిపోయింది. తీరిక సమయాలలో కొద్దిమంది ఆంతరంగిక సభ్యులతోను, కొన్ని సమయాలలో సభ్యుల బృందంతోను ఆ నాయకులు దక్షి ణేశ్వరానికి వెళ్లి శ్రీరామకృష్ణులతో కొంతసేపు ధార్మిక ప్రసంగాలలో గడిపి రావడం కద్దు.

ఆ బ్రహ్మసమాజ నాయకులలో కానవచ్చే ఆధ్యాత్మిక దప్పిక, భగవం తుని పట్ల వారికి గల భక్తి చూసి శ్రీరామకృష్ణులు ఎంతో సంతోషించారు; సాధన

2. వారితో శ్రీరామకృష్ణుల అనురాగ బాంధవ్యం

సంద్రంలో లోతుగా మునిగి, దివ్యజ్ఞానం పొంది తరింప వారిని ప్రోత్సాహ పరచడంలో శ్రీరామకృష్ణులు ఎలాటి ప్రయత్నలోపం చేయలేదు. వారితో కలిసి భగవత్సంకీర్తనలు, ధార్మిక ప్రసంగాలు చేస్తూ, వాటి నిమిత్తం తరచు కేశవ్ ఇంటికి ఆహ్వానం లేకపోయినప్పటికీ వెళ్లి పరమానందభరితులయ్యేవారు. ఆ విధంగా శ్రీరామకృష్ణుల, నిజమైన సత్యాన్వేషకులైన పలువురు బ్రహ్మసమాజస్థుల మధ్య అత్యంత సన్నిహిత బాంధవ్యం నెలకొనసాగింది. కొన్ని సమయాలలో శ్రీరామకృష్ణులు కేశవ్ ఇంటికే కాక ఇతర బ్రహ్మసమాజస్థుల ఇళ్లకు కూడా వెళ్లి వారిని ఆనందపరచి, తరింపచేసేవారు. బ్రహ్మసమాజస్థులైన సిందూరియాపటి వాస్తవ్యుడైన మణిమోహన్ మల్లిక్, మాతఘాస వీథిలోని జయగోపాల్ సేన్, బారానగర్ సింథి వాస్తవ్యుడైన వేణీమాధవ్ పాల్, నందన్‌బాగన్‌కు చెందిన కాశీశ్వర్ మిశ్రా ఇళ్లకు శ్రీరామకృష్ణులు తరచు ఉత్సవ దినాలలో వెళ్లి వచ్చేవారు. కొన్ని సందర్భాలలో శ్రీరామకృష్ణులు అకస్మాత్తుగా బ్రహ్మసమాజ ప్రార్థన మందిరానికి వచ్చినప్పుడు, కేశవ్ తను ఇస్తున్న ధర్మోపదేశాన్ని అర్ధంతరంగా ముగించి, వేదిక దిగి, స్వయంగా ఆయనను హార్దికంగా ఆహ్వానించేవాడు; ఆయన వచనామృతాన్ని గ్రోలడానికి, ఆయన సంకీర్తనను విని ఆనందంలో తరించిపోవడానికి కేశవ్ తహతహ చెందేవాడు.

3. శ్రీరామకృష్ణుల పట్ల బ్రహ్మసమాజస్థులకు గల ప్రగాఢ ఆకర్షణ

తమ భావనాధోరణి, జీవన సరళి గల వ్యక్తులతో ధారాళంగా, నిస్సంకోచంగా మెలగవచ్చు. తమతో ధారాళంగా మెలగుతూ ఆనందిస్తూన్న శ్రీరామకృష్ణులను చూసి బ్రహ్మసమాజస్థులు ఆయనను కూడా తమ మతభావనా ధోరణులున్న వ్యక్తిగా నిర్ణయించుకోవడంలో ఎలాటి ఆశ్చర్యమూ లేదు. అనేక సందర్భాలలో తమ ఆరాధనా వేడుకలలో శ్రీరామకృష్ణులు పాల్గొనడం చూసి శాక్తులు, వైష్ణవులు మొదలైన హైందవ సంప్రదాయస్థులు కూడా ఇదే నిర్ణయానికి రావడంలో విడ్డూరం లేదు. శ్రీరామకృష్ణులు సదా భావముఖంలో సుప్రతిష్ఠితులై ఉన్నందువలన ఆయన ఏ సంప్రదాయం లేదా మత శాఖతోనైనా సహజంగా ఇట్టే కలిసిపోయేలా ప్రవర్తించగలరు. ఆ విషయం అప్పుడు ఎవరికి మట్టుకు అవగతమైంది కనుక? శ్రీరామకృష్ణులు బ్రహ్మసమాజస్థుల కీర్తనలలో, ధ్యాన సమావేశాలలో పాల్గొని, వారి భక్తి విధానంతో పరిపూర్ణంగా తాదాత్మ్యం చెందినందు వలన, బ్రహ్మసమాజస్థులు ఆయన మనస్సు నిరాకార బ్రహ్మంలో పూర్తిగా లీనమైపోయిందని భావించారు; అంతేకాక ఆయన తమకంటే అత్యధికానందాన్ని పొందుతున్నారనీ, ధ్యానంలో

తమలా కేవలం అంధకారాన్ని మాత్రమే దర్శించడం లేదనీ, అసాధారణ జ్యోతి దర్శనాన్ని పొందారనీ వారు భావించారు. తమ సమస్తాన్ని భగవదర్పితం చేసి, ఆయనలో శ్రీరామకృష్ణులలా లీనం కాకపోతే, అటువంటి పరమానందం, జ్యోతిదర్శనం చవిచూడడం తమకు ఎండమావిగానే మిగిలిపోతుందని బ్రహ్మసమాజస్థులు అనుకోసాగారు.

4. సాధనలో బ్రహ్మసమాజస్థులకు శ్రీరామకృష్ణుల తోడ్పాటు

బ్రహ్మసమాజస్థులలోని సత్యంపట్ల ఇష్టం, పరిత్యాగం, ఆధ్యాత్మిక తృష్ణ మొదలైన సుగుణాలను చూసి, వారు పురోగమింప శ్రీరామకృష్ణులు వారికి దోహదం చేయడానికి ప్రయత్నించారు. భగవత్ భక్తులను, ఏ సంప్రదాయానికి చెందినప్పటికీ శ్రీరామకృష్ణులు వారిని తమకు అత్యంత ఆప్తులుగా పరిగణించేవారు; అంతేగాక ఆధ్యాత్మిక అన్వేషణలో వారికి దోహదపడి, వారు అనుసరించే ఆ పథంలో పరిపూర్ణులను చేయడంలో శ్రీరామకృష్ణులు ఎంతో కృషి చేసేవారు. నిజమైన భక్తులు ఒక ప్రత్యేక కోవకు చెందినవారని శ్రీరామకృష్ణులు సదా చెప్పేవారు; వారితో కలిసి తినడానికీ, త్రాగడానికీ వారెన్నడూ సంకోచించేవారు కాదు. కాబట్టి కేశవ్, ఆతడి బృందంలోని విజయకృష్ణ గోస్వామి, ప్రతాపచంద్ర మజుందార్, చిరంజీవి శర్మ, శివనాథ్ శాస్త్రి, అమృతలాల్ బోస్ తదితరులను శ్రీరామకృష్ణులు అభిమానించేవారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వారితో అంత సన్నిహితంగా మెలగడం వలన, పాశ్చాత్య విద్యాప్రభావం వారిని భారతీయ మతాదర్శానికి సుదూరంగా తీసుకుపోయిందని శ్రీరామకృష్ణులకు అవగతం కావడానికి ఎంతో సమయం పట్టలేదు; పైగా సంఘసంస్కరణనే తమ మతాచరణకు పరాకాష్ఠ అని వారు పరిగణించడం కూడా ఆయన గుర్తించక పోలేదు. కాబట్టి భగవత్సాక్షాత్కారమే జీవిత పరమావధి అని వారిని అంగీకరించేలా చేయడానికి ఆయన ప్రయత్నించారు; వారి సమాజం ఆ మేరకు వారిని అనుసరించకపోయినా ఫరవాలేదన్నారు. తత్ఫలితంగా కేశవ్, ఆతడి బృందం శ్రీరామకృష్ణులు చూపిన మార్గంలో ఎంతో పురోగమించారు. భగవంతుణ్ణి మధురమైన జగజ్జనని నామంతో సంబోధించే సంప్రదాయం, భగవంతుణ్ణి జగజ్జననిగా ఆరాధించడం బ్రహ్మసమాజంలో చోటుచేసుకొన్నాయి; శ్రీరామకృష్ణుల భావనలు, ఆదర్శాలు బ్రహ్మసమాజ సంగీతసాహిత్యాలలో ప్రవేశించి, సమాజాన్ని మధురమయం గావించాయి. అంతే కాదు. శ్రీరామకృష్ణుల జీవితం నుండి ఎంతో నేర్చుకోవలసింది ఉందని సమాజ నాయకులు గ్రహించారు; ఏ ఆదర్శాలు, అనుష్ఠానాలు మూఢనమ్మకాలని ఎంచి బ్రహ్మ

సమాజం, హిందూమతం నుండి విడివడిందో, వాటిని గురించి పర్యాలో చించవలసింది ఎంతో ఉందని కూడా వారు తెలుసుకొన్నారు.

పాశ్చాత్య భావాలలో ఊరిపోయిన కేశవ్, అతడి సహచరులు తమ భావనలను, ఉపదేశాలను సరిగా అర్థం చేసుకోలేదని ప్రారంభం నుండే శ్రీరామకృష్ణులు గ్రహించే ఉన్నారు; పైగా వారు అర్థం చేసుకొన్నది కూడా వారికి అంతగా రుచించలేదనీ ఆయనకు తెలుసు. ఈ విషయం జ్ఞప్తిలో ఉంచుకొనే, వారికి ఉపదేశించేటప్పుడు ఆయన తరచు, "నా మనస్సుకు తోచింది మీకు చెప్పాను. దాని 'తలా తోక' తీసివేసి మీరు స్వీకరించవచ్చు" అని చెప్పేవారు. అంతేకాక సంఘసంస్కరణ, లౌకిక సుఖభోగాల పట్ల కోర్కె బ్రహ్మ సమాజస్థులలో అనేకులకు జీవిత లక్ష్యమనే విషయం గ్రహించడానికి ఆయనకు ఎంతో సమయం పట్టలేదు. ఈ విషయం గురించి అనేక సందర్భాలలో పరిహాసపూర్వకంగా ఈ క్రింది విధంగా చెప్పేవారు:

5. తమకు ఆదరణీయాలైన ఉపదేశాలనే ధారాళంగా స్వీకరించమనడం

"వారి ఉపాసనను తిలకించడానికి కేశవ్ ఇంటికి వెళ్లాను. భగవంతుని దివ్యశక్తులను చాలాసేపు స్తుతించిన తరువాత, పురోహితుడు, 'భగవంతుణ్ణి ఇక ధ్యానిద్దాం' అని అన్నాడు. వాళ్లు ఎంతసేపు ధ్యానం చేస్తారో అని ఆశ్చర్యపోయాను. కాని, రెండు నిమిషాలు కళ్లు మూసుకొన్నారోలేదో ధ్యానం పూర్తయిపోయింది! ఆ విధంగా ధ్యానించి భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోగలరా? ధ్యానం చేస్తూన్నప్పుడు వారందరి ముఖాలను పరిశీలించి చూశాను. ఆ తరువాత కేశవ్‌తో ఇలా చెప్పాను : 'ధ్యానిస్తూన్నప్పుడు మీ అందరినీ చూశాను. అప్పుడు నాకు ఏమనిపించిందో మీకు తెలుసా? దక్షిణేశ్వరంలో చెట్ల మీద ఒక్కొక్కప్పుడు కోతులు గుంపులుగా, అమాయకంగా పెద్దమనుషులలా కూర్చునివుంటాయి. కాని అవి అంత అమాయకమైనవేం కావు; అవి అలా కూర్చుని ఏ ఇంటి కప్పుల మీద సొరకాయలు, గుమ్మడికాయలు ఉన్నాయో అనీ లేదా ఏ తోటలలో అరటి గెలలు లభిస్తాయో అనీ ఆలోచిస్తూ ఉంటాయి. కాసేపట్లో గావుకేకలేస్తూ చెట్లనుండి తోటలోకి దూకి పళ్లను, కాయగూరలను కడుపార మెక్కుతాయి. అనేకులు ఆ తీరులో ధ్యానం చేయడం నేను చూశాను.' నా మాటలు విని వారంతా నవ్వుకున్నారు."

6. శ్రీరామకృష్ణులు హాస్యోక్తుల ద్వారా బోధిస్తారు

శ్రీరామకృష్ణులు మాకు కూడా ఆ విధంగా హాస్యోక్తులతో బోధించేవారు. ఒక రోజు వివేకానందస్వామి ఆయన ముందు భక్తి గీతాలు ఆలాపించడం, మాకు గుర్తుంది. ఆ రోజులలో స్వామీజీ తరచు బ్రహ్మసమాజానికి

వెళ్లి అక్కడ ధ్యానం, ప్రార్థనలు రెండు పూటలా చేసేవాడు. భక్తితో, ఏకాగ్రతతో ఆతడు బ్రహ్మం గురించిన, 'ఆ కళంకరహిత పురుషునిపై నీ మనస్సును కేంద్రీకరించు' అనే పాటను పాడసాగాడు. ఆ పాటలో, 'సదా ఆయనను ఆరాధించు, ఆయన సాక్షాత్కారానికై సదా పాటుపడు' అనే ఒక చరణం ఉంది. స్వామీజీ మనస్సులో ఈ మాటలు నాటుకుపోయేటట్లు చేయాలని హఠాత్తుగా శ్రీరామకృష్ణులు, "కాదు, కాదు. 'ఆయనను రోజుకు రెండుసార్లు ఆరాధించు, ప్రార్థించు' అని చెప్పు. నువ్వు ఆచరించని దానిని పదేపదే ఎందుకు వ్యర్థంగా పలుకుతావు?" అని అన్నారు. అంతా పెద్దగా నవ్వారు. స్వామీజీ చిన్నబుచ్చుకొన్నాడు.

7. భక్తి : శక్తిగా భగవంతుని చైతన్యం

ఆరాధన గురించి మరో సందర్భంలో కేశవ్, తదితర బ్రహ్మసమాజస్థులకు శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "ఆయన శక్తులను ఎందుకు అంతగా మీరు వర్ణిస్తారు? తండ్రి ముందు పిల్లవాడు కూర్చుని, 'నా తండ్రికి ఎన్ని ఇళ్లున్నాయి, ఎన్ని గుర్రాలున్నాయి, ఎన్ని ఆవులున్నాయి, ఎన్ని తోటలున్నాయి' అని ఆలోచిస్తాడా? లేదా తండ్రి తన పట్ల ఎంత ప్రేమగా ఉంటున్నాడో, తన నెంత ఆప్యాయంగా చూసుకొంటున్నాడో అని ఆలోచిస్తాడా? తండ్రి తన పిల్లవాడికి తిండి, బట్ట లోటు లేకుండా చూస్తాడు; అయితే ఏమిటి? మనం, నిజానికి ఆయన బిడ్డలం, అవన్నీ ఆయన మనకు సమకూరుస్తే, దానిని గురించి ఎందుకింత ఆర్భాటం? అలా ఆలోచించడానికి బదులుగా నిజమైన భక్తుడు ప్రేమతో ఆయనను తన సొంతం చేసుకోవాలి; తన ప్రార్థనలను ఈడేర్చమని, ఆయన దర్శన ప్రాప్తి కలిగించమని వేధించాలి, సాధికారంతో అడగాలి. ఆయన శక్తుల గురించి ఆలోచించేకొద్దీ, తన ప్రార్థనలను ఈడేర్చమని సాధికారంతో అడగలేరు. ఆయన ఘనత గురించిన ఆలోచనే, ఆయనకూ భక్తుడికీ మధ్య ఎంతో అంతరాన్ని కల్పిస్తుంది. నీ సొంత మనిషిగా ఆయనను భావించు. అటువంటప్పుడు మాత్రమే ఆయన సాక్షాత్కారం లభిస్తుంది."

భగవత్సాక్షాత్కారార్థం సమస్తం త్యజిస్తూ, అందుకై గట్టిగా శ్రమించడం నేర్చుకొంటూ, కేశవ్ తదితర బ్రహ్మసమాజస్థులు శ్రీరామకృష్ణుల నుండి

8. 'భగవంతుని స్వభావానికి పరిమితిని విధియుంచకండి'

మరింత నేర్చుకోసాగారు. పాశ్చాత్య మతప్రచారకుల నుండి, ఆంగ్ల పుస్తకాల నుండి భగవంతుడు ఎన్నడూ సాకారుడు కాడని వాళ్లు తెలుసుకొన్నారు. కాబట్టి భగవంతుడు విగ్రహాలలో నెలకొని ఉన్నాడని విశ్వసిస్తూ, విగ్రహారాధన చేయడం వారి దృష్టిలో మహాపాపం. "ఆకారం లేని నీరు శీతలం కారణంగా ఘనీభవించి

రూపం పొందే విధంగా, నిరాకారమైన సచ్చిదానందం భక్తి కారణంగా ఘనీ భవించి విభిన్న రూపాలను దాలుస్తుంది''; ''బొమ్మ సీతాఫలాన్ని చూసి నిజ మైన సీతాఫలం జ్ఞాపకం వచ్చేటట్లు విగ్రహం వైపుకు తిరగగానే, భగవంతుని యథార్థ నైజం తెలియవస్తుంది'' - ఇటువంటి శ్రీరామకృష్ణుల ఉక్తులు వారి మనస్సులపై ప్రభావం కలిగించాయి; దాంతో వారు తాము తర్కరహితమైన దనీ, తిరస్కారయుతమైనదనీ పేర్కొనే 'విగ్రహారాధన' గురించి మరింత పర్యాలోచన చేయవలసిన అవసరం ఎంతో ఉందని గ్రహించారు. బ్రహ్మం, దాని శక్తి (ఈ విశ్వం ఆ శక్తి అభివ్యక్తీకరణే), అగ్ని, దాని దాహకశక్తిలా అభిన్నమైన వని శ్రీరామకృష్ణులు ఋజువు చేసిన నాటి నుండి కేశవ్, తదితర బ్రహ్మసమా జస్థులు సాకార భగవదారాధనను సరిక్రొత్త వెలుగులో చూడసాగారనడంలో ఎలాటి సందేహానికీ తావులేదు. భగవంతుడు నిరాకారుడు కాని సగుణుడు అని తర్కించడం ఎంత పొరపాటో భగవంతుడు సాకారుడేకాని నిర్గుణుడని వాదిం చడమూ అంతే పొరపాటని వారిప్పుడు గ్రహించగలిగారు. ఎందుకంటే రూపం, గుణం రెండూ ఏకకాలంలో ఉంటాయి కదా! అంటే దేనికైనా ఒకటి ఉందని అంగీకరిస్తే, రెండవది కూడా ఉన్నట్లే. ఆయన అభివ్యక్తీకరణమైన నానా రూపాలు గల ఈ విశ్వం ఆయనను సాకారునిగా వ్యక్తం చేస్తుంది; నిరాకార సగుణ బ్రహ్మంగా ఈ విశ్వాన్ని నియంత్రిస్తాడు; గుణాతీతుడైనప్పుడు నామ రూపాదుల సమస్త అభివ్యక్తీకరణలకు శాశ్వత అంతర పొరగా ఆయన వ్యవహ రిస్తాడు. ''భగవంతుని నైజానికి పరిమితిని నిర్ణయించకూడదు. ఆయన సాకా రుడు, నిరాకారుడు కూడా; సగుణుడు, నిర్గుణుడు కూడా. అవే కాక ఇంకా ఏమేమిగా ఉన్నాడో ఎవరి కెరుక'' అన్న శ్రీరామకృష్ణుల సామాన్య సూక్తిలోని గూఢార్థాన్ని విని కేశవాదులు నాడు విస్మయులయ్యారు.

1875 వ సం॥ కేశవ్, శ్రీరామకృష్ణులను కలుసుకొన్న దాదాపు మూడు సంవత్సరాల తరువాత బ్రహ్మసమాజం కేశవ్ సమర్థ నేతృత్వంలో పాశ్చాత్య భావనల, ఆదర్శాల పట్టును బాగా సడలించుకొని, క్రొత్త రూపాన్ని సంత రించుకోసాగింది. ఆధ్యాత్మిక సాధనల పట్ల అభిమానం పెరగడం ఈ క్రొత్త పరిణామంలోని ఒక ప్రధానాంశం; ఈ అంశం సత్వరమే జనాకర్షణను పొందిం దనడంలో అతిశయోక్తి లేదు. తదనంతరం, 1878 వ సం॥ మార్చ్ 6వ తేదీ కేశవ్ తన కుమార్తెను, కూఛ్‌బిహార్ రాజకుమారునికిచ్చి వివాహం చేశాడు. బ్రహ్మసమాజం నిర్ణయించిన వివాహయోగ్యమైన వధువు వయస్సుకంటే, కేశవ్ కుమార్తె వయస్సు కాస్త చిన్నదవడం వలన సమాజంలో ఈ వివాహం విమర్శా దుమారాన్ని లేవదీసింది; సంఘ సంస్కరణల విషయంలో పాశ్చా త్యాన్ని గుడ్డిగా అనుకరించడంలో మహోత్సాహం చూపే ఈ సమాజం,

తత్ఫలితంగా రెండుగా, భారతదేశ బ్రహ్మసమాజంగానూ, సాధారణ బ్రహ్మ సమాజంగానూ విడిపోయింది. కాని ఈ సంఘటన వలన బ్రహ్మసమాజం మీది శ్రీరామకృష్ణుల ప్రాబల్యం చెక్కుచెదరలేదు. ఆయన ఆ రెండు వర్గాలనూ అభిమానించారు; ఆ రెండు వర్గాలలోని నిజమైన సత్యాన్వేషకులు ఇంతకు మునుపులా ఆయన వద్దకు వచ్చి, ఆధ్యాత్మికపరమైన తోడ్పాటు ఎప్పటిలానే పొందసాగారు.

9. శ్రీరామకృష్ణుల ఉపదేశాలను కేశవ్ సాక్షికంగా అంగీకరించడం: నవవిధాన్

ఈ సంఘటనానంతరం భారతదేశ బ్రహ్మసమాజ నాయకుడైన కేశవ చంద్రసేన్, శ్రీరామకృష్ణుల అనుగ్రహంతో తన సాధనాపథంలోను, ఆధ్యాత్మిక జీవితంలోను శరవేగంతో పురోగమించాడు. నైవేద్యాదులు అర్పించడం, పవిత్ర జలాలలో స్నానం ఆచరించడం, శిరోముండనం చేయించుకోవడం, కాషాయాంబరాలు ధరించడం వంటివి చేయడం వలన మనస్సు ఆధ్యాత్మిక జగత్తులో ఉన్నతభూములకు అధిరోహిస్తుందని కేశవ్ విశ్వసించసాగాడు, దాదాపు వాటిని స్వయంగా తాను పాటించాడు కూడా. గౌరాంగుడు, ఏసుక్రీస్తు మొదలైన మహాపురుషులు వివిధ ఆధ్యాత్మిక భావాలకు మూర్తిమత్వాలుగా జ్యోతిర్మయ దేహాలతో విరాజిల్లుతున్నారనే ప్రగాఢ విశ్వాసాన్ని పెంపొందించుకొంటూ వారి ఆధ్యాత్మిక లక్షణాలను సరిగా గ్రహించడానికి అప్పుడప్పుడు వారిని ప్రగాఢంగా ధ్యానిస్తూ రాసాగాడు. శ్రీరామకృష్ణులు ఒక ప్రత్యేక సంప్రదాయ సాధనను అనుష్ఠిస్తూన్నప్పుడు, ఆ సంప్రదాయస్థులు ధరించే చిహ్నాలను తామూ ధరించేవారు. ఈ విషయం ఆయన నుండి వినడం వలన పైన పేర్కొన్న సాధనలను అనుష్ఠించాడని చెప్పడం అవసరంలేదు. పైన పేర్కొన్న సాధనానుష్ఠానాల సహాయంతో కేశవ్, శ్రీరామకృష్ణులు క్రొత్తగా ఆవిష్కరించిన ''మతాలెన్నో మార్గాలన్ని'' అనే మహాసత్యాన్ని అవగతం చేసుకోవడానికి ప్రయత్నించాడు. తత్ఫలితంగా కూచ్‌బిహార్ వివాహం జరిగిన రెండు సంవత్సరాల లోపే కేశవ్ 'నవవిధాన్' స్థాపించి, ఆ వేదిక ద్వారా తాను గ్రహించిన మేరకు ఆ మహాసత్యాన్ని లోకులకు ప్రచారం చేశాడు. శ్రీరామకృష్ణుల పట్ల ఎంత భక్తి విశ్వాసాలు కేశవ్‌కు ఉండేవో మేం మాటలలో వ్యక్తం చేయలేం. దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించి, ఆయన పాదధూళి స్వీకరించి పదేపదే 'నవవిధాన్‌కు జయం' అంటూ నినదించడం మాలో అనేకులం చూసివున్నాం. 'నవవిధాన్' సిద్ధాంతాల ప్రచారం ప్రారంభించిన నాలుగేళ్లకే అతడు కాలధర్మం చెందకుంటే, ఆతడి ఆధ్యాత్మిక జీవితం ఏ మేరకు పురోగమించి ఉండేదో ఎవరు చెప్పగలరు?

కేశవ్‌ను, శ్రీరామకృష్ణులు అత్యంత ఆప్తునిగా పరిగణించేవారు. ఒక సందర్భంలో కేశవ్ జబ్బుపడ్డాడని వినగానే, కేశవ్‌కు నయంకావాలని ప్రార్థిస్తూ, జగజ్జననికి కొబ్బరి బొండాం, చక్కెర సమర్పిస్తానని శ్రీరామకృష్ణులు మొక్కుకొన్నారు. అతణ్ణి చూడడానికి వెళ్ళి, ఎంతో బలహీనంగా ఉన్న కేశవ్‌ను చూసి శ్రీరామకృష్ణులు కంట తడిపెట్టుకొన్నారు. అప్పుడు అతడితో ఇలా అన్నారు: ''తోటమాలి కొన్ని సందర్భాలలో గులాబి మొక్క కొమ్మలను మాత్రమే కత్తిరించడు; మొక్క వ్రేళ్లను పెకలించి సూర్యరశ్మి, మంచు ఆ వ్రేళ్లమీద పడేటట్లు చేస్తాడు; అప్పుడు ఆ గులాబిమొక్క చక్కని పెద్ద పువ్వులను పూస్తుంది. ఆ ఉద్దేశం నిమిత్తమే తోటమాలి నీ దేహానికి ఈ స్థితి కల్పించాడు.'' 1884 వ సం॥ కేశవచంద్రసేన్ మరణవార్త వినగానే శ్రీరామకృష్ణులు దుఃఖసాగరంలో మునిగిపోయి మూడు రోజులపాటు మంచం మీద నుండి లేవలేదు, ఎవరితోను మాట్లాడనూ లేదు. ఆ తరువాత ఆయన, ''కేశవ్ మరణ వార్త వినగానే, నా అవయవాలలో ఒకటి పక్షవాతంతో పడిపోయినట్లు అనిపించింది'' అని అన్నారు. కేశవ్ కుటుంబంలో ఆడ, మగ యావన్మందీ శ్రీరామకృష్ణుల పట్ల ఎంతో భక్తిప్రపత్తులు ప్రదర్శించేవారు. కొన్ని సందర్భాలలో వారు శ్రీరామకృష్ణులను 'కమల్ కుటీర్' అనే తమ గృహానికి తోడ్కొని వచ్చేవారు; మరికొన్ని సమయాలలో ఆయన ముఖతా ఆధ్యాత్మిక ఉపదేశాలు వినడానికి దక్షిణేశ్వరానికి స్వయంగా వచ్చేవారు. కేశవ్ జీవించి ఉన్నంత వరకు 'నవవిధాన్' బ్రహ్మసమాజస్థులకు అనివార్యమైన మాఘమాస ఉత్సవాలలో కనీసం ఒక రోజు శ్రీరామకృష్ణుల పావన సాంగత్యంలో, కీర్తనానందంలో వారు గడిపేవారు. పైగా అప్పుడప్పుడు కేశవ్ తన బృందంతో నౌకలో దక్షిణేశ్వరానికి వచ్చి శ్రీరామకృష్ణులను నౌకావిహారానికి తోడ్కొని వెళ్లేవాడు. నౌకలో శ్రీరామకృష్ణుల సంకీర్తనలతో, పావన ప్రసంగాలతో కేశవ్ బృందం యావత్తు తన్మయులైపోవడం కద్దు.

10. కేశవ్ పట్ల శ్రీరామకృష్ణుల ప్రగాఢ ప్రేమాభిమానాలు

కూచ్‌బిహార్ వివాహానంతరం రెండుగా విడిపోయిన బ్రహ్మసమాజంలోని, సాధారణ బ్రహ్మసమాజానికి విజయకృష్ణ గోస్వామి, శివనాథశాస్త్రి ఆచార్యులైనారు. సత్యనిష్ఠ, సాధనపట్ల ఆసక్తిగల విజయకృష్ణ గోస్వామి, కేశవ్‌కు ఎంతో ప్రియమైన వ్యక్తి. శ్రీరామకృష్ణులను కలుసుకొన్న తదనంతరం, కేశవ్‌సేన్‌లా, విజయకృష్ణ గోస్వామిలో కూడా సాధనల పట్ల ఆరాటం అధికమైంది. ఆ మార్గంలో పురోగమించేకొద్దీ, స్వల్పకాలంలోనే అతడికి వివిధ దివ్యదర్శనాలు

11. విజయకృష్ణ గోస్వామిపై శ్రీరామకృష్ణుల ప్రభావం

లుగసాగాయి; ఫలితంగా భగవంతుని సాకార అభివ్యక్తీకరణ పట్ల అతడు
)శ్వాసం సంతరించుకొన్నాడు. సంస్కృత కళాశాలలో అధ్యయనం చేయ
ానికి విజయకృష్ణ గోస్వామి మొట్టమొదట కలకత్తాకు సనాతన బ్రాహ్మణునిలా
ులక, జంధ్యంతో వచ్చాడు. బ్రహ్మసమాజంలో చేరిన తరువాత ఒక రోజు
బ్రహ్మసమాజస్థులు భావించే సత్యం పట్లగల మర్యాదను మన్నించి వాటి
నన్నిటినీ విసర్జించాడు. తనకు గురువువంటి కేశవ్‌ను, అదే సత్యం కారణంగా,
కూచ్‌బిహార్ వివాహానంతరం బహిష్కరించాడు. మళ్లీ అదే సత్యం పట్లగల
గౌరవాన్ని పురస్కరించుకొని సాకార భగవంతునిపట్ల తనకుగల విశ్వాసాన్ని
దాచుకోలేక, బ్రహ్మసమాజం నుండి వైదొలగాడు. ఈ కారణంగా జీవ
నాధారం కోల్పోవడంతో కొంతకాలం అతడు కష్టాలు పడవలసివచ్చింది. కాని
అందుకై అతడు నిరుత్సాహం చెందలేదు. ఆధ్యాత్మికపరమైన తోడ్పాటును
శ్రీరామకృష్ణుల నుండి పొందాననీ, కొన్ని సమయాలలో విచిత్ర రీతులలో
ఆయన దివ్యదర్శనాలను పొందాననీ అతడు మాతో ఎన్నోసార్లు చెప్పాడు. కాని
అతడు శ్రీరామకృష్ణులను ఉపగురువుగా భావించి గౌరవించాడో లేక మరో
విధంగా భావించి ఆదరించాడో మేం చెప్పలేం; ఎందుకంటే, ఒక సందర్భంలో
గయలోని ఆకాశగంగ పర్వతం మీద ఒక సాధువు కరుణించి యోగశక్తితో తనకు
అకస్మాత్తుగా భావపారవశ్య స్థితిని కలిగించడంతో, అతడు తనకు గురువు
అయినాడని విజయ్‌కృష్ణ గోస్వామి చెప్పడం మేం వినివున్నాం. కాని విజయ్‌కు,
శ్రీరామకృష్ణులంటే ఎంతో ఉన్నతాభిప్రాయం ఉందనడంలో ఎలాటి
సందేహమూ లేదు. విజయ్ నుండి స్వయంగా మేం విన్న విషయం ఈ
పుస్తకంలో మరొకచోట (IV.5) వివరించాం.

బ్రహ్మసమాజం నుండి వైదొలగిన తరువాత రోజులు గడిచేకొద్దీ విజయ్
ఆధ్యాత్మిక జీవితం ప్రగాఢతరం కాసాగింది. కీర్తనానందంలో విజయ్

12. అప్పటినుండి సాధనపథంలో ఏ మేరకు విజయ్ పురోగమించాడు?

కృష్ణ గోస్వామి పొందే భావపారవశ్యం, చేసే విశృంఖల
నృత్యం చూసి జనం ముగ్ధులయ్యేవారు. ఆతడి ఆధ్యా
త్మిక స్థితిని గురించి స్వయంగా శ్రీరామకృష్ణులు మాతో
ఇలా చెప్పివున్నారు: "ఆధ్యాత్మిక సాక్షాత్కార పరాకాష్ఠకు
ప్రక్కనున్న గదిని విజయ్ చేరుకొన్నాడు; ఆ గది తలుపులు తడుతున్నాడు."
ఆధ్యాత్మిక లోతుపాతులను అనుభూతం చేసుకొన్న తరువాత విజయ్ అనేకు
లకు మంత్రదీక్ష నొసగాడు. శ్రీరామకృష్ణులు మహాసమాధి చెందిన పధ్నా
లుగు సంవత్సరాల తరువాత విజయకృష్ణ గోస్వామి పూరీలో పరమపదిం
చాడు.

13. కేశవ్, విజయ్‌ల మధ్యనున్న అపార్థాన్ని తొలగించడం

కూచ్‌బిహార్ వివాహానంతరం రెండు బ్రహ్మసమాజాల, అంటే భారత దేశ బ్రహ్మసమాజం, సాధారణ బ్రహ్మసమాజం మధ్య మనస్పర్థలు తలెత్తాయి. రెండు సమాజాలవారి మధ్య మాటలు కూడా కరవయ్యాయి. కాని మేం ఇంతకు మునుపే ప్రస్తావించినట్లు రెండు సమాజాలకు చెందిన సభ్యులూ సాధనపట్ల ఆసక్తి ఉన్నవారవడం వలన, మామూలుగా దక్షిణేశ్వరానికి రాసాగారు.

ఇలావుండగా ఒక రోజు హఠాత్తుగా కేశవ్, విజయ్ తమ ఆంతరంగిక అనుయాయులతో శ్రీరామకృష్ణుల వద్దకు రావడం తటస్థించింది. ఒక బృందం దక్షిణేశ్వరానికి వస్తున్నట్లు రెండవ బృందానికి తెలియనందున ఇది జరిగింది. వారందరి ముఖాలలో ఇబ్బంది, చిరాకు ప్రస్ఫుటంగా కానవచ్చాయి. కేశవ్, విజయ్‌ల ముఖాలలో కూడా ఆ ఇబ్బంది ద్యోతకమవడం చూసి శ్రీరామకృష్ణులు, రాజీ చేసే ధోరణిలో ఇలా అన్నారు: ''ఇలా చూడండి. ఒకానొకప్పుడు శివుని, రాముని మధ్య ఒక తగాదా తలెత్తి, వారి మధ్య గొప్పయుద్ధం కూడా జరిగింది. శివుని గురువు రాముడన్న సంగతి, రాముని గురువు శివుడన్న విషయం లోకవిదితమే. అందువలన అనతికాలం లోనే ఆ తగాదా పరిష్కారమైంది. కాని శివుని భూతగణాలకూ, రాముని శిష్యులైన వానరులకూ మధ్యమాత్రం సఖ్యత ఎన్నటికీ కుదరలేదు. భూత గణాలకూ వానరులకూ మధ్య ఘర్షణ సదాసర్వదా కొనసాగుతూనే వచ్చింది.'' పిదప కేశవ్, విజయ్‌లను సంబోధిస్తూ ఆయన ఇలా చెప్పారు: ''జరిగింది ఏదో జరిగిపోయింది. మీ మధ్య ఇకపై మనస్పర్థ ఉండకూడదు; అది భూత గణాలకూ, వానరులకూ పరిమితమై ఉండనివ్వండి.'' ఈ సంఘటనానంతరం కేశవ్, విజయ్‌లు కనీసం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మొదలు పెట్టారు.

14. దక్షిణేశ్వరానికి రావడం శివనాథ్ మానుకోవడం

తన ప్రత్యక్ష ఆధ్యాత్మిక అనుభూతుల కారణంగా విజయకృష్ణ గోస్వామి సాధారణ బ్రహ్మసమాజాన్ని విడిచిపెట్టిపోగానే, ఆతడిపట్ల భక్తివిశ్వాసాలున్న వారంతాకూడా సమాజం నుండి వైదొలగారు; పర్యవసానంగా సమాజం తేజోవిహీనమైంది. అప్పుడు శివనాథ శాస్త్రి సమాజ నాయకత్వం వహించి, కొంతలోకొంత సమాజాన్ని ఆదుకొన్నాడు. అంతకు ముందు అతడు శ్రీరామకృష్ణులను భక్తి ప్రపత్తులతో పలుమార్లు దర్శించి ఉన్నాడు. శ్రీరామకృష్ణులు కూడా శివనాథ్ పట్ల అవ్యాజానురాగాలు చూపేవారు. కాని విజయ్ సమాజం వదిలిపెట్టి పోయిన తరువాత శివనాథ్ పెద్ద చిక్కులోపడ్డాడు. విజయ్ ఆధ్యాత్మికపరమైన

భిప్రాయాలు శ్రీరామకృష్ణుల ప్రభావం వలన మారిపోయాయనీ, ందుకే విజయ్ సమాజాన్ని వదలి ళ్లాడనీ శివనాథ్ భావించి, శ్రీరామ ృష్ణుల వద్దకు వెళ్లడం మాను కొన్నాడు.

శివనాథ్ శాస్త్రి

వివేకానంద స్వామి అంతకు కొద్ది కాలం క్రితమే సాధారణ బ్రహ్మసమాజంలో చేరాడు; శివనాథ్ తదితరులకు ప్రీతిపాత్రుడయ్యాడు. సాధారణ బ్రహ్మ సమాజంలో చేరినప్పటికీ, వివేకానంద స్వామి అప్పుడప్పుడు కేశవ్ వద్దకు, దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లివచ్చేవాడు. వివేకానంద స్వామి ఇలా చెప్పారు: ''శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లడం ఎందుకు మానుకొన్నారని అడిగినప్పుడు, శివనాథశాస్త్రి, 'తరచు నేను అక్కడకు వెళితే, నన్ను అనుకరించి తక్కిన బ్రహ్మసమాజస్థు లందరు కూడా అక్కడకు పోతారు; ఫలితంగా సమాజం మూతపడుతుంది' అని జవాబిచ్చాడు.'' తననుకూడా దక్షిణేశ్వరానికి వెళ్లవద్దని శివనాథ్ సలహా ఇచ్చాడని కూడా స్వామీజీ చెప్పారు. అంతేగాక, ''శ్రీరామకృష్ణుల భావపార వశ్యం వగైరాలన్నీ నరాల బలహీనత ఫలితాలే; భౌతికపరమైన కఠోర శ్రమ కారణంగానే ఆయనకు మతిచెడింది'' అని కూడా శివనాథ్ చెప్పాడట. శ్రీరామ కృష్ణులకు ఈ విషయం తెలిసినప్పుడు, ఆయన ఏమన్నారో మరొకచోట (IV.2) ప్రస్తావించాం.

ఏది ఏమైనప్పటికీ శ్రీరామకృష్ణుల ప్రభావం వలన సాధనల పట్ల ఆసక్తి బ్రహ్మసమాజంలో జనించింది; నవవిధాన్, సాధారణ బ్రహ్మసమాజంలోని సత్యాన్వేషకులందరూ భగవత్సాక్షాత్కారార్థం తమ జీవితాలను మలచుకొనే ప్రయత్నంలో మునిగిపోయారు.

15. బ్రహ్మసమాజంపై శ్రీరామకృష్ణుల ప్రభావం గురించి ప్రతాపచంద్ర మజుందార్ వెలిబుచ్చిన అభిప్రాయం

ఒకసారి ప్రతాపచంద్ర మజుందార్ శ్రీరామకృష్ణుల సాంగత్యం కోరి దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు, బ్రహ్మ సమాజస్థులు శ్రీరామకృష్ణుల సాంగత్యలబ్ధి పొందిన తరువాత సమాజ ఆధ్యాత్మిక భావాల పురోగతి, నైజం గురించి చెప్పమని మేం అతణ్ణి ప్రశ్నించాం.

అందుకు అతడు, "ఆయనను దర్శించుకోవడానికి ముందు మతం అంటే ఏమిటో మాకు అవగతం అయిందా? ఉత్త డాబులరాయుళ్లం. ఆయనను చూసిన తరువాతే నిజమైన ధార్మిక జీవితం అంటే ఏమిటో మాకు అర్థమైంది." అప్పుడు ఆచార్య చిరంజీవి శర్మ (త్రైలోక్యనాథ్ సన్యాల్) కూడా అక్కడే ఉన్నాడు.

నవవిధాన్‌పై శ్రీరామకృష్ణుల ప్రభావం స్పష్టంగా తెలియవస్తుంది. విజయ కృష్ణ గోస్వామి ఆచార్య పదవిలో ఉన్నంత వరకు సాధారణ బ్రహ్మసమాజంపై శ్రీరామకృష్ణుల ప్రభావం కొంతలోకొంత ఉంటూనే వచ్చింది. కాని విజయ్, తదితరులు సాధారణ బ్రహ్మ సమాజాన్ని వదలిపెట్టి పోయాక, పై ప్రభావం తగ్గింది; ఆ సమాజం ఆధ్యాత్మికతను కోల్పోయి, సంఘ సంస్కరణాది కార్యాలలో నిమగ్నమైంది. పైన పేర్కొన్న ప్రభావం తగ్గినప్పటికీ, ఆ ప్రభావం పూర్తిగా తుడిచిపెట్టుకుపోలేదు; యోగాభ్యాసం, వేదాంత అధ్యయనం అక్కడి కొందరి సభ్యులలో కొనసాగడమే ఇందుకు తార్కాణం. వారిలో కొందరు, కర్తాభజా సంప్రదాయస్థులు పాటించే వైదిక సూత్రాలను అనుసరించి, ధ్యానం సహాయంతో భౌతిక రుగ్మతలను నయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని కూడా మాకు తెలియవచ్చింది.

16. సాధారణ బ్రహ్మ సమాజంపై శ్రీరామ కృష్ణుల ప్రభావం

నవవిధాన్ ఆచార్యుడైన చిరంజీవి శర్మ బ్రహ్మసమాజ సంగీత పురోభివృద్ధికి ఎంతో కృషి చేశాడు. కాని శ్రీరామకృష్ణుల భావపారవశ్యతలు సమాధులు చూసీ, దివ్యదర్శనాదుల గురించి విన్న తరువాతే ఉన్నత భావాలను జాగృతం చేసే గీతాలకు స్వరకల్పన చేశాడని తెలియవస్తున్నది. అతడి కొన్ని పాటలలో మొదటి చరణాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాం.

17. బ్రహ్మసమాజ సంగీతంపై శ్రీరామ కృష్ణుల ప్రభావం

1. ఓ జననీ! నీ నిరాకార సౌందర్యం చిమ్మచీకట్లో ప్రకాశిస్తూన్నది...
2. అగాధ సమాధి సాగరం ఎల్లలు లేనిది...
3. ఆహా! చైతన్య గగనాన దివ్యప్రేమ చంద్రుడు ఉదయించాడు...
4. పరమానంద సాగర జలాలలో దివ్యప్రేమానందపు తరంగాలు...
5. ఓ జననీ! దివ్యోన్మత్తత నాకు ప్రసాదించు...

ఈ అద్భుత గీతాలకు స్వరకల్పన చేసిన చిరంజీవి శర్మకు వంగ ప్రజలు యావన్మందీ, దేశం మొత్తంలోని సాధకు లందరూ ఎంతో ఋణపడి వున్నారనడం అతిశయోక్తి కాదు. కేవలం శ్రీరామకృష్ణుల భావపారవశ్యాన్ని

హాత్రమే చూసి ఈ పాటలను రచించాడనడంలో ఎలాటి సందేహమూ లేదు. చిరంజీవి శర్మది మృదుమధుర కంఠస్వరం. ఆతడి సంగీతాన్ని వింటూ శ్రీరామకృష్ణులు భావపారవశ్య మగ్నులవడం మేం అనేక పర్యాయాలు చూసివున్నాం.

ఆ కాలఘట్టంలో శ్రీరామకృష్ణుల అసాధారణ ఆధ్యాత్మిక ప్రభావంతో ఆ రీతిలో బ్రహ్మసమాజం స్ఫూర్తి పొందింది. బ్రహ్మసమాజం ప్రచారం చేసే

18. బ్రహ్మసమాజానికి శ్రీరామకృష్ణుల గుర్తింపు

నిరాకారోపాసన అపక్వ రకానికి చెందిందని శ్రీరామకృష్ణులు చెప్పినప్పటికీ (III.2), హృదయపూర్వక విశ్వాసంతో ఒక సాధకుడు నిరాకారోపాసన ద్వారా భగవత్సాక్షాత్కారం పొందగలడని ఆయన స్వయంగా చెప్పడం మేం వినివున్నాం. సంకీర్తనాంతంలో భగవంతుడికీ, అన్ని సంప్రదాయాలకు చెందిన భక్తులకూ ఆయన వంగి నమస్కరించేటప్పుడు, ''బ్రహ్మజ్ఞానులైన ఆధునికులకు నమస్కరిస్తున్నాను'' అంటూ బ్రహ్మసమాజస్థులకు నమస్కరించడం ఎన్నడూ మరచిపోరు. బ్రహ్మసమాజ మతం భగవత్సాక్షాత్కార స్థితికి చేర్చే ఒక మతమని ఆయన నిజంగానే నమ్మారనడం ఇందుమూలంగా స్పష్టమౌతున్నది. కాని బ్రహ్మసమాజస్థులు పాశ్చాత్య ప్రభావం నుండి బయటపడి, నిజమైన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలనే ప్రగాఢ ఆకాంక్ష ఆయనకు ఉండేది, అందుకోసం ఎంతో శ్రమించారు కూడా. సంఘసంస్కరణాలు, లోకోపకార కార్యాలు చేయడం ఎంతో శ్లాఘనీయమైనప్పటికీ, అవే మానవ జీవిత లక్ష్యాలు కావని ఆయన పదేపదే బ్రహ్మసమాజస్థులకు చెప్పేవారు; అదే సమయంలో భగవత్సాక్షాత్కారార్థం ఒనరించే పూజాది కార్యకలాపాలను నిరుపయోగంగా పరిగణించరాదనీ ఆయన వారికి తెలిపేవారు. శ్రీరామకృష్ణుల అసాధారణ ఆధ్యాత్మిక జీవితం గురించి ప్రప్రథమంగా బ్రహ్మసమాజమే బహిరంగంగా చర్చించింది; తద్వారా కలకత్తావాసుల మనస్సులు దక్షిణేశ్వరం వైపుకు ఆకర్షింపబడ్డాయి. శ్రీరామకృష్ణుల పాదపద్మాల వద్ద కూర్చుని ఆధ్యాత్మిక శక్తిని, చిరశాంతిని సంతరించుకొని తరించిన ప్రతి ఒక్కరు నవవిధాన్‌కూ, సాధారణ బ్రహ్మసమాజానికీ ఎంతో ఋణపడి ఉన్నారని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ రచయిత కూడా ఆ రెండు సమాజాలకు ఎంతో ఋణపడి ఉన్నాడు; ఎందుకంటే, యౌవన ప్రారంభంలో ఆ రెండు సమాజాలు ఆతడిలో ఉన్నతాశయాలు పాదుగొలిపి, ఆతడు తన ఆధ్యాత్మిక జీవితాన్ని తీర్చిదిద్దుకోవడంలో ఎంతో దోహదం చేశాయి. భక్తితో, కృతజ్ఞతతో మేం ఆ సమాజానికి, వాటి మణి

పూసలైన బ్రహ్మం, బ్రహ్మసమాజం, బ్రహ్మసమాజ బృందానికి - వారంతా యథార్థ ప్రకృతిపరంగా ఒక్కరే అని గ్రహించి - పదేపదే ప్రణామాలర్పిస్తున్నాం. శ్రీరామకృష్ణులు బ్రహ్మసమాజస్థుల సాంగత్యంలో బ్రహ్మానందం పొందిన, కళ్లారా మేం చూసిన రెండు దృశ్యాల ఛాయాచిత్రాలను పాఠకులకు అందిస్తున్నాం.

1.ii. మణిమల్లిక్ గృహంలో బ్రహ్మసమాజ ఉత్సవం

1. ఆ సంఘటన జరిగిన తేదీ నిర్ణయం

మాకు బాగా గుర్తు, అది హేమంత ఋతువు. వానలలో స్నానమాడి ఆనందించిన ప్రకృతి శీతకాలాన్ని, మంచును చవిచూడ నారంభించింది. హేమంతం దాదాపు గడిచిపోయింది. ఆ సమయంలో ఒక రోజు జరిగిన సంఘటనను వర్ణించబోతున్నాం. ఆ సంఘటన జరిగిన తేదీని, అదృష్టవశాత్తు ఈ క్రింది రీతిలో నిర్ణయించగలిగాం. శ్రీరామకృష్ణుల పరమ భక్తుడూ, మాకు మాననీయుడూ అయిన బలరాం బోసు ఆ సంఘటన జరిగిన సన్నివేశంలో ఉండడం తటస్థించింది. అతడి అలవాటు ప్రకారం పంచాంగంలో నాలుగైదు మాటలు వ్రాసి ఆ రోజును గుర్తుపెట్టాడు. దీనిని బట్టి ఆ సంఘటన సోమవారం, నవంబర్ 26, 1883 లో జరిగిందని మేం తెలుసుకొన్నాం.

2. వైకుంఠనాథ్ సన్యాల్‌తో మా పరిచయం

మేం అప్పుడు కలకత్తాలోని సెయింట్ జేవియర్ కళాశాలలో చదువుకొంటున్నాం. అప్పటికి మేం శ్రీరామకృష్ణులను రెండు మూడుసార్లు మాత్రమే దర్శించుకొన్నాం. ఆ రోజు కళాశాలకు సెలవు దినం. కొన్నగర్‌కు చెందిన వరద సుందర్ పాల్, హరిప్రసన్న చట్టోపాధ్యాయ్ (కాలాంతరంలో స్వామి విజ్ఞానానంద)తో కలిసి మేం సాయంత్రం శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లాలని నిర్ణయించుకొన్నాం. పడవలో దక్షిణేశ్వరానికి పోతున్నప్పుడు, మా మాదిరే మరొక ప్రయాణికుడు కూడా ఆయన వద్దకే వెళుతున్నాడని చెప్పినట్లు మాకు గుర్తుంది. మాటల సందర్భంలో అతడి పేరు వైకుంఠనాథ్ సన్యాల్ అని, అతడు కూడా శ్రీరామకృష్ణులను ఆ మధ్యనే కలుసుకొన్నట్లు తెలియవచ్చింది. మా మాట

వైకుంఠనాథ్ సన్యాల్

లలో శ్రీరామకృష్ణుల ప్రస్తావన రావడం విని, పడవలోని మరో ప్రయాణీకుడు ఆయన గురించి పరిహాసంగా ఏదో అన్నాడు. దాంతో వైకుంఠనాథ్ రెచ్చిపోయి, ధిక్కరించి అతగాడి నోరు మూయించాడు. ఈ విషయం కూడా మాకు గుర్తుంది. మేం దక్షిణేశ్వరానికి మధ్యాహ్నం రెండు లేదా రెండున్నరకు చేరాం.

మేం శ్రీరామకృష్ణుల గదిలో కెళ్లి, ఆయనకు పాదాభివందనం చేయగానే, ఆయన ఇలా అన్నారు: ''ఇవాళ వచ్చారా! కాస్త ఆలస్యంగా వచ్చివుంటే మనం కలుసుకోనేవాళ్లం కాము. నేడు నేను కలకత్తాకు వెళుతున్నాను; బండికోసం వెళ్లారు. అక్కడ బ్రహ్మసమాజం వారి ఉత్సవం జరుగనున్నది. మనం కలుసుకోవడం మంచిదే అయింది. దయచేసి కూర్చోండి. నన్ను కలుసుకోకుండా మీరు తిరిగి వెళ్లిపోయివుంటే, ఎంత నిరుత్సాహం చెందేవారో కదా!''

గదిలో పరిచిన చాప మీద కూర్చున్నాక, ''మీరు పాల్గొనబోయే బ్రహ్మ సమాజ ఉత్సవంలో మమ్మల్ని రానిస్తారా?'' అని ఆయనను అడిగాం.

3. బాబూరాంతో మా ప్రథమ పరిచయం

అందుకు ఆయన ఇలా బదులిచ్చారు : ''ఎందుకు రానివ్వరు? అక్కడకు వెళ్లాలని ఉంటే ధారాళంగా మీరు రావచ్చు. ఆ ఉత్సవం సిందూరియాపటి వాస్తవ్యుడైన మణిమల్లిక్ ఇంట్లో జరుగబోతున్నది.'' ఇంతలో మరీ సన్నంగాని, ఎరుపురంగు వస్త్రం ధరించిన ఒక యువకుడు గదిలోకి రావడం చూసి శ్రీరామకృష్ణులు, ''రా, మణిమల్లిక్ ఇంటి విలాసం వాళ్లకు చెప్పు'' అని అన్నారు. ఆ యువకుడు వినమ్రంగా, ''81, చిత్పూర్ వీథి, సిందూరియాపటి'' అని ఆ విలాసం చెప్పాడు. ఆ యువకుడి సరళ ప్రవర్తన, శాంత స్వభావం చూసి, ఆలయంలోని ఒక బ్రాహ్మణ అధికారి కుమారుడేమో అని అనుకొన్నాం. కాని రెండు నెలలు గడిచాక విశ్వవిద్యాలయ పరీక్షా హాల్ నుండి అతడు రావడం చూసి, అతడితో మాట్లాడి, అతణ్ణి గురించి మేం అనుకొన్నది తప్పు అని తెలుసుకొన్నాం. ఆ తరువాత అతడి పేరు బాబూరాం అనీ, అతడి స్వస్థలం తారకేశ్వర్ సమీపం

బాబూరాం
(స్వామి ప్రేమానంద)

లోని ఆంట్‌పూర్ గ్రామమనీ తెలుసుకొన్నాం. కలకత్తాలోని కోంబులియ టోలా పేటలో ఒక అద్దె ఇంట్లో నివసిస్తున్నాడనీ, అప్పుడప్పుడు శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లి, ఆయనతోపాటు అక్కడే బసచేయడం కూడా కద్దు అనీ తెలుసుకొన్నాం. ఆతడే కాలాంతరంలో స్వామి ప్రేమానంద.

ఇంతలో బండి వచ్చింది. తువ్వాలు దుస్తులు, సుగంధద్రవ్యాలున్న చిన్ని సంచి తీసుకురమ్మని బాబూరాంకు చెప్పి, జగజ్జననికి ప్రణామంచేసి, శ్రీరామకృష్ణులు వెళ్లి బండిలో కూర్చున్నారు. బాబూరాం ఆ వస్తువులు పుచ్చుకొని, బండికి అటువైపుగా కూర్చున్నాడు. ఆ రోజు శ్రీరామకృష్ణులతో పాటు కలకత్తాకు మరో వ్యక్తి కూడా వెళ్లాడు. ఆ తరువాత ఆ వ్యక్తి పేరు ప్రతాపచంద్ర హాజ్రా అని తెలుసుకొన్నాం.

శ్రీరామకృష్ణులు కలకత్తాకు బయలుదేరగానే మా కొక పడవ సిద్ధంగా దొరికింది. మేం ఆ పడవలో బయలుదేరి, బారాబజార్ వద్ద దిగాం. ఉత్సవం సూర్యాస్తమయ సమయంలో జరుగుతుందని భావించి, ఒక మిత్రుడి ఇంట్లో ఎదురుచూస్తూ కూర్చున్నాం. మమ్మల్ని ఉత్సవం జరిగే చోట తప్పక కలుసుకొంటానని చెప్పి మా క్రొత్త పరిచయస్థుడైన వైకుంఠనాథ్ ఏదో పనిమీద వెళ్లాడు.

మేం సాయంత్రం నాలుగు గంటలకు మణిబాబు ఇంటికి చేరుకొన్నాం. శ్రీరామకృష్ణులను గురించి వాకబు చేయగా, ఎవరో వచ్చి మమ్మల్ని మేడ మీదకు తోడ్కొని వెళ్లాడు. మేడమీది గది తోరణాలతో, పువ్వులతో కళకళలాడుతూ ఉత్సవ సొబగులను సంతరించుకొంది. కొద్దిమంది భక్తులు వాళ్లలో వాళ్లు మాట్లాడుకొంటున్నారు. మధ్యాహ్న ప్రార్థన, సంగీత కార్యక్రమం ముగిశాయనీ, మళ్లీ ప్రార్థన, కీర్తన సాయంత్రం ఉంటాయనీ విచారించగా తెలియ వచ్చింది. భక్తురాండ్ర విన్నపం మేరకు శ్రీరామకృష్ణులను లోపల గదిలోకి తోడ్కొని వెళ్లారట.

ప్రార్థన మొదలవడానికి ఇంకా కొంత సమయం పడుతుందని తెలిసి, మేం బయటకు వెళ్లాం. మునిమాపు వేళకు తిరిగివచ్చాం. మేం ఆ వీథిలోకి వస్తూవుండగానే మృదుమధుర సంగీతం, మృదంగనాదం మాకు వీనుల విందు చేశాయి. సంకీర్తన మొదలైందని గ్రహించి, మేం పరుగున మేడమీదికి వెళ్లాం. అక్కడకు వెళ్లి చూశాం కదా! ఆ హాలు లోపల, బయట గుంపులు గుంపులుగా ఉన్నారు జనం. ప్రతి ద్వారం ముందు క్రిక్కిరిసి జనం నిలబడివున్నారు. వారిని తోసుకొని లోపలకు వెళ్లడం దాదాపు అసాధ్యమే! ప్రతి ఒక్కరు మెడలు చాచి కళ్లార్పకుండా లోపలకు తొంగిచూస్తున్నారు. పక్కన ఎవరు ఉన్నారో ఎవరు లేరో గమనించే స్థితిలో లేరు వాళ్లు. ముందు వాకిలి గుండా లోపలకు వెళ్లడం అసాధ్యం కనుక, మేం అలా తిరిగి పశ్చిమవైపు కప్పును దాటి, ఉత్తరం వైపు వాకిలి వద్దకు చేరుకొన్నాం. ఇక్కడ జనం కాస్త పలచగా ఉన్నందువలన, ఏదో విధంగా మెడలు చాచి లోపలకు చూడగలిగాం.

4. మణి మల్లిక్ ఇంట్లో అద్భుత సంకీర్తన

అద్భుత దృశ్యం! పరమానందం అక్కడ పరవళ్లు త్రొక్కుతూన్నది. కీర్తనానందంలో అందరూ తన్మయావస్థలో ఉన్నారు. కొందరు నవ్వుతున్నారు, కొందరు విలపిస్తున్నారు, మరికొందరు నృత్యం చేస్తున్నారు. తమను అదుపులో ఉంచుకోలేక పలువురు అప్పుడప్పుడు నేలపై దభీమని పడిపోతున్నారు. భావోద్వేగంలో వారు ఉన్మత్తులలా ప్రవర్తిస్తున్నారు. ఆ భగవదోన్మత్త జనానీకం మధ్య శ్రీరామకృష్ణులు లయకు తగినట్లు నృత్యం చేస్తున్నారు. నృత్యం చేస్తూ ఆయన ముందుకు అడుగులు వేస్తూవుంటే, సమ్మోహితులైన భక్తులు ఆయన ధారాళంగా కదలడానికి దారి ఇస్తున్నారు. శ్రీరామకృష్ణుల ప్రతి అవయవంలోను అసాధారణ కోమలత్వం, మాధుర్యం, సింహబలం కానవస్తోంది. అద్భుత నృత్యం! ఆ నృత్యంలో ఎలాటి కృత్రిమత్వం, అసహజ హావభావాలు, విన్యాసాలు లేవు; అదుపుతప్పడం కూడా కానరాలేదు. మరోవైపు అనుగ్రహం, పరమానందం వెదజల్లుతూన్న అంగ భంగిమలు. అంతరంగంలో శ్రీరామకృష్ణులు అనుభవిస్తూన్న పరమానందానికి బాహ్య అభివ్యక్తీకరణే ఆ నృత్యం! అలా నృత్యం చేస్తూచేస్తూ ఒక్కోసారి ఆయన బాహ్యస్మృతిని కోల్పోతున్నారు, మరో సమయంలో ఆయన పైబట్ట జారిపోగా భక్తులు చటుక్కున దాన్ని ఆయన నడుం చుట్టూ గట్టిగా బిగదీసి కట్టుతున్నారు. మళ్లీ కొందరు ఆధ్యాత్మిక భావోద్వేగ కారణంగా బాహ్యస్మృతి కోల్పోవడం చూసి ఆయన వారి ఛాతీని స్పృశించి, మళ్లీ వారిని మామూలు స్థితికి తీసుకొస్తున్నారు. ఆయనలో నుండి ఉత్పన్నమయ్యే దేదీప్యమానమైన

5. శ్రీరామకృష్ణుల అద్భుత నృత్యం

దివ్యానంద ప్రవాహం అన్ని వైపులా పరివ్యాపిస్తూ, భక్తులు భగవంతుణ్ణి ముఖా ముఖి చూసేలా చేస్తూన్నది. మందకొడి భక్తులలో ఆ దివ్యానందం ఆధ్యాత్మిక భావోద్వేగాన్ని తీవ్రతరం చేస్తూన్నది; సోమరిపోతుల మనస్సులను ఉత్సాహంతో ఆధ్యాత్మిక జగత్తు వైపుకు ఉరకలు వేయిస్తూన్నది; సంసారం పట్ల పరమానురక్తి గల వ్యక్తులలో, తాత్కాలికంగా ఆ అనురక్తిని పూర్తిగా మటుమాయం చేస్తూన్నది. ఆయనలో వెల్లువై ప్రవహించే దివ్య భావోద్వేగం అందరినీ ముంచెత్తివేస్తూన్నది. ఆయన పావనత్వంతో వికసించిన వారి మనస్సులు తెలియరాని ఉన్నత ఆధ్యాత్మిక భూమిని అధిరోహించాయి. అటువంటి సమయంలో సాధారణ బ్రహ్మసమాజ ఆచార్యుడైన విజయకృష్ణ గోస్వామి అప్పుడప్పుడు సమాధ్యావస్థలోకి పోతూవస్తున్నాడని చెప్పనవసరం లేదేమో! బ్రహ్మసమాజ భక్తులు పలువురు కూడా అదే స్థితిలో ఉన్నారు. పైగా 'నృత్యం చేయండి ఓ పిల్లల్లారా, ఆనందమయి జగజ్జనని గురించి, పదేపదే' అనే గీతాన్ని, సంగీతానికి లయబద్ధంగా చిరంజీవి శర్మ ఆలాపిస్తూ ఆ భావనలో లీనమైపోయి ఆత్మానుభూతి పొందాడు. తదనంతరం రెండు గంటలసేపు కీర్తనానందంలో గడిచిపోయింది. పిదప ఈ క్రింది పాట పాడారు:

నితాయ్, హరి నామానికి అంత మాధుర్యం తెచ్చింది ఎవరో
నితాయా లేక గౌరా లేక శాంతిపూర్ అద్వైతుడా?
హరినామ మధువును గ్రోలు, ఓ మనసా, గ్రోలి ఉన్మత్తం చెందు
నేలమీద పొర్లుతూ 'నాకు శరణాగతి కల్పించు' అని హరి నామాన్ని
ఉచ్చరిస్తూ విలపించు
హరినామంతో ఆకాశాన్ని నింపివేయి, రెండు చేతులూ
పైకెత్తి నృత్యంచేస్తూ హరినామం గానంచేయి,
ప్రతిఫలరహితంగా హరినామాన్ని ఇంటింటా ప్రచారం గావించు.
హరి భక్త్యానందంలో రోజురోజుకు ఉల్లాసంగా కొట్టుకుపో
హరి నామాన్ని గానం చేయి, నీ జీవిత పరాకాష్ఠ పర్యంతం,
భక్త్యానందంలో ఉన్మత్తుడవై సమస్త నిమ్నకాంక్షలను ధ్వంసం
గావించు!

ఆ అద్భుత కీర్తన ఉత్పన్నం చేసిన భావోద్వేగ తరంగాలు నెమ్మదిగా ఉపశమించాయి. తరువాత భక్తిమార్గ గురువులకూ, మత సంప్రదాయాలకూ ప్రణామాలు అర్పించారు.

కీర్తన ముగిసి, అంతా కూర్చున్న తరువాత శ్రీరామకృష్ణులు, ఆచార్య నరేంద్రనాథ్ ఛటోపాధ్యాయను ''ఓ మనసా! ప్రాణికోటి సారమైన హరి నామామృతాన్ని గ్రోలి ఉన్మత్తత పొందు'' అనే గీతాన్ని పాడమన్నారని, మాకు గుర్తుంది. వెంటనే అతడు సమధికోత్సాహంతో మృదుమధురంగా ఆ గీతాన్ని రెండు మూడుసార్లు పాడాడు. అందరి మనస్సులు మళ్లీ సంతోషభరితమయ్యాయి.

తదనంతరం శ్రీరామకృష్ణులు అక్కడ హాజరైన అందరికీ వివిధ ఉపదేశాలు ఇవ్వసాగారు. మనస్సును రూపరసాది విషయాల నుండి ఉపసంహరించి, దానిని భగవదర్పితం చేస్తే జీవుడు కచ్చితంగా పరమశాంతిని పొందుతాడని ఆయన ఉపదేశించారు. ఆ చావడి తూర్పు భాగంలో తెర వెనుక కూర్చుని వున్న భక్తురాండ్రు, శ్రీరామకృష్ణులను ఆధ్యాత్మిక విషయాల గురించి అనేక ప్రశ్న లడిగారు; అందుకు ఆయన ఇచ్చిన జవాబులు విని వారెంతో ఆనందించారు. అలా వారి ప్రశ్నలకు జవాబులిస్తూ మధ్యమధ్యలో రాంప్రసాద్, కమలాకాంత మొదలైన భక్తసాధకులు జగజ్జననిపై రచించిన కొన్ని పాటలను శ్రీరామకృష్ణులు పాడారు. ఆ అంశం వారి హృదయాలను ప్రభావితం చేయాలనే ఉద్దేశంతోనే ఆయన ఆ పాటలు పాడారు. ఆయన పాడిన పాటలలో, ఈ క్రింది ఐదు పాటలు మాకు స్పష్టంగా గుర్తున్నాయి:

1. నల్లనిదౌ నా మానస మధుపము
   ఉల్లాసంబుగ లాగివేయబడె
   తల్లి శ్యామ పద నీరాజనమునకు
   ఉల్లము రంజిలచేయు విధమున.
2. శ్యామ పద అంబరాన ఎంతో ఎత్తున ఈ మానస గాలిపటం ఎగురుతోంది.
3. ఇదంతా ఆ ఉన్మత్త స్త్రీ (జగజ్జనని) లీలయే.
4. పాపం ఆ మనస్సు తప్పేమిటి? ఆతడి నెందుకు తప్పుడుగా దోషని నిర్ణయిస్తావు?
5. ఓ తల్లీ, నేను పూర్తిగా మెలకువతోవున్నప్పుడు నా ఇంట్లో దొంగతనం జరిగినందుకు మాత్రమే నేను విచారిస్తున్నాను, ఓ జననీ నువ్వు నాకు కావలిగా ఉన్నావు.

శ్రీరామకృష్ణులు జగజ్జనని గురించి అలా పాడుతూన్నప్పుడు, విజయకృష్ణ గోస్వామి కొద్దిమంది భక్తులతో మరో గదిలోకి వెళ్లి వారికి తులసీదాసు

గాయణం చదివి, వివరించబోయాడు. ఇంతలో ప్రార్థన సమయం కావ

. విజయ్‌కృష్ణ స్వామితో శ్రీరామ ణ హాస్యోక్తులు

డంతో, దావడిలోకి వచ్చి, ప్రార్థన ప్రారంభించడానికి ముందు, శ్రీరామకృష్ణులకు ప్రణామం చేశాడు. విజయ్‌ను చూడగానే శ్రీరామకృష్ణులు హాస్యంగా ఇలా రు: "ఈ మధ్య సంకీర్తనలో విజయ్ ఎంతో ఆనందిస్తున్నాడు. కాని డు నృత్యం చేస్తున్నప్పుడు కప్పు విరిగి మీద పడుతుందేమోనని భయం స్తు ఆవరిస్తోంది! (అంతా నవ్వారు) అప్పను, అటువంటి సంఘటన మా ంతాలలో నిజంగానే జరిగింది. ఇంటి రెండవ అంతస్తును కలపతో, క్టలతో నిర్మిస్తారు. ఒక గోస్వామి తన శిష్యులలో ఒకరి ఇంటికి వెళ్ళి, మొదటి ంతస్తులో కీర్తన ప్రారంభించాడు. కీర్తన రసపట్టులో ఉండగా, నృత్యం మొద ంది. ఆ గోస్వామి నీ మాదిరి (విజయ్‌ను చూస్తూ) కాస్త స్థూలకాయుడు. తడు కాసేపు నృత్యం చేయగానే కప్పు విరిగి, గోస్వామి దభీమని నేలమీద పోయాడు! అందుకే నీ నృత్యం అటువంటి దారుణ పరిణామానికి రితీస్తుందనే నా భయం." (అంతా నవ్వారు) విజయ్ కాషాయాంబరాలు రించి ఉండడం చూసి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఈ మధ్యకాలంలో తడు కాషాయం రంగును ఎంతో ఇష్టపడుతున్నాడు. జనం పైన, క్రింద రించే వస్త్రాలకు కాషాయం అద్దకం చేసుకోవడం కద్దు. కాని విజయ్ తన స్త్రాలను, ఉత్తరీయాన్ని, చొక్కాను, కాన్వాసు పాదరక్షలను సైతం కాషాయం కి మార్చుకొన్నాడు. మంచిది. అలా చేయాలనుకొనే ఒక స్థితి వస్తుంది; షాయం కాని ఏ వస్త్రాన్నీ వారు ధరించ ఇష్టపడరు. కాషాయం పరిత్యాగానికి ర్తు; అంటే భోగత్వాశాత్యారక్షం సమస్తం త్యజించే వ్రతం పాటిస్తున్నానని ధకునికి కాషాయం గుర్తుచేస్తూ ఉంటుంది." విజయ్, శ్రీరామకృష్ణులకు ణామం చేశాడు; "శాంతి, పరిపూర్ణ శాంతి లభిస్తుంది గాక!" అనే అను హ వచనాలతో శ్రీరామకృష్ణులు అతణ్ణి ఆశీర్వదించారు.

శ్రీరామకృష్ణులు జగజ్జననిపై పాటలు పాడుతూన్నప్పుడు మరొక సంఘ న జరిగింది. ఆయన సదా అంతర్ముఖావస్థలో నెలకొని ఉంటూ

7. భక్తుల పట్ల రామకృష్ణుల ఆప్యాయ నురాగం

వున్నప్పటికీ ఆయన పరిశీలనాశక్తి ఎంత సునిశితమైనదో పై సంఘటన బుజువు చేస్తుంది. ఆయన పాడుతున్న ప్పుడు బాబూరాం ముఖం వైపు చూడడం తటస్థిం ంది; బాబూరాం ఆకలిదప్పులతో బాధపడుతున్నాడని ఆయన పసిగ హించారు. తాము తినకుండా అతడు ఏమీ పుచ్చుకోడని ఆయనకు బాగా లుసు. అందువలన శ్రీరామకృష్ణులు తీపి భక్ష్యాలు తెప్పించుకొని కాస్త తిని, గిలిన దానిలో అధికభాగం బాబూరాంకు, తక్కింది భక్తులకు ఇచ్చారు.

కొంతసేపయ్యాక విజయ్ శ్రీరామకృష్ణులకు ప్రణామంచేసి, సాయంత్ర ప్రార్థనకై క్రిందికి దిగివచ్చాడు. శ్రీరామకృష్ణులను రాత్రి భోజనానికై లోపలి గదిలోకి తోడ్కొని వెళ్లారు. అప్పుడు సమయం రాత్రి తొమ్మిది గంటలు దాటింది. ఈ లోపు మేం ప్రార్థనలో పాల్గొనడానికి క్రిందికి దిగివచ్చాం. బ్రహ్మ సమాజ భక్తులు ప్రాంగణంలో సమావేశమై ఉండడం చూశాం; ఆచార్యుడైన విజయ్ వేదిక నలంకరించాడు. ఆచార్యుణ్ణే అనుసరిస్తూ, వారంతా 'బ్రహ్మ సత్యం, జ్ఞాన మనంతం' అనే వేదపాఠం లయయుక్తంగా గానం చేయసాగారు. ప్రార్థన మొదలైంది. కొంతసేపటికి శ్రీరామకృష్ణులు అక్కడ వచ్చి, ఆసనంలో కూర్చుని ప్రార్థనలో పాల్గొన్నారు. పది పదిహేను నిమిషాలు నిశ్చలంగా కూర్చుని, తరువాత నేలను స్పృశించి ప్రణమిల్లారు. అప్పుడు సమయం పది గంటలు దాటింది. దక్షిణేశ్వరానికి తిరిగి వెళ్లడానికి బండిని ఏర్పాటు చేయమన్నారు శ్రీరామకృష్ణులు. ఆయన చొక్కావేసుకొని, చలిగాలి చెవులలోకి పోకుండా టోపీ ధరించారు. బండి రాగానే మెల్లగా అడుగులు వేస్తూ వెళ్లి బండిలో కూర్చున్నారు. బాబూరాం తదితరులు ఆయనను అనుసరించారు. ఆచార్య విజయ్ వేదిక నుండి బ్రహ్మసమాజ భక్తులను సంబోధిస్తూ, ఉపదేశాలిస్తున్నాడు. మేం కూడా ఇళ్లకు బయలుదేరాం.

8. మణి మల్లిక్ కుటుంబం ఒక భక్త కుటుంబం

బ్రహ్మసమాజ భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు ఎలా ఆనందించారో ఆ సందర్భంలో మేం కళ్లారా చూశాం. మణిబాబు మంత్రదీక్ష పుచ్చుకొన్న పరిపూర్ణ బ్రహ్మసమాజ భక్తుడో కాదో మాకు తెలియదు. కాని అతడి కుటుంబంలోని యావన్మందీ బ్రహ్మసమాజ మతాన్ని పాటిస్తూ, సమాజం విధించిన నిత్యప్రార్థనలు తు.చ. తప్పక చేస్తారని మాకు తెలియవచ్చింది. ఆ కుటుంబంలోని ఒక స్త్రీ ప్రార్థనా సమయంలో మనస్సును ఏకాగ్రం చేయలేక పోవడం శ్రీరామకృష్ణులకు తెలియవచ్చింది. ''ఆ సమయంలో నీ మనస్సుకు ఎవరు జ్ఞాపకం వస్తారు?'' అని ఆయన, ఆమెను ఆప్యాయంగా అడిగారు. తన సోదరుని పిల్లవాణ్ణే ఆమె సాకుతూన్నదనీ, ఆమె మనస్సు ప్రార్థన సమయంలో అతణ్ణే జ్ఞాపకం చేసుకొంటున్నదనీ శ్రీరామకృష్ణులు తెలుసుకొన్నారు. ఆ పిల్లవాణ్ణే, బాలకృష్ణుడిగా భావించి సేవించమని ఆమెకు ఉపదేశించారు. ఈ ఉపదేశాన్ని అట్లే ఆచరించి, అనతికాలంలోనే ఆమె భావసమాధి స్థితిని పొందగలిగింది. ఈ విషయం మేం మరొకచోట (III.1) ప్రస్తావించాం. మరొక సందర్భంలో బ్రహ్మసమాజ భక్తుల సాంగత్యంలో శ్రీరామకృష్ణులు దివ్యానందాన్ని అనుభవించడం మేం కళ్లారా చూశాం. రాబోయే పుటల్లో ఆ సందర్భాన్ని వివరించాం. □

1.iii. జయగోపాల్ సేన్ ఇంట్లో శ్రీరామకృష్ణులు

మణిమోహన్ ఇంట్లో జరిగిన కీర్తనలో శ్రీరామకృష్ణుల భావపారవశ్యం, పరమానందానుభూతులను చూసి సంతోషపరవశులై క్రొత్త ఆధ్యాత్మిక వైఖరిని సంతరించుకొన్నది మేం ఒక్కరం మాత్రమే కాదు; మా మిత్రుడు వరదా సుందర్ కూడా ఆ ఉత్సవంలో పాల్గొని, అదే అనుభూతిని పొందాడు. మళ్లీ శ్రీరామకృష్ణులు అటువంటి ఉత్సవ వేడుకలలో ఎప్పుడు పాల్గొంటారో అని ఆరాటంతో వాకబు చేయడం మొదలుపెట్టాడు. అతడి పంట త్వరలోనే పండింది. రెండు రోజుల తరువాత, బుధవారం, నవంబర్ 28వ తేదీ మేం కలుసుకొన్నప్పుడు అతడిలా చెప్పాడు: ''ఈ రోజు శ్రీరామకృష్ణులు కేశవ్ బాబు కమల కుటీరానికి వస్తున్నారు. అక్కడ నుండి మథఘాసాలోని జయ గోపాల్ సేన్ ఇంటికి సాయంత్రం తరువాత వెళ్లనున్నారు. మీరు ఆయనను చూడడానికి వెళతారా?'' అప్పుడు కేశవసేన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడు తున్నాడని మాకు తెలుసు. మా వంటి అపరిచితులు అటువంటి సమ యంలో కమల కుటీరానికి వెళితే అక్కడి వారికి చికాకు కలుగుతుందేమోనని ఆలోచించి, శ్రీరామకృష్ణుల దర్శనార్థం సాయంత్రం తరువాత జయగోపాల్ సేన్ ఇంటికే వెళ్లడానికి నిశ్చయించుకొన్నాం.

మథఘాసా ప్రాంతం, బారాబజార్‌లో ఒక భాగమే ననుకొని ముందు అక్కడికే వెళ్లాం. అక్కడ వాకబు చేసి, ఎంతో శ్రమపడి చివరకు సూర్యాస్త మానం తరువాత జయగోపాల్ సేన్ గృహాన్ని చేరుకొన్నాం.

1. జయగోపాల్ సేన్ గృహం

ఆ రోజు మధ్యాహ్నం వాన పడింది. ఎందుకంటే వీథుల్లో మేం బురదలో నడిచి వెళ్లినట్లు మాకు బాగా గుర్తు. జయగోపాల్ బాబు ఇల్లు,

మణిమోహన్ ఇల్లు మాదిరే పశ్చిమ ముఖంగా ఉంది; తూర్పు వైపు తిరిగి ఆ ఇంట్లోకి వెళ్లినట్లు మాకు జ్ఞాపకం. ఇంటి ముఖద్వారాన్ని దాటుతున్నప్పుడు ఒక వ్యక్తి తారసపడ్డాడు; శ్రీరామకృష్ణులు వచ్చారా అని అతణ్ణే అడిగాం. అతడు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి, మేడ మొదటి అంతస్తుకు వెళ్లమన్నాడు. దక్షిణం వైపునున్న మెట్ల మీదుగా వెళ్లి విశాలమైన చావడి గదిలో అడుగుపెట్టాం. ఆ గది ఉత్తర దక్షిణాలుగా వ్యాపించివుంది. ఆ గది చాలా శుభ్రంగా ఉంది. నేలమీద విశాలమైన పరుపు, దానిమీద తెల్లని వస్త్రం పరిచి ఉన్నారు. శ్రీరామకృష్ణులు దాని మీద కూర్చుని ఉన్నారు. బ్రహ్మసమాజ భక్తులు ఆయనను పరివేష్టించి ఉన్నారు. వారిలో నవవిధాన్ ఆచార్యులైన చిరంజీవి శర్మ, అమృతలాల్ బసు ఉన్నట్లు మాకు గుర్తు. ఆ ఇంటి యజమాని జయగోపాల్, ఆతడి సోదరుడు, ఇరుగుపొరుగునవున్న ఆతడి స్నేహితులు ఇద్దరు ముగ్గురు, శ్రీరామకృష్ణులతో వచ్చిన ఒకరిద్దరు భక్తులు కూడా అక్కడే ఉన్నారు. ఆ భక్తబృందంలో శ్రీరామకృష్ణులు ముద్దుగా పిలిచే హుటకో (హఠాత్తుగా వచ్చి, హఠాత్తుగా మాయమయ్యే వ్యక్తి అని అర్థం), చిన్నగోపాల్ కూడా ఉన్నట్లు మాకు జ్ఞాపకం. శ్రీరామకృష్ణులతో అక్కడ పది పన్నెండుమంది దాకా ఉండడం మేం గమనించాం. అది బహిరంగ సమావేశం కాదనీ, అక్కడకు రావడం పొరపాటేమోననీ మేం భావించాం. భోజనానికి రమ్మని పిలుపు వచ్చేముందే మేం అక్కడ నుండి చల్లగా జారుకోవాలనుకొన్నాం.

లోపలకు రాగానే, శ్రీరామకృష్ణుల పాదారవిందాలకు ప్రణమిల్లాం. ''మీరెలా ఇక్కడకు వచ్చారు?'' అని ఆయన అడిగారు. ''నేడు మీరు ఇక్కడకు వస్తున్నట్లు తెలిసింది; మిమ్మల్ని చూడగోరి వచ్చాం'' అని జవాబిచ్చాం. మా సమాధానంతో ప్రసన్నులైనట్లున్నారు; మమ్మల్ని కూర్చోమన్నారు. మేం కూర్చున్నాం. ఆదుర్దా తగ్గడంతో పరిసరాలు గమనిస్తూ, ఆధ్యాత్మిక వికాసం కలిగించే ఆయన వచనాలు వినసాగాం.

2. శ్రీరామకృష్ణుల బోధనా విధానం

ఇటీవలే మేం శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా దర్శించుకొన్నప్పటికీ, ఆయనను కలుసుకొన్న మొదటి రోజే ఆయన వచనామృతం పట్ల మాకు అసాధారణ ఆకర్షణ ఏర్పడింది. అందుకు కారణం అప్పట్లో మేం గ్రహించలేకపోయాం; ఆయన బోధనా విధానం ఎంత అనుపమానమైనదో ఇప్పుడు గ్రహించగలిగాం. దానిలో పాండిత్య ప్రకర్ష, తర్కాన్ని గుప్పించడం, వాక్సరణి చోటుచేసుకోవు; పద ప్రయోగంలో కృత్రిమత్వం, సాధారణ భావాలకు వాగాడంబరపు ముసుగు, భారతీయ తత్త్వ శాస్త్ర సూత్రకారుల మాదిరి నిగూఢ భావనల వ్యక్తీకరణలో పదాల లుబ్ధత్వం

ంత వెతకినా కానరావు. తాము మాట్లాడే భాషపట్ల శ్రీరామకృష్ణులు గార్తిశ్రద్ధ వహించేవారో లేదో మేం చెప్పలేం. నిత్యం జరిగే సంఘటనల నుండి దాహరిస్తూ తమ భావాలను శ్రోతల మనస్సులలో హత్తుకునేలా చేయడం, యన మాటలు ఒక్కసారి విన్నవారికి సైతం అవగతమౌతుంది. శ్రోతలకు లాంటి సంశయాలు కలుగకపోవడమే కాదు, ఆయన వచనాలలోని సత్యాన్ని హించి వారు పూర్తిగా సంతృప్తి చెందుతారు. ఆ సోదాహరణలు తక్షణమే ఆయనకు స్ఫురించడానికి ఆయన అసాధారణ జ్ఞాపకశక్తి, అద్భుత గ్రహణ శక్తి, సునిశిత పరిశీలనాశక్తి, అనుపమాన సమయస్ఫూర్తే కారణాలు. కాని జగజ్జనని అనుగ్రహమే అందుకు కారణం అని సదా శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఆయన తరచు ఇలా చెప్పేవారు: ''సంపూర్ణంగా ఆమె మీద ఆధారపడిన వ్యక్తి హృద యంలో ఆమె ఆసీనురాలై, అతడు ఏం చెప్పాలో సంజ్ఞలతో అతడికి తెలియ చేస్తుంది. జగజ్జనని అటువంటి వ్యక్తి మనస్సును సదా జ్ఞానభాండాగారంలా మలచి ఉంచుతుంది. అతడు ఎంత వినియోగించుకొన్నా, ఆ జ్ఞానం తర గదు.'' ఈ విషయం వివరిస్తూ ఒక రోజు ఈ క్రింది సంఘటనను ప్రస్తావిం చారు:

దక్షిణేశ్వర కాళికాలయానికి ఉత్తరాన ఒక ప్రభుత్వ మందుగుండు కార్ఖానా ఉండేది. సిక్కు మతానికి చెందిన కొందరు సిపాయిలు అక్కడ కావలి కాస్తూ, నివసించేవారు. వారందరూ శ్రీరామకృష్ణుల పట్ల అమిత భక్తిప్రపత్తు లతో ఉండేవారు. కొన్ని సందర్భాలలో వాళ్ళు ఆయనను తమ బసకు తోడ్కొని వెళ్లి ధార్మిక సందేహాలను నివృత్తి చేసుకోవడం కద్దు. '' 'సంసారంలో ఉంటూ మనిషి భగవత్సాక్షాత్కారం పొందడం ఎలా?' అని ఒక రోజు వాళ్ళు, నన్ను అడిగారు. వెంటనే నా మనస్సులో బియ్యం దంపే రోలు, రోకలి మెద లాయి. రోకలి దంపుతూవుంటే ఒక వ్యకి వడ్లను జాగ్రత్తగా రోలులోకి తోస్తూవుంటాడు. ఆ దృశ్యం నా మనస్సులో మెదలగానే, సంసారంలో ఉండే వ్యక్తి కూడా అంత జాగ్రత్తగా మసలుకోవాలని జగజ్జనని వివరిస్తూన్నట్లు నేను గ్రహించాను. రోలు వద్ద కూర్చుని వడ్లను రోలులోకి తోస్తూవున్న వ్యక్తి, రోకలి తన చేతుల మీద పడకుండా ఎంత జాగ్రత్తగా వ్యవహరిస్తాడో, అట్లే సంసా రంలో ఉండే వ్యక్తి సంసార లంపటాలలో చిక్కువడకుండా సదా జాగ్రత్త వహిం చాలి. అటువంటప్పుడు మాత్రమే ఆ వ్యక్తి పతనం చెందకుండా బంధనాల నుండి తప్పించుకోగలుగుతాడు. రోలు, రోకలి చిత్రం మదిలో మెదలగానే, జగజ్జనని ఈ భావనను నాలో ఉత్పన్నం చేసింది; ఇదే ఆ సిపాయిలకు నేను వివరించి చెప్పాను. ఆ వివరణ విని వాళ్ళు ఎంతో తృప్తిచెందారు. లోకులతో

మాట్లాడుతున్నప్పుడు అటువంటి దృశ్యాలు నా మదిలో మెదలడం కద్దు.''

అనవసరంగా మాట్లాడి శ్రోతల మనస్సులను ఎన్నడూ గందరగోళపర చకపోవడం శ్రీరామకృష్ణుల బోధనా విధానంలోని మరో విలక్షణత. విష

3. ఆయన బోధా విధానంలోని మరో విలక్షణత

యాంశాన్నీ, ప్రశ్నించే వ్యక్తి ఉద్దేశాన్ని సరిగా వివేచించి, సరళంగా నాలుగు ముక్కల్లో జవాబు చెప్పేవారు. తన నిర్ణయాన్ని పై రీతిలో సోదాహరణతో తెలిపేవారు. అలా నిర్ణయాన్ని ప్రకటించడం ఆయన బోధన పద్ధతిలో విశిష్ట లక్షణమని మేం భావిస్తాం. తన అంతరాంతరాల్లో నిజమని తెలిసిన విషయాన్నే ఆయన జవాబుగా ప్రకటించేవారు. ఆ సమస్యకు మరో పరిష్కారం సాధ్యం కాదని ఆయన పొడిగించి చెప్పరు. తాము వ్యక్తంచేసే భావాలపట్ల గల ప్రగాఢ విశ్వాసం కారణంగా శ్రోతల మనస్సులలో ఆ భావం ప్రగాఢంగా హత్తుకుపోయేది. గత సంస్కారాల పర్యవసానంగా ఎవరైనా ఆయన నిర్ణయాలకు వ్యతిరిక్తంగా వాదనలు, కారణాలు లేవనెత్తి సాధనాఫలితంగా సత్యాలని తెలుసుకొన్న ఆయన నిర్ణయాలను ససేమిరా అంగీకరించకుంటే, ఆయన, ''నా మనస్సుకు తోచింది. చెప్పాను; నీకు నచ్చినంతవరకు (అంటే తలా, తోకా తీసివేసి) అంగీకరిస్తే అంగీకరించు'' అంటూ ఆ ప్రస్తావనను అంతటితో ముగించేవారు. ఒకరి స్వాతంత్ర్యంలో జోక్యం చేసుకొని వారి ఆధ్యాత్మిక వైఖరికి హాని ఆయన ఎన్నటికీ తలపెట్టరు. భగవత్సంకల్పంతో చర్చిస్తూన్న సమస్యకు నిజమైన పరిష్కారాన్ని ఆ వ్యక్తి ఉన్నత మనోస్థితిని చేరినప్పుడు అవగతం చేసుకోగలడని ఆయన సరిపుచ్చుకొంటారని భావించవచ్చు.

అక్కడితో ఆయన ఆగరు; సుప్రసిద్ధ సాధకులు స్వరకల్పన చేసిన భక్తి గీతాలను, కొన్ని సందర్భాలలో శాస్త్రాల నుండి ఉదాహరణలను జోడించి తన మాటలకు మరింత శక్తిని చేకూరుస్తారు. దాంతో ఆ వ్యక్తి సంశయాలు తొలగిపోతాయి; విషయాంశంలోని సత్యాన్ని విశ్వసించి తదనుగుణంగా తన జీవితాన్ని మలచుకోవడానికి సంసిద్ధుడౌతాడు.

ఇక్కడ మరొక్క మాట చెప్పవలసి ఉంది. భక్తిమార్గగాములు లేదా జ్ఞానమార్గగాములు తమ గమ్యాంతాన ఆరాధనా వస్తువుతో తాదాత్మ్యం

4. అనుభూతిరహిత వచనాలపట్ల ఆయన చిరాకుపడడం

చెందినట్లు గ్రహించినప్పుడే ఆ సాధకుడు అద్వైతజ్ఞానాన్ని సంతరించుకొంటాడని పదేపదే శ్రీరామకృష్ణులు మాతో చెప్పేవారు. 'శుద్ధ భక్తి, శుద్ధ జ్ఞానం రెండు ఒక్కటే' లేదా 'అక్కడ (పరాకాష్ఠ స్థితిలో) నక్కలన్నీ ఒక్క విధంగానే ఊళలు వేస్తాయి

జ్ఞానులంతా ఒకే ఆత్మసాక్షాత్కారం గురించే వచిస్తారు?' అనే ఆయన మాటలే పై దానికి తార్కాణాలు. శ్రీరామకృష్ణుల అభిప్రాయంలో అద్వైత జ్ఞానమే పరమసత్యం అయినప్పటికీ ఆయన లౌకిక వస్తువుల పట్ల అత్యాశగల జనసామాన్యానికి విశిష్టాద్వైతాన్నే సదా నేర్పేవారు; ఎన్నటికీ ద్వైతంలోని భక్తిని విడిచిపెట్టేవారు కాదు. ఉన్నత ఆధ్యాత్మిక అనుభూతులు పొందని వ్యక్తులు, ఆ మాటకొస్తే భక్తిశూన్యులు అద్వైతానికి లేదా విశిష్టాద్వైతానికి అనుకూలంగా చేసే వాదనలు చూసి ఆయన ఎంతో చిరాకుపడేవారు. అటువంటి సందర్భాలలో వారిని పరుష వచనాలతో గర్హించడానికి సైతం ఆయన సంకోచించేవారు కాదు. ఒక రోజు మా మిత్రుడైన వైకుంఠనాథ్ సన్యాల్‌ను, పంచదశి మొదలైన శాస్త్రగ్రంథాలను పఠించావా అని శ్రీరామకృష్ణులు అడిగారు. అతడినుండి లేదు అని జవాబు రాగానే ఆయన ఊపిరిపీల్చుకొని, ''నువ్వు చదవకపోవడం మంచిదే. కొందరు యువకులు అటువంటి శాస్త్రగ్రంథాలు కేవలం చదివి ఇక్కడికి వస్తారు. ఏదీ అనుష్ఠించరు, వాదన చేయడానికే వస్తారు. అది నాకు యాతనా భరితంగా ఉంటుంది'' అని అన్నారు.

ఆ రోజు జయగోపాల్ సేన్ ఇంట్లో ఒక ఫలానా వ్యక్తి శ్రీరామకృష్ణులను, ''సంసారంలో జీవిస్తూ భగవదనుగ్రహం పొందడం ఎలా?'' అని అడిగాడు. శ్రీరామకృష్ణులు అతడికి విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని, జగజ్జననిపై కొన్ని పాటలు పాడుతూ వివరించారు. ఆయన వివరణ సారాంశాన్ని క్రింద తెలుపుతున్నాం.

5. సంసార జీవితంలో భగవత్సాక్షాత్కారం పొందడం ఎలాగో శ్రీరామకృష్ణులు నేర్పడం

సంసారం అశాశ్వతం అని తెలిసికూడా సంసారాన్ని 'నాది' అని భావించుకొని ఆ ప్రకారం మెలగినంత కాలం అతడు దాన్లో చిక్కుపడిపోతాడు; యాతనలు అనుభవిస్తూ, సంసారం నుండి పారిపోగోరినా, అతడికి దారీతెన్నూ కనిపించదు. ఇలా చెబుతూ శ్రీరామకృష్ణులు, ''మహామాయ మాయ జగత్తును గొప్ప భ్రాంతిలో ముంచివుంచుతుంది; బ్రహ్మ విష్ణువులు సైతం ఆ భ్రాంతిలో మునిగే ఉంటారు, ఇక జీవుడి విషయం చెప్పాలా!'' అనే పాట పాడారు. కాబట్టి ఈ తాత్కాలిక సంసారాన్ని మానసికంగా భగవంతునితో ముడివేసి తదనుగుణంగా ప్రతి పనిని నిర్వర్తించాలి. ఒక చేత్తో భగవంతుని పాదపద్మాలను గట్టిగా పుచ్చుకొని, మరో చేత్తో తక్కిన పనులు చేసుకుంటూ పోవాలి; ఈ సంసారంలోని వ్యక్తులూ, వస్తువులూ తన సొంతం కావనీ, ఆయనకే చెందినవనీ సదా జ్ఞాపకంలో ఉంచుకోవాలి. అలా చేయగలిగితే, సంసారానురక్తి వలన కలిగే బాధలుండవు. అప్పుడు తాను ఏం చేసినా అది భగవంతుని నిమిత్తమే అనే భావన ఉదయించి, అతడి మనస్సు భగవంతుని వైపుగా పురోగ

మిస్తుంది. ఈ భావాన్ని పటిష్టంగా శ్రోత మనస్సులో నాటుకుపోయేలా చేయడం కోసం శ్రీరామకృష్ణులు, ''ఓ మనసా! నీకు సేద్యం చేయడం (జీవన సేద్యం) తెలియదు'' అనే పాటను పాడారు. పాడటం పూర్తికాగానే ఆయన కొనసాగించారు: ''ఆ విధంగా భగవంతుని ఆధారం చేసుకొని జీవితం గడిపితే, ఈ లోకంలోని యావన్మందీ, వస్తువులు యావత్తూ భగవంతుని అంశలే అనే భావన క్రమంగా జనిస్తుంది. అటువంటప్పుడు సాధకుడు తన తల్లితండ్రులను విశ్వానికి తల్లితండ్రులుగా (బ్రహ్మం, దాని శక్తి) సేవిస్తాడు. తన కొడుకులను, కూతుళ్లను బాలగోపాలుని, జగజ్జనని అభివ్యక్తీకరణలుగా చూస్తాడు; తక్కిన అందరూ నారాయణుని అంశలుగా తెలుసుకొని, వారిపట్ల భక్తిప్రపత్తులతో మెలగుతాడు. సంసారంలో అట్టి ఆధ్యాత్మిక భావంలో జీవించే వ్యక్తి ఆదర్శప్రాయుడైన గృహస్థు; ఆతడి మనస్సు నుండి మరణభీతి సమూలంగా తొలగిపోతుంది. అటువంటి వ్యక్తులు ఎంతో అరుదుగా ఉంటారు.'' ఆ తరువాత ఆ ఆదర్శాన్ని చేరుకొనే ఉపాయాన్ని తెలిపే ఉద్దేశంతో ఆయన ఇలా అన్నారు: ''విచక్షణా జ్ఞానం మీద ఆధారపడి ఉండాలి, అన్ని కార్యాలను ఆ వెలుగులోనే నిర్వర్తించాలి; అప్పుడప్పుడు కోలాహల సంసార వాతావరణం నుండి నిష్క్రమించి, ఏకాంతవాసంలో భగవత్సాక్షాత్కారార్థం ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించాలి.'' తమ జీవితంలో పైన పేర్కొన్న ఆదర్శాన్ని ఈ రీతిలో మాత్రమే ఆచరించగలగాలి. అందుకైన మార్గాన్ని సూచిస్తూ శ్రీరామకృష్ణులు, రాంప్రసాద్ సుప్రసిద్ధ గీతం, ''రావే మనసా షికారు పోదము కాళీ కల్ప ద్రుమంబునకు, ప్రోగుచేయు మా చెట్టు క్రిందను నాలుగు పురుషార్థంబులును'' ఆలాపించారు. 'విచక్షణా జ్ఞానం' అన్న ప్రయోగానికి అర్థం ఏమిటో ఆయన తెలిపారు. ఆ విచక్షణాజ్ఞాన దోహదంతో సాధకుడు భగవంతుడు శాశ్వత పరమపదార్థమనీ, రూపరసాదుల ఏకమొత్తమనీ గ్రహించి, సంసార పరిత్యాగం చేస్తాడు. కాని భగవంతుణ్ణి తెలుసుకొన్న తరువాత, అదే జ్ఞానం ఆ పరమాత్మ, తన లీలలలో విశ్వంలోని అనేక వ్యక్తుల వస్తువుల రూపాలను దాలుస్తాడనీ బోధిస్తుంది; అప్పుడు భగవంతుడు నిత్యమూ, లీలా అనే అనుభూతిని సాధకుడు పొంది, తరిస్తాడు.

6. సంకీర్తనానందం

తరువాత ఆచార్య చిరంజీవి, ''ఓ జననీ, నన్ను మత్తిల్లచేయి'' అనే పాటను ఆలాపించాడు; అందరూ బృందగానం చేశారు. ఆ పాట ప్రారంభం కాగానే శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో లేచి నిలబడ్డారు. అంతా లేచి నిలబడి, ఆయన చుట్టూ చేరి నాట్యం చేస్తూ, పాడసాగారు. ఆ పాట పూర్తిచేసి, చిరంజీవి మళ్లీ పాడసాగాడు:

ఆహా, దివ్యప్రేమ పూర్ణచంద్రుడు చైతన్య ఆకాశాన ఉదయించాడు.
దయాళువుకు విజయోస్తు!
కాంచండి, దివ్యప్రేమ సాగరం ఉప్పొంగింది! ఓ, ఆ పరమానందం
పరికించండి!
ఆహా, భక్తులు తారలలా, లీలామానుషుడు హరి చుట్టూ
ప్రకాశిస్తూన్నారు!
స్వర్గ ద్వారాన్ని తెరుస్తూ, నవవిధానపు క్రొంగ్రొత్త మారుతం వీస్తూ,
ఆనందతరంగాలను లేపెత్తుతూన్నది.
దివ్యప్రేమ అమృత మాధుర్య సువాసన చుట్టూ వేగంగా పరివ్యాపిస్తూ,
పావనధ్యానానందంలో యోగులను మత్తిల్లచేస్తూన్నది.
ఆనందమయి జగజ్జనని ఆశీనయైన నవవిధాన పద్మం
తీరంలేని సాగరంలో నృత్యం చేస్తూన్నది.
ఆధ్యాత్మిక భావోద్వేగంలో మునిగిపోయిన భక్త భ్రమరాలు
ఆ పద్మంలోని మధువును గ్రోలుతున్నవి.
ఓ! భక్తుల మనస్సులను రంజిల్లచేసే జగజ్జనని అనుగ్రహాపూర్ణ వదనం!
భక్తిలో సంలీనమైన సాధుబృందాలు
ఆమె పాదారవిందాల వద్ద నృత్యం చేస్తున్నారు.
ఏమా సౌందర్యం! జీవితం వసంతాన్ని సంతరించుకొంది దాన్నంతా
చూసి. సర్వుల పాదాలు పుచ్చుకొని ప్రేమదాసు జగజ్జననికి
విజయోస్తు అని గానం చేయమని వేడుకొంటున్నాడు.

చాలాసేపు పాటకు అనుగుణంగా నృత్యం కొనసాగింది. తరువాత భగవంతునికి, భక్తులకు ప్రణామాలర్పిస్తూ సంకీర్తన కార్యక్రమం ముగిసింది. అందరూ శ్రీరామకృష్ణుల పాదధూళి స్వీకరించి, కూర్చున్నారు. ఈ సందర్భంలో కూడా ఆయన చాలాసేపు మనోహరంగా నృత్యం చేశారు. కాని మణి మోహన్ ఇంట్లో ఆయన పొందిన ప్రగాఢ పారవశ్యం ఇక్కడ పొందినట్లు కనిపించలేదు. తదనంతరం శ్రీరామకృష్ణులు కూర్చుని, చిరంజీవితో ఇలా అన్నారు: ''నీ ఆ పాటను మొట్టమొదటిసారి విన్నప్పుడు, అట్టి జీవితం,

అంతపెద్ద పూర్ణచంద్రుడు ఉదయిస్తున్నట్లు నేను కాంచగలిగాను; ఆ తరువాత భావపారవశ్యంలో జారుకొన్నాను.''

కేశవ్ అస్వస్థత గురించి జయగోపాల్, చిరంజీవి మాట్లాడుకోసాగారు. ఎవరితోనో శ్రీరామకృష్ణులు, రాఖాల్‌కు ఒంట్లో బాగాలేదని చెప్పినట్లు మాకు గుర్తు. జయగోపాల్ మంత్రదీక్ష పుచ్చుకొన్న బ్రహ్మసమాజ భక్తుడో కాదో మాకు తెలియదు; కాని అతడికి కేశవ్‌సేన్‌పట్లా, బ్రహ్మసమాజ భక్తుల పట్లా ఎంతో భక్తిప్రపత్తులు ఉన్నాయనడం నిజం. కేశవ్ కొన్ని సమయాలలో కలకత్తాకు సమీపాన ఉన్న బేల్ఘురియాలోని జయగోపాల్ ఉద్యానానికి వెళ్లి, ఆధ్యాత్మిక సాధనలలో కొంత సమయం గడిపి వచ్చేవాడు. అక్కడే కేశవ్, గురుదేవులను మొట్టమొదటిసారి కలుసుకోవడం తటస్థించింది. కేశవ్ జీవితంలో ఆధ్యాత్మికత ప్రగాఢమై, నవవిధాన్ ఆవిర్భావానికి ఆ సమావేశమే నాంది పలికింది. ఆనాటి నుండి జయగోపాల్ కూడా శ్రీరామకృష్ణుల పట్ల అమిత భక్తిశ్రద్ధలు చూపసాగాడు. కొన్ని సమయాలలో దక్షిణేశ్వరానికి స్వయంగా వెళ్లి, లేదా శ్రీరామకృష్ణులను తన ఇంటికి సాదరంగా ఆహ్వానించి ధార్మిక ప్రసంగాలలో పాల్గొని ఎంతో ఆనందించేవాడు. శ్రీరామకృష్ణులు కలకత్తాకు రావడానికయ్యే బండి బాడుగ ఖర్చులో అధికభాగం జయగోపాలే భరించేవాడని మేం వినివున్నాం. శ్రీరామకృష్ణుల పట్ల ఆయన కుటుంబ సభ్యు లందరూ ఎంతో గౌరవం చూపేవారు.

రాత్రి బాగా ప్రొద్దుపోవడంతో, శ్రీరామకృష్ణుల నుండి మేం సెలవు పుచ్చుకొని, ఇళ్లకు బయలుదేరాం.

2. దివ్యదర్శనాలలో చూసిన భక్తుల ఆగమనారంభం

1. బ్రహ్మసమాజం నుండి కూడా శ్రీరామకృష్ణులు కొంత నేర్చుకోవడం

ఒకరి మతంపట్ల వారికి ఉండవలసిన విశ్వాసం, భగవత్సాక్షాత్కారార్థం సర్వ సంగ పరిత్యాగం అనే శ్రీరామకృష్ణుల కీర్తనీయ ఆదర్శాలను స్వయంగా చూసి బ్రహ్మసమాజ నాయకులైన కేశవ సేన్, విజయకృష్ణ, ప్రతాపచంద్ర, శివనాథ్, చిరంజీవి, అమృతలాల్, గౌరగోవింద మొదలైన వారంతా ఎంతో లబ్ధి పొందినట్లు మేం ఇంతకు మునుపే పాఠకులకు తెలిపివున్నాం. ''భావముఖంలో సుప్రతిష్ఠితులూ, బ్రహ్మజ్ఞానీ అయిన శ్రీరామకృష్ణులు, కేశవ్ తదితర బ్రహ్మసమాజ నాయకుల పరిచయం వలన ఏదైనా లబ్ధి పొందారా?'' అనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతుంది. ఇందుకు శ్రీరామకృష్ణుల భక్తు లనేకులు తక్షణం ''లేదు'' అనే సమాధానం ఇస్తారు. కాని 'ఇచ్చి పుచ్చుకోవడ' మనే సూత్రం సర్వత్రా వర్తించడం మనం చూడవచ్చు. తెలివితక్కువ, చంచలత్వం ఒక బాలుడికి బోధించేటప్పుడు మనం కూడా కొంత నేర్చుకోగలుగుతాం. అతడివంటి వారికి తగిన బోధనా పద్ధతి, విషయాంశాన్ని అర్థం చేసుకోవ ...ంలో అతడి గత సంస్కారాలు ఏ మేరకు దోహదం చేస్తాయో లేదా ఆటంక పరుస్తాయో మొదలైన విషయాలు మనకు తెలియవస్తాయి. ఆ ఆటంకాలను తొలగించే విధానం కూడా తెలుసుకోగలం. కాబట్టి పాశ్చాత్య భావాల, ఆదర్శాల ఆధారంగా స్థాపించబడ్డ బ్రహ్మసమాజం నుండి శ్రీరామకృష్ణులు లాటి లబ్ధీ పొందలేదనడం సబబు కాదు. మా అభిప్రాయం అందుకు ...న్నం. తమ అసాధారణ సాధనా ఫలితంగా సంతరించుకొన్న ఆధ్యాత్మిక అనుభూతులను బ్రహ్మసమాజానికి అందించే ప్రయత్నంలో ఆయన కూడా దాని

1

నుండి కొంత నేర్చుకొన్నారని అభిప్రాయపడుతున్నాం. ఆ విషయం గురించి ఇక్కడ ఒకింత చర్చించడం యుక్తమే.

బ్రహ్మసమాజస్థులతో పరిచయం కావడానికి మునుపు శ్రీరామకృష్ణులు పాశ్చాత్య భావాల, ఆదర్శాల ప్రభావానికి సుదూరంగా ఉండిపోయి, జీవితం గడిపారు. ఒక్క మథురనాథ్‌ను మినహాయిస్తే ఆయనకు

2. పాశ్చాత్య భావాల ప్రభావం గ్రహించగలగడం

పరిచయమైన వారంతా సనాతన 'ధర్మం, మోక్షం' అనే ఆదర్శాలను పాటించిన వారే. వారిలో కొందరు లోక హితార్థం దయాధర్మ కార్యాలను చేయడంలో పాటుపడ్డారు; కొందరు భగవ త్సాక్షాత్కారం నిమిత్తం శాశ్వత, కీర్తనీయ సర్వసంగపరిత్యాగ మార్గాన్ని అనుస రించారు. పాశ్చాత్య విధానంలో విద్యావంతుడైన మథుర్ ఆయనకు ఎంతో పరిచయస్థుడైనప్పటికీ, ఆ రీతిలో విద్యావంతులైన అనేకులను చూసే అవ కాశమూ, తద్వారా ఆ విద్యావిధానం తెచ్చిన సనాతన హిందూ ఆదర్శప్రాయ జీవితానికి ఎంతో విభిన్నమైన మార్పులను గమనించే సందర్భమూ ఆయనకు కలుగలేదు. పైగా ఆయన పావన సాంగత్యంలో మథుర్‌బాబు స్వభావం మారి పోయింది కూడా; కాబట్టి అతణ్ణే పరిశీలించి పాశ్చాత్య విద్యావిధానం కొని తెచ్చిన నూతన స్థితిని ఆయన గమనించే అవకాశమూ కలుగలేదు. బ్రహ్మ సమాజస్థులతో పరిచయమయ్యాక, వాళ్ల భగవత్సాక్షాత్కారం కోసం ప్రయత్నం చేస్తూన్నప్పటికీ, సనాతన జాతీయ ఆదర్శాన్నుండి వైదొలగడం ఆయన స్పష్టంగా గమనించగలిగారు. అందుకు కారణం ఏమిటో కనుగొనే ప్రయత్నంలో ఆయన మనస్సు మగ్నమైపోయింది. ఆ విధంగా పాశ్చాత్య విద్యా విధానం, బోధన కారణంగా జన జీవనంలో చొచ్చుకుపోతున్న విలక్షణ భావా లతో ప్రప్రథమంగా ఆయనకు పరిచయం కలిగింది.

తాము ప్రత్యక్షంగా సాక్షాత్కరించుకొన్న ఆధ్యాత్మిక సత్యాలను కేశవ్ తదితర బ్రహ్మసమాజస్థులు సత్వరమే బహిరంగంగా అంగీకరిస్తారని శ్రీరామ కృష్ణులు మొదట్లో భావించినట్లు తెలుస్తోంది. కాని

3. ఆధునికుల తులనాత్మక వైఖరి

రోజులు గడిచినప్పటికీ, తమకు అత్యంత సన్నిహితు లవుతూవున్నప్పటికీ, వాళ్ల పాశ్చాత్య విద్యావిధాన ప్రభావం నుండి విడవడ లేదు, తమ ప్రత్యక్ష ఆధ్యాత్మిక అనుభూతుల పట్ల పరిపూర్ణ విశ్వాసాన్నీ ప్రక టించలేకపోయారు. కాబట్టి పాశ్చాత్య భావాలు భారతీయ యువతలో వ్రేళ్లూనాయని ఆయన గ్రహించారు; పాశ్చాత్య చింతనాశీలురు, పండితులు గురు స్థానాన్ని ఆక్రమించారనీ, అదే స్థితి దీర్ఘకాలం కొనసాగుతుందనీ ఆయన అర్థంచేసుకొన్నారు. కనుక భారతీయ ఋషివర్యుల ప్రత్యక్ష ఆధ్యాత్మిక అను

ాతులను, పాశ్చాత్య పండితుల భావాలతో తులనాత్మకంగా పరిశీలన చేస్తే
'ని, భారతీయ యువత ఋషుల అనుభూతులను పరమ సత్యాలుగా అంగీ
రించరనీ, లబ్ధిపొందరనీ కూడా శ్రీరామకృష్ణులు తెలుసుకొన్నారు. అందు
ల్లనే వారికి ఉపదేశం చేసిన మరుక్షణమే, "నా మనస్సుకు తోచింది చెప్పాను;
ాటిలో మీకు అనుగుణమైన వాటిని ఎంపిక చేసుకోండి" అని తరచు
ెప్పేవారు. లేదా ఆయన మాటల తీరులో చెప్పాలంటే 'తలా తోకా తీసి
ేయండి' అని చెప్పవలసి వస్తుంది. ఆయన వాళ్లకు ఎంపిక చేసుకొనే పరిపూర్ణ
స్వాతంత్ర్యం ఇచ్చారు; కనుకనే ఆయన భావాల, అనుభూతులను వాళ్లు ఇష్ట
పడినంత వరకు అంగీకరించారని చెప్పడం అనవసరం.

భారతీయ ఋషుల భావాల, ఆదర్శాల సుసంఘటిత మూర్తులైన శ్రీరామకృష్ణులు వారి ఆ వైఖరికి ఏమాత్రం సంచలనం చెందలేదు. లోకంలో జరిగే రకరకాల సంఘటనలకు జగజ్జనని సంకల్పం మాత్రమే హేతువని ఆయన అంతరాంతరాళాలలో గట్టిగా నమ్మివుండడమే అందుకు కారణం; ఆమె ఆదేశం పొంది, సర్వావస్థలలోను ఆ మార్గదర్శకత్వంలో మెలగే వ్యక్తికి ఏ సంఘటనా అవరోధంగా నిలబడదు. అసాధ్యాన్ని సాధ్యం గావించే మాయ తన యథార్థ స్వభావాన్ని అతడికి వెల్లడించి, వివరించి, సదా అతడికి స్థిరమైన శాంతిని ఒనగూరుస్తుంది. కాబట్టే జగజ్జనని సంకల్పం వల్లనే పాశ్చాత్య భావాలూ, ఆదర్శాలూ భారతదేశంలో ప్రవేశించాయనీ, ఆమె సంకల్పం చేతనే బ్రహ్మ సమాజస్థులూ, ఇతర విద్యావంతులూ వాళ్ల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారనీ శ్రీరామకృష్ణులు స్పష్టంగా గ్రహించారు. కనుక వారి బలహీనతపట్ల ఆయన ఎలా విసుగు చెందుతారు? లేదా తమ అనంత అనురాగ ఆప్యాయత లను వారిపై వర్షించకుండా ఎలా ఉండగలరు? ఆయన ఆరాటం చెందక, ఇలా యోచించారు: "ఋషివర్యుల ప్రత్యక్ష జ్ఞానాన్ని వారికి నచ్చిన మేరకు స్వీక రిస్తారు గాక! జగజ్జనని భవిష్యత్తులో అటువంటి వారిని ఇచ్ఛాపూర్వకంగా ఆ జ్ఞానాన్ని స్వీకరించేలా చేస్తుందిగాక!"

4. ఈ విషయంగా శ్రీరామకృష్ణులు సంచలనం చెందకపోవడం

బ్రహ్మసమాజస్థులు తాము చెప్పినదంతా అంగీకరించకపోయినప్పటికీ, తమ ఆధ్యాత్మికానుభూతులను పాక్షికంగా చెప్పడంతో శ్రీరామకృష్ణులు సంతృప్తి చెందలేదు. ఆయన సదా ఆధ్యాత్మిక జగత్తులోని నిగూఢ సత్యాల నన్నింటిని వారికి వెల్లడించేవారు. ఆ సత్యాలు : "భగవంతునికై సర్వసంగ పరిత్యాగం చేయనిదే ఆయన సాక్షాత్కారం లభించదు.", "అన్ని సంప్రదాయాలు

5. తమ ఉపదేశాలను పాక్షికంగా బ్రహ్మసమాజస్థులు స్వీకరించడం పట్ల శ్రీరామకృష్ణులు సమాధానపడడం

(నిజమైన) మార్గాలే (భగవత్సాక్షాత్కారానికి)'', ''ప్రతి మార్గం చివరన ఉపాసకుడు, ఉపాస్యునితో తాదాత్మ్యం చెందుతాడు.'' ''ఆలోచనలు, వచనాలు పూర్తిగా ఏకీభవించడమే గొప్ప సాధన'', ''సత్యాన్ని అసత్యం నుండి వివేచించడం, వాంఛారహితులై ఉండడం, లౌకిక కర్తవ్యాల నన్నిటిని ఆయన పట్ల పూర్తి విశ్వాసంతో, ఆయన ఆధారంతో నిర్వర్తించడం - ఇదే ఆయన వద్దకు తోడ్కొనిపోయే మార్గం.''

శరీరం నుండి పూర్తిగా విడివడిపోయి ఆధ్యాత్మిక జగత్తులోని పరమ సత్యాలను అనుభూతం చేసుకోవడం ఎన్నటికీ సాధ్యంకాదని కేశవాదులకు ఆయన వివరించి చెప్పేవారు. అలా చేయగోరితే మనసావాచాకర్మేణా ఆత్మ సంయమనం పాటించాలి. ఈ ఉపదేశ ఫలితంగా వారు ఆ నియమాన్ని పాటింప ప్రయత్నించసాగారు. తమ ఉపదేశాలను సమగ్రంగా వారు గ్రహించలేకపోవడం గమనించి, గత సంస్కారాలు వ్రేళ్లూని పాతుకుపోయినప్పుడు క్రొత్త భావాలను చొప్పించడం దాదాపు అసాధ్యమే అనే నిర్ణయానికి వచ్చారు శ్రీరామకృష్ణులు; అయినప్పటికీ ప్రయత్నించడం చిలుక గొంతు మొద్దుబారిన తరువాత దానితో 'రాధాకృష్ణ' అని ఉచ్చరింప చేయడం వంటిదే అని ఆయన ఎరుగక పోలేదు. పాశ్చాత్య భౌతికవాద ప్రభావంచేతనో లేక మరేదో కారణంగానో లౌకిక సుఖభోగాలను అనుభవించాలనే వాంఛలో ఊరిపోయిన వ్యక్తులు భారతదేశం ప్రచారం చేసిన పరిత్యాగ భావాన్ని అవగతం చేసుకోలేరు, ససేమిరా పాటించనూ లేరని శ్రీరామకృష్ణులు అవగతం చేసుకొన్నారు. అందుకే ఆయన జగజ్జననిని వ్యాకులతతో ఇలా ప్రార్థించారు: ''అమ్మా, సర్వసంగపరిత్యాగులైన నీ భక్తులను ఇక్కడకు తోడ్కొనిరా, వాళ్లతో నిస్సంకోచంగా నీ గురించి ముచ్చటిస్తూ ఆనందంగా గడుపుతాను.'' ఈ పరిశీలన ఫలితంగా కళంకరహిత మనస్కులైన యువకులే తమ భావాలను, లక్ష్యాలను నిస్సంకోచంగా, సమగ్రంగా అంగీకరించి, గ్రహించి సాహసంతో ఆ భావాలకు, లక్ష్యాలకు ప్రాతినిధ్యం వహించే సత్యాలను ఆవిష్కరించుకోవడంలో పురోగమిస్తారనే నమ్మకం ఆయనలో కలిగిందనుకోవడం అనుచితం కాబోదు.

6. బ్రహ్మసమాజం ద్వారా కలకత్తా ప్రజలు శ్రీరామకృష్ణులపట్ల ఆకర్షితులు కావడం

బ్రహ్మసమాజ నాయకులు శ్రీరామకృష్ణుల నూతన ఆధ్యాత్మిక భావాలను ఏ మేరకు అంగీకరించారో, తద్ద్వారా వారిలో ఎలాటి పరిణామాలు కలిగాయో తెలుసుకోవడానికి కలకత్తా జనసామాన్యానికి ఎంతో కాలం పట్టలేదు. కేశవ్ తదితరులు బ్రహ్మసమాజ పత్రికలలో శ్రీరామకృష్ణుల అసాధారణ ఆధ్యాత్మిక ధోరణులను, ఆయన అమృత వచనాలను గురించి ప్రచురించ నారంభించగానే



మనోమోహన్ మిత్ర

కలకత్తా జనానీకం వాటి పట్ల ఎంతో ఆకర్షితులైనారు; శ్రీరామకృష్ణుల దర్శనార్థం దక్షిణేశ్వరానికి తీర్థప్రజలా రాసాగారు. ఈ రీతిలో శ్రీరామకృష్ణులు దివ్యదర్శనాలలో గుర్తించిన భక్తులు క్రమంగా దక్షిణేశ్వర కాళికాలయానికి రావడం తటస్థించింది.

శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తులైన రామచంద్ర దత్త, మనోమోహన్ మిత్ర, కేశవ్ ప్రచురిస్తున్న పత్రికలలో శ్రీరామకృష్ణులను గురించి చదివి, 1879వ సంవత్సరాంతాన, అంటే శ్రీరామకృష్ణ - కేశవ్‌ల మొదటి సమావేశం జరిగిన దాదాపు నాలుగేళ్ల తరువాత, శ్రీరామకృష్ణులను కలుసుకొన్నారు. ఈ విషయం మేం వారి ముఖతా విన్నాం. శ్రీ శ్రీరామకృష్ణ పరమహంస దేవెర్ జీవన్ వృత్తాంత అనే తన పుస్తకంలో, శ్రీరామకృష్ణుల సాంగత్య భాగ్యంతో తమ జీవితాలలో ఎలాంటి మహత్పరిణామాలు క్రమంగా చోటు చేసుకొన్నాయో రామచంద్ర దత్త వెల్లడించివున్నాడు. వాటిని ఇక్కడ పొందుపరచ నవసరం లేదు. శ్రీరామకృష్ణుల ఆదర్శమైన భగవత్సాక్షాత్కారార్థం పరిపూర్ణ కామినీకాంచన పరిత్యాగాన్ని వారు పూర్తిగా పాటించలేక పోయినప్పటికీ, ఆయన పట్లగల భక్తివిశ్వాసాల ప్రభావంలో ఆ పరిత్యాగ మార్గంలో వాళ్లు ఎంతో దూరం గమించగలిగారని మాత్రం చెప్పక తప్పదు. తన కష్టార్జితాన్ని ఒక సత్కార్యానికై ఖర్చు చేయడంలో ఒక గృహస్థ భక్తుని భక్తిశ్రద్ధల తీవ్రతను మనం గమనించవచ్చు.

రామచంద్ర దత్త

శ్రీరామకృష్ణులను మొదట తన గురుస్థానంలో, తదనంతరం తన ఇష్టదైవం స్థానంలో నిలుపుకొన్నాడు. రామచంద్రదత్త. కలకత్తా సిమ్లా పేటలోని తన ఇంటికి శ్రీరామకృష్ణులను, ఆయన భక్తులను ఉత్సవ సమయాలలో పదేపదే ఆహ్వానించి విరివిగా డబ్బు ఖర్చు పెట్టేవాడు. దీని నుండి ఆతడి భక్తివిశ్వాసాల ప్రగాఢతను మనం సులభంగా గ్రహించవచ్చు. తరచు శ్రీరామకృష్ణులు రామ చంద్ర దత్త గురించి ఇలా చెప్పేవారు: ''ఇప్పుడు రామచంద్ర ఎంత ఉదారుడో మీరు చూస్తున్నారు. మొదట్లో అతడు ఇక్కడకు వచ్చినప్పుడు ఎంత పిసినారిగా ఉండేవాడో మీకు తెలియదు. ఏలక్కాయలు తెమ్మని అతణ్ణే అడిగాను. ఒక రోజు అతడు ఒక పైస ఏలక్కాయలు నా ముందు పెట్టి, నమస్కరించాడు. అతడి స్వభావంలో ఇప్పుడు ఎంతటి మార్పు వచ్చిందో ఈ సంఘటన నుండి మీరు ఊహించవచ్చు.''

7. శ్రీరామకృష్ణుల అద్భుత దర్శనం : రాఖాల్ రావడం

శ్రీరామకృష్ణుల అనుగ్రహం పొంది ఆయన పాదారవిందాలను ఆశ్రయించి శాశ్వతంగా సమస్త భయాందోళనల నుండి విముక్తులైన రామచంద్ర, మనోమోహన్‌లు ఎంతటి ధన్యులో మాటల్లో చెప్పనలవి కాదు. సంసారంలో ఉంటూ అటువంటి శరణాగతి దక్కుతుందని వాళ్ళు కలలో కూడా ఊహించి ఉండ రనడం అతిశయోక్తి కాదు! ఈ పరిస్థితుల్లో వాళ్ళు తమ బంధుమిత్రులను తాము శరణాగతి పొందిన చోటుకు తోడ్కొని రావడంలో వింత ఏమీ లేదు. అనతికాలంలోనే వాళ్ళ కుటుంబాలూ, ఇతర బంధువులూ శ్రీరామ కృష్ణుల దర్శనార్థం రాసాగారు. ఈ విధంగా 1881వ సంవత్సరాంతం నుండి సర్వసంగ పరిత్యాగులూ, శ్రీరామకృష్ణుల లీలలో పాత్రధారులూ అయిన భక్తులు ఆయన వద్దకు రావడం ప్రారంభించారు. ఆ కోవకు చెందిన వారిలో శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన ప్రథముడు స్వామి బ్రహ్మానంద. సన్న్యాసాశ్రమానికి పూర్వం అతడి పేరు రాఖాల్‌చంద్ర. అతడు మనోమోహన్ సోదరిని వివాహం చేసు

రాఖాల్
(స్వామి బ్రహ్మానంద)

న్నాడు; తన అత్తగారి కుటుంబం నుండే అతడు మొదటిసారి శ్రీరామ కృష్ణుల గురించి విన్నాడు. తన వివాహం జరిగిన కొద్దికాలంలోనే అతడు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చాడు. శ్రీరామకృష్ణులు ఇలా చెబుతూవుండేవారు: "రాఖాల్ నా వద్దకు రాకపూర్వం, ఒక దివ్యదర్శనంలో జగజ్జనని హఠాత్తుగా ఒక బాలుణ్ణి తీసుకువచ్చి నా ఒళ్లో కూర్చోపెట్టి, 'నీ కుమారుడు' అని చెప్పింది; ఆ మాట విని నేను భయంతో ఉలిక్కిపడ్డాను. 'అదెలా? నా కెలా కుమారుడు జన్మిస్తాడు?' అని ఆరాటంతో ఆమెను అడిగాను. ఆమె నవ్వి, 'అతడు సాధారణ లౌకిక రీతిలో కలిగిన కుమారుడు కాదు; నీ ఆధ్యాత్మిక తనయుడు' అని వివరించింది. అప్పుడు నా మనస్సు కుదుటపడింది. ఆ దివ్యదర్శనం కలిగిన స్వల్పకాలంలోనే రాఖాల్ వచ్చాడు; అతడే ఆ బాలుడని తక్షణమే నేను గుర్తించాను.''

మరో సందర్భంలో శ్రీరామకృష్ణులు, రాఖాల్ గురించి మాతో ఇలా చెప్పారు: '' ఆ రోజుల్లో రాఖాల్ మూడు నాలుగేళ్ల పసిబాలుని స్వభావం కలిగి ఉండేవాడు. నన్ను తన తల్లిలా భావించేవాడు. అప్పుడప్పుడు పరుగున ఆనందంగా వచ్చి నిస్సంకోచంగా నా ఒళ్లో కూర్చునేవాడు. ఇంటికి వెళ్లడం మాట అటుంచి, నా ఒళ్లో నుండి కదనుకూడా కదిలేవాడు కాదు. అతణ్ణి ఇంటికి వెళ్లిరమ్మని బలవంతపెట్టేవాణ్ణి; అతడు ఇంటికి వెళ్లకపోతే అతడి తండ్రి ఇక్కడికి అతణ్ణి ఇకమీదట అసలు పంపడేమోనని నా భయం. అతడి తండ్రి సంపన్నుడైన జమీందారు, అదే సమయంలో పిసినారికూడా. తన కుమారుణ్ణి ఇక్కడకు రానివ్వకుండా మొదట్లో ఎంతో ప్రయత్నించాడు. తరువాత పలువురు సంపన్నులూ, విద్యావంతులూ ఇక్కడకు రావడం తెలుసుకొని, తన కుమారుడు ఇక్కడకు రావడంలో ఎలాంటి ఆక్షేపణా తెలుపలేదు. కొన్ని సందర్భాలలో తన కుమారుణ్ణి కలుసుకోవడానికి ఆతడే ఇక్కడకు వచ్చేవాడు. రాఖాల్ నిమిత్తం ఆతడిపట్ల నే నెంతో శ్రద్ధ కనబరిచేవాణ్ణి; దాంతో అత డెంతో ప్రసన్నుడయ్యేవాడు.

8. రాఖాల్ బాలక స్వభావం

''కాని ఆతడి అత్తగారి కుటుంబం వారు ఆతడి రాకపట్ల ఎన్నడూ ఎలాటి అభ్యంతరమూ చెప్పలేదు. మనోమోహన్ తల్లి, సోదరి అందరూ తరచు ఇక్కడకు రావడమే అందుకు కారణం. ఒక రోజు, రాఖాల్ ఇక్కడకు రావడం ప్రారంభించిన మొదట్లో, మనోమోహన్ తల్లి, రాఖాల్ భార్యను తోడ్కొని ఇక్కడకు వచ్చింది. రాఖాల్ దైవభక్తికి ఆతడి భార్య అడ్డంగా నిలుస్తుందేమోనని ఆరాటం చెందాను. ఆమె ముఖకవళికలను, భౌతిక లక్షణాలను సునిశితంగా పరిశీలిం

9. రాఖాల్ భార్య

చాక, నా ఆరాటానికి అర్థం లేదని తెలుసుకొన్నాను. శక్త్యంశ ఆమెలో కాన రావడం వలన తన భర్త భగవత్సాక్షాత్కార మార్గానికి ఆమె ఎలాటి అంత రాయం కలిగించదని గ్రహించి, సంప్రీతుడనైనాను. వెంటనే నహబత్‌కు (మాతృదేవికి) కోడలికి ఒక రూపాయి కానుక ఇచ్చి, ఆమె మేలి ముసుగు ధరించిన ముఖాన్ని[1] తిలకించమని కబురు చేశాను.

''నా సాంగత్యంలో ఉంటున్నప్పుడు అతడికి కలిగే ఆనందపారవశ్య బాలక స్వభావాన్ని వర్ణించడం అసాధ్యం; అతడు దాన్లో తన్మయుడైపోయే వాడు. అప్పు డతణ్ణి చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్య చకితు లయ్యేవారు. ఆధ్యాత్మిక భావోద్వేగ స్ఫూర్తిలో నేనుకూడా అతడికి జున్ను, వెన్న తినిపించి ఆతడి ముచ్చట్లలో పాల్గొని ఆతణ్ణి ఉత్సాహపరిచేవాణ్ణి. అనేక సందర్భాలలో అతణ్ణి నా భుజాలమీద కూర్చోబెట్టుకొనేవాణ్ణి. అలా చేయడంలో నేను కించిత్తు కూడా సంశయించేవాణ్ణి కాను. కాని అప్పుడే, అక్కడే, 'అతడు ఎదిగి భార్య సహచర్యంలో జీవించసాగినప్పుడు, ఆ బాలక స్వభావం అంతరించిపోతుంది' అని చెప్పేవాణ్ణి.

10. బాలక స్వభావాన్ని రాఖాల్ ఎలా కోల్పోతాడు

''పొరపాటు చేసినప్పుడు అతణ్ణి నేను తిట్టడం కద్దు. ఒక రోజు అతడు ఎంతో ఆకలి వేయడంతో కాళికాలయం నుండి వెన్న, ప్రసాదాలను తన చేతులతో తీసుకొని తినివేశాడు. అది చూసి నేను 'ఎంత పేరాశ! పేరాశను అణచుకోవడానికి బదులుగా, నీ చేత్తో వెన్న తీసుకొని తినేశావు; ఈ విషయం ఇక్కడ నుండి (తమ నుండి) నేర్చుకొని ఉండాలి!' అని అన్నాను. అతడు భయంతో కుంచించుకు పోయాడు; మళ్లీ ఎన్నడూ అలా ప్రవర్తించలేదు.

11. రాఖాల్‌ను, శ్రీరామకృష్ణులు తిట్టడం

''అప్పుడు రాఖాల్‌లో పిల్లలలో ఉండే ఈర్ష్యకూడా ఉండేది. అది నాకు దుర్భరమైంది; అతణ్ణి తప్ప నే నెవరినీ ప్రేమించింది లేదు కదా! అది తెలిస్తే అతడి మనస్సు గాయపడు తుంది. జగజ్జనని ఇక్కడకు తోడ్కొని వచ్చిన వారిని చూసి అతడు అసూయపడి తనకు హాని తలపెట్టు కొంటాడేమోనని నే నెంతో ఆందోళనపడ్డాను.

12. రాఖాల్ మనస్సులో ఈర్ష్య : శ్రీరామకృష్ణుల భయ సంశయాలు

---

1. క్రొత్తగా వచ్చిన కోడలి మేలిముసుగు ధరించిన ముఖాన్ని అత్తగారు ఆ విధంగా తిలకించడం వంగదేశ ఆచారం. మొదట కోడలికి సామాన్యంగా కొంత డబ్బు కానుకగా ఇచ్చి, తరువాత మేలిముసుగును నెమ్మదిగా తొలగించి, ఆమె ముఖాన్ని తిలకించి, ముద్దుపెట్టు కోవడం ఆనవాయితీ.

13. రాఖాల్ బృందావనానికి వెళ్లడం

''ఇక్కడకు వచ్చిన మూడేళ్ల తరువాత రాఖాల్ జబ్బుపడ్డాడు; బలరాంతో కలిసి అతడు బృందావనానికి వెళ్లాడు. అతణ్ణి ఇక్కడ నుండి జగజ్జనని తీసుకుపోతున్నట్లు, అంతకు కొద్దికాలం మునుపు ఒక దివ్యదర్శనంలో చూశాను. అప్పుడు ఆమెను, 'తల్లీ, అతడు (రాఖల్) కేవలం బాలుడు, అజ్ఞాని; అందుకే అతడు కొన్ని సమయాలలో కుపితుడౌతాడు. నీ కార్యం నిమిత్తం అతణ్ణి ఇక్కడ నుండి తీసుకొనిపోయివుంటే, అతణ్ణి మంచి చోట, ఆనందప్రద భావంలో నెలకొని ఉండేలా చూడు' అని ప్రార్థించాను. ఆ తరువాత అనతికాలంలోనే అతడు బృందావనానికి వెళ్లాడు.

14. రాఖాల్ అస్వస్థత గురించి విని శ్రీరామకృష్ణుల భయోద్రేకం

''బృందావనంలో రాఖాల్ అస్వస్థుడైనాడని వినగానే నేను పడ్డ ఆరాటం అంతా ఇంతా కాదు. ఎందుకంటే, నిజానికి రాఖాల్ వ్రజభూమికి చెందిన గోపాలకుడని జగజ్జనని ఇంతకు మునుపే దర్శింపచేసింది. తాను ఎక్కడ నుండి దేహాన్ని ధరించి వచ్చాడో మళ్లీ అక్కడికి వెళితే తన గత జన్మ జ్ఞాపకానికి వచ్చి, దేహపరిత్యాగం చేసే ఆస్కారం ఎంతో ఉంటుంది. అందుకే అత డెక్కడ బృందావనంలో మరణిస్తాడోనని నేను భయపడ్డాను. కాబట్టే వ్యాకులతతో జగజ్జననిని ప్రార్థించాను; ఆమె అలా జరగదని అభయమిచ్చి, నన్ను ఊరడించింది. రాఖాల్ గురించి అమ్మ నా కెన్నో విషయాలు దర్శింపచేసింది. వాటిలో అనేకం నేను వెల్లడించరాదు.''[1]

15. రాఖాల్ తదుపరి జీవితం

తమ ప్రప్రథమ యువభక్తుని గురించి శ్రీరామకృష్ణులు వివిధ సందర్భాలలో చెప్పిన విషయాలకు అంతే లేదు. జగజ్జనని అతణ్ణి గురించి దర్శింపచేసింది యథాతథంగా ఋజువైంది. వయస్సు పెరిగేకొద్దీ భగవత్సాక్షాత్కారార్థం సర్వసంగపరిత్యాగం చేసి అతడు ఉత్కృష్ట సాధకుల కోవలోకి చేరాడు. ఇప్పుడు ఆ బాలుడు శ్రీరామకృష్ణ సంప్రదాయంలో అత్యున్నత స్థానాన్ని అలంకరించాడు. శ్రీరామకృష్ణుల సంకల్పంతో ఇప్పటిదాకా స్వామి బ్రహ్మానంద మానవాళికి మహోపకారం చేస్తూనే వచ్చాడు.[2]

---

1. పైన పేర్కొన్నట్లు అన్ని విషయాలు శ్రీరామకృష్ణులు ఒకే సందర్భంలో వెల్లడించకపోయినా అనుకూలతకోసం వాటిని మేం ఇక్కడ పొందుపరుస్తున్నాం.

2. బ్రహ్మానంద స్వామి 1922లో పరమపదించారు.

మరిన్ని విషయాలు ఆయనను గురించి చెప్పరాదనే ఉద్దేశంతో మేం ఇక్కడితో ఆ ప్రస్తావన ఆపివేస్తున్నాం.[1]

బ్రహ్మానందస్వామి మొట్టమొదటిసారి శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన మూడు లేక నాలుగు నెలల తరువాత వివేకానందస్వామి గురుదేవుల వద్దకు వచ్చాడు. ఆయన జీవితంలో ముడివడివున్న సంఘటనలను ఇకపై వివరించ బోతున్నాం.

---

1. బ్రహ్మానంద స్వామి గురించి ఈ రచయిత అనేక విషయాలు తెలుపాలనుకొన్నారు; కాని బ్రహ్మానందస్వామి గతజన్మ సంఘటనలూ, మరికొన్ని గోప్య విషయాలూ ఆయనకు (బ్రహ్మానందస్వామికి) వెల్లడించరాదని శ్రీరామకృష్ణుల నిషేధం ప్రేమానందస్వామి గుర్తు చేయ డంతో, రచయిత అందుకు పూనుకోలేదు. కాబట్టి అనేక విషయాలు లోకానికి తెలియ కుండానే, మరుగునపడిపోయాయి.

3. నరేంద్రుని పుట్టుపూర్వోత్తరాలు - ఆతడి దక్షిణేశ్వర రాక

బ్రహ్మజ్ఞాని సర్వజ్ఞుడని వేదాలూ, ఇతర శాస్త్రగ్రంథాలూ వచిస్తున్నాయి.

1. దివ్యభావంలో శ్రీరామకృష్ణులు

బ్రహ్మజ్ఞానంలో సుప్రతిష్ఠితులైన శ్రీరామకృష్ణుల ప్రవర్త
నను చూసినప్పుడు పై శాస్త్రవచనం రూఢీ అవుతుంది.
ఎందుకంటే ఆయన బ్రహ్మం, బ్రహ్మశక్తియైన మాయ యొక్క నిత్యం, లీల
లతో సుపరిచితులవడమే కాక, సమస్త సంశయాలకూ కళంకాలకూ అతీత
మైన పరమానంద స్థితిలో ఓలలాడుతున్నారు. జగజ్జననితో అభిన్నత పొందు
తూన్న భావముఖ స్థితిలో సుప్రతిష్ఠితులై ఉండడం వలన, కోరుకొన్న తక్ష
ణమే ఆయన మాయాజగత్తులోని ఏ మర్మాన్నైనా ఇట్టే గ్రహించగలిగేవారు.
ఆయన మనోనేత్రం నుండి మాయ తన స్వభావాన్ని ఇక ఏమాత్రం దాచి
ంచలేకపోయింది. ఎందుకంటే మాయ మేలిముసుగును చొచ్చుకొనిపోయే
ాత్మదృష్టి ఆయన మనోనేత్రం సంతరించుకొంది కనుక. స్వభావసిద్ధంగా
స్తే అంతేకదా! ఎందుకంటే భావముఖం, విశ్వభావనలు కొన్ని సమయా
అభివ్యక్తమయ్యే, కొన్ని సమయాల్లో అభివ్యక్తం కాని మాయాతీతుడైన
్వరుని విశ్వమానసం - ఈ రెండూ ఒక్కటే కదా! విశ్వమానసంలో
ఖుంచే భావాలన్నీ, తన చిన్ని-అహం తత్త్వ పరిధిని అధిగమించి విశ్వ-
ంతో తాదాత్మ్యం చెందిన వ్యక్తి కళ్లెదుట స్పష్టంగా కనిపిస్తాయి. ఆ స్థితిని
న్నారు కాబట్టే శ్రీరామకృష్ణులు, తమ భక్తులు తమ వద్దకు రాక
మే వారి గత జన్మలలో జరిగిన సంఘటన లన్నిటినీ తెలుసుకోగలిగారు.
ానస ఒక ఫలానా ప్రత్యేక లీలను ఆయన తెలుసుకోగలరు; ఎందుకంటే
అభివ్యక్తీకరణకు ఈ ప్రస్తుత దేహం దాల్చింది తానే కనుక. ఆ లీలలో

పాల్గొనడానికి భగవత్సంకల్పానుసారం కొందరు ఉత్కృష్ట కోవకు చెందిన సాధకులు జన్మించారనీ ఆయనకు తెలుసు. ఆ లీల అభివ్యక్తీకరణలో ఎవరు ఎక్కువగా దోహదం చేస్తారో, ఎవరు తక్కువగా చేస్తారో కూడా ఆయనకు తెలియని విషయం కాదు; అంతేకాదు తద్ద్వారా ఎవరు లబ్ధి పొంది, ఈ జీవితంలోనే పరిపూర్ణత్వాన్ని పొందగలరో కూడా ఆయనకు తెలుసు. వారు వచ్చే సమయం దగ్గర పడిందని తెలిసి, వారి కోసం ఆతురతతో ఆయన ఎదురు చూడసాగారు. మాయారాజ్యంలో జీవిస్తూ, దాని మర్మాలన్నీ ఎరిగిన వ్యక్తిని సర్వజ్ఞుడని కాక మరెలా పరిగణించాలి?

2. సురేంద్రుని ఇంట్లో శ్రీరామకృష్ణ నరేంద్రుల ప్రథమ సమావేశం

శ్రీరామకృష్ణ వివేకానందుల ప్రథమ సమావేశం గురించి కాస్త పరికించి చూస్తే దివ్యభావంలో నెలకొనివున్న శ్రీరామకృష్ణులు, తాము దివ్యదర్శనాలలో గుర్తించిన భక్తులకై ఎలా తహతహతో ఎదురుచూస్తూన్నారో తెలుసుకోవచ్చు. తాను దక్షిణేశ్వరానికి మొదటి సారి వెళ్లిన సమయంలోనే కలకత్తాలోని సిమ్లా పేట వాస్తవ్యుడు సురేంద్రనాథ్ మిత్రకూడ అక్కడకు వచ్చినట్లు బ్రహ్మానందస్వామి తెలిపివున్నాడు. సురేంద్ర స్వల్పకాలంలోనే శ్రీరామకృష్ణులకు బాగా చేరువయ్యాడు; శ్రీరామకృష్ణులను తన ఇంటికి తోడ్కొని వెళ్లి ఆనందంగా ఉత్సవ వేడుకలు జరిపించాడు. ఆ సందర్భంలో మంచి గాయకుడు ఎవరూ లభించనందున, తన పొరుగింటి విశ్వనాథ దత్త కుమారుడైన నరేంద్రుణ్ణే ఉత్సవంలో పాల్గొని భక్తిగీతాలు, ముఖ్యంగా శ్రీరామకృష్ణులు ముగ్ధులయ్యేలా పాడమని సాదరంగా ఆహ్వానించాడు. శ్రీరామకృష్ణుల దివ్యలీలలో ప్రధాన పాత్రధారియైన వివేకానందస్వామి, శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా కలుసుకోవడం ఆ విధంగా జరిగింది. ఈ సంఘటన బహుశ 1881 నవంబర్ నెలలో జరిగివుండవచ్చు. అప్పుడు నరేంద్రుని వయస్సు పద్దెనిమిదేళ్లు, కలకత్తా విశ్వవిద్యాలయ ఎఫ్.ఏ. పరీక్షలకు అప్పుడు సిద్ధమౌతున్నాడు.

3. నరేంద్రుణ్ణి దక్షిణేశ్వరానికి రమ్మని శ్రీరామకృష్ణులు ఆహ్వానించడం

ఆ రోజు నరేంద్రుణ్ణి చూసినప్పటి నుండి శ్రీరామకృష్ణులు అతడి పట్ల అమిత ఆకర్షితులైనట్లు తాను స్పష్టంగా భావించినట్లు బ్రహ్మానందస్వామి చెప్పేవాడు. ఎందుకంటే శ్రీరామకృష్ణులు మొదట సురేంద్రను, పిదప రామచంద్రను పిలిచి మధురస్వరంలో పాడిన ఆ యువగాయకుణ్ణి గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అంతేకాక పాట పూర్తికాగానే ఆ యువకుడి వద్దకు స్వయంగా ఆయనే వెళ్లి అతడి ముఖకవళికలను జాగ్రత్తగా గమ

నిస్తూ ఒకటి రెండు మాటలు అతడితో మాట్లాడి, త్వరలో ఒకసారి దక్షిణేశ్వరానికి రమ్మని ఆహ్వానించారు కూడా.

ఈ సంఘటన జరిగిన కొన్ని వారాల తరువాత కలకత్తా విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎఫ్.ఏ. పరీక్షలు ముగిశాయి. కలకత్తా వాస్తవ్యుడైన ఒక పెద్ద

4. దక్షిణేశ్వరానికి నరేంద్రుడు మొదటి సారి వెళ్లడం

మనిషి విన్నపం మేరకు నరేంద్రుని తండ్రి, ఆ పెద్దమనిషి కుమార్తెతో నరేంద్రుని వివాహం జరిపించడానికి ఏర్పాట్లు చేయసాగాడు. వధువు కాస్త నల్లగా ఉండడం వలన, ఆమె తండ్రి పదివేల రూపాయలు కట్నం ఇవ్వడానికి అంగీకరించాడు. నరేంద్రుని బంధువులు, రామచంద్రదత్త ఆధ్వర్యంలో ఆ వివాహానికి సమ్మ

పశ్చిమవైపు తలుపు, అర్ధచంద్రాకార మొగసాల

తించమని నరేంద్రునికి నచ్చచెప్ప ప్రయత్నించారు. కాని నరేంద్రుడు తీవ్ర అభ్యంతరం తెలపడంతో ఆ వివాహం జరగలేదు. రామచంద్ర, నరేంద్రుని తండ్రికి చాలాదగ్గరి బంధువు. అతడు, నరేంద్రుని తండ్రి ఇంట్లో పెరిగాడు; ఆ సమయంలో కలకత్తాలో వైద్యవృత్తిలో ఉంటున్నాడు. ఆధ్యాత్మిక జ్ఞానోదయ మార్గాన్వేషణ కారణంగా నరేంద్రుడు వివాహానికి సమ్మతించలేదని రామచంద్ర తెలుసుకొని, అతడితో ఇలా అన్నాడు: ''భగవత్సాక్షాత్కారం పట్ల నీకు నిజమైన అభిలాషే ఉంటే, బ్రహ్మసమాజం తదితర చోట్లకు వెళ్లడానికి బదులు దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లు.'' ఇదే సమయంలో ఒక రోజు సురేంద్ర తనతో బండిలో దక్షిణేశ్వరానికి రమ్మని నరేంద్రుణ్ణి ఆహ్వానించాడు. నరేంద్రుడు అందుకు సమ్మతించాడు. ఇద్దరు ముగ్గురు మిత్రులతో, సురేంద్ర వెంట దక్షిణేశ్వరం వెళ్లాడు.

ఆ సందర్భంలో నరేంద్రుణ్ణి చూసినప్పుడు ఆయనలో కలిగిన ఆలోచనలను శ్రీరామకృష్ణులు మాటల సందర్భంలో క్లుప్తంగా మాతో ఇలా చెప్పారు:

5. నరేంద్రుణ్ణి గురించి శ్రీరామకృష్ణుల ఆలోచనలు

''ఆ రోజు నరేన్ పశ్చిమద్వారం (గంగకు అభిముఖంగా ఉన్న) గుండా ఈ గదిలోకి వచ్చాడు. తన శరీరం గురించి శ్రద్ధ వహిస్తున్నట్లుగా కనిపించలేదు. జుట్టు దువ్వుకోలేదు, బట్టలు నలిగి ఉన్నాయి. బాహ్యాలంకరణ పట్ల ఇతరులలా అతడికి శ్రద్ధ ఉన్నట్లు లేదు. దేనిపట్లా అనురక్తి కనిపించలేదు. మనస్సు దాదాపు అంతర్ముఖమై ఉన్నట్లు అతడి కళ్లు సూచించాయి. ఇదంతా చూసి నేను, 'సత్త్వగుణం సమృద్ధంగా ఉన్న ఈ గొప్ప ఆధ్యాత్మిక సాధకుడు లౌకికుల నెలవైన కలకత్తాలో జీవిస్తూవుండడం సాధ్యమేనా?' అనుకొని ఆశ్చర్యపోయాను.''

''నేలమీద పరుప పరిచివుంది. దానిమీద అతణ్ణి కూర్చోమన్నాను. గంగాజలం ఉన్న కూజా ప్రక్కన అతడు కూర్చున్నాడు. అతడి పరిచయస్థులు కొందరు కూడా ఆ రోజు అతడితో కలిసివచ్చారు. వాళ్ల స్వభావంలో అతడికి విరుద్ధంగా, సాధారణ లౌకికులలా నాకు కనిపించారు. వాళ్ల దృష్టి సుఖభోగాల పైనే ఉంది.

''వాకబు చేయగా అతడు రెండు మూడు బెంగాలీ పాటలు మాత్రమే నేర్చుకొన్నట్లు తెలిసింది. వాటిని పాడమని అడిగాను. అతడు బ్రహ్మసమాజ గీతం పాడనారంభించాడు:

మరలు మనస మన నిజ నికేతనంబునకు
　　మారువేషముల దాల్చి
　　పరదేశపు ఈ భువిలో

వ్యర్థముగా ద్రిమ్మదిరుగు
చుండనేల మన మిచట? ॥ మ ॥

వరులు సకల ప్రాణతతులు
పంచమహాభూతములును
గారొక్కరు నీవారలు
వారెల్ల పరాయివారు ॥ మ ॥

పరవారల ప్రేమలోబడి
మరతువు నిన్నేల మనస
నీ వారల నా రీతిని
ఏల మరచుచున్నావు? ॥ మ ॥

సరి మార్గము గనపరచెడు
కరదీపిక ప్రేమజ్యోతి
ధరియించుచు అధిరోహణ
మొనరింపుము సత్యపథము ॥ మ ॥

నీ దారిన బత్తెముగా
నీ సుగుణములను తెమ్ము
పరుల కంటబడనీయక
భద్రముగా వాని దాచి ॥ మ ॥

ఇరువురు దారిని దోచెడు
దొంగలవలె లోభ మోహ
మనువారలు నీ సంపద
గొనిపోవగ దాగినారు ॥ మ ॥

అనవరతము నిన్నాపద
దరిజేరక రక్షించెడు
శమదమ మను రక్షక
భటవర్గము వెంటగొనుము ॥ మ ॥

సత్పురుషుల సాంగత్యము
స్వాగతమొసగెడు సత్రము
అలసిన నీ అవయవముల
నిట విశ్రాంతిని గొననిమ్ము ॥ మ ॥

సంశయమేదైన నీకు
బొడసూపినచో నప్పట
సత్రపు సంరక్షకుని
సరిమార్గము నరసికొనుము ॥ మ ॥

దారిలో భయమేర్పడిన
ఈశ్వరు నెలుగెత్తి పిలువు
ఆ దారికి ప్రభుడతడు
మృత్యువు సైతము మ్రొక్కును ॥ మ ॥

ధ్యాన స్థితిలో ఉన్నట్లు అతడు తన మనస్సును హృదయాన్ని లయం చేసి ఆ పాటను గానం చేశాడు. ఆ పాట వినగానే, నన్ను నేను అదుపులో ఉంచుకోలేకపోయాను, భావపారవశ్యంలో మునిగిపోయాను.

''అతడు సెలవు పుచ్చుకొని వెళ్లిపోయాక, ఇరవై నాలుగు గంటలూ అతణ్ణి మళ్లీ చూడగోరి నేను తపించిపోయాను. ఆ తపనను మాటల్లో వర్ణించలేను. తడి తువ్వాలును పిండుతున్నట్లు నా హృదయాన్ని పిండివేస్తున్న బాధను తరచు అనుభవించసాగాను. నన్ను నేను అదుపులో ఉంచుకోలేక దక్షిణేశ్వర ఉద్యానానికి ఉత్తరాన ఉన్న దేవదారు వృక్షాల వైపుకు పరుగెత్తికెళ్లేవాణ్ణి; సామాన్యంగా అక్కడ జనం ఎవరూ సంచరించరు. అక్కడకు పోయి బిగ్గరగా విలపిస్తూ, ''నాయనా! రా, నిన్ను చూడకుండా ఉండలేకపోతున్నాను' అని పలికేవాణ్ణి. అలా కాసేపు విలపించిన తరువాతే, నా ఆరాటం కాస్త ఉపశమించేది. ఈ విధంగా ఆరు నెలలపాటు కొనసాగింది. ఇతర బాలురకోసం కూడా కొన్ని సమయాలలో నా మనస్సు ఆరాటపడిన విషయం నిజమే. కాని నరేన్‌కై నేను పడిన తాపత్రయంతో పోలిస్తే ఈ ఆరాటం అంతంత మాత్రమే.''

6. నరేంద్రుణ్ణి చూడగోరి శ్రీరామకృష్ణులు తపించిపోవడం

దక్షిణేశ్వరంలో మొదటిసారి నరేంద్రుణ్ణి చూసినప్పుడు తమ మనస్సులో జనించిన అసాధారణ భావోద్వేగాలను గురించిన చాలా విషయాలు ఆయన మానుంచి దాచివుంచారని మాకు ఆ తరువాత తెలియవచ్చింది. ఆ విషయాల గురించి ఆయన మాతో కొంత ముభావంగానే మాట్లాడారు. ఆ సందర్భం గురించి ముచ్చటిస్తున్నప్పుడు ఒక రోజు నరేంద్రుడు మాతో ఇలా చెప్పాడు: ''నేను పాడడం ముగించాను. వెంటనే శ్రీరామకృష్ణులు లేచి నిలబడి, తమ చేయి నా మీద వేసి, నన్ను ఉత్తరం వైపు వసారాలోకి

7. శ్రీరామకృష్ణులతో జరిగిన తన ప్రథమ సమావేశం గురించి నరేంద్రుడు

ఉత్తరం వైపు వసారా

తోడ్కొని వెళ్లారు. అది శీతకాలం. ఉత్తరం వైపు నుండి వచ్చే చలిగాలి గదిలోకి రాకుండా వసారా స్తంభాల మధ్య చాపలు దించివుంచారు. కాబట్టి వసారాలోకి వచ్చి, గది తలుపు మూసివేస్తే బయటి నుండి లేదా గదిలో నుండి వసారాలో ఏం జరుగుతూన్నదో ఎవరికీ కనిపించదు. వసారాలోకి రాగానే శ్రీరామకృష్ణులు గది తలుపు మూసివేశారు. వ్యక్తిగతంగా నా కేదో ఉపదేశించబోతారను కొన్నాను. కాని ఆయన చెప్పింది, చేసింది ఊహాతీతం. హఠాత్తుగా ఆయన నా చేయి పుచ్చుకొన్నారు; ఆయన కళ్లవెంట ఆనందాశ్రువులు ధారగా స్రవిస్తు న్నాయి. ఆప్యాయత ఉట్టిపడే కంఠస్వరంలో ఆయన నాతో ఇలా అన్నారు: 'ఇంత ఆలశ్యంగా నువ్వు రావడం న్యాయమేనా? నీ కోసం నే నెంత పరితపిస్తూ ఎదురుచూస్తూన్నానో ఒకసారన్నా ఆలోచించావా? ఈ లౌకికుల ఉబుసుపోక కబుర్లు వినీవినీ నా చెవులు తూట్లు పడిపోయాయి. నా అంతరాంతర భావ నలను పంచుకోవడానికి ఎవరూ లేనందున, నా హృదయం పగిలిపోయే స్థితికి వచ్చింది.' ఇలా అసంబద్ధంగా మాట్లాడుతూ విలపించసాగారు. మరుక్షణమే నా ముందు నిలబడి భగవంతునికి భక్తిచెల్లించే తీరులో చేతులు జోడించు

కొని, ఇలా అన్నారు: 'నాకు తెలుసు ప్రభూ! సనాతన నరనారాయణ ఋషు లలో నువ్వు నరుడవని నే నెరుగుదును. నువ్వు మానవాళి కష్టాలను దుఃఖా లను బాప, ఈ రూపంలో ఇప్పుడు అవతరించావు.'

''నేను విస్తుబోయి ఇలా అనుకొన్నాను: 'ఎవరిని చూడడానికి వచ్చాను? ఈయన, పూర్తిగా పిచ్చివాడు. లేకుంటే విశ్వనాథ దత్త కుమారుడనైన నాతో

8. మళ్లీ వస్తానని నరేంద్రుడు వాగ్దానం చేయడం

ఈ ధోరణిలో మాట్లాడతారా?' అయినప్పటికీ నేను మౌనంగా ఉండిపోయాను. ఆ పిచ్చివ్యక్తి తన ధోరణిలో తాను మాట్లాడసాగాడు. మరుక్షణమే ఆయన నన్నక్కడ ఉండమని, తను గదిలోకి వెళ్లాడు. వచ్చేటప్పుడు వెన్న, పటికబెల్లం, సందేశ్ తీసుకువచ్చి స్వయంగా తన చేత్తో నాకు తినిపించసాగారు. ఆ తినుబండారాలను నా చేతికిస్తే, నా మిత్రులతో కలిసి తింటానని ఎంత చెప్పినా ఆయన వినిపించు కోలేదు. 'వాళ్లు తరువాత తింటారులే! ముందు వీటిని నువ్వు తిను' అన్నారు. ఇలా అంటూ మొత్తం తీపి తినుబండారాలను నాకు తినిపించే వరకు ఆయన తృప్తిచెందలేదు. ఆ తరువాత నా చేయి పుచ్చుకొని, 'త్వరలోనే మళ్లీ ఇక్కడకు ఒంటరిగా వస్తానని వాగ్దానం చెయ్యి' అని అన్నారు. అలా ఆయన ప్రాధేయ పడడం చూసి 'వస్తా'నని వాగ్దానం చేశాను. తరువాత ఆయనతోకూడా గదిలోకి వెళ్లి, నా సహచరుల ప్రక్కన కూర్చున్నాను.

''ఆయనను జాగ్రత్తగా గమనించసాగాను. ఇతరులతో ఆయన మాట్లాడే టప్పుడుగాని, వ్యవహరించేటప్పుడుగాని ఆయన వైఖరిలో నా కెలాంటి పిచ్చి

9. శ్రీరామకృష్ణుల గురించి నరేంద్రుని తొలి అభిప్రాయం

తనమూ కనిపించలేదు. ఆయన చక్కటి మాటలు, భావపారవశ్యం నన్ను ఆకట్టుకొన్నాయి; భగవంతునికై సమస్తం త్యజించిన ఈ వ్యక్తి యథార్థమైన పరిత్యాగి అనీ, చెప్పిందే అనుష్ఠిస్తారనీ నేను భావించాను. 'మిమ్మల్ని చూస్తూన్నట్లు, మీతో మాట్లాడుతూన్నట్లుగానే భగవంతుణ్ణి దర్శించవచ్చు, ఆయనతో మాట్లాడ వచ్చు; కాని అలా చేయాలని ఎవరు అనుకొంటారు? జనం భార్యాపుత్రులు మరణించినప్పుడు కడవలకొద్దీ కన్నీరు స్రవించేలా విలపిస్తారు; ధనం, సంప దలకై కూడా అదే రీతిలో ప్రవర్తిస్తారు. భగవత్సాక్షాత్కారం లభించలేదని విల పించే దెవరు? భగవంతుణ్ణి నిజంగా ప్రార్థిస్తూ ఆయనకై వ్యాకులత చెందేవారికి ఆయన తప్పక సాక్షాత్కరిస్తాడు.' ఆయన ఈ వచనాలు విన్నప్పుడు, ఇవి కేవలం కావ్యాలంకారంతో కూడుకొన్న ఇతర మతప్రచారకులు చేసే ప్రసంగ పంక్తులు కావని గ్రహించాను. అవి భగవంతునికై సర్వసంగపరిత్యాగం చేసి సంత

బ్రహ్మం ఉనికిని ఇట్టే విశ్వసించడంలో అతడు సంతృప్తి చెందడు. గత జన్మల

11. బ్రహ్మసమాజంతో నరేంద్రుని సంబంధం

ఆధ్యాత్మిక సంస్కారాల ప్రోద్బలం వలన నిజంగా భగవంతుడు ఉండివుంటే, పరమ వ్యాకులతతో ఆరాటపడే వ్యక్తికి ఆయన ఎన్నటికీ తన స్వకీయ స్వభావాన్ని దాచి వుంచడు, అది కనుగొనడానికి తప్పక ఏదో ఒక మార్గం ఆవిష్కరించే ఉంటాడని ఆతడి హృదయం సతతం తెలియచేస్తూనే ఉంది. భగవత్సాక్షాత్కారార్థం అన్వేషణ చేయని జీవితం భారమూ, వెట్టిచాకిరీ చేయడంతో సమానమూ అవుతుందని అతడికి స్ఫురించింది. ఒకసారి అతడు మాతో ఇలా చెప్పినట్లు మాకు స్పష్టంగా గుర్తుంది:

''యౌవనావస్థను చేరుకొన్నప్పటి నుండి, ప్రతి రాత్రి పడుకోగానే నా ముందు రెండు భావాలు ప్రత్యక్షమయ్యేవి. ఒక దర్శనంలో అపార సంపద,

12. నరేంద్రుని రెండు అద్భుత భావనలు

అసంఖ్యాక పరివారజనం, గౌరవం, హోదా, మహా వైభవం, అధికారం గల వ్యక్తిని. లోకంలోని గొప్ప వ్యక్తులందరిలో అగ్రస్థానాన్ని ఆక్రమించుకొన్నట్లు భావించేవాణ్ణి. దాన్ని సాధించే శక్తి సామర్థ్యాలు నాకు ఉన్నాయనుకొనేవాణ్ణి. మరుక్షణంలోనే సర్వసంగ పరిత్యాగం చేసి, కౌపీనధారినై, దొరికింది తింటూ, రాత్రుళ్లు చెట్లక్రింద నిద్రిస్తూ, భగవత్సంకల్పం మీదే పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నట్లు మరో దృశ్యం కానవచ్చేది. కోరుకుంటే ఋషుల, మహర్షులలా జీవించగలననుకొన్నాను. నా జీవితాన్ని ఎలా కావాలంటే అలా మలచుకోగల పరస్పర విరుద్ధమైన ఈ దృశ్యాలు నా మదిలో మెదలాయి. కాని చివరికి రెండవదే మనస్సును ఆకట్టుకొంది. ఈ మార్గంలోనే మనిషి నిజమైన పరమానందాన్ని పొందగలడనీ, మొదటి మార్గం కాక ఈ మార్గాన్నే నేను అనుసరించాలనీ, అనుకొన్నాను. అటువంటి జీవితం అందించే ఆనందాన్ని గురించి దీర్ఘంగా యోచిస్తూ నా మనస్సు భగవద్ధ్యానంలో లీనమైపోగా నేను నిద్రలో జారుకొనేవాణ్ణి. ఎంతో కాలం ప్రతి రాత్రి ఇలాగే జరగడం నాకు ఎంతో ఆశ్చర్యంగా ఉండేది.''

ఆ పిన్నవయస్సులోనే, ఎవరి సలహా లేకుండానే భగవత్సాక్షాత్కారానికి అత్యుత్తమ మార్గం ధ్యానమే అని నరేంద్రుడు కనుగొన్నాడు. ఆతడి గతజన్మల

13. ధ్యానం పట్ల నరేంద్రుని సహజ అభిరుచి

ఆధ్యాత్మికత, దానినుండి పొందిన సంస్కారాలను ఈ విషయం చెప్పక చెబుతూన్నది. నాలుగైదేళ్ల వయస్సులో ఉన్నప్పుడు అతడు సీత, రాముడు, శివుడు మొదలైన దేవీదేవతల చిన్నిప్రతిమలను బజారునుండి కొనితెచ్చుకొనేవాడు. ఇంట్లో వాటిని చక్కగా అలంకరించి, వాటి ముందు నిశ్చలంగా కళ్లుమూసుకొని

ధ్యానాన్ని అనుకరిస్తూ కూర్చునేవాడు. ఈలోపు కొన్ని చెట్ల ఊడలలా భూమ్మీదకు దిగివచ్చే రీతిలో తన తలనుండి జటలు కట్టిన తన శిరోజాలు వ్రేలాడి నేలమీద పడుతున్నాయేమోనని మధ్యమధ్య కళ్లు తెరిచి చూసేవాడు. ఎందుకంటే మునులు ఋషులు దీర్ఘకాలం తపస్సు చేస్తూన్నప్పుడు, వారి శిరోజాలు జటలుకట్టి నేలమీద వ్రేలాడేవని ఇంట్లోని వృద్ధ స్త్రీలు చెప్పగా అతడు వినివున్నాడు. ఒకరోజు నరేంద్రుడు, పొరుగింటి హరి అనే బాలుడితో ఎవరికీ తెలియకుండా ఇంట్లో ఏకాంతమైన ఒకచోట చాలాసేపు ధ్యానాన్ని అనుకరిస్తూ కూర్చుండిపోయాడు. అతడి కోసం ఇంటిల్లిపాదీ వెతకి వేసారి పోయి, చివరకు ఎక్కడికో బయటకు వెళ్లి దారితప్పిపోయాడని భావించారు. ఆ తరువాత ఎవరూ వెళ్లని ఆ ఏకాంతమైన చోటికి తలుపులు పగలగొట్టి వెళితే, అక్కడ నిశ్చలంగా ధ్యానభంగిమలో అతడు కూర్చుని ఉండడం కనిపించింది. పై విషయం పూజ్యురాలైన అతడి తల్లే స్వయంగా చెప్పారు. అతడి ప్రవర్తన బాలుర ఊహలను వ్యక్తంచేసేది గానే ఉన్నప్పటికీ, ఎటువంటి అద్భుత ఆధ్యాత్మిక సంస్కారాలతో అతడు జన్మించాడో అది చాటి చెబు తోంది. మనం ప్రస్తావిస్తూన్న కాలఘట్టంలో అతడి బంధువు లెవరికీ అతడు అనునిత్యం ధ్యానం చేస్తూన్నట్లు తెలియదు. ఎందుకంటే ఇంట్లోని వారంతా నిద్రపోయిన తరువాతే తన గది తలుపులు బిడాయించి ధ్యానానికి కూర్చునే వాడు. కొన్ని సమయాలలో ధ్యానంలో ఎంతగా లీనమైపోయేవాడంటే, తిరిగి అతడికి మామూలు బాహ్యస్మృతి వచ్చేసరికి భళ్లున తెల్లవారిపోవడం కూడా కద్దు.

ఈ సమయంలోనే జరిగిన ఒక సంఘటన ఫలితంగా నరేంద్రుని ధ్యానాభి రుచి మరింత ఇనుమడించింది. ఒక రోజు అతడు మిత్రులతో కలిసి ఆది

14. మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ ప్రోత్సాహం

బ్రహ్మసమాజం ఆచార్యుడైన మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్‌ను చూడడానికి వెళ్లాడు. ఆ సందర్భంలో మహర్షిగారు ఆ యువకులను తన చెంత కూర్చోబెట్టు కొని ప్రతి రోజు భగవంతుని గురించి ధ్యానం చేయమని ఉపదేశించాడు. నరేం ద్రుణ్ణి సంబోధిస్తూ ఆ రోజు ఆయన, ''నీలో యోగి లక్షణాలు అభివ్యక్త మౌతున్నాయి; నువ్వు ధ్యానాన్ని అభ్యసిస్తే, యోగశాస్త్రాలు వచించిన అను భూతులను తప్పక పొందుతావు'' అని చెప్పాడు. ఆయన పావనత్వం కార ణంగా నరేంద్రుడికి అంతకు ముందు నుండే ఆయనంటే అమిత గౌరవం ఉండేది. కాబట్టి ఆయన సలహా మేరకు, ఇంతకు ముందుకంటే అత్యంత ఉత్సాహంతో నరేంద్రుడు ధ్యానం చేయసాగాడనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

చిన్ననాటి నుండే నరేంద్రుడిలో బహుముఖ ప్రజ్ఞాపాటవాల సూచనలు కానరాసాగాయి. ముగ్ధబోధ అనే సంస్కృత వ్యాకరణ గ్రంథంలోని సూత్రాలన్నీ అతడికి కంఠోపాఠం. అతడి బంధువైన ఒక వృద్ధుడు అతణ్ణి ఒళ్లో చేరదీసుకొని అతడి వంశంలోని తాత ముత్తాతల పేర్లు, దేవీదేవతల స్తుతులు, పై వ్యాకరణ గ్రంథంలోని సూత్రాలు నేర్పేవాడు. ఆరేళ్లప్రాయంలోనే నరేంద్రుడు గేయరామాయణం కంఠస్థం చేశాడు. ఆ ప్రాంతంలో గేయరామాయణం ఎక్కడ గానం చేసినా నరేంద్రుడు అక్కడ ఉండడం తథ్యం! ఒక రోజు ఆ ప్రాంతాన గేయరామాయణం గానం చేస్తున్న గాయకుడికి రెండు మూడు చరణాలు గుర్తుకు రాలేదు; వెంటనే అక్కడున్న నరేంద్రుడు ఆ చరణాలు అందించి, ఆ గాయకుడి నుండి ప్రశంసతో పాటు కొన్ని మిఠాయిలు కూడా దక్కించుకొన్నాడు. రామాయణ కావ్యాన్ని ఎక్కడ పారాయణ చేస్తూన్నా తాను అక్కడుంటానని హనుమంతుడు వ్రతం పూనాడు. రామాయణ పారాయణ వింటున్నప్పుడల్లా, పై విషయం గుర్తుకు తెచ్చుకొని నరేంద్రుడు హనుమంతుడికోసం చుట్టూ కలయచూసేవాడు. అతడి అద్భుత జ్ఞాపకశక్తి కారణంగా అతణ్ణి 'ఏకసంథాగ్రాహి' అని పేర్కొనడం సముచితం. అతడు చిన్ననాటి నుండి పాఠాలు నేర్చుకొనే విధానం ఈ కారణం వల్లనే ఇతర బాలురకంటే విభిన్నమైనదిగా తోస్తుంది. అతణ్ణి బడిలో చేర్పించగానే, రోజువారీ పాఠాలలో అతడికి తోడ్పడడానికి ఒక బోధకుణ్ణి నియమించారు. ఆ విషయంగా నరేంద్రుడు ఇలా చెప్పేవాడు: ''ఆతడు ఇంట్లోకి రాగానే, నేను నా ఆంగ్ల, బెంగాలీ పాఠ్య పుస్తకాలు తెచ్చి, ఆ రోజు ఏ పాఠాలు నేర్చుకోవాలో చెప్పి, వాటిని ఆతడి చేతికిచ్చి, ప్రశాంతంగా కూర్చునేవాణ్ణి. ఆ బోధకుడు రెండు మూడుసార్లు ఆ పాఠాలలోని పదాల ఉచ్చారణ, అర్థం ఇత్యాదులు ఏదో తానే స్వయంగా పాఠం నేర్చుకొంటున్నట్లు వల్లించి, వెళ్లిపోయేవాడు. అదే చాలు నాకు, వాటిని నేర్చుకోవడానికి.'' పెరిగి పెద్దయ్యాక పాఠ్యపుస్తకాలను పరీక్షలకు రెండు మూడు నెలలముందు మాత్రమే చదవడం ప్రారంభించేవాడు. సంవత్సరంలో తక్కిన రోజులు తనకు నచ్చిన ఇతర పుస్తకాలు చదివేవాడు. ఆ విధంగా ప్రవేశ పరీక్షలకు కూర్చోవడానికి మునుపే అతడు ఆంగ్ల, బెంగాలీ భాషలలోని ముఖ్యమైన సాహిత్య గ్రంథాలను, అనేక చరిత్ర పుస్తకాలను దాదాపు చదివేశాడు. ఈ పద్ధతిని అవలంబించడం వలన కొన్ని సమయాలలో పరీక్షల ముందు అతడు ఎంతో కష్టపడి చదవవలసి వచ్చేది. ఒక రోజు ఈ అలవాటు కారణంగా ఎదురైన ఇబ్బందిని ఎలా పరిష్కరించాడో చెబుతూ ఇలా అన్నాడు: ''ప్రవేశ పరీక్షలకు ఇంకా రెండు మూడు రోజులే ఉన్నాయనగా

15. నరేంద్రుని బహుముఖ ప్రజ్ఞాపాటవాలు

'యూక్లిడ్' పుటలను నేను కనీసం తిరగవేయనుకూడా లేదు. దాన్ని అధ్యయనం చేయడానికి ఆ రాత్రి అంతా కూర్చున్నాను. ఇరవై నాలుగు గంటలలో ఆ విషయాంశం మీది నాలుగు పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పరీక్షలకు హాజరయ్యాను.'' ఆతడు అలా చేయగలిగాడంటే భగవదనుగ్రహం వలన సంతరించుకొన్న దేహదార్ఢ్యం, అసాధారణ జ్ఞాపకశక్తే అందుకు కారణమని చెప్పనవసరం లేదు.

పాఠ్యపుస్తకాలు చదవని సమయాలలో నరేంద్రుడు ఇతరమైన పుస్తకాలు చదివేవాడని చెప్పడం వలన ఆతడు నవలలు, నాటకాలు చదువుకొంటూ కాలాన్ని వృథాచేశాడని అనుకోరాదు. ప్రత్యేక విషయాంశాల మీది గ్రంథాలను అధ్యయనం చేయాలనే అభిరుచి కొన్ని ప్రత్యేక సమయాలలో ఆతడి మనస్సులో జనించడం కద్దు. ఆ విషయాంశం మీద లభించే పుస్తకాలన్నీ సేకరించి వాటిని ఔపోసనపట్టేసేవాడు. ఉదాహరణకు, ప్రవేశ పరీక్ష జరిగే 1879 వ సం॥లో భారతదేశ చరిత్ర మీద లభించే ముఖ్యమైన గ్రంథాలు చదవాలనే ఉత్సుకత ఆతడిలో కలిగింది. వెంటనే ఆతడు మార్ష్‌మాన్, ఎల్ఫిన్‌స్టోన్ మొదలైన వారి గ్రంథాలను సేకరించి చదివాడు. ఎఫ్.ఏ. పరీక్షలకు సిద్ధమౌతూ విట్లే, జెవాన్స్, మిల్ మొదలైన వారి ఆంగ్ల తర్క గ్రంథాలు ఒకటి వెంట ఒకటి అన్నిటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు; బి.ఏ. పరీక్షలకు చదువుతూన్నప్పుడు ఇంగ్లండ్ తదితర ఐరోపా దేశాల ప్రాచీన, ఆధునిక చరిత్రలనూ, పాశ్చాత్య తత్త్వశాస్త్ర గ్రంథాలనూ చదవాలనే గొప్పకోర్కె ఆతడికి కలిగింది. ఇతర విద్యా విభాగాల గ్రంథాలను కూడా చదవాలనే ఆవేగం ఆతడికి ఉండేది.

16. అధ్యయనం వల్ల నరేంద్రుని అభిరుచి

అసంఖ్యాక పుస్తకాలు చదివిన ఫలితంగా నరేంద్రునిలో త్వరితంగా చదవగల శక్తి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే కాలం నుండి అసాధారణంగా పెంపొందింది. ఆతడు ఇలా చెప్పేవాడు: ''అప్పటి నుండి ఒక పుస్తకాన్ని పుచ్చుకొన్నప్పుడు, ఆ రచయితను అర్థం చేసుకోవడానికి పంక్తి వెంట పంక్తిగా చదవవలసిన అవసరం నాకుండేది కాదు. ఒక పేరాలోని మొదటి పంక్తి, చివరి పంక్తి చదవగానే ఆ పుటలోని సారాంశాన్ని నేను గ్రహించేవాణ్ణి. క్రమంగా ఆ శక్తి పెంపొందడంతో పై రీతిలో పేరాలు చదవవలసిన అవసరం కూడా నాకు లేకపోయింది. కొన్ని సమయాలలో ఒక పుటలోని మొదటి పంక్తి చివరి పంక్తి చదవగానే సారం అవగతమయ్యేది. మళ్లీ రచయిత తర్కాలతో తన ఒక ప్రత్యేక వైఖరిని

17. త్వరితంగా చదవగల నరేంద్రుని సమర్థత

పుస్తకంలో ఏ భాగంలోనన్నా వివరించేటప్పుడు, పుస్తకంలోని ఆతడి యావత్తు వాదసరణిని, కేవలం ఆ తర్క ప్రారంభాన్ని చదవగానే అర్థం చేసుకోగలిగే వాళ్లే.''

ఎంతో అధ్యయనం, ప్రగాఢ చింతన ఫలితంగా నరేంద్రుడికి వాదనలో ఎంతో ఆసక్తి ఏర్పడింది. కాని అతడెన్నడూ కుతర్కానికి దిగేవాడు కాడు.

18. నరేంద్రుని వాదసరణి

తన అంతరాంతరాళాల్లో సత్యమని తెలిసిన విషయాన్నే సదా సమర్థిస్తాడు. కాని తనకు సత్యం అని తెలిసిన విషయానికి వ్యతిరేకంగా ఎవరన్నా తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తే మాత్రం సాత్వికంగా వింటూ ఊరుకోడు. ఆ అంశంపై తిరుగులేని వాదనలు గుప్పించి ప్రత్యర్థిని ఇట్టే నోరుమూయించేస్తాడు. ఆతడి తర్కం ముందు తలవంచని వారు లేరంటే అతిశయోక్తి కాదు. వాదనలో పరాజయం చవిచూసిన అతడి ప్రత్యర్థులు అతడి పట్ల గుర్రుగానే ఉండేవారని చెప్పనవసరం లేదు. ప్రత్యర్థి మాటలు నాలుగు వినీవినగానే అతడి వాదనా సరళిని గ్రహించి, ముందే తన జవాబుతో సిద్ధంగా ఉండేవాడు. ప్రత్యర్థిని మట్టికరిపించే అంత చక్కని వాదనలు ఎలా చటుక్కున స్ఫురిస్తాయని ప్రశ్నించినప్పుడు, ఒకసారి అతడు ఇలా జవాబిచ్చాడు: ''ప్రపంచంలో ఎన్ని నూతన భావనలు ఉత్పన్నం కావడం లేదు? ఆ భావనలకు అనుకూల, ప్రతికూల కారణాలతోబాటు, వాటిలో కొన్నింటిని తెలుసుకొనివుంటే, జవాబులకు తడుముకోవలసిన అగత్యం ఉండదు. ఎందుకంటే ప్రత్యర్థి తన వాదనకు అనుకూలంగా ఏ కారణాన్ని దృష్టాంతీకరించినప్పటికీ, అది పైన పేర్కొన్న వాటిలో ఏదో ఒకటి అయి తీరాలి. ఏ విషయాంశం మీదనన్నా నూతన భావనలు లోకానికి అందించగల వ్యక్తులు ఎంతో అరుదుగానే ఉంటారు.''

పుట్టుకతోనే కుశాగ్రబుద్ధి, అసాధారణ జ్ఞాపకశక్తి, ప్రగాఢ చింతన సంతరించుకొన్న నరేంద్రుడు ప్రతి విషయాన్ని స్వల్పకాలంలోనే ఆమూలాగ్రం గ్రహించగలిగేవాడు; అందువలన ఆటపాటలకూ, స్నేహితులతో వినోదంగా ఆనందంగా కాలం గడపడానికీ అతడికి తీరిక కొరవడలేదు. అలా అతడు ఉల్లాసంగా వేడుకలతో ఎంతో సమయం గడపడం చూసి లోకులు అతడు చదువు సంధ్యలను అసలు పట్టించుకోవడం లేదని భావించేవారు. నరేంద్రుని ఈ విధానాన్ని అనుకరించడానికి ప్రయత్నించి పలువురు బాలురు విద్యార్థులూ తమ భవిష్యత్తును పాడుచేసుకొన్నారు.

జ్ఞాన సముపార్జన పట్ల ఎంత ప్రీతి ఉందో, చిన్ననాటి నుండి నరేంద్రుడికి రకరకాల శరీర వ్యాయామాల పట్ల సైతం అంతే ప్రీతి ఉండేది. అతడు

19. శరీర వ్యాయామం పట్ల నరేంద్రుని అభిరుచి

చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు, తండ్రి అతడికి ఒక పొట్టిజాతి గుర్రాన్ని కొని యిచ్చాడు. తత్ఫలితంగా పెద్దవాడయ్యాక అతడు మంచి రౌతు అయ్యాడు. మల్లయుద్ధం, కత్తిసాము, కసరత్తు, మొదలైన అన్ని శారీరక వ్యాయామాలను అతడు నేర్చు కొన్నాడు. పర్యవసానంగా అతడు దేహదార్ఢ్యం, క్రియాశీలత సంతరించు కొన్నాడు. పైగా పైన పేర్కొన్న వ్యాయామాలన్నింటిలో కౌశలం కూడా సంపా దించాడు. ఆ రోజుల్లో సాధారణ వ్యాయామ పోటీలు నిర్వహించి విజేతలైన వారికి నవగోపాల్ మిత్ర నెలకొల్పిన 'హిందుసంత'లో బహుమతులు కూడా ఇచ్చేవారు. ఆ పోటీలలో కొన్ని సమయాలలో నరేంద్రుడు కూడా పాల్గొనే వాడు.

20. అతడి సాహసం, నెచ్చెలిమి

చిన్ననాటి నుండి అప్రతిహత సాహసం, మిత్రప్రేమలను ప్రకృతి అతడికి ప్రసాదించింది. ఈ గుణాలే అతణ్ణి విద్యార్థి జీవితంలోను, తదనంతర జీవితం లోను అగ్రగణ్య నాయకునిగా రూపొందించడంలో దోహదం చేశాయి. ఎనిమిదేళ్ల ప్రాయంలో ఒకసారి అతడు, మిత్రులతో కలిసి దక్షిణ కలకత్తా మెటియాబుర్జ్‌లోని, మాజీ లక్నో నవాబు వాజిద్ ఆలీ మృగప్రదర్శనశాలకు వెళ్లాడు. కుర్రవాళ్లే పైకం ప్రోగు చేసుకొని, చంద్‌పాల్‌ఘట్టం వద్ద తమ ప్రయాణానికి రానుపోను ఒక పడవను అద్దెకు తీసుకొన్నారు. వెనక్కు తిరిగి వస్తున్నప్పుడు దారిలో ఒక బాలుడు అనారోగ్యానికి గురియై పడవలో వాంతి చేసుకొన్నాడు. ఆ పడవ మనిషి ఒక మహమ్మదీయుడు; పడవ చంద్‌పాల్‌ఘట్టం చేరుకోగానే అతడు ఎంతో కోపంతో, తన పడవను శుభ్రంగా కడిగి వెళ్లమనీ, లేకపోతే ఎవరినీ పడవ నుండి దిగనివ్వననీ బాలురను బెదిరించాడు. ఎవరితో నన్నా పడవను శుభ్రం చేయించుకోమనీ, దానికయ్యే కూలీ తాము ఇస్తామనీ బాలురు, పడవ మనిషితో చెప్పారు; అతడు అందుకు ససేమిరా అంగీకరించలేదు. దాంతో వారి మధ్య వివాదం తలెత్తి, కొట్లాటకు దారితీసే పరిస్థితి ఏర్పడింది. చుట్టు ప్రక్కల ఉన్న పడవ మనుషులు ఏకమై బాలురను చితకబాదడానికి సిద్ధమై నారు. ఆ పరిస్థితిలో బాలురకు ఏం చెయ్యాలో పాలుబోలేదు. బాలురలో నరేంద్రుడే చిన్నవాడు. ఆ గందరగోళంలో నరేంద్రుడు పడవ నుండి దిగి చల్లగా జారుకొన్నాడు. మరీ చిన్నపిల్లవాడని పడవవాళ్లు అతణ్ణి అడ్డగించలేదు. నరేంద్రుడు తీరంపై నిలబడి చూడగా ఆ గొడవ చిలికిచిలికి గాలివాన అయ్యేలా కనిపించింది. తన మిత్రులను ఎలా కాపాడాలో అని అతడు ఆలోచిస్తూండగా, ఇద్దరు ఆంగ్లేయ సిపాయిలు తీరంవెంట నడిచిపోతూ ఉండడం కనిపించింది.

నరేంద్రుడు ఒక్క పరుగున వారి వద్దకెళ్లి, వారికి అభివాదం చేసి, వారి చేతులు పుచ్చుకొన్నాడు. వచ్చీరాని ఆంగ్లంలో, సైగలు చేస్తూ ఆ గొడవ అంతా వాళ్లకు వివరించి చెప్పాడు. ఆ సిపాయిలు కుర్రవాడి ప్రసన్న దృక్కులకు, ప్రవర్తనకు ముగ్ధులై, వడివడిగా పడవ వద్దకు వచ్చారు; పరిస్థితిని అర్థంచేసుకొన్నారు. చేతుల్లోని బెత్తాలను పైకెత్తి బాలురను వదలిపెట్టమని పడవవాళ్లను ఆదేశించారు. సైన్యంలోని తెల్లసిపాయిలుగా వాళ్లను గుర్తించి, పడవవాళ్లందరూ గుట్టు చప్పుడు కాకుండా అక్కడ నుండి వెళ్లిపోయారు. నరేంద్రుడి మిత్రులు ఊపిరి పీల్చుకొన్నారు. నరేంద్రుడి సమయోచిత సాహసం చూసి ఆ సిపాయిలు ముచ్చటపడి, తమతో నాటకశాలకు రమ్మనమని అతణ్ణి ఆహ్వానించారు. కాని నరేంద్రుడు వారి ఆహ్వానాన్ని వినయంగా తిరస్కరించి, వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

అతడి సాహసాన్ని చాటే మరికొన్ని సంఘటనలు కూడా ఉన్నాయి. వాటిలో ఒకటి రెండింటిని ఇక్కడ ప్రస్తావించడం అసంగతం కాబోదు.

21. సైరాపిస్ అనే ఓడను సందర్శింప అనుమతి పొందడం

నరేంద్రుడికి పది లేక పన్నెండేళ్లప్పుడు వేల్స్ రాజకుమారుడు (తదనంతరం 7వ ఎడ్వర్డ్) భారతదేశానికి రావడం తటస్థించింది. ఆ సందర్భంలో సైరాపిస్ అనే ఆంగ్లేయ యుద్ధనౌక కలకత్తా రేవుకు వచ్చింది. ఆ నౌకను సందర్శింప అనేకులకు అనుమతికూడా ఇచ్చారు. తన మిత్రులతో ఆ నౌకను సందర్శింపగోరి నరేంద్రుడు ఛౌరంగీలోని ఆ కార్యాలయానికి అనుమతి కోరుతూ దరఖాస్తు పుచ్చుకొని వెళ్లాడు; కాని ద్వారం వద్దనున్న కావలివాడు మరీ పెద్దమనుషులను తప్ప, ఎవరినీ లోపలకు అనుమతించడం లేదు. లోపల ఉన్న ఆంగ్లేయ అధికారిని ఎలా కలుసుకోవాలో ఆలోచిస్తూ నరేంద్రుడు ప్రవేశ ద్వారం వద్దే నిలబడ్డాడు. అనేకులు కార్యాలయం నుండి అనుమతి పత్రాలు పుచ్చుకుని రావడం అతడు చూశాడు. వారంతా రెండవ అంతస్తులోని ఒక వసారాలోకి వెళ్లడం గమనించాడు. ఆంగ్ల అధికారి దరఖాస్తులు పుచ్చుకొని, అనుమతి పత్రాలు మంజూరు చేస్తున్న చోటు బహుశా అదేనేమో ననుకొన్నాడు నరేంద్రుడు. కాస్త అన్వేషించి చూడగా ఆ ఆంగ్ల అధికారి సేవకులు మేడపైకి వెళ్లే ఇనుపమెట్లు ఒక మూలన ఉండడం నరేంద్రుడి కంటబడింది. ఆ మెట్లు సరాసరి ఆ వసారా వెనుకనున్న గది వద్దకు పోవడం కూడా నరేంద్రుడు గమనించకపోలేదు. తాను ఎవరి కంటన్నా పడితే గొప్ప ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలిసీ, ఎంతో సాహసం చేసి ఆ మెట్ల మీదుగా రెండవ అంతస్తును చేరుకొన్నాడు. అధికారి గదిగుండా వసారాలోకి వెళ్లాడు. అక్కడ దరఖాస్తుదారులు గుంపుగా

ఆ అధికారి చుట్టూ నిలబడి ఉండడమూ, ఆతడు దించిన తల ఎత్తకుండా వారి అనుమతి పత్రాలపై సంతకం చేసి ఇస్తూవుండడమూ నరేంద్రుడు చూశాడు. వారి వెనుక నిలబడి, సకాలంలో అనుమతిపత్రం పొంది, అధికారికి అభివాదన తెల్పి, ముందు మెట్లగుండా అందరిలా దర్జాగా దిగి, బయటకు వచ్చాడు.

ఆ సమయంలో కలకత్తాలోని సిమ్లా ప్రాంతంలోని బాలుర ఉపయోగార్థం కారన్‌వాలీస్ వీధిలో వ్యాయామం నేర్పే ఒక వ్యాయామశాల ఉండేది. దానిని 'హిందుసంత'ను నెలకొల్పిన నవగోపాల్ మిత్ర స్థాపించాడు. అది నరేంద్రుని ఇంటికి సమీపంలో ఉండడం వలన, అతడు ప్రతిరోజు మిత్రులతో కలిసి వెళ్ళి, అక్కడ వ్యాయామం అభ్యసించేవాడు. ఈ బాలురకు నవగోపాల్ బాబుతో బాగా పరిచయం ఉండడం వలన, ఆ వ్యాయామశాల నిర్వహణను ఆయన వారికి అప్పగించాడు. ఇలావుండగా ఒకరోజు ఒక ట్రిపీజ్[1] అమర్చడంకోసం భారమైన ఒక కలప చట్రం నిటారుగా నిలబెట్ట ప్రయత్నించారు కాని అది వారికి మించిన పనే అయింది. ఇంతలో జనం అక్కడ గుమిగూడారు కాని ఎవరూ సహాయం అందించడానికి ముందుకు రాలేదు. ఆ జనంలో లావైన ఒక ఆంగ్లేయ నావికుడు నిలబడి ఉండడం చూసి, నరేంద్రుడు ఆ వ్యక్తిని సహాయం చేయమని కోరాడు. అతడు సంతోషంగా అందుకు అంగీకరించి, బాలురతో జతకట్టాడు. ఆ తరువాత బాలురు ఆ చట్రం తలభాగాన్ని ఒక తాడు సహాయంతో లేవనెత్తసాగారు; ఆ నావికుడు ఆ చట్రం కాళ్లను మెల్లగా సాకెట్స్‌లో ప్రవేశించేటట్లు చూసుకోసాగాడు. పని చురుగ్గానే సాగుతోంది. ఇంతలో తాడు తెగి, ఠక్కున ఆ కలపచట్రం నేలమీద పడిపోయింది. ఆ చట్రం కాళ్లలో ఒకటి హఠాత్తుగా పైకివెళ్ళి ఆ నావికుడి తలకు గట్టిగా తగిలింది. అతడు స్పృహతప్పి పడిపోయాడు. ఆ నావికుడు అలా స్పృహతప్పి పడిపోవడం, గాయం నుండి ధారగా రక్తం స్రవిస్తూవుండడం చూసి అక్కడున్న ప్రతి ఒక్కరు అతడు చచ్చిపోయాడని నిర్ణయించుకొని, పోలీసుల భయంతో నలుదిక్కులా పారిపోయారు. నరేంద్రుడు, అతడి మిత్రులు ఒకరిద్దరు మాత్రం అక్కడ్నుండి కదలక, నావికుడికి శైత్యోపచారాలు చేయసాగారు. నరేంద్రుడు తన బట్టను చింపి, దాన్ని నీటిలో ముంచి, ఆ గాయం మీద కట్టాడు. మెల్లగా నీరు అతడి ముఖం మీద చిలకరిస్తూ, అతడికి విసరసాగాడు. కాసేపటికి ఆ నావికుడికి

22. ట్రిపీజ్ సంఘటన

---

1. వ్యాయామ కసరత్తులకోసం తాళ్లతో అడ్డంగా వేలాడగట్టి ఉండే దండం (దండాలు).

స్పృహ రాగానే, అతణ్ణి ప్రక్కనున్న ట్రెయినింగ్ అకాడమీ భవంతిలోకి మోసుకువెళ్లారు. ఒక వైద్యుణ్ణి తోడ్కొని వెంటనే రమ్మని నవగోపాల్ బాబుకు కబురు వెళ్లింది. వైద్యుడు వచ్చి, నావికుణ్ణి పరీక్షించి, ''గాయం పెద్దదేం కాదు; వారం రోజుల్లో నయమైపోతుంది'' అని చెప్పాడు. నరేంద్రుడి ఉపచారాలతో, మందుమాకులు, ఆహారం మొదలైన చక్కని ఏర్పాట్లతో ఆ నావికుడు వారం రోజులలో కోలుకొన్నాడు. ఆ తరువాత నరేంద్రుడు ఆ ప్రాంతంలోని కొందరు పెద్దమనుషుల నుండి కొంత సొమ్ము సేకరించి ప్రయాణ ఖర్చుల క్రింద ఆ పైకాన్ని నావికుడి కిచ్చి, అతణ్ణి సాగనంపాడు. క్లిష్టమైన, అపాయకరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు బాల్యావస్థలో సైతం నరేంద్రుడు ఎంత ప్రశాంతంగా వ్యవహరించేవాడో సూచించే అనేక సంఘటనలను గురించి మేం వినివున్నాం.

బాల్యం నుండి కూడా నరేంద్రుడు సత్యసంధుడు. యౌవనంలోకి అడుగిడగానే ఆ సత్యసంధత నూరింతలు పెరిగింది. అతడు ఇలా చెప్పేవాడు:

23. నరేంద్రుని సత్యనిష్ఠ

''నేను ఎన్నడూ భూతాల గురించి చెప్పి పిల్లలను భయపెట్టను, అసత్యదోషం వాటిల్లుతుందనే భయంతో. అలా చేసేవాళ్లను బాగా తిట్టేవాణ్ణి. ఆంగ్ల విద్యావిధానంలో చదివినందున, బ్రహ్మ సమాజానికి వెళుతూవున్నందున సత్యాన్ని వాక్రుచ్చాలనే ఆసక్తి అప్పుడు నాలో ఎంతో అధికరించింది.''

దేహదార్ఢ్యం, కుశాగ్రబుద్ధి, అద్భుత జ్ఞాపకశక్తి, పవిత్ర హృదయం - వీటిని సంతరించుకొన్న కారణంగా నరేంద్రుడు సదా మందహాస వదనంతో అలరారేవాడు. నరేంద్రుడు నృత్యం నేర్చుకొన్నాడు, గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం బాగా అలవరచుకొన్నాడు. అతడు మిత్రులతో కలిసి రకరకాల వినోదాలలో, వేడుకలలో సమధికోత్సాహంతో పాల్గొనేవాడు; కాని అవి నైతికత హద్దులను దాటనంత వరకే! సదా అతడు ప్రసన్నంగా ఉండడానికి కారణం తెలుసుకోలేక, బాహ్య పరిశీలకులు తరచు అది ఆతడి ప్రవర్తన లోపంగా ఎంచేవారు. కాని నరేంద్రుడు లోకుల ప్రశంసనుగాని లేదా నిందనుగాని ఎన్నటికీ లక్షించేవాడు కాదు. వారి అసత్య దూషణలను ఖండింప ఆతడి హృదయం దిగజారేది కాదు.

24. హాని కలిగించని వినోదాల పట్ల నరేంద్రుని అభిలాష

పేదలపట్ల కరుణ అతడికి పుట్టుకతో అబ్బిన సుగుణం. చిన్నతనంలో ఎవరైనా భిక్షగాడు ఇంటికి వస్తే, అతడు కోరిందల్లా, విలువైన వస్త్రాలు పాత్రలతో సహా ఇచ్చివేసేవాడు నరేంద్రుడు. ఆ విషయం తెలుసుకొని కుటుంబ

సభ్యులు నరేంద్రుణ్ణి తిట్టి, ఆ భిక్షగాడి నుండి ఆ వస్తువులు తిరిగి తీసుకొని అతడికి కొంత డబ్బు ఇచ్చి పంపేవారు. ఇలాగే కొన్నిసార్లు జరిగిన తరువాత, ఒక రోజు అతడి తల్లి నరేంద్రుణ్ణి మొదటి అంతస్తులో ఒక గదిలో ఉంచి, గదికి గడియపెట్టింది. అదే సమయంలో ఒక భిక్షగాడు వచ్చి బిగ్గరగా అడుక్కోసాగాడు. వెంటనే నరేంద్రుడు తన తల్లి విలువైన వస్త్రాలను కొన్నిటిని మేడ మీది కిటికీ నుండి క్రిందికి విసిరివేశాడు.

25. నరేంద్రుని కోపం

నరేంద్రుని తల్లి తరచు ఇలా చెప్పేవారు: ''చిన్నతనం నుండి నరేంద్రుడిలో ఒక గొప్ప దుర్బలత ఉండేది. ఏ కారణంగానన్నా అతడికి కోపం వస్తే, తనను తాను మరిచిపోయి చేతికి అందిన వస్తువులను ఛిన్నాభిన్నం చేసి ఆ ముక్కలను నాలుగు వైపులా చిందరవందరగా పారేసేవాడు. ఒక కుమారుణ్ణి అనుగ్రహించమని కాశీవిశ్వనాథుణ్ణి మొక్కుకొన్నాను. ఆయన నా మొక్కును తీరుస్తూ తన భూతగణాలలో ఒకరిని నా వద్దకు పంపాడు. లేకపోతే నరేంద్రుడు కోపం వచ్చినప్పుడు భూతంలా ఎందుకు ప్రవర్తిస్తాడు?'' కాని ఆమె, కుమారుని ఆ కోపానికి ఒక గొప్ప చికిత్స కనిపెట్టింది. కుమారుడి కోపం ఏ విధంగాను ఉపశమించనప్పుడు ఆమె విశ్వనాథుణ్ణి తలచుకొని అతడి తలమీద రెండు మూడు బిందెల నీరు గుమ్మరించేది. ఏం ఆశ్చర్యం, బాలుడి కోపం క్షణంలో ఎగిరిపోయేది. దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను కలుసుకొన్న అనతికాలంలోనే ఒక రోజు నరేంద్రుడు మాతో ఇలా చెప్పాడు: ''ఈ మతాచరణలో నే నేమీ లబ్ధి పొందక పోవచ్చునేమో; కాని ఆయన అనుగ్రహం వలన నా తారాస్థాయి కోపాన్ని నియంత్రించుకోవడం మాత్రం రూఢి. ఇంతకు మునుపు కోపంలో నన్ను నేను అదుపులో ఉంచుకోలేకపోయేవాణ్ణి; తదుపరి అందుగురించి పశ్చాత్తాపం చెందేవాణ్ణి. కాని ప్రస్తుతం ఎవరన్నా నాకు గొప్ప అపకారం చేసినా లేదా నన్ను తీవ్రంగా కొట్టినప్పటికీ నాకు అంతగా కోపం రావడం లేదు.''

26. నరేంద్రుని మనోబుద్ధుల సమ వికాసం

మనోబుద్ధులు సమంగా వికసించిన వ్యక్తులు లోకంలో ఎంతో అరుదు. అటువంటి వ్యక్తులే సమాజంలో గుర్తింపబడతారు. మళ్ళీ, ఆధ్యాత్మిక జగత్తులో తమ అనుపమానతను అభివ్యక్తం చేసేవారు కూడా చిన్ననాటి నుండే ఎంతో పురోగమించిన ఊహాశక్తిని సంతరించుకొని ఉండివుంటారు. నరేంద్రుని జీవితం అధ్యయనం చేస్తే ఈ విషయం తేటతెల్లమౌతుంది. ఒకటి రెండు ఉదాహరణలు చూపుతే పాఠకులకు ఈ విషయం సులభంగా అర్థమౌతుంది.

27. రాయ్‌పూర్ వెళ్లే దారిలో నరేంద్రుడు ధ్యానమగ్నుడవడం

ఒకప్పుడు ఏదో పనిబడి నరేంద్రుని తండ్రి కొంతకాలం మధ్యభారత దేశంలోని రాయ్‌పూర్‌లో నివసించాడు. అక్కడే మరికొంతకాలం గడపవలసి ఉంటుందని తెలిసి, రాయ్‌పూర్‌కు తన కుటుంబాన్ని రప్పించుకొన్నాడు. వారిని తోడ్కొని వచ్చే బాధ్యత నరేంద్రుడికి అప్పగించాడు. అప్పుడతడి వయస్సు పధ్నాలుగో లేక పదిహేనో. ఆ రోజుల్లో రాయ్‌పూర్‌కు రైలు సౌకర్యం లేదు. కనుక దట్టమైన క్రూరమృగ సంచారమున్న అడవుల గుండా ఎడ్లబండి మీద పదిహేను రోజులు ప్రయాణం చేయవలసి ఉండేది. ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కోవలసి ఉంటుందని అతడికి తెలుసు. అయినప్పటికీ అద్భుత వన్య ప్రాంత సౌందర్యాన్ని చూసి ఆనందించే అవకాశం వచ్చినందుకు ప్రయాణంలో ఎదురయ్యే కష్టాల గురించి అతడు లక్షించలేదు. భూమిని సర్వాలంకారశోభితగా అలంకరించిన భగవంతుని అపరిమిత శక్తిని, అనంత ప్రేమను మొట్ట మొదటిసారి ప్రత్యక్షంగా చవిచూడడంతో నరేంద్రుడు ముగ్ధుడయ్యాడు. అతడు ఇలా అనేవాడు: "అరణ్యాల గుండా పయనిస్తూన్నప్పుడు నేను తిలకించింది, అనుభూతం చేసుకొన్నది నా జ్ఞాపకాలలో సదా అట్లే నిలిచిపోయింది, ముఖ్యంగా ఒకరోజు జరిగిన సంఘటన. ఒక రోజు ఒక లోయగుండా పయనించవలసి వచ్చింది. అంబరాన్ని చుంబించే వింధ్యపర్వత శిఖరాలు మాకు రెండు వైపులా నిలబడి ఉన్నాయి. ఫల పుష్ప భారంతో వంగిన రకరకాల చెట్లు, తీగలు సాటిలేని అందాన్ని సంతరించుకొని పర్వత సానువులను ఆవరించి ఉన్నాయి. ఆహార అన్వేషణకై అటూ ఇటూ ఎగురుతూ చేసే పక్షుల కిలకిలా రావాలతో ఆ ప్రాంతం మారుమ్రోగుతున్నది. రెండు పర్వత శిఖరాలు ఆలింగనం చేసుకొన్న రీతిలో ఇరుకైన అడవి మార్గంపై ముందుకు వాలిన ప్రదేశాన్ని ఎడ్లబండ్లు చేరుకొంటున్నాయి. జాగ్రత్తగా పరిశీలించి చూడగా, ఆ శిఖరాలు కలుసుకొన్న చోటు క్రింద, శిఖరం నుండి పాదం వరకు ఒక పెద్ద చీలిక కనిపించింది. ఆ చీలిక అంచువెంట యుగాలపర్యంతం తేనెటీగలు శ్రమించి కట్టిన ఒక బ్రహ్మాండమైన తేనెపట్టు వ్రేలాడుతూండడం నా కంటబడింది. సంభ్రమాశ్చర్యాలతో ఆ తేనెటీగల రాజ్యపు ఆద్యంతాలను పరికిస్తూ, ముల్లోకాలను నియంత్రించేవాడైన భగవంతుని అనంత శక్తిని గురించిన తలపులో మగ్నుడనై, పూర్తిగా బాహ్యస్మృతిని కొంతసేపు కోల్పోయాను. అదే స్థితిలో ఎడ్లబండిలో ఎంతసేపు పడివున్నానో నాకు గుర్తులేదు. బాహ్యచైతన్యం వచ్చాక చూద్దును కదా, ఆ ప్రాంతం దాటి చాలాదూరం వచ్చేసినట్లు గ్రహించాను. బండిలో నేను ఒక్కడినే ఉండడం వలన, దీనిని గురించి ఎవరికీ ఏమీ తెలియ

రాలేదు.'' బలమైన ఊహాశక్తి తోడ్పాటుతో ప్రగాఢ ధ్యానావస్థలోకి జారుకొని, దాన్లో సంలీనమైపోవడం బహుశా నరేంద్రుడికి ఇదే మొదటి అనుభవం అయి వుండవచ్చు.

నరేంద్రుని పూర్వీకులను గురించి క్లుప్తంగా ప్రస్తావించి ఈ అధ్యాయాన్ని ముగిస్తాం. అనేక శాఖలుగా విడిపోయిన సిమ్లాపేట దత్త కుటుంబం, కలకత్తా లోని ప్రాచీన కుటుంబాలలో ఒకటి. ఆస్తిపాస్తులలో, హోదాలో, పాండిత్యంలో కలకత్తాలోని మధ్యతరగతి కాయస్థులలో నరేంద్రుని కుటుంబం పేరెన్నికగన్నది.

28. సన్న్యాసం పుచ్చుకొన్న నరేంద్రుని తాత

నరేంద్రుని ముత్తాత, రామ్‌మోహన్ దత్త ఒక న్యాయవాది; అతడు బాగా ఆర్జించాడు; పెద్ద కుటుంబాన్ని పోషిస్తూ, మిత్రుల ఇరుగుపొరుగుల మర్యాద మన్ననలను చూరగొన్నాడు. అతడు సిమ్లాలోని గౌర్‌మోహన్ ముఖర్జీ వీధిలోని తన స్వార్జిత గృహంలో నివసించేవాడు. అతడి కుమారుడైన దుర్గాచరణ్‌కు, తండ్రి నుండి అపారమైన సంపద సంక్రమించింది. కాని దుర్గాచరణ్‌కు కాస్త చిన్నవయస్సులోనే సంసారం పట్ల విరక్తి జనించడంతో, సన్న్యాసం పుచ్చుకొన్నాడు. చిన్ననాటి నుండి సాధుసన్యాసుల పట్ల దుర్గాచరణ్‌కు భక్తిప్రపత్తులుండేవి. ఆ అభిరుచి అతణ్ణి శాస్త్రాధ్యయనానికి దారి తీయించి, అనతికాలంలోనే అతణ్ణి మంచి పండితునిగా తీర్చిదిద్దింది. వివాహం చేసుకొన్నప్పటికీ దుర్గాచరణ్‌కు సంసారం పట్ల ఎటువంటి అనురక్తీ లేదు. తన సొంత ఉద్యానంలో ఎక్కువ సమయం సాధుసాంగత్యంలో గడిపేవాడు. ఒక కుమారుడు పుట్టిన స్వల్పకాలంలోనే తన తాతగారైన దుర్గాచరణ్ సంసార పరిత్యాగం చేశారని వివేకానంద స్వామి చెప్పేవారు. కుటుంబాన్ని వీడి వెళ్లిపోయినప్పటికీ దుర్గాచరణ్ భగవత్సంకల్పం వలన, తదనంతర కాలంలో తన భార్యను బంధువులను రెండు పర్యాయాలు కలుసుకొన్నాడు. ఆయన కుటుంబాన్ని వదలి వెళ్లిపోయినప్పుడు, ఆయన కుమారుడు విశ్వనాథ్ వయస్సు రెండు లేదా మూడేళ్లు ఉండవచ్చు. ఆయన భార్య, బంధువులు కాశీకి వెళ్లి అక్కడ కొంతకాలం బసచేశారు. బహుశా ఆయనను వెతకడానికే కాశీకి వెళ్లారేమో! అప్పటికి రైలు సౌకర్యం లేనందున, గౌరవనీయ కుటుంబాల వారు కాశీకి పడవల మీద వచ్చేవారు. దుర్గాచరణ్ భార్యకూడా ఒక యాత్రీకుల బృందంతో కలిసి కాశీకి వెళ్లింది. దారిలో ఒకచోట చిన్ని విశ్వనాథ్ పడవ నుండి గంగాజలాల్లో పడిపోయాడు. అది మొదట తల్లి చూసి వెంటనే నీళ్లలో దూకేసింది. స్పృహతప్పిపోయిన తల్లిని ఎంతో ప్రయాసపడి పడవలోకి చేర్చారు. ఆ స్పృహతప్పిన పరిస్థితిలో కూడా ఆ తల్లి, బిడ్డడి చేతిని గట్టిగా

పట్టుకొనే ఉంది. ఎల్లలెరుగని మాతృప్రేమ ఆ విధంగా బిడ్డడి ప్రాణాన్ని కాపాడింది.

కాశీలో దుర్గాచరణ్ భార్య నిత్యం విశ్వేశ్వరాలయానికి వెళ్లి వచ్చేది. ఒక రోజు వాన పడినందున వీధిలో ఆమె జారి, దేవాలయం ముందు పడి పోయింది. అప్పుడు అటుగా పోతున్న ఒక సన్న్యాసి అది చూసి గబగబా ఆమె వద్దకు వెళ్లాడు. ఆమెను పైకెత్తి, ఆలయం మెట్లమీద కూర్చోబెట్టి, దెబ్బలు తగిలాయేమోనని ఆమెను జాగ్రత్తగా పరీక్షించాడు. కాని ఆ రెండు నేత్ర ద్వయాలూ కలుసుకొన్న క్షణంలోనే దుర్గాచరణ్, అతడి భార్య పరస్పరం గుర్తించారు. ఆ సన్న్యాసియైన దుర్గాచరణ్ ఆమెను రెండవసారి కళ్లెత్తి చూడ నైనా చూడకుండా, అక్కణ్ణుండి కదలి ఎటో వెళ్లిపోయాడు.

సన్న్యాస సంప్రదాయంలో ప్రతి సన్న్యాసి పన్నెండేళ్ల కొకసారి తన జన్మ స్థలాన్ని దర్శించాలనే నియమం ఒకటి ఉంది. ఆ నియమం మేరకు దుర్గా చరణ్ పన్నెండేళ్ల తదనంతరం కలకత్తాకు తిరిగివచ్చి, ఒక పాత మిత్రుడి ఇంట్లో బసచేశాడు. తన రాకను గురించి తన బంధువు లెవరికీ తెలుపవద్దని దుర్గాచరణ్ తన మిత్రుణ్ణి కోరాడు. కాని పరమ లౌకికుడైన ఆ మిత్రుడు, దుర్గాచరణ్ విన్నపాన్ని మన్నించక, రహస్యంగా అతడి రాకను బంధువులకు తెలియచేశాడు. వాళ్ల గుంపుగా వచ్చి, బలవంతంగా దుర్గాచరణ్‌ను ఇంటికి తోడ్కొని వెళ్లారు. వారితో ఇంటికి పోయినప్పటికీ, అతడు ఎవరితోను మాట్లాడలేదు. ఒక గదిలోకి వెళ్లి ఒక మూల కళ్లుమూసుకొని నిశ్చలంగా ఒక కొయ్యదుంగలా కూర్చున్నాడు. బంధువులు గది తలుపు మూసివేశారు. ఆయన అదే భంగిమలో మూడు రాత్రులు, మూడు పగళ్లు కదలా మెదలక కూర్చుండిపోయాడని తెలియవస్తోంది. ఆయన ఆమరణ దీక్షకు పూను కొంటాడేమోనని భయపడి బంధువులు ఆ గది తలుపు తెరిచివుంచారు. మర్నాడుదయం ఎవరి కంటా పడకుండా దుర్గాచరణ్ మాయమయ్యాడు.

దుర్గాచరణ్ కుమారుడైన విశ్వనాథ్ పారశీక, ఆంగ్ల భాషలలో చక్కని పాండిత్యం గడించి, కలకత్తా ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా వృత్తిని అవ లంబించాడు. అతడు మిత్రులపట్ల ఉదారత, ప్రేమగల వ్యక్తి. ఎంతో సంపాదించినప్పటికీ, నిల్వగా ఏమీ వదలి పెట్టిపోలేదు. పొదుపుగా ఉండలేకపోవడమనే లక్షణం బహుశ అతడు, తన తండ్రి నుండి సంక్రమించుకొన్నట్లుంది. విశ్వనాథ్ స్వభావం సాధారణ లౌకి కునికంటే ఎన్నో రీతులలో ఎంతో విభిన్నంగా ఉండేది. ఉదాహరణకు, రేపు అన్న ఆలోచన అతణ్ణి ఎన్నడూ కలవరపరచదు. అర్హతానర్హతల వివక్షత

29. నరేంద్రుని తండ్రి, విశ్వనాథ్ దత్త

లేకుండానే అతడు ఎందరికో సహాయం చేశాడు. బంధువుల పట్ల ఎంతో ఆప్యాయతతో మసలుకొనేవాడు; అయినప్పటికీ కుటుంబం నుండి దీర్ఘకాలం తను దూరంగా ఉండిపోయినప్పుడు, బంధువుల క్షేమసమాచారాదులు తెలుసుకోవాలని అతడు ఏమాత్రం ఆరాటం చెందేవాడుకాదు.

30. సంగీతం పట్ల విశ్వనాథ్ ప్రీతి

విశ్వనాథ్ తెలివైన వ్యక్తి, గొప్ప గ్రహణశక్తి ఉన్నవాడు. అతడికి సంగీతం పట్లా ఇతర లలిత కళలపట్లా ఎంతో అభిరుచి ఉండేది. శాస్త్రీయంగా సంగీతం నేర్చుకొనకపోయినా, తన తండ్రి నిధుబాబు లలిత గీతాలను సుమధురంగా గానం చేసేవాడని వివేకానంద స్వామి చెప్పేవాడు. నాటి సామాన్య అభిప్రాయానికి విరుద్ధంగా, విశ్వనాథ్ సంగీతాన్ని హానిలేని వినోదంగా పరిగణించేవాడు; తన పెద్ద కుమారుడైన నరేంద్రనాథ్‌కు చదువు చెప్పించినట్లే, శ్రద్ధగా సంగీతాన్ని కూడా నేర్పించాడు. వైష్ణవ బైరాగులు పాడగా కేవలం ఒక్కసారి విని నేర్చుకొన్న భక్తిపాటలను అతడి భార్య భువనేశ్వరీదేవి రాగయుక్తంగా పాడడంలో నేర్పరి.

31. మహమ్మదీయ ఆచార వ్యవహారాల పట్ల విశ్వనాథ్ మక్కువ

విశ్వనాథ్‌కు బైబిల్‌ను, పారశీక కవి హాఫీజ్ గీతాలను చదవడం ఎంతో ఇష్టం. ఏసుక్రీస్తు సుమధుర జీవితాన్ని తెలిపే బైబిల్‌లోని ఒకటి రెండు అధ్యాయాలను విశ్వనాథ్ నిత్యం చదివేవాడు. తన భార్యా పుత్రులకు కూడా ఇవి, హాఫీజ్ గీతాలు చదివి ఒకింత వినిపించేవాడు. తను లక్నో, లాహోర్ మొదలైన చోట్ల కొంతకాలం నివసించినప్పుడు కొన్ని మహమ్మదీయ ఆచార వ్యవహారాలను ప్రశంసించటమే కాక స్వయంగా తనుకూడా పాటించేవాడు. ఆ కారణంగానే నిత్యం పులావ్ తినే అలవాటు. అతడి కుటుంబంలో చోటుచేసుకొన్నట్లుంది.

32. వినోదాల పట్ల విశ్వనాథ్ అభిలాష

విశ్వనాథ్ ఎంత సరసుడో హాస్యప్రియుడో అంత గంభీరుడు కూడా. తన కుమారులలో, కుమార్తెలలో ఎవరైనా తప్పు చేస్తే వారిని గట్టిగా తిట్టేవాడు కాదు; కాని వారి స్నేహితులకు ఆ విషయం తెలిపేవాడు; దాంతో వారు సిగ్గుపడి మళ్లీ ఎన్నడూ ఆ తప్పు చేసేవారు కారు. ఒక రోజు నరేంద్రుడు తల్లితో ఏదో విషయంలో ఘర్షణపడి ఆమెను ఒకటి రెండు పరుష వచనాలతో నొప్పించాడు. అయినా కుమారుణ్ణి తండ్రి మందలించలేదు; అందుకు మారుగా నరేంద్రుడి గదిలో అతడి మిత్రులకంతా కనిపించేటట్లు గోడమీద నరేంద్రుడు, తల్లితో మాట్లాడుతున్నప్పుడు ఫలానా పరుషవచనాలను ఉపయోగించాడని బొగ్గుతో కొట్టొచ్చినట్లు వ్రాసివుంచాడు. నరేంద్రుడు, అతడి మిత్రులు గదిలోకి రాగానే గోడమీది వ్రాతలపై వాళ్ల దృష్టి

పడింది. నరేంద్రుడు తన దుష్ప్రవర్తనను తలచుకొని ఎంతోసేపు కుంచించుకు పోయాడు.

దూరపు బంధువులతో కలిపి విశ్వనాథ్ అతిపెద్ద కుటుంబాన్నే పోషించే వాడు. వారి ఆహార, ఇతర అవసరాలు తీర్చడంలో అతడు దుబారా చేసేవాడు.

33. విశ్వనాథ్ ఉదారత్వం

అతడి ఔదార్యం మీద జీవిస్తూన్న ఆ బంధువులలో కొందరు సోమరులుగా తయారయ్యారు. మరికొందరు త్రాగుడు మొదలైన మత్తు పదార్థాలకు అలవడ్డారు. నరేంద్రుడు పెద్దవాడయ్యాక, ఆ బంధువుల పట్ల తండ్రి అపాత్రదానం చేస్తున్నాడని ఆయనను నిలదీసేవాడు. అందుకు విశ్వనాథ్ ఇలా జవాబిచ్చేవాడు: ''మానవ జీవితం ఎంత దుఃఖభూయిష్ఠమైనదో ఊహించడానికి నీకు వయస్సు చాలదు. నీకు అవగతమైనప్పుడు ఈ దుర్భర జీవులు తమ జీవితపు చేదు అనుభవాల నుండి తాత్కాలిక ఉపశమానార్థం త్రాగుతున్నారని గ్రహించి, వారిని క్షమించే దృక్పథం అలవరచుకోగలుగుతావు.''

విశ్వనాథ్‌కు పలువురు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. అందరూ సుగుణవంతులు. కాని కుమార్తెలలో ఎక్కువమంది చిన్నవయస్సులోనే మర

34. విశ్వనాథ్ మరణం

ణించారు. వరుసగా ముగ్గురు లేక నలుగురు కుమార్తెల తరువాత జన్మించిన నరేంద్రుడంటే తల్లితండ్రులకు ఎంతో ప్రీతి. 1883వ సం॥ శీతకాలంలో నరేంద్రుడు బి.ఏ. పరీక్షలకు తయారవుతున్నప్పుడు హఠాత్తుగా గుండెపోటుతో అతడి తండ్రి మరణించాడు. అతి ఉదారుడైన విశ్వనాథ్ ఈ హఠాన్మరణం కుటుంబాన్ని నిరుపేదలుగా దిగజార్చింది.

నరేంద్రుని తల్లి భువనేశ్వరీదేవి గారి గురించి ఎంతో గొప్పగా మేం వినివున్నాం. ఆమె బాహ్యసౌందర్యమే కాక దైవభక్తి వంటి అంతఃసౌందర్యం

35. నరేంద్రుని తల్లి

కూడా సంతరించుకొన్న మహనీయురాలు. మెట్టింటి పెద్ద కుటుంబ బాధ్యతను పూర్తిగా తన భుజస్కంధాలపై వేసుకొని సమర్థతతో ఆ కుటుంబాన్ని నిర్వహించగలగడం ఆమె తెలివితేటలకు నిదర్శనం. ఆమె ఎంత అలవోకగా, దక్షతతో గృహకృత్యాలను నిర్వహించేదంటే, కుట్టు అల్లిక మొదలైన పనులకు ఆమెకు ఎంతో తీరుబాటుకూడా ఉండేదంటే అతిశయోక్తికాదు. ఆమె అంతగా చదువుకోలేదు; కాని రామాయణ భారతాది ఇతిహాసాలను, తదితర ధార్మిక గ్రంథాలను మాత్రం చక్కగా చదవగలిగేది. కాని భర్తనుండి, కుమారుల నుండి, ఇతరుల నుండి అనేక విషయాలు మౌఖికంగా నేర్చుకొన్నందున, సంభాషించేటప్పుడు ఆమెను

ఉన్నత విద్యావంతురాలుగా పలువురు ఎంచడం కద్దు. ఆమె జ్ఞాపకశక్తి, ప్రతిధారణశక్తి అద్భుతం. ఒక్కసారి విన్న విషయాన్ని జ్ఞాపకం చేసుకొని తక్కున పునరుచ్చరించగలిగేది. సామెతలు ఆమె నోట్లో మెదలుతూనే ఉంటాయి.

భర్త మరణానంతరం గడ్డురోజులు ఎదురైనప్పుడు ఆమె సహజ స్థైర్యం పరీక్షకు నిలబడవలసి వచ్చింది. హఠాత్తుగా తారుమారైన పరిస్థితులలో ఆమె అద్భుత సహనాన్ని, ప్రశాంతతను, పొదుపును ప్రదర్శించి మారిన వాతావరణానికి అనుగుణంగా వ్యవహరించగలిగింది. నెలకు వెయ్యి రూపాయలతో కుటుంబాన్ని నిర్వహిస్తూ వచ్చిన ఆమెకు నేడు కేవలం ముప్ఫై రూపాయలతో తనతోబాటు కుమారులను, కుమార్తెలను పోషించుకోవలసిన అగత్యం ఏర్పడింది. కాని ఏనాడు ఆమె నిరాశానిస్పృహలు చెందలేదు. ఆ కొద్దిపాటి రాబడితోనే ఆమె చక్కగా ఇంటిని గడుపుతూ వచ్చింది; చూసేవారికి ఆమె గృహ నిర్వహణకు ఎంతో వ్యయం చేస్తూన్నట్లు కానవచ్చేది. భర్త హఠాన్మరణానంతరం భువనేశ్వరికి దాపురించిన దుర్భర కష్టాలను గురించి ఆలోచిస్తే ఎవరికైనా వణకురాక తప్పదు. కుటుంబ ఖర్చులకై స్థిరమైన ఆదాయం ఏదీ లేదు; అయినప్పటికీ వృద్ధురాలైన తల్లిని, సంతానాన్ని ఉన్నంతలో బాగా చూసుకోవలసిన బాధ్యత తప్పలేదు. తన భర్త ఉదారత్వంతో జీవితంలో బాగా స్థిరపడ్డ బంధువులు ఈ క్లిష్టపరిస్థితుల్లో ముందుకు వచ్చి సహాయం అందించక పోగా, న్యాయంగా ఆమెకు చెందవలసిన ఆస్తిపాస్తులనుకూడా ఆమెకు దక్కనీయకుండా చేయాలని ప్రయత్నించసాగారు. సుగుణసంపన్నుడైన ఆమె పెద్ద కుమారుడు నరేంద్రనాథ్‌కు శాయశక్తులా ప్రయత్నించినా ఉద్యోగం ఏదీ దొరకలేదు; దాంతో అతడికి సంసారం పట్ల విరక్తి కలిగి, సంసార పరిత్యాగం చేయగోరి అందుకు సిద్ధం కాసాగాడు. ఈ దుర్భర పరిస్థితులలో సైతం భువనేశ్వరీదేవి తన కర్తవ్యాలను నిర్వర్తించిన తీరుతెన్నులు చూస్తే, ఆమె పట్ల ఎవరికి మాత్రం గౌరవాదరణలు కలుగవు? శ్రీరామకృష్ణులతో నరేంద్రుని కేర్పడ్డ సాన్నిహిత్య బాంధవ్యాన్ని గురించి వివరించబోయేటప్పుడు, ఆ కాలఘట్టంలో నరేంద్రుని కుటుంబ స్థితిని గురించి మళ్లీ ప్రస్తావించగలం. కనుక ఇప్పుడు నరేంద్రుని రెండవసారి దక్షిణేశ్వర రాక గురించి వివరించబోతున్నాం.

4. శ్రీరామకృష్ణులతో నరేంద్రుని రెండవ, మూడవ సమావేశాలు

1. శ్రీరామకృష్ణులను రెండవసారి కలుసుకోవడంలో నరేంద్రుని జాప్యం

ఆత్మవిశ్వాసం, మహోదార లక్ష్యాలతో ఒప్పారేవారు, ఇతరులలోని మహత్వాన్ని కనుగొన్నప్పుడు తక్షణమే దానిని గుర్తించి ఆనంద భరితులౌతారు. మళ్లీ ఎవరిలోనన్నా అసాధారణ స్థాయిలో మహత్వం అభివ్యక్తమవడం వారు గమనిస్తే, వారి మనస్సులు సదా ఆ భావనలోనే నెలకొని ఉంటాయి; అలా నెలకొని ఉండేకొద్దీ వారి పట్ల ఏర్పడ్డ ప్రశంసాభావ ఆనందపారవశ్యంలో విభ్రాంతు లవడం కద్దు. అయినప్పటికీ ఆ ప్రశంసాప్రభావంలోపడి స్వకీయ మార్గాన్ని వీడి, తాము ప్రశంసించే వ్యక్తి జీవనాన్ని అనుకరించరు. సుదీర్ఘ సాంగత్యమూ, తద్ద్వారా పెంపొందిన మధురానురాగం మూలంగానే ఆ ప్రశంస వారి జీవితాలలో ప్రస్ఫుట ప్రభావాన్ని కల్పిస్తుంది. శ్రీరామకృష్ణులను మొదటి సారి దక్షిణేశ్వరంలో కలుసుకొన్నప్పుడు నరేంద్రుడు ఆ స్థితిలో ఉన్నాడు. శ్రీరామకృష్ణుల అద్భుత వైరాగ్యం అతణ్ణి ఎంతగానో ఆకట్టుకొన్నప్పటికీ, నరేంద్రుడు మొదట్లో ఆయనను జీవిత ఆదర్శమూర్తిగా అంగీకరించలేదు. ప్రథమ సమావేశానంతరం దక్షిణేశ్వరం నుండి తిరిగి వచ్చిన తరువాత శ్రీరామకృష్ణుల అద్భుత వ్యక్తిత్వమూ, ప్రవర్తన అతడికి పదేపదే గుర్తుకు వచ్చాయనడంలో ఎలాటి సందేహమూలేదు. అయినప్పటికీ రెండవసారి తప్పక వస్తానని ఆయనకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడానికి అతడు తొందరపడలేదు. తాను అధ్యయనం చేసిన పాశ్చాత్య మనస్తత్వశాస్త్ర జ్ఞానం మేరకు శ్రీరామకృష్ణులు ఒక ఏకోన్మాది అని అతడు నిర్ణయించడం, అతడి రెండవసారి దక్షిణేశ్వర రాకను వాయిదా వేయడానికి కారణమైంది. పైగా అతడు అనేక

కార్యాలలో నిమగ్నుడవడం కూడా అందుకు ఒక కారణం కావచ్చు. ధ్యానాభ్యాసం, కళాశాల చదువుకు తోడు నరేంద్రుడు ఆ సమయంలో సంగీత వ్యాయామాలలో శిక్షణ కూడా పొందుతున్నాడు. అంతేకాక బ్రహ్మసమాజ పద్ధతిలో తన మిత్రుల మానసిక, ఆధ్యాత్మిక వికాసం నిమిత్తం అతడు కలకత్తాలో వివిధ ప్రాంతాలలో ప్రార్థన, చర్చా వేదికలను నిర్వహించసాగాడు. కాబట్టి ఒక నెలపాటు దక్షిణేశ్వరానికి వెళ్లాలనే ఆలోచన అతడికి రాకపోవడంలో ఆశ్చర్యం ఏముంది? దైనందిన కర్తవ్యాల కారణంగా అతడు దక్షిణేశ్వరానికి వెళ్లలేకపోయినప్పటికీ, వీలైనంత త్వరలో దక్షిణేశ్వరానికి ఒంటరిగా వస్తానన్న వాగ్దానాన్ని నెరవేర్చమని అతడి సత్యనిష్ఠ, స్మృతి పదేపదే పురికొల్పుతూనే ఉన్నాయి. కాబట్టి ప్రథమ సమావేశం జరిగిన దాదాపు నెల తరువాత ఒక రోజు నరేంద్రుడు ఒంటరిగా దక్షిణేశ్వరానికి బయలుదేరాడు. ఆ నాడు అక్కడ జరిగిన సంఘటనల గురించి మాకు నరేంద్రుడు తెలిపిన వివరాలను పాఠకులకు ఇక్కడ పొందుపరుస్తున్నాం:

2. శ్రీరామకృష్ణుల యోగశక్తి ద్వారా నరేంద్రుడు పొందిన అద్భుతమైన అనుభవం

''కలకత్తా నుండి దక్షిణేశ్వరం బాగా దూరంలో ఉందన్న విషయం నాకు అంతగా తెలియదు. అక్కడకు నేను ఒక్కసారే వెళ్లాను, అదీ బండిలో వెళ్లడం తటస్థించింది. బారానగర్‌లోని నా మిత్రులైన దాశరథి సన్యాల్, శత్కారి, లాహిరి మొదలైన వారి ఇళ్లకు వెళ్లేవాణ్ణి; రాణీరాస్మణి ఉద్యానం బారానగర్‌కు సమీపంలోనే ఉందనుకొనేవాణ్ణి. కాని ఆనాటి నా దక్షిణేశ్వర ప్రయాణానికి ఎడతెరపి లేనట్లే కనిపించింది. అక్కడా ఇక్కడా వాకబు చేసుకొంటూ మొత్తానికి ఎలాగో అలా దక్షిణేశ్వరం చేరుకొన్నాను. తిన్నగా శ్రీరామకృష్ణుల గదిలోకి వెళ్లాను. చిన్నిమంచంమీద ఆయన తన్మయులై కూర్చుని ఉండడం చూశాను; గదిలో మరెవరూ లేరు. నన్ను చూడగానే నన్ను దగ్గరకు రమ్మని పిలిచి ఆనందంగా ఆ చిన్ని మంచం చివర కూర్చోబెట్టుకొన్నారు. నేను కూర్చున్నాను; ఆయన ఒక విచిత్ర భావంలో మగ్నులైవున్నారు. తమలో తామే అస్పష్టంగా ఏదో గొణుక్కొంటున్నారు. తదేకంగా నన్ను చూస్తూ మెల్లగా నా వద్దకు రాసాగారు. మరొక పిచ్చి దృశ్యం చూడబోతున్నాననుకొన్నాను. అలా అనుకొంటూ ఉండగానే, ఆయన నా వద్దకు వచ్చి తన కుడి పాదాన్ని నా మీద ఉంచారు. తక్షణమే నా కొక అద్భుత అనుభూతి కలిగింది. గదిలోని వస్తువులన్నీ గోడలతో సహా గిరాగిరా తిరుగుతూ ఏదో తెలియరాని ప్రాంతానికి తిరోగమించడమూ, ఈ విశ్వమంతా 'నేను' అన్న భావంతో సహా సమస్తాన్ని మ్రింగివేసే మహాశూన్యంలోకి మాయమైపోవడమూ కళ్లారా చూశాను. అప్పుడు



శ్రీరామకృష్ణుల గది

నన్ను విపరీతమైన భయం ఆవరించింది. 'నేను' అన్న భావం నశించడం మరణమే అని నాకు తెలియని విషయం కాదు. మరణం నాకు అత్యంత సమీపంలోనే ఉందనుకొన్నాను. నన్ను అదుపులో ఉంచుకోలేక, 'ఆహ్! నాకు మీరు ఏం చేశారు? నాకు తల్లితండ్రులున్నారని మీకు తెలుసా' అంటూ బిగ్గరగా కేక పెట్టాను. నా మాటలు విని పెద్దగా నవ్వుతూ, తమ చేత్తో నా ఛాతీని నిమురుతూ, 'సరే, ఇది ఉపశమిస్తుందిలే. మొత్తం ఒకేసారి చేయనవసరం లేదు. కాలక్రమంలో కలుగుతుంది' అని చెప్పారు. ఆయన అలా చెప్పిన తక్షణమే ఆ అద్భుత అనుభూతి ఎలా కలిగిందో అట్లే క్షణంలో మాయమవడం చూసి ఆశ్చర్యచకితుడనయ్యాను. నేను మామూలు స్థితికి వచ్చి గదిలోను, బయట వస్తువులు నిశ్చలంగానే ఉండడం గమనించాను.

"ఆ సంఘటనను వర్ణించడానికి ఒకింత సమయం పట్టినప్పటికీ, నిజంగా అది జరగడానికి అంతకంటే ఎంతో తక్కువసేపే పట్టింది. ఆ సంఘటన నా మనస్సులో గొప్ప విప్లవాన్ని ఉత్పన్నం చేసింది. జరిగింది ఏమిటో అర్థంకాక తబ్బిబ్బయ్యాను. ఈ అద్భుత వ్యక్తి శక్తి వలననే ఆ అసాధారణ

అనుభూతి హఠాత్తుగా కలగడం, మాయమవడం జరగడం కళ్లారా చూశాను.

3. నరేంద్రుని పునరాలోచనలు

పుస్తకాలలో నేను సమ్మోహనశక్తి, వశీకరణశక్తి గురించి చదివివున్నాను. ఈ సంఘటన కూడా అటువంటి కోవకు చెందినదేనా అనే అనుమానం తలెత్తింది. కాని నా మనస్సు దాన్ని ససేమిరా అంగీకరించలేదు. ఎందుకంటే, గొప్ప సంకల్పశక్తి గల వ్యక్తులు తమ ప్రభావాన్ని దుర్బల మనస్కుల మీద మాత్రమే పరపి అటువంటి స్థితులను కల్పిస్తారు. కాని నేను దుర్బల మనస్కుడను కాను; పైగా తెలివితేటలు, మనోబలం గల వ్యక్తినని నేను గర్విస్తూ ఉంటాను. అసాధారణ వ్యక్తుల ప్రభావంలో పడి వారి చేతిలో కీలుబొమ్మలా వ్యవహరించే సామాన్యులలా నేను సమ్మోహనానికి గురికావడం జరగలేదు. ఎటువంటి ప్రభావమూ నన్ను నియంత్రించడానికి నే నెన్నడూ వీలుకల్పించను. పైగా మొదటి నుండి ఆయన ఒక ఏకోన్మాది అనే కచ్చితమైన నిర్ణయానికి వచ్చినవాణ్ణి. హఠాత్తుగా ఆ స్థితిలో నేను ఎందుకు చిక్కువడిపోయాను? పర్యాలోచించి చూసినప్పటికీ ఏ నిర్ణయానికి నేను రాలేకపోయాను. తీరని సమస్యగా అది నా హృదయంలో అట్లే నిలిచిపోయింది. ఈ సందర్భంలో, 'నీ తత్త్వశాస్త్రం కనే కలలకంటే స్వర్గంలోను, భువిలోను ఇంకా ఎన్నో విషయాలు ఉన్నాయి' అన్న షేక్స్పియర్ మహాకవి వచనాలు నాకు గుర్తుకొచ్చాయి. ఈ విషయంకూడా అటువంటిదేనేమో అని అనుకొన్నాను. దీన్లోని నిజానిజాలు తేల్చుకోవడం సాధ్యంకాదని నిశ్చయించుకొన్నాను. కాని ఈ అద్భుతమైన పిచ్చి వ్యక్తి ప్రభావంలో ఇకముందు పడిపోకుండా గట్టి జాగ్రత్త తీసుకోవాలని మాత్రం నిశ్చయించుకొన్నాను.

''కాని నా ఆలోచనలు కొనసాగుతూనే ఉన్నాయి: దృఢసంకల్పం, ప్రగాఢ విశ్వాసాలు సంతరించుకొన్న నా వంటి వ్యక్తి మనోనిర్మాణాన్ని ముక్కలు

4. శ్రీరామకృష్ణులను సునిశితంగా పరిశీలించాలని నరేంద్రుడు తీర్మానించుకోవడం

ముక్కలుగా చెల్లాచెదరు గావించి, దానిని మట్టిముద్దలా తనకు ఇష్టమైన నమూనాలో మలచగలిగిన వ్యక్తిని పిచ్చివానిగా ఎలా పరిగణించగలను? కాని ఆయన ప్రవర్తన, నన్ను పక్కకు తోడ్కొనివెళ్లి చెప్పిన పలుకులు - వీటి సంగతి ఏమిటి? వాటిని పిచ్చివాని ప్రేలాపనలా కాకుండా మరెలా తీసుకోవాలి? కాబట్టి పై నా అనుభవానికి కారణం ఏమిటో తెలుసుకోలేకపోయినప్పటికీ, ఈ బాలునివంటి పావన, సరళహృదయుణ్ణి గురించి ఏ నిశ్చితాభిప్రాయానికీ నేను రాలేకపోయాను. ఒక వ్యక్తి గురించి గాని లేదా ఒక ప్రతిపాదన గురించిగాని సరైన పరిశీలన, దర్యాప్తు, యుక్తియుక్త విచారణ చేయకుండా నే నెన్నడూ ఎలాంటి నిర్ణయానికి వచ్చేవాణ్ణి కాను. బాల్యావస్థ నుండి నేను ఇదే

విధంగా వ్యవహరించేవాణ్ణి. ఆ రోజు నా నైజం తీవ్రమైన దిగ్భ్రాంతికి గురి కావడంతో నా హృదయం క్షోభించింది. తత్ఫలితంగా, ఆ అద్భుత వ్యక్తి శక్తిని, స్వభావాన్ని క్షుణ్ణంగా అవగతం చేసుకోవాలనే దృఢనిశ్చయం నాలో జనించింది.

''వివిధ ఆలోచనలతో, తీర్మానాలతో ఆ రోజు అలా గడిపివేశాను. కాని శ్రీరామకృష్ణులు ఆ సంఘటనానంతరం పూర్తిగా విభిన్న వ్యక్తిలా కనిపించారు; ఆప్యాయతతో స్వయంగా తానే నాకు తినిపిస్తూ చిరకాల పరిచయస్థునిలా నాతో మెలగసాగారు. సుదీర్ఘకాల ఎడబాటు తరువాత కలుసుకొన్న ప్రాణస్నేహితుడు లేదా అత్యంత సన్నిహిత బంధువు ప్రవర్తించే తీరులో ఆయన నాతో మెలగసాగారు. నాకు తినిపించారు, నాతో మాట్లాడారు, ఆప్యాయతాను రాగాలతో నన్ను ముంచెత్తారు; అయినప్పటికీ వీటితో ఆయన తృప్తి చెందినట్లు కనిపించలేదు. ఆయన అనురాగమయ ప్రవర్తన కూడా నాలో కించిత్తు కూడా ఆతురతను కల్పించలేదు. సాయంత్రం కావడంతో నాటికి ఆయన వద్ద సెలవు పుచ్చుకొన్నాను. మళ్లీ త్వరలో వస్తానన్న వాగ్దానం తీసుకొన్న తరువాతే ఆయన నాకు వీడ్కోలు తెలిపారు. జరిగిన దానిని గురించిన, నాలో చెలరేగిన సమస్యా పరిష్కారం గురించిన గాఢాలోచనలతో దక్షిణేశ్వరం నుండి వెనక్కు బయలు దేరాను.''

5. చిరకాల పరిచయస్థునిలా నరేంద్రునితో, శ్రీరామకృష్ణులు మెలగడం

రెండవసారి శ్రీరామకృష్ణులను కలుసుకొన్న తరువాత ఎంతకాలానికి నరేంద్రుడు మళ్లీ దక్షిణేశ్వరానికి వెళ్లాడో మాకు తెలియరాలేదు. కాని శ్రీరామకృష్ణుల అద్భుత శక్తిని పరికించిన తరువాత, ఆ శక్తి మూలాధారాన్ని గురించి అవగతం చేసుకోవాలనే ప్రగాఢ ఆకాంక్ష నరేంద్రునిలో జనించడం వలన మూడవసారి దక్షిణేశ్వరం వెళ్లడంలో నరేంద్రుడు జాప్యం చేసివుండడని భావిస్తాం. ఆ ఆతురత నరేంద్రుణ్ణి, శ్రీరామకృష్ణుల పాదపద్మాల వద్దకు వీలైనంత త్వరలోనే వెళ్లేలా చేసి వుండవచ్చు. బహుశా ఒక వారం తరువాత నరేంద్రుడు మూడవసారి దక్షిణేశ్వరం వెళ్లివుంటాడు. ఆ వారం రోజులు అతడు కళాశాలకు హాజరవడంలో నిమగ్నుడై ఉండివుంటాడు. ఎందుకంటే ఏదైనా సమస్య ఎదురైనప్పుడు, ఆ సమస్యను పరిష్కరించేదాకా తిండి తిప్పలు, విశ్రాంతి గురించి పట్టించుకోక పోవడం అతడి స్వభావం. కాబట్టి అతడి మనస్సు శ్రీరామకృష్ణులను అవగతం చేసుకోవడంలో నిమగ్నమై ఉండివుంటుందనడంలో ఎలాటి సందేహమూ లేదు. అంతేగాక మూడవసారి శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లినప్పుడు, ఆయన

6. నరేంద్రుని మూడవ సమావేశం

ప్రభావంలో పడిపోకూడదని మనస్సును స్థిరపరచుకొనే వెళ్లివుంటాడని రూఢిగా చెప్పవచ్చు. కాని అక్కడ జరిగింది అనూహ్యం. శ్రీరామకృష్ణుల నుండి, నరేంద్రుడి నుండి మేం ఈ సందర్భంగా విన్న విషయాలు ఇక్కడ పొందుపరుస్తున్నాం.

ఆ సందర్భంలో కాళికాలయం జనసమ్మర్దంగా ఉండడం వలన కాబోలు శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి సమీపంలోని యదుమల్లిక్ ఉద్యానానికి తనతో కూడా రమ్మన్నారు. లేదా మరేదో కారణం కూడా ఉండి వుండవచ్చు. యదుమల్లిక్‌కు, ఆయన తల్లికి శ్రీరామకృష్ణుల పట్ల ఎంతో భక్తిప్రపత్తులుండేవి. తాము లేని సమయంలో శ్రీరామకృష్ణులు ఉద్యానానికి వస్తే, గంగాభిముఖంగా ఉన్న చావడిని ఆయనకోసం తెరిచి ఉంచమని తమ ఉద్యానవన సంరక్షకుడికి ఆదేశాలు ఇచ్చివున్నారు. ఆ రోజు శ్రీరామకృష్ణులు నరేంద్రుడితో కలిసి గంగాతీరాన ఉన్న ఆ ఉద్యానంలో కొంతసేపు పచార్లుచేశారు. నరేంద్రుడితో మాట్లాడుతూ, ఆ చావడిలోకి వచ్చి కూర్చున్నారు; ఆ క్షణంలోనే భావపారవశ్యంలో మగ్నులైపోయారు. నరేంద్రుడు ప్రక్కనే కూర్చుని ఆయన ఆ స్థితిని ప్రశాంతంగా పరిశీలించసాగాడు. హఠాత్తుగా శ్రీరామకృష్ణులు ఇంతకు ముందులా నరేంద్రుణ్ణి స్పృశించారు. గత అనుభవం గుర్తుంచుకొని నరేంద్రుడు ఎంతో జాగ్రత్తగా ఉన్నప్పటికీ, ఆ స్పర్శశక్తిని తమాయించుకోలేకపోయాడు. గతంలోలా కాకుండా, ఇప్పుడు ఆ స్పర్శతో నరేంద్రుడు పూర్తి బాహ్యస్మృతిని కోల్పోయాడు. కాసేపటికి బాహ్యస్మృతి వచ్చాక చూస్తే, తమ చేత్తో తన ఛాతీని నిమురుతూ శ్రీరామకృష్ణులు కనిపించారు. నరేంద్రుడు మామూలు స్థితిలోకి రావడం చూసి ఆయన మందహాసం చేశారు.

7. భావపారవశ్యంలోని శ్రీరామకృష్ణుల స్పర్శతో నరేంద్రుడు బాహ్యస్మృతిని కోల్పోవడం

బాహ్యస్మృతి కోల్పోయిన తరువాత తాను పొందిన అనుభూతిని గురించి నరేంద్రుడు మాతో ఏమీ చెప్పలేదు. అది గోప్యమైన విషయమై ఉంటుంది కాబట్టి అతడు మాతో దాన్ని గురించి చెప్పలేదని మేం అనుకొన్నాం. కాని ఈ సంఘటన గురించి తదనంతరం ఎప్పుడో మాతో ముచ్చటిస్తూ శ్రీరామకృష్ణులు, నరేంద్రుడు పొందిన అనుభూతిని గురించి సహజంగానే అతడు ఎరిగివుండడని చెప్పినప్పుడు అసలు విషయం మేం గ్రహించగలిగాం. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు:

''నరేంద్రుడు బాహ్యచైతన్యరహితుడై ఉన్న ఆ సమయంతో అతణ్ణే అతడెవరు, ఎక్కణ్ణుండి వచ్చాడు, ఎందుకు వచ్చాడు (జన్మించాడు), ఇక్కడ (ఈ భువిలో) ఎంతకాలం ఉంటాడు వంటి ప్రశ్నలు వేశాను. తన అంత

రాంతరాళాల్లోకి పోయి అతడు నా ప్రశ్న లన్నిటికీ సముచిత జవాబు లిచ్చాడు. అతడి జవాబులు, నా దర్శనాలలో అతణ్ణి గురించి నే నెరిగిన విషయాలను రూఢిపరిచాయి. ఆ విషయాలను వెల్లడించడం నిషిద్ధం. కాని అసలు తానెవరో తెలుసుకొన్న నాడు అతడు ఇక ఈ ఇలలో ఉండడని ఈ విషయాల నుండి నేను గ్రహించగలిగాను; తక్షణమే అతడు దృఢసంకల్పంతో యోగం ద్వారా దేహాన్ని పరిత్యజిస్తాడు. నరేంద్రుడు ఒక గొప్ప ధ్యానసిద్ధుడు.''

8. ఆ బాహ్యచైతన్య రహిత స్థితిలో నరేంద్రుణ్ణి, శ్రీరామకృష్ణులు ప్రశ్నించడం

ఆ తదనంతరం నరేంద్రుణ్ణి గురించి తాము పొందిన దివ్యదర్శనాలను శ్రీరామకృష్ణులు కించిత్తు మాతో చెప్పారు. పాఠకుల సౌకర్యార్థం వాటిని ఇక్కడ వివరించబోతున్నాం. నరేంద్రుడు దక్షిణేశ్వరానికి రాక మునుపే శ్రీరామకృష్ణులకు ఆ దివ్యదర్శనానుభూతులు కలిగాయన్న విషయం, ఆ దర్శనాలను ఆయన మాకు వివరించినప్పుడు మాకు అవగతమైంది. శ్రీరామకృష్ణులు మాకు ఇలా వివరించి చెప్పారు:

''ఒక రోజు సమాధి స్థితిలో నా మనస్సు జ్యోతిర్మండలం గుండా పైపైకి పోవడం నేను చూశాను. సూర్యచంద్ర నక్షత్ర సమేతమైన ఈ స్థూలప్రపంచాన్ని అతిక్రమించి మొట్టమొదట అది భావమయ సూక్ష్మ జగత్తులోకి ప్రవేశించింది. సూక్ష్మ సూక్ష్మతమ భూములను మనస్సు అధిరోహించేకొద్దీ, బాటకు ఇరు వంకల సౌందర్యవంతులైన దేవతామూర్తులు కానరాసాగారు. క్రమంగా నా మనస్సు ఆ ప్రాంతం శివార్లను చేరుకొంది. అక్కడ ఖండ, అఖండ జగత్తులను వేరుచేస్తున్న ఒక వెలుగు రేఖను చూశాను. దానిని లంఘించి నా మనస్సు మెల్లగా ఆ అఖండ జగత్తులోకి ప్రవేశించింది. అక్కడ సాకారమయమైన దేదీ కనిపించలేదు. దివ్యదేహాలైన దేవీదేవతలు సైతం ఆ దిగువ లోకాలలోనే ఆధిపత్యం చెలాయించగలరు కనుక అక్కడ ప్రవేశించడానికి నేను భయపడ్డాను. కాని మరుక్షణంలోనే దేహధారులూ, దివ్యతేజస్కులూ అయిన సప్తర్షులు అక్కడ సమాధిమగ్నులై కూర్చుని ఉండడం చూశాను. ఆ ఋషులు జ్ఞానంలో, సౌజన్యంలో, ప్రేమపరిత్యాగాలలో దేవతలనే తలదన్నినట్లుగా నాకు కనిపించారు. ఆశ్చర్యచకితుడనై వారి మహత్వం గూర్చి పర్యాలోచిస్తూండగా, నా ముందు ఆ అఖండ జగత్తులోని తేజోరాశిలో కొంతభాగం ఘనీభవించి ఒక దివ్య శిశువుగా రూపొందడం చూశాను. ఆ దివ్యశిశువు మెల్లగా ఒక ఋషి వద్దకు వెళ్లి తన మృదువైన చేతులను ఆయన మెడచుట్టూ వేసి, మృదుమధుర స్వనంలో పిలుస్తూ ఆయనను సమాధి నుండి మేల్కొల్ప

9. నరేంద్రుణ్ణి గురించిన శ్రీరామకృష్ణుల అద్భుత దర్శనం

డానికి ప్రయత్నించింది. ఆ కోమల హస్త స్పర్శతో ఆ ఋషి జాగ్రదావస్థలోకి వచ్చి అర్ధనిమీలితనేత్రుడై ఆ అద్భుత శిశువును చూశాడు. ఆ శిశువును చూడగానే ఆయన వదనంలో భాసించిన మహదానందాన్ని చూసి వారి అను బంధం శాశ్వతమైనదనే తలపు నాలో మెదలింది. ఆ అసాధారణ దివ్యశిశువు అనంతమైన ఆనందం పొందుతూ ఆ ఋషితో, 'నేను వెళుతున్నాను, నువ్వు నాతో కూడా రావాలి!' అని అన్నది. ఆ విన్నపానికి ఆయన ఏం బదులు పలుక లేదు, కాని ఆయన ప్రేమాస్పద నేత్రాలు అందుకు అంగీకారాన్ని తెలుపకనే తెలిపాయి. తరువాత ఆ శిశువును ఆప్యాయంగా చూస్తూ ఆయన సమాధి మగ్నుడైనాడు. ఇదంతా చూసి నేను ఆశ్చర్యపోతూవుండగా, ఆ ఋషి మన శ్శరీరాలలో కొంతభాగం దివ్యప్రకాశంగా మారి భూమి వైపుగా దిగసాగింది. మొట్టమొదటిసారి నరేంద్రుణ్ణి చూసీచూడగానే ఆ ఋషిసత్తముడే నరేంద్రు డని నేను గ్రహించాను.''[1]

10. శ్రీరామకృష్ణుల పట్ల నరేంద్రుని దృఢ విశ్వాసం

రెండవసారి శ్రీరామకృష్ణుల అద్భుతశక్తి ప్రభావం నరేంద్రుడి మానసిక స్థితిలో మార్పును ఉత్పన్నం చేసినప్పుడు అతడు తప్పక ఆశ్చర్యచకితుడై ఉంటాడు. ఆ అనుల్లంఘనీయమైన దివ్యశక్తితో పోల్చుతే తన మనోశక్తి, తెలివి నిరుపయోగాలని నరేంద్రుడు అంత రాంతరాళాల్లో గ్రహించాడు. శ్రీరామకృష్ణులు ఒక ఏకో న్మాది అనే అతడి గత అభిప్రాయం మారిపోయింది. కాని మొదటి సమా వేశంలో ఏకాంతంగా శ్రీరామకృష్ణులు అతడికి చెప్పిన మాటల అర్థం, ఉద్దేశం అతడు అవగతం చేసుకొనేవుంటాడని మాత్రం చెప్పలేం. శ్రీరామకృష్ణులు దివ్యశక్తి సంతరించుకొన్న అసాధారణమైన మహనీయులనీ, తనవంటి వ్యక్తి మనస్సును సంకల్పమాత్రాన ఊర్ధ్వదిశకు త్రిప్పగలరనీ మాత్రం నరేంద్రుడు గ్రహించి ఉంటాడు. అంతేకాక శ్రీరామకృష్ణుల సంకల్పం దైవసంకల్పంతో తాదాత్మ్యం చెందివుండడం వలన, ఆనాడు అందరూ పొందలేని అరుదైన అనుగ్రహం ఆయన దాక్షిణ్యం కారణంగానే తనకు లభించిందని కూడా నరేం ద్రుడు గ్రహించి ఉంటాడు; కనుక కోరకుండానే అటువంటి లోకోత్తర మహ నీయుని అనుగ్రహానికి పాత్రుడనవడం తన మహద్భాగ్యమేనని నరేంద్రుడు భావించాడు.

---

1. శ్రీరామకృష్ణులు తమ దివ్యదర్శనాన్ని మాతో అతి సరళభాషలో వర్ణించి చెప్పారు. అదే భాషలో అట్లే వర్ణించి చెప్పడం మాకు సాధ్యం కాదు. మా శక్తిమేరకు ఆయన భాషను అట్లే ఉపయోగించి క్లుప్తంగా వివరించాము. ఒక రోజు ఆ శిశువు గురించి అడిగినప్పుడు, శ్రీరామ కృష్ణులే ఆ శిశువు రూపం దాల్చారని మాకు తెలియవచ్చింది.

11. గురువు గురించిన నరేంద్రుని భావనలో మార్పు

పై నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో నరేంద్రుడు తన అనేక గత అభిప్రాయాలను మార్చుకోవలసి వచ్చింది. ఒక వ్యక్తిని గురువుగా లేదా ఆధ్యాత్మిక మార్గదర్శిగా అంగీకరించడానికి గతంలో అతడు ఎంతో ఆక్షేపణ తెలిపేవాడు; ఎందుకంటే, స్వల్ప శక్తులు, దర్శనాలు సంతరించుకొని తనలాగే బలహీనుడై ఉన్న ఆ వ్యక్తి, తదనంతరకాలంలో విచక్షణారహితంగా తన ఉత్తరువులను పాటించమనడం అవివేకంగా నరేంద్రుడు భావించడమే ఇందుకు కారణం. బ్రహ్మ సమాజంలో చేరినప్పుడు ఆ వైఖరిని నరేంద్రుడు రూఢిపరచుకొన్నాడని చెప్పడం అనవసరం. పై రెండు రోజులలో జరిగిన సంఘటనలు ఆదిలో గురువుపట్ల అతడికిగల భావనను తీవ్రంగా కుదిపివేసింది. సామాన్యజనుల మనస్సులలోని భగవంతుని భావనను మించిన అసాధారణ ప్రేమ, పావనత్వం, తపస్సు, వైరాగ్యం సంతరించుకొన్న అటువంటి మహనీయులు, ఈ లోకంలో, అరుదుగానే అయినప్పటికీ ఉద్భవిస్తారనే విషయం నరేంద్రుడు అవగతం చేసుకొన్నాడు. కాబట్టి అటువంటి వ్యక్తులను గురువులుగా అంగీకరిస్తే జనసామాన్యం ఎంతో లబ్ధి పొందుతుంది. పర్యవసానంగా శ్రీరామకృష్ణులను గురువుగా అంగీకరించడానికి నరేంద్రుడు సంసిద్ధుడైనాడు; కాని శ్రీరామకృష్ణుల ప్రతి వచనాన్ని విచక్షణారహితంగా అంగీకరించడానికి మాత్రం అతడు ఇంకా తయారుకాలేదు.

12. వైరాగ్య పథంలో నరేంద్రుని పురోగతి

వైరాగ్యం సంతరించుకోకుండా భగవత్సాక్షాత్కారం లభించదనే భావన నరేంద్రుడి మనస్సును చిన్ననాటి నుండి ప్రభావితం చేస్తూవచ్చింది. అది అతడిలో స్వతసిద్ధంగా నెలకొని ఉన్నదే; అందుకు కారణం అతడి గతజన్మ సంస్కారాలే! అతడు బ్రహ్మ సమాజ సభ్యుడైనప్పటికీ వివాహ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలనే వారి సమావేశాల, చర్చావేదికలలో అతడెన్నడూ పాల్గొనలేదనే సంగతి పైన పేర్కొన్న విషయానికి ఋజువుగా భావించవచ్చు. సర్వసంగ పరిత్యాగులైన శ్రీరామకృష్ణుల పరిచయంతోను, ఆయన అసాధారణ శక్తులను పరికించడంతోను వైరాగ్య భావన ఇప్పుడు పూర్తిగా అతడిలో వికసించసాగింది.

అప్పటి నుండి నరేంద్రుడు ఒకే విషయం గురించిన ఆలోచనలతో సతమతం కాసాగాడు. అటువంటి గొప్ప మహాత్ముల సాంగత్యంతో మనిషి మనస్సు వారి ప్రతి వచనాన్ని సముచిత రీతిలో ఆచితూచకుండానే విశ్వసిస్తుందని నరేంద్రుడు భావించేవాడు. ఏది ఏమైనప్పటికీ అలా జరగకుండా తాను జాగ్రత్త పడాలని అనుకొన్నాడు. పైన వర్ణించిన రెండు రోజుల సంఘటనల కారణంగా

13. పరీక్షించకుండా ఉపదేశాలను స్వీకరించ రాదనే నరేంద్రుని సంకల్పం

ఇప్పుడు శ్రీరామకృష్ణుల పట్ల ఎంతో భక్తిప్రపత్తులు నరేంద్రుడు చెల్లిస్తూ వున్నప్పటికీ, శ్రీరామకృష్ణుల దర్శనాలను, అనుభూతులను అట్లే విశ్వసించ రాదనే నిర్ణయానికి వచ్చాడతడు; ఆ అనుభూతుల దర్శ నాల గురించి వ్యక్తిగతంగా తాను తెలుసుకోకుండా లేదా ఒకవేళ శ్రీరామకృష్ణులు అసంతుష్టులైనప్పటికీ వాటిని కఠిన హేతువాద పరీక్షకు గురి చేయకుండా నమ్మరాదను కొన్నాడు; పర్యవసానంగా ఒక వంక ఆధ్యాత్మిక జగత్తులోని నిక్షిప్త సత్యాలను గ్రహించడంలో సదా మనస్సును సంసిద్ధంగా ఉంచినప్పటికీ, మరో వంక అప్పటి నుండి శ్రీరామకృష్ణుల అద్భుత ప్రవర్తన, దర్శనాలను తీవ్ర పరీక్షకు గురిచేయడంలో నిమగ్నుడయ్యాడు.

14. అప్పటి నుండి నరేంద్రుని ప్రవర్తన

ప్రథమ సమావేశంలో విచిత్ర పదాలతో తనను సంబోధించడంతో నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను ఏకోన్మాదిగా పరిగణించాడు. శ్రీరామకృష్ణులను అవతారమూర్తిగా ఎంచి ఆయన వచనాలను పరికిస్తే, నరేంద్రుని కుశాగ్రబుద్ధికి ఆ వచనాల ప్రస్ఫుట అర్థం తోచేది. కాని సత్యాన్వేషితమైన, యుక్తియుక్తమైన ఆతడి మనస్సు హఠాత్తుగా ఈ వాస్తవాన్ని ఎలా అంగీకరిస్తుంది? కాబట్టి ఆ వచనాలను, ఆ సంఘటనలను అర్థం చేసుకోగల శక్తిని భగవంతుడు ఎప్పటికైనా ప్రసాదించినప్పుడు వాటిని గురించి చర్చించాలని అతడు నిశ్చయించుకొన్నాడు. ఆ విధంగా ఆ సమస్యను తన మనస్సులో ఒక మూలకు నెట్టివేసి, భగవత్సాక్షాత్కారం ఎలా పొంది తరించాలో శ్రీరామకృష్ణులతో చర్చించడంలో, ఆయననుండి నేర్చుకోవడంలో అతడు నిమగ్నుడయ్యాడు.

15. అప్పటి నరేంద్రుని మానసిక స్థితి

తన గత నిశ్చితాభిప్రాయాలను మార్చుకొని నూతన సత్యాలను అంగీ కరించే సమయంలో దృఢమైన మనస్సు అంతరంగంలో నుండి బలమైన ప్రతి ఘటనను ఎదుర్కొనడం సహజం. నరేంద్రుడు ఇప్పుడు ఆ సంకట స్థితిలోనే ఉన్నాడు. శ్రీరామకృష్ణుల అద్భుత శక్తిని కళ్లారా చూసినప్పటికీ ఆయనను పూర్తిగా అంగీకరించలేదు; ఆయన పట్ల ఆకర్షితుడైనప్పటికీ, ఆయన నుండి దూరంగా ఉండగోరాడు. ఆతడి ఈ వైఖరి పర్యవసానం ఏ విధంగా పరిణమించిందో ముందు ముందు చూడ బోతాం.

5. శ్రీరామకృష్ణుల నిస్వార్థ ప్రేమ: నరేంద్రనాథ్

1. తొలి జీవితంలో నరేంద్రుని అసాధారణ అనుభూతులు

నరేంద్రనాథ్ ఎంతో అరుదైన ఉదాత్త సంస్కారాలతో జన్మించాడు. శ్రీరామకృష్ణులను దర్శించడానికి మునుపే అతడు పొందిన అసామాన్య అనుభూతులు ఈ విషయాన్ని రూఢిచేస్తాయి. అందుకు కొన్ని ఉదాహరణలను ఇక్కడ పొందుపరుస్తున్నాం. నరేంద్రుడు ఇలా చెప్పేవాడు: ''నిద్రించడానికి కళ్లు మూసుకోగానే భ్రూమధ్యంలో ఒక అద్భుతమైన జ్యోతి బిందువును జీవిత పర్యంతం గాంచేవాణ్ణి; ఆ జ్యోతిలో ఏర్పడే వివిధ మార్పులను శ్రద్ధగా గమనించేవాణ్ణి. ఆ జ్యోతిని స్పష్టంగా చూడాలనే ఉద్దేశంతో నేను బోర్లగా పడుకొనేవాణ్ణి. ఆ అసాధారణ జ్యోతి బిందువు రంగులు మారుస్తూ, పరిమాణంలో పెద్దదవుతూ కానవచ్చేది; క్రమంగా ఆ బిందువు బంతి పరిమాణానికి పెరిగి చివరకు పగిలిపోయి, నా ఆపాదమస్తకాన్ని ధవళ కాంతితో కప్పివేసేది. అలా జరుగగానే నేను బాహ్యస్మృతి కోల్పోయి, నిద్రలోకి జారిపోయేవాణ్ణి. అందరూ అదేవిధంగా నిద్రించేవారనుకొనేవాణ్ణి. చాలాకాలం అదే అభిప్రాయంలో ఉండిపోయాను. పెరిగి పెద్దవాడినయ్యాక ధ్యానం అభ్యసిస్తున్నప్పుడు, కళ్లు మూసుకోగానే ఆ జ్యోతి బిందువు నా ముందు ప్రత్యక్షమయ్యేది; అప్పుడు నా మనస్సును దాని మీద ఏకాగ్ర పరచేవాణ్ణి. మహర్షి దేవేంద్రనాథ్‌గారి ఉపదేశానుసారం ఆ రోజుల్లో నేను కొందరు మిత్రులతో నిత్యం ధ్యానం అభ్యసించేవాణ్ణి. మాలో మేం మాకు కలిగిన అనుభూతులు, దర్శనాలను గురించి మాట్లాడుకొనేవారం. ఆ సందర్భంలోనే వారెవరికీ అటువంటి జ్యోతి దర్శనం కలగలేదనీ, వారెవరూ ఆ రీతిలో నిద్రపోయేవారు కారనీ నేను తెలుసుకొన్నాను.

''చిన్ననాటి నుండి కొన్ని సమయాలలో నేను ఒక వస్తువునో, ప్రదేశాన్నో లేదా వ్యక్తినో చూసినప్పుడు దానితోనో లేదా ఆ వ్యక్తితోనో నా కెంతో

పూర్వ పరిచయం ఉన్నట్లు తోచడం కద్దు; అంతకు పూర్వమే దానినో లేదా ఆ వ్యక్తినో చూసినట్లు నాకు అనిపించేది. ఇలా తరచుగా జరిగేది. బహుశా అప్పుడు నేను మిత్రులతో కలిసి ఏదో ఒక చోట ఏదో అంశం గురించి చర్చిస్తూ ఉండివుంటాను; ఆ సమయంలో ఎవరో ఏదో వ్యాఖ్యానించగానే, తక్షణమే, 'హా! ఈ అంశంమీదే వాళ్లతో ఈ ఇంట్లో చాలాకాలం క్రితం ముచ్చటించాను, ఇదే వ్యక్తి ఆ సమయంలో ఇలాగే వ్యాఖ్యానించాడు' అనే విషయం గుర్తుకొచ్చేది. ఎప్పుడు, ఎక్కడ వాళ్లతో ఆ విధంగా మాట్లాడానో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించాను గాని, స్ఫురణకు రాలేదు. పునర్జన్మ సిద్ధాంతం గురించి తెలిసినప్పుడు, బహుశా ఆ ప్రదేశాల, ఆ వ్యక్తులతో గత జన్మలో పరిచయం ఉండివుంటుందనీ, కొన్ని సమయాలలో ఆ విషయాలు పాక్షికంగా గుర్తుకు వస్తూవుండవచ్చుననీ అనుకొనేవాణ్ణి. ఆ తరువాత అటువంటి నిర్ణయానికి రావడం యుక్తియుక్తం కాదని గట్టి నమ్మకం ఏర్పడింది. నేను జన్మించడానికి పూర్వమే, ఈ జన్మలో పరిచయస్థులు కాబోయే వారిని ఏదో విధంగా చూసివుంటాననీ, నేను జన్మించిన తరువాత అప్పుడప్పుడు వారి జ్ఞాపకాలు నా మనస్సులో మెదలుతున్నవనీ ప్రస్తుతం[1] నాకు అనిపిస్తున్నది.''

2. శ్రీరామకృష్ణుల దివ్యశక్తుల ప్రత్యక్షానుభూతిని నరేంద్రుడు చవిచూడడం

శ్రీరామకృష్ణుల పావన జీవితం, భావపారవశ్యతల గురించి అనేకుల[2] నుండి విన్న తరువాతనే నరేంద్రుడు ఆయనను దర్శించడానికి వచ్చాడు. ఆయనను చూసినప్పుడు తనలో మానసికంగా మార్పు వస్తుందనిగాని లేదా అద్భుత అనుభూతిని చవిచూస్తాననిగాని అతడు కలలోకూడా ఊహించలేదు. కాని సంఘటనలు మరో విధంగా జరిగాయి. శ్రీరామకృష్ణులను

---

1. మేం అతడికి పరిచయస్థులమైన తరువాత ఈ అసాధారణ అనుభవాన్ని వెల్లడించాడు. కాని తన జీవిత అంతిమ కాలంలోనే ఆ తరువాతి నిర్ణయానికి రావడం తటస్థించింది.

2. దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు నరేంద్రుడు కలకత్తాలోని జనరల్ అసెంబ్లీ ఇన్స్టిట్యూషన్ నుండి ఎఫ్.ఏ. పరీక్షలు వ్రాయబోతున్నాడని ఇంతకు మునుపే తెలిపివున్నాం. ఉదార మనస్కుడూ, పండితుడూ అయిన హేస్టీ మహాశయుడు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉండేవాడు. బహుముఖ ప్రజ్ఞావంతుడూ, విద్యార్థుల పట్ల ఆప్యాయతతో మెలగే వాడూ అయిన ఈ ఆంగ్లేయుని నరేంద్రుడు ఎంతో గౌరవించేవాడు. ఒక రోజు ఆంగ్లసాహిత్య అధ్యాపకుడు హఠాత్తుగా అస్వస్థుడు కావడం వలన, ఎఫ్.ఏ. విద్యార్థులకు సాహిత్యం బోధించడానికి హేస్టీ స్వయంగా వచ్చాడు. వర్డ్స్‌వర్త్ కవితలను చర్చిస్తూ ఆ కవి ప్రకృతి శోభను ఆస్వాదిస్తూ సమాధి స్థితిలో మగ్నుడైపోవడం గురించి హేస్టీ ప్రస్తావించాడు. విద్యార్థులకు సమాధి స్థితి అంటే ఏమిటో అర్థం కాకపోవడం చూసి, వారికి ఆ అవస్థను గురించి సముచితంగా వివరించి చివరకు

→

రెండవసారి, మూడవసారి సందర్శించిన సందర్భంలో కలిగిన అసాధారణ అనుభూతులతో పోల్చిచూసినప్పుడు, నరేంద్రుడు గతంలో పొందిన అనుభూతులు చిల్లిగవ్వకు కొరగావని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. శ్రీరామకృష్ణుల వ్యక్తిత్వ అగాధాలను తరచిచూడ ప్రయత్నించినప్పుడు అసాధారణమైన ఆతడి మేధస్సు పరాజయాన్ని చవిచూసింది; ఆ సమస్యకు పరిష్కారం కనుచూపు మేరలో కానరాలేదు. అగ్రాహ్యమైన శ్రీరామకృష్ణుల దివ్యశక్తి మూలంగానే తనకు అద్భుత అనుభూతులు కలిగాయని విశ్వసించకపోవడంలో కించిత్తు కారణం కూడా అతడు కనుగొనలేకపోవడమే అందుకు హేతువు. దానిని గురించి గాఢంగా ఆలోచించేకొద్దీ అతడి విస్మయం మేరమీరసాగింది.

3. ఆధ్యాత్మిక జీవితానికి నరేంద్రుని అర్హత

శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరంలో రెండవసారి దర్శించినప్పుడు నరేంద్రుడు పొందిన అద్భుత అనుభూతిని గురించి యోచించిన ప్రతి ఒక్కరూ స్తబ్ధులు కావడం అనివార్యం. సుదీర్ఘకాల తపశ్చర్యలు వైరాగ్యం పాటించిన ఫలితంగా ఒక సామాన్యవ్యక్తి జీవితంలో అటువంటి అనుభూతి కలుగుతుందని శాస్త్రాలు వచిస్తున్నాయి; ఆ అనుభూతి కలిగినప్పుడు ఆ వ్యక్తి పరమానందం చెందడమే కాక, గురువులో భగవంతుని అభివ్యక్తీకరణను గాంచి, ఆయనకు ఆత్మసమర్పణ చేసుకొంటాడు. నరేంద్రుడు అలా చేయకపోవడంలో అంతగా ఆశ్చర్యపోనక్కరలేదు. ఆతడి అసాధారణ ఆధ్యాత్మిక అర్హత అతడలా చేయకపోవడానికి కారణం. ఆతడు ఆధ్యాత్మికతలో సమున్నత శ్రేణిలోని వ్యక్తి కావడం వలనే ఆ సమయంలో పూర్తిగా తన్మయత్వంలో మునిగిపోలేదు. ఈ అసాధారణ అర్హత కారణంగానే అతడు తనను అద్భుతంగా అదుపులో ఉంచుకోగలిగాడు. పైగా శ్రీరామకృష్ణుల అసాధారణ వ్యక్తిత్వాన్ని ప్రవర్తనను పరీక్షించడంలోనూ, అందుకు కారణాన్ని కనుగొనడంలోనూ ఎక్కువసేపు గడపడం కూడా అందుకు కారణం కావచ్చు. పూర్తిగా శ్రీరామకృష్ణులకు శరణాగతుడు

→

ఇలా చెప్పాడు: ''మనోపావనత్వమూ, ఒక ఫలానా వస్తువు పట్ల గల మనోఏకాగ్రతా ఆ స్థితిని కలిగిస్తాయి. అటువంటి స్థితిని పొందడానికి అర్హులైన వ్యక్తులు ఎంతో అరుదు. సమకాలీనులలో దక్షిణేశ్వరంలో వసిస్తూన్న రామకృష్ణ పరమహంస ఆ స్థితిని పొందడం నేను చూశాను. ఆయన ఆ స్థితిని ఒక్కసారి వెళ్ళిచూస్తే సమాధ్యవస్థ అంటే ఏమిటో మీకే అర్థమౌతుంది.'' ఆ విధంగా హేస్టీ మహాశయుని ముఖతా శ్రీరామకృష్ణులను గురించి విన్న తరువాత, శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి నరేంద్రుడు, సురేంద్రుని ఇంట్లో చూశాడు. తరచు బ్రహ్మసమాజానికి వెళ్లేవాడు కనుక, నరేంద్రుడు అక్కడకూడా ఆయనను గురించి వినివుండవచ్చు.

కానప్పటికీ, ఆతడు ఆయన పట్ల ఎంతో ఆకర్షితుడైనాడనడంలో ఎలాంటి సంశయమూ లేదు.

4. నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ఆకర్షణ

వారిద్దరు కలుసుకొన్న నాటినుండి శ్రీరామకృష్ణులు, నరేంద్రుని పట్ల ఎంతో ఆకర్షితులైనారు. తమ ఆధ్యాత్మిక జీవితంలో అనుభూతం చేసుకొన్న సమస్తాన్నీ పరమ అర్హుడైన శిష్యుడు తారసపడగానే అతడికి ప్రసాదించాలనే ఆతురతతో ఆ బ్రహ్మజ్ఞానియైన గురువరేణ్యుడు ఆరాటం చెందసాగాడు. ఆ తహతహ వర్ణనాతీతం. ఉద్దేశరహితమూ, స్వార్థరహితమూ అయిన ఆ ఆరాటం భగవత్సంకల్పాన్ని నెరవేర్చే ఆత్మారాములైన గురువుల మనస్సులలో జనిస్తుంది. ఇటువంటి ఉన్నత మానసిక ప్రేరణకు లోనై జగద్గురువులు అర్హులైన శిష్యులకు జ్ఞానాన్ని అనుగ్రహించి, వారిని సమస్త కామనాల బంధనాల నుండి విముక్తులను చేసి, పరిపూర్ణత్వాన్ని సంతరించుకొనేలా చేస్తారు.[1]

5. మొదటి సమావేశంలోనే నరేంద్రునికి బ్రహ్మజ్ఞానం అనుగ్రహింప శ్రీరామకృష్ణులు ప్రయత్నించడం

మొట్టమొదటిసారి నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు అతడికి భావపారవశ్యం కల్పించి బ్రహ్మజ్ఞానం సంతరించుకొనేలా చేయగోరారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఎందుకంటే, ఇది జరిగిన మూడు లేక నాలుగేళ్ల తరువాత నరేంద్రుడు పూర్తిగా శ్రీరామకృష్ణులను శరణుజొచ్చి పదేపదే తనకు నిర్వికల్ప సమాధి స్థితిని ప్రసాదించమని ప్రార్థించాడు. అప్పుడు ఆయన ఈ సంఘటనను వ్యంగ్యంగా సూచిస్తూ, మా సమక్షంలో ఎత్తిపొడుపుగా, "ఎందుకు? నాకు తల్లితండ్రులున్నారని అప్పుడు చెప్పలేదా?" అని అన్నారు. మరో సందర్భంలో ఆయన అతడితో ఇలా చెప్పారు: "ఇలా చూడు. ఒక ఫలానా మనిషి చనిపోయి, దయ్యం అయ్యాడు. అతడు సుదీర్ఘకాలం ఏకాకిగా ఉండిపోవడంతో, ఒక సహచరుడి తోడుకోసం పరితపించిపోయాడు. ఎవరో ఒక వ్యక్తి ప్రమాదంలో మరణించాడని తెలియగానే తన చిరకాల వాంఛయైన తోడు లభిస్తుందనే ఆశతో ఆ ప్రమాదం జరిగిన చోటుకు ఈ వ్యక్తి (దయ్యం) ఒక్క పరుగున వెళ్లేవాడు. కాని పాపం ఈ దయ్యానికి నిరాశే ఎదురయ్యేది. ప్రమాదంలో చనిపోయిన మనిషి దయ్యంగా రూపాంతరం చెందకుండా గంగాజలం అతడి భౌతిక కాయం మీద చిలకరించేవారు. కాబట్టి ఈ దయ్యం నిరాశానిస్పృహలతో వెనక్కు తిరిగివచ్చి, పూర్వంలా ఏకాకిగానే జీవించసాగింది. తోడు కావాలన్న ఈ దయ్యం కోర్కె

---

1. దీనినే శాస్త్రాలు శాంభవీ దీక్ష అని పేర్కొంటాయి. IV.4

ఎన్నటికీ నెరవేరలేదు. నేను కూడా కచ్చితంగా అదే స్థితిలో ఉన్నాను. నిన్ను చూడగానే, 'ఈసారయినా బహుశా నాకు తోడు లభిస్తుంది' అని అనుకొన్నాను. కాని నువ్వుకూడా నాకు తల్లితండ్రులున్నారని చెప్పావు. కాబట్టి ఇప్పటికీ నా కొక సహచరుడు లభించలేదు.'' ఈ విధంగా శ్రీరామకృష్ణులు ఆనాటి సంఘటనను ప్రస్తావిస్తూ నరేంద్రుణ్ణి ఎగతాళి చేసేవారు.

6. నరేంద్రుడు మొదటిసారి, రెండవ సారి పొందిన అద్భుత అనుభవాలలోని తారతమ్యం

సమాధి స్థితిని పొందబోతున్న తరుణంలో నరేంద్రుడి మనస్సును విపరీతమైన భయం ఆవరించడం గమనించి శ్రీరామకృష్ణులు, ఆతడి మనస్సును ఆ ఊర్ధ్వస్థితికి అధిరోహింపచేసే ప్రయత్నాన్ని అప్పటికి విరమించారు. అయినప్పటికీ శ్రీరామకృష్ణుల మనస్సును సందేహ మేఘాలు ఆవరించాయి. గతంలో తాము నరేంద్రుణ్ణి గురించి పొందిన దర్శనాల, అనుభూతుల వాస్తవికతల పట్ల ఆయనకు సందేహాలు తలెత్తాయి. బహుశ అందుకే ఆయన నరేంద్రుడు మూడవసారి దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు తమ శక్తితో ఆతడి అంతరాంతరాళాల్లో నుండి ఆతడి జీవిత రహస్యాలను తెలుసుకొన్నారని మా ఊహ. తమ ప్రశ్నలకు నరేంద్రుడు ఇచ్చిన జవాబులు తమ దర్శనాలతో కచ్చితంగా సరిపోవడంతో నిశ్చింతులయ్యారు. మొదటిసారి, రెండవ సారి నరేంద్రుడు ఒకే రకమైన భావపారవశ్యం పొందలేదని ఇందుమూలంగా తేటతెల్లమౌతున్నది.

7. నరేంద్రుని గురించి శ్రీరామకృష్ణుల వెరపు

ఆ పరీక్షానంతరం శ్రీరామకృష్ణులు ఒక రకంగా నిశ్చింతులయ్యారు; కాని ఏదో చెప్పరాని వెరపు ఆయన మనస్సులో పొంచివుంది. అందుకు కారణం: నరేంద్రుడిలో సంపూర్ణంగా పద్దెనిమిది గుణాలు లేదా శక్తి అభివ్యక్తీకరణలు ఉండడం ఆయన చూశారు; ఆ గుణాలలో కేవలం ఒకటో రెండో గుణాలు ఉన్న వ్యక్తి లోకంలో పేరుప్రఖ్యాతులు, అసాధారణ ప్రాబల్యం సముపార్జించుకోగలుగుతాడు. భగవంతుణ్ణి గురించిన, మనిషిని గురించిన, ప్రపంచాన్ని గురించిన పరమ సత్యాలను అనుభూతం చేసుకొనే నిమిత్తం తనలో కేంద్రీకృతమైన శక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నిర్దేశించడంలో నరేంద్రుడు విఫలుడైతే, పర్యవసానంగా అవాంఛనీయ ఫలితాలను చవిచూడవలసి వస్తుందని శ్రీరామకృష్ణులు భయపడ్డారు. అదే కనుక జరిగితే నరేంద్రుడు ఒక సరిక్రొత్త మతశాఖను స్థాపించి, ఇతర ధార్మిక నాయకులలా లేదా ప్రవక్తలలా లోకఖ్యాతిగాంచుతాడు. కాని అలా జరిగే పక్షంలో ముందుగా ఆత్మసాక్షాత్కారం పొందకుండా ఆధ్యాత్మిక జగత్తులోని మహోదార సత్యాలను ప్రచారం చేయడానికి అతడికి సాధ్యం

కాదు; ఆ విధంగా లోకం తాను పొందబోయే గొప్ప వరాన్ని కోల్పోతుంది. అందువలన నరేంద్రుడు సకల విషయాలలోను తమను అనుసరించాలనే, తమ మాదిరే మహోదార ఆధ్యాత్మిక సత్యాలను ఆకళింపుచేసుకొని వాటిని లోకానికి వెల్లడించాలనే తీవ్ర ఆకాంక్ష శ్రీరామకృష్ణులలో జనించింది. శ్రీరామకృష్ణులు తరచు ఇలా చెప్పేవారు: ''నీరు ప్రవహించని చెరువుల, కొలనులలో కలుపు మొక్కలు పెరిగే రీతిలో, మనిషి పాక్షిక ఆధ్యాత్మిక సత్యాలనే పరిపూర్ణ సత్యాలుగా ఎంచి సంతృప్తి చెందినప్పుడు పరిమిత ప్రాంతానికి మాత్రమే వర్తించే మతశాఖలు ఉద్భవిస్తాయి.'' పరమసత్యానుభూతిని పొంద నరేంద్రుణ్ణి అర్హునిగా రూపొందించడానికి ఎన్ని విధాల శ్రీరామకృష్ణులు ప్రయత్నించారో యోచిస్తే ప్రతి ఒక్కరూ ఆశ్చర్యచకితులౌతారనడం అతిశయోక్తి కాదు. అలా అర్హుని చేయకుంటే అసాధారణ మేధస్సు, మానసిక బలం గల నరేంద్రుడు భ్రష్టుపట్టి, సొంత మతశాఖను రూపొందించడం తథ్యమని ఆయన ఊహించకపోలేదు.

8. నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులు ఎందుకు ఆకర్షితులైనారు?

పైన పేర్కొన్న రీతిలో భ్రష్టుపట్టే ఆస్కారం నరేంద్రునికి ఇక లేదని ఆయనకు ప్రగాఢ నమ్మకం కలిగేటంత వరకు మొట్టమొదటి సమావేశం నుండి నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులకు ఏర్పడ్డ విచిత్ర, బలీయమైన ఆకర్షణ ఉపశమించలేదు. ఈ అసాధారణ ఘటనను గురించి ఒకింత పునరాలోచించి చూసినప్పుడు అందుకైన కొన్ని కారణాలు నరేంద్రుణ్ణి గురించి శ్రీరామకృష్ణులకు కలిగిన అసాధారణ దర్శనాలలో వ్రేళ్లూని ఉన్నాయనీ, మిగిలినవి ఆయన భయంలో పాదుకొని ఉన్నవనీ స్పష్టంగా తెలుస్తుంది. ఆధునిక యుగ ప్రభావంలో పడిపోయి అతడు ఇచ్ఛాపూర్వకంగా భార్య, సంపద లేదా పేరుప్రతిష్ఠలు మొదలైన కోర్కెల బంధాలను తగిలించుకొని, తన మహజ్జీవిత పరమ లక్ష్యాన్ని పాక్షికంగానైనా నెరవేర్చక పోతాడేమోననే భయం ఆయనలో లేకపోలేదు.

9. ఈ ఆకర్షణ సహజమే, అనివార్యమే

శ్రీరామకృష్ణుల సుదీర్ఘకాల సాధన, వైరాగ్యాల ఫలితంగా ఆయన పరిమిత వ్యక్తి చైతన్యం అదృశ్యమై, జగత్కారణంతో చైతన్య స్థితిలో శాశ్వతంగా తాదాత్మ్యం చెందారు; మానవాళికి శ్రేయస్సును ఒనరించే భగవత్కార్యం తన సొంత కార్యంగా భావించారు. ఈ ఆధునికయుగంలో ధార్మికత క్షీణించడానికైన కారణాలను తన మనోదేహాలనే పరికరాలతో తొలగించే కార్యసాధన కృపాళువూ, సర్వవ్యాపీ అయిన భగవంతుని సంకల్పమే అని ఈ జ్ఞానార్జన వలన ఆయన గ్రహించారు. ఈ జ్ఞానం వలనే ఏదో అల్ప స్వార్థధ్యేయం నిమిత్తం నరేంద్రుడు జన్మించలేదనీ, మాన

వాళికి మేలు చేసే కార్యంలో తనకు దోహదం చేయడానికి తీవ్ర దైవభక్తి కారణంగా ఈ ఇలలో జన్మించాడనీ శ్రీరామకృష్ణులు తెలుసుకొన్నారు. కాబట్టి నిస్వార్థ, నిత్యముక్తుడైన నరేంద్రుణ్ణి తన 'సొంతం'గా ఎంచి, ఆతడి పట్ల అత్యంత ఆకర్షితులు కావడంలో ఆశ్చర్యం ఏముంది? బాహ్య పరిశీలకులకు ఇది వింతగా కనిపించవచ్చు; కాని పైన వర్ణించిన నేపథ్యం గురించి తెలిసిన సునిశిత దృష్టిగల వ్యక్తులకు నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులకు ఏర్పడ్డ ఈ ఆకర్షణ సహజమూ, అనివార్యమూ అని తోచక తప్పదు.

10. నరేంద్రుని పట్ల గల శ్రీరామకృష్ణుల అనురాగం అలౌకికమైనది

మొట్టమొదటిసారి నరేంద్రుణ్ణి కలుసుకొన్నప్పటి రోజు నుండి శ్రీరామకృష్ణులు అతణ్ణి ఏ మేరకు తన సొంతంగా పరిగణించారో, అతణ్ణి ఎంత ప్రగాఢంగా ప్రేమించారో చెప్పడం మా శక్తికి మించిన పని. లోకులు ఇతరులను తమ సొంతంగా ఎంచి ప్రేమించడానికి పురిగొల్పే కారణాలు ఇక్కడ కానరావు. అయినప్పటికీ నరేంద్రుని సాంగత్యంలో ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు పొందేటంత ఆనందం, ఆతడి ఎడబాటులో ఆయన పడేటంత ఆరాటం మేం ఎక్కడా, ఎన్నడూ చూడలేదు. ఎటువంటి స్వార్థప్రయోజనమూ లేకుండా ఒక వ్యక్తి మరో వ్యక్తిని ఇంత తీవ్రంగా ప్రేమించగలడనే భావన మేం కలలో సైతం ఊహించలేదు. నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులు చూపే అద్భుత ప్రేమను చూసినప్పుడు, ఈ లోకం మానవుడిలో మాధవుణ్ణి చూసే రోజును తిలకిస్తుందనీ, ఆ భగవత్ అభివ్యక్తీకరణకు నిజమైన నిస్వార్థ భక్తిశ్రద్ధలను చెల్లించి తరిస్తుందనీ మాకు ప్రగాఢ విశ్వాసం కలిగింది.

11. ఆ ప్రేమ గురించి ప్రేమానంద స్వామి ఉద్ఘాటన

శ్రీరామకృష్ణుల వద్దకు నరేంద్రుడు వచ్చిన కొద్దికాలంలోనే ప్రేమానంద స్వామి మొట్టమొదటిసారి ఆయన వద్దకు వచ్చాడు. అప్పుడు ఏదో కారణంగా నరేంద్రుడు ఒక వారం రోజులు దక్షిణేశ్వరానికి రాలేకపోయాడు. నరేంద్రుని ఎడబాటుకు శ్రీరామకృష్ణులు మానసిక వ్యథను అనుభవించడం చూసి ప్రేమానంద స్వామి ఆశ్చర్యచకితుడైనాడు; దానిని గురించి అనేక సందర్భాలలో మాకు వివరించి చెప్పేవాడు.

12. ప్రేమానందస్వామి మొట్టమొదటిసారి దక్షిణేశ్వర సందర్శనం

అతడొకసారి ఇలా చెప్పాడు: ''బ్రహ్మానందస్వామీ, నేనూ ఒక సందర్భంలో పడవలో దక్షిణేశ్వరానికి వెళ్లడానికి హాట్‌ఖోలా ఘట్టానికి వెళ్లాం. అక్కడ రాందయాళ్ బాబు కనిపించారు. ఆయనకూడా దక్షిణేశ్వరానికే వెళుతున్నారని తెలుసుకొని మేమంతా ఒకే పడవలోనే బయలుదేరాం. రాణీరాస్మణి కాళికాల

యానికి మేం చేరుకొనే సరికి దాదాపు మునిమాపువేళ అయింది. తిన్నగా శ్రీరామకృష్ణుల గదికి వెళ్లాం. జగజ్జననిని ప్రార్థింప ఆయన కాళికాలయానికి వెళ్లినట్లు తెలిసింది. మమ్మల్ని అక్కడే వేచివుండమని, బ్రహ్మానందస్వామి ఆయనను తోడ్కొని రావడానికి కాళికాలయానికి వెళ్లాడు. కాసేపటికి శ్రీరామకృష్ణులను జాగ్రత్తగా పుచ్చుకొని, 'మెట్లు, ... ఇటురండి, ఇక్కడ దిగండి' అంటూ ఆయనను నడిపిస్తూ, బ్రహ్మానందస్వామి రావడం చూశాను. శ్రీరామకృష్ణులు తరచు భావోద్వేగంలో బాహ్యస్మృతిని కోల్పోతారని నేను ఇంతకు మునుపే వినివున్నాను. కాబట్టి ఆ విధంగా ఆయన త్రాగిన వ్యక్తిలా తూలిపోతూ నడుస్తూ రావడం చూసి, ఆయన భావావస్థలో ఉన్నారని గ్రహించాను. అదే స్థితిలో గదిలోకి వచ్చి, చిన్నమంచం మీద కూర్చున్నారు. కాసేపటికి మామూలు స్థితిలోకి వచ్చాక నన్ను గురించి, నా బంధువులను గురించి కొన్ని ప్రశ్నలడిగారు; తరువాత నా ముఖం, చేతులు, కాళ్లు మొదలైన వాటి లక్షణాలను పరీక్షించసాగారు. నా ముంజేతిని తమ చేతుల్లోకి, దాని బరువును తూస్తూన్నట్లు కాసేపు పుచ్చుకొని, 'భేష్' అన్నారు. ఆ మాటకు అర్థం ఆయనకు మాత్రమే తెలిసినట్లుంది. ఆ తరువాత నరేంద్రుని ఆరోగ్యం గురించి రాందయాళ్ బాబును వాకబు చేశారు. నరేంద్రుడు బాగానే ఉన్నాడని తెలుసుకొని, 'అతడు ఇక్కడకు వచ్చి చాలరోజులయింది. అతణ్ణి చూడాలనుకొంటున్నాను. దయచేసి ఇక్కడకు ఒకసారి రమ్మని చెప్పండి' అని చెప్పారు.

''ధార్మిక ప్రసంగాలలో కొన్ని గంటలు ఆనందంగా గడిచిపోయాయి. మేం రాత్రి పది గంటలకు భోజనం చేశాం. కాళికాలయ ప్రాంగణానికి ఉత్తరం వైపున, శ్రీరామకృష్ణుల గదికి తూర్పున ఉన్న వసారాలో మేం నడుంవాల్చాము. గదిలో శ్రీరామకృష్ణులకు, బ్రహ్మానందస్వామికి పరుపులు వేశారు. ఒక గంటసేపు కూడా గడవక ముందే శ్రీరామకృష్ణులు తన వస్త్రాన్ని చంకలో ఉంచుకొని గదిలో నుండి బయటకు వచ్చి రాందయాళ్ బాబు వద్దకు వచ్చి ఆప్యాయంగా, 'నిద్రపోతున్నావా?' అని అడిగారు. మే మిద్దరం గబుక్కున లేచి, 'లేదండి' అని చెప్పాం. అప్పుడాయన ఇలా అన్నారు: 'ఇలా చూడండి. నరేంద్రుణ్ణి చాలారోజులుగా చూడకపోవడంతో తడి తువ్వాలులా నా హృదయాన్ని బలవంతంగా పిండుతూన్నట్లు అనిపిస్తోంది. ఒకసారి వచ్చి చూడమని దయచేసి అతడికి చెప్పండి. అతడు సత్వగుణ సంపన్నుడు, అతడు సాక్షాత్తు నారాయణుడు; అప్పుడప్పుడు అతణ్ణి చూడకపోతే నాకు మనశ్శాంతి ఉండదు.' గత కొద్ది కాలంగా రాందయాళ్‌బాబు దక్షిణేశ్వరానికి వస్తూ

13. నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులు చూపే అక్కర గురించి బ్రహ్మానందస్వామి ప్రత్యక్ష అనుభవం

వున్నాడు. శ్రీరామకృష్ణుల బాలక నైజం ఆతడికి తెలియంది కాదు. శ్రీరామ కృష్ణుల ఆ బాలక ప్రవర్తనను చూసి రాందయాళ్‌బాబు ఆయన భావపార వశ్యంలో ఉన్నారని గ్రహించాడు. ఉదయం అవగానే నరేంద్రుణ్ణి చూసి, అతణ్ణి రమ్మనమని చెబుతానని ఆయనను ఊరడించాడు. కాని శ్రీరామకృష్ణుల ఆ భావపారవశ్యం ఆ రాత్రి ఉపశమించలేదు. మాకు విశ్రాంతి ఉండదని గ్రహించి, అప్పుడప్పుడు ఆయన తన గదిలోకి కాసేపు వెళ్లిపోయేవారు. కాని ఆ విషయం విస్మరించి మళ్లీ మా వద్దకు వచ్చి నరేంద్రుని సుగుణాలను, ఆతడి ఎడబాటుకు తాను పడే ఆరాటాన్ని దయనీయంగా మా ముందు వ్యక్తం చేయసాగారు. ఆయన దుర్భర వేదనను చూసి నేను ఆశ్చర్యపోయి, 'ఈయన ప్రేమ ఎంత అద్భుతమైనది! ఏ వ్యక్తి ఎడబాటుకై ఈయన ఇంత వ్యాకులత చెందుతున్నారో ఆ వ్యక్తి ఎంత కఠిన హృదయుడై ఉంటాడు!' అని అనుకొన్నాను. ఆ రాత్రి అలా గడిచిపోయింది. ప్రొద్దున మేం కాళికాలయానికి వెళ్లి జగజ్జననిని అర్చించాం. తరువాత శ్రీరామకృష్ణులకు సాష్టాంగ ప్రణామం చేసి, సెలవు పుచ్చుకొని కలకత్తాకు తిరిగి వచ్చేశాం.''

1883వ సం॥లో ఒక రోజు మా మిత్రుడైన వైకుంఠనాథ్ సన్యాల్ దక్షిణేశ్వరానికి వచ్చాడు. అప్పుడు నరేంద్రుడు చాలా రోజులుగా రానందు వలన శ్రీరామకృష్ణులు ఎంతో ఆతురత చెందుతూ ఉండడం అతడు గమనించాడు. వైకుంఠనాథ్ ఇలా చెప్పాడు: ''శ్రీరామకృష్ణుల మనస్సు నరేంద్రుని ఆలోచనలతో పొంగిపొరలుతూన్నది. ఆయన నరేంద్రుని సుగుణాలను తప్ప మరి దేనిని గురించీ మాట్లాడడం లేదు. నన్ను సంబోధిస్తూ, 'నరేంద్రుడు శుద్ధసత్త్వమయుడు, అతడు అఖండ స్థితికి చెందిన నలుగురిలో ఒకడు, సప్తర్షులలో ఒకడు.[1] అతడి సుగుణాలకు అంతేలేదు' అని చెప్పారు. ఇలా అంటూ శ్రీరామకృష్ణులు దుర్భర క్లేశంతో, బిడ్డను ఎడబాసిన తల్లిలా భోరున విలపించసాగారు. తనను అదుపులో ఉంచుకోలేని ఆయన స్థితిని, ప్రవర్తనను చూసి మాకు ఏం చేయాలో పాలుబోలేదు. అప్పుడే ఆయన వడి వడిగా అడుగులు వేస్తూ తమ గదికి ఉత్తరం వైపున ఉన్న వసారాలోకి వెళ్లారు. అలా కొంతసేపు విలపించి, గద్గదస్వనంలో, 'హా! అతణ్ణి చూడకుండా నేను ఉండలేను' అని పలికారు. కాసేపటికి ఒకింత తమాయించుకొని గదిలోకి వచ్చి

14. నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ప్రేమ గురించి వైకుంఠనాథ్ సన్యాల్

1. ఆ నలుగురు : సనక, సనందన, సనాతన, సనత్కుమారుడు. వీరు సన, సనత్‌సుజాత, కపిలులతో కలిసి సప్తర్షులు అవుతారు.

మా ప్రక్కన వచ్చి కూర్చున్నారు. తరువాత దయనీయంగా ఇలా అన్నారు: 'ఎంత విలపించినప్పటికీ నరేంద్రుడు రాలేదు. అతణ్ణి చూడాలనే ఆరాటం, తహతహ నా హృదయాన్ని పిండివేస్తూన్న వ్యథను కలిగిస్తూంది; అతడి పట్ల నాకున్న తీవ్ర ఆకర్షణను అతడు గుర్తించినట్లే లేదు.' ఇలా అంటూ వ్యథతో గదిలో నుండి బయటకు వెళ్లిపోయారు. కాసేపయాక మళ్లీ గదిలోకి వచ్చి, 'వయస్సు పైబడ్డ నేను అలా విలపిస్తూ అతడికోసం ఆరాటం చెందడం చూస్తే వాళ్లు ఏమనుకొంటారు? అయినప్పటికీ నా సొంతవాళ్లయిన మీ ముందు నేను సిగ్గుపడను. కాని దీనిని చూస్తే ఇతరులు ఏమనుకొంటారు? ఏది ఏమైనప్పటికీ నన్ను నేను అదుపులో ఉంచుకోలేను' అని అన్నారు. నరేంద్రుని పట్ల శ్రీరామ కృష్ణులకు ఉన్న ప్రేమను చూసి మేం స్తబ్ధులమైపోయాం. నరేంద్రుడు భగ వంతుని వంటి వాడనుకొన్నాం. లేకపోతే శ్రీరామకృష్ణులు ఆతడి పట్ల ఎందుకు అంత ఆకర్షితులౌతారు? తరువాత మేం ఆయనను అనునయిస్తూ 'మహా శయా, అతడు అలా చేయడం తప్పు. తను రాకపోతే మీరు ఎంత బాధపడ తారో తెలిసి కూడా అతడు రాకపోవడం బాగాలేదు' అని చెప్పాం.

''ఈ సంఘటనానంతరం ఒక రోజు ఆయన నరేంద్రుణ్ణి నాకు పరి చయం చేశారు. నరేంద్రుడి సాంగత్యంలో ఎంత ఆనందంగా కనిపించారో, ఆతడి ఎడబాటులో అంత వ్యథను అనుభవించడం నేను చూడగలిగాను. తరువాత మేం శ్రీరామకృష్ణుల జన్మదినోత్సవ సందర్భంలో దక్షిణేశ్వరానికి వెళ్లాం. ఆ రోజు భక్తులు ఆయనను నూతన వస్త్రాలతో, పువ్వుల మాలలతో, గంధం అలది ఎంతో అందంగా అలంకరించారు. ఆయన గదికి తూర్పువైపు ఉన్న వసారాలో కీర్తన జరిగింది. భక్తులు తమను పరివేష్టించి ఉండగా కీర్తన వింటూ అప్పుడప్పుడు భావపారవశ్యులవుతూ, ఒకటి రెండు పంక్తులు జోడిస్తూ కీర్తనను మరింత ఆసక్తికరంగా చేస్తూ ఆనందించసాగారు. కాని నరేంద్రుడు హాజరు కానందున ఆయన అమితానందాన్ని చవిచూసినట్లు లేదు. మధ్యమధ్యలో చుట్టూ కలయచూస్తూ, 'నరేంద్రుడు ఇంకా రాలేదన్నమాట' అని మాతో చెప్పసాగారు. దాదాపు మధ్యాహ్న సమయానికి నరేంద్రుడు వచ్చాడు; ఆయన పాదపద్మాలకు ప్రణమిల్లాడు. అతణ్ణి చూడగానే శ్రీరామ కృష్ణులు ఎగిరి గంతేసి, అతడి భుజాలమీద ఎక్కి కూర్చుని భావపారవశ్య మగ్నులైనారు. కొంతసేపటికి మామూలు స్థితిలోకి వచ్చి అతడికి తినిపిస్తూ, అతడితో మాట్లాడసాగారు. ఆ పైన ఆయన కీర్తనను వినలేదు.''

నరేంద్రుడు పొందిన తీవ్ర, అలౌకిక శ్రీరామకృష్ణుల ప్రేమను గురించి ఆలోచిస్తే, తప్పక ఆశ్చర్యచకితుల మవుతాం. అసాధారణ, నిస్వార్థ ప్రేమ వర్షం

కురుస్తూన్నప్పటికీ నరేంద్రుడు ఏమాత్రం చలించక, అడుగడుగునా శ్రీరామకృష్ణులను పరీక్షింప ముందంజ వేయడాన్ని చూస్తే, సత్యం పట్లగల నరేంద్రుని ప్రగాఢ ప్రేమ స్పష్టంగా తెలియవస్తుంది. ఇది ఒక వంక ఆశ్చర్యపరుస్తూ ఉంటే, శ్రీరామకృష్ణుల ఉదాత్తత, అహంకారరాహిత్యం మరో వంక ఆశ్చర్యపోయేలా చేస్తున్నది. నరేంద్రుని ఈ వైఖరికి ఆయన నొచ్చుకోలేదు సరికదా, సంతోషంగా ఆ పరీక్షలకు ఆయన లోనైనారు; తద్ద్వారా తన శిష్యుడు ఋజువులతో సహా ధ్రువీకరించుకొని ఆధ్యాత్మిక సత్యాలను సమగ్రంగా అనుభూతం చేసుకోగలుగుతాడని ఆయన ఆశించారు. ఈ విషయం విన్న ప్రతి ఒక్కరూ విస్తుపోకుండా ఉండలేరనడం అతిశయోక్తి కాదు. శ్రీరామకృష్ణ - నరేంద్రుల అనుబంధాన్ని అధ్యయనం చేసేకొద్దీ ఒక వంక పరీక్షించకుండా దేనినీ అంగీకరించని నరేంద్రుని దృఢనిశ్చయం, శిష్యునికి ఉన్నత ఆధ్యాత్మిక సత్యాలను అనుభూతం చేయడం కోసం విమర్శలను, చిన్నబుచ్చుకోవడాలను త్రోసిరాజన్న శ్రీరామకృష్ణుల ఆతురత - ఈ రెండూ కానవచ్చి మనలను ముగ్ధులను చేస్తాయి. ఇటువంటి అధ్యయనం ద్వారా నిజమైన గురువు, గొప్ప అర్హతగల శిష్యునికి అతడి ఆధ్యాత్మిక వైఖరులను చెక్కుచెదరనివ్వక ఎలా ఉపదేశిస్తాడో మనకు అవగతమౌతుంది; చివరకు శిష్యుని హృదయంలో శాశ్వతమైన భక్తిప్రపత్తులను ఆ గురువు ఎలా పొందుతాడో కూడా మనం తెలుసుకోగలం.

15. శ్రీరామకృష్ణులు తనపై వర్షిస్తున్న ప్రేమకు నరేంద్రుడు చలించక పోవడం

6.i. శ్రీరామకృష్ణ నరేంద్రనాథ్‌ల మధ్య నెలకొన్న అపురూప అనుబంధం

1. శ్రీరామకృష్ణుల పావన సాంగత్యం ఎంత కాలం నరేంద్రుడికి లభించింది?

శ్రీరామకృష్ణుల పావన సాంగత్యభాగ్యం నరేంద్రనాథ్‌కు ఐదు సంవత్సరాలు లభించింది. ఇందుమూలంగా ఈ ఐదు సంవత్సరాల కాలం నరేంద్రుడు సదాసర్వదా ఆయన పాదపద్మాల సన్నిధిలో గడిపాడని పాఠకులు అనుకోవచ్చు. కాని అలా అనుకోవడం పొరపాటు. కలకత్తా భక్తు లందరిలాగానే నరేంద్రుడు కూడా ఇంటి నుండి దక్షిణేశ్వరానికి వచ్చి ఆయనను ఆ కాలఘట్టంలో దర్శించుకొని పోతూవుండేవాడు. మొట్టమొదటి నుండి శ్రీరామకృష్ణుల అనంత ప్రేమకు పాత్రుడు కావడం వలన స్వల్పకాల వ్యవధులలోనే అతడు దక్షిణేశ్వరానికి వెళ్లివస్తూవుండేవాడని కచ్చితంగా తెలియవస్తోంది. క్రమేణా దక్షిణేశ్వరానికి వారంలో ఒకటి రెండుసార్లు, తీరిక ఉన్నప్పుడు రెండు మూడు అంతకంటే ఎక్కువ రోజులు అక్కడే గడపడం తన కర్తవ్యంగా నరేంద్రుడు భావించసాగాడు. కొన్ని సమయాలలో ఈ నియమాన్ని అతడు ఉల్లంఘించ లేదని చెప్పలేం. కాని మొదటి నుండి నరేంద్రుడి పట్ల ఎంతో ఆకర్షితులైన శ్రీరామకృష్ణులు ఆ నియమాన్ని అతడు తరచు ఉల్లంఘించనీయకుండా వ్యవహరించి ఉంటారు. ఏదో కారణంగా నరేంద్రుడు ఒక వారం రోజులు దక్షిణేశ్వరానికి రాకుంటే, ఆయన ఎంతో ఆరాటపడిపోయి, ఎవరి ద్వారానో అతడికి కబురు పంపి, అతణ్ణే తమ వద్దకు రప్పించుకొనేవారు; లేదా కొన్ని గంటలు అతడితో గడపడానికి తామే స్వయంగా కలకత్తాకు వెళ్లేవారు. శ్రీరామకృష్ణులతో పరిచయం కలిగిన తరువాత మాకు తెలిసినంత వరకు నరేంద్రుడు యథావిధిగా దక్షిణేశ్వరానికి రావడంలో పెద్దగా జాప్యం ఎన్నడూ చేసింది లేదు.

కాని 1884వ సం॥ ప్రారంభంలో బి.ఏ. పరీక్షలు వ్రాసిన స్వల్పకాలంలోనే తండ్రి హఠాన్మరణం తరువాత కుటుంబ బాధ్యత తన భుజస్కంధాల మీద పడ్డాక ఆ నియమాన్ని అతడు ఉల్లంఘించక తప్పలేదు.

ఆ ఐదు సంవత్సరాలలో శ్రీరామకృష్ణులు, నరేంద్రునితో వ్యవహరించిన తీరులో ఐదు ముఖ్యాంశాలలో ద్యోతకమౌతున్నాయి: 1. నరేంద్రుడు తమ వద్దకు రావడం ప్రారంభించినప్పటి నుండి, నరేంద్రుని వంటి అత్యున్నత అర్హతవున్న వ్యక్తి ఆధ్యాత్మిక జగత్తులో ఎంతో అరుదు అని ఆయన అంతర్దృష్టితో గ్రహించే ఉన్నారు; అంతేకాదు జగజ్జనని తమను పురమాయించిన సనాతన ధర్మాన్ని పునరుద్ధరించి ఆధునిక కాల ఆవశ్యకతలకు అనుగుణంగా తీర్చిదిద్దే కార్యంలో తమకు ఎంతో దోహదం చేయడానికే నరేంద్రుడు జన్మిం చాడనీ ఆయనకు తెలియకపోలేదు. 2. అనంత ప్రేమ విశ్వాసాలనే త్రాటితో నరేంద్రుణ్ణి తమతో శాశ్వతంగా కట్టివేశారు. 3. తాము అంతర్దృష్టితో గాంచిన నరేంద్రుని మహత్వమూ, ఆతడి జీవిత లక్ష్యమూ వాస్తవమేనని అతణ్ణి అనేక విధాల పరీక్షించి రూఢిపరచుకొన్నారు. 4. ఆ మహత్కార్యం నెరవేర్చడానికి యుక్తమైన పరికరంగా తీర్చిదిద్దడానికి అతడికి శిక్షణ నిచ్చారు. 5. శిష్యుడు శిక్షణ పూర్తిచేసి బ్రహ్మజ్ఞానం సంతరించుకొన్నాక, సనాతనధర్మ సంస్థాపన కార్యం ఎలా ఉపక్రమించాలో అతడికి ఉపదేశించారు; ఈ కార్యనిర్వహణను, తాము స్వయంగా నెలకొల్పిన సన్న్యాస సంప్రదాయ కార్యభారాన్ని నిశ్చింతగా అతడికి అప్పగించారు.

2. నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ప్రవర్తన లోని ఐదు ముఖ్యాం శాలు

నరేంద్రుడు దక్షిణేశ్వరానికి రాక పూర్వమే అతడి మహత్వాన్ని గురించి కొన్ని అద్భుత దర్శనాలను శ్రీరామకృష్ణులు గాంచారని మేం ఇంతకు మునుపే తెలిపివున్నాం. నరేంద్రుడితో పరిచయం ఏర్పడ్డప్పటి నుండి ఆ దివ్యదర్శనాల ప్రభావం కారణంగా నరేంద్రుణ్ణి ఆయన ప్రేమ విశ్వాసాలు సంతరించుకొన్న వ్యక్తిగా పరిగ ణించేవారు. ఆ ప్రేమ విశ్వాసాలనే ప్రవాహం నరేంద్రుని హృదయంలో శ్రీరామ కృష్ణుల జీవిత పర్యంతం ఒకే రీతిలో ప్రవహించి, అతణ్ణి శ్రీరామకృష్ణులతో ప్రేమ అనే త్రాటితో కట్టిపడేసింది. ఈ ప్రేమవిశ్వాసాల నేపథ్యంలోనే శ్రీరామ కృష్ణులు కొన్ని సమయాలలో నరేంద్రుణ్ణి పరీక్షించారు కూడా.

3. అద్భుత దర్శ నాలపై ఆధారపడిన శ్రీరామకృష్ణుల వైఖరి

''తమ యౌగిక దర్శనాల నుండి నరేంద్రుని మహత్వం, ఆతడి అవ తరణలోని ఉద్దేశం తెలుసుకొన్న తరువాత కూడా శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి ఎందుకు పరీక్షించారు?'' అనే ప్రశ్న తలెత్తవచ్చు. దేహధారులై మాయా

4. నరేంద్రుణ్ణి శ్రీరామకృష్ణులు పరీక్షించడానికి హేతువు

జగత్తులో ప్రవేశించినప్పుడు శ్రీరామకృష్ణుల వంటి అవతార పురుషులకు కూడా, దర్శనాలు కించిత్తు అస్పష్టంగా కానరావడం వలన పొరపాటుకు కొంత ఆస్కారం ఉంటుంది. కాబట్టే కొన్ని సమయాలలో అటువంటి పరీక్షలు అవసరమై ఉన్నాయి. ఈ విషయాన్ని మాకు విశదీకరిస్తూ శ్రీరామకృష్ణులు, "హీనలోహాలను మిశ్రమం చేయకుండా బంగారు ఆభరణాలు చేయలేరు" అని చెప్పారు. జ్ఞానాన్ని వెల్లడించే అవతార పురుషుల మనోదేహాలు శుద్ధసత్వంతో రూపొందలేవు; వాటికి కించిత్తు రజస్సు తమస్సు కలుపవలసి ఉంటుంది. సాధనలు అనుష్ఠిస్తున్నప్పుడు జగజ్జనని అనుగ్రహంతో శ్రీరామకృష్ణులలో అద్భుతమైన ఆధ్యాత్మిక జ్ఞానం, దర్శనాలు అభివ్యక్తమైనాయి. కొన్ని సమయాలలో ఆ దర్శనాల సత్యాసత్యాల పట్ల ఆయనలో సంశయాలు తలెత్తడం కద్దు; పరీక్షించిన తరువాతే వాటిని పూర్తిగా అంగీకరించేవారు. కాబట్టి నరేంద్రుని విషయంలో తమకు కలిగిన అద్భుత దర్శనాల వాస్తవాన్ని పరీక్షించకుండా ఆయన అంగీకరించకపోవడంలో వింత ఏముంది?

నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులు మెలగిన పైన ప్రస్తావించిన ఐదు రకాల విధానాలలో, ప్రేమ మిళితమైన విశ్వాసం, పరీక్షించడం, బోధించడం అనే

5. నరేంద్రుని ఎడ శ్రీరామకృష్ణులు ఎలా మెలగారు?

మూడు విధానాలు ఏకకాలంలోనే ప్రారంభమైనాయి. ఆతడి పట్లగల ప్రేమ విశ్వాసాలతో మెలగిన రీతి గురించి ఇంతకు మునుపే క్లుప్తంగా ముచ్చటించివున్నాం. దీనిని గురించి తరువాత వివరంగా చెప్పవలసి ఉంది. ఎందుకంటే, ఇంతకు ముందు ఎన్నడూ శ్రీరామకృష్ణుల జీవితం నరేంద్రునితో మాదిరి మరి ఏ భక్తునితోను ఇంత సన్నిహితంగా పెనవేసుకొని ఉండడం తటస్థించలేదు. తన ప్రధాన అంతేవాసులలో ఒకరిని కలుసుకోగానే, "ఈ వ్యక్తి ప్రగాఢ విశ్వాసమనే సుస్థిరమైన, చలించని పునాది మీద నా ఆధ్యాత్మిక ఆలయాన్ని నిర్మిస్తాను" అని ఏసుక్రీస్తు చెప్పాడు. నరేంద్రుణ్ణి కలుసుకొన్న క్షణంలోనే శ్రీరామకృష్ణులలో భగవత్ప్రేరణ వలన అటువంటి దృఢవిశ్వాసం జనించింది. తన పుత్రసమానుడూ, నేస్తమూ అయిన నరేంద్రుడు తన ఆదేశాలను నిర్వర్తింప జన్మించాడనీ, తమ ఇద్దరి జీవితాలు ప్రేమ అనే తెగిపోని త్రాటితో శాశ్వతంగా ముడివేయబడినాయనీ శ్రీరామకృష్ణులు తమ దర్శనాల నుండి గ్రహించారు. అటువంటి ప్రేమ ఉన్నతోన్నతమైన ఆధ్యాత్మిక ప్రేమ; అట్టి ప్రేమలో ప్రేమికుడు తన ప్రేయసికి పరిపూర్ణ స్వాతంత్ర్యాన్ని ఒసగినప్పటికీ, ఆ ప్రేయసి యుగాలపర్యంతంగా తనకు సొంతమైనదనే భావనను మాత్రం కోల్పోడు. అటువంటి ప్రేమలో

పరస్పరం తమ సర్వస్వాన్ని ప్రతిఫలం ఆశించకుండా ఇచ్చివేయడంలో ఆనందిస్తారు. శ్రీరామకృష్ణ నరేంద్రుల మధ్య నెలకొన్న నిస్వార్థ ప్రేమ ఉదంతం వంటి దానిని లోకం ఎన్నడైనా చూసివుందో లేదో సందేహమే! ఈ అనుపమాన ప్రేమోదంతంలోని ప్రతి ఘట్టాన్ని స్పష్టంగా వర్ణించడానికి మేం అసమర్థులం; అయినప్పటికీ సత్యం పట్లగల ఆసక్తి కారణంగా దానిని గురించి సూచనప్రాయంగా తెలిపి, పిదప నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణులు మెలగిన తీరుతెన్నులను విశదంగా చర్చిస్తాం.

6. నరేంద్రుని గురించి సామాన్యుల పొరపాటు అభిప్రాయం

మొదటి సమావేశం నుండి శ్రీరామకృష్ణుల పావనత్వం, వైరాగ్యం, ఏకాగ్ర భక్తిని చూసి నరేంద్రుడు ఆకర్షితుడైనట్లే, శ్రీరామకృష్ణులు కూడా నరేంద్రుడి అపార ఆత్మస్థైర్యం, సత్యనిష్ఠ పట్ల ముగ్ధులై ఆనాటినుండి ఆతణ్ణే తమ సొంత మనిషిగా పరిగణించారని మాకు తోస్తున్నది. నరేంద్రుడి మహత్త్వం, వైభవాన్విత భవిష్యత్తు గురించి శ్రీరామకృష్ణుల యౌగిక దర్శనాలను కాస్త పక్కకుపెట్టి, వారి అద్భుత పరస్పర ఆకర్షణకు గల హేతువును కనుగొనడానికి ప్రయత్నించినప్పుడు, మేం ఇంతకు ముందు చెప్పిన విషయం స్పష్టమౌతుంది. అంతర్దృష్టి రహితులైన జనం నరేంద్రుని అద్భుతమైన ఆత్మస్థైర్యాన్ని అహంకారంగాను, అపార శక్త్యుత్సాహాలను తలపొగరుగాను, సత్యనిష్ఠను నటనగాను లేదా అమాయకతగాను పరిగణించడం కద్దు. జనం ప్రశంసలకు అతడు ఉపేక్ష వహించడాన్ని, ఆతడు నిర్మోహమాటంగా మాట్లాడడాన్ని, అన్ని విషయాలలోను నిస్సంకోచంగా వ్యవహరించడాన్ని, ఎవరిని గురించో భయపడక దేనినీ మరుగుపరచకపోవడాన్ని చూసి జనం పై నిర్ణయానికి వచ్చివుంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు: నరేంద్రుడితో మాకు బాగా పరిచయంకాక ముందు, ఆతడి పొరుగింటి వారు అతణ్ణే గురించి మాతో ఇలా చెప్పినట్లు జ్ఞాపకం: ''ఆ ఇంట్లో ఒక కుర్రవాడు ఉన్నాడు; అటువంటి పనికిమాలినవాణ్ణే నే నెన్నడూ చూడలేదు. బి.ఏ. పట్టా పుచ్చుకొన్నాక అతడు మరింత నిరర్థకంగా తయారయ్యాడు. తండ్రి, ఇతర పెద్దలు ముందు తబలా వాయిస్తూ నిర్లక్ష్యంగా పాటలు పాడడం ప్రారంభిస్తాడు, పెద్దల సమక్షంలో పొగత్రాగుతూంటాడు. ప్రతి విషయంలోను అతడి ప్రవర్తన ఇలాగే ఉంటుంది.''

ఇది జరిగిన కొద్దికాలానికే నరేంద్రుని విధానాల గురించి విభిన్న వర్ణనను మేం శ్రీరామకృష్ణులను రెండవసారో లేదో మూడవసారో కలుసుకొన్నప్పుడు ఆయన ముఖతా విన్నాం. యదుమల్లిక్ ఉద్యానగృహ నిర్వాహకుడైన రతన్‌తో, మమ్మల్ని చూపుతూ శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: ''ఈ కుర్రవాళ్లు

7. నరేంద్రుణ్ణి, శ్రీరామకృష్ణులు శ్లాఘించడం ఈ రచయిత వినడం

సజ్జనులు. ఈ కుర్రవాడు ఒకటిన్నర పరీక్షలలో ఉత్తీర్ణుడైనాడు. (ఆ సంవత్సరం నేను ఎఫ్.ఏ. పరీక్షలకు తయారవుతున్నాను); మర్యాదమన్నన తెలిసినవాడు. కాని నేను నరేంద్రుని వంటి మరొక కుర్రవాణ్ణే మాత్రం చూడలేదు. నరేంద్రుడు గాత్ర సంగీతంలో, వాద్యసంగీతంలో కోవిదుడు; జ్ఞాన సముపార్జనలో, సంభాషించడంలో, ధార్మిక విషయాలలో అత్యంత సమర్థుడు. ధ్యానిస్తూన్నప్పుడు రాత్రంతా అతడు బాహ్యస్మృతిని కోల్పోతాడు. నా నరేంద్రుడు మిశ్రమంలేని స్వచ్ఛమైన నాణెం; పైకి విసిరితే నిజం ప్రతిధ్వనిస్తుంది. ఇతర బాలురు ఎంతో శ్రమించి ఏదో విధంగా రెండు లేదా మూడు పరీక్షలలో ఉత్తీర్ణులు కావచ్చునేమో! అక్కడితో సరి, వాళ్ల పని ఖాళీ. కాని నరేంద్రుని విషయం అలా కాదు. ప్రతి పనిని అతడు అలవోకగా చేసేస్తాడు, పరీక్షలలో ఉత్తీర్ణత పొందడం అతడికి అల్పవిషయం. అతడు బ్రహ్మసమాజానికి కూడా వెళ్లి భక్తిగీతాలు ఆలాపిస్తాడు; కాని అతడు ఇతర బ్రహ్మసమాజస్థుల వంటివాడు కాదు. అతడు నిజమైన బ్రహ్మజ్ఞాని. ధ్యాన సమయంలో అతడికి జ్యోతి దర్శనం కలుగుతుంది. ఏమీ లేకుండానే నేను నరేంద్రుణ్ణే అంతగా ప్రేమిస్తున్నానా ఏమిటి?'' ఆ పలుకులకు ముగ్ధులమై, నరేంద్రుని పరిచయం పొందగోరి, ''మహాశయా, నరేంద్రుడు ఎక్కడ ఉంటున్నాడు?'' అని అడిగాం. అందుకు ఆయన, ''కలకత్తాలోని సిమ్లా పేట వాస్తవ్యుడైన విశ్వనాథ్ దత్త కుమారుడు నరేంద్రుడు'' అని చెప్పారు. ఆ తరువాత మేం కలకత్తాకు తిరిగివచ్చి వాకబు చేయగా, శ్రీరామకృష్ణులు ఎంతగానో శ్లాఘించిన ఆ నరేంద్రుడు మరెవరో కాదు, తన పొరుగింటి, ఏ యువకుణ్ణే మా మిత్రుడు తీవ్రంగా విమర్శించాడో అతడే అని తెలియవచ్చింది. ఇటువంటి వ్యక్తుల వ్యాఖ్యానాలను బట్టి ఇతరుల ప్రవర్తనను అంచనా వేయడం ఎంత అనుచితమో అనుకొని మేం ఆశ్చర్యచకితులమైనాం.

8. నరేంద్రుని గురించిన ఈ రచయిత తొలి పొరపాటు అభిప్రాయం

ఈ విషయానికి సంబంధించిన మరొక సంఘటనను ఇక్కడ ప్రస్తావించడం అసంగతం కాబోదు. పై విధంగా నరేంద్రుని సుగుణాలను శ్రీరామకృష్ణులు మాకు వర్ణించి చెప్పడానికి కొన్ని నెలల ముందు అతణ్ణే ఒక మిత్రుడి ఇంట్లో కలుసుకొనే భాగ్యం మాకు కలిగింది. ఆ రోజు అతణ్ణే చూశాం కాని పొరపాటు అభిప్రాయం ఉన్నందువలన అతడితో ఏమి మాట్లాడలేదు. కాని ఆ రోజు అతడు మాట్లాడిన వచనాలు, అనేక దశాబ్దాల తరువాత కూడా నిన్నమొన్న విన్నట్లుగా మాకు అనిపించే రీతిలో మా జ్ఞాపకాలలో బలంగా పాదుకుపోయాయి.

వాటిని గురించి తెలిపే ముందు, ఏ పరిస్థితుల్లో మేం ఆ వచనాలు విన్నామో తెలుపవలసివుంది; లేకుంటే ఆ సందర్భంలో నరేంద్రుని గురించి పొరపాటు అభిప్రాయం మాలో ఎందుకు చోటుచేసుకొన్నదో మీరు అవగతం చేసుకోలేక పోవచ్చు.

ఏ మిత్రుని ఇంట్లో ఆ రోజు నరేంద్రుణ్ణి చూశామో, ఆ మిత్రుడు గౌర్ మోహన్ ముఖర్జీ వీథిలోని నరేంద్రుని ఇంటికి ఎదురుగా ఒక రెండం

9. ఒక మిత్రుని ఇంట్లో నరేంద్రుణ్ణి, రచయిత మొట్టమొదటిసారి కలుసుకోవడం

తస్తుల మేడను అద్దెకు తీసుకొని ఉన్నాడు. నాలుగైదు సంవత్సరాలు మేం పాఠశాలలో సహాధ్యాయులం. ప్రవేశ పరీక్షకు కూర్చోవడానికి రెండేళ్ల ముందు మా మిత్రుడు ఇంగ్లండుకు బయలుదేరాడు. కాని కారణాంతరాల వలన బొంబాయి దాటి పోలేకపోయాడు. తన లక్ష్యం నెరవేరకపోవడంతో, అతడు ఒక వార్తాపత్రికకు సంపాదకుడైనాడు; బెంగాలీలో కవితలు, వ్యాసాలు రచించి క్రమంగా కొన్ని పుస్తకాలు కూడా రచించాడు. ఒకింత కాలం క్రితమే వివాహం చేసుకొన్నాడు. ఆ తరువాత అతడు నీతిబాహ్య జీవితం గడుపుతున్నాడనీ, డబ్బు సంపాదించడానికి మోసాలకు కూడా వెనుకాడడం లేదనీ వినికిడి. దాన్లోని నిజానిజాలు తెలుసుకోగోరి ఒక రోజు చెప్పాపెట్టకుండా హఠాత్తుగా అతడి ఇంటికి వెళ్లాం.

మా రాక గురించి ఒక సేవకుడి ద్వారా కబురు పంపి, చావడి గదిలో కూర్చున్నాం. ఇంతలో ఒక యువకుడు ఆ గదిలోకి వచ్చాడు. కూనిరాగంలో

10. ఆ సమయంలో నరేంద్రుని బాహ్యప్రవర్తన

హిందీ పాటను పాడుకోనారంభించాడు; ఆ ఇంటి యజమానితో అతడికి బాగా పరిచయం ఉన్నట్లు దీనిని బట్టి తెలియవస్తోంది. అతడు పాడిన పాటలు శ్రీకృష్ణుని గురించినవని మాకు జ్ఞాపకం; ఆ పాటలలో 'కనాయ్', 'పిల్లనగ్రోవి' అనే పదాలు మాకు స్పష్టంగా వినిపించాయి. అతడు పాడిన 'నీలమేఘశ్యాముని పిల్లనగ్రోవి', నవనాగరికం కాకపోయినా అతడు వస్త్రధారణలో చూపిన శ్రద్ధ, చక్కగా దువ్వుకొన్న శిరోజాలు, ఉదాసీనతకు దారితీస్తున్న అతడి అన్యమనస్కత - ఇవి, నీతిబాహ్యుడైన మా మిత్రుడితో అతడికి ఉన్న సన్నిహిత పరిచయం కలగలసి అతడిపట్ల మాకు ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించాయి. మేం ఉన్నామనే ధ్యాసే లేకుండా అతడలా సిగ్గులేకుండా ప్రవర్తించడం, పిదప పొగత్రాగడం చూసి, మా నీతిబాహ్యుడైన మిత్రుడికి ఇతగాడు విశ్వాసపాత్రుడైన అనుయాయి అని మేం నిశ్చయించుకొన్నాం; ఇటువంటి యువకులతో మెలగుతూన్నందు వలనే మా మిత్రుడు మోసాలకు పాల్పడుతున్నాడని మాకు గట్టి నమ్మకం ఏర్ప

డింది. మమ్మల్ని గమనించినప్పటికీ ఉదాసీన వైఖరిని అతడు అవలంబించడం వలన మేం అతణ్ణి పరిచయం చేసుకోవాలని ఎలాటి ప్రయత్నమూ చేయలేదు.

కాసేపటికి మా బాల్యమిత్రుడు రానేవచ్చాడు. చాలాకాలం తరువాత మేం కలుసుకొంటున్నప్పటికీ, మాతో ముక్తసరిగా ఏవో రెండు మాటలు

11. నరేంద్రుని సాహిత్య చర్చ

మా మిత్రుడితో మాట్లాడాడు. మమ్మల్ని విడిచిపెట్టి, పైన ప్రస్తావించిన యువకుడితో ఆనందంగా వివిధ విషయాల గురించి మాట్లాడసాగాడు. అతడి ప్రవర్తన అవమానకరంగా తోచినప్పటికీ, సభ్యత అడ్డువచ్చి మేం తక్షణమే సెలవు పుచ్చుకొని వెళ్లలేకపోయాం. కాబట్టి వారిద్దరి మధ్య ఆంగ్లంలోను, బెంగాలీలోను జరుగుతున్న సంభాషణను వింటూ అక్కడే కూర్చున్నాం. మానవ భావనా వైఖరులను సరిగా వెలిబుచ్చడమే ఉన్నత సాహిత్య కర్తవ్యమని వారిద్దరూ దాదాపు అంగీకరించినప్పటికీ, ప్రతి మానవ భావనా వైఖరికి సరిగా ప్రాతినిధ్యం వహిస్తూ అభివ్యక్తం చేసే రచనను సాహిత్యం క్రింద పరిగణించవచ్చా? అనే అభిప్రాయభేదం వారి మధ్య తలెత్తింది. మా మిత్రుడు అందుకు అనుకూలంగాను, ఆ యువకుడు తద్విరుద్ధంగాను తమ అభిప్రాయాలను వెలిబుచ్చినట్లు మాకు గుర్తు. భావనా వైఖరిని, అది మంచిదైనా లేదా చెడుదైనా సరిగా వ్యక్తం చేసినంత మాత్రం చేత ఆ రచన ఉన్నత సాహిత్యం కాదనీ, చక్కని అభిరుచిని, ఉన్నత ఆదర్శాన్ని అభివ్యక్తం చేసే రచనే ఉన్నత సాహిత్యం క్రిందికి వస్తుందనీ ఆ యువకుడు మా మిత్రుడి అభిప్రాయాన్ని ఖండిస్తూ, అతణ్ణి తన అభిప్రాయంతో ఏకీభవించేలా చేయ ప్రయత్నించసాగాడు. తన వాదనకు మద్దతుగా ఆ యువకుడు సుప్రసిద్ధ ఆంగ్ల సాహిత్యవేత్త ఛాసర్ నుండి ప్రసిద్ధ బెంగాలీ సాహిత్యకారుల రచనల వరకు ప్రస్తావిస్తూ, ప్రతి ఒక్కరూ ఈ ఉన్నత ఉదాత్త సిద్ధాంతాన్ని అంటిపెట్టుకొని ఎలా అమరత్వం సాధించారో చక్కగా విశదీకరించి చెప్పాడు. చివరికి ఆ యువకుడు తన వాదనను ముగిస్తూ ఇలా చెప్పాడు: ''మంచి చెడు భావనా ధోరణులను మనిషి వ్యక్తం చేస్తున్నప్పటికీ, అతడు సదా ఏదో ప్రత్యేక ఆదర్శాన్ని వెలిబుచ్చాలనే ప్రయాసపడుతూ ఉంటాడు. మనిషికి మనిషికి మధ్యనున్న తారతమ్యం ఆ ప్రత్యేక ఆదర్శాన్ని గ్రహించుకోవడం లోను, దానిని అభివ్యక్తీకరించడంలోను ఉంటుంది. రూపరసాది భోగాలు శాశ్వతమనీ, యథార్థమనీ సామాన్య జనులు ఎంచి, వాటినే తమ జీవిత ధ్యేయంగా పరిగణిస్తారు. They idealize what is apparently real[1] [చూపులకు

---

1. ఈ వాక్యాన్ని ఆంగ్లంలోనే మాట్లాడాడు.

వాస్తవంగా కనబడేదంతా వారు ఆదర్శనీయం చేసుకొంటారు.] పశువులకు, అటువంటి వ్యక్తులకూ ఎలాంటి తేడా ఉండదు. ఈ రకం వ్యక్తులు ఎన్నటికీ ఉదాత్త సాహిత్యాన్ని సృష్టించలేరు. మరొక కోవకు చెందిన వ్యక్తులున్నారు; చూపులకు వాస్తవంగా కనిపించే సుఖభోగాలతో సంతృప్తి చెందని వీరు, తమ అంతరాంతరాళాలలో ఉన్నతోన్నత ఆదర్శాలను భావన చేసుకొంటూ, ఆ ఆదర్శాల మేరకు బాహ్య వ్యవహారాలన్నీ మలచుకోవడానికి ఆతురత చెందుతారు - They want to realize the ideal.[1] (ఆ ఆదర్శాన్ని అనుభూతం చేసుకోగోరతారు.) ఈ కోవకు చెందిన వ్యక్తులు మాత్రమే నిజమైన సాహిత్యాన్ని సృష్టించగలరు. మళ్లీ, వారిలోనే తోడ్పాటుకోసం ఆ అత్యున్నత ధ్యేయం వైపుకు తిరిగి, ఈ జీవితంలోనే దానిని అనుభూతం చేసుకోవడానికి ప్రయత్నించేవారు, సర్వసామాన్యంగా లౌకిక జీవితానికి వెలుపలే ఉండిపోతారు. దక్షిణేశ్వరంలో వసిస్తూన్న పరమహంసదేవులు ఒక్కరే ఆ ఆదర్శాన్ని అనుభూతం చేసుకోవడం నేను కళ్లారా చూశాను.''

ఆ యువకుని పాండిత్యాన్ని, ఆ విస్తార భావాలను సమర్థించడంలో ఆతడు ప్రదర్శించిన వాదనా పటిమను చూసి మేం ఆశ్చర్యచకితులమైనాం.

12. శ్రీరామకృష్ణుల ద్వారా నరేంద్రుని మహత్వాన్ని రచయిత తెలుసుకోవడం

కాని ఆతడి వచనాలకూ, ఆతడి జీవన వైఖరికీ ఎటువంటి పొంతన లేదని తలచినప్పుడు నిజానికి మేం నిస్పృహ చెందాం; ఎందుకంటే, మా మిత్రుడి వంటి నీతిబాహ్యునితో ఆతడి కెలా సన్నిహిత సాంగత్యం కలిగింది? ఆ తరువాత మా మిత్రుడి నుండి సెలవు పుచ్చుకొన్నాం. ఇది జరిగిన కొన్ని నెలల తరువాత నరేంద్రుడి సుగుణాలను శ్రీరామకృష్ణులు శ్లాఘించడం మేం వినడం తటస్థించింది; దాంతో నరేంద్రుణ్ణే కలుసుకొని అతడితో పరిచయం పొందాలని నిశ్చయించుకొన్నాం. శ్లాఘనీయుడైన ఆ నరేంద్రుడు మరెవరో కాదు, ఆ నాడు మా బాల్యమిత్రుడి ఇంట్లో చూసిన యువకుడే అని తెలిసినప్పుడు మేం పొందిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు.

13. ఆది నుండి శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి గుర్తించడం

సామాన్య జనం నరేంద్రుని బాహ్యప్రవర్తనను చూసి అతణ్ణి అహంకారిగా, పొగరుబోతుగా పరిగణించడం కద్దు; కాని శ్రీరామకృష్ణులు ఆ పొరపాటుకు లోను కాలేదు. పరిచయమైనప్పటి నుండి, 'అహంకారం, గర్వం' ఆతడి అద్భుతమైన ఆత్మస్థైర్యం నుండి జనించాయనీ, ఆ ఆత్మస్థైర్యం ఆతడిలో మరుగున

---

1. ఈ వాక్యాన్ని కూడా ఆంగ్లంలోనే మాట్లాడాడు.

ఉన్న అనుపమాన మానసికశక్తి ఫలితంగా ఏర్పడిందనీ శ్రీరామకృష్ణులు అవగతం చేసుకొన్నారు; ఆతడి స్వేచ్ఛామయ ప్రవర్తన స్వాభావికమైన ఆతడి ఆత్మసంయమాన్ని సూచిస్తుందనీ, తనను గురించి ఇతరుల అభిప్రాయం పట్ల ఆతడి ఉదాసీన వైఖరి, స్వకీయ పావనత్వం గురించిన ఆత్మతృప్తి నుండి జనించిందనీ ఆయన గుర్తించారు. కాలక్రమంలో అసాధారణమైన నరేంద్రుని నైజం సహస్రదళ పద్మంలా పరిపూర్ణంగా వికసించి అనుపమాన మహత్వంలో సుస్థాపితమౌతుందనీ, లోకులు అనుభవిస్తూన్న యాతనలను, క్లేశాలను చూసి ఆతడి అహంకారం, గర్వం అనంత కరుణగా ద్రవిస్తుందనీ ఆయన ఎరుగక పోలేదు; ఆతడి అసాధారణ ఆత్మస్థైర్యం క్రుంగిపోయిన హృదయాలలో ఆశలను చిగురిస్తుందనీ శ్రీరామకృష్ణులు గ్రహించే ఉన్నారు; విశృంఖలం కాని ఆతడి స్వేచ్ఛాయుత ప్రవర్తన, ఆత్మసంయమంలోనే నిజమైన స్వేచ్ఛ ఉందని ఇతరులకు తేటతెల్లం చేస్తుందనీ ఆయనకు తెలియకపోలేదు.

14. బహిరంగంగా శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి ప్రశంసించడం: అందుకు హేతువు

శ్రీరామకృష్ణులు అంతగా నరేంద్రుణ్ణి ప్రశంసించడానికి అదే కారణం; నరేంద్రుని సుగుణాలను శ్లాఘించడానికి ఒక్క నోరు సరిపోదని ఆయన భావించడం అతిశయోక్తి కాబోదు. బహిరంగంగా ప్రశంస లందుకొన్న దుర్బల మనస్సు క్రమంగా అహంకార పూరితమై పతనం చెందుతుందని ఆయనకు తెలిసి నప్పటికీ, నరేంద్రుని విషయంలో ఆ హెచ్చరికకు అవసరం ఉండదని ఆయన గ్రహించకపోలేదు. ఆ దుర్బలత్వానికి నరేంద్రుని మనస్సు ఎంతో ఎత్తులో సంచరిస్తూ ఉంటుందనే గట్టి నమ్మకం కుదిరినందుననే ఆయన అతణ్ణే బహిరంగంగా ప్రశంసించారు. కొన్ని ఉదాహరణలు చూస్తే ఈ విషయం పాఠకులకు బాగా అవగతమౌతుంది.

ఒకరోజు సుప్రసిద్ధ బ్రహ్మసమాజ నాయకులైన కేశవచంద్రసేన్, విజయకృష్ణ గోస్వామి, తదితరులు శ్రీరామకృష్ణుల సమక్షంలో కూర్చుని ఉన్నారు.

15. నరేంద్రునిలో అంతర్గతమై ఉన్న శక్తుల గురించి శ్రీరామకృష్ణులు

యువకుడైన నరేంద్రుడు కూడా అక్కడ కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు భావసమాధి మగ్నులై, కేశవ్‌ను విజయ్‌ను అనుగ్రహ దృక్కులతో వీక్షించారు. పిదప ఆయన దృష్టి నరేంద్రునిపై పడింది; శ్రీరామకృష్ణుల మనో ఫలకంపై నరేంద్రుని తేజోమయ భావి జీవిత చిత్రం కదలాడింది. తక్షణం కేశవాదుల పూర్తిగా వికసించిన జీవితాలతో నరేంద్రుని భావి జీవితాన్ని పోల్చుకొని, నరేంద్రుణ్ణే ఆప్యాయంగా పరికించారు. ఆ సమావేశం పూర్తికాగానే ఆయన ఇలా అన్నారు: ''సమృద్ధంగా ఉన్న ఒక్క శక్తి కారణంగా కేశవ్

లోకప్రసిద్ధుడైనాడు; కాని నరేంద్రునిలో అటువంటి శక్తులు పద్దెనిమిది ఉన్నాయి. కేశవ్ విజయ్‌ల హృదయాలు దీపశిఖ వంటి జ్ఞానజ్యోతితో ప్రకాశవంతమైనాయి; కాని నరేంద్రుని హృదయంలో సాక్షాత్తు జ్ఞానభాస్కరుడే ఉదయించి, దాన్లోని కించిత్తు మాయాభ్రాంతులను సైతం సమూలంగా రూపుమాపినట్లు నేను కనుకొన్నాను.''

అంతర్దృష్టిరహితుడైన ఒక దుర్బల మనస్కుడు తనను శ్రీరామకృష్ణులే స్వయంగా ప్రశంసిస్తే గర్వంతో ఉప్పొంగిపోయి, తన్మయుడైపోవడం తథ్యం. కాని అటువంటి ప్రశంసకు నరేంద్రుని మానసిక ప్రతిస్పందన పూర్తి విరుద్ధం. అసాధారణ అంతర్దృష్టిని సంతరించుకొన్న నరేంద్రుడి మనస్సు, కేశవ్ విజయ్‌ల సుగుణాలతో స్వకీయ గుణాలను నిష్పక్షపాతంగా పోల్చుకొన్నది. తనను ఆ విధంగా శ్రీరామకృష్ణులు ప్రశంసించడాన్ని నరేంద్రుడు తీవ్రంగా నిర సిస్తూ, ఇలా చెప్పేవాడు: ''మహాశయా, మీరు ఏమంటున్నారు? ఈ మాట వింటే జనం మిమ్మల్ని పిచ్చివాడి క్రింద జమకడతారు. లోకప్రసిద్ధుడైన కేశవ్, ఉదారుడైన విజయ్ ఎక్కడ, మామూలు పాఠశాల విద్యార్థియైన నే నెక్కడ? మా మధ్య హస్తిమశకాంతరం ఉంది! దయచేసి మళ్లీ అలా ఎన్నడూ పోల్చ కండి.'' ఆతడి నిరసనను విని శ్రీరామకృష్ణులు ప్రసన్నులై, ఆప్యాయం ఉట్టిపడే కంఠంతో ఇలా అన్నారు: ''నేను ఏం చేయాలి, నాయనా? నేనే అలా పలికాను అనుకొంటున్నావా? తల్లి ఇదంతా నాకు దర్శింపచేసింది; అందుకే అలా చెప్పాను. తల్లి నా కెప్పుడు సత్యాన్నే దర్శింపచేస్తుంది, ఎన్నటికీ అసత్యాన్ని చూపదు; అందువలననే నే నలా మాట్లాడాను.''

తల్లి (జగజ్జనని) తమకు ఇది దర్శింప చేసిందనీ లేదా అలా వచించిందనీ చెప్పి నరేంద్రుణ్ణి సదా శ్రీరామకృష్ణులు సంతృప్తి పరచలేకపోయేవారు.

16. అందుకు నరేంద్రుని విరసన

శ్రీరామకృష్ణుల దర్శనాలలోని నిజానిజాలను సంశయిస్తూ నిర్మొహమాటంగా మాట్లాడే ధైర్యశాలియైన నరేంద్రుడు తరచు ఇలా అనేవాడు: ''మీకు ఇవన్నీ తల్లియే దర్శింప చేస్తూన్నదని ఎవరు చెప్పగలరు? మీ మెదడులో జనించే కల్పనలు కావచ్చునేమో! నాకే అటువంటి అనుభవాలు కలిగితే, తప్పకుండా వాటిని నా మెదడు కల్పించే వెర్రితలంపు లుగా పరిగణిస్తాను. మన కళ్లు, చెవులు, తక్కిన ఇంద్రియాలు, విశేషంగా ఒక విశిష్ట గుణంగల ఒక ప్రత్యేక వస్తువును చూడాలనే కోర్కె కలిగినప్పుడు, తరచు మనలను మోసపుచ్చుతాయని విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రం నిర్వివాదాంశంగా ఋజువుచేసి ఉన్నాయి. నే నంటే మీ కెంతో ఆప్యాయత ఉంది, ప్రతి విషయం

లోను నేను ఘనత వహించాలని ఆశిస్తున్నారు; అందుకే కాబోలు మీకు అటు వంటి దర్శనాలు కలుగుతున్నాయి.''

ఆధునిక పాశ్చాత్య శరీరధర్మశాస్త్ర, మనస్తత్వశాస్త్ర పరిశోధకులు మార్మికులుగా పరిగణింపబడే ఒక కోవకు చెందిన వ్యక్తులు పొందే దర్శనాలను

17. నరేంద్రుని వాదనాపటిమ

భ్రమలుగా చూపినట్లు సముచిత దృష్టాంతాల సహాయంతో నరేంద్రుడు తరచు శ్రీరామకృష్ణులకు విశదీకరింప ప్రయత్నించసాగాడు. శ్రీరామకృష్ణుల మనస్సు ఉన్నత భావభూములలో నెలకొని ఉన్నప్పుడు, నరేంద్రుని ఆ కుతర్కపు ప్రయత్నాన్ని సత్యం తెలుసుకోవాలనే ఆతడి ప్రగాఢ వాంఛగా ఎంచి, అతడిపట్ల మరింత ప్రసన్నులవసాగారు. కాని మామూలు బాహ్యచైతన్య స్థితిలో ఉన్నప్పుడు బాలక మనస్కులైన శ్రీరామకృష్ణులు ఆతడి కుశాగ్ర వాదనలు విని ఆరాటం చెందేవారు. అప్పుడాయన సందిగ్ధావస్థలో పడిపోయి, ఇలా ఆలోచించేవారు: 'ఆహా! నరేంద్రుడు త్రికరణశుద్ధిగా సత్యసంధుడు, అసత్యమాడడు. సత్యమైన భావనలు మాత్రమే నరేంద్రుని వంటి సత్యసంధుల మనస్సులలో జనిస్తాయని శాస్త్రాలు నొక్కివక్కాణిస్తున్నాయి. అటువంటప్పుడు నా దర్శనాలు పొరపాటు అయ్యే ఆస్కారం ఉందా? కాని అనేక విధాల నా దర్శనాలను ఇంతకు మునుపు పరీక్షించి, తల్లి ఏది సత్యమో దానినే నాచే దర్శింపచేసిందని రూఢిపరచుకొనే ఉన్నాను. పైగా అవి సత్యాలే అని ఆమె ముఖతా పదేపదే విన్నాను కూడా. అటువంటప్పుడు సత్యమే జీవితంగా గడిపే నరేంద్రుడు ఆ దర్శనాలను నా మనోకల్పనలని ఎందుకు చెబుతున్నాడు? నా దర్శనాలను గురించి తెలుపగానే అవి సత్యాలే అని ఎందుకతడు అంగీకరించడం లేదు?' ఇలా కలత చెంది చివరికి ఆయన ఈ విషయాన్ని అమ్మకు నివేదించారు. ''ఆతడి మాటలు ఎందుకు వింటావు? ఇదంతా సత్యమేనని స్వల్పకాలంలోనే అతడు అంగీకరిస్తాడు'' అనే అమ్మ అభయవచనాలు విన్న తరువాత శ్రీరామకృష్ణులు నిశ్చింతులైనారు. పైన చెప్పిన దానిని మరింత బాగా అర్థం కావడానికి ఉదాహరణగా ఇక్కడ ఒక సంఘటనను పొందుపరుస్తున్నాం:

అప్పటికి కూచ్‌బిహార్ వివాహం కారణంగా బ్రహ్మసమాజం చీలి

18. నరేంద్రుణ్ణి చూడ గోరి శ్రీరామకృష్ణులు సాధారణ బ్రహ్మసమాజానికి వెళ్లడం

పోయింది; సాధారణ బ్రహ్మసమాజం అంతకు కొన్ని ఏళ్ల మునుపు స్థాపించబడింది. నరేంద్రుడు అప్పుడప్పుడు కేశవ్ వద్దకు పోతూవున్నప్పటికీ, క్రమంతప్పకుండా సాధారణ బ్రహ్మసమాజ ఆదివార ప్రార్థనా సమావేశాలలో పాల్గొంటూ, అక్కడ భక్తిగీతాలు పాడేవాడు. ఒక సందర్భంలో నరేంద్రుడు

ఒక వారమో లేదా రెండు వారాలో శ్రీరామకృష్ణుల దర్శనార్థం దక్షిణేశ్వరానికి వెళ్లలేకపోయాడు. అతడికోసం శ్రీరామకృష్ణులు ఎదురుతెన్నులు చూసి, చివరకు స్వయంగా తామే కలకత్తాకు పోయి నరేంద్రుణ్ణి చూడ నిశ్చయించారు. ఆ రోజు ఆదివారం కావడం వలన, నరేంద్రుడు ఎవరినన్నా చూడడంకోసం బయటకు వెళ్లివుంటాడనీ, కాబట్టి తాము కలకత్తాకు వెళ్లినా ప్రయోజనం ఉండదనీ ఆయనకు గుర్తుకువచ్చింది. తాము సాధారణ బ్రహ్మసమాజానికి పోతే, నాడు ఆదివారం కాబట్టి అక్కడ తప్పకుండా నరేంద్రుణ్ణి చూడ వచ్చునని చివరకు ఆయన నిర్ణయించారు. తాము ఇలా హఠాత్తుగా అక్కడకు వెళితే బ్రహ్మసమాజస్థులకు ఇబ్బంది కలుగుతుందేమోనన్న ఆలోచన ఆయన మదిలో మెదలకపోలేదు. కాని మరుక్షణంలోనే మళ్లీ ఇలా ఆలోచించారు: ''ఎందుకు అలా అనుకోవాలి? కేశవ్ సమాజానికి అలాగే అనేకసార్లు వెళ్లాను, నా రాకపట్ల వారు ఆనందాన్నే వ్యక్తపరిచారు. సాధారణ బ్రహ్మసమాజ నాయకులైన విజయ్, శివనాథ్ మొదలైన వారు కూడా తరచు దక్షిణేశ్వరానికి వస్తూనే ఉన్నారు కదా!'' ఇలా ఆలోచించినప్పటికీ సరళహృదయులైన శ్రీరామకృష్ణులకు ఒక ముఖ్య విషయం జ్ఞాపకం రాలేదు. శ్రీరామకృష్ణులతో సాంగత్య లబ్ధి పొందిన తరువాత కేశవ్, విజయ్‌ల ధార్మిక వైఖరులలో మార్పు రావడం గమనించి, శివనాథ్ తదితర సాధారణ బ్రహ్మసమాజస్థుల దక్షిణేశ్వర రాకలు క్రమంగా తగ్గిపోవడం శ్రీరామకృష్ణులకు స్ఫురించలేదు. అలా గమనించలేక పోవడం ఆయనకు స్వాభావికమే కదా! ఎందుకంటే, మనిషి ధార్మిక భావాలు ఆతడి మనస్సు ఉన్నతోన్నత ఆధ్యాత్మిక భావభూములను అధిరోహించి, భగవదనుగ్రహం పొందినప్పుడు సమూల మార్పులకు లోనవుతుందనే భావన సదా ఆయన హృదయాంతరాళాల్లో కలుగుతూండేది. కాబట్టి సత్యంపట్ల అనురక్తిగల బ్రహ్మసమాజస్థులు ఇప్పుడు మరో త్రోవపట్టి ఆధ్యాత్మిక అనుభవాలకు పరిమితిని కల్పిస్తారని ఆయన ఎలా అనుకోగలరు?

అప్పుడు మునిమాపువేళ. వందలాది బ్రహ్మసమాజస్థుల పావన హృదయాలు, 'బ్రహ్మసత్యం జ్ఞానమనంతం' మొదలైన మంత్రోచ్చారణల

19. ఆయన రాకకు ఫలితం

మూలంగా జనించిన ఉద్వేగంతో ఉప్పొంగి, భగవత్పాద పద్మాలలో లయమై ఉన్నాయి. మెల్లగా ప్రార్థన, ధ్యానం ముగింపుకొచ్చాయి; పిదప ఆచార్యుడు పీఠాన్ని అలంకరించి, అక్కడ సమావేశమై ఉన్న సమాజ సభ్యులకు దైవభక్తిని పెంపొందించే ఉపదేశాలు ఇవ్వ సాగాడు. అదే సమయంలో అర్ధబాహ్య చైతన్యంలో ఉన్న శ్రీరామకృష్ణులు బ్రహ్మసమాజ మందిరంలోకి ప్రవేశించి, తిన్నగా పీఠంమీద ఆసీనుడై ఉన్న ఆచార్యుని వద్దకు వెళ్లారు. అక్కడ సమావేశమైవున్న వారిలో అనేకులు

ఆయనను ఇంతకు మునుపే చూసివున్నారు. కాబట్టి శ్రీరామకృష్ణుల రాక అక్కడున్న అందరికీ క్షణంలో తెలిసిపోయింది. ఇంతకు మునుపు శ్రీరామకృష్ణులను చూడనివారు ఆయనను చూడగోరి నేల మీద, బల్లల మీద లేచి నిలబడ్డారు. దాంతో అక్కడ ఒకింత గడబిడ పరిస్థితి నెలకొనడంతో, ఆచార్యుడు ఉపదేశ ప్రసంగాన్ని ముగించవలసి వచ్చింది. భక్తిగీతాలు ఆలాపించే బృందంలో కూర్చున్న నరేంద్రుడు, శ్రీరామకృష్ణులు హఠాత్తుగా అలా రావడానికి కారణం గ్రహించి, ఆయన వద్దకు వచ్చాడు. కాని విజయ్ తదితర బ్రహ్మసమాజ నాయకులలో భిన్నాభిప్రాయం కలగడానికి కారకులైన వ్యక్తి శ్రీరామకృష్ణులే అని నిశ్చయించుకొన్న ఆచార్యుడు, తక్కిన ముఖ్యులు, ఆయనపట్ల ఉదాసీనంగా వ్యవహరించారు; కనీస మర్యాదను సైతం వారు పాటించలేదు.

ఏ ప్రక్కకు చూడకుండా శ్రీరామకృష్ణులు తిన్నగా పీఠం వద్దకు వచ్చారు; అప్పుడు ఆయన భావపారవశ్యంలో ఉన్నారు. ఆయన ఆ భావసమాధ్యవస్థను చూడగోరిన జనసమూహంలో గడబిడ మరింత అధికరించి, గందరగోళ పరిస్థితి అక్కడ నెలకొంది. ఆ గడబిడ తగ్గే సూచనలు ఏవీ కనిపించకపోవడంతో, జనాన్ని చెల్లాచెదరు చేయడానికి ఆ సమావేశ సభామంటపంలోని దీపాలను ఆర్పివేశారు. ఆ చీకటిలో ప్రతి ఒక్కరూ ద్వారం వైపుకు పరుగెత్తడంతో ఆ గందరగోళం తీవ్రస్థాయికి చేరుకొంది.

20. జనాన్ని చెల్లా చెదరు చేయడానికి దీపాలు ఆర్పివేయడం

శ్రీరామకృష్ణులను సమాజ సభ్యులు ఎవరూ పట్టించుకోకపోవడం చూసి నరేంద్రుడు స్వయంగా తానే ఆయనను ఆ చీకటిలో నుండి బయటకు తోడ్కొని రావడంలో నిమగ్నుడైనాడు. శ్రీరామకృష్ణుల భావపారవశ్యం తగ్గిపోగానే, నరేంద్రుడు ఆయనను వెనుక ద్వారం గుండా ఎంతో కష్టంమీద బయటకు తోడ్కొని వచ్చాడు. తరువాత ఆయనను ఒక బండిలో దక్షిణేశ్వరానికి తోడ్కొని వెళ్లాడు. ఆ సంఘటన గురించి నరేంద్రుడు ఇలా చెప్పాడు: ''ఆ రోజు నా గురించి ఆయన ఎంతటి నిరాదరణకు గురియైనారో తలచుకొంటే ఎంతో బాధగా ఉంది. ఆ రోజు ఆయన ఆ ప్రవర్తనకు ఆయనను ఎంతగా నిందించానో కదా! కాని ఆయనో! ఆ అవమానానికి ఆయన బాధపడలేదు, సరికదా నా నిందాలాపాలకు చెవి ఒగ్గనూ లేదు; ఆయన ప్రక్కన నేను ఉండడంతో ఆయన ఎంతో సంతృప్తి చెందారు.

21. శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరానికి నరేంద్రుడు తోడ్కొని వెళ్లడం

''నా పట్లగల ప్రేమతో తమను గురించి ఆయన బొత్తిగా శ్రద్ధవహించకపోవడం చూసి, ఆయనతో కొన్ని సందర్భాలలో పరుషంగా మాట్లాడడానికి

22. తనను అంతగా ప్రేమిస్తున్నందుకు నరేంద్రుడు, శ్రీరామకృష్ణులను నిరసించడం

కూడా నేను సంకోచించలేదు. నేను ఇలా చెప్పేవాణ్ణి: 'జడభరతుడు సదా ఒక లేడిని గురించే చింతనచేస్తూ ఉండడం వలన మరు జన్మలో లేడిగా జన్మించాడని పురాణాలలో చెప్పబడింది. అదే నిజమైతే, సదా నన్ను గురించే చింతన చేస్తున్న మీరుకూడా పర్యవసానం ఏమిటో కాస్త ఎరిగి, అప్రమత్తంగా ఉండండి.' బాలక మనస్తత్వంగల శ్రీరామకృష్ణులు ఆ మాటలు విని ఆందోళన చెందారు. పిదప, 'నువ్వన్నది నిజమే, నాయనా! అలా జరగడం ఎంతటి దుర్ఘటన! కాని నిన్ను చూడకుండా నేను ఉండలేను. ఏం చేయాలి?' అని అన్నారు. భయవిషాదాలు పెనగొనగా శ్రీరామకృష్ణులు ఈ విషయాన్ని నివేదించడానికి జగజ్జనని వద్దకెళ్లారు. కాసేపట్లో తిరిగి వచ్చి, ఆనందంగా ఇలా చెప్పారు: 'వెళ్లిపో ధూర్తుడా! మళ్లీ ఎన్నడూ నీ మాటలకు చెవి ఒగ్గను. 'అతణ్ణి ప్రేమిస్తున్నావు. అతడిలో ఏ రోజు అయితే నారాయణుణ్ణి చూడలేవో, ఆనాటి నుండి నువ్వు అతడివైపు క్షణంకూడా దృష్టిని సారించవు' అని అమ్మ చెప్పింది.' నా పట్ల ఆయన చూపుతున్న అసాధారణ ప్రేమపట్ల నేను లేవనెత్తిన అభ్యంతరాలను ఒక్క మాటతో ఆయన కొట్టిపడేశారు.''

6.ii. శ్రీరామకృష్ణ నరేంద్రనాథ్‌ల మధ్య నెలకొన్న అపురూప అనుబంధం

1. నరేంద్రుని మహాత్త్వం గురించిన శ్రీరామకృష్ణుల వచనాలు

ఎప్పుడు ఏ పనిలో నిమగ్నుడై ఉన్నప్పటికీ నరేంద్రుని పావనమైన మనస్సూ, హృదయమూ సదా ఉన్నత ఆదర్శాలతో ప్రేరేపింపబడి ఉండడాన్ని ప్రారంభం నుండి శ్రీరామకృష్ణులు తమ అంతర్దృష్టితో కనిపెట్టే ఉన్నారు. అందుకే నరేంద్రునితోటి శ్రీరామకృష్ణుల దైనందిన ప్రవర్తన అరుదైన కోమలత్వాన్ని కలిగి ఉండేది. తినడం, త్రాగడం, నిద్రించడం, ఒక చోటుకు బయలు దేరడం, ధ్యానించడం, ప్రార్థించడం మొదలైన విషయాలలో శ్రీరామకృష్ణులు నియమనిష్ఠలను స్వయంగా తాము పాటించేవారు; అలా చేయడం చూసి భక్తులు స్ఫూర్తిపొంది తామూ అలాగే చేస్తారనీ, లేకుంటే వారు కష్టపడవలసి వస్తుందనీ ఆయన ఎరుగకపోలేదు. కాని నరేంద్రుడు ఆ నియమాలను పాటించకపోయినా అతడికి ఏ హాని వాటిల్లదని ఆయన నిస్సంకోచంగా అందరి సమక్షంలో పదేపదే చెప్పేవారు. ఆయన ఇలా చెప్పేవారు: ''నరేంద్రుడు నిత్య సిద్ధుడు, ధ్యానసిద్ధుడు. అతడిలో సతతం ప్రజ్వరిల్లే జ్ఞానాగ్ని, ఆహార నియమాదులను పాటించకపోవడంలోని దోషాలను దగ్ధం చేసివేస్తుంది. ఏ వ్యక్తి నుండి గాని, ఏ చోటునుండిగాని, తన ఇచ్ఛమేరకు ఏం తీసుకొన్నప్పటికీ అతడి మనస్సు కళంకం కాదు. తన జ్ఞానఖడ్గంతో అతడు మాయాబంధనాలను నిత్యం ముక్కలు ముక్కలు చేసివేస్తూంటాడు; కాబట్టి మహామాయ అతణ్ణి తన అదుపులో ఉంచుకోవడంలో విఫలతను చవిచూస్తుంది.'' హా! ఇలా ఎన్ని విధాలలో శ్రీరామకృష్ణులు మేం విస్మయం చెందేరీతిలో నరేంద్రుణ్ణి శ్లాఘించే వారో కదా!

ఒకసారి మార్వాడీ భక్తులు శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చి, ఆయనకు ప్రణామాలు చేసి పటికబెల్లం, సీమబాదం పప్పులు మొదలైన వివిధ ఆహార పదార్థాలను ఆయనకు అర్పించారు. వాటిలో ఏ ఒక్కటీ ఆయన స్వీకరించలేదు సరికదా అక్కడ హాజరైవున్న ఏ భక్తునికి కూడా ఇవ్వలేదు. ఆయన ఇలా అన్నారు: ''వారు (మార్వాడీలు) ఉద్దేశరహితంగా దేనిని సమర్పించరు; ఒక సాధువుకు కేవలం తమలపాకులు సమర్పిస్తున్నప్పుడు సైతం దానితో అనేక కోర్కెలను ఈడేర్చ మనే ప్రార్థనను జోడిస్తారు. అటువంటి వ్యక్తులు సమర్పించే ఆహారాన్ని పుచ్చు కొన్న వ్యక్తి భక్తి పతనం చెందుతుంది.'' కాబట్టి ఆ మార్వాడీలు సమర్పించిన ఆహార పదార్థాలను ఏం చేయాలో అన్న ప్రశ్న తలెత్తింది. అప్పుడు శ్రీరామ కృష్ణులు, ''వెళ్లి ఆ పదార్థాలను నరేంద్రుడికి ఇచ్చిరండి. వాటిని ఆరగించినా అతడికి ఎలాంటి చెరపూ జరగదు'' అని అన్నారు.

2. మార్వాడీ భక్తులు నివేదించి తెచ్చిన ఆహార పదార్థాలు

ఒక రోజు నరేంద్రుడు భోజనశాలలో (hotel) భోజనంచేసి తిన్నగా శ్రీరామ కృష్ణుల వద్దకు వచ్చి, ''మహాశయా, జనం నిషిద్ధ ఆహారంగా ఎంచే భోజన శాలలో భోజనం చేశాను'' అని చెప్పాడు. గొప్పలకు పోయి నరేంద్రుడు అలా చెప్పలేదని ఆయనకు తెలుసు; తమను తాకకుండా ఉండడానికి లేదా తాము ఉపయో గించే కూజా, పాత్రలు మొదలైనవాటిని తనను తాకనివ్వ కుండా ఉండడానికి శ్రీరామకృష్ణులు ముందుజాగ్రత్త తీసుకొంటారనే కారణంగానే నరేంద్రుడు ఆ విషయం చెప్పాడని ఆయన గ్రహించారు. ఆ మాట విన్న తక్షణమే శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''అలా చేసినందున నీ కెలాంటి దోషమూ అంటదు. పందిమాంసం, ఆవుమాంసం తిని కూడా ఒకరు భగవంతునిపైనే తన మనస్సును నిమగ్నంచేసే పక్షంలో, ఆ వ్యక్తి హవిష్యాన్నం తిన్నట్లే లెక్క; కాని ఒకరు కేవలం ఆకులూ అలములూ తింటూ లౌకిక కోర్కెలలో పూర్తిగా మునిగిపోయి ఉంటే, ఆ వ్యక్తి పంది మాంసం ఆవుమాంసం తిన్నట్లే లెక్క. ఆ నిషిద్ధ ఆహారం తినడంలో నువ్వు ఎలాంటి తప్పూ చేయలేదని భావిస్తున్నాను. కాని వీరిలో ఎవరైనా (ఇతరుల నందరినీ చూపుతూ) నా వద్దకు వచ్చి అలా చెప్పివుంటే, అతణ్ణి నేను కనీసం తాకనైనా తాకి ఉండేవాణ్ణి కాను.''

3. నరేంద్రుని భక్తిపై ఆహార దోషం ఎటువంటి ప్రభావం చూపలేదు

మొట్టమొదట వారు కలుసుకొన్నప్పటినుండి శ్రీరామకృష్ణులు, నరేం ద్రుని పట్ల అన్ని విషయాలలో చూపిన ఆప్యాయత, ఆతణ్ణి ప్రశంసించిన తీరు, అతడికిచ్చిన స్వేచ్ఛ - వీటిని కచ్చితంగా వర్ణించి పాఠకులకు చెప్పడం దాదాపు మాకు అసాధ్యమే. విశాల

4. నరేంద్రుని పురోగతి

మనస్కుడైన శిష్యుని స్వతస్సిద్ధమైన సామర్థ్యాలపట్ల ఆదరణ వహించి గురువు ప్రవర్తించిన ఈ తీరు ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో మరొకటి కానరావడం సందేహాస్పదమే. తమ అంతరాంతరాళాల్లోని ఆలోచనలను నరేంద్రునికి వెలిబుచ్చకుండా శ్రీరామకృష్ణులు సంతృప్తి చెందేవారు కారు; అన్ని విషయాలలోను అతణ్ణే సంప్రతించాలని ఆశించేవారు. ఇతర భక్తుల విశ్వాసాన్ని, తెలివితేటలను పరీక్షించడానికి కొన్ని సమయాల్లో శ్రీరామకృష్ణులు వారిని నరేంద్రునితో వాదించమనేవారు. దేన్నీ సునిశితంగా పరీక్షించకుండా సత్యంగా అంగీకరించమని ఆయన నరేంద్రుణ్ణే ఎన్నడూ కోరిందిలేదు. నరేంద్రుని భక్తిప్రపత్తులు, ఆత్మస్థైర్యం, వ్యక్తిగత ప్రయత్నాలలో ఆతడి సామర్థ్యం, సత్యసంధతను చూసి నరేంద్రుని పట్ల శ్రీరామకృష్ణుల ఈ ప్రవర్తన నూరు రెట్లు అధికరించిందని చెప్పనవసరంలేదు. శ్రీరామకృష్ణుల అనంత ప్రేమ విశ్వాసాలు నరేంద్రుని అన్ని వైపులా దుర్భేద్యమైన గోడలా ఆవరించి, అతణ్ణి అన్ని రకాల దురాకర్షణల నుండి, దుర్వర్తనల నుండి రక్షించింది; ఇందుమూలంగా నరేంద్రుడు స్వతసిద్ధమైన అపార స్వేచ్ఛను అనుభవించాడు. ఒక్క సంవత్సరం తిరిగే లోపు శ్రీరామకృష్ణుల పట్ల గల నరేంద్రుని ప్రేమ ఎంత ప్రగాఢమైనదంటే, శాశ్వతంగా అతడు ఆయనకు శరణాగతుడయ్యాడంటే అతిశయోక్తి కాబోదు. కాని శ్రీరామకృష్ణుల నిస్వార్థ ప్రేమవాహిని తన జీవిత లక్ష్యం వైపుగా ఎంత ముందుకు తీసుకొనిపోయిందో అప్పుడు నరేంద్రుడికి తెలుసా? బహుశా తెలిసి ఉండదు. ఇంతకు మునుపు ఏనాడు అనుభవించని పరమానందాన్ని సంతృప్తిగా అనుభవించిన నరేంద్రుడు, దేవతలు సైతం అపేక్షించే అనుపమాన, పొందజాలని వస్తువే అది అని ఇంకా తెలుసుకోలేదనే చెప్పాలి. ఎందుకంటే, తనకు పరిచితమైన పరమ స్వార్థ, కఠోర ప్రపంచంలో ఈ అరుదైన ప్రేమను పోల్చడానికి అతడికి ఏ వస్తువూ కానరాలేదు. ఈ విషయాన్ని స్పష్టంగా పాఠకులు గ్రహించడానికి కొన్ని ఉదాహరణలు పొందుపరచడం ఇక్కడ అసంగతం కాబోదు.

5. శ్రీ 'మ'ను నరేంద్రునితో వాదించమని శ్రీరామకృష్ణులు కోరడం

నరేంద్రుడు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన కొన్ని నెలల తరువాత 'శ్రీరామకృష్ణ కథామృత' రచయితయైన శ్రీ 'మ'కు మార్చ్ 1882 వ సం॥లో శ్రీరామకృష్ణులను దర్శించుకొనే భాగ్యం కలిగింది. ఆ పుస్తకంలో శ్రీ 'మ'యే స్వయంగా తాను అప్పట్లో బారానగర్‌లో వసించడం వలన ఎలా శ్రీరామకృష్ణులను పలుమార్లు దర్శించుకొన్నదీ, ఎలా శ్రీరామకృష్ణులు వ్యంగ్య హేళనలతో తన పాండిత్యాహంకారాన్ని నిర్మూలించి తనను వినమ్ర పండి

మహేంద్రనాథ్ గుప్త ('మ')

తునిగా తీర్చిదిద్దారో మొదలైన విషయాలు పొందుపరిచి ఉన్నారు. నరేంద్రుడు ఇలా చెప్పాడు: ''ఆ సమయంలో ఒక రోజు రాత్రి నేను దక్షిణేశ్వరంలోనే శ్రీరామకృష్ణులతో గడపడం తటస్థించింది. నేను ప్రశాంతంగా పంచవటి క్రింద కూర్చుని ఉండగా హఠాత్తుగా శ్రీరామకృష్ణులు అక్కడకు వచ్చి నా చెయ్యి పుచ్చుకొని, నవ్వుతూ ఇలా అన్నారు: 'నీ తెలివి, పాండిత్యాలకు నేడొక పరీక్ష. నువ్వు రెండున్నర పరీక్షలలో మాత్రమే ఉత్తీర్ణుడవైనావు; మూడున్నర పరీక్షలలో[1] ఉత్తీర్ణుడైన ఉపాధ్యాయుడు నేడు ఇక్కడకు వచ్చాడు. నాతో రా, అతడితో నువ్వు ఎలా సంభాషించగలవో చూడాలి.' ఇష్టంవున్నా లేకపోయినా ఆయనతో పాటు వెళ్లవలసి వచ్చింది. శ్రీరామకృష్ణుల గదిలో 'మ'తో పరిచయమైన తరువాత, వివిధ అంశాల మీద ఆయనతో మాట్లాడ నారంభించాను. మమ్మల్ని అలా సంభాషణలో మగ్నులను చేసి శ్రీరామకృష్ణులు, నిశ్శబ్దంగా కూర్చుని మా మాటలు వింటూ, మమ్మల్ని గమనించసాగారు. శ్రీ 'మ' ఆయన వద్ద సెలవు పుచ్చుకొని వెళ్లిపోయిన తరువాత శ్రీరామకృష్ణులు, 'ఆ పరీక్షలలో అతడు ఉత్తీర్ణుడైతే మాత్రం ఏమిటి? ఉపాధ్యాయుడు స్త్రీలా సిగ్గుపడే స్వభావం గలవాడు. ఉద్ఘాటిస్తూ మాట్లాడలేడు' అని అన్నారు. ఆ విధంగా ఇతరులతో నన్ను పోటీకి నిలబెట్టి శ్రీరామకృష్ణులు వినోదించేవారు.''

6. భక్తుడైన కేదారనాథ్ ఛట్టోపాధ్యాయ

శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తులలో కేదారనాథ్ ఛట్టోపాధ్యాయ ఒకడు. నరేంద్రుడు రాక ముందునుండే అతడు శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూవున్నట్లు తెలియవస్తోంది. ఇతడు తూర్పు బెంగాల్‌లోని ఢక్కాలో ఉద్యోగం చేస్తున్నందువలన, శరన్నవరాత్రుల వంటి

---

1. అప్పుడు నరేంద్రుడు బి.ఏ. పరీక్షలకు చదువుతున్నాడు; శ్రీ 'మ' అప్పటికే ఆ పరీక్షలో ఉత్తీర్ణుడై న్యాయశాస్త్రం (బి.ఎల్) చదువుతున్నాడు. ఈ విషయాలను శ్రీరామకృష్ణులు ఈ రీతిలో వ్యక్తం చేశారు.

ఉత్సవ సెలవులలో మాత్రమే శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూవుండేవాడు. కేదార్ సాధక భక్తుడు; వైష్ణవశాస్త్రాలలో వర్ణించబడి ఉన్న ఆధ్యాత్మిక భావాల, వైఖరులను అనుష్ఠిస్తూ ఉంటాడు. భక్తిగీతాలు వింటున్నప్పుడు అతడి కళ్ల వెంట అశ్రువులు స్రవించడం కద్దు. అందుకే శ్రీరామకృష్ణులు బహిరంగంగా అతణ్ణి ప్రశంసిస్తూండేవారు. కేదార్ భక్తివిశ్వాసాలను చూసి ఢాకాలో అనేకులు అతడి పట్ల ఎంతో మర్యాదమన్ననలు చెల్లిస్తూండేవారు. ఆతడి ఉపదేశాల ననుసరించి పలువురు తమ ఆధ్యాత్మిక జీవితాలను మలచుకోవడానికి ప్రయత్నించారనడం అతిశయోక్తి కాదు.

శ్రీరామకృష్ణుల వద్దకు తండోపతండాలుగా జనం రాసాగినప్పుడు, వారందరితో ధార్మిక విషయాలు ముచ్చటించి ముచ్చటించి ఆయన అలసి పోయేవారు; ఒక రోజు భావపారవశ్యంలో ఆయన జగజ్జననిని, "అమ్మా, నేను అంతగా మాట్లాడలేకపోతున్నాను; కేదార్, రామ్, గిరీష్, విజయ్‌లకు[1] కాస్త శక్తిని ప్రసాదించు; దాంతో జనం ముందుగా వారి వద్ద కెళ్లి, కొంత గ్రహించి, చివరగా ఇక్కడకు (తమ వద్దకు) వచ్చి ఒకటి రెండు మాటల్లో ఆధ్యాత్మిక జాగృతం పొందగలుగుతారు" అని ప్రార్థించినట్లు మేం విన్నాం. కాని ఇది చాలాకాలం తరువాత జరిగిన విషయం.

7. కేదార్ వాదనా పటిమ

తన కర్తవ్యాల నుండి ఒకింత కాలం సెలవు పుచ్చుకొని కేదార్ కలకత్తాకు వచ్చి అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులను దర్శించుకోసాగాడు. భక్తసాధకుడైన అతడు తన ప్రక్కన ఉండడం శ్రీరామకృష్ణులకు ఆనందాన్ని కలిగించింది; అతడితో ధార్మిక విషయాల గురించి ముచ్చటిస్తూ ఇతర భక్తులను ఆయన, అతడికి పరిచయం చేశారు. ఆ సమయంలో ఒక రోజు నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చాడు. శ్రీరామకృష్ణులతో కేదార్ ఉండడం చూశాడు. శ్రీరామకృష్ణుల కోర్కె మేరకు భక్తిగీతాలు పాడుతూవుంటే, కేదార్ భావపారవశ్యం పొందుతూ ఉండడం నరేంద్రుడు గమనించాడు. ఆ తరువాత కేదార్‌తో వాదించమన్నారు నరేంద్రుణ్ణి. తన ధోరణిలో కేదార్ బాగానే వాదించగలడు; హేతుయుక్తంకాని ప్రత్యర్థి వచనాలను వ్యంగ్యాత్మకంగా అప్పుడప్పుడు అతడు ఎత్తిచూపడం కద్దు. ఏ మాటలతో ఒక రోజు ప్రత్యర్థి నోటిని అతడు మూయించాడో, ఆ మాటలు శ్రీరామకృష్ణులకు ఎంతో నచ్చాయి. ఎవరైనా అటువంటి ప్రశ్నలను తమను అడిగితే,

---

1. కేదార్‌నాథ్ ఛట్టోపాధ్యాయ, రామచంద్రదత్త, గిరీష్‌చంద్రఘోష్, విజయకృష్ణగోస్వామి.

శ్రీరామకృష్ణులు తరచు ఆ ఫలానా ఫలానా ప్రశ్నకు కేదార్ ఇలా ఇలా జవాబిచ్చాడని ఆ జవాబులను ఏకరువుపెట్టేవారు. ఆ రోజు ప్రత్యర్థి, ''భగవంతుడు నిజంగా కరుణామయుడే అయితే, ఎందుకు ఆయన ఇంత బాధలను, కష్టాలను, అత్యాచారాలను కల్పించాడు. వేలాదిమంది కరువు కాటకాల వాత బడి మరణిస్తున్నారు?'' అనే ప్రశ్నను లేవదీశాడు. అందుకు కేదార్ ఇలా జవాబిచ్చాడు: ''భగవంతుడు దయామయుడే అయినప్పటికీ, బాధలు కష్టాలు అత్యాచారాదులు ఇట్లే కొనసాగాలని ఆయన నిర్ణయం తీసుకొన్న సమావేశానికి దురదృష్టవశాత్తు నన్ను ఆహ్వానించలేదు. అటువంటప్పుడు అందుకు కారణమేమిటో నా కెలా తెలుస్తుంది?'' కాని ఈ రోజు అందరి సమక్షంలో నరేంద్రుని కుశాగ్రబుద్ధి ముందు కేదార్ తలవంచక తప్పలేదు.

కేదార్ సెలవు పుచ్చుకొని వెళ్లిపోయాక శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి ఇలా అడిగారు: ''మంచిది, అతణ్ణి గురించి ఏమనుకొంటున్నావు? అతడి

8. కేదార్ గురించి నరేంద్రుడు

గొప్ప దైవభక్తిని గుర్తించావా? భగవన్నామం చెవిని పడగానే అతడి కళ్లు ఎలా స్రవించాయో చూశావా? హరి నామం వినగానే ఎవరి కళ్ల నుండి అశ్రుధారలు వర్షిస్తాయో, ఆ వ్యక్తి ముక్తుడని గ్రహించాలి. కేదార్ ఉత్కృష్టమైన వ్యక్తి కాడా?'' ధార్మికత నిమిత్తమైనా లేదా మరే కారణంగానైనా పురుషదేహాన్ని ధరించి స్త్రీ వైఖరిని అవలంబించే వ్యక్తులను నరేంద్రుడు తన హృదయం అట్టడుగునుండి ద్వేషించేవాడు. తన సంకల్పాన్ని, పట్టుదలను దృఢతరం చేసుకోవడానికి బదులుగా, భగవంతుణ్ణి సమీపించి విలపించడంలో ఉపశమనం పొందడం పురుషత్వానికి అవమానమని నరేంద్రుడు భావించేవాడు. పరిపూర్ణంగా భగవంతునికి పరాధీనుడైనప్పటికీ, మనిషి సదా మనిషిగానే వ్యవహరించాలనీ, మనిషిగానే ఆయనను శరణు వేడాలనీ నరేంద్రుడు అభిప్రాయపడేవాడు. కాబట్టి శ్రీరామకృష్ణుల ఆ వచనాలను హృదయపూర్వకంగా ఆమోదించలేకపోయినప్పటికీ ఆయనతో ఇలా చెప్పాడు: ''కాని మహాశయా, ఆ విషయం నా కెలా తెలుసు? వ్యక్తుల నైజం మీరు బాగా గ్రహించగలరు; మీరే ఆ విషయం నిశ్చయంగా చెప్పగలరు. లేకుంటే ఊరకనే విలపిస్తూన్న వ్యక్తిని చూసి అతడు సజ్జనుడో లేదా దుర్జనుడో ఎవరూ చెప్పలేరు. కొంతసేపు ఏకాగ్రంగా ఒక దానినే చూస్తూవుంటే కళ్లలోని అశ్రుకారకాలైన గ్రంథులు అలసిపోయి కన్నీళ్లు స్రవిస్తాయి. శ్రీకృష్ణుని విరహ వేదనను అనుభవిస్తున్న శ్రీమతిని (రాధ) అభివర్ణిస్తున్న పాటలు వింటూ లేదా ఆ పాటలు పాడుతూ విలపించే వారిలో అత్యధికులు తమ భార్యల ఎడబాటును తలచుకొని లేదా తమనే ఆ స్థితిలో ఊహించుకొని అలా విలపిస్తారనడంలో ఎలాంటి

సందేహమూ లేదు. అటువంటి పరిస్థితితో బొత్తిగా పరిచయంలేని నా వంటి వ్యక్తులకు కరుణరసం ఉట్టిపడే మధుర కీర్తన[1] విన్నప్పుడు సైతం కళ్లు ఆర్ద్రం కావు.'' తనను ప్రశ్నించినప్పుడు సదా ఆ విధంగా నరేంద్రుడు తనకు నిజమని తెలిసిన విషయాన్ని శ్రీరామకృష్ణులతో నిర్భయంగా చెప్పేవాడు. శ్రీరామ కృష్ణులు కూడా అలా నరేంద్రుడు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చినందుకు సదా ప్రసన్నులయ్యేవారు. ఎందుకంటే, వ్యక్తుల హృదయాలను చదవగలిగే శ్రీరామ కృష్ణులకు సత్యమే జీవితంగా బ్రతికే నరేంద్రుని మనస్సులో కించిత్తుకూడా బడాయి లేదని తెలియకపోలేదు; లేదా అతడు తన అంతరాంతరాళాలను 'సందిగ్ధతకు ఏమాత్రం తావియ్యకుండా స్పష్టంగా ఉంచుకొంటాడు' అని ఆయన మాటల్లోనే చెప్పవచ్చు.

9. నరేంద్రుడు - రాఖాల్

శ్రీరామకృష్ణులను కలుసుకోవడానికి కొద్దికాలం ముందే నరేంద్రుడు బ్రహ్మసమాజంలో చేరాడు. ఒక్క నిరాకార భగవంతుణ్ణే మాత్రమే విశ్వసిస్తానే, ఆయననే ఉపాసిస్తానే, ఆయననే ధ్యానిస్తానే బ్రహ్మ సమాజ దీక్షను నరేంద్రుడు చేగొన్నాడు. కాని బ్రహ్మ సమాజస్థులు ప్రచారం చేసే సామాజిక ఆచార సంప్రదాయాలను పాటించి బ్రహ్మసమాజస్థునిగా మారిపోవాలనే ఆలోచన ఎన్నడూ అతడిలో జనించ లేదు. రాఖాల్‌కు అంతకు ముందునుండే నరేంద్రుణ్ణి తెలుసు; ఎంతో సమయం వారిద్దరూ కలిసి గడిపేవారు. నరేంద్రుని ఆప్యాయత, ఉట్టిపడే ప్రవర్తనకు ముగ్ధుడైన బాలక స్వభావుడైన రాఖాల్, నరేంద్రుని పట్ల ప్రగాఢ నమ్మకం కలిగి ఉండడమే కాక, నరేంద్రుడి సంకల్పశక్తి ద్వారా అన్ని విష యాలలో క్రమబద్ధతను సంతరించుకొన్నాడనడంలో ఎలాంటి ఆశ్చర్యమూ లేదు. కాబట్టి నరేంద్రుని సలహా మేరకు బ్రహ్మసమాజ దీక్షను తానూ చేగొన్నాడు. ఇది జరిగిన కొద్దికాలంలోనే రాఖాల్, శ్రీరామకృష్ణులను కలుసు కొన్నాడు. శ్రీరామకృష్ణుల ఉపదేశంతో రాఖాల్‌లో నిద్రాణమైవున్న సాకారో పాసన మళ్లీ జాగృతమైంది. ఆ తరువాత కొద్దికాలంలోనే నరేంద్రుడు దక్షిణేశ్వ రానికి వచ్చాడు; అక్కడ రాఖాల్ ఉండడం చూసి ఎంతో సంతోషించాడు. కొన్ని రోజులు గడిచాక శ్రీరామకృష్ణులతోబాటు కాళికాలయానికి వెళ్లి రాఖాల్ విగ్రహారాధన చేయడం నరేంద్రుడు చూశాడు. అది చూసి సత్యసంధుడైన నరేంద్రుడు నిరాశచెందాడు; రాఖాల్‌కు పూర్వం పుచ్చుకొన్న బ్రహ్మసమాజ

---

1. మధురానగరానికి శ్రీకృష్ణుడు వెళ్లిపోతున్నప్పుడు బృందావన గోపికలు అనుభవించిన తీవ్ర విరహాన్ని వర్ణించే గీతాలు.

దీక్షను గుర్తుచేసి, "ఆలయానికి వెళ్ళి విగ్రహాలకు ప్రణామం చేయడం వలన నువ్వు దీక్షాభంగ అపరాధానికి గురియైనావు" అంటూ సుతిమెత్తగా చీవాట్లు పెట్టాడు. రాఖాల్ ఆ మాటలు విని మౌనం వహించాడు; అప్పటి నుండి నరేంద్రుణ్ణి కలుసుకోవాలంటే రాఖాల్‌కు భయమూ, జంకూ ఏర్పడ్డాయి. ఆ తరువాత రాఖాల్ ఎందుకు అలా ప్రవర్తించాడో తెలుసుకొని శ్రీరామకృష్ణులు నచ్చచెప్పే ధోరణిలో ఆప్యాయంగా నరేంద్రుడితో ఇలా చెప్పారు: "ఇలా చూడు. రాఖాల్‌ను ఇకపై నిందించవద్దు. నిన్ను చూసి కుంచించుకుపోతు న్నాడు. ఇప్పుడు అతడికి సాకార భగవంతునిలో విశ్వాసం ఏర్పడింది; అందుకు అతడు ఏం చేయగలడు? ఆదినుండే ప్రతి ఒక్కరికీ నిరాకార భగవంతుని భావన కలుగుతుందా ఏమిటి?" నాటి నుండి రాఖాల్‌ను నిరసించడం నరేంద్రుడు మానుకొన్నాడు.

10. అద్వైతతత్త్వాన్ని నరేంద్రుడు నిరసించడం

ఆధ్యాత్మిక జగత్తులో నరేంద్రుడు ఎంతో విశిష్టార్హతలు ఉన్న వ్యక్తి అని శ్రీరామకృష్ణులు గ్రహించారు; మొట్టమొదటి రోజు తాము కలుసుకొన్నప్పటి నుండి ఆతడిలో అద్వైతతత్త్వ సత్యంపట్ల విశ్వాసాన్ని పాదుగొల్పాలని ఆయన ప్రయత్నించారు. దక్షిణేశ్వరానికి రాగానే అష్టావక్ర సంహిత మొదలైన పుస్తకాలను చదవమని అతడికిచ్చారు. కాని సగుణ నిరాకారబ్రహ్మాన్ని ఆరాధిస్తూన్న నరేంద్రుడికి ఇటువంటి పుస్తకాలు నాస్తికతకు, దైవదూషణకు ప్రాతినిధ్యం వహిస్తూన్నట్లు అనిపించాయి. శ్రీరామ కృష్ణుల విన్నపం మేరకు అష్టావక్ర సంహితను ఒకింత చదవగానే అతడు ఇలా విరుచుకుపడ్డాడు: "దీనికీ నాస్తికతకూ భేదం ఏముంది? సృష్టింపబడిన జీవుడు తానే సృష్టికర్తనని భావించవచ్చా? ఇంతకంటే పాపం మరేముంటుంది? 'నేను దేవుణ్ణి, నువ్వు దేవుడవు, పుట్టేగిట్టేవన్నీ దేవుళ్లే' అన్న భావనకంటే తర్క రహిత సూక్తి మరొకటి ఉందా? ఇటువంటి గ్రంథాలను వచించిన ఋషుల, మునుల మతులు చెడి ఉంటాయి. లేకుంటే అటువంటి విషయాలు ఎలా వ్రాసివుంటారు?" నిర్మొహమాటంగా మాట్లాడిన నరేంద్రుని ఆ వచనాలు విని, ఆతడి ఆధ్యాత్మిక వైఖరిని హఠాత్తుగా ఎదుర్కోకుండా శ్రీరామకృష్ణులు నవ్వుతూ ఇలా అన్నారు: "ఇప్పుడు నువ్వు ఆ భావాలను అంగీకరించక పోవచ్చు. అందువలన ఋషులను, మునులను గర్హించడం ఎందుకు? భగవం తుని స్వభావానికి పరిమితులను ఎందుకు నిర్ణయిస్తావు? మూర్తీభవించిన సత్యమే అయిన ఆయనను సదా ప్రార్థిస్తూ ఉండు; తనను నీకు ఏ నైజంలో వ్యక్తంచేసుకొంటాడో, అదే ఆయన నిజమైన స్వభావం అని విశ్వసించు." కాని నరేంద్రుడు, శ్రీరామకృష్ణుల ఈ వచనాలకు చెవి ఒగ్గలేదు. ఎందుకంటే, హేతు

వాదంతో సుస్థాపితంకాని దేనినీ అతడు సత్యంగా అంగీకరించడు. నిజానిజాలు తెలుసుకోవడంలో అతడు అవలంబించే తీరు ఇదే. కాబట్టి అద్వైత సిద్ధాంతానికి విరుద్ధంగా హేతువాదాన్ని లేవదీయడానికి అతడు ఎన్నడూ, శ్రీరామకృష్ణులతో సహా ఎవరివద్దా సంకోచించడు; అద్వైతతత్త్వానికి విరుద్ధంగా వ్యంగ్యాత్మక వచనాలు కూడా అతడు అప్పుడప్పుడు ప్రయోగించడం కద్దు.

11. ప్రతాపచంద్ర హాజ్రా

ఆ సమయంలో దక్షిణేశ్వర ఉద్యానంలో ప్రతాపచంద్ర హాజ్రా అనే వ్యక్తి వసిస్తూవుండేవాడు. హాజ్రా కుటుంబ, ఆర్థిక పరిస్థితులు అప్పుడు అంతంత మాత్రంగానే ఉండేవి. అందువలన ఆధ్యాత్మిక సాఫల్య సిద్ధికై అతడు ఎంతగా ప్రయత్నిస్తూన్నప్పటికీ, అతడి మనస్సులో ధనంపట్ల గల ఆకాంక్షదే పైచేయి అయ్యేది. కాని ఆ ఆకాంక్షను మనస్సులోనే దాచుకొని, బయటకు భగవంతునిపట్ల నిస్వార్థసేవను గురించి గొప్పగా మాట్లాడి, తద్ద్వారా ప్రశంస పొందాలని ప్రయత్నిస్తూవుంటాడు. లాభనష్టాలను బేరీజు వేయడం అతడికి ఎంత స్వభావసిద్ధమైనదంటే, ఆధ్యాత్మిక సాధన సమయంలో సైతం ఆతడు దానిని విస్మరించడు. జప సాధనలు అనుష్ఠించి ఏదో అద్భుత శక్తిని గడించి, దాంతో ధనంపట్లగల ఆకాంక్షను తీర్చుకోవాలనే యోచన కొన్ని సమయాలలో అతడి మనస్సులో మెదలడం కద్దు. మొట్టమొదటి నుండి హాజ్రా ఈ వైఖరి శ్రీరామకృష్ణులు గమనించకపోలేదు; ఆ దురుద్దేశాన్ని విడిచిపెట్టి, భగవంతుని ప్రార్థిస్తూ ఉండమని ఆయన ఉపదేశించారు కూడా. కాని దుర్బల మనస్కుడైన హాజ్రా ఆ ఉపదేశాన్ని పాటించకపోగా, అహం భ్రాంతి స్వార్థపరత్వ ప్రేరణలతో శ్రీరామకృష్ణులను దర్శింపగోరి వచ్చిన వారితో, తానూ తక్కువపాటి సాధువును కానని ప్రచారం చేసుకొనేవాడు. దాంతోపాటు నిజాయితీగా ఉండాలనే నిజమైన కించిత్తు కోర్కెకూడా అతడి మనస్సులో లేకపోలేదు. హాజ్రా ప్రవర్తన గురించి శ్రీరామకృష్ణులు ఎరిగే ఉన్నప్పటికీ, ఆతణ్ణి కొన్ని సమయాలలో తీవ్రంగా చీవాట్లు పెట్టినప్పటికీ, అక్కడ నుండి శాశ్వతంగా అతణ్ణి ఆయన పంపించి వేయకపోవడమే పై విషయానికి తార్కాణం. కాని అతడితో కలిసిమెలిసి ఉండవద్దని మాలో కొందరిని శ్రీరామకృష్ణులు హెచ్చరిస్తూ, ''ఆ హాజ్రా లెక్కలుగట్టే మనస్తత్వం ఉన్నవాడు. అతడి మాటలకు చెవి ఒగ్గకండి'' అని చెప్పేవారు.

పైన వర్ణించిన సద్గుణ దుర్గుణాలతోపాటు హాజ్రాకు సంశయాత్మక మనస్తత్వం కూడా ఉంది. అతడితో సమానమైన విద్యార్హతలుగల ఇతరులతో పోల్చిచూస్తే హాజ్రా ఎంతో తెలివితేటలు ఉన్నవాడనే అంగీకరించాలి. కాబట్టి

ఆంగ్ల విద్యను అభ్యసించిన నరేంద్రుని వంటి వ్యక్తులు పాశ్చాత్య అజ్ఞేయవాద తత్త్వవేత్తల సిద్ధాంతాలను చర్చించుకోవడం విని కించిత్తు అర్థంచేసుకోగలిగే

12. హాజ్రా తెలివితేటలకు నరేంద్రుని మెప్పుకోలు

వాడు హాజ్రా. అందుచేత నరేంద్రుడు దక్షిణేశ్వరం వచ్చినప్పుడు, తీరక దొరికితే ఒక గంటో లేక రెండు గంటలో హాజ్రాతో సంభాషిస్తూ గడిపేవాడు. నరేంద్రుని కుశాగ్ర బుద్ధి ముందు హాజ్రా తలవంచక తప్పేది కాదు. నరేంద్రుని వచనాలను హాజ్రా అమిత శ్రద్ధతో వినేవాడు; కొన్ని సమయాలలో అతడికోసం హుక్కా సిద్ధంచేసి ఇవ్వడంకూడా కద్దు. హాజ్రా పట్ల నరేంద్రుని ఆ వైఖరిని చూసి మేం, 'హాజ్రా నరేంద్రుని నేస్తం' అంటూ పరిహసించేవాళ్లం.

నరేంద్రుడు కళ్లబడగానే శ్రీరామకృష్ణులు తరచు భావపారవశ్యంలో మగ్నులయ్యేవారు. పాక్షికంగా బాహ్యచైతన్యంలోకి వచ్చిన తరువాత అతడితో

13. నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు శ్రీరామకృష్ణుల ప్రవర్తన

చాలాసేపు ఆధ్యాత్మిక విషయాలు ముచ్చటిస్తూ ఆనందించేవారు. అటువంటి సమయాలలో వచనాల, చేతల ద్వారా ఆతడి మనస్సులో ఉన్నత ఆధ్యాత్మిక సత్యాలను పాదుగొల్ప ప్రయత్నించేవారు. అప్పుడప్పుడు ఆయన భక్తి గీతాలు వినగోరేవారు; కాని నరేంద్రుని సుమధుర కంఠస్వరం వింటూవుండగానే మళ్లీ ఆయన భావపారవశ్య మగ్నులయ్యేవారు. ఆ కారణంగా నరేంద్రుని గానం ఆగేపోయేది కాదు సుమా! కొన్ని గంటలసేపు ఆ భావంలో లీనమైపోయిన నరేంద్రుడు పాట తరువాత పాట పాడసాగేవాడు. బాహ్యచైతన్యంలోకి వచ్చిన తరువాత శ్రీరామకృష్ణులు అతణ్ణే ప్రత్యేకంగా ఒక ఫలానా పాటను పాడమనేవారు. ఆ తరువాత జీవేశ్వరుల మధ్యనున్న భేదం, బ్రహ్మం జీవుల యథార్థ స్వభావం మొదలైన అద్వైత సిద్ధాంతంలోని సూక్ష్మతర సత్యాలను ముచ్చటించడంలో కొంత సమయం గడిచిపోయేది. ఆ విధంగా నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడల్లా అక్కడ పరమానందం వెల్లివిరిసేది.

ఒక రోజు శ్రీరామకృష్ణులు అద్వైతతత్త్వం ప్రకారం జీవేశ్వరుల అభిన్నతను సూచించే అనేక విషయాలు నరేంద్రునికి చెప్పారు. నరేంద్రుడు ఆ

14. ఆధ్యాత్మిక భావోద్వేగంలో శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి స్పృశించడం

వచనాలను శ్రద్ధతోనే ఆలకించాడు గాని, వాటిని అవగతం చేసుకోలేకపోయాడు; ఆ తరువాత అతడు హాజ్రా వద్దకు వెళ్లాడు. పొగత్రాగుతూ, ఆ విషయాలను మళ్లీ హాజ్రాతో చర్చిస్తూ, "నీళ్ల కూజా భగవంతుడవడం, ఆ పాత్ర భగవంతుడవడం, మనం చూస్తూన్న ప్రతి వస్తువూ భగవంతుడవడం ఎన్నటికైనా సాధ్యమేనా?" అని అడిగాడు. ఆ భావాన్ని నరేంద్రునితో కలిసి

హాజ్రాకూడా ఎగతాళి చేస్తూ, ఇద్దరూ పకపకా నవ్వుకోసాగారు. అప్పటి వరకు శ్రీరామకృష్ణులు పాక్షిక బాహ్యచైతన్య స్థితిలోనే ఉన్నారు. నరేంద్రుడు బిగ్గరగా నవ్వడం విని ఆయన తమ వస్త్రాన్ని బాలునిలా చంకలో పెట్టుకొని గది నుండి బయటకు నవ్వుతూ వచ్చారు. ఆప్యాయంగా, ''మీ రిద్దరూ ఏం మాట్లాడుకొంటున్నారు?'' అని అడిగారు. పిదప ఆయన నరేంద్రుణ్ణి స్పృశించి, భావపారవశ్యంలో మగ్నులైపోయారు.

15. నరేంద్రుని అద్భుత అనుభవం

తదనంతరం నరేంద్రుడు మాతో ఇలా చెప్పాడు: ''శ్రీరామకృష్ణుల అద్భుత స్పర్శతో క్షణంలో నా మనఃస్థితిలో సంపూర్ణ విప్లవాత్మక మార్పు జనించింది. ఈ యావత్తు విశ్వంలో ఒక్క భగవంతుడు తప్ప మరేదీ నాకు కనిపించకపోవడంతో నేను దిగ్భ్రాంతుడనయ్యాను. ఆ స్థితి ఎంతసేపు అలా కొనసాగుతుందోనని విస్మయం చెందుతూ మౌనంగా ఉండిపోయాను. కాని ఆ ఉన్మాదావస్థ ఆ రోజంతా అట్లే ఉండిపోయింది. ఇంటికి తిరిగి వచ్చినా, ఆ స్థితి అలాగే కొనసాగింది. నేను చూస్తున్నదంతా ఆయనగానే కనిపిస్తోంది. భోజనానికి కూర్చున్నాను. అన్నం, కంచం, వడ్డిస్తున్న వ్యక్తి, చివరికి నేనూ యావత్తు ఆయనగానే కనిపించసాగింది. ఒకటి రెండు ముద్దలు నోట్లో వేసుకొని ప్రశాంతంగా కూర్చున్నాను. 'ఎందుకు ప్రశాంతంగా కూర్చున్నావు? ఎందుకు తినడం లేదు?' అన్న మా అమ్మ ఆప్యాయవచనాలతో బాహ్యస్మృతిలోకి వచ్చి, మళ్ళీ తినడం మొదలు పెట్టాను. ఆ విధంగా తింటున్నప్పుడు, త్రాగుతున్నప్పుడు, కూర్చున్నప్పుడు, పడుకొన్నప్పుడు, కళాశాలకు పోతున్నప్పుడు, పచార్లు చేస్తున్నప్పుడు అదే అనుభవం కొనసాగింది. వర్ణనాతీతమైన ఒక రకం మత్తు సదా నన్ను ఆవహించింది. వీధిలో నడుస్తున్నప్పుడు ఒక బండి ఎదురుగా వస్తున్నప్పటికీ ప్రక్కకు జరిగిపోవాలనే ధ్యాస నాకు కలగలేదు. 'నేను కూడా అదే కదా' అనే తలంపే అందుకు కారణం. ఆ సమయంలో నా చేతులూ, కాళ్ళూ సదా అచేతనంగా ఉండిపోయేవి. అన్నం తింటున్నప్పుడు, తింటున్నాననే స్ఫురణే ఉండేది కాదు. మరెవరో తింటున్నారని అనిపించేది. కొన్ని సమయాల్లో తింటూ పడుకొనేవాణ్ణి; కాసేపట్లో లేచి తినడం కొనసాగించేవాణ్ణి. కొన్ని రోజుల్లో మామూలు కంటే ఎంతో ఎక్కువ తినేవాణ్ణి. కాని అలా తిన్నందు వలన ఎలాంటి ఇబ్బందికీ నేను గురికాలేదు. 'నీ కేదో తీవ్రమైన రుగ్మత దాపురించినట్లు భయం వేస్తోంది' అంది మా అమ్మ కంగారుపడుతూ.

''కొన్ని సమయాలలో, 'ఎక్కువ కాలం వీడు బ్రతకడు' అని ఆమె అనేది. నన్ను ఆవరించిన ఆ మత్తు కాస్త తగ్గాక ప్రపంచం నాకు కలలా అనిపిం

చింది. హెదువా చెరువుగట్టు మీద పచార్లు చేస్తూ తలను, చెరువు చుట్టూ వేసిన ఇనుపకమ్మీల కంచెకు గుద్దుకొన్నాను; ఆ కంచె నిజమైనదో లేదా అదీ కలలో కనిపిస్తూన్నదో తెలుసుకోగోరి అలా చేశాను. చేతులూ కాళ్లూ అచేతన అవస్థలో ఉండడంచేత, పక్షవాతం వాతపడతానేమోనని భయపడ్డాను. కొంత కాలం ఆ తీవ్రమత్తువంటి అవస్థ నుండి విడివడలేకపోయాను. మామూలు స్థితిలోకి వచ్చి ఊపిరిపీల్చుకొన్నాక, అది అద్వైతజ్ఞాన సూచనగా గ్రహించాను. కాబట్టి శాస్త్రాలలో దానిని గురించి వ్రాయబడింది అసత్యం కాదని తేలింది. అప్పటి నుండి నే నెన్నడూ అద్వైత సత్యాన్ని సందేహించింది లేదు.

16. ఒక సందర్భంలో రచయిత, నరేంద్రునితో సంభాషించడం

మరొక సందర్భంలో నరేంద్రుడి నుండి మరో అద్భుత సంఘటన గురించి విన్నాం. మేం బాగా పరిచయస్థులమైనాక 1884వ సం॥ శీతకాలంలో ఆ సంఘటన గురించి నరేంద్రుడు మాతో ప్రస్తావించాడు. ఆ సమయంలోనే ఆ సంఘటన జరిగిందని మేం ఊహించాం.

సిమ్లాపేటలోని గౌర్ మోహన్ ముఖర్జీ వీధిలోని నరేంద్రుని ఇంటికి మధ్యాహ్నం కాబోతుండగా వెళ్లి, అతడితో అక్కడే రాత్రి పదకొండు గంటల దాకా ఉన్నట్లు మాకు బాగా గుర్తు. ఆ రోజు రామకృష్ణానంద స్వామి కూడా మాతోనే ఉన్నాడు. మొదటి రోజు నరేంద్రుణ్ణి చూసినప్పటి నుండి మాకు అతడి పట్ల కలిగిన అలౌకిక ఆకర్షణ, ఆ రోజు భగవత్సంకల్పంతో వేయిరెట్లు అధికరించింది. ఇంతకు ముందు శ్రీరామకృష్ణులను సిద్ధులని, అంటే భగవత్సాక్షాత్కారం పొందిన వ్యక్తి అని మాత్రమే మేం భావించాం. కాని ఆ రోజు శ్రీరామకృష్ణుల గురించిన నరేంద్రుని వచనాలు మా హృదయాలలోకి చొచ్చుకొనిపోయి, మా మనస్సులపై నూతన వెలుగును ప్రసరింపచేశాయి. ఏసుక్రీస్తు, చైతన్యులు వంటి మహాపురుషుల, జగద్గురువుల జీవిత చరిత్రలో నమోదైన అసాధారణ సంఘటనలను మేం అప్పటి వరకు నమ్మేవారం కాము; కాని అటువంటి అసాధారణ సంఘటనలు శ్రీరామకృష్ణుల జీవితంలో నిత్యం జరుగుతున్నాయని నరేంద్రుని వచనాలను బట్టి మేం గ్రహించాం. తమను ఆశ్రయించిన వారికి స్పర్శామాత్రంగా భక్తిని ప్రసాదించారు; సంకల్పమాత్రాన హృదయ బంధనాలను త్రెంచివేసి, గత సంస్కారాలను చెరిపివేశారు. తమను శరణుజొచ్చిన వారిని భావపారవశ్యంలో ముంచివేసి, దివ్యానందాన్ని చూపించారు. వారి జీవిత గమనాన్ని ఆధ్యాత్మిక పథంలోకి త్రిప్పి సత్వరమే వారు భగవత్సాక్షాత్కారం పొంది, తద్ద్వారా శాశ్వతంగా తరించిపోయేలా చేయడమూ కద్దు. ఆ నాటి మునిమాపు వేళ నరేంద్రుడు మమ్మల్ని హెదువా

చెరువు గట్టువద్దకు తోడ్కొని వెళ్లి శ్రీరామకృష్ణుల అనుగ్రహం వలన తాను పొందిన దివ్యానుభూతులను వివరించి చెప్పడం మాకు బాగా గుర్తు. తన్మయుడై కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు; తరువాత తన హృదయం పొందుతూన్న పరమానందాన్ని, సుమధుర కంఠంతో ఈ పాట రూపంలో వ్యక్తం చేశాడు:

ప్రేమ సంపదను పంపిణీ చేస్తున్నాడు చైతన్యుడు
దానిని పొంద ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాడు నితాయ్
అసంఖ్యాక కలశాలలో ఆ ప్రేమసంపదను
    పంపిణీ చేసినప్పటికీ అది తరగదు
శాంతిపూర్ నదియాలు ఆ ప్రేమ వెల్లువలో
    మునిగి తేలుతున్నాయి
అవును, ఆ అద్భుత చైతన్యుల ప్రేమామృతంలో
    అవి మునిగి ఆనందిస్తున్నాయి.

పాట ముగిసింది. స్వగతంలోలా నరేంద్రుడు మెల్లగా ఇలా అన్నాడు: "నిజానికి ఆయన ప్రేమను పంచిపెడుతున్నారు. చైతన్యులు ప్రేమ, భక్తి, దివ్యజ్ఞానం, ముక్తి, ఏది ఎవరు కోరితే దాన్ని అనుగ్రహిస్తున్నాడు. ఏమా అద్భుతశక్తి! (అతడు నిశ్చలంగా ఒకింతసేపు కూర్చుండిపోయాడు) తలుపు గడియపెట్టి నా పరుపు మీద రాత్రి పడుకొనే ఉన్నాను. అప్పుడు హఠాత్తుగా ఆయన నన్ను - ఈ దేహంలో జీవిస్తున్న వ్యక్తిని - ఆకర్షించి దక్షిణేశ్వరానికి తోడ్కొని వెళ్లారు. అక్కడ నాకు మహోపదేశాలు చేశారు, నాతో అనేక విషయాల గురించి ముచ్చటించారు; వెనక్కు తిరిగి వెళ్లడానికి అనుమతించారు. తాము ఇష్టపడింది దేన్నైనా ఆయన చేయగలరు; ఈ దక్షిణేశ్వర చైతన్యులు ఏదన్నా చేయగలరు."

17. ఒక అద్భుత సంఘటన గురించి నరేంద్రుని ప్రస్తావన

మునిమాపు వేళ గడిచి క్రమంగా అంతటా గాఢాంధకారం క్రమ్ముకొంది. మేం ఒకరి నొకరం చూసుకోలేకపోతున్నాం; ఆ అవసరం కూడా లేదు. ఎందుకంటే, నరేంద్రుని ఆధ్యాత్మిక భావోద్వేగ రాశి మా హృదయ సీమలలో గాఢంగా చొచ్చుకుపోయి, మా శరీరాలు తూలిపోతూ, ఈ ప్రపంచం కాల్పనిక జగత్తులోకి తిరోగమిస్తున్నంత ఉన్మత్తతను మా మనస్సులలో ఉత్పన్నం చేసింది. పైగా వేలాది జీవుల గత సంస్కారాల బంధనాలను ధ్వంసంచేసే అనంతమయుడైన

18. దయిత ఇంట్లో నరేంద్రుని అపూర్వ అనుభవం

భగవంతుడు పరిమిత మానవమూర్తిగా, తేజోవిరాజమానుడుగా వ్యక్తమౌతాడనే వాస్తవం మాకు అప్పుడు వెల్లడయింది. కాలం ఎలా గడిచిపోయిందో మాకు తెలియలేదు. కాని హఠాత్తుగా తొమ్మిది గంటలు అయినట్లు తెలియవచ్చింది. ''రండి వెళదాం, కాస్తదూరం దాకా మీకూడా వస్తాను'' అన్న నరేంద్రుని మాటలు విన్నప్పుడు, అతడి వద్ద నుండి సెలవు పుచ్చుకోవడానికి నా మనస్సు విముఖత చూపింది. మేం వెళుతూ కూడా ఆసక్తికరమైన చర్చలలో మునిగిపోయాం. మేం చంపాతల సమీపంలోని ఇంటి వద్దకు రాగానే, నరేంద్రుణ్ణి అంతదూరం వరకు నడిపించి తీసుకురావడం మా మూర్ఖత్వంగా భావించాం. కాబట్టి అతణ్ణి ఇంట్లోకి ఆహ్వానించి, ఫలహారం సమర్పించి, తరువాత ఇంటిదాకా తోడ్కొనివెళ్లి దింపివచ్చాం.

ఆ రోజు జరిగిన మరొక సంఘటన స్పష్టంగా నాకు గుర్తుంది. మా ఇంట్లోకి ప్రవేశించగానే నరేంద్రుడు నిశ్చలంగా నిలబడిపోయి, ఇలా అన్నాడు: ''ఇంతకు ముందు ఎప్పుడో ఈ ఇంటిని చూసినట్లుగా ఉంది. ఇక్కడ ప్రతి ఒక్కటీ నాకు బాగా తెలిసినట్లుగా కనిపిస్తున్నది. అన్ని గదులు, ఆ గదులకు దారితీసే మార్గాలు నాకు చిరపరిచితమైనట్లు తోస్తున్నది. ఎంత విచిత్రం, అద్భుతం!'' ఈ పుస్తకంలో మరో చోట తన జీవితంలో అప్పుడప్పుడు నరేంద్రుడు ఇటువంటి అనుభవాలను ఎలా పొందివున్నాడో ఆ వైనమూ, ఇటువంటి అసాధారణ ఘటనలకు అతడిచ్చిన హేతువులూ మేం పొందుపరచి ఉండడం పాఠకులకు జ్ఞాపకం ఉంటుంది. కాబట్టి వాటిని ఇక్కడ మళ్లీ ప్రస్తావించడం లేదు.

7. శ్రీరామకృష్ణుల పరీక్షా విధానం: నరేంద్రుడు

మొట్టమొదటిసారి కలుసుకొన్నప్పటి నుండే నరేంద్రునిలోని ఉన్నత ఆధ్యాత్మిక లక్షణాలను, కార్యరూపం దాల్చే శక్తులను గుర్తించిన శ్రీరామకృష్ణులు తమ అసాధారణ నిస్వార్థ అనురాగంతో అతణ్ణి ఎలా ఆకట్టుకొన్నారో మేం ఇంతకు మునుపే మరోచోట తెలిపివున్నాం. ఆధ్యాత్మిక విషయాలలో అతడికి శిక్షణ నిస్తూన్నప్పటికీ అప్పుడప్పుడు అతణ్ణి పరీక్షకు గురిచేసేవారు. నరేంద్రుణ్ణి పరీక్షించే పద్ధతులను, తీరులను గురించి ఇక్కడ క్లుప్తంగా వివరించడం ఎంతో అవసరంగా తోస్తున్నది.

కూచ్‌బిహార్ వివాహం గురించి తలెత్తిన అభిప్రాయభేదాల వలన బ్రహ్మసమాజం రెండుగా విడిపోనున్నప్పుడు శ్రీరామకృష్ణులు, కేశవ్‌తో ఇలా

1. శ్రీరామకృష్ణుల పరీక్షా విధానం

అన్నారు: ''నీ సమాజంలో సభ్యుల సంఖ్యను పెంచడం నిమిత్తం పరీక్షించకుండానే ఎవరినిపడితే వాళ్లను చేర్చుకొంటావు. అటువంటప్పుడు సమాజం చీలిపోవడంలో వింతేముంది? క్షుణ్ణంగా పరీక్షించకుండా నే నెవరినీ స్వీకరించను.''

నిజమే. తమ వద్దకు వచ్చే భక్తులను వారికి తెలిసే రీతిలోనే లేదా తెలియని విధంగానో శ్రీరామకృష్ణులు ఆశ్చర్యకర రీతుల్లో పరీక్షించేవారు. నిరక్షరాస్యులైన ఒక వ్యక్తి కనీవినీ ఎరుగని విధానాలలో కౌశలాన్ని ఎలా సముపార్జించుకొన్నారో ఆలోచిస్తే ఎవరైనాసరే ఆశ్చర్యపోక తప్పదు. సహజంగానే ఈ ప్రశ్న తలెత్తుతుంది: ''గత జన్మలలో సముపార్జించుకొన్న జ్ఞానం ఇప్పుడు వ్యక్తమౌతూన్నదేమో? లేదా ప్రాచీన ఋషులలా ఈ జన్మలోనే అనుష్ఠించిన సాధనల ద్వారా లభించిన అతీంద్రియ దర్శనం లేదా సర్వజ్ఞత్వానికి ఫలమా అది? లేదా

అంతరంగ భక్తుల వద్ద తమను అవతారపురుషునిగా ప్రకటించిన మేరకు అభివ్యక్తమయ్యే శక్తి ప్రదర్శనా అది?'' సహజంగానే ఇటువంటి ప్రశ్నలు మనలో తలెత్తినప్పటికీ, జవాబుల కోసం వాటిని ఇప్పుడు నొక్కి-వక్కాణించ తలచలేదు. కేవలం ఇప్పుడు సంఘటనల పరంపరను నిర్దుష్టంగా వివరిస్తాం; వాటి గురించిన నిర్ణయం పాఠకులకే వదలివేస్తున్నాం.

2. సాధారణమైన పరీక్షా విధానం

ఆ పరీక్షా విధానాలను తెలియచెప్పే కొన్ని సంఘటనలను పొందుపరిస్తే, పాఠకులకు శ్రీరామకృష్ణులు అవలంబించిన ఆ అసాధారణ పద్ధతులు చక్కగా అవగతమౌతాయి. కాని వాటిని అర్థం చేసుకోవాలని ప్రయత్నించే ముందు, శ్రీరామకృష్ణులు పరీక్షార్థం అవలంబించే విధానాల, ఉపాయాల గురించి తెలుసుకొని ఉండాలి. ఎవరైనా ఆయన వద్దకు రాగానే, ఆయన ఆ వ్యక్తిని విచిత్రంగా తిలకించేవారు. అలా చూసినప్పుడు ఆయన మనస్సు ఆ వ్యక్తి పట్ల ఆకర్షింపబడితే, ఆధ్యాత్మిక విషయాల గురించి ఒకింత మాట్లాడి, అప్పుడప్పుడు రమ్మని అతడితో చెప్పేవారు. ఆ వ్యక్తి తరచు రాసాగినప్పుడు, సూక్ష్మంగా పరిశీలించి అతడిలో నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మిక సంస్కారాల గురించి కచ్చితమైన ఒక నిర్ణయానికి రావడానికి ప్రయత్నించేవారు; ఆ సందర్భంలోనే అతడికి తెలియకుండానే, అతడి అవయవ నిర్మాణం, మానసిక ప్రవృత్తులు, లౌకిక సుఖభోగాల పట్ల అతడికున్న అనురక్తి తీవ్రత, ముఖ్యంగా కామినీకాంచనాల పట్ల అతడికి గల అనురక్తి, తమ పట్ల అతడి మనస్సు ఏ మేరకు ఆకర్షింపబడుతూన్నదో కూడా నిశితంగా గమనించేవారు. అతడి మాటల, చేతల, ప్రవర్తన నుండి పై భోగట్టా సేకరించేవారు. ఆయన పరిశీలన ఎంత సునిశితంగా, సమగ్రంగా ఉండేదంటే, ఆ వ్యక్తి స్వభావాన్ని సంపూర్ణంగా ఆయన కేవలం కొద్దిరోజులలోనే గ్రహించ గలిగేవారనడం అతిశయోక్తి కాదు. తదనంతరం ఆ వ్యక్తి మనస్సులో బాహ్యాపరిశీలన స్పష్టం చేయలేని, లోతుగా దాగివున్న విషయం దేనినైనా తెలుసుకోగోరితే శ్రీరామకృష్ణులు తమ సూక్ష్మ యౌగిక అంతర్దృష్టి సహాయంతో ఆ విషయాన్ని గ్రహించేవారు. ఈ విషయంగా ఒక రోజు ఆయన మాతో ఇలా చెప్పారు:

''తెల్లవారుజాము ఏకాంతంగా కూర్చుని మీ శ్రేయస్సు గురించి ఆలోచిస్తూన్నప్పుడు అమ్మ (జగజ్జనని) మీ గురించి అన్ని సంగతులు - మీలో ఎవరెవరు ఎంతవరకు పురోగమించారో, ఏ అడ్డంకుల కారణం ఎవరు ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించలేకపోతున్నారో - దర్శింపచేసేది.'' పై వచనాల నుండి తెల్లవారుజామున మాత్రమే శ్రీరామకృష్ణుల యోగనేత్రాలు

తెరుచుకొనేవని మాత్రం పాఠకులు పొరపడకూడదు. ఎప్పుడనుకొంటే అప్పుడే, సంకల్పమాత్రంగా ఆయన ఉన్నత భావభూములను అధిరోహించి ఆ యోగదృష్టిని సంతరించుకోగలరని, ఇతర సమయాలలో ఆయన మాటల వలన తెలియవస్తూన్నది. ఉదాహరణకు ఆయన ఈ వచనాలను పరికించండి: ''అద్దాల అల్మారా వైపు చూసినప్పుడు దాన్లోని వస్తువులన్నీ ఎలా స్పష్టంగా కనిపిస్తాయో, అట్లే ఒక వ్యక్తిని చూసీచూడగానే అతడిలోని ఆలోచనలూ, గత సంస్కారాలూ మొదలైనవన్నీ కొట్టొచ్చినట్లే నాకు కానవస్తాయి.''

మామూలు భక్తుని స్వభావాన్ని తెలుసుకోగోరినప్పుడు శ్రీరామకృష్ణులు అవలంబించే పరీక్షాపద్ధతి పై రీతిలో ఉండేది. కాని ప్రత్యేకమైన అంతరంగ

3. విశిష్ట ఆధ్యాత్మిక భావ సంపన్నులైన వ్యక్తులను కలుసుకొన్నప్పుడు శ్రీరామకృష్ణులలో భావ సాదృశ్యం కలగడం

భక్తుల విషయంలో ఈ విధానం కొంచెం వ్యత్యాసంగా ఉండేది. అటువంటి అంతరంగ భక్తులను గురించి జగజ్జనని, ఆయన ఉన్నత భావభూములలో నెలకొని ఉన్నప్పుడు కలిగిన దివ్యదర్శనాలలో తెలియచేసేది. తాము అనుష్ఠించిన అసాధారణ సాధనల ఫలితంగా ఆయన మనశ్శరీరాలు సూక్ష్మ ఆధ్యాత్మిక శక్తులు సంతరించుకొన్న పరికరంగా మారింది; తద్వారా ఆ శక్తులను తమలో పదిలపరచుకోవడమే కాక, ఇతరులలో ఆ శక్తుల ఉనికిని తెలుసుకోవడం కూడా ఆయనకు సుసాధ్యమే అన్న విషయం ఈ పుస్తకంలో వేరొక చోట తెలిపివున్నాం. ఇది అక్షర సత్యం.

ఒక ఫలానా ఆధ్యాత్మిక భావం సంతరించుకొన్న ఒక వ్యక్తిని చూడగానే, శ్రీరామకృష్ణుల మనస్సుకూడా దివ్యప్రేరణతో అదే ఆధ్యాత్మిక భావంతో నిండిపోయేది. అట్లే, ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక భావభూమిలో నెలకొనివున్న ఒక వ్యక్తితో సాంగత్యం కలుగగానే, ఆయన మనస్సు కూడా సహజంగానే అదే భావభూమిని అధిరోహించి ఆ వ్యక్తి మనస్సులోని భావనలను వెల్లడించేది. నరేంద్రుని ప్రథమ సందర్శన సందర్భంతో ముడివడిన శ్రీరామకృష్ణుల అనుభూతులను జ్ఞాపకం చేసుకొంటే, పాఠకులకు మేం చెబుతున్న విషయం అవగతమౌతుంది.

శ్రీరామకృష్ణులు అంతరంగ భక్తుల విషయంలో యౌగిక శక్తులను విని

4. వ్యక్తులను పరీక్షించడంలో శ్రీరామకృష్ణులు అవలంబించే నాలుగు పద్ధతులు

యోగించినా, సామాన్య భక్తుల విషయంలో ఉపయోగించే సాధారణ - పరీక్షాపద్ధతులను వారి పట్ల కూడా ఉపయోగించేవారు కాదని భావించరాదు. మామూలు స్థితిలో ఉండేటప్పుడు సామాన్య భక్తుల మాదిరి, నరేంద్రునితో సహా అంతరంగ భక్తుల మాట తీరు, ప్రవర్తనలను ఆయన

సునిశితంగా పరిశీలించేవారు; అలా పరీక్షించేటంత వరకు ఆయన నిశ్చింతు లయ్యేవారు కారు. ఈ విషయం ఎంతో ప్రధానం కనుక పాఠకులు దీనిని సమ గ్రంగా తెలుసుకోవడం సముచితం. భక్తులను పరీక్షించడంలో శ్రీరామకృష్ణులు అవలంబించే పద్ధతులను నాలుగు ప్రధాన విభాగాలుగా వర్గీకరించాలి. వీటిని స్థూలంగా ఇంతకు మునుపే వ్యక్తపరచి ఉన్నాం; ప్రస్తుతం వాటిని సోదాహరణ లతో వివరించబోతున్నాం.

5. ముఖవళికలను బట్టి మానసిక సంస్కారాలను రూఢిపరచుకోవడం

మొదటిది: కొత్తగా వచ్చిన వ్యక్తి శారీరక లక్షణాలను పరిశీలించి అతడి పూర్వసంస్కారాలను శ్రీరామకృష్ణులు ధ్రువీకరించుకొనేవారు. మన ఆలో చనలు చేతల రూపంలోకి తర్జుమా అవుతూన్నప్పుడు, అవి మన శరీరంపై మెదడుపై కొన్ని ప్రత్యేక ముద్రలను విడిచిపోతాయి. ఆధునిక శరీర ధర్మశాస్త్రం, మనస్తత్వ శాస్త్రం ఈ విషయాన్ని ఎంతో మేరకు ఋజువు చేసి మా నమ్మకాన్ని రూఢిపరచాయి. వేదాలు, తదితర శాస్త్రాలు ఈ సత్యాన్ని ప్రాచీన కాలంనుండే మనకు తెలియచేస్తూన్నాయి. వేదాలు, స్మృతులు, పురా ణాలు, దర్శనాలు, తదితర హైందవ శాస్త్రగ్రంథాలు, 'శరీరాన్ని కల్పించేది మన'స్సని ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నాయి. ఒక మనిషి ఆలోచనా సరణి సదా మంచి లేక చెడు మార్గంలో పోతూవున్నప్పుడు, అతడి శరీరంలో ఆ ఆలో చనలు కార్యరూపం దాల్చడానికి అనువుగా మార్పులు కలిగి, రూపాంతరం జరుగుతుంది. మనిషి శరీర అవయవ నిర్మాణాన్ని పరికించి అతడి నైజాన్ని సూచించే అనేక సామెతలు వాడుకలో ఉన్నాయి. కాబట్టే వివాహ సమయంలో, మంత్రదీక్షను ఇచ్చేటప్పుడు వధువు, శిష్యుల శరీరాలను ఆపాదమస్తక పర్యంతం నిశితంగా పరీక్షించడం నేటికీ అత్యావశ్యకంగా పరిగణింపబడు తూన్నది.

6. ఈ విషయంలో శ్రీరామకృష్ణుల అద్భుత పరిజ్ఞానం

అటువంటప్పుడు శాస్త్రాల పట్ల నమ్మకంగల శ్రీరామకృష్ణులు తమ శిష్యుల శారీరక లక్షణాలను పరిశీలించి ఉంటారనడంలో ఎలాంటి ఆశ్చర్యమూ లేదు. కాని మాటల సందర్భంలో శారీరక లక్షణశాస్త్రం గురించి అనేక విషయాలు చెప్పేవారంటే, అవన్నీ వారికెలా తెలిశాయో అని మేం విస్తుపోయేవారం. బహుశా ఈ విషయాలన్నీ పొందుపరచబడిన ఒక పురాతన గ్రంథాన్ని చదివో లేక ఎవరైనా చదువుతూండగా వినో ఉంటారేమోనని మాలో మేం తర్జనభర్జన పడేవారం. కాని ఇప్పటిదాకా అటువంటి గ్రంథం గురించి కనీవినీ ఉండలేదు కనుక మా భావన నిరాధారమైనదిగా కనిపిస్తోంది. కాబట్టే స్త్రీ పురుషుల ప్రతి

అంగ లేదా ఇంద్రియ నిర్మాణం దైనందిన జీవితంలో మనకు తారసించే ఒక ప్రత్యేక వస్తువును పోలి కనిపిస్తే అది ఏ మంచి లేదా చెడు గుణాలను సూచిస్తుందో వారు చెప్పేటప్పుడు మేం ఆశ్చర్యపోతూ వినేవారం. ఆయన ఇలా చెప్పేవారు: ''ఉదాహరణకు మనిషి కళ్లను తీసుకోండి. కొందరి కళ్లు పద్మ పత్రాలలా ఉంటాయి; మరికొందరి కళ్లు ఎద్దు కళ్లను పోలివుంటాయి. కొందరివి యోగి కళ్లలా ఉంటాయి. పద్మపత్రాలు పోలిన కళ్లుగల వ్యక్తి సదాలోచనా పరుడు; ఎద్దు కళ్లను పోలిన కళ్లున్న వ్యక్తిలో కామం అత్యధికంగా ఉంటుంది; యోగుల కళ్లుగల వ్యక్తుల కళ్లు ఊర్ధ్వముఖమై, ఎర్రబారి ఉంటాయి; దేవతల నయనాలు మరీ పెద్దవి కాకపోయినా, పొడవుగా చెవుల వరకు వ్యాపించి ఉంటాయి. మాట్లాడుతున్నప్పుడు క్రీగంట చూసే అలవాటు గల వ్యక్తులు సామాన్యుల కంటే ఎక్కువ తెలివితేటలు గలవారై ఉంటారు.''

అట్లే వ్యక్తుల సాధారణ శరీర నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ ఆయన ఇలా చెప్పేవారు: ''భక్తుల శరీరాలు స్వాభావికంగానే చాలా మృదువుగా ఉంటాయి; వారి కాళ్ల చేతుల కీళ్లు ఒదులుగా (అంటే సులభంగా వంగే రీతిలో) ఉంటాయి. భక్తుని శరీరం సన్నగా ఉన్నాకూడా కోణాకృతిలో కీళ్లు కనిపించని తీరులో ఎముకలూ, కండరాలూ అమరివుంటాయి.''

ఒక ఫలానా వ్యక్తి తెలివి మంచికా లేక చెడుకా దారితీస్తుందనే విషయం నిర్ధారణ చేసుకోవడానికి శ్రీరామకృష్ణులు ఆ వ్యక్తి ముంజేతిని తమ చేతుల్లోకి తీసుకొని, దానిని ఒదులుగా ఉంచమనేవారు. ఆ తరువాత దాని బరువును తూచేవారు. సాధారణంగా అందరి ముంజేతుల కంటే అది తక్కువ బరువుగా ఉందనిపిస్తే అతడి మనస్సు పావనమైనదని పరిగణించేవారు. మొట్టమొదటిసారి ప్రేమానందస్వామి (బాబూరాం) దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడు. శ్రీరామకృష్ణులు అతడి ముంజేయి పుచ్చుకొని బరువు తూచారని మేం ఇంతకు మునుపే తెలిపివున్నాం. అయినా ఆయన ఎందుకు అలా చేశారో మాతో చెప్పలేదు కనుక ఆ సందర్భంలో ఏ ఉద్దేశంతో ఆయన అలా చేశారో అక్కడ మేం ప్రస్తావించలేదు. కాని మరో సందర్భంలో జరిగిన సంఘటన వలన మేం ఆ నిర్ణయానికి రాగలిగాం. ఆ సంఘటనను క్రింద వివరిస్తున్నాం.

7. ముంజేతి బరువు తూచి వ్యక్తి స్వభావాన్ని నిర్ధారించడం

శ్రీరామకృష్ణులు కాశీపూర్ ఉద్యానంలో వ్యాధిగ్రస్తులై ఉన్నప్పుడు, ఈ రచయిత తమ్ముడు, చారుచంద్ర చక్రవర్తి ఆయనను చూడడానికి ఒకరోజు అక్కడికి వచ్చాడు. అతణ్ణి చూసి శ్రీరామకృష్ణులు ఎంతో ప్రసన్నులైనారు. అతణ్ణి తమ ప్రక్కనే కూర్చోబెట్టుకొని, కుశల ప్రశ్నలు వేసి, అతడికి వివిధ ఆధ్యాత్మిక

ఉపదేశాలిచ్చారు. ఈ రచయిత అప్పుడు అక్కడకు వచ్చినప్పుడు ఆయన, ''ఈ కుర్రవాడు నీ తమ్ముడా?'' అని అడిగారు. అవునని రచయిత తల ఊపగానే, శ్రీరామకృష్ణులు, ''చాలా మంచివాడు. నీకంటే కూడా తెలివైన వాడు. ఈతడి తెలివి మంచికా లేదా చెడుకా, దేనికి దారితీస్తుందో చూస్తాను'' అంటూ, ఆ కుర్రవాడి ముంజేతిని తమ చేతుల్లోకి తీసుకొని బరువు చూశారు. తరువాత, ''శ్రేయోదాయకమైన తెలివే'' అని వచించారు. పిదప రచయితను ఆప్యాయంగా, ''ఇతణ్ణి కూడా నేను ఆకర్షించానా? (అంటే, అతడి మనస్సును లౌకిక జీవితం వైపు నుండి భగవంతుడి వైపుకు మరల్చానా?) ఏమంటావు?'' అని అడిగారు. ''చాలా మంచిదండీ. అలాగే చేయండి'' అని ఈ రచయిత బదులిచ్చాడు. శ్రీరామకృష్ణులు క్షణం యోచించి, ''వద్దు, అలా చేయను; ఇప్పటికే ఒకణ్ణి (రచయితను) తీసుకొన్నాను. మరొకణ్ణి తీసుకొంటే మీ తల్లిదండ్రులు, ముఖ్యంగా మీ అమ్మ చాలా బాధపడుతుంది. నా జీవితంలో చాలా మంది శక్తులను (తల్లులను) బాధపెట్టాను. మరెవరినీ ఇక బాధించబోను'' అని అన్నారు. ఇలా అంటూ ఆ కుర్రవాడికి ఇంకొన్ని ఉపదేశాలిచ్చి, తినడానికి తినుబండారాలనిచ్చి, సాగనంపారు.

8. ఇతర లక్షణాలు స్వభావ తీరుతెన్నులను వెల్లడించడం

అవయవ నిర్మాణం మాదిరిగా నిద్ర, మలమూత్రవిసర్జన వంటి సాధారణ దైనందిన క్రియలు కూడా విభిన్న గతసంస్కారాలు సంతరించుకొనివున్న వ్యక్తులలో ఎంతో విభిన్నంగా ఉంటాయని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. కాబట్టి అనుభవజ్ఞులు ఈ క్రియల నుండి ఆరాలు తీసి వ్యక్తుల స్వభావాలను నిర్ధారించగలరని ఆయన తరచు చెప్పేవారు. ఉదాహరణకు, నిద్రించేటప్పుడు అందరూ ఒకే రకంగా ఊపిరి పీల్చుకోరు అని ఆయన తెలిపేవారు. ''భోగి ఊపిరి పీల్చుకోవడం ఒక రకంగా ఉంటుంది, విరాగి ఊపిరి పీల్చుకోవడం తద్విరుద్ధంగా ఉంటుంది. మూత్ర విసర్జన చేసేటప్పుడు భోగి మూత్రధార ఎడమ వైపుకు, విరాగిది కుడివైపుకు పోతుంది; అట్లే యోగి మలాన్ని పందులు మొదలైన జంతువులు ముట్టవు'' అని శ్రీరామకృష్ణులు చెబుతూండేవారు.

9. ద్వార కాపలావారు హనుమాన్ సింగ్

పై విషయానికి సంబంధించిన ఒక సంఘటనను శ్రీరామకృష్ణులు మాకు వివరించారు. మథుర్‌బాబు కాలంలో దక్షిణేశ్వర కాళికాలయ కాపలాదారుగా హనుమాన్ సింగ్ అనే వ్యక్తిని నియమించారు. కాపలాదారులు పలువురు ఉన్నప్పటికీ హనుమాన్ సింగ్ పట్ల లోకులు ఎక్కువ గౌరవం కనబరచేవారు. హనుమాన్ సింగ్ ప్రసిద్ధుడైన

మల్లుడే కాక, ఆధ్యాత్మిక సాధకుడు కూడా కావడమే అందుకు కారణం. ఒకసారి మరో మల్లుడు దక్షిణేశ్వరానికి వచ్చి, హనుమాన్ సింగ్‌ను తనతో మల్ల యుద్ధానికి సవాలు చేశాడు; హనుమాన్ సింగ్‌ను మల్లయుద్ధంలో ఓడించి, అతడి నౌకరీ సంపాదించాలన్నదే ఈ మల్లుని ఉద్దేశం. ఈ మల్లుని దేహ దార్ఢ్యం, బలం మొదలైనవి హనుమాన్‌సింగ్ గమనించాడు; కాని అతడి సవాలును అంగీకరించడానికి ఏమాత్రం తటపటాయించలేదు. పందానికి ఒక రోజు నిర్ణయించారు; ఆ పందానికి మథుర్‌బాబు వంటి వారిని న్యాయనిర్ణేతలుగా వ్యవహరించమన్నారు.

పందెం నిర్ణీతమైన రోజుకు ఒక వారం ముందునుండే ఈ కొత్త మల్లుడు రాసులకొద్దీ పౌష్టిక ఆహారాన్ని ఆరగిస్తూ, కసరత్తు అభ్యసించసాగాడు. తద్విరుద్ధంగా ఆంజనేయ భక్తుడైన హనుమాన్ సింగ్, ఉదయం స్నానం చేసినప్పటి నుండి తన ఇష్టదైవ మంత్రాన్ని రోజంతా జపిస్తూ, సాయంత్రం ఒక్కపూట మాత్రమే భోజనం చేయసాగాడు. హనుమాన్ సింగ్ భీతిచెంది, గెలవగలనన్న ఆశను పూర్తిగా విడిచిపెట్టి ఈ రకంగా చేస్తున్నాడని అంతా అనుకోసాగారు. శ్రీరామకృష్ణులకు, హనుమాన్ సింగ్ పట్ల ప్రేమాభిమానాలున్నాయి. అందుచేత పోటీకి ఒక రోజు ముందు అతణ్ణి పిలిచి, ''నువ్వు పౌష్టికాహారం తినడం లేదు, వ్యాయామం అభ్యసించడమూ లేదు; అటువంటప్పుడు ఆ కొత్త మల్లుని గెలవగలవా?'' అని అడిగారు. హనుమాన్ సింగ్ సభక్తికంగా ఆయనకు మ్రొక్కి, ''మీ అనుగ్రహం ఉంటే తప్పక గెలుస్తాను. రాసులకొద్దీ ఆహారం తింటే దేహానికి బలం చేకూరదు; తిన్న ఆహారం జీర్ణం చేసుకోవాలి. రహస్యంగా ఆ కొత్తమల్లుడి మలాన్ని పరికించి చూశాను. అతడు తన జీర్ణశక్తికి మించి ఆరగిస్తున్నాడు'' అని విన్నవించాడు. తరువాత పోటీలో హనుమాన్ సింగ్, ఆ కొత్తమల్లుణ్ణి ఓడించాడని శ్రీరామకృష్ణులు మాతో చెప్పారు.

పురుషుల మాదిరే స్త్రీల అంగనిర్మాణం గురించి శ్రీరామకృష్ణులు ఎన్నో విషయాలు చెప్పేవారు. అంగనిర్మాణాన్ని గమనించి కొందరు స్త్రీలను ఆయన

10. స్త్రీల ఆధ్యాత్మిక నైజాన్ని దాచి పరముకోవడం

'విద్యాశక్తు'లని, అంటే ఆధ్యాత్మిక పథంలో పురోగమింప పురుషులకు దోహదం చేసేవారని పరిగణించేవారు; అట్లే పురుషులను సంసార లంపటంలోకి ఈడ్చే స్త్రీలను 'అవిద్యా శక్తు'లని ఆయన పేర్కొనేవారు. ఆయన ఇలా చెప్పేవారు: ''ఆహారం, నిద్ర, ఇంద్రియాసక్తి మొదలైనవి విద్యాశక్తులలో స్వాభావికంగానే ఎంతో మితంగా ఉంటాయి. తమ భర్తల భగవత్ప్రసంగం వింటూవుంటే వారి హృదయాలు ఆనందంతో పులకించిపోతాయి; స్వయంగా వారే భగవత్ప్రసంగం

చేస్తూ భర్తలకు ఉన్నత ఆధ్యాత్మిక ప్రేరణను కల్పిస్తారు; తమ భర్తలను సదా సర్వదా నిమ్న అభిరుచుల, చేతల నుండి పరిరక్షిస్తూ, వారి భగవత్సాక్షాత్కారార్థం సకల విధాల దోహదం చేస్తూంటారు. ఇక అవిద్యాశక్తుల నైజం, చేతలు ఇందుకు పూర్తిగా వ్యతిరేకం. వీళ్లు శారీరక సుఖాలను ఎంతగానో అపేక్షిస్తారు, మితిమీరిన తిండి, నిద్ర వాంఛిస్తారు. తమ స్వసుఖాలలో తప్ప మరే విషయంలోను భర్తలు శ్రద్ధ వహించకుండా అడ్డుపడడమే వీరి ముఖ్యోద్దేశం. భర్తలు ఆధ్యాత్మిక విషయాల గురించి తమతో మాట్లాడితే, వీరు అసంతృప్తి చెందడమే కాక చిరాకుపడడం కూడా కద్దు.''

అట్లే ఎవరిలో భోగాసక్తి ఏ మేరకు ఉంటుందో స్త్రీల జననేంద్రియ బాహ్యాకృతి సూచిస్తుందని కొన్ని సమయాలలో శ్రీరామకృష్ణులు చెప్పేవారు. అవి (యోనులు) వివిధ ఆకృతులలో ఉంటాయని కూడా ఆయన తెలిపేవారు. కొన్ని ఆకృతులు స్వల్ప కామప్రవృత్తిని సూచిస్తాయని ఆయన వచించేవారు. ఏ స్త్రీల పిరుదులు నల్లగండుచీమల వెనుక భాగాలలా కుంభాకారంలో ఉంటాయో, అట్టి స్త్రీలలో పాశవిక ప్రవృత్తి (కామం) మితిమించి ఉంటుందని కూడా శ్రీరామకృష్ణులు తెలిపేవారు.

శారీరక లక్షణాలను పరిశీలించి మనిషి నైజాన్ని నిర్ధారించడం గురించి శ్రీరామకృష్ణులు మాతో చెప్పిన విషయా లెన్నో! జనుల నైజాన్ని తెలుసుకొనే ప్రక్రియలలో దీనినికూడా ఒకటిగా పరిగణించి, దాని తోడ్పాటుతో నరేంద్రునితో సహా తమ భక్తుల నందరిని ఆయన పరీక్షించారు. నరేంద్రుణ్ణి అలా పరీక్షించి, సంతృప్తులై ఆయన అతడితో ఇలా అన్నారు: ''నీ శరీరంలోని అంగాల లక్షణాలన్నీ చాలా బాగున్నాయి. ఉన్న దోషం ఒక్కటే; నిద్రిస్తున్నప్పుడు నువ్వు బరువుగా శ్వాస పీలుస్తుంటావు. అలా బరువుగా శ్వాసించే వ్యక్తి అల్పాయుష్కుడని యోగులు వచిస్తూంటారు.''

11. నరేంద్రుని శారీరక లక్షణాలపై శ్రీరామకృష్ణులు వెలిబుచ్చిన అభిప్రాయం

చేతులలో వ్యక్తమయ్యే మానసిక స్థితులను పరిశీలించడం ఆయన అవలంబించే రెండవ పద్ధతి; వ్యక్తుల కామకాంచన ఆసక్తిని అంచనా వేయడం ఆయన అవలంబించే మూడవ పద్ధతి. కొత్తగా వచ్చిన వ్యక్తిని శ్రీరామకృష్ణులు కొంతకాలం పరిశీలించి చూసేవారు; ఆ తరువాత ఆతడిలో మంచి సంస్కారాలు కానవస్తే, అతణ్ణి తమ అంతరంగ భక్తులలో చేర్చుకోవాలని నిశ్చయించుకొని, అతడిలోని లోపాలను సవరింప సముచిత ఉపదేశాలిచ్చేవారు; అవసరమైతే అతణ్ణి సుతిమెత్తగా చీవాట్లు పెట్టేవారు కూడా. అలాగే ఆ వ్యక్తిని ఎంపిక

12. అతిసామాన్యమైన పనులలో వెల్లడయ్యే మానసిక ప్రతిచర్యలను, ఇతర కార్యకలాపాలు వెల్లడించే కామకాంచన ఆసక్తి తీవ్రతలను పరిశీలించడం ద్వారా మనిషిలోని స్వాభావిక సంస్కారాలను తెలుసుకోవడం

చేస్తూన్నప్పుడే, ఆ వ్యక్తి సన్న్యాసిగానో లేదా గృహస్థ శిష్యునిగానో తన జీవితాన్ని మలచుకోబోతాడో ముందుగానే గ్రహించి, ప్రారంభం నుండే తదనుగుణంగా ఉపదేశాలిచ్చేవారు. అందుకే శ్రీరామకృష్ణులు తమ వద్దకు వచ్చే ప్రతి వ్యక్తిని, అతడు వివాహితుడో కాడో, సామాన్యంగా జీవితం గడిచిపోవడానికి కుటుంబ ఆర్థిక పరిస్థితులు వీలు కల్పిస్తాయో లేదో, ఒకవేళ అతడు సంసార పరిత్యాగం చేయగోరితే కుటుంబ బాధ్యతను చేపట్టే దగ్గరి బంధువు లెవరన్నా ఉన్నారో లేదో - ఈ విషయాలన్నీ అడిగి తెలుసుకొనేవారు.

13. యువకుల గురించి శ్రీరామకృష్ణుల అభిప్రాయం

పాఠశాల, కళాశాల విద్యార్థుల పట్ల శ్రీరామకృష్ణులు సదా కారుణ్యం వహించేవారు. ఆయన ఇలా అనేవారు: ''వాళ్ల మనస్సులు భార్య, బిడ్డలు, పేరుప్రతిష్ఠలు ఇత్యాది బంధాలతో అన్యమనస్కం కాలేదు. (సరైన శిక్షణ పొందితే) వాళ్లు తమ మనస్సులను పూర్తిగా భగవంతునిపై మరల్చగలరు.'' అందుకే యువకులలో ఆధ్యాత్మిక భావాలను జనింప చేయడానికి ఆయన ఎంతో ప్రయత్నించేవారు. పై అభిప్రాయాన్ని ఆయన వివిధ దృష్టాంతాలతో వ్యక్తం చేసేవారు. ఆయన ఇలా చెప్పేవారు: ''మనస్సు ఆవాల పొట్లం వంటిది; ఒక్కసారి ఆ పొట్లం చిట్లి, ఆవాలు చిందరవందరగా క్రిందపడిపోతే వాటిని ఏరడం దాదాపు అసాధ్యం.'' లేదా ''గొంతు ముదరిపోయిన చిలుకకు 'రాధాకృష్ణ' నామం ఉచ్చరింప నేర్పడం దుస్సాధ్యం.'' లేదా ''పచ్చి ఇటుకలపై పడ్డ ఆవు గిట్టల ముద్రలు సులభంగానే చెరిపివేయవచ్చు, కాని కాల్చబడిన ఇటుకలపైబడ్డ ముద్రలను చెరిపివేయడం సాధ్యం కాదు.'' కాబట్టే ఇంకా సంసార పంకిలం అంటని యువకులను తరచి తరచి ప్రశ్నించి వారి సహజ నైజం సంసారం వైపుకు మొగ్గుతుందో లేక పరిత్యాగం వైపుగా మొగ్గు చూపుతుందో తెలుసుకొనేవారు శ్రీరామకృష్ణులు. వారు అర్హులని ఆయనకు తోస్తే, పరిత్యాగ పథంలో పురోగమింప సముచిత ఉపదేశాలు వారికి ఇచ్చేవారు.

14. తమ వద్దకు వచ్చే భక్తుల చర్యల నన్నిటిని ఆయన గమనించడం

తమ వద్దకు వచ్చే ఒక ఫలానా వ్యక్తి చర్యల నన్నిటిని సునిశితంగా పరిశీలించి ఆతడి మానసిక స్థితులను తెలుసుకోవడంతోనే శ్రీరామకృష్ణులు ఆగిపోయేవారు కారు; అతడెంత సరళ స్వభావుడో, సత్యసంధుడో, మాటలను చేతలలో ఏ మేరకు చూపుతున్నాడో, ప్రతి చేతను వివేచనతో నిర్వర్తిస్తున్నాడో, తనకు

బోధించిన సత్యాలను అతడు ఎంతవరకు విశ్వసిస్తున్నాడో మొదలైన విషయా లన్నీ ఆయన సునిశితంగా పరిశీలించేవారు.

కొన్ని రోజులుగా దక్షిణేశ్వరానికి తరచు వస్తూన్న ఒక యువకుణ్ణి హఠాత్తుగా శ్రీరామకృష్ణులు, ''ఎందుకు వివాహం చేసుకోవు?'' అని అడిగారు.

15. కొన్ని ఉదాహరణలు

అందుకు ఆ యువకుడు ఇలా బదులు చెప్పాడు: ''మహాశయా, ఇంకా నా మనస్సు నా వశంలోకి రాలేదు; ఇప్పుడు నేను వివాహం చేసుకొంటే, నా భార్యపట్లగల అనురక్తితో హితాహితాల వివేచనాశక్తిని కోల్పోతాను. కామాన్ని జయించగలిగిన నాడే వివాహం చేసు కొంటాను.'' ఆ జవాబు నుండి ఆ యువకుడి అంతరాన అనురక్తి ఉన్నప్ప టికీ, అతడి మనస్సు పరిత్యాగ మార్గంవైపుకు ఆకర్షింపబడిందని శ్రీరామ కృష్ణులు గ్రహించకపోలేదు. నవ్వుతూ ఆయన, ''కామాన్ని జయించిన తద నంతరం నీ కిక వివాహం చేసుకోవలసిన అవసరమే ఉండదు'' అని చెప్పారు.

ఒక రోజు మరొక యువకుడితో అనేక విషయాల గురించి ముచ్చటిస్తూ శ్రీరామకృష్ణులు, అతడితో ఇలా అన్నారు: ''చూడు, ఇదేమిటో చెప్పగలవా? ఎంత ప్రయత్నించినా ఒంటిపై బట్టను ఉంచుకోలేకపోతున్నాను, సదా జారి పోతూనే ఉంటుంది; ఎప్పుడు జారిపోతుందో నాకు ధ్యాసే ఉండదు. వయస్సు పైబడ్డ నేను అలా నగ్నంగా వెళ్లడమా! అయినప్పటికీ నగ్నంగా ఉన్నట్లు నాకు అనిపించదు. ఇంతకు మునుపు ఎవరైనా నన్ను ఆ స్థితిలో చూస్తున్నారనే ఎరుకే ఉండేదికాదు. నగ్నంగా ఉన్న నన్ను చూసిన వారు సిగ్గు పడతారని ఇప్పుడు ఒడిని ఒక వస్త్రంతో కప్పుకొంటున్నాను. నువ్వు నా మాదిరి (నగ్నంగా) జనం ముందు నిలబడగలవా?'' అందుకు ఆ యువకుడు, ''మహాశయా, అలా చేయగలనో లేదో నిశ్చయంగా చెప్పలేను. కాని మీరు చెయ్యమంటే కట్టుబట్టలను విప్పేస్తాను'' అని జవాబిచ్చాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు, ''అయితే కట్టుబట్టను విప్పి, తలపాగాలా చుట్టుకొని ఆలయ ప్రాంగణం చుట్టూ తిరిగిరా, చూస్తాను'' అని అన్నాడు. ''అలా చేయలేను, మీ ముందు మాత్రమే విప్పగలను'' అన్నాడు ఆ యువకుడు. ఆ మాట విని శ్రీరామకృష్ణులు, ''అనేకులు అలాగే అంటుంటారు. 'మీ ముందు నగ్నంగా నిలబడడానికి సిగ్గుపడం. కాని ఇతరుల ఎదుట నగ్నంగా నిలబడలేం' అని చెబుతారు'' అని అన్నారు.

ఈ సందర్భంలో మాకు మరో సంఘటన జ్ఞాపకానికి వస్తూన్నది. అది వెన్నెల రాత్రి; కృష్ణపక్షం విదియో లేదా తదియో. మేం రాత్రి పడుకొన్న కాసేప టికే గంగలో పోటు వచ్చింది. శ్రీరామకృష్ణులు మంచం మీద నుండి లేచి,

''గంగలో పోటు చూడడానికి అంతా రండి'' అంటూ గంగ గట్టు వద్దకు పరుగెత్తుకొని పోసాగారు. ప్రశాంతంగా ప్రవహిస్తూన్న స్వచ్ఛమైన గంగానది హఠాత్తుగా అడ్డుతిరిగి మహావేగంతో, గట్టుమీదికి ఉవ్వెత్తు అలలతో ఎగిరిపడుతూండడం చూసి, ఉల్లాసంతో చిన్న పిల్లవాడిలా శ్రీరామకృష్ణులు నాట్యం చేయసాగారు. ఆయన మమ్మల్ని పిలిచినప్పుడు మేం నిద్రమత్తులో ఉన్నాం. ఆయన పిలుపు విని, లేచి బట్టలు సవరించుకొని వెళ్లేసరికి కాస్త ఆలస్యమైంది. కాబట్టి మేం నది గట్టు వద్దకు వెళ్లేసరికి నదిలో పోటు ఆగిపోయింది. మాలో కొందరం ఒకింత చూడగలిగాం, తక్కిన వారు అదీ చూడలేకపోయారు. శ్రీరామకృష్ణులు అప్పటి దాకా ఆనందంలో మునిగివున్నారు. నదిలో పోటు వెళ్లిపోయిన తరువాత మమ్మల్ని చూస్తూ, ''మంచిది, నదిలో పోటును చూశారా?'' అని అడిగారు. మేం దుస్తులు కట్టుకొని వచ్చే లోపుగానే నదిలో పోటు వెళ్లిపోయిందని విని, ఆయన, ''మూర్ఖుల్లారా! బట్టలు ధరించి వచ్చేవరకూ పోటు మీ కోసం వేచివుంటుందా? నాలా మీరూ బట్టలు విడిచి ఎందుకు పరుగెత్తుకొని రాలేదు?'' అని అన్నారు.

16. గంగలో పోటు

''వివాహం చేసుకోవాలనుకొంటున్నావా? ఉద్యోగం చేస్తావా?'' అని శ్రీరామకృష్ణులు అడిగే ప్రశ్నలకు, మాలో కొందరం, ''మహాశయా, వివాహం చేసుకోవాలనే ఆకాంక్ష లేదు, కాని ఉద్యోగం చేయక తప్పదు'' అని జవాబు ఇచ్చేవారం. స్వాతంత్ర్య పిపాసువులైన శ్రీరామకృష్ణులకు ఈ జవాబు ఎంతో అనుచితంగా తోచేది. ఆయన ఇలా అనేవారు: ''వివాహం చేసుకోకుండా, గృహస్థ బాధ్యతలను స్వీకరించకుంటే, జీవితాంతం మరొకరికి సేవలో ఉండడం ఎందుకు? మీ నిండు మనస్సును భగవంతునికి అర్పించి ఆయనను ఆరాధించండి. మనిషిగా జన్మించాక ఇంతకంటే చేసే మహత్కార్యం ఏముంది? ఒంటరి జీవితం గడపడం అసాధ్యమనుకొంటే, వివాహం చేసుకో; కాని భగవత్సాక్షాత్కారమే జీవిత పరమ లక్ష్యమని మరచిపోవద్దు. ఋజుమార్గంలో గృహస్థుడిగా జీవించు.'' జీవిత లక్ష్యం గురించి ఇదే ఆయన నిశ్చితాభిప్రాయం.

17. చేతుల నష్టం టిని భగవత్సాక్షాత్కారం వైపుకే మరల్చాలి

కాబట్టి ఆధ్యాత్మిక మార్గానికి యోగ్యులనీ, మంచి సాధకులనీ తాము పరిగణించిన యువకులైన భక్తులు ఎవరైనా వివాహం చేసుకొన్నాడని గాని, లేదా ఏ అవసరమూ లేకుండానే సామాన్యులలా కేవలం ధనసంపాదన నిమిత్తమే ఉద్యోగం చేస్తున్నాడనిగాని లేదా పేరుప్రతిష్ఠల తహతహతో మరేదైనా లౌకిక కార్యకలాపాలలో మునిగివున్నాడనిగాని తెలియవస్తే శ్రీరామకృష్ణులు ఎంతో వ్యథ చెందేవారు.

తమ యువ భక్తుడైన నిరంజన్ (కాలాంతరంలో స్వామి నిరంజనానంద) ఉద్యోగం చేస్తున్నాడని విని, అతడితో ఆయన, ''వృద్ధురాలైన నీ తల్లిని పోషింప నువ్వు ఉద్యోగం చేస్తున్నావు. కనుక నేను సహించగలను; లేకపోతే నీ ముఖం కూడా చూడలేకపోయేవాణ్ణి'' అని అన్నారు.

మరొక యువ భక్తుడైన చిన్న నరేంద్రుడు వివాహం చేసుకొని శ్రీరామ కృష్ణులను దర్శింప కాశీపూర్ ఉద్యానానికి వచ్చాడు. అప్పుడాయన అతడి మెడ చుట్టూ చేతులు వేసి, పుత్రశోకంతో విలపించే తీరులో, పదేపదే ''నాయనా, భగవంతుణ్ణి విస్మరించి సంసార సాగరంలో పూర్తిగా మునిగిపోకుండా ఉంటావు గాక!'' అంటూ భోరున విలపించారు.

18. భగవద్విశ్వాసం, మూర్ఖత్వం విభిన్నమైనవి; సత్ అసత్ వివక్షణ సదా చేస్తూండాలి

కొత్తగా జనించిన భగవత్ప్రేమ ప్రేరణలో కొందరు భక్తులు, 'విశ్వాసం లేకుండా ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించలే'రన్న ఉపదేశాన్ని తప్పుగా అర్థం చేసుకొని, విచక్షణారహితంగా ప్రతి విషయాన్నీ, ప్రతి వ్యక్తినీ నమ్మాలని భావించడం కద్దు. అటువంటి భక్తులను చూసీచూడగానే శ్రీరామకృష్ణులు వారి పొరపాటును గ్రహించి, వారిని మందలించేవారు. విశ్వాసంతోనే ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని లోకులకు ఆయన ఉపదేశించేవారు. కాని సదసద్విచారణతో ఏది వాంఛనీయమో, ఏది కాదో నిర్ణయించాలని కూడా ఆయన నొక్కి వక్కాణించేవారు.

శ్రీరామకృష్ణుల ఆప్త శిష్యుడొకడు (స్వామి యోగానంద) ఒకసారి అంగడిలో ఒక మూకుడు కొన్నాడు. ఆ అంగడివాడికి అన్యాయం చేయడం తప్పని ధర్మోపదేశం చేసి, పరీక్షించకుండానే ఆ మూకుడు కొన్నాడు. ఇంటికి వచ్చాక చూస్తే ఆ మూకుడులో పగులు కనిపించింది. ఆ విషయం శ్రీరామకృష్ణులకు తెలిసింది. ఆ శిష్యుణ్ణి పిలిచి, సుతిమెత్తగా చీవాట్లుపెట్టి, ఇలా చెప్పారు: ''భక్తుడుగా ఉండడం వలన మూర్ఖుడివి కావడం ఎందుకు? ధార్మికతను అభ్యసించడానికా ఆ అంగడివాడు అంగడి నడుపుతూన్నది? అంగడివాణ్ణి నమ్మి, ఒక్కసారి కూడా పరీక్షించకుండా నువ్వు మూకుడును తీసుకురావడానికి ధర్మనిష్ఠే కారణమా? మళ్ళీ ఎన్నడూ అలా చేయవద్దు. ఏదైనా వస్తువు కొనాలనుకొంటే నాలుగైదు అంగళ్లలో విచారించి దాని అసలైన ధరను తెలుసుకోవాలి; కొనేటప్పుడు ఆ వస్తువును క్షుణ్ణంగా పరీక్షించాలి. అంగడి వాళ్లకు కొసరు ఇచ్చే వాడుక ఉంది కనుక, ఆ కొసరు కూడా అడిగి పుచ్చుకోకుండా రాకూడదు.''

ఒక ఫలానా మానసిక స్వభావం ఉండడం వలన కొందరు వ్యక్తులు ఆధ్యాత్మిక జీవితం పేరిట ఎంతో సాధుస్వభావులు కావడం కద్దు; తత్ఫలి

తంగా కొన్ని సమయాలలో ఆధ్యాత్మిక మార్గం నుండి వారు పతనం చెందడమూ జరుగవచ్చు. కోమల స్వభావులైన స్త్రీ పురుషులు తరచు ఈ ప్రమాదంలో పడిపోతుంటారు. అందువలన శ్రీరామకృష్ణులు సదా అటువంటి వ్యక్తులకు కాస్త కఠినంగా ఉండమనీ, కఠిన ప్రవృత్తి గలవారికి కాస్త కోమలంగా వ్యవహరించమనీ బోధించేవారు. మాలోని భక్తు డొకడి (స్వామి యోగానంద) హృదయం ఎంతో కోమలంగా ఉండేది. విపరీత పరిస్థితులలో సైతం అతడికి ఎన్నడూ కోపం వచ్చేది కాదు, కనీసం పరుషంగా కూడా మాట్లాడేవాడూ కాదు. వివాహం చేసుకోవడం అతడి నైజానికి పూర్తి విరుద్ధం, అతడికి అటువంటి ఉద్దేశమూ ఉండేది కాదు. కాని కన్నతల్లి కన్నీళ్లకు ద్రవించిపోయి హఠాత్తుగా ఒక రోజు వివాహబంధంలో చిక్కువడిపోయాడు. ఆ వివాహం అతడినెంత నిరాశానిస్పృహలకు గురిచేసిందో, అతడెంత హతాశుడయ్యాడో వర్ణించలేం. శ్రీరామకృష్ణుల ఆశ్రయం, ఉపశమన వచనాలు మాత్రమే అతణ్ణి ఆ సందర్భంలో కాపాడగలిగాయి. తనలోని అపరిమిత కోమలత్వాన్ని, మెతకదనాన్ని నియంత్రించడం నేర్చుకొని, ఏ పనినైనా పర్యాలోచించి చేయడాన్ని అలవరచుకోగలడనే ఉద్దేశంతో శ్రీరామకృష్ణులు ఒక కంట అతణ్ణి కనిపెట్టసాగారు.

19. విభిన్న మానసిక స్వభావాలు గల వ్యక్తులకు విభిన్న బోధనలు

సామాన్య విషయాల సహాయంతో అతడికి తగిన శిక్షణ నెలా ఆయన ఇచ్చారో స్పష్టంగా తెలుసుకోవడానికి ఒకటి రెండు ఉదాహరణలు ఇక్కడ ఇస్తున్నాం. శ్రీరామకృష్ణుల వస్త్రాలు, వస్తువులు ఉన్న పెట్టెలో ఒక రోజు బొద్దింక కనిపించింది. అప్పుడు ఆయన, ''దీన్ని గది బయటకు పట్టుకుపోయి చంపిరా'' అని అతడికి చెప్పారు. అతడు దాన్ని పట్టుకొన్నాడు; కాని బయటకు వెళ్లి దాన్ని చంపకుండా, వదలిపెట్టేశాడు. అతడు తిరిగి రాగానే ''ఆ బొద్దింకను చంపేశావా?'' అని అడిగారు. అతడు సిగ్గుపడి, ''లేదండి. బయట విడిచిపెట్టి వచ్చాను'' అని జవాబిచ్చాడు. ఆయన అతణ్ణి చీవాట్లు పెట్టి, ''చంపమని చెబితే, వదలిపెట్టి వస్తావా? నేను చెప్పినట్లే చెయ్యాలి. లేకుంటే భవిష్యత్తులో క్లిష్ట పరిస్థితుల్లో నీ ఊహ ప్రకారం వ్యవహరించి తదనంతరం పశ్చాత్తాప పడవలసి వస్తుంది'' అని మందలింపు ధోరణిలో చెప్పారు.

ఒక రోజు యోగేన్ (స్వామి యోగానంద) పడవలో దక్షిణేశ్వరానికి వస్తున్నాడు. ప్రయాణీకులలో ఎవరో ప్రశ్నించగా, కాళికాలయంలో వసిస్తున్న శ్రీరామకృష్ణుల వద్దకు వెళతున్నానని అతడు చెప్పాడు.

20. యోగానందకు ఉపదేశించడం

ఈ మాట వినగానే ఆ సదరు ప్రయాణీకుడు శ్రీరామకృష్ణులను దూషింప నారంభించాడు: ''ఓ! ఆయన కేవలం ఒక కపట

వేషధారి, ప్రజలను మోసగిస్తున్నాడు. షడ్రశోపేతంగా భుజిస్తాడు, మెత్తని
పరుపుల మీద పవ్వళిస్తాడు, బడి పిల్లల మనస్సులను మార్చివేస్తాడు.'' ఆ
దుర్భాషలు విని యోగేన్ ఎంతో బాధపడ్డాడు. అతణ్ణి ప్రతిఘటించాలని అను
కొన్నా తన మృదుల స్వభావం కారణంగా మరుక్షణమే ఇలా ఆలోచనలో
పడ్డాడు: ''అవగతం చేసుకోవడానికి కించిత్తు ప్రయత్నం కూడా చేయకుండా
అనేకులు గురుదేవులను గురించి చెడుగా భావించుకొని, దుర్భాషలాడుతూం
టారు. కాని దీన్లో నేనేం చేయగలను?'' ఇలా ఆలోచించి ఆ వ్యక్తి మాటలను
ఖండింప కనీస ప్రతిఘటన కూడా చేయకుండా, మౌనంగా ఉండిపోయాడు.

శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన తరువాత మాటల సందర్భంలో,
పడవలో జరిగిన సంఘటనను పూసగుచ్చినట్లు ఆయనకు వర్ణించి చెప్పాడు.
అహంకారరహితులూ, దూషణభూషణలకు అతీతులూ అయిన శ్రీరామ
కృష్ణులు ఆ సంఘటన గురించి విని తేలిగ్గా నవ్వేస్తారని యోగీన్ భావించాడు.
కాని తద్విరుద్ధంగా ఆయన స్పందించారు. ఆ సంఘటనను మరో దృక్పథంలో
పరికించి, ఆయన ఇలా వ్యాఖ్యానించారు: ''ఆహ్, అకారణంగా అతడు నన్ను
దుర్భాషలాడాడు, నువ్వేమో ఏ ప్రతిచర్యా చేయకుండా, మౌనంగా తిరిగి వచ్చే
శావే? శాస్త్రాలు ఏం వచిస్తున్నాయో తెలుసా? తన గురువును పరాయివాడు
ఎవరైనా తూలనాడితే అతగాడి తలను నరికివేయాలి లేదా ఆ చోటు నుండి
తక్షణమే నిష్క్రమించాలి. ఆ దుర్భాష
లను ప్రతిఘటిస్తూ ఒక్క మాటకూడా
మాట్లాడకుండా నువ్వేమో వచ్చే
శావు!''

శిష్యుల మానసిక ప్రవృత్తుల
ననుసరించి శ్రీరామకృష్ణుల ఉపదేశాలు

21. నిరంజన్‌కు విభిన్న ఉపదేశం

ఎలా భిన్న
భిన్నంగా ఉండేవో
మేం తెలుపబోయే ఈ క్రింది సంఘ
టన నుండి పాఠకులు అవగతం చేసుకో
వచ్చు. నిరంజన్ (కాలాంతరంలో
స్వామి నిరంజనానంద) సహజంగానే
ఉద్రేక స్వభావం గలవాడు. ఒక రోజు
నిరంజన్ పడవలో దక్షిణేశ్వరానికి వస్తు
న్నప్పుడు, పై విధంగానే కొందరు
ప్రయాణీకులు శ్రీరామకృష్ణులను

నిరంజన్
(స్వామి నిరంజనానంద)

దుర్భాషలాడడం విన్నాడు. తక్షణం అతడు తీవ్రంగా వారిని ప్రతిఘటించాడు. అలా ప్రతిఘటించినప్పటికీ వారు నిందాలాపాలు ఆపకపోవడంతో ఆగ్రహోదగ్రుడై పడవను ముంచివేయడానికి సిద్ధపడ్డాడు. నిరంజన్ మహాబలిష్ఠుడు, పైగా గజ ఈతగాడు. కోపంతో అతడి ముఖం ఎర్రబారడం చూసి ప్రయాణీకులు భయంతో వణకిపోతూ, తమను క్షమించి, పడవను ముంచివేసే ప్రయత్నం విరమించమని పదేపదే వేడుకొన్నారు. తదనంతరం శ్రీరామకృష్ణులకు ఈ విషయం తెలిసి నిరంజన్‌ను చీవాట్లు పెట్టారు. అతడితో ఇలా చెప్పారు: ''కోపం ప్రమాదభరితమైనది, గర్హించవలసింది. కోపానికి లోను కావచ్చా? సజ్జనుడి కోపం నీటి మీద వ్రాసిన గీతలా, తక్షణం మాయమై పోతుంది. అనుచితంగా మాట్లాడడమే హీనబుద్ధుల లక్షణం. అటువంటి విషయాల గురించి వాళ్లతో కలహానికి దిగితే, జీవితపర్యంతమూ ఆ రీతిలోనే గడపవలసి వస్తుంది. అటువంటి వారిని క్రిమికీటకాలలా పరిగణించి, వారి మాటలను పట్టించుకోకూడదు. కోపానికి వశవర్తివై ఎంత అపకారానికి ఒడిగట్టబోయావో ఒక్కసారి యోచించి చూడు. ఆ పడవ నడిపేవాళ్లు ఏం తప్పు చేశారని పాపం వారికి హాని చేయపూనుకొన్నావు?''

22. భక్తురాండ్రకు ఉపదేశం

పురుషులకు మాదిరిగానే శ్రీరామకృష్ణులు భక్తురాండ్రకు వారి స్వభావానికి అనుగుణంగా ఉపదేశాలిచ్చేవారు. మృదుల స్వభావంగల ఒక స్త్రీకి ఆయన ఇలా మందలింపు ధోరణిలో ఉపదేశించటం మాకు జ్ఞాపకం: ''నీకు పరిచయస్థుడైన ఒక ఫలానా పురుషుడు ఎన్నో ప్రయాసలకోర్చి నీకు అన్ని విషయాలలోను సహాయం చేశాడనుకొందాం. కాని నీ అందచందాల వ్యామోహంలో పడి అతడి దుర్బల మనస్సు నీకై తపిస్తుందనుకొందాం. అటువంటప్పుడు అతడిపట్ల దయ తలుస్తావా లేదా ఒక్క తన్నుతన్ని అతడి నుండి వైదొలగిపోతావా? కాబట్టి ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడంటే అక్కడ, ఎవడంటే వాడి మీద విచక్షణా రహితంగా దయచూపడం సాధ్యంకాదని గ్రహించుకో. దయ చూపడానికీ ఒక హద్దు ఉంటుంది. దేశకాల పాత్రలను బట్టే దయ వహించవలసి ఉంటుంది.''

23. హరీష్ వృత్తాంతం

పై విషయానికి సంబంధించిన మరో సంఘటన మాకు జ్ఞాపకం వస్తున్నది. హరీష్ బలిష్ఠుడైన యువకుడు. అతడికి అందమైన భార్య, చిన్న బిడ్డ ఉండేవారు. అతడి ఆర్థిక పరిస్థితులు మొత్తంమీద బాగానే ఉండేవి. శ్రీరామకృష్ణులను కొన్నిసార్లు దర్శించుకోగానే అతడి మనస్సు గొప్ప వైరాగ్య భావాలతో నిండిపోయింది. అతడి

ముక్కుసూటి నైజం, నిష్ఠ, ప్రశాంతత చూసి శ్రీరామకృష్ణులు ఎంతో ప్రసన్నులై, అతడికి ఆశ్రయం ఇచ్చారు. అప్పటి నుండి హరీష్ దక్షిణేశ్వరంలోనే శ్రీరామకృష్ణులను సేవిస్తూ, జపధ్యానాలు తదితర ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠిస్తూ ఎక్కువ కాలం గడపసాగాడు. తల్లితండ్రుల ఒత్తిడి, అత్తవారి సాదర ఆహ్వానం, భార్య, సంతానం- ఇవేవీ హరీష్‌ను కదలించలేకపోయాయి. అతడు మౌనవ్రతం పాటిస్తూ, ఎవరి వ్యాఖ్యానాన్ని పట్టించుకోకుండా తన దారిలో పోసాగాడు. అతడి శాంతస్వభావాన్ని, నిష్ఠను మాకు ఎత్తి చూపించే ధోరణిలో శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు మాతో, ''అసలుసిసలైన మనుషులు హరీష్‌లా ఉంటారు. వారు ప్రేరణ లన్నిటికీ స్తబ్ధులై ఉంటూ, ఎలాంటి ప్రతిస్పందనా వ్యక్తం చేయరు'' అని చెప్పేవారు.

హరీష్ ఆ విధంగా లౌకిక వ్యాపారాదులన్నీ మూటగట్టి, ఆధ్యాత్మిక సాధనలలో ఉన్నప్పుడు, అతడి కుటుంబంలోని యావన్మందీ ఎంతో బాధపడుతున్నారనే వార్త అతడి చెవినపడింది. అతడి భార్య భర్త వియోగాన్ని ఇక ఏమాత్రం భరించలేక అన్నపానాదులను దాదాపు త్యజించిందనీ అతడికి తెలియవచ్చింది. ఇదంతా వినికూడా హరీష్ నిర్లిప్తంగా, మౌనంగా ఉండిపోయాడు. అతడి మనస్సులో ఏముందో తెలుసుకోగోరి ఒక రోజు శ్రీరామకృష్ణులు అతణ్ణి ప్రక్కకు పిలిచి, ఇలా చెప్పారు: ''నీ భార్య ఎంతో బాధపడుతోంది. ఒక్కసారి ఇంటికి వెళ్లి ఆమెను చూసి రాకూడదా? ఒక రకంగా ఆమెను చూసుకొనే వాళ్లు ఎవరూ లేరనే చెప్పాలి.[1] కాబట్టి ఆమె పట్ల దయ చూపటంలో తప్పేముంది?'' అందుకు హరీష్, ''మహాశయా, దయ చూపే సందర్భం కాదిది. ఒకవేళ దయ చూపడానికి ఇంటికి పోతే, సంసార మోహంలో పడిపోయి, నా జీవిత ప్రధాన కర్తవ్యాన్ని విస్మరిస్తానేమో! దయచేసి నన్నలా చేయమని ఆదేశించకండి'' అని వినమ్రంగా జవాబిచ్చాడు. హరీష్ జవాబుతో శ్రీరామకృష్ణులు ఎంతో ప్రసన్నులయ్యారు. అతడి మాటలను అప్పుడప్పుడు మాతో ప్రస్తావించి అతడి వైరాగ్యాన్ని ప్రశంసించేవారు.

24. ''దయ చూపే సందర్భం కాదిది''

మామూలు దైనందిన చేతలను పరిశీలించి మా మనస్సులలోని మంచి, చెడు గుణాలను శ్రీరామకృష్ణులు ఎలా తెలుసుకొనేవారో చూపడానికి ఎన్నో ఉదాహరణలు పేర్కొనవచ్చు. నిరంజన్ అధికంగా నెయ్యి తినడం

---

1. హరిశ్ తల్లి అప్పటికే మరణించడం వలన శ్రీరామకృష్ణులు అలా చెప్పివుండవచ్చు.

చూసి, ''అంత నెయ్యి తింటున్నావే! చివరకు నువ్వు లోకుల కుమార్తెలనూ, కోడళ్లనూ లేవదీసుకుపోయేట్లున్నావే?'' అని అనేవారు.

25. వ్యక్తుల మామూలు దైనందిన చేతల ఆధారంగా ఉపదేశించడం

మరొక వ్యక్తి ఎక్కువసేపు నిద్రించడం గమనించి ఆయన ఎంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యశాస్త్రం అధ్యయనం చేయాలనే తీవ్ర ఆకాంక్షతో ఆయన ఆదేశాన్ని పాటించని మరొక వ్యక్తిని చూసి ''కోర్కెలను ఒకటి వెంట ఒకటిగా వదలివేయడానికి బదులు నువ్వు వాటిని పెంచుకొంటున్నావు; అటువంటప్పుడు ఆధ్యాత్మిక ప్రగతిని ఎలా పొందగలవు?'' అని అడిగారు. ఇతర అంశాలను ప్రస్తావిస్తున్నప్పుడు ఇటువంటి ఎన్నో ఉదాహరణలను పాఠకులకు తెలిపివున్నాం. కాబట్టి మరిన్ని ఉదాహరణలు పేర్కొనడం అనవసరమని భావిస్తున్నాం.

పైన పేర్కొన్న పరీక్షా పద్ధతుల ద్వారా తమ ఆశ్రిత భక్తుల నైజాన్ని గ్రహించి, వారి లోటుపాట్లను ఎలా సవరించుకోవాలో ఉపదేశించేవారు; అంతే

26. తమను గురించిన వ్యక్తుల అంచనాల ద్వారా శ్రీరామకృష్ణులు వారి ఆధ్యాత్మిక ప్రగతిని రూఢిపరచుకోవడం

గాక ఆ ఉపదేశాలు ఏ మేరకు కార్యరూపం దాల్చాయో పదేపదే గమనిస్తూ ఉండేవారు. ఒక ఫలానా వ్యక్తి ఆధ్యాత్మిక ప్రగతిని రూఢి చేసుకోవడంలో ఆయన ఒక ప్రత్యేక విధానాన్ని అవలంబించడమూ కద్దు. ఆయన అవలంబించే ఆ విధానం ఇది: ఏ భక్తిప్రపత్తుల ప్రేరణతో ఒక ఫలానా వ్యక్తి తమ వద్దకు ప్రప్రథమంగా వచ్చాడో, ఆ భక్తిప్రపత్తులు క్రమేణా పెంపొందుతున్నాయో లేదో పరిశీలించడం ఆయన ఒక నియమంగా ఎంచుకొన్నారు. ఆ విషయం తెలుసుకోవాలనే ఉద్దేశంతో, కొన్ని సమయాలలో శ్రీరామకృష్ణులు ఒక ఫలానా వ్యక్తి తమ ఆధ్యాత్మిక స్థితులను లేదా తమ ప్రవర్తనను ఏ మేరకు అవగతం చేసుకొన్నాడో అని ఆ వ్యక్తిని ప్రశ్నించేవారు. తక్కిన సమయాలలో ఆ వ్యక్తికి తమ వచనాల పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉందో లేదో ఆయన గమనించేవారు; మరికొన్ని సమయాలలో ఎవరి సాంగత్యంలో ఆ వ్యక్తి ఆధ్యాత్మిక భావం పెంపొందుతుందో వారిని అతడికి పరిచయం చేసేవారు. ఆధునిక ప్రపంచంలో ఆధ్యాత్మికతకు ప్రతిరూపంగా తమను సహజంగా అతడు గుర్తించే దశకు వచ్చేదాకా ఆయన ఆ శిష్యుని ఆధ్యాత్మిక ప్రగతి గురించి నిశ్చింతులై ఉండలేకపోయేవారనడం అతిశయోక్తి కాదు.

పైన చెప్పిన విషయం విని పాఠకులు ఆశ్చర్యపడతారనడంలో సందేహం

27. దీనిని గురించి మరింత వివరణ

లేదు. కాని కాస్త ఆలోచించి చూస్తే అలా ఆశ్చర్యపోవడానికి ఆస్కారం కనిపించదు; పైగా శ్రీరామకృష్ణులు అలా వచించడం సహజమూ, యుక్తియుక్తమూ అని కూడా తెలియవస్తుంది. అలా

ప్రవర్తించడం తప్ప ఆయనకు మరో ప్రత్యామ్నాయం లేదు; ఎందుకంటే లోకం ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని ఆధ్యాత్మికత తమలో అభివ్యక్త మౌతూందన్న విషయం ఆయనకు ఎరుకే. సుదీర్ఘకాల కఠోర తపశ్చర్యలు, ప్రగాఢ ధ్యాన సమాధులు పొందడం ఫలితంగా ఆయనలో అహంకారం సంపూర్ణంగా దగ్ధమైపోయిందనీ, భ్రమలో పడే కించిత్తు ఆస్కారంకూడా లేనే లేదనీ మేం మరొక చోట వివరింప ప్రయత్నించడం పాఠకులు చూడవచ్చు.

ఆయన మనస్సులో అపరిమిత స్ఫూర్తి, అనంత జ్ఞానం అభివ్యక్తమౌ తూంటాయి. పర్యవసానంగా లోకం మునుపు ఎన్నడూ కనీవినీ ఎరుగని ఆధ్యాత్మిక ఆదర్శం తమ ద్వారా వ్యక్తమౌతుందనే ప్రగాఢ నమ్మకం ఆయనలో ఉదయించింది. కాబట్టి ఆ ఆదర్శాన్ని చక్కగా గ్రహించి, దాని వెలుగులో తమ జీవితాలను ప్రకాశింపచేసుకొనే వారు ఈ ఆధునిక యుగంలో ఆధ్యాత్మిక ప్రగతిని సునాయాసంగా పొందగలరని ఆయన నమ్మడం సహజమే కదా! కనుక ఆయన వద్దకు వచ్చే భక్తులు ఆయన గురించి పైన పేర్కొన్న విషయాలు చక్కగా అర్థం చేసుకొన్నారో లేదో, అర్థం చేసుకొని ఉంటే ఆయనలో అభివ్యక్త మయ్యే ఉదార ఆధ్యాత్మిక భావాలకు అనుగుణంగా తమ జీవితాలను తీర్చిదిద్దు కొనే ప్రయత్నాలు చేస్తున్నారో లేదో ఆయన క్షుణ్ణంగా పరిశీలించడంలో ఎలాటి ఆశ్చర్యమూ లేదు.

పైన ప్రస్తావించిన తమ మనోనమ్మకాన్ని శ్రీరామకృష్ణులు వివిధ రీతుల్లో వ్యక్తం చేసేవారు. తరచు ఆయన ఇలా చెప్పేవారు: ''నవాబుల కాలంలో చెలా మణిలో ఉండిన నాణేలు పాదుషాల కాలంలో చెల్లవు''; ''నేను చెప్పినట్లు ముందుకు పోతే తిన్నగా లక్ష్యాన్ని చేరగలవు''; ''జననమరణ పరంపరలో చివరి జన్మను చేరుకొన్నవాడు (అంటే ముక్తిని పొంద సిద్ధంగా ఉన్నవాడు) మాత్రమే ఇక్కడకు వచ్చి ఈ చోటి (అంటే తమ) ఉదార ఆదర్శాన్ని స్వీకరి స్తాడు''[1]; ''నీ ఇష్టదైవం దీన్లో (తమను చూపుతూ) వసిస్తూన్నాడు; కనుక దీని మీద ధ్యానించడం, నీ ఇష్టదైవం మీదే ధ్యానించడమౌతుంది.''

తమ శిష్యులకు తమ పట్లగల విశ్వాసం, తమను గురించి కలిగిన అవ గాహనను ఎలా రూఢీపరచుకొనేవారో కొన్ని ఉదాహరణల ద్వారా వివరించ బోతున్నాం. అప్పుడు పాఠకులు మేం చెప్పిన విషయాన్ని మరింత చక్కగా గ్రహించవచ్చు.

---

1. ఈ పలుకుల గూఢార్థాన్ని గురుభావం (IV.4.51)లో విశదంగా చర్చించాం.

శ్రీరామకృష్ణుల దర్శనభాగ్యం ద్వారా ఆయన అహైతుక కృపను పొంద గలిగిన వ్యక్తు లందరికీ, ఏకాంతంలోనో లేదా కొద్దిమంది మాత్రమే ఉన్నప్పుడో హఠాత్తుగా ఆయన, ''సరే, నన్ను గురించి నీ అభిప్రాయం ఏమిటి? నే నెవరిని?'' అని భాగ్య శాలియైన ఒక ఫలానా భక్తుణ్ణి ప్రశ్నించేవారనే విషయం సువిదితమే. తమకు కొంతకాలంగా సన్నిహితంగా తెలిసిన వ్యక్తులనే ఆయన అలా ప్రశ్నించేవారు. కాని కొన్ని సమయాలలో క్రొత్తగా తమ వద్దకు వస్తూ వున్న వ్యక్తులను కూడా అలా ప్రశ్నించేవారు. చాలాకాలం మునుపే యౌగిక దర్శనాలలో కానవచ్చిన భక్తులే వీరు. వారినుండి వచ్చే జవాబుల వైవిధ్యాన్ని వర్ణించడం కష్టం. ఆ జవాబులు క్లుప్తంగా చెప్పాలంటే ఇలా ఉండేవి: ''మీరు 'నిజమైన సాధువులు', 'నిజమైన భక్తులు', 'మహాపురుషులు', 'సిద్ధపురు షులు', 'అవతార పురుషులు', 'సాక్షాత్తు చైతన్యులు', 'సాక్షాత్తు పరమేశ్వ రులు', 'స్వయంగా ఆ భగవంతులే'. '' భగవదవతారం పట్ల నమ్మకంలేని కొందరు బ్రహ్మసమాజస్థులు, ''మీరు శ్రీకృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, చైతన్యులతో సమానులైన భగవత్ప్రేమికులు'' అని జవాబు చెప్పేవారు.

28. ఆయనను గురించి వివిధ భక్తుల విభిన్న అంచనాలు

విలియమ్స్[1] అనే ఒక క్రైస్తవుణ్ణి అలా ప్రశ్నించినప్పుడు అతడు, శ్రీరామ కృష్ణులు సాక్షాత్తు భగవంతుని పుత్రుడైన, నిత్యచిన్మయరూపుడైన ఏసుక్రీస్తు అని తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. అలా జవాబులు చెప్పిన వ్యక్తులు శ్రీరామకృష్ణులను ఏ మేరకు అవగతం చేసుకొన్నారో మాకు తెలియదు; కాని తమ జవాబుల ద్వారా ఏకకాలంలో శ్రీరామకృష్ణులను గురించీ, భగవంతుణ్ణి గురించీ తమకున్న అభిప్రాయాలను వెల్లడించారన్నది మాత్రం సత్యం. శ్రీరామకృష్ణులు వారి జవాబులను పైన ప్రస్తావించిన వెలుగులోనే స్వీకరించి, వారి ఆధ్యాత్మిక వైఖరులకు అనుగుణంగా ఉపదేశించేవారు. సకల ఆధ్యాత్మిక భావమూర్తులైన శ్రీరామకృష్ణులు వారి భావానికి హాని కలిగించకుండా, ప్రతి ఒక్కరిని వారి భావంలో చరమావస్థను చేరుకొనేలా చేసి, దేశకాలాతీతుడూ, సత్యస్వరూపుడూ అయిన భగవంతుని సాక్షాత్కారం పొంద దోహదం చేసే

---

1. ఇతడు శ్రీరామకృష్ణులను పలుమార్లు సందర్శించిన తరువాత, ఆయన సాక్షాత్తు భగవదవతారమూర్తులనే నిశ్చితాభిప్రాయానికి వచ్చి, ఆయన ఉపదేశం మేరకు సర్వసంగ పరిత్యాగం చేశాడని విశ్వసనీయుల నుండి తెలియవచ్చింది. పంజాబుకు ఉత్తరంగా హిమా లయాలలో ఏదో ఒకచోట వసిస్తూ, మరణ పర్యంతం సాధనానుష్ఠానాలలో గడిపాడని తెలియ వస్తున్నది.

వారు. కాని ఆ వ్యక్తి తన సొంత భావాన్ని వ్యక్తీకరించాడో లేదా మరొకరి భావాన్ని అనుకరిస్తున్నాడో మాత్రం గమనించేవారు.

శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చినప్పుడు పూర్ణుడు[1] కేవలం బాలుడనే చెప్పాలి. అప్పుడు అతడి వయస్సు పదమూడేళ్లకు కాస్త పైబడి ఉండవచ్చు.

29. భక్తుడైన పూర్ణ చంద్రుడి ఉదాహరణ ఆ సమయంలో శ్రీరామకృష్ణుల పరమభక్తుడైన శ్రీమహేంద్ర (కథామృత రచయిత) శ్యాంబజార్‌లో దయాసాగరుడైన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ స్థాపించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా ఉంటున్నాడు. సహజంగా దైవభక్తి గల బాలురను ఆయన దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణుల వద్దకు తోడ్కొని వచ్చేవారు. ఆ విధంగా ఆయన తేజేంద్ర, నారాయణ్, హరిపద, వినోద్, చిన్న నరేన్, ప్రమథ (పల్టు) మొదలైన బాగ్‌బజార్‌కు చెందిన బాలురను ఒకరి తరువాత ఒకరినిగా వెంటబెట్టుకు వచ్చేవారు; వీరంతా శ్రీరామకృష్ణుల వద్ద ఆశ్రయం పొందారు. కాబట్టి మాలో కొందరం మహేంద్రను 'పిల్లలను అపహరించే పంతులు' అని తమాషాగా పేర్కొనేవారం. అలా ఆయనను మేం పేర్కొనడం విని శ్రీరామకృష్ణులు, 'సరైన బిరుదు' అంటూ నవ్వుకొనేవారు. మహేంద్ర ఒక రోజు మూడవ తరగతి పిల్లలకు పాఠం చెబుతూవున్నప్పుడు పూర్ణుడి మంచి స్వభావం, తియ్యని పలుకులు ఆయనను ఆకర్షించాయి; త్వరలోనే ఆయన పూర్ణుణ్ణి, శ్రీరామకృష్ణులకు పరిచయం చేసే ఏర్పాట్లు చేశారు. పూర్ణుడి సంరక్షకులు కఠిన స్వభావులు కనుక ఆ ఏర్పాట్లు గోప్యంగా జరిగాయి. ఎందుకంటే ఈ విషయం ముందుగా వారికి తెలిస్తే గురుశిష్యు లిద్దరూ వాళ్ల చేతుల్లో ఇబ్బందికి గురి కాక తప్పదు. పూర్ణుడు మామూలు వేళకు బడికి వచ్చి, బాడుగ బండిలో దక్షిణేశ్వరానికి వెళ్లి గురుదేవులను దర్శించుకొన్నాడు; బడి వదిలే వేళకు దక్షిణేశ్వరం నుండి తిరిగి బడికి వచ్చేశాడు. ఇంటికి మామూలు వేళకే తిరిగి పోగలిగాడు.



పూర్ణచంద్ర ఘోష్

---

1. పూర్ణచంద్ర ఘోష్

31. పూర్ణుడి పట్ల శ్రీరామకృష్ణుల ఆప్యాయతానురాగాలు

ఆ రోజు పూర్ణుణ్ణి చూసి శ్రీరామకృష్ణులు ఎంతో ఆనందించారు. అతడికి ఆప్యాయంగా తినుబండారాలు ఇచ్చారు; ఉపదేశా లిచ్చారు. అతడు తిరిగి వెళ్లిపోయేటప్పుడు, ''అవకాశం ఉన్నప్పుడల్లా ఇక్కడకు వస్తూవుండు; బండిలోనేరా - బండి బాడుగ ఇక్కడ ఇచ్చేటట్లు ఏర్పాటు జరుగుతుంది'' అని అతడితో చెప్పారు. ఆ తరువాత ఆయన మాతో ఇలా చెప్పారు: ''పూర్ణుడు నారాయణాంశసంభూతుడు. సత్వగుణ సంపన్నుడైన సాధకుడు. ఈ రకంగా చూసినప్పుడు, నరేంద్రుని తరువాతి స్థానం ఇతడిదే. పూర్ణుడి రాకతో ఇంతకు మునుపు దివ్యదర్శనాలలో నేను చూసిన భక్తులు అందరూ వచ్చినట్లే! కాబట్టి భవిష్యత్తులో ఆ కోవకు చెందిన వ్యక్తులు ఇక రారు.''

30. పూర్ణుడి ఆధ్యాత్మిక అర్హత గురించి శ్రీరామకృష్ణులు

శ్రీరామకృష్ణులను దర్శించుకొన్న తరువాత పూర్ణుడిలో నాడు అసాధారణమైన మానసిక పరిణామం జనించింది. శ్రీరామకృష్ణుల తోడి గతజన్మ స్మృతి అతడిలో జాగృతమైంది. దాంతో అతడు అంతర్ముఖుడైనాడు. అతడి కళ్లవెంట ఆనందాశ్రువులు ధారలు కట్టాయి. సంరక్షకుల భయంతో ఎంతో కష్టంమీద తనను అదుపులో ఉంచుకొని ఆ రోజు ఇంటికి తిరిగి వెళ్లాడు. ఆ నాటినుండి పూర్ణుణ్ణి తరచు చూసి, అతడికి స్వయంగా తినిపించాలనే ఆరాటం శ్రీరామకృష్ణులలో తీవ్రం కాసాగింది. అవకాశం దొరికినప్పుడల్లా అతడికి రకరకాల తినుబండారాలను పంపించేవారు. ఆ తినుబండారాలు తీసుకెళ్లి పూర్ణుడికి ఇచ్చే వ్యక్తితో ఎవరికీ తెలియకుండా ఇచ్చిరమ్మనేవారు. ఆ విషయం ఇంట్లో తెలియవస్తే అతణ్ణి ఇంట్లో బాధిస్తారని తెలిసే అలా గోప్యంగా శ్రీరామకృష్ణులు ఇవ్వమనేవారు.

32. పూర్ణుడి దృష్టిలో శ్రీరామకృష్ణులు

పూర్ణుణ్ణి చూడాలనే ఆరాటంలో శ్రీరామకృష్ణుల కళ్లవెంట ఎడతెగని అశ్రువులు స్రవించడం మేం అనేక సందర్భాలలో చూశాం. ఆయన ఆ ప్రవర్తనకు మేం ఆశ్చర్యపోవడం చూసి ఆయన ఒక రోజు మాతో ఇలా చెప్పారు: ''పూర్ణుడి పట్ల నే నిలా ఆకర్షితుడనవడం చూసి మీరు ఆశ్చర్యపోతున్నారు; కాని నరేన్‌ను ప్రప్రథమంగా చూసినప్పుడు నేను అనుభవించిన తపన, ఆ సందర్భంలో నేను పడ్డ ఆరాటం మీరు చూసివుంటే, మీ రెలా స్పందించేవారో నేను ఊహించుకోలేను.'' పూర్ణుణ్ణి చూడాలనే ఆరాటం మరింత తీవ్రమైనప్పుడు ఆయన ఆ రోజు మధ్యాహ్నం బాగ్‌బజార్‌లోని బలరాంబాబు ఇంటికో లేదా ఆ ప్రాంతంలోని మరొక భక్తుని ఇంటికో వెళ్లేవారు; తరువాత బడికి కబురు పంపి పూర్ణుణ్ణి

తమ వద్దకు పిలిపించుకొనేవారు. పూర్ణుడు రెండవసారి శ్రీరామకృష్ణులను ఈ విధంగానే దర్శించాడు. అతడు ఆ రోజంతా తన్మయత్వంలో మునిగి పోయాడు. ఆ సందర్భంలో శ్రీరామకృష్ణులు అతడికి కన్నతల్లిలా స్వయంగా తమ చేతులతో తినిపించారు. పిదప, ''సరే, నా గురించి నువ్వు ఏమనుకొంటు న్నావు? నే నెవరిని?'' అని అతణ్ణే ప్రశ్నించారు. అసాధారణ హృదయ ప్రేర ణకు భక్తిజోడవగా పులకాంకితుడైన పూర్ణుడు, ''సాక్షాత్తు ఆ దేవుడే మీరు'' అని జవాబిచ్చాడు.

బాలుడైన పూర్ణుడు చూసీచూడగానే తమను సర్వశ్రేష్ఠ ఆదర్శ రూపు నిగా స్వీకరించడం చూసి శ్రీరామకృష్ణుల విస్మయానందాలు మేరమీరాయి.

33. పూర్ణుడికి శ్రీరామకృష్ణుల ఉపదేశం

హృదయపూర్వకంగా పూర్ణుణ్ణి ఆశీర్వదించి మహాశక్తి వంతమైన మంత్రంతో దీక్షను ఒసగారు; సాధన రహస్యా లను వెల్లడిచేస్తూ అతడికి ఉపదేశం చేశారు. దక్షిణేశ్వరానికి తిరిగి వచ్చాక పదేపదే మాతో ఆయన ఇలా చెప్పసాగారు: ''సరే, పూర్ణుడు ఇంకా బాలుడే కదా! ఇంకా బుద్ధి వికసించలేదు. అయినప్పటికీ అతడు ఈ విషయాన్ని (అంటే ఆధ్యాత్మిక పరాకాష్ఠ తమలో ఉందని) ఎలా అర్థం చేసుకొన్నాడు? దివ్యసంస్కారాల ప్రేరణతో మరికొందరు కూడా ఆ ప్రశ్నకు సరిగ్గా అలాంటి జవాబు ఇచ్చివున్నారు. తప్పకుండా అతడిలో మంచి పూర్వజన్మ సంస్కారాలు ఉండే తీరాలి. ఇటువంటి శుద్ధసాత్త్వికుల హృదయాలలో స్వతసిద్ధంగానే సత్యం పరిపూర్ణంగా ప్రకాశిస్తూ ఉంటుంది.''

అనివార్య పరిస్థితుల కారణంగా పూర్ణుడు వివాహం చేసుకొని, సంసార జీవితం గడపవలసి వచ్చింది. అయినప్పటికీ అసాధారణ విశ్వాసం, భగవంతుని

34. సంసారియైనప్పటికీ పూర్ణుని మహత్వం

పైనే ఆధారపడే స్వభావం, సాధనపట్లగల అభిలాష, నిర హంకారం, నిస్స్వార్థత్వం మొదలైన సద్గుణాలన్నీ అతడు పుణికిపుచ్చుకొన్నాడని అతడితో సన్నిహిత సంబంధమున్న ప్రతి ఒక్కరికీ సువిదితమే.

తమ ఆశ్రిత భక్తులను శ్రీరామకృష్ణులు అదే విధంగా ప్రశ్నించడం గురించి మరొక ఉదాహరణ. శ్రీరామకృష్ణుల గదిలో శ్రీచైతన్య మహాప్రభువు

35. రెండవ ఉదాహరణ - వైకుంఠనాథ్

సంకీర్తన చేస్తున్న చిత్తరువు ఒకటి ఉండేది. మాకు బాగా పరిచయస్థుడైన ఒక వ్యక్తిని, అతడు దక్షిణేశ్వరానికి వస్తూన్న కొత్తలో ఒక రోజు శ్రీరామకృష్ణులు ఆ చిత్తరువును చూపుతూ, ''వారంతా దివ్యభావోద్వేగపూరితులై ఎలా ఉన్నారో చూశావా?'' అని అడిగారు.

ఆ వ్యక్తి: మహాశయా, వారంతా నిమ్నకులస్థులండీ!

శ్రీరామకృష్ణులు: అదేమిటి? అలా అనవచ్చా?

ఆ వ్యక్తి: నిజమండి; నేను నదియాకు చెందినవాణ్ణే. సాధారణంగా ఈ వైష్ణవులందరూ నిమ్నకులస్థులేనండి.

శ్రీరామకృష్ణులు: నువ్వు నదియా వాస్తవ్యుడివా! అలా అయితే నీకు మరో ప్రణామం.[1] సరే, రాం తదితరులు దీన్ని (తమను చూపిస్తూ) అవతారమని అంటారు. దీనిని గురించి నువ్వు ఏమనుకొంటున్నావు?

ఆ వ్యక్తి: మహాశయా, వారంతా మిమ్మల్ని తక్కువగానే అంచనా వేశారండి.

శ్రీరామకృష్ణులు: అదెలా? వాళ్ళు భగవదవతారమంటున్నారు, నువ్వేమో తక్కువగా అంచనా వేశారంటున్నావు.

ఆ వ్యక్తి: అవునండి; అవతారం భగవంతుడిలో ఒక అంశ మాత్రమే కదా! నాకు మాత్రం మీరు సాక్షాత్తు ఆ పరమశివుడిగానే కనిపిస్తున్నారు.

శ్రీరామకృష్ణులు: నువ్వేమంటున్నావు?

ఆ వ్యక్తి: నా మనస్సుకు అలా తోస్తున్నప్పుడు నేను చేయగలిగిందేముంది? శివుణ్ణే ధ్యానించమని మీరు నాకు చెప్పివున్నారు. కాని ఎంత ప్రయత్నించినా నా కది సాధ్యంకాలేదు. ధ్యానం చేయడానికి కూర్చోగానే మీ దయార్ద్ర వదనం తేజోమయంగా నా ముందు ప్రత్యక్షమయ్యేది. మీ వదనాన్ని త్రోసిరాజని శివుణ్ణే ధ్యానించలేకపోయాను, అలా చేయాలనే కోర్కె కూడా నాలో జనించలేదు. అందువలన మిమ్మల్నే శివుడిగా ధ్యానించసాగాను.

శ్రీరామకృష్ణులు: (ఆప్యాయంగా నవ్వుతూ) అలా మాట్లాడవద్దు. నేను నీ చిన్ని వెంట్రుకకు సమానమైన వాణ్ణని నాకు తెలుసు. (ఇద్దరూ నవ్వారు) సరేలే. నీ గురించి ఎంతో ఆందోళన చెందేవాణ్ణే; ఈ రోజు ఆ ఆరాటం తీరిపోయింది.

శ్రీరామకృష్ణుల ఆ చివరి వచనాలను ఆ వ్యక్తి ఆ సమయంలో అర్థం చేసుకొన్నాడో లేదో మాకు తెలియదు. కాని శ్రీరామకృష్ణులు అతడు చెప్పింది విని ప్రసన్నులయ్యారని మాత్రం మాకు తెలుసు. మాకు కావలసింది ఆయన ప్రసన్నత, అనుగ్రహం మాత్రమే. అంతటితో మేం సంతృప్తులయ్యేవారం; ఆయన వచనాల నన్నిటినీ అర్థం చేసుకోవాలనే కోర్కె మాకు ఉండేది కాదు.

---

1. ఎవరినైనా చూడగానే ప్రణామం చేయడం శ్రీరామకృష్ణుల వాడుక. అలా ఆ వ్యక్తికి ఇంతకు మునుపు ఒకసారి ప్రణామం చేశారు కనుకనే 'మరో ప్రణామం' అని అన్నారు.

ఆ వ్యక్తి ఆ రోజు తమను సర్వశ్రేష్ఠ ఆధ్యాత్మిక ఆదర్శంగా స్వీకరించాడని గ్రహించే ఆయన అలా అన్నారని (అంటే ఆ ఆరాటం తీరిపోయిందని) మేం భావించుకొన్నాం.

తమను ఆశ్రయించిన భక్తు లందరూ తమనూ తమ విధానాలనూ సునిశితంగా పరిశీలించాలనీ, అలా పరిశీలించిన తదనంతరమే తమ యథార్థ తత్త్వం పట్ల విశ్వాసం వహించాలనీ ఆయన నొక్కివక్కాణించేవారు. తరచు ఆయన మాతో ''సాధువును పగటిపూట, రాత్రివేళ కూడా పరిశీలించండి. తదనంతరమే ఆతణ్ణి విశ్వసించండి'' అని చెప్పేవారు. ఇతరుల కిచ్చే ఉపదేశాలను సాధువు స్వయంగా ఆచరిస్తూన్నాడో లేదో పరిశీలించమని శ్రీరామకృష్ణులు సదా మమ్మల్ని హెచ్చరించేవారు. తలపులు, పలుకులు, చేతలు ఒక్కటిగా ఉండని వ్యక్తిని ఎన్నటికీ నమ్మవద్దని ఆయన చెబుతూండేవారు. ఈ సందర్భంగా అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు ఒక కథ చెప్పేవారు.

36. పలుకులు, చేతలు భిన్నంగా ఉండే వ్యక్తిని విశ్వసించరాదు

ఒక ఫలానా వ్యక్తి పిల్లవాడు సదా అజీర్ణంతో బాధపడేవాడు. ఒక రోజు ఆ వ్యక్తి పిల్లవాణ్ణి ఒక మారుమూల గ్రామంలో ఉన్న సుప్రసిద్ధ వైద్యుడి వద్దకు చికిత్సకై తీసుకువెళ్లాడు. ఆ వైద్యుడు కుర్రవాణ్ణి పరీక్షించి రోగ నిర్ణయం చేశాడు. కాని మందుమాకులు ఏవీ ఇవ్వకుండా వారిని మర్నాడు రమ్మన్నాడు. మర్నాడు ఆ తండ్రీకొడుకులు వైద్యుడి వద్దకు వచ్చినప్పుడు అతడు, ఆ పిల్లవాడితో, ''బెల్లం తినడం మానుకో, రోగం నయమౌతుంది. మరే మందూ అవసరం లేదు'' అని చెప్పాడు. ఆ మాటలు విని తండ్రి, ''అయ్యా, ఈ మాట నిన్ననే చెప్పివుండవచ్చు కదా! ఇంత శ్రమపడి ఇవాళ మేం రావాల్సిన అవసరం ఉండేది కాదు'' అంటూ వాపోయాడు. అందుకు ఆ వైద్యుడు ఇలా జవాబిచ్చాడు: ''నిన్న ఇక్కడ కొన్ని బెల్లపు జాడీలు ఉండడం నువ్వు చూశావు కదా! కుర్రవాడికి బెల్లం తినవద్దని నిన్ననే చెప్పివుంటే, 'ఈ వైద్యుడు చిత్రమైన వ్యక్తిలా ఉన్నాడు. స్వయంగా తానే అంత బెల్లం ఒక పక్క తింటూ మరోపక్క నన్ను మాత్రం తినవద్దంటాడే!' అని అతడు తప్పక అనుకొని ఉంటాడు. అప్పుడు నా మాటల్లో కుర్రవాడికి ఏమాత్రం గురి కుదరదు. అందువలననే ఆ బెల్లపు జాడీలను అక్కడ నుంచి తీసివేసిన తరువాతే ఈ మాట చెప్పవలసి వచ్చింది.''

37. వైద్యుడు, రోగి కథ

శ్రీరామకృష్ణుల ఉపదేశం మేరకు మేమంతా ఆయన ప్రవర్తనను, జీవన విధానాలను సునిశితంగా పరిశీలించేవారం. మాలో కొందరు అలా పరీక్షించ

దానికి ఏమాత్రం తటపటాయించేవారు కారు. మేం చిత్తశుద్ధితోనే ఆయనను పరీక్షిస్తున్నామనీ తద్ద్వారా మా భక్తివిశ్వాసాలు పెంపొందుతాయనీ తెలిసే ఆయన మా పరీక్షలకు సంతోషించినట్లు తోస్తున్నది. ఇందుకు ఈ క్రింది సంఘటన ఒక స్పష్టమైన ఉదాహరణ.

38. భక్తులు శ్రీరామకృష్ణులను పరీక్షించడం

యోగానందస్వామి గురించి కొన్ని విషయాలు ఇంతకు మునుపే చెప్పుకొన్నాం. ఈ కథకు ఇతడే నాయకుడు; ఈ కథను అతడి నుండే తరువాత మేం విన్నాం. ఈ కథను చెప్పడానికి ముందు అతణ్ణి గురించి క్లుప్తంగా పరిచయం చేయవలసివుంది.

39. మొదటి ఉదాహరణ: యోగానంద స్వామి కథ

యోగానందస్వామి పూర్వాశ్రమ నామధేయం యోగేంద్రనాథ్ రాయ్ చౌధురి. పేరుప్రఖ్యాతులున్న సువర్ణ చౌధురీల వంశంలో అతడు జన్మించాడు. అతడి తండ్రి నవీన్‌చంద్ర ఒకప్పుడు సంపన్నుడైన జమీందారు; ఆ కుటుంబం తరతరాలుగా దక్షిణేశ్వరంలోనే వసిస్తూ వచ్చింది. యోగేంద్రుడి ఇంట్లో పూజాదికాలు సదా జరుగుతూండేవి; ఆ ఇల్లు కీర్తనంతోను, భాగవతాది పారాయణాలతోను సదా మార్మోగుతూ ఉండేదని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇవన్నీ యోగేంద్రుడి బాల్యంలోను, అంతకు మునుపు జరిగిన విషయాలు. తమ సాధన కాలంలో హరికథ ఆలకించడంకోసం ఆ ఇంటికి పలుమార్లు వెళ్ళినట్లు, ఆ కుటుంబ సభ్యులతో పరిచయం కూడా ఉందినట్లు శ్రీరామకృష్ణులు చెబుతూవుండేవారు. కాని యోగేంద్రుడు యౌవనంలోకి అడుగుపెట్టే సమయానికి గృహకలహాలు, తదితర కారణాల వలన ఆ కుటుంబం ఆస్తిపాస్తులన్నీ కోల్పోయి దాదాపు దారిద్ర్యావస్థకు చేరుకొంది.

యోగేన్
(స్వామి యోగానంద)

చిన్ననాటి నుండి యోగేంద్రుడు మృదుమధుర స్వభావాన్ని సంతరించుకొన్నాడు. అసాధారణ సుగుణాలతో అతడు జన్మించాడనడం అతిశయోక్తి కాదు. చిన్ననాటి

40. యోగేంద్రుడి పుట్టుపూర్వోత్తరాలు, అతడి తెలివితేటలు

నుండే తాను ఈ ప్రపంచానికి చెందినవాణ్ణి కాననీ, తన నిజమైన ఆవాసం ఇక్కడ కాదనీ, తన చిరపరిచిత నేస్తాలు ఇప్పటికీ ఉంటున్న ఎక్కడో సుదూరంలో ఉన్న నక్షత్ర మండలంలో ఉందనీ అతడు సదా భావిస్తూ ఉండేవాడు. అతడు కోపగించుకోవడం మేం ఎన్నడూ చూడలేదు. ''కామాన్ని సంపూర్ణంగా జయించినవాడు మనలో ఎవరైనా ఉన్నాడంటే అతడు యోగేంద్రుడొక్కడే'' అని వివేకానందస్వామి తరచు వచిస్తూండేవాడు. ఎవరంటే వారిని బోళాగా నమ్మే అతడి సరళత్వాన్ని తొలగింప శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు చీవాట్లు పెట్టినప్పటికీ, యోగేంద్రుడు మూర్ఖుడు మాత్రం కాడు. తన కర్తవ్యాలను ప్రశాంతంగా చేసుకుపోతూవున్నప్పటికీ, లోకుల చేతలను పరిశీలిస్తూనే ఉండేవాడు; వారి గురించి అతడికి ఏర్పడ్డ నిర్ణయాలు ఎన్నటికీ సత్యదూరమయ్యేవి కావు. ఇది తన తెలివితేటల పట్ల ఒక రకమైన గర్వాన్ని అతడిలో కలిగించింది.

దక్షిణేశ్వర వాస్తవ్యుడు కావడం వలన యుక్తవయస్కుడు కాక మునుపే యోగేంద్రుడికి శ్రీరామకృష్ణులను దర్శించే భాగ్యం కలిగింది. మొట్టమొదటి పరిచయంలోనే యోగేంద్రుణ్ణి చూసి శ్రీరామకృష్ణులు సంతోషంతో పొంగిపోయారు. ఆధ్యాత్మిక జ్ఞానోదయం కోసం తమ వద్దకు వస్తారని చాలాకాలం క్రితమే జగజ్జనని దివ్యదర్శనాలలో చూపించిన భక్తులలో యోగేన్ కూడా ఒకడని ఆయన గుర్తించారు; అంతే కాదు, అతడు తమ వద్దకు వచ్చిన కొలదికాలంలోనే జగజ్జనని అనుగ్రహంతో ఈశ్వరకోటులైన ఆరుగురిలో యోగేన్ ఒకడని శ్రీరామకృష్ణులు గ్రహించారు.

41. యోగేంద్రుడు ఈశ్వరకోటిలోని వాడు

దయనీయంగా తల్లి విలపించడంతో, తనకు ఎంతమాత్రం ఇష్టంలేక పోయినా యోగీంద్రుడు హఠాత్తుగా వివాహం చేసుకొన్నాడని ఇంతకు ముందే చెప్పివున్నాం. అతడు ఇలా చెప్పేవాడు: ''వివాహం చేసుకొన్న మరుక్షణమే భగవత్సాక్షాత్కారం పొందాలనే ఆశ అడుగంటిపోయింది. కామినీకాంచన పరిత్యాగమే ఎవరి ప్రథమోపదేశమో అటువంటి శ్రీరామకృష్ణుల వద్దకు ఇక ఎందుకు వెళ్లాలి? సుతిమెత్తని హృదయం కారణంగానే నా జీవితాన్ని నాశనం చేసుకొన్నాను. జరిగిన దానిని జరుగకుండా చేయలేం. ఎంత త్వరగా మరణిస్తే నా కంత మంచిది. ఇంతకు మునుపు శ్రీరామకృష్ణులను నిత్యం దర్శించేవాణ్ణి; కాని ఈ సంఘటన తరువాత ఆయన వద్దకు వెళ్లడం పూర్తిగా మానుకొన్నాను; హతాశుడనై పశ్చాత్తాపంతో కుమిలిపోతూ రోజులు గడపసాగాను. కాని శ్రీరామకృష్ణులు నన్ను విడిచిపెట్టలేదు. పదేపదే తమ వద్దకు రమ్మని కబురు పంప

42. యోగేంద్రుని వివాహం, అతడి పశ్చాత్తాపం

సాగారు; ఎంతకీ నేను వెళ్లకపోవడంతో ఆయన నన్ను రప్పించుకోవడానికి ఒక యుక్తి ప్రయోగించారు.

''నా వివాహానికి ముందు కాళికాలయంలోని ఒక వ్యక్తి ఏవో వస్తువులు కొనమని నాకు కొన్ని రూపాయలు ఇచ్చివున్నాడు. ఆ మొత్తంలో కొన్ని అణాలు నా వద్ద మిగిలాయి. ఒక వ్యక్తి ద్వారా ఆ వస్తువులు పంపుతూ, మిగిలిన పైకం త్వరలోనే పంపుతానని ఆ కాళికాలయంలోని వ్యక్తికి కబురు పంపించాను. ఈ విషయం శ్రీరామకృష్ణులకు తెలుసు. కాబట్టి కోపం నటిస్తూ ఒక రోజు ఒక వ్యక్తితో నా కిలా కబురు పంపారు: 'ఏం మనిషివయ్యా నువ్వు? మిగతా పైకం తిరిగి ఇవ్వలేదు సరికదా ఎప్పుడు ఇస్తావో అదీ చెప్పిపంపలేదు. నువ్వు వస్తువులకోసం ఖర్చు పెట్టింది ఎంతో తెలియచేస్తూ, మిగిలింది ఇచ్చివేసివుండాలి.'

''ఆ మాటలు నా అహాన్ని బాగా దెబ్బతీశాయి. నేను ఇలా అనుకొన్నాను: 'సన్నిహితంగా ఇంతకాలం మెలగిన తరువాత కూడా శ్రీరామకృష్ణులు నన్ను మోసగాడిగా భావిస్తున్నారా? సరే, ఈ రోజే అక్కడకు ఎలాగో అలా వెళ్లి ఈ వ్యవహారం తేల్చుకొంటాను; ఆ తరువాత మరెన్నడూ కాళికాలయం వైపు ముఖం కూడా తిప్పను.' నేనప్పుడు నిరాశానిస్పృహలు, పశ్చాత్తాపం, దెబ్బతిన్న అభిమానంతో దాదాపు జీవచ్ఛవంలా ఉన్నాను. ఆ నాటి మధ్యాహ్నం కాళికాలయానికి వెళ్లాను. కట్టుబట్టను చంకలో ఉంచుకొని, భావ పారవశ్యంలో తమ గదికి వెలుపల నిలబడి ఉన్న శ్రీరామకృష్ణులను దూరం నుండి చూశాను. నన్ను చూడగానే గబగబా ముందుకు వచ్చి ఇలా అనసాగారు: 'ఓ! వివాహం చేసుకొంటే మాత్రం ఏమిటి! లక్ష వివాహాలు చేసుకొన్నా ఇక్కడి (తమ) అనుగ్రహం ఉంటే ఏ కీడు నిన్ను దరిచేరదు. సంసార జీవితం గడుపుతూ భగవత్సాక్షాత్కారం పొందగోరితే, ఒక్కసారి నీ భార్యను ఇక్కడకు తోడ్కొనిరా; సంసార జీవితాన్ని పరిత్యజించి భగవంతుణ్ణే పొందగోరితే, అదీ నీకు సాధ్యపడేలా చేస్తాను.' అర్ధబాహ్య పారవశ్య స్థితిలో ఉన్న శ్రీరామకృష్ణుల ఆ వచనాలతో పోయిన నా ప్రాణం మళ్లీ తిరిగి వచ్చినట్లయింది. నా నిరాశానిస్పృహలు మాయమైపోయాయి. కళ్లవెంట అశ్రుధారలు ప్రవహిస్తూండగా ఆయన పాదాల మ్రోల వాలిపోయాను. ఆయనకూడా ఎంతో ఆప్యాయంగా నా చేయి పుచ్చుకొని గదిలోకి దారితీశారు. బాకీ పైకం సంగతి ప్రస్తావించబోయాను కాని ఆయన ఆ మాటనే వినిపించుకోలేదు.''

సర్వసంగ పరిత్యాగం చేసే సన్న్యాసికి ఉండే సంస్కారాలతోనే యోగీంద్రుడు జన్మించాడు. వివాహం చేసుకొన్నప్పటికీ, ఆ భావం మాత్రం కించిత్తు

కూడా మార్పుకు లోనుకాలేదు. తన ఏకైక అభయప్రదాతయైన శ్రీరామకృష్ణుల సేవలోనే యోగీన్ ఎక్కువ సమయం గడపసాగాడు. తమ కుమారుడు వివాహం చేసుకొన్నా సంపాదనపట్లా, సంసారంపట్లా ఎంతో ఉదాసీనంగా వ్యవహరించడం చూసి అతడి తల్లితండ్రులు ఫిర్యాదు చేయసాగారు. యోగీన్ ఇలా చెప్పాడు: ''ఒక రోజు మా అమ్మ, 'సంపాదించాలని నీకు లేకపోతే ఎందుకు వివాహం చేసుకొన్నావు?' అని నిలదీసి అడిగింది. అందుకు నేను, 'నువ్వు విలపిస్తూ ఉండడం చూడలేకనే వివాహం చేసుకొంటున్నానని పదేపదే నీకప్పుడు చెప్పాను కదా' అని చెప్పాను. ఆ జవాబు విని ఆమె మండిపడి, 'ఓహో! బాగానే ఉంది. లోలోపల ఇష్టంలేకపోతే నా కోసం వివాహం చేసుకొంటావా? ఎవరైనా ఈ మాట నమ్ముతారా?' అని అడిగింది. ఆ మాటలు విని దిగ్భ్రాంతి చెంది, 'భగవంతుడా! ఎవరి దుఃఖాన్ని చూడలేక నిన్ను సైతం విడిచిపెట్టడానికి సిద్ధమైనానో ఆమే ఇలా అంటున్నదే! ఎంత దౌర్భాగ్యం! ఒక్క గురుదేవులు తప్ప తలపులు, పలుకులు ఒక్కటే అయిన వ్యక్తులు ఈ లోకంలో మరెవరూ లేరు' అని అనుకొన్నాను. అప్పటి నుండి ఈ లోకం పట్ల రోత పుట్టింది. నాటి నుండి రాత్రిళ్లు కూడా గురుదేవుల వద్దే గడపసాగాను.''

43. దక్షిణేశ్వర కాళి కాలయంలోనే యోగీన్ రాత్రిళ్లు కూడా గడపడం

ఒక రోజు పగలంతా దక్షిణేశ్వర కాళికాలయంలోనే గడిపి సాయంత్రం కాగానే శ్రీరామకృష్ణుల వద్ద సెలవు పుచ్చుకొని భక్తులందరూ వెళ్లిపోవడం యోగీన్ చూశాడు. దగ్గర మరెవరూ లేకపోవడం వలన శ్రీరామకృష్ణులు ఇబ్బంది పడతారేమోనని యోచించి యోగీన్ ఆ రాత్రి అక్కడే గడపదలచుకొన్నాడు. రాత్రి యోగీన్ అక్కడే గడపడంపట్ల శ్రీరామకృష్ణులు కూడా సంతోషం వెలిబుచ్చారు. ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుకొంటూ రాత్రి ఎంతో పొద్దుపోవడం వారు గమనించలేదు; అప్పుడు పది గంటలు అయింది. శ్రీరామకృష్ణులు కాస్త ఉపాహారం తీసుకొన్నారు. యోగీంద్రుడు భోజనం చేశాక అతణ్ణికూడా తమ గదిలోనే పడుకోమని చెప్పి ఆయన నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దాటాక ఆయన బహిర్భూమికి పోవలసి వచ్చింది; యోగీన్ వైపు చూస్తే అతడు గాఢనిద్రలో ఉన్నాడు. నిద్ర లేపితే ఇబ్బంది పడతాడేమోనని ఆయనే ఒంటరిగానే పంచవటి మీదుగా దేవదారు తోపు వైపుకు బయలుదేరారు.

జీవితాంతం యోగీన్ ఎంతో తక్కువ సమయం నిద్రించేవాడు. ఆ రోజు శ్రీరామకృష్ణులు గదిలోనుండి బయటకు వెళ్లిన కాసేపటికే యోగీన్‌కు

మెలకువ వచ్చింది. లేచి చూస్తే గది తలుపులు తెరిచివున్నాయి, శ్రీరామ కృష్ణులు మంచం మీద లేరు. ఇంత రాత్రివేళ ఆయన ఎక్కడకు వెళ్లారా అని ఆశ్చర్యంలో తలమునకలయ్యాడు. ఆయన శౌచాదుల నిమిత్తం వాడే చెంబు మొదలైనవన్నీ అక్కడే ఉన్నాయి. బహుశా ఆయన ఆరుబయట పచార్లు చేస్తున్నారేమోనని యోగేన్ అనుకొన్నాడు. అప్పుడు అతడి మనస్సులో భయంకరమైన అనుమానం చెలరేగింది. ''అయితే శ్రీరామకృష్ణులు నహబత్‌లో వసిస్తున్న తమ భార్య వద్దకు వెళ్లారా? ఈయన కూడా చెప్పేదొకటి, చేసేది మరొకటి కోవకు చెందుతారా?''

44. శ్రీరామకృష్ణుల వల్ల యోగీన్‌కు సంశయం కలగడం

యోగీంద్ర ఇలా చెప్పాడు: ''అలాంటి ఆలోచన మదిలో మెదలగానే నాలో అనుమానం, భయం తదితర భావనలు చెలరేగాయి. ఎంత అనుచితమైనా నిజాన్ని తెలుసుకోవాలని నిశ్చయించుకొన్నాను. తరువాత నేను దగ్గరలోనే ఒక చోట నిలబడి నహబత్ తలుపువైపు చూడసాగాను. కొన్ని నిమిషాలు అలా నిలబడ్డానో లేదో పంచవటి నుండి ఎవరో నడచివస్తున్న చెప్పుల సవ్వడి వినవచ్చింది. కాసేపట్లో శ్రీరామ కృష్ణులు నా ముందుకు వచ్చారు. 'ఓ, ఇక్కడ నిలబడి ఉంది నువ్వా!' అని ఆప్యాయంగా నన్ను పలకరించారు. ఆయన గురించి అలా అనుమానపడినందుకు సిగ్గుతో చచ్చిపోయాను, తల పైకెత్తలేకపోయాను, నోట మాట పెగల్లేదు. నా ముఖం చూసి ఆయన అంతా అర్థం చేసుకొన్నారు; అయినా తప్పుపట్టక నన్ను అనునయిస్తూ, 'భేష్, మంచిదే. సాధువును పగటిపూట పరిశీలించు, రాత్రీ పరిశీలించు. ఆ తరువాతే విశ్వసించు' అని అన్నారు. అలా అంటూ తమతో రమ్మని చెప్పి తమ గదికి దారితీశారు. అనుమాన పిశాచం వాతబడి ఎంత పెద్ద అపరాధం చేశానోగదా అనే ఆలోచనలతో ఆ రాత్రి నా కిక నిద్ర పట్టలేదు.''

45. యోగీంద్రుడి సందేహ నివృత్తి

యోగానంద స్వామి అలా చేసిన అపరాధానికి పూర్తి ప్రాయశ్చిత్తమే చేశాడు; అతడు సంపూర్ణంగా గురుదేవుల పాదపద్మాలకు తనను ఆత్మ సమర్పణ గావించుకొన్నాడు; తన జీవితాన్నంతా, ముందుగా శ్రీరామకృష్ణుల సేవకు, ఆయన మహాసమాధి అనంతరం మాతృదేవి సేవకు అర్పించాడు. తీవ్రవైరాగ్య సంపన్నుడు, భక్తిజ్ఞానాలను సమానంగా సంతరించుకొన్నవాడు, సమాధ్యవస్థలు పొందినవాడు అయిన యోగీంద్రుడి వంటి యోగి తారసపడడం

46. గురువు పాద పద్మాలకు యోగీన్ ఆత్మసమర్పణ

ఎంతో అరుదు. ఆతడు 1899 వ సం॥ భౌతికకాయాన్ని వీడి పరమపదంలో లీనమైపోయాడు.

నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వస్తూన్నప్పటి నుండి శ్రీరామకృష్ణులు అతడి చేతల నన్నిటిని పరిశీలించేవారని ఇంతకు ముందే చెప్పుకొన్నాం.

47. నరేంద్రుని చేతలను శ్రీరామకృష్ణులు పరిశీలించడం

ఆ పరిశీలనల పర్యవసానంగా ధైర్యం, సాహసం, ఆత్మ సంయమం, ధార్మికతపట్ల అభిలాష, ఏ సత్కార్యానికైనా ఆత్మత్యాగం చేయడం మొదలైన సద్గుణాలన్నీ నరేంద్రుడిలో స్వాభావికంగానే ప్రదీప్తమౌతున్నాయని ఆయన గ్రహించారు. శుభసంస్కారాలు అతడిలో ఎంత దృఢంగా పాదుకుపోయి ఉన్నాయంటే ఏ విపరీత పరిస్థితులలోనూ లేదా ఎలాంటి ప్రలోభంలోనూ ఇతరులలా అతడు ఎలాంటి నిమ్నకార్యానికి ఒడిగట్టలేడని కూడా శ్రీరామకృష్ణులు తెలుసుకోగలిగారు. ఇక నరేంద్రుడి సత్యనిష్ఠను గురించి చెప్పపనిలేదు. కఠోరమైన అతడి సత్యనిష్ఠను గమనించి శ్రీరామకృష్ణులు ఎంత ముగ్ధులైనారంటే నరేంద్రుడి మాటలను ఆయన అక్షరాల నమ్మేవారు; అంతేకాదు నిజం తప్ప పొరపాటుగానైనా నరేంద్రుడి నోట అసత్యం వెలువడదనీ, యాదృచ్ఛికంగా అతడి మనస్సులో మెదలే ఆలోచనలన్నీ నిజమై తీరుతాయనీ ఆయనకు ప్రగాఢ విశ్వాసం కుదిరింది. కాబట్టే ఆయన నరేంద్రుణ్ణే సదా సత్యం విషయంలో ప్రోత్సహిస్తూ ఇలా చెప్పేవారు: ''త్రికరణశుద్ధిగా ఎవరు ఎప్పుడూ సత్యాన్నే అనుష్ఠిస్తూ ఉంటాడో అతడు తప్పక సత్యస్వరూపుడైన భగవంతుని సాక్షాత్కారం పొందగలడు. పన్నెండు సంవత్సరాలు త్రికరణశుద్ధిగా సత్యవ్రతాన్ని పాటించే వ్యక్తి సత్య సంకల్పుడౌతాడు.''

నరేంద్రుని సత్యనిష్ఠ పట్ల శ్రీరామకృష్ణులకు ఏర్పడ్డ ప్రగాఢ విశ్వాసం గురించి ఒక తమాషా సంఘటన మాకు గుర్తుకు వస్తూన్నది. ఒక రోజు

48. ఒక తమాషా సంఘటన

మాటల సందర్భంలో శ్రీరామకృష్ణులు భక్తుడి నైజాన్ని చాతకపక్షితో పోల్చుతూ ఇలా అన్నారు: ''చాతకపక్షి దప్పిక తీర్చుకోవడం కోసం సదా వర్షపు నీటికై ఎదురుచూస్తూ ఉంటుంది; అట్లే భక్తుడు కూడా తన హృదయ ఆవేదనను, సర్వ కామనలను తొలగింప సదా ఒక్క భగవంతుడిపై మాత్రమే ఆధారపడి ఉంటాడు.'' నరేంద్రుడు అప్పుడు అక్కడే కూర్చునివున్నాడు. హఠాత్తుగా అతడు, ''మహాశయా, చాతకపక్షి వర్షపు నీటిని తప్ప మరే నీటిని త్రాగదనే లోకోక్తిలో నిజం లేదు; ఇతర పక్షులలా అదీ చెరువుల, నదుల నీటిని త్రాగుతుంది. ఒక చాతకపక్షి అలా త్రాగడం కళ్లారా చూశాను'' అని అన్నాడు. అందుకు శ్రీరామకృష్ణులు,

''అదెలా? చాతకపక్షి ఇతర పక్షులలా జలాశయాలలోని నీళ్లను త్రాగుతుందా? అటువంటప్పుడు సుదీర్ఘకాల నా నమ్మకం వమ్ము అవుతుంది. నువ్వు స్వయంగా చూశావు కాబట్టి, దానిని గురించి నా కెలాంటి సందేహమూ లేదు'' అని చెప్పారు. కాని బాలక స్వభావులైన ఆయన అలా అనడంతోనే తృప్తి చెందలేదు. చాతకపక్షిని గురించిన తన నమ్మకం వమ్ము అయింది కనుక తన ఇతర నమ్మకాలూ వమ్ము అవుతాయేమోననే ఆలోచనలోపడ్డారు. అలా ఆలోచించి ఖిన్నులయ్యారు.

ఇది జరిగిన కొన్ని రోజులకు నరేంద్రుడు ఒకరోజు హఠాత్తుగా శ్రీరామకృష్ణులను పిలిచి, ''అదుగో అక్కడ చూడండి, మహాశయా! చాతకపక్షి ఎలా గంగాజలాన్ని త్రాగుతున్నదో చూడండి'' అని చెప్పాడు. శ్రీరామకృష్ణులు పరుగున వచ్చి, నరేంద్రుడు చూపిన పక్షిని చూసి పకపక నవ్వారు. ఎందుకంటే అది చాతకపక్షికాదు; మళ్లీ నవ్వుతూ, ''అది గబ్బిలం. ధూర్తుడా గబ్బిలాన్ని చూసి చాతకపక్షిగా ఎంచి నా కెంత ఆరాటం కలిగించావు. ఇకపై నీ మాటలను ఏవీ నమ్మను'' అని అన్నాను.

గౌరవం, శిష్టాచారం, సౌందర్య ప్రశంస మొదలైన ఉదాత్త ఉద్వేగాల ప్రేరణతో స్త్రీలను చూసినప్పుడు పురుషుల మనస్సు మెత్తబడడం సహజమే.

49. నరేంద్రుడి ఆత్మ సంయమం

కాని అందుకు కారణం ఆ ఉదాత్త భావప్రేరణ కాదనీ, సూక్ష్మమైన కామ సంస్కారాలనీ శాస్త్రాలు వచిస్తున్నాయి. అటువంటి సంస్కారాలూ, అభివ్యక్తీకరణలూ నరేంద్రుడిలో పూర్తిగా లుప్తం. అది గుర్తించి శ్రీరామకృష్ణులు ఉప్పొంగిపోయారు. స్త్రీ అందచందాలకు ఏనాడూ నరేంద్రుడు ఆకర్షితుడు కాడనే ప్రగాఢ నమ్మకం శ్రీరామకృష్ణులలో పాదుకుపోయింది. తరచు భావసమాధులు పొందుతూండడం వలన మే మెంతో గౌరవం చూపే భక్తుడు ఒకడితో[1], నరేంద్రుణ్ణి పోలుస్తూ, ఒక రోజు శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''స్త్రీలు ఒలకబోసే హొయల ముందు ఇతడు మైమరచిపోతాడు. కాని నరేంద్రుని విషయం తద్విరుద్ధం. అతణ్ణి నేను సునిశితంగా గమనించాను; అటువంటి పరిస్థితుల్లో ముఖం త్రిప్పేసుకొని, 'వీళ్లు (స్త్రీలు) ఎందుకు ఇక్కడున్నారు?' అని అంటాడు.''

జ్ఞానం, పుంభావం నరేంద్రునిలో అధికంగా అభివ్యక్తమై ఉన్నప్పటికీ కోమలత్వానికి, భక్తిభావానికి కొదువ లేదని అనేక సందర్భాలలో శ్రీరామకృష్ణులు వచించడం కద్దు. నరేంద్రుడి సామాన్య చేతల ద్వారా అభివ్యక్తమయ్యే

---

1. నిత్యగోపాల్. కాలాంతరంలో ఇతడు జ్ఞానానందస్వామిగా పేర్కొనబడ్డాడు.

మానసిక స్థితులను, శారీరక లక్షణాలను పరిశీలించి ఆ తరువాతే ఆయన ఆ నిర్ణయానికి వచ్చారు. నరేంద్రుని ముద్దుగొలిపే ముఖ కవళికలను పరిశీలిస్తూ ఒక రోజు శ్రీరామకృష్ణులు, ''శుష్క-జ్ఞానం గల వ్యక్తికి ఎక్కడన్నా ఇటువంటి కళ్లు ఉంటాయా? జ్ఞానంతోపాటు స్త్రీకి స్వాభావికమైన భక్తిభావం కూడా నీలో ఉంది. ఎవరిలో కేవలం పుంభావం మాత్రమే ఉంటుందో వారి వక్షపు మొనల చుట్టూ నలుపు మచ్చ ఉండదు. మహావీరుడైన అర్జునుడికి ఆ నలుపు మచ్చ లేదు'' అని నరేంద్రుడితో చెప్పడం మాకు జ్ఞాపకం.

50. నరేంద్రునిలో కానవచ్చే భక్తియొక్క భౌతిక లక్షణాలు

పైన ప్రస్తావించిన నాలుగు పద్ధతులలోనే కాక మాకు తెలిసిన, తెలియని ఇతర రీతులలో కూడా శ్రీరామకృష్ణులు నరేంద్రుణ్ణి పరీక్షించారు. వాటిలో ఒకటి లేదా రెండు ముఖ్యమైన వాటిని ఇప్పుడు పాఠకులకు తెలుప నున్నాం.

51. శ్రీరామకృష్ణుల ఉదాసీన వైఖరిపట్ల ఆందోళన చెందని నరేంద్రుడు

నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చినప్పుడల్లా శ్రీరామకృష్ణులు అధిక సమయం అతడితోనే గడిపేవారని ఇంతకు మునుపే తెలిపివున్నాం. నరేంద్రుడు దూరంగా కనబడగానే శ్రీరామకృష్ణుల మనస్సు శరీరం విడిచి పరుగెత్తుకొని వెళ్లి అతణ్ణి ప్రియాలింగనం చేసుకొనేదని చెప్పడం అతిశయోక్తి కాబోదు. నరేంద్రుణ్ణి చూసిన తక్షణం, ''అదుగో న...., అదుగో న....'' అంటూ శ్రీరామకృష్ణులు భావపారవశ్యంలో మగ్నులైపోవడం మేం ఎన్నిసార్లు చూశామో చెప్పడం కష్టం. కాని ఆ పరిస్థితికి ఒక అంతరాయం ఏర్పడింది. ఒక దశలో శ్రీరామకృష్ణులు అతడి పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం కాన వచ్చింది. మామూలుగానే ఒక రోజు నరేంద్రుడు వచ్చి శ్రీరామకృష్ణులకు ప్రణామం చేసి ఆయన ముందు కూర్చుని, చాలాసేపు ఎదురుచూశాడు. కాని శ్రీరామకృష్ణులు కనీసం అతడి క్షేమం గురించికూడా విచారించక పూర్తిగా ఉదాసీనంగా ఉండిపోయారు. శ్రీరామకృష్ణులు బహుశా ఆధ్యాత్మిక భావో ద్వేగంలో ఉన్నారేమోనని నరేంద్రుడు అనుకొన్నాడు. చాలాసేపు అలా నిరీ క్షించి, చివరకు గది బయటకు వచ్చి హాజ్రాతో పిచ్చాపాటీ మాట్లాడుతూ పొగత్రాగసాగాడు. ఇంతలో శ్రీరామకృష్ణులు ఇతరులతో మాట్లాడడం విని పించి నరేంద్రుడు మళ్లీ గదిలోకి వచ్చి ఆయన వద్ద కూర్చున్నాడు. కాని శ్రీరామకృష్ణులు మాత్రం అతడితో ఒక్కమాట కూడా మాట్లాడక మంచం మీద అటువైపు తిరిగి పడుకొన్నారు. ఆ పగలంతా అలాగే గడిచిపోయి, సాయంత్రం కాసాగింది; అయినప్పటికీ శ్రీరామకృష్ణుల వైఖరిలో ఎలాంటి

మార్పు నరేంద్రుడికి కనిపించలేదు. కాబట్టి ఆయనకు ప్రణామం చేసి కల కత్తాకు తిరిగి వెళ్లిపోయాడు.

మళ్లీ ఒక వారం తిరక్కుండానే నరేంద్రుడు దక్షిణేశ్వరానికి వచ్చాడు; శ్రీరామకృష్ణుల ఉదాసీన వైఖరి అట్లే ఉండడం గమనించాడు. ఆ రోజు కూడా అతడు హాజ్రా, తదితరులతో పిచ్చాపాటీ మాట్లాడుతూ రోజంతా గడిపి, సాయంత్రం కాగానే ఇంటికి బయలుదేరాడు. నరేంద్రుడు మూడవసారి, నాలుగవసారి దక్షిణేశ్వరానికి వచ్చాడు కాని శ్రీరామకృష్ణుల నిర్లిప్త వైఖరిలో మార్పు ఏమీ అతడికి కనిపించలేదు. అయినప్పటికీ ఆ ఉదాసీన ధోరణికి అతడు బాధపడలేదు. మామూలుగానే శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూనే ఉన్నాడు. నరేంద్రుడు ఇంటి వద్దే ఉంటున్నప్పుడు, శ్రీరామకృష్ణులు ఎవరినో ఒకరిని పంపి అతడి క్షేమ సమాచారం తెలుసుకొనేవారు; కాని అతడు తమ వద్దకు వచ్చినప్పుడు మాత్రం ఎప్పటిలా తమ ఉదాసీన వైఖరిని కొనసాగించ సాగారు. ఇలా ఒక నెల గడిచింది. అయినా తమ ఈ నిర్లక్ష్య ధోరణి కారణంగా నరేంద్రుడు రావడం మానుకోకపోవడం గమనించారు శ్రీరామకృష్ణులు. ఒక రోజు అతణ్ణి పిలిచి ఇలా అడిగారు: ''సరే, నేను ఒక్క మాటకూడా నీతో మాట్లాడలేదు; అయినప్పటికీ నువ్వు ఇక్కడకు వస్తూనే ఉన్నావు. ఎందుకు అలా చేస్తున్నావు?'' అందుకు నరేంద్రుడు, ''మీతో మాట్లాడడం కోసమా నే నిక్కడకు వస్తున్నాను? మీ రంటే నా కెంతో ఇష్టం. మిమ్మల్ని చూడగోరే నే నిక్కడికి వస్తున్నాను'' అని జవాబు చెప్పాడు. ఆ జవాబుతో శ్రీరామ కృష్ణులు ఎంతో ప్రసన్నులై ఇలా అన్నారు: ''నిన్ను సరిగా ఆదరించకుంటే రావడం మానివేస్తావేమోనని నిన్ను పరీక్షించాను. ఇంతటి ఉదాసీన వైఖరిని, అనాదరణను సహించడం నీ వంటి ఉన్నతస్థాయి ఆధ్యాత్మిక సాధకుడికే చెల్లింది. మరొకరైతే ఎప్పుడో వదలిపెట్టేసేవారు, మళ్లీ ఎన్నడూ ఇటు తొంగి చూసేవారే కాదు.''

మరో సంఘటన గురించి ప్రస్తావించి ఈ అధ్యాయాన్ని ముగిస్తాం.

52. నరేంద్రుడు: అతీంద్రియ శక్తులు

భగవత్సాక్షాత్కారార్థం నరేంద్రుడి హృదయం ఎంత తహ తహ చెందిందో ఈ సంఘటన నుండి చక్కగా అవగత మౌతుంది.

ఒక రోజు శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి పంచవటి వైపుకు తోడ్కొని వెళ్లి, అతడితో ఇలా చెప్పారు: ''సుదీర్ఘకాల తపస్సు ఫలితంగా అణిమాది అష్ట సిద్ధులు నాకు లభించాయి. కాని కట్టుబట్ట ఉందో లేదో అనే ఎరుకేలేని నా వంటి వ్యక్తికి ఆ సిద్ధులను ఉపయోగించే సందర్భమూ, అవకాశమూ ఎక్క

డుంది? కాబట్టి అమ్మతో చెప్పి ఆ సిద్ధు లన్నిటినీ నీకు ఇప్పించాలని అనుకొం టున్నాను. ఎందుకంటే, నువ్వే ఆమె పనిని ఎంతో చేయవలసి ఉందని ఆమె స్వయంగా నాతో చెప్పింది. ఆ శక్తులన్నీ నీకు దత్తమైతే, అవసరమైనప్పుడు ఉపయోగించుకోగలుగుతావు. మరి నువ్వేమంటావు?'' శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరంలో మొట్టమొదటిసారి చూసిన నాటి నుండి అనంతమైన దివ్యశక్తి ఆయనలో అభివ్యక్తమౌతూవుందన్న విషయం నరేంద్రుడికి అనుభవైకవేద్యమే. అందువలన ఆయన ఈ వచనాలను నమ్మక పోవడానికి ఎలాటి కారణమూ నరేంద్రుడికి లేదు. కాని అతడి హృదయంలో గుప్తమై ఉన్న భగవద్భక్తి ఏ వివే చనా చేయకుండా ఆ శక్తులను స్వీకరింప సమ్మతించలేదు. నరేంద్రుడు కాసేపు తీవ్రంగా ఆలోచించి, ''మహాశయా! ఆ శక్తులు భగవత్సాక్షాత్కారానికి నాకు దోహదం చేస్తాయా?'' అని అడిగాడు. అందుకు శ్రీరామకృష్ణులు, ''ఆ విష యంలో సహాయం చేయలేవు. కాని భగవత్సాక్షాత్కారానంతరం, జగజ్జనని పనులు నిర్వర్తిస్తూన్నప్పుడు అవి నీకు బాసటగా ఉంటాయి'' అని చెప్పారు. ఆ మాటలు విని నరేంద్రుడు ఇలా అన్నాడు: ''అలా అయితే మహాశయా, వాటి అవసరం నాకు లేదు. ముందు భగవత్సాక్షాత్కారం పొందనివ్వండి. ఆ తరువాత వాటిని స్వీకరించాలో వద్దో నిర్ణయించుకొంటాను. ఆ అద్భుత శక్తు లను ఇప్పుడే పొందితే, నా లక్ష్యాన్నే విస్మరించి, స్వార్థపరుడనై వాటిని అను చితంగా ఉపయోగిస్తే సర్వనాశనమైపోవడం తథ్యం.''

అణిమాది అష్టసిద్ధులను శ్రీరామకృష్ణులు నిజంగానే నరేంద్రుడికి ప్రసా దించ దలచుకొన్నారో లేక అతణ్ణి పరీక్షించే ఉద్దేశంతో అలా అడిగారో ఇత మిత్థంగా చెప్పడం కష్టం. కాని నరేంద్రుడు వాటిని నిష్కర్షగా తిరస్కరించడం పట్ల శ్రీరామకృష్ణులు ఎంతో ప్రసన్నులయ్యారని మాత్రం కచ్చితంగా చెప్ప గలం.

8.i. జీవితంలోను, శ్రీరామకృష్ణుల వద్దా నరేంద్రుని శిక్షణ

తమ నైజాన్ని నరేంద్రుని నైజంతో పోల్చుతూ శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు మాతో, ''దీన్లో (తమలో) ఉంటున్న వ్యక్తిలో స్త్రీ నైజం అభివ్యక్తమౌతూ ఉంటుంది, నరేంద్రునిలోని వ్యక్తిలో పురుషభావం అభివ్యక్తమౌతూ ఉంటుంది'' అని చెప్పేవారు. ఈ మాటలు ఆయన ఏ అర్థంలో చెప్పారో చెప్పడం కష్టం. కాని భగవత్సాక్షాత్కారార్థం వారిద్దరూ ఏ మార్గాలను అనుసరించారో, అంటే ఏ ముఖ్య విధానాలు అవలంబించారో వాటిని అధ్యయనం చేస్తే పై వచనానికి యుక్తియుక్తమైన అర్థం మనకు ద్యోతకమౌతుంది. ఎందుకంటే, భగవత్సాక్షాత్కారార్థం ఏ సాధనలు అనుష్ఠించాలని శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయో వాటిని గురుముఖతా వినగానే వాటిపట్ల పరిపూర్ణ విశ్వాసం వహించి, వెంటనే వాటిని శ్రీరామకృష్ణులు అనుష్ఠించారు. కాని ఈ విషయంలో నరేంద్రుని వైఖరి పూర్తి విరుద్ధం. వినగానే అతడు దేనినీ విశ్వసించేవాడు కాడు. శాస్త్రాలూ, గురువులూ వచిస్తూన్న దాన్లో ఏవైనా పొరపాట్లు ఉన్నవేమోనని అతడు వివేచించి వాటి యుక్తియుక్తతను తేల్చుకొనేవాడు. ఆ తరువాతే వాటిని అనుష్ఠానంలో పెట్టేవాడు.

1. తమలో స్త్రీ నైజం, నరేంద్రునిలో పురుష నైజం అభివ్యక్తమౌతూం డన్న శ్రీరామకృష్ణుల వచనానికి అర్థం

గతజన్మ సంస్కారాల కారణంగా భగవంతుని ఉనికిని నరేంద్రుడు గట్టిగా నమ్ముతూవున్నప్పటికీ, ప్రతివ్యక్తీ పొరబాట్లకూ, మూఢనమ్మకాలకూ ఎప్పుడో ఒకప్పుడు లోను కాకుండా ఉండలేడనే భావం అతడిలో జీవిత పర్యంతం మెదలుతూనే ఉండేది. అనాలోచితంగా ఎవరి మాటను మాత్రం ఎందుకు అంగీకరించాలనే భావంకూడా అతడిలో పాదుకుపోయింది. భక్తివిశ్వాసాల

ఉక్తులను హేతువాద దృష్ట్యా పరికించి, ఆ మనోవైఖరితోనే జీవితంలోని లౌకిక, ఆధ్యాత్మిక వ్యవహారాలను నిర్వహించడాన్ని ఈ ఆధునిక యుగంలో పురుషోచిత లక్షణంగా పరిగణిస్తారని చెప్పడం అవసరం లేదేమో!

సర్వకాలాలలో, సకల ప్రాంతాలలో మానవ జీవితాన్ని ప్రభావితం చేయడం లోను, మలచడంలోను పర్యావరణం ప్రముఖపాత్ర వహిస్తుందనడం అతిశయోక్తి కాదు. కాబట్టి పర్యావరణ శక్తి, ప్రభావం నరేంద్రుని జీవితంలో సైతం కానరావడం ఏమంత ఆశ్చర్యకరమైన విషయం కాదు. శ్రీరామకృష్ణుల వద్దకు రావడానికి ఎంతో ముందే అసాధారణ ప్రతిభావంతుడైన నరేంద్రుడు ఆంగ్ల సాహిత్యాన్ని, ఐరోపా, భారతదేశ చరిత్రలను, పాశ్చాత్య తర్క-శాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు; పరిశోధన, స్వతంత్ర చింతనే ప్రాతిపదికాలైన పాశ్చాత్య భావాలు అతడి నరనరాల్లో ఎన్నడో జీర్ణించుకుపోయాయి. కాబట్టి శాస్త్రవచనాల పట్ల అనేక సందర్భాలలో సంశయం వ్యక్తం చేయడం అతడికి స్వాభావికమే; అనుభవజ్ఞుడైన మనిషిగానే తప్ప ఫలానా ఏ వ్యక్తినీ గురువుగా స్వీకరించడానికి అతడు తటపటాయించడం కూడా అతడికి స్వభావసిద్ధమే.

2. నరేంద్రుడు స్వతంత్ర చింతనాశీలి

నరేంద్రుడి తండ్రి, బంధువుల జీవిత ఆదర్శాలు, నాటి కలకత్తా సమాజపు పరిస్థితులు నరేంద్రుడి పై వైఖరిని మరింత పటిష్ఠం చేశాయి. అతడి తాత జీవిత పర్యంతం హైందవ శాస్త్రాల పట్ల అపరిమిత విశ్వాసం కలిగివుండి, సన్న్యాసియైనాడు; కాని నరేంద్రుడి తండ్రి తన పాశ్చాత్య విధాన విద్యాభ్యాసం పర్యవసానంగా ఆ విశ్వాసాన్ని కోల్పోయి, స్వతంత్ర చింతనా పిపాసువైనాడు. పారశీక కవి హాఫీజ్ కవితలను, బైబిల్‌లో నమోదైన ఏసుక్రీస్తు ఉపదేశాలను నరేంద్రుని తండ్రి ఆధ్యాత్మిక భావాల పరాకాష్ఠగా పరిగణించేవాడు. ఆయనకు సంస్కృతం రానందున భగవద్గీత మొదలైన హిందూశాస్త్రాలు చదవలేదు. కాబట్టే పైన పేర్కొన్న వాటినే ఆధ్యాత్మికతకు అత్యున్నత హద్దుగా పరిగణించాడు. ఒక రోజు నరేంద్రుడు ధార్మిక గ్రంథాలను చదువుతూ ఉండడం చూసి, అతడికొక బైబిల్ ప్రతిని బహూకరించి, ''మతం అన్నది ఏదైనా ఉన్నదంటే, అది దీన్లోనే ఉంది'' అని చెప్పాడు. నరేంద్రుని తండ్రి బైబిల్‌ను, హాఫీజ్ కవితలను అలా తెగమెచ్చుకొన్నప్పటికీ, ఆ పుస్తకాలలో ఉన్న భావాలకు అనుగుణంగా ఆయన జీవితం ఆధ్యాత్మికంగా మలచబడలేదు. ఆయన నైజానికి ఆధ్యాత్మికత వంటబట్టని విషయంగా కానవస్తున్నది; ఆ పుస్తకాల పట్ల ఆయన వ్యక్తం చేసే ప్రశంసకూడా నోటిమాటే! ధన సంపాదన, సుఖంగా ఆనందంగా జీవించడం,

3. తన తండ్రి జీవితం, సమాజ పరిస్థితులు నరేంద్రునిపై చూపిన ప్రభావం

ఇతరుల సుఖసంతోషాలకు చేతనైనంత దోహదం చేయడం - ఇదే ఆయన జీవిత లక్ష్యం. దీనిని, ఆయన దైనందిన జీవితాన్ని అధ్యయనం చేసినప్పుడు భగవంతుడు, ఆత్మ, పరలోకం వంటి వాటిపై ఆయనకు ఎటువంటి నమ్మకం లేదని తేటతెల్లమౌతుంది. పాశ్చాత్య జడవాద ప్రభావం, అంటే ఉన్నదంతా ఈ ప్రపంచం ఒక్కటే మరేమీ లేదనే వాదం నరేంద్రుని తండ్రివంటి వ్యక్తుల మనస్సులలో అతీంద్రియ సత్యాలను గురించి భయంకరమైన అనుమానాలను ఉత్పన్నం చేసింది; అనేకులలో నాస్తిక బీజాలను మొలకెత్తింప చేసింది. ప్రాచీన ఋషిసత్తముల, శాస్త్రాల నుండి నేర్చవలసింది ఏమీ లేదనీ, అవే మూఢనమ్మకాలకు, బలహీనతలకు మూలమనీ వారు గట్టిగా నమ్మసాగారు. పర్యవసానంగా ఆధ్యాత్మికత అనే వెన్నెముక, మతం పట్ల విశ్వాసం లోపించినవారై అంతరాన ఒక తీరులో భావిస్తూ, బాహ్యంగా మరో విధంగా ప్రవర్తిస్తూ క్రమేణా స్వార్థ పూరితులూ, నయవంచకులూ కాసాగారు. మహామేధావియైన రాజారామ మోహన్ రాయ్ స్థాపించిన బ్రహ్మసమాజం దేశవ్యాప్తంగా ప్రాకిపోతున్న జడ వాదాన్ని, నాస్తికత్వాన్ని ఒకింతకాలం అరికట్టడానికి ప్రయత్నించింది. కాని పాశ్చాత్య నాగరకతా ప్రాబల్యంలో ఆ సమాజం అంతఃకలహాల కారణంగా రెండుగా చీలిపోయి అచిరకాలంలోనే గత ప్రాభవాన్ని కోల్పోయింది. ఆ రెండు వర్గాల అనుయాయులూ క్రమంగా పాశ్చాత్య భౌతికవాద చింతనాప్రవాహంలో కొట్టుకుపోయే లక్షణాలు ఆ సమయంలో కొట్టవచ్చినట్లు కనబడసాగాయి.

1881వ సం॥లో ఎఫ్.ఏ. పరీక్షల అనంతరం నరేంద్రుడికి పాశ్చాత్య విజ్ఞాన తత్త్వశాస్త్రాలతో బాగా పరిచయం ఏర్పడింది. అతడు అప్పటికే

4. పాశ్చాత్య చింతనా ధోరణి పట్ల నరేంద్రుడి అసంతృప్తి

పాశ్చాత్య తార్కికులైన మిల్ ఇత్యాదుల సిద్ధాంతాలను ఔపోసన పట్టేశాడు. డికార్ట్ 'అహంవాదాన్ని', హ్యూం బెన్‌థాంల 'నిరీశ్వరవాదాన్ని', స్పినోజ్ 'సర్వేశ్వరవాదాన్ని' డార్విన్ 'పరిణామావాదాన్ని', కోమ్టే 'రూఢివాదాన్ని', స్పెన్సర్ 'అజ్ఞేయ వాదాన్ని' - ఇలా వివిధ పాశ్చాత్య దార్శనికుల విభిన్న తాత్త్విక సిద్ధాంతాలను ఔపోసన పట్టి పరమసత్యపు నైజాన్ని ధ్రువీకరించుకోవాలనే ప్రగాఢ ఆరాటం నరేంద్రుడిలో చెలరేగింది. అట్లే జర్మన్ దార్శనికుల ఘనత గురించి విని కాంట్, ఫిక్టే, హెగల్, షోపన్‌హోర్ వంటి దార్శనికుల తాత్త్విక చింతనా ధోరణులనూ అధ్యయనం చేయసాగాడు. అలాగే స్నాయువులు, మెదడు ఎలా రూపొందుతాయో, ఎలా పనిచేస్తాయో తెలుసుకోగోరి అప్పుడప్పుడు స్నేహితులతో కలకత్తా వైద్యకళాశాలకు వెళ్లి శరీర ధర్మశాస్త్రాధ్యయనంలో మనస్సును

లగ్నంచేసి, ఆ విషయాంశాల మీద ఇవ్వబడే ప్రసంగాలను కూడా వినసాగాడు. పర్యవసానంగా 1884వ సం॥లో బి.ఏ. పరీక్షలలో ఉత్తీర్ణుడు కావడానికి మునుపే పాశ్చాత్య తత్త్వశాస్త్రం గురించి ఎంతో జ్ఞానం సముపార్జించాడు. అతడు ఈ జ్ఞానాన్ని ఎంత అధికంగా పొందసాగాడో అంత ఎక్కువగా మనిషి మనసు, బుద్ధులు ఎంత పరిమితమైనవో అతడికి అవగతం కాసాగింది. ఇంద్రియాతీతమైన ఆ పరమ సత్యాన్ని, భగవత్సాక్షాత్కారాన్ని పొందడానికి ఇవి చాలవని గ్రహించాడు; కనీసం ఏ మార్గాన్ని అనుసరిస్తే ఆ సాక్షాత్కారం లభిస్తుందో ఆ మార్గం గురించి కించిత్తు కూడా అవి వెల్లడించలేవనే విషయమూ అతడికి స్పష్టమైంది. ఈ విషయం ఎంత అధికంగా స్పష్టం కాసాగిందో నరేంద్రుడి మనస్సు అంతే అశాంతిని పొందసాగింది.

5. ప్రాచ్య, పాశ్చాత్య చింతనాధోరణుల మధ్య నరేంద్రుడు ఊగులాడడం

ఇంద్రియాల ద్వారా మెదడుకు చేరే బాహ్యస్పందనలు, వివిధ ప్రతిస్పందనలను ఉత్పన్నంచేసి అనుక్షణం మనిషి మనస్సులో సతతం మార్పులు కలిగిస్తూ సుఖదుఃఖ అనుభవాలను జనింపచేస్తూంటాయనే విషయం పాశ్చాత్య విజ్ఞాన తత్త్వశాస్త్ర తోడ్పాటుతో నరేంద్రుడు అర్థం చేసుకొన్నాడు. దేశకాలాల సహాయంతో మనస్సులో కలిగే పరిణామాలు మాత్రమే మనిషి ప్రత్యక్ష అనుభవానికి కారణాలు. అంతేగాని మనస్సులో ప్రతిస్పందన, మార్పులు జనింపచేస్తే ఆ బాహ్య మూలస్థానం అసలు స్వరూపం మనిషికెప్పుడూ అజ్ఞాతంగానే, అజ్ఞేయంగానే ఉండిపోతుంది. ఈ పరిమితి అంతర జగత్తుకు, మనిషి అసలు (ఆత్మ) స్వరూప విషయానికి కూడా అన్వయిస్తుంది. (అంటే ఇవికూడా అజ్ఞాతం, అజ్ఞేయంగానే ఉండిపోతాయన్నమాట.) అంతర జగత్తులో (అంతఃకరణంలో) కూడా అజ్ఞాతమైనది ఏదో ఒకటి తన శక్తితో మనిషి మనస్సులో 'నేను', 'నాది' మొదలైన భావాలు ఉత్పన్నం చేస్తూ వుంటుంది. ఈ అజ్ఞాత శక్తి దేశకాలాలకు అతీతమైనది కావడం వలన దాన్ని గుర్తించడం మనిషికి అసాధ్యం. అలా దేశకాలాలలనే దుర్భేద్యమైన గోడలు అడ్డు తగలడం వలన లోపలకు లేదా బయటకు, ఏ దిక్కుకు పోయి ఆ పరమ సత్యాన్ని అన్వేషిస్తూన్నప్పటికీ మనిషి మనస్సు నిస్సహాయ స్థితినే చవిచూస్తుంది.

పంచ జ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధి సహాయంతో మనిషి ఈ విశ్వ రహస్యాన్ని కనుగొనడానికి, దాని మూలాన్ని చేరడానికి ఎంత ప్రయత్నించినా తెలుసుకోవడం అసాధ్యమని నరేంద్రుడు గుర్తించాడు. ఏ ఇంద్రియ జ్ఞానం ద్వారా మనిషి తన తర్కాన్ని నిర్మించి, నిర్ణయాలకు రాచూస్తూన్నాడో ఆ

ఇంద్రియజన్య జ్ఞానమే తప్పుల కుప్ప అని అతను పక్కాగా గ్రహించాడు. ఆ కారణంగానే దేహానికి భిన్నంగా ఆత్మ అనే మరొకటి ఉందని నిరూపించ పాశ్చాత్య విద్వాంసులు చేస్తున్న ప్రయత్నాలు విఫలం కాక తప్పదు. కాబట్టి పారమార్థిక సత్యాలను గురించిన పాశ్చాత్యుల అంతిమ నిర్ణయాలు నరేంద్రునికి యుక్తియుక్తంగా తోచలేదు. సదా రూపరసాది భోగాలవల్ల అనుభూతమైన సామాన్య జనుల అనుభవాలే సహజం, స్వాభావికం అని అంగీకరించి పాశ్చాత్యాన్ని అనుకరిస్తూ ఆ అనుభవాల పునాది మీద దర్శనశాస్త్రాన్ని నెలకొల్పడం సబబా? లేక ప్రాచ్యాన్ని అనుసరించి సామాన్యుల అనుభవాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాకూడా ఋషులు, బుద్ధుడు వంటి మహనీయుల అసాధారణ అనుభూతుల పునాది మీద దార్శనిక సత్యాన్ని కనుగొనడానికి ప్రయత్నించడం సముచితమా? ఈ సందేహం నరేంద్రుని మనస్సును తొలిచివేయసాగింది.

ఆధ్యాత్మిక పరమైన పాశ్చాత్య తత్త్వశాస్త్ర నిర్ణయాలు చాలా మేరకు యుక్తియుక్తంగా నరేంద్రుడికి తోచకపోయినప్పటికీ, పాశ్చాత్య భౌతికశాస్త్ర

6. నరేంద్రుని భావ వ్యాఖ్యానపద్ధతిలో ఎలాంటి మార్పులేక పోవడం

ఆవిష్కరణలను, పాశ్చాత్యుల పరిశీలనా ప్రయోగాల వైజ్ఞానిక విధానాలను నరేంద్రుడు ఎంతగానో ప్రశంసించేవాడు. మనస్తత్త్వశాస్త్ర, ఆధ్యాత్మిక సత్యాలను పరీక్షించడంలో నరేంద్రుడు ఆ పాశ్చాత్య వైజ్ఞానిక ఆవిష్కరణాల, వైజ్ఞానిక విశ్లేషణా విధానాల తోడ్పాటును సదా తీసుకొనేవాడు.

అప్పటి నుండీ నరేంద్రుడు ఆ విధానాల ద్వారా శ్రీరామకృష్ణుల అసాధారణ అనుభూతులను విశ్లేషించ ప్రయత్నించసాగాడు. ఆ విధంగా ఏ అనుభూతులు ఆ విశ్లేషణకు నిలబడగలిగాయో వాటిని మాత్రమే సత్యాలుగా అంగీకరించి విశ్వాసంగా వాటిని అనుష్ఠించేవాడు. సత్యసాక్షాత్కారం అతడి హృదయం ఎంత తపిస్తున్నప్పటికీ అవసరంగా ఏదైనా చేయడం, భయంతో ఏదైనా గౌరవించడం నరేంద్రుడి స్వభావానికి పూర్తిగా విరుద్ధం. ఈ విషయం అనివార్యంగా నాస్తికవాదానికి దారితీసే పక్షంలో, నరేంద్రుడు నాస్తికతను అంగీకరించడానికి కూడా సిద్ధమయ్యాడు. ఈ మానవ జీవిత రహస్యాన్ని కనుగొనడానికి సత్యసాక్షాత్కారం పొందడానికి కేవల సాంసారిక సుఖభోగాలనే కాక తన ప్రాణాన్ని సైతం త్యజించడానికీ అతను తయారయ్యాడు.

కాబట్టి పరమసత్యాన్ని అన్వేషించడంలో దృష్టిని నిలిపి, పాశ్చాత్య చింతనాధోరణులను అధ్యయనం చేస్తూ వాటిలోని ఆరోగ్యకరమైన అంశాలను మాత్రమే స్వీకరించడంలో ప్రస్తుతం నరేంద్రుడు నిమగ్నుడయ్యాడు. ఆ పాశ్చాత్య భావ ప్రభావంలో వాదోపవాదాలకు లోనై అప్పుడప్పుడు వారి

విశ్వాసాలనే సరళమార్గాన్ని అతడు విడిచిపెట్టడం కూడా తటస్థించింది. అయినప్పటికీ అతడి అసాధారణమైన మేధాసంపత్తి, పట్టుదలదే పైచేయి అయింది; సత్యసాక్షాత్కారంలో అతడు కృతకృత్యుడు కావడానికి చివరికి అవి దోహదం చేశాయి. ఈ విషయాలేవీ సరిగా అర్థం చేసుకోలేని అనేకులు పాశ్చాత్య గ్రంథాలలోని అభిప్రాయాలను వివేచించకుండానే నరేంద్రుడు ఒంటపట్టించుకొంటున్నాడని పొరబడ్డారు. నరేంద్రుడు పాశ్చాత్య తత్త్వ పక్షపాతి అనే అభిప్రాయం అతడి మిత్రవర్గంలో ఎంత బలపడిందంటే, ఒక రోజు అతడు భగవద్గీతను పఠించి దానిని ఎంతో ప్రశంసించడాన్ని చూసి అతడి మిత్రులు నివ్వెరపోయి ఆ సమాచారాన్ని గురుదేవులకు తెలిపారు. అప్పుడు ఆయన, "కొందరు పాశ్చాత్య విద్వాంసులు గీతను ప్రశంసించడం చూసి అతడలా చేయలేదనుకొంటాను" అని చెప్పారు.

7. నరేంద్రుడి భగవద్విశ్వాసం చెక్కుచెదర లేదు

ఒక్క విషయం మాత్రం ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి. పాశ్చాత్య చింతనా ధోరణుల ప్రభావం అతడిలో గొప్ప విప్లవాన్ని తీసుకురావడానికి మునుపే నరేంద్రుడు శ్రీరామకృష్ణులను దర్శించాడు, కొన్ని అసాధారణ ఆధ్యాత్మిక అనుభూతులు పొందాడు కూడా. ఆ అనుభూతులను గురించి ఇంతకు మునుపే పాఠకులకు తెలిపివున్నాం. భగవంతుని ఉనికిపట్ల ప్రగాఢ విశ్వాసాన్ని అతడిలో పాదుగొల్పడానికి అవి దోహదం చేశాయన్న విషయం నిర్వివాదాంశం. లేకపోతే జగత్కారణుడైన భగవంతుడు అజ్ఞేయుడని వచించే పాశ్చాత్య భావాల, సిద్ధాంతాలలో మునిగి నరేంద్రుడు ఎంతదూరం కొట్టుకొనిపోయి ఉండేవాడో అంచనా వేయడం కష్టం. ఆ భావాలు భగవంతుని ఉనికి పట్ల నరేంద్రునికి గల విశ్వాసాన్ని, బలీయమైన అతడి గత ఆధ్యాత్మిక సంస్కారాల కారణంగా సమూలంగా నాశనం చేయలేకపోయినా, వాటి తాకిడి వలన అతడి భగవద్విశ్వాసం కొంతమేరకు సడలిపోయే ఆస్కారం ఉందనే చెప్పాల్సివస్తుంది. కాని విధి నిర్ణయం వేరుగా ఉంది. భగవత్సంకల్పంతో నరేంద్రుడు ఈ భువిలో జన్మించడం ఒక విశిష్ట కార్యసాధన కోసమే కదా! భగవదనుగ్రహంతో అతడు ఏ సద్గురువరేణ్యుల ఆశ్రయం పొందాడో ఆయనే పదేపదే ఇలా చెప్పేవారు: "ఆర్తితో చేసిన ప్రార్థనను భగవంతుడు తప్పక ఆలకిస్తాడు. మనం కూర్చుని ఎలా మాట్లాడుకొంటున్నామో, అంతకంటే సన్నిహితంగా ఆయనతో మాట్లాడవచ్చు, ఆయన పలుకులు వినవచ్చు, ఆయనను స్పృశించవచ్చునని నేను ప్రమాణం చేసి చెబుతున్నాను." మరో సందర్భంలో ఆయన, నరేంద్రుడితో ఇలా చెప్పారు: "సామాన్యంగా భగవంతుణ్ణే పూజించే రూపాలు,

భగవంతుడు ఇటువంటి వాడని ఆయనను గురించిన అభిప్రాయాలు మానవ కల్పితాలే కదా అని నువ్వు వాటిని స్వీకరించకపోయినా ఫరవాలేదు. కాని జగన్నియామకుడైన భగవంతుడు ఒకడు ఉన్నాడనే విశ్వాసం ఉంటే చాలు. అప్పుడు, 'ఓ దేవుడా, నువ్వు ఎటువంటి వాడివో నాకు తెలియదు; కాని ప్రభూ, దయచేసి నీ యథార్థ స్వరూపాన్ని నాకు అభివ్యక్తం చేయి' అని ఆర్తితో ప్రార్థిస్తే, తప్పకుండా ఆయన నీ మొరను ఆలకించి, నిన్ను అనుగ్రహిస్తాడు.''

శ్రీరామకృష్ణుల ఈ అభయవాణి నరేంద్రుడిలో సాధనల పట్ల ఇంతకు ముందెన్నడూ లేని అత్యుత్సాహాన్ని జనింప చేసిందని ప్రత్యేకంగా చెప్పడం అవసరం లేదేమో!

8. నరేంద్రుని సాధన

సుప్రసిద్ధ పాశ్చాత్య దార్శనికుడైన హామిల్టన్ తన దర్శన గ్రంథం ముగింపులో ఇలా వ్రాశాడు: ''జగన్నియామకుడైన భగవంతుడు ఒకడున్నాడనే సత్యాన్ని చూచాయగా మాత్రం తెల్పి ఊరకొంటుంది మానవుడి మేధస్సు. అంతేగాని ఆ భగవంతుని స్వరూపం ఏమిటో వ్యక్తం చేయడం దానికి సాధ్యం కాదు. కాబట్టి దర్శన శాస్త్రాలు ఇక్కడితో ఆగిపోతాయి. దర్శనాలు ఎక్కడ ఆగిపోతాయో ఆధ్యాత్మికత అక్కడ ప్రారంభమౌతుంది.'' హామిల్టన్ పై వచనాలు నరేంద్రుడికి ఎంతో నచ్చాయి. మాటల సందర్భంలో అనేకసార్లు అతడు వాటిని ఉదహరించేవాడు. సాధనలలో నిమగ్నుడైనప్పటికీ నరేంద్రుడు తత్త్వశాస్త్ర అధ్యయనాన్ని విరమించలేదు. తన సమయాన్ని సంగీతం, ధ్యానం, అధ్యయనంలో గడపసాగాడు.

9. ధ్యానాభ్యాసం పట్ల నరేంద్రుడి అభిలాష

అప్పటి నుండి నరేంద్రుడు ఒక నూతన విధానంలో ధ్యానం అభ్యసించసాగాడు. భగవంతుణ్ణి సాకారునిగా లేదా నిరాకారునిగా - ఎలా భావించినా సరే - మానవ భావాలను ఆరోపించే ఆయనను భావించక తప్పదు; ఈ విషయం ఇంతకు మునుపే తెలిపాం. ఈ విషయం అవగతం చేసుకోవడానికి మునుపు నరేంద్రుడు బ్రహ్మసమాజం నిర్దేశించిన తీరులో భగవంతుణ్ణి నిరాకార సగుణునిగా ఉపాసించేవాడు. కాని అదికూడా ఒక రకంగా మానవ భావమే అని ఇప్పుడు గ్రహించి ఆ పద్ధతిని విడిచిపెట్టాడు. ఇప్పటి నుండి, ''హే భగవాన్, నీ యథార్థ స్వరూపాన్ని దర్శించే యోగ్యతను నాకు ప్రసాదించు'' అని ప్రార్థిస్తూ, మనస్సును ఆలోచనారహితం చేసి, దానిని గాలి వీచని చోట ఉన్న దీపశిఖలా నిశ్చలంగా ఉంచడానికి ప్రయత్నించసాగాడు. మొదటి నుండి అతడి మనస్సు కట్టుబాటులో ఉండడం వలన ఒకింత కాలం ఈ విధంగా అభ్యాసం చేశాడో

లేదో అతడి మనస్సు ఎంత తన్మయం చెందేదంటే అప్పుడప్పుడు అతడిలో దేహస్మృతి, కాల స్ఫురణ అదృశ్యమైపోయేవంటే అతిశయోక్తి కాదు. ఇంట్లో అంతా నిద్రకు ఉపక్రమించిన తరువాత, అతడు తన గదిలో ధ్యానానికి కూర్చునేవాడు; అనేక సందర్భాలలో ఆ ధ్యానం రాత్రంతా కొనసాగడం కద్దు.

పై ధ్యానాభ్యాస ఫలితంగా నరేంద్రుడికి ఒక రోజు అద్భుత దర్శనం ఒకటి కలిగింది. మాటల సందర్భంలో ఆ దర్శనం గురించి మాకు ఇలా వర్ణించి

10. బుద్ధుని దర్శనం కలగడం

చెప్పాడు: ''మనస్సును నిశ్చలమూ ఆలోచనారహితమూ చేయగానే దానిలో ప్రశాంత పరమానంద వాహిని ప్రవహించేది. ధ్యానానంతరం సైతం దాని ప్రభావం వలన ఒక రకమైన మత్తు చాలా సేపటి వరకూ నాలో ఉండిపోవడం కద్దు. కాబట్టి కూర్చున్న చోటు నుండి వెంటనే లేవాలని నాకు అనిపించేది కాదు.

''ఒక రోజు ధ్యానం ముగించి అలా కూర్చుని ఉన్నప్పుడు దివ్య తేజస్సుతో గదినంతా దేదీప్యమానం చేస్తూ ఒక అపూర్వ సన్న్యాసమూర్తి ఎక్కడ నుండో హఠాత్తుగా వచ్చి నా ముందు, కాస్త దూరంలో నిలబడ్డాడు. ఆయన కాషాయాంబరాలు ధరించి, చేత కమండలం పుచ్చుకొని ఉన్నాడు. ఆయన వదనం అనిర్వచనీయమైన ప్రశాంతతకు ఆలవాలమై ఉంది; సమస్త విషయాల పట్ల కానవచ్చే నిర్లిప్తత వైఖరి నుండి జనించిన ఆయన అంతర్ముఖత్వం నన్నెంతో విస్మయుణ్ణి చేసి, ఆకట్టుకొంది. ఏదో చెప్పదలచుకొన్నట్లుగా నా వైపే తదేకంగా చూస్తూ ఆ మూర్తి నా వైపు మెల్లగా అడుగులు వేశాడు. అప్పుడు నే నెంతో భయపడ్డాను, స్థిరంగా ఉండలేకపోయాను. వెంటనే ఆసనం మీద నుండి లేచి గది తలుపు తెరిచి గబగబా బయటకు వెళ్లిపోయాను. మరుక్షణమే 'ఎందుకు అంత భయపడ్డాను?' అనుకొన్నాను. ధైర్యం తెచ్చుకొని ఆ సన్న్యాసి చెప్పగోరుతున్నదేదో వినాలనే ఉద్దేశంతో మళ్లీ గదిలోకి వెళ్లాను. కాని ఆయన కనిపించలేదు. గదిలో చాలాసేపు ఎదురు చూశాను కాని ఫలితం లేకపోయింది. ఆయన మాటలు వినకుండా అలా పారిపోవాలనే మూర్ఖత్వం నా కెందుకు కలిగిందా అనుకొంటూ పశ్చాత్తాపంతో కుంగిపోయాను. నేను అనేకమంది సన్న్యాసులను చూశాను కాని అటువంటి అద్భుత ముఖవైఖరి ఎన్నడూ ఎవరిలోను చూడలేదు. ఆ ముఖారవిందం నా హృదయంలో పాదుకుపోయింది. అది నా భ్రమ కావచ్చునేమోగాని, ఆ నాడు నేను భాగ్యవశాత్తు చూసిన ఆ మూర్తి బుద్ధభగవానుడేనని నా దృఢ నమ్మకం.''

8.ii. జీవితంలోను, శ్రీరామకృష్ణుల వద్దా నరేంద్రుని శిక్షణ

నరేంద్రుడు ఏకాంతవాసంలోను, అధ్యయనంలోను, జపతపాదులలోను, దక్షిణేశ్వరానికి వెళ్లివస్తూండడంలోను కాలం గడపసాగాడు. కుమారుని భవిష్యత్తు గురించి యోచించి నరేంద్రుడి తండ్రి అతణ్ణి న్యాయవాద వృత్తిని నేర్చుకోవడానికి ఆ కాలంలో కలకత్తాలో సుప్రసిద్ధ న్యాయవాదియైన నిమాయ్ చరణ్ బసు వద్ద నియుక్తుణ్ణి చేశాడు. లౌకిక జీవితంలో కుమారుణ్ణి స్థిరపరచి, అతడికి వివాహం చేయగోరి వధువుకోసం వెతకసాగాడు. కాని వివాహం చేసుకోనని నరేంద్రుడు భీష్మించుకొని కూర్చోవడంతోనూ, యుక్తమైన వధువు లభించక పోవడం తోనూ నరేంద్రుని వివాహ ప్రయత్నాలు ఆలస్యం కాసాగాయి.

1. నరేంద్రుడు న్యాయవాద వృత్తిలో శిక్షణ పొందడం

శ్రీరామకృష్ణులు ఎప్పుడన్నా రాంతను వీథిలోని నరేంద్రుడు అధ్యయనం చేసే గదికి వచ్చి సాధనను గురించి అతడికి వివిధ ఉపదేశాలు ఇచ్చేవారు. తల్లి తండ్రుల శోకపూరిత ప్రోద్బలానికి తలవొగ్గి వివాహ బంధంలో ఇరుక్కోకూడదనే ఉద్దేశంతో కఠోర బ్రహ్మచర్యాన్ని పాటించమని ఆయన నరేంద్రుణ్ణి ఉత్తేజపరచడం కద్దు. శ్రీరామకృష్ణులు అతడికి ఇలా చెప్పేవారు: ''పన్నెండేళ్ల అవిచ్ఛిన్న బ్రహ్మచర్యం పాటించిన వ్యక్తిలో 'మేధానాడి' తెరచుకొంటుంది. అప్పుడు అతడి బుద్ధి అతిసూక్ష్మతత్త్వాలలోకి చొచ్చుకొనిపోయి, వాటిని ఆకళింపు చేసుకోగలుగుతుంది; అటువంటి బుద్ధి సహాయంతో మాత్రమే భగవత్సాక్షాత్కారం లభిస్తుంది. అటువంటి శుద్ధబుద్ధికి మాత్రమే భగవంతుడు తనను వ్యక్తపరచుకొంటాడు.''

2. జీవితాంతం బ్రహ్మచర్యం పాటించాలన్న నరేంద్రుని తీర్మానం

3. సన్న్యాసి కావాలనే అతడి అభిలాష

శ్రీరామకృష్ణులతో గల సన్నిహిత సాంగత్యం కారణంగానే నరేంద్రుడు వివాహానికి అంగీకరించడం లేదని అతడి ఇంట్లోని స్త్రీజనం అభిప్రాయపడ సాగారు. దీనిని గురించి నరేంద్రుడు ఇలా చెప్పాడు: ''ఒక రోజు శ్రీరామకృష్ణులు నేను చదువుకొంటున్న గదికి వచ్చి జీవితాంతం బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించమని నాకు ఉపదేశిస్తూండగా, బయటినుండి మా నాయనమ్మ అంతా విని, నా తల్లితండ్రులకు ఆ విషయం చెప్పేసింది. ఒక సాధువుతో కలసిమెలసి ఉండడం వలన నే నెక్కడ సన్న్యాసినై పోతానేమోనని, ఆ నాటి నుండి నా వివాహం కోసం విశ్వప్రయత్నాలు చేయ సాగారు. అయినా ఏం ప్రయోజనం? శ్రీరామకృష్ణుల దృఢసంకల్పం ముందు ఆ ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయాయి. అయినా అంతా నిశ్చయమైపోయిన తరు వాత కూడా ఏవో కొన్ని అల్ప విషయాలలో అభిప్రాయభేదాలు తలెత్తడంతో వివాహాలు ఆగిపోవడం మనం చూస్తున్నాం కదా!''

4. యథాప్రకారం శ్రీరామకృష్ణులను నరేంద్రుడు దర్శిస్తూనే ఉండడం

నరేంద్రుడు తరచు దక్షిణేశ్వరానికి వెళ్లి శ్రీరామకృష్ణులను ఆ విధంగా దర్శిస్తూ ఉండడం ఇంట్లో ఎవరికీ నచ్చకపోయినా, ఆ విషయం గురించి అత డితో మాట్లాడడానికి ఎవరూ సాహసించలేదు. తల్లి తండ్రులకు అల్లారుముద్దు బిడ్డడైన నరేంద్రుడు తన ప్రవర్తన పట్ల ఎవరైనా ప్రతిబంధకం కల్పిస్తే, ఏమాత్రం లక్షించేవాడు కాడు; ప్రతి విషయంలోను తన ఇచ్ఛమేరకే ప్రవర్తించడం నరేంద్రుడికి పరిపాటి. ఒక బాలుణ్ణే లేదా దుర్బల మనస్కుడైన యువకుణ్ణే మందలించి అరికట్టేటట్లు వివేకవంతుడైన నరేంద్రుణ్ణే అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తే తత్ఫలితం తాము ఆశించినదానికి పూర్తిగా విరుద్ధంగా ఉంటుందని ఇంట్లోని వారందరికీ బాగా తెలుసు. కాబట్టి నరేంద్రుడు నిరా టంకంగా ముందు మాదిరే దక్షిణేశ్వరానికి వెళ్లి శ్రీరామకృష్ణులను దర్శించి రావడంలో ఎలాంటి మార్పు ఏర్పడలేదు.

5. శ్రీరామకృష్ణులతో తన సమయాన్ని నరేంద్రుడు గడిపిన తీరు

ఈ కాలఘట్టంలో దక్షిణేశ్వరం వద్ద శ్రీరామకృష్ణులతో గడిపిన రోజుల మధుర స్మృతులు నరేంద్రుణ్ణే జీవితపర్యంతం పరమానందంలో ముంచివేశా యనడం అతిశయోక్తి కాదు. ఆ విషయంగా నరేంద్రుడు ఇలా చెప్పేవాడు: ''శ్రీరామకృష్ణులతో ఎంత పరమా నందభరితుడనై నేను ఆ రోజులు గడిపానో ఇతరులకు వర్ణించి చెప్పడం అసాధ్యం. ఆటపాటల, హాస్యవినోదాల, చిన్ని దైనందిన సంఘ టనల ద్వారా నిరంతరం ఉన్నత ఆధ్యాత్మిక తత్వాలను మాకు బోధిస్తూ, మాకు ఏమాత్రం తెలియకుండా మా జీవితాలను తదనుగుణంగా ఆయన

[illegible]

చేస్తున్నప్పుడు, తమ గురువులైన తోతాపురి ఏం ఉపదేశం చేశారో దాన్ని గుర్తుకు తెచ్చుకొని, నా భ్రూమధ్యంలో తమ గోటితో బాగా గీరి, ఆ నొప్పి మీద మనస్సును ఏకాగ్రం చేయమని ఆయన నన్ను ఆదేశించారు. నిజానికి ఇష్టమొచ్చినంతసేపు ఆ నొప్పి మీద ఒకే రీతిగా మనస్సును కేంద్రీకరించగలి గాను; తత్ఫలితంగా నా శరీరంలోని తక్కిన భాగాల ఉనికే నాకు స్ఫురించలేదు సరికదా, వాటివల్ల మనస్సుకు ఎలాంటి అవరోధమూ ఏర్పడలేదు.

''గురుదేవులు సాధనలు చేసిన పంచవటి నిర్జన ప్రాంతం కావడం వలన ఆ చోటు మా ధ్యానసాధనాదుల కెంతో అనుకూలమై అమరింది. ఆధ్యాత్మిక సాధనలకు మాత్రమేనని ఎందుకు చెప్పాలి? మేం అక్కడ ఆటపాటల వినోదాలతో ఎంతో సమయం గడిపివున్నాం. అటువంటి సందర్భాలలో శ్రీరామకృష్ణులు కూడా మాతో జతకలిపి మా ఆనందాన్ని ఇనుమడింప చేసేవారు. మేం పరుగులు తీసేవారం, చెట్లు ఎక్కేవారం, మాధవీలతల ఉయ్యాలలో ఊగేవారం; కొన్ని సందర్భాలలో అక్కడే వనభోజనాలు చేసేవారం. అటువంటి ఒక సందర్భంలో స్వహస్తాలతో నేను వండిన వంటకాలను స్వయంగా శ్రీరామకృష్ణులు ఆరగించారు. బ్రాహ్మణేతరులు వండిన వంటకాలను ఆయన భుజించరని నాకు తెలుసు. కాబట్టే ఆలయ నైవేద్యాన్ని ఆయనకోసం ఏర్పాటు చేద్దామనుకొన్నాను. కాని అలా చేయవద్దని నన్ను వారించి, ''సత్వగుణ సంపన్నుడవైన నీ వంటి వ్యక్తి వండిన భోజనం తిన్నా నా కేమీ కాదు'' అని చెప్పారు. పదేపదే నేను వద్దంటూవున్నా ఆయన నా విన్నపాలు పట్టించుకో కుండా, నేను వండిన భోజనం ఆరగించారు.''

6. భవనాథ్ ప్రభృత నరేంద్రుని బారానగర మిత్రులు

భవనాథ్ ఛట్టోపాధ్యాయ అనే వ్యక్తి భక్తుడే కాక అందగాడు కూడా. ఒకింత కాలంగా అతడు దక్షిణేశ్వరానికి వస్తూ శ్రీరామకృష్ణులను దర్శించుకో సాగాడు. భక్తి, విశ్వాసం, వినయవిధేయతలు, సరళత్వం వంటి సుగుణాలు సంతరించుకొన్న కారణంగా అతడు శ్రీరామకృష్ణులకు ప్రీతిపాత్రుడయ్యాడు. అతడికి నరేంద్రునితో పరిచయమై, మెల్లగా ఆ పరిచయం స్నేహంగా మారింది. అతడికి గల స్త్రీలవంటి కోమలత్వాన్ని, నరేంద్రుని పట్ల అతడికి ఉన్న అసాధారణ ప్రేమను చూసి శ్రీరామకృష్ణులు కొన్ని సమయాలలో, ''బహుశా పూర్వ జన్మలో నువ్వు నరేంద్రుడి భార్యవై ఉండి ఉంటావు'' అని ఎగతాళిగా అనే వారు. భవనాథ్ బారానగరంలో ఉండేవాడు. అవకాశం దొరికినప్పుడల్లా నరేంద్రుణ్ణి భోజనానికి తన ఇంటికి తోడ్కొని వెళ్లేవాడు. భవనాథ్ పొరుగింటి వాడైన సత్కారి లాహరికి కూడా నరేంద్రుడితో బాగా పరిచయం ఉంది; అలాగే

దాశరథి సన్యాల్, నరేంద్రుడి సహాధ్యాయి, మిత్రుడు. నరేంద్రుడికి తీరిక దొరికినప్పుడు ఈ మిత్రులందరూ రాత్రింబవళ్లు అతడితో గడపడం కద్దు. కాబట్టి అప్పుడప్పుడు దక్షిణేశ్వరానికి వెళ్లిన రోజులలోనో లేదా ప్రత్యేక సందర్భాలలో వారి ఆహ్వానాన్ని పురస్కరించుకొనో ఈ బారానగర మిత్రులతో కొంత సమయం గడపడం నరేంద్రుడికి పరిపాటి.

7. నరేంద్రుని తండ్రి హఠాన్మరణం

1884వ సం॥ తొలికాలంలో, బి.ఏ. పరీక్షా ఫలితాలు వెలువడడానికి కొద్దికాలం మునుపు సాఫీగా సాగిపోతున్న నరేంద్రుని జీవితంపై అశనిపాతం పడ్డది. ఆతడి తండ్రియైన విశ్వనాథ్ దత్తకు అంతకు ముందు పని ఒత్తిడి కారణంగా నాడీవ్యవస్థ దెబ్బతింది. ఒకరోజు రాత్రి దాదాపు పదిగంటలప్పుడు ఆయన హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు. మిత్రుల ఆహ్వానం మేరకు నాటి మధ్యాహ్నం నరేంద్రుడు బారానగర్‌కు వెళ్లి, రాత్రి పదకొండు గంటల దాకా భక్తిగీతాలు ఆలాపిస్తూ అక్కడే గడిపాడు. తరువాత భోజనంచేసి, మిత్రులతో మాట్లాడుతూ పడుకొన్నాడు. తెల్లవారుజాము రెండు గంటలప్పుడు అతడి మిత్రుడైన హేమాలి అక్కడకు వచ్చి తండ్రి ఆకస్మిక మరణవార్తను నరేంద్రునికి చేరవేశాడు. వెంటనే నరేంద్రుడు ఇంటికి బయలుదేరాడు.

8. నరేంద్రుని లౌకిక పరిస్థితులలో శోచనీయ మార్పు

నరేంద్రుడు ఇంటికి వెళ్లి తండ్రి అంత్యక్రియలు యథావిధిగా పూర్తి చేశాడు. ఆ తరువాత వాకబు చేయగా కుటుంబ ఆర్థిక పరిస్థితులు కడు శోచనీయ స్థితిలో ఉన్నట్లు నరేంద్రుడికి తెలియవచ్చింది. సంపాదనకంటే అధికంగా ఖర్చు పెట్టడం వలన ఆస్తిపాస్తులు మిగలకపోగా, అప్పులు మాత్రం మిగిల్చిపోయాడు నరేంద్రుని తండ్రి. నరేంద్రుని తండ్రి సహాయంతో వాళ్ల బంధువులు తమ ఆర్థిక పరిస్థితులను ఎంతో మెరుగుపరచుకొన్నారు. అందుకు నరేంద్రుని కుటుంబం పట్ల కృతజ్ఞతగా ఉండడానికి బదులు, అప్పటి ఆ కుటుంబ నిస్సహాయ పరిస్థితిని ఎరగా చేసుకొని స్వార్థలాభం పొందగోరారు. వాళ్ళ శత్రుత్వంపూని నరేంద్రుని కుటుంబాన్ని ఇంటి నుండి పారద్రోల కుట్రకూడా పన్నారు. పైసా ఆదాయం లేకపోయినా ఆ ఇక్కట్లో అయిదారు మందిని పోషించవలసి వచ్చింది. ఉన్నత జీవన ప్రమాణాలతో పెరిగి పెద్దవాడైన నరేంద్రు డప్పుడు నిస్సహాయ స్థితిలో పడిపోయాడు. కుటుంబాన్ని పోషించడానికి ఏం చేయాలో అతడికి పాలుపోలేదు. ఉద్యోగార్థం గడపలెక్కసాగాడు గాని, ప్రతిచోట చుక్కే ఎదురైంది. దుర్దశ దాపురించినప్పుడు మనిషి చేసే శతకోటి ప్రయత్నాలూ విఫలమే అవుతాయన్నది ముమ్మాటికీ సత్యం. తండ్రి మరణించాక

మూడు నాలుగు నెలలు భారంగా గడిచిపోయాయి; కాని పేదరికం, అనిశ్చయం అనే కారుమబ్బులు క్రమ్ముకొన్న నరేంద్రుని జీవిత ఆకాశంలో ఒక్క ఆశాకిరణమైన పొడచూపలేదు. మళ్లీ అతడెప్పుడైనా అటువంటి గాఢాంధకార జీవితాన్ని చవిచూసి ఉంటాడా అన్నది సందేహమే! ఆ కాల ఘట్టాన్ని గురించి మాట్లాడుతూ అతడు కొన్ని సమయాలలో మాతో ఇలా చెప్పేవాడు:

9. ఆ దుర్దశ ఘట్టన

''మైల గడువు పూర్తికాక మునుపే నేను అక్కడా ఇక్కడా ఉద్యోగం కోసం తిరుగాడాను. పస్తు కడుపుతో, ఉత్త కాళ్లతో ఉద్యోగం కోసం దరఖాస్తు చేతపుచ్చుకొని మధ్యాహ్నపు మండుటెండలో కార్యాలయం నుండి కార్యాలయానికి తిరుగాడాను. ఆప్త మిత్రులు కొందరు సానుభూతితో కొన్ని రోజులు నాతోనే ఉండేవారు, కాని కొన్ని రోజులు నాతో ఉండలేకపోయేవారు. కాని ప్రతిచోట నాకు నిరాశా నిస్పృహలే ఎదురైనాయి. ఆ కఠోర లౌకిక వాస్తవాల ప్రప్రథమ అనుభవంతో నిస్వార్థసానుభూతి ఎంతో అరుదైనదనీ, దుర్బలులకూ పేదలకూ ఇక్కడ స్థానంలేదనీ నాకు బాగా అర్థమైంది. ఇదివరలో ఒకటి రెండు రోజులు నాకు సహాయం చేసినందుకు తాము కృతార్థులమైనట్లు భావించిన వారిప్పుడు అందుకు విరుద్ధంగా చేయడమే సబబని భావించసాగారు. సహాయం చేయగల స్థితిలో ఉండికూడా వాళ్లు నా పట్ల పెడమొఖం చూపసాగారు. అటువంటి చేదు అనుభవాలు చవిచూసేకొద్దీ, ఈ లోకం ఒక రాక్షసుని సృష్టిగా నాకు అనిపించేది. ఒక రోజు మిట్టమధ్యాహ్నం మండుటెండలో తిరిగి తిరిగి పాదాలు బొబ్బలెక్కాయి; అలసిసొలసిపోయి మైదానంలోని 'ఒక్‌టెర్లోని' స్మారకచిహ్న కట్టడం నీడలో విశ్రమించాను. ఆ రోజు ఒకరిద్దరు మిత్రులు నాతోపాటు ఉన్నారు. లేదా అనుకోకుండా అక్కడ కలుసుకోవడమో జరిగింది. నన్ను అనునయించడానికి కాబోలు వారిలో ఒకడు, ''కృపాళువైన బ్రహ్మ శ్వాస అనే పిల్లవాయువు వీచసాగింది....'' అనే పాట పాడసాగాడు. ఆ పాట వినగానే అతడు నా తలమీద గట్టిదెబ్బలు కొడుతున్నట్లు భావించాను. నా తల్లి, తమ్ముల నిస్సహాయస్థితి గుర్తుకు వచ్చి, అవమానంతో నిరాశ నిస్పృహలు ముప్పిరిగొనగా, 'నోరుముయ్యి, ఎవరికి ఆకలి బాధతో అలమటించే అవసరంలేదో అటువంటి భాగ్యవంతులకు ఈ కల్పనలు మధురంగా కానరావచ్చు. ఒకప్పుడు నాకూ అలాగే అనిపించేది. కాని ఇప్పుడు కఠోర వాస్తవాలు ఎదురైనప్పుడు ఆ కల్పనలు అపహాస్యంగా తోస్తున్నాయి' అంటూ అరచాను.

''నా మాటలు విని ఆ మిత్రుడు ఎంతో నొచ్చుకొన్నాడేమో! కాని ఎంతటి కటిక దారిద్ర్యం అనుభవిస్తూవుంటే ఆ మాటలు నా నోట వెలువడి ఉంటాయో అతడి కెలా అర్థమౌతుంది? ఒక్కొక్కరోజు నిద్రలేచి రహస్యంగా ఆరాతీయగా ఇంట్లో అందరికీ చాలి నంత ఆహారం లేకపోవడం తెలుసుకొని, చేత చిల్లిగవ్వ లేకపోవడంతో, 'ఒక మిత్రుడు భోజనానికి తన ఇంటికి ఆహ్వానించా'డని అమ్మతో చెప్పి, బయ టకు వెళ్లిపోయేవాణ్ణి. అటువంటి సందర్భాలలో ఒక్కొక్కప్పుడు ఏదో కించిత్తు తినేవాణ్ణి; కొన్ని రోజులు ఇంట్లోని తక్కినవారికి సరిపడే ఆహారం ఉంటుందనే ఉద్దేశంతో పస్తులతోనే గడిపేవాణ్ణి. ఇంట్లో వారికి లేదా బయటి వారికి ఈ విషయాలు తెలుపడానికి అభిమానం అడ్డుపడేది. ఇంతకు ముందు మాదిరే సంపన్నులైన మిత్రులు తమ ఇళ్లకు లేదా ఉద్యానాలకు వచ్చి నా పాటలతో తమ ఆనందాన్ని ఇనుమడింపచేయమని కోరేవారు. వారి కోర్కెను తిరస్కరించలేక, కొన్ని సమయాలలో వారితోబాటు వెళ్లి, నా పాటలతో వారిని సంతోషపరచేవాణ్ణి. కాని నా మనస్సులోని భావాలను వారికి వ్యక్త పరచాలని అభిలషించేవాణ్ణి కాను. నా పరిస్థితి గురించి తమకు తాముగా వారెన్నడు విచారించేవారు కాదు. ఏ ఒకరిద్దరో అప్పుడప్పుడు ఆప్యాయంగా, 'ఈ రోజు నువ్వెందుకు నిరుత్సాహంగా, బలహీనంగా కనిపిస్తున్నావు? కారణం ఏమిటో దయచేసి చెప్పు' అని అడిగేవారు. వారిలో ఒక మిత్రుడు, ఇంకొక మిత్రుడి ద్వారా నా పరిస్థితి తెలుసుకొని, అజ్ఞాతంగా మా అమ్మకు ఉత్తరాలు వ్రాస్తూ డబ్బు పంపసాగాడు. ఈ విధంగా అతడు నన్ను శాశ్వత ఋణబద్ధుణ్ణి చేసివేశాడు.

10. కటిక దారిద్ర్యం

''యవ్వనంలో నైతికతను కోల్పోయి మోసంతో ధనమార్జిస్తూన్న కొందరు నా బాల్యమిత్రులు నా దారిద్ర్యావస్థను గురించి తెలుసుకొని, ఇదే అదనుగా నన్ను తమతో కలుపుకోవాలని ప్రయత్నించ సాగారు. కాని నా మాదిరి దురదృష్టవశాత్తు అభాగ్యులై మోసంతో జీవనం సాగిస్తూన్న కొందరు మాత్రం నా పరిస్థితికి నిజంగానే బాధ పడడం నేను గుర్తించాను.

11. స్త్రీల ప్రలోభం

''ఇక 'మహామాయ' కూడా నా విషయంలో వెనుకంజవేయలేదు. నన్ను ప్రలోభంలో మునిగిపోయేలా చేయడానికి ఆమెకూ ఇదే చక్కని అదను. చాలాకాలం నుంచి ఒక సంపన్నురాలికి నా మీద ఒక కన్ను ఉంది. తనతోపాటు తన యావదాస్తులనూ పరిగ్రహించి నా దారిద్ర్యాన్ని రూపుమాపుకోమని ఆమె ఒక ప్రతిపాదనను పంపింది. అసహ్యంతో నిష్కర్షగా ఆమె ప్రతిపాదనను

తిరస్కరించాను. ఇది జరిగిన కొద్ది రోజులకే మరొక స్త్రీ ఇదే విధంగా ఆకర్షిస్తూ నా వద్దకు వచ్చింది. ఆమెతో ఇలా అన్నాను: ''అమ్మా, ఈ నిరర్థక శరీర సుఖం నిమిత్తం ఎన్నెన్ని పాపాలకు ఒడిగట్టావో కదా! మృత్యువు సమీపంలోనే ఉంది. ఆ రోజుకు తగిన సన్నాహాలు ఏవన్నా చేసివుంచావా? ఈ నిమ్నత్వాన్ని వీడి, భగవంతుణ్ణే ప్రార్థించు.''

''అటువంటి కటిక దారిద్ర్యంతో బాధపడుతున్నప్పటికీ భగవంతుని ఉనికిపట్ల నాకున్న విశ్వాసం సడలిపోలేదు, 'దేవుడు మంచివాడు' కాదనీ సందేహించనూ లేదు. తెల్లవారగానే నిద్ర నుండి మేల్కొని భగవన్నామాన్ని స్మరిస్తూ పడకనుండి లేచేవాణ్ణి. ఆ తరువాత దృఢనిశ్చయంతో, గంపెడాశతో ఉద్యోగ అన్వేషణకై బయలుదేరేవాణ్ణి. ఈ అలవాటు ప్రకారం ఒక రోజు భగవన్నామాన్ని స్మరిస్తూ నేను పడకనుండి లేవబోతూండగా, మా అమ్మ నా పలుకులు ప్రక్క గదినుండి విని హఠాత్తుగా ఇలా అంది: 'ఆపరా, ఆపు! చిన్నప్పటి నుండి నువ్వు దేవుడు దేవుడని అఘోరిస్తున్నావే! మరి ఆ దేవుడు నీకు ఏం చేసిపెట్టాడు?' అమ్మ ఈ మాటలు నన్ను అమితంగా గాయపరిచాయి. బాధతో సతమతమౌతూ నాలోనే నిలా అనుకొన్నాను: 'దేవుడు నిజంగానే ఉన్నాడా? అలా ఉండివుంటే మనిషి శోకమయ ప్రార్థనను ఆలకిస్తాడా? ఆలకించేవాడే అయితే నే నింతగా ప్రార్థిస్తున్నా ఆయననుండి ఎలాంటి స్పందనా ఎందుకు రావడంలేదు? కృపాళువైన ఆయన సృష్టిలో ఇంత బాధలు ఎందుకున్నాయి? పరమానందమే మూర్తీభవించిన భగవంతుని రాజ్యంలో ఇంత ఘోరదుర్ఘటనలు, దుఃఖాలు ఎందుకు సంభవిస్తున్నాయి?' ఇతరుల కష్టాలు చూసి బాధపడ్డ విద్యాసాగర్, 'నిజంగా దేవుడు దయామయుడూ, మంగళమయుడూ అయితే లక్షలాది జనం కరువుకాటకాల వాతబడి, నాలుగు మెతుకులు దొరక్క చావడం ఎందుకు?' అన్న మాటలు నా చెవుల్లో మార్మోగాయి. గాయపడ్డ భక్తి భావన నా హృదయాన్ని తొలిచివేసింది; భగవంతుని ఉనికిపట్ల సంశయం నా మనస్సును ఆక్రమించింది.

12. తల్లి మందలింపు

''దేనినైనా రహస్యంగా చేయడం నా స్వభావానికి విరుద్ధం. చిన్నతనం నుండి భయపడిగాని, మరో కారణం వలన గాని నా ఆలోచనలను దాచుకొనే అలవాటు నాకు లేదు. నన్ను ఆవహించిన ఆ భావోద్వేగంలో భగవంతుడు లేడనీ, ఒకవేళ ఉన్నా ఆయనను ప్రార్థించడం వృథా కనుక ఆ అవసరం లేదనీ ప్రజల ముందు కెళ్లి నేను ఋజువుపరచడానికి ప్రయత్నించడంలో ఎలాంటి

13. గాయపడిన అభిమానం కారణంగా నాస్తికత్వం జనించడం

ఆశ్చర్యమూ లేదు. దీని పర్యవసానంగా నే నొక నాస్తికుణ్ణయ్యాననీ, దుష్టులతో సహవాసం చేస్తున్నాననీ, త్రాగుడికీ, వేశ్యాగృహాలకు వెళ్లడానికి సైతమూ వెను కంజ వేయడం లేదనీ ఒక పుకారు బయలుదేరింది. ఆ అసత్య ప్రచారం విని చిన్ననాటి నుండే మరీ మృదువు కాని నా గుండె మరింత కర్కశమైంది. ఫలితంగా అడగని వారిని సైతం పిలిచి, 'దుఃఖభూయిష్ఠమైన ఈ సంసారంలో తమ కష్టాలను క్షణికంగానైనా మరచిపోవడంకోసం ఎవరైనా మధువు గ్రోలీ, వేశ్యాగృహాలకు వెళ్లీ తాను సుఖపడుతున్నానని నిజంగా భావిస్తే నా కెలాంటి అభ్యంతరమూ లేదు. పైగా వారి మాదిరిగా సుఖపడగలుగుతానని నిస్సందేహంగా నమ్మిననాడు నేనుకూడా అలా చేయడానికి వెనుకాడను' అని బహిరంగంగా ప్రకటించసాగాను.

14. నరేంద్రుని శీలం పట్ల శ్రీరామకృష్ణుల విశ్వాసం

''వార్తలు వాయువేగంతో పయనిస్తాయి. నా ఈ మాటలు వికృతరూపం దాల్చి దక్షిణేశ్వరంలోని శ్రీరామకృష్ణులకూ, అలాగే కలకత్తాలోని భక్తులకూ చేరడానికి ఎంతో సమయం పట్టలేదు. నా యథార్థ పరిస్థితిని నిర్ధారణ చేసుకోవడానికి కొందరు నన్ను చూడడానికి వచ్చారు. వీరు నా గురించి ప్రచారంలోకి వచ్చిన వార్తలను కొంతలోకొంత నమ్ముతున్నామని సూచనలతో నాకు తెలియచేశారు. నే నంతగా దిగజారిపోయానని వారు నమ్ముతున్నారని తెలుసుకోగానే నా హృదయం ఎంతో గాయపడింది; అది నన్ను దైవ వ్యతిరేక ప్రచారానికి పురిగొల్పింది. శిక్షిస్తాడనే భయంతో భగవంతుడు ఉన్నాడని అంగీకరించడం మహాదౌర్బల్యం అని ఋజువుపరచ ప్రయత్నించాను. హ్యూం, మిల్, బెస్, కోమ్టే మొదలైన పాశ్చాత్య తత్వవేత్తలను ఉదాహరిస్తూ, అసలు భగవంతుని ఉనికికి ఎలాంటి ఋజువూ లేదని వారితో ప్రచండంగా వాదించ నారంభించాను. పర్యవసానంగా నేను పతనమైపోయాననే వారి అభిప్రాయం మరింత రూఢియైంది. వీరి ముఖతా ఈ విషయం విని శ్రీరామకృష్ణులు కూడా బహుశా నమ్ముతారని అనుకొని నేను సంతోషించాను. అలా ఊహించుకొన్న తక్షణం నా హృదయం గాయపడ్డ భావంనుండి జనించిన విషాద భావనతో నిండిపోయింది. 'గురుదేవులు నన్ను గురించి ఏమైనా అనుకోగాక! మనుషుల మంచి చెడు అభిప్రాయాలకు అసలు ఏ విలువా లేనప్పుడు వారు ఏం అనుకొన్నా నాకు ఒరగబోయేది ఏమీ లేదు' అనే నిర్ణయానికి వచ్చాను.

''కాని జరిగింది ఏమిటో ఆ తరువాత విని ఆశ్చర్యచకితుడనయ్యాను. ఆ భక్తుల నుండి నన్ను గురించి విని అవును, కాదు అని ఏమీ చెప్పకుండానే శ్రీరామకృష్ణులు ఊరకనే ఉండిపోయారట. కాని భవనాథ్ విలపిస్తూ,

'మహాశయా, నరేంద్రుడు ఇంతగా దిగజారిపోతాడని కలలో సైతం ఊహించలేదు' అని చెప్పినప్పుడు, ఆయన ఉద్రిక్తులై, 'నోరు మూసుకో! నరేంద్రుడు ఎన్నటికీ ఆ విధంగా దిగజారడని అమ్మ నాకు చెప్పింది. మళ్లీ ఇలాంటి మాటలు చెప్పావో, జాగ్రత్త నీ ముఖంకూడా చూడను' అని అన్నారు.

''అయినా గర్వాహంకారాలతో నాస్తిక భావాన్ని అలా ఎంత పెంపొందించుకోదలచినా ఏం ప్రయోజనం? చిన్ననాటి నుండీ, ప్రత్యేకించి శ్రీరామకృష్ణులను దర్శించుకొన్నప్పటి నుండీ నాకు కలిగిన అసాధారణ దివ్యానుభూతులు జాజ్జ్వల్యరూపంలో నా మదిలో మెదలగానే నేను ఇలా అనుకొన్నాను: 'కచ్చితంగా భగవంతుడు ఉన్నాడు, ఆయనను సాక్షాత్కరించుకొనే మార్గాలూ తప్పకుండా ఉండనే ఉన్నాయి; లేకుంటే బ్రతకడం ఎందుకోసం? బ్రతుకుకు విలువ ఏముంది? జీవితంలో ఎన్ని దుర్భర కష్టాలు ఎదురైనా ఆ మార్గాన్ని అన్వేషించి తప్పక కనుగొనాలి.' ఇలా రోజు గడవసాగాయి. సంశయాలతో మనస్సు ఊగిసలాడసాగింది. నా లౌకిక కష్టాలు గట్టెక్కే సూచనలే కనుచూపు మేరలో కానరాలేదు.

15. అవిచ్ఛిన్న అశాంతి

''ఎండాకాలం గడిచి, వర్షాకాలం వచ్చింది. ముందుమాదిరే ఉద్యోగం కోసం అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నాను. ఒక రోజు పూర్తిగా పస్తుండిపోయి అలసిపోయిన కాళ్లను ఈడ్చుకొంటూ, అంతకంటే మరింత అలసిసొలసిన మనస్సుతో వర్షంలో పూర్తిగా తడిసి రాత్రి ఇంటికి తిరిగివస్తున్నాను. అప్పుడు నాలో ఎంత నిస్సత్తువ కలిగిందంటే, ఒక్క అడుగుకూడా ముందుకు వేయలేక ప్రక్కనే ఉన్న ఒక ఇంటి వసారాలో కట్టెలా పడిపోయాను. కొంతసేపు పూర్తిగా బాహ్యస్మృతి కోల్పోయానేమో చెప్పలేను; కాని మనస్సులో రకరకాల ఆలోచనలు, రంగుల చిత్రాలు ఒకటి వెంట ఒకటిగా మెదలుతూ మాయమైనట్లు నాకు జ్ఞాపకం. వాటిని పారద్రోలడానికి లేదా ఒకే ప్రత్యేక ఆలోచన మీదే కేంద్రీకరించడానికి నేను అశక్తుణ్ణయ్యాను. ఆ సమయంలో నా కొక విచిత్రానుభూతి కలిగింది.

16. అద్భుత దర్శనంతో నరేంద్రుడు శాంతి పొందడం

''ఏదో ఒక దైవశక్తి నా మనస్సు లోపలి తెరలన్నిటినీ ఒకటి తరువాత ఒకటిగా పైకెత్తుతూ ఉన్నట్లు అనిపించింది. దయాళువైన భగవంతుని సృష్టిలో ఇన్ని దుఃఖాలూ కష్టాలూ ఎందుకు ఉన్నాయి? భగవంతుడి కఠోర ధర్మం, అనంత కరుణల మధ్య సామరస్యం ఎక్కడ? మొదలైన ఏ సంశయాల నివృత్తికై ఇంతకాలం మనస్సు సతమతమైనదో వాటన్నిటికీ హృదయాంతరాళాల్లో

పరిష్కారాలు లభించాయి. దాంతో మనస్సు పరమానందభరితమైంది. ఇంటికి తిరిగిపోతున్నప్పుడు శరీరంలో కించిత్తు అలసట కూడా కనిపించ లేదు; నా మనస్సు అపార స్థైర్యాన్ని, శాంతిని సంతరించుకొంది. అప్పుడు దాదాపు తెల్లవారబోతున్నది.

''లోకుల నిందాప్రస్తుతులకు నేను పూర్తిగా ఉదాసీనుణ్ణయ్యాను. సామాన్యుల మాదిరిగా ధనసంపాదనకు, కుటుంబ పోషణకు, సాంసారిక సుఖాలను అనుభవిస్తూ కాలం గడపటానికి నేను జన్మించ లేదనే గట్టినమ్మకం నాలో పాదుకుపోయింది. దాంతో మా తాతగారిలా సర్వసంగసన్న్యాసం పుచ్చుకోవాలని గోప్యంగా సంసిద్ధుణ్ణవసాగాను. ప్రయాణపు రోజు కూడా నిర్ణయించుకొన్నాను. ఆ రోజే శ్రీరామకృష్ణులు కలకత్తాలోని ఒక భక్తుని ఇంటికి వస్తున్నారని తెలిసింది. ఇది మంచి అవకాశం, ఇల్లు విడిచిపెట్టి వెళ్లే ముందు గురుదేవులను దర్శించుకొంటాను అని అనుకొన్నాను. నేను శ్రీరామకృష్ణులను కలుసుకోగానే, 'ఈ రోజు నువ్వు నాతో దక్షిణేశ్వరానికి రావాలి' అని పట్టుబట్టారు. నేను రాలేనని ఎన్నో సాకులు చెప్పి నప్పటికీ ఆయన వినిపించుకోలేదు. ఆయనతోపాటు బండిలో వెళ్లక తప్ప లేదు. దారిలో పెద్దగా ఏమీ మాట్లాడలేదు. దక్షిణేశ్వరం చేరాక ఇతరులతో పాటు నేను కూడా ఆయన గదిలో కొంతసేపు కూర్చున్నాను. ఇంతలో ఆయన భావపారవశ్యమగ్నులైనారు. మరుక్షణమే హఠాత్తుగా నా దగ్గరకు వచ్చి, నా చేయి పుచ్చుకొని కళ్లవెంట కన్నీరు స్రవిస్తూండగా పాడసాగారు:

17. సన్న్యసించాలనే నరేంద్రుని సంకల్పం

మాట్లాడడానికీ భయమే
ఊరకనే ఉండాలన్నా భయమే
(నా) మనస్సులో అనుమానం
నిన్ను కోల్పోతానేమోనని - కృష్ణా!

''నా భావోద్వేగాలను అంతదాకా ఎలాగో అణచుకోగలిగాను; కాని ఇక నా కది సాధ్యం కాలేదు. గురుదేవులలా నా ఛాతీకూడా అశ్రువులతో తడిసి పోయింది. శ్రీరామకృష్ణులకు అంతా తెలిసిపోయిందని నేను గ్రహించాను. మా ఇద్దరి ప్రవర్తనా చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యచకితులైనారు. ఆయన భావావస్థ నుండి మామూలు స్థితికి వచ్చిన తరువాత ఎవరో దీనిని గురించి ఆయనను అడిగారు. 'ఇదేదో మా ఇద్దరికీ సంబంధించిన విషయం' అని తక్కున జవాబిచ్చారు. వారందరినీ పంపించివేశాక రాత్రి నన్ను ప్రక్కకు

18. శ్రీరామకృష్ణుల విన్నపం మేరకు నరేంద్రుని సంకల్పంలో మార్పు

పిలిచి, 'అమ్మ కార్యం నిమిత్తమే నువ్వు ఈ లోకంలోకి వచ్చావని తెలుసుకో; నువ్వు ఎన్నడూ సాంసారిక జీవితం గడపవు. కాని నా కోసం, నేను బ్రతికి ఉన్నంత వరకు నీ కుటుంబంతోనే ఉండిపో' అని అన్నారు. ఇలా అంటూ ఉండగా ఆయన కళ్లవెంట అశ్రువులు ధారగా స్రవించాయి, భావోద్వేగంతో ఆయన కంఠం గద్గదమైంది.

''గురుదేవుల వద్ద సెలవు పుచ్చుకొని మర్నాడు ఇంటికి తిరిగి వచ్చాను. మరుక్షణమే కుటుంబం గురించిన ఆలోచనలు మనస్సును నింపివేశాయి.

19. దారిద్ర్య ఉపశమనం కోసం నరేంద్రుడు ఆయనను ప్రార్థించడం

ఇంతకు మునుపు మాదిరే కుటుంబ పోషణ నిమిత్తం ఉద్యోగంకోసం వివిధ ప్రయత్నాలూ చేయసాగాను. ఒక న్యాయవాది కార్యాలయంలో పనిచేశాను, కొన్ని పుస్తకాలు కూడా తర్జుమా చేశాను. ఈ విధంగా ఒకింత ధనం సంపాదించాను, దాంతో కుటుంబ పోషణ ఏదో రకంగా జరిగిపోయింది. కాని అవన్నీ తాత్కాలిక ఉద్యోగాలు; శాశ్వతమైన ఉద్యోగం లేనందున, తల్లీ తమ్ముళ్ల పోషణకు చక్కని ఏర్పాటు ఏదీ చేయలేకపోయాను. కొన్ని రోజులు ఇలా గడిచిన తరువాత, శ్రీరామకృష్ణుల ప్రార్థనలను భగవంతుడు ఆలకిస్తాడనే విషయం చటుక్కున జ్ఞాపకానికి వచ్చింది. 'నా కోసం ఆయనను ప్రార్థించమని కోరతాను; దాంతో నా తల్లీతమ్ముళ్ల కూడుగుడ్డల కొరత తీరిపోతుంది. ఆయన నా మాటను ఎన్నడూ కాదనరు' అని అనుకొన్నాను. వెంటనే దక్షిణేశ్వరానికి పరుగుతీశాను. నా తల్లీ తమ్ముళ్ల దారిద్ర్య బాధ తీరేటందుకు నా కోసం అమ్మను ప్రార్థించమని ఆయనను పదేపదే వేడుకొన్నాను. అందుకు శ్రీరామకృష్ణులు ఆప్యాయంగా, 'నాయనా, నే నటువంటి ప్రార్థనలు చేయలేనని నీకు తెలుసుకదా! నీ అంతట నువ్వే అమ్మను ఎందుకు ప్రార్థించకూడదు? అమ్మను నువ్వు అంగీకరించవు; అందుకే నీ కిన్ని కష్టాలు' అని అన్నారు. ఆ మాటలు విని నే నిలా చెప్పాను: 'అమ్మ విషయం నా కేమీ తెలియదు; నా కోసం మీరే దయచేసి అమ్మను ప్రార్థించండి. మీరు తప్పక ప్రార్థించాలి; మీరు ప్రార్థించనంత దాకా మిమ్మల్ని విడిచిపెట్టను.' ఆప్యాయతానురాగాలు ఉట్టిపడే స్వరంలో ఆయన ఇలా అన్నారు: 'నీ కష్టాలను బాపమని అమ్మను పలుమార్లు ప్రార్థించాను. కాని ఆమెను నువ్వు అంగీకరించనందున ఆమె నా మొరను ఆలకించలేదు. సరే, ఈ రోజు మంగళవారం, అమ్మకు విశిష్టమైన రోజు. ఈ రోజు నువ్వు ఆమెను ఏం కోరితే దాన్ని అమ్మ ప్రసాదిస్తుందని కచ్చితంగా చెప్పగలను. నేటి రాత్రి ఆలయానికి వెళ్లి ఆమెను మొక్కి, వరం ప్రసాదించమని ప్రార్థించు. అనురాగమయి అయిన నా తల్లి సాక్షాత్తు బ్రహ్మశక్తి; శుద్ధ

చైతన్యమూర్తి. సంకల్ప మాత్రాన ఈ విశ్వాన్ని సృజించింది. ఆమె సంకల్పిస్తే చేయలేనిది ఏముంది.'

''శ్రీరామకృష్ణులు అంత నిశ్చయంగా చెబుతున్నప్పుడు ప్రార్థించిన మరుక్షణమే నా కష్టాలన్నీ తీరిపోతాయనే గట్టినమ్మకం నాలో జనించింది.

20. నరేంద్రునికి జగజ్జనని దివ్యదర్శనం

ఎంతో ఆశతో రాత్రికోసం నిరీక్షించసాగాను. మెల్లగా రాత్రయింది. మొదటి ప్రహరం గడిచిపోగానే ఆలయానికి వెళ్లమని గురుదేవులు నన్ను ఆదేశించారు. ఆలయానికి వెళుతూన్నప్పుడు ఒక రకమైన మత్తు నన్ను ఆవహించింది; కాళ్లు తడబడసాగాయి. తల్లిని తప్పక చూడగలననే, ఆమె వచనాలు వినగలననే ప్రగాఢ నమ్మకం నాలో జనించింది. తక్కిన విషయాలన్నీ విస్మరించి, అదే ధ్యాసలో మగ్నుడనైపోయాను. ఆలయంలోకి ప్రవేశించగానే నిజంగా తల్లి చిన్మయమై కానవచ్చింది; సజీవమూర్తిగా కనిపించింది. నిజంగానే అనంతమైన ప్రేమను, సౌందర్యాన్ని వెదజల్లుతూన్నట్లు కంటపడింది. నా హృదయం భక్త్యారాధనతో ఉప్పొంగిపోయింది. ఆ తల్లి పాదపద్మాలకు పదేపదే ప్రణమిల్లుతూ, 'అమ్మా, వివేకను ప్రసాదించు, వైరాగ్యాన్ని అనుగ్రహించు, దివ్య భక్తిజ్ఞానాలను ప్రసాదించు; అనవరతం నిన్ను దర్శించ గలిగేటట్లు అనుగ్రహించు' అని ప్రార్థించాను. నా అంతరంగం యావత్తు శాంతితో పొంగిపొరలింది. విశ్వమంతా కనుమరుగైపోయింది, ఒక్క తల్లి మాత్రమే నా హృదయసీమను ఆక్రమించివేసింది.

''శ్రీరామకృష్ణుల వద్దకు తిరిగి రాగానే, 'నీ దుర్దశను తొలగించమని అమ్మను ప్రార్థించావు కదూ?' అని ఆయన అడిగారు. ఆ ప్రశ్నకు ఉలిక్కిపడి,

21. జగజ్జననిని సంపదలు అనుగ్రహించమని మూడుసార్లు ప్రార్థించడంలో నరేంద్రుని వైఫల్యం

'లేదండి. అలా అడగడం మరచిపోయాను. కాబట్టి ఇప్పుడు ఏం చేయమంటారు?' అని అన్నాను. 'వెంటనే వెళ్లి ఆమెను మళ్లీ ప్రార్థించు' అని ఆయన చెప్పారు. మళ్లీ ఆలయానికి బయలుదేరాను; ఆమె సన్నిధిలోకి రాగానే మళ్లీ అదే మత్తు నన్ను ఆవహించింది. సమస్తం మరచిపోయాను. పదేపదే ఆమెకు ప్రణామాలు చేస్తూ దివ్యభక్తి జ్ఞానాలను ప్రసాదించమని ప్రార్థించి, తిరిగి వచ్చేశాను. నన్ను చూడగానే శ్రీరామకృష్ణులు నవ్వుతూ, 'సరే, ఈసారన్నా నీ దారిద్ర్యావస్థను తొలగించమని ఆమెను అడిగావా?' అని ప్రశ్నించారు. మళ్లీ ఉలిక్కిపడి, 'లేదండి. అమ్మను దర్శించగానే వర్ణనాతీతమైన ఒక దివ్యశక్తి ప్రభావంలో సమస్తం మరచిపోయి, జ్ఞాన భక్తులను మాత్రమే అమ్మను అర్థించాను. ఇప్పుడు మార్గాంతరం ఏమిటి?' అని అన్నాను. అందుకు శ్రీరామకృష్ణులు, 'ఓరీ అవివేకీ! నిన్ను నువ్వు కాస్త అదుపులో ఉంచుకొని, ఆ ప్రార్థన

చేయలేకపోయావా? మరోసారి వెళ్లి నీ కోర్కెలను ఆమెకు విన్నవించు. త్వరగా వెళ్లు' అని అన్నారు. మూడవసారి బయలుదేరాను; కాని ఆలయంలోకి ప్రవే శించగానే చెప్పరాని సిగ్గుతో క్రుంగిపోయాను. 'ఎటువంటి తుచ్ఛమైన విష యాలు అర్థించడానికి తల్లి వద్దకు వచ్చాను? గురుదేవులు తరచు చెప్పేటట్లు, చక్రవర్తి అనుగ్రహం పొంది గుమ్మడి కాయలు కోరినట్లుగా ఉంది నా ఈ ప్రార్థన. ఎంత తెలివిమాలిన వ్యవహారం ఇది' అనే ఆలోచన నాలో మెదలింది. సిగ్గు, విరక్తి నన్ను క్రమ్ముకోగా, ఆమె పాదాల మ్రోల వ్రాలి, 'తల్లీ నాకు ఇంకేమీ వద్దు; కేవలం భక్తిజ్ఞానాలను మాత్రం అనుగ్రహించు తల్లీ!' అని ప్రార్థించాను.

''ఆలయం నుండి వెలుపలకు రాగానే ఇదంతా గురుదేవులు లీల అని నాకు కచ్చితంగా స్ఫురించింది. లేకపోతే మూడుసార్లు ఆలయానికి వెళ్లికూడా ఎందుకు అడగలేకపోయాను? వెంటనే ఆయన వద్ద కెళ్లి, నా తల్లీతమ్ముళ్లకు కూడగుడ్డలకు కొరత లేకుండా హామీ ఇవ్వమని పట్టుబడుతూ, 'ఆ విధంగా నాలో మత్తు ఆవహింపచేసి, తల్లిని ప్రార్థించకుండా నన్ను నివారించింది కచ్చితంగా మీరే నని నాకు తెలుసు' అని అన్నాను. నా మాటలు విని ఆయన ఆప్యాయంగా ఇలా అన్నారు: 'నాయనా, నే నెవరికోసమూ అలా ప్రార్థించలేను; నా నోటినుండి అటువంటి మాటలు ఎన్నడూ వెలువడవు. నువ్వు కోరిన దంతా అమ్మ వద్ద పొందగలవని చెప్పాను కదా! కాని నువ్వే ఆమెను అలా అడగలేకపోయావు. సంసార సుఖాల నిమిత్తం నువ్వు జన్మించలేదు. అటువం టప్పుడు నేను చేయగలిగింది ఏముంది?' అందుకు నేను, 'నేను ససేమిరా ఒప్పుకోనండి. నా నిమిత్తం మీరు అలాంటి ప్రార్థన చేయక తప్పదు; ఒక్కసారి మీరు అలా ప్రార్థిస్తే వారి దుర్దశ తొలగిపోతుందని నా గట్టి నమ్మకం' అని అన్నాను. నేను పట్టుపట్టి అలా వేడుకోగా వేడుకోగా చివరికి ఆయన, 'సరే, సామాన్యమైన కూడుగుడ్డలకోసం ఎన్నడూ వారు ఎలాంటి ఇబ్బందీ పడరు' అని అన్నారు.''

పైన వివరించిన సంఘటన నరేంద్రుని జీవితంలో ఒక గొప్ప మలుపు అని చెప్పనవసరం లేదు. భగవంతుణ్ణే తల్లిగా ఆరాధించడం, అట్లే ప్రతి మల ప్రతీకల ద్వారా భగవంతుణ్ణే అర్చించడంలోని నిగూ ఢార్థం నరేంద్రుడికి ఇప్పటి వరకు అవగతం కాలేదు. ఆ ఈ సంఘటన జరగడానికి మునుపు దేవాలయాలలో ప్రతిష్ఠితమైన దేవతా విగ్రహాలను అతడు ఎంతో చులకనభావంతో చూసే వాడు, ఎన్నడూ భక్తిప్రపత్తులతో చూసి ఎరుగడు. కాని పై సంఘటన అతడి కళ్లను తెరిపించింది. విగ్రహారాధనలోని నిగూఢతత్వం ఇప్పుడు అతడికి స్పష్టంగా

22. విగ్రహారాధనను నరేంద్రుడు విశ్వసించడం

అవగతమైంది; ఫలితంగా ఆతడి ఆధ్యాత్మిక జీవితం పరిపూర్ణతను సంతరించుకొంది. ఆతడిలో అలాంటి పరిణామం కలగడం చూసి శ్రీరామకృష్ణుల వర్ణనాతీతమైన ఆనందాన్ని పొందారు. ఇది జరిగిన మర్నాడు మా మిత్రుడొకడు[1] దక్షిణేశ్వరానికి వెళ్లాడు. ఆ రోజు అతడు చూసింది, విన్నది ఆతడి మాటల్లో ఇక్కడ పొందుపరిస్తే పాఠకులకు ఆ విషయం చక్కగా విశదమౌతుంది.

23. ఈ విషయంగా శ్రీరామకృష్ణులు ఆనందించిన వైనం

''ఒకే కార్యాలయంలో పనిచేస్తున్న కారణంగా తారాపద ఘోష్ అనే వ్యక్తితో నాకు బాగా పరిచయం ఏర్పడింది. నరేంద్రుడు, తారాపదునికి ఆప్త మిత్రుడు. కాబట్టి నరేంద్రుణ్ణి అప్పుడప్పుడు ఆ కార్యాలయంలో చూసేవాణ్ణి. పైగా పరమహంసదేవులు నరేంద్రుణ్ణి అమితంగా ప్రేమిస్తున్నారని తారాపదుడు మాటల సందర్భంలో ఒక రోజు నాతో చెప్పాడు కూడా. అయినప్పటికీ నరేంద్రుని పరిచయంకోసం నేను ప్రయత్నించలేదు. ఒక రోజు మధ్యాహ్నం వేళ నేను దక్షిణేశ్వరానికి వెళ్లాను. అప్పుడు శ్రీరామకృష్ణులు తమ గదిలో ఒంటరిగా కూర్చుని ఉన్నారు; నరేంద్రుడు గది బయట ఒక ప్రక్క నిద్రపోతున్నాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణుల ముఖం పరమానందంతో ప్రకాశిస్తూన్నది. నేను ఆయన వద్దకెళ్లి ప్రణామం చేశానో లేదో, ఆయన నరేంద్రుణ్ణి చూపుతూ ఇలా అన్నారు: 'అలా చూడు. అతడెంతో సజ్జనుడు. అతడి పేరు నరేంద్రుడు. ఇంతకు మునుపు అతడెన్నడూ జగజ్జననిని అంగీకరించలేదు; నిన్న రాత్రే అంగీకరించాడు. అతడు కష్టదశలో ఉన్నాడు. అందువలన ధనంకోసం అమ్మను ప్రార్థించమని చెప్పాను. కాని అతడు అలా అడగలేకపోయాడు; ఆమెను అలా అడగడానికి సిగ్గుపడ్డాడట. ఆలయం నుండి తిరిగి వచ్చాక అమ్మ మీద ఒక పాటను నేర్పమని నన్ను అడిగాడు. నేను ఈ పాటను నేర్పాను:

(నా) తల్లీ! నువ్వు సంసార తారిణివి!
త్రిగుణ స్వరూపిణివి! పరాశక్తివి!
నువ్వు దీనులపాలిట దయామయివి,
    దుఃఖనివారిణివి అని నాకు తెలుసు
నేలలో నీటిలో ఉన్నది నువ్వే!
అన్నిటికీ మూలం నువ్వే!
జీవులందరిలోవున్న అక్షరస్వరూపిణివి నువ్వే!
నువ్వే సాకారరూపిణివి, నువ్వే నిరాకారరూపిణివి! ॥ (నా) తల్లీ ॥

---

1. వైకుంఠనాథ్ సన్యాల్

నువ్వే సంధ్యవు, నువ్వే గాయత్రివి, జగద్ధాత్రివీ నువ్వే!
దిక్కులేని వారిని రక్షించేదీ నువ్వే!
సదాశివుని మనోహారివీ నువ్వే! ॥ (నా) తల్లీ ॥

'రాత్రంతా అదే పనిగా ఆ పాటను పాడుతూ ఉండిపోయాడు. అందుకే ఇప్పుడు నిద్రపోతున్నాడు. (ఆనందంగా నవ్వుతూ) నరేంద్రుడు కాళిని అంగీకరించాడు; ఎంత మంచిదయింది; అవునా కాదా?'

పిల్లవాడిలా ఆయన అలా సంతోషించడం చూసి నేను, 'నిజమేనండి. చాలా మంచిదే అయింది' అని అన్నాను. కాసేపయ్యాక చిన్నగా నవ్వుతూ మళ్లీ ఆయన, 'నరేంద్రుడు తల్లిని అంగీకరించాడు; చాలా మంచిపనే అయింది; మరి నువ్వేమంటావు?' అని అడిగారు. పదేపదే అలా అంటూ ఆయన తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు.

24. నరేంద్రునితోటి శ్రీరామకృష్ణుల ఆప్త బాంధవ్యం

''మధ్యాహ్నం నాలుగు గంటలకు మేల్కొని నరేంద్రుడు గదిలోకి వచ్చి శ్రీరామకృష్ణుల ప్రక్కన కూర్చున్నాడు. ఆయన వద్ద సెలవు పుచ్చుకొని కలకత్తాకు తిరిగి వెళ్లబోతున్నట్లు కనిపించాడు. కాని అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు భావపారవశ్యముగ్నులై, దాదాపు అతడి ఒడిలో కూర్చుని ఇలా అనసాగారు: 'నాకు కనిపిస్తున్న దేమిటంటే ఇదీ (తమ శరీరాన్ని చూపుతూ) నేనే, ఇది కూడా (నరేంద్రుని శరీరాన్ని చూపుతూ) నేనే. నిజం చెబుతున్నాను, ఈ రెండింటి మధ్య నాకు ఏ తేడా కనిపించడం లేదు. గంగానది జలాలపై ఒక కర్రను పెడితే అది రెండు భాగాలైనట్లు కనబడుతుంది; కాని నిజానికి భాగాలు లేవు, ఒక్క అఖండ జలరాశి మాత్రమే ఉంది. ఇదీ అటువంటిదే. అర్థమైందా? ఒక్క తల్లి తప్ప మరేముంది? నువ్వేమంటావు?' అలా అంటూ హఠాత్తుగా, 'పొగ త్రాగుతాను' అన్నారు. వెంటనే వెళ్లి హుక్కా సిద్ధంచేసి ఆయనకు ఇచ్చాను. ఒకటి రెండుసార్లు త్రాగి, హుక్కాను నా కిచ్చి, 'పాత్రనుండే త్రాగుతాను' అని, పాత్రను చేతుల్లోకి తీసుకుని పొగ త్రాగసాగారు. మూడు నాలుగు గ్రుక్కలు పీల్చి పాత్రను నరేంద్రుని నోటి వద్ద పెట్టి, 'ఒక్క గ్రుక్క, నా చేతుల మీదుగా ఒక్క గ్రుక్క త్రాగు' అని అన్నారు. కాని నరేంద్రుడు కుంచించుకుపోవడం చూసి శ్రీరామకృష్ణులు, 'ఎంత అమాయకత్వం! నువ్వూ నేనూ భిన్నులమా? ఇదీ నేనే, అదికూడా నేనే' అని అన్నారు. అలా అంటూ అతనిచే పొగత్రాగించడానికి తమ రెండు చేతులూ అతడి నోటి వద్దకు తెచ్చారు. అలా గురుదేవులు నిర్బంధించడంతో నరేంద్రుడు ఆయన చేతులగుండా రెండు

మూడు గుక్కలు త్రాగి, ఆపేశాడు. అతడు పొగత్రాగడం ఆపగానే, శ్రీరామ కృష్ణులు తామే మళ్లీ పొగత్రాగబోయారు.

ఆ సమయంలో నరేంద్రుడు కంగారుగా, 'మహాశయా, చేతులు కడు క్కొని తర్వాత త్రాగండి' అని అన్నాడు. కాని శ్రీరామకృష్ణులు అతడి మాటలు పట్టించుకోలేదు. 'ఓరీ ధూర్తుడా, భేదబుద్ధి ఎరుక చాలా ఉందే' అని అన్నారు. నరేంద్రుని నోటిని తాకిన చేతులతోనే ఆయన పొగత్రాగారు. భావావస్థలో అనేక విషయాల గురించి మాట్లాడారు. తమకు సమర్పించడానికి తెచ్చిన ఏ వస్తువు నుండి ముందే కించిత్తు మరెవరికైనా ఇస్తే, ఆ వస్తువును ఎంగిలిగా, దేవునికి అర్పించడానికి అనర్హంగా శ్రీరామకృష్ణులు నిర్ణయించేవారు; అట్టి వస్తువులను స్వయంగా తాము స్వీకరించేవారు కాదు. కాని ఆ రోజు నరేంద్రుని విషయంలో ఆ నియమభంగం చేయడం చూసి, ఆయనకు అత డెంత ఆప్తుడోననుకొని ఆశ్చర్యచకితుడనయ్యాను.

''రాత్రి ఎనిమిది గంటలదాకా మేం మాట్లాడుతూ కూర్చున్నాం. అప్ప టికి శ్రీరామకృష్ణుల భావపారవశ్యం పూర్తిగా ఉపశమించింది. ఆ తరువాత ఆయన వద్ద సెలవు పుచ్చుకొని కలకత్తాకు నడిచివెళ్లాం.''

25. నరేంద్రునితో పాటు వైకుంఠ్ కలకత్తాకు తిరిగిపోవడం

ఆ తరువాత అనేక సందర్భాలలో నరేంద్రుడు ఇలా చెప్పగా మేం విన్నాం: ''మొట్టమొదటిసారి కలుసుకొన్న ప్పటి నుండి ఒక్క గురుదేవులు మాత్రమే - మరెవ్వరూ నా తల్లి తమ్ములతో సహా - ఒకే రీతి విశ్వాసాన్ని సదా నా పట్ల కలిగి ఉన్నారు. ఆ విశ్వాస అభి మానాలు నన్ను ఆయనతో శాశ్వతంగా కట్టిపడేశాయి. ప్రేమించడమంటే ఏమిటో ఒక్క శ్రీరామకృష్ణులకు మాత్రమే తెలుసు; అట్లే ప్రేమించారు కూడా. ఇతరులు తమ స్వార్థం నిమిత్తం ప్రేమను నటిస్తారు.''

9. శ్రీరామకృష్ణుల భక్తబృందం - నరేంద్రనాథ్

1. 1884 నాటికే శ్రీరామకృష్ణుల విశేష భక్తులందరూ వచ్చి చేరడం

యౌగిక దర్శనాలలో శ్రీరామకృష్ణులు గాంచిన భక్తు లందరూ 1884వ సం॥ పూర్తి కాకమునుపే దక్షిణేశ్వరానికి వచ్చేశారు. ఎందు కంటే, 1885వ సం॥ ప్రారంభంలో పూర్ణుడు ఆయన వద్దకు వచ్చాడు. అతణ్ణి అనుగ్రహించిన తరువాత ఆయన, ''పూర్ణుని రాకతో నేను దర్శనాలలో కాంచిన ఆ కోవకు చెందిన భక్తులందరూ వచ్చేసినట్లే. ఆ తరగతికి చెందిన భక్తులు ఇకమీదట ఎవరూ రారు'' అని అన్నారు.

2. ఈ కోవకు చెందిన భక్తులతో శ్రీరామకృష్ణుల ప్రవర్తన

పైన పేర్కొన్న ఆ కోవకు చెందిన భక్తులలో అనేకులు 1883 వ సం॥ మధ్య కాలంలోనే వచ్చారు. ఈ సమయంలో నరేంద్రుడు తన కుటుంబ పోష ణార్థం దారిద్ర్యంతో పోరాటం సాగిస్తున్నాడు. రాఖాల్ బృందావనానికి వెళ్లివున్నాడు. పై కోవకు చెందిన భక్తు లలో ఎవరైనా తమ వద్దకు రాబోతున్నప్పుడు ఆయన ముందుగానే, ''ఈ రోజు ఆ వైపు నుండి (ఒక ఫలానా దిశను చూపుతూ) ఇక్కడకు చెందిన భక్తుడొకడు రానున్నాడు'' అని చెప్పేవారు. లేదా అటువంటి వ్యక్తి వచ్చీరాగానే, ''నువ్వు ఇక్కడి వాడివే'' అంటూ ఆప్యాయంగా అతణ్ణి ఆహ్వానించేవారు. ఇంకా భాగ్యశాలులైతే వారు రాగానే వారిపట్ల ఆయన ప్రత్యే కంగా ఆకర్షితులై, వారికి తినిపించాలనీ, వారితో ఆధ్యాత్మిక విషయాల గురించి ముచ్చటించాలనీ, వారిని పదేపదే చూడాలనీ ఆయన ఎంతో తహతహ చెందే వారు. గత సంస్కారాల నుండి ఉత్పన్నమైన వారి నైజాన్ని ఆయన పరిశీలించి, అంతకు క్రితం నుండి తమ వద్దకు వస్తూన్న అటువంటి నైజమేగల భక్తులకు వారిని పరిచయం చేసేవారు; అందువలన తమవంటి దృక్పథమే గల వ్యక్తు లతో తమ తీరిక సమయాన్ని ఆధ్యాత్మిక విషయాలు ముచ్చటించుకోవ

డంలో గడపగలరని శ్రీరామకృష్ణులు ఆశించేవారు. ఆహ్వానం లేకపోయినా అటువంటి భక్తుల ఇళ్లకు ఆయన వెళ్లి, ముచ్చటైన సంభాషణతో వారి సంరక్షకులను ప్రసన్నులను చేసి, ఆ భక్తులు తమ వద్దకు నిరాటంకంగా రావడానికి మార్గాన్ని సుగమం చేసేవారు.

ఆ కోవకు చెందిన భక్తుడు తమ వద్దకు వచ్చిన కాసేపటికి, అతణ్ణి ప్రక్కకు పిలిచి ధ్యానం చేయమని చెప్పి, దివ్యభావోద్వేగంలో ఆ భక్తుని ఛాతీనో లేదా నాలుకనో స్పృశించేవారు. శక్తిసమన్వితమైన ఆ స్పర్శతో భక్తుని మనస్సు అంతర్ముఖం కాగా అతడు అచేతనావస్థను చేరుకొనేవాడు; ఆ అవస్థలో ఆతడిలో సంచయమై ఉన్న గత సంస్కారాలు చైతన్యం పొంది ఆతడిలో ఆధ్యాత్మిక అనుభూతిని ఉత్పన్నం చేసేవి. గురుదేవుల ఆ దివ్యస్పర్శ పర్యవసానంగా కొందరికి జ్యోతిదర్శనం కలిగేది, మరి కొందరు దేవీదేవతల తేజోమయ రూపాలను దర్శించేవారు. ఇంకొందరు ప్రగాఢ ధ్యానమగ్నులయ్యేవారు లేదా అంతకు మునుపు ఎన్నడూ పొందని దివ్యానందాన్ని చవిచూసేవారు. కొద్దిమందికి హృదయ బంధనాలు తెగిపోయి భగవత్సాక్షాత్కారం కోసం తహతహలాడేవారు. మరికొందరు ఆధ్యాత్మిక భావోద్వేగ ప్రేరణతో సవికల్ప సమాధి పొందేవారు. బహు అరుదుగా ఏ ఒక్కరో నిర్వికల్ప సమాధి అనుభూతిని ముందుగానే ఒకింత చవిచూసేవారు.

3. దివ్యభావంలో శ్రీరామకృష్ణులు వారి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేయడం

ఇలా శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి తేజోవిరాజమాన మూర్తులను దర్శనాలలో గాంచినవారు కోకొల్లలు. ఒక రోజు తారక్‌లో (స్వామి శివానంద) ఆ దివ్యస్పర్శ పర్యవసానంగా మహాభగవద్వ్యాకులతా, ఏడ్పూ పొంగిపొర్లాయనీ, ఫలితంగా ఆతడి హృదయ గ్రంథులన్నీ విడివడ్డాయనీ స్వయంగా గురుదేవుల నుండే మేం విన్నాం. నిరాకార ధ్యానం చేస్తూన్న చిన్న నరేంద్రుడు ఆ దివ్య స్పర్శతో భావపారవశ్యంలో మగ్నుడైపోయాడు. కాని శ్రీరామకృష్ణుల దివ్యస్పర్శ ఫలితంగా నిర్వికల్ప సమాధి అనుభూతిని ముందుగానే చవిచూడగలిగింది నరేంద్రు డొక్కడే.

భక్తులను అలా స్పృశించడమే కాక కొందరికి శ్రీరామకృష్ణులు మంత్రదీక్ష కూడా ఇచ్చారు. మామూలు గురువుల మాదిరి దీక్ష ఇస్తున్నప్పుడు పూజ చేయడంగాని, జాతకాలు పరిశీలించడంగాని ఆయన చేసేవారు కారు. కాని యోగదృష్టితో శిష్యుల పూర్వ సంస్కారాలను కనుగొని, 'ఇది నీకు తగిన మంత్రం' అని తెలిపేవారు. నిరంజన్, తేజ్‌చంద్ర, వైకుంఠ్ మొదలైన వారిని ఆ విధంగా అనుగ్రహించినట్లు ఆయన ముఖతా మేం విన్నాం. కేవలం ఒక

వ్యక్తి శాక్తుల కుటుంబంలో జన్మించాడు కాబట్టి అతడికి శాక్తమంత్రాన్ని లేదా వైష్ణవుల కుటుంబంలో జన్మించాడు కనుక వైష్ణవమంత్రాన్ని ఆయన ఇచ్చేవారు కాదు. వారివారి పూర్వ సంస్కారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే కొన్ని సమయాల్లో శక్తి ఆరాధకుడికి వైష్ణవ మంత్రాన్ని, వైష్ణవ ఆరాధకుడికి శక్తి మంత్రాన్ని దీక్షగా ఇవ్వడం కూడా కద్దు. అంటే శిష్యుల సంస్కారాల మేరకు ఎవరికి ఏది దోహదం చేస్తుందో వారికి ఆ ఉపదేశం చేసేవారనడం స్పష్టం.

4. శ్రీరామకృష్ణుల దివ్యస్పర్శ ఋజువు పరచే విషయం

సంకల్పమాత్రాన లేదా స్పర్శమాత్రాన మహాత్ములు ఇతరులలో ఆధ్యాత్మిక శక్తిని ప్రసరింపచేసి వారి మనస్సులను ఉన్నతోన్నత భావభూముల వైపుకు మరల్చగలరని శాస్త్రాలు వచిస్తున్నాయి. మహా పురుషుల ప్రభావం వేశ్యల, కాముకుల, పాపుల, దుష్టుల జీవితాలనే మార్చివేసినప్పుడు, వారి అంతరంగ శిష్యుల విషయం గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం ఏముంది? ఎంతో కాలం నుండి లోకంలో అవతారపురుషులుగా పరిగణింపబడి ఆరాధింపబడుతూన్న శ్రీకృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, చైతన్యుల వంటి మహాపురుషుల ప్రతి ఒక్కరిలో ఆ శక్తి అభివ్యక్తీకరణ విభిన్న పరిమాణాలలో కానవస్తూన్నది.

శాస్త్రాలు అలా వక్కాణిస్తూన్నప్పటికీ ప్రయోజనం ఏమిటి? అటువంటి అవతార పురుషుల అలౌకిక చేతల గురించిన ప్రత్యక్షజ్ఞానం సుదీర్ఘకాలం లేనందున లోకం వారిపట్ల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయింది. అంతేకాదు, ప్రస్తుత కాలంలో భగవంతునిపై విశ్వాసం కూడా మూఢనమ్మకంగా, మానసిక దౌర్బల్యంగా పరిగణింపబడుతున్నది. భగవంతుని మీదే నమ్మకం పోయినప్పుడు, ఇక భగవదవతారాలను నమ్మటం గురించి వేరేగా చెప్పాలా? లోకుల మనస్సుల నుండి ఆ అపనమ్మకాన్ని తొలగించి వారిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపింపచేయడానికి ఈ ఆధునిక యుగంలో శ్రీరామకృష్ణుల వంటి మహాపురుషుల ఆవిర్భావం ఎంతో ఆవశ్యకం. ఆయనలో అటువంటి మహాన్‌శక్తి అభివ్యక్తీకరించడం చూసినప్పుడే, గతకాలంలోని మహాపురుషులలో కూడా అట్టి శక్తులు ఉండేవనే నమ్మకం మాలో కలుగసాగింది. శ్రీరామకృష్ణులను అవతారపురుషులుగా విశ్వసించకపోయినా, ఆయనలో అభివ్యక్తమయ్యే మహాద్భుతశక్తిని చూసినప్పుడు, శ్రీకృష్ణుడు బుద్ధుడు ఏసుక్రీస్తు చైతన్యులు మొదలైన మహానుభావులు ఏ కోవకు చెందారో ఈయన కూడా ఆ కోవకే చెందిన వ్యక్తి అని మాత్రం అంగీకరించక తప్పదు.

యువకులు, వృద్ధులు, గృహస్థులు, సన్న్యాసులు, సాకారోపాసకులు, నిరాకారోపాసకులు మొదలైన వివిధ కోవలకు, వయస్సులకు చెందిన భక్తులు

పలువురు భవిష్యత్తులో తమ వద్దకు రాబోతున్నారని శ్రీరామకృష్ణులకు ముందే తెలుసు. ఇలా వచ్చిన భక్తులలో చాలా [illegible] అప్పటికీ, అందరిలో ఒక్క సామాన్య [illegible] ఈ ప్రతి ఒక్కరూ తమ సొంత మార్గం ద్వారా, తమ ఇష్టదైవం మీద అచంచల విశ్వాసం [illegible] వారు; అంతేకాదు ఈ ప్రతి ఒక్కరూ భగవత్సాక్షాత్కారం కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడ్డవారు కూడా.

5. ప్రతి భక్తుడూ శ్రీరామకృష్ణులను తన భావంలోని వ్యక్తిగా తలచడం

శ్రీరామకృష్ణులు తమ భక్తుల నందరినీ ప్రేమ బంధంతో [illegible] కట్టివేసి, ప్రతి ఒక్కరి ఆధ్యాత్మిక భావాన్ని పరిరక్షిస్తూ, సకల మత సిద్ధాంతాలలో కోవిదులైన వారైనప్పటికీ, ఆయన (ఆ భక్తుని) ఆధ్యాత్మిక భావం పట్లనే తమకు అధిక ప్రీతి అని అతడు భావించే రీతిలో ఆయన మెలిగేవారు. అలాంటి అభిప్రాయం కలగడం వలన గురుదేవుల పట్ల ప్రతి శిష్యుడూ ఎంతో భక్తిప్రపత్తులు చెల్లించేవాడు. సంకుచిత శాఖాభిమానాలను వారు అధిగమించిపోతూ, శ్రీరామకృష్ణుల సర్వాంగత్వం, ఉపదేశాల ఫలితంగా క్రమంగా వారు ఉదారభావాలను సంతరించుకొనేవారో అప్పుడు ఆయన పరిపూర్ణత్వం అవగతం చేసుకొని ఆశ్చర్యచకితులయ్యేవారు. ఉదాహరణగా ఒక సంఘటన గురించి ప్రస్తావిస్తున్నాం.

6. ఒక ఉదాహరణ: బలరాం బసు

కలకత్తాలోని బాగ్‌బజార్ వాస్తవ్యుడైన బలరాం బసు వైష్ణవుల కుటుంబంలో జన్మించాడు, వైష్ణవాన్ని తు.చ. తప్పక పాటించేవాడు. సంపన్న కుటుంబీకుడైనప్పటికీ ప్రాపంచిక [illegible] సంపన్నుడైనప్పటికీ [illegible]. ప్రతి రోజూ ఉదయం పూజలో, ధార్మిక అధ్యయనంలో నాలుగైదు గంటలు గడిపేవాడు; అహింసను కచ్చితంగా పాటించేవాడు కావడం వలన ఏ కారణం చేత క్రిమికీటకాలను సైతం చంపి తొలగించేవాడు కాడు. బలరాం మొట్టమొదటిసారి శ్రీరామకృష్ణులు చూడగానే చిరపరిచితుడిలా అతణ్ణి ఎంతో ప్రేమతో స్వీకరించారు. అతణ్ణి గురించి ఆయన ఇలా అనేవారు: “ఇతడు చైతన్య మహాప్రభువు అంతరంగ భక్తుడు. ఇక్కడికి (నాకు) చెందిన వాడు. [illegible] తో పాటు వైష్ణవులు సంకీర్తన చేస్తూ శ్రీహరి నామంతో దిక్కులు మారుమ్రోగిస్తూ, ఆవాహన [illegible] భావావేశంలో [illegible] ఒక రోజు దర్శించాను. ఆ సంకీర్తన బృందంలో ఇతణ్ణి (బలరాం బసు) చూశాను.”

శ్రీరామకృష్ణుల దివ్యసాంగత్యంలో బలరాంలో అద్భుత పరిణామం జనించింది; ఫలితంగా సత్వరమే అతడు ఆధ్యాత్మిక జగత్తులో ఎంతో పురోగమించాడు. శాస్త్రాలు ఆదేశించే బాహ్యపూజల వంటి వైధీ భక్తి ఆవరణాన్ని అతిక్రమించి, సంపూర్ణంగా భగవంతునికి పరాధీనుడై సదసద్విచారశీలాన్వితుడై సంసారంలో నిస్సంగుడై జీవించసాగాడు. భార్య, కొడుకు, సంపద ఇత్యాది తన సర్వస్వాన్ని భగవత్పాదపద్మాలకు అర్పించి యావత్తు భగవంతునిదే అనే భావంతో ఆయన దాసునిగా, ఆయన ఆజ్ఞలు పాలించడానికి సదాసర్వవేళలా సిద్ధంగా ఉండి జీవించసాగాడు. సాధ్యమైనంత కాలం శ్రీరామకృష్ణుల పావన సాంగత్యంలో గడపడం ఒక్కటే క్రమంగా బలరాం జీవిత ధ్యేయమైంది. శ్రీరామకృష్ణుల అనుగ్రహంతో పొందిన పరమ శాంతిని తానొక్కడు మాత్రమే అనుభవించడంతో బలరాం ఆగిపోలేదు. తన బంధుమిత్రులు యావన్మందీ గురుదేవుల సాంగత్య లబ్ధిపొంది తద్వారా పరమానందాన్ని అనుభవించాలనే ఆకాంక్షతో అందుకు సముచిత ఏర్పాట్లు చేయడంలో నిమగ్నుడైనాడు. ఆ విధంగా భగవంతుని దాసుడనే బలరాం వైఖరి కారణంగా అనేకులు శ్రీరామకృష్ణుల ఆశ్రయాన్ని పొంది తమ జన్మలను సార్థకం చేసుకొన్నారు.

7. శ్రీరామకృష్ణుల దర్శనానంతరం బలరాం తొలుత ప్రవర్తన

బాహ్య పూజ విషయంలో బలరాం అభిప్రాయం ఎలా మారిందో అదే విధంగా ఒకింత కాలంలోనే అహింసావ్రతాన్ని పాటించడంలో కూడా ఆతడి అభిప్రాయం మారింది. శ్రీరామకృష్ణుల సాంగత్య భాగ్యం కలగడానికి మునుపు, పూజ ధ్యానాదులకు భంగం కలిగించే దోమలకు సైతం బలరాం హాని తలపెట్టేవాడు కాడు. అలా వాటికి హాని చేస్తే తన ఆధ్యాత్మికత కుంటువడుతుందని అతడి అభిప్రాయం.

8. అహింసావ్రతం పట్ల బలరాం సంశయం

ఒక రోజు ధ్యానానికి కూర్చున్నప్పుడు, 'మనస్సు స్వాభావికంగానే చంచలమైంది. అటువంటి మనస్సును ఏకాగ్రం చేసి భగవత్పాదపద్మాలపై ఏకాగ్రం చేయడమే కర్తవ్యం, అదే ధర్మంగాని సదా ఈగలనూ, దోమలనూ రక్షించడం కాదే! కనుక ఏదో కొన్ని దోమలను చంపి ఒకింతసేపయినా మనస్సును భగవంతునిపై ఏకాగ్రం చేయడం అధార్మికం కాదు, పైగా జీవిత పరమ లక్ష్యానికి దోహదకారి కూడా' అనే ఆలోచన బలరాం మనస్సులో మెదలింది. అందు గురించి బలరాం ఇలా చెప్పేవాడు: ''సుదీర్ఘ కాలంగా పాటిస్తూవున్న అహింసా వ్రతం ఆ ఆలోచనతో తలక్రిందులైంది; కాని నా మనస్సులో సంశయాలు పూర్తిగా తొలగిపోలేదు. కాబట్టి ఈ విషయంగా శ్రీరామకృష్ణులను సంప్రదించడానికి దక్షిణేశ్వరానికి బయలుదేరాను. 'ఇతరుల మాదిరి ఆయన దోమలను

చంపడం నే నెప్పుడు చూడలేదే!' అని దారిలో వెళుతూ అనుకొన్నాను. అటువంటి సంఘటన నా కేదీ జ్ఞాపకం రాలేదు. నాకు తెలిసినంత వరకు నా కంటే అహింసా వ్రతాన్ని కఠోరంగా ఆయన పాటించేవారు. అప్పుడు ఒకనాటి సంఘటన నాకు జ్ఞాపకానికి వచ్చింది. ఒక రోజు లేత పచ్చికబయలు మీదుగా ఒక వ్యక్తి నడిచిపోతున్నప్పుడు, అది చూసి అతూడు తమ ఛాతీమీదుగా నడిచి పోతున్నంత బాధతో ఆయన సతమతమయ్యారు. ఆ గడ్డిపరకలో సైతం అభి వ్యక్తమౌతున్న ప్రాణశక్తిని గుర్తించగల చైతన్యమూర్తులు ఆయన! ఈ విషయం జ్ఞాపకం రావడంతో గురుదేవులను మళ్లీ సంప్రతించడం అనవసరం, ఇదంతా నా మనోభ్రాంతి అనే నిర్ణయానికి వచ్చాను. అయినప్పటికీ ఆయనను దర్శించు కొని రావచ్చు కదా! మనస్సు పరిశుద్ధమౌతుం'దని అనుకొన్నాను.

9. ఒక ఉదాహరణతో బలరాం సందేహ నివృత్తి

''దక్షిణేశ్వరం చేరుకొని గురుదేవుల గది తలుపు వద్దకు వచ్చాను. కాని గదిలోకి వెళ్లడానికి ముందు ఆయన అప్పుడు ఏం చేస్తున్నారో చూసి ఆశ్చర్య పోయాను. తమ మంచంలో నక్కిన నల్లులను పట్టి చంపుతున్నారు! నేను ఆయనను సమీపించి, ప్రణామం చేయగానే, 'ఈ దిండులో నల్లులు బాగా పెరుగుతున్నాయి. రేయింబవళ్లు అవి నన్ను కుడుతూ నిద్రాభంగం కలిగిస్తున్నాయి. అందుకే వాటిని చంపుతున్నాను' అని చెప్పారు. ఇక నా సంశయం గురించి ప్రశ్నించవల సిన అవసరం లేకపోయింది. ఆయన మాటల, చేతలతో నా మనస్సు సంశయ రహితమైంది. కాని ఆశ్చర్యపోతూ ఇలా ఆలోచనలో పడ్డాను. గత రెండు మూడేళ్లుగా వేళాపాళా చూడకుండా ఈయన వద్దకు వస్తున్నాను. ఉదయం వచ్చి, రాత్రిదాకా ఉండి తిరిగి వెళ్లేవాణ్ణి. ఒకవేళ సాయంత్రం వేళ వస్తే, రాత్రి బాగా ప్రొద్దుపోయాకనే ఆయన వద్ద సెలవు పుచ్చుకొని తిరిగి వెళ్లేవాణ్ణి. ఆ విధంగా వారానికి మూడు నాలుగుసార్లు ఇక్కడికి వచ్చేవాణ్ణి. కాని ఆయన ఇలా ప్రవర్తించడం నే నెన్నడూ చూడలేదు. నేడు ఆయన ఇలా చేయడానికి కారణం ఏమిటో! ఇంతకు మునుపు ఆయన అలా చేయడం నేను చూసివుంటే నా ఆధ్యాత్మిక భావానికి హాని వాటిల్లేదేమో! పర్యవసానంగా ఆయన పట్ల విశ్వా సాన్ని కోల్పోయి ఉండేవాడినేమో! అందువల్లనే పరమకారుణ్యమూర్తులైన శ్రీరామకృష్ణులు ఇంతకు ముందు ఎన్నడూ నా ముందు ఆ విధంగా చేయ లేదని నేను అనుకొన్నాను.''

యోగ దృష్టిలో కానవచ్చిన భక్తులే కాకుండా ఈ కాలఘట్టంలో ఎందరో స్త్రీలు పురుషులు శ్రీరామకృష్ణులను దర్శించి, శాంతి పొందగోరి దక్షిణేశ్వరా నికి వచ్చారు. ఈ అందరినీ కూడా ఆయన ఆప్యాయంతో ఆహ్వానించి ఉపదేశా

లతో కొందరిని, దివ్యభావపారవశ్యంలో స్పృశించి మరికొందరిని అనుగ్ర

10. రెండు కోవల భక్తులు

హించారు. కాలం గడిచేకొద్దీ శ్రీరామకృష్ణులను కేంద్రాకర్షణగా చేసుకొని భక్తబృందం విస్తృతించసాగింది. ఆ భక్తుల లోని బాలుర, అవివాహితులైన యువకుల ఆధ్యాత్మిక జీవితాలను తీర్చిదిద్దడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధవహించారు. అందుకు గల కారణాన్ని అనేక సందర్భాలలో ఇలా వెలిబుచ్చేవారు: ''పదహారు అణాల (సంపూర్ణ) మనస్సును నిమగ్నం చేయకుంటే పరిపూర్ణ భగవత్సాక్షాత్కారం ఎన్నటికీ లభించదు. ఈ యువకుల మనస్సులలో భార్య, బిడ్డలు, సంపద, పేరుప్రతిష్ఠలు మొదలైన లౌకిక వస్తువుల ధ్యాస కించిత్తు కూడా లేదు; అవి నిర్మలంగా, స్వచ్ఛంగా ఉన్నాయి. ఇప్పుడు కనుక వారు ప్రయత్నిస్తే, భగవంతునికి నిండు మనస్సును అర్పించి, సకాలంలో భగవద్దర్శనం పొంది తరించగలుగుతారు. అందువలననే వారిని ఆధ్యాత్మిక పథంలో నిర్దేశింప నేనింత ఉత్సుకత చూపుతున్నాను.'' అవకాశం దొరికినప్పుడల్లా శ్రీరామకృష్ణులు ఈ యువకులలో ప్రతి ఒక్కరినీ ఒక ఏకాంత ప్రదేశానికి తోడ్కొనివెళ్లి యోగం, ధ్యానం మొదలైన విశిష్ట ఆధ్యాత్మిక సాధనలలో ఉపదేశాలు ఇచ్చేవారు; అంతేకాక కఠోర బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించమని వారితో నొక్కివక్కాణించేవారు. అలాగే యోగ్యత మేరకు వారి వారి నిర్దిష్ట మార్గాలను చూపి, శాంత దాస్యాది భావాల ననుసరించి ఏ భావాన్ని చేపట్టితే తమ తమ ప్రత్యేక మార్గాలలో సత్వరమే పురోగమించడం సులభమో దాన్ని ఆయన వారికి ఉపదేశించేవారు.

అవివాహిత యువకులకు ఆధ్యాత్మికోపదేశాలివ్వడంలో శ్రీరామకృష్ణులు ఎంతో ఉత్సుకత చూపేవారని విని సామాన్య గృహస్థ భక్తులను ఆయన

11. పురుషులకు శ్రీరామకృష్ణుల ఉపదేశ విధానం

తక్కువ మేరకు అనుగ్రహించేవారని ఎవరూ అపార్థం చేసుకోరాదు. గృహస్థ భక్తులలో అనేకులకు తీరికగాని లేదా సామర్థ్యంగాని లేనందున ఆయన వారిని ఉన్నత ఆధ్యాత్మిక తత్త్వాలను ఆచరణలో పెట్టవద్దనీ, వాటిని అధ్యయనం చేయవద్దనీ చెప్పేవారు. కాని కామకాంచన అనురక్తిని క్రమంగా తగ్గించుకొంటూ, భక్తిమార్గాన్ని అవలంబిస్తూ చివరకు భగవత్సాక్షాత్కారాన్ని పొందే రీతిలో వారిని తీర్చిదిద్ద ప్రయత్నించేవారు. మొట్టమొదట వారికి 'తమ సొంత సంసారంలో' కాక 'భగవంతుని సంసారం'లో జీవించమని ఉద్బోధించేవారు; సంసార కర్తవ్యాలను నిర్వర్తిస్తూ, అనురక్తిని, 'నేను నాది' అనే భావాన్ని వీడి సంపన్నుని ఇంట్లో పనిచేసే దాసీ మనస్తత్వాన్ని అలవరచుకోమని వారికి ఉపదేశించేవారు. తమ శక్తిమేరకు ఇంద్రియనిగ్రహాన్ని పాటించమని వారిని ప్రోత్సహించేవారు. ''ఒక

రిద్దరు బిడ్డలు పుట్టిన తరువాత భార్యాభర్తలు సోదరీసోదరుల్లా మెలగుతూ, తమ మనస్సులను భగవదాయత్తం చేయాలి'' అని నొక్కి వక్కాణించేవారు. పైగా సదా సత్యపరిపాలన చేస్తూ అందరితోను సరళంగా ప్రవర్తించాలనీ, ఆడంబరంగా ఉండరాదనీ, సామాన్య అన్న వస్త్రాదులతో తృప్తిచెందుతూ దృష్టిని సర్వదా భగవంతుని మీదే కేంద్రీకరించాలనీ, రోజూ ప్రొద్దున సాయంత్రం పూజా జపం సంకీర్తనలు సలపాలనీ శ్రీరామకృష్ణులు గృహస్థ భక్తులను నిర్దేశించేవారు. వీటిని కూడా ఆచరించలేని గృహస్థులను మునిమాపువేళ ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని, చప్పట్లుకొడుతూ హరినామ భజన చేయమనేవారు. బంధుమిత్రులను ఆహ్వానించి అందరూ కలిసి 'నామసంకీర్తన' చేయమనీ వారికి ఆయన ఉపదేశించడం కద్దు.

సామాన్యంగా స్త్రీలకు, పురుషులకు ఉపదేశం ఇస్తున్నప్పుడు ఆయన ఇలా చెప్పడం మేం విన్నాం: ''కలియుగంలో నారదీయ భక్తిమార్గం ఒక్కటే చాలా అనువైనది; బిగ్గరగా భగవన్నామ సంకీర్తనం చేస్తే జీవుడు ఉద్ధరింపబడతాడు. కలికాలంలో మనుషులు అల్పాయుష్కులు, శక్తిహీనులు, అన్నగత ప్రాణులు. అందుకే భగవత్సాక్షాత్కారార్థం అటువంటి సులభమార్గం వారికి నిర్దేశించారు.'' మళ్లీ యోగం, ధ్యానం వంటి కఠోర సాధనలను గురించి విని ఎక్కడ నిస్పృహ చెందుతారోనని కొన్ని సమయాలలో ఆయన ఇలా చెప్పేవారు: ''సన్న్యాసి అయిన వ్యక్తి తప్పక భగవంతుణ్ణే ధ్యానించి తీరతాడు. ఎందుకంటే సాంసారిక విధులన్నిటినీ పరిత్యజించడం భగవద్ధ్యాన నిమిత్తమే కదా! అటువంటప్పుడు అలా చేయడంలో ఘనత ఏముంది? కాని తల్లితండ్రులు, భార్యాబిడ్డలు, తదితరులు అనే భారమైన కర్తవ్యాలను నిర్వహిస్తూ ఎవడు భగవంతుణ్ణే ఒక్కసారైనా హృదయపూర్వకంగా ప్రార్థిస్తాడో, ఆ వ్యక్తి పట్ల భగవంతుడు ఎంతో ప్రసన్నుడౌతాడు. భగవంతుడు, 'ఇంతపెద్ద భారాన్ని తన భుజస్కంధాలపై మోస్తూకూడా ఈ వ్యక్తి ఒకింతసేపైనా నన్ను గూర్చి తలచుకొంటున్నాడు. నిజానికి భక్తులలో ఇతడే అగ్రగణ్యుడు' అని అనుకొంటాడు.''

12. భక్తులలో నరేంద్రుని ప్రాధాన్యం

యోగ దృష్టిలో కాంచిన విశిష్ట భక్తు లందరిలో నరేంద్రునికి ఎంత అత్యున్నత స్థానం శ్రీరామకృష్ణులు ఒసగారో మాటలలో వర్ణించలేం; విశిష్ట భక్తుల సంగతే ఇలా ఉన్నప్పుడు, సామాన్య భక్తుల గురించి ప్రత్యేకంగా చెప్పాలా? యోగదృష్టిలో తాము చూసిన భక్తులలో కొందరిని గురించి ప్రస్తావిస్తూ ఆయన, ''వీరంతా ఈశ్వరకోటులు. అంటే భగవంతుని ఒక ప్రత్యేక కార్యం నిర్వర్తించడానికై ఈ లోకంలో పుట్టిన కారణజన్ములు'' అని అనేవారు. ఆ కొద్దిమంది ఈశ్వర

కోటులను, నరేంద్రునితో పోల్చుతూ ఒక రోజు శ్రీరామకృష్ణులు మాతో ఇలా చెప్పారు: ''నరేంద్రుడు సహస్రదళ పద్మం వంటివాడు. ఈ కోవకు చెందిన ఇతరులు కూడా పద్మాల వంటి వారే; కాని వారు పది, పదిహేను లేదా మహా అయితే ఇరవై దళాల పద్మాలవంటి వారు.'' మరో సందర్భంలో ఆయన, ''ఎంతోమంది భక్తులు ఇక్కడకు వస్తూవుంటారు; కాని నరేంద్రుని వంటి వ్యక్తిమాత్రం ఎవరూ రాలేదు'' అని అన్నారు.

శ్రీరామకృష్ణుల వచనాలను చక్కగా అవగతం చేసుకొని, ఆ పలుకుల, ఆయన అద్భుత చేతల అర్థాన్ని వ్యక్తం చేయగల వ్యక్తి నరేంద్రుడు తప్ప మరొకరు లేడంటే అతిశయోక్తి కాదు. శ్రీరామకృష్ణుల వచనాలకు నరేంద్రుని వ్యాఖ్యానం విని కొన్ని సమయాల్లో ఆశ్చర్యచకితులమై, ఇలా తలపోయడం కద్దు. 'ఆహా! మేం కూడా ఇవే పలుకులను ఆయన ముఖతా విన్నాం కాని వాటిలో ఇంత నిగూఢార్థం ఇమిడి ఉందని అర్థం చేసుకోలేకపోయాం కదా!' ఉదాహరణకు అటువంటి ఒక సందర్భాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

13. శ్రీరామకృష్ణుల వచనాల ప్రగాఢతను నరేంద్రుడు అవగతం చేసుకోవడం

1884వ సం॥లో ఏదో ఒక సమయాన మా మిత్రు డొకడు దక్షిణేశ్వ రానికి వచ్చాడు; అప్పుడు భక్త పరివేష్టితులై తమ గదిలో కూర్చున్న శ్రీరామ కృష్ణులను చూశాడు. నరేంద్రుడు కూడా అక్కడే ఉన్నాడు. ఆధ్యాత్మిక ప్రసంగాల మధ్య వేడుకలతో అందరూ ఆహ్లాదంగా ఉన్నారు. మాటల మధ్యలో వైష్ణవ మత ప్రస్తావన వచ్చింది. వైష్ణవ మత సారాన్ని క్లుప్తంగా వివరించి, శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: ''భగవన్నామంలో రుచి, జీవు లందరిపట్ల దయ, వైష్ణవుల సేవ అనే మూడు గుణాలను అలవరచుకొని ప్రతి వైష్ణవుడూ వాటిని పాటించాలని ఆ మతం బోధిస్తూన్నది. భగవంతుడు, ఆయన నామం అభిన్నమైనవి. నామం, నామి రెంటి అభేదాన్ని గ్రహించి భక్తి ప్రపత్తులతో ఆయన నామాన్ని జపించాలి. కృష్ణుడు - వైష్ణవుడు లేదా భగవం తుడు - భక్తుడు ఒక్కటేనని గ్రహించి భక్తులను సదా గౌరవించాలి, నమస్క రించాలి, పూజించాలి. అట్లే విశ్వం యావత్తు కృష్ణుడికి చెందినదేనని హృదయ పూర్వకంగా విశ్వసించి జీవులందరిపట్ల కరుణ వహించాలి.''

'జీవు లందరిపట్ల కరుణ వహించాలి' అని ఆయన పలుకుతూ ఉండ గానే ఆయన భావపారవశ్య స్థితిలోకి వెళ్ళిపోయారు. కొంతసేపటికి పాక్షిక బాహ్యచైతన్యం పొంది, ఆయన తిరిగి ఇలా కొనసాగించారు: ''జీవుడి పట్ల దయ చూపడమా! నువ్వే అల్ప ప్రాణివి; అటువంటప్పుడు జీవుల పట్ల ఎలా దయ చూపగలవు? దయ చూపడానికి నువ్వెవడివి? దౌర్భాగ్యుడా, దయను

అనుగ్రహించడానికి నువ్వెవడివి? కాదు, కాదు జీవులపట్ల దయ కాదు చూపవలసింది. వారిని సాక్షాత్తు శివునిగా ఎంచి సేవించాలి.''

14. శివుణ్ణిగా ఎంచి జీవుణ్ణి సేవించడం

ఆ భావసమాధిలో శ్రీరామకృష్ణులు పలికిన వచనాలు అక్కడున్న భక్తులందరూ వినసాగారు; కాని ఆ పలుకులలోని అంతరార్థాన్ని ఎవరూ కనుగొనలేకపోయారు. గురుదేవుల భావావస్థ ఉపశమించాక గదిలో నుండి వెలుపలకు వచ్చిన నరేంద్రుడు మాత్రమే ఇలా పలికాడు: ''ఆహా! గురుదేవుల వచనాలలో ఈ రోజు నేను ఎంత అద్భుత ప్రకాశాన్ని చూడగలిగాను! శుష్కమైనదనీ, కఠినమైనదనీ, కనికరంలేనిదనీ కూడా అపార్థం చేసుకోబడే వేదాంత (అద్వైత) జ్ఞానాన్ని తీయని భగవద్భక్తితో సమన్వయం చేశారు ఈ రోజు గురుదేవులు; పరమ సత్యాన్ని చేరుకోగలిగే సరి క్రొత్త మధుర మార్గాన్ని ఆయన ఈ రోజు చూపించారు. 'లోకాన్ని లోకులను అన్నిటినీ పరిత్యజించి, అరణ్యాలకు వెళ్లి, భక్తి ప్రేమ దయ మొదలైన కోమల భావాల నన్నిటినీ నిర్దాక్షిణ్యంగా హృదయం నుండి కూకటివ్రేళ్లతో సహా పెకలించివేయాలి. అప్పుడే, అలా చేసినప్పుడే అద్వైతజ్ఞానం పొందగల'మని సుదీర్ఘకాలంగా వింటూవచ్చాం. సాధకులు ఎవరైనా ప్రాచీన గ్రంథాలలో నిర్దేశించిన రీతిలో ఆ అద్వైత జ్ఞానాన్ని పొందాలని ప్రయత్నించినప్పుడు ఈ యావత్తు లోకాన్ని, లోకంలోని ప్రతి వ్యక్తిని తన సాధనామార్గంలో ఆటంకాలుగా పరిగణించవలసివచ్చేది. ఈ వైఖరి వారిలో సమాజం పట్ల ఒక రకమైన ఏవగింపును ఉత్పన్నం చేసి, తరచు వారిని సరైన ఆధ్యాత్మిక పథం నుండి వైదొలగచేసేది. కాని భావావస్థలో శ్రీరామకృష్ణులు ఈ రోజు వచించిన దానిని బట్టి అరణ్యపరమైన వేదాంతాన్ని జనావాసంలోకి తీసుకొనిరావచ్చుననీ, దైనందిన లౌకిక జీవితంలో ఆచరించవచ్చుననీ తేటతెల్లమౌతున్నది. ప్రతి వ్యక్తి తన పనిని చేసుకుపోతూ ఉండవచ్చు; దాన్లో ఎలాంటి హానీ లేదు; భగవంతుడే తన ముందు ఈ జగత్తు, దాన్లోని జీవులందరిలా అభివ్యక్తమౌతున్నాడని పరిపూర్ణ విశ్వాసం అతడు ముందుగా కలిగివుండాలి. జీవితంలో అనుక్షణం తాను చూసే వ్యక్తులు, తాను ప్రేమించే గౌరవించే సానుభూతి చూపే వ్యక్తులందరూ ఆ పరమాత్ముని అంశలనే అతడు భావించాలి. ఈ విధంగా ప్రపంచంలోని యావన్మందినీ శివుణ్ణిగా చూడగలిగితే, వారికంటే తాను శ్రేష్ఠుడనని అనుకొనే ఆస్కారం ఎక్కడ? లేదా వారిపై కుపితులవడం, ద్వేషించడం లేదా వారిపై దర్పం ప్రదర్శించడం లేదా వారిపట్ల దయ చూపడం అనేదీ ఎలా సాధ్యం? ఆ విధంగా శివస్వరూపులుగా జీవులను సేవించడం మూలంగా సాధకుని హృదయం పావనత్వాన్ని సంతరించుకొంటుంది; కొద్ది

కాలంలోనే తానుకూడా నిత్యశుద్ధ బుద్ధ ముక్తుడైన శివుని అంశననే ప్రగాఢ విశ్వాసం అతడిలో పాదుకొంటుంది.

''గురుదేవుల ఆ వచనాల నుండి భక్తిమార్గంపై కూడా గొప్ప కాంతి ప్రసరించడం మనకు గోచరిస్తుంది. జీవులందరిలో భగవంతుణ్ణి దర్శించ లేనంత వరకు భక్తి పరాకాష్ఠకు చేరడమూ, జీవిత పరమ లక్ష్యాన్ని నెరవేర్చు కోవడమూ అసాధ్యం. భగవత్సాక్షాత్కారానికి రాజమార్గమైన నిష్కామకర్మ మార్గాన్ని అనుసరించే సాధకులు కూడా ఆ వచనాల నుండి ఎంతో వెలుగును పొందగలరు. ఎందుకంటే, ఏ పనీ చేయకుండా ఊరకనే కూర్చోవడం బద్ధజీవు లకు అసాధ్యం కనుక శివజ్ఞానంతో జీవారాధన చేయడమే కర్తవ్యమనీ, అలా చేస్తేనే సత్వరం వారు తమ గమ్యాన్ని చేరుకోగలరనీ మళ్ళీ చెప్పడం అనవసరం. భగవంతుడు కనుక నా కొక అవకాశం ఇస్తే ఈ రోజు నేను విన్న ఈ పరమ సత్యాన్ని లోకమంతటా చాటుతాను; పండితులకు పామరులకు, ధనికులకు పేదలకు, బ్రాహ్మణులకు నిమ్నకులస్థులకూ ఉపదేశిస్తాను.''

అద్భుతమూర్తులైన శ్రీరామకృష్ణులు అదే విధంగా సదా భావపారవశ్య స్థితిలోకి వెళ్ళి మానవ జీవితానికి భక్తి కర్మ జ్ఞానయోగాలపై నూతన వెలుగును ప్రసరింపచేయడం కద్దు. దురదృష్టవంతులం కావడం వలన ఆయన వచనాల అంతస్సూచనలను అప్పుడు మేం గ్రహించలేకపోయాం. గురుదేవుల ఆ దివ్య వచనాలను మనిషికి సాధ్యమైనంత మేరకు అవగతం చేసుకొన్నది మహామేధావి యైన నరేంద్రు డొక్కడే; అలా అర్థం చేసుకొని అప్పుడప్పుడు వాటి లోకోత్తర ప్రాధాన్యతను ప్రకటించి మమ్మల్ని ఆశ్చర్యచకితులను చేసేవాడతడు.

10. పానీహాటీ మహోత్సవం

1. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా నరేంద్రుడు

నరేంద్రుడు దారిద్ర్యబాధల్ని చూడలేక శ్రీరామకృష్ణులను శరణు పొందడం, సామాన్య అన్నవస్త్రాదులకు ఆ కుటుంబానికి లోటు రాదని ఆయన ఆశీర్వదించడం గురించి ఇంతకు మునుపే చెప్పివున్నాం. అప్పటి నుండి నరేంద్రుని లౌకిక పరిస్థితులు క్రమంగా మెరుగుపడసాగాయి; పెద్దగా శ్రీమంతులు కాకపోయినా వెనుక అనుభవించిన కటిక దారిద్ర్యాన్ని వారు మరెన్నడూ చవిచూడలేదు. ఈ సంఘటన జరిగిన కొద్దికాలంలోనే కలకత్తా చంపాతల పేటలో మెట్రో పొలిటన్ పాఠశాల ఒక శాఖను ప్రారంభించింది; ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఆదరణతో నరేంద్రుడు ఆ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా నియుక్తుడయ్యాడు. ఆ పాఠశాలలో అతడు బహుశా 1885వ సం॥ మే నెల నుండి మూడు నాలుగు నెలలు ఉపాధ్యాయుడిగా పనిచేశాడు.

2. బంధువుల శత్రుత్వం

నరేంద్రుని కుటుంబ పరిస్థితులు ఒకింత మెరుగుపడినప్పటికీ, బంధువుల శత్రుత్వం వలన అతడు ఎంతో క్షోభకు గురియైనాడు. అవకాశం చూసుకొని ఆ బంధువులు నరేంద్రుని పూర్వీక ఆస్తిపాస్తులలోని మంచి ఇళ్లను, స్థలాలను ఏదో రకంగా ఆక్రమించేసుకొన్నారు. ఫలితంగా నరేంద్రుడు తన సొంత ఇంటిని వదలిపెట్టి రాంతను బసు వీధిలోని తన అమ్మమ్మ ఇంట్లో నివసించవలసి వచ్చింది. న్యాయంగా తమకు చెందవలసిన ఆస్తికై ఉన్నత న్యాయస్థానంలో దావా వేశాడు. తన తండ్రికి స్నేహితుడైన నిమాయ్ చరణ్ బసు అనే న్యాయవాది ఈ దావాలో నరేంద్రుడికి ఎంతో సహాయం చేశాడు. ఇప్పుడు ఈ దావా వ్యవహారాన్ని చూసుకోవడంలో ఎంతో సమయం గడపవలసి వచ్చినందుకూ, న్యాయశాస్త్ర (బి.ఎల్.) పరీక్షలు సమీపించడం వలనా నరేంద్రుడుడు తన ఉపాధ్యాయ పదవికి మూడు నాలుగు

నెలల తరువాత రాజీనామా చేయవలసి వచ్చింది. అంతేగాక అలా రాజీనామా చేయడానికి మరో ముఖ్యమైన కారణంకూడా ఉంది. ఆ సమయంలోనే శ్రీరామకృష్ణుల కంఠంలో వ్యాధి ప్రారంభమై, క్రమంగా అది ప్రకోపించసాగింది. అందువలన గురుదేవుల చికిత్స, సేవల ఏర్పాట్లు చేయడానికై ఆయన సమక్షంలో తాను ఉండవలసిన అవసరం ఎంతో ఉంటుందని నరేంద్రుడు భావించి, ఉద్యోగానికి రాజీనామా చేసి ఉంటాడు.

1885వ సంవత్సరం విపరీతమైన ఎండల కారణంగా శ్రీరామకృష్ణులు ఎంతో బాధపడడం చూసి భక్తులు ఆయనను మంచుగడ్డను వాడమని

3. శ్రీరామకృష్ణుల వ్యాధి

ప్రార్థించారు. మంచుగడ్డను తిని ఆయన ఒకింత ఉపశమనం పొందడంతో భక్తులలో అనేకులు దక్షిణేశ్వరానికి వస్తున్నప్పుడు మంచుగడ్డలను తీసుకురాసాగారు. ఆయన కూడా షర్బత్తులలో మంచు ముక్కలను కలిపి త్రాగుతూ పిల్లవాడిలా సంతోషపడేవారు. ఒకటి లేదా రెండు నెలలు మంచుగడ్డలను వాడేసరికి కంఠంలో నొప్పి ప్రారంభమైంది. బహుశా ఏప్రెల్ నెలలో మొట్టమొదటిసారి నొప్పి ప్రారంభమై ఉండవచ్చు.

ఒక నెల గడిచిన తరువాత కూడా నొప్పి తగ్గలేదు; మే నెల రాగానే ఆ వ్యాధి క్రొత్త లక్షణాలను దాల్చింది. ఆయన ఎక్కువగా మాట్లాడినా లేదా

4. అధికంగా మాట్లాడడం, భావసమాధి పొందడం కారణంగా వ్యాధి ప్రకోపించడం

భావసమాధి పొందినా వ్యాధి ప్రకోపించసాగింది. జలుబు కారణంగా గొంతు లోపలిభాగం వాచిందని మొదట నిర్ణయించి ప్లాస్టర్ (పట్టీ) వేశారు. కాని కొద్దిరోజుల తరువాత కూడా దాని వలన గుణం కనబడకపోవడంతో, బౌబజార్‌కు చెందిన గొంతురోగ నిపుణుడైన డ్యాక్టర్ రాఖాల్‌ను ఒక భక్తుడు తోడ్కొని వచ్చాడు. డ్యాక్టరు పరీక్షించి, రోగ నిర్ణయంచేసి గొంతు లోపల, వెలుపల పూయడానికి ఒక లేపనాన్ని, ఔషధాలను ఇచ్చాడు. శ్రీరామకృష్ణులు ఎక్కువగా మాట్లాడకుండా, భావపారవశ్య స్థితిలోకి వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోమని మాతో చెప్పివెళ్లాడు.

మెల్లగా జ్యేష్ఠ మాసంలోని శుక్ల త్రయోదశి సమీపించింది. కలకత్తాకు ఉత్తరంగా గంగాతీరాన కొద్దిమైళ్ల దూరంలోని పానీహాటీ అనే గ్రామంలో ప్రతి

5. పానీహాటీ మహోత్సవ వృత్తాంతం

ఏటా వైష్ణవ సంప్రదాయస్థులు ఒక ఉత్సవాన్ని జరుపుతారు. ఈ మహోత్సవం వెనుక ఒక కథ ఉంది. శ్రీ చైతన్య మహాప్రభువుల సహచరులలో ఒకడైన రఘునాథదాస గోస్వామి ఈ గ్రామ వాస్తవ్యుడు. ఈతడి తీవ్ర వైరాగ్య, అనాసక్తతల గురించి వంగ దేశంలో

తెలియనివారుండరంటే అతిశయోక్తి కాదు. తండ్రికి ఏకైక పుత్రుడైన రఘునాథ్ ఒకప్పుడు పరమ సౌందర్యవతియైన భార్యను, అపార సంపదను వదలిపెట్టి శ్రీ చైతన్యుల ఆశ్రయం పొందగోరి శాంతిపూర్‌కు వెళ్లాడు. అప్పుడు చైతన్యులు, 'నువ్వీ మర్కట వైరాగ్యాన్ని విడిచిపెట్టి నేను చెప్పేదాకా ఇంట్లోనే ఉండు' అని అతణ్ణి ఆదేశించి, ఇంటికి పంపివేశారు. చైతన్యుల ఆదేశాన్ని శిరసావహించి రఘునాథ్ ఇంటికి తిరిగి వెళ్లాడు; కాని సన్న్యసించాలనే తన తీవ్ర ఆకాంక్షను మనస్సులోనే దాచుకొని, తండ్రికి మామకు కుటుంబ వ్యవహారాలలో చేదోడువాదోడుగా ఉండసాగాడు. ఆ విధంగా ఇంట్లోనే కాలం గడుపుతున్నప్పటికీ అప్పుడప్పుడు చైతన్యుల సహచరులను చూడకుండా ఉండలేకపోయేవాడు. తండ్రి అనుమతితో వారి సాంగత్యంలో కొద్ది రోజులు గడిపి, తిరిగి ఇంటికి వచ్చేసేవాడు.

రోజులు అలా దొర్లిపోతున్నాయి; రఘునాథ్ ఇంట్లోనే ఉంటూ, సంసార పరిత్యాగానికి ఎదురుతెన్నులు చూడసాగాడు. కాలక్రమంలో చైతన్యులు కూడా సన్న్యాసం పుచ్చుకొని నీలాచలంలో (పూరీ క్షేత్రంలో) నివసించసాగాడు. వైష్ణవమత ప్రచారార్థం తన సహచరుడైన నిత్యానందుణ్ణి నియమించాడు. నిత్యానందుడు చైతన్యుల ఆదేశం మేరకు గంగాతీరంలోని 'ఖార్దహ' అనే గ్రామాన్ని తన ప్రధాన కేంద్రంగా చేసుకొని, అక్కడ నుండి వంగదేశం యావత్తు సంచరిస్తూ అసంఖ్యాకులకు వైష్ణవమత దీక్షను ఒసగుతూ భగవన్నామాన్ని ప్రచారం చేయసాగాడు.

ఒక సందర్భంలో తన మిత్రశిష్య ఆంతరంగిక బృందంతో నిత్యానందుడు పానీహాటీ గ్రామానికి వేంచేశాడు. రఘునాథ్ ఆయనను దర్శించడానికి వెళ్లాడు. అటుకులు, పెరుగు, పాలు, బెల్లం, అరటిపళ్లతో పంచామృతం చేసి భగవంతునికి నివేదించి, ఆ ఆహారాన్ని తమందరికీ సమర్పించమని నిత్యానందుడు అతణ్ణి ఆదేశించారు. ఆ ఆదేశాన్ని తన భాగ్యంగా రఘునాథ్ ఎంచి నిత్యానందుణ్ణి ఆ గంగాతీరాన దర్శింప వచ్చిన వందలాది భక్తులందరికీ కూడా శ్రద్ధాసోపేతంగా విందు చేశాడు. ఆ ఉత్సవం ముగిసిన పిదప నిత్యానందునికి మ్రొక్కి సెలవు పుచ్చుకోవడానికి వెళ్లినప్పుడు భావావస్థలో ఆయన రఘునాథ్‌ను కౌగిలించుకొని, ఇలా అన్నాడు: ''సమయం ఆసన్నమైంది. సంసారాన్ని త్యజించి నువ్విప్పుడు పూరీక్షేత్రానికి వెళ్లు. చైతన్యమహాప్రభువులు ఇప్పుడు నిన్ను అనుగ్రహిస్తారు. నీ ఆధ్యాత్మిక జీవిత పరిపూర్ణతకై నిన్ను సనాతన గోస్వామి శిక్షణలో నియుక్తులను చేస్తారు.'' నిత్యానందుని ఆ ఆదేశాన్ని విని రఘునాథ్ సంతోషంతో ఎగిరి గంతువేశాడు. ఇంటికి వెళ్లి కొద్ది రోజులు

అక్కడ ఉండి, సంసారాన్ని శాశ్వతంగా పరిత్యజించి, పూరీక్షేత్రానికి వెళ్ళిపోయాడు.

ఈ సంఘటనను కొనియాడే నిమిత్తం ప్రతి ఏటా గంగాతీరంలోని పానీహాటీ గ్రామంలో చైతన్య నిత్యానందుల పేరిట ఒక మహోత్సవాన్ని జరుపుకోవడం వైష్ణవ భక్తులకు ఆనవాయితీ. రఘునాథ్‌లా భగవదనుగ్రహం పొందగోరే వారా ఉత్సవాన్ని ఏటా జరుపుకొంటున్నారు. అప్పటి నుండి ఈ మహోత్సవం 'పానీహాటీ అటుకుల ఉత్సవం'గా ఖ్యాతిగాంచింది.

6. ఆ ఉత్సవంలో పాల్గొనాలనే శ్రీరామకృష్ణుల ఆకాంక్ష

శ్రీరామకృష్ణులు పానీహాటీ మహోత్సవంలో పలుమార్లు పాల్గొనట్లు మరొకచోట మేం ప్రస్తావించి ఉన్నాం. కాని కారణాంతరాల వలన పాశ్చాత్య రీతిలో విద్యావంతులైన భక్తులు తమ వద్దకు వస్తూవున్నప్పటి నుండి గత కొద్ది సంవత్సరాలుగా ఆయన ఆ ఉత్సవంలో పాల్గొనలేకపోయారు. ఈ సంవత్సరం భక్తులతో కలిసి వెళ్ళి ఆ ఉత్సవంలో పాల్గొనాలని ఆయన తమ ఆకాంక్షను వ్యక్తం చేసి, మాతో ఇలా అన్నారు: ''ఉత్సవ దినాన అక్కడ పరమానందం పొంగిపొరలుతుంది. వాస్తవానికి హరినామం సరఫరా చేసే అంగడి ఆ రోజు అక్కడ తెరచి ఉంటుంది. మీ 'యంగ్ బెంగాల్' అటువంటిది ఎన్నడూ చూసివుండదు. పోయి చూద్దాం రండి.'' రామచంద్రదత్త తదితర భక్తులు ఆయన ప్రతిపాదనకు హర్షించినప్పటికీ, శ్రీరామకృష్ణుల గొంతు నొప్పిని జ్ఞాపకం చేసుకొని వారిలో కొందరు అలా వెళ్ళకుండా ఆయనను నివారింప ప్రయత్నించారు. వారిని సంతృప్తిపరచే ఉద్దేశంతో ఆయన ఇలా అన్నారు: ''ఉదయానే ఇక్కడ కాస్త తింటాను; అక్కడ ఒకటి రెండు గంటలు గడిపి తిరిగివచ్చేద్దాం. అలా చేస్తే పెద్దగా హాని ఏం జరగదు. భావపారవశ్యం అధికరిస్తే గొంతునొప్పి కూడా అధికమౌతుంది. కనుక ఆ విషయంలో కడుజాగ్రత్త వహిస్తే ఏ బాధా ఉండదు.'' ఆయన పలుకులతో అన్ని అభ్యంతరాలు గాలికి కొట్టుకుపోయాయి; భక్తులు పానీహాటీ ప్రయాణానికి ఏర్పాట్లు చేయ సాగారు.

శుక్లపక్ష త్రయోదశి, పానీహాటీ మహోత్సవ దినం. ఉదయం తొమ్మిది గంటలకు దాదాపు ఇరవై ఐదుమంది భక్తులు రెండు పడవలలో దక్షిణేశ్వరానికి

7. పానీహాటీకి బయలుదేరడం

వచ్చారు. కొందరు కాలినడకన వచ్చారు. శ్రీరామకృష్ణుల నిమిత్తం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పడవ ఘట్టం వద్ద ఆగి ఉంది. వేకువజామునే కొందరు భక్తురాండ్రు కూడా వచ్చివున్నారు. వీరు మాతృదేవితో కలిసి శ్రీరామకృష్ణులకు, భక్తులకు కావలసిన భోజనాదులు

ఏర్పాటు చేయసాగారు. అందరూ భోజనాలు ముగించి పది గంటలకు బయలుదేరడానికి సిద్ధమయ్యారు.

శ్రీరామకృష్ణులు భోజనం ముగించాక, తాను కూడా రావచ్చునా అని మాతృదేవి ఒక భక్తురాలి ద్వారా కబురు పంపింది. ఆ భక్తురాలితో ఆయన,

8. మాతృదేవి ఆ బృందంతో కలిసి వెళ్లకపోవడానికి హేతువు

''మీరంతా కూడా వస్తున్నట్లున్నారే! ఇష్టమైతే ఆమెను కూడా రమ్మనండి'' అని అన్నారు. ఈ జవాబు విని మాతృదేవి, ఇలా అంది: ''ఆయనతో కలిసి అనేకమంది వెళుతున్నారు, పైగా అక్కడ జనం తండోపతండాలుగా వస్తారు. పడవ నుండి దిగి, ఉత్సవాన్ని తిలకించడం నా కెంతో ఇబ్బందిగా ఉంటుంది. నేను వెళ్లక పోవడమే మంచిది.'' వెళ్లాలనే యోచనే ఆమె విడిచిపెట్టింది. శ్రీరామకృష్ణులతో కలిసి వెళ్లే ఇద్దరు ముగ్గురు భక్తురాండ్రకు భోజనం పెట్టి, ఆయన వెళ్లే అదే పడవలోనే వెళ్లమని వారితో చెప్పింది.

భక్తబృందం దాదాపు పన్నెండు గంటలకు పానీహాటీ చేరింది. అప్పటికే గంగాతీరంలోని పురాతన రావిచెట్టు చుట్టూ వందలాది మంది గుమిగూడి

9. ఉత్సవ స్థలంలో భక్తులు చూసిన దృశ్యం

వున్నారు. పలుచోట్ల జరుగుతున్న సంకీర్తనానందంలో వైష్ణవ భక్తులు మునిగివున్నారు. కాని అలావున్నప్పటికీ, వారిలో అనేకులు సంకీర్తనలో తన్మయులైనట్లు కానరావడం లేదు. ప్రతిచోట ఒకరకమైన నిర్జీవ సంకీర్తనగానే కానవస్తున్నది.

పానీహాటీ చేరడానికి ముందు, చేరిన తరువాత కూడా నరేంద్రుడు, బలరాం, గిరీశ్‌ఘోష్, రాంచంద్ర, మహేంద్రనాథ్ ప్రభృత ప్రధాన భక్తులు ఏ సంకీర్తన బృందంలోను కలిసి భావావేశులు కారాదని గురుదేవులను పదేపదే ప్రాథేయపడ్డారు. ఎందుకంటే ఆయన అలా చేస్తే భావపారవశ్యం కలగడం అనివార్యమై, గొంతు నొప్పి అధికరించడం తథ్యం.

శ్రీరామకృష్ణులు పడవ నుండి దిగి తిన్నగా మణిసేన్ ఇంటికి వెళ్లారు. ఆయనను చూసి ఇంటిల్లిపాదీ సంతోషంతో ఉప్పొంగిపోయి, ప్రణామాలు

10. మణిసేన్ గృహం

చేసి, ఆయనను కచేరి గదిలోకి తోడ్కొనిపోయి అక్కడ సుఖాసీనుని చేశారు. ఆ గది ఆంగ్లేయ పద్ధతిలో మాదిరి బల్లలు, కుర్చీలు, సోఫాలు, తివాచీలు మొదలైన వాటితో అలంకరింపబడి ఉంది. పది పదిహేను నిమిషాలు విశ్రమించాక శ్రీరామకృష్ణులు, మణిసేన్ కుటుంబానికి చెందిన శ్రీరాధాకాంత ఆలయానికి మ్రొక్కడానికి బయలుదేరారు.

ఆ దేవాలయం కచేరి గదికి సమీపంలోనే ఉంది. మే మంతా కచేరి ప్రక్క వాకిలిగుండా తిన్నగా నాట్యమందిరంలో ప్రవేశించి రాధాకృష్ణుల జంట విగ్రహ

లను దర్శించుకొన్నాం. ఆ విగ్రహాలు ఎంతో అందంగా మలచబడి ఉన్నాయి. ఒకింత ఆ విగ్రహాలనే తదేకంగా చూసి అర్ధబాహ్యదివ్యభావంలో శ్రీరామకృష్ణులు ప్రణామాలు అర్పించారు. నాట్యమందిరం నుండి బయటకు వచ్చి ఐదారు మెట్లు క్రిందికి దిగితే చతుష్కోణ ఆలయ ప్రాంగణంలోకి అడుగిడతాం. ప్రాంగణానికి నలువంకలా చక్కని గదులు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించగానే విగ్రహాలు కానవచ్చే రీతిలో ఆలయ ద్వారం అమరివుంది.

11. మణిసేన్ కుటుంబీకుల దేవాలయం

శ్రీరామకృష్ణులు ఆలయంలో మ్రొక్కుతూన్నప్పుడు ఒక సంకీర్తన బృందం ద్వారం గుండా ప్రాంగణంలోకి వచ్చి సంకీర్తన ప్రారంభించింది. ఉత్సవానికి వచ్చిన ప్రతి సంకీర్తన బృందం ఈ ఆలయ ప్రాంగణంలోకి వచ్చి మొట్టమొదట సంకీర్తన ప్రారంభించి ఆ తరువాత గంగాతీరానికి వెళ్లి భగవన్నామ సంకీర్తన చేయడం పరిపాటి. ఇంతలో పొడుగ్గా, లావుగా, తెల్లని మేనిఛాయగల మధ్యవయస్కుడైన ఒక వ్యక్తి యజ్ఞోపవీతం, తలపై శిఖ, ఒంటి నిండా చందన పూత, శంఖచక్రాల చిహ్నాలు, చిన్న సంచీలోని జపమాలను తిప్పుకొంటూ ప్రాంగణంలోకి వచ్చాడు. ఉత్తరీయం అతడి భుజం నుండి వ్రేలాడుతున్నది. చక్కగా ఉతికిన తెల్లని ధోవతిని పొందికగా ధరించి ఉన్నాడు. నడుం మడతలలో కొన్ని నాణేలు పెట్టుకొని ఉన్నాడు. అతణ్ణి చూడగానే ఇతరుల విశ్వాసం మీద ధనం సముపార్జించుకొనే కపట గోస్వామిగా కానవస్తాడు. సంకీర్తన బృందాన్ని ఉత్తేజపరచడానికో, బహుశా కొత్తగా వచ్చిన వారికి తానొక మహాభక్తుణ్ణని చాటుకోవడానికో అన్నట్లు రాగానే అతడు సంకీర్తన బృందంతో జత కట్టి తానేదో భావపారవశ్యంలో మగ్నుడై ఉన్నట్లు గర్జిస్తూ హావభావాలు ప్రదర్శిస్తూ నృత్యం చేయసాగాడు.

భగవంతునికి మ్రొక్కి శ్రీరామకృష్ణులు ఆలయంలో ఒక ప్రక్క నిలబడ్డారు. ఆ గోస్వామి భావసమాధ్యవస్థను నటించడం, ఆతడి దుస్తులు అలంకరణలు మాత్రం చెక్కుచెదరక సక్రమంగా ఉండడం గమనించి నవ్వుతూ శ్రీరామకృష్ణులు తమ ప్రక్కనే ఉన్న నరేంద్రాది భక్తులతో మెల్లగా, ''ఆ కాపట్యం చూడండి'' అని అన్నారు. ఆయన ఆ వ్యాఖ్యానంతో అందరి పెదవులపై చిరునవ్వు తాండవించింది. ఆయన ఎటువంటి భావోద్వేగానికీ గురికాకుండా తమను అదుపులో ఉంచుకోవడం చూసి భక్తులంతా నిశ్చింతులయ్యారు. కాని మరుక్షణమే, కన్నుమూసి తెరచేంతలో ఎప్పుడు ఎలా జరిగిందో భక్తులు అవగతం చేసుకోవడానికి మునుపే శ్రీరామకృష్ణులు ఒక్క గెంతుతో సంకీర్తన బృందం మధ్యలో

12. భావసమాధ్యవస్థలో శ్రీరామకృష్ణులు నృత్యం చేయడం

దూకి భావావస్థలోకి జారిపోయి, పూర్తిగా బాహ్యస్మృతిని కోల్పోయారు. వెంటనే భక్తులు నాట్యమందిరం నుండి పరుగున వచ్చి ఆయన చుట్టూ నిలబడ్డారు.

ఇక గురుదేవులు మధ్యమధ్యలో పాక్షికంగా బాహ్యస్మృతిని పొంది, సింహం మాదిరి అంగలువేస్తూ నృత్యం చేయసాగారు; ఇంతలో బాహ్యస్మృతిని మళ్లీ పూర్తిగా కోల్పోయి నిశ్చేష్టులై నిలబడిపోసాగారు. ఆధ్యాత్మిక భావోద్వేగ ప్రభావంలో లయానుసారంగా త్వరితగతిలో ముందుకు, వెనుకకు అడుగులు వేస్తూ ఆయన నృత్యం చేయసాగారు. పరమానంద సాగరంలో మహానందంగా ఈదుతున్న చేపలా కనిపించారు. ఆయన ప్రతి అవయవ కదలికా ఆ విష యాన్ని స్పష్టంగా సూచిస్తూన్నది. సౌందర్యమూ కోమలత్వమూ మధురంగా సామరస్యం పొంది అత్యంత స్వాభావికంగా విచ్చలవిడిగా అభివ్యక్తమౌతున్న ఆ దివ్యానందాన్ని మాటల్లో వర్ణించడం అసాధ్యం. నానావిధ హావభావ సమ న్వితమైన స్త్రీల పురుషుల అద్భుత నృత్యాల నెన్నో మేం తిలకించివున్నాం; కాని దివ్యభావావేశంలో తన్మయులై తాండవ నృత్యం చేస్తున్నప్పుడు శ్రీరామ కృష్ణుల దేహంలో సౌందర్యమూ శక్తీ ఎలా సమన్వయం చెందివుంటాయో, దాన్లో శతాంశం కూడా మేం మరెక్కడా తిలకించలేదంటే అతిశయోక్తి కాదు. దివ్యభావోద్వేగంలో జనించిన పరమానందంతో పొంగిపొరలుతున్న ఆయన దేహం సత్వర అంగలతో ముందు వెనుకలకు ఊగుతూన్నప్పుడు అది ఘన పదార్థంతో తయారుచేయబడింది కాదనీ, బ్రహ్మానంద సాగరంలో ఉవ్వెత్తున లేచి, మరుక్షణమే ఆ సాగరజలాలో లయమైపోయే తరంగమనీ చూపరులకు తోస్తున్నది. అసలు, నకిలీల మధ్యనున్న హస్తిమశకాంతరాన్ని ఎవరూ ఎవరికీ వివరించవలసిన అవసరం లేకపోయింది. ఇక ఆ కీర్తన బృందం ఆ గోస్వామి వైపు కన్నెత్తి అయినా చూడకుండా శ్రీరామకృష్ణులను పరివేష్టించి, నూరింతల సమధికోత్సాహంతో పాడసాగింది.

దాదాపు అరగంటసేపు ఇలా గడిచిన తరువాత శ్రీరామకృష్ణులు దాదాపు మామూలు స్థితికి రావడం గమనించి ఆ సంకీర్తన బృందం మధ్యనుండి ఆయనను తోడ్కొని పోవడానికి భక్తులు ప్రయత్నిం చారు. శ్రీ చైతన్యుల సహచరుడైన రాఘవ పండితుడు అనునిత్యం తన ఇంట్లో అర్చించిన దైవవిగ్రహాలు, సాల గ్రామం ఆ స్థలానికి ఒక మైలు దూరంలో ప్రతిష్ఠితమై ఉన్నాయి. ఆ విగ్రహా లను దర్శించుకొని, వాటికి మ్రొక్కి తదుపరి తమ పడవల వద్దకు వెళ్లాలని భక్తులు నిర్ణయించారు. అందుకు శ్రీరామకృష్ణులు సమ్మతించి భక్తులతో

13. రాఘవ పండితుని ఇంటికి పోతున్నప్పుడు శ్రీరామకృష్ణుల భావావస్థ

మణిసేన్ దేవాలయం నుండి బయలుదేరారు. కాని ఆ కీర్తన బృందం మాత్రం విడిచిపెట్టకుండా శ్రీరామకృష్ణుల వెనుకే రాసాగింది. మహోత్సాహంతో భగవన్నామ సంకీర్తన చేస్తూ వారూ ఆయనను అనుసరించారు. శ్రీరామకృష్ణులు కొన్ని అడుగులు ముందుకు వేశారోలేదో, భావావస్థలో మగ్నులై నిశ్చలంగా నిలబడిపోయారు. పాక్షిక బాహ్యస్మృతి పొందిన తరువాత, భక్తులు ఆయనను ముందుకు నడవమని ప్రార్థించారు. నాల్గైదు అడుగులు ముందుకు వేసీ వేయగానే మళ్లీ ఆయన భావపారవశ్యులయ్యారు. పదే పదే ఇలా ఆయనకు భావావస్థ కలగడం వలన భక్తులు అతినెమ్మదిగా ముందుకు కదలవలసి వచ్చింది.

14. భావసమాధ్యవస్థలో శ్రీరామకృష్ణుల అలౌకిక సౌందర్యం

భావసమాధ్యవస్థలో ఆ రోజు శ్రీరామకృష్ణుల దేహంలో కానవచ్చిన దివ్యప్రకాశాన్ని, సౌందర్యాన్ని మేం మరెక్కడా చూసినట్లు గుర్తులేదు. ఆ దివ్య పురుషుని అద్భుత సౌందర్యం వర్ణనాతీతం. ఆధ్యాత్మిక భావోద్వేగ ప్రభావంలో క్షణమాత్రాన మనిషి దేహంలో అటువంటి మార్పు కలుగుతుందని మేం కనీసం ఎన్నడూ ఊహించనైనా ఊహించలేదు. నిత్యం మేం చూస్తున్న గురుదేవులు మరింత పొడవరిగా, కలలో కానవచ్చేట్లు అతి తేలిక దేహధారిగా కనిపించారు. ఆయన చామనఛాయ వర్ణం గౌరవర్ణంతో ప్రకాశించసాగింది. దివ్యభావంలో తేజరిల్లుతూ, అపూర్వమైన ఛిరునవ్వుతో గురుదేవుల ముఖారవిందం ఇప్పుడు అలౌకిక శాంత్యానందకారుణ్యాలను సంతరించుకొని దేదీప్యమానంగా ప్రకాశిస్తూ నలువంకలా కాంతిపుంజాలను వెదజల్లుతూన్నది. ఆ దృశ్యాన్ని చూసి మంత్రముగ్ధమైన ఆ జనసమూహం ఇతర విషయాలనన్నిటిని మరచిపోయి, తనకు తెలియకుండానే ఆయనను అనుసరించసాగింది. ఆయన ధరించిన గౌరవర్ణ పట్టువస్త్రం ఆయన మేనిఛాయతో ఒకటైపోయి అగ్నిజ్వాలలు ఆవరించిన వ్యక్తిలా భ్రమింపచేస్తున్నది.

15. శ్రీరామకృష్ణులను తిలకించిన సంకీర్తన బృంద ఉత్సుకత, ఆనందం

శ్రీరామకృష్ణులు మణిబాబు దేవాలయం నుండి వీథిలోకి రాగానే, సంకీర్తన బృందం ఆయన దివ్యసౌందర్యాన్ని, మనోహర నృత్యాన్ని, పదేపదే కలుగుతున్న ప్రగాఢ భావపారవశ్యాన్ని చూశారు. ఆ దృశ్యం వారి ఉత్సుకతను తారాస్థాయికి కొనిపోగా, వారు పాడనారంభించారు:

''సురనదీ తీరాన 'హరి' నామాన్ని గానం చేస్తున్నదెవరో?
ప్రేమప్రదాత నితాయ్ వచ్చినట్లుగా ఉంది,

'హరి' అని గానం చేస్తున్నదీ
'జై రాధ' అని జయజయధ్వానాలు చేస్తున్నదీ ఎవరో?
ప్రేమ ప్రదాత నితాయ్ వచ్చినట్లుగా ఉంది,
దివ్యప్రేమ ప్రదాత నితాయ్ అరుదెంచినట్లుగా ఉంది,
మన నితాయ్, ప్రేమ ప్రదాత, వచ్చాడు!
అతడు లేకుండా మా మనస్సులు ఎలా ఉపశమిస్తాయి?
ప్రేమప్రదాత మన నితాయ్ ఇక్కడకు వచ్చాడు!''

ఆ చివరి చరణాన్ని సంకీర్తన బృందంవారు గానం చేస్తున్నప్పుడు తమ వ్రేళ్లతో శ్రీరామకృష్ణులను చూపుతూ 'ఇదుగో మన ప్రేమ ప్రదాత' అంటూ పదేపదే పాడుతూ మహదానందంతో నృత్యం చేయసాగారు.

16. ఎల్లరూ శ్రీరామకృష్ణుల పట్ల ఆకర్షితులవడం

వారి ఉత్సుకత, ఉత్సవాన్ని తిలకింప వచ్చిన యావన్మందినీ ఆకర్షించగా, వారంతా అక్కడకు రాసాగారు. అక్కడకు వచ్చి శ్రీరామకృష్ణులను చూసిన వారంతా ముగ్ధులై మహోత్సాహంతో సంకీర్తన బృందంతో జతకట్టారు; లేదా వర్ణనాతీతమైన దివ్యభావోద్వేగం తమ హృదయాలలో ఉత్పన్నం కావడంతో విస్మయం చెంది, స్థాణువులై రెప్పవాల్చకుండా ఆయననే చూడసాగారు. ఆ సంకీర్తన బృందం ఉత్సుకత క్రమంగా అక్కడున్న ఎల్లరినీ ఆవరించడమే కాకుండా, కొన్ని సంకీర్తన బృందాలను కూడా ఆకట్టుకొంది; ఆ బృందాలవారూ అక్కడకు వచ్చి, ఈ బృందంతో జతకట్టారు. ఆ విధంగా భావపారవశ్యముగ్ధులై ఉన్న శ్రీరామకృష్ణులను పెద్ద జనసమూహం పరివేష్టించింది. అందరూ కలసి మెల్లగా రాఘవ పండితుని కుటీరం వైపుగా కదలసాగారు.

ఈలోగా భక్తురాండ్రు గంగాతీరాన ఉన్న రావిచెట్టు వద్దకు వెళ్లి శ్రీగౌరాంగ నిత్యానందుల పేరిట కొన్ని పళ్లెరాలలో మధురభక్ష్యాలు నివేదించి, ఆ ప్రసాదాన్ని గురుదేవుల వద్దకు తీసుకురాసాగారు. వారు రాఘవ పండితుని కుటీరానికి చేరడానికి కొస్త ముందు ఒక సంఘటన జరిగింది.

17. పళ్లెంలో ప్రసాదం

ఎక్కణ్ణుండి వచ్చాడో ఎవరికీ తెలియదు, బైరాగి వేషంలో వికారరూపుడైన వైష్ణవు డొకడు అలా వస్తున్న ఒక భక్తురాలి నుండి ప్రసాద పళ్లెరాన్ని గబుక్కున లాక్కొని భక్తిభావం పొంగిపొర్లుతున్న వ్యక్తిలా నటిస్తూ కొంత ప్రసాదాన్ని తన చేతులతో శ్రీరామకృష్ణుల నోట్లో పెట్టాడు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు భావపారవశ్య ప్రభావంలో నిశ్చల స్థితిలో నిలబడి ఉన్నారు.

ఆ వ్యక్తి ఆయనను తాకీతాకగానే ఆయన దేహమంతా కుంచించుకుపోయి ఆయన పారవశ్యస్థితి భగ్నమైంది. ఆ ఆహారాన్ని ఉమ్మివేసి నోటిని కడుక్కొన్నారు. ఆ వైష్ణవ డొక మోసగాడని గ్రహించడానికి ఎంతోసేపు పట్టలేదు. అందరూ తన వైపు ఏవగింపుగా చూడడంతో వాడు అక్కణ్ణుండి చల్లగా జారుకొన్నాడు. ఆ తరువాత శ్రీరామకృష్ణులు ఒక భక్తుడినుండి కించిత్తు ప్రసాదం నోటవేసుకొని, తక్కినదంతా భక్తులకు ఇచ్చివేశారు.

ఒక మైలు దూరంలో ఉన్న రాఘవ పండితుని కుటీరానికి చేరడానికి దాదాపు మూడు గంటలసేపు పట్టింది. శ్రీరామకృష్ణులు ఆలయానికి వెళ్లి, విగ్రహాలను స్పృశించి, మ్రొక్కి, ఒకింత విశ్రాంతి తీసుకొనేటప్పటికి అరగంట పట్టింది. ఆయనతో కూడా వచ్చిన జనం తమ దారిన తాము వెళ్లిపోయారు. గుంపు పలచనవడంతో భక్తులు ఆయనను పడవ వద్దకు తోడ్కొని వచ్చారు. కాని ఇక్కడ సైతం ఒక అద్భుత సంఘటన జరిగింది.

18. నవచైతన్యుని అనుగ్రహించడం

శ్రీరామకృష్ణులు ఉత్సవానికి వచ్చారని తెలిసి కొన్నగర్ వాస్తవ్యుడైన నవ చైతన్య మిత్ర ఆయన కోసం ఆతురతతో అక్కడా ఇక్కడా వెతకసాగాడు. ఇప్పుడు బయలుదేరనున్న పడవలో శ్రీరామకృష్ణులు కూర్చుని ఉండడం చూసి అతడు పిచ్చివాడిలా పరుగెత్తుకొంటూ ఆయన వద్దకొచ్చాడు. ఆయన కాళ్ల మీద పడి, ''ప్రభూ, నన్ను అనుగ్రహించు'' అంటూ హృదయోద్వేగాన్ని ఆపుకోలేక విలపించసాగాడు. ఆతడి వ్యాకులతకు, హృదయపూర్వక ప్రార్థనకు స్పందించి దివ్యభావంలో ఆయన నవచైతన్యుని స్పృశించారు. ఆ స్పర్శ ఫలితంగా అతడికి ఎటువంటి దివ్యదర్శనం కలిగిందో తెలియరాలేదుగాని, తృటిలో ఆతడి ఆవేదన మాత్రం పట్టరాని సంతోషంగా మారిపోయింది. బాహ్యస్మృతిని కోల్పోయిన వ్యక్తిలా ఆ పడవలో నవచైతన్య విశృంఖల నృత్యం చేయసాగాడు. శ్రీరామకృష్ణుల మహత్వాన్ని స్తుతుల రూపంలో శ్లాఘిస్తూ పదేపదే ఆయనకు మ్రొక్కసాగాడు. కొంతసేపు ఈ విధంగా గడిచాక గురుదేవులు అతడి వీపును నిమిరి అనునయిస్తూ, అతడికి పలు ఉపదేశాలు ఇచ్చారు.

నవచైతన్య ఇంతకు మునుపు శ్రీరామకృష్ణులను అనేకసార్లు దర్శించాడు గాని, ఆయన అనుగ్రహాన్ని పొందలేదు. నేడు ఆయన అనుగ్రహం పొంది, తరించాడు. ఆ తరువాత అతడు కుటుంబ వ్యవహారాలను తన కుమారునికి అప్పగించి, తన గ్రామంలోనే గంగాతీరాన ఒక కుటీరంలో వానప్రస్థునిలా సాధనలో, భగవన్నామ సంకీర్తనలో, గురుదేవుల మహత్వాన్ని కొనియాడ

డంలో శేషజీవితాన్ని గడిపాడు. నాటి నుండి వృద్ధుడైన నవచైతన్య సంకీర్తన సమయంలో భావపారవశ్యం పొందసాగాడు; భక్తితో ఊరిపోయి ఆనందప్రద మైన ఆతడి రూపాన్ని చూసి జనం అతణ్ణి ఎంతో గౌరవించేవారు. ఆ రీతిలో శ్రీరామకృష్ణుల అనుగ్రహానికి పాత్రుడైన నవచైతన్య తన శేషజీవితంలో ఎంతో మంది హృదయాలలో దైవభక్తిని జాగృతంచేసి, ధన్యుడయ్యాడు.

19. దక్షిణేశ్వరానికి తిరిగి రావడం

నవచైతన్య సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయాక శ్రీరామకృష్ణులు పడవను బయలుదేర అనుజ్ఞ నిచ్చారు. కాస్త దూరం మేం వెళ్ళగానే చీకటిపడింది; రాత్రి ఎనిమిదిన్నరకు మేం దక్షిణేశ్వరం చేరుకొన్నాం. తరువాత శ్రీరామకృష్ణులు తమ గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. భక్తులు ఆయనకు ప్రణామాలు చేసి, ఆయన వద్ద సెలవు పుచ్చుకొని కలకత్తా బయలుదేరారు. భక్తు లందరూ పడవలో కూర్చోబోతుండగా, వారిలో ఒక యువకుడు తాను మరచిపోయిన చెప్పులను తెచ్చుకోవడానికి శ్రీరామకృష్ణుల గదికి పరుగెత్తుకెళ్ళాడు. అతడు తిరిగి ఎందుకు వచ్చాడో ప్రశ్నించి తమాషాగా శ్రీరామకృష్ణులు "పడవ బయలుదేరడానికి ముందే అదృష్టవశాత్తు నీ కీ విషయం జ్ఞాపకం వచ్చింది. లేకుంటే ఈనాటి ఆనందమంతా మంటకలిసి పోయేది" అని అన్నారు. ఆ మాటలు విని ఆ యువకుడు నవ్వి, ఆయనకు ప్రణామం చేసి వెళ్ళబోతుండగా ఆయన, "ఈ రోజు ఎలా ఆనందించావు? హరినామ సంత జరిగింది కదా!" అని అడిగారు. ఆ యువకుడు అందుకు తల ఊపగా, ఆ ఉత్సవ స్థలంలో భావపారవశ్యం పొందిన భక్తులను ఆయన పేర్కొన్నారు. ఆయన చిన్న నరేంద్రుణ్ణి ప్రశంసిస్తూ ఇలా అన్నారు: "ఆ నల్లని పిల్లవాడు ఇక్కడకు కొద్దిరోజుల నుండే వస్తున్నాడు; ఇప్పటికే అతడికి భావ పారవశ్య స్థితులు కలుగుతున్నాయి. ఆ రోజు ఆతడి భావపారవశ్యం ఎంత సేపటికీ తగ్గలేదు; ఒక గంటకు పైగా అతడు బాహ్యస్మృతిని కోల్పోయాడు. 'నా మనస్సు ఇటీవల భగవంతుని నిరాకారంలో లీనమౌతున్నది' అని చెబుతూవుంటాడు. చిన్న నరేంద్రుడు సజ్జనుడు; ఏమంటావు? ఒక రోజు అతడి ఇంటికి వెళ్ళి అతడితో మాట్లాడి చూడు. వెళతావు కదూ?"

ఆ యువకుడు ఆయన మాటలన్నిటికీ తన అంగీకారం తెలిపి, "కాని మహాశయా, పెద్ద నరేంద్రుణ్ణి ఇష్టపడినంతగా నే నెవరినీ ఇష్టపడను. కాబట్టి చిన్న నరేంద్రుడి ఇంటికి వెళ్ళడానికి నాకు మనస్కరించడం లేదు" అని చల్లగా చెప్పాడు. అలా చెప్పినందుకు గురుదేవులు అతణ్ణి చీవాట్లు పెట్టి, ఇలా అన్నారు: "కుర్ర వెధవా, ఎంత పక్షపాతబుద్ధిరా నీది! భగవంతుని పువ్వుల సజ్జలో వివిధ రకాల పువ్వులు ఉంటాయి. ఆయనకు వివిధ రకాల భక్తులు

ఉంటారు. అందరితో కలసిపోయి మెలగుతూ ఆనందించలేకపోవడం, అల్ప త్వాన్ని సూచిస్తుంది. నువ్వు ఒక రోజు తప్పక చిన్ననరేంద్రుణ్ణి చూసిరావాలి? సరేనా?'' ఇక తప్పదని, ఆ యువకుడు అందుకు అంగీకరించి, ఆయనకు ప్రణామం చేసి సెలవు పుచ్చుకొని వెళ్లిపోయాడు. గురుదేవుల సలహా మేరకు ఆ యువకుడు కొద్దిరోజులలోనే చిన్న నరేంద్రుని ఇంటికి వెళ్లినట్లు, అతడితో మాట్లాడిన ఫలితంగా క్లిష్టమైన తన జీవిత సమస్యకు పరిష్కారం పొందినట్లు తరువాత మాకు తెలియవచ్చింది.

నాటి రాత్రి పదిగంటలప్పుడు పడవ కలకత్తా చేరుకొంది.

20. మాతృదేవి వివేకం గురించి శ్రీరామకృష్ణులు

ఆనాటి రాత్రి భక్తురాండ్రు మాతృదేవివద్దే ఉండిపోయారు. మర్నాడు స్నానయాత్రోత్సవమూ, అట్లే కాళికాలయ ప్రతిష్ఠాపన వార్షికోత్సవమూ కావడం వలన ఆ ఉత్సవ వేడుకలను తిలకించిన తరువాత కలకత్తాకు తిరిగి పోవడానికి వారు నిర్ణయించుకొన్నారు. రాత్రి భోజనం చేస్తూ పానీహాటీ ఉత్సవం గురించి ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు ఒక భక్తురాలితో ఇలా అన్నారు: ''జనం తండోపతండాలుగా వచ్చారు; పైగా భావపారవశ్యం కారణంగా అందరి దృష్టి నా మీదే ఉండిపోయింది. ఆమె (మాతృదేవి) రాకపోవడం మంచిదే అయింది. ఆమెను జనం నా ప్రక్కన చూసివుంటే తప్పకుండా హంస[1], హంసి వచ్చారని వ్యాఖ్యానించి ఉండేవారు. ఆమె ఎంతో వివేకవంతురాలు.''

మాతృదేవి అసాధారణ తెలివితేటలకు మరొక ఉదాహరణగా ఆయన ఇలా కొనసాగించారు: ''మార్వాడీ భక్తుడు లక్ష్మీనారాయణ పదివేల రూపాయలు కానుకగా ఇవ్వగోరినప్పుడు నా తలను ఎవరో రంపంతో పరపర కోస్తున్నట్లు అనిపించింది. 'అమ్మా, ఇంతకాలం తర్వాత కూడా నన్ను ప్రలోభానికి గురిచేయ చూస్తున్నావా?' అని అమ్మను అడిగాను. ఆమె (మాతృదేవి) మనస్సును పరీక్షించే ఉద్దేశంతో ఆమెను పిలిపించి, 'ఇలా చూడు, అతడు పెద్ద మొత్తం ఇవ్వచూస్తున్నాడు. నేను అందుకు అంగీకరించనందున, ఆ మొత్తాన్ని నీకు ఇద్దామనుకొంటున్నాడు. నువ్వు పుచ్చుకోవచ్చు కదా! ఏమంటావు?' అని అడిగాను. ఆ మాటలు విన్న తక్షణమే ఆమె ఇలా అన్నది: 'నే నెలా పుచ్చుకొంటాను? ఆ పైకం ఎన్నటికీ పుచ్చుకోను. ఒకవేళ ఆ పైకం నేను పుచ్చుకొన్నా, మీ సేవల, అవసరాల నిమిత్తం మాత్రమే దాన్ని వినియోగించవలసి

---

1. హంస అనే పదానికి ఉత్కృష్ట సన్న్యాసి అనే అర్థం కూడా ఉంది. హంస, హంసి అంటే మగహంస, ఆడహంస అని వ్యంగ్యార్థంలో ఆయన చెప్పారు.

ఉంటుంది. అంటే ఆ పైకం మీరు పుచ్చుకొన్నట్లే అవుతుంది కదా! మీ వైరాగ్యాన్ని చూసే లోకులు మీ పట్ల భక్తిప్రపత్తులు చెల్లిస్తున్నారు. కాబట్టి ఏ విధంగాను ఆ పైకం పుచ్చుకోవడం అసంభవం.' ఆమె జవాబు విని బ్రతుకుజీవుడా అనుకొన్నాను.''

శ్రీరామకృష్ణులు భోజనం చేసిన తరువాత భక్తురాండ్రు నహబత్‌లోని మాతృదేవి వద్దకు వెళ్లి గురుదేవులు ఆమెను గురించి చెప్పిన విషయం ఆమెకు తెలిపారు. ఆ విషయం విని ఆమె ఇలా అంది: ''ఉదయం ఆయన కబురు పంపిన తీరునుబట్టే నేను పానీహాటీకి వెళ్లడం ఆయనకు మనస్ఫూర్తిగా ఇష్టంలేదని గ్రహించాను. లేకపోతే, 'తప్పకుండా రావచ్చు' అని చెప్పేవారు. కాని వెళ్లాలా? వద్దా? అనే నిర్ణయాన్ని నాకే వదలివేసి, 'రాగోరితే రావచ్చు' అని ఎప్పుడన్నారో అప్పుడే పోవడం సబబు కాదని నిర్ధారణ చేసుకొన్నాను.''

21. ఈ అంశం గురించి మాతృదేవి వచనాలు

శరీరంలో విపరీతమైన మంట కారణంగా నాటి రాత్రి శ్రీరామకృష్ణులకు నిద్రపట్టలేదు. ఉత్సవంలో నానారకాల వ్యక్తులు ఆయన పావన దేహాన్ని తాకినందున అలా జరిగివుండవచ్చు. ఎందుకంటే రోగం నయమవాలనో లేదా మరేదో ఉద్దేశంతోనో కల్మష మనస్కులైన అపవిత్రులు ఆయన పాదధూళి స్వీకరించినప్పుడల్లా తరచు ఆయన అటువంటి శారీరక మంటను అనుభవించడం కద్దు.

22. స్నానయాత్ర దినం: శ్రీరామకృష్ణులు విసుగు చెందడం

పానీహాటీ మహోత్సవం జరిగిన మర్నాడు స్నానయాత్రోత్సవం జరిగింది. మేం ఆ రోజు దక్షిణేశ్వరానికి వెళ్లలేకపోయాం. అనేకులు గురుదేవుల దర్శనార్థం ఆ రోజు దక్షిణేశ్వరానికి వచ్చారని భక్తురాండ్ర నుండి మేం విన్నాం. దర్శనార్థులలో 'అ' తల్లి కూడా ఉంది. తన ఆస్తిపాస్తుల పరిష్కారంలో సహాయం చేయమని ఆయనను సతాయించిందనీ, ఆ కారణంగా ఆనాటి ఆయన ఆనందానికి పెద్దవిఘ్నం ఏర్పడిందనీ మేం విన్నాం. మధ్యాహ్న భోజన సమయంలోకూడా వదలిపెట్టకుండా ఆమె, ఆయన దగ్గరే కూర్చుని ఉండడం చూసి ఆయన ఎంతో విసుగుచెంది, ఆ తరువాత ఆమెతో మాట్లాడలేదట; మామూలుగా భోజనం కూడా చేయలేకపోయారట. తదనంతరం మాకు పరిచయస్థురాలైన ఒక భక్తురాలు ఆయన చేతులు కడుక్కోవడానికి నీళ్లు పోస్తూవుంటే, ఆమెతో ఏకాంతంగా ఆయన ఇలా అన్నారట: ''భగవంతుని పట్ల భక్తిప్రేమలు పొందాలని ఆశించి జనం ఇక్కడకు వస్తారు. తన ఆస్తిపాస్తుల పరిష్కారానికి ఇక్కడికి వచ్చింది ఆ స్త్రీ! ఆ దురుద్దేశంతోనే మామిడిపళ్లు, మిఠాయిలు తీసుకువచ్చింది; వాటిలో ఒక్క ముక్క కూడా నేను నోటపెట్ట

లేదు. నేడు స్నానయాత్రోత్సవం. గత స్నానయాత్ర దినాలలో ఎంతటి భావ పారవశ్యంలో మునిగివుండేవాణ్ణి! ఆ భావపారవశ్యం జనింపచేసిన మత్తు రెండు మూడు రోజుల దాకా కొనసాగేది. ఈ రోజు భావపారవశ్యం కలిగితే ఒట్టు! నానారకాల వ్యక్తుల సంసర్గం, ఇక్కడి వాతావరణం కారణంగా ఉన్నత భావాలు జనించలేదు.''

'అ' తల్లి నాటి రాత్రికూడా దక్షిణేశ్వరంలో ఉండిపోవడంతో శ్రీరామ కృష్ణుల విసుగు రాత్రి సైతం ఉపశమించలేదు. రాత్రి భోజనం చేస్తున్నప్పుడు ఒక భక్తురాలితో ఆయన ఇలా అన్నారు: ''ఇంతమంది స్త్రీలు ఇక్కడ గుమి గూడడం మంచిది కాదు. మథుర్‌బాబు కుమారుడు త్రైలోక్యుడు ఇక్కడే ఉన్నాడు. దీన్ని చూసి అతడు ఏమనుకొంటాడు? అప్పుడప్పుడు ఏదో ఒక రిద్దరు వచ్చి ఒకటి రెండు రోజులు బసచేసిపోతే ఫరవాలేదు; కాని గుంపుగా ఉండిపోతే ఎలా? ఆడవాళ్ల రద్దీని నేను భరించలేను.''

తమ కారణంగా శ్రీరామకృష్ణులు బాగా విసుగుచెంది ఉన్నారని గ్రహించి భక్తురాండ్రు ఖిన్నులై, తెల్లవారగానే కలకత్తాకు తిరిగి వెళ్లిపోయారు.

కాళికాలయంలో విశేషపూజ, యాత్ర, నైవేద్యాదులతో స్నానయాత్రో త్సవం నాడు ఎంతో వైభవంగా జరిగింది; కాని భక్తులు పై కారణంగా పెద్దగా ఆనందించలేకపోయారు.

ఎడతెగకుండా ఉన్నతభావభూములలో నెలకొని ఉంటున్నప్పటికీ, దైనందిన జీవితంలో జరిగే ప్రతి విషయాన్ని ఆయన ఎంత నిశితంగా గమ నించేవారో, భక్తుల హితవుకోసం ఆయన వారిని ఎలా శాసిస్తూ నిర్దేశిస్తూ ఉండేవారో పై సంఘటన నుండి పాఠకులు కొంత మేరకు అర్థం చేసుకోవచ్చు.

11. శ్రీరామకృష్ణులు కలకత్తాకు తరలిరావడం

1. పానీహాటీ అను ఘుంతో శ్రీరామ కృష్ణుల గొంతునొప్పి ప్రకోపించడం

పానీహాటీ మహోత్సవంలో పాల్గొన్న తదనంతరం శ్రీరామకృష్ణుల గొంతు నొప్పి ప్రకోపించింది. ఆ రోజు అప్పుడప్పుడు వర్షం కూడా కురిసింది. వానలో తడుస్తూ ఒట్టి కాళ్లతో చాలా సేపు ఉండడం వలన నొప్పి అధికరించిందనీ, అటు వంటిది మళ్లీ జరగకూడదనీ, జరిగితే పరిస్థితి విష మిస్తుందనీ వైద్యులు, భక్తులకు హెచ్చరికగా సూచించారు. అప్పటి నుండి చాలా అప్రమత్తంగా ఉండాలని భక్తులు నిశ్చయించుకొన్నారు.

బాలక స్వభావులైన శ్రీరామకృష్ణులు ఆనాటి వైద్యనిషేధాల ఉల్లంఘన తప్పునంతా రామచంద్రదత్త వంటి పెద్దలైన భక్తుల మీద మోపి, ''వెళ్ల కూడదని పట్టుపట్టి చెప్పివుంటే ఆ రోజు నేను పానీహాటీకి వెళ్లేవాణ్ణా?'' అని వాళ్లను నిలదీసినట్లు అడిగారు. వృత్తిరీత్యా రామచంద్ర దత్త వైద్యుడు కాక పోయినప్పటికీ, కాంప్‌బెల్ వైద్యసంస్థలో అతడు చదివి, డిప్లొమో పొంది వున్నాడు. వైష్ణవ మత అభిమాని కావడం వలన పానీహాటీకి వెళ్లడానికి ఒక రకంగా అతడు గురుదేవులను ప్రోత్సహించాడు. ఆ కారణంగా జరిగిన తప్పులో అధిక బాధ్యతను అతడు వహించవలసి వచ్చింది.

ఒక రోజు మా మిత్రు డొకడు దక్షిణేశ్వరానికి వెళ్లి, తమ గదిలో చిన్న మంచం మీద, గొంతుకు లేపనం పూసుకొని నిశ్చలంగా కూర్చునివున్న శ్రీరామ కృష్ణులను చూశాడు. అప్పుడు ఏం జరిగిందో అతడిలా మాతో చెప్పాడు: ''ఒక పనిని చేయవద్దని కట్టడిచేసి, ఒకచోట కదలనివ్వకుండా కూర్చోబెట్టిన పిల్లవాడి ముఖంలో ద్యోతకమయ్యే విషాదఛాయలు ఆయన ముఖంలో కాన వచ్చాయి. ఆయనకు ప్రణామం చేసి, విషయం ఏమిటని అడిగాను. ఆయన తమ గొంతుకు పూసిన లేపనాన్ని చూపుతూ, 'ఇలా చూడు. నొప్పి

అధికరించడంతో వైద్యుడు ఎక్కువగా మాట్లాడవద్దని నిషేధించాడు!' అని చెప్పారు. అందుకు నేను, 'అదా విషయం! ఆ రోజు మీరు పానీహాటీకి వెళ్లారని విన్నాను. అందుకే బహుశా నొప్పి ఎక్కువై ఉంటుంది' అని అన్నాను. ఆ మాటలకు అభిమానం దెబ్బతిన్న చిన్నపిల్లవాడిలా ఇలా అన్నారు: 'కాని చూడు. పైన, క్రింద నీళ్లు. పైగా వాన కురుస్తూవుంది. వీథులన్నీ బురదమయం. అయినప్పటికీ రాం (రాంచంద్రదత్త) నన్నక్కడకు తోడ్కొని వెళ్లి రోజంతా నృత్యం చేయించాడు! అతడు ఒక పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. పైగా వైద్యుడుకూడా. వెళ్లవద్దని గట్టిగా నిషేధించివుంటే నే నక్కడకు వెళ్లేవాడినా?' ఆయన మాటలు విని నేను, 'అవునండి. రాం పొరపాటు చేశాడు. అయినా జరిగిందేమో జరిగిపోయింది. ఇప్పటినుండి కొన్నిరోజులు జాగ్రత్తగా ఉండండి, నొప్పి తగ్గిపోతుంది' అని చెప్పాను. నా జవాబు విని ఆయన ప్రసన్నులై, ఇలా అన్నారు: 'మాటా పలుకూ లేకుండా ఎవరైనా ఊరకే ఉండగలరా? ఎంతోదూరం నుండి నువ్వు వచ్చావు కదా! మరి నేను నీతో ఒక్క మాటకూడా మాట్లాడకూడదా? మరో విధంగా ఇది సాధ్యమా?' అందుకు నే నిలా జవాబిచ్చాను: 'మిమ్మల్ని చూడడంతోనే నేను సంతృప్తి చెందాను. అటువంటప్పుడు మీరు మాట్లాడడం ఎందుకు? ఈ పరిస్థితుల్లో మీరు మౌనం పాటిస్తే మాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. మీకు నయమైనాక మళ్లీ మీ నుండి ఎన్నో గొప్ప విషయాలు తప్పక వినగలుగుతాం.' కాని ఆయన నా మాటలు అసలు పట్టించుకోలేదు. వైద్యుల నిషేధాన్ని, తమ బాధను, మిగిలిన విషయాలను మరచిపోయి ఇంతకు మునుపులా నాతో మాట్లాడనారంభించారు.''

2. వైద్యుల నిషేధాన్ని శ్రీరామకృష్ణులు ఉల్లంఘించడం

ఆషాఢమాసం గడిచిపోయింది. నెలరోజుల పైగా ఆయన చికిత్స పొందుతున్నప్పటికీ గొంతునొప్పి ఏమాత్రం తగ్గుముఖం పట్టలేదు. ఇతర సమయాలలో నొప్పి కొంచెం తగ్గినా, పౌర్ణమి అమావాస్య ఏకాదశి వంటి రోజులలో నొప్పి ప్రకోపించేది. ఆ రోజులలో ఎటువంటి కూరగాయలు లేదా ఘన ఆహారాన్ని మ్రింగడానికి ఆయనకు దాదాపు అసాధ్యమయ్యేది. కాబట్టి ఆ రోజుల్లో పాలన్నం లేదా రవ్వతో చేసిన పాయసం కాస్త పుచ్చుకొనేవారు. వైద్యులు ఆయనను మళ్లీ పరీక్ష చేసి, ఆయన వ్యాధిని 'ఉపన్యాసకులకు వచ్చే గొంతు నొప్పి'గా నిర్ధారణ చేశారు. అంటే రేయింబవళ్లు ఎడతెగకుండా ధార్మిక ప్రసంగాలు చేయడం వలన ఆయన గొంతులోని స్వరపేటిక ఎంతో ఒత్తిడికి గురికావడంతో ఆ వ్యాధి సంక్రమిం

చింది. వైద్యులు మందులు, పథ్యపానాదులు మొదలైనవి నిర్ణయించారు. శ్రీరామకృష్ణులు వైద్యుల సలహాలను తు.చ. పాటించినప్పటికీ, రెండు విషయాలలో వారి సలహాలను ఉల్లంఘించారు. ప్రగాఢ భగవద్భక్తి, సంసార తాపత్రయాలతో అల్లాడిపోతున్న జనుల పట్లగల అపార కారుణ్యం కారణంగా ఆయన భావపారవశ్య స్థితులలోకి ప్రవేశించడాన్ని, భక్తులతో మాట్లాడడాన్ని మాత్రం మానుకోలేకపోయారు. మాటలలో భగవంతుని గురించిన ప్రస్తావన రాగానే ఇంతకు మునుపులా ఆయన భావపారవశ్యమగ్నులైపోయేవారు; అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతూ అంతులేని బాధలు అనుభవిస్తూ శాంతి పొందడమెలా అనే వ్యాకులతతో సరైన మార్గంకోసం అన్వేషిస్తూ వచ్చిన లోకుల పట్ల అపార కారుణ్యం వహించి, వైద్యుల నిషేధాలను గాలికి వదలివేసి, వారికి సదుపదేశాలు ఒసగి, ఆశీర్వదించి పంపసాగారు.

ఆ సమయంలో ఆధ్యాత్మిక పిపాసువులు అనేకులు శ్రీరామకృష్ణుల వద్దకు రాసాగారు. పాత వారే కాక, ఆధ్యాత్మిక దప్పిక తీర్చుకోవడానికి నిత్యం ఐదారుమంది క్రొత్తవ్యక్తులూ దక్షిణేశ్వరానికి రాసాగారు.

3. శ్రీరామకృష్ణుల వ్యాధికి కారణాలు

1875వ సం॥లో కేశవచంద్రసేన్ దక్షిణేశ్వరానికి వచ్చి, శ్రీరామకృష్ణుల మహత్వాన్ని ప్రకటింప ప్రారంభించినప్పటి నుండి రోజు అలాగే జరుగుతూ వస్తోంది. కాబట్టి గత పదకొండు సంవత్సరాలూగా ఆధ్యాత్మిక ఆకలిదప్పికలతో అలమటించే వారికి సేదతీర్చడంలో తిండి తిప్పలు మొదలైన దైనందిన ఆవశ్యకత విషయాల పట్ల ఎంతో అశ్రద్ధ వహిస్తూవచ్చారు. పైగా మహాభావ ప్రేరణ వలన ఆయనకు నిద్రకూడా బాగా కరవయింది. మేం దక్షిణేశ్వరంలో ఆయనతో బసచేసి ఉన్న సమయంలో, అనేక సందర్భాలలో రాత్రి 11 గంటలకు పడుకొని ఒకింత సేపట్లోనే లేచి భావపారవశ్య స్థితిలో పచార్లు చేయడం మేం చూసివున్నాం. ఒకసారి పశ్చిమ ద్వారాన్ని, మరొకసారి ఉత్తర ద్వారాన్ని తెరచుకొని బయటకు వెళ్లేవారు; మళ్లీ మంచం మీద ప్రశాంతంగా పడుకొనివున్నా, పూర్తి మెలకువతోనే ఉండేవారు. రాత్రి మూడు నాలుగుసార్లు పడకమీద నుండి లేచేవారు; అయినప్పటికీ నిత్యం తెల్లవారు జాము 4 గంటలకే లేచి భగవంతుణ్ణే స్మరిస్తూ, ధ్యానిస్తూ తెల్లవారడంకోసం నిరీక్షించేవారు. ఆ తరువాత మమ్మల్ని మేల్కొలిపేవారు. ఎడతెగక నిద్ర లేమితో రాత్రిళ్లు గడపడం వలనా, పగటివేళ అనేకులకు ఆధ్యాత్మికోపదేశాలు ఇవ్వడంలో అమితంగా శ్రమించడం వలనా ఆయన దేహారోగ్యం బాగా దెబ్బతిని పోయిందనడంలో ఆశ్చర్యం ఏముంది?

4. భావసమాధిలో జగజ్జననితో శ్రీరామ కృష్ణులు తగవులాడడం

తమ శరీరం బాగా అలసిపోయి నిస్సత్తువ ఆవహిస్తూందన్న విషయం శ్రీరామకృష్ణులు ఎవరికీ వ్యక్తం చేయకపోయినా, భావావస్థలో జగజ్జననితో అప్పుడప్పుడు ప్రేమపూర్వకంగా తగవులాడడంలో పై విషయం సూచనప్రాయంగా మేం గ్రహించాం; కాని విషయం మాకు పూర్తిగా అవగతం అయ్యేది కాదు.

శ్రీరామకృష్ణులు అస్వస్థతకు గురికావడానికి ఒకింత కాలం ముందు మాలో ఒకరకం దక్షిణేశ్వరానికి వెళ్లినప్పుడు ఆయన తమ చిన్న మంచం మీద కూర్చుని భావావస్థలో ఎవరినో ఉద్దేశించి ఇలా అంటున్నారు: ''నిరర్థకుల నందరినీ ఇక్కడకు తోడ్కొని వస్తున్నావు. ఒక్క సేరు పాలలో ఐదు సేర్ల నీళ్లు కలిపినట్లుగా ఉంది! తడి కట్టెలను నోటితో ఊది ఊది నా కళ్లు ఎర్రబారి ఉబ్బిపోయాయి, ఎముకలు నుగ్గునుగ్గు అయిపోతున్నాయి. అంత పని చేయడం నావల్ల కాదు. నీకు ప్రీతిగా ఉంటే నువ్వే చేసుకో. ఒకటి రెండు మాటల్లో ఆధ్యాత్మిక జాగృతం సంతరించుకొనే యోగ్యులను మాత్రం ఇక్కడకు తోడ్కొనిరా.''

మరొక సందర్భంలో తమవద్ద కూర్చున్న భక్తులతో శ్రీరామకృష్ణులు ఇలా పలికారు: ''అమ్మను నేడు, 'విజయ్, గిరీష్, కేదార్, రాం (రాంచంద్ర), పంతులు (శ్రీరామకృష్ణ కథామృత రచయిత 'మ') - వీరికి కొంచెం శక్తిని ప్రసాదించు. దానివలన కొత్తగా వచ్చేవారు ముందుగా వీరి వద్ద తమ లోపాలను చక్కబరచుకొని ఆ తరువాత ఇక్కడకు (తమ వద్దకు) వస్తారు' అని వేడుకొన్నాను.''

లోకుల జీవితాలను, వారి ఆధ్యాత్మిక వైఖరులను తీర్చిదిద్దడం గురించి ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు ఒక సందర్భంలో ఒక భక్తురాలితో, ''నువ్వు నీళ్లు పొయ్యి, నేను మట్టిని సిద్ధంచేస్తాను'' అని చెప్పారు. ఆధ్యాత్మిక దప్పికతో తపించిపోతున్న జనం గుంపులు గుంపులుగా దక్షిణేశ్వరానికి రావడం చూసి, మొదటిసారిగా గొంతులో నొప్పి కలిగిన కొద్దిరోజుల తదనంతరం, భావపారవశ్యంలో జగజ్జననితో ఇలా మొరపెట్టుకొన్నారు: ''ఇంతమందినా తోడ్కొని రావడం? పెద్ద గుంపునే ఉత్పన్నం చేస్తున్నావు; స్నానానికి, తినడానికి తీరికే లేకపోతున్నది. ఇది కేవలం ఒక మద్దెల, అదీ చిల్లులు పడ్డది (తమ శరీరాన్ని సూచించి). రేయింబవళ్లు వాయిస్తూవుంటే ఇది ఎంతకాలం మన్నుతుంది?''

1884వ సంవత్సరానికి దక్షిణేశ్వరంలో వసిస్తూన్న శ్రీరామకృష్ణులు యావత్తు కలకత్తా నగరంలో సుప్రసిద్ధులయ్యారు. ఆయన అనుపమాన వ్యక్తిత్వం, తరచు పొందే భావావస్థలు, అతిసరళంగా అమృతవాక్కులతో

5. దక్షిణేశ్వరంలో భక్త ప్రవాహం

కూడిన ఆయన ఆధ్యాత్మికోపదేశాలు, సాధకులలో ఆధ్యాత్మిక అవ్యక్తతను ఇట్టే జాగృతం చేయగల ఆయన అసదృశశక్తి, కులమత విచక్షతలేని ఆయన ఎల్లరి పట్లా చూపే నిస్వార్థ ప్రేమ - ఇవన్నీ కలకత్తా వాసులు సామాన్యంగా ఆయన గురించి ముచ్చటించుకొనే విషయాలు. దాంతో కలకత్తా జనానీకం పెద్దసంఖ్యలో ఆయనను దర్శింప దక్షిణేశ్వరానికి రాసాగారు; ఒకసారి ఆయనను దర్శించినవారికి, పదేపదే ఆయన వద్దకు రావడం పరిపాటి అయిందని చెప్పడం అతిశయోక్తి కాబోదు. వారంతా ఒకేసారి, ఒకే రోజు వచ్చే ఆస్కారం లేదు కనుక అటువంటి వారి సంఖ్యను అంచనా కట్టడం సాధ్యం కాదు. ఒక విధంగా చూస్తే ఇదీ మంచికే అనిపిస్తుంది. ఎందుకంటే నానాటికీ అధికంగా వస్తూన్న భక్తులను చూసి శ్రీరామకృష్ణుల అంతరంగ భక్తుల సంతోషం ఇతోధికమైంది; వారెవరిని పూజ్యులుగా ఆరాధిస్తున్నారో వారే ఇప్పుడు ఎల్లరకూ ఆరాధనీయులైనారనీ, అందరికీ ప్రీతిపాత్రులయ్యారనీ ఆనందంతో వారు పొంగిపోయారు. కాని ఏకకాలంలో అనేకులు రావడం చూస్తే అది సంతోషానికి కారణం కావడమే కాక దుఃఖానికీ, భయానికీ కూడా కారణమయ్యేది. ఎందుకంటే, ''అనేకులు ఎప్పుడు దీన్ని (తమను) దేవుడని పరిగణించి భక్తిప్రపత్తులు దీనికి (తమకు) చెల్లిస్తారో, అప్పుడు ఇది (తమ దేహం) కనుమరుగైపోతుంది'' అని శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు వచించి ఉండడం వారు వినలేదా? వారు తరచు కలుసుకొంటూ ఉంటే తప్పకుండా ఈ విషయం గురించి చర్చించుకొని కచ్చితంగా విషాదభరితులవడం తథ్యం.

6. తమ మరణ కాలాన్ని శ్రీరామకృష్ణులు ముందుగానే సూచించడం

తమ మరణ కాలాన్ని గురించి అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు సూచన ప్రాయంగా మాకు తెలియచేసి ఉన్నారు. కాని స్పష్టంగా ఆ మాటలు విన్నప్పటికీ ఆయన ప్రేమలో కళ్ళుమూసుకొనిపోయి, అప్పట్లో మేం ఆ మాటలను పట్టించుకోలేదు. ఆ పలుకులను పైపైకి అర్థం చేసుకొన్నా వాటి అంతరార్థాన్ని అవగతం చేసుకోలేక పోయాం. వాళ్ళ మనస్సులో అప్పుడు ఒకే ఆలోచన మెదలేది; శ్రీరామకృష్ణుల అనుగ్రహం వలన తాము అనుభవిస్తున్న ప్రశాంతతను తమ మిత్రుల, బంధువులతో కూడా అనుభవించేలా చేయాలన్నదే వారి ఆ ఏకైక ఆలోచన. కాబట్టి ఆయన మరణిస్తారనే భయం వారి మనస్సులలో ఏనాడు మెదలలేదు.

శ్రీరామకృష్ణులకు గొంతువ్యాధి సంక్రమించడానికి నాల్గైదేళ్ళ మునుపు శ్రీరామకృష్ణులు, ఒకసారి మాతృదేవితో ఇలా చెప్పారు: ''ఎప్పుడు నేను ఎవ

రంటే వారి చేతినుండి ఆహారం పుచ్చుకొంటానో, రాత్రుళ్లు కలకత్తాలో గడుపుతానో, నా ఆహారంలో కొంత ముందుగా ఇతరుల కిచ్చి తక్కినది తింటానో అప్పుడు నా మరణకాలం త్వరలోనే సమీపిస్తున్నదని గ్రహించుకో.'' శ్రీరామకృష్ణులకు గొంతువ్యాధి సంక్రమించడానికి మునుపు నుండే భవిష్యద్వాణి మేరకు సంఘటనలు జరగసాగాయి. అనేకుల ఆహ్వానాలను పురస్కరించుకొని కలకత్తాకు వెళ్లి అన్నం మాత్రం తప్ప ఇతర ఆహారపదార్థాలన్నీ ఆయన స్వీకరించసాగారు; అప్పుడప్పుడు అనుకోని రీతిలో బలరాం ఇంట్లో రాత్రిళ్లు కూడా గడపసాగారు; నరేంద్రుడు అజీర్తితో బాధపడుతూ కొన్ని రోజులు ఆయన వద్దకు వెళ్లలేకపోయాడు; అతడికి పథ్యపానాదులు సరిగా సమకూరవేమోనని తలచి ఒక రోజు ఉదయాన అతణ్ణి దక్షిణేశ్వరానికి పిలిపించుకొన్నారు; తమకోసం వండిన చారన్నంలో కొంత ముందుగా అతడికి తినిపించి, మిగిలిన అన్నాన్ని తాము భుజించారు. అందుకు మాతృదేవి అభ్యంతరం తెల్పి, మళ్లీ ఆయనకోసం వండుతానని చెప్పినా ఆయన వినలేదు; పైగా ఇలా అన్నారు: ''ఈ అన్నంలో కొంతభాగం ముందుగా నరేంద్రుడికి ఇస్తున్నప్పుడు నా మనస్సు కుంచించుకుపోలేదు. కనుక నాకు ఏ హానీ వాటిల్లదు. మళ్లీ నువ్వు వండ నవసరం లేదు.'' కాలాంతరంలో మాతృదేవి, ''ఆయన అలా చెప్పినప్పటికీ, ఆయన భవిష్యద్వాణి గుర్తుకువచ్చి నేను ఎంతో ఆందోళనపడ్డాను'' అని చెప్పింది.

7. శివజ్ఞానంతో శ్రీరామకృష్ణుల జీవ సేవ

లోకులకు ఉపదేశించడంలో అమితంగా శ్రమించడం వలన ఆయన దేహాన్ని నిస్సత్తువ ఆవహించింది; కాని ఆ విషయంలో మానసిక ఉత్సుకత మాత్రం కించిత్తు కూడా తగ్గలేదు. యోగ్యుడైన వ్యక్తి ఎవరైన రాగానే తమ హృదయాంతరాళాలలో ఆతడి యోగ్యతను ఇట్టే పసిగట్టి దివ్యభావంలో తన్మయులై అతడికి ఉపదేశించే వారు లేదా అతణ్ణి స్పృశించేవారు; ఆ విధంగా ఆతడి ఆధ్యాత్మిక పురోగతికి మార్గద్వారం తెరిచేవారు.

అది ఇలా జరిగేది: క్రొత్తగా వచ్చిన వ్యక్తి ఆధ్యాత్మిక భావం శ్రీరామకృష్ణుల హృదయంలో ప్రతిస్పందన కలిగించి, ఆయనలోని ఇతర భావాలన్నీ తాత్కాలికంగా వైదొలగేవి. పిదప దివ్యదృష్టితో ఆ వ్యక్తి సంపూర్ణత్వం వైపు ఎంతగా పురోగమించాడో, ఇంకా ఎందుకు ముందంజ వేయలేకపోయాడో గ్రహించేవారు. తరువాత ఆతడి మార్గంలోని అడ్డంకులను తొలగించి, అతణ్ణి ఉన్నత భావభూములను అధిరోహింప చేసేవారు.

ఆ విధంగా తమ జీవిత ఆఖరి క్షణం వరకు సర్వదా శివజ్ఞానంతో శ్రీరామకృష్ణులు జీవులను సేవిస్తూ, ఆబాలవృద్ధుల జన్మజన్మాంతరాల ఆధ్యాత్మిక తపనను తీర్చి, శాస్త్రాలలో ఏది 'పరమ పద' మని అభివర్ణింపబడిందో వారిని ఆ పరమ పదానికి అధిరోహింపచేసి బ్రహ్మానందానుభవాన్ని వారికి చవిచూపించారు.

8. లోకుల మనస్సులలో నిహితంగా ఉన్న గత సంస్కారాలను ఆయన కనుగొనడం

లోకుల మనస్సులలోని గుప్త భావాలను, సంస్కారాలను కనుగొనే శక్తి శ్రీరామకృష్ణులలో ఉండడం మేం స్పష్టంగా చూసివున్నాం. దేహారోగ్యం లేదా రోగం ఆయన మనస్సును ఎన్నడూ స్పృశించి ఎరుగదు అనడానికి ఇదే ఋజువుగా చెప్పవచ్చు. లోకుల మనస్సులలో గోప్య విషయాలను పూర్తిగా ఆయన తెలుసుకోగలిగినా, ఆయన ఆ విషయాలు బహిర్గతం చేసి తమ శక్తిని చాటుకోవడం ఎన్నడూ జరగలేదు. అయినా ఎవరికైనా మంచి కలుగుతుందని తోచినప్పుడు అవసరమైనంత మేరకు మాత్రమే తమ ఆ శక్తిని ప్రదర్శించి వారికి ఉన్నత మార్గాలను చూపెట్టేవారు. లేదా భాగ్యశాలురైన కొందరి హృదయాలలో తమ పట్ల ఉన్న విశ్వాసాన్ని పటిష్టం చేసే ఉద్దేశంతో ఆ శక్తిని వ్యక్తం చేసేవారు. పాఠకుల సౌకర్యార్థం దాని కొక సామాన్య ఉదాహరణను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

9. ఒక ఉదాహరణ

శ్రీరామకృష్ణుల గొంతునొప్పి అధికరించిందని విని, మాకు తెలిసిన ఒక స్త్రీ ఆయనను దర్శింప బయలుదేరింది. అది 1885వ సంవత్సర శ్రావణ మాసాంతం. ఈమె వెళ్లనున్నట్లు తెలిసి అదే పేట వాస్తవ్యురాలైన మరొక స్త్రీ, ''నీ ద్వారా గురుదేవులకు పంపడానికి ఇంట్లో పాలు తప్ప ఏమీ లేదు. దయచేసి పాలను తీసుకుపోగలవా?'' అని ఈమెను అడిగింది. అందుకు ఈ స్త్రీ నిరాకరించి, ఇలా అంది: ''దక్షిణేశ్వరంలో మంచి పాలకు ఏమీ కొదువలేదు. పాలకు చక్కని ఏర్పాటు చేసేవున్నారని నాకు తెలుసు. పైగా పాలను తీసుకుపోవడం ఎంతో ఇబ్బంది కూడా. కనుక పాలు తీసుకుపోవలసిన అవసరం ఏమీ లేదు.''

దక్షిణేశ్వరం చేరిన తరువాత శ్రీరామకృష్ణులు గొంతునొప్పి కారణంగా పాలన్నం తప్ప మరే ఆహారమూ పుచ్చుకోలేకపోతున్నారని ఆమెకు తెలియవచ్చింది. పైగా ఏదో కారణం వలన రోజూ పాలు తెచ్చే పాలమ్మి ఆ రోజు పాలు తేనందున మాతృదేవి ఎంతో ఆదుర్దా చెందడం కూడా ఈమె చూసింది. కలకత్తా నుండి పాలు తీసుకురానందుకు ఈ భక్తురాలు ఇప్పుడు ఎంతో పశ్చాత్తాపం చెందింది. దక్షిణేశ్వరం చుట్టుపట్ల పాలు ఎక్కడున్నా

అమ్ముతున్నారేమోనని ఈమె వాకబు చేసింది; దేవాలయానికి కాస్త దూరంలో శ్రీమతి పాండే అనే ఉత్తరదేశ స్త్రీ వద్ద ఆవు ఉందనీ, ఆమె పాలు అమ్ముతుందనీ తెలియవచ్చింది. ఈ భక్తురాలు ఆమె ఇంటికి వెళ్లింది; కాని అప్పటికే ఆమె ఇంట్లో పాలన్నీ తీరిపోయాయి. ఆమె వద్ద మూడు చటాకుల పాలు మాత్రం మిగిలాయి; వాటినీ అప్పటికే ఆమె కాచివేసింది. ఆమెను ప్రాధేయపడి ఆ కాచిన పాలనే ఈ భక్తురాలు తీసుకొంది. ఈ భక్తురాలు అలా తెచ్చిన పాలతోనే గురుదేవులు నాడు భోజనం చేశారు. భోజనం పూర్తి చేశాక నోరు కడుక్కోవడానికి ఆయన చేతిలో ఈమె నీరు పోసింది.

ఆ తరువాత ఆయన ఈ భక్తురాలిని ప్రక్కకు పిలిచి ఆప్యాయత ఉట్టిపడే రీతిలో, "నా గొంతు చాలా నొప్పిగా ఉంది. రోగం నయంచేసే మంత్రాన్ని ఉచ్చరిస్తూ నీ చేతితో నా గొంతును నిమురు" అని అడిగారు. ఆ పలుకులు విని ఆ భక్తురాలు కొంతసేపు ఆశ్చర్యంలో మునిగిపోయింది. తరువాత గురుదేవులు కోరినట్లు తన చేతితో ఆయన గొంతును సుతిమెత్తగా నిమిరి, మాతృదేవి వద్దకు వెళ్లింది. మాతృదేవితో ఈమె ఇలా అంది: "ఆ మంత్రం నాకు తెలుసని ఆయన ఎలా గ్రహించారు? చాలాకాలం క్రితం కొన్ని కోర్కెలను తీర్చగల మంత్రాన్ని ఘోష్పురా సంప్రదాయానికి చెందిన ఒక స్త్రీ నుండి నేర్చుకొన్నాను. భగవంతుణ్ణి ఉద్దేశరహితంగా ప్రార్థించాలని తెలుసుకొన్నప్పుడు, ఆ మంత్రాన్ని విసర్జించాను. గురుదేవులకు నా జీవితాన్నంతా పూసగుచ్చినట్లు చెప్పాను కాని ఈ మంత్రం విషయం మాత్రం దాచిపెట్టాను; ఆ మంత్రం విషయం చెబితే ఆయన నన్ను ఏవగించుకొంటారని భయపడ్డాను. అటువంటప్పుడు ఈ విషయం ఆయన ఎలా గ్రహించారు?" ఈ మాటలు విని మాతృదేవి నవ్వుతూ, ఆప్యాయంగా ఇలా చెప్పింది: "ఇతరుల ఆలోచనలు, చేతలు అన్నీ ఆయనకు తెలిసిపోతాయి. కాని అది ఇతరుల పట్ల ఉన్న ఆయన సద్భావాన్ని ఏమాత్రం చెరిపివేయదు. సదుద్దేశంతో ఎవరు ఏం చేసినా ఆయన వారిపట్ల అనిష్టత చూపరు. నువ్వేమీ భయపడనవసరం లేదు. ఇక్కడకు రాక మునుపే నేను కూడా ఆ మంత్రాన్ని పొందివున్నాను. ఆ మాట నేను చెప్పినప్పుడు ఆయన, 'ఆ మంత్రదీక్ష పుచ్చుకొన్నా ఫరవాలేదు; ఇప్పుడు ఆ మంత్రాన్ని నీ ఇష్టదైవం పాదపద్మాలకు అర్పించు' అని అన్నారు."

10. వ్యాధి ప్రకోపించి గొంతునుండి రక్తం స్రవించడం

శ్రావణం గడిచిపోయింది, భాద్రపదంలోకూడా కొన్ని రోజులు దొర్లిపోయాయి. అయినా ఎంత చికిత్సచేసినా ఆయన గొంతు వ్యాధి ప్రకోపం తగ్గలేదు. భక్తులు దీనిని గురించి తీవ్రంగా ఆలోచిస్తూనే ఉన్నారుగాని, ఏం చేయాలో వారికి

పాలుపోలేదు. సరిగా అదే సమయంలో జరిగిన ఒక సంఘటన వారు తక్షణ నిర్ణయానికి రావడానికి దోహదం చేసింది.

బాగ్‌బజార్‌కు చెందిన ఒక భక్తురాలు ఆ రోజు రాత్రి భోజనానికి భక్తులను తన ఇంటికి ఆహ్వానించింది. శ్రీరామకృష్ణులను కూడా తోడ్కొని వెళ్లాలని ఆమె ఎంతో ఆశించింది; కాని ఆయన అస్వస్థులై ఉన్నారని తెలిసి, తన ఆశను పూర్తిగా వదలివేసింది. అయినప్పటికీ ఎలాగో అలా వీలుచేసుకొని ఆయన రాగలరేమోనని చిరు ఆశతో ఒక భక్తుణ్ణి వేడుకొని దక్షిణేశ్వరానికి పంపింది. ఆ వెళ్లిన వ్యక్తి రాత్రి తొమ్మిది గంటలకు కూడా తిరిగి రాకపోయేసరికి, ఇంకా ఆలశ్యం చేయకుండా భక్తుల నందరినీ భోజనానికి కూర్చోబెట్టింది. అప్పుడు దక్షిణేశ్వరానికి వెళ్లిన భక్తుడు తిరిగివచ్చాడు. శ్రీరామకృష్ణుల గొంతు నుండి రక్తం స్రవించడం వలన ఆయన రాలేకున్నారనే సమాచారం తెలియచేశాడు. అప్పుడక్కడ నరేంద్రుడు, రాం, గిరీష్, దేవేంద్ర, మహేంద్ర ('మ') ప్రభృతులు ఉన్నారు. ఈ సమాచారం విని వారెంతో ఆందోళనపడ్డారు. వెంటనే అందరూ పరస్పరం సంప్రతించుకొని కలకత్తాలో చికిత్స నిమిత్తం ఒక ఇంటిని అద్దెకు తీసుకొని వెంటనే శ్రీరామకృష్ణులను అక్కడకు తరలించాలని తీర్మానించారు. భోజనం చేస్తున్నప్పుడు నరేంద్రుడు ఖిన్నుడవడం గమనించిన ఒక యువకుడు దానికి కారణం ఏమిటని అడిగాడు. అందుకు నరేంద్రుడు ఇలా జవాబిచ్చాడు: ''ఎవరి సాంగత్య లబ్ధి వలన మనం ఇంత ఆనందాన్ని పొందుతున్నామో, ఆయన బహుశ ఈసారి మనలను విడిచి పోబోతున్నారు. వైద్యగ్రంథాల నుండి, మిత్రులైన వైద్యుల మాటల నుండి ఇటువంటి గొంతు వ్యాధి క్రమంగా క్యాన్సర్‌గా పరిణమిస్తుందని తెలుసుకొన్నాను. రక్తం స్రవిస్తున్న దన్న విషయం ఈ రోజు విని, నేటి దాకా వైద్యశాస్త్రం ఎటువంటి చికిత్సా కనుగొనలేని ఆ వ్యాధే ఇది అని అనుమానిస్తున్నాను.''

మర్నాడు ఉదయం వయస్సులో పెద్దవాళ్లయిన కొద్దిమంది భక్తులు దక్షిణేశ్వరానికి వెళ్లి, చికిత్స నిమిత్తం కలకత్తాకు వచ్చి ఉండవలసిందిగా శ్రీరామకృష్ణులను ప్రార్థించారు. అందుకు ఆయన అంగీకరించారు. గురుదేవులకుగల గంగాభక్తి అందరికీ తెలిసిన విషయమే. కాబట్టి దుర్గాచరణ్ ముఖర్జీ వీథిలో ఒక చిన్న ఇంటి మేడమీద నుండి గంగానదిని చూడవచ్చునని తెలుసుకొని, భక్తులు ఆ ఇంటిని అద్దెకు తీసుకొని త్వరలోనే గురుదేవులను ఆ ఇంటికి తోడ్కొని వచ్చారు. కాని సువిశాల కాళికాలయ ప్రాంగణ వాతావరణంలో నివసించడానికి అలవాటుపడిన శ్రీరామకృష్ణులకు ఆ చిన్న ఇంట్లో నివసించడం అసాధ్యమై

11. చికిత్స నిమిత్తం బలరాం ఇంట్లో బస చేయడం

పోయింది. వెంటనే ఆయన రమాకాంత బసు వీథిలోని బలరాం బసు ఇంటికి వెళ్లిపోయారు. బలరాం ఆయనను ప్రీతిపూర్వకంగా ఆహ్వానించి తగిన ఇల్లు లభించేదాకా తన ఇంట్లోనే ఉండమని ఆయనను ప్రార్థించాడు. అందుకు ఆయన అంగీకరించారు.

అనుకూలమైన ఇంటికోసం భక్తులు వెతకసాగారు. ఇక ఆలస్యం చేయడం ఎంతమాత్రం మంచిదికాదని ఎంచి ఈలోపు భక్తులు కలకత్తాలోని

12. వ్యాధిని క్యాన్సర్‌గా నిర్ధారణ చేయడం

సుప్రసిద్ధ వైద్యులను రావించి శ్రీరామకృష్ణుల వ్యాధి గురించి వారి అభిప్రాయాలను సేకరించసాగారు. గంగా ప్రసాద్, గోపీమోహన్, ద్వారకానాథ్, నవగోపాల్ ప్రభృత వైద్యులు రావింప బడ్డారు. వీరందరూ శ్రీరామకృష్ణులను పరీక్షించి రోగం నయంకాని రోహిణి (క్యాన్సర్) వ్యాధిగా నిర్ధారణచేశారు. ఒక భక్తుడు గంగాప్రసాద్‌ను ప్రక్కకు పిలిచి అడిగినప్పుడు ఆతడు తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చాడు: ''పాశ్చాత్య వైద్యులు క్యాన్సర్ అని పేర్కొనే వ్యాధే ఈ రోహిణి. వైద్యశాస్త్ర గ్రంథాలు ఈ వ్యాధికి చికిత్సాప్రక్రియను సూచిస్తూన్నప్పటికీ, ఈ వ్యాధిని నయంకానిదిగానే పరిగణిస్తారు.'' వైద్యులు ఎటువంటి ఆశ కనబరచకపోవటం తోను, అధిక మోతాదులో ఔషధ వాడకం శ్రీరామకృష్ణుల శరీరతత్వానికి అసలు పడదని తెలిసి భక్తులు హోమియోపతి విధానంలో ఆయనకు చికిత్స జరిపించడం సబబని భావించారు. ఒక వారం రోజుల లోపుగానే శ్యాంపుకూర్ వీథిలోని గోకుల్‌చంద్ర భట్టాచార్య ఇంటిని భక్తులు అద్దెకు తీసుకొన్నారు; శ్రీరామకృష్ణులను అక్కడకు తరలించారు; కలకత్తాలో సుప్రసిద్ధ వైద్యుడైన మహేంద్రలాల్ సర్కార్ ఆయనకు చికిత్స ప్రారంభించాడు.

శ్రీరామకృష్ణులు కలకత్తాకు వచ్చిన వార్త ఈ నోటా ఆ నోటా కలకత్తా నగరమంతా ప్రాకింది. గుంపులు గుంపులుగా తెలిసినవారు, తెలియనివారు

13. బలరాం ఇంట్లో ఆధ్యాత్మిక సేవనం

శ్రీరామకృష్ణులను దర్శించడానికి బలరాం ఇంటికి రాసా గారు; అప్పుడు బలరాం ఇల్లు పండుగలా ఆనందంతో వెల్లివిరియసాగింది. వైద్యుల నిర్దేశం మేరకు అప్పుడప్పుడు శ్రీరామకృష్ణులు మాట్లాడకుండా ఉండగలిగినప్పటికీ, భక్తుల దీనాలాపాలు సదా ఆయనను ఆధ్యాత్మిక విషయాలు వారితో మాట్లాడడానికి ప్రేరేపించాయి; ఆయన కల కత్తాకు కేవలం ఈ ఉద్దేశంతో మాత్రమే వచ్చారన్నట్లో, దక్షిణేశ్వరం రాలేని భక్తులకు ఆధ్యాత్మిక వెలుగును ఇక్కడే ప్రసరింప చేయడానికి వచ్చారన్నట్లో కానవస్తున్నట్లుగా ఉంది. బలరాం ఇంట్లో బసచేసిన ఆ వారం రోజులు ప్రొద్దుట

నుండి మధ్యాహ్నం భోజనం చేసేవరకు, ఆ తరువాత రెండు గంటలు విశ్రాంతి తీసుకొని మళ్లీ అప్పటినుండి రాత్రి భోజనం చేసేదాకా ఎందరివో ఆధ్యాత్మిక జీవిత సమస్యలను పరిష్కరించారు; ఆధ్యాత్మిక ప్రసంగాల మూలంగా అనేకులను ఆధ్యాత్మిక మార్గంవైపు ఆకర్షించారు. భక్తిగీతాలు ఆల కిస్తూ ప్రగాఢ భావసమాధ్యావస్థను పొంది, అనేకమంది ఆధ్యాత్మిక పిపాసువుల హృదయాలను శాంత్యానందాలతో ముంచెత్తివేశారు. గురుదేవులు బలరాం ఇంట్లో బసచేసిన అన్ని రోజులు అన్ని సమయాలలోను అక్కడే ఉండే అదృష్టం మాలో ఎవరికీ దక్కలేదు. అలాగే గురుదేవులకోసం, భక్తులకోసం ఏర్పాట్లు చేయడంలో నిమగ్నుడైన ఇంటి యజమాని (బలరాం బసు) కూడా అన్ని వేళల్లోనూ ఆయన వద్దే ఉండలేకపోయాడు. కాబట్టి ఆ వారం రోజులలో జరిగి విషయాలను యథాతథంగా వివరించి చెప్పడం సాధ్యం కాదు. కాని ఆ వారం రోజులు ఆ ఇంట్లో గురుదేవులు ఎలా గడిపారో సూచించే ఒక సంఘ టన వివరాలను మాత్రం ఇక్కడ పొందుపరుస్తున్నాం.

14. బలరాం ఇంట్లో జరిగిన ఒక సంఘటన

ఆ రోజుల్లో మేం కళాశాలలో చదువుతున్నాం. కనుక వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే శ్రీరామకృష్ణులను చూడగలిగే వారం. ఒక రోజు మధ్యాహ్నం బలరాం ఇంటికి వచ్చాం; మొదటి అంతస్తు చావడి గది జనంతో క్రిక్కిరిసి ఉంది. గిరీష్, కాళీపద ఘోష్ ఎంతో ఉత్సాహంతో పాడనారంభించారు:

"ఓ నితాయ్, నన్ను పట్టుకో!
నా హృదయం నేడు ఒక అవ్యక్తభావంతో నిండిపోయింది."

ఎంతో కష్టపడి గదిలోకి రాగలిగాం. గదికి పశ్చిమ చివరన తూర్పు ముఖంగా కూర్చుని భావపారవశ్య స్థితిలో మగ్నులై ఉన్న శ్రీరామకృష్ణు లను చూశాం. ఆయన పెదవులపై ఆనందానుగ్రహాలను సూచిస్తూన్న చిరు నవ్వు వెల్లివిరిసివుంది; కుడి కాలును ఎత్తి, చాచివున్నారు. ఆయన ముందు కూర్చున్న ఒక భక్తుడు ఆ కాలును ముద్దుగా అతిజాగ్రత్తగా తన ఛాతీమీద ఉంచుకొని ఉన్నాడు. మూసివున్న కళ్లనుండి అశ్రువులు ధారకట్టి అతడి చెంపలను, ఛాతీని తడిపివేశాయి. శ్రీరామకృష్ణుల దివ్యసాన్నిధ్యంలో చేష్టలు దక్కి అందరూ కూర్చుని ఉన్నారు.

పాట సాగిపోతున్నది:

నా హృదయం నేడు ఒక అవ్యక్తభావంతో నిండిపోయింది
నన్ను పట్టుకో, ఓ నితాయ్!

(ఓ నితాయ్) జీవులలో హరినామాన్ని పంచడానికి
ప్రేమ నదిలో ఏ తరంగాలు లేవాయో
ఆ తరంగాలలో నే నిప్పుడు తేలిపోతున్నాను
(ఓ నితాయ్) స్వయంగా నేనే వ్రాసిన ఋణపత్రం మీద
అష్టసఖుల[1] సాక్ష్యాలున్నాయ్
(ఇప్పుడు) ప్రేమ ఋణదాత అప్పును నేను తీర్చేదెలా?
(నేను) కూడబెట్టిన సంపదంతా హరించుకుపోయింది
కాని ఋణం మాత్రం తీరలేదే!
ప్రేమ అనే ఆ ఋణం కారణంగా
నే నిప్పుడు వేలం వేయబడుతున్నానే!

పాట పూర్తయింది. కాసేపటికి శ్రీరామకృష్ణులు పాక్షికంగా బాహ్యస్మృతిలోకి వచ్చారు. తమ ముందు కూర్చున్న వ్యక్తితో, 'శ్రీకృష్ణ చైతన్య, శ్రీకృష్ణ చైతన్య, శ్రీకృష్ణ చైతన్య' అని పలుకమన్నారు. ఆ విధంగా ఆ వ్యక్తితో అలా ముమ్మార్లు ఉచ్చరింపచేసిన తరువాత ఆయన పూర్తి బాహ్యస్మృతిలోకి వచ్చి, అక్కడున్న వారితో మాట్లాడసాగారు. వాకబు చేసిన తరువాత ఆ వ్యక్తి పేరు నిత్యగోపాల్ గోస్వామి అనీ, ఢాకాలో ఏదో కళాశాలలో అధ్యాపకుడుగా పని చేస్తున్నాడనీ, శ్రీరామకృష్ణుల అస్వస్థ గురించి తెలుసుకొని ఆయనను చూడడానికి వచ్చాడనీ మాకు తెలిసింది. ఆతడి భక్తి ఉత్సుకత అతడి రూపసౌందర్యాన్ని ఇనుమడింపచేస్తున్నది.

---

1. రాధాదేవి ఎనిమిదిమంది చెలికత్తెలు.

12.i. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు

1. శ్యాంపుకూర్ ఇంటి వర్ణన

శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులకోసం అద్దెకు తీసుకొన్న ఇల్లు తూర్పు నుండి పశ్చిమంగా పొడవులో విస్తరించి, శ్యాంపుకూర్ వీథిలో ఉత్తరంవైపు నెలకొని ఉంది. ఇంట్లోకి అడుగిడగానే ఒక ఇరుకైన వసారా, కుడి ఎడమల రెండు అరుగులు కానవస్తాయి. మరికొన్ని అడుగులు ముందుకు వేస్తే కుడివైపు మొదటి అంతస్తుకు దారితీసే మెట్లు, ఎదురుగా ప్రాంగణం, ప్రాంగణానికి తూర్పుగా రెండు మూడు చిన్నగదులు కనిపిస్తాయి. మెట్ల మీదుగా మొదటి అంతస్తులోకి వెళ్లగానే కుడిప్రక్క తూర్పు పడమరలుగా విస్తరించిన దర్శనార్థుల పెద్దగది, ఎడమప్రక్క తూర్పు పడమరలుగా గదులకు దారితీసే సన్నని నడవా ఉన్నాయి. ఈ నడవా గుండా పోతే కచ్చేరి గది వాకిలి మొదట కనిపిస్తుంది. శ్రీరామకృష్ణులు ఆ గదిలోనే బస చేశారు. దీనికి దక్షిణంగా, ఉత్తరంగా రెండు వసారాలున్నాయి; ఉత్తరం వైపున్న వసారా కాస్త విశాలమైంది. దీనికి పశ్చిమాన రెండు చిన్నచిన్న గదులున్నాయి. ఒక గది భక్తుల ఉపయోగార్థమూ, మరొక గది రాత్రివేళ మాతృదేవి పడుకోవడానికి కేటాయించబడ్డాయి. దర్శనార్థుల గదికి పశ్చిమంగా అందరూ కూర్చోవడానికి మరొక సన్నని వసారా ఉంది. శ్రీరామకృష్ణులు ఉన్న గదికి తూర్పుగా డాబాపైకి దారితీసే మెట్లు ఉన్నాయి. ఈ మెట్ల వెలుపల ఆరు అడుగుల విస్తీర్ణం గల డాబా భాగానికి కప్పువేసి ఉంది. మాతృదేవి పగటిపూట ఇక్కడే ఉండి, గురుదేవుల పథ్యపానాదులు తయారుచేసేది. బలరాం బసు ఇంట్లో నుండి శ్రీరామకృష్ణులు ఈ ఇంటికి భాద్రపద మాసాంతాన, అంటే 1885వ సం॥ సెప్టెంబరు నెలలో వచ్చారు. ఆయన ఈ ఇంట్లో దాదాపు మూడు నెలలకు పైబడి గడిపారు; ఆగ్రహాయణం (నవంబర్ - డిసెంబర్) గడవడానికి ఒకటి రెండు రోజులకు ముందు కాశీపూర్ ఉద్యాన గృహానికి బస మార్చారు.



శ్యాంపుకూర్ గృహం

2. శ్రీరామకృష్ణుల చికిత్సకై డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ నియుక్తులవడం

శ్యాంపుకూర్ ఇంటికి వచ్చిన కొన్ని రోజుల తరువాత తమ నిర్ణయం మేరకు భక్తులు శ్రీరామకృష్ణుల చికిత్స నిమిత్తం డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్‌ను రావించారు. మథుర్‌బాబు బ్రతికివున్న రోజులలో డాక్టర్ సర్కార్ దక్షిణేశ్వరానికి కొన్నిసార్లు మథుర్ కుటుంబం వారికి చికిత్స చేయడానికి వచ్చివున్నాడు; కాబట్టి అతడు శ్రీరామకృష్ణులకు పూర్తిగా అపరిచితుడు కాడు. కాని అది చాలాకాలం నాటి మాట. కాబట్టి సుప్రసిద్ధ వైద్యుడైన మహేంద్రలాల్ దక్షిణేశ్వర రాకలను గురించి మరచిపోయి ఉండడం సహజమే; పైగా భక్తులు రోగి పేరు చెప్పకుండా డాక్టర్‌ను ఆహ్వానించారు. కాని అతడు శ్రీరామకృష్ణులను చూడగానే గుర్తించాడు; ఎంతో శ్రద్ధగా ఆయనను పరీక్షించి, రోగాన్ని కనుగొని, మందులు పథ్యం నిర్ణయించాడు. ఆ తరువాత కొంతసేపు శ్రీరామకృష్ణులతో ఆధ్యాత్మిక విషయాల గురించీ, కాళికాలయం గురించీ ముచ్చటించి, సెలవు పుచ్చుకొని వెళ్లిపోయాడు. వెళ్లేముందు గురుదేవుల దేహపరిస్థితి గురించి తనకు ప్రతి ఉదయం తెలియచేయమని భక్తులతో చెప్పినట్లు మాకు జ్ఞాపకం. వెళ్లేముందు భక్తులు ఇచ్చిన ఆయన మామూలు రుసుం పుచ్చుకొన్నాడు. కాని మర్నాడు వచ్చినప్పుడు మాటల సందర్భంలో

భక్తులే గురుదేవులను కలకత్తాకు తోడ్కొని వచ్చారనీ, ఖర్చులన్నీ వారే భరిస్తున్నారనీ డ్యాక్టర్‌కు తెలిసింది. గురుదేవుల పట్ల భక్తులు చూపుతున్న భక్తిప్రపత్తులకు ఎంతో ప్రసన్నుడై డ్యాక్టర్ ఆపైన పైకం పుచ్చుకోవడానికి నిరాకరించాడు. "ఎలాంటి రుసుమూ పుచ్చుకోకుండా ఆయనకు చికిత్స చేస్తాను; మీ ఉదాత్త ప్రయత్నంలో నా శక్తి మేరకు దోహదం చేస్తాను" అని అన్నాడు.

3. గురుదేవుల పథ్యం, రాత్రి సేవ

ఎంతో అనుభవజ్ఞుడైన వైద్యుడు చికిత్స చేస్తూవున్నా భక్తులు ఆందోళన పడకుండా ఉండలేకపోయారు. గురుదేవుల సేవకు రేయింబవళ్లు ప్రత్యేకంగా కొందరిని నియమించాలనీ, ఆయన పథ్యాన్ని శ్రద్ధగా తయారుచేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలనీ భక్తులు నిశ్చయించుకొన్నారు. డబ్బు ఉన్నంత మాత్రాన పై రెండు కొరతలూ తీరవని వారు గ్రహించకపోలేదు. కనుక పథ్య ఆహారాన్ని తయారుచేయడానికి దక్షిణేశ్వరం నుండి మాతృదేవిని తోడ్కొని రావాలని నిర్ణయించారు; సేవాదులకు యువభక్తులను కేటాయించాలని తీర్మానించారు. కాని అందుకు ఎన్నో ఆటంకాలున్నాయి. ఎందుకంటే, స్త్రీలు నివసించడానికి ప్రత్యేకంగా ఆ ఇంట్లో గదులు లేనందున మాతృదేవి ఒంటరిగా నివసించగలదో లేదో వారికి పాలుపోలేదు. అలాగే యువభక్తులు రోజూ వస్తూ నిద్ర లేకుండా రాత్రుళ్లు అక్కడే గడిపితే వారి సంరక్షకులు నొచ్చుకొంటారేమో!

4. మాతృదేవి అమిత సిగ్గుకు ఒక ఉదాహరణ

మాతృదేవి కాశీపూర్‌కు రావడం గురించి భక్తులలో సంశయం జనించకపోలేదు. వారి సందేహానికి కారణం లేకపోలేదు. ఎందుకంటే, ఆమె ఎంత లజ్జావంతురాలో వారికి బాగా తెలుసు. దక్షిణేశ్వర ఉద్యానంలో ఉత్తరం వైపునవున్న నహబత్ (వాద్యమందిరంలో) వసిస్తూ ఇన్నేళ్లుగా గురుదేవుల సేవలో నిమగ్నురాలై ఉన్నప్పటికీ, స్వయంగా ఆయనే ఆమెకు పరిచయం చేసిన ఏదో ఇద్దరు ముగ్గురు యువభక్తులు తప్ప ఆమె పాదపద్మాలను చూసిన లేదా ఆమె గొంతు విన్న వారు ఎవరూ లేరంటే అతిశయోక్తి కాదు. రోజంతా ఆ చిన్నగదిలోనే గడుపుతూ నిత్యం రెండు పూటలా గురుదేవుల, భక్తుల నిమిత్తం రకరకాల వంటకాలను వండిపెడుతున్నా, అలా చేస్తున్న దెవరో ఇంతకాలం ఎవరికీ తెలియదు.

ఎవరూ మేల్కొనక ముందే ప్రతి రోజు తెల్లవారుజాము మూడు గంటలకే నిద్రలేచి కాలకృత్యాలు, గంగాస్నానం ముగించుకొని మళ్లీ ఆ గదిలోకి వెళ్లి రోజంతా బయటకు వచ్చేదికాదు. ఓర్పుతో చకచకా తన పనినంతా పూర్తిచేసుకొని, జపధ్యానాదులలో నిమగ్నురాలయ్యేది. ఒక సందర్భంలో ఇంకా బాగా

చీకటి ఉండగానే ఆమె స్నానఘట్టానికి వెళ్లబోతూ, నహబత్ ఎదుటనున్న పొగడ చెట్టు క్రింద పడుకొనివున్న ఒక మొసలి మీద దాదాపు అడుగువేయ బోయింది. అదృష్టవశాత్తు ఆమె అడుగుల సవ్వడి విని ఆ మొసలి నీళ్లలోకి దూకేసింది. మరెన్నడూ చేత దీపం లేకుండా ఆమె స్నానఘట్టానికి వెళ్లలేదు.

ఎవరి కంటా పడకుండా చాలాకాలంగా వాద్యమందిరపు ఆ చిన్న గదిలో వసిస్తూవచ్చిన మాతృదేవి, ఏ సంకోచమూ లేకుండా పగలంతా పురుషుల మధ్య శ్యాంపుకూర్ ఇంట్లో ఎలా ఉండగలదోనని ఏ భక్తుడూ ఊహించలేకపోయాడు. ప్రత్యామ్నాయం లేనందున ఈ విషయం గురించి శ్రీరామకృష్ణులతో ప్రస్తావించవలసిన నిర్బంధానికి భక్తులు గురియైనారు. ఆయన వారికి ఆమె నైజాన్ని జ్ఞప్తికి తెచ్చి, ''ఆమె ఇక్కడ ఉండగలదా? ఇక్కడి పరిస్థితులన్నీ తెలిశాక రావడానికి ఇష్టపడుతుందేమో ఆమెను అడిగి చూడండి. ఇష్టపడితే, నిరభ్యంతరంగా ఆమె రావచ్చు'' అని అన్నారు. దక్షిణేశ్వరంలో ఉంటూవున్న మాతృదేవికి కబురు పంపారు.

5. శ్యాంపుకూర్‌కు మాతృదేవిని తోడ్కొని రావాలనే ప్రతిపాదన

అవసరమైనప్పుడు దేశకాల పాత్రానుసారంగా సర్దుకుపోలేని వ్యక్తి ఎన్నటికీ శాంతిని లేదా తను కోరుకొన్న లక్ష్యాన్ని పొందలేడని శ్రీరామకృష్ణులు తరచు వచించేవారు. ఆయన వచనాల లోనే చెప్పాలంటే, 'సమయాన్ని బట్టి, ప్రదేశాన్నిబట్టి, వ్యక్తినిబట్టి వ్యవహరించాలి' అనే సిద్ధాంతాన్ని పాటించని వారికి వైఫల్యం తప్పదు.

6. దేశకాల పాత్రానుగుణంగా సర్దుకుపోయే మాతృదేవి సమర్థత

సిగ్గు బిడియాలనే దుర్భేద్యమైన తెర మరుగున వసిస్తూవున్నప్పటికీ పూజ్యురాలైన మాతృదేవి, పై ఉపదేశాన్ని గురుదేవులనుండి గ్రహించి తదనుగుణంగా తన జీవితాన్ని తీర్చిదిద్దుకొంది. ప్రప్రథమంగా ఆమె దక్షిణేశ్వరానికి వచ్చినప్పటి వర్ణన (II.20) నుండి, అట్లే ఈ క్రింద మేం ప్రస్తావించనున్న సంఘటన నుండి అవసరం ఏర్పడ్డప్పుడల్లా తన అలవాట్ల, గత సంస్కారాలనుండి విడివడి భయసంకోచరహితంగా ఆమె ఎలా యుక్తంగా మెలగ గలిగిందో పాఠకులు స్పష్టంగా తెలుసుకోవచ్చు.

ఆ రోజులలో డబ్బులేమి కారణంగానూ, చౌక అవడం వలనా జయరాంబాటి కామార్పుకూర్‌ల నుండి దక్షిణేశ్వరానికి కాలినడకనే మాతృదేవి వెళ్లడం కద్దు. అలా కాలినడకన వెళ్లే ప్రయాణీకులు జహానాబాద్ (ఆరాంబాగ్) చేరుకొని, అక్కడ నుండి 'తేలోభేలో' అనే పది మైళ్ల మైదానాన్ని గమించి తారకేశ్వరం

7. కామార్పుకూర్ నుండి దక్షిణేశ్వరానికి వచ్చే దారిలో

చేరుకొనేవారు; అక్కడ నుండి 'కైకోలా' అనే మరో మైదానం దాటి వైద్యావాటి చేరుకొని, అక్కడ గంగానదిని దాటేవారు. ఆ రోజుల్లో ఆ రెండు మైదానాల్లో బందిపోట్ల బెడద ఎంతో అధికం. ఇప్పటికీ బందిపోట్ల బారినపడి ఉదయ మధ్యాహ్న సాయంకాల సమయాలలో ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోతూ వుంటారని చెప్పుకొంటారు. ఇప్పటికి కూడా తేలో భేలో గ్రామాలకు రెండు మైళ్ల దూరంగా మైదానం మధ్యలో నోరు తెరచుకొని పెద్ద కోరలతో భయానకంగా కనిపించే కాళీవిగ్రహం కనబడుతుంది. స్థానికులలో ఆమె 'తేలోభేలో బందిపోట్ల కాళి'గా పేరుగాంచింది. ఈ బందిపోట్లు ప్రయాణీకులను చంపడానికి, దోపిడీలకు బయలుదేరబోయే ముందు ఈమెను పూజిస్తారని చెప్పుకొంటారు. కాబట్టి ఆ రోజుల్లో ప్రయాణీకులు తమను బందిపోట్ల నుండి రక్షించుకోవడానికి బృందాలుగా ఆ మైదానాల గుండా పయనించేవారు.

8. మాతృదేవి తారకేశ్వరానికి కాలినడకన వస్తున్నప్పుడు జరిగిన సంఘటన

ఒకప్పుడు రామేశ్వర్ (గురుదేవుల చిన్న అన్నగారు) కుమార్తె, చిన్న కుమారుడు, మరికొందరితో కలిసి మాతృదేవి కామార్పుకూర్ నుండి దక్షిణేశ్వరానికి కాలినడకన బయలుదేరింది. ఆ బృందం ఆరాంబాగ్ చేరుకొంది. చీకటి పడడానికి ముందే తేలో భేలో మైదానాన్ని దాటగలమని ఎంచి, మాతృదేవితో వచ్చినవారు ఆరాంబాగ్‌లో రాత్రి బస చేయడానికి అంగీకరించలేదు. ప్రయాణంలో ఎంతో అలసిపోయివున్నా మాతృదేవి తన బడలిక విషయం ఎవరికీ చెప్పకుండా వారితోబాటు బయలుదేరింది. కాని నాలుగు మైళ్లు దాటేటప్పటికే వారితోబాటు నడవలేక ఆమె బాగా వెనుకబడ్డది. ఆమె కోసం వారు కాసేపు ఆగి, త్వరత్వరగా నడవమని ఆమెతో చెప్పి, కదలిపోసాగారు. మైదానం మధ్యకు చేరేసరికి మాతృదేవి వాళ్లకంటే ఎంతో వెనుక పడిపోయింది. మళ్లీ ఆమెకోసం ఆగి ఆమె రాగానే, "ఇంత నెమ్మదిగా నడిస్తే రాత్రి బాగా ప్రొద్దుపోయాకాని ఈ మైదానాన్ని దాటలేం. అందరం బందిపోట్ల వాతపడే ప్రమాదం ఉంది" అని ఆమెతో చెప్పారు. తన కారణంగా అందరూ ఇబ్బంది పడడం, భయపడడం చూసి, "నాకోసం ఆగవద్దు. మీ రంతా తిన్నగా తారకేశ్వరం వెళ్లి విశ్రాంతి తీసుకోండి. సాధ్యమైనంత త్వరగా వచ్చి మిమ్మల్ని కలుసుకొంటాను" అని వారితో చెప్పింది. ఒక ప్రక్క సూర్యాస్తమానం కాబోతూండడం చూసీ, మరోవంక మాతృదేవి మాటలనుబట్టీ వారంతా వేరే ఆలోచన చేయకుండా గబాగబా ముందుకు సాగిపోయారు. కాసేపట్లో కను మరుగయ్యారు.

మాతృదేవి కూడా సాధ్యమైనంత వేగంగా నడవసాగింది. కాని నిస్సత్తువ కారణంగా ఆమె నడక వేగం తగ్గింది; మైదానం మధ్యకు చేరేలోపుగానే చీకట్లు క్రమ్ముకొన్నాయి. ఇప్పుడు ఏం చేయాలో పాలుబోక ఆందోళన పడుతూండగా, కారుమబ్బువంటి నల్లని పొడవైన ఒక వ్యక్తి దుడ్డుకర్ర చేతపట్టి వడివడిగా ఆమె వైపు రావడం కనిపించింది. ఆతడికి కాస్త వెనుకగా, ఆతడి సహచరుడు కాబోలు మరో వ్యక్తికూడా రావడం ఆమె కంటపడింది. అది చూసి పారిపోవడం లేదా అరవడం వృథా అని భావించి భయంతో దడదడలాడుతూ ఆమె అక్కడే నిలబడిపోయింది.

9. తేలో భేలో మైదానంలో

కొద్ది క్షణాల్లో ఆ పురుషుడు ఆమెను సమీపించి కర్కశంగా, ''ఎవరు నువ్వు? ఈ వేళప్పుడు ఎందుకు ఇక్కడ నిలబడ్డావు?'' అని ప్రశ్నించాడు. అతణ్ణి ప్రసన్నుని చేసుకొనే ఉద్దేశంతో మాతృదేవి అతణ్ణి 'నాన్న' అని సంబోధిస్తూ, ''నాన్నా, నాతోపాటు వచ్చినవారు నన్ను విడిచి వెళ్ళిపోయారు; నేను దారితప్పానని అనుకొంటున్నాను. వాళ్ళు ఉన్న చోటుకు దయచేసి నన్ను తోడ్కొనిపోగలవా? నీ అల్లుడు, రాణీ రాస్మణి దక్షిణేశ్వర కాళికాలయంలో వసిస్తున్నాడు. నేను ఆయన వద్దకే వెళుతున్నాను. నువ్వు కనుక నన్ను అక్కడదాకా తోడ్కొనిపోతే ఆయన ఎంతో సంతోషిస్తారు'' అని ఎంతో వినమ్రంగా అతణ్ణి అడిగింది. ఆమె అలా చెబుతూండగానే ఆ రెండో వ్యక్తి అక్కడకు రావడం జరిగింది. ఆ వ్యక్తి పురుషుడు కాదు, స్త్రీ, ఆ పురుషుడి భార్య. ఆమెను చూడగానే మాతృదేవి మరింత ధైర్యం పుంజుకొని, ఆమె చేయి పుచ్చుకొని, ''అమ్మా, నేను నీ కుమార్తెను, శారదను. నాతో కలిసి వచ్చినవారు ముందుగా వెళ్ళిపోవడంతో నేను ప్రమాదంలో చిక్కుకొన్నాను. అదృష్టవశాత్తు నువ్వూ, నాన్నా కనిపించారు. లేకపోతే ఏం చేసేదాన్నో నాకే తెలియదు'' అని చెప్పింది.

10. బాగ్దీ దంపతులు

మాతృదేవి సరళ, నిస్సంకోచ వైఖరిని చూసి ఆ బాగ్దీ[1] బందిపోటు, ఆతడి భార్య హృదయాలు కరిగిపోయాయి. మాతృ పితృ వాత్సల్యాలు పొంగిపొర్లగా కులం జాతివంటి సాంఘిక ప్రతిబంధకాలను విస్మరించి ఆ దంపతులు తమ సొంత కుమార్తెగా

11. మాతృదేవికి వారి ఆదరణ

---

1. బాగ్దీలు నిమ్నజాతివారు; సాహసానికి, బలానికి వీరు పెట్టిందిపేరు. గతంలో వీరు సైనికులుగా బాగా రాణించారు. ఆ తరువాత ఆంగ్లప్రభుత్వం వంగదేశంలో సైనికులను తీసుకోవడం ఆపివేయడంతో, వీరిలో అనేకులు బందిపోట్లుగా మారిపోయారు.

భావించి మాతృదేవిని ఓదార్చి, ఊరడించారు. ఆమె శారీరకంగా ఎంతో అలసిపోయి ఉండడం గమనించి చుట్టుప్రక్కల ఉన్న ఒక దుకాణానికి ఆమెను తోడ్కొని వెళ్లి అక్కడ ఆమెకు ఆ రాత్రికి బస ఏర్పాటు చేశారు. ఆ స్త్రీ తన చీరను పరచి మాతృదేవికి పడకను అమర్చింది; ఆతడు మరమరాలు, తియ్యని అటుకులు కొనితెచ్చి తినడానికి ఇచ్చాడు. మాతృదేవి వాటిని తిన్న తరువాత, ఆప్యాయంగా ఆమెను నిద్రకు ఉపక్రమించమని చెప్పి, వారిద్దరూ ఆమెకు రాత్రంతా కాపలాకాస్తూ కూర్చున్నారు. తెల్లవారగానే మాతృదేవిని లేపి, సూర్యోదయమైన ఒక గంటలో ఆమెను తారకేశ్వరానికి తోడ్కొని వెళ్లారు. ఆమెను ఒక దుకాణం వద్దకు తీసుకుపోయి, అక్కడ కాసేపు విశ్రమించ మన్నారు. ఆ స్త్రీ తన భర్తతో, "రాత్రి నా కుమార్తె ఏమీ తినలేదు. వెళ్లి తారకేశ్వర శివుని అర్చించి, బజారు నుండి చేపలు, కూరగాయలు పట్రా, నేడు ఆమెకు సుష్టుగా తినిపించాలి" అని చెప్పింది.

ఆ పురుషుడు భార్య చెప్పిన వస్తువులు తేవడానికి బజారుకు వెళ్లగానే మాతృదేవి తోటి ప్రయాణీకులు ఆమెను వెతుక్కుంటూ వచ్చారు.

12. బాగ్దీ దంపతుల నుండి మాతృదేవి సెలవు పుచ్చుకోవడం

సురక్షితంగా ఆమె వచ్చి చేరుకోవడంతో వారు ఎంతో సంతోషించారు. ఆ తరువాత మాతృదేవి రాత్రి తనకు ఆశ్రయం ఇచ్చి కాపాడిన ఆ 'తల్లితండ్రు'లను వారికి పరిచయం చేసి, "నిన్న రాత్రి వీరే కనిపించి నాకు ఆశ్రయం ఇవ్వకపోతే ఏమై పోయేదాన్నో" అని చెప్పింది.

తరువాత అందరూ కలిసి తారకేశ్వర శివుణ్ణి ఆరాధించి, వంట చేసుకొని భుజించి అక్కడే కొంతసేపు విశ్రమించారు. తదనంతరం వైద్యావాటికి బయలుదేరుతున్నప్పుడు మాతృదేవి తన అనంత కృతజ్ఞతలు తెల్పుకొని ఆ బాగ్దీ దంపతులను సెలవు కోరింది. కాలాంతరంలో మాతృదేవి ఆ సంఘటన గురించి ఇలా చెప్పేది: "ఆ ఒక్క రాత్రిలో పరస్పరం ఆ దంపతులూ నేనూ ఎంత ఆత్మీయులమైనామంటే, వారి నుండి సెలవు పుచ్చుకోబోతున్నప్పుడు ఉద్వేగంలో నా కళ్ల వెంట అశ్రువులు ధారగా స్రవించాయి. అవకాశం చూసుకొని దక్షిణేశ్వరానికి రావలసిందిగా వారిని బ్రతిమిలాడాను. వస్తామని వారు మాట ఇచ్చిన తరువాతే ఎంతో కష్టంమీద నేను బయలుదేరగలిగాను. మేం బయలుదేరుతున్నప్పుడు చాలాదూరం వరకు వారుకూడా మమ్మల్ని దింపడానికి వచ్చారు. దారిప్రక్కని చేలలోని సెనగలను కోసి, నా చీర కొంగుకు కట్టి ఆమె ఏడుస్తూ, 'అమ్మాయ్ శారదా, రాత్రి అటుకులతో పాటు వీటిని కూడా తిను' అని చెప్పింది.

''ఇచ్చిన మాటను ఆ దంపతులు నిలబెట్టుకొన్నారు. మిఠాయిలు పుచ్చుకొని వారు పలుమార్లు దక్షిణేశ్వరానికి వచ్చారు. నా ద్వారా ఆయన (శ్రీరామకృష్ణులు) జరిగినదంతా విని, ఆ దంపతులు వచ్చినప్పుడల్లా వారిని ఆప్యాయంగా ఆహ్వానించి, వారిపట్ల అల్లుడి మాదిరే ప్రవర్తించారు. నా 'బంది పోటు తండ్రి' ఇప్పుడు సరళహృదయుడుగా సజ్జనుడుగా మారిపోయినప్ప టికీ, గతంలో ఎన్నో దోపిడీలు చేసిన వ్యక్తిగానే నాకు కనిపిస్తాడు.''

వైద్యుల సలహా మేరకు పథ్యపానాదులు కచ్చితంగా తయారుచేసి ఇవ్వ కుంటే శ్రీరామకృష్ణుల వ్యాధి ప్రకోపించవచ్చుననే సమాచారం వినగానే మాతృ

13. శ్యాంపుకూర్ ఇంట్లో మాతృదేవి

దేవి తన అసౌకర్యాలను ఏమాత్రం లక్షించక నిస్సంకో చంగా శ్యాంపుకూర్ ఇంటికి వచ్చేసింది. నానారకాల అసౌ కర్యాలు భరిస్తూ, అపరిచితులైన పురుషుల మధ్య ఒకే ఇంట్లో మూడు నెలలు మాతృదేవి గడిపింది అనే విషయం ఎవరికైనా ఆశ్చర్యం కలిగించక మానదు. అందరికీ స్నానాలగది ఒక్కటే ఉన్నా, ఎప్పుడామె కాలకృత్యాలు ముగించుకొని తెల్లవారుజాము మూడు గంటలకు ముందే రెండవ అంతస్తు డాబా మీదికి వెళ్లిపోయేదో ఎవరికీ తెలిసేదికాదు. రోజంతా అక్కడే ఉండిపోయి గురుదేవుల కోసం వేళవేళకీ పథ్యపానాదులు తయారుచేసి, అద్భుతానందస్వామి (లాటూ) లేదా అద్వైతానంద స్వామి (పెద్దగోపాల్) ద్వారా కబురు పంపేది. అప్పుడు అందరినీ అక్కడనుండి వైదొలగమని చెప్పి భోజనాన్ని ఆమె క్రిందికి తీసుకు వచ్చేది. లేదా శిష్యులమైన మేమే తీసుకొని వచ్చేవారం. మధ్యాహ్నం ఆమె భోజనం చేసి, అక్కడే విశ్రమించేది. రాత్రి పదకొండు గంటలకు అంతా నిద్ర పోయాక ఆమె మొదటి అంతస్తుకు దిగివచ్చి, తెల్లవారి రెండు గంటల దాకా తన కోసం కేటాయించిన గదిలో నిద్రించేది. గురుదేవులకు వ్యాధి నయమౌ తుందనే ఆశతో గుండెను రాయిచేసుకొని ఆ విధంగా ఆమె రోజులు గడప సాగింది. ఎవరికీ తెలియరాకుండా ఎంత నెమ్మదిగా ఆమె ఆ ఇంట్లో బసచేసిం దంటే, అక్కడికి వచ్చే దర్శనార్థులలో అనేకులకు ఆమె అక్కడ ఉంటున్న సంగతే తెలిసేదికాదు. అలా అత్యంత కష్టభరితమూ, బాధ్యతాయుతమూ అయిన గురుదేవుల సేవాకార్యాన్ని నిర్వర్తిస్తూ మాతృదేవి శ్యాంపుకూర్ ఇంట్లో రోజులు గడపసాగింది.

పథ్యపానాదుల సమస్య ఆ విధంగా తీరడంతో, ఇప్పుడిక రాత్రిపూట

14. శ్రీరామకృష్ణులను యువభక్తులు సేవించడం

శ్రీరామకృష్ణులను సేవించే వ్యవహారం గురించి భక్తులు తీవ్రంగా ఆలోచించసాగారు. నరేంద్రుడు తానే ఆ బాధ్య తను స్వీకరించి రాత్రుళ్లు అక్కడే గడపసాగాడు. అది చూసి ఉత్సాహపూరితు

లైన చిన్నగోపాల్, కాళి, శశి వంటి యువకులు ముందుకొచ్చి ఆ పనిలో పాలుపంచుకోసాగారు. వీరంతా భగవత్సాక్షాత్కారమనే మహోన్నత జీవితాదర్శం కోసమే జీవించాలనే దృఢ సంకల్పంతో జీవిస్తున్న యువకులు. శ్రీరామకృష్ణుల జాజ్జ్వల్యమానమైన పరిత్యాగం, పావన వచనాలు, సాంగత్యం వలన పొందిన స్ఫూర్తితోనూ, ఆయన పట్లగల తమ భక్తిప్రపత్తుల చేతా తమను ఆయన సేవకై అంకితం చేసుకోవాలని సంకల్పించారు ఆ యువకులు. ఆ యువకుల తల్లితండ్రులకు వారి జీవితోద్దేశం ఏమిటో అప్పట్లో తెలియదు; కాబట్టి శ్యాంపుకూర్ ఇంటికి వచ్చి గురుదేవులకు అలా సేవచేయడం పట్ల వారు ఎటువంటి ఆక్షేపణా తెలుపలేదు. కాని శ్రీరామకృష్ణుల వ్యాధి ప్రకోపించడంతో ఈ యువకులు కళాశాలలకు వెళ్లకపోవడమూ, తిండితిప్పలకు ఇంటికి రాకపోవడమూ చూసి వారి తల్లితండ్రులకు అనుమానం రాసాగింది. ఆ అనుమానం క్రమంగా ఆందోళనకు దారితీసింది. దాంతో వారు తమ బిడ్డలు గురుదేవులను సేవించకుండా చేయడానికి నానారకాల మార్గాలూ అవలంబించసాగారు. కాని నరేంద్రుని ఉదాహరణ, స్ఫూర్తి, ప్రోత్సాహం లేకుంటే ఆ యువకులు తల్లితండ్రుల ఒత్తిడికి లొంగిపోయి, దృఢంగా తమ సేవా కార్యంలో నిమగ్నులై ఉండేవారు కారని చెప్పడం అనవసరం. నలుగురైదుగురు మాత్రమే తమ జీవితాలను అంకితం చేసి శ్యాంపుకూర్ ఇంట్లో సేవావ్రతాన్ని పాటించినప్పటికీ, కాశీపూర్ ఉద్యానగృహంలో ఆ వ్రతం పూర్తి అయ్యేనాటికి ఆ సేవావ్రతాన్ని పాటించిన వారి సంఖ్య నాలుగు రెట్లుగా పెరిగింది.

12.ii. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు

1. శ్రీరామకృష్ణుల సేవలో గృహస్థ భక్తుల పాత్ర

పైన పేర్కొన్న రీతిలో శ్రీరామకృష్ణుల చికిత్సకూ, పథ్యపానాదులకూ, అహర్నిశల సేవకూ తగిన ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తులు నిశ్చింతులు కాలేకపోయారు. ఎందుకంటే, కలకత్తాలోని పేరు మోసిన వైద్యులు శ్రీరామకృష్ణుల గొంతువ్యాధి నయం కాదని ఘంటాపథంగా చెప్పకపోయినా, ఆ వ్యాధి చికిత్స ఎంతో కష్టమనీ, ఆయనకు ఆ వ్యాధి నుండి ఉపశమనం కలగడానికి సుదీర్ఘకాలం పడుతుందనీ తెలిపి వున్నారు. అందువలన ఆయన పూర్తిగా కోలుకొనే వరకూ సేవ శుశ్రూషాదులకు అవసరమయ్యే ఖర్చును ఏ రకంగా భరించాలో భక్తులు తర్జనభర్జన పడసాగారు. అది సహజమే కదా! బలరాం, సురేంద్ర, రాంచంద్ర, గిరీష్‌చంద్ర, మహేంద్రనాథ్, తదితర గృహస్థ భక్తులు, తమ కుటుంబాలను పోషించుకొంటూ, గురుదేవుల చికిత్స తదితరాదులకయ్యే ఖర్చులను ఏ ఒక్కరూ పూర్తిగా తామే భరించగల స్తోమత ఉన్నవారు కారు. అయినా గురుదేవుల పవిత్ర సాన్నిధ్యం కారణంగా తమ హృదయాలలో శాంత్యానందాలు, ఆశతో ప్రేరితులై భవిష్యత్తు గురించి మరో ఆలోచన చేయకుండా సేవాకార్యంలో నిమగ్నులైపోయారు. కాని వారి హృదయాలలో పొంగిపొరలే ప్రవాహానికి పోటుపాటులు లేకుండా పోలేదు; భవిష్యత్తు గురించిన ఆలోచన మనస్సులో మెదలీమెదలగానే వారి శాంత్యానందాలు ఠక్కున సమసిపోవడం కద్దు. నిజానికి ఆ ప్రవాహం సదా సమానంగా ప్రవహించడం లేదు కూడా. అయినా అటువంటి సమయాలలో గురుదేవుల అద్భుత ఆధ్యాత్మిక అభివ్యక్తీకరణను వారు చవిచూడడంతో ఆ ఆందోళన ఆసాంతం అదృశ్యమై మళ్లీ వారి హృదయాలు శక్త్యుత్సాహాలతో నిండిపోయేవి.

ఏదో అనిర్వచనీయమైన పరమానందం, మేధకు అందని ఒక ఉన్నతోన్నత భూమికి వారిని గొనిపోయేది; అక్కడి దివ్యప్రకాశంలో వారి కిది ద్యోతకమైంది: ఎవరిని తమ జీవిత పరమ లక్ష్యంగా స్వీకరించారో, ఆయన కేవలం మానవమాత్రుడే కాక ఆధ్యాత్మిక జగత్తు యావత్తుకీ ఆశ్రయ స్వరూపుడూ, సంసార సాగరంలో మునిగిపోతున్న జీవుల పరమగతీ, దేవమానవుడూ అయిన సాక్షాత్తు నారాయణుడని తేటతెల్లమైంది. అట్టి గురుదేవుల జన్మ, చేతలు, తపశ్చర్యలు, ఆహారవిహారాదులు, అంతెందుకు శారీరక రుగ్మతతో బాధననుభవించడం - ఇవన్నీ మానవాళి హితం కోసమే, వారి ఉద్ధరణ నిమిత్తమే అని వారికి స్పష్టమైంది. లేకుంటే జన్మ మృత్యు జరావ్యాధి దుఃఖదోషాదులకు అతీతుడైన ఆ సత్యసంకల్పునికి, ఆ పరమపురుషునికి శారీరక రుగ్మత వాటిల్లడం ఏమిటి? సేవించడానికి తమ భక్తులకు ఒక చక్కని అవకాశం ఇవ్వడం నిమిత్తమే ప్రస్తుతం వ్యాధిగ్రస్తునిగా ఉండడం దక్షిణేశ్వరం దాకా వెళ్లి ఆయనను దర్శించుకొని వచ్చే ఆస్కారమూ, తీరికా లేని జనుల హృదయాలలో ఆధ్యాత్మిక జ్యోతిని రగిలింప ఆయన ఇప్పుడు వారి మధ్యలోనే నివసించడం! పాశ్చాత్య విద్యాప్రభావంతో జడవాదులైన మనుషులు ఏ విజ్ఞానశాస్త్రాన్ని ఆధారం చేసుకొని తాము సర్వజ్ఞులమనీ, తమ కే భయం లేదనీ భావిస్తూ, లౌకిక భోగాలను ఈడేర్చుకోవడం ఒక్కటే జీవిత పరమోద్దేశమను కొంటూవున్న అజ్ఞులలో భగవత్సాక్షాత్కారమనే దివ్యజ్యోతిని రగిలించి దాని ప్రకాశంలో తమ పూర్వ భావాలు ఎంత నిమ్నమైనవో గ్రహించేలా చేసి, వారి జీవితాలను త్యాగపథంలో నడిపించడం కోసమే గురుదేవులు ఇప్పుడు రుగ్మతతో పడి ఉన్నారు.

అటువంటప్పుడు ధనం కొరత గురించి వారు సంశయించడం ఎందుకు? ఎవరు తమకు సేవించే అవకాశాన్ని కల్పించారో వారే ఆ కొరతను తీర్చగల శక్తిని తమకు ప్రసాదిస్తారని భక్తులు దృఢంగా విశ్వసించసాగారు.

పై వ్యాఖ్యానాలు మా భావోద్వేగ జనితాలని పాఠకులు భావించరాదు. శ్రీరామకృష్ణుల దివ్యసాన్నిధ్యంలో భక్తులు పరస్పరం చర్చించుకొన్న పై విషయాలు స్వయంగా మేం విన్నవే. ధనం కొరత కారణంగా గురుదేవుల సేవలో లోటు జరుగుతుందేమోనని భక్తులు ఎన్నోసార్లు ఆందోళన చెంది, పరస్పరం సంప్రదించుకోవడమూ, ప్రతిసారీ పైన పేర్కొన్నట్లు తమ హృదయాలలో అద్భుత భావప్రేరణను పొంది, ఊరడిల్లడం కళ్లారా మేం చూసివున్నాం. ఒక భక్తుడు ఒకసారి ఇలా అన్నాడు: "శ్రీరామకృష్ణులు తమ ఏర్పాట్లను తామే చూసుకోగలరు. ఒకవేళ చూసుకో

2. గృహస్థ భక్తుల పరిత్యాగం

లేకపోయినా మిన్ను విరిగి మీద పడదులే! ఒక ఇటుకపై మరొక ఇటుక పేర్చబడి ఉన్నంతవరకూ (తన స్వగృహాన్ని చూపుతూ) ఎటువంటి ఆందోళనా చెందనక్కర్లేదు. నా ఇంటిని తనఖాపెట్టి ఆయన సేవలకయ్యే ఖర్చును భరిస్తాను.'' మరొక భక్తుడు ఇలా చెప్పాడు: ''నా పిల్లల వివాహాలకూ లేదా వారు జబ్బుపడినప్పుడూ నే నెలా ఆ ఖర్చును భరించగలిగానో అట్లే గురుదేవుల సేవకయ్యే ఖర్చును నేను చూసుకొంటాను. నా భార్య ఒంటిమీద నగానట్రా ఉన్నంతవరకూ అందు గురించి ఆందోళన చెందపనిలేదు.'' మరొక వ్యక్తి నోరు తెరచి ఏదీ వ్యక్తం చేయకపోయినా తన కుటుంబ ఖర్చులను బాగా తగ్గించివేసి, తద్ద్వారా పొదుపు చేసిన సొమ్మును గురుదేవుల సేవకై వినియోగించసాగాడు. ఆ భావస్ఫూర్తితోనే సురేంద్ర ఇంటి అద్దెను తానొక్కడే భరించాడు; బలరాం, రాంచంద్ర, మహేంద్రనాథ్, గిరీష్‌లు కలిసి గురుదేవుల, ఆయనను సేవించేవారల అవసరాలను చూసుకోసాగారు.

3. గురుదేవుల వ్యాధి భక్తులను ఒక సంఘంగా పెనవేయడం

భక్తులు తమ హృదయాలలో చవిచూస్తున్న దివ్యానందానికి ఆలంబన శ్రీరామకృష్ణులు; అదే ఆలంబన ఇప్పుడు వారిని ఎంతో సన్నిహితులనుగా చేర్చి, ప్రేమ అనే త్రాటితో బంధించివేసింది. శ్రీరామకృష్ణుల భక్తసంఘమనే వృక్ష బీజం దక్షిణేశ్వరంలోనే నాటబడినప్పటికీ, అది శ్యాంపుకూర్ కాశీపూర్ ఉద్యానాలలో మొలకెత్తి, శ్రీరామకృష్ణులు వ్యాధిగ్రస్థులవడం ఇలా జరగడం నిమిత్తమే అని పలువురు భక్తులు నమ్మేటంత సత్వరం ఆ మహావృక్షం విస్తృతించింది.

శ్రీరామకృష్ణులు వ్యాధిగ్రస్థులు కావడానికి కారణం, అట్లే మళ్లీ ఎప్పుడు ఆయన స్వస్థులు కాగలరో - అన్న విషయాల గురించి ఇదివరలో భక్తులకున్న

4. శ్రీరామకృష్ణులను గురించి భక్తుల మూడు భావనలు

ఇతమిత్థంకాని ఆలోచనలు, ఊహాగానాలు రోజులు గడిచే కొద్దీ స్థిరమైన రూపులు దిద్దుకోసాగాయి. అవి వారిని కొన్ని కోవలుగా విభజించాయి. గురుదేవుల జీవితంలో గతంలో జరిగిన అద్భుత సంఘటనలే భక్తుల ఆ అభిప్రాయాలకూ, ఊహలకూ మూలకారణం అనే విషయం సుస్పష్టం.

ఒక కోవకు చెందిన భక్తులు, యుగావతారులైన శ్రీరామకృష్ణుల శారీరక రుగ్మత నిజమైన వ్యాధి కాదనీ, అది ఒక కల్పన అనీ అనుకోవడమే కాక, అదే విషయాన్ని బాహాటంగా వెల్లడించారు కూడా. పూర్తిగా తెలిసే ఏదో ఒక విశేష కార్యాన్ని సాధించే నిమిత్తమే ఆ వ్యాధిని కల్పించుకొన్నారు; కనుక ఎప్పుడు కావాలంటే అప్పుడు మళ్లీ పూర్వం మాదిరే స్వస్థులు కాగలరని వారు భావించసాగారు. ఈ అభిప్రాయంగల భక్తులకు గిరీష్‌చంద్రఘోష్ నాయకుడు.

ఎవరి అనుల్లంఘనీయమైన ఇచ్ఛాశక్తికి పూర్తిగా లోబడి ఉంటూ, జీవితంలో ప్రతి ఒక్క పనిని నెరవేర్చుతూన్నారో ఆ జగజ్జనని జగత్కళ్యాణం నిమిత్తం నిగూఢమైన తన ఒకానొక కార్యంకోసం గురుదేవులను కొంతకాలం వ్యాధిగ్రస్థులను చేసిందనీ - ఆ ఉద్దేశం శ్రీరామకృష్ణులు స్వయంగా ఎరిగివున్నారో లేదో చెప్పలేం కాని - ఆమె ఉద్దేశం ఫలించిన తక్షణం ఆయన స్వస్థులు కాగలరనీ కొందరు భక్తులు ప్రగాఢంగా నమ్మారు.

ఇక మరికొందరు భక్తుల అభిప్రాయం: జనన మరణ జరావ్యాధులన్నీ శారీరక సహజ ధర్మాలు. శరీరం నిలిచి ఉన్నంతవరకూ ఇవన్నీ సంభవిస్తాయి. అటువంటప్పుడు దీని వెనుక నిగూఢమైన ఏదో రహస్యం ఒకటి ఉందని ఊరకే అపోహపడవలసిన అవసరంలేదు. కళ్లారా చూస్తూన్నంత వరకు శ్రీరామ కృష్ణుల గురించిన ఏ విషయాన్ని సైతం తర్కయుక్తంగా విశ్లేషించి అర్థం చేసుకో నంతదాకా మేం ఏమీ అంగీకరించం; గురుదేవులు స్వస్థత పొందేవరకు ప్రాణా లర్పించి సేవించడానికి మేం సదా సంసిద్ధులం. అలాగే ఏ ఉన్నత జీవితా దర్శాన్ని ఆయన మాకు చూపారో ఆ మూసలో మా జీవితాలను మలచుకోవ డానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం. శ్రీరామకృష్ణుల యువశిష్యులకు ప్రతినిధిగా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వ్యక్తి నరేంద్రుడని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

శ్రీరామకృష్ణుల భక్తులు విభిన్న మనస్తత్వాలూ, విభిన్న అభిప్రాయాలూ గలవారైనప్పటికీ ఒక్క విషయంలో మాత్రం వారంతా ఏకీభావంలో ఉన్నారు.

5. భక్తుల పరస్పర ప్రేమాభిమానాలు

గురుదేవుల ఉదార బోధనల మేరకు తమ జీవితాలను గడపగలిగితే, హృదయపూర్వకంగా తమ సేవలను అర్పించి ఆయన అనుగ్రహానికి పాత్రులైతే మానవ జీవితపరమావధిని పొంద గలమనే ప్రగాఢ విశ్వాసం ఆ భక్తులందరిలో పాదుకొని ఉందనడం నిర్వివా దాంశం. అందువలననే ఒక వర్గంవారు గురుదేవులు యుగావతారులనీ, మరి కొందరు జగద్గురువులనీ, ఇంకొక వర్గంవారు మానవరూపంలోని దైవమనీ నమ్మినప్పటికీ పరస్పర ప్రేమాభిమానాలకు వారిలో కొదువలేదు.

వివిధ రకాల శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అభివ్యక్తీకరణలను ధ్రువీకరించే

6. శ్రీరామకృష్ణులలో విశేష ఆధ్యాత్మిక అభివ్యక్తతను భక్తులు అనుభూతి చేసుకోవడం

స్వయంగా మేం చూసిన కొన్ని సంఘటనలను ఇక్కడ పాఠకుల సౌకర్యార్థం పొందుపరుస్తున్నాం. శిష్యులూగా వర్గీ కరించబడని దర్శనార్థులు కూడా ఆ సంఘటనలు జర గడం చూసివున్నారు.

డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్

7. శ్రీరామకృష్ణుల పట్ల డా. సర్కార్ ఆకర్షితులు కావడం

శ్రీరామకృష్ణుల చికిత్స బాధ్యతను చేగొన్న డా. మహేంద్రలాల్ సర్కార్ ఆయనకు స్వస్థత చేకూర్చడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు. శ్రీరామకృష్ణులను పరీక్షించడానికి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం - రోజూ మూడుసార్లు రాసాగాడు. ప్రతి రోజు పరీక్ష పూర్తిచేసి ఔషధ నిర్ణయం చేశాక కొంతసేపు శ్రీరామకృష్ణులతో ఆధ్యాత్మిక విషయాల గురించి ముచ్చటించేవాడు. అలా రోజులు గడిచేకొద్దీ శ్రీరామకృష్ణుల ఉదార ఆధ్యాత్మిక భావాలపట్ల డ్రాక్టర్ మహేంద్రలాల్ సర్కార్‌కు విశేష ఆకర్షణ ఏర్పడింది; దాంతో తీరిక లభించినప్పుడల్లా రెండు మూడు గంటల పర్యంతం గురుదేవుల సాన్నిధ్యంలో గడిపి వెళ్లేవాడు. విలువైన ఆతడి సమయంలో ఎంతోసేపు తమ వద్ద గడుపుతూన్నందుకు ఒక రోజు శ్రీరామకృష్ణులు కృతజ్ఞతలు తెలుపబోతూండగా, డ్రాక్టర్ సర్కార్ గబుక్కున ఆయన్ను వారించి, ఇలా అన్నాడు: ''మీ కోసం మాత్రమే నే నింత సమయం ఇక్కడ గడుపుతున్నానని భావిస్తున్నారా? దీన్లో నా స్వార్థమూ ఉంది. మీతో మాట్లాడుతూంటే నే నెంతో ఆనందం పొందుతున్నాను. గతంలో మిమ్మల్ని చూసినప్పటికీ పనుల హడావిడి కారణంగా మిమ్మల్ని సన్నిహితంగా తెలుసుకొనే అవకాశం అప్పుడు లేకపోయింది. మీ సత్యసంధత కారణంగా నాకు మీ రెంతో నచ్చారు. సత్యం అని తెలిసిన విషయం నుండి మాటల ద్వారాకాని, చేతల ద్వారాగాని మీరు వెంట్రుకవాసి కూడా వైదొలగరు. ఎక్కడ చూసినా చెప్పేదొకటీ, చేసేది మరొకటీగా నాకు కనిపిస్తూన్నది. కించిత్తుకూడా ఆ వైఖరిని నేను సహించలేను. నేను మిమ్మల్ని శ్లాఘిస్తున్నానని అనుకోకండి. నేను అటువంటి వ్యక్తిని కాను. ఏదో సామెత చెప్పినట్లు 'తండ్రిని చెరిపే పుత్రుణ్ణే' నేను. తండ్రి తప్పుచేసినా సూటిగా నిలదీసి అడిగే మనిషిని నేను. అందుకే నోటి దురుసు వాడినని పేరుగాంచాను.'' ఆ మాటలు విని శ్రీరామకృష్ణులు

నవ్వుతూ, ''అవును, దానిని గురించి విన్నాను; కాని చాలాకాలం నుండి వస్తు న్నప్పటికీ దానికి ఇంతవరకు నిదర్శనం దొరకలేదు'' అని అన్నారు.

డ్బాక్టర్ కూడా నవ్వుతూ ఇలా అన్నాడు: ''అది మనిద్దరి అదృష్టం. లేకుంటే తప్పు ఏదైనా కానవస్తే మహేంద్రలాల్ సర్కార్ సహించే మనస్తత్వం

8. డాక్టర్ మహేంద్ర లాల్ సర్కార్ సత్యనిష్ఠ

లేనివాడని మీకు ఎప్పుడో తెలిసేది. అయినప్పటికీ సత్యం పట్ల నాకు మక్కువ లేదని భావించకండి. జీవితమంతా అక్కడికీ ఇక్కడికీ పరుగులు పెడుతున్నది సత్యం అని నాకు తెలిసినదాన్ని రూఢిపరచడానికే; అందుకే హోమియోపతి వైద్యం చేపట్టాను. అందుకే 'విజ్ఞానాభివృద్ధి సంస్థ'ను నెలకొల్పాను. నా పనులన్నీ ఆ సత్యం నిమిత్తమే.''

ఆ మాటలు విని డ్బాక్టర్ సత్యనిష్ఠుడనడం నిజమైనా ఆతడి నిష్ఠ అపరా (ప్రాపంచిక) విద్య కోవకు చెందిన సాపేక్ష సత్యాలపట్ల గల నిష్ఠ అనీ, కాని శ్రీరామకృష్ణుల సత్యనిష్ఠ యావజ్జీవితం పరా (బ్రహ్మ) విద్యకు చెందినదని మాలో ఒకరు సూచించడం మాకు జ్ఞాపకం వుంది.

ఆతడి మాటలు విని కాస్త ఉత్తేజితుడైన డ్బాక్టర్ ఇలా అన్నాడు: ''ఇదే మీకున్న రోగం. జ్ఞానపరంగా చూస్తే పరా ఏమిటి, అపరా ఏమిటి? సత్య

9. పరావిద్య : అపరా విద్య

ప్రకటనలో ఎక్కువ తక్కువ లనడం అర్థంపర్థం లేని మాటలు. ఒకవేళ అటువంటి భేదం ఉందనుకొన్నా అపరా విద్య మూలంగానే పరావిద్యకు చేరక తప్పదని అంగీకరించాలి. ఈ సృష్టికి మూలకారకుడైన భగవంతుణ్ణి ప్రకృతి విజ్ఞానం ద్వారా ఆవిష్కృతమైన ప్రత్యక్ష సత్యాల మూలంగానే స్పష్టంగా తెలుసుకోగలం. అయినా నాస్తిక వైజ్ఞానికులను నేను ఖాతరు చేయను. వారు చెప్పేది ఏమిటో కూడా నాకు అర్థంకాదు; వారు కళ్లుండీ గుడ్డివారు. కాని ఆద్యంతాలు లేని భగవంతుణ్ణి పరి పూర్ణంగా అవగతం చేసుకొన్నానని ఎవరైనా చెబితే వాడొక అబద్ధాలకోరు, వంచ కుడు. ఉన్మత్త శరణాలయమే అతడికి తగిన చోటు.''

ఆ మాటలు విని ప్రసన్న దృక్కులతో డ్బాక్టర్‌ను చూస్తూ, ''నువ్వన్నది

10. భగవంతుడు అనంతుడు

నిజం. భగవంతుణ్ణి పరిమితం చేసే వ్యక్తులు నిమ్న మనస్కులు. వారి 'మాటలను నేను సహించలేను'' అన్నారు శ్రీరామకృష్ణులు నవ్వుతూ.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు భక్తశ్రేష్ఠుడైన రాంప్రసాద్ రచించిన 'ఎరుగగ

11. బుద్ధికి అవగత మైనా హృదయం అంగీ కరించదు

తరమె ఏరికైనా, తల్లి కాళి నిజతత్వ మించుక? షడ్దర్శ నములె శక్తిహీనములు, తల్లి విషయము తెలియజేయు టకు' అనే పాటను, మాలో ఒకరిని పాడమన్నారు.

మాలో ఎవరో ఆ పాటను ఇలా పాడారు:

ఎరుగగ తరమె ఏరికైనా
తల్లి కాళి నిజతత్త్వ మించుక?
షడ్దర్శనములె శక్తిహీనములు
తల్లి విషయము తెలియచేయుటకు ॥ ఎ ॥

అంతర మందున ఆత్మానందము
ఆస్వాదించెడు ఆత్మయోగికి
ఆమెయె వెల్గును అంతరాత్మయని
సర్వశాస్త్రములు సన్నుతిజేయును ॥ ఎ ॥

ఎల్లప్రాణుల యుల్లమునందున
ఆమె వసించును ఐచ్ఛికముగనే
ఆమె గర్భమున అమరియున్నవి
అండాండంబులు బ్రహ్మాండంబులు ॥ ఎ ॥

అంత విశాలము ఆమె గర్భము
నీవు దానిని అవలోకింతువే?
మూలాధార సహస్రారముల
ఆమెను యోగి ధ్యానము సేయును ॥ ఎ ॥

ఆమె ఎట్టిదో అసలు ఎవ్వరో
శివుడుగాక మరి ఎవరు చూచెదరు
పద్మవనములో పతి సన్నిధిలో
హంసి హంసతో ఆటలాడును ॥ ఎ ॥

అమ్మ నెరుగ నెవడాశించినను
రవ్వ చేయును రామప్రసాదు
ఆమె నెరుగవలె ననుచు తలచుట
నవ్వులాట సాగరము నీదుట ॥ ఎ ॥

హృది ఎరిగినను మది ఎరుగక
అందమైన యా చందమామను
పట్టుకొనుటకై కొట్టుకొనెడు మరు
గుజ్జు వానివలె కోరుచున్నది ॥ ఎ ॥

ఆ పాటను వింటూ శ్రీరామకృష్ణులు మధ్యమధ్యలో చరణాల అర్థాన్ని డాక్టర్‌కు హీనస్వరంలో వివరించసాగారు. గాయకుడు 'హృది ఎరిగినను మది ఎరుగక' అని పాడినప్పుడు, శ్రీరామకృష్ణులు చప్పున అతణ్ణి ఆపి, ''తల్లక్రిందులైంది. 'మది ఎరిగినను హృది ఎరుగక' అని ఉండాలి.' భగవంతుణ్ణి తెలుసుకోగోరినప్పుడు అనంతుడైన ఆయనను తెలుసుకోవడం తనకు అసాధ్యమని అతడి బుద్ధి సులభంగానే గ్రహిస్తుంది. కాని అతడి హృదయం మాత్రం అందుకు సమ్మతించదు. ఆయనను పొందడానికి సతతం ప్రయత్నిస్తూనే ఉంటుంది'' అని చెప్పారు.

శ్రీరామకృష్ణుల పై వ్యాఖ్యానం విని డాక్టర్ ముగ్ధుడై ఇలా అన్నాడు: ''నిజం చెప్పారు. బుద్ధి చాలా చెడ్డది; ఏదైనా రవ్వంత అడ్డమొచ్చినా, 'ఇక ముందుకుపోవడం చేతకాదు' అని చతికిలపడుతుంది. కాని హృదయం మాత్రం ససేమిరా ఒప్పుకోదు. ఇన్ని ఆవిష్కరణలకు, మున్ముందు చేయబోయే ఆవిష్కరణలకు (ఆ హృదయమే) కారణం.''

12. భావసమాధిలోని ఒక బాలభక్తుని నాడి పరీక్షించడం

ఆ పాట వింటూ ఒకరిద్దరు యువకులు భావపారవశ్యంలో బాహ్యస్మృతిని కోల్పోవడం చూసి డాక్టర్ వారి వద్దకెళ్ళి వారి నాడిని పరీక్షించి, గురుదేవులతో, ''మూర్ఛపోయిన వారిలా వీరు బాహ్యస్మృతి పూర్తిగా కోల్పోయినట్లు కనిపిస్తున్నారు'' అని అన్నాడు. శ్రీరామకృష్ణులు వారి ఛాతీని తమ చేత్తో నిమురుతూ, మెల్లగా వారి చెవులలో భగవన్నామం ఉచ్చరించగానే వాళ్ళు బాహ్యస్మృతిని పొందడం గమనించి డాక్టర్ మళ్ళీ గురుదేవులతో, ''ఇదంతా మీ లీలలా కనిపిస్తూన్నది'' అని అన్నాడు. గురుదేవులు నవ్వి, ఇలా అన్నారు: ''ఇది నా లీల కాదు, భగవత్సంకల్పం. భార్య, బిడ్డలు, పేరు ప్రతిష్ఠలు, ధనం ఇత్యాదితో వారి మనస్సులు ఇంకా సావధానతను కోల్పోలేదు. సంకీర్తన వింటూ మనస్సును భగవంతునిలో లీనం చేయగలగడానికి అదే కారణం.''

13. విద్య ఉత్పాదించే ఆవేశం (గర్వం)

వెనుకటి అంశం మళ్ళీ ప్రస్తావనకు వచ్చింది. ''స్వయంగా మీరు భగవంతుణ్ణి నమ్ముతున్నా, ఆయనకు పరిమితులు కల్పించకపోయినా, అనేకమంది విజ్ఞానవేత్తలు భగవంతుణ్ణి త్రోసిరాజంటారు; మరికొందరు భగవంతుని ఉనికిని విశ్వసించినా ఆయన తాము భావించే మేరకే ఘనుడనీ, తాము ఆయనకు ఆపాదించిన మేరకే శక్తివంతుడనీ ఎలుగెత్తి చాటుతారు'' అని భక్తులు కొందరు డాక్టర్‌తో చెప్పారు. అందుకు డాక్టర్ ఇలా జవాబిచ్చాడు: ''మీరు చెప్పింది ముమ్మాటికీ నిజం. జ్ఞానం కారణంగా అలా అంటున్నారని మీరు భావిస్తున్నారా? కాదు. విద్య ఉత్పాదనచేసే

ఆవేశం (గర్వం). జీర్ణం కాని జ్ఞానం. ఆయన సృష్టించిన ఏవో అల్పమైన వాటిని కనుగొన్నామని ఎంచి, విశ్వరహస్యమంతా తెలిసిపోయిందని విర్రవీగుతారు. ఈ కోవకు చెందినవారు గొప్ప విద్యావంతులే అయినప్పటికీ అనుభవశూన్యులు. కాని ఈ రెండు అర్హతలు సంతరించుకొన్న వారిలో ఈ విపరీత వైఖరి ఉండదు. నా మటుకు నేను ఎన్నటికీ ఆ రీతిలో యోచించను.''

ఆ జవాబు విని శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: ''నువ్వన్నది నిజం. జ్ఞానంతోపాటు, 'నేను పండితుణ్ణి, నేను అవగతం చేసుకొన్నదే సత్యం; ఇతరుల అభిప్రాయాలు తప్పు' అనే అహంకూడా అబ్బుతుంది. మనిషి నానా బంధనాలతో కష్టపడుతూవుంటాడు. విద్యాహంకారం దాన్లో ఒకటి. నువ్వు గొప్ప విద్యావంతుడివి, అదృష్టవశాత్తు నువ్వు ఆ రకం అహం నుండి తప్పించుకొన్నావు. అందుకు భగవంతుని అనుగ్రహమే కారణం.''

గురుదేవుల వచనాలు విని డాక్టర్ ఒకింత ఉత్తేజితుడై ఇలా పలికాడు: ''నాకు తెలిసింది, అర్థమైంది ఎంతో తక్కువ, అసలు ఏమీ లేదనే చెప్పవచ్చు. కాబట్టి మిడిసిపడడానికి కేముంది? ఇంకా నేను తెలుసుకోవలసింది ఎంతో ఉంది; నిజానికి ప్రతి వ్యక్తికీ తెలిసిన అనేక విషయాలు నాకు తెలియవు. కనుక దేనిని గాని ఎవరి వద్ద నుండిగాని నేర్చుకోవడానికి నేను ఏమాత్రం సంకోచించను. వీరినుండి (మమ్మల్ని చూపుతూ) కూడా నేను తెలుసుకోవలసిన విషయాలు అనేకం ఉన్నాయని తోస్తోంది. ఆ కోణం నుండి చూస్తే సర్వుల పాదధూళిని స్వీకరింప నేను సిద్ధం.''

14. డాక్టర్ వినమ్రత

ఆ మాటలు విని గురుదేవులు (మమ్మల్ని చూపుతూ), ''వీరితో, 'మిత్రమా బ్రతికి ఉన్నంతవరకు నేర్చుకొంటూనే ఉంటాను' అని చెబుతూంటాను'' అన్నారు. తరువాత డాక్టర్‌ను చూపుతూ శ్రీరామకృష్ణులు ''ఈయన ఎంత నిరహంకారో మీరు గమనించారా? ఆయనలో సారం ఉండబట్టే అటువంటి వైఖరి ఉంది'' అని కొనసాగించారు. ఆ తరువాత డాక్టర్ సెలవుపుచ్చుకొని వెళ్లిపోయాడు.

15. 'డాక్టర్‌లో సారం ఉంది'

తమ పట్ల విశ్వాసమూ, ప్రేమా డాక్టర్‌లో ఇనుమడించేకొద్దీ, శ్రీరామకృష్ణులు ఆయనను ఆధ్యాత్మిక మార్గంలో ముందంజ వేయించడంలో ఎంతో శ్రద్ధ వహించసాగారు. పైగా సంస్కారవంతులు, సంస్కారవంతులతోనే మాట్లాడడానికి ఇష్టపడతారనే విషయం ఎరిగివున్న శ్రీరామకృష్ణులు, అప్పుడప్పుడు

16. ఆధ్యాత్మిక పథంలో డాక్టర్‌ను గురుదేవులు నడిపించడం

మహేంద్రనాథ్ ('మ'), గిరీష్‌చంద్ర, నరేంద్ర మొదలైన శిష్యులను విద్యావంతుడైన డాక్టర్‌తో మాట్లాడడానికి పంపేవారు. గిరీష్‌తో ఆ రీతిలో పరిచయం ఏర్పడ్డాక, డాక్టర్ ఒక రోజు గిరీష్ ప్రదర్శించే 'బుద్ధచరిత్ర' అనే నాటకాన్ని తిలకించి, ఆ నాటకాన్ని ఎంతో ప్రశంసించాడు. అట్లే గిరీష్ రచించి, ప్రదర్శించిన మరికొన్ని నాటకాలనూ తిలకించాడు.

అదేవిధంగా నరేంద్రుని సంభాషణాచాతుర్యానికి ఎంతో ముగ్ధుడై డాక్టర్, అతణ్ణి ఒక రోజు భోజనానికి ఆహ్వానించాడు. నరేంద్రునికి సంగీతంలో ఎంతో ప్రావీణ్యం ఉందని తెలుసుకొని, తనకోసం ఒక రోజు కొన్ని భక్తిగీతాలు పాడమని డాక్టర్, అతణ్ణి కోరాడు. అలా కోరిన కొన్ని రోజుల తరువాత ఒకనాటి మధ్యాహ్నం గురుదేవులను పరీక్షించడానికి డాక్టర్ వచ్చినప్పుడు, నరేంద్రుడు రెండు మూడు గంటలసేపు పాడి, ఆయన కోర్కెను తీర్చాడు. నరేంద్రుని పాటలు విని డాక్టర్ పరమానందభరితుడయ్యాడు. గురుదేవుల వద్ద సెలవు పుచ్చుకోబోతూ, నరేంద్రుణ్ణి ఆశీర్వదించి, కౌగిలించుకొని, ముద్దాడి శ్రీరామకృష్ణులతో, "ఇటువంటి యువకుడు భగవత్సాక్షాత్కార మార్గం అనుసరించడం చూస్తే నా కెంతో ఆనందంగా ఉంది. ఇతడొక రత్నం. తాను చేౕొన్న ప్రతి పనిలోను ఇతడు రాణిస్తాడు" అని అన్నాడు. అందుమీదట గురుదేవులు, సంతోషంతో నరేంద్రుణ్ణి పరికిస్తూ, ఇలా అన్నారు: "అద్వైతుని ఆర్తనాదాలు విని గౌరాంగుడు నడియాకు వచ్చాడని చెప్పుకొంటారు. ఈ సారి జరిగేదంతా అతడి (నరేంద్రుని) కోసమే." ఆనాటి నుండి గురుదేవులను పరీక్షించడానికి వచ్చినప్పుడల్లా, ఆ సందర్భంలో నరేంద్రుడు కనుక అక్కడ ఉండడం తటస్థిస్తే, నరేంద్రుని భక్తిగీతాలు కొన్ని వినకుండామాత్రం డాక్టర్ సెలవు పుచ్చుకొని వెళ్లేవాడు కాడు.

17. ఔషధాలు ఆశించిన ఫలితాలను ఇవ్వక పోవడంతో డాక్టర్ ఆందోళన

అది శరత్కాలం. వంగదేశంలో దుర్గాదేవి ఉత్సవాల సమయం. ఆ సమయంలో గురుదేవుల వ్యాధి కొన్ని రోజులు తగ్గుముఖం పడుతూ, మరి కొన్ని రోజులు ప్రకోపిస్తూ అటూ ఇటూగా ఊగిసాగింది. చికిత్స వలన చెప్పుకోదగ్గ గుణం ఏమీ కానరాలేదు. ఒక రోజు డాక్టర్ పరీక్షించి, వ్యాధి ప్రకోపించడం గమనించి "పథ్యంలో ఏదో అవకతవక జరిగినట్లుంది. ఈ రోజు మీరు ఏం తిన్నారో చెప్పండి" అని ప్రశ్నించాడు. తాము ఆ రోజు ఏం తిన్నారో శ్రీరామకృష్ణులు తెలిపారు. ఆ రోజు ఆయన మామూలుగానే బియ్యంజావ, చారు, పాలు ఉదయాన పుచ్చుకొన్నారు; సాయంత్రం పాలు, బార్లీనీరు పుచ్చుకొన్నారు. డాక్టర్ ఆయన పుచ్చుకొన్న ఆహార వివరాలు విని, "మీరు

చెబుతున్నది నేను నమ్మను; నేను చెప్పిన పథ్యంలో ఏదో మార్పు జరిగింది. సరే, చారులో ఏం కూరగాయలు వినియోగించారో చెప్పండి?'' అని అడిగారు. అందుకు శ్రీరామకృష్ణులు, ''బంగాళాదుంపలు, అరటికాయలు, వంకాయలు, ఒకటి రెండు కాలీఫ్లవర్ ముక్కలు'' అని జవాబిచ్చారు.

ఆ జవాబు వినగానే డాక్టర్, ''అదీ సంగతి. మీరు కాలీఫ్లవర్ తిన్నారన్న మాట! ఇలా చూడండి, పథ్యంలో ఎంతో అవకతవక జరిగింది. కాలీఫ్లవర్ ఎంతో వేడిచేస్తుంది, పైగా జీర్ణం చేసుకోవడమూ కష్టమే. ఎన్ని ముక్కలు తిన్నారు?'' అని ప్రశ్నించాడు. ''ఒక్క ముక్కకూడా నోట పెట్టలేదు. కాలీఫ్లవర్ ముక్కలు చారులో వేసివుండడం చూశాను'' అని గురుదేవులు సుతిమెత్తగా ప్రతిఘటించే ధోరణిలో జవాబిచ్చారు. అందుమీదట డాక్టర్, ''తిన్నా తినకపోయినా ఒక్కటే; కాని కాలీఫ్లవర్ సారం చారులో కలిసింది. కనుక మీ జీర్ణశక్తి మందగించింది. ఫలితంగా రోగం నేడు ప్రకోపించింది'' అంటూ విశ్లేషించాడు. శ్రీరామకృష్ణులు ప్రతిఘటిస్తూ ఇలా అన్నారు: ''అదెలా? నేను కాలీఫ్లవర్ పుచ్చుకోనూ లేదు, నా జీర్ణశక్తి మందగించనూ లేదు. కాలీఫ్లవర్ సారం కించిత్తు చారులో కలిసినంత మాత్రాన రోగం ప్రకోపించిందనడం నేను ససేమిరా అంగీకరించను.''

డాక్టర్ ఇలా కొనసాగించాడు: ''కించిత్తు నియమ భంగం ఎంత హానికి దారితీస్తుందో మీరెవరికీ అర్థం కావడం లేదు. నా జీవితంలో జరిగిన ఒక

18. కించిత్తు నియమ భంగం ఎంతో హానికరం

సంఘటనను విశదీకరిస్తే మీకు పై విషయం బాగా అర్థమౌతుంది. చిన్నప్పటి నుండి నా జీర్ణశక్తి అంతంత మాత్రమే; అప్పుడప్పుడు నేను అజీర్ణంతో బాధపడడం కద్దు. అందువలన ఆహార విషయంలో నేను ఎంతో జాగ్రత్త వహిస్తాను, పథ్య నియమాలు పాటిస్తాను. బజారు నుండి తెచ్చిన వేటినీ నేను తినను. నెయ్యి, నూనె ఇంట్లోనే తయారుచేయిస్తాను. అయినప్పటికీ ఒకానొక సందర్భంలో నాకు జలుబు చేసి, అది శ్వాసనాళం వాపుకు దారితీసి, ఏ చికిత్సకూ నయం కాలేదు. నా ఆహారంలో ఏదో పొరపాటు జరిగి ఉంటుందనే ఆలోచన అప్పుడు కలిగింది. కాని క్షుణ్ణంగా పరిశీలించినప్పటికీ నా దైనందిన ఆహారంలో ఎలాంటి దోషమూ కనిపించలేదు. కొన్ని రోజుల తరువాత హఠాత్తుగా మా ఆవుకు పొట్టి చిక్కుడుకాయలు మా పనివాడు తినిపించడం నా కళ్లబడింది. ఆ ఆవు పాలనే నేను నిత్యం త్రాగుతాను. వాకబు చేయగా కొన్ని మణుగుల ఆ చిక్కుడు కాయలను ఒక ఫలానా చోటు నుండి కొనుగోలుచేసి తెచ్చారని తెలియవచ్చింది.

ఆ చిక్కుడు కాయలను తింటే జలుబు చేస్తుందని ఎవరూ తినకపోయేసరికి, వాటిని ఆవుకు మేతగా పెట్టసాగారు. ఆవు ఆ చిక్కుడు కాయలను తినడం, నాకు జలుబు చేయడం - రెండూ ఏకకాలంలో జరిగాయి. దానిని ధ్రువీకరించుకొనే నిమిత్తం ఆవుకు చిక్కుడుకాయలు తినిపించడం ఆపేశాను, నా ఊహ ప్రకారమే నా జలుబూ తగ్గసాగింది. ఆ సందర్భంలో జలుబు నుండి పూర్తిగా కోలుకోవడానికి నాకు చాలాకాలం పట్టింది. వాతావరణ మార్పుకు, తదితర ప్రక్రియలకు నాలుగైదు వేల రూపాయలు ఖర్చు పెట్టాకనే, నాకు జలుబు నుండి పూర్తి విముక్తి లభించింది.''

డాక్టర్ చెప్పింది విని, శ్రీరామకృష్ణులు మందహాసం చేస్తూ, ''అమ్మో! చింతచెట్టు క్రింద నడిచినంత మాత్రాన జలుబు పట్టుకొన్న వ్యక్తి కథలా ఉందే ఇది!'' అని అన్నారు.

అందరూ నవ్వారు. డాక్టర్ సూచించిన కారణం కొంత సంశయాత్మకమే అయినప్పటికీ, ఆయనకున్న ప్రగాఢ విశ్వాసాన్ని గురించి ఎవరూ ఆక్షేపణ లేవదీయలేదు. ఆయన నిషేధాన్ని అంగీకరించి గురుదేవుల వంటలో కాలీఫ్లవర్ వాడకాన్ని ఆపివేశారు.

శ్రీరామకృష్ణులు తన పట్ల వ్యక్తం చేసే ప్రేమ, ఆయన సరళమైన నడవడిక, ఆయన ప్రగాఢ ఆధ్యాత్మికత డాక్టర్‌ను ఆయన పట్ల ఆకర్షితుని చేసింది;

19. శ్రీరామకృష్ణుల పట్ల డాక్టర్ గౌరవం ఇనుమడించడం

క్రమంగా డాక్టర్ హృదయంలో శ్రీరామకృష్ణుల పట్ల గౌరవం ఇనుమడించసాగింది. డాక్టర్ మాటలు, చేతలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఆయన శ్రీరామకృష్ణుల పట్ల మాత్రమే కాక, భక్తులపట్ల కూడా ఎంతో అభిమానం కనబరచసాగాడు; శ్రీరామకృష్ణులను భక్తులు మిథ్యాఆరాధ్యమూర్తిగా సేవించడం లేదని డాక్టర్‌కు గట్టినమ్మకం ఏర్పడింది. కాని గురుదేవుల పట్ల వారి భక్తిప్రపత్తులను డాక్టర్ ఏ దృష్టితో పరికించాడో చెప్పడం అంత సులభం కాదు. అతడికి అది కాస్త అతిగా కనిపించివుండవచ్చు. అయినప్పటికీ భక్తులు స్వార్థం నిమిత్తంగాని లేదా గొప్పకోసంగాని తమ భక్తిప్రపత్తులను చూపడం లేదని మాత్రం డాక్టర్ చక్కగా గ్రహించాడు. కనుక అతడికి అది ఒక నిగూఢ రహస్యంగానే మిగిలిపోయింది. భక్తులతో ఆయన సన్నిహితంగా మెలగుతూ ఉన్నప్పటికీ డాక్టర్ కుశాగ్రబుద్ధికి అది అంతుబట్టలేదు. భగవద్విశ్వాసం గలవాడైనా, పాశ్చాత్య విద్యా ప్రభావం వలన కేవలం ఒక మానవమాత్రుణ్ణే, ఆ వ్యక్తిలో ఎంతటి దివ్యశక్తి అభివ్యక్తీకరిస్తూన్నప్పటికీ, గురువుగా లేదా అవతారపురుషునిగా ఆరాధించడం డాక్టర్‌కు అర్థంకాని విషయంగానే మిగిలిపోయింది. తనకు ఈ విషయం అవగతం

కాలేదు కనుక ఆ వైఖరికి అతడు విముఖుడైనాడు. ఆధునిక విద్యావంతుల మాదిరి విరోధించడానికి కారణం ఉందికూడా. అదేమిటంటే: లోకంలో అవతార పురుషులుగా పరిగణింపబడి ఎవరు ఆరాధింపబడుతూ వస్తూన్నారో వారి శిష్యప్రశిష్యులు తెలివితక్కువతనంతో ఆ అవతార పురుషులను గురించి ఎంత అతిగా ప్రచారం చేశారంటే, ఆ అవతార పురుషుల యథార్థ స్వభావాన్ని ఇప్పుడు గుర్తించడమే ఎంతో కష్టమైపోయింది. తాము ఆరాధించే వారి మహత్వాన్ని ప్రచారం చేయాలనే అనుయాయుల ఉత్సుకతే అందుకు కారణం. ఈ మిథ్యా ఉత్సుకతే సామాన్యులలో విరోధాన్ని జనింపచేసింది.

పై విషయాన్ని గురించి డాక్టర్ ఒక రోజు సూటిగా శ్రీరామకృష్ణులతో ఇలా చెప్పాడు: ''భగవంతుణ్ణి ఆరాధించడం, పూజించడం మొదలైనవి చేయడం నేను అర్థం చేసుకోగలను. కాని అనంతుడైన ఆ భగవంతుడు మానవమాత్రుడిగా జన్మించాడని చెప్పడంలోనే వస్తుంది పేచీ అంతా. ఆయన యశోదానందనుడుగా, మేరీ తనయుడిగా, శచీనందనుడుగా[1] అవతరించాడనే విషయం అర్థం చేసుకోలేం. ఈ 'నందను'ల గుంపే దేశాన్ని సర్వనాశనం చేసింది.'' డాక్టర్ మాటలు విని నవ్వి, గురుదేవులు మాతో, ''ఆయన ఏమంటున్నాడు? అయినా మందమతులైన మతమౌఢ్యులు వారిని (అవతార పురుషులను) మహిమాన్వితులుగా కానవచ్చేలా చేయగోరి అలా ప్రవర్తించినందువల్లనే జనుల మనస్సులలో ఇటువంటి ప్రతిచర్యలు సహజంగా జనించాయన్న మాట నిజం'' అని అన్నారు.

20. భగవదవతారం గురించి డాక్టర్ అభిప్రాయం

అవతార పురుషుల గురించి డాక్టర్‌కు ఉన్న అభిప్రాయం చూసి గిరీష్ ఘోష్, నరేంద్రనాథ్‌లు ఆయనతో పలుమార్లు వివాదించారు. ఫలితంగా బాగా యోచించకుండా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంలో డాక్టర్ జాగ్రత్తపడ్డాడు. నిజానికి అవతారతత్వానికి వ్యతిరేకంగా అనేక యుక్తియుక్త వాదాలు ప్రకటించవచ్చు. కాని తర్కం సాధించలేని పనిని ప్రేమ సాధించింది.

శ్రీరామకృష్ణుల అసాధారణ ప్రేమ, ఆయనలో అభివ్యక్తమౌతున్న అద్భుత ఆధ్యాత్మికత క్రమంగా డాక్టర్ పై అభిప్రాయాన్ని చాలావరకు మార్చసాగాయి. ఆ సంవత్సర దుర్గాపూజా సమయంలో, సంధిపూజా కాలంలో హఠాత్తుగా శ్రీరామకృష్ణులలో అద్భుత శక్తి అభివ్యక్తీకరించడం మే మంతా చూశాం. దాన్ని చూసి, పరీక్షించే అవకాశం అప్పుడు డాక్టర్‌కు లభించింది.

---

1. చైతన్యమహాప్రభువు

ఆయన ఆ రోజు మరో డాక్టర్ మిత్రుడితో వచ్చాడు. భావపారవశ్యంలో ఉన్న శ్రీరామకృష్ణుల హృదయ స్పందనాదులను వైద్య పరికరాలతో డాక్టర్ పరీక్షించాడు. ఆయన మిత్రుడు శ్రీరామకృష్ణుల కళ్లు మూతలుపడతాయో లేదో అని పరీక్షించడానికి తెరచివున్న ఆయన కళ్లలో వ్రేళ్లను పెట్టడానికి కూడా వెనుకాడ లేదు. అలా పరీక్షించి వాళ్లు నివ్వెరబోయారు; అన్ని రకాలా బాహ్యంగా మరణించిన వ్యక్తిలా కానవచ్చే శ్రీరామకృష్ణులు పొందిన సమాధి స్థితిని గురించి తమ విజ్ఞానశాస్త్రం ఏమీ చెప్పలేకపోతున్నదని వాళ్లు అంగీకరించక తప్పలేదు. ఇక పాశ్చాత్య మానసికశాస్త్రవేత్త సమాధిస్థితిని కేవలం చైతన్యరహిత అవస్థగా భావించడం ఆతడి అవివేకాన్ని, బేసబబైన హఠాన్ని ప్రదర్శిస్తూన్నది. భగవంతుని సృష్టిలో అనేక విషయాల మర్మాన్ని ఇప్పటి వరకు పాశ్చాత్య విజ్ఞానమూ, తత్వశాస్త్రమూ వివరించలేకపోయాయి; భవిష్యత్తులో సైతం ఆ మర్మాన్ని విశదీకరించడం కూడా సందేహాస్పదమే. బాహ్యంగా మృతుడుగా కానవచ్చినా ఆ సమాధి స్థితి శ్రీరామకృష్ణుల మానసికానుభూతులు ఎంత యథార్థాలో అనే విషయం ఇదివరకే చర్చించాం కనుక మళ్లీ దానిని ఇక్కడ ఏకరువుపెట్టడం అనవసరమని భావిస్తున్నాం.

ఆశ్వయుజ మాసం గడిచి కార్తీకం వచ్చింది, కాళీపూజా దినం దగ్గర పడింది. కాని శ్రీరామకృష్ణుల దేహ పరిస్థితిలో మెరుగు కనిపించలేదు. చికిత్స

21. వ్యాధి ప్రకోపించడం

ప్రారంభమైనప్పుడు కనిపించిన గుణం నానాటికీ తగ్గి, వ్యాధి తీవ్రతరమౌతోందనే భయం కలుగసాగింది. కాని శ్రీరామకృష్ణుల ఆనందం ప్రసన్నత మాత్రం తగ్గడానికి బదులుగా ఇనుమడిస్తున్నట్లు భక్తులకు కనబడింది. డాక్టర్ సర్కార్ తరచు ఆయనను పరీక్షిస్తూ, మందులు మార్పు చేస్తూన్నప్పటికీ ఆయన ఆశించిన ఫలితం కనబడకపోవడంతో, బహుశా ఋతువు మార్పే అందుకు కారణమని భావించాడు. శీతకాలం చలి కాస్త ఎక్కువకాగానే పరిస్థితి మెరుగుపడుతుందని అనుకొన్నాడు.

దుర్గాపూజ సందర్భంలో జరిగినట్లే కాళికాదేవి పూజా సందర్భంలో కూడా శ్రీరామకృష్ణులలో అద్భుత ఆధ్యాత్మిక అభివ్యక్తీకరణ దివ్యత్వాన్ని

22. కాళికోత్సవంలో శ్రీరామకృష్ణుల అద్భుత భావసమాధి

భక్తులు చూశారు. ఒకప్పుడు దేవేంద్రనాథ్ అనే భక్తునికి కాళీ విగ్రహాన్ని తెచ్చి పూజించాలనే ఆకాంక్ష కలిగింది. శ్రీరామకృష్ణుల, ఆయన భక్తుల సమక్షంలో తన కోర్కె ఈడేరితే అంతకు మించిన ఆనందం ఉండదని భావించి కాళీవిగ్రహాన్ని శ్యాంపుకూర్ ఇంటికే తెచ్చి అక్కడే పూజించాలనే తన ప్రతిపాదనను విన్నవించాడు. శ్రీరామకృష్ణుల సమక్షంలో పూజ నిర్వహిస్తే అది చూసి ఆయన దేహం

ఉత్సుకతతో మరింత డస్సిపోతుందని భక్తులు అతణ్ణి ఆ విషయంగా ప్రోత్స హించలేదు. భక్తులు తనను ప్రోత్సహించకపోవడం దేవేంద్రుడికి సబబుగానే తోచి, అతడు తన ఉద్దేశాన్ని మార్చుకొన్నాడు.

కాని కాళీపూజకు ముందురోజు హఠాత్తుగా కొందరు భక్తులను పిలిచి శ్రీరామకృష్ణులు, ''సంక్షిప్తంగా పూజ నిర్వర్తించడానికి కావలసిన సరంజామాను సేకరించి తీసుకురండి. రేపు కాళీమాతను తప్పక పూజించాలి'' అని చెప్పారు. ఆయన మాటలు విని భక్తులు ఆనందించి తమలో తాము సంప్రదించుకోసాగారు. పూజా ఏర్పాట్ల గురించి ఆయన ఎటువంటి ఆదేశాలు ఇవ్వనందున భక్తులు తర్జనభర్జన పడసాగారు. పూజ పదహారు ఉపచారాలతో చేయాలా లేదా పంచోపచారాలతోనా? పూజలో అన్నభోగం అర్పించాలా, లేదా? పూజ ఎవరు చేస్తారు? ఇటువంటి సంశయాలతో వాళ్లు ఏ నిర్ణయానికీ రాలేకపోయారు. గంధం, పువ్వులు, ధూపం, దీపం, పండ్లు, మిఠాయిలు సిద్ధం చేసుకొని ఉండాలని చివరికి తీర్మానించారు. ఆ తరువాత గురుదేవులు ఎలా చేయాలని ఆదేశిస్తారో అలా చేయవచ్చునుకొన్నారు. పూజ రోజు ఉదయం వరకూ శ్రీరామకృష్ణులు వారికి ఎటువంటి ఆదేశమూ ఇవ్వలేదు.

23. పూజ ఏర్పాట్లు

అప్పుడు సమయం రాత్రి ఏడు గంటలయింది. శ్రీరామకృష్ణులు అప్పటికీ పూజ గురించి ఏం చెప్పకుండా ప్రశాంతంగా తమ మంచం మీద కూర్చునివున్నారు. భక్తులు ఆయన మంచానికి తూర్పు వైపు నేలను శుభ్రం చేసి, సేకరించిన పూజా ద్రవ్యాలు తెచ్చి, అక్కడ ఉంచారు. దక్షిణేశ్వరంలో ఉంటున్నప్పుడు గంధపుష్పాదులతో శ్రీరామకృష్ణులు కొన్ని సందర్భాలలో తమను తామే పూజించుకొనేవారు. అలా ఆయన చేయడం కొందరు భక్తులు చూసివున్నారు. ఈ రోజు కూడా ఆయన తమ మనశ్శరీరాలనే ప్రతీకల ద్వారా విశ్వచైతన్యాన్ని, దాని శక్తిని పూజిస్తారేమో లేదా జగజ్జననితో తాదాత్మ్యజ్ఞానం పొంది శాస్త్రానుసారం ఆత్మపూజను నిర్వర్తిస్తారేమోననే నిర్ణయానికి వచ్చారు భక్తులు. అందుకే పూజోపకరణాలను గురుదేవుల మంచం ప్రక్కన అమర్చారు. వారలా అమరుస్తూన్నా శ్రీరామకృష్ణులు వారిని వారించలేదు.

24. శ్రీరామకృష్ణులు మౌనంగా కూర్చోవడం

క్రమంగా పూజాద్రవ్యాలన్నీ అక్కడ అమర్చిపెట్టారు. ధూపం వేసి, దీపాలు వెలిగించారు. గదంతా కాంతితో, సుగంధ వాసనలతో నిండిపోయింది. శ్రీరామకృష్ణులు మౌనంగా నిశ్చలంగా కూర్చుని ఉండడం చూసి భక్తులు ఆయన ప్రక్కన కూర్చున్నారు. కొందరు ఆయన ఆదేశానికి నిరీక్షిస్తూ తదేకంగా ఆయన వైపే చూస్తున్నారు.

మరికొందరు జగజ్జననిని ధ్యానించసాగారు. ఆ విధంగా గదిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. గదిలో ముప్పై మందికి పైబడే ఉన్నప్పటికీ, గది ఖాళీగా ఉన్నట్లుగా తోస్తున్నది. ఆ విధంగా కొంతసేపు గడిచింది. కాని శ్రీరామకృష్ణులు స్వయంగా తామే పూజ ప్రారంభించడంగాని లేదా పూజ చేయమని మాలో ఎవరికైనా పురమాయించడంగాని చేయక అప్పటికీ నిశ్చలంగా కూర్చుండిపోయారు.

యువభక్తులతోపాటు మహేంద్రనాథ్, రాంచంద్ర, దేవేంద్రనాథ్, గిరీష్ ఘోష్ వంటి పెద్దలైన భక్తులుకూడా అప్పుడు అక్కడున్నారు. పూజ గురించి శ్రీరామకృష్ణులు మౌనంగా ఉండిపోవడం వీరిలో అనేకులను ఆశ్చర్యపరచింది. 'ఐదుపావలా ఐదణాల' విశ్వాసం ఉందని శ్రీరామకృష్ణులు తరచు అభివర్ణించే గిరీష్ మనస్సులో మాత్రం వేరే ఆలోచనలు మెదలాయి. 'తమ నిమిత్తం కాళీపూజను చేసే అవసరం ఆయనకు లేదు. ఒకవేళ అహేతుక భక్తి ప్రేరణతో పూజ చేయాలనే ఆకాంక్ష ఆయనకు జనించిందనుకొంటే, మరి ఆయన ఊరకే ఎందుకు కూర్చుండిపోయారు? మరేదో కారణం ఉండి వుండాలి. తమ దేహాన్ని సజీవ జగజ్జనని ప్రతిమగా ఎంచి, భక్తులు పూజించి తరించాలనే ఉద్దేశంతోనేనా ఈ పూజ ఏర్పాట్లు? తప్పకుండా ఇదే అయి వుండాలి' అనే తలంపుతో అతడిలో ఉత్సాహం ఉరకలు వేసింది. తక్షణం ఎదురుగా అమర్చివున్న గంధపుష్పాదులను చేతుల్లోకి తీసుకొని 'జై మా' అంటూ శ్రీరామకృష్ణుల పాదపద్మాలకు వాటిని అర్పించాడు. అతడు అలా చేసిన క్షణంలోనే శ్రీరామకృష్ణులు రోమాంచితులై, ప్రగాఢ సమాధిమగ్నులైనారు. ఆయన వదనం దివ్యజ్యోతిలా ప్రకాశించసాగింది, ఆయన పెదవులపై దివ్యదరహాసం చిందులు వేస్తూన్నది; రెండు చేతులూ వరాభయ ముద్రలు దాల్చాయి. ఆయనలో జగజ్జనని అభివ్యక్తీకరణ స్పష్టంగా కానవస్తూన్నది.

12. భావసమాధి మగ్నులైన శ్రీరామకృష్ణులను, గిరీష్‌చంద్ర పూజించడం

శ్రీరామకృష్ణులు భావపారవశ్యులైన తరువాతే గిరీష్ పుష్పాదులు అర్పించాడని పలువురు భక్తులు భావించారు; అంటే పై సంఘటనలు త్రుటిలో జరిగిపోయినట్లు తెలియవస్తూన్నది. కాస్త దూరంలో ఉన్న మరికొందరికి దేదీప్యమానంగా ప్రకాశిస్తూన్న దేవీమూర్తి హఠాత్తుగా గురుదేవులుగా ఆవిర్భవించినట్లు అనిపించింది.

ఇక భక్తుల ఆనందానికి అవధుల్లేవని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అక్కడున్న ప్రతి ఒక్కరూ పళ్లెరం నుండి ఎలాగో గంధపుష్పాదులను తీసుకొని తమ ఇష్టమంత్రాన్ని ఉచ్చరిస్తూ జయజయధ్వానాలతో గురుదేవుల పాదపద్మాలను అర్చించసాగారు. అలా కొంతసేపు గడచిపోయిన తరువాత శ్రీరామకృష్ణుల

భావపారవశ్యం ఉపశమించి ఆయన పాక్షిక బాహ్యస్మృతిని పొందారు. అప్పుడు పూజ నిమిత్తం తెచ్చిన పండ్లు, మిఠాయిలు మొదలైన వాటిని ఆయనకు సమర్పించారు. ఆయన వాటిలో ఒకింతమాత్రం స్వీకరించి భక్తిజ్ఞానాలు ఇనుమడించాలని వారిని ఆశీర్వదించారు. పిదప గురుదేవుల ప్రసాదాన్ని భక్తులు ఆరగించి, రాత్రి బాగా ప్రొద్దుపోయే దాకా మహోత్సాహంతో దేవీమాహాత్మ్యాన్ని, నామాన్ని కీర్తిస్తూ భక్తిగీతాలు పాడారు. ఆ సంవత్సరం కాళీపూజ నాడు భక్తులు పొందిన ఆనందం వర్ణనాతీతం; ఇంతకు మునుపు ఎన్నడూ వారంతటి ఆనందాన్ని చవిచూసి ఎరుగరు. ఈ ఆనందోత్సాహం వారి మదిలో శాశ్వతంగా నిలిచి పోయిందని చెప్పడం అతిశయోక్తికాదు. క్లేశాలు ఎదురైనప్పుడల్లా, మనస్సును నిరాశానిస్పృహలు ఆవరించినప్పుడల్లా ఆ నాటి దివ్యమందహాసంతో ప్రకాశించే గురుదేవుల ప్రసన్న వదనం, వరాభయ ముద్రలు దాల్చిన కరకమలాలతో కూడిన ఆ దివ్యమంగళమూర్తి వారి హృదయాలలో స్ఫురించేవి; తత్ఫలితంగా భగవంతుని పరిరక్షణలో తాము ఉన్నామనే విశ్వాసం వారిలో మరింత బలపడేది.

26. భక్తులు కూడా శ్రీరామకృష్ణులను అర్చించడం

శ్యాంపుకూర్‌లో వసిస్తూ ఉన్నప్పుడు కేవలం విశేషమైన పండుగ రోజులలో మాత్రమే భక్తులు శ్రీరామకృష్ణులలో దివ్యశక్తి అభివ్యక్తం కావడం అనుభూతి చేసుకొన్నారనడం సబబు కాదు. కాని రోజు, సమయం అనే తారతమ్యం లేకుండా ఆయనలో ఆ దివ్యశక్తి అభివ్యక్తం కావడం భక్తులు చూసేవున్నారు. ఫలితంగా భక్తులలో గురుదేవులు మానవరూపంలోని దేవుడనే విశ్వాసం నానాటికీ బలపడసాగింది. కాని దివ్య అభివ్యక్తీకరణలు ఎప్పుడూ అందరి ముందూ జరిగేవని అనుకోరాదు. కొద్దిమంది భక్తులకే వాటిని ప్రత్యక్షంగా దర్శించే భాగ్యం కలిగేది. తరువాత వీరి నుండి ఆ సంఘటనలను గురించి విన్న ఇతర భక్తులలో ఆ నమ్మకం బలపడసాగిందనే విషయంలో ఎలాంటి సందేహమూ లేదు. పై విషయాన్ని స్పష్టం చేసే కొన్ని ఉదాహరణలు ఇక్కడ పొందుపరుస్తున్నాం.

27. శ్రీరామకృష్ణులను గురించిన భక్తుల ప్రత్యక్ష ఆధ్యాత్మికానుభూతులు

బలరాం బసుకు సంబంధించిన కొన్ని విషయాలు ఇదివరకే ప్రస్తావించి వున్నాం. శ్రీరామకృష్ణుల పట్ల అతడూ, అతడి కుటుంబమూ భక్తిప్రపత్తులు చెల్లిస్తూన్నందున ఆతడి బంధువులు అతడిపట్ల గుర్రుగా ఉన్నారు. అందుకు కారణం లేకపోలేదు. వీరంతా వైష్ణవులు కావడం వలన ఆ కాలంలో ప్రాబల్యంలో ఉన్న దీక్షాదులు స్వీకరించారు. అందువలన వీరి మతం కొంత

28. శ్రీరామకృష్ణులతో బలరాం సాంగత్యం పట్ల ఆతడి బంధువుల అనిష్టత

సంకుచితంగా ఉండటంచేత వారు బాహ్యవిధులనే అధికంగా పాటించేవారు. కాబట్టి వారు అన్ని మతాలూ, సంప్రదాయాలూ భగవత్సాక్షాత్కారానికి మార్గాలే అనే శ్రీరామకృష్ణుల ఉదార సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేకపోయారు. పైగా శ్రీరామకృష్ణులు మత చిహ్నాలను కూడా ధరించరు. పరమ ఛాందసులైన వీరి అవగాహనకు ఇవన్నీ అతీతమైనవి. అందువలనే శ్రీరామకృష్ణుల సాంగత్య ఫలితంగా, ఆయన అనుగ్రహ ఫలంగా నానాటికీ ఉదార భావసంపన్నుడౌతున్న బలరాంను చూసి ఆతడు నాస్తికుడుగా మారిపోతున్నాడని ఆ బంధువులు అపోహపడసాగారు.

సంపద, గౌరవం, కులీనజన్మ తదితర లౌకిక ఆధిక్యతలు తరచు మనిషిలో ఒక విచిత్రమైన గర్వాన్ని, అహంకారాన్ని జనింపచేయడం కద్దు. బలరాం బంధువులు కూడా ఈ బలహీనతను సంతరించుకొన్న వ్యక్తులే. సుప్రసిద్ధుడైన కృష్ణరాం బసు వంశంలో జన్మించడం వలన తాముకూడా ఘనులమనే వారు గర్వించేవారు. అటువంటప్పుడు వంశగౌరవాన్ని విస్మరించి సామాన్యవ్యక్తిలా ఆధ్యాత్మిక విషయాలలో ఉపదేశార్థం ఎప్పుడంటే అప్పుడు దక్షిణేశ్వరానికి శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లడం, అంతటితో ఆగక భార్య, కుమార్తె, ఇతర కుటుంబ స్త్రీలను ఆయన వద్దకు తోడ్కొని పోవడానికి వెనుకాడకపోవడం - ఇవన్నీ బలరాం బంధువులకు అవమానకరంగా తోచివుంటాయని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కాబట్టి ఎలాగైనాసరే బలరాంను, గురుదేవుల వద్దకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవాలని ఆ బంధుగణం కంకణం కట్టుకొంది.

29. బలరాంను వారు విరోధించడం

సన్మార్గంలో తమ ఉద్దేశం నెరవేరకపోతే అహంకారపూరితులైన వ్యక్తులు చెడు మార్గాలను అవలంబించడం పరిపాటి. బలరాం బంధువులలో కొందరు ఆ కోవకు చెందుతారు. కాల్నాకు చెందిన సుప్రసిద్ధ వైష్ణవుడైన భగవాన్‌దాస్ బాబాజీని గుర్తుచేసి, తమ వంశ గౌరవానికి భంగం వాటిల్లేలా వ్యవహరించవద్దని బలరాంకు నూరిపోసి, అతణ్ణి శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లకుండా చేయాలని శతధా ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో శ్రీరామకృష్ణుల పట్ల ద్వేషం పూని అవకాశం లభించినప్పుడల్లా ఆయనను దుమ్మెత్తి పోయసాగారు. అయినా శ్రీరామకృష్ణులు తమ ఇష్టదైవం పట్ల ఏకాగ్రభక్తి లేనివారూ, తినడం త్రాగడం మొదలైన వాటి పట్ల సంప్రదాయ వ్యతిరేకీ, తిలకనామాల చిహ్నాలు ధరించే వైష్ణవ సంప్రదాయానికి వ్యతిరేకులూ అనే విషయాలు ఇతరుల నుండి వినే బలరాం బంధువులు గురుదేవులను గురించి పై అభిప్రాయానికి వచ్చారనే చెప్పక తప్పదు.

తమ ప్రయత్నాలన్నీ వమ్మైపోవడంతో, ఆఖరి ప్రయత్నంగా శ్రీరామకృష్ణ బలరాంల గురించి వికృత కథనాలు కల్పించి తమ దాయాదులైన నిమాయ్ చరణ్ బసు, హరివల్లభ్ బసు చెవులలో ఊదరగొట్టసాగారు.

కారుణ్యం, త్యాగస్ఫూర్తి, అనాసక్తత అనే సుగుణాలు సంతరించుకొన్న బలరాం జమీలూ, ఇతర ఆస్తులూ సముచితంగా నిర్వహించాలంటే కొన్ని

30. బలరాం తొలి జీవనం

సందర్భాలలో క్రూరంగా వ్యవహరించక తప్పదని ఎన్నడో గ్రహించాడు. కనుక తన జమీను, ఇతర ఆస్తులను నిమాయ్ బసు నిర్వహణలో అప్పగించి వచ్చాడు. తన ఆస్తిపాస్తులపై నిమాయ్ పంపే ఆదాయం అతడి అవసరాలన్నిటికీ సరిపోకపోయినా, బలరాం ఎలాగో అలా కుటుంబాన్ని గడుపుకొస్తున్నాడు. ఆస్తిపాస్తులను స్వయంగా తానే చూసుకోగల శారీరక దార్ఢ్యం అతడికి లేదు. యవ్వన తొలిదశలో అతడు అజీర్ణ రోగంతో ఎంతో బాధపడ్డాడు. ఫలితంగా పన్నెండు సంవత్సరాల పర్యంతం అన్నం తినకుండా, బార్లీనీరు పాలతో గడపవలసి వచ్చింది. ఆరోగ్యం పుంజుకొనే నిమిత్తం చాలాకాలం అతడు పూరీలోనే గడిపాడు. ఆ కాలఘట్టాన్ని అతడు జపధ్యానాలతో, సాధుసాంగత్యంతో, నిత్యం జగన్నాథ దర్శనంతో గడిపివున్నాడు. వైష్ణవ సమాజంలో ఉన్న గుణదోషాలను గ్రహించే సదవకాశం అప్పుడు అతడికి కలిగింది. కలకత్తా వదలివెళ్లిన చాలాకాలం తరువాత ఏదో పనిమీద మళ్లీ కలకత్తాకు వచ్చిన సందర్భంలో అతడు శ్రీరామకృష్ణులను కలుసుకోవడం తటస్థించింది.

తన జ్యేష్ఠపుత్రిక వివాహ సందర్భంగా కొన్ని వారాలకోసం బలరాం కలకత్తాకు రావలసివచ్చింది. కాకపోతే పూర్తి పదకొండు సంవత్సరాలు అతడు

31. శ్రీరామకృష్ణులను బలరాం కలుసుకోవడం

పూరీలో శాంతియుతంగానే గడిపాడు. బలరాం కలకత్తాకు తిరిగి వచ్చిన కొద్దికాలంలోనే అతడి దాయాది హరివల్లభ్ బసు, 57 రమాకాంత బసు వీథిలో ఒక ఇల్లు కొనుగోలు చేశాడు. పూరీలో వసిస్తున్నప్పుడు బలరాం సాధువులతో ఎంతో సన్నిహితంగా మెలగడం చూసి, సంసారాన్ని త్యజించి అతడెక్కడ సన్న్యాసం పుచ్చుకొంటాడోననే భయంతో అతడి తండ్రి, దాయాదులు రహస్యంగా సంప్రదించుకొని బలరాంను కలకత్తాలో కొనుగోలు చేసిన ఇంట్లో వసించమని చెప్పారు. సాధుసాంగత్యం, నిత్య జగన్నాథ దర్శనం రెంటినీ కోల్పోయిన బలరాం దుఃఖభారంతో కలకత్తాకు వచ్చి నివసించసాగాడు. ఏదో రకంగా కొన్ని రోజులు కలకత్తాలో గడిపి మళ్లీ పూరీకి వెళ్లగలనని మొదట్లో అతడు అనుకొన్నాడు. కాని

శ్రీరామకృష్ణులను కలుసుకొన్న తరువాత ఆ అభిప్రాయాన్ని మార్చుకొని కలకత్తాలోనే శాశ్వతంగా ఉండిపోవాలని తీర్మానించుకొన్నాడు.

కాబట్టి ఎక్కడ హరివల్లభ్ కలకత్తా ఇంటిని ఖాళీ చేయమని చెప్తే లేదా నిమాయ్ బసు ఎక్కడ జమీని, ఇతర ఆస్తిపాస్తులను చూసుకోవడానికి కొఠార్‌కు (బలరాం స్వస్థలం) రమ్మని చెప్తే శ్రీరామకృష్ణుల సాంగత్యాన్ని తానెక్కడ కోల్పోతానో అనే ఆందోళనతో ఇప్పుడు బలరాం కొట్టుమిట్టాడుతున్నాడు.

ఆందోళన కలిగించే ఆలోచనలు ఒక్కొక్కప్పుడు భవిష్యత్ సంఘటనలను సూచిస్తాయి. బలరాం విషయంలో ఇప్పుడు అదే జరిగింది. అతడు భయపడుతున్నదంతా నిజమైంది. బంధువుల దుష్ప్రేరణతో బలరాం దాయాదులు ఇద్దరూ అతడిపట్ల అసంతుష్టులైనట్లు సూచిస్తూ ఉత్తరాలు వ్రాశారు. పైగా ఏదో కొన్ని ముఖ్య విషయాల పరిష్కారం గురించి బలరాంను సంప్రదించడానికి హరవల్లభ్ త్వరలో కలకత్తాకు వచ్చి కొన్ని రోజులు బలరాం ఇంట్లో బస చేస్తాడనే వార్త కూడా చేరింది. తాను ఏ తప్పూ చేయలేదే అని బలరాం ధీమాగా ఉన్నప్పటికీ, విధివశాత్తు ఎక్కడ శ్రీరామకృష్ణులను విడిచిపెట్టి పోవలసి వస్తుందోననే చింత పట్టుకొంది బలరాంను. 'ఇతరుల మాటలు నమ్మి దాయాదులు తనకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకొన్నా, వ్యాధిగ్రస్థులై ఉన్న శ్రీరామకృష్ణులను ఈ సమయంలో విడిచిపెట్టి వెళ్లను' అనే తీర్మానానికి, ఎంతో తర్జనభర్జనానంతరం బలరాం వచ్చాడు. ఇంతలో హరివల్లభ్ కలకత్తాకు రానేవచ్చాడు. తనతో ఉంటున్నప్పుడు దాయాదికి ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా చక్కని ఏర్పాట్లు బలరాం చేశాడు. ఏమాత్రం భయాందోళనలు చెందకుండా తన సంకల్పాన్ని ఏమాత్రం సడలించకుండా ఇదివరలో మాదిరే శ్రీరామకృష్ణుల వద్దకు రాకపోకలు సాగిస్తూనే వచ్చాడు.

32. బలరాం దాయాది హరివల్లభ్ కలకత్తాకు రావడం

మనస్సును ప్రతిఫలించే శ్రేష్ఠమైన అద్దం ముఖమని అంటారు. హరివల్లభ్ బసు కలకత్తాకు వచ్చిన రోజున బలరాం తమ వద్దకు రాగానే అతడి ముఖాన్ని చూసి అతడి మనస్సులోని సంఘర్షణను శ్రీరామకృష్ణులు అవగతం చేసుకొన్నారు. బలరాంను తమ సొంతమనిషిగా ఆయన పరిగణించేవారు. అతడి ఆ దురవస్థలో సానుభూతి వహించి, ప్రక్కకు పిలిచి, అతణ్ణి అనేక రీతుల ప్రశ్నించి అసలు పరిస్థితిని తెలుసుకొన్నారు. తరువాత ఆయన, "అతడు ఎలాంటి వ్యక్తి? ఒక రోజు అతణ్ణి ఇక్కడకు తోడ్కొని రాగలవా?" అని

33. హరివల్లభ్‌ను శ్రీరామకృష్ణులు చూడ గోరడం

బలరాంను అడిగారు. అందుకు బలరాం ఇలా జవాబిచ్చాడు: ''మనిషిగా మాత్రం చాలా మంచివాడు. విద్యావంతుడు, తెలివిగలవాడు, ఉదారుడు, దానశీలుడు. సంపన్ను లందరిలో సామాన్యంగా కానవచ్చే లోపం అతడిలోనూ ఉంది. చెప్పుడు మాటలు ఇట్టే నమ్మేస్తాడు. ఇతరులు చెప్పిన మాటలు విని నా గురించి తప్పుడు అభిప్రాయానికి వచ్చాడు. కేవలం నేను ఇక్కడకు వస్తున్నాననే అతడు నా పట్ల అసంతుష్టుడై ఉన్నాడు. కాబట్టి నేను రమ్మంటే అతడు ఇక్కడకు రావడం సందేహమే.'' ఆ జవాబు విని శ్రీరామకృష్ణులు, ''అలా అయితే అతణ్ణి అడగనవసరంలేదు. గిరీష్‌ను ఇక్కడికి రమ్మను'' అని చెప్పారు.

గిరీష్ వచ్చి, హరివల్లభ్‌ను తోడ్కొని రావడానికి సంతోషంగా అంగీకరించాడు. అతడు ఇలా అన్నాడు: ''నేనూ హరివల్లభ్ చిన్ననాటి సహాధ్యాయులం. కాబట్టి అతడు కలకత్తాకు వచ్చాడని తెలియగానే నేను వెంటనే వెళ్ళి అతణ్ణి కలుసుకోవడం కద్దు. కనుక అతణ్ణి కలుసుకోవడంలో నాకు ఎలాంటి ఇబ్బందీ లేదు. ఈ రోజే వెళ్ళి అతణ్ణి కలుసుకొంటాను.''

34. శ్రీరామకృష్ణుల వద్దకు హరివల్లభ్‌ను, గిరీష్ తోడ్కొని రావడం

మర్నాడు సాయంత్రం ఐదు గంటల సమయంలో గిరీష్, హరివల్లభ్‌ను తోడ్కొని వచ్చి, శ్రీరామకృష్ణులకు పరిచయం చేశాడు. ''ఇతడు నా బాల్య మిత్రుడు, హరివల్లభ్ బసు. కటక్‌లో ప్రస్తుతం ప్రభుత్వ న్యాయవాదిగా ఉంటున్నాడు. మిమ్మల్ని చూడడానికి వచ్చాడు'' అని ఆయనతో గిరీష్ చెప్పాడు. శ్రీరామకృష్ణులు అతణ్ణి ఆప్యాయంగా ఆహ్వానించి తన ప్రక్కన కూర్చోబెట్టుకొని ఇలా అన్నారు: ''నిన్ను గురించి అనేకుల మూలంగా విన్నాను; నిన్ను చూడాలనే కోర్కె కలిగింది. నీకు లెక్కలుగట్టే స్వభావం ఉందేమోనని భయపడ్డాను. (గిరీష్‌తో) నా భయం నిరాధారమైందని ఇప్పుడు తేలింది. (హరివల్లభ్‌ను చూపుతూ) ఇతడు బాలుడివంటి సరళస్వభావి. (గిరీష్‌తో) ఇతడి కళ్లను గమనించావా? అంతరంగం భక్తిపూరితం కాకపోతే ఇటువంటి కళ్లు ఉండడం అసంభవం. (హఠాత్తుగా హరివల్లభ్‌ను స్పృశిస్తూ) అవును, నా కెంతో ఆప్తుడిలా అనిపిస్తున్నావు. నీ నుండి ఎడంగా ఉండాలని నేను అనుకోలేకపోతున్నాను.'' గురుదేవుల ఆ పలుకులు విని హరివల్లభ్ ఆయనకు ప్రణామం చేసి, పాదధూళి స్వీకరించి, ''అదంతా మీ అనుగ్రహమే'' అని అన్నాడు.

తరువాత గిరీష్ ఇలా అన్నాడు: ''దైవభక్తి ఇతడికి ఉండడం సహజమే; ఎందుకంటే, సుప్రసిద్ధ భక్తుల కుటుంబంలో ఇతడు జన్మించాడు. కీర్తిశేషులైన కృష్ణరాం బసు భక్తిని గురించి జనులు ఎంతగానో ప్రశంసిస్తారు. అతడు ప్రాతః

స్మరణీయుడు. ఆతడి దైవభక్తి ఈ ప్రాంతానికి కీర్తిప్రతిష్ఠలను కొనితెచ్చిందంటే అతిశయోక్తి కాదు. అటువంటి వంశంలో జన్మించిన వాడు భక్తుడు కాకుంటే మరెవరు భక్తుడౌతాడో చెప్పండి?''

ఆ తరువాత దైవభక్తిని గురించి చర్చ ప్రారంభమైంది. భగవంతుని పట్ల విశ్వాసం, భక్తి, కేవలం ఆయనపైనే ఆధారపడి ఉండడం - ఇవి సంతరించుకొంటేనే మానవ జీవితం సార్థకమౌతుందంటూ, భక్తి గురించిన వివిధాంశాలు ముచ్చటించారు శ్రీరామకృష్ణులు. అలా మాట్లాడుతూన్నప్పుడే ఆయన భావపారవశ్యమగ్నులైనారు. కాసేపటికి పాక్షిక బాహ్యస్మృతిలోకి వచ్చిన తరువాత మాలో ఒకరిని ఒక భక్తిగీతం పాడమన్నారు. ఆ పాటలోని అర్థాన్ని హీనస్వరంలో హరివల్లభ్‌కు విశదీకరిస్తూ మళ్లీ ఆయన ప్రగాఢ భావావస్థలోకి వెళ్లిపోయారు. పాట పూర్తి అవుతూండగానే అక్కడున్న వారిలో ఇద్దరు ముగ్గురు యువభక్తులు కూడా భావసమాధిమగ్నులైనారు. ప్రతి ఒక్కరి హృదయాలను కదలించివేసిన శ్రీరామకృష్ణుల వచనాలకు ఎంతో ముగ్ధుడైన హరివల్లభ్ కళ్లలో ప్రేమాశ్రువులు స్రవించాయి. మునిమాపువేళ అయిన కాసేపటికి శ్రీరామకృష్ణుల నుండి సెలవు పుచ్చుకొని హరివల్లభ్ వెళ్లిపోయాడు.

35. శ్రీరామకృష్ణుల స్పర్శ : తత్ప్రభావం

దక్షిణేశ్వరంలో ఉంటున్నప్పుడు ఆయన దర్శనార్థం వచ్చిన నూతన వ్యక్తి ఎవరైనా ఆయన సిద్ధాంతానికి వ్యతిరేకంగా వాదించబోయినప్పుడు లేదా ఏదో ఒక కారణంతో ఎవరైనా ఆయనను వ్యతిరేకించాలనే ఉద్దేశంతో వచ్చినప్పుడు నేరుగా ఆయన వారిని స్పృశించడం తరచు మేం చూసివున్నాం. ఆ స్పర్శ ప్రభావంతో తక్షణమే ఆ దర్శనార్థులు ఆయన ఉపదేశాలకు అనుకూలంగా స్పందించేవారు. అంటే వచ్చిన వారందరినీ అలా స్పృశించేవారని భావించరాదు. ఎవరిని చూస్తే ఆయన మనస్సు ప్రసన్నమయ్యేదో అటువంటి వ్యక్తులను మాత్రమే శ్రీరామకృష్ణులు స్పృశించేవారు. అలా స్పృశించడానికి కారణం ఏమిటో తమంత తామే ఆయన ఒక రోజు చెప్పారు: ''అహంకారానికి వశవర్తులయ్యో లేదా ఆత్మన్యూనతాభావంతోనో మనుషులు ఇతరుల వచనాలను అంగీకరించడానికి ఇష్టపడరు. (తమ శరీరాన్ని చూపుతూ) కాని ఈ లోపల ఉన్న వ్యక్తిని అటువంటి వ్యక్తులు తాకిన మరుక్షణమే దైవీశక్తి ప్రభావం వలన ఆ అహంకారం మళ్లీ తలెత్తదు; పడగెత్తి బుసలు కొడుతున్న పాము ఒక ప్రత్యేక వనమూలిక స్పర్శచేత ఎలా తల దింపివేసుకొంటుందో అలాగే ఇదీను. మాటల సందర్భంలో నేరుగా నేను అటువంటి వారిని స్పృశించడానికి కారణం అదే.''

శ్రీరామకృష్ణుల పట్ల అమిత గౌరవభావంతో, అంతకు ముందు తనలో వున్న వైఖరికి పూర్తి విరుద్ధంగా నాడు శ్రీరామకృష్ణుల వద్ద సెలవు పుచ్చుకొని వెళుతున్న హరివల్లభ్ బసును చూసి శ్రీరామకృష్ణుల పై వచనాలు మాకు చటుక్కున జ్ఞప్తికి వచ్చాయి. శ్రీరామకృష్ణులను దర్శించడంలో బలరాం తప్పు చేస్తున్నాడనే ఆలోచన ఆతడి దయాదుల మనస్సులలో మళ్లీ తలెత్తలేదనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

శ్యాంపుకూర్‌లో ఉంటున్నప్పుడు శ్రీరామకృష్ణుల శారీరక పరిస్థితి దిగజారసాగింది; దాంతోబాటు ఆయనను దర్శించి అనుగ్రహం పొందాలని వచ్చే

36. భక్తుల సంఖ్య అధికరించడం

భక్తుల సంఖ్య అధికం కాసాగింది. హరీశ్చంద్ర ముస్తఫీ, మణీంద్రనాథ్ గుప్త మొదలైన గృహస్థభక్తులు, యువభక్తులైన శారదాప్రసన్న (కాలాంతరంలో స్వామి త్రిగుణాతీతానంద) వంటి తదితరులు శ్రీరామకృష్ణులను ప్రప్రథమంగా ఇక్కడే చూశారు. మళ్లీ స్వామి అభేదానంద మొదలైన వారు ఒకటి రెండుసార్లు శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరంలో చూసినప్పటికీ, ఆయనతో సన్నిహిత సాంగత్యం కలిగే అవకాశం వారికి ఇక్కడే లభించింది. ఇలా క్రొత్తగా వచ్చిన వారి గత సంస్కారాలను, నైజాన్ని గమనించి శ్రీరామకృష్ణులు వారికి భక్తిప్రధాన మార్గాన్నో లేదా జ్ఞానంతో కూడిన భక్తిమార్గాన్నో నిర్దేశించేవారు. అవకాశం లభించినప్పుడల్లా వారికి ఏకాంతంలో ఉపదేశాలిచ్చి ఆధ్యాత్మిక మార్గంలో వారు పురోగమించేలా ప్రేరేపించేవారు.

ఒక రోజు శ్రీరామకృష్ణులు ఒక యువకునికి భగవంతుని సాకార, నిరాకార రూపాలలో ధ్యానించడానికి యోగ్యమైన ఆసనాదులను ప్రదర్శించి చూపిన విషయం మాకు తెలుసు. పద్మాసనం వేసుకొని ఎడమ చేతిమీద కుడి చేయి ఉంచి, రెండు చేతులను ఛాతీదాకా ఎత్తి, కళ్లు మూసుకొని ఆయన, ''సాకార భగవంతుని ధ్యానించడానికి ఈ ఆసనం ఎంతో యోగ్యమైనది'' అని అన్నారు. తదుపరి పద్మాసనం వేసుకొని కుడి ఎడమ చేతులను కుడి ఎడమ మోకాళ్లమీద ఉంచి చూపుడు వ్రేలును బొటనవ్రేలితో జతచేసి (జ్ఞాన ముద్రా), దృష్టిని భ్రూమధ్యంలో స్థిరంచేసి, ''ఇది నిరాకార ధ్యానానికి శ్రేష్ఠమైన ఆసనం'' అని ఆయన తెలిపారు. అలా చెబుతూ ఉండగానే ఆయన సమాధిమగ్నులయ్యారు. కాసేపయ్యాక బలవంతంగా మనస్సును మామూలు స్థితికి దింపి, ''ఇక చూపడం సాధ్యం కాదు. ఇలా కూర్చోగానే నా మనస్సు తన్మయమై, సమాధిలో లీనమైపోతూన్నది, దేహంలోని వాయువులు ఊర్ధ్వగాములు కావడం వలన పైకెగసి గొంతులోని గాయాన్ని బాధిస్తున్నాయి.

అందుకే సమాధి స్థితిలోకి పోకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మరీమరీ హెచ్చరించాడు'' అని చెప్పారు.

శ్రీరామకృష్ణుల మాటలు విని ఆ యువకుడు ఎంతో బాధపడి, ''ఇవన్నీ ఎందుకు ప్రదర్శించి చూపించారు? నేను అడగలేదు కదా!'' అని అన్నాడు. అందుకు ఆయన, ''అది నిజమే. కాని ఒకింత అయినా ప్రదర్శించి చూపకుండా, వివరించకుండా ఉండగలనా?'' అని జవాబిచ్చారు. శ్రీరామ కృష్ణుల అపార కరుణను, భావపారవశ్యాన్ని అమితంగా ఇష్టపడే ఆయన మన స్సును గురించి ఆలోచించిన ఆ యువకుడు విస్తుపోయాడు.

37. శ్రీరామకృష్ణుల చేతలలోని మాధుర్యం వల్ల ఎల్లరు ఆకర్షితులవడం

శ్రీరామకృష్ణుల చేత లన్నింటిలోను ఒక అనుపమానమైన మాధుర్యం ఏ మేరకు కానవచ్చేదంటే క్రొత్తగా వచ్చే అనేకులు దానిని చూసి ఇట్టే ఆకర్షితులై పోయేవారు. ఇందుకు ఒక ఉదాహరణగా ఒక సంఘటనను పొందుపరుస్తున్నాం. ఈ సంఘటనను గురించి మేం గిరీష్‌చంద్ర తమ్ముడైన అతుల్‌చంద్ర ఘోష్ నుండి విన్నాం. అతడికి మిత్రులంటే పంచప్రాణాలు. ఆ సంఘ టనను అతడి మాటలలోనే పొందుపరచడానికి ప్రయత్నిస్తాం.

38. ఒక ఉదాహరణ: సబ్ జడ్జి ఉపేంద్ర

''ఉపేంద్ర నా ఆప్తమిత్రుడు. ఇతడు సబ్‌జడ్జిగా మరో రాష్ట్రంలో పని చేస్తూండేవాడు. శ్రీరామకృష్ణులతో నాకు పరిచయం కలిగిన తరువాత, 'ఈసారి నువ్వు ఇంటికి వచ్చినప్పుడు నీ కొక అద్భుతం చూపిస్తాను' అని అతడికి ఉత్తరం వ్రాశాను. అతడు క్రిస్మస్ సెలవులలో ఇంటికి తిరిగివచ్చినప్పుడు ఆ సంగతి నాకు జ్ఞాపకం చేశాడు. అప్పుడు అతడితో ఇలా చెప్పాను: 'శ్రీరామకృష్ణ పరమహంసగారిని నీకు పరిచయం చేయాలనుకొన్నాను. కాని ఆయన ప్రస్తుతం తీవ్ర అనా రోగ్యంతో శ్యాంపుకూర్‌లో ఉంటున్నారు. డాక్టర్‌లు ఆయనను మాట్లాడకూడ దని నిషేధించారు. నువ్వా కొత్తవాడివి. కనుక నిన్ను అక్కడికి ఎలా తోడ్కొని పోగలను?'' ఆ రోజు గడిచిపోయింది. మరో రోజు ఉపేంద్ర మా అన్నను (గిరీష్) చూడడానికి వచ్చాడు. మాటల సందర్భంలో శ్రీరామకృష్ణుల ప్రస్తా వన వచ్చింది. 'అతుల్‌తో ఒక రోజు కలిసి వెళ్లి ఆయనను నువ్వు ఎందుకు చూసిరాకూడదు?' అన్నాడు మా అన్న. అందుకు ఉపేంద్ర, 'ఆరు నెలల నుండి నన్ను అక్కడకు తీసుకుపోతానని చెబుతూనే ఉన్నాడు. కాని ఇక్కడకు నేను వచ్చిన తరువాత దానిని గురించి జ్ఞాపకం చేస్తే, ఇప్పుడు సాధ్యం కాదంటున్నాడు' అని చెప్పాడు. ఆ మాట విని నేను మా అన్నతో, 'ప్రస్తుతం మనలను కూడా ఎప్పుడంటే అప్పుడు ఆయన వద్దకు అనుమతించడం లేదు.

అటువంటప్పుడు ఒక క్రొత్తవ్యక్తిని నే నెలా తోడ్కొనిపోగలను?' అని చెప్పాను. 'ఏది ఏమైనప్పటికి ఇతణ్ణి ఒకసారి తీసుకువెళ్లు. అదృష్టం బాగుంటే గురు దేవులు దర్శనం ఇచ్చి ఆదరిస్తారు' అన్నాడు మా అన్న.

"ఆ తరువాత ఒక రోజు మధ్యాహ్నం ఉపేంద్రను అక్కడకు తీసుకు వెళ్లాను. రెండు పెద్ద చాపల మీద కూర్చున్న భక్తులతో శ్రీరామకృష్ణుల గది

39. శ్రీరామకృష్ణులను ఉపేంద్ర దర్శించడం

క్రిక్కిరిసిపోయి ఉంది. చిత్రకళ (ప్రఖ్యాత చిత్రకారుడు అన్నదా బాగ్చి ఆ రోజు అక్కడే ఉన్నాడు), స్వర్ణకారుల అంగడిలో బంగారాన్ని కరిగించడం[1] వంటి అనేక మామూలు విషయాలు

---

1. స్వర్ణకారులు వెండి, బంగారాలను అపహరించడంలో ప్రదర్శించే నైపుణ్యాన్ని గురించి శ్రీరామకృష్ణులు అప్పుడప్పుడు మా కొక కథ చెప్పేవారు. అతుల్ ఘోష్ ప్రస్తావిస్తున్నది ఆ కథనే. ఆ కథ ఇది: ఒకప్పుడు ఒక వ్యక్తి నగనొకదాన్ని అమ్మడానికి కొందరు మిత్రులతో ఒక స్వర్ణకారుడి అంగడికి వెళ్లాడు. ఒళ్లంతా పంగనామాలు, తలపై పిలక, మెళ్లో రుద్రాక్షమాల ధరించి హరినామాన్ని జపిస్తూ అంగడి ముంగిట కూర్చునివున్న ఒక వృద్ధుడైన స్వర్ణకారుణ్ణి వారు చూశారు. అతడి క్రింద పనిచేసే ముగ్గురు నలుగురు కూడా అదే రీతిలో తిలకం, రుద్రాక్షమాలలు ధరించి ఆభరణాల తయారీలో నిమగ్నులై అంగడిలో ఉన్నారు. వారి వేషధారణను, భక్తిని చూసి ఆ వ్యక్తి అతడి మిత్రులు ఈ స్వర్ణకారులు ధార్మికులనీ, తమను మోసగించరనీ భావించారు. తరువాత వారు తాము అమ్మదలచుకొన్న ఆభరణాన్ని ఆ ముసలి స్వర్ణకారుడికి ఇచ్చి, దాని వెలను నిర్ణయించి చెప్పమని కోరారు. ఆ వృద్ధుడు వారిని సాదరంగా కూర్చోబెట్టి, వారికి హుక్కా సిద్ధం చేయమని ఒక పనివాణ్ణి పురమాయించాడు. పిదప ఆ ఆభరణాన్ని గీటురాయి మీదగీసి, బంగారాన్ని పరీక్షించి, దాని ధర నిర్ణయించి చెప్పాడు. వారు అంగీకరించడంతో ఆ ఆభరణాన్ని కరిగించడానికి తన సహాయకుడికిచ్చి అంగడిలోకి పంపించాడు. ఆ సహాయకుడు దాన్ని కరిగించడం మొదలుపెట్టగానే, హఠాత్తుగా దేవుణ్ణి జ్ఞాపకం చేసుకొని 'కేశవా, కేశవా' అంటూ అరిచాడు. భగవద్భావంలో ఉప్పొంగిపోతూ ఆ ముసలి స్వర్ణకారుడు కూడా, 'గోపాలా! గోపాలా!' అంటూ కేకలు పెట్టాడు. అంగడిలో ఉన్న ఒక సహాయకుడు తక్షణమే 'హరి! హరి! హరి!' అని కేకలువేశాడు. ఈలోపు క్రొత్తగా వచ్చిన ఖాతాదారులకు హుక్కా సిద్ధంచేసి ఇచ్చినవాడు అంగడిలోకి పోతూ 'హర! హర! హర!' అన్నాడు బిగ్గరగా. ఇతడు అలా బిగ్గరగా చెప్పగానే బంగారాన్ని కరిగిస్తున్నవాడు కరిగిన కొంత బంగారాన్ని చాక చక్యంగా తన ముందున్న నీళ్లకుండలో పారబోశాడు.

కాని ఈ స్వర్ణకారులు భగవన్నామాలను విపరీతార్థాలలో ఉపయోగిస్తున్నారనే విషయం పాపం ఆ నగలు అమ్మడానికి వచ్చిన వ్యక్తులకు అర్థం కాలేదు. కేశవా అనడానికి బదులుగా 'కే సబ్' (వంగభాషలో) అన్నారు. అంటే వచ్చిన వారెవరు? అని అర్థం. మరో విధంగా చూస్తే వచ్చినవారు తెలివైనవారా లేదా దద్దమ్మలా అని తెలుసుకోగోరారు. ఆ ప్రశ్నకు ఆ వృద్ధుడు 'గోపాల' అంటే ఆవుల మంద లేదా దద్దమ్మలు అనే అర్థంలో జవాబిచ్చాడు. 'హరి', 'హర' అనే పదాలను హరించనా?

→

గురించి మాటలు సాగుతున్నాయి. చాలాసేపు మేం అక్కడ కూర్చున్నప్పటికీ అటువంటి వ్యర్థప్రసంగాలతోనే కాలం గడిచింది. అప్పుడు నే నిలా ఆలోచించాను: 'ఈ రోజు ఈ క్రొత్త వ్యక్తిని తోడ్కొని వచ్చాను. ఈ రోజే వ్యర్థ ప్రసంగాలతో కాలం గడిచిపోతున్నది. గురుదేవులను గురించి ఇతడు (ఉపేంద్ర) ఏమనుకొంటాడు?' నేను విసుగు చెందసాగాను. మధ్యమధ్యలో నా మిత్రుడి వంక బెరుకుగా చూడసాగాను. కాని అతడి ముఖంలో ఆ ప్రసంగాలను ఆనందంగా వింటున్న ధోరణి ద్యోతకమైంది. ఇక పోదామని అతడికి సైగ చేశాను. కాని కాసేపు ఉండమని అతడు సైగద్వారా తెలిపాడు. రెండు మూడుసార్లు నేను సైగ చేసిన తరువాత, అతడు లేచి నా వద్దకు వచ్చాడు. అప్పుడతణ్ణి, 'ఇంతసేపటి నుండి ఏం వింటున్నావు? ఏముంది ఆ మాటల్లో వినడానికి? నిన్ను 'బాంగాల్' అని మేం ఊరకేనా పిలుస్తున్నాం?' అని అడిగాను. అలా మేం అతణ్ణి సంబోధించడానికి కారణం అతడి నుదుటి మీద పచ్చబొట్టు ఉండడమే. అందుకు అతడు, 'కాదు, వినడానికి ఎంతో ఇంపుగా ఉంది. విశ్వజనీన ప్రేమను గురించి నే నింతకు మునుపు వినివున్నాను. కాని ఎవరిలోను దాని అభివ్యక్తీకరణను ఎన్నడూ చూడలేదు. అటువంటి చిన్నచిన్న విషయాలలో అంత ఆనందం పొందుతూన్న ఈయనలో (శ్రీరామకృష్ణులలో) దానిని నేడు చవిచూశాను. మళ్లీ ఒకసారి రావాలి; ఆయనను మూడు ప్రశ్నలు అడగాలి' అని జవాబిచ్చాడు.

→ అనే అర్థంలోను, ఊ, కాజెయ్యి అనే అర్థంలోను ప్రయోగించారు. అమ్ముకోడానికి వచ్చిన ఆ వ్యక్తులు ఈ స్వర్ణకారుల బాహ్యంగా కానవచ్చే దైవభక్తి, నిష్ఠను చూసి సంతోషించి, పొగ త్రాగుతూ కూర్చున్నారు. ఆ తరవాత కరిగించిన బంగారాన్ని తూయించి, ధర ప్రకారం పైకం పుచ్చుకొని తమదారిన తాము వెళ్లిపోయారు.

అధర్‌చంద్రసేన్ శ్రీరామకృష్ణుల గొప్ప గృహస్థ భక్తులలో ఒకడు. ఒక రోజు అతడి ఇంట్లో వంగదేశ సుప్రసిద్ధ నవలాకారుడు బంకించంద్ర గురుదేవులను కలుసుకొన్నాడు. భగవంతుడంటే అనేక సంశయభావాలున్న బంకిం ఆ రోజు మతాన్ని గురించి అనేక క్లిష్ట ప్రశ్నలను గురుదేవులను అడిగాడు. ఆ ప్రశ్నలకు శ్రీరామకృష్ణులు సముచిత సమాధానాలు ఇచ్చిన తరువాత బంకింతో ఆయన పరిహాసంగా, ''పేరులోనే కాక చేతలలో కూడా నువ్వు బంకింవే!'' అని అన్నారు. [వంగభాషలో బంకిం అంటే అవకతవక లేదా వంగి ఉండడం అని అర్థం.] గురుదేవుల సమాధానాలతో సంతృప్తుడైన బంకిం, 'మహాశయా, మీ రొక రోజు తప్పక కంఠల్‌పాడాలోని మా ఇంటికి వేంచేయాలి. భగవంతుని పూజాదికాలకు అక్కడ తగిన ఏర్పాట్లున్నాయి. మేమంతా హరినామస్మరణ చేస్తాం'' అని అన్నాడు. మళ్లీ పరిహాసపూర్వంగా శ్రీరామకృష్ణులు, ''హరి నామాన్ని ఎలా స్వీకరిస్తారు? ఆ స్వర్ణకారులు స్వీకరించిన రీతిలోనా?'' అని అడిగారు. ఇలా అంటూ గురుదేవులు పై కథ చెప్పారు. ఆ కథ విని అంతా కడుపుబ్బ నవ్వుకొన్నారు.

''మరునాటి ఉదయం నేను మళ్లీ ఉపేంద్రుణ్ణి తీసుకొనివెళ్లాను. ఆ సమయంలో గురుదేవుల వద్ద దాదాపు ఎవరూ లేరనే చెప్పాలి. ఒకరిద్దరు సేవకులు మా బావ మల్లిక్ మాత్రం ఉన్నారు. బయలుదేరే ముందే 'అడగవల సిందేమిటో నువ్వే అడుగు. అప్పుడే నీకు తృప్తికరంగా జవాబులు లభిస్తాయి. మరెవరి మూలంగాను మాత్రం ప్రశ్నలను అడిగించవద్దు' అని పదేపదే ఉపేంద్రను హెచ్చరించాను. కాని అతడు బిడియపడే నైజంగలవాడు. వద్దని చెప్పిన పనే చేశాడు. మల్లిక్ ద్వారా తన ప్రశ్నలను అడిగించాడు; గురుదేవులు ఏదో సమాధానం చెప్పారు. ఆ సమాధానం అతడికి సంతృప్తి కలిగించలేదని అతడి ముఖమే చెప్పక చెప్పింది. అప్పుడతడితో మెల్లగా, 'మరింకేమౌతుంది! నిన్నే అడగమని పదేపదే చెప్పలేదా? నువ్వే స్వయంగా ఆయనను ఎందుకు ప్రశ్నించవు? నీ ప్రశ్నలు అడగడానికి ఒక న్యాయవాదిని నియమించుకోవాలా?' అని అన్నాను.

''ఉపేన్ ధైర్యం పుంజుకొని స్వయంగా శ్రీరామకృష్ణులను, 'మహాశయా! భగవంతుడు సాకారుడా లేదా నిరాకారుడా? ఆయన రెండూ అయిన పక్షంలో

40. భగవంతుడు సాకారుడు, నిరాకారుడు కూడా

ఏకకాలంలో పరస్పర విరుద్ధమైన స్వభావాలను ఎలా కలిగివుంటాడు?' అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు వెంటనే శ్రీరామకృష్ణులు, 'మంచుగడ్డ, నీరులా భగవంతుడు సాకారుడు, నిరాకారుడు కూడా' అని జవాబిచ్చారు. ఉపేన్ కళాశాలలో విజ్ఞాన శాస్త్రం అభ్యసించాడు. కాబట్టి ఆ ఉదాహరణ అతడి కెంతో తృప్తినిచ్చింది. గురుదేవు లిచ్చిన జవాబును విజ్ఞానశాస్త్ర సహాయంతో అవగతం చేసుకొని ఉపేంద్ర ఎంతో సంతోషించాడు. ఆ ఒక్క ప్రశ్నే అడిగి అతడు ఊరకుండి పోయాడు. పిదప గురుదేవులకు ప్రణామం చేసి, సెలవు పుచ్చుకొని బయటకు వచ్చేశాడు. బయటకు రాగానే, 'ఉపేంద్రా, మూడు ప్రశ్నలు అడుగుతానన్నావు కదా! ఒక్క ప్రశ్నే అడిగి ఎందుకు వచ్చేశావు?' అని అడిగాను. అందుకు అతడు, 'అర్థం కాలేదా? ఆ ఒక్క జవాబులోనే నా మూడు ప్రశ్నలకూ సమాధానం లభించింది' అని చెప్పాడు.

''సోదరుడైన రాం (రాంచంద్ర దత్త) పెందలకడనే భోజనం చేసి ఆఫీసు దుస్తులను సంచీలో వేసుకొని తరచు శ్రీరామకృష్ణుల వద్దకు వస్తూవుండడం

41. రాంచంద్ర మాటలతో అతుల్ చిరాకుపడడం

బహుశా మీకు జ్ఞాపకం ఉండవచ్చు. అలా వచ్చి ఒకటి రెండు గంటలు అక్కడ గడిపి, తరువాత ఆఫీసు దుస్తులు ధరించి, వెళ్లిపోయేవాడు. ఆ రోజు గురుదేవులు ఉపేంద్రుని ప్రశ్నకు సమాధానం చెబుతున్నప్పుడు హఠాత్తుగా రాం అక్కడకు వచ్చి

ఆఫీసు దుస్తులు ధరిస్తూ గురుదేవుల మాటలు విన్నాడు. తరువాత మే మిద్దరం బయటకు రాగానే రాం, 'సోదరా, అతుల్! ఉపేన్‌ను నా వద్దకు తోడ్కొనిరా. అతడి ప్రశ్నకు గురుదేవులు ఇచ్చిన జవాబును అతడు అర్థం చేసుకోలేడు. శ్రీరామకృష్ణుల వచనాలను అవగతం చేసుకోవాలంటే నా తత్వ ప్రకాశిక పుస్తకాన్ని అతడు చదవాలి' అని చెప్పాడు. అతడి మాటలు నాకు చిరాకు పుట్టించాయి. నేను నిస్సంకోచంగా, 'మా కంటే ఏడు సంవత్సరాల ముందు నుండే మీరు గురుదేవుల వద్దకు వస్తూవున్నది నిజమే కదా! శ్రీరామకృష్ణుల వచనాల నుండి అతడు సత్యాన్ని అర్థం చేసుకోలేడనీ, మీ పుస్తకం నుండి మాత్రమే గ్రహించగలడనీ ఎలా చెప్పగలుగుతున్నారు? గురు దేవులు విశదీకరించలేని విషయాన్ని మీ పుస్తకం విశదీకరిస్తుందా? ఎంత విపరీత ధోరణి! కాని మీ పుస్తకాన్ని ఉపేంద్రకు నిరాక్షేపణీయంగా ఇవ్వండి; అది వేరే విషయం' అని చెప్పాను. ఆ మాటలతో రాం సిగ్గుపడి, పుస్తకాన్ని ఉపేంద్రకు ఇచ్చాడు.''

12.iii. శ్యాంపుకూర్‌లో శ్రీరామకృష్ణులు

1. తమ సూక్ష్మ దేహంలో శ్రీరామకృష్ణులకు పుళ్లు కానరావడం

శ్యాంపుకూర్‌లో బసచేసి ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులకు ఒక అద్భుత దర్శనం కలిగింది. తమ గదిలో పచార్లు చేస్తున్నప్పుడు తమ స్థూల శరీరం నుండి సూక్ష్మశరీరం వెలుపలకు రావడం ఆయన చూశారు; ఆ సూక్ష్మశరీరం వీపు అంతా, ముఖ్యంగా గొంతు ప్రాంతంలో పుళ్లు ఆవరించి ఉన్నాయి. ఆ సూక్ష్మశరీరాన్ని చూస్తూ ఆ పుళ్లు ఏర్పడడానికి కారణ మేమిటోనని ఆశ్చర్యపోయారు. ఎన్నో పాపాలు చేసిన జనులు ఆయనను తాకడంతో పునీతులైనారు; వారి పాపాలు ఆయనకు సంక్రమించడంతో ఆయన సూక్ష్మ శరీరంపై పుళ్లు ఏర్పడ్డాయని జగజ్జనని ఆయనకు తెలియచేసింది. జీవులను ఉద్ధరించడానికి లక్షసార్లు జన్మనెత్తడానికీ వెనుకాడనని దక్షిణేశ్వరంలో పలుమార్లు ఆయన చెప్పడం స్వయంగా మేం వినివున్నాం. కాబట్టి పైన పేర్కొన్న దర్శనాన్ని పొంది ఏమాత్రం దిగులు చెందక సంతోషంగా ఆయన ఆ విషయం తెలుపడం మాకు విచిత్రంగా తోచలేదు. ఆయన అపార కారుణ్యాన్ని జ్ఞాపకం తెచ్చుకొని చర్చించుకొంటున్నప్పుడు ముగ్ధులమయ్యేవారం.

శ్రీరామకృష్ణులు పూర్వపు ఆరోగ్యాన్ని పుంజుకొనేటంత వరకు క్రొత్తవారి నెవరినీ ఆయన పాదాలను తాకి ప్రణామం చేయనివ్వరాదని భక్తులు, ముఖ్యంగా యువకులైన భక్తులు ఎంతో అప్రమత్తంగా ఉండసాగారు. అలాగే భక్తులలో కొందరు తమ గత విశృంఖల జీవితాలను తలచుకొని, ఇకపై గురుదేవుల పావన దేహాన్ని తాకరాదని నిశ్చయించుకొన్నారు.

కాని నరేంద్రుని వంటి ఒకరిద్దరు శ్రీరామకృష్ణుల పై దర్శనం గురించి తెలిసి, దాని రహస్యాన్ని పరిశోధించ ప్రయత్నించసాగారు. ఇతరుల కర్మఫలాన్ని కొందరు మహాపురుషులు స్వచ్ఛందంగా స్వీకరించి దానిని స్వయంగా

అనుభవించగలరనే నమ్మకం క్రైస్తవ, వైష్ణవాది మతాలకు మూలాధారంగా ఉంది. శ్రీరామకృష్ణుల పై అనుభవం భక్తులను ఆ పరిశోధనకు ప్రేరేపించింది.

క్రొత్తగా వస్తూన్న దర్శనార్థులను శ్రీరామకృష్ణుల వద్దకు పోకుండా అడ్డుకొంటున్న భక్తుల ప్రయత్నం చూసి గిరీష్‌చంద్ర, "ప్రయత్నించి చూడండి,

2. క్రొత్త దర్శనార్థుల వల్ల నిబంధనలు

తప్పేమీ లేదు; కాని అది అసాధ్యం. ఎందుకంటే శ్రీరామకృష్ణుల అవతరణ ఇందుకోసమే" అని చెప్పాడు. రోజులు గడిచేకొద్దీ గిరీష్ ఊహ నిజమని తేలింది. పూర్తిగా అపరిచితులైన వ్యక్తులను అడ్డుకోవడం సాధ్యమైనప్పటికీ, భక్తులకు పరిచయస్థులైన క్రొత్త వారిని ఆపడం సాధ్యం కాలేదు. కాబట్టి తొలి నిర్ణయం మార్చుకోవలసి వచ్చింది. పూర్తిగా అపరిచితులైన వ్యక్తులను గురుదేవుల వద్దకు వెళ్లనివ్వరాదని తీర్మానించారు. పరిచయస్థులైన భక్తులకు గురుదేవుల పాదాలను తాకి ప్రణామం చేయరాదని కట్టడి చేశారు. అసాధారణ భక్త్యభినివేశం గల పూర్తి అపరిచితులైన వ్యక్తులు వచ్చినప్పుడు ఈ నియమాన్ని కూడా ఉల్లంఘించ వలసివచ్చేది.

పై నిబంధనను పాటిస్తున్నప్పుడు ఒక తమాషా సంఘటన జరిగింది. శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో వసిస్తూన్నప్పుడు ఒక సందర్భంలో గిరీష్

3. ఒక నటి శ్రీరామకృష్ణులను దర్శించడం

చంద్ర ప్రదర్శించిన ఒక పౌరాణిక నాటకాన్ని తిలకించడానికి థియేటర్‌కు వెళ్లారు. ఆ నాటకంలో నాయకి పాత్రను పోషించిన నటిని ఆయన ఎంతో ప్రశంసించారు. నాటకం ముగిశాక భావ సమాధిమగ్నులై ఉన్న శ్రీరామకృష్ణుల పాదపద్మాలను అర్చించే భాగ్యం ఆమె పొందింది. ఆనాటి నుండి ఆమె, శ్రీరామకృష్ణులను సాక్షాత్తు భగవంతునిగా ఆరాధించసాగింది. మళ్లీ ఆయనను దర్శించుకొనే అవకాశం కోసం ఆమె నిరీక్షిస్తూన్నది.

కాళిపద ఘోష్

శ్రీరామకృష్ణుల తీవ్ర అనారోగ్యం గురించి విని, ఆయనను ఒకసారి దర్శించుకోవాలని ఆమె ఆరాటపడసాగింది. కాళిపద ఘోష్ ఆమెకు పరిచయస్థుడు కావడం వలన గురుదేవులను

నటి (వినోదిని)

దర్శించుకోవడంలో తనకు సహాయం చేయమని అతణ్ణే పదేపదే బ్రతిమిలాడింది; ఆ భారమంతా అతడి మీదే వేసింది. కాళీపదుడు అన్ని విషయాలలోను గిరీష్ శిష్యుడే. శ్రీరామకృష్ణులు అవతారమూర్తులు కనుక పశ్చాత్తాపం చెందిన పాపులు ఎవరైనా ఆయనను తాకినా ఆయనకు ఎలాంటి హాని వాటిల్లదని గిరీష్ మాదిరే ఇతడూ విశ్వసిస్తాడు. అందువలన గురుదేవుల వద్దకు ఆ నటిని తోడ్కొనిపోవడానికి అతడు ఎంతమాత్రం సంశయించలేదు.

ఒకరోజు రహస్యంగా సంప్రతించి, ఆనాటి బెంగాలీ యువకునిలా పాశ్చాత్య వేషధారణలో ఆ నటిని తోడ్కొని కాళీపదుడు నాటి సాయంత్రం శ్యాంపుకూర్ ఇంటికి వచ్చాడు. ఆమెను తన నేస్తంగా మాకు పరిచయం చేసి, గురుదేవుల వద్దకు ఆమెను తోడ్కొనివెళ్ళి, ఆయనతో నిజం చెప్పేశాడు. ఆ సమయంలో మేమెవరమూ గదిలో లేనందున అతడికి ఏ అడ్డంకీ లేకపోయింది. మా కళ్ళలో దుమ్ముకొట్టడానికి ఆ నటి ఆ వేషధారణలో వచ్చిందని తెలుసుకొని హాస్యప్రియులైన శ్రీరామకృష్ణులు ఆహ్లాదంగా నవ్వుకున్నారు. ఆమె భక్తి విశ్వాసాలను చూసి ప్రసన్నులై ఆయన ఆమె సాహసాన్ని, తెలివితేటలను, భక్తిప్రపత్తులను ప్రశంసించారు. పిదప ఆమెకు ఒకింత ఆధ్యాత్మికోపదేశం చేశారు; ఆనందబాష్పాలు స్రవిస్తూండగా ఆ నటి మహాభక్తితో తలను గురుదేవుల పాదాలపై పెట్టి ప్రణామం చేసి, సెలవు పుచ్చుకొని కాళీపదునితో వెళ్ళిపోయింది. జరిగిన అసలు విషయాన్ని తదనంతరం శ్రీరామకృష్ణుల ద్వారా మేం తెలుసుకొన్నాం. కాని మమ్మల్ని అంత చాకచక్యంతో కన్నుగప్పడం చూసి ఆయన ఎంతో సంబరపడి నవ్వుకోవడం చూశాక, కాళీపదునిపై మేం కోపగించుకోలేకపోయాం.

4. భక్తులలో భావోద్వేగం అధికరించడానికి కారణం

శ్రీరామకృష్ణుల పావన సాంగత్యం, ఆయనకు చేస్తూన్న సేవల ఫలితంగా భక్తులలో ఆయనపట్ల ఉన్న భక్తివిశ్వాసాలు ఎన్నోరెట్లు అధికరించిన మాట నిజమే. కాని వారి మనస్సులు ఇప్పుడు యథార్థ ఆధ్యాత్మికతకు పూర్తిగా వ్యతిరేక మార్గంలో పయనించే ప్రమాదంలో పడ్డాయి. తీవ్ర వైరాగ్యం, దుస్సాధ్యమైన

ఆత్మసంయమాలకు బదులుగా తాత్కాలిక భావోద్వేగం కొందరు భక్తులకు ప్రియం కాసాగాయి. భావోద్వేగత ఎంత మధురంగా కానవచ్చినా అది కనుక తీవ్రవైరాగ్యం, ఆత్మసంయమాలకు దారితీయకపోతే, కామక్రోధాది అంతః శత్రువులను నిర్జించే శక్తిని అందివ్వలేదనే విషయం వీరు అవగతం చేసుకోలేక పోయారు.

ఈ భావోద్వేగం అధికరించడానికి చాలా కారణాలున్నాయి. మొదటి కారణం: సులభమార్గాలను, సత్వర ఫలితాలను పొందగోరడం మానవ నైజం. ఆధ్యాత్మికపరులుగా పరిగణింపబడే అనేకులు భగవంతుణ్ణీ, ప్రాపంచికతను అంటే వైరాగ్యాన్ని, సుఖభోగాలను రెంటినీ ఆకాంక్షిస్తారు. ఇవి రెండు చీకటి వెలుగులలా పరస్పర విరుద్ధాలనీ, రెంటినీ ఏకకాలంలో పొందడం అసాధ్యమనీ గ్రహించిన అరుదైన ఏ కొద్దిమందో పప్పులో కాలు వేయరు. భగవత్సాక్షాత్కారం కోసం సర్వసంగపరిత్యాగాన్ని విడచిపెట్టకుండా పై గమ్యాన్ని చేరు కోవడం అసాధ్యమనే విషయం వారు గ్రహిస్తారు. కాని మూర్ఖులకు కొదువ లేదు కదా! రెండు తీరాలను ఏకకాలంలో చేరడమనే అసంభవాన్ని సంభవం చేయబోయి వీరు తమ పడవను ఈ తీరం నుండి ఒకింత దూరం పోనిచ్చి, జీవితాంతం లంగరు వేసిన తీరులో అక్కడే చతికిలపడిపోతారు.

అందువలననే తమ వద్దకు వచ్చే ప్రతి వ్యక్తినీ వివిధ రీతుల్లో పరీక్షించి పైన పేర్కొన్న రెండు కోవల్లో ఆ వ్యక్తి ఏ కోవకు చెందుతాడో శ్రీరామకృష్ణులు తెల్సుకొనేవారు. అలా పరీక్షించి ఆ ఫలానా వ్యక్తి రెండవ కోవకు (అంటే భగవంతుణ్ణీ సంసారాన్నీ రెంటినీ కోరుకొనే వర్గానికి) చెందిన వాడని తెల్సు కొంటే, అతడు అవగతం చేసుకొని జీర్ణించుకోగలిగిన మేరకే పరిత్యాగ ఆద ర్శాన్ని ఉపదేశించేవారు. కాబట్టే యోగ్యత ననుసరించి ఆయన వివిధ వ్యక్తు లకు విభిన్న రకాల ఉపదేశాలు ఇచ్చేవారు. గృహస్థభక్తులకు, అవివాహిత శిష్యు లకు విభిన్నంగా ఉపదేశించేవారు. జనులకు ఉపదేశాలిస్తూన్నప్పుడు భగవ న్నామ సంకీర్తనమూ, నారదీయభక్తీ ఈ కలియుగానికి ఉపయుక్తమైనవని ఆయన చెప్పడానికి ఇదే కారణం. ఆ కాలంలో జనసామాన్యంలో మత, శాస్త్ర అధ్యయనాలు ఎంత అప్రచలితమైపోయాయంటే నూరుమందిలో ఒక్కరికైనా నారదీయ భక్తి అవగతమై ఉంటుందనడం సందేహమే. భగవంతుని నిమిత్తం సర్వసంగ పరిత్యాగం చేయాలనే విషయం నారద మహర్షి బోధించాడని జనానికి తెలియదు. కనుక దుర్బల స్వభావవశవర్తులై ఇహాన్నీ పరాన్నీ సంతరించుకో గోరి, అధికరించిన తాత్కాలిక భావోద్వేగం ఆధ్యాత్మిక అనుభూతికి పరాకాష్ఠగా

ఎంచి అజ్ఞులైన శ్రీరామకృష్ణుల భక్తులు కొందరు తప్పటడుగులు వేశారంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఆ పొరపాటుకు భక్తులను దారితీయించిన రెండవ కారణం: శ్రీరామ కృష్ణులలో ప్రస్తుతం అభివ్యక్తమౌతున్న అసాధారణ భావపరవశతకు మూలం మేం ఆయన వద్దకు రావడానికి ముందు ఆయన ఒనరించిన కఠోర సాధనాను ష్ఠానాదుల ఫలితమే అని అర్థం చేసుకోలేకపోవడం.

పై పొరపాటుకు భక్తులను దారితీయించిన అత్యంత ముఖ్యకారణం గిరీష్‌చంద్ర ఘోష్ తన 'ముక్త్యారునామా'ను గురుదేవులకు సంపూర్ణంగా సమర్పించి, ఆయన యుగావతారులని దృఢంగా విశ్వసించి ఆ విషయం ఆనందంతో ఉత్సాహంతో ఎలుగెత్తి అందరి ముందు చాటడమే అని చెప్పాలి. శ్రీరామకృష్ణులు అవతారమూర్తులని అంతకు ముందునుండి ఎందరో పరిగ ణిస్తూ వచ్చినప్పటికీ, ఆయన నిషేధాజ్ఞను శిరసావహించి ఎవరూ తమ ఆ భావాన్ని వెల్లడించలేదు. ఎందుకంటే అసంఖ్యాకులు తమను అవతారపురు షునిగా పరిగణించి ఎప్పుడు తమ చుట్టూ గుమిగూడతారో, అప్పుడు ఈ లోకం నుండి తాము నిష్క్రమించబోతున్నట్లు గ్రహించాలని భక్తులను ఆయన హెచ్చరిస్తూ వచ్చారు.

కాని గిరీష్‌చంద్ర ఆలోచనా ధోరణే వేరు. తన జీవితంలో అతడెన్నడూ తన భావాలనూ లేదా చేతలనూ అవి మంచివైనా చెడువైనా దాచిపెట్టి ఎరుగడు. కాబట్టి అతడు గురుదేవుల నిషేధాన్ని పాటించలేకపోయాడు. పైగా తన మేధస్సు, జీవితానుభవాలు, మహోత్సాహం, ప్రగాఢ విశ్వాసం - వీటి దోహ దంతో తాను శ్రీరామకృష్ణుల యథార్థ మహత్వాన్ని అవగతం చేసుకొని ఆయ నకు సంపూర్ణంగా ఆత్మసమర్పణ చేసుకోగలిగాననే విషయం అతడు విస్మరిం చాడు. కనుక విచక్షణారహితంగా అందరినీ తన మాదిరిగానే వ్యవహరించమని ప్రోత్సహించాడు. దాంతో పురుషప్రయత్నం, భక్తిప్రపత్తులు, పరిత్యాగం, తప శ్చర్యల అవసరాన్ని ఉపేక్షించి, 'ఆయనకు ముక్త్యారునామాను ఇచ్చివేశాం', 'ఆయనకు మేం ఆత్మసమర్పణం చేసేసుకొన్నాం' అంటూ ఉత్తమాటలు వల్లిస్తూ, భగవత్సాక్షాత్కారమనేది అతిసులభమని జనం అభిప్రాయపడ సాగారు. శ్రీరామకృష్ణుల పట్ల గిరీష్‌కు గల అపారభక్తి అతడి మేధస్సు అతణ్ణి తప్పుదారి పట్టించకుంటే, అతడు అలా ప్రచారం చేసివుండేవాడు కాడు. సనాతన ధర్మానికి పట్టిన గ్లానిని తొలగించి మానవాళికి వినూత్న ఆధ్యాత్మిక జాగృతాన్ని కల్పించి, 'తాపత్రయం'తో బాధపడుతున్న జీవులు తమను

ఆశ్రయించి సులభంగా తరించే నిమిత్తం స్వచ్ఛందంగా జన్మ జరావ్యాధులను స్వీకరింప శ్రీరామకృష్ణులు మానవదేహం దాల్చారని గిరీష్ ప్రగాఢంగా నమ్మాడు. అటువంటప్పుడు శ్రీరామకృష్ణులు తమ ఉద్యమాన్ని పూర్తి గావించకుండా నిష్క్రమించరని ఆతడి బుద్ధికి స్ఫురించింది. అందువలన శ్రీరామకృష్ణులను ఆశ్రయించి తనలా శాంతి, దివ్యానందాన్ని పొందమని అతడు ఇతరులను ఆహ్వానించడాన్ని తప్పుపట్టలేం.

5. ఈ విషయంలో రాంచంద్ర, గిరీష్‌ను మించిపోవడం

రాంచంద్ర వంటి పెద్దలైన భక్తుల తెలివి గిరీష్‌చంద్ర కుశాగ్రబుద్ధి, వాదనాపటిమ ముందు తీసికట్టే. రాంచంద్ర ఒక వైష్ణవ కుటుంబంలో జన్మించాడని ఇంతకు మునుపే తెలిపివున్నాం. కాబట్టి అతడు శ్రీరామకృష్ణులను సాక్షాత్తు శ్రీకృష్ణునిగాను, గౌరాంగునిగాను ఎంచడంలో ఎలాంటి ఆశ్చర్యమూ లేదు. అయినా గిరీష్ గురుదేవుల అవతారతత్వాన్ని ప్రకటించడానికి మునుపు రాంచంద్ర తన సిద్ధాంతాలను ప్రకటించడంలో కొంత సంయమం పాటించాడు. కాని గిరీష్ ప్రకటన ఆతడి ఉత్సుకతకు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. శ్రీరామకృష్ణులు కేవలం ఒక అవతారపురుషులని ప్రకటించడంతోనే ఇతడు ఆగిపోలేదు. మరి కాస్త ముందుకు వెళ్లి శ్రీరామకృష్ణుల పూర్వ అవతారాలైన గౌరాంగ, శ్రీకృష్ణుల భక్తులు, ఇప్పటి శ్రీరామకృష్ణుల ఫలానా ఫలానా భక్తులని గుర్తించే ఊహాకల్పనలలో తేలిపోసాగాడు. తాత్కాలిక భావోద్వేగానికి గురియై ఏ భక్తులు శారీరక మార్పులకు లోనైనారో, కొన్ని సమయాలలో బాహ్యస్మృతిని కోల్పోయారో, ఆ సదరు వ్యక్తులే రాంచంద్ర అంచనాలో ఉత్కృష్టులని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

6. విజయకృష్ణ గోస్వామి ఆ మంటను ప్రజ్వలింపచేయడం

శ్రీరామకృష్ణులు యుగావతారులనే ప్రగాఢ విశ్వాసం కారణంగా భక్తులు భావోద్వేగమనే ఉరవడిలో కొట్టుకుపోతూండగా విజయకృష్ణ గోస్వామి ఢాకా నుండి గురుదేవులను చూడడానికి వచ్చాడు. ఒక రోజు ఢాకాలో తన గదిలో కూర్చుని ధ్యానం చేస్తున్నప్పుడు సశరీరంగా శ్రీరామకృష్ణులు తనకు ఎలా దర్శనం ఇచ్చారో, తాను ఆయన శరీరాన్ని, అవయవాలను ఎలా స్పృశించాడో (IV.5), ఆ వైనాన్ని అందరి ముందు వెల్లడించాడు. అతడు అలా వెల్లడించడం దావాగ్నికి పెనుగాలి తోడైనట్లయింది. ఆ సమయంలో భక్తి సంగీతం వింటూ వింటూ ఐదారుగురు భక్తులు పాక్షికంగా బాహ్యస్మృతిని కోల్పోతూండేవారు. వీరు యుక్తి యుక్తత, నిత్యానిత్యవివేకంతో కూడివున్న ఆధ్యాత్మిక అనుష్ఠానమనే రాజమార్గాన్ని వీడి, అద్భుతాలు జరుగుతాయని పిచ్చిగా ఎదురుచూడడం అల

వరచుకొన్నారు. శ్రీరామకృష్ణుల దివ్యశక్తి ఏ సమయంలోనైనా ఏదైనా చేయగల దనే నమ్మకంతో వీరు నిరీక్షించసాగారు.

అనారోగ్యకరమైన ఈ తాత్కాలిక భావోద్వేగాన్నే కొందరు భక్తులు ఆధ్యాత్మిక జీవితానికి పరాకాష్ఠగా ఎంచుతున్నారని నరేంద్రుని నిశిత దృష్టి తక్షణం పసిగట్టింది.

7. ఈ భావోద్వేగాన్ని అరికట్టే నరేంద్రుని ప్రయత్నాలు

శ్రీరామకృష్ణులు తమ భక్తులలో నరేంద్రునికి అత్యున్నత స్థానం ఇచ్చేవారు. వైరాగ్యం, ఆత్మసంయమం, ఏకాగ్రభక్తి మొదలైన ఆధ్యాత్మిక ఉన్నత లక్షణాలతో పోల్చి చూస్తే ఈ తాత్కాలిక భావోద్వేగం నిరర్థకమైనదనీ, దాని పగ్గాలు వదలివేస్తే మున్ముందు హాని వాటిల్లే ప్రమాదం కూడా ఉందనీ నరేంద్రుడు గ్రహించాడు. కాబట్టి నరేంద్రుడు దీనిని భక్తులకు విశదీకరించి పరిస్థితిని చక్కబెట్టాలని ప్రయత్నించాడు.

భక్తులు భ్రష్టుపట్టే అవకాశం ఉందని చూసి కూడా శ్రీరామకృష్ణులు నిర్లిప్తంగా ఎందుకు ఉండిపోయారనే ప్రశ్న తలెత్తవచ్చు. అందుకు సమాధానం: ఆయన ఉదాసీన వైఖరిని పాటించలేదు. అసలుసిసలైన భావోద్వేగం భగవత్సాక్షాత్కారానికి దారితీసే మార్గమని ఆయనకు తెలియకపోలేదు. భక్తులలో నిజానికి ఎవరు ఇందుకు అర్హులో అని గమనిస్తూ అటువంటి వారిని ఆ మార్గంలో నడిపించడానికి ఒక అనుకూల సందర్భం కోసం ఆయన ఎదురుచూడసాగారు. ఎందుకంటే, 'ఎంతగా కోరుకొన్నప్పటికీ సముచిత సమయం ఆసన్నమయ్యే వరకు ఏదీ రాదు', 'సాఫల్యం సమయాపేక్షం', 'ప్రతిదీ సరైన సమయం కోసం నిరీక్షిస్తుంది' అని ఆయన అప్పుడప్పుడు అనడం మేం వినివున్నాం. మళ్లీ, తప్పులు చేస్తున్న భక్తులను సరిదిద్దడానికి నరేంద్రుడు చేస్తూన్న ప్రయత్నాన్ని గమనిస్తూ, తత్ఫలితానికి ఆయన ఎదురుచూస్తున్నారేమో ఎవరికెరుక! లేదా ఈ విషయంలో నరేంద్రుణ్ణే పరికరంగా ఉపయోగించి, భక్తులను సరిగా తీర్చిదిద్దడమే ఆయన ఉద్దేశమేమో ఎవరు చెప్పగలరు?

దార్ఢ్య దేహాలూ, నిశ్చితమైన మనస్సులూగల యువభక్తులు తన మాటలను అవగతం చేసుకోగలరని తలచి, యుక్తితర్కాలను దృష్టాంతీకరిస్తూ నరేంద్రుడు ఆ భావోద్వేగ వెల్లువకు ఎదురొడ్డి నిలిచాడు.

8. భావోద్వేగం జీవితంలో నిరంతర పరిణామాన్ని ఉత్పన్నం చేయదు

అతడు ఇలా చెప్పాడు: ''భావోద్వేగం మానవ జీవితంలో ఒక నిరంతర పరిణామాన్ని ఉత్పన్నం చేయదు; అది క్షణికకాలంలో భగవత్సాక్షాత్కారం పొంద మనిషిని తహతహలాడిస్తుంది. కాని మరుక్షణంలోనే కామకాంచనాల పట్ల వైదొలగచేసే శక్తి దాన్లో వీగిపోతుంది, దానికి ఆ ప్రగాఢత లేదు. కాబట్టి అది జీవితంలో

ఎంతో నిరర్థకమైనది. దాని ప్రభావంలో కొందరికి అశ్రువులు స్రవించడం, గుర్పాటు, తాత్కాలిక శారీరక మార్పులు కలగడం కద్దు; లేదా తాత్కాలికంగా కొందరు బాహ్యస్మృతి కోల్పోవచ్చు. అయినా ఇవన్నీ నరాల బలహీనత లక్షణాలని నా దృఢనమ్మకం. తన సంకల్పశక్తితో ఇటువంటి భావోద్వేగాన్ని అణచుకోలేని పక్షంలో, పౌష్టిక ఆహారాన్ని తినాలి, అవసరమైతే వైద్యుణ్ణే సంప్రతించాలి.''

9. కన్నీరు స్రవించడంలో, గుర్పాటులో, శారీరక మార్పులలో కృత్రిమత్వం హానికరం

నరేంద్రుడు కొనసాగించాడు: ''ఈ శారీరక మార్పులలో, బాహ్యస్మృతి కోల్పోవడంలో ఎంతో కృత్రిమత కానవస్తుంది. మనలను మనం అదుపులో పెట్టుకోగల సమర్థత పెంపొందేకొద్దీ, యథార్థమైన భావోద్వేగం ప్రగాఢతరమౌతుంది. అరుదైన ఏ కొద్దిమందిలో మాత్రమే మహాశక్తిమంతమైన ఈ ఆధ్యాత్మిక భావోద్వేగ వేలాతరంగాలు సంయమమనే ఆనకట్టను ఛేదించి శారీరక మార్పులుగా, బాహ్యస్మృతి కోల్పోవడాలుగా అభివ్యక్తీకృతమౌతాయి. మూర్ఖులు ఈ విషయం అర్థంచేసుకోలేక, ఈ ప్రక్రియను తల్లక్రిందులుగా చేస్తారు. ఈ శారీరక వికారాల ద్వారా, బాహ్యస్మృతిని కోల్పోవడం ద్వారా ఆధ్యాత్మిక భావోద్వేగ ప్రగాఢతను సంతరించుకొన్నట్లు వారు భావిస్తారు. కాబట్టి ఆ మార్పులు తమలో ఏర్పడడానికి వీరు ఎరుకతోనే తీవ్రంగా ప్రయత్నిస్తూంటారు. ఆ అభిలాష, ప్రయత్నం క్రమంగా వారిలో అలవాటుగా మారి, రోజులు గడిచేకొద్దీ నరాలదుర్బలతగా పరిణమిస్తుంది; కాలక్రమంలో ఈ తాత్కాలిక భావోద్వేగం కించిత్తు పొడచూపినా ఆ మార్పులు యాంత్రికంగా ఏర్పడడం కద్దు. పర్యవసానంగా వెర్రివారు కావడమో లేదా స్వేచ్ఛగా వాటిలో మునిగిపోయి ఎడతెగని రుగ్మతకు గురికావడమో జరుగుతుంది. ధార్మికతను అనుష్ఠించే ప్రయత్నంలో నూటికి ఎనభై శాతం మంది దగాకోర్లుగాను, పదిహేను శాతం మంది పిచ్చివాళ్ళుగాను మారతారు; తక్కిన ఐదు శాతం మంది సత్యసాక్షాత్కారం సంతరించుకొని తరిస్తారు. కాబట్టి అప్రమత్తంగా ఉండండి.''

10. నరేంద్రుని మాటల వల్ల దృఢ విశ్వాసం ఏర్పడడం

నరేంద్రుని పై మాటలు నిజమని మేం మొదట్లో నమ్మలేదు. కాని ఒకింత కాలంలోనే ఆతడి మాటలలోని నిజం రూఢి అయింది. ఒక భక్తుడు ఏకాంతంలో కూర్చుని భావోద్వేగాన్ని పురిగొల్పే పాటలు పాడుతూ, దానికి తగిన శారీరక మార్పులను కల్పించుకోవడానికి ప్రయత్నించడం తలవని తలంపుగా కంటబడింది. భావావేశంలో ఒకింత బాహ్యస్మృతిని కోల్పోయి మనోహరంగా

నృత్యం చేసే ఒక భక్తుణ్ణి చూసి మరో భక్తుడు అదే రీతిలో నృత్యం అభ్యసించ సాగాడు. ఈ రెండవ భక్తుణ్ణి చూసి మూడవ భక్తుడు దానిని అనుకరించ సాగాడు. మరొక భక్తుడు తరచు భావోద్వేగపరవశుడు కావడం గమనించి నరేంద్రుడు ఏకాంతంలో అతడి మూర్ఖత్వాన్ని ఎత్తిచూపి, ఆ భావోద్వేగాన్ని అదుపులో ఉంచుకోమనీ పౌష్టికాహారాన్ని పుచ్చుకోమనీ సుతిమెత్తగా సలహా ఇచ్చాడు. నరేంద్రుని సలహాను తు.చ. తప్పకుండా పాటించిన ఫలితంగా ఆ భక్తుడు పదిహేను రోజులలోనే ఆరోగ్యం పుంజుకోవడమే కాక ఆత్మసంయమాన్ని కూడా ఎంతో మేరకు సంతరించుకోగలిగాడు.

నరేంద్రుని వచనాలలోని నిజాలు తమ కళ్లముందు ప్రత్యక్షంగా ద్యోతకమవడంతో ఆతడి మాటలలోని సత్యాన్ని నమ్మక తప్పలేదు; పై భక్తులలా తమలో కూడా శారీరక మార్పులు కలుగకపోవడం, బాహ్యస్మృతిని కోల్పోలేకపోవడం తమ దురదృష్టమని వాపోతున్న భక్తులు ఇప్పుడు అలా అనుకోవడం మానుకొన్నారు.

ఈ విషయాన్ని తర్కవాదాల సహాయంతో మాత్రమే ప్రచారంచేసి ఊరుకోలేదు. ఎవరిలోనైనా కించిత్తు కృత్రిమ భావోద్వేగాన్ని పసిగట్టితే అందరి ముందు దానిని పరిహసిస్తూ వినోదించేవాడు; దాంతో ఆ భక్తుడు సిగ్గుపడి, చిన్నబుచ్చుకొనేవాడు. ఒక కోవకు చెందిన వైష్ణవులలో బాగా ప్రాబల్యంలోవున్న ఒక సాధనానుష్ఠానంలో పురుషుడు స్త్రీల హావభావాలను అనుకరించడం కద్దు. ఆ అనుకరణ ఒక్కొక్కప్పుడు ఎంతో పరిహాసాస్పదంగా పరిణమిస్తుంది. నరేంద్రుడు పై అంశాన్ని ప్రస్తావించి మాకు కడుపుబ్బ నవ్వు పుట్టించేవాడు; మాలో అటువంటి భావోద్వేగంపట్ల మక్కువ గలవారిని ఎగతాళి చేస్తూ వారు, భగవంతుని 'స్నేహితురాళ్ల' కోవకు చెందుతారని చెప్పేవాడు. పురుషసింహుడైన నరేంద్రుడికి సాధన పేరిట పురుషుడు తన పురుషత్వాన్ని (పౌరుషం), పరిశ్రమను, అసదృశమైన సత్యాన్వేషణను విడిచిపెట్టి స్త్రీల హావభావాలను అనుకరిస్తూ, వైష్ణవ గీతాలు ఆలాపిస్తూ విలపిస్తూండడం జుగుప్సాకరంగా తోచేది. అందుకే వీరభావంతో సాధనలు అనుష్ఠిస్తూ నిత్యానిత్యవివేచనతో కూడిన భక్తిభావాన్ని పొందగోరే వారిని 'శివుని భూతగణం'గాను, తద్విరుద్ధమైన సాధన చేసేవారిని 'స్నేహితురాళ్లు'గాను హాస్యగంభీరంగా మారుపేరుతో పిలిచేవాడు.

11. భావోద్వేగాన్ని నరేంద్రుడు అపహాస్యం చేయడం

తన తర్కం, ఎత్తిపొడుపులతో తాత్కాలిక భావోద్వేగపరుల బృందంలో గండు పెట్టడంతో నరేంద్రుడు తృప్తి చెందలేదు. కేవల ప్రచారం వాంఛిత

ఫలాన్ని అందివ్వలేదనీ, దాని స్థానే ఒక కొత్త మానసిక వైఖరి పాదుగొల్పనంత వరకూ అది సాధ్యం కాదనీ గట్టిగా నమ్మిన నరేంద్రుడు, దానికోసం ఎంతో ప్రయత్నించసాగాడు. తీరిక దొరికినప్పుడల్లా యువభక్తులను చేరదీసి వైరాగ్యం, దైవభక్తి, సంసారంలోని అనిత్యాల గురించి వారి హృదయాలలో జాగృతం కలిగించే పాటలు వారితో కలిసి పాడసాగాడు, వారి హృదయాలలో ఆ ఉత్కృష్ట ఆధ్యాత్మిక భావజ్వాల ప్రజ్వలింప ప్రయత్నించసాగాడు. శ్రీరామకృష్ణులను దర్శించడానికి వచ్చి, సుమధుర కంఠంతో నరేంద్రుడు పాడిన గీతాలు, స్తోత్రాలు విన్న ఫలితంగా తమ హృదయాలలో జనించిన వైరాగ్య ప్రేరణతో కన్నీరు స్రవిస్తూండగా తిరిగి వెళ్లినవారు ఎందరో!

12. భావోద్వేగస్థానే నిశ్చలమైన వైరాగ్యం, దైవభక్తి నెలకొల్ప నరేంద్రుని ప్రయత్నాలు

నరేంద్రుడు పాడిన కొన్ని పాటలు:

ఓ చిద్ఘనుడా, ఓ అమృతసాగరా ।
నీ నామకీర్తనంతో జీవితం మధురమయమౌతూన్నది ।

* * *

మనోబుధ్యహంకార చిత్తాని నాహం
న శ్రోత్ర జిహ్వే న చ ఘ్రాణ నేత్రే ।
న చ వ్యోమ భూమి ర్నతేజో న వాయుః
చిదానందరూపః శివోఽహం శివోఽహం ॥

[నేను మనస్సు బుద్ధి అహంకార చిత్తాలను కాను. నేను చెవి నాలుక ముక్కు కళ్లను కాను. నేను ఆకాశాన్ని భూమిని కాను, తేజస్సు వాయువును కాను. నేను చిదానందరూపుడైన శివుణ్ణే, శివుణ్ణే.]

మళ్లీ నరేంద్రుడు, ప్రగాఢ దైవభక్తి ఫలితంగా గురుదేవులు స్వాభావికంగా సాధనలు అనుష్ఠించిన వైనాలను వివరించేవాడు లేదా ఆయన మహాత్మ్యాన్ని శిష్యులు విస్మయం చెందే రీతిలో అభివర్ణించేవాడు. లేదా మరొకప్పుడు 'క్రీస్తు అనుకరణ' అనే పుస్తకం నుండి ఉపదేశాలను ఉదాహరించి, ''భగవంతుణ్ణే నిజంగా ప్రేమించే వ్యక్తి జీవితం కూడా అదే తీరులో మలచబడుతుంది. కాబట్టి మనం గురుదేవులను నిజంగా ప్రేమించామో లేదో ఈ పరీక్ష తేల్చివేస్తుంది'' అని చెప్పేవాడు. పైగా అతడు, ''అద్వైత జ్ఞానాన్ని కొంగున ముడివేసుకొని తదనంతరం నీ ఇచ్ఛమేరకు వ్యవహరించు'' అనే గురుదేవుల

13. శ్రీరామకృష్ణులను ప్రేమించేవారి జీవితాలు అదే మాదిరిగా రూపొందుతాయి

ఉపదేశాన్ని పదేపదే మాకు గుర్తుకు తెచ్చేవాడు. పిదప శ్రీరామకృష్ణులలో అభివ్యక్తమయ్యే భావోద్వేగం యావత్తుకు మూలాధారం ఆ అద్వైత జ్ఞానమే అని నరేంద్రుడు మాకు విశదీకరించేవాడు. కాబట్టి భక్తులు మొట్టమొదట ఆ అద్వైత జ్ఞానాన్ని సంతరించుకోవడానికి పాటుపడాలని చెప్పేవాడు.

14. నూతన భావాలను విమర్శనాత్మకంగా పరిశీలించాక భక్తులు అంగీకరించేలా చేయడానికి నరేంద్రుడి ప్రయాస

నూతన భావాలను ముందుగా పరీక్షించి వాటి యుక్తాయుక్తతను తెలుసుకొన్న తదుపరే వాటిని స్వీకరించాలని నరేంద్రుడు మమ్మల్ని ప్రోత్సహించేవాడు. ఏకాగ్రత ద్వారా శారీరక రుగ్మతలను నయం చేయవచ్చునని విని[1] శ్రీరామకృష్ణుల వ్యాధిని నయంచేసే ఉద్దేశంతో ఒక రోజు మా అందరినీ ఒక గదిలోకి పిలిచి, తలుపులు మూసి అందరినీ ధ్యానం చేయమన్నాడు. అట్లే భక్తులను యుక్తియుక్తంగాని అభ్యాసాల నుండి వైదొలగేటట్లు సదా ప్రయత్నిస్తూండేవాడు. క్రింద పేర్కొనే సంఘటన అందుకు ఒక చక్కని ఉదాహరణ.

15. పేరుప్రతిష్ఠలకై మహిమాచరణ్ చక్రవర్తి ప్రాకులాట

మహిమాచరణ్ ఇల్లు 'మతి' చెరువు దక్షిణతీరం కాశీపూర్ వీధిని కలుసుకొనే చోటుకు ఎదురుగా నెలకొని ఉంది. అతడిలో అనేక సద్గుణాలున్నాయి. కాని అతడు సదా తన అర్హతకంటే అధికుడనని ప్రదర్శించుకోవడానికి తాపత్రయపడుతూవుంటాడు. గౌరవం పొందే నిమిత్తం అబద్ధాలు చెప్పడానికీ సంకోచించడు. తనను సంపన్నుడిగా, విద్యాధికుడిగా, మేధావిగా, ధార్మికుడిగా, ఉదారుడిగా, సద్గుణ సంపన్నుడిగా లోకులు పరిగణించాలనే తాపత్రయమే అతడి జీవితంలో ప్రతి చర్యను నిబద్ధీకరించేది; ఒక్కో సందర్భంలో ఇందు మూలంగా అతడు నవ్వులపాలవడం కూడా కద్దు. ఒకప్పుడు మహిమాచరణ్ ఒక ఉచిత పాఠశాలను ప్రారంభించి దానికి ప్రాచ్య - ఆర్య - శిక్షా - కంద - పరిషత్ (The Educational section of the Institute of the Oriental Aryans) అనే పేరు పెట్టాడు. తన ఏకైక కుమారుడికి మృగాంక - మౌళి - పుత్ర - తుండి అని నామకరణం చేశాడు. అలాగే తను పెంచుకొంటున్న

---

1. స్థిరంగా కూర్చుని నాకు ఏ వ్యాధీ లేదు, ఆరోగ్యంగానే ఉన్నాను అని మనస్సులో ఏకాగ్రంగా ఊహించుకోగలిగితే వ్యాధి నయమౌతుందనే సిద్ధాంతం ఒకటి ఉంది. విశేషంగా దీనిని క్రైస్తవ విజ్ఞానం (Christian Science) అనే ఒక పాశ్చాత్య మతశాఖ ఆచరిస్తూన్నది. గత శతాబ్దంలో ఈ మతశాఖ అమెరికాలో ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఈ పద్ధతిని తనకోసం గాని లేదా ఇతరులకోసం గాని అవలంబించవచ్చు.

జింకకు ప్రాచీన ఋషికి చెందిన 'కపింజల' అనే పేరుపెట్టాడు. తనబోటి మహాపండితులకు సామాన్యుల మాదిరి చిన్నచిన్న పేర్లు పెట్టడం సబబా? కాదు.

అతడు ఎన్నో ఆంగ్ల, సంస్కృత పుస్తకాలను సేకరించి ఉంచుకొన్నాడు. ఆతడితో పరిచయం అయిన తరువాత ఒక రోజు మేం నరేంద్రుడితో కలిసి అతడి ఇంటికి వెళ్ళి, ''మహాశయా, ఈ పుస్తకాలన్నీ మీరు చదివారా?'' అని అడిగాం. ఎంతో వినమ్రంగా తాను చదివినట్లు తల ఊపాడు. కాని నరేంద్రుడు కొన్ని పుస్తకాలను తీసుకొని, వాటిలో కొన్ని కాగితాలు కత్తిరింపబడకుండా ఉండడం గమనించి, కారణం ఏమిటని అడిగాడు. అందుకు మహిమాచరణ్ తడుముకోకుండా ఇలా జవాబిచ్చాడు: ''చూడు తమ్ముడూ, నేను చదివిన తరువాత మిత్రులు కొందరు ఆ పుస్తకాలను పట్టుకుపోయారు. కాని తిరిగి ఇవ్వలేదు. కాబట్టి మళ్ళీ వాటిని కొనుక్కోవలసి వచ్చింది. అందుకే అప్పటి నుండి పుస్తకాలు తీసుకుపోవడానికి అనుమతించడంలేదు.'' కాని కొద్దిసేపట్లోనే ఆ పుస్తకాలలో ఒక్కటిలోనైనా కాగితాలు కత్తిరింపబడలేదని నరేంద్రుడు కనిపెట్టేశాడు. (అంటే ఒక్క పుస్తకం కూడా అతడు చదవలేదని తేలిపోయింది.) కాబట్టి తానొక గొప్ప పండితుణ్ణని లోకులకు ప్రదర్శించుకొనే నిమిత్తమూ, అలాగే తన గదికి అదనపు అందం కల్పించడం కోసమూ మహిమాచరణ్ పుస్తకాలను అల్మారాలో పొందికగా పేర్చిపెట్టాడని నరేంద్రుడికి కచ్చితంగా తెలిసిపోయింది.

అతడితో పరిచయమైనప్పుడు మాటల సందర్భంలో మహిమాచరణ్ మాతో తానొక జ్ఞానమార్గ సాధకుణ్ణని చెప్పాడు. కలకత్తా భక్తులు రావడానికి

16. జ్ఞానిగా చలామణి కాగోరిన మహిమాచరణ్: అతడి పులిచర్మం ఎన్నో ఏళ్ళకు మునుపే ఇతడు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చేవాడు. విశేష ఉత్సవ దినాలలో కాషాయ వస్త్రాలు ధరించి మెడలో రుద్రాక్ష మాలలతో, చేత ఒంటితీగ వాయిద్యాన్ని పుచ్చుకొని, పంచవటి క్రింద, పరచిన తన పులిచర్మంమీద సాధన నిమిత్తం మహా ఆడంబరంగా కూర్చునేవాడు. ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు పులిచర్మాన్ని గురుదేవుల గది గోడకు తగిలించి పోయేవాడు. అతణ్ణి అర్థం చేసుకోవడానికి గురుదేవులకు ఇంతమాత్రం చాలు. ఆ పులిచర్మం ఎవరిదని ఒక రోజు ఎవరో అడిగారు. అందుకు గురుదేవులు ఇలా జవాబిచ్చారు: ''మహిమాచరణ్ దీన్ని ఇక్కడ తగిలించిపోయాడు. ఎందుకో తెలుసా? దీన్ని చూసి జనం నన్ను అడుగుతారు. నేను అతడి పేరు చెప్పగానే, వాళ్ళు అతణ్ణి ఒక గొప్ప సాధకునిగా పరిగణిస్తారు కదా!''

మంత్రదీక్షను గురించి ప్రసక్తి వచ్చినప్పుడు మహిమాచరణ్, ''నా గురువుగారి నామధేయం ఆగమాచార్య డమరువల్లభ'' అని పేర్కొనే వాడట. మరికొన్ని సందర్భాలలో, తానూ శ్రీరామకృష్ణుల మాదిరి పరమహంస పరివ్రాజకుడైన తోతాపురి నుండి దీక్షను పుచ్చుకొన్నట్లు చెప్పడం కద్దు. అతడిలా చెప్పేవాడు: ''నేను పశ్చిమభారతదేశంలో తీర్థయాత్రలు చేస్తూన్నప్పుడు ఒక ఫలానా ప్రదేశంలో ఆయనను కలుసుకొని, మంత్రదీక్ష పొందాను. భక్తిమార్గాన్ని అనుసరించమని శ్రీరామకృష్ణులనూ, జ్ఞానమార్గాన్ని అవలంబించమని నన్నూ ఆయన ఆదేశించారు.'' అతడి పై మాటలలో ఎంత నిజం ఉందో అతడికే తెలుసు, సర్వాంతర్యామియైన ఆ భగవంతుడికే ఎరుక అని ప్రత్యేకంగా చెప్పనిలేదు.

17. అతడి గురువు

ఏకతంత్రి సహాయంతో ఓంకారాన్ని పలికించడం, అప్పుడప్పుడు ఉత్తర గీత వంటి పుస్తకాల నుండి ఒకటి రెండు శ్లోకాలు బిగ్గరగా వల్లించడం - ఇవే మేం చూసిన అతడి సాధనలు. అదే సనాతన జ్ఞానమార్గ సాధన అనీ, ఇది అనుష్ఠిస్తే మరే సాధనా చేయనవసరం లేదనీ, దానితోనే కుండలినీశక్తి జాగృతమౌతుందనీ, భగవత్సాక్షాత్కారం లభిస్తుందనీ అతడు చెప్పేవాడు. మహిమాచరణ్ ఇంట్లో అన్నపూర్ణాదేవి విగ్రహం ప్రతిష్ఠితమై ఉంది. ప్రతి ఏటా జగద్ధాత్రి పూజ కూడా నిర్వహిస్తూన్నట్లే తెలియవస్తోంది. దీనినిబట్టి అతడు శాక్తుల వంశంలో జన్మించినట్లు ఊహించవచ్చు. తదనంతర కాలంలో అతడు శాక్త సాధన మార్గాన్ని అవలంబించినట్లు కానవస్తోంది. ఎందుకంటే జట్కాలో వెళుతున్నప్పుడు తరచు అతడు, 'తారా, తత్త్వమసి', 'తారా, తత్త్వమసి' అని బిగ్గరగా ఉచ్చరించడం వినవచ్చేది. అతడికి ఉన్న ఆస్తిపాస్తుల నుండి వచ్చే ఆదాయంతో అతడి కుటుంబ జీవనం హాయిగా గడిచిపోయేది.

18. మహిమాచరణ్ ఆధ్యాత్మిక సాధన

శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్‌లో బసచేసివున్నప్పుడు ఆయనను చూడడంకోసం మహిమాచరణ్ రెండు మూడుసార్లు వచ్చాడు. వచ్చినప్పుడు గురుదేవుల ఆరోగ్యాన్ని విచారించి, ఆ తరువాత దర్శనార్థుల గదిలో కూర్చుని ఏకతంత్రితో ప్రణవాన్ని ఏకస్వరంలో ఉచ్చరిస్తూండేవాడు; అలా ఉచ్చరిస్తూ మధ్యమధ్యలో అక్కడున్న వారితో ధార్మిక ప్రసంగాలు చేస్తూండేవాడు. కాషాయాంబరాలతో ఇనుమడిస్తూన్న అతడి బాహ్యసౌందర్యాన్ని, స్థూలకాయాన్ని, ఆకట్టుకొనే అతడి పలుకులను చూసి ముగ్ధులైన అనేకులు, అతణ్ణే ఆధ్యాత్మికపరమైన ప్రశ్నలు

19. శ్యాంపుకూర్‌లో మహిమాచరణ్

అడిగేవారు. శ్రీరామకృష్ణులు కూడా కొన్ని సమయాలలో అతడితో, ''నువ్వు పండితుడివి కదా! దయచేసి వారికి (దర్శనార్థులకు) ఏదైనా ఉపదేశించు'' అని చెప్పేవారు. ఎందుకంటే, కొందరిని శిష్యులుగా చేసుకొని పేరుప్రతిష్ఠలు పొంద డానికి అతడు తహతహలాడుతున్నాడనే విషయం శ్రీరామకృష్ణులకు తెలి యంది కాదు.

ఒక రోజు మహిమాచరణ్ శ్యాంపుకూర్‌కు వచ్చి అనేక విషయాల గురించి మాట్లాడుతూ తాను అనుసరిస్తున్న సాధనామార్గమే ఉత్కృష్టమైన

20. మహిమాచరణ్ నరేంద్రుల మధ్య వాదోప వాదాలు

దనీ, సులభమైనదనీ, తక్కిన మార్గాలన్నీ నిమ్నమైన వనీ, కఠినమైనవనీ చెప్పి, దాన్ని ఋజువుపరచ ప్రయ త్నించాడు. ఏ ఆక్షేపణ చెప్పకుండా యువభక్తులు అతడు చెబుతూన్నదంతా కిమ్మని వినడం నరేంద్రుడు సహించలేకపోయాడు. వెంటనే మహిమాచరణ్ వాదనలను ప్రతివాదనలతో ఖండిస్తూ, చివరికి అతడి ప్రతి పాదనలు అంగీకారయోగ్యం కావని తేల్చివేశాడు; పిదప అతణ్ణి, ''మీరు చేస్తు న్నట్లు ఏకతంత్రిని మీటుతూ ప్రణవాన్ని ఉచ్చరించడం మూలంగా భగవం తుణ్ణి దర్శించవచ్చు అనడానికి ఋజువు ఏమిటి?'' అని సూటిగా ప్రశ్నిం చాడు. అందుకు మహిమాచరణ్ ఇలా జవాబిచ్చాడు: ''నాదమే బ్రహ్మం. ఏక స్వరంలో ప్రణవాన్ని ఉచ్చరిస్తూవుంటే భగవంతుడు దర్శనం ఇవ్వక తప్పదు. అంతకంటే మరేమీ చేయనవసరం లేదు.'' నరేంద్రుడు ఆ మాటలను ప్రతిఘటిస్తూ, ''భగవంతుడు వ్రాతపూర్వకంగా మీతో అలాంటి ఒప్పందం కుదుర్చుకొన్నాడా ఏమిటి? లేదా మీరు గొంతు పెకలించుకొని 'హూం', 'హూం' అంటూ కేకలు పెట్టగానే మంత్రతంత్రాలకు ముగ్ధమైన పాములా, మీ ముందు ప్రత్యక్షమౌతాడా?'' అని అడిగాడు. నరేంద్రుడి వాదనాపటిమ ముందు మహిమాచరణ్ ధర్మోపదేశం వీగిపోవడంతో, ఆ రోజు అతడు సత్వరమే సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయాడు.

విభిన్న సంప్రదాయాలకు చెందిన నిజమైన సాధకు లందరికీ గురుదేవుల భక్తులు సముచిత గౌరవం ఇస్తున్నారో లేదో నరేంద్రుడు ఒకకంట కనిపెడు

21. నిజమైన సాధకు లందరికీ సముచిత గౌరవం ఇవ్వాలన్న నరేంద్రుని ఉద్బోధ

తూనే ఉన్నాడు. ''తమ సంప్రదాయానికి చెందిన సాధకు లకు మాత్రమే గౌరవాన్నిస్తూ, జనం సామాన్యంగా ప్రవ ర్తించే తీరులో ఇతర సంప్రదాయానికి చెందిన సాధకు లను గర్హించడం, 'మతాలెన్నో, మార్గాలన్ని' అన్న గురు దేవుల ఉదార సిద్ధాంతాన్ని అవమానించడంతో సమానమౌతుంది'' అని

అతడు చెప్పేవాడు. శ్యాంపుకూర్‌లో మేం బసచేసి ఉన్నప్పుడు జరిగిన ఈ తీరు సంఘటన మాకు జ్ఞాపకం వస్తూంది.

ప్రభుదయాళ్ మిశ్ర అనే క్రైస్తవ మతప్రచారకుడు ఒక రోజు శ్రీరామ కృష్ణులను చూడడానికి వచ్చాడు. కాషాయాంబరాలు ధరించి ఉండడంతో

22. క్రైస్తవ ప్రచారకుడు ప్రభుదయాళ్ మిశ్ర

మొదట మేం ఆతణ్ణి క్రైస్తవుడని గుర్తించలేకపోయాం. తర్వాత మాటల సందర్భంలో అత డెవరో తెలుసుకొని, క్రైస్తవుడై కాషాయాంబరాలు ధరించడానికి కారణం ఏమి టని అడిగాం. అందుకు అతడిలా జవాబిచ్చాడు: ''నే నొక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాను. మధురమయుడైన ఏసుక్రీస్తు పట్ల విశ్వాసం వహించి ఆయనను నా ఆరాధ్యదైవంగా భావించే భాగ్యం కలిగినంత మాత్రం చేత పూర్వీకుల నుండి పారంపర్యంగా వస్తూన్న ఆచార సంప్రదాయాలను వదులుకోవాలా? యోగశాస్త్రం పట్ల నాకు నమ్మకం ఉంది; క్రీస్తును ఇష్టదైవంగా నిత్యం యోగాన్ని అభ్యసిస్తూన్నాను. కులవ్యవస్థ పాటించే విభేదాలలో నాకు నమ్మకంలేదు. కాని ఎవరంటే వారి చేతుల నుండి ఆహారాన్ని పుచ్చుకోవడం యోగానికి హానికరం అని నమ్ముతాను. అందుకే రోజు స్వయంగా వండుకొని తింటాను. పర్యవసానంగా క్రైస్తవుణ్ణే అయినప్పటికీ ఒకటి తరువాత ఒకటిగా, జ్యోతిదర్శనం వంటి యోగసాధన ఫలితాలను పొందగలుగుతున్నాను. అనాదిగా పరమాత్మ భక్తులైన యోగులు కాషాయాంబరాలు ధరిస్తూ వచ్చారు. అందుకే మరే దుస్తుల కంటే ఈ కాషాయాంబరాలనే ఇష్టపడతాను.''

నరేంద్రుడు ప్రశ్నలపరంపరను కురిపిస్తూ ఆ క్రైస్తవ ప్రచారకుని అంతరంగంలోని ప్రీతికరమైన భావాల నన్నిటినీ వెల్లడింప చేయగలిగాడు. ఆ విధంగా ఆతడు నిజమైన యోగి, సాధువని నరేంద్రుడు గ్రహించి ఆతడి పట్ల ఎంతో గౌరవం చూపాడు; మమ్మల్ని కూడా అట్లే చేయమన్నాడు. మాలో పలువురం ఆతడి పాదాలు స్పృశించి, ప్రణామాలు చేశాం. మే మంతా ఒకచోట కూర్చుని గురుదేవులకు నివేదించిన మిఠాయి ప్రసాదాన్ని పుచ్చుకొన్నాం. శ్రీరామకృష్ణులను తాను సాక్షాత్తు ఏసుక్రీస్తుగా పరిగణిస్తున్నానని అతడు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

శ్రీరామకృష్ణుల పరిస్థితి నానాటికీ దిగజారుతూండగా, నరేంద్రుడు ఆ

23. శ్రీరామకృష్ణుల ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడం

విధంగా భక్తులకు మార్గదర్శకత్వం వహించసాగాడు. మొదట్లో దాదాపు మంచి ఫలితాల నిచ్చిన అవే మందులు ఇప్పుడు పనిచేయకపోవడంతో డాక్టర్ సర్కార్ ఆందోళన చెందసాగాడు. ఇదంతా కలకత్తా నగర కాలుష్య వాతావరణ ఫలితమని

నిశ్చయించుకొని, నగరానికి వెలుపల ఉన్న ఏదో ఒక ఉద్యానగృహానికి శ్రీరామకృష్ణులను తరలించడం మంచిదని అతడు భక్తులకు సలహాయిచ్చాడు. అప్పటికి ఆగ్రహాయణ మాసం (నవంబర్ - డిసెంబర్) సగం గడిచిపోయింది. పుష్యమాసంలో ఇల్లు మారడానికి శ్రీరామకృష్ణులు ఇష్టపడరని గ్రహించి త్వరలోనే మరొక ఇంటికోసం విశ్వప్రయత్నాలు చేయసాగారు భక్తులు. సత్వరమే వారి ప్రయత్నం ఫలించింది. నెలకు ఎనభై రూపాయలకు ఒక ఉద్యాన గృహాన్ని అద్దెకు పుచ్చుకొన్నారు. రాణీ కాత్యాయని అల్లుడైన కీ.శే. గోపాల్ చంద్ర ఘోష్‌ది ఆ ఉద్యాన గృహం. బారానగర బజారుకు దారితీసే ప్రధాన మార్గానికి తూర్పుగా, కాశీపూర్ మతి కొలనుకు ఉత్తరం వైపు బాట ఆ ప్రధాన మార్గాన్ని కలిసే చోట ఈ గృహం నెలకొనివుంది. శ్రీరామకృష్ణుల అతిసన్నిహిత భక్తుడూ, సిమూలియాపేట వాస్తవ్యుడూ అయిన సురేంద్రనాథ్ మిత్ర మొత్తం అద్దెను తాను చెల్లిస్తానన్నాడు.

అద్దె ఒప్పందం ఏర్పాట్లు పూర్తిచేసుకొన్న తరువాత, శ్యాంపుకూర్ నుండి కుర్చీలు, బల్లలు, పాత్రలు మొదలైనవి కొత్త ఇంటికి చేరవేయడానికి ఒక మంచి రోజు నిర్ణయించారు. కొత్త ఇంట్లో ఏర్పాట్లన్నీ పూర్తిచేసుకొని ఆగ్రహాయణమాసం గడిచిపోవడానికి ఒక రోజు ముందు భక్తులు శ్రీరామకృష్ణులను శ్యాంపుకూర్ నుండి, కాశీపూర్ ఉద్యాన గృహానికి తోడ్కొని వెళ్లారు. రమణీయమైన ఆ ప్రదేశం, ఆ ఏకాంతత, ఆరుబయలు, ఫలపుష్పాదులతో అలరారుతున్న చెట్లు చూసి గురుదేవులు ఎంతో ఆనందించారు. ఆయన ఆహ్లాదాన్ని చూసి భక్తుల హృదయాలు సంతోషంతో వెల్లివిరిశాయి.

13.i. కాశీపూర్ ఉద్యానగృహంలో శ్రీరామకృష్ణులు[1]

కాశీపూర్ ఉద్యాన గృహం ఉత్తర కలకత్తా గుండా వెళ్లి బారానగర్‌లోని బాగ్ బజార్‌ను కలిపే విశాలమైన మార్గంమీద, కలకత్తా నగరానికి మూడు మైళ్ల దూరంలో నెలకొని ఉంది.

బాగ్బజార్ వంతెన ఉత్తరంవైపు నుండి ప్రారంభమై కాశీపూర్‌కు దక్షిణంగా ఉన్న ఆ మార్గం ఇరువైపుల పేద శ్రామికుల గుడిసెలు, నిత్యావసర వస్తువులన్నీ లభించే చిన్న అంగళ్లు కానవస్తాయి. అంతే కాక అక్కడక్కడ ఇటుక కట్టడాలవంటి జనుపనార మిల్లులు, డోస్ట్ కంపెనీకి చెందిన ఇనుప కర్మాగారం, రాలీ సోదరుల సంస్థ, ఒకటి రెండు ఉద్యానాలు లేదా ఇళ్లు, పోలీస్ స్టేషన్, అగ్నిమాపక దళం స్టేషన్ మొదలైనవి కూడా కనిపిస్తాయి. పేదల సంపన్నుల జీవన పరిస్థితుల మధ్యవున్న భయంకరమైన తారతమ్యానికి సాక్షిగా ఉన్నట్లు ఈ ప్రాంతానికి ఒకింత పశ్చిమంగా కానవస్తుంది ప్రసిద్ధ సర్వమంగళాదేవి ఆలయం.

1. కాశీపూర్

సియల్‌దాహ రైలు స్టేషన్ ఆవరణ మరింత విస్తృతించబడడంతో, తగరం కప్పులతో కూడిన చిన్నచిన్న గిడ్డంగులు ఆ మార్గం మీద ఉద్భవించి, గతంలోని ఆ ప్రాంతపు కించిత్తు అందాన్ని పాడుచేశాయి. ఈ పురాతన మార్గం ఆ విధంగా చిత్రకారుని దృష్టికి లేదా కవి దృష్టికి ప్రసన్నంగా కనిపించకపోయినా,

---

1. ఈ అధ్యాయాన్ని రచయిత వ్యాసంగా రచించి రామకృష్ణ సంఘ వంగ మాసపత్రిక 'ఉద్బోధన్'లో ప్రచురించారు. కాని ఈ అధ్యాయం రచయిత జీవించి ఉన్నప్పుడు ప్రచురితమైన ఈ గ్రంథం మొదటి ముద్రణలో చోటుచేసుకోలేదు.

చరిత్రకారుని దృష్టిలో కొంత విలువలేకపోలేదు. ఎందుకంటే ఈ మార్గం మీదుగానే పురోగమించి ఆంగ్లేయులకు చెందిన గోవిందపూర్ కోటను సిరాజ్ నవాబు[1] ఆక్రమించాడు. అంతేకాక బాగ్బజార్‌కు అరమైలు దూరంలో ఈ మార్గం మీదనే అపఖ్యాతిపాలైన ద్రోహి మీర్జాఫర్ నవాబు రాజ భవనం ఒకప్పుడు ఉండేది. బాగ్బజార్ నుండి కాశీపూర్ కూడలి వరకు ఈ మార్గం ఏమాత్రం అందంగా ఉండదు; కాని అక్కడ నుండి బాగ్బజార్ వరకు పొడి గించబడ్డ మార్గం ఆకర్షణీయంగా ఉండదని చెప్పలేం.

కాశీపూర్ కూడలికి మరికొంత దూరం ఉత్తరంగా పోతే మతి చెరువు దక్షిణతీరం వస్తుంది. దానికి ఎదురుగుండా మార్గానికి తూర్పువైపు మా సుప్ర సిద్ధ మిత్రుడైన మహిమాచరణ్ అందమైన ఇల్లు నెలకొని ఉంది. ఈ ఇంటి చుట్టూగల ఉద్యానంలో అధికభాగం ఇప్పుడు రైలు కంపెనీ కొనుగోలుచేసి, గంగాతీరం దాకా రైలుపట్టాలు నిర్మించింది. ఈ కారణంగా ఈ ఇంటి పూర్వపు శోభ బాగా తగ్గిపోయింది.

ఇక్కడ నుండి కాస్త దూరం ఉత్తరం వైపుగా వెళితే మతిచెరువు ఉత్తర సరిహద్దు కనిపిస్తుంది. దీనికి ఎదురుగా, మార్గానికి తూర్పు వైపు ఎత్తైన ప్రహరీ గోడ, ఇనుప ద్వారంతో మన కాశీపూర్ ఉద్యానగృహం కనబడుతుంది. మతి చెరువు పశ్చిమ భాగానికి పశ్చిమంగా అనేక అందమైన ఉద్యాన గృహాలను చూడవచ్చు; వాటిలో కొన్ని గంగాతీరాన ఉన్నాయి. వీటిలో అన్నింటికంటే మతిలాల్ సీల్‌కు చెందిన ఉద్యానగృహమే అత్యంత సుందరమైనది, ఆకర్షణీయ మైనది. ఇప్పుడు ఆ గృహం కలకత్తా విద్యుత్ కంపెనీ అధీనంలోకి రావడం వలన గత సౌందర్యాన్ని, ప్రశాంతతను కోల్పోయి ఎడతెగని కోలాహలా నికి కేంద్రమైపోయింది.

ఈ ఉద్యానానికి ఉత్తరంగా గంగాతీరాన శిథిలావస్థలోని బాసకుల ఇంటిని చూడవచ్చు. ఈ ఇంటికి దారితీసే బాటకు ఇరువంకలా చింతచెట్లు బారులు తీరి ఉన్నాయి. ఈ సుందర దృశ్యం దర్శనార్థుల మనస్సులను ఆహ్లాదపరుస్తుం టుంది.

మేం శ్రీరామకృష్ణులతో కాశీపూర్ ఉద్యాన గృహంలో బసచేసి ఉన్నప్పుడు గంగలో స్నానం చేయడంకోసం ఈ మతిలాల్ ఉద్యానానికి వెళ్లేవారం. స్నానం ముగించి, ఘట్టానికి ప్రక్కన పెరుగుతున్న గుల్చి చెట్లనుండి సువాసనభరిత

---

1. సిరాజ్ - ఉద్ - దౌలా, వంగదేశం, బీహార్, ఒరిస్సాల చిట్టచివరి స్వతంత్ర నవాబు.

మైన గుల్చి పుష్పాలను సేకరించి గురుదేవులకు సమర్పించేవారం. ఈ పుష్పా లంటే ఆయనకు ఎంతో ఇష్టం. తరచు ఆ చింతచెట్లున్న దారిగుండా నడిచి, బాసకుల శిథిలావస్థలోని ఉద్యానగృహానికి వెళ్లి, గంగాతీరాన తాపీగా కూర్చునే వారం. ఈ ఉద్యానానికి ఉత్తరం వైపు కీ.శే. ప్రాణనాథ్ చౌధురికి చెందిన విశాల మైన స్నానఘట్టం ఉంది. ఆ ఘట్టానికి మళ్లీ ఉత్తరాన సుప్రసిద్ధుడైన లాలా బాబు భార్య రాణీకాత్యాయనికి చెందిన అందమైన గోపాలుని ఆలయం ఉంది. అప్పుడప్పుడు మేం ఆ ఘట్టానికి స్నానార్థం వెళ్లి, అలాగే ఆలయంలో మ్రొక్కి-వచ్చేవారం. ఈ రాణీ కాత్యాయనీ అల్లుడే కీ.శే. గోపాల్ చంద్రఘోష్. అతడిదే కాశీపూర్ ఉద్యాన గృహం. భక్తులు ఈ ఇంటిని నెలకు ఎనభై రూపాయల అద్దెకు, ఆరు నెలల కాలానికి పుచ్చుకొన్నారు; పిదప మరో మూడు నెలలకు ఒప్పందం పొడిగించుకొన్నారు. శ్రీరామకృష్ణుల గొప్ప భక్తుడైన సిమ్లాపేట వాస్తవ్యుడు సురేంద్రనాథ్ మిత్ర దస్తావేజు మీద సంతకం చేసి పూర్తి అద్దెను చెల్లించాడు.

పెద్దది కాకపోయినా కాశీపూర్ ఉద్యానగృహం ఎంతో అందమైనది. దాని విస్తీర్ణం నాలుగున్నర ఎకరాలకంటే కాస్త ఎక్కువ. ఈ చతుష్కోణాకృతిలోని

2. కాశీపూర్ ఉద్యాన గృహం

ఉద్యానం ఉత్తరం నుండి దక్షిణం కంటే తూర్పు నుండి పడమరగా ఎక్కువ పొడవులో ఉంటుంది. నలువైపులా ఎత్తైన ప్రహరీగోడలున్నాయి. ఉత్తరం వైపు ప్రహరీగోడ మధ్యభాగాన్ని దాదాపు ఆనుకొని వరుసగా మూడు నాలుగు గదులున్నాయి; ఈ గదులు వంటకు, సామానులు నిల్వచేసుకోవడానికి వినియోగపడతాయి. ఈ గదులకు ఎదు రుగా, ఉద్యానానికి అటువైపు రెండస్తుల నివాసగృహం ఉంది. ఈ ఇంట్లో మేడ మీద రెండు గదులు, క్రింద నాలుగు గదులు ఉన్నాయి. క్రింద ఉన్న గదుల మధ్యగది ఎంతో విశాలమైనది. దీనికి ఉత్తరం వైపు ఉన్న ప్రక్క-ప్రక్క రెండు గదులు చిన్నవి. ఈ గదులలో పశ్చిమంగా ఉన్న గదినుండి మొదటి అంతస్తుకు దారితీసే చెక్క-మెట్లవరుస ఉంది. తూర్పు గది మాతృదేవి కోసం కేటాయిం చారు. పైన పేర్కొన్న తూర్పు పడమరలుగా విస్తరించిన విశాలమైన గదిని, దానికి దక్షిణాన ఉన్న గదిని, ఆ గదికి తూర్పునగల వసారాను భక్తులు కూర్చోవడానికి, నిద్రించడానికి ఉపయోగించసాగారు. క్రిందనున్న విశాలమైన గదికి సరిగ్గా పై అంతస్తులో అంతే పరిమాణంలో చతురస్రాకారంలో ఒక గది ఉంది. శ్రీరామకృష్ణులు ఈ గదిలోనే బసచేశారు. దీనికి దక్షిణంగా పిట్టగోడ లతో ఒక చిన్నడాబా ఉంది. అప్పుడప్పుడు ఇక్కడే శ్రీరామకృష్ణులు పచార్లు చేసేవారు, లేదా కూర్చునేవారు. దీనికి ఉత్తరంగా మెట్లకు దారితీసే గది కప్పు,



కాశీపూర్ ఉద్యాన గృహం

మాతృదేవికి కేటాయించిన గది మీదుగా అంతే పరిమాణంలో ఒక చిన్నగది ఉన్నాయి. ఇక్కడే శ్రీరామకృష్ణులు స్నానాదులు చేసేవారు. రాత్రిపూట ఒక రిద్దరు సేవకులు ఈ గదిని ఉపయోగించేవారు.

ఈ కాశీపూర్ ఉద్యాన గృహానికి తూర్పు, పశ్చిమాలలో క్రిందనున్న విశాలమైన గదికి దారితీసే మెట్లున్నాయి. ఇంటి చుట్టూ ఇటుకలతో నిర్మిత మైన వృత్తాకార తోట బాట ఉంది. ఉద్యానానికి నైరుతి మూల పశ్చిమ వైపు ఉన్న ప్రహరీగోడకు ఆనుకొని ద్వారపాలకుడికి చిన్నగది, దానికి ఉత్తరాన ఇనుప ద్వారం ఉన్నాయి. గుర్రపుబళ్లు పోవడానికి అనువుగా ఒక అర్ధచంద్రాకార తోట బాట ఈశాన్యంగా వెళ్లి, ఇంటి చుట్టూవున్న వృత్తాకార బాటలో కలుస్తోంది. ఇంటికి పశ్చిమాన చిన్న కొలను ఉంది. ఇంట్లో క్రిందవున్న విశాలమైన గదికి దారితీసే పశ్చిమంవైపు ఉన్న మెట్లకు ఎదురుగా తోట బాటకు అటువైపు ఈ కొలనుకు దారితీసే మెట్లున్నాయి. ఉద్యానానికి ఈశాన్య మూల ఒక కొలను ఉంది; ఇది పైన పేర్కొన్న కొలనుకంటే నాలుగైదు రెట్లు పెద్దది. ఉద్యానానికి వాయవ్యాన రెండు మూడు గదులు ఉన్నాయి. ఉద్యానం వాయవ్య మూల గుర్రపుశాల ఒకటి ఉంది. పైన పేర్కొన్న కొలనుకు పశ్చిమాన ఉద్యానం దక్షిణపు గోడవద్ద తోటమాలి కోసం ప్రక్కప్రక్కన శిథిలావస్థలోని ఇటు కలతో కట్టిన రెండు గదులు ఉన్నాయి. ఉద్యానంలో తక్కిన చోట్ల మామిడి,



శ్రీరామకృష్ణులు బసచేసిన గది

పనస, లీచీ వంటి పండ్ల చెట్లు ఉన్నాయి. తోట బాటలు రెండు వైపులా పువ్వుల మొక్కలతో అలంకరింపబడివున్నాయి. చిన్న, పెద్ద చెరువుల సమీపంలోని స్థలాలలో వంటకు కావలసిన ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. అలాగే చెట్ల నడుమ పచ్చికను పెంచడం వలన ఉద్యాన రామణీయకత ఇనుమడించింది.

శ్రీరామకృష్ణులు ఈ ఉద్యానగృహానికి 1885వ సం॥ డిసెంబర్ 11వ తేదీ నాడు వచ్చారు. గడచిన ఎనిమిది నెలల కాలంలో రోగం బాగా ముదిరిపోవ

డంతో శ్రీరామకృష్ణుల పొడవైన దృఢకాయం చిక్కి శల్యమైపోయి ఎముకల గూడులా తయారైంది. అయినప్పటికీ పరిపూర్ణ ఆత్మసంయమం సంతరించుకొన్న ఆయన మనస్సు రోగాన్ని, బాధను ఏమాత్రం ఖాతరుచేయలేదు. వ్యక్తిగతంగా, సామూహికంగా ఎడతెగకుండా, అవిరామంగా ఉపదేశాల ద్వారా తమ భక్తులకు శిక్షణ గరపే కార్యం, ఇంతకు మునుపే ప్రారంభమైన ఈ కార్యాన్ని ముగించడం కోసం ఆయన నడుం బిగించారేమో అన్నట్లుగా ఆయన కనిపించసాగారు. పైగా దక్షిణేశ్వరంలో పలుమార్లు ఆయన భక్తులకు చెప్పిన భవిష్యద్వాణి ఇప్పుడు అక్షరాలా జరుగుతూండడం మేం సదా చూస్తూ వున్నాం. అనేక సందర్భాలలో ఆయన ఇలా చెప్పేవారు: ''నేను చనిపోవడానికి ముందు రహస్యాన్నంతా బట్టబయలు చేసి పోతాను (అంటే తాము భగవదవతారమనే విషయం)''; ''అనేకులకు (నా దివ్యత్వం) తెలియవచ్చి, దానిని గురించి గుసగుసలాడసాగినప్పుడు ఈ తొడుగు (ఆయన దేహం) నిలవదు; అమ్మ సంకల్పంతో ఛిన్నాభిన్నమౌతుంది'; ''ఆ (వ్యాధిగ్రస్తులైన) సమయంలో అంతరంగ భక్తులెవరో, ఎవరు కారో తేలిపోతుంది.''

3. శ్రీరామకృష్ణులు కాశీపూర్‌కు వచ్చి తమ యువ శిష్యులకు శిక్షణ గరపడం

నరేంద్రాది భక్తుల గురించి ఆయన చెప్పిన భవిష్యద్వాణిని మేం అర్థంచేసుకోగలిగింది ఇక్కడే: ''అమ్మ తన విశేష కార్యం నిమిత్తం నిన్ను (నరేంద్రుణ్ణి) ఈ భూమికి కొనివచ్చింది; కనుక నన్ను అనుసరించే తీరాలి; నన్ను విడిచి ఎక్కడకు వెళ్లగలవు?'' ''వారంతా (యువ శిష్యులు) హోమపక్షి వంటి వారు. ఆ పక్షి ఆకాశంలో ఎంతో ఎత్తులో వసిస్తుంది. అది అక్కడే గుడ్లను పెడుతుంది. ఆ గుడ్లు అత్యంత వేగంతో క్రిందపడసాగుతాయి. అవి నేలను తాకి ముక్కలుముక్కలై పోతాయేమోనని భయం వేస్తుంది. కాని అలా జరుగదు. క్రింద పడే లోపే అవి పొదగబడి పక్షికూనలు బయటకు వస్తాయి. క్రింద పడుతూవుండగానే వాటికి రెక్కలు మొలుచుకువస్తాయి. తక్షణం అవి రెక్కలు విప్పుకొని, పైకెగిరి వాటికోసం ఎదురుచూస్తున్న తల్లితండ్రులను చేరతాయి. అదే విధంగా వీరు (బాలభక్తులు) కూడా కట్టివేయబడడానికి ముందే సంసారాన్ని త్యజించి భగవంతుని వైపుగా ఏగుతారు.''

పైగా శ్రీరామకృష్ణులు, నరేంద్రునికి విశేష శిక్షణ నిచ్చి, మలచి, తన యువభక్తుల బాధ్యతను ఆతడికి అప్పగించి, వారికి మార్గదర్శకత్వం వహించ ఉపదేశాలిచ్చింది ఇక్కడే. అందుచేత కాశీపూర్‌లో నెరవేర్చిన పని ఎంతో ప్రాధాన్యం వహించిందని ప్రత్యేకంగా చెప్పడం అనవసరం.

కనుక శ్రీరామకృష్ణుల జీవితంలో అత్యంత ప్రాధాన్యం వహించిన కార్యాలు సాధింపబడిన ఈ పావన స్థలాన్ని రామకృష్ణ మిషన్ ప్రాప్తించుకొంటే,

4. ఎన్నో పవిత్ర స్మృతులను సంతరించు కొన్న కాశీపూర్ ఉద్యాన గృహాన్ని రామకృష్ణ మిషన్ ప్రాప్తించుకోవాలి

ఆయన ఒనరించిన ఆ కార్యాల పావన స్మృతులు చెక్కుచెదరక తరతరాల దర్శనార్థుల హృదయాలలో స్ఫూర్తిని జాగృతం చేసి వారిలో ఆధ్యాత్మిక ప్రేరణను కలిగిస్తాయనడం తథ్యం. కాబట్టి అందరి మనస్సులలోను ఇటువంటి బలీయమైన కోర్కె జనించడం సహజమే. కాని అయ్యో, ఈ కోర్కె నెరవేరడంలో ఒక గొప్ప ఆటంకం వాటిల్లింది.[1] ఈ స్థలాన్ని కైవశం చేసుకోవడానికి రైల్వే కంపెనీ ప్రయత్నిస్తున్నట్లు మాకు తెలిసింది. అదే కనుక జరిగితే గురుదేవుల ఈ దివ్యలీలాస్థానపు రూపం పూర్తిగా మారిపోతుందని చెప్పడం అనవసరం. బహుశా అలా జరిగితే అది జనుపనార గిడ్డంగిగానో, రైల్వే దొడ్డిగానో మారవచ్చు. భగవత్సంకల్పం అదే అయితే దుర్బలులమైన మనం ఏం చేయగలం? కనుక 'విధి లిఖితం జరుగక తప్పదు' అనే తలంపుతో, నిస్సహాయతతో ఊరటచెందుదాం.

---

1. ఈ కోర్కె ఇటీవలే (1946) నెరవేరింది. కాశీపూర్ ఉద్యానగృహం రామకృష్ణ సంస్థలలోని ఒక ఆశ్రమంగా రూపొందింది.

13.ii. కాశీపూర్‌లో సేవాదీక్ష

1. ఉద్యానగృహంలో బసచేయడంలో గురుదేవుల ఆనందం

పుష్యమాసంలో నూతన స్థలానికి తరలి వెళ్లరాదనే సంప్రదాయం కారణంగా ఆగ్రహాయణం పూర్తికావడానికి ఒక రోజు ముందు శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్ నుండి, కాశీపూర్‌కు ఏతెంచారని మునుపే చెప్పివున్నాం. కాశీపూర్ ఉద్యాన గృహం జనసందడితో కోలాహలంగా ఉండే బాట మీద నెలకొనివున్న శ్యాంపు కూర్ ఇంటికంటే ఎంతో విశాలంగా, ఏకాంతంగా ఉంది. ఇక్కడ ఏ వంక చూసినా కనుచూపుమేర వరకు కానవచ్చే పచ్చని చెట్ల ఆకులు, రంగురంగుల పువ్వులు, ముదురు లేత గడ్డితో కూడిన పచ్చికబయళ్లు కన్నుల పండువ చేస్తూంటాయి. దక్షిణేశ్వర కాళికాలయ ప్రాంగణ సహజ సౌందర్యంతో పోల్చి చూసినప్పుడు ఈ ఉద్యానం అంతంత మాత్రమే. అయినప్పటికీ నాలుగు నెలలు ఏకబిగిన కలకత్తాలో గడిపిన శ్రీరామకృష్ణులకు ఈ ఉద్యానం ఆహ్లాద కరంగానే తోచడంలో అతిశయోక్తి లేదు. తమకు కేటాయించిన మొదటి అంతస్తులోని విశాలమైన గదిలోకి ప్రవేశించగానే చుట్టూ కానవచ్చిన రామ ణీయకత ఆయనను ఎంతో ఆకట్టుకొంది. ఆయన దక్షిణం వైపు ద్వారం నుండి గది వెలుపలకు వచ్చి, డాబా మీద నిలబడి, ఆ ఉద్యాన సౌందర్యాన్ని తిలకిస్తూ కొంతసేపు గడిపారు. మాతృదేవి కూడా ఈ ఉద్యానగృహాన్ని చూసి ఎంతో ఆనందించింది. శ్యాంపుకూర్ ఇంటి మాదిరి పంజరంలో పక్షిలా ఇక్కడ ఉండవలసిన అవసరం లేదని, గురుదేవులకు ఎంతో చక్కని వాతావర ణంలో సేవలు అందించవచ్చునని తలచి ఆమె ఎంతో సంబరపడిపోయింది. కాశీపూర్ ఉద్యానగృహాన్ని చూసి వారిద్దరూ సంతోషించడంతో గురు దేవుల సేవకులు పొందిన ఆనందం వర్ణనాతీతమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఆ ఇంట్లో లోటుపాట్లను సరిదిద్దుకొని స్థిరపడడంలో కొద్దిరోజులు గడిచిపోయాయి. కాశీపూర్ ఉద్యానగృహం కలకత్తాకు దూరంగా ఉండడం వలన గురుదేవులకు చికిత్స చేస్తూన్న డాక్టరు రాకపోకలకు, ఇళ్లకు దూరంగా ఉండడం చేత అక్కడే బసచేసి స్వచ్ఛందంగా సేవలు అందిస్తూన్న భక్తుల ఖర్చులకు అధికంగా ధనం అవసరమై ఉందనీ, అట్లే మందీమార్బలం కూడా ఉండాలనీ నరేంద్రుడు దీర్ఘంగా యోచించి గ్రహించాడు. ఈ విషయాలన్నింటినీ ప్రారంభం నుండే జాగ్రత్తగా యోచించి సముచిత ఏర్పాట్లు చేసుకోకపోతే, రాబోయే రోజుల్లో శ్రీరామకృష్ణులను సేవించడంలో ఇబ్బందులు ఎదురవడం తప్పదనీ నరేంద్రుడు గ్రహించకపోలేదు. మొట్టమొదటి నుండి ఆర్థిక బాధ్యతలను చూసుకొంటున్న బలరాం, సురేంద్ర, రాం, గిరీష్, మహేంద్రాదులు ఇప్పుడు చక్కగా ఆ విషయం గురించి పరస్పరం సంప్రతించుకొని ఆర్థిక కొరత రాకుండా తగిన ఏర్పాట్లు చేశారు. మందీమార్బలం విషయం ఇంతకు ముందు మాదిరి నరేంద్రుడే చూసుకోవలసి వచ్చింది. అందువలన అతడు ఎక్కువ సమయం కాశీపూర్ ఉద్యానంలోనే గడపవలసి వచ్చింది. అతడు ఈ విషయంలో మార్గదర్శకత్వం వహించకపోతే తల్లితండ్రుల భయంతోనో లేక తమ చదువులకు ఆటంకం కలుగుతుందనో తక్కిన యువశిష్యులు కూడా ముందుకురాని పరిస్థితి ఎదురౌతుంది. ఎందుకంటే శ్రీరామకృష్ణులు శ్యాంపుకూర్‌లో బసచేసి ఉన్నప్పుడు వారు ఇళ్లకు వెళ్లి భోజనాదులు ముగించుకుని తిరిగి వచ్చి గురుదేవుల సేవలో నిమగ్నులయ్యేవారు. కాని కాశీపూర్ కలకత్తాకు దూరంగా ఉండడం వలన అలా చేయడం ఇప్పుడు వారికి సాధ్యం కాదు.

2. శ్రీరామకృష్ణుల సేవకు మందీమార్బలం, ధనం అవసరమైనాయి

ఆ సంవత్సరం నరేంద్రుడు న్యాయశాస్త్ర పరీక్షకు చదువుతున్నాడు. కనుక కలకత్తాలోనే ఉంటూ చదువుకోవడం తప్పనిసరైంది; అందుకు తోడు ఉన్నత న్యాయస్థానంలో పూర్వీకుల ఆస్తి విషయంగా తన బంధువులపై వేసిన వ్యాజ్యం కూడా అతడు స్వయంగా చూసుకోవలసిన అగత్యం ఎదురైంది. అయినప్పటికీ గురుదేవుల సేవకై ఆ అభిప్రాయానికి తిలోదకాలిచ్చేశాడు. న్యాయశాస్త్ర గ్రంథాలు కాశీపూర్‌కు తెచ్చుకొని, వీలు చిక్కితే చదువుకోవాలని నిర్ణయించుకొన్నాడు. ఇలా న్యాయశాస్త్ర పరీక్షలకు ఒక ప్రక్క చదువుకోవడమూ, మరో ప్రక్క గురుదేవులను సేవించడమూ నరేంద్రుడి అప్పటి అభిప్రాయంగా తెలియవస్తున్నది. ఎందుకంటే అతడికి మరో మార్గం

3. ఉద్యానగృహంలోనే బసచేసి గురుదేవులను సేవించాలని నరేంద్రుడు సంకల్పించడం

కనిపించలేదు. ఎలాగో పరీక్షల్లో ఉత్తీర్ణుడై, కొన్ని సంవత్సరాలు కష్టించి పనిచేసి కొంతసొమ్ము సంపాదించి, తల్లి తమ్ముళ్ల జీవితాలు తిండితిప్పలకు లోటు రాకుండా జరిగిపోయేలా ఏదో ఒక ఏర్పాటుచేసి, తదనంతరం సంసారాన్ని త్యజించి పూర్తిగా భగవత్సాక్షాత్కారం కోసం తన జీవితాన్ని అర్పించుకోవాలని అతడు భావించాడు. కాని విధివ్రాత మరోలా ఉంది! మనలో అనేకులం అటు వంటి సత్సంకల్పాలు చేసుకొంటాం కాని దాన్లో ఎందరం విజయులవు తున్నాం? సుఖంగా కూర్చుని, 'ఇంతవరకు మాత్రమే నేను లౌకిక ప్రవాహంలో ఈదులాడతాను; ఆ తరువాత దృఢమైన సంకల్ప శక్తిని చూపి ఎదురీది తిరిగి వస్తాను' అని ఊహాలోకంలో అంచనాలు వేసుకొంటాం, అనుకొన్న పథకం ప్రకారం పని ప్రారంభిస్తాం. కాని సంసారమనే ఆ సుడిగుండంలో చిక్కువడ కుండా ఎందరం ఆవలి తీరాన్ని చేరగలుగుతాం?

నరేంద్రుడు అత్యున్నత శ్రేణికి చెందిన ఆధ్యాత్మిక సాధకుడు, పైగా గురుదేవుల అపరిమిత అనుగ్రహానికి పాత్రుడైనవాడు. అటువంటప్పుడు ఆతడి సంకల్పం నెరవేరుతుందా? లేక కుటుంబ పరిస్థితులలో ఏర్పడే అనూహ్యమైన చిక్కులకు ఎదురొడ్డి తన సంకల్పానుసారం నిలబడగలడా? లేదా రాజీ పడిపోతాడా? పాఠకా, వేచి ఉండు. అమోఘమైన గురుదేవుల సంకల్పశక్తి అతణ్ణి ఏ మార్గంలో ఏ విధంగా లక్ష్యాన్ని చేర్చగలిగిందో త్వరలోనే చూడగలం.[1]

4. జగజ్జనని మీద మాత్రమే శ్రీరామకృష్ణులు ఆధారపడి ఉండడం

ఇప్పటి దాకా శ్రీరామకృష్ణులను సేవించడానికి భక్తులు ఏం చేస్తూవచ్చారో మేం తెలియచేస్తూవచ్చాం. ఇప్పుడు మరో ప్రశ్నం తలెత్తవచ్చు. ''తమను గురించి ఏమీ ఆలోచించకుండా గురుదేవులు ప్రతి దానికి భక్తుల మీదే ఇప్పుడు ఆధారపడి ఉన్నారా? దక్షిణేశ్వ రంలో ఉంటున్నప్పుడు ఎవరు ఒక వంక వేదవేదాంతా లకు అతీతమైన సత్యాలను సాక్షాత్కరించుకొంటూ, మరోవంక చిన్నచిన్న దైనందిన వ్యవహారాలను, అట్లే ప్రతి భక్తుని లౌకిక ఆధ్యాత్మిక స్థితిగతులను గురించి ఒక కంట కనిపెడుతూ వచ్చారో ఆ గురుదేవులే ఇప్పుడు తమను గురించి ఏమీ ఆలోచించకుండా అన్నిటికోసమూ భక్తులపై ఆధారపడ సాగారా?''

కాదు. సదాసర్వవేళలా ఎవరి మీద భారంవేసి, ఎవరి సంకల్పాను సారం ప్రవర్తిస్తూ వచ్చారో, ఇప్పుడు కూడా ఆయన కేవలం ఆ జగజ్జననినే

---

1. రచయిత ఈ భాగాన్ని పూర్తిచేయలేకపోయాడు.

చూస్తూ ఆమె ఒక్కదానిమీదే ఆధారపడసాగారు - ఇదే పై ప్రశ్నకు సమాధానం.

• జగజ్జనని సంకల్పానుసారమే తాము భక్తుల నుండి సేవలను స్వీకరిస్తున్నామనీ, అదంతా వారి మేలు కోసమేననీ ఆయనకు ముందుగానే తెలుసు. శ్రీరామకృష్ణుల జీవితగాథను చెప్పేకొద్దీ ఈ ముఖ్యాంశం మరింత తేటతెల్లమౌతుంది.

5. తమ నేతృత్వంలో ఆయన ఏర్పాట్లు చేయించుకోవడం

ఒక్కొక్కప్పుడు శ్రీరామకృష్ణులు తమకు నచ్చని ఏర్పాట్లను భక్తులకు తెలిపో, తెలిపితే వారు బాధపడతారని భావించి మరికొన్నిసార్లు వారికి తెలుపకుండానే మార్చేసేవారు. ఉదాహరణగా, ఆయన చికిత్స నిమిత్తం కలకత్తాకు రాబోతున్నప్పుడు బలరాంను పిలిచి ఇలా చెప్పారు: ''ఇలా చూడు, చందాలు వేసుకొని రోజూ నా భోజన ఏర్పాట్లు చేయడం నాకు సుతరామూ ఇష్టంలేదు. ఎందుకంటే నే నెన్నడు అలా జీవించలేదు. దక్షిణేశ్వర కాళికాలంలో ఉంటున్నప్పుడు అలా చెయ్యలేదా అని నువ్వు అడగవచ్చు. ఎందుకంటే ఆలయ యాజమాన్యం విడిగా ఉంటున్నప్పటికీ, ఆలయ వ్యవహారాలను సంయుక్తంగా నిర్వహించేవారు. అటువంటప్పుడు ఒక రకంగా చూస్తే నా జీవనం సంయుక్తంగా వారి చందాల మీదనే గడిచిందని నువ్వు వాదించవచ్చు. కాని నిజం అది కాదు. అప్పుడు సైతం చందాల మీద జీవించవలసిన అగత్యం నాకు పట్టలేదు. పూజారిగా నాకు రాస్మణి కాలంనుండే నెలకు ఏడు రూపాయలు, నిత్యం ఆలయ ప్రసాదాలు నేను అక్కడ జీవించినంత కాలం సమర్పించాలనే ఏర్పాటు చేయబడింది. కాబట్టి ఒక రకంగా చూస్తే నేను అక్కడ పెన్షన్[1] మీద జీవించినట్లే. కనుక చికిత్స నిమిత్తం నేను దక్షిణేశ్వరానికి వెలుపల ఉండవలసినంత వరకు నా భోజన ఖర్చులు నువ్వే భరించు.''

మళ్ళీ కాశీపూర్ ఉద్యాన గృహాన్ని అద్దెకు తీసుకొన్న తరువాత, ఆయనకు అద్దె చాలా ఎక్కువ అని తెలియవచ్చింది. భక్తులలో అనేకులు ఎంతో కష్టంతో తమ సంసారాలను గడుపుకొస్తున్న తరుణంలో ఇంత పెద్ద అద్దెను వారెలా భరించగలరో అని ఆయన విస్తుబోయారు. ఎట్టకేలకు ఆయన డోస్టే కంపెనీలో సూపరింటెండెంట్‌గా ఉంటున్న సురేంద్రనాథ్‌ను పిలిచి ఇలా చెప్పారు: ''ఇలా చూడు సురేంద్రా! వీరంతా చిన్నచిన్న గుమాస్తాలు, వచ్చే చిరు ఆదాయంతో కష్టం మీద కుటుంబాలను పోషించుకొంటున్నారు.

---

1. శ్రీరామకృష్ణులు ఈ పదాన్ని 'పెన్సిల్'గా ఉచ్చరించేవారు.

చందాలు వేసుకొని అంత మొత్తాన్ని వారు సేకరించగలరా? కనుక అద్దె మొత్తం నువ్వే చెల్లించు.'' సురేంద్ర చేతులు జోడించి, ''మీ ఆజ్ఞ'' అంటూ సంతోషంగా అందుకు అంగీకరించాడు.

లాటూ
(స్వామి అద్భుతానంద)

శ్రీరామకృష్ణులు ఒక రోజు బలహీనత కారణంగా మలమూత్ర విసర్జన నిమిత్తం ఇకముందు బయటకు పోవడం కూడా కష్టమైపోతుందని మాకు చెప్పారు. శ్రీరామకృష్ణుల ఆ మాటలు విని యువభక్తుడైన లాటూ[1] ఎంతో బాధపడి, ''మహాశయా, మీ 'పాకీవాణ్ణి' నే నిక్కడ ఉన్నాను'' అని చేతులు జోడించి చెప్పాడు. వచ్చీరాని వంగభాషలో అతడన్న ఆ మాటలు ఆ శోక సమయంలో గురుదేవులతో సహా అందరికీ నవ్వు తెప్పించాయి. ఈ విధంగా ఏర్పాట్లలో సరైన మార్పులను ఆయనే చేస్తూ భక్తులకు అసౌకర్యం కల్పించేవారు కారు.

ఏర్పాట్లన్నీ సక్రమంగా జరిగిపోతున్నాయి. ఒక్కొక్కరుగా యువ భక్తులు, అవసరమైన సంఖ్యకంటే ఎక్కువగానే రాసాగారు. నరేంద్రుడు వారిని

6. భావి సన్న్యాసి బృందం రూపుదిద్దుకోవడం

ధ్యానం, జపం, అధ్యయనం, సత్ప్రసంగాలు, శాస్త్ర చర్చలు మొదలైన వాటిలో నిమగ్నులను చేశాడు. వీటిలో లీనమైపోయిన వారికి రోజులు ఎలా గడచిపోతున్నాయో తెలియరావడం లేదు. ఒక వంక గురుదేవుల విశుద్ధ నిస్స్వార్థప్రేమ, మరోవంక నరేంద్రుని ప్రగాఢ మైత్రి, ఉదాత్త సాంగత్యం - ఈ రెండు ఆకర్షణలు ఆ యువకులను మధురకోమలమైన ఎడతెగని బంధంలో పెనవేసింది; ఒకే కుటుంబంలోని సభ్యులకంటే కూడా వారు అన్యోన్యంగా మెలగుతున్నారంటే అతిశయోక్తి కాదు. ఆ యువభక్తులలో ఎవరైనా దురదృష్టవశాత్తు అత్యవసర

---

1. స్వామి అద్భుతానంద పేరిట రామకృష్ణ సంఘంలో ప్రసిద్ధుడు. ఇతడు బీహార్ రాష్ట్రంలో ఛాప్రా అనే గ్రామంలో జన్మించాడు. అతడు వంగభాషను అర్థంచేసుకోగలిగినప్పటికీ, మాట్లాడుతున్నప్పుడు మాత్రం తమాషాగా, వినే వారికి ఎంతో ఇంపుగా ఉండేది.

మైన పనిబడి ఇంటికి వెళ్లవలసివస్తే అదే రోజు సాయంత్రమో, తప్పితే మర్నాటి ఉదయమో తప్పకుండా కాశీపూర్‌కు తిరిగి వచ్చేసేవారు. వారి అనుబంధం ఆ మేరకు పెనవేసుకుపోయింది. ఆ యువభక్తులు సంఖ్యలో పన్నెండు మంది[1] కంటే ఎక్కువ కాకపోయినా, వారంతా శ్రీరామకృష్ణుల మానవ అవతార పరిసమాప్తి వరకూ అక్కడే ఉండిపోయి, సంసారాన్ని పరిత్యజించి తమ సేవాదీక్షను పరిపూర్తిచేశారు. వారు గురువును తమ ప్రాణంకంటే మిన్నగా ప్రేమించిన కర్మకుశలురు.

కాశీపూర్‌కు వచ్చిన కొద్ది రోజుల తరువాత శ్రీరామకృష్ణులు ఒక రోజు క్రిందికి దిగివచ్చి కొంతసేపు ఇంటి చుట్టూ ఉన్న తోటబాట మీద పచార్లు చేశారు. అది చూసి భక్తులు సంతోషించారు; ప్రతి రోజూ అలా పచార్లు చేయగలిగితే ఆయన ఆరోగ్యం పుంజుకొంటుందని వారు ఆశించారు. ఆరుబయలు చలిలో తిరగడం వలన జలుబు చేసిన కారణంగానో లేదా మరేదో కారణంగానో మర్నాడు ఆయన బలహీనపడి కొన్ని రోజుల దాకా పచార్లు చేయలేకపోయారు. రెండు మూడు రోజుల్లో జలుబు నయమైందిగాని, బలహీనత మాత్రం అల్లే ఉండిపోయింది. డాక్టర్లు మేకపిల్ల మాంసంతో సూప్ చేసి పుచ్చుకోమన్నారు. ఆయన అదే విధంగా పుచ్చుకోవడంతో కొద్ది రోజులలోనే బలహీనత ఎంతో మేరకు తగ్గిపోయింది. ఆయన ఆరోగ్యంలో పురోభివృద్ధి పదిహేను రోజులదాకా కొనసాగింది. ఈ మధ్యలో ఒక రోజు డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ వచ్చి ఆయన ఆరోగ్యం మెరుగుపడడం గుర్తించి ఎంతో సంతోషించాడు.

7. శ్రీరామకృష్ణుల ఆరోగ్యం కించిత్తు మెరుగుపడడం

యువకులైన సేవకులు రోజు కలకత్తాకు వెళ్లి శ్రీరామకృష్ణుల ఆరోగ్యం గురించి డాక్టర్‌కు చెప్పి, వచ్చేటప్పుడు ఆయన పథ్యపానాదులకు కావలసిన సరంజామా తీసుకువచ్చేవారు. మొట్టమొదట ఈ రెండు పనులూ ఒకే వ్యక్తికి అప్పగించేవారు. అది ఎంతో అసౌకర్యానికి దారితీసింది. తరువాత ఆ రెండు

---

1. ఈ పన్నెండు మంది నామధేయాలు : నరేంద్రుడు, రాఖాల్, బాబూరాం, నిరంజన్, యోగీంద్ర, లాటూ, తారక్, పెద్దగోపాల్ (ఆ యువకులలో ఇతడొక్కడే వృద్ధుడు), కాళి, శశి, శరత్, హుట్కో (గోపాల్). తండ్రి భయంతో శారదుడు ఒకటి రెండు రోజులు ఉండి వెళ్లిపోయేవాడు. హరీష్ కొన్ని రోజులు ఉండి ఇంటికి వెళ్లిపోయాడు. పిదప అతడికి మతిస్థిమితం తప్పింది. హరి, తులసి, గంగాధర్ ఇంటివద్దే జపతపాదులు చేసుకొంటూ, అప్పుడప్పుడు వచ్చిపోతూవుండేవారు. ఈ పన్నెండు మందికాక మరో ఇద్దరు వచ్చి మహిమాచరణ్ చక్రవర్తి ఇంట్లో నివసించసాగారు.

అత్యవసరమైన పనులకు ఇద్దరిని కేటాయించారు. ఏదైనా మరో పని పడితే మూడో మనిషిని కలకత్తాకు పంపించేవారు. యువభక్తులు వరుస ప్రకారం ఇల్లు ఊడ్చడం, బారానగర్ బజారుకు వెళ్ళి నిత్యావసరాలు కొనుగోలు చేసి రావడం, రేయింబవళ్ళు గురుదేవులకు అవసరమైన సేవలు చేయడం వంటి పనులను నిర్వర్తించసాగారు. వారు చేసే ప్రతి పనిని నరేంద్రుడు పర్యవేక్షించేవాడు; హఠాత్తుగా ఏదైనా పని చేయవలసి వస్తే స్వయంగా తానే ఆ పని చేసేవాడు.

లక్ష్మీదేవి

ఇంతకు ముందు మాదిరే గురుదేవుల పథ్యపానాదులను మాతృదేవియే సిద్ధంచేసేది. ఏదైనా ప్రత్యేక పథ్యం చేయవలసి వస్తే డాక్టర్ నుండి దానిని తయారుచేసే విధానం ఆమె తెలుసుకొనేది. పెద్దగోపాల్ వంటి ఒకరిద్దరు భక్తులతో ఆమె నిస్సంకోచంగా మాట్లాడడం వలన, వారు ఆమెకు పథ్యం తయారుచేసే విధానాన్ని వివరించి చెప్పేవారు. వంట చేయడమేగాక స్వయంగా ఆమే మధ్యాహ్నం, సాయంత్రం గురుదేవులకు భోజనాన్ని తీసుకువెళ్ళేది. ఆయన భోజనం ముగించే వరకు అక్కడే వేచివుండి, గిన్నెలు పాత్రలు తిరిగి తీసుకువెళ్ళేది. వంటావార్పులలో మాతృదేవికి సహాయం చేయడానికీ, ఆమెకు తోడుగా ఉండడానికీ లక్ష్మీదేవిని (గురుదేవుల అన్నగారి కుమార్తె) కాశీపూర్‌కు తోడ్కొని వచ్చారు. అంతేగాక తరచు దక్షిణేశ్వరానికి శ్రీరామకృష్ణుల దర్శనార్థం వచ్చే భక్తురాండ్రు అప్పుడప్పుడు కాశీపూర్‌కు వచ్చి కొన్ని గంటలసేపు మాతృదేవికి తోడుగా ఉండి వెళ్ళిపోయేవారు; ఎప్పుడన్నా ఒకటి రెండు రోజులు వారు అక్కడే బసచేసేవారు కూడా. ఆ విధంగా ప్రతివారం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా గడిచిపోసాగింది.

8. వంటలో మాతృదేవికి సోదరి లక్ష్మి సహాయపడడం

గృహస్థ భక్తులు సైతం ఆ సమయంలో నిశ్చింతగా ఉండలేకపోయారు. వారు రాం లేదా గిరీష్ ఇళ్ళలో సమావేశమై గురుదేవుల సేవాకార్యం సాఫీగా సాగిపోవడం గురించి సంప్రతించుకొనేవారు. ప్రతి నెలా తాము అవసరమైనంత సమయాన్ని లేదా ధనాన్ని వెచ్చించ

9. గృహస్థ భక్తులు - ఆర్థిక విషయాలు

లేరని వారికి తెలుసు; అందుకే నెలకు ఒకటి రెండుసార్లు సమావేశమై ముందుగానే ఆ విషయాల గురించి నిర్ణయాలు తీసుకొనేవారు.

10. భగవత్సాక్షాత్కారం కోసం యువభక్తులను నరేంద్రుడు ప్రేరేపించడం

ప్రతి పనీ క్రమబద్ధంగా సాగేటంత వరకు యువభక్తులలో అనేకులు కొద్ది కాలమైనా ఇళ్లకు వెళ్లలేదు. అనివార్య పరిస్థితులలో ఇళ్లకు వెళ్లవలసి వచ్చిన వారు, ఇంటికి వెళ్లి కొన్ని గంటలలోనే తిరిగి వచ్చేసేవారు. పైగా గురుదేవులు కోలుకునేటంత వరకు ఇంటికి రావడం సాధ్యం కాదని కబురు కూడా ఇంటికి పంపేవారు. యువభక్తుల తల్లితండ్రులు ఎవరూ ఈ విషయం తెలియగానే తక్షణమే ఆమోదించారని చెప్పడం అనవసరం. కాని వాళ్లు చేయగలిగింది మాత్రం ఏముంది? తమ బిడ్డల మెదళ్లు పాడైపోయాయని వారు అనుకొనేవారు. ప్రత్యక్షంగా ఈ విషయంలో తాము జోక్యం చేసుకొంటే మంచి జరగడానికి బదులు చెడే జరుగవచ్చునని వారికి తెలియకపోలేదు. కాబట్టి బిడ్డలను వారి దారిలోనే పోనిస్తూ నెమ్మదిగా పరోక్షంగా ఒత్తిడి, అనునయాలతో వారిని తమ దారిలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించసాగారు.

ఆ విధంగా గృహస్థ భక్తులూ, బ్రహ్మచారి భక్తులూ కలిసికట్టుగా, హృదయపూర్వకంగా దృఢసంకల్పంతో శ్రీరామకృష్ణుల సేవాదీక్షను పాటిస్తున్నందున అంతా సవ్యంగా సాగిపోవడం చూసి నరేంద్రుడు నిశ్చింతుడయ్యాడు. తన వ్యవహారం గురించి ఆలోచించడానికి అప్పుడతడికి సమయం చిక్కింది; ఒకటి రెండు రోజులు ఇంటికి వెళ్లివద్దామనుకొన్నాడు. మా అందరికీ ఆ విషయం తెలిపి రాత్రి పడుకోవడానికి వెళ్లాడు; కాని నిద్రపట్టలేదు. కాసేపట్లోనే లేచి కూర్చున్నాడు. గోపాల్, మాలో ఒకరిద్దరం మేలుకొని ఉండడం చూసి, ''రండి, తోటలో పచార్లుచేస్తూ పొగత్రాగివద్దాం'' అన్నాడు.

పచార్లు చేస్తూ అతడిలా చెప్పాడు: ''గురుదేవులు దుర్భరమైన రోగంతో బాధపడుతున్నారు. దేహాన్ని త్యజించడానికి ఆయన సంకల్పించుకోలేదని ఎవరు చెప్పగలరు? కాబట్టి సమయం ఉన్నప్పుడే వారిని సేవిస్తూ, జపధ్యాన సాధనలు అనుష్ఠిస్తూ ఆధ్యాత్మికంగా పురోగమిద్దాం. ఈ సదవకాశాన్ని జారవిడిస్తే, ఆయన పోయిన తరువాత మనం పడే పశ్చాత్తాపానికి అంతువుండదు. కోర్కెలన్నీ ఈడేరిన తదుపరి భగవంతుణ్ణి ప్రార్థించడమా! ఇప్పుడు మన సమయమంతా ఇలాగే గడచిపోవడం లేదా? నానాటికీ మనం ఈ కోర్కెల వలలో చిక్కుకోవడం లేదా? ఈ కోర్కెలే ఎట్టకేలకు మన వినాశనానికీ, చావుకూ దారితీస్తాయి. కనుక కోర్కెలను త్యజిద్దాం; అవును, వాటన్నిటిని ఆమూలాగ్రం త్యజించివేద్దాం.''

పుష్యమాసపు చలిరాత్రి మహానిశ్శబ్దంలో కునుకులు పడుతున్నది. అనంత వినీలాకాశం నక్షత్రాలనే కన్నులతో ఈ భూతలాన్ని నిశ్చలంగా వీక్షిస్తూ న్నది. ప్రచండ సూర్యకిరణాల కారణాన ఎండిపోయిన చెట్ల క్రింద పరిశుభ్రంగా కూర్చోవడానికి అనువుగా ఉంది. అనాసక్త వైరాగ్యపూరితమై ధ్యానసిద్ధమైన నరేం ద్రుని మనస్సుకు బాహ్య నిశ్శబ్దం తనలోతాను లీనమైపోతున్నట్లు అనిపిం చింది. ఇక నడక ఆపి ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు. కాస్త దూరంలో ఎండిన గడ్డి, విరిగిన చెట్లకొమ్మల గుట్టను చూశాడు. అప్పు డతడు ఇలా అన్నాడు: ''వాటిని మండించండి. సాధువులు ఈ సమయంలో చెట్ల క్రింద ధునిని రగుల్చుతారు. మనం కూడా ధునిని రగిలించి, దాన్లో మన కోర్కెలను దగ్ధం చేసివేద్దాం.'' అట్లే ధునిని రగిలించారు. అన్ని పక్కల పడివున్న ఎండుగడ్డి, పుల్లలను ఏరి మేం వాటిని అగ్నిలో పడేస్తూ మా హృదయాలలోని కోర్కెల నన్నిటినీ ఆహుతిస్తూన్నట్లుగా ఎంచి, పరమానందం పొందసాగాం.

11. యువభక్తులు ధునిలో కోర్కెలను దగ్ధం చేయడం

మా లౌకిక వాంఛలన్నీ దగ్ధమై, మా మనస్సులలో ప్రశాంతత పావ నత్వాలు ఇనుమడించినట్లు, భగవంతుని సమీపిస్తున్నట్లు మేం భావించసాగాం. 'అయ్యో, ఇంతకు మునుపే మేం ఎందుకు ఈ పని చేయలేదు? ఇది ఎంత ఆనందాన్ని కలిగించిందోగదా!' అని అనుకున్నాం. వీలున్నప్పుడల్లా ఇలా ధును లను రగిలించాలని సంకల్పించుకొన్నాం. రెండు మూడు గంటలు అలా గడిచి పోయాయి; ఎండుకట్టెలు అయిపోయిన తరువాత, మంటను ఆర్పి వెళ్లి పడు కొన్నాం. అప్పుడు సమయం వేకువజాము నాలుగు గంటలు. ఉదయం లేచిన తరువాత ఈ ధుని కార్యక్రమంలో పాలుపంచుకోలేకపోయిన మా మిత్రులు ఎంతో విచారపడ్డారు. తమను పిలువనందుకు ఎంతో నొచ్చుకొన్నారు. వాళ్లను అనునయిస్తున్న ధోరణిలో, నరేంద్రుడు ఇలా అన్నాడు: ''ముందుగా అను కొని అలా చేయలేదు. అంత ఆనందం కలుగుతుందని ముందుగానే ఎవరు ఊహించారు? ఇకమీదట వీలున్నప్పుడల్లా మనం అంతా కలిసి ధునిని రగి లించి, ధ్యానం చేద్దాం. కనుక విచారించకండి.''

అనుకొన్న ప్రకారం ప్రొద్దుటే నరేంద్రుడు కలకత్తాకు వెళ్లాడు; ఒక రోజు అక్కడ గడిపి కొన్ని న్యాయశాస్త్ర పుస్తకాలు పుచ్చుకొని కాశీపూర్‌కు తిరిగి వచ్చేశాడు.

13.iii. శ్రీరామకృష్ణుల ఆత్మవ్యక్తీకరణ - అభయ ప్రదానం

1. డాక్టర్ రాజేంద్ర చికిత్సలో గురుదేవుల ఆరోగ్యం కించిత్తు మెరుగుపడడం

కాశీపూర్‌కు వచ్చిన తరువాత శ్రీరామకృష్ణులు ఒకసారి క్రిందికి దిగివచ్చి, కాసేపు తోటలో పచార్లు చేశారు. బలహీనత కారణం తరువాత పదిహేను రోజుల దాకా మళ్లీ క్రిందికి దిగి రాలేదు. ఆ సమయంలో చికిత్సలో ఎలాంటి మార్పు చేయకపోయినా, డాక్టర్ మాత్రం మారాడు. బాగ్ బజార్‌కు చెందిన సంపన్న, విఖ్యాత అక్రూర్ దత్త కుటుంబంలో డాక్టర్ రాజేంద్రనాథ దత్త జన్మించాడు. అతడు ఎంతో వ్యయప్రయాసలకోర్చి హోమియోపతి వైద్యం అధ్యయనం చేసి, కలకత్తాలో హోమియోపతి వైద్య విధానాన్ని ప్రచారం చేశాడు. డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ హోమియోపతి వైద్య ప్రభావ సామర్థ్యాల పట్ల నమ్మకం పొంది, ఆ వైద్య విధానాన్ని పాటించాడు.

లోకుల ద్వారా శ్రీరామకృష్ణుల వ్యాధి గురించి డాక్టర్ రాజేంద్ర విన్నాడు. తాను కనుక ఆయన వ్యాధిని నయం చేయగలిగితే, హోమియోపతి వైద్య విధానం ఖ్యాతి గాంచుతుందని అతడు గ్రహించాడు; ఎంతో యోచించి ఆ వ్యాధికి ఒక మందును ఎంపిక చేశాడు. గిరీష్ తమ్ముడైన అతుల్‌తో రాజేంద్రకు పరిచయం వుంది. ఈ సమయంలోనే అతడు అతుల్‌ను ఎక్కడో కలుసుకొని గురుదేవుల వ్యాధి గురించి ప్రస్తావించి ఉంటాడని మాకు గుర్తు. తరువాత గురుదేవులకు చికిత్స చేయాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేస్తూ అతుల్‌తో ఇలా అన్నాడు: ''దీర్ఘాలోచనానంతరం ఒక ఔషధాన్ని ఎంపిక చేశానని (డాక్టర్) మహేంద్రతో చెప్పండి. ఇది సత్ఫలితాన్ని ఇస్తుందని

ఆశిస్తున్నాను. అతడికి ఎలాంటి అభ్యంతరం లేకుంటే ఈ ఔషధాన్ని ఒకసారి ప్రయత్నించి చూస్తాను.'' అతుల్ ఈ విషయాన్ని భక్తులకూ, డ్యాక్టర్ మహేంద్రలాల్ సర్కార్‌కూ తెలియచేశాడు. ఎవరూ అభ్యంతరం వెలిబుచ్చక పోవడంతో, డ్యాక్టర్ రాజేంద్ర, గురుదేవులను పరీక్షించడానికి వచ్చాడు. వ్యాధి ఆద్యంతాల వివరాలన్నీ సావధానంగా విని అతడు 'లైకోపోడియం 200' అనే ఔషధాన్ని వాడమని ఇచ్చాడు. ఆ ఔషధం పుచ్చుకొన్నాక దాదాపు పదిహేను రోజుల పైబడి శ్రీరామకృష్ణుల ఆరోగ్యంలో మెరుగు కానవచ్చింది. దాంతో త్వరలోనే ఆయన బలాన్ని, ఆరోగ్యాన్ని పుంజుకోగలరని భక్తులు ఆశించారు.

2. శ్రీరామకృష్ణుల ఆత్మవ్యక్తీకరణ - అభయ ప్రదానం

పుష్యమాసంలో సగం గడిచిపోయింది. అది 1886 వ సంవత్సరం జనవరి ఒకటవ తేదీ. ఈ రోజు శ్రీరామకృష్ణులకు ఒంట్లో కొంత కులాసాగానే ఉంది. గదిలో నుండి బయటకు వచ్చి, తోటలో కాసేపు పచార్లు చేయాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. నాడు సెలవు దినం కావడంతో గృహస్థ భక్తులు మధ్యాహ్నం తరువాత ఒక్కరొక్కరుగా, జట్లుగా రాసాగారు.

మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీరామకృష్ణులు క్రిందికి దిగివచ్చేసరికి ముప్పై మందికి పైగానే భక్తులు వచ్చి ఇంట్లోను, బయట చెట్లక్రింద మాట్లాడు కొంటూ కనిపించారు. ఆయనను చూడగానే వారంతా గౌరవపురస్సరంగా లేచి, ఆయనకు ప్రణామాలు చేశారు. ఆయన తోటబాట మీద మెల్లగా నడుస్తూ దక్షిణ ద్వారం వైపుగా వెళ్లసాగారు; భక్తులు కాస్త దూరంలో ఆయనను అనుసరించారు. ఆయన దారి మధ్యకు వచ్చేసరికి చెట్ల క్రింద కూర్చుని మాట్లాడుకొంటున్న గిరీష్, రాం, అతుల్, మరి కొందరు కనిపించారు. ఆయనను చూడగానే వారు ప్రణామాలర్పించి ఆనందంగా ఆయన వద్దకు వచ్చారు.

హఠాత్తుగా శ్రీరామకృష్ణులు, గిరీష్‌ను సంబోధిస్తూ ఇలా అన్నారు: ''గిరీష్, ప్రతి ఒక్కరితోను ఎక్కడంటే అక్కడ దీనిని (తమను) గురించి (అవతారమని) చెబుతున్నావని తెలిసింది. అలా చెప్పడానికి (తమలో) ఏం చూశావు, ఏం అవగతం చేసుకొన్నావు?'' ఆ మాటలు విని గిరీష్ ఏమాత్రం చలించకుండా, శ్రీరామకృష్ణుల పాదాలకు మోకరిల్లి, చేతులు జోడించి, ముఖాన్ని పైకెత్తి, గద్గదస్వనంలో, ''ఎవరి మహత్వాన్ని వ్యాసవాల్మీకాదులు సైతం వర్ణించలేరో, అటువంటి వారిని గురించి మరేం చెప్పగలను?'' అని అన్నాడు.

భక్తిప్రపత్తులు ఉట్టిపడే గిరీష్ పలుకులు విని, శ్రీరామకృష్ణులు ముగ్ధులై, అక్కడ గుమిగూడిన భక్తులందరిని ఆశీర్వదిస్తూ, ''ఇంకా చెప్పడానికేముంది? మీ అందరిలో ఆధ్యాత్మిక జాగృతం కలుగుగాక!'' అని అన్నారు. అలా అంటూ, భక్తుల పట్ల కృపాళువులైన శ్రీరామకృష్ణులు భావసమాధిమగ్ను లైనారు.

స్వార్థగంధరహితమైన ఆ గంభీర ఆశీర్వచనాలు ప్రతి భక్తుని హృద యంలో సూటిగా ప్రవేశించి వారిని ఆనందంలో ముంచెత్తివేశాయి. వారు దేశకాలాలను మరచిపోయారు; గురుదేవుల వ్యాధిని మరచిపోయారు; కోలు కోనంత వరకు ఆయనను తాకరాదనే తమ నిర్ణయాన్ని విస్మరించారు; తన పైటకొంగు కప్పి బిడ్డను పరిరక్షించే మాతృమూర్తిలా తమ క్లేశాలను చూసి ఆ కష్టాలు తానే అనుభవిస్తున్నట్లు బాధపడుతూన్నట్లు భావించి కరుణించిన ఓ అద్భుత దేవతామూర్తి స్వర్గం నుండి దిగివచ్చి తమను ఆప్యాయంగా దగ్గరకు తీసుకొంటున్న ప్రత్యక్షానుభూతిని వారు పొందారు. అప్పుడు అందరూ ముందుకు వెళ్లి ఆయనకు మ్రొక్కి, ఆయన పాదధూళి స్వీకరింప ఉబలాట పడ్డారు. దిక్కులు పిక్కటిల్లేలా 'జై రామకృష్ణ' అనే జయజయధ్వానాలు చేస్తూ ప్రతి భక్తుడూ ఒకరి తరువాత ఒకరుగా ఆయనకు ప్రణమిల్లసాగారు. వారు అలా ప్రణమిల్లుతూండగా శ్రీరామకృష్ణుల కరుణాబ్ధి నాడు పొంగిపొరలి ఒక అద్భుత సంఘటనకు దారితీసింది. దక్షిణేశ్వరంలో వసిస్తున్నప్పుడు కరుణతో, అనుగ్రహంతో దివ్య అర్ధభావావస్థలో తన్మయులై కొందరు భక్తులను అమోఘ మైన స్పర్శతో ఆశీర్వదించడం దాదాపు నిత్యం చూసేవారం. ఈ రోజు అదే దివ్యభావావస్థలో కాశీపూర్ ఉద్యాన గృహంలో సమావేశమైన భక్తుల నందరినీ స్పృశించసాగారు. గురుదేవులు అలా ప్రవర్తించడంతో భక్తులు పొందిన ఆనం దానికి అవధులు లేకపోయాయని వేరేగా చెప్పనవసరం లేదు. ఇటుపైన తమ దివ్యత్వాన్ని తమ (భక్తుల) నుండి గాని లేదా లోకుల నుండిగాని దాచిపెట్టరని భక్తులు భావించారు. పాపులు, ఆర్తులు, దీనులు - ఒక్కరేమిటి సర్వులూ గురుదేవుల ఆ దివ్యపాదాబ్జాలను ఆశ్రయిస్తే అభయం పొందగలరని ఎన్నో లోటుపాట్లు, లౌకికత, అసమర్థత ఉన్నప్పటికీ కూడా ఆ భక్తులకు సందేహా తీతంగా అవగతమైపోయింది.

ఆ దివ్య ఘటన తమ కళ్లముందు అలా జరగడం చూసి మాటా పలుకూలేక మంత్రముగ్ధుల్లా తదేక దృష్టితో గురుదేవులనే చూడసాగారు కొందరు భక్తులు. మరికొందరు ఇంట్లో ఉన్నవారి నందరినీ చప్పున వచ్చి

ఆయన అనుగ్రహం పొందమని కేకలు పెట్టారు. ఇంకొందరు పువ్వులు సేకరించి మంత్రోచ్చాటనతో ఆయన పాదాలను అర్చించసాగారు.

త్వరలోనే గురుదేవుల భావసమాధి భంగమైంది. భక్తులు కూడా మామూలు స్థితిలోకి వచ్చారు. ఆ విధంగా నాడు ఉద్యానంలో పచార్లు పూర్తిచేసుకొని శ్రీరామకృష్ణులు ఇంట్లోకి వెళ్లి తమ గదిలో కూర్చున్నారు.

3. శ్రీరామకృష్ణులు కల్పతరువే అయినారు?

రాంచంద్ర దత్త ఇత్యాదులు ఆనాటి సంఘటనను శ్రీరామకృష్ణులు 'కల్పతరువు'గా మారడమని అభివర్ణించారు. కాని దీనిని శ్రీరామకృష్ణుల 'ఆత్మ వ్యక్తీకరణ' అనిగాని లేదా 'అభయ ప్రదానం' అనిగాని అభివర్ణించడమే సముచితంగా మాకు తోస్తున్నది.

మంచి చెడు అన్న విచక్షణ పాటించక కోరిన వారికి కోరినదల్లా కల్పవృక్షం ఇస్తుందంటారు. కాని గురుదేవులు అంతకంటే ఎక్కువే ఇచ్చారు. ఆనాటి సంఘటన ద్వారా తాము మానవరూపంలోని దేవుడనే సత్యాన్ని స్పష్టం చేసి, ఏ తారతమ్యం లేకుండా అందరికీ తమ ఆశ్రయాన్ని ఒసగి, అభయ ప్రదానం చేశారు.

ఏది ఏమైనప్పటికీ నాడు గురుదేవుల అనుగ్రహం పొంది ధన్యులైనవారిలో హరన్‌చంద్ర దాస్‌ను ప్రత్యేకంగా పేర్కొనాలి. ఎందుకంటే, అతడు మ్రొక్క గానే భావసమాధిలోని శ్రీరామకృష్ణులు తమ పాదాన్ని ఆతడి తలమీద ఉంచారు. అటువంటి అరుదైన అనుగ్రహాన్ని ఆయన ఎంతో అరుదుగా[1] చూపడం మేం చూసివున్నాం. రాంలాల్ ఛటోపాధ్యాయ కూడా ఆ సంద ర్భంలో అక్కడే ఉన్నాడు; అతడు కూడా ఆయన అనుగ్రహం పొందాడు. ఆ సంఘటన గురించి అతడు ఇలా చెప్పాడు: "అంతకు మునుపు ధ్యాన సమయంలో నా ఇష్టదేవతామూర్తిలో కొంత భాగాన్నే మనస్సులో చూడగలిగే వాణ్ణి. ఆయన పాదపద్మాలను చూడగలిగితే ముఖారవిందం కానవచ్చేది కాదు. ఒక్కొక్కప్పుడు శిరస్సు నుండి నడుం దాకా చూడగలిగినా, పాదాలు, కాన వచ్చేవి కావు. పైగా నేను చూస్తూన్నదంతా నిర్జీవంగానే కానవచ్చేది. కాని గురు దేవులు నాడు నన్ను స్పృశించగానే సర్వాంగసహితమైన నా ఇష్టదేవతామూర్తి హఠాత్తుగా నా హృత్కమలంలో దేదీప్యమానంగా ప్రసన్న దృక్కులతో కదలుతూ గోచరించింది."

---

1. బేలియాఘాటాకు చెందిన హరన్‌చంద్ర దాస్ ఫిన్లే మేయర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూవుండేవాడు. శ్రీరామకృష్ణులు అతడిపై విశేష అనుగ్రహం చూపిన నాటి జ్ఞాపకార్థంగా తన జీవిత కడపటి సంవత్సరాలలో ఏటేటా జనవరి 1వ తేదీ తన ఇంట్లో ఉత్సవం జరిపేవాడు.

4. ఆత్మ వ్యక్తీకరణ సమయంలో అక్కడ హాజరైవున్న వారు

ఆ రోజు ఆ సంఘటన జరిగిన స్థలంలో ఉన్న వ్యక్తులలో తొమ్మిది లేదా పదిమంది పేర్లు మాత్రమే మాకు జ్ఞాపకం. వారు : గిరీష్, అతుల్, రాం, నవగోపాల్, హరమోహన్, వైకుంఠ్, కిశోరి (రాయ్), హరన్, రాంలాల్, అక్షయ్. మహేంద్రనాథ్ (శ్రీరామకృష్ణ కథామృత గ్రంథకర్త) బహుశ ఉన్నట్లున్నారు. కాని గురుదేవుల భావి సన్న్యాస శిష్యులు ఒక్కరు కూడా ఆ సమయంలో అక్కడ ఉండలేకపోవడం ఎంతో ఆశ్చర్యం. గురుదేవుల సేవలోనూ, గతరాత్రి ఎన్నో గంటలసేపు కఠోర సాధనలలో నిమగ్నులై ఉండడం వలనా నరేంద్రుడు తదితరులు బాగా అలసిపోయి ఆ సందర్భంలో ఇంట్లో నిద్రపోతూన్నారు. లాటూ, శరత్ మేల్కొనే ఉండి శ్రీరామకృష్ణుల గదికి దక్షిణం వైపువున్న డాబామీద క్రింద తోటలో జరుగుతూన్నదంతా చూస్తున్నప్పటికీ వారు అక్కడకు బుద్ధిపూర్వకంగానే వెళ్లలేదు. ఎందుకంటే శ్రీరామకృష్ణులు తమ గది నుండి క్రిందికి దిగి వెళ్లగానే ఆయన దుస్తులను, పరుపు, దిళ్లను ఎండలోవేసి, గదిని శుభ్రపరచడంలో నిమగ్నులైనారు. పని పూర్తిచేయకుండా సగంలో విడిచిపెట్టిపోతే గురుదేవులకు అసౌకర్యం కలుగుతుందని వారు క్రిందికి వెళ్లదలచుకోలేదు.

5. ఆధ్యాత్మికానుభూతులు కలిగించమని గురుదేవులను వైకుంఠనాథ్ సతాయించడం

ఆ నాడు అక్కడున్న వారికి కలిగిన ఆధ్యాత్మికానుభూతులను గురించి చెప్పమని ఇతరులతోపాటు వైకుంఠనాథ్‌ను కూడా అడిగాం. వైకుంఠనాథ్ ఏం చెప్పాడో తెలిపి, ఈ అంశాన్ని ఇక్కడితో ముగిస్తాం.

శ్రీరామకృష్ణులను దాదాపు మేం కలుసుకొన్న కాలఘట్టంలోనే వైకుంఠనాథ్ కూడా ఆయనను కలుసుకొన్నాడు. అప్పటి నుండి శ్రీరామకృష్ణులు ఉపదేశాలిచ్చి ఆతడి జీవితాన్ని ఎలా తీర్చిదిద్దారో ఇంతకుమునుపే ప్రస్తావించివున్నాం. తదుపరి అతడికి మంత్రదీక్ష నిచ్చి అతణ్ణి ధన్యుణ్ణి చేశారు. అప్పటి నుండి వైకుంఠ్ శాయశక్తులా సాధనలు అనుష్ఠిస్తూ తన ఇష్టదైవ దర్శనం పొందడానికి ప్రయత్నించసాగాడు. శ్రీరామకృష్ణుల అనుగ్రహంతో తప్ప తన కోర్కె ఈడేరదని గ్రహించి అప్పుడప్పుడు ఆయనను దీనాతిదీనంగా - ముఖ్యంగా ఆయన వ్యాధిగ్రస్తులై మొదట కలకత్తాకు, పిదప కాశీపూర్‌కు వచ్చినప్పటి నుండి - ప్రార్థించసాగాడు. ఈ సమయంలో కూడా రెండు మూడు పర్యాయాలు తన కోర్కెను ఈడేర్చమని ఆయనను ఎంతో వినమ్రంగా అర్థించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు ప్రసన్నంగా నవ్వి, అతణ్ణి

అనునయిస్తూ, ''కాస్త ఆగు. ఈ రోగం కొంచెం నయంకానివ్వు. కావలసిన దంతా నేను చేసిపెడతాను'' అని అన్నారు.

ఆనాడు ఆ సంఘటన జరిగిన సమయంలో అక్కడ వైకుంఠనాథ్ ఉన్నాడు. శక్తిమంతమైన తమ అపూర్వ స్పర్శతో ఇద్దరు ముగ్గురు భక్తులను

6. శ్రీరామకృష్ణుల స్పర్శతో వైకుంఠ్‌లో జనించిన అనుభూతి

శ్రీరామకృష్ణులు ఆశీర్వదించిన పిదప వైకుంఠనాథ్ వచ్చి, ఆయన ముందు మోకరిల్లి, ''మహాశయా, నన్ను అనుగ్రహించండి'' అని ప్రార్థించాడు. అందుకు ఆయన, ''ఇంతకు మునుపే నీ కంతా ఇచ్చాను కదా!'' అని అన్నారు. ''అంతా ఇవ్వ బడిందని మీరు చెబుతున్నప్పుడు అది నిజం కాక తప్పదు. అయినా దాన్ని అవగతం చేసుకోగలిగేటట్లు నన్ను అనుగ్రహించండి'' అని వేడుకొన్నాడు వైకుంఠ్. ''సరే అలాగే కానివ్వు'' అంటూ గురుదేవులు అతడి ఛాతీని ఒక్క క్షణం మామూలు రీతిలో స్పృశించారు.

తత్ఫలితంగా తాను పొందిన అనుభూతిని వైకుంఠ్ ఇలా వర్ణించాడు: ''ఆయన అలా స్పృశించిన మరుక్షణంలో నా మనస్సులో గొప్ప విప్లవం చెల రేగింది. ప్రసన్న దరహాసంతో ప్రకాశిస్తూన్న గురుదేవులమూర్తి ఆకాశంలో, ఇళ్లలో, చెట్లలో, మనుషులలో, నేను చూస్తున్న ప్రతి దాన్లో నాకు కాన వచ్చింది. అప్పుడు నాలో ఉప్పొంగుతున్న సంతోషాన్ని ఎలా అదుపు చేసు కోవాలో అర్థంకాక, మీరు, శరత్, లాటూ డాబామీద నిలబడి ఉండడం చూసి, 'మీరెక్కడున్నారో అంతా వెంటనే రండి' అంటూ బిగ్గరగా పిలిచాను. ఆ మనోభావం, ఆ దివ్యదర్శనం జాగ్రదావస్థలో కొన్ని రోజుల దాకా అట్లే కొనసాగింది. అన్నింట్లోనూ అలా గురుదేవుల దివ్యదర్శనాన్ని చూసి ఆశ్చ ర్యంతో ముగ్ధుడనైపోయాను. కార్యాలయానికి లేదా పనిమీద మరెక్కడికి వెళ్లినా నాలో అదే స్థితి కొనసాగింది.

''చేయవలసిన పనిని సకాలంలో చేయలేకపోవడంతో అది వెనకపడ సాగింది. పని వెనకపడడం చూసి ఆ దర్శనాన్ని తాత్కాలికంగా మరచిపోవ

7. యోగ్యత సంత రించుకోకుండా ఉన్నత ఆధ్యాత్మికానుభూతులను నిలిపి ఉంచుకోవడం అసాధ్యం

డానికి ప్రయత్నించాను, కాని ఆ ప్రయత్నం విఫలమైంది. భగవంతుని విశ్వరూప దర్శనాన్ని చూసి, తట్టుకోలేక ఆ రూపాన్ని ఉపసంహరించుకోమని అర్జునుడు ఎందుకు ప్రార్థించాడో నా కిప్పుడు కించిత్తు అర్థమైంది. ముక్తపురు షులు సదాసర్వవేళల ఇటువంటి మహోన్నత స్థితిలోనే నెలకొని ఉంటారనే శాస్త్రవచనం జ్ఞాపకం వచ్చింది. ఈ అనుభవానంతరమే అట్టి మహోన్నత

స్థితిలో నెలకొని ఉండాలంటే మనస్సును ఏ మేరకు వాసనారహితంగా రూపొందించుకోవాలో నాకు అవగతమైంది.

''ఆ రకంగా కొద్ది రోజులు గడిచాయో లేదో అదే దివ్యదర్శనాన్ని చూస్తూ, అదే మానసిక స్థితిలో ఉండడం నాకు ఎంతో యాతనాకరంగా పరిణమించింది. 'నేను పిచ్చివాణ్ణి కావడం లేదుగదా!' అనే చింత పట్టుకొంది. అప్పుడు ఎంతో భయపడి గురుదేవులను, 'ప్రభో, నేను ఈ మానసిక స్థితిని తట్టుకోలేకపోతున్నాను. కరుణించి ఈ స్థితిని ఉపసంహరింప చేయండి' అని ప్రార్థించాను. ఇప్పుడు ఇలా ఆలోచిస్తున్నాను: 'మానవ దౌర్బల్యం మూర్ఖత్వం ఎంత దుర్భరమైనవి! నే నెందుకు అలా ప్రార్థించాను? ఆయన పట్ల నే నెందుకు ప్రగాఢ విశ్వాసం వహించలేకపోయాను? చివరకు ఏమయ్యేదో ఓపికగా ఎందుకు వేచి ఉండలేకపోయాను? మహా అయితే పిచ్చివాణ్ణి అయ్యేవాణ్ణి లేదా మరణించేవాణ్ణి, అంతేకదా!'

''కాని నే నలా ప్రార్థించిన మరుక్షణంలోనే దివ్యదర్శనం, ఆ నా మానసిక స్థితి అంతమైనాయి. ఏ మహాపురుషుడు వాటిని నాకు అనుగ్రహించాడో ఆయనే వాటిని ఉపసంహరించారని నా ప్రగాఢ నమ్మకం. కాని అవి ఆసాంతం తొలగిపోవాలనే ప్రార్థన నా మనస్సులో కలుగునందున, బహుశా ఆయనే కరుణించి వాటిని అనుభూతం చేసుకోగల కించిత్తు సామర్థ్యాన్ని నా మనస్సుకు ప్రసాదించి ఉంటారు. కాబట్టే దివ్యభావోద్దీప్తమైన గురుదేవుల మూర్తి రోజూ కొన్నిసార్లు హఠాత్తుగా నాకు కానవస్తూ నన్ను విస్మయుణ్ణి చేస్తూ, తరింప చేస్తూన్నది.''

అనుబంధం

కాళీమాత ఒడిలో ...

వీధిగాయకులు హఠాత్తుగా వస్తారు. ఆడతారు, పాడతారు. వచ్చినట్లే హఠాత్తుగా నిష్క్రమిస్తారు. వాళ్లు వచ్చినప్పుడూ వారిని ఎవరూ గుర్తించరు, నిష్క్రమిస్తున్నప్పుడూ వాళ్లు ఫలానా అని ఎవరికీ తెలియరాదు. - శ్రీరామకృష్ణులు

అవును. శ్రీరామకృష్ణుల మహోన్నత జీవితచరిత్రను చదువుతున్నప్పుడు ఇది యథాతథంగా రూఢీ అవుతుంది. ఆయన నేతృత్వంలో ఒక దివ్యగాయకుల బృందం వచ్చి ఆనందరాగంలో పాటలు పాడి వెళ్లినట్లుగా ఉంది. ఆ సుమధుర గీతాలను శారదానంద స్వామి కల్పతరువు రోజు వరకు, అంటే 1886వ సం॥ జనవరి 1వ తేదీ వరకు పొందుపరచి ఉన్నారు. ఆ పాటల ముగింపును, ఆ గాయకబృంద నేత మరణాన్ని తెలుసుకోగోరితే మనం ఇతర పుస్తకాలను చూడ వలసి వస్తుంది. గురుదేవుల గృహస్థ శిష్యులు కొందరు, ఆయనను దర్శించిన ఇతరులు కొందరు ఆయన జీవిత చరిత్రను రచించి ఉన్నారు. వాటి నుండి, రామకృష్ణ మిషన్ వెలువరించిన పలు పుస్తకాల నుండి సేకరించి, అనువదించి ఈ అనుబంధాన్ని పొందుపరచాం.

కాళీమాత అనుంగు పుత్రుడైన గురుదేవులు ఆమె ఒడిలో శాశ్వతంగా నిద్రించిన ఆ శోక వృత్తాంతాన్ని తెలుపడానికి మాత్రమే ఈ అనుబంధాన్ని పొందుపరచడం లేదు. నేడు లోకవ్యాప్తంగా విస్తృతించిన రామకృష్ణ మిషన్ అనే మహావృక్షపు బీజం దక్షిణేశ్వరంలో నాటబడినప్పటికీ, శ్యాంపుకూర్‌లోనూ కాశీపూర్‌లోనూ అది అంకురించిందని మనకు తెలుసు. అది ఎలా అంకురించిందో, కంచె వేసి దానిని పరిరక్షించే బాధ్యతను గురుదేవులు ఎలా నరేంద్రునికి అప్పగించారో ముఖ్యంగా తెలుసుకోవడానికే ఈ విభాగాన్ని మేం పొందుపరచాం.

జనవరి మొదటి తేదీ సంఘటనానంతరం గురుదేవుల ఒంట్లో మంట ఆరంభమైంది. గంగాజలాన్ని తెప్పించుకొని, తమపై ఆయన చిలకరించు కొన్నారు.

ఈ కాలఘట్టంలో నరేంద్రునిలో ఆధ్యాత్మిక దప్పిక మితిమీరింది. భగవదనుభూతి పొందడానికి ఆతడిలో ఆరాటం ఉధృతమైంది. జనవరి 1వ తేదీ నాడు ఆతడు గురుదేవుల వద్ద కెళ్లి, 'తమ అనుగ్రహం వలన అందరు ఏదోరకమైన ఉన్నత అనుభూతిని పొందారు. అనుభూతి పొంద నన్నూ అనుగ్రహించండి. అందరికీ లభించిన తరువాత నేను మాత్రం రిక్తహస్తునిగా ఉండిపోవాలా?' అని అడిగాడు. అందుకు గురుదేవులు, 'నీ కుటుంబానికి చేయవలసిన ఏర్పాట్లు చేసిన తరువాత నా వద్దకురా. అవునూ, ఇంతకూ నీకు ఏం కావాలి?' అని అడిగారు. ఆ మాటలు విని నరేంద్రుడు, 'నేను మూడు నాలుగు రోజులు అవిచ్ఛిన్న సమాధిలో మగ్నుడనై ఉండిపోవాలి. తినడానికి మాత్రమే బాహ్యస్మృతిలోకి రావాలి. అటువంటి ఒక స్థితిని అనుగ్రహించండి' అని అడిగాడు. వెంటనే శ్రీరామకృష్ణులు, 'సిగ్గుచేటు. నువ్వు ఒక మర్రి వృక్షంలా ఎదిగి, సంసార తాపంతో వాడిపోతున్న వేలాదిమందికి నీడనిస్తావని ఆశించాను. కాని నువ్వేమో స్వకీయ ముక్తిని కోరుతున్నావు. నువ్వు కోరిన స్థితికంటే ఉన్నతోన్నత స్థితి ఒకటి ఉంది. 'సర్వమూ నీవే' అని నువ్వే కదా పాడావు! నీ కుటుంబానికి కావలసిన ఏర్పాట్లు చేసి నా వద్దకు రా. సమాధికంటే ఉన్నతమైన స్థితిని నువ్వు పొందగలవు' అని అన్నారు.

మర్నాడు ఉదయం నరేంద్రుడు ఇంటికి వెళ్లాడు. పరీక్షలు దగ్గరపడు తున్నప్పటికీ చదవకుండా తిరుగాడుతున్నందుకు ఇంట్లోవారు అతణ్ణి మంద లించారు. నాయనమ్మ ఇంట్లోని తను చదువుకొంటున్న గదికి వెళ్లి, పుస్తకం తెరిచాడు. అంతే, చదవడం ఏదో ఒక భయంకరమైన పనిగా తోచి, చెప్పరాని భయం ఆతణ్ణి ఆవహించింది. అతడు చదవలేకపోయాడు. కుటుంబ పరి స్థితినిబట్టి చూస్తే చదివే తీరాలి; కాని చదవవద్దని ఆ భయం బెదరిస్తూన్నట్లు అతడికి తోచింది. చదవాలో వద్దో అనే సందిగ్ధంలో అతడు సతమత మయ్యాడు. ఏ నిర్ణయానికీ రాలేక, హృదయమే పగిలిపోయేలా విలపించాడు. ఇంతకు ముందెన్నడూ అతడు అలా విలపించి ఎరుగడు. ఆ తరువాత ఏం జరిగింది? ఆతడే ఇలా చెబుతున్నాడు: ''నా పుస్తకాలు వగైరాలను అక్కడే పడేసి, వెర్రివాడిలా గురుదేవులను వెతుక్కొంటూ కాశీపూర్‌కు పరుగెత్తాను. దారిలో చెప్పులు తెగిపోయి ఎక్కడో పడిపోయాయి. ఒక గడ్డివామికి గుద్దుకొని

ఒళ్లంతా గడ్డిపరకలు అంటుకొన్నాయి. ఒళ్లు తెలియకుండా పరుగెత్తాను. కాశీపూర్ వరకు పరుగెత్తుతూనే ఉన్నాను.''

జనవరి 4వ తేదీ ఉదయం తొమ్మిది గంటల సమయం. నిరంజన్, శశి, మహేంద్రనాథ్‌లు గురుదేవుల ప్రక్కన కూర్చునివున్నారు. వ్యాధి ప్రకోపించడంతో గురుదేవులు నొప్పితో ఎంతో బాధపడుతున్నారు. అప్పటికీ తమ చుట్టూవున్న వారితో హీనస్వరంలో నరేంద్రుణ్ణి గురించి ప్రస్తావించారు. ''నరేంద్రుడి ప్రస్తుత అద్భుతమైన స్థితిని పరికించండి. ఒక కాలఘట్టంలో ఆతడు సాకార భగవంతుణ్ణి ససేమిరా అంగీకరించ లేదు. ఇప్పుడు ఆ భగవంతుణ్ణే పొంద ఆరాటపడుతున్నాడు!'' తదనంతరం నరేంద్రుడు తన లక్ష్యాన్ని సత్వరమే పొందగలడని సూచనప్రాయంగా చెప్పారు.

గురుదేవుల ఉపదేశానుసారం నరేంద్రుడు పలు విధాలైన సాధనలు అనుష్ఠించాడు; వాటన్నిట్లోను అతడు విజయవంతుడవడంలో వింతేముంది! కాశీపూర్ రోజులలో శ్రీరామకృష్ణులు అతణ్ణి భవిష్యత్ కార్యానికి అనువుగా మలచారు. ఒక రోజు ఆయన నరేంద్రుణ్ణి పిలిచి, తక్కిన శిష్యులను చూపుతూ, 'వీరందరి బాధ్యతా నీ మీదే వదలిపెట్టి వెళుతున్నాను. వాళ్ల సాధనలు అనుష్ఠించేలా, ఇంటికి తిరిగిపోకుండా ఉండేలా చూసుకో' అని చెప్పారు. యువకు లందరికీ సన్న్యాస మార్గంలో పయనించేలా నెమ్మదిగా శిక్షణ గరిపారు. ఒక రోజు వాళ్లతో వీధుల వెంట వెళ్లి భిక్ష సేకరించుకొని రమ్మన్నారు. వారిలో పలువురు ఎంతో సంపన్నుల కుమారులు, ఐశ్వర్యంలో పుట్టి పెరిగినవారు. అయినప్పటికీ గురుదేవుల ఈ ఆదేశాన్ని పాటింప సంతోషంగా బయలుదేరారు. భిక్షగా సేకరించి తెచ్చిన బియ్యం, కూరగాయలను వండి గురుదేవుల వద్దకు తెచ్చారు. దాన్లోనుండి ఒకింత తీసుకొని తమ నోట్లో వేసుకొన్న గురుదేవులు, 'మంచిపని చేశారు. ఈ ఆహారం ఎంతో పవిత్రమైనది' అని చెప్పారు. ఆయన ఎంతో తృప్తి చెందారు.

నానాటికీ శ్రీరామకృష్ణుల గొంతునొప్పి భరించరానంత అధికరించ సాగింది. కాని ఆయనో మందహాసం చేస్తూ, హీనస్వరంలో, ''మనసా, నొప్పీ శరీరమూ పరస్పరం చూసుకొంటాయి. నువ్వు సదా ఆనందంలో మునిగి వుండు'' అన్నారు. మార్చి 14వ తేదీ రాత్రి మహేంద్రనాథ్‌తో, ''ఇదంతా ఆనందంగా భరిస్తున్నాను. లేకుంటే మీరంతా భోరున ఏడ్చేస్తారు. మీ రంతా, 'ఈ చిత్రవధ వద్దు, శరీరాన్ని త్యజించివేయండి' అని చెబితే, నేను ఆనందంతో ఈ దేహాన్ని త్యజిస్తాను'' అని అన్నారు.

మార్చ్ 15వ తేదీ సూర్యోదయ సమయంలో గిరీష్, డాక్టర్లయిన ఉపేంద్రుడు, కవిరాజ్ నవగోపాల్‌ను తోడ్కొని వచ్చాడు. వాళ్లు గురుదేవులను శారీరకంగా పరీక్షించి, ఔషధాలు ఇచ్చారు. అందువలన దేహపరిస్థితి కాస్త మెరుగు పడింది. తన ప్రక్కనున్న భక్తులతో, ''ఇది దేహానికి వచ్చిన రోగం, దేహం అంటూ ఉంటే రోగం తప్పక వస్తుంది. ఇది ప్రకృతి ధర్మం. ఈ దేహం సూక్ష్మాణువులతో రూపొందినట్లు నాకు కానవస్తూన్నది'' అని చెప్పారు. తరువాత గిరీష్ వైపు తిరిగి, ''నేను భగవంతుని అనేక రూపాలను గాంచుతున్నాను. దాన్లో ఇదీ (తాము) ఒకటై ఉంది'' అని చెప్పారు.

మార్చ్ 15వ తేదీ ఉదయం ఏడు గంటల సమయం. భక్తులతో హీన స్వరంలోను, కొన్ని సమయాలలో సైగతోను ఆయన మాట్లాడారు. నరేంద్రుడు, రాఖాల్, లాటు, పెద్దగోపాల్, మహేంద్రనాథ్ ('మ') మొదలైనవారు అప్పుడు అక్కడున్నారు.

శ్రీరామకృష్ణులు: నేను ఇప్పుడు ఏం చూస్తున్నానో తెలుసా? సమస్తమూ భగవంతుడే అయివున్నాడు. జీవరాసులన్నీ వేర్వేరు తోలు తిత్తుల మాదిరిగాను, భగవంతుడే వాటిలో ప్రవేశించి కాళ్లు చేతులు తలలను కదలిస్తూవున్నట్లు చూస్తున్నాను -

ఒకింత సేపట్లో ఆయన సమాధిమగ్నులైనారు. ఆ తరువాత కాస్త ఆహారం స్వీకరించి, ''ఇప్పుడు నాకు ఎలాంటి నొప్పి లేదు'' అని అన్నారు.

ఆ తరువాత భక్తులను ఆప్యాయంగా చూశారు. ఆయన కారుణ్యం వేలాది నదులలా పొంగిపొర్లి ప్రవహిస్తూన్నట్లు తోచింది. నరేంద్రుడు, రాఖాల్‌ల చెంపలను మాతృవాత్సల్యంతో నిమిరారు. కాసేపయ్యాక మహేంద్రనాథ్‌తో, ''ఇప్పుడు ఈ దేహానికి నయమై ఇంకా కొంతకాలం జీవింప అనుమతి లభిస్తే, అనేకులు ఆధ్యాత్మిక జాగృతం పొందుతారు'' అని అన్నారు.

కొంతసేపు మౌనం పాటించి ఇలా అన్నారు: ''కాని అది జరగదు. ఈసారి ఈ దేహం నిలవదు.''

రాఖాల్: మీ దేహం ఇంకా కొంతకాలం నిలిచేటట్లు కరుణించి భగవంతుని ప్రార్థించండి.

శ్రీరామకృష్ణులు: అది భగవదేచ్ఛ.

నరేంద్రుడు: మీ మనస్సూ, భగవంతుని సంకల్పమూ ఒక్కటే కదా!

శ్రీరామకృష్ణులు ఒకింతసేపు మౌనంగా ఉండిపోయారు. పిదప, ''అట్లే నేను ప్రార్థించినా ఏమీ జరగదు. నేనూ అమ్మా ఒక్కరమే అయినట్లు చూస్తున్నాను'' అని అన్నారు.

కాసేపయ్యాక మళ్లీ కొనసాగించారు: ''దీన్లో ఇద్దరు ఉన్నారు. ఒకరు అమ్మ. (కాసేపయ్యాక) అవును, ఒకరు ఆమె, మరొకరు ఆమె భక్తుడు. చెయ్యి విరిగిన వ్యక్తి[1], ఇప్పుడు వ్యాధిగ్రస్తుడూ భక్తుడే. మీకు అర్థమౌతున్నదా?''

భక్తులు మౌనంగా ఉండిపోయారు.

శ్రీరామకృష్ణులు: అయ్యో, ఇదంతా నే నెవరికి మొరపెట్టుకోగలను? ఎవరు నన్ను అర్థం చేసుకోగలరు? (కాసేపయ్యాక) భగవంతుడు మనిషిగా అవతరిస్తున్నాడు, భక్తులతోపాటు ఈ ఇలలోకి వస్తున్నాడు. ఆయన నిష్క్రమించేటప్పుడు భక్తులూ వెళ్లిపోతారు.

రాఖాల్: అందుకే మీరు మమ్మల్ని వదలిపెట్టి వెళ్లవద్దని బ్రతిమాలుకొంటున్నాం.

శ్రీరామకృష్ణులు చిన్నగా నవ్వి, ఇలా అన్నారు: ''వీధిగాయకులు హఠాత్తుగా వస్తారు. ఆడతారు, పాడతారు. వచ్చినట్లే హఠాత్తుగా నిష్క్రమిస్తారు. వాళ్లు వచ్చినప్పుడూ వారిని ఎవరూ గుర్తించరు, నిష్క్రమిస్తూన్నప్పుడు వాళ్లు ఫలానా అని ఎవరికీ తెలియరాదు.''

పలువురు వైద్యులు వచ్చి చికిత్స చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడం చూసి మాతృదేవి, దైవశక్తి మూలంగా శ్రీరామకృష్ణుల ప్రాణాలు కాపాడడానికి నిశ్చయించుకొంది. కోరిన వరం ప్రసాదించే తారకేశ్వర శివాలయానికి వెళ్లి తన భర్తను రక్షింప ఒక మార్గం లభించేవరకు ప్రాయోపవేశం పూని, దైవసన్నిధిలో ఉండిపోయింది. మొదటి రోజు గడిచిపోయింది. రెండవ రోజు పగటి వేళ గడిచిపోయింది. రాత్రయింది. ఆ రాత్రి అద్భుతమైన ఒక అనుభవం ఆమెకు కలిగింది. అసంఖ్యాక మట్టి కుండలను ఎవరో పగలగొట్టుతున్నట్లు ఒక శబ్దం వినవచ్చింది. ఆమెలో తీవ్రవైరాగ్యం జనించింది. 'ఈ లోకంలో బాంధవ్యం అంటే ఏమిటి? ఒట్టి కలే కదా!' అని ఆమె భావించింది. ఆమె కాశీపూర్‌కి తిరిగివచ్చేసింది. శ్రీరామకృష్ణులు ఆమెను చూడగానే, 'మంచిది, నువ్వెళ్లిన పని ఏమైంది?' అని అడిగారు. ఆమె జరిగింది పూసగుచ్చినట్లు చెప్పింది. అదే జవాబును ఆయన ఎదురుచూసినట్లుంది.

ఒక రోజు పెద్దగోపాల్ కొన్ని కాషాయ వస్త్రాలను, రుద్రాక్షమాలలను మూటగాకట్టి శ్రీరామకృష్ణుల వద్దకు తెచ్చాడు. వాటిని ఉత్తమ సన్న్యాసులకు

---

1. 1884వ సం॥ జనవరి మాసాంతాన సరుగుడు తోపుకు పోతూ, భావపారవశ్యస్థితిలో కంచె ప్రక్కన పడిపోయినందున శ్రీరామకృష్ణుల చేతి ఎముక తొలగి, బాగా దెబ్బ తగిలింది.

ఇవ్వగోరుతున్నట్లు చెప్పాడు. శ్రీరామకృష్ణులు తమ ముందున్న యువశిష్యులను చూపి, ''వీరికంటే ఉత్తములైన సన్న్యాసులు ఎవరూ ఉండరు. వీరికే వాటిని ఇవ్వు'' అని చెప్పారు. పెద్దగోపాల్ మూటను ఆయన ముందు పెట్టాడు. వాటిని భక్తులైన ఆ పన్నెండుమంది యువకులకు శ్రీరామకృష్ణులు అందించారు. ఒక కాషాయ వస్త్రమూ, ఒక రుద్రాక్ష మాలా మిగిలాయి. వాటిని గిరీష్ కోసం కేటాయించి ఉంచమన్నారు. ''వైరాగ్య మనస్తత్వంలో గిరీష్ ఈ యువకు లెవరికీ తీసిపోడు'' అని చెప్పారు. ఒక రోజు సాయంత్రం సన్న్యాసానికైనా క్రతువు ఒకటి చేయమని, ఊళ్లోకి వెళ్లి భిక్షమెత్తి రమ్మన్నారు. ఈ విధంగా శ్రీరామకృష్ణులు రామకృష్ణ సన్న్యాస సంఘాన్ని ప్రారంభించారు.

నరేంద్రుడు 'సత్యం' తెలుసుకోవడంలో ఎంతో అనురక్తుడై ఉన్నాడో, అందుకై రేయింబవళ్లు అతడు ఏ రకంగా శ్రమించాడో మునుపే చూసివున్నాం. ఒక రోజు సాయంత్రం అతడు ధ్యానం చేస్తూవున్నప్పుడు హఠాత్తుగా అతడికి ఆ అవస్థ కలిగింది. మొదట్లో ఆతడి తల వెనుక జ్యోతి కానవచ్చింది. పిదప అతడు మెల్లమెల్లగా తన ఉనికినీ, బాహ్యజగత్తు ఉనికినీ కోల్పోయి సమాధిలో మగ్నుడైపోయాడు. ఇంద్రియాలను, మనస్సును, లోకాలను అతిక్రమించి చైతన్యమయమైన నిర్వికల్పసమాధిలో మగ్నుడైనాడు. చాలాసేపయిన తరువాత సమాధి స్థితిలో నుండి దిగివచ్చాక ఆతడికి తల మాత్రం ఉన్నట్లుగా, తక్కిన దేహం లేనట్లుగా తోచింది. కాబట్టి, ''నా దేహం ఎక్కడ? దేహం ఎక్కడ?'' అంటూ కేకలుపెట్టాడు. ఆతడి కేకలు విని పరుగున వచ్చిన పెద్ద గోపాల్, ఆతడి దేహాన్ని చూపి, ''ఇదుగో ఉంది నరేన్, ఇదుగో ఉంది'' అని చెప్పాడు. గోపాల్ మాటలు అతడి చెవినపడినట్లు లేదు. ముందు మాదిరే కేకలు పెట్టాడు. భయపడ్డ గోపాల్ మేడమీదికి పరుగెత్తి శ్రీరామకృష్ణులకు విషయం తెలిపాడు. గోపాల్ చెప్పింది ప్రశాంతంగా విన్న శ్రీరామకృష్ణులు నవ్వుతూ, ''అదే స్థితిలో అతణ్ణి ఇంకా కొంతసేపు ఉండనివ్వు. ఈ స్థితికే అతడు చాలాకాలంగా నన్ను ఎంతో వేధిస్తున్నాడు'' అని అన్నారు.

పెద్దగోపాల్
(స్వామి అద్వైతానంద)

చాలాసేపు గడిచాక నరేంద్రుడు బాహ్యస్మృతిలోకి వచ్చాడు. కళ్లు తెరవ గానే తన చుట్టూ ఆందోళనతో కూర్చున్న సోదరశిష్యులు కనిపించారు. ఇంత కాలంగా ఆతడి మనస్సులో చెలరేగుతూవున్న తుపాను సమసిపోయింది, ప్రగాఢ శాంతి నెలకొంది. ఆ తరువాత శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్లాడు. ఆయన ఆనందంగా అతణ్ణి చూస్తూ, ''కాళీమాత ఇప్పుడు నీకు సమస్తం దర్శింపచేసింది. కాని ఈ అనుభవం తాత్కాలికంగా తాళం వేసి ఉంటుంది. దాని తాళం చెవి నా వద్దే ఉంటుంది. నువ్వు జగజ్జనని కార్యాలను నిర్వర్తించిన తరువాత ఈ నిధి మళ్లీ నీకు లభిస్తుంది; మళ్లీ సమస్తం నువ్వు అనుభూతం చేసుకొంటావు'' అని చెప్పారు.

ఈ రోజులలో జరిగిన ఒక సంఘటన మనస్సును కదలించివేస్తుంది. శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి ఎంత అమితంగా ప్రేమించారో విశదపరచడంతో పాటు, తమ భవిష్యత్తు, భవిష్యత్ కార్యాన్ని అతడికి అప్పగించిన వైనం తెలిపే ఒక ముఖ్య సంఘటన ఇది. గురుదేవులకు, ఆయనను సేవించేవారికి అయ్యే ఖర్చును గృహస్థ భక్తులు భరిస్తూవచ్చారని ఇంతకు మునుపే తెలిపివున్నాం. యువభక్తులు ఎక్కువ ఖర్చు చేస్తున్నారని గృహస్థ భక్తులు భావించారు. ఇది రెండు వర్గాల మధ్య మనస్తాపానికి దారితీసింది. అది క్రమంగా పెరిగి శత్రుత్వంగా మారబోతున్నప్పుడు నరేంద్రుడు ఈ విషయం శ్రీరామకృష్ణులకు తెలిపాడు. నరేంద్రుని విచారాన్ని చూసి ఆయన, ''ఓ, నా నరేన్, నీ భుజాల మీద నన్ను ఎక్కడకు తోడ్కొని వెళ్లినా, నే నక్కడకు వచ్చి వసిస్తాను'' అన్నారు ఆప్యాయం ఉట్టిపడే స్వరంలో.

ఏప్రెల్, మే, జూన్, జూలై నెలలు దొర్లిపోయాయి. శ్రీరామకృష్ణుల పరిస్థితి అంతకంతకూ దిగజారసాగింది. ఒక రోజు శ్రీరామకృష్ణులు, నరేంద్రునికి తమ ఇష్టమంత్రమైన రామనామంలో దీక్ష నొసగారు. నరేంద్రుడు ఆనంద పారవశ్యంలో తన్మయుడై, ''రామా, రామా'' అంటూ ఉచ్చరిస్తూ ఇంటిని పదేపదే చుట్టిచుట్టి రాసాగాడు. అతడి పారవశ్య స్థితిని చూసిన వారు, ఆతడిని సమీపించడానికే భయపడ్డారు. ''రామా, రామా'' అంటూ ఉచ్చరిస్తూ గంటల పర్యంతం ఆతడు చుట్టూ తిరిగిరావడం చూసి, శ్రీరామకృష్ణులకు ఆ విషయం తెలిపారు. శ్రీరామకృష్ణులు, ''అతణ్ణి ఆ స్థితిలోనే ఉండనివ్వండి. త్వరలోనే సరిపోతుంది'' అని అన్నారు. కొన్ని గంటల తరువాత క్రమంగా నరేంద్రుడు మామూలు స్థితిలోకి రాగలిగాడు.

దుర్గాచరణ్ నాగమహాశయుడు కాశీపూర్‌కు కొన్నిమార్లు వచ్చి శ్రీరామకృష్ణులను దర్శించాడు. శ్రీరామకృష్ణులంటే ఆతడికి వల్లమాలిన ప్రేమాభి



నాగమహాశయులు

మానాలుండేవి. ఆయన అనుభవిస్తున్న బాధను చూడలేక అతడు తరచు రావడంలేదు. ఒకసారి అతడు వచ్చినప్పుడు శ్రీరామకృష్ణులు అతణ్ణి తమ మంచం దగ్గరకు రమ్మన్నారు. ''ఇలా చూడు, దుర్గాచరణ్! ఈ వ్యాధిని నయం చేయడం తమకు అసాధ్యమని డాక్టర్లు పెదవివిరిచారు. నువ్వు నయం చేయగలవా?'' అని అడిగారు. నాగ మహాశయుడు కాసేపు తీవ్రంగా యోచించాడు. ఆ తరువాత శ్రీరామకృష్ణుల వ్యాధిని యోగశక్తి ద్వారా తన దేహంలోకి రప్పించుకోవాలనే నిర్ణయానికి వచ్చి, వినమ్రంగా, ''అవును, మీ వ్యాధిని ఎలా నయంచేయాలో నాకు తెలుసు. మీ అనుగ్రహంతో ఆ పనిని ఇప్పుడే చేసివేస్తాను'' అని చెప్పి, ఆయనను సమీపించాడు. శ్రీరామకృష్ణులు అతడి భావాన్ని గ్రహించారు. వెంటనే అతణ్ణి ప్రక్కకు త్రోసివేసి, ''నీకు సాధ్యమని నాకు తెలుసు. ఈ వ్యాధిని నువ్వు నయంచేయగలవు'' అని అన్నారు.

శ్రీరామకృష్ణులకు వచ్చిన వ్యాధి, అంటువ్యాధి అనే వదంతి వ్యాపించింది. దాంతో కొందరు ఆయనను సమీపించడానికీ, సేవలు చేయడానికీ సంకోచించారు. ఇది చూసి నరేంద్రుడు అందరినీ శ్రీరామకృష్ణుల గదిలో సమావేశపరిచాడు. ఆయన త్రాగి వదలివేసిన జావను అందరి సమక్షంలో త్రాగి, అది అంటువ్యాధి కాదని అందరికీ స్పష్టం చేశాడు.

ఒకసారి శ్రీరామకృష్ణులు ఒక కాగితం ముక్కమీద, ''జై రాధే ప్రేమమయీ, నరేన్ లోకానికి ఉపదేశిస్తాడు. ప్రతి చోటికీ వెళ్లి (సత్యాన్ని) ప్రచారం చేస్తాడు'' అని వ్రాసి చూపారు. దానికి తన నిరసనను సూచిస్తూ నరేంద్రుడు, ''అదంతా నాకు సాధ్యం కాదు'' అని చెప్పాడు. అందుకు శ్రీరామకృష్ణులు, ''నువ్వు చేసే తీరాలి'' అని నొక్కి చెప్పారు.

ఒకనాటి సాయంత్రం నిరంజన్ మొదలైన యువభక్తులు తోటలో ఒక మూలగా ఉన్న ఈతచెట్టు నుండి రసం త్రాగే నిమిత్తం ఆ చెట్టును సమీపించారు. ఆ సమయంలో శ్రీరామకృష్ణులు తమ పరుపుమీద పడుకొని



శ్రీరామకృష్ణులు వ్రాసి చూపింది

ఉన్నారు. కనీసం లేచి కూర్చోవడానికే ఆయనకు సాధ్యంకానంత బలహీనంగా ఉన్నారప్పుడు. హఠాత్తుగా ఆయన లేచి, క్రిందికి దిగి పరుగెత్తారు. మాతృదేవి యాదృచ్ఛికంగా ఆ దృశ్యం చూసింది. ఆయన అలా లేచి పరుగెత్తడం నమ్మలేక, ఎందుకైనా మంచిదని ఆయన గదిలోకి వెళ్ళి చూద్దామనుకొని, అక్కడకు వెళ్ళింది. అక్కడ ఆయన లేరు. అయితే కాసేపట్లోనే వచ్చి పడుకొన్నారు. అదంతా విస్మయంతో చూస్తూన్న మాతృదేవి, ఆయన వద్దకెళ్ళి విషయం ఏమిటని అడిగింది. తాము పడక నుండి లేచి వెళ్ళిన విషయమే ఖండిస్తూ, "నేను లేచి వెళ్ళడమా! అంతా నీ భ్రమే. వంటగదిలోనే సదా ఉండిపోయి నీ మెదడు వేడెక్కింది" అని చెప్పారు. కాని మాతృదేవి అంతటితో వదలిపెట్టలేదు. పట్టుబట్టి అడిగినప్పుడు, నిరంజనాదులు వెళ్ళిన చోటువద్ద ఉన్న ఈత చెట్టులో ఒక నాగుపాము పొంచి ఉన్నట్లూ, దాన్ని పారద్రోలడానికే తాము వెళ్ళినట్లూ ఆయన చెప్పారు. ఇటువంటి సంఘటనలకు ప్రాధాన్యం ఇవ్వరాదనే ఆయన మొదట్లో ఆ విషయం చెప్పడానికి నిరాకరించి ఉండవచ్చు.

రోజులు దొర్లిపోతున్నాయి. యోగీన్‌ను పిలిచి పంచాంగం పట్రమ్మన్నారు. ఆగస్టు 9వ తేదీనుండి వరుసగా తిథులను, నక్షత్రాలను వాటి ఫలాలను చదవమన్నారు. నెల చివరి రోజు రాగానే, ఇక చదవవద్దని సైగ చేశారు.

ఈ సంఘటన జరిగి నాలుగైదు రోజులు గడిచాయి. ఒక రోజు శ్రీరామకృష్ణులు, నరేంద్రుణ్ణి తమ ప్రక్కకు రమ్మని పిలిచారు. అప్పుడు గదిలో

ఎవరూ లేరు. వారిద్దరే ఉన్నారు. ఆయన నరేంద్రుణ్ణి తన ఎదుట కూర్చో మని, అతణ్ణి తదేకంగా చూస్తూ సమాధిమగ్నులైనారు. కాసేపట్లో నరేంద్రుడు తన దేహంలో విద్యుచ్ఛక్తి వంటి ఒక శక్తి ప్రసరించడం గుర్తించాడు. మెల్లమెల్లగా ఆతడు కూడా బాహ్యస్మృతిని కోల్పోయాడు. తాను ఎంతసేపు అలా సమాధి మగ్నుడై ఉండిపోయాడో అతడికి తెలియరాలేదు. బాహ్యస్మృతి కలిగి కళ్లు తెరచి చూసినప్పుడు శ్రీరామకృష్ణులు కన్నీటి ధారలలో మునిగి కూర్చుని ఉండడం కనిపించింది. నరేంద్రుడు అందుకు కారణ మేమిటని అడిగి నప్పుడు, ''నా సమస్తాన్నీ నేడు నీకు ధారాదత్తం చేసి నేను బికారినైపోయాను. ఈ శక్తుల మూలంగా నువ్వు లోకానికి ఎంతో మేలు చేయబోతావు. ఆ తరువాతే నువ్వు ఎక్కణ్ణుండి వచ్చావో అక్కడికే తిరిగిపోతావు'' అని చెప్పారు. ఈ విధంగా తమ శక్తులను నరేంద్రునికి ధారాదత్తం చేసినందున ఇద్దరూ ఏకాత్ములైపోయారు. ఈ అనుసంధానం మూలంగా లోకం పొందిన మేళ్లను ప్రస్తుత చరిత్ర చెప్పకనే చెబుతున్నది. రాబోయే చరిత్ర ఇంకా చెప్పవలసి ఉంది.

రెండు రోజులు గడిచిపోయాయి. తమను అవతారంగా శ్రీరామకృష్ణులు చెప్పడాన్ని పరీక్షించాలనే ఉద్దేశం నరేంద్రుడికి కలిగింది. నాడు ఎంతో బాధతో శ్రీరామకృష్ణులు అల్లల్లాడిపోతున్నారు. 'ఈ భరించరాని బాధలో సైతం ఆయన తమను అవతారపురుషులని వ్యక్తంచేసుకొంటే, ఆయన నిజంగానే అవ తారపురుషులని నమ్ముతాను' అని అనుకొన్నాడు నరేంద్రుడు. బాధతో త్రుళ్లి పోతూ పడుకొని ఉన్న శ్రీరామకృష్ణులు ఆ క్షణంలోనే తన శక్తినంతా కూడ దీసుకొని లేచి కూర్చుని స్పష్టంగా, ''నరేన్, మునుపు ఎవరు రాముడిగా కృష్ణు డిగా అవతరించారో, ఆయనే ప్రస్తుతం రామకృష్ణుడుగా ఈ దేహంలో నెలకొని ఉన్నాడు; కాని నీ వేదాంత ధోరణిలో కాదు'' అని అన్నారు. ఎన్నో దివ్యదర్శ నాలను, శక్తులను ఆయనలో దర్శించిన పిదప కూడా తనకు ఇంకా ఆ సందేహం నివృత్తి కానందున నరేంద్రుడు సిగ్గుపడ్డాడు, అవమానం చెందాడు.

ఆగస్టు 15వ తేది. ఏ రోజు రాకూడదని భక్తులు ఆశించారో, ఆ రోజు - భక్తులను దుఃఖసాగరంలో ముంచబోయే రోజు రానే వచ్చింది. ఆ రోజు ఆదివారం. శ్రీరామకృష్ణుల బాధ ఎంతో తీవ్రరూపం దాల్చింది. ఆయన నాడి సక్రమంగా కొట్టుకోవడం లేదు. నాడి చూడడంలో నిష్ణాతుడని ఎవరిని శ్రీరామకృష్ణులు ప్రశంసిస్తారో ఆ భక్తుడైన అతుల్ ఆయన నాడి పరీక్షించి, ఆయన పరిస్థితి బాగా దిగజారిపోయినట్లు గ్రహించాడు. చుట్టూవున్న వారితో, ఆయన ఇక బ్రతకడం కష్టమనీ, ఎంతో అప్రమత్తంగా ఉండమనీ చెప్పాడు.

సూర్యాస్తమానం కావడానికి ఇంకా కొద్దిసేపు మాత్రమే ఉంది. శ్రీరామ కృష్ణులు సరిగా ఊపిరి పీల్చుకోలేక పోతున్నారు. భారంగా ఊపిరి పీలుస్తు న్నారు. భక్తులు వెక్కి-వెక్కి ఏడ్వ సాగారు. తమ జీవితాలలో ఏ జ్యోతి ఆనందాన్ని నింపుతూ వస్తూ్తన్నదో అది ఆరిపోబోతున్నదని ఎరిగి అందరూ శ్రీరామకృష్ణుల చుట్టూ గుమిగూడారు. కాసేపయ్యాక శ్రీరామ కృష్ణులు ఆకలి వేస్తూ్తన్నదన్నారు. కొంచెం ద్రవాహారం ఇచ్చారు. కాని ఆయన మ్రింగలేకపోయారు. ఎంతో కష్టంమీదట ఒకింత పుచ్చుకోగలిగారు.

శశి
(స్వామి రామకృష్ణానంద)

నోరు తుడిచి, మెల్లగా ఆయనను పడుకోబెట్టారు. రెండు కాళ్లను చాపి, దిండు మీద పెట్టారు. ఇద్దరు విసరసాగారు. పడుకొన్న ఆయన కాసేపట్లో హఠాత్తుగా సమాధిమగ్నులైనారు. దేహం నిశ్చలంగా, శిలలా మారిపోయింది. ఊపిరి ఆగి పోయింది. ఇన్ని రోజులుగా రేయింబవళ్లు ప్రక్కనే ఉంటూ సేవలు చేస్తూ వచ్చిన శశికి ఈ సమాధిస్థితి, మామూలుగా ఆయనకు కలిగే సమాధ్యవస్థగా తోచలేదు. ఏదో గొప్పమార్పు వచ్చినట్లు కానరాగా, ఏడ్వనారంభించాడు. నరేంద్రుడు అందరితోను, ''హరి ఓం తత్సత్'' అని ఉచ్చరించమన్నాడు. చాలాసేపటి వరకు వారంతా అట్లే ఉచ్చరించారు. కలకత్తా నుండి గిరీష్‌ను, రాంచంద్రను తోడ్కొని రావడానికి మనుషులు పరుగెత్తారు.

అర్ధరాత్రి దాటాక శ్రీరామకృష్ణులకు బాహ్యస్మృతి వచ్చింది. ఎంతో ఆకలివేస్తూ్తన్నదన్నారు. పాయంపట్టి లేచికూర్చున్నారు. ఒక పాత్రనిండా జావ ఇచ్చారు. అందరూ ఆశ్చర్యపోయేలా ఆ జావను అంతా సులభంగా త్రాగి వేశారు. ఆయన ఇంత ఆహారం పుచ్చుకొని ఎన్నో రోజులయింది. ఆహారం పుచ్చుకొన్న తరువాత ఒంట్లో కాస్త బాగుందన్నారు. ఆయన నిద్రకు ఉపక్రమిస్తే బాగుంటుందని నరేంద్రుడన్నాడు. బాధ కారణం వలన ఎంతో హీనస్వరంలో మాట్లాడే ఆయన బిగ్గరగా, 'అమ్మ కాళీ' అంటూ మూడుసార్లు ఉచ్చరిం చారు. పిదప మెల్లగా పడుకొన్నారు. ఆ తరువాత నరేంద్రుడు విశ్రాంతికై క్రిందికి వెళ్లాడు.



‘శ్రీ గదాధర్ ఛటోపాధ్యాయ; కామార్పుకూర్ గ్రామం’ అన్న శ్రీరామకృష్ణుల వ్రాత

అప్పుడు రాత్రి ఒంటి గంట రెండు నిమిషాలు. మంచం మీద పడుకొనివున్న శ్రీరామకృష్ణుల ఒంట్లో హఠాత్తుగా పారవశ్యం కలిగింది. రోమాంచమైంది. దృష్టి నాసికాగ్రంలో నిలిచింది. పెదవులపై చిరునవ్వు వికసించింది. శ్రీరామకృష్ణులు సమాధిమగ్నులైనారు. ఇది ఇంతకాలంగా ఆయన మునిగి తేలుతూ వచ్చిన మామూలు సమాధి కాదు, మహాసమాధి; కాళీమాత ఒడిలో ఆమె అనుంగు పుత్రుడు శాశ్వతంగా లీనమైపోయిన ప్రగాఢ సమాధి! ఈ సమాధి అనంతరం ఆయన ప్రాణం దేహంలోకి తిరిగి రాలేదు. అది 1886వ సం॥ ఆగస్టు 16వ తేది.

కొంతసేపట్లో గిరీష్, రాంచంద్రలు వచ్చారు. ఈ శోకవార్త కలకత్తా అంతటా వ్యాపించింది. ఉదయం కెప్టెన్ విశ్వనాథ్ వచ్చాడు. అతడు శ్రీరామకృష్ణుల దేహం చూసి, ‘‘దేహంలో కొంత వేడి ఉంది’’ అని చెప్పి, వెన్నముకను బాగా తోమాడు. ఇంకా అంతా ముగిసిపోలేదు, శ్రీరామకృష్ణులు సమాధి స్థితిలోనే ఉన్నారనీ, అంత్యక్రియలు వెంటనే ప్రారంభించవద్దనీ చెప్పాడు.

ఆ తరువాత డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ వచ్చాడు. శ్రీరామకృష్ణుల శరీరాన్ని నిశితంగా పరీక్షించి ప్రాణం పోయిందని తేల్చిచెప్పాడు.

వార్త తెలియగానే మాతృదేవి. గురుదేవుల పడక వద్దకు పరుగున వచ్చి, ‘‘అమ్మా, కాళీ, నువ్వు ఎక్కడి వెళ్ళిపోయావు?’’ అంటూ విలపించింది. ఆ దృశ్యం చూసి అందరి హృదయాలు ద్రవించిపోయాయి. ఆమెను క్రిందికి తోడ్కొనివచ్చారు. నాటి సాయంత్రం మాతృదేవి తన సుమంగళీ రూపాన్ని చెరిపివేయడం కోసం తాను ధరించివున్న బంగారు గాజులను తీసివేయ ప్రయత్నించింది. అప్పుడు ఆమె ముందు శ్రీరామకృష్ణులు కనిపించి, ‘‘నేను ఎక్కడకు వెళ్ళిపోయాను? ఇదుగో ఇక్కడే ఉన్నాను. ఒక గదిలో నుండి మరొక

తారక్
(స్వామి శివానంద)

గంగాధర్
(స్వామి అఖండానంద)



హరి
(స్వామి తురీయానంద)

హరిప్రసన్న
(స్వామి విజ్ఞానానంద)

సుబోధ్
(స్వామి సుబోధానంద)

కాళీ
(స్వామి అభేదానంద)

శారదా ప్రసన్న
(స్వామి త్రిగుణాతీతానంద)

గదిలోకిపోయాను, అంతే'' అని చెప్పి, మాతృదేవి వితంతురూపం దాల్చ కుండా ఆపారు. తదనంతర కాలంలో రెండుసార్లు మాతృదేవి గాజులు తీసి వేయ ప్రయత్నించినప్పుడు, శ్రీరామకృష్ణులు కనిపించి ఆ విధంగానే ఆ ప్రయ త్నాన్ని ఆపించారు. ఆ తరువాత మాతృదేవి జీవిత పర్యంతం గాజులు తీసి వేయకుండానే సుమంగళీరూపంలోనే జీవించింది.

ఆగస్టు 16వ తేది సాయంత్రం ఐదుగంటలు. శ్రీరామకృష్ణుల పావన దేహాన్ని మేడమీద నుండి క్రింది తీసుకువచ్చి, మంచంమీద ఉంచారు. కాషాయ వస్త్రంతో ఆచ్ఛాదింపబడి, చందనపుష్పాలతో అలంకరింపబడింది. 6 గంటలకు కాశీపూర్ శ్మశానవాటికకు భక్తిపాటలు పాడుతూ గురుదేవుల భౌతిక కాయాన్ని తీసుకువెళ్లారు. శ్మశానానికి వెళ్లగానే అక్కడ పేర్చబడివున్న చితిమీద ఉంచారు. త్రైలోక్యనాథ్ సన్యాల్ మనస్సును ద్రవింపచేసే పాటలు కొన్ని పాడాడు. చితికి కొరివి అంటించారు. రెండు గంటల లోపే అంతా ముగిసిపోయింది.

భక్తుల మనస్సులలో ఒక గంభీర ప్రశాంతత నెలకొంది. వారి శోకతప్త హృదయాలు ఊరడిల్లాయి; 'గురుదేవులు నిష్క్రమించలేదు. మా ఆత్మల లోనే సంలీనమైపోయారు' అనే ప్రగాఢనమ్మకం వారిలో కలిగింది. శ్రీరామ కృష్ణుల పావన చితాభస్మాన్ని ఒక కలశంలో సేకరించి, వేలాది మధుర జ్ఞాప కాలు పొంగిపొర్లగా 'జై శ్రీరామకృష్ణ!' అంటూ ఉచ్చరిస్తూ కాశీపూర్ ఇంటికి తిరిగివచ్చారు.

శ్రీరామకృష్ణుల అస్థులను ఎక్కడ ఉంచి ఆరాధించాలి అన్న పెద్ద ప్రశ్న అప్పుడు తలెత్తింది. తర్జనభర్జనానంతరం కలకత్తాకు వెలుపల ఉన్న కాంకూర్ గాఛి అనే చోట రామచంద్రకు సొంతమైన తోటలో ఉంచి, దేవాలయం నిర్మింప గృహస్థ భక్తులు నిశ్చయించారు. శ్రీరామకృష్ణులు ఒక సందర్భంలో ఈ తోటకు వచ్చివుండడం వారి ఆ నిర్ణయానికి ఒక కారణమైంది. కాని శ్రీరామ కృష్ణుల సన్న్యాస భక్తులు ఈ ప్రతిపాదనను అంగీకరించలేదు. వారు అస్థులలో అత్యధిక భాగం బలరాం ఇంటికి పంపి, అక్కడ సక్రమంగా ఆరాధించేలా చేశారు. భవిష్యత్‌కాలంలో గంగాతీరాన స్థలం కొనుగోలుచేసి అక్కడ శ్రీరామ కృష్ణుల ఆలయం నిర్మించాలన్నది వారి అభిప్రాయం. మిగిలిన అస్థులను శ్రీకృష్ణ జయంతి నాడు కాంకూర్‌గాఛికి తీసుకువెళ్లారు. శశి ఈ అస్థికల కలశాన్ని తలమీద మోసుకొంటూ వెళ్లాడు. సన్న్యాస శిష్యులందరూ, భక్తులూ కూడా వెళ్లారు. కాంకూర్‌గాఛిలో అస్థుల నుంచి, ఆలయం నిర్మించి, సక్రమంగా అను నిత్యం పూజాదికాలు నిర్వర్తించేలా రాం ఏర్పాట్లు చేశాడు.

శ్రీరామకృష్ణులు జీవించి ఉన్నప్పుడు కొందరు శిష్యులు, నిరంతరం ఆయనతోనే కాశీపూర్ ఇంట్లోనే ఉండిపోయారు. ఇప్పుడు ఇంటి అద్దె ఇచ్చుకో లేని పరిస్థితిలో ఎక్కడకు పోవాలో వారికి అర్థంకాలేదు. గృహస్థ భక్తులు వారి కోసం ధనం వెచ్చించడానికి సిద్ధంగాలేరు. వారిని తమ ఇళ్లకు తిరిగి వెళ్లిపోయి చదువు కొనసాగించి, చక్కని భక్తులుగా జీవించమని కొందరు గృహస్థ భక్తులు ఉపదేశించారు. కాని మూర్తీభవించిన సన్న్యాసిగా జీవించిన శ్రీరామకృష్ణుల వద్ద శిక్షణ పొందిన ఆ యువశిష్యుల మనస్సులు మళ్లీ లౌకిక జీవితాన్ని అభిలషించ లేదు. ఆ సమయంలో శ్రీరామకృష్ణుల భక్తుడైన సురేంద్రనాథ్ మిత్ర వారికి తోడుగా నిలిచాడు. అతడు నరేంద్రునితో, ''నరేన్, మీ రంతా ఎక్కడకు పోతారు? ఒక ఇంటిని అద్దెకు తీసుకొని అక్కడ ఉండండి. లౌకిక క్లేశాలలో వాడిపోతున్న మేమూ అప్పుడప్పుడు అక్కడకు వస్తాం; మా దుఃఖాలను బాపే ఒక శరణాలయంగా ఆ ఇల్లు ఉంటుంది. శ్రీరామకృష్ణుల ఖర్చులకై నేను ఏదో నా శక్తిమేరకు కొంత ఇస్తూవచ్చాను. దాన్ని ఇకమీదట మీకు ఇస్తాను'' అని అన్నాడు. ఆతడి సహాయంతో వరాహనగర్ అనే పేటలో పాడుబడ్డ ఇంటిని అద్దెకు కుదుర్చుకొన్నారు. దాన్లో బసచేస్తూ, శ్రీరామకృష్ణుల అనుగ్రహాన్నే తోడుగా చేసుకొని ఆ యువశిష్యులు కఠోర తపస్సు చేశారు. అదే ప్రప్రథమ రామకృష్ణ మఠం. అదే నేడు ఆకాశాన్ని అంటుతూన్న మహావృక్షంగా ఎదిగి లోకవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించి ఆధ్యాత్మిక పిపాసువులకూ, సంసార అనలంలో దహింపబడుతున్న వారికీ తన చల్లని నీడలో ఆశ్రయం ఇస్తూన్నది.

కొన్ని అంశాలు[1]

యోగీన్ మా నుండి విన్నవి:

మాతృదేవి దక్షిణేశ్వరంలో వసిస్తూవున్న రోజుల్లో శ్రీరామకృష్ణులు అనేక విషయాలలో ఆమె అభిప్రాయాన్ని అడిగేవారు. కాని మాతృదేవి, ''మన్నించండి. కాసేపయ్యాక చెబుతాను'' అని చెప్పేవారు.

అందుకు శ్రీరామకృష్ణులు, ''ఎందుకు, ఇప్పుడే చెప్పకూడదా? ఎవరితో కలిసి ఆలోచించ దలచుకొన్నావు?'' అని అడిగేవారు.

అప్పుడు ఆమె, ''కాస్త ఆగండి. నేను కాస్త యోచించి మీతో మాట్లాడతాను'' అని చెప్పేవారు.

పిదప తిన్నగా నహబత్‌కు వచ్చి జగజ్జననితో, ''అమ్మా, నేను ఏం చెప్పాలో అనుగ్రహించి తెలియచెయ్యి'' అని హృదయపూర్వకంగా ప్రార్థించేది. ప్రార్థన ఫలితంగా ఆమెకు లభించే జవాబును అట్లే శ్రీరామకృష్ణులకు విన్నవించేది.

* * *

శ్రీరామకృష్ణులు కాశీపూర్‌లో వ్యాధి తీవ్రతతో బాధపడుతున్నప్పుడు మాతృదేవి పొందిన దుఃఖం వర్ణనాతీతం. ఒక రోజు ఆమెకు ఒక దర్శనం

---

1. స్వామి శారదానంద శ్రీరామకృష్ణుల జీవిత గాథను 1-1-1886 (కల్పతరువు దినం) వరకు మాత్రమే రచించారు. ఆ తరువాత గురుదేవులు జీవించిన ఎనిమిది నెలలను రచించడం జరగలేదు. 'కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులు' అనే పుస్తకం రచించిన వారొకరు కొన్ని నోట్సులు వ్రాసి వుంచుకొన్నారు. ఆ నోట్సులలో కొన్నిటిని సేకరించి ఈ శీర్షికలో, పాఠకులకు ఉపయుక్తంగా ఉంటుందనే ఉద్దేశంతో పొందుపరుస్తున్నాం.

కలిగింది. పొడవైన జడతోవున్న కారునలుపు స్త్రీ కనిపించి ఆమె ప్రక్కన కూర్చుంది. ఆమె సాక్షాత్తు కాళికాదేవియే అని తెలుసుకొన్న మాతృదేవి, ''ఓ, నువ్వు వచ్చేశావా!'' అని ఆశ్చర్యపోతూ అడిగింది.

''అవును. నేను దక్షిణేశ్వరం నుండి వస్తున్నాను'' అన్నది దేవి.

కాసేపు సంభాషణ కొనసాగింది. అప్పుడు కాళికాదేవి కంఠం కాస్త వంగి వుండడం మాతృదేవి చూసింది. వెంటనే, ''నీ కంఠానికి ఏమైంది, అమ్మా?'' అని అడిగింది.

కాళి: నా కంఠంలో వ్రణం వచ్చింది.

మాతృదేవి: ఓ దేవుడా, గురుదేవులకే గొంతులో పుండు, నీకూ వచ్చేసిందే!

కాళి: అవును.

ఈ విధంగా గురుదేవులూ, కాళీ అభిన్నులని మాతృదేవికి తెలియవచ్చింది.

* * *

సామాన్యంగా రాందయాళ్ (కుటుంబ పురోహితుడు) లేదా 'మ' - వీరే దక్షిణేశ్వరంలో కీర్తనకు ఏర్పాట్లు చేసేవారు. ఒకసారి ఆ విధంగా ఏర్పాటు చేసినప్పుడు శ్రీరామకృష్ణులు హరిపాదుణ్ణి పంపి యోగీన్మా, భావిని మొదలైనవారిని ఆహ్వానించారు. నాడు కీర్తన రక్తికట్టలేదు. గాయకుని హావభావాలు చూస్తే అతడు ఎవరితోనో దెబ్బలాడుతూన్నట్లుగా అనిపించింది. శ్రీరామకృష్ణులకు భావపారవశ్యమే జనించలేదు. ఆయన ఇతరులతో మాట్లాడసాగారు.

కీర్తన ముగిశాక ఆయన రాంతో, ''రాం, కీర్తన జరుగుతున్నప్పుడు మీరెవరూ నాట్యమాడలేదు, ఎందుకని?'' అని అడిగారు.

అందుకు రాం, ''కోతులు ఎక్కడున్నా తమంత తామే నాట్యం చేస్తాయా? మీరు నాట్యం చేయలేదు, మేం ఎలా చేయగలం?'' అని అడిగాడు.

తరువాత శ్రీరామకృష్ణులు భక్తురాంద్రతో వెళ్లి జగజ్జననిని ఆరాధించమని చెప్పారు. వాళ్లు తిరిగి వచ్చినప్పుడు ఆయన ఆకుపచ్చ చొక్కాధరించి భక్తులతో ఈ క్రింద పాటను పాడుతూ, నృత్యం చేయసాగారు.

నా మాయీ నల్లనిదా?
కాళరూపి దిగంబరి
హృదయాబ్జపు ఉద్దీపని....

యోగీన్‌మా, ఇతరులు గదిలోకి వచ్చి ఒక మూల నిలబడ్డారు. రాత్రి తొమ్మిది గంటలు అయినప్పటికీ ఆయన భావపారవశ్య స్థితి ఉపశమించ లేదు.

ఇంటికి తిరిగి వెళ్లిపోవాలని యోగీన్‌మా అదుర్దాపడసాగింది. ఎందు కంటే, ఎంతో ఆలస్యంగా పోతే భావిని తల్లి ఒక రగడనే లేవదీస్తుంది. హరిపాదు నితో వాళ్లు బయలుదేర సిద్ధమైనారు. పారవశ్య స్థితిలో గురుదేవులు హఠాత్తుగా ఒక కేక వేశారు. ఆ తరువాత మామూలు స్థితిలోకి ఆయన వచ్చాక, "ఎవ రది, ప్రసాదం పుచ్చుకోకుండా వెళుతూన్నది?" అని అడిగారు. "మేమే బయలుదేరుతున్నామండి" అన్నాడు హరిపాదుడు. శ్రీరామకృష్ణులు, అతడికీ యోగీన్‌మా తదితరులకూ ప్రసాదం ఇచ్చారు. ఆ రోజు ఇంటికి వెళ్లేసరికి అర్ధరాత్రి దాటింది.

* * *

ఒక సందర్భంలో శ్రీరామకృష్ణులు, గోలాప్‌మా తదితరులతో కలకత్తా లోని ఈడెన్ ఉద్యానానికి శిల్పప్రతీకలను (Masonic symbols) తిలకింప వెళ్లారు. అప్పుడు సమయం ఉదయం తొమ్మిది గంటలయి ఉంటుంది. అందరికీ ఆకలిదప్పులు. ఒక భక్తుడు రెండు పైసలకు మిఠాయి కొని తెచ్చాడు. దానిని అతడు గురుదేవులకు ఇచ్చాడు. ఆయన దానిని ఆరగించి ఒక గ్లాసు నీరు త్రాగారు. ఆశ్చర్యం ఏమిటంటే, అక్కడున్న అందరి ఆకలిదప్పులు తీరి పోయాయి. శ్రీరామకృష్ణులు ఒకింత ప్రసాదం ఇస్తారని ఎదురుచూసిన 'గోలాప్‌మా' కు ఇప్పుడు గొంతవరకు తిన్నట్లుగా అనిపించింది. శ్రీరామ కృష్ణుల తృప్తి అందరినీ తృప్తిపరచింది. విస్మయంలో మునిగిపోయిన వాళ్లు ఆ విషయం ఆయనతో చెప్పారు.

యోగీన్‌మా

* * *

ఒక సందర్భంలో యోగీన్ మా మనస్సు ఎంతో చంచల స్థితికి లోనైంది. తన సమస్యను గురుదేవులకు తెలుపా

లనుకొన్నది. ఒక రోజు వేకువన కాలినడకనే దక్షిణేశ్వరానికి బయలుదేరింది. అక్కడకు వెళ్లినప్పుడు గోపాలుని తల్లి అక్కడ ఉండడం చూసింది.

శ్రీరామకృష్ణులు ఉత్తర వసారా గోడను ఆనుకొని నిలబడి ఉన్నారు. ఆయనను చూడగానే యోగీన్మా విచారమూ, చంచలతా ఎగిరిపోయాయి.

యోగీన్మా తోట నుండి కొన్ని పువ్వులు సేకరించి తన చీరచెంగున ముడివేసుకొంది. అది చూసి శ్రీరామకృష్ణులు అదేమిటని అడిగారు. యోగీన్మా పువ్వులు చూపించి, ఆయన పాదపద్మాలకు వాటిని సమర్పించింది. శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితిలో తన పాదాన్ని యోగీన్మా తలమీద ఉంచారు. పక్కనే నిలబడివున్న గోపాలుని తల్లి ఆ పాదాన్ని హృదయానికి హత్తుకోమని చెప్పింది. యోగీన్మా కూడా అట్లే చేసింది.

శ్రీరామకృష్ణుల మహాసమాధి తదనంతరం ఒక రోజు యోగీన్మా జపం చేసుకొంటూవుంది. అప్పుడు ఆమెకు అశరీరవాణి ఇలా వినిపించింది: ''నీ హృదయంలో గదాధరుని పాదపద్మాల ముద్ర నెలకొనివుంది.''

గోలాప్‌మా నుండి విన్నది:

ఒక రోజు రాత్రి శ్రీరామకృష్ణులు కాళికాలయ ఉద్యానంలో పచార్లు చేస్తున్నారు. అప్పుడు ఆయన భావపారవశ్య స్థితిలో ఉన్నారు. ఆయనను చూసిన 'గోలాప్‌మా'కు సాక్షాత్తు కాళికాదేవియే పచార్లు చేస్తున్నట్లు అనిపించింది. గోలాప్‌మా దేహం రోమాంచమైంది.

* * *

ఒక రోజు పెద్ద గోపాల్ వస్తువులు కొనడానికి బజారుకు వెళ్లాడు. వస్తువులు కొన్న తరువాత ఒక వస్త్రం కొని వాటిని దాన్లో మూటగా కట్టి తెచ్చాడు. ఆతడు వేసిన ముడిని విప్పడానికి ఎంతో శ్రమపడవలసి వచ్చిందని గోలాప్‌మా, శ్రీరామకృష్ణులకు చెప్పింది. వస్తువులు చాలావున్నాయని చూసి ఆయన, మాతృదేవితో, ''ఎందుకు గోపాల్‌తో ఇన్ని వస్తువులు తెమ్మని చెప్పావు?'' అని అడిగారు.

మాతృదేవి: నేను ఏం చేయగలను! ఎంతో మంది భక్తులున్నారు.

శ్రీరామకృష్ణులు: కాళికాలయంలో భక్తులకు భోజనాలకు ఏర్పాట్లు జరిగివుంటాయని తెలిసే ఎందుకింత ఖర్చు పెట్టించావు! నిత్యం ఇలా ఎక్కువ సేపు వంటఇంట్లోనే నిలబడి రెండు పూటలా వండితే, ఉష్ణం అధికరించి నీ ఆరోగ్యం పాడైపోదా? ఇంత ఎక్కువగా వండవద్దు. నేను ఇవన్నీ తినబోను.

చెప్పినట్లే ఆయన వాటిలో ఏదీ తినలేదు. కనుక వండిన అన్నిటినీ ఆలయ వంటశాలకు పంపటం జరిగింది.

మాతృదేవి విచారం వర్ణనాతీతం. వెక్కి-వెక్కి ఆమె ఏడ్చింది.

శ్రీరామకృష్ణులు ఆమెను ఇలా అనునయించారు: ''ఇది నిన్ను మించిన శ్రమ అని నీకు తెలియదా? నీ ఆరోగ్యం గురించే నే నలా మాట్లాడాను. ఇక ప్రత్యేకించి ఏ ఆహారాన్ని వండమనీ నీతో చెప్పకూడదని నిర్ణయించుకొన్నాను. 'లభించింది తినడం' అనే ధోరణి పాటిస్తాను. నీకుగా నువ్వు ఏదన్నా వండాలనుకొంటే చెయ్యి, కాని నా కేది ఇష్టమని మాత్రం అడగ వద్దు.''

స్వామి రామకృష్ణానంద నుండి విన్నది:

ఒక రోజు గోపాలుని తల్లి ఆకువేసి, అన్నం వడ్డించబోయింది. గాలి వీచి ఆకు అల్లల్లాడడంతో, అన్నం వడ్డించలేకపోయింది. హఠాత్తుగా అక్కడ ఒక కుర్రాడు వచ్చి ఆకును పట్టుకొన్నాడు. ఆమె అన్నం వడ్డించింది. ఆ తరువాత, ''అవును, ఈ అబ్బాయి ఎవరు?'' అని యోచిస్తూ అతడికేసి చూసింది. అక్కడ ఎవరూ లేరు.

కిషోరీ మోహన్‌రాయ్ నుండి విన్నది

ఒకే గురువు వద్ద నుండి దీక్ష పొందాలని నేనూ, నా భార్య అనుకొన్నాం. ఒకసారి నా భార్య పుట్టింటికి వెళ్లింది. ఒక రోజు నేను కార్యాలయంలో ఉన్నప్పుడు ఆమె నుండి ఒక ఉత్తరం వచ్చింది. నా భార్య, తన తల్లితో మరో గురువు వద్ద దీక్ష పుచ్చుకోబోతూన్నట్లు, అందుకై నన్ను డబ్బు పంపమని ఆ ఉత్తరంలో వ్రాసివుంది. నేను ఎంతో విచారిస్తూ కాశీపూర్‌కు వెళ్లాను.

నాడు 'అ-' ద్వారం వద్ద కాపలా కాస్తున్నాడు. నన్ను లోపలకు వెళ్ల కూడదని అడ్డగించాడు. నేను రెండడుగులు ముందుకు వేసేసరికి, తిట్టడం ప్రారంభించాడు. నాలోని శోకం దుర్భరమై కన్నీరుమున్నీరయ్యాను. మనస్సు వికలమైపోగా నేను తిరిగి వెళ్ల ఉద్యమించినప్పుడు స్వామీజీ నన్ను చూడడం తటస్థించింది. వెంటనే ఆయన నా వద్దకొచ్చి, ''ఏమిటి, ఇలా విచారంగా ఉన్నారు?'' అని అడిగారు. నేను విషయం చెప్పాను. అందుకు ఆయన, ''ఇవాళ ఏమిటో తెలియడం లేదు, అంతా గందరగోళంగా ఉంది. ఇంత వరకు (మధ్యాహ్నం 3 గంటలు) శ్రీరామకృష్ణులు భోజనం చేయలేదు. అనవసరమైన వ్యక్తులు కొందరు చెప్పాపెట్టకుండా ఆయన గదిలోకి వచ్చి ఆయనకు ఎంతో

ఇబ్బంది కలిగించారు. 'అ-' మూర్ఖుడు. జరిగింది మీతో చెప్పివుండవచ్చు. పోనివ్వండి, మీరు గురుదేవులను చూడాలా? ఆయన మిమ్మల్ని చూస్తే సంతోషించి ఒకవేళ మీ చేతుల మీదుగా ఏదైనా తినవచ్చునేమో! భక్తులను ఆయన ఎంత ప్రేమిస్తున్నారో మీకు తెలుసుకదా!'' అని చెప్పారు.

లోపలికి పోవాలని అంతగా అనుకోవడం లేదు. కాని స్వామీజీ విడిచి పెట్టలేదు. 'అ-'ను మందలించి నన్ను మెట్లు ఎక్కి వెళ్లమన్నారు. నేను మరో దారి లేక మెట్లు ఎక్కి శ్రీరామకృష్ణుల గదిలోకి వెళ్లాను. గుమ్మం వద్ద నుండే ఆయనకు మొక్కి, తిరిగి రాబోయాను. కాని ఆయన నన్ను దగ్గరకు రమ్మన్నారు. ''మీ కావలి మనిషి ఊరుకోడు-'' అని అన్నాను. వెంటనే ఆయన (అతడేమీ చేయలేడనే ధోరణిలో విసుగ్గా) బొటనవ్రేలిని కదిలించి, నన్ను దగ్గరకు రమ్మని చెప్పారు. పిదప తమ గొంతును చూపారు. ''మహాశయా, మీరు నేడు ఎంత శుష్కించిపోయి కనబడుతున్నారో తెలుసా? మీరు ఏమీ తిన్నట్లులేదనిపిస్తోంది. నేను కొంచెం ఆహారం తీసుకురానా?'' అని అడిగాను. ఆయన గదిలో రవ్వపాయసం సిద్ధంగా ఉంది. దాన్ని కాస్త వేడి చేయించి, దాన్ని పుచ్చుకొన్నారు. ఆ తరువాత, ''ఇప్పుడు ఉసిరికాయ లభిస్తుందా? కాస్త తీసుకురాగలవా?'' అని నన్ను అడిగారు. పిదప సురేష్ మిత్ర భార్య దీక్ష పుచ్చుకోవడం గురించి నాకు చెప్పమని పెద్దగోపాల్‌తో చెప్పారు. నేను నిర్ఘాంత పోయాను.

పెద్దగోపాల్ ఇలా అన్నాడు: ''సురేష్‌బాబు సతీమణి ఒక ఫలానా గురువు వద్ద దీక్షపొందగోరింది. కాని సురేష్ అందుకు అనుమతించలేదు. కనుక ఇద్దరి మధ్య మనస్తాపం ఏర్పడింది. ఈ విషయం గురుదేవులకు తెలియవచ్చింది. ఒక రోజు శ్రీరామకృష్ణులు సురేష్‌బాబుతో, 'సురేష్, మీ సతీమణి భ్రష్టుపట్టి పోతే మీరు ఏం చేయగలరు?' అని అడిగారు. అందుకు సురేష్‌బాబు, 'ఆమె కోరుకొంటే నే నెలా అడ్డగించగలను' అని చెప్పాడు. వెంటనే గురుదేవులు, 'చూశావా, అటువంటప్పుడు మంచిపని నెందుకు ఆపుతున్నావు? దీక్ష పొందడం మంచిపనే కదా!' అని చెప్పారు.''

నాకు కావలసిన జవాబు లభించింది.

జయచంద్ర మిత్ర నుండి విన్నది:

(నేను ప్రప్రథమంగా హరితో కలిసి గురుదేవుల వద్దకు వెళ్లాను.) హరి ఇంట్లో లేనందున రెండవసారి ఒంటరిగానే వెళ్లాను. శ్రీరామకృష్ణులు నన్ను

దక్షిణవైపు వసారాలోకి తోడ్కొని వెళ్లారు. నా హృదయాన్ని, నాలుకను వ్రేళ్లతో స్పృశించారు.

గురుదేవులు: నీ ఇష్టదేవతగా ఎవరిని భావిస్తున్నావు?

నేను ఏమీ మాట్లాడలేదు.

గురుదేవులు: ఓ, చెప్పడం ఇష్టంలేదన్నమాట! ఫరవాలేదు. (కాళీని చూపుతూ) ఈమెను ఇష్టపడుతున్నావు. అంతేనా!

నేను ''ఊ'' అని తల ఊపగానే గురుదేవులు ఆ మంత్రాన్ని నాకు ఉపదేశించారు. పిదప ఆయనతో నేను, 'మహాశయా, మీరు నాకు దీక్షనిచ్చారు. ఇందువలన నా కులగురువు విచారిస్తే నాకు హాని వాటిల్లదా?' అని అడిగాను.

గురుదేవులు: ఏముంది, ఆయన నుండి కూడా ఒక మంత్రాన్ని పుచ్చుకో. అందుకు ఇష్టంలేకపోతే ఆయనకు మామూలుగా ఇచ్చే దక్షిణ ఇచ్చివెయ్యి.

ఆ తరువాత గురుదేవులు నాకు తినడానికి మంచి ఆహారం ఇచ్చారు. పగలంతా అక్కడే గడిపి ఇంటికి తిరిగి వెళ్లాను.

అతుల్‌చంద్ర ఘోష్ నుండి విన్నది:
(గిరీష్ తమ్ముడు)

ఉత్తర కలకత్తాలోని దీనుబాబు ఇంటికి గురుదేవులు ఒకసారి విచ్చేశారు. మా పెద్ద అన్నగారు గిరీష్ ఆయనను చూడడానికి వెళ్లాడు. ఆయన రాగానే నేను ఆయనతో, ''ఆయన ఎటువంటివారు?'' అని అడిగాను.

''ఒక కపటి'' అని జవాబిచ్చాడు.

నేను మళ్లీ ఏ ప్రశ్నావేయకూడదనే ఉద్దేశంతోనే అలా జవాబిచ్చాడు. కాని నా అన్న దక్షిణేశ్వరానికి తరచు వెళ్లసాగాడు. అంతేకాదు ఆయన, దేవేన్‌బాబు రహస్యంగా గురుదేవుల గురించి మాట్లాడుకొంటూ ఉంటారు. నాతో ఏమీ చెప్పరు.

1885వ సం॥ మార్చ్ నెలలో ఒక రోజు నేను ఇంటికి వచ్చినప్పుడు అన్నగారు, దేవేన్‌బాబు, హరిపాదుడు అలవాటు ప్రకారం మాట్లాడుకొంటున్నారు. ''ఏమిటి మీలో మీరు ఏం మాట్లాడుకొంటున్నారు? పరమహంసగారి గురించా? ఆయన పరమహంస కాదు, రాజహంస. ఎర్రంచు ధోవతి ధరిస్తారు, అందమైన చొక్కాలు వేసుకొంటారు, పాలిష్ వేసిన చెప్పులు ధరిస్తారు, సుఖాసనంలో నిద్రిస్తారు'' అన్నాను నేను.

ఇలా మాట్లాడుకొంటున్నప్పుడు గురుదేవులు, నారాయణ్‌తో అక్కడకు వచ్చారు. రాగానే, ''గిరీష్, భగవంతుని అనుగ్రహం వల్లనే మీ వద్దకు రాగలిగాను'' అని అన్నారు. ప్రాంగణం దాటి, మెట్లు ఎక్కి వచ్చి, ఆయన మాట్లాడేవరకు, మేం ఎవరం ఆయనను గమనించలేదు. నా అన్న, ఇతరులు ఆయనకు సాష్టాంగ నమస్కారాలు చేశారు. 'బ్రాహ్మణులకు సముచిత గౌరవం ఇవ్వాలి' అన్నదే మా సంప్రదాయం. అందువల్ల నేనూ చేతులు జోడించి ఆయనకు నమస్కరించాను. గురుదేవులు కూర్చున్నారు. మా అన్న ఆయనకు ఎదురుగా కూర్చున్నాడు. ఇతరులు ఆయన చుట్టూ కూర్చున్నారు.

మా అన్న నన్ను ఆయనకు పరిచయం చేసి, ''ఇతడు నా చిన్న తమ్ముడు, ఇప్పుడే మిమ్మల్ని తక్కువచేసి మాట్లాడుతున్నాడు'' అని చెప్పాడు. పిదప నన్ను చూసి, ''ఇప్పుడెందుకు మౌనం వహించావు. ఆయనను చూడగానే తన్మయుడవైపోయావా?'' అని అడిగాడు.

నేను సిగ్గుపడ్డాను. కాని భయపడలేదు, ఆయన ఆకర్షణలో తన్మయుడనూ కాలేదు. కాబట్టి గురుదేవులతో, ''మహాశయా, మీరు పరమహంసలు కారు, రాజహంసలని చెప్పాను'' అని చెప్పాను.

వెంటనే గురుదేవులు నా అన్నతో ఇలా అన్నారు: ''నీ తమ్ముడు సరిగానే చెప్పాడుగదా. ఇది తక్కువ చేయడం కాదే! పాలనూ నీటినీ కలిపి ఉంచితే హంస వాటిని వేరుచేసి పాలను మాత్రం త్రాగుతుంది. అంతేకాదు. కాశీకి వెళితే ఎందరో పరమహంసలను చూడవచ్చు. నీ తమ్ముడు నన్ను వారందరికీ రాజును చేశాడు. సముచితంగానే చెప్పాడు.''

కేవలం వచనజాలంతో గురుదేవులను జయించలేం. ఆయన మేధావి అని గ్రహించాను. ఆయనను శోధింప, ''మహాశయా, మీ పేరేమిటి?'' అని అడిగాను.

గురుదేవులు నా వీపును నిమురుతూ, ''మాకంటూ పేరంటూ ఏదైనా ఉంటుందా? హే, హలో అని ఎలాగైనా నన్ను సంబోధించవచ్చు. సంబోధిస్తున్నది నన్నేనని అర్థం చేసుకోగలను'' అని అన్నారు.

'ఇదేమిటి, ఈయన నా మనస్సును చదివేస్తున్నారా?' అనే ఆలోచనలలో పడ్డాను. ఇతరుల మనస్సులను చదవగలిగే విద్య నాకు కొంచెం తెలుసు. కొంత కాలం దానిని అభ్యసించానుకూడా.

గురుదేవులు కొనసాగించారు: ''నేటిదాకా నాకు నీ పట్ల కాస్త భయం ఉండేది. ఆనాడు ఈ దారిలో వెళ్లాను గిరీష్ ఇంట్లో లేడు. వసారాలో కూర్చున్న నిన్ను చూసి, నీ వద్దకొచ్చి వాకబు చేయనా అని నారాయణ్ అడి

గాడు. నేను వద్దన్నాను. నీ పొడవైన గడ్డంచూసి నేను భయపడ్డాను. ఇప్పుడు భయమంతా తొలగిపోయింది.''

''మీ భయం గురించీ, అది నేడు తొలగిపోవడం గురించీ నా కెలా తెలుస్తుంది? నేను అదే గడ్డంతో అదే వ్యక్తిగానే ఉన్నాను'' అన్నాను నేను.

ఆ సమయంలో 'మ', పల్టు, చిన్ననరేన్ అక్కడకు వచ్చారు. గురుదేవులు 'మ'ను చూసి, ''రండి, రండి, మూడున్నర పట్టభద్రులూ రండి'' అని అన్నారు. వాళ్ల నవ్వుతూ కూర్చున్నారు.

తరువాత అనేక విషయాల గురించి మాటలు కొనసాగారు.

దక్షిణేశ్వర ఆలయాలు

కాళికాలయం

కలకత్తాకు ఉత్తరాన ఐదు మైళ్ల దూరంలోని దక్షిణేశ్వర మనే గ్రామంలో పావన గంగానది తూర్పు తీరాన ఈ ఆలయం వెలసి ఉంది. రాణీ రాస్మణి అనే పరమ భక్తురాలైన ఒక జమీందారిణి ఈ ఆలయాన్ని నిర్మించింది. ఒక రోజు కాళీమాత ఆమె కలలో కనిపించి, తన కొక ఆలయం నిర్మించమని ఆదేశించింది. ఆ మేరకు ఆమె అనతికాలంలోనే ఈ ఆలయం నిర్మించి, దేవిని ప్రతిష్ఠించింది. గంగానది మీదుగా పడవలో వచ్చేవారు, సుందరమైన ఈ ఆలయాన్ని చూపిస్తూ, ''ఈ అద్భుతమైన ఆలయాన్ని నిర్మించిన రాణి రాస్మణీ! నువ్వు భాగ్యశాలివి. నీ పుణ్యం చేతనే కదా లోకులు నేడు ఈ సజీవ దైవమూర్తి అయిన భగవాన్ శ్రీరామకృష్ణులను దర్శించి, పూజించే అవకాశం కలిగింది'' అనటం కద్దు. సాధువులు, పరమహంసలు, హిందువులు, క్రైస్త వులు, మహమ్మదీయులు, బ్రహ్మసమాజస్థులు, శాక్తేయులు, వైష్ణవులు, స్త్రీలు పురుషులు అందరూ ఇక్కడకు వస్తూంటారు.

చాందనీ - ద్వాదశ శివాలయాలు

పడవనుంచి దిగగానే మొదట విశాలమైన మెట్లుగల స్నానఘట్టం వస్తుంది. ఇక్కడే శ్రీరామకృష్ణులు స్నానం చేసేవారు. స్నానఘట్టం దాటగానే కానవచ్చే చాందనీలో ఆలయపు ద్వారపాలకులు వసించి, కాపలా కాస్తూ ఉంటారు. వారి మంచాలు, చెక్కపెట్టెలు, రెండుమూడు పాత్రలు అన్నిటినీ అక్కడ చూడవచ్చు. ఆలయానికి సమీపంలో నివసిస్తున్న సంపన్నులు కొందరు స్నానార్థం వచ్చినప్పుడు ఇక్కడ కూర్చుని కబుర్లాడుతూ ఒంటికి నూనె రాచుకొంటారు.



౫౦ శ్రీరామకృష్ణుల గదికి దారితీసే వసారా, రాధాకాంతాలయం, కాళికాలయం, మండపం ౯

శ్రీ భవతారిణీ కాళి మా

సాధువులు, ఫకీర్లు, బైరాగులు మొదలైనవారు ఆలయ ధర్మశాలలో ప్రసాదం ఆరగించడానికి, పూజ నైవేద్య గంటలు మ్రోగేవరకు ఇక్కడ వేచి ఉంటారు. కొన్ని సందర్భాలలో కాషాయ వస్త్రధారిణియైన భైరవి, త్రిశూలం చేతపుచ్చుకొని ఇక్కడ కూర్చుని ఉండటం కూడా చూడవచ్చు. భోజన వేళ కాగానే ఆమెకూడా ధర్మశాలకు పోతుంది. చాందనీకి ఉత్తరాన ఆరు, దక్షిణాన ఆరు, మొత్తం పన్నెండు శివాలయాలు వరుసగా కానవస్తాయి. గంగానది మీదుగా పడవలో వచ్చేవారు, దూరంనుంచే ఈ ద్వాదశ శివాలయాలను చూపి, ''రాణి రాస్మణి నిర్మించిన ఆలయా లివి'' అని చెప్పుకోవటం పరిపాటి.

ప్రాంగణం : రాధాకాంత ఆలయం

చాందనీకి శివాలయాలకు తూర్పున పొడవైన విశాలమైన ప్రాంగణం ఉత్తర-దక్షిణాలకు వ్యాపించి ఉంది. దాన్లో ప్రక్క-ప్రక్కన రెండు ఆలయాలను చూడవచ్చు. దక్షిణాన, దక్షిణాభిముఖంగా ఉన్న పెద్ద ఆలయంలో కాళీమాత, ఉత్తరం వైపున ఉన్న చిన్న ఆలయంలో, పశ్చిమదిశన పరవళ్ళు తొక్కుతూ ఉన్న పావన గంగానదిని చూస్తూ రాధాకాంతుడు వెలసి ఉన్నారు. ఈ రాధాకాంత ఆలయాన్ని విష్ణ్వాలయం అనికూడా పేర్కొం టారు.

మెట్లెక్కి రాధాకాంత ఆలయం చేరుకోవచ్చు. అక్కడ పశ్చిమాభి ముఖంగా రాధ, కృష్ణుల విగ్రహాలు ప్రతిష్ఠితమై ఉన్నవి. ఆలయం నేల చలువ రాళ్లతో పరచి ఉంది. ఆలయ పైకప్పున అలంకృతమైన గాజు దీపాలు వరు సలుగా వ్రేలాడుతూంటాయి. ప్రస్తుతం వాటిని ఉపయోగించటం లేదు. దుమ్ము, ధూళి పడకుండా ఎర్రని వస్త్రంతో వాటిని కప్పి ఉంచారు. సాయం త్రపు సూర్యుని కిరణాలు విగ్రహాలమీద పడకుండా ఉండటానికి వసారాలోని పెద్ద స్తంభాల నడుమ మందపాటి తెరలు కట్టబడి ఉన్నాయి. ఒక కాపలాదారు ఆలయాన్ని కాపలాకాస్తూ ఉంటాడు. ద్వారం ప్రక్కన చిన్న ఇత్తడి పాత్రలో శ్రీపాదతీర్థం ఉంటుంది. దేవుణ్ణి పూజించి తిరిగివచ్చే భక్తులు ఈ తీర్థాన్ని సభక్తికంగా పుచ్చుకొంటారు. ఆలయం లోపల రాధాకృష్ణులు సింహాసనా రూఢులై దర్శనం ఇస్తూంటారు. 1857-58లో శ్రీరామకృష్ణులు మొట్ట మొదట ఈ ఆలయంలోనే పూజారిగా ఉండేవారు.

భవతారిణీ కాళికాదేవి

కాళికాలయంలో కాళీమాత సుందరమైన శిలావిగ్రహం ప్రతిష్ఠితమై ఉంది. ఇక్కడ కాళీమాతను భవతారిణిగా, అంటే భవసాగరాన్ని దాటించే దేవిగా పూజిస్తారు. ఆలయ గచ్చు తెలుపు నలుపు చలువరాళ్లతో పరచబడి ఉంది. మెట్లున్న ఎత్తైన పీఠం ఒకటి ఇక్కడ ఉంది. పీఠం మీద వెండితో తయారైన సహస్రదళ పద్మం, దాని మీద దక్షిణాభిముఖంగా తల, ఉత్తరం వైపుగా సాచిన కాళ్లతో శివుడు శవంలా పడి ఉంటాడు. శివుని విగ్రహం తెల్లని చలువరాతితో తయారైనది. బెనారస్ పట్టుచీరను ధరించి, వివిధాలంకార భూషితయై, నల్లని చలువరాతితో మలచబడి సౌందర్యం ఉట్టిపడుతూ ఉన్న ముక్కంటి దేవియైన శ్యామాకాళీ, శివుని హృదయస్థానం మీద నిలబడి ఉంటుంది. ఆమె నిలబడి ఉన్న, గాంభీర్యం ఉట్టిపడే తీరుతెన్నులను మాట లలో వర్ణించలేం.

కాళీమాత పాదాలకు నూపురం, గజ్జెలు, పాజీబులు, మెట్టెలు మొదలైన ఆభరణాలు, మందారపువ్వులు, బిల్వపత్రాలు అలంకరింపబడి ఉంటాయి. శ్రీరామకృష్ణుల కోర్కె మేరకు మథుర్‌బాబు అనేక ఆభరణాలను దేవికి కానుకగా సమర్పించాడు. అమ్మవారి చేతికి వంకీలు, మురుగులు, గాజులు; మెడలో కంటె, కాసులపేరు, ముత్యాలసరం, శిరస్సున కిరీటం, కర్ణాభరణాలు అలంకరింపబడి ఉన్నాయి. ముక్కుపుడకలు, నత్తు, బేసరి ఉన్నాయి. రెండు ఎడమ చేతుల్లో మానవ శిరస్సు, ఖడ్గం పట్టుకొని ఉంటుంది. కుడి రెండు చేతులు వరదాభయ ముద్రలు చూపుతూంటాయి. ఆమె నడుముకు మానవ హస్తాలమాల, వేపాకుల గుత్తి, వడ్డాణము ధరింపబడి ఉంటాయి. ఆమె రూపం విధ్వంసక భీతిని, మాతృహృదయ మార్దవం అందించే విశ్వాసాన్ని కలగలిపి చూపుతూ ఉన్నట్లుగా కానవస్తుంది. జగత్ శక్తి ఆమే. యావత్ప్రపంచంలో ద్వంద్వాలకు వైభవాన్విత సామరస్యం ఆమే. సృష్టి స్థితి లయాలు నిర్వర్తించేదీ ఆమే. ఆమె మూడవ కన్ను జ్ఞాననేత్రం. ఆ త్రినేత్రాల దృక్కులు దుష్టులకు భయకంపనాలను, సజ్జనులకు అనురాగాన్ని కల్పిస్తాయి.

గర్భగుడిలో ఒక మూల, అంటే ఈశాన్యమూల దేవి విశ్రాంతి గైకొనటానికి మంచం వేసి ఉంది. మరో ప్రక్కన వింజామరం (చామరం) వ్రేలాడుతోంది. శ్రీరామకృష్ణులు ఈ వింజామరంతో దేవికి ఎన్నోమార్లు వీవన చేసి సేవలు చేసి ఉన్నారు.

పీఠంపై పద్మదళాల ఆసనంమీద ఒక వెండి చెంబులోనూ, పీఠం క్రింద వరుసగా పేర్చిన కలశాలలోనూ నీళ్లు నింపబడి ఉంటాయి. పీఠం చుట్టూ

అష్టధాతువులతో తయారైన సింహం, మొసలి, త్రిశూలం, ఆడ నక్క, నల్లరాతితో మలచిన నంది, హంస కానవస్తాయి.

పీఠం మెట్లపై వెండితో తయారైన చిన్న సింహాసనం మీద సాలగ్రామం, జటాధారి అనే సాధువునుంచి శ్రీరామకృష్ణులు పొందిన అష్టధాతువులతో తయారైన 'రాంలాలా' అని పేర్కొబడే బాలరాముని విగ్రహం, బాణేశ్వర లింగం, అనేక దేవీదేవతల విగ్రహాలు అమర్చబడి ఉంటాయి.

జగజ్జనని దక్షిణాభిముఖంగా ప్రతిష్ఠితమై ఉంటుంది. దేవి పీఠానికి దక్షిణంగా ఉన్న కలశంలో కుంకుమ, అర్చన గావించబడిన పువ్వులు, పుష్ప మాలలు మొదలైనవి ఉంటాయి.

గర్భగుడిలో మరోవైపు దేవి ఆచమనం చేయటానికి తామ్రపాత్ర ఒక దాన్లో నీళ్ల నింపి ఉంచారు. దేవి పీఠం మీద ఎత్తులో అందమైన గోపురం అమరి ఉంది. దేవికి వెనుకవైపు బెనారస్ పట్టుతో రూపొందిన అందమైన తెర వ్రేలాడుతోంది. పీఠం నాలుగువైపులా చిన్న చిన్న వెండి స్తంభాలు నిలచి ఉన్నాయి. స్తంభాలపైన నవరత్నఖచితమైన గోపురం అమరి ఉంది. గర్భగుడి సుదృఢ ద్వారాలతో సురక్షితంగా ఉంటుంది. ఒక ద్వారం ప్రక్కన, వసారాలో కాపలాదారు కూర్చుని ఉంటాడు. ఆలయ ద్వారం ప్రక్కనే దేవి పాదతీర్థం ఉంటుంది.

కాళికాలయ అగ్రాన తొమ్మిది గోపురాలు అమరి ఉన్నవి. క్రింది వరుసలో నాలుగు చిన్న గోపురాలు, మధ్య వరుసలో నాలుగు చిన్న గోపురాలు, అన్నింటికంటే పైన ఒక చిన్న గోపురం అమరి ఉన్నవి. వీటిలో ఒక గోపురం ప్రస్తుతం విరిగి ఉంది. భవతారిణీ కాళికాలయంలోను, రాధాకాంత ఆలయం లోను శ్రీరామకృష్ణులు పూజలు ఒనరించి ఉన్నారు. ధ్యానాయత్త జీవితానికి అనుకూలమైన వాతావరణం ఇక్కడ గోచరమవుతుంది.

ఈ మండపంలో పెద్ద స్తంభాలు రెండు వరుసల్లో అమరి ఉన్నాయి. ఈ స్తంభాలు కప్పుభారాన్ని తలదాల్చి ఉన్నాయి. ఉత్సవ వేళలలో, కాళీపూజ వంటి పర్వదినాలలో ఈ మండపంలో నాటకాలు ప్రదర్శిస్తారు. ఈ మండపం లోనే శ్రీరామకృష్ణుల ఇచ్చమేరకు 'అన్నమేరు' ఉత్సవం, రాణీ రాస్మణీ అల్లు డైన మథుర్‌బాబు ఏర్పాటుచేశాడు. ఇక్కడే శ్రీరామకృష్ణులు భైరవీపూజను ఘనంగా నిర్వహించారు.

వంటశాల, భాండాగారము, అతిథిశాల, బలిపీఠం

ప్రాంగణం పశ్చిమాన ద్వాదశ శివాలయాలు ఉన్నాయి. సన్యాసులకు ఇష్ట దైవమైన శివుని పలుస్థితులు తెలియచేసే పన్నెండు శివలింగాలు ప్రతిష్ఠింపబడి

ఉన్నవి. అనునిత్యం విధివిహితంగా ఈ శివలింగాలకు పూజాదికాలు నిర్వర్తిస్తారు.

పెద్ద ఆవరణ తక్కిన మూడు వైపుల వంటశాలలు, భాండాగారాలు, అతిథిశాల (ధర్మశాల) నెలకొని ఉన్నాయి. తూర్పున వంటశాలలు, భాండాగారము, అతిథులశాల అమరి ఉన్నాయి. రాధాకాంత ఆలయ, కాళికాలయ నైవేద్యాలను విడివిడి వంటశాలలలో వండుతారు. అనునిత్యం కాళీపూజ తరువాత, మధ్యాహ్న భోజన వేళకు కాస్త ముందుగా నైవేద్యం అర్పించబడుతుంది. పిదప, ఆ అన్నప్రసాదాన్ని ధర్మశాలలో గుమిగూడిన భక్తులకు, పేదలకు వితరణ చేస్తారు. వండిన ఆహారం స్వీకరింప నొల్లని సాధువులకు స్వయంపాకం వస్తుభండారంనుంచి ఆలయ కోశాధికారి అనుమతితో ఇస్తారు. ఆలయ సిబ్బందికికూడా ప్రసాదంలో భాగం ఉంది. రాణి రాస్మణి బంధువులు, మిత్రులు వచ్చినప్పుడు కుఠీ (అతిథి భవనం)లో బస చేస్తారు. వారికీ ఆలయ ప్రసాదం పంపబడుతుంది. భాండాగారానికి దక్షిణంగా బలిపీఠం ఉంది.

కార్యాలయం

పెద్ద ఆవరణకు దక్షిణాన వరుసగా అనేక గదులు కానవస్తాయి. ఆలయ కార్యాలయమూ, ఆలయ సిబ్బంది బస, భక్తుల బస ఇక్కడ ఉన్నాయి. కార్యాలయ నిర్వహణాధికారి, గణకుడు ఇక్కడే నివసిస్తారు. భాండాగార నిర్వహణాధికారి, వంటశాల సిబ్బంది, ఆలయ అర్చకులు, పనివారు మొదలైనవారు సదా ఇక్కడ తిరుగాడుతూ ఉంటారు. ఉత్సవ దినాలలో మాత్రమే వినియోగింపబడే పెద్దపెద్ద జంపఖానాలు, తెరలు మొదలైనవాటిని కొన్ని గదుల్లో పదిలపరచి ఉంచుతారు. శ్రీరామకృష్ణుల జన్మదిన వేడుకలో నివేదనం వండడానికి కొన్ని గదులను నేటికీ ఉపయోగిస్తున్నారు.

ఉత్తరవైపున కొన్ని గదులు వరుసగా కట్టబడి ఉన్నాయి. ఈ వరుస మధ్యన ఒక ద్వారం కానవస్తుంది. ఇక్కడ సదా ఒక కాపలాదారు ఉంటాడు. ఈ ద్వారంగుండా ఆలయంలోకి వెళ్లేవారు తమ పాదరక్షలను ఇక్కడ వదలి వెళతారు.

శ్రీరామకృష్ణుల గది

ప్రాంగణంలో వాయవ్యమూల, అంటే ద్వాదశ శివాలయాలకు ఉత్తరంగా శ్రీరామకృష్ణుల గది ఉంది. శ్రీరామకృష్ణులు తమ జీవితకాలంలో అత్యధికభాగం ఇక్కడే గడిపారు. ఈ గదికి పశ్చిమాన నెలకొన్న అర్ధచంద్రాకార


దక్షిణేశ్వర ఆలయాలు
ప్రధాన ద్వారం
కలకత్తా, 4 మైళ్లు
ఉ
వెనుక ద్వారం
కొలను
ఫలోద్యానం
ఫలోద్యానం
ఫలోద్యానం
బిల్వవృక్షం
కొలను
పాత్రలు తోమే గట్టు
వంటశాలలు,
భాండాగారాలు,
భోజనశాలలు,
కార్యాలయాలు,
అతిథి గృహాలు
రాధాకాంతాలయం
గూస్ కొలను
కుఠీ
నట్ మందిరం
ప్రాంగణం
కాళికాలయం
ధ్యాన కుటీరం
పంచవటి
మర్రిచెట్టు
చాందినీ
శివాలయాలు
దేవదారువనం
మాతృదేవి నహబత్
ముఖద్వారం
నహబత్
పూలతోటలు
ప్రాంగణానికి వెళ్లే ద్వారం
శ్రీరామకృష్ణుల గది
గంగానది
వసారాలు
అర్ధచంద్రాకార మొగసాల
0 100' 200' 300' 400'

వసారాలో నిలబడి పావన గంగానదిని దర్శిస్తూ ఉండేవారు శ్రీరామకృష్ణులు. ఈ వసారాను ఆనుకొని కాలిబాట ఒకటి ఉత్తర-దక్షిణంగా పోతూ ఉంది. బాటకు పశ్చిమాన పువ్వులతోట - దాన్ని దాటి వెళితే రాళ్లతో కట్టబడిన గట్టు - గట్టును తాకుతూ సర్వతీర్థమయి అయిన గంగాదేవి కలకల నినాదంతో ప్రవహిస్తూ ఉంది.

నహబత్, పొగడ చెట్టు, పంచవటి

శ్రీరామకృష్ణుల గదికి ఉత్తరం వైపు ఒక చదరపు వసారా, అక్కడనుంచి పూతోటకు వెళ్లే బాట, పూతోట[1] అమరి ఉన్నాయి. పూతోట దాటితే మేడతోకూడిన నహబత్ (మేళపు చావడి) కానవస్తుంది. ఈ మేళపుచావడిలో శ్రీరామకృష్ణుల వయోవృద్ధురాలైన తల్లి, మాతృమూర్తి శారదాదేవి నివసించే వారు. నహబత్ తరువాత పొగడచెట్లు, స్నానఘట్టం ఉన్నాయి. ఈ ఘట్టంలో, ఊరి స్త్రీజనం స్నానం చేస్తారు. ఇక్కడే శ్రీరామకృష్ణుల తల్లి 1877లో భగవత్ సన్నిధానం చేరుకొంది.

పొగడచెట్టును దాటి ఉత్తరం వైపుకు వెళితే పంచవటి వస్తుంది. శ్రీరామ కృష్ణులు ఇక్కడ ఎన్నో ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించారు. భక్తులతో కలసి పచార్లు చేశారు. కొన్ని వేళల్లో నడిరేయికూడా అక్కడకు వెళుతూండేవారు. పంచవటిలో వటవృక్షం (మర్రిచెట్టు), అశ్వత్థవృక్షం (రావిచెట్టు), నింబ వృక్షం (వేపచెట్టు), ఆమలక వృక్షం (ఉసిరి చెట్టు), బిల్వవృక్షం (మారేడు చెట్టు) ఉన్నాయి. వీటిని శ్రీరామకృష్ణులు స్వయంగా నాటి, పెంచారు. బృందా వనం నుంచి తాము తెచ్చిన పావన మృత్తికను ఇక్కడ చల్లారు. ఈ పంచవటికి తూర్పున ఒక పర్ణకుటీరం నిర్మింపచేసి దాన్లో చాలాకాలం తపస్సులో, భగవ చ్చింతనలో గడిపారు. ఇప్పుడు ఈ పర్ణకుటీరాన్ని కట్టడంగా మార్చి ఉన్నారు.

పంచవటి పలురకాల పక్షులకు, జంతువులకు ఆలవాలమై ఉంది. దాని చుట్టూ మెట్లతో కూడిన అరుగు ఒకటి నిర్మితమై ఉంది. ఈ అరుగుమీద వాయవ్యమూలన కూర్చుని శ్రీరామకృష్ణులు అనేక కఠోర సాధనలు అను ష్ఠించారు. దేవీ దర్శనంకోసం కన్నీరుమున్నీరైనారు.

---

1. ఈ పూతోట మధ్యన ప్రస్తుతం ఒక సుందర మండపం నిర్మించబడి, దాన్లో రాణి రాస్మణి పాలరాతి విగ్రహం నెలకొల్పి ఉన్నారు.

సరుగుడు తోపు, బిల్వవృక్షాలు, కుఠీ

పంచవటికి కొంచెం ఉత్తరంగా వెళితే ఇనుప తీగెలతో కట్టిన కంచె ఒకటి వస్తుంది. ఆ కంచెకు ఆవలి వైపునే సరుగుడు తోపు ఉంది. అక్కడ సరుగుడు చెట్లు వరుసగా బారులుతీరి ఉన్నాయి. సరుగుడు తోపుకు తూర్పుగా వెళితే బిల్వవృక్షం వస్తుంది. ఇక్కడకూడా శ్రీరామకృష్ణులు అనేక సాధనలు సల్పారు. సరుగుడు చెట్ల, మారేడు చెట్లకు వెనుకనే ఎత్తైన ప్రహరీగోడ ఉంది. దానికి ఆవల తుపాకీమందు కర్మాగారం ఉంది.

ఆలయ ప్రాంగణపు సింహద్వారం బయట ఉత్తరం వైపున రెండంతస్తుల 'కుఠీ' ఉన్నది. రాణి రాస్మణి, ఆమె అల్లుడు మథుర్‌బాబు మొదలైన వారు ఆలయానికి వచ్చినప్పుడు ఇందులోనే విడిది చేసేవారు. వారు జీవించి ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు ఈ కుఠీలోని క్రింది అంతస్థులో పడమటివైపు గదిలో ఉండేవారు. ఇక్కడనుండి పొగడచెట్ల గట్టుకు వెళ్ళవచ్చు. అక్కడనుండి గంగానది సుందర దృశ్యం చక్కగా కానవస్తుంది.

పాత్రలు తోమే గట్టు, గాజీతోలా, రెండు వాకిళ్ళు

సింహద్వారానికి, కుఠీకి మధ్యన ఉన్న దారిలో వెళ్ళినప్పుడు కుడి ప్రక్కగా మెట్లతో తీర్చి కట్టబడిన సుందరమైన కోనేరు ఉన్నది. కాళికాలయానికి తూర్పువైపున ఈ కోనేటి మరొక గట్టు ఉంది. అక్కడ వంట పాత్రలు తోముతారు. అదేవైపున అనతిదూరంలోనే మరో గట్టు ఉంది. దాని దగ్గర ఒక పెద్ద చెట్టు ఉంది. దీన్ని గాజీతోలా అంటారు. ఆ దారినే తూర్పుగా వెళితే సింహద్వారం ఒకటి వస్తుంది. ఆలంబజార్, కలకత్తానుండి వచ్చేవారు ఆ ద్వారంనుండే ఆలయంలోకి రావచ్చు. ఇక్కడ సర్వదా ద్వారపాలకుడు కాపలాకాస్తుంటాడు. కలకత్తానుండి శ్రీరామకృష్ణులు, రాత్రి పొద్దుపోయాక వచ్చినప్పుడు ఈ ద్వారంగుండానే లోపలికి వచ్చేవారు. అప్పుడు ద్వారపాలకుడు తాళం తీసి ద్వారం తెరిచేవాడు. శ్రీరామకృష్ణులు, అతణ్ణి తమ గదికి తీసుకువెళ్ళి పూరీలు, మిఠాయిలు వంటి ప్రసాదం పెట్టేవారు.

హంసపుకూర్, అశ్వశాల, గోశాల, పువ్వుల తోట

పంచవటికి తూర్పువైపున మరో కొలను ఉంది. దాన్ని హంసపుకూర్ అంటారు. దానికి ఉత్తర దిక్కున అశ్వశాల, గోశాల ఉన్నాయి. గోశాలకు తూర్పుగా సందువాకిలి ఉంది. ఈ వాకిలి నుండే దక్షిణేశ్వర గ్రామానికి వెళ్ళ

వచ్చు. పూజారులు, మరికొందరు పనివారు తమ కుటుంబాలను తోడ్కొని వచ్చి దక్షిణేశ్వరంలోనే వసించేవారు. వారు ఈ వాకిలిగుండానే రాకపోకలు సాగించేవారు.

ఆలయ ప్రాంగణానికి దక్షిణ సరిహద్దు నుండి ఉత్తరాన గల పంచవటి వరకు గంగాతీరాన కాలిబాట ఉంది. ఆ బాటకు ఇరువైపులా పువ్వుల చెట్లు నాటి ఉన్నారు. అలాగే కుఠీవద్ద తూర్పు-పడమరలుగా ఉన్న దారిలోకూడా పువ్వుల చెట్లు ఉన్నాయి. గాజీతోలానుండి గోశాలవరకు; కుఠీ, హంసపుకూర్‌లకు తూర్పుగా ఉన్న స్థలంలో నలుదిక్కులా పలురకాల పువ్వుల, పండ్ల చెట్లు ఉన్నాయి. ఇక్కడ మరో కొలనుకూడా ఉంది.

వేకువజామున ఆకాశం రక్తవర్ణంతో శోభించేటప్పుడు మంగళహారతి సుమధుర నాదాలు ఆలయంనుండి వినవస్తాయి. అప్పుడు పూజ నిమిత్తం కాళికాదేవి తోటలో పువ్వులు కోయ నారంభిస్తారు. గంగాతీరాన పంచవటికి ఎదురుగా బిల్వవృక్షం, తెల్లగన్నేరు పువ్వుల చెట్లు ఉన్నాయి. మల్లెపూలు, మాధవీలత, తెల్లగన్నేరు పువ్వులంటే శ్రీరామకృష్ణులకు మహాప్రీతి. మాధవీ లతను స్వయంగా బృందావనం నుండి తెచ్చి నాటారు. హంసపుకూర్, కుఠీకి మధ్యనున్న కొలను ఒడ్డున సంపెంగ చెట్టు ఉంది. దానికి కొంత దూరంలో పన్నీరు, మందారపువ్వుల చెట్లు ఉన్నాయి. దడిలో శంఖు పువ్వుల తీగ అల్లుకొని ఉంది. దానికి చివరగా మొల్లచెట్టు, పారిజాతపు చెట్టు ఉన్నాయి. ద్వాదశ శివాలయాలకు పశ్చిమంగా శ్రీరామకృష్ణుల గదికి ఇరువైపులా ఉన్న స్థలం పలు రకాల పువ్వుల చెట్లతో అలరారుతోంది.

ప్రప్రథమంలో శ్రీరామకృష్ణులు కూడా ఇక్కడ పువ్వులు కోసేవారు. ఒక రోజు పంచవటి ఎదుటనున్న ఒక బిళ్వవృక్షం ఆకులు కోస్తూంటే ఒక కొమ్మ కొద్దిగా ఊడి వచ్చింది. అప్పుడు సర్వభూతాలలోనూ భగవంతుడు విరాజిల్లుతున్నాడు అన్న అనుభూతి కలిగింది ఆయనకు. ఆ చెట్టుకు ఎంతగా బాధ కలిగిందో అని చింతించారు. పిమ్మట ఆయన ఆకులు కోయలేకపోయారు. మరొక రోజు పువ్వులు కోయడానికి తిరుగుతున్నారు. అప్పుడు ఒక్కొక్క పువ్వు ఒక్కొక్క గుత్తిగా విరాట్ శివునికి అలంకరిస్తూ, అహర్నిశలు ఆ విరాడ్రూపుని పూజ జరుగుతున్నట్లుగా ఆయన దర్శించారు.

శ్రీరామకృష్ణుల గది వసారా

శ్రీరామకృష్ణుల గదికి తూర్పువైపున పొడవైన వసారా ఉంది. ఈ వసారాలో కొంత భాగం ప్రాంగణం వైపుగా అంటే దక్షిణాభిముఖంగా ఉంది.

శ్రీరామకృష్ణులు తరచు ఈ వసారాలో కూర్చుని ఆధ్యాత్మిక ప్రసంగాలు, భగవత్ సంకీర్తనలు గావించేవారు. వసారాలోని మిగిలిన భాగం ఉత్తరాభి ముఖంగా ఉంటుంది. ఈ వసారాలో భక్తులు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చి ఆయన జన్మదిన వేడుకలు జరుపుకునేవారు; ఆయనతోపాటు సంకీర్తన చేసే వారు; ఆయన, వారితోపాటు కలసి కూర్చుని ప్రసాదం స్వీకరించేవారు. కేశవ్ చంద్రసేన్ భక్తి వినమ్రతలతో శ్రీరామకృష్ణులతో సంభాషించింది ఈ వసారా లోనే. ఆనందంగా అందరూ కలసి మరమరాలు, కొబ్బరి, పూరీలు, మిఠా యిలు మొదలైవాటిని తినేవారు. నరేంద్రుణ్ణి చూసి శ్రీరామకృష్ణులు సమాధి మగ్నులయింది కూడా ఈ వసారాలోనే.

ఆనంద నికేతనం

కాళికాలయం ఆనంద నికేతనంగా రూపొందింది. ఇక్కడ రాధాకాం తులు, భవతారిణీదేవి, శివభగవానుల నిత్యపూజానైవేద్యాలు, అతిథి సేవలు జరుగుతున్నాయి. ఒకవైపు పవిత్ర భాగీరథీ కనుచూపు మేర కానవస్తుంది. మరొకవైపు సుగంధపరిమళభరితమై చిత్రవిచిత్ర కుసుమ సమూహాలతో పువ్వుల తోట అలరారుతోంది. ఒక చేతన పురుషుడు రాత్రింబవళ్ళు భగవ త్ప్రేమలో ఉన్మత్తుడయింది ఇక్కడే! ప్రత్యక్షదైవంగా నివసించిందీ ఇక్కడే! ఆలయంలో దేవికి మేలుకొలుపు సేవ మొదలు పవళింపు సేవ వరకు యథా విధిగా మంగళవాద్యాలతో నిత్యకళ్యాణం పచ్చతోరణంగా పూజాదికాలు నిర్వ ర్తింపబడుతూ కాళీఆలయం ఆనంద నికేతనంగా విరాజిల్లుతూ వస్తూ ఉన్నది.

పూర్వాపర్యక్రమంలో ముఖ్య సంఘటనలు

సం॥	సంఘటన
1775	ఖుదీరామ్ జననం.
1791	చంద్రమణీదేవి జననం.
1799	ఇరవై ఐదేళ్ల ఖుదీరామ్, ఎనిమిదేళ్ల చంద్రాదేవిని వివాహం చేసుకోవడం.
1805	రామ్‌కుమార్ జననం.
1810	కాత్యాయని జననం.
1815	నలభైయో ఏట ఖుదిరామ్ కామార్పుకూర్‌లో స్థిరనివాసం.
1821	రామ్‌కుమార్, కాత్యాయనుల వివాహాలు.
1824	ఖుదీరామ్ రామేశ్వర తీర్థయాత్రకు బయలుదేరడం.
1826	రామేశ్వర్ జననం.
1834	కాత్యాయనిని పిశాచి ఆవహించడం.
1835	అరవయ్యో ఏట ఖుదీరామ్ కాశీ, గయలకు తీర్థయాత్ర.
1836	ఫిబ్రవరి 17వ తేదీ బ్రహ్మముహూర్తంలో శ్రీరామకృష్ణుల జననం
1840	సర్వమంగళ జననం.
1843	ఖుదీరామ్ మరణం.
1848	రామేశ్వర్, సర్వమంగళల వివాహాలు.
1849	అక్షయ్‌ను ప్రసవించి రాంకుమార్ భార్య మరణించడం.
1850	కలకత్తాలోని ఝామాపుకూర్‌లో రాంకుమార్ సంస్కృత పాఠశాల ప్రారంభం.

1852 కలకత్తాకు శ్రీరామకృష్ణుల రాక.

1853 డిసెంబర్ 22, మాతృమూర్తి శారదాదేవి జననం.

1855 దక్షిణేశ్వర కాళికాలయ ప్రతిష్ఠాపన. దక్షిణేశ్వరంలో హృదయ్. విష్ణ్వాలయ పూజారిగా శ్రీరామకృష్ణుల నియామకం, తదనంతరం కాళికాలయ పూజారిగా నియుక్తులు కావడం.

1856 రాంకుమార్ మరణం. భగవత్సాక్షాత్కారం, శ్రీరామకృష్ణుల ప్రథమ దివ్యోన్మత్త స్థితి.

1857 రాణీ రాస్మణిని శిక్షించడం.

1858 కాళికాలయ పూజారిగా హలధారి. శ్రీరామకృష్ణుల కామార్పుకూర్ ఆగమనం.

1859 శ్రీరామకృష్ణుల వివాహం.

1860 దక్షిణేశ్వరానికి తిరిగి రావడం. శ్రీరామకృష్ణులలో శివ-శక్తులను మథుర్ దర్శించడం.

1861 రాణీ రాస్మణి కాలధర్మం. భైరవీ బ్రాహ్మణి ఆగమనం.

1862 శ్రీరామకృష్ణుల తాంత్రిక సాధన.

1863 తంత్రసాధన పరిసమాప్తి. గంగాతీరాన వసించడానికి చంద్రమణీదేవి దక్షిణేశ్వరానికి రావడం.

1864 మథుర్ 'అన్నమేరు' ఉత్సవం.

1865 తోతాపురి రాక, శ్రీరామకృష్ణుల సన్యాస స్వీకారం. హలధారి స్థానే అక్షయ్.

1866 ఆరు నెలలకాలం శ్రీరామకృష్ణులు అద్వైత భూమిలో నెలకొని ఉండడం.

1867 బ్రాహ్మణి హృదయ్‌లతో, శ్రీరామకృష్ణులు కామార్పుకూర్‌కు వెళ్లడం. మాతృదేవి కామార్పుకూర్‌కు రావడం.

1868 శ్రీరామకృష్ణుల తీర్థయాత్ర.

1869 అక్షయ్ వివాహం, మరణం.

1870 శ్రీరామకృష్ణుల కాల్నా, నవద్వీప్ సందర్శనం; భగవాన్‌దాసుతో సమావేశం.

1871 మథుర్‌బాబు మరణం.

1872 మాతృదేవి దక్షిణేశ్వర ప్రథమ సందర్శనం.

1873 శ్రీరామకృష్ణుల షోడశీపూజ, మాతృదేవి కామార్పుకూర్‌కు తిరిగి వెళ్ళిపోవడం. రామేశ్వర్ మరణం.

1874 రెండవసారి మాతృదేవి దక్షిణేశ్వరానికి రావడం.

1875 కేశవచంద్రసేన్‌తో శ్రీరామకృష్ణుల ప్రథమ సమావేశం.

1876 మాతృదేవి జబ్బుపడి పుట్టింటికి వెళ్లడం. చంద్రమణీదేవి కాలధర్మం.

1877 మాతృదేవి తృతీయ దక్షిణేశ్వర సందర్శనం.

1879 శిష్యుల ఆగమనానికి నాంది.

1881 నరేంద్రనాథ్‌తో, శ్రీరామకృష్ణుల ప్రథమ సమావేశం. హృదయ్‌కు ఉద్వాసన.

1882 విద్యాసాగర్‌ను శ్రీరామకృష్ణులు సందర్శించడం; మాతృదేవి తిరిగి దక్షిణేశ్వరానికి రావడం.

1883 ఈ రచయిత శ్రీరామకృష్ణులను నవంబర్ 26వ తేదీ కలుసు కోవడం.

1884 కేశవ్ కాలధర్మం. శ్రీరామకృష్ణులను మొట్టమొదటిసారి గోపాలుని తల్లి సందర్శించడం. ఆంతరంగిక భక్తుల రాక పూర్తికావడం.

1885 పానీహాటీ మహోత్సవాన్ని చివరిసారి సందర్శించడం. సెప్టెంబర్ తొలినాళ్లలో శ్యామ్‌పుకూర్‌కు, అక్కడ నుండి డిసెంబర్ 11 నాడు కాశీపూర్‌కు శ్రీరామకృష్ణులను తరలించడం.

1886 జనవరి 1వ తేదీ (కల్పతరువు దినం) నాడు శ్రీరామకృష్ణుల అనుగ్రహ వృష్టి.

1886 ఆగస్టు 16వ తేది శ్రీరామకృష్ణుల మహాసమాధి



స్వామి వివేకానంద
(కాశీపూర్)

౹౧ స్వామి శారదానంద ౧౹

రచన - రచయిత

ప్రఖ్యాత ఫ్రెంచి పండితుడైన రోమారోలా ఎవరిని 'వంగ ప్రవక్త'గా పాశ్చాత్య ప్రపంచానికి పరిచయం చేశాడో ఆ శ్రీరామకృష్ణుల సమగ్ర జీవిత చరిత్ర ఆయన సన్న్యాస శిష్యులైన శారదానందస్వామి వంగ భాషలో 'శ్రీ శ్రీరామకృష్ణ లీలాప్రసంగం' పేరిట రచించారు.

శ్రీరామకృష్ణుల జీవితం గత (19వ) శతాబ్దపు అత్యంత ప్రాముఖ్యత వహించిన ఆధ్యాత్మిక సంఘటన. ఆయన ప్రధాన శిష్యులైన స్వామి వివేకానంద ఆయనను గురించి ఇలా ప్రకటించారు: ''శ్రీరామకృష్ణుల జీవితం ఆయన బోధనల కంటే వెయ్యిరెట్లు ఘనతరమైంది, అది ఉపనిషత్తుల మంత్రాలకు సజీవ వ్యాఖ్యానమే కాదు; ఆయన మానవ రూపంలో ఆవిర్భవించిన ఉపనిషత్తుల భావఘనమూర్తి. అనుపమానమైన ఆ పరిపూర్ణత, తనను తాను సమర్పించుకొని అద్భుతమైన ఆ కారుణ్యం, బద్ధ జీవుడి పట్ల కనబరిచే ఆ సహానుభూతి ప్రపంచంలో మరెక్కడా కానరాదు. స్త్రీ పురుషులకు మధ్య, శ్రీమంతులకు దరిద్రులకు మధ్య, పండిత పామరులకు మధ్య, బ్రాహ్మణ నిమ్నకులస్థులకు మధ్య కనబడుతున్న తారతమ్యాలను కూకటి వ్రేళ్లతో పెకలించివేయడానికే ఆయన జీవించారు... ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతి సభ్యతల కొరకు అపూర్వ సమన్వయం కొనిరావటానికే ఆయన అవతరించింది. అంతగొప్ప, అంత అద్భుతమైన మత సామరస్యాన్ని కొనితెచ్చిన జగద్గురువును గత అనేక శతాబ్దాలలో భారతదేశం ఉత్పన్నం చేయలేదనడం తిరుగులేని సత్యం. ప్రస్తుత యుగధర్మం ప్రపంచానికంతటికీ, విశేషంగా భారతదేశానికి, ఎంతో మేలు కలిగిస్తుంది. ఈ యుగధర్మానికి స్ఫూర్తిప్రదాత భగవాన్ శ్రీరామకృష్ణులు. గతంలో ఏతెంచిన మహాన్ మతప్రవక్తలందరి నూతన అభివ్యక్తీకరణే శ్రీరామకృష్ణులు.''

అటువంటి జీవితాన్ని సరిగా అర్థం చేసుకొని వ్యక్తం చేయటం సామాన్యులకు అసాధ్యం. ఆధ్యాత్మిక రాజ్యంలో అనంత జ్ఞానం, అత్యున్నత శ్రేణికి చెందిన అంతర్దృష్టి, యుక్తియుక్తత సంతరించుకొన్న మనిషికి మాత్రమే ఆ పని సాధ్యం.

ప్రత్యక్ష పరిశీలన, ఎంతో ఓపికతో విభిన్న స్థానాల నుండి విషయ సేకరణ, సప్రామాణికం కావాలనే లక్ష్యాన్ని చేర ఎంతో శ్రద్ధతో సేకరించిన విషయాలను పరిశీలించటం, మత సిద్ధాంతాలకు, అనుష్ఠానాలకు సంబంధించిన జటిల చిక్కులను తేటతెల్లంగా వివరించటం - వీటిని సంతరించుకొని వంగభాషలో రచింపబడిన 'శ్రీరామకృష్ణ లీలాప్రసంగం' ఆధ్యాత్మిక మహాపురుషుల జీవితచరిత్రలో ప్రప్రథమ స్థానాన్ని అలంకరించగలదనటంలో ఎలాంటి సందేహమూ లేదు.

ఈ పుస్తకం ధారావాహికంగా ఐదు సంపుటాలుగా ప్రచురింపబడింది. మొదటి రెండు సంపుటాలలో శ్రీరామకృష్ణుల గురుభావం విశదంగా చిత్రీకరింపబడింది. తర్వాతి రెండు భాగాలలో ఆయన బాల్యం, యవ్వనం, కఠోర సాధనలు వర్ణింపబడ్డాయి. వారి జీవితంలో దివ్యభావం ఎలా వ్యక్తమైందో చివరి సంపుటం వివరిస్తుంది.

దురదృష్టవశాత్తు ఈ పుస్తకం అసంపూర్ణంగానే ఉండిపోయింది. శ్రీరామకృష్ణుల చివరి కొన్ని నెలల జీవితం దీనిలో పొందపరచబడలేదు. అయినా కూడా "అసంపూర్ణమైనా అద్భుతమైన రచన" అని దీన్ని గురించి రోమా రోలా ప్రశంసించడం అతిశయోక్తి కాదు.

ఇక గ్రంథకర్తను గురించి ఫ్రెంచి పండితుడు రోమారోలా ఇలా అంటాడు: "ఆయన దార్శనికుడిగా, చరిత్రకారుడిగా ప్రామాణికుడనడంలో ఏ సందేహమూ లేదు. తాత్విక వ్యాఖ్యానాలు సమృద్ధిగా కూడిన ఆయన పుస్తకాలలో సమృద్ధికరమైన హిందూ చింతనాధోరణిలో శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక అభివ్యక్తీకరణను రచయిత కచ్చితమైన స్థానంలోనే ప్రతిష్ఠించాడు." విషయాంశాన్ని అద్భుత రీతిలో మలచడంలో రచయిత చూపిన పాటవం అద్వితీయం. విస్తృతమైన ఆయన అనుభవాలు, పాండిత్యం, యుక్తియుక్త విచారశక్తి, అన్నింటికంటే ఎక్కువగా వారి ఆధ్యాత్మిక సాధనలు - సాదాసీదా పాఠకునికి కూడా తక్షణమే విశదమౌతాయి.

కనుక ఈ తెలుగు అనువాదాన్ని చదువగోరే పాఠకులకు రచయిత సంక్షిప్త జీవితం ఎంతో ఆసక్తికరం, దోహదం కాగలదు; ఆధ్యాత్మిక యుగ ప్రవర్తులైన శ్రీరామకృష్ణుల పావన జీవితాన్ని ఈయన ఎంత ప్రామాణికంగా, సమగ్రంగా

రచించటంలో సఫలమయ్యారో పాఠకులు గ్రహించగలరు. కనుక రచయిత సంక్షిప్త జీవితం ఈ క్రింద పొందుపరచాం.

స్వామి శారదానంద

శ్రీరామకృష్ణుల సన్న్యాస శిష్యుల్లో అత్యంత ప్రధానమైన శిష్యుడు స్వామి శారదానంద. ఆయన పూర్వాశ్రమ నామధేయం శరత్‌చంద్ర చక్రవర్తి. ఇతడు 1865వ సంవత్సరం డిసెంబరు నెలలో కలకత్తాలో నివసిస్తూన్న ఒక సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు.

చిన్నప్పుడే ఇతని జీవితంలో మహాపురుష లక్షణాలు వ్యక్తం కాసాగాయి. శాంత స్వభావియైన ఈ పిల్లవాడు దృఢకాయం, కుశాగ్రమైన బుద్ధి, సాను భూతి సంతరించుకొన్నాడు.

అవలీలగా తోటి విద్యార్థులందరినీ మించగల్గిన శరత్‌చంద్రుడు బహిరంగ చర్చలలో కూడా నిపుణుడు. అయినా కఠినంగా మాట్లాడటం, ఎగతాళి చేసి ఇతరులను బాధించటం అతనికి అసాధ్యమైనపని. ఆప్యాయపూరితమైన అతని హృదయం బాధపడుతున్న పరిచితులు, మిత్రులు, బంధువులు, ఇరుగుపొరుగువారు, చివరకు పనివాళ్ళ - రోగం అత్యంత సాంక్రమితమైనదైనా సరే - ఎవరినైనా వెనువెంటనే సేవించటానికతణ్ణి ఎంతో స్వాభావికంగా పురిగొల్పేది. అన్నింటికంటే ఎక్కువగా శరత్‌చంద్రుని మానసిక నిర్మాణంలోని అద్భుత లక్షణం, అతని ఆధ్యాత్మికాభిరుచి. చిన్నప్పటినుండే అతని మనస్సు సహజంగా మతసంప్రదాయాల పట్ల మొగ్గుచూపేది. అతనికిష్టమైన ఆట - పూజ చేస్తున్నట్లు నటించటం. పెరుగుతున్న కొద్దీ ఈ ఆట అతని జీవితంలో ముఖ్యాంశంగా పరిణమించింది.

పూర్వాచారపరాయణులైన కుటుంబంలో జన్మించిన శరచ్చంద్రుడికి యుగానుగతంగా వస్తున్న హిందూమతం పట్ల అత్యంత శ్రద్ధాభక్తులు జనించాయి. అయినా బడి చదువు ముగిసేటప్పటికి మతమంటే అతని విశ్వాసం యుక్తియుక్తత అనే పునాది మీద సుస్థిరమైంది. దీనికి మూలకారణం కేశవ చంద్రసేన్ నాయకత్వంలో అప్పుడు ప్రాబల్యం వహించిన 'నవవిధాన్' అనే బ్రహ్మసమాజం ప్రభావమే. సెయింట్‌క్జేవియర్ కళాశాలలో చదువుతున్న సమయంలో బైబిల్ చదివిన ఫలితంగా ఏసుక్రీస్తు జీవితం, ఉపదేశాలు అతణ్ణి ఎంతో ప్రేరేపించాయి. ఫలితంగా ఆధ్యాత్మిక సాధనల పట్ల అతని ఉత్సాహం ద్విగుణీకృతమైంది. కళాశాల చివరి రోజుల్లో భాగ్యవశాత్తు ఒక మహనీయుణ్ణి కలుసుకొన్నాడు. ఫలితంగా మత సత్యాలను గురించిన అతని అనుమానాలన్నీ

శాశ్వతంగా నివృత్తమైనాయి; శరచ్చంద్రుని జీవితమే పూర్తిగా మారి పోయింది.

శరచ్చంద్రుడు కలుసుకున్న ఆ మహనీయుడే దక్షిణేశ్వర పరమహంసగా ఖ్యాతిగాంచిన శ్రీరామకృష్ణులు. కలకత్తా వార్తాపత్రికల ద్వారా, విశేషంగా బ్రహ్మ సమాజపు వార్తాపత్రికల ద్వారా ఆధ్యాత్మిక శిఖరాల నధిరోహించిన మహా పురుషుడొకరు దక్షిణేశ్వరంలో నివసిస్తూన్నారనే విషయం కలకత్తా జన సమూహంలో కార్చిచ్చులా కొద్ది సంవత్సరాల నుండి వ్యాపించసాగింది. ఆ వార్త విని స్త్రీలు, పురుషులు, యువకులు, వృద్ధులు, ఒకరేమిటి ఆధ్యాత్మిక పిపాసువు లెందరో దక్షిణేశ్వరానికి వెళ్లసాగారు. శరచ్చంద్రుడు, అతడి దాయాదియైన శశి (కాలాంతరంలో స్వామి రామకృష్ణానంద) ఆ వార్త విని పరమహంసను దర్శించటానికి తహతహలాడసాగారు. అప్పుడు వారు యువ కులు, కళాశాల విద్యార్థులు. 1883వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఒకనాడు వారిద్దరూ శ్రీరామకృష్ణులను దర్శింప బయలుదేరారు.

అటువంటి యోగ్యులైన యువసాధకుల కోసమే ఎదురుచూడసాగారు శ్రీరామకృష్ణులు. వీరు రాగానే మహానందంతో వారిని ఆప్యాయంగా ఆహ్వానించి ఆధ్యాత్మిక ప్రసంగాలతో ఈ యువకుల్ని తమవారిగా చేసుకున్నారు. తమ తియ్యని సరళ వచనాలతో భగవద్దర్శనం కోసం ప్రాపంచిక సుఖభోగాలను పరి త్యజించాలనే సత్యాన్ని ఆ యువహృదయాలలో దృఢంగా పాదుగొల్పారు. తమ ఆధ్యాత్మిక జీవితాన్ని నిర్దేశించగలిగే అపూర్వమైన గురువు శ్రీరామకృష్ణులనే సత్యం వారికి ఆ క్షణమే స్ఫురించింది.

గురువారం కళాశాలకు సెలవు కావటం చేత అప్పటి నుండి ప్రతి గురువారం వెళ్ళి గురుదేవులను కలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు శరత్. అత్యంత పవిత్రమూ, నిస్వార్థమూ అయిన శ్రీరామకృష్ణుల ప్రేమ అతణ్ణి ముగ్ధుణ్ణి చేసింది. రోజులు గడిచేకొద్దీ గురుదేవుల పట్ల అతడు మరింత ఆకర్షి తుడు కాసాగాడు. పదేపదే గురుదేవుల సాంగత్య ఫలితంగా మతాన్ని గురించి అతడి అభిప్రాయాలు స్పష్టం కాసాగాయి; శ్రీరామకృష్ణుల మార్గదర్శకత్వంలో సత్వరమే శరత్ ఆధ్యాత్మికమార్గంలో పురోగమించసాగాడు.

బాల్యం నుండే శరచ్చంద్రునిలో ఆధ్యాత్మిక అభిలాష ఎంతో ప్రగాఢంగా ఉండేది. జీవంలేని పొంగు భావాలు అతని గమ్యం కాదు, చివరకి భగవంతుని రూపాదులను దర్శించటమూ అతడు ఆకాంక్షించింది లేదు. జీవులందరి లోను భగవంతుణ్ణే దర్శించటమే అతని ఏకైక ధ్యేయం. ఆధ్యాత్మిక పురోగమ నానికి ఇదే పరాకాష్ఠ అని, దానిని చేరటం అంత సులభం కాదనీ శ్రీరామ

కృష్ణులు చెప్పారు. దారిలో ఎన్ని కష్టాలను ఓర్చుకోవలసి వచ్చినా తాను సంసిద్ధుడననీ ఆ మహోన్నత లక్ష్యం తప్ప మరేదీ తనకు సంతృప్తికరం కాజాల దనీ సమాధానం చెప్పాడు ఈ యువశిష్యుడు. యువసాధకుని మనోనిబ్బరాన్ని చూసి గురుదేవులెంతగానో సంతసించి భవిష్యత్తులో ఆధ్యాత్మిక శిఖరాల నధిరో హించనున్న నరేంద్రనాథ్‌తో స్నేహం చేయమని నిర్దేశించారు.

శ్రీరామకృష్ణులను దర్శించిన ఒక్క సంవత్సరంలో శరత్, నరేంద్రులు ఆప్తమిత్రులయ్యారు. 1884వ సంవత్సరం అక్టోబర్ నెలలో ఒక రోజు శ్రీరామకృష్ణుల అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతులను నరేంద్రుడి నుండి విన్నాడు శరత్. ఫలితంగా గురుదేవులను గురించిన అతనికున్న మొదటి అభి ప్రాయం పూర్తిగా మారిపోయింది. శ్రీరామకృష్ణులు కేవలం సామాన్యులైన ఒక సిద్ధపురుషులు మాత్రమే కారనీ, తాను విన్న అవతార పురుషులలా, ప్రవక్త లలో ఒకరనే అభిప్రాయం అతడికి అప్పుడు కలిగింది.

సహజంగానే శ్రీరామకృష్ణుల పట్ల అతనికున్న శ్రద్ధాభక్తులిప్పుడు ఆకాశా న్నంటాయి. అచంచల విశ్వాసంతో అతడిప్పుడు శ్రీరామకృష్ణులను తన గురు దేవులుగా ఎంచి, పూర్తిగా ఆయనకు అన్ని రీతుల్లోను శరణాగతుడయ్యాడు. అప్పటి నుండి అతడు ఇంటి వాతావరణం, కళాశాల చదువు కల్పించిన అవ కాశాన్నంతా సాధనలలో గడపసాగాడు. ఇక గురుదేవులు కూడా యువశిష్య నిలో గర్భితంగా ఉన్న ఉత్కృష్ట ఆధ్యాత్మిక బీజాన్ని గుర్తించి, అతని మీద తమ అపార అనుగ్రహాన్ని క్రుమ్మరించారు.

ఇలా అంతా సవ్యంగా జరిగిపోసాగింది 1885వ సంవత్సరం వరకు. ఆ సంవత్సర మధ్యలో తీవ్ర కంఠవ్రణంతో (క్యాన్సర్) వ్యాధిగ్రస్తులై చికిత్సకోసం కలకత్తాకు తోడ్కొని రాబడ్డారు శ్రీరామకృష్ణులు - భయంకరమైన ఈ వార్త అశనిపాతమైంది శరత్‌కు. చివరికదే వార్త అతని ఆధ్యాత్మిక పిపాసను వెయ్యిం తలు ఇనుమడించింది కూడా. ప్రపంచమే తలక్రిందులైనట్లు భావించాడు శరత్. గురుదేవులకు సేవ చేయటంకోసం అప్పుడే చేరిన కలకత్తా వైద్య కళా శాలకు తిలోదకాలిచ్చి ఇంటిని విడిచిపెట్టి గురుదేవుల వద్దకు పరుగెత్తాడు. అప్పటి నుండి రాత్రింబగళ్లు అక్కడే ఉంటూ గురుదేవులను సేవించసాగాడు. నాల్గు నెలల తర్వాత శ్రీరామకృష్ణులక్కడ నుండి కాశీపూర్‌కు కొనిపోబడ్డారు. గురుదేవులు జీవించి ఉన్నంతవరకూ సమధికోత్సాహంతో ఆయనను సేవిం చాడు శరచ్చంద్రుడు.

శ్రీరామకృష్ణులు అలా తీవ్ర రోగంతో బాధపడిన ఒక్క సంవత్సరకాలం యువశిష్యులకు ఒక సంకేతమైంది. నరేంద్రుని నాయకత్వంలో సంసారాన్ని

పరిత్యజించి భవిష్యత్సన్న్యాసి సంప్రదాయానికి నాంది పలికారు. వారు గురుదేవులను సేవించటానికొచ్చినా నిజానికి సన్న్యాస జీవితపు శిక్షణను పొందింది ఇక్కడే. ఈ సమయంలో ఒక రోజు శరచ్చంద్రునితో సహా మరికొందరు యువ శిష్యులు హైందవ సన్న్యాసికి ప్రత్యేకించబడిన కాషాయవస్త్రాలను స్వయంగా శ్రీరామకృష్ణుల నుండి స్వీకరించారు. అలాగే గురుదేవుల సూచన మేరకు తమలో వ్రేళ్లానిపోయివున్న అహంభావనలను నిర్మూలించటం కోసమూ, భగవంతుడి మీద సంపూర్ణంగా ఆధారపడటానికీ భిక్షమెత్తడం ప్రారంభించినదీ ఇక్కడే. అట్టి ఆ యువశిష్యులు గురుదేవుల మూలంగా మహోన్నత ఆధ్యాత్మికాదర్శాలచే ప్రేరేపితులై లాంఛనప్రాయంగా సన్న్యాసాశ్రమంలో అడుగుపెట్టారు. అప్పటి నుండి ప్రాణసములైన గురుదేవుల సేవ, ఆధ్యాత్మికోన్నతికై ఏకాగ్ర భక్తితో సాధన - ఇవి తప్ప తక్కిన అన్నిటినీ విస్మరించారు.

భగవత్సాక్షాత్కారమనే పరమలక్ష్యం వారి హృదయాలలో గాఢంగా హత్తుకుపోయింది. ప్రపంచం, దాని వ్యవహారాలు - వీటి ఆకర్షణ వారి నుండి తొలగిపోయింది. 1886వ సంవత్సరం ఆగస్టు నెలలో శ్రీరామకృష్ణులు మహాసమాధి పొందారు. అప్పటి నుండి యువశిష్యుల మనోభీష్టం మరింత తీవ్రతరమైంది. కొద్ది రోజులలోనే కాశీపూర్‌కు అనతిదూరంగా బారానగరంలోని ఒక అద్దె ఇంట్లో మఠం నెలకొల్పారు. ఇష్టం లేకున్నా గురుదేవులు మహాసమాధి పొందిన తరువాత శరచ్చంద్రుడు ఇంటికి తిరిగిపోయాడు. అయినా మఠం ప్రారంభమైన తక్షణం తరచు అక్కడికి వెళ్లి సోదర శిష్యులతో కలిసి సాధన భజనలలో, గురుదేవుల జీవితం, ఉపదేశాది ఆధ్యాత్మిక ప్రసంగాలను చేస్తూ సమయం వెళ్లబుచ్చసాగాడు. శరచ్చంద్రుని తండ్రికి తన కుమారుడెక్కడ సన్న్యాసం పుచ్చుకొంటాడోననే భయం పట్టుకొంది. తర్కం ద్వారా పుత్రుని మనస్సును ప్రాపంచిక జీవితం వైపుకు త్రిప్పలేక, సోదరశిష్యులను కలుసుకోకుండా చేయడంకోసం చివరికతణ్ణి, ఒక గదిలో పెట్టి తాళం వేశాడు. దాంతో ఒకింతైనా చలించక తన ఏకాంత బంధనాన్నే భగవత్కృపగా, సదవకాశంగా ఎంచి మనస్సును పూర్తిగా సాధనలో నిమగ్నం చేయసాగాడు. కాని అన్న మీద జాలిపడి అతని తమ్ముడు రహస్యంగా తాళం తీశాడు. తక్షణం చల్లగా శరచ్చంద్రుడు ఇంటిని విడిచిపెట్టి తిన్నగా మఠానికి వెళ్లాడు.

ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే అతడు మరికొందరు సోదర శిష్యులతో కలిసి ప్రేమానందస్వామి స్వగ్రామం ఆంట్‌పూరుకు వెళ్లాడు. అక్కడ ఏసుక్రీస్తు జన్మించిన నాటి రాత్రి అందరూ కలిసి ధునిని రగిలించి సాధనమగ్నులయ్యారు. నాటి రాత్రి ఏసుక్రీస్తు జీవితంచే ప్రేరేపితుడై ఆయన పవిత్రతను,

త్యాగాన్ని గురించి నరేంద్రుడెంత సమాధికోత్సాహంతో మాట్లాడాడంటే అక్కడున్న యువశిష్య లందరూ సన్న్యాస దీక్షను చేగొన్నారు.

అలా ఒక్కొక్క మెట్టుగా హిందూ సన్న్యాస మార్గంలో పురోగమించ సాగాడు శరచ్చంద్రుడు. శ్రీరామకృష్ణుల భావిసన్న్యాస శిష్యులు ఆ కాలంలో బారాగనరపు మఠంలో ఎంతటి కఠోర సాధనలు చేయసాగారో వర్ణించ నలవి కాదు. అన్నవస్త్రాదుల లోటును లక్షించక కఠోర భగవత్సాక్షాత్కార మార్గాన్ని సంతోషంతో వరించారు ఈ విద్యావంతులైన మధ్యతరగతికి చెందిన యువ కులు. ఏకనిష్ఠతో వారు చేపట్టిన ఆధ్యాత్మిక సాధన నుండి మరే విషయమూ వారి మనస్సును వైదొలగచేయలేకపోయింది. జపం, ధ్యానం, స్తోత్ర ప్రార్థనలు, శాస్త్రాధ్యయనం, ఆధ్యాత్మిక ప్రసంగాలలో గడవసాగింది వారి సమయమంతా. అలా తదేక దీక్షతో సాధన మగ్నులైన ఆ యువశిష్యులు తమ గమ్యాన్ని చేరే వరకూ విశ్రమించదలచుకోలేదు.

ఒక శుభముహూర్తంలో శాస్త్రాలు నిర్దేశించిన 'విరజా హోమాన్ని' నిర్వ ర్తించి, శాస్త్రోక్తంగా సన్న్యాసం పుచ్చుకొని సనాతన సన్న్యాసి సంప్రదాయంలో కలిసిపోయారు. నిజానికి వీరి సన్న్యాస జీవితం కాశీపూర్‌లో శ్రీరామకృష్ణుల చివరి దినాలలో ప్రారంభమై, నరేంద్రుని ప్రేరేపణతో ఆంట్‌పూర్‌లో వర్ధిల్లినా వైదికశాస్త్రాచారాన్ననుసరించి విధ్యుక్తంగా నిజమైన సన్న్యాసి జీవితం ప్రారంభ మైంది ఈనాటి నుండే. జాతి, కుల, వంశాచారాలకు సంబంధించిన పూర్వా శ్రమ సంస్కారాల నన్నిటికీ త్రోసిరాజని, తమ నామధేయాలకు, పదవులకు తిలోదకాలిచ్చి, నూతన నామధేయాలను స్వీకరించారు. నాటినుండి శరచ్చం ద్రుడు స్వామి శారదానంద అయినాడు.

బారానగర మఠానికి చెందిన సన్న్యాసుల మాదిరిగా త్వరలోనే పవిత్ర పరివ్రాజక జీవితాన్ని గడపాలనే తీవ్ర ఆకాంక్ష శారదానందుణ్ణి ఆవేశించింది. తన తోటి శిష్యుల సాంగత్యం, మఠపు నిశ్చింత జీవితం - ఇవి కూడా అతని కిప్పుడు సహించరాని బంధనాలుగా కానవచ్చాయి. ఆహార, ఆశ్రయాలకు కేవలం భగవంతుడొక్కడి మీదే ఆధారపడుతూ, ముక్తజీవుడుగా ఆధ్యాత్మిక సాధనలను కొనసాగించాలనే వ్యాకులతతో అతడి హృదయం తపించసాగింది. శతాబ్దాల తరబడిగా సాధుసత్పురుషుల వాసంతో పవిత్రీకృతమైన పుణ్య క్షేత్రాలు, పవిత్ర నదీతీరాలు, హిమాలయోత్తుంగ శిఖరాలు అతడి పవిత్ర హృదయాన్నిప్పుడు తీవ్రంగా ఆకట్టుకోసాగాయి.

బారానగరాన్ని విడిచిపెట్టిన తర్వాత స్వామి మొదట జగన్నాథుని పూరీ క్షేత్రం చేరుకొన్నాడు. కొంతకాలం అక్కడ బసచేసి తిరిగి వచ్చి, మళ్లీ ఉత్తర

భారత తీర్థాలకు పయనమైనాడు. దారిలో కాశీ అయోధ్యలను దర్శించి హృషీకేశ్ చేరి సాంప్రదాయక సన్న్యాసి జీవితాన్ని అనుసరించి కఠోర తపస్సు చేస్తూ కొన్ని నెలలు అక్కడ గడిపాడు. 1890వ సంవత్సరపు వేసవి కాలంలో హిమాలయ శిఖరాలమీద నెలకొన్న కేదార్‌నాథ్, తుంగనాథ్, బద్రీనాథ్ వంటి క్షేత్రాలను దర్శించాడు. జూలై నెలలో అల్మోరాకు దిగి వచ్చి ఒక నెలరోజుల లోపుగానే వివేకానందను కలుసుకున్నాడు. తర్వాత ఆయనతో కలిసి గర్వాల్ రాష్ట్రం గుండా మళ్లీ హృషీకేశ్‌కు తిరిగి వెళ్ళాడు. పిదప వివేకానందతో కలిసి మీరట్, ఢిల్లీలలో కొంతకాలం గడిపి దారిలో మథుర, బృందావనం, ప్రయాగ క్షేత్రాలను దర్శించుకొని చివరకు కాశీ చేరుకొన్నాడు. ఈ పుణ్యక్షేత్రంలో కొంతకాలం కఠోర తపస్సు చేశాడు. ఫలితంగా రక్త విరేచనాలకు గురియైనాడు. ఆ కారణంగా కోలుకోవటం కోసం 1891 వ సంవత్సరం సెప్టెంబరు నెలలో బారానగర మఠానికి తిరిగి వచ్చాడు శారదానంద స్వామి కోలుకొన్న తదుపరి మాతృదేవిని దర్శించటం కోసం జయరాంబాటికి వెళ్లాడు.

స్వామి శారదానంద తీర్థపర్యటనల వివరాలను తెలుసుకోవచ్చు. కాని త్వరితగతిలో ఆధ్యాత్మిక ప్రగతి నొందిన ఆయన మనస్సును అర్థం చేసుకోవటం ఎవరికి సాధ్యం? ఎప్పుడు, ఎలా, ఏ విధానాల ద్వారా ఆయన మనస్సు ఆధ్యాత్మిక వికాసం పొందిందో వివరించటం దుస్సాధ్యం. కనుక అత్యంత ఆసక్తికరమైన ఆయన అంతరంగ జీవితం మూసిన పుస్తకంలాగా ఆయన హృదయంలోనే అజ్ఞాతంగా నిలబడిపోయింది.

1892వ సంవత్సరంలో మఠం బారానగరం నుండి దక్షిణేశ్వరానికి ఒకింత దగ్గరగా ఉన్నా ఆలంబజార్‌కు మార్చబడింది. ఇది జరగటానికొకింత ముందుకాలం నుండి, ఆ తర్వాతకూడా కొంతకాలం వరకు నరేంద్రుని ఆచూకీ ఎవరికీ తెలియరాలేదు. పరివ్రాజకావస్థలో అదృశ్యుడైపోయిన తమ సోదర శిష్యు డిప్పుడు సముద్రాలను దాటి 'భారతీయ ఝంఝామారుత సన్న్యాసి'గా అమెరికా సమాజంమీద విరుచుకుపడ్డ వైనం హఠాత్తుగా తెలుసుకొని ఆ యువసన్న్యాసులు ఆనందంతో పులకరించిపోయారు. 1894 మార్చి నుండి వివేకానందస్వామి క్రమబద్ధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపసాగాడు. ఉత్తరాల ద్వారా సంప్రదాయపరంగా వస్తున్న సన్న్యాసపు ఏకాంతం నుండి బయల్వెడలి, 'ఆత్మనోమోక్షార్థం జగద్ధితాయచ' (స్వంత ముక్తికి, జగత్సేవకు) అనే జంట ఆదర్శాలే తమ గమ్యంగా చేసుకొని ఒక కొంగ్రొత్త హిందూ సన్న్యాసి సంప్రదాయాన్ని స్థాపించవలసిందిగా సోదర శిష్యులను ప్రేరేపించ సాగాడు. రెండు సంవత్సరాల తర్వాత తన పాశ్చాత్య కార్యకలాపాలలో తోడ్పడటం కోసం శారదానంద స్వామిని పాశ్చాత్యానికి రావించాడు. నాయకుని

ఆదేశానుసారం స్వామి 1896వ సం॥ ఏప్రిల్ నెలలో లండన్ చేరాడు. మరొక్క నెల తర్వాత రెండవసారి అమెరికా నుండి వివేకానందస్వామి లండన్‌కు వచ్చాడు.

అప్పటికే వివేకానందస్వామి న్యూయార్క్‌లో వేదాంత సంఘాన్ని స్థాపించారు. లండన్‌లో కొన్ని ఉపన్యాసాలిచ్చిన పిదప శారదానందును న్యూయార్క్‌కి పంపించారు స్వామీజీ. అక్కడ వేదాంతమీద హిందూమత భావాల, ఆదర్శాల, యోగదర్శనం మీద చక్కని ఉపన్యాసాలు ఇచ్చి స్వామి వేదాంత ప్రచారాన్ని సుస్థిరం చేయసాగాడు. అలాగే గ్రీనేకర్ తులనాత్మక మత సమావేశం, బ్రూక్లిన్ ఎథికల్ అసోసియేషన్ - ఈ సంస్థలలో పాల్గొని వాటి కార్యక్రమంలో ఇతోధికంగా దోహదం చేశారు. అలాగే న్యూయార్క్, బోస్టన్ సమాజంలోని ప్రముఖులకు వేదాంత లక్ష్యాలను, ఆదర్శాలను గురించి ఉపన్యసించి వారి జీవిత విలువలలో ఎంతో పరిణామం తీసుకువచ్చాడు. స్వానుభవంతో నిండి హృదయాంతరాళం నుండి వెలువడిన స్వామి ప్రసంగాలు శ్రోత్రల హృదయాలలో ప్రగాఢంగా పాదుకుపోయేవి. అన్నిటికంటే ఎక్కువగా ఆయన ధీరత్వం, ప్రశాంతత, విశాల దృక్పథం, నిస్వార్థ ప్రేమ, ఆప్యాయతలు అమెరికాలో ఆయనకు ఎందరినో మిత్రుల్ని, భక్తుల్ని చేకూర్చాయి. ఇలా శారదానంద నిర్దేశకత్వంలో వేదాంత సంఘపు కార్యం సుస్థిరం కాసాగుతున్న ప్పుడు నాయకుని పిలుపు వచ్చింది మళ్లీ. ఆ ఆదేశాన్ననుసరించి, పాశ్చాత్యాన్ని విడిచిపెట్టి 1898వ సంవత్సరం జనవరి 12వ తేదీ ఐరోపా మీదుగా భారత దేశానికి మరలాడు స్వామి.

వివేకానంద స్వామి 1897వ సంవత్సరం జనవరిలో అమెరికా నుండి భారతదేశానికి వచ్చాడు. వచ్చిందే తడవుగా కొలంబో నుండి ప్రారంభించి అల్మోరా వరకు భారతీయ జాగృత శంఖారావాన్ని మ్రోగించసాగాడు. మహాశక్తి వంతమైన తన ఉపన్యాసాలతో భారతీయుల హృదయాలను ఉర్రూతలూగించాడు. అలా అవిరామంగా పని చేస్తూ కలకత్తాకు వచ్చి రామకృష్ణ సంఘాన్ని స్థాపించటం కోసం ప్రయత్నించసాగాడు.

1897వ సంవత్సరం మే నెల 'రామకృష్ణ మిషన్'ను స్థాపించాడు. ఆయన వచ్చిన ఒక్క సంవత్సరం లోపల ఆలంబజార్ మఠం తాత్కాలికంగా బేలూర్‌లో నీలాంబరబాబు ఉద్యానగృహానికి మార్చబడింది. దీనికి పశ్చిమంగా కొద్ది దూరంలో ఉన్న ఒక స్థలాన్ని కొనుగోలు చేశారు రామకృష్ణ మఠాన్ని స్థిరం చేయటం కోసం. (ప్రస్తుతపు బేలూర్ మఠం ఇదే) ఈ పరిస్థితిలో రామకృష్ణ మిషన్ కార్యాలను సక్రమంగా నిర్వర్తించడంకోసం, రామకృష్ణ మఠపు

కార్యాలను అజమాయిషీ చేయటం కోసం శారదానంద స్వామి రావలసిన అవసరం ఏర్పడింది. స్వామీజీ ఆయనను రప్పించింది ప్రత్యేకంగా దీనికోసమే.

స్వామి శారదానంద 1898వ సంవత్సరం ఫిబ్రవరి తొలి దినాలలో నీలాంబరబాబు ఉద్యానగృహానికి తరలించబడిన మఠాన్ని చేరి ఆయనకోసం కేటాయింపబడిన కార్యాలను చేబట్టాడు. 1899 ప్రారంభంలో ఇప్పుడు బేలూర్ మఠంగా ప్రసిద్ధి పొందిన స్థలానికి మఠం శాశ్వతంగా మార్చబడింది. ఇది జరిగిన రెండు సంవత్సరాలలోపే రామకృష్ణ మిషన్ అసోసియేషన్‌ను చట్ట బద్ధం చేసే ట్రస్టు దస్తావేజుని తయారుచేయించారు స్వామీజీ. చట్టబద్ధమైన ఈ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా శారదానంద స్వామి నియుక్తుడైనాడు.

ఈ సందర్భంలో మరో విషయాన్నిక్కడ విశదీకరించాలి. కొంతకాలం తర్వాత కార్యనిర్వహణ సౌలభ్యం నిమిత్తం రామకృష్ణ సంఘం 1. రామకృష్ణ మఠం, 2. రామకృష్ణ మిషన్ అని రెండుగా విభజింపబడింది. ఈ విభజన కేవలం సంఘోద్దేశాన్ని చట్టబద్ధం చేయటం కోసమే అని పాఠకులు గ్రహిం చాలి. మఠం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యాలకు ప్రాముఖ్యత నిస్తుంది. మిషన్ సంఘసేవాకార్యక్రమాలకు ప్రాధాన్యత నిస్తుంది. ఇది తప్ప ఈ రెండింటి మధ్య మరే తేడా లేదు.

శారదానందస్వామి రెండు సంఘాలకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించ సాగాడు. అత్యంత విశ్వసనీయుడైన అనుచరుడుగా జీవితాంతం స్వామి ఈ పదవినే మహానిష్ఠతో నిర్వర్తించాడు. ఎందుకంటే స్వామీజీయే స్వయంగా శారదానందకు ఈ పనిని అప్పగించాడు.

పాశ్చాత్యంలో నివసించి పాశ్చాత్య సంఘనిర్వహణా పద్ధతులను చక్కగా ఆకళింపుచేసుకొన్న శారదానంద తన అనుభవంతో శ్రీరామకృష్ణ సంఘ అంతర వ్యవహారాలనన్నిటినీ త్వరలోనే ఒక నిర్దిష్ట రూపంలోకి తీసుకువచ్చాడు. ఆయన నిర్దేశంలో ఆధ్యాత్మిక సాధనలు, శాస్త్ర పఠనం, సంఘకార్యం, అన్నీ చక్కగా జరుగసాగాయి. పైగా తన పాశ్చాత్యానుభవాన్ని ఊతకర్రగా తీసుకొని మఠంలో చేరుతున్న యోగ్యులైన యువకులను ఎన్నుకొని వారిని ప్రచారకు లుగా పాశ్చాత్యానికి పంపటానికి కావలసిన శిక్షణను కూడా ఇవ్వసాగాడు స్వామి.

ఇన్ని పనులతోపాటు కొన్ని ఆవశ్యకమైన సమాజసేవాకార్యాలను నిర్వ ర్తింపవలసి వచ్చింది స్వామికి. అమెరికా నుండి తిరిగి వచ్చిన కొన్ని నెలలోనే రామకృష్ణ మిషన్ కలకత్తా ప్లేగ్ సహాయ కార్యక్రమాన్ని చేపట్టవలసి వచ్చింది. మరికొన్ని నెలల తర్వాత స్వామీజీ శిష్యుల్ని కొందరిని ఉత్తర భారతదేశంలోని చారిత్రక స్థలాలను చూపెట్టటానికి మార్గదర్శకుడిగా వారితో వెళ్లవలసి

శ్రీరామకృష్ణ దేవాలయం, బేలూరు మఠం

శ్రీరామకృష్ణుల విగ్రహం, బేలూరు మఠం

వచ్చింది. మఠం బేలూరుకి మార్చబడిన తర్వాత ధనం అవసరమై దానికోసం రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలకు వెళ్ళి ఉపన్యాసాలు ఇవ్వవలసి వచ్చింది. వివేకానంద రెండవసారిగా పాశ్చాత్యానికి వెళ్లటానికి (1899) ఒకింత ముందుగా స్వామి పశ్చిమ భారతం నుండి మఠానికి తిరిగివచ్చి తన దైనందిన కర్తవ్యాలను యథాశక్తితో మళ్లీ నిర్వర్తించసాగాడు. ఆ సంవత్సరాంతాన తూర్పు వంగదేశం (ప్రస్తుత బంగ్లాదేశ్) వెళ్లి ఉత్తేజకరమైన ఉపన్యాసాలిచ్చి ఎంతమందిలో ఆధ్యాత్మిక స్ఫూర్తిని ప్రజ్వలింప చేశాడు శారదానందస్వామి.

1900 సంవత్సరం చివరి భాగంలో వివేకానందస్వామి రెండవ పాశ్చాత్య పర్యటనం నుండి తిరిగి వచ్చారు. ఆయన 1901వ సంవత్సరం జనవరిలో బేలూరు మఠ ట్రస్టు దస్తావేజు అమలుపరచారు. ఆయన జీవితకార్యం ముగిసింది. రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ కార్యాలను ట్రస్టీల చేతికి - విశేషంగా అధ్యక్షుడైన బ్రహ్మానందస్వామికి, ప్రధాన కార్యదర్శి శారదానంద స్వామికి - అప్పగించి 1902 సంవత్సరం జూలైలో మరణించారు. ప్రియతముడైన తమ నాయకుని మరణం వారి కెంత ఆఘాతం కలిగించిందో వర్ణించటం కష్టం. అయినా కూడా శ్రీరామకృష్ణుల మానసపుత్రుడు రామకృష్ణ సంఘాధ్యక్షుడైన బ్రహ్మానంద స్వామి ప్రేరణాత్మక మార్గదర్శకత్వంతో రామకృష్ణ మఠ, మిషనులకు సంబంధించిన మహాబాధ్యతను అతికౌశలంగా నిర్వర్తించసాగాడు శారదానందస్వామి.

కొద్దికాలంలోనే మరో బాధ్యతను స్వీకరించవలసి వచ్చింది స్వామికి.

మూడు సంవత్సరాల నుండి వివేకానంద స్వామి నిర్దేశంతో 'ఉద్బోధన్' అనే వంగ మాసపత్రిక వెలువడసాగింది. మునుపు ఆ పత్రికను చక్కగా నిర్వహిస్తూ వచ్చింది స్వామి త్రిగుణాతీతానంద. ఇప్పుడతడు వేదాంతాన్ని ప్రచారం చేయటానికి అమెరికాకు వెళ్లాడు. పత్రికను నడిపే సామర్థ్యం కల్గినవారెవరూ లేకపోవటంచేత ఈ పత్రికను ఆపేయవలసిన పరిస్థితి ఏర్పడ్డప్పుడు ఆ బాధ్యతను స్వీకరించాడు స్వామి శారదానంద. వివేకానంద ఆశించిన విధంగా స్వామి అధీనంలో ఈ మాసపత్రిక ఎంతో ప్రాచుర్యం పొందసాగింది, దాని ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. అనేక సంవత్సరాల కఠోర పరిశ్రమ ఫలితంగా ఉద్బోధన్ మాసపత్రిక సొంత భవనానికి మారింది.

ఉద్బోధన్ అనే పేరుతో కలకత్తా బాగ్బజారులో ఒక మంచి భవనాన్ని కట్టించాడు, శారదానంద స్వామి. దీన్ని కట్టించటానికి మరో ముఖ్య కారణం కూడా ఉంది. ఈ సమయంలో మాతృదేవి కలకత్తాకు వచ్చినప్పుడు ఎవరైనా భక్తుల ఇండ్లలో బసచేసి, తిరిగి జయరాంబాటికి వెళ్లేవారు. ఆమెకు ఒక

శాశ్వతమైన బస లేకపోవటం ఎంతో అసౌకర్యంగా ఉండేది. పరమ మాతృభక్తు లైన స్వామికి అది ఎంతో బాధాకరమైంది. కనుక ఎలాగైనా సరే ఆమెకోసం ఒక ఇంటిని కట్టించాలని నిశ్చయించుకొన్నాడు. కట్టించడానికి కావలసిన ధనం లేనందున బాధ్యతనంతా తానే వహించి, తన పేర అప్పుచేసి బాగ్బజార్‌లో ఒక మంచి ఇంటిని కట్టించారు. ఈ ఇంటిలో పై అంతస్తు మాతృదేవికి, ఆమె సేవకులకు కేటాయించబడింది. 1909వ సంవత్సరం మే 23వ తేదీన తొలిసారిగా మాతృదేవి ఈ ఇంట్లో కాలిడింది. క్రింది భాగం ఉద్బోధన్ పత్రిక పనికి, అలాగే త్వరితగతిలో పెరుగుతున్న ఇతర వంగ గ్రంథాలకోసం (రామ కృష్ణ - వివేకానందసాహిత్యం) ఉపయోగింపబడసాగింది. మాతృదేవి నివ సించడం చేత 'మాయేర్‌బాటి' (మాతృగృహం), ఉద్బోధన్ పత్రిక ప్రచు రింపబడుతూండటంచేత 'ఉద్బోధన్' అని ఈ ఇంటికి పేర్లొచ్చాయి. వీటిలో 'మాయేర్‌బాటి' అనే పేరు భక్తులలో బాగా ప్రాచుర్యం పొందింది.

ఇల్లు కట్టించటం నిమిత్తం తీసుకొన్న అప్పు తీర్చటంకోసం ఒక చక్కని ఉపాయం తోచింది శారదానందస్వామికి. ఆయన ఇప్పుడు శ్రీరామకృష్ణుల జీవిత చరిత్రను ప్రామాణికంగా, సమగ్రంగా రచించి ప్రచురించదల్చుకున్నారు. రామకృష్ణ సంఘ దైనందిన వ్యవహారాలనన్నిటినీ చక్కగా నడపటంతోపాటు ఈ మహాకార్యాన్ని సమధికోత్సాహంతో చేపట్టాడు స్వామి. ఇప్పుడాయన శ్రీరామ కృష్ణుల చరిత్రకు సంబంధించిన విషయాలన్నిటినీ అతికష్టంతో సేకరించ సాగాడు. జీవితచరిత్రను ప్రామాణికం చేయటంలోనూ, సేకరించిన విషయా లన్నిటినీ ఎంతో జాగ్రత్తగా పరిశీలించి, నిస్సందేహమని రూఢియైన సంఘటన లను మాత్రమే స్వీకరించే పనిలోనూ నిమగ్నుడయ్యాడు. ఉద్బోధన్ కార్యా లయంలోని ఒక చిన్న గదిలో ఒక మూల ఎదుట ఒక చిన్న బల్ల పెట్టుకొని సంవత్సరాల తరబడి పరిశ్రమించాడు స్వామి. వచ్చేపోయే దర్శనార్థులు, దైనం దిన సంఘకార్యాలు - ఎన్ని అవరోధాలు కల్గినా అన్నిటినీ చూసుకొంటూ లభించిన మిగిలిన సమయాన్ని శ్రీరామకృష్ణ లీలాప్రసంగ రచనకు వినియో గించసాగాడు. ఈ ఉద్గ్రంథం ఇలా మొట్టమొదట వరుసగా 1909 సంవత్సరం నుండి ధారావాహికంగా ఉద్బోధన్‌లో ప్రచురింపబడసాగింది. తర్వాత అంటే 1911 నుండి 1918 సంవత్సరాల మధ్యకాలంలో గ్రంథం ఐదు భాగాలలో ప్రచురింపబడింది.

జాతి, మత, వర్గ వివక్షత లేకుండా ప్రజలలో విద్యాసంబంధిత, ప్రజాసేవకు సంబంధించిన సేవాకార్యాలను నిర్వహింప ఒక ప్రత్యేక సంఘంగా 'రామకృష్ణ మిషన్' ఏర్పడింది. ఇలా రామకృష్ణ మఠానికి, మిషనుకు చెందిన

కేంద్రాలు భారతదేశంలో ఎన్నోచోట్ల, విదేశాలలో కొన్నిచోట్ల స్థాపింపబడ సాగాయి. కాలం గడిచేకొద్దీ ఇవి అధికరించాయి. వీటితోపాటు వరదలు, క్షామం, భూకంపం, అంటువ్యాధుల వంటి దుర్ఘటనలు ఎదురైనప్పుడు సన్న్యాసులు నివారణ కేంద్రాలను ప్రారంభించటం పరిపాటైంది. మఠ, మిషన్, ప్రధాన కార్యదర్శిగా నానాటికీ పెరుగుతున్న ఈ బాధ్యతల నన్నిటినీ నిర్దేశించటం ఎంతో కష్టంగా పరిణమించసాగింది. అయినా అన్నిటినీ అతి సామర్థ్యంతో నెరవేర్చసాగాడు స్వామి. తన సహజ శాంతతతో మౌనంగా వ్యవహారాలన్నిటినీ నిర్దేశించసాగాడు. ఈ పనిలో కొన్నిసార్లు తికమకపడవలసిన పరిస్థితుల్ని, ఫలితంగా కల్గే చిక్కులను ఎదుర్కొనవలసి వచ్చేది. అయినా ఏ పరిస్థితినైనా ప్రశాంతంగా, చాకచక్యంగా చక్కబరచగలిగేవాడు స్వామి. అలా ఎంతో సాహసంతో, తెలివితేటలతో సమస్యలను పరిష్కరించడం వలననే ఆ కాలంలో విద్రోహులుగా ప్రభుత్వం వారి అనుమానానికి గురైన యువకులు కొందరు ఆధ్యాత్మిక పిపాసువులై రామకృష్ణ సంఘంలో చేరి ఎంతో ప్రజాసేవ చేయగలిగారు. స్వాతంత్ర్యంకోసం పోరాటం జరుగుతున్న ఆ రోజుల్లో ఆంగ్ల ప్రభుత్వం సమాజ సేవాసంస్థలను కూడా అనుమానిస్తూన్నప్పుడు స్వామి ప్రయత్నం వలననే రామకృష్ణ మిషన్ నిర్విఘ్నంగా తన సేవలను సాగించగలిగిందంటే అతిశయోక్తి కాదు.

స్వామి శారదానంద అవిరామంగా ఎన్నో పనులు అలవోకగా నిర్వర్తించేవారు. దీనికి మూలం అత్యంత గభీరమైన ఆయన అంతర్జీవితమే. ఈ ఉత్సాహానికి, శక్తికి మూలప్రేరణ ఆయన ఆధ్యాత్మిక సాక్షాత్కారాలే అని చెప్పవచ్చు. ఆయన జీవితంలోని కొన్ని సంఘటనలు ఈ విషయాన్ని సూచించుతున్నాయి.

ఎంతటి అపాయకరమైన పరిస్థితులలో కూడా చలించక ఎంత ప్రశాంతంగా ఉండేవాడో స్వామి ఈ క్రింది సంఘటన స్పష్టం చేస్తున్నది. 1898వ సంవత్సరాంతాన ఆయనొకసారి వివేకానందస్వామిని, ఆయన స్నేహితులను కలుసుకోవటం కోసం రావల్పిండి నుండి శ్రీనగర్ (కాశ్మీర్)కు గుర్రపు బండిలో పోతూవున్నాడు. దారిలో హఠాత్తుగా గుర్రం బెదిరిపోయి వాయువేగంతో కొండ క్రిందకు పరుగెత్తసాగింది. అదృష్టవశాత్తు దారిలో వంగి ఉన్న ఒక పెద్ద చెట్టు గుర్రం వేగాన్ని ఆపింది. ఒకింతైనా చలించకుండా ప్రశాంతంగా బయటకు వచ్చాడు స్వామి. అదే క్షణంలో ఒక పెద్ద రాయి కొండ నుండి విరిగి పడివచ్చి స్వామికి కొన్ని అంగుళాల ప్రక్కనే ఉన్న గుర్రం మీద పడింది. తక్షణం గుర్రం చచ్చిపోయింది. తన జీవితమే అంతం కాబోయే ఆ సంఘ

టనను మహాప్రశాంతంగా స్థితప్రజ్ఞునిలా చూడసాగాడు ఆత్మసాక్షాత్కారంలో సుస్థిరుడైన స్వామి

జీవన్ముక్తుడైన స్వామి జీవితంలో అపాయకర సంఘటన లెన్నోగదా! 1896వ సంవత్సరంలో నౌకలో లండన్‌కు పయనించసాగాడు స్వామి. దారిలో పెద్ద తుపాను చెలరేగి నౌకను అల్లకల్లోలం చేయసాగింది. ప్రయాణీకులు ఏడుస్తూ అటూ ఇటూ పరుగెత్తుకుపోయే దృశ్యాన్ని అతి ప్రశాంతంగా దర్శించసాగాడు స్వామి. తదనంతర కాలంలో ఏదో సందర్భంలో చిన్న పడవలో గంగానదిని దాటుతున్నప్పుడు ఒక తుపాను చెలరేగి పడవ దాదాపు మునిగిపోయే పరిస్థితి ఎదురైంది. ఇదేమంత గమనించదగిన విషయం కాదన్నట్లు కదలామెదలక ప్రశాంతంగా కూర్చుండిపోయాడు స్వామి. అలా కూర్చున్న స్వామిని చూచి భయంతో గడగడలాడుతున్న తోటి ప్రయాణీకుడు చికాకుపడటం చూసి స్వామి నవ్వాడు.

పూర్వజన్మలో తాను ఏసుక్రీస్తు అనుయాయుడనే దివ్యదృశ్యాన్ని శారదానంద స్వామి చూశారు. శ్రీరామకృష్ణు లోకప్పుడు. స్వామి జీవితంలో జరిగిన ఒక సంఘటన ఈ విషయాన్ని జ్ఞప్తికి తీసుకువస్తున్నది. లండన్ నుండి భారతదేశానికి తిరిగి వస్తున్నప్పుడు స్వామి రోమ్ నగరానికి వెళ్లి సెయింట్ పీటర్ దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఉన్నప్పుడు హఠాత్తుగా ఆయన మనస్సు సమాధిమగ్నమైంది. ఆ సమయంలో కలిగిన అనుభూతి ఆయన జీవిత రహస్యంగానే ఉండిపోయింది. అయినా కూడా ఏసుక్రీస్తు శిష్యులలో ఒకరితో సంసర్గం కలిగివున్న ఈ పవిత్ర దేవాలయం స్వామికి తన పూర్వ జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చిందని, కనుకనే ఆయనలా పరిసరాలను మర్చిపోయాడని మనం ఊహించవచ్చు.

మార్మికమైన ఇటువంటి సంఘటనల ద్వారా విశదమౌతున్న శారదానంద ఆధ్యాత్మికౌన్నత్యం కొన్ని అరుదైన సందర్భాలలో వారిచ్చిన సూచనల ద్వారా ఋజువవుతున్నది. స్వామి దినచర్య పుస్తకంలో ప్రత్యక్షంగా ఆయన జగజ్జననిని తరచు దర్శించటం అక్కడక్కడ వ్రాసి ఉండటం మనకు కనబడుతుంది. స్వామి 'భారతదేశంలో శక్తిపూజ' అనే మరో వంగ పుస్తకం రచించాడు. పుస్తకాన్ని అంకితం చేస్తూ స్వామి ఇలా వ్రాశాడు: ''ఎవరి అనుగ్రహంతో రచయిత స్త్రీలందరిలోను జగజ్జననిని దర్శించగలుగుతున్నాడో ఆమెకే (మాతృదేవికి) ఈ గ్రంథం పరమభక్తితో అంకితం చేస్తున్నాను.'' ఆయన మనస్సు ఆధ్యాత్మికంగా ఎంత ఉన్నత భూములను అధిరోహించిందో ఇది రూఢిపరుస్తున్నది. ప్రపంచాన్నంతా జగన్మాతగా దర్శించటమే తాంత్రిక సాధనల

లక్ష్యం. పాశ్చాత్యం నుండి తిరిగి వచ్చిన రెండు సంవత్సరాలలోపే శారదానంద స్వామి తాంత్రిక సాధనలను అనుష్ఠించి, దాన్లో పరాకాష్ఠకు చేరాడు.

తదనంతరకాలంలో తన ఆధ్యాత్మికానుభూతులను గురించి పదేపదే అడుగుతున్న తన సన్న్యాసి సేవకునికి చెప్పదల్చుకోకపోయినా ఈ సూచన ఆకస్మికంగా వారి నోట వెలువడింది: ''నేను పొందని ఆధ్యాత్మికానుభూతులేవీ 'శ్రీరామకృష్ణ లీలాప్రసంగం'లో వ్రాయలేదు.'' మరి ఈ పుస్తకం ఆధ్యాత్మిక పరాకాష్ఠయైన నిర్వికల్పసమాధితోపాటు ఎన్నో రకాల ఆధ్యాత్మికానుభూతులతో నిండివుంది. అంటే స్వామి సాక్షాత్కారాలను మనం ఊహించుకోవలసిందే. ఆయన ఇక జీవన్ముక్తులై కేవలం మానవాళి శ్రేయస్సు కోసమే జీవితాంతం పాటుపడ్డారనే విషయం చెప్పటం అనవసరం.

రామకృష్ణ మఠం - రామకృష్ణ మిషన్ కార్యక్రమాలను నిర్వహించడం గురుదేవుల జీవితచరిత్రను రచించి ప్రచురించటం వంటి పనులతోపాటు అన్నిటికంటే ముఖ్యమైన మరో పనిని చేపట్టాడు శారదానందస్వామి. అది మాతృదేవి ఆరోగ్యం, సౌకర్యాలను చూచుకోవటం. మాతృదేవిని సాక్షాత్తు జగన్మాతృస్వరూపిణిగా ఎంచి, ఆమె సేవలో తన జీవితాన్నర్పించాడు స్వామి. ఆమె జయరాంబాటిలో ఉన్నా, కలకత్తాలో ఉన్నా - ఎక్కడున్నా ఎప్పుడు ఆమె పట్ల శ్రద్ధ వహించేవాడు. ఉద్బోధన్ కార్యాలయాన్ని ముఖ్యంగా మాతృదేవి కలకత్తాకు వచ్చినప్పుడు బసచేయడం కోసమే కట్టించాడు. ఈ పనిని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయడానికీ, అప్పుచేయడానికీ వెనుకాడలేదు స్వామి. ఆ అప్పును తీర్చటానికిగాను 'శ్రీరామకృష్ణ లీలాప్రసంగం' రచిస్తూ, ప్రచురిస్తూ దాదాపు తొమ్మిది సంవత్సరాలు కఠోర పరిశ్రమచేశారు స్వామి. నిజానికి మాతృదేవిమీద స్వామికున్న భక్తిప్రగాఢతను అంచనావేయడం కష్టం. ఉద్బోధన్ భవనంలో క్రింది అంతస్తులో ఒక చిన్న గదిలో కూర్చుని తనను తల్లి ద్వారపాలకునిగా పరిగణించుకొని ఆమెను చూడటానికి వచ్చే దర్శనార్థుల గుంపుల్ని అజమాయిషీ చేస్తూండేవాడు. కొన్నిసార్లు క్రొత్తవారి కాయన తనను 'తల్లి ద్వారపాలకునిగా' పరిచయం చేసుకొని వినోదిస్తూండేవాడు. మాతృదేవిని ఇలా సేవించటం సుకృతంగా భావించేవాడని ఆయన ధోరణి నుండి తేటతెల్లమౌతుంది. 1920లో తీవ్ర రోగగ్రస్థురాలై కడపటిసారిగా ఆమె ఉద్బోధన్‌లో ఉంటున్నప్పుడు స్వస్థురాలిని చేయటంకోసం ఆమె చికిత్సా విషయంలో, పథ్య విషయంలో, సేవ విషయంలో స్వామి ఎంత శ్రమించాడో వర్ణించటం అసాధ్యం. 1920వ సంవత్సరంలో మాతృదేవి పరమపదించింది.

మూడు సంవత్సరాల తర్వాత 1923వ సంవత్సరం ఏప్రిల్ నెలలో మాతృదేవి పుట్టిన జయరాంబాటిలో ఆమె జ్ఞాపకార్థం అందమైన ఒక ఆల యాన్ని నిర్మించాడు స్వామి. ప్రతిష్ఠోత్సవ సమయంలో మాతృప్రేమ స్వామిని ఎంత ఆవేశిందంటే, తల్లివలె స్వామికూడా అడిగినవారందరికీ మంత్రదీక్ష నిచ్చి వారి జీవితాలను ఆధ్యాత్మికమయం చేశాడు. ఉత్సవ దినాలలో స్వామి నుండి ఒక మహా ఆధ్యాత్మిక శక్తి పెల్లుబికిరావటం అనేకులు గమనించి వున్నారు.

ఒక దీర్ఘయజ్ఞమైన స్వామి జీవితంలో తుది ఆహుతి మాతృదేవి మందిర ప్రతిష్ఠ అని పేర్కొనవచ్చు. అదివరకే మహాపురుషులైన సోదరశిష్యులు కొందరు పరమపదాన్ని చేశారు. ఆ తర్వాత మాతృదేవి వెళ్లిపోయింది. మరి రెండు సంవత్సరాల లోపే శ్రీరామకృష్ణుల మానసపుత్రుడు, మొదటి సంఘాధ్య క్షుడు అయిన బ్రహ్మానంద స్వామి కూడా నిష్క్రమించాడు. ఈ సంఘటనలు స్థితప్రజ్ఞుని వంటి శారదానందను కూడా కదలించివేశాయి, కార్యోత్సాహాన్ని సడలించివేశాయి. కనుకనే మాతృదేవి ఆలయం కట్టడం, ప్రతిష్ఠాపన కార్యాలు పూర్తి అయినప్పటి నుండి స్వామి దాదాపు దైనందిన కార్యాల నుండి వైదొలగి ఎక్కువ కాలం ధ్యానంలో గడపసాగాడు. రచన కూడా పూర్తిగా ఆగిపోయింది. తన మహత్తర రచనయైన 'శ్రీరామకృష్ణ లీలాప్రసంగా'న్ని ఇక అంతటితోనే ఆపివేశాడు.

ప్రస్తుతం స్వామి లక్ష్యం అంతా రామకృష్ణ సంఘంలో చేరుతున్న కొత్త సన్న్యాసులలో, బ్రహ్మచారులలో సంఘప్రతిష్ఠాపకుడైన వివేకానందస్వామి నెల కొల్పిన భావాలను, ఆదర్శాలను దృఢంగా పాదుగొలపడం; భవిష్యత్తులో సంఘ కార్యభారాన్ని చేపట్టగలగటం కోసం యోగ్యులైన కొందరు యువ సన్న్యాసు లకు తగిన శిక్షణ నివ్వటం. అందుకోసంగా 1926వ సంవత్సరంలో ఒక మహా సమావేశాన్ని ఏర్పరచి మఠం, మిషన్ కేంద్రాలన్నిటి నుండి ప్రతినిధుల్ని ఆహ్వానించాడు. సమావేశ ఉపోద్ఘాత ఉపన్యాసంలో మహావిజృంభణంతో ముందు కేగుతున్న రామకృష్ణ సంఘ పుట్టుక, పెంపును ప్రస్తావించి, దారిలో అది ఎదుర్కొనే ఆటంకాలను ఎత్తిచూపి, సంఘనాయకుడు నెలకొల్పిన ఆదర్శాలను పూర్తిగా అనుష్ఠించి ఈ అడ్డంకులను గమంచి లక్ష్యాన్ని చేరమని అందరికీ ఉద్బోధించారు. ఈ సందర్భంగానే సంఘకార్యపరిపాలనకు సంబంధిం చిన సమస్యలను గురించి సంఘకార్యనిర్వాహకునికి సలహాలిచ్చి తోడ్పడటం కోసం కొంతమంది సన్న్యాసులతో కూడిన కార్యనిర్వాహక వర్గాన్ని ఏర్పర చాడు స్వామి. అప్పటికే వయోవృద్ధులౌతున్న సన్న్యాసులొక్కొక్కరుగా ఈ

భూమినుండి వెళ్ళిపోతూవుండడం చేత భవిష్యత్తులో బరువైన బాధ్యతలను స్వీకరించగలిగే యువసన్న్యాసులను తయారుచేయడం యుక్తియుక్తమే గదా! శారదానందస్వామి అలా నెలకొల్పిన ఈ కార్యనిర్వాహక వర్గం ఆ సమయంలో తాత్కాలిక ప్రయోజనాన్ని సాధించటంతోపాటు సుస్థిరమైపోయి ఈనాటికీ సంఘోద్దేశాలను అమలుపరచటాని కెంతోగానో దోహదం చేస్తూవుంది.

రామకృష్ణ సంఘ భావాదర్శనాలను అలా ఎత్తిచూపించి, దైనందిన జీవితంలో వాటినెలా అభ్యాసించాలో చూపెట్టి, సంఘయువ సభ్యులకెంతో ప్రేరణనిచ్చి, దాదాపు ముప్ఫై ఏండ్ల వెనుక ప్రియతమ నాయకుడైన వివేకానంద స్వామి తన కప్పగించిన బాధ్యతను చక్కగా నిర్వర్తించి, ప్రశాంతంగా తన కార్యం నుండి నిష్క్రమించి 1927వ సంవత్సరం ఆగష్టు 19వ తేదీన మహాసమాధిలో ప్రవేశించాడు శారదానందస్వామి.

జీవన్ముక్తుడైన మహాపురుషుణ్ణి జీవితంలోని ఏ విధినియమాలు బంధించలేవు. విశ్వరహస్యాన్ని తెలుసుకొని, సర్వం బ్రహ్మమయంగా ప్రత్యక్షం చేసుకున్న వ్యక్తి కిక ఏ విధీ, ఏ కార్యమూ ఉండదు. అయినా కూడా భగవత్సంకల్పంతో మానవాళి శ్రేయస్సుకై పాటుపడటానికి పూనుకున్నప్పుడు అతడు పోషించవలసిన పాత్రకు తగిన విశేష గుణాలు కొన్ని అతనిలో వ్యక్తమౌతూంటాయి.

ఈ ప్రపంచనాటక రంగంలో శారదానందస్వామి పాత్ర ఆదర్శకర్మయోగి ఎలా జీవించాలో ఎత్తిచూపటమే. పరిపూర్ణమైన నిస్సంగత్వంతో, ఆత్మ నిగ్రహంతో కూడినవాడై తన విధ్యుక్తకర్మలను అవి ఎంత చిన్నవైనా సరే, పెద్దవైనా సరే - అన్నిటి మీద పరిపూర్ణ శ్రద్ధ వహించి నిర్దిష్టంగా నిర్వర్తిస్తూ వచ్చాడు. నిందాప్రశంసలను, విఘ్నాలను లక్ష్యపెట్టక పవిత్రమైన తన నిర్దిష్టమార్గంలో ముక్కుసూటిగా ముందుకు వెళ్లాడు.

నిజంగానే శారదానందస్వామి, వివేకానందస్వామి ఎత్తి చూపించిన ఆదర్శ కర్మయోగిగా జీవించాడు. యుక్తితోకూడిన మనస్సు, దయాపూర్ణమైన హృదయం, సమధికోత్సాహం, అరుదైన కార్యనిర్వాహక శక్తి - ఇవి ఆదర్శకర్మయోగియైన స్వామి గుణాలు. ప్రతి ఒక్కరిలోను వివేకానంద స్వామి చూడదల్చిన 'అనంత సహనం, అద్వితీయ పవిత్రత, అసామాన్యధీరత్వం' - ఇవి స్వామి రక్తంలో ప్రవహించాయి. శారదానంద ధీరత్వాన్ని చూసి స్వామీజీ ఒకప్పుడు, 'శరత్ రక్తం చేపరక్తం వంటిది. ఏదీ దాన్ని ఉద్రేకపరచలేదు' అని అభివర్ణించాడు. సముద్రం వంటి అగాధం, ఆకాశం వంటి విశాలత్వం' సంతరించుకొంది శారదానందుని హృదయం.

నికృష్టమైన పాపిలో కూడా గర్భితంగా ఉన్న దివ్యత్వాన్ని చూస్తూ అపార ప్రేమ, సహానుభూతులతో దాన్ని వ్యక్తం చేయించటం కోసం చివరి వరకూ పాటుపడేవాడు స్వామి. సహచరులచే కూడా గెంటబడిన ముక్కోపులు, పోట్లాడే వ్యక్తులు కూడా స్వాముల దయతో ఆయన ఆశ్రయాన్ని పొందే వారు. ''నిజమైన త్యాగి అందరినీ సమదృష్టితో చూస్తూ, అందరినీ సమాన ప్రేమతో సేవించుతాడు'' అనే వివేకానందుల ఉక్తి స్వామి విషయంలో అక్షర సత్యం.

తాను గొప్పవాడననే ఆలోచన లేకుండా అందరినీ సరిసమాన ప్రేమతో, ఆప్యాయతతో చూసేవాడు స్వామి. వ్యక్తిగత సౌకర్యాల గురించి ఏనాడు ఖాతరు చేయలేదు స్వామి. సొంత శిష్యుల నుండి కూడా ఎప్పుడో చాలా అరుదుగాగాని సేవను స్వీకరించేవాడు కాదు. అయినా ఇతరులకు తోడ్పడటం కోసం ఎన్ని కష్టాలను ఓర్చడానికీ, చివరకు ప్రాణత్యాగం చేయడానికీ ఎప్పుడూ సంసిద్ధుడే ఆయన.

హిమాలయాల్లో సంచరిస్తూన్నప్పు డొకసారి ఒక కొండదిగి, లోయను దాటవలసి వచ్చింది. ఆ సమయంలో తనలాగే ప్రయాణం చేస్తున్న ఒక వృద్ధస్త్రీని చూచి జాలిపడి తక్షణం తన చేతికర్ర నామె కందించాడు తన అసౌకర్యాన్ని, చేతికర్రలేకపోతే తనకు వాటిల్లే అపాయాన్ని నిర్లక్ష్యం చేసి. అలాగే భయంకరమైన అంటువ్యాధులు సోకి, సొంత బంధుగుణం కూడా దగ్గరకు రానటువంటి రోగుల దగ్గరకు స్వామి తరచు వెళ్ళేవాడు. సహించలేని మనో యాతనలతో బాధపడేవారిని ప్రేమపూరితమైన స్వామి పలుకులు అమృత సమంగా ఊరడించేవి. స్వామి వ్యక్తిత్వ విశేషగుణం ఆయన మామూలు ప్రవర్త నలో వ్యక్తమయ్యేది. సరైన ప్రవర్తన కదొక గుణపాఠం అందరికీ. సభ్యతతో వ్యవహరించడంలో సుశిక్షితులైనవారు కూడా స్వామి ప్రవర్తనను చూసి ముగ్ధ లయ్యేవారు. యువకులు వేసే పనికిమాలిన ప్రశ్నలనుకూడా ఓపికతో విని తియ్యని పలుకులతో సరైన సమాధానాలిచ్చే వారి ధీరత్వం ఆశ్చర్యాన్ని కలిగిం చేది. అపరాధుల్ని మందలించేటప్పుడు కూడా ఆయన తియ్యని పలుకులు వారి బాధను తొలగించేవి. నిజానికి ఆయన పలుకులు బిడ్డల్ని మందలించే తల్లి పలుకుల్లా కనపడేవి. అయినా కూడా మహాగాంభీర్యంతో కూడిన ఆ పలుకులు అపరాధి హృదయాన్ని పరివర్తనం చేసి ఆకాంక్షించిన ఫలితాన్ని కల్గించేవి.

ఇక శారదానంద స్వామి పనిచేసే తీరు లక్షింపవలసిన విషయం - అంత క్రమబద్ధంగా ఉండేది, అందరికీ గుణపాఠంగా ఉండేది. నిదానం, ధీరత్వం,

ప్రశాంతితోకూడిన నడవడికతో ప్రతి ఒక్క పనిని కావలసినంత ఏకాగ్రతతో నెరవేర్చేవాడు. చిన్నదైనా, పెద్దదైనా ప్రతి ఒక్క పనికీ పవిత్రమైన భావత్పూజా సమంగా చేసేవాడాయన. సదా నిదానం పాటించేవాడు, అసంపూర్ణమైన వివరాలను తీసుకొని తక్షణమే ఏ తీర్మానానికి వచ్చేవాడు కాదు. వ్యక్తుల, వారి కార్యకలాపాల గురించి వ్యవహరించేటప్పుడు యుక్తి, సానుభూతి దృష్టితో మెలగేవాడు.

అన్నిటినీ నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట రీతిలో ఉంచట మనేది వారి అంతర్గతమైన సుగుణంగా శోభించేది. తన అవసరాలు ఎంతో తక్కువైనప్పటికీ తన చుట్టూ అన్నీ పొందికగా, నిర్దిష్టంగా ఉండేటట్లు చూచేవాడు. ఈ గుణం బహుశ గురుదేవుల ఉదాహరణతో మరింత బలపడి ఉండవచ్చు. ఎందుకంటే నిరాడంబరతలో, నిర్దిష్టత్వంలో శ్రీరామకృష్ణులు అద్వితీయులు.

పైన అభివర్ణించిన 'శ్రీరామకృష్ణ లీలాప్రసంగ' రచయిత అయిన స్వామి శారదానంద జీవిత చరిత్ర నుండి రామకృష్ణ సంఘ ప్రధాన కార్యదర్శిగా ఆయన ఎటువంటి పాత్రను పోషించారో పాఠకులు కొంతలోకొంత ఊహించుకోవచ్చు.

ఆత్మసాక్షాత్కారంతోపాటు జగత్కల్యాణానికి పాటుపడుతున్న ప్రతి ఒక్కరికీ స్వామి శారదానంద పవిత్ర జీవితం ఒక ఉత్కృష్ట అనుసరణీయమైన దృష్టాంతంగా, శాశ్వతంగా నిలిచిపోవడం తథ్యం.

- స్వామి నిర్వేదానంద

శ్రీరామకృష్ణుల పాదుకలు

సపార్షద శ్రీరామకృష్ణ స్తోత్రమ్

సర్వధర్మస్థాపకస్త్వం సర్వధర్మస్వరూపకః ।
ఆచార్యాణాం మహాచార్యో రామకృష్ణాయ తే నమః

యథాగ్నేర్దాహికాశక్తి రామకృష్ణే స్థితా హి యా ।
సర్వవిద్యాస్వరూపాం తాం శారదాం ప్రణమామ్యహమ్

పరతత్త్వే సదా లీనో రామకృష్ణసమాజ్ఞయా ।
యో ధర్మస్థాపనరతో వీరేశం తం నమామ్యహమ్

కాళిందీపుల్లకమలే మాధవేన క్రీడారత ।
బ్రహ్మానంద నమస్తుభ్యం సద్గురో లోకనాయక

యోగానందః ప్రేమానందశ్చాన్యే వై యే చ పార్షదాః।
రామకృష్ణగతప్రాణాః సర్వాంస్తాన్ ప్రణమామ్యహమ్.

-స్వామి శారదానంద

* * *

శ్రీరామకృష్ణ స్తవమ్

-స్వామి వివేకానంద

ఆచణ్డాలా ప్రతిహతరయో యస్య ప్రేమప్రవాహః
లోకాతీతోఽప్యహహ న జహౌ లోకకల్యాణ మార్గమ్।
త్రైలోక్యేఽప్యప్రతిమ మహిమా జానకీ ప్రాణబన్ధో
భక్త్యా జ్ఞానం వృతవరవపుః సీతయా యో హి రామః॥

స్తబ్ధీకృత్య ప్రళయకలితం వాహవోత్థం మహాన్తం
హిత్వా రాత్రి ప్రకృతి సహజా మన్ధతామిస్రమిశ్రామ్।
గీతం శాన్తం మధురమపి యః సింహనాదం జగర్జ
సోఽయం జాతః ప్రథితపురుషో రామకృష్ణస్త్విదానీమ్॥

నర దేవ దేవ జయ జయ నరదేవ
శక్తి సముద్ర సముత్థ తరంగం
దర్శిత ప్రేమ విజృంభిత రంగమ్।
సంశయ రాక్షస నాశ మహాస్త్రం
యామి గురుం శరణం భవవైద్యమ్॥

నర దేవ దేవ జయ జయ నర దేవ
అద్వయతత్త్వ సమాహిత చిత్తం
ప్రోజ్జ్వల భక్తి పటావృత వృత్తమ్।
కర్మకలేవర మద్భుత చేష్టం
యామి గురుం శరణం భవవైద్యమ్॥

[ఎవరి ప్రేమప్రవాహం చండాలుని పర్యంతం అప్రతిహత వేగంతో ప్రవహించిందో (అంటే చండాలురను సైతం అకుంఠితంగా ప్రేమించటానికి వెను తీయలేదో), ఎవరి స్వభావం ప్రపంచాతీతమైనా కూడా లోకకళ్యాణ మార్గాన్ని పరిత్యజించలేదో, ఎవరి మహిమ ముల్లోకాల్లో అసమానమో, ఎవరు సీతాదే

వికి ప్రాణాధికుడో, ఎవరి ఘనీభవించిన భక్తి అనే దేహం జ్ఞానమనే వస్త్రంతో కట్టబడి ఉండేదో ఆ సీతారాముడే -

మళ్ళీ శ్రీకృష్ణుడుగా అవతరించి కురుక్షేత్ర యుద్ధసమయంలో చెలరేగిన ప్రళయకాలతుల్య ఘోరరవాన్ని నిశ్శబ్దం చేశాడో; ప్రకృతి సహజ ఘోర అంధకారమనే అర్జునుని అజ్ఞానాన్ని సమూలంగా నాశనం చేశాడో; అంతేగాక ప్రశాంతమూ సుమధురమూ ఐనా గీతోపదేశాన్ని సింహగర్జనతో బోధించాడో ఆ సువిఖ్యాత పురుషుడే ఇప్పుడు తిరిగి శ్రీరామకృష్ణ రూపంలో అవతరించాడు.

హే నరదేవదేవ! నీకు జయమగుగాక! ఎవరు శక్తి అనే సముద్రంనుండి లేచిన ఒక మహోతరంగ స్వరూపుడో, ఎవరు నానా ప్రేమ లీలలను ప్రదర్శించారో, ఎవరు సందేహాలనే రాక్షసులను నాశనం చేయగల్గిన మహాస్త్రస్వరూపులో, ఎవరు భవరోగాన్ని నయం చేయగల వైద్యస్వరూపులో ఆ సద్గురుని శరణు పొందుతున్నాను.

హే నరదేవదేవ! నీకు జయమగుగాక! ఎవరి చిత్తం సదా అద్వయ బ్రహ్మంలో సమాహితమై (సుప్రతిష్ఠితమై) ఉంటుందో, ఎవరి ఘనీభవ జ్ఞాన దేహం భక్తి అనే వస్త్రంతో ఆచ్ఛాదితమో, ఎవరి దేహం ఆమరణాన్తం లోకహిత కర్మల్లో నియుక్తమో, ఎవరి కర్మలీలలు మహాద్భుతాలో ఆ భవవైద్యుని, ఆ సద్గురుని శరణు పొందుతున్నాను.]

* * *

కుర్మస్తారక చర్వణం
త్రిభువన ముత్పాటయామో వయమ్ ।
కింభో నవిజానాస్యస్మాన్
రామకృష్ణ దాసావయమ్॥

క్షీణాస్మ దీనాః సకరుణా జల్పన్ని మూఢా జనా।
నాస్తిక్యన్విదస్తు అహహ దేహాత్మవా దాతురాః।
ప్రాప్తా స్మవీరాగత భయా అభయం ప్రతిష్ఠాయదా
ఆస్తిక్య న్విదస్తు చినుమః రామకృష్ణ దాసావయమ్.

పీత్వా పీత్వా పరమ మమృతం వీత సంసారరాగాః
హిత్వా హిత్వా సకల కలహ ప్రాపిణీం స్వార్థ సిద్ధి
ధ్యాత్వా ధ్యాత్వా గురువరపదం సర్వకల్యాణ రూపం
నత్వా నత్వా సకల భువనం పాతు మామన్త్రయామః॥

ప్రాప్తం యద్వైత్వనాది నిధనం వేదోదధిం మథిత్వా
దత్తయస్య ప్రకరణే హరిహర బ్రహ్మాది దేవైర్బలమ్
పూర్ణంయత్తు ప్రాణసారైర్భౌమ నారాయణానాం
రామకృష్ణ స్తనుందత్తే తత్పూర్ణ పాత్రం మిదం భోః॥

[నక్షత్రాలను పొడిపొడిచేద్దాం. త్రిభువనాలను పెకలించివేద్దాం. మనం ఎవరమో మీకు తెలియదా? మనం శ్రీరామకృష్ణ దాసులం. భయమా? ఛీ ఛీ ఎవరిని చూసి భయం?

శరీరంతో తాదాత్మ్యం చెందిన బుద్ధిహీనులే 'మేం బలహీనులం, మేం దీనులం' అని వాపోతారు. భయాతీతమైన స్థితిని బడసిన మనం యిక భయపడవలసిన అవసరంలేదు. మనం ధీరులమైనాం. ఇదే ఆస్తికత, శ్రీరామకృష్ణ దాసులమైన మనం దీన్నే కోరుకొందాం.

పరమామృతాన్ని మాటిమాటికి గ్రోలుతూ, సంసారంలోని అనురాగాన్ని వదలినవారమై, అన్ని కలహాలకు తల్లి అయిన స్వార్థపరత్వాన్ని వదలివేసి, సకల కల్యాణరూపమైన గురుదేవుని పాదపద్మాలను సదా ధ్యానిస్తూ వినమ్రతా మూర్తులమై ఆ అమృతపానంలో పాల్గొనమని సకల ప్రపంచాన్ని ఆహ్వానిద్దాం.

ఏ అమృతం అనంత వేద మహాసముద్ర మథనంచేత ఉద్భవించిందో, దేనిలోకి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు తమ శక్తినంతా గుమ్మరించారో, ఏది నారాయణుని అవతారమూర్తు లందరి ప్రాణసారంతో నిండుకొన్నదో, ఆ అమృతకలశాన్ని శ్రీరామకృష్ణులు పూర్ణరూపంలో తనలో ధరించివున్నారు.]

సుందరయ్య గ్రంథాలయ
A C No. 79093
హైదరాబాద్-500

తిరుమల తిరుపతి దేవస్థానం వారి
ఆర్థిక సహాయంతో రామకృష్ణ మఠం
హైదరాబాద్ వారు సమర్పించు
ప్రత్యేక కానుక - తగ్గింపు ధరలు

శ్రీరామకృష్ణ కథామృతము

(మూడు సంపుటములు) అసలు ధర రూ. 300.00

తగ్గింపు ధర రూ. 150.00

శ్రీరామకృష్ణ పరమహంస

(రెండు సంపుటములు) అసలు ధర రూ. 400.00

తగ్గింపు ధర రూ. 100.00

గమనిక:

పుస్తకములు సెట్టుగానే అమ్మబడును.

ప్రతులకు:

శ్రీరామకృష్ణ మఠం

దోమలగూడ

హైదరాబాదు - 500 029

మా వెబ్ సైట్ ద్వారా కూడ పుస్తకాలు ఆర్డరు చేయవచ్చు

www.sriramakrishnamath.org

శ్రీరామకృష్ణ మఠం

మైలాపూర్, చెన్నై - 600 004

email : srkmath@vsnl.com

ISBN 81-7823-018-6

9 788178 230184

Sri Ramakrishna Paramahamsa - 2

(Telugu) Rs. 200.00

ISBN 81-7823-012-7